# దీపతోరణం

వందమంది
రచయిత్రుల కథానికలు
సంకలనం

డా॥ వాసా ప్రభావతి • పొత్తూరి విజయలక్ష్మి • స్వాతి శ్రీపాద



# దీపతోరణం

వందమంది రచయిత్రుల కథానికలు

సంపాదకవర్గం

**డా॥వాసా ప్రభావతి**

శ్రీమతి **పొత్తూరి విజయలక్ష్మి**

శ్రీమతి **స్వాతి శ్రీపాద**

శ్రీమతి **తమిరిశ జానకి**

ప్రచురణ:

శ్రీ వేదగిరి కమ్యూనికేషన్స్

బ్లాక్-6, ఫ్లాట్-10, హెచ్.ఐ.జి-1

బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్-500 044.

సెల్: 9391343916

www.telugukathanika.com

e-mail:vedagiri_rambabu@yahoo.com

**DEEPA TORANAM**

| | | |
|---|---|---|
| First Edition | : | **October 2012** |
| Cover Design | : | **Bali** |
| Price | : | Rs. 500/- |
| DTP | : | **Manu Graphics**<br>1-8-185/2, Chikkadpally<br>Hyderabad - 500 020<br>Ph: 040-27633574 |
| Printed at | : | **Venu Graphics**<br>Nallakunta<br>Hyderabad |
| Published by | : | **Sri Vedagiri Communications**<br>HIG - I, Block-6, Flat 10<br>Baghlingampally<br>Hyderabad |
| Copies available at | : | **All branches of Visalandhra**<br>**Navodaya Book distributers**<br>Opp. Aaryasamaj, Koti, Hyderabad<br>**Navayuga Book House**<br>Koti, Hyderabad<br>**Sri Vedagiri Communications** |

# తెలుగు రచయిత్రులకు అభివందనం!
# శ్రీ వేదగిరి కమ్యూనికేషన్స్‌కు అభినందనం!

"దేశభాషలందు తెలుగు లెస్స
తెలుగు సాహిత్యమందు మహిళలెస్స"

ఆధునిక తెలుగు సాహిత్యంలో అపురూపమైన ప్రక్రియ, అధిక ప్రచారంలో ఉన్న ప్రక్రియ కథానికే. ఎందరో కథానికా రచయితలు, మరెందరో రచయిత్రులు, మరెందరో పాఠకులు ప్రోత్సహించే పత్రికలు, ఈనాడు ఇంటర్‌నెట్‌లు కూడా కథానికను ప్రోత్సహిస్తున్నారు.

పత్రికలవారు రచయిత్రులకిచ్చే ప్రోత్సాహం అభినందనీయం. దిన, వార, మాస పత్రికల ప్రోత్సాహంతోనే ఈనాడు రచయిత్రులు రాశిలోను, వాశిలోను కూడా ముందున్నారు. అయినా ఇంకా కొందరు రచయిత్రులపై కాస్త చిన్న చూపు చూపిస్తూనే ఉన్నాయి. అందుకే కొన్ని కార్యక్రమాలలో రచయిత్రులు 2% లేక 3% వెనకబడతారు. అయినా మన రచయిత్రులు అటువంటి వారిని పట్టించుకోకుండా ఉత్సాహంతో ముందుకు సాగిపోతూనే ఉన్నారు.

'లేఖిని' మహిళా చైతన్యసాహితీ సాంస్కృతిక సంస్థ తెలుగు రచయిత్రుల కోసం స్థాపించిన సంస్థ. తెలుగు రచయిత్రులందరూ ఇందులో సభ్యులే! 2005లో స్థాపించబడిన ఈ సంస్థ సాహిత్యపరంగా ఎన్నో కార్యక్రమాల్ని నిర్వహిస్తోంది. రచయిత్రుల గ్రంథావిష్కరణ సభలతో పాటు "పలుకే బంగారమాయె" మాతృభాషగా తెలుగు పై భాషాపరంగా సదస్సులు, అనేక సెమినార్‌లు నిర్వహిస్తోంది. అంతేకాకుండా కేంద్ర సాహిత్య అకాడమీ వారితో కలిసి కవయిత్రులు సమ్మేళనాలు, సెమినార్లతో పాటు, అఖిల భారతస్థాయిలో 2011 ఫిబ్రవరి 11, 12 తేదీలలో కేంద్రసాహిత్య అకాడమీ వారితో కలిసి అఖిల భారత రచయిత్రుల సమావేశాల్ని నిర్వహించి రచయిత్రులందరికీ తగిన ప్రోత్సాహం అందించింది. మహిళా దినోత్సవాలు జరిపి స్త్రీలకు సంబంధించిన ఎన్నో విషయాలపై చర్చలు జరుపుతోంది. వార్షికోత్సవం

రోజున 'మాతృదేవోభవ' పురస్కారాలు ఇచ్చి అనేక రంగాలలోని రచయిత్రులను గౌరవిస్తోంది. విశ్వసాహితీ వారితో కలిసి అనేక సదస్సులు ఏర్పాటు చేసింది. శ్రీ వేదగిరి కమ్యూనికేషన్స్ వారితో కలిసి మహాకవి గురజాడ వారిపై సదస్సులు నిర్వహించింది. సభలు, సమావేశాలు, కార్యక్రమాలే కాదు పుస్తకాలు ప్రచురించడము కూడా చేపట్టింది.

"నేను–నారచనలు" అనే శీర్షికతో యద్ధనపూడి సులోచనారాణి మాలతీచందూర్, రామలక్ష్మి మొదలుకొని సీనియర్ జూనియర్స్ అనే భేదం లేకుండా రచయిత్రులు తమ రచనలు అందజేశారు. "నేను– నా రచనలు" గ్రంథం ప్రచురించిన తరువాత, నిడదవోలు మాలతి (యు.ఎస్.ఎ) ఆంగ్లంలోకి అనువాదం చేసిన కొన్ని కథానికలను "తెలుగు పెన్ స్కేప్" పేరుతో ప్రచురించాము. శాంత సుందరిగారు హిందీలోకి అనువాదం చేసిన రచయిత్రుల కథానికలను "గుల్‌దస్తా" పేరుతో 27మంది రచయిత్రుల హిందీ కథానికలను ప్రచురించాము.

ఇప్పుడు నేటి తెలుగు రచయిత్రుల నూరు కథానికలను "దీపతోరణం" పేరుతో పుస్తకరూపంలో తీసుకురావాలని కథానికలను సేకరించాము. మా యీ ప్రయత్నంలో రచయిత్రులందరూ తమ కథానికలను మాకు ఇచ్చి సహకరించినందుకు వారికి మా కృతజ్ఞతలు అందజేస్తున్నాము.

ఈ సంకలనంలో అటు భువనేశ్వర్ మొదలుకొని తెలుగుదేశంలోని అన్ని ప్రాంతాల రచయిత్రులే కాకుండా అమెరికా, కెనడా మొదలగు ప్రాంతాల వాసుల కథానికలు చోటుచేసుకున్నాయి. అన్ని ప్రాంతాల తెలుగు రచయిత్రుల కథానికలను ప్రచురించాలన్నదే మా ధ్యేయం.

ప్రాంతాలతో, వాదాలతో, పార్టీలతో మాకు సంబంధము లేదు. మానవత్వమే మా సిద్ధాంతం. ఎవరి మంచి రచననైనా స్వీకరించాలన్న మా ధ్యేయాన్ని ఆచరణలో చూపిస్తూనే కథానికలను సేకరించాము.

"దీప తోరణం" తెలుగు రచయిత్రుల నూరు కథానికలు "లేఖిని" సభ్యులదే కాక లేఖిని సంస్థను ఆదరించి, అభిమానించే రచయిత్రులందరి కథానికలు ఇందులో చోటు చేసుకున్నాయి. వారందరికి పేరు పేరున మా ధన్యవాదాలు.

ఈ రోజుల్లో పుస్తక ప్రచురణ సామాన్యమైన విషయం కాదు. భారీ వ్యయంతో కూడినపని. శ్రీ వేదగిరి కమ్యూనికేషన్స్ పేరిట డా॥వేదగిరి రాంబాబుగారు "దీపతోరణం" ప్రచురిస్తానని కథానికా శతజయంతి సందర్భంగా చెప్పడమే ఈ

కార్యక్రమానికి నాందిపలకడం. డా॥వేదగిరి రాంబాబు ఇప్పటికీ ఎన్నో గ్రంథాలు ప్రచురించడమే కాదు గురజాడ, శ్రీపాద వంటి మహాకవుల జయంతుత్సవాలను ఎవరి ఆర్థిక సహాయం లేకుండా విజయనగరం, కాకినాడ, రాజమండ్రి మొదలైన అనేక నగరాలలో, అనేక పట్టణాలలో జరిపించిన ఏకైక వ్యక్తి డా॥వేదగిరి రాంబాబు. మహాకవి గురజాడ 150వ జయంతి ముగింపు కార్యక్రమాలలో భాగంగా డా॥వేదగిరి రాంబాబుగారు షష్టిపూర్తి సందర్భంగా 40సం॥ల సాహితీ ప్రస్తానంలో భాగంగా "లేఖిని" సేకరించిన వందమంది రచయిత్రుల కథానికలను "దీపతోరణం"పేరుతో శ్రీ వేదగిరి కమ్యూనికేషన్స్ ద్వారా ప్రచురించి ఆవిష్కరణ కు సిద్ధం చేశారు. వారికి లేఖిని కళాభినందనలు అందజేస్తోంది.

వారి సతీమణి శ్రీమతి సంధ్య మరింత ఉన్నతురాలు డా॥రాంబాబుగారికి అన్నివిధాల తగిన భార్యామణి. ఆ దంపతులకు మా అభినందనలు.

దీపతోరణంలోని నూరు మంది రచయిత్రుల కథానికలను సేకరించి ఎన్నికచేయుటలో లేఖినికి ఎన్నో విధాల సహకరించి "దీపతోరణం" రూపు దాల్చుటకు ఎన్నో విధాల సహకరించిన లేఖిని సభ్యులు ప్రముఖ రచయిత్రులు శ్రీమతి శీలాసుభద్రాదేవి గారికి, శ్రీమతి పోడూరి కృష్ణకుమారిగారికి, శ్రీమతి గంటి భానుమతిగారికి, శ్రీమతి అత్తలూరు విజయలక్ష్మిగారికి, శ్రీమతి రేణుక అయోలగారికి, "లేఖిని" తరపున కృతజ్ఞతలు అందజేస్తున్నాము.

"దీపతోరణా"నికి తమ కథానికలు అందించి సహకరించిన రచయిత్రులందరికీ మా కృతజ్ఞతలు.

'దీపతోరణం' వందమంది రచయిత్రుల కథానికలకు అందంగా, ఆకర్ష ణీయంగా అర్ధవంతంగా ముఖచిత్రం చిత్రించి ఇచ్చిన ప్రముఖ రచయిత బాలిగారికి, ఈ గ్రంథాన్ని సకాలంలో డి.టి.పి. చేసి ఇచ్చిన కుడుపూడి భాస్కర్‌రావు (మనుగ్రాఫిక్స్)గారికి, ముద్రించి ఇచ్చిన శ్రీవేణుగోపాల్‌రెడ్డి (వేణు గ్రాఫిక్స్) వారికి మా కృతజ్ఞతలు అందజేస్తున్నాము.

జై జై తెలుగు కథానిక...

**డా॥ వాసా ప్రభావతి**
**శ్రీమతి పొత్తూరి విజయలక్ష్మి**
**శ్రీమతి స్వాతిశ్రీపాద**
**శ్రీమతి తమిరిశ జానకి**

# కథాభివందనాలు

కథానికా శతజయంతి వాడవాడలా చేస్తున్న రోజులవి. మాతోబాటే డా॥వాసా ప్రభావతిగారు వ్యక్తిగతంగా కృషి చేయడమే కాకుండా, ఇతర రచయిత్రులతో కలిసి 'లేఖిని' సంస్థ ద్వారా కూడా ఎన్నో సాహితీ కార్యక్రమాల్ని నిర్వహించారు. ఆ సందర్భంలో రచయిత్రుల వంద కథానికల్తో ఓ సంకలనం తేవాలనిపించింది. ఆ విషయాన్నే డా॥వాసా ప్రభావతిగారితో అన్నాను. అది ఇప్పటికి కార్యరూపం ధరించింది. కథానికా రచయితగా, కథానికాభిమానిగా ఈ సంకలనం ఇలా నా షష్టి పూర్తికి నలభై సంవత్సరాల సాహిత్య జీవితోత్సవానికి వెలుగు చూడడం నాకెంతో ఆనందదాయకం. ఈ సంకలనంలోని రచయిత్రులందరికీ, సంకలనకర్తలకు, నా కథానికాభివందనాలు.

మనం ఎప్పటినుంచో చదువుతన్న ప్రముఖ రచయిత్రుల దగ్గరనుంచి వర్ధమాన రచయిత్రుల వరకు– వందమంది రచయిత్రుల కథానికలు ఈ సంకలనంలో ఉన్నాయి. శతజయంతి జరుపుకున్న కథానికకి ఇదో కంఠాభరణం.

చాలాకాలం నుంచి ఈ ఆలోచనవున్నా – గత వారం రోజులలో చాలా వేగంగా ఈ సంకలనాన్ని తేవడానికి తీవ్రకృషి చేసిన డా॥వాసా ప్రభావతి గారితో పాటు శ్రీపాద స్వాతిగారు, ఇతర రచయిత్రులకు నా నమస్కారాలు ముఖ్యంగా ఈ పుస్తకావిష్కరణ సభకు విచ్చేస్తున్న ప్రముఖ రచయిత్రి డా॥కె.రామలక్ష్మిగారికి నా నమస్కారాలు.

అందరికీ నా కథానికా శతవందనాలు.

**–వేదగిరి రాంబాబు**

# తోరణాలు


| | | | |
|---|---|---|---|
| 1. | దానం | - *డా॥వి.ఎస్.రమాదేవి* | *13* |
| 2. | కారుణ్యం | - *డా॥ మాలతీ చందూర్* | *19* |
| 3. | సువర్ణ గన్నేరు | - *డా॥ కె.రామలక్ష్మి* | *26* |
| 4. | ఇంటర్నెట్ పెళ్ళిచూపులు | - *రంగనాయకమ్మ* | *32* |
| 5. | సంఘజీవి | - *తురగా జానకీరాణి* | *86* |
| 6. | మారిన కాలం-మారని మనిషి | - *పవని నిర్మల ప్రభావతి* | *100* |
| 7. | జ్యోతి | - *యద్దనపూడి సులోచనారాణి* | *110* |
| 8. | మట్టిగోడల మధ్య గడ్డిపోచ | - *శివరాజు సుబ్బలక్ష్మి* | *136* |
| 9. | పువ్వులన్నీ శ్రీవారివే | - *ఆచార్య నాయని కృష్ణకుమారి* | *148* |
| 10. | గాలి రథం | - *ఆర్.వసుంధరాదేవి* | *153* |
| 11. | తీరని కోరిక | - *ద్వివేదుల విశాలాక్షి* | *160* |
| 12. | ఎంతపని జరిగింది! | - *డా॥సి.ఆనందారామం* | *172* |
| 13. | మా బతుకు మాది | - *డి.కామేశ్వరి* | *183* |
| 14. | నిర్ణయం | - *అబ్బూరి ఛాయాదేవి* | *193* |
| 15. | అనుబంధాలు | - *పోలాప్రగడ రాజ్యలక్ష్మి* | *201* |
| 16. | మృత్యోర్మా అమృతంగమయ | - *నందుల సుశీలాదేవి* | *209* |
| 17. | అయ్యో, ఒక్కరయినా చెప్పలేదు! | - *నిడదవోలు మాలతి* | *216* |
| 18. | దేవుడి ఇల్లు | - *ఉషారాణి భాటియా* | *219* |

| | | | |
|---|---|---|---|
| 19. | పసిడి సంకెళ్ళు | – *వేదుల శకుంతల* | *224* |
| 20. | గతానికి ఘడియ పెట్టు | – *గోవిందరాజు సీతాదేవి* | *228* |
| 21. | స్వేదబిందువులు | – *పోల్కంపల్లి శాంతాదేవి* | *240* |
| 22. | ఉరి | – *పరిమళా సోమేశ్వర్* | *246* |
| 23. | ఔట్‌సోర్సింగ్ | – *జొన్నలగడ్డ రామలక్ష్మి* | *260* |
| 24. | ఎంతో చిన్నది జీవితం | – *తమిరిశ జానకి* | *270* |
| 25. | చిన్నదేవేరి | – *డా॥ చాగంటి తులసి* | *281* |
| 26. | సంగమం | – *విజయలక్ష్మీ రామకృష్ణన్* | *288* |
| 27. | మొగ్గ | – *శారదా అశోక వర్ధన్* | *300* |
| 28. | రెక్కల చూపు | – *శీలా సుభద్రాదేవి* | *306* |
| 29. | నిర్ణయానికి అటూ ఇటూ | – *ఇంద్రగంటి జానకీబాల* | *315* |
| 30. | కాపలా | – *డా॥ముక్తేవి భారతి* | *323* |
| 31. | ఎవరి విలువలు నాన్నా? | – *జె.భాగ్యలక్ష్మి* | *329* |
| 32. | మొగ్గ నవ్వింది | – *పింగళి బాలాదేవి* | *339* |
| 33. | మానవత్వం ఓడిపోలేదు! | – *వింధ్యవాసిని* | *349* |
| 34. | దోపిడి | – *ముదిగంటి సుజాతారెడ్డి* | *367* |
| 35. | ఉపాసన | – *జలంధర* | *377* |
| 36. | జ్వలిత | – *డా॥ఆలూరి విజయలక్ష్మి* | *391* |
| 37. | ఆర్య | – *కొమరవోలు సరోజ* | *404* |
| 38. | దీపం | – *శేషూ అప్పారావ్* | *413* |
| 39. | కరువు | – *డా॥సోమరాజు సుశీల* | *419* |
| 40. | కృష్ణవేణి | – *సి.వేదవతి* | *425* |

| | | | |
|---|---|---|---|
| 41. | శీనయ్యగారి సైకిలు | – *తురగా జయశ్యామల* | *439* |
| 42. | స్పర్శ | – *గంటి భానుమతి* | *448* |
| 43. | ఆడపిల్ల | – *సోమంచి ఉషారాణి* | *454* |
| 44. | అనురాగ స్మృతి | – *డా. భవానీదేవి* | *465* |
| 45. | చింతచెట్టునీడలో... | | |
| | వెచ్చని పరిమళాల పాట | – *కుప్పిలి పద్మ* | *470* |
| 46. | వెండి కిరీటం | – *ఆచార్య ఎస్. శరత్‌జ్యోత్స్నారాణి* | *479* |
| 47. | మౌనరాగాలెన్నినాళ్ళో! | – *కె.బి.లక్ష్మి* | *484* |
| 48. | నాకు బ్రతకాలని ఉంది నాన్నా! | – *సాకేతపురి కస్తూరి* | *496* |
| 49. | తోటమాలి | – *అత్తలూరు విజయలక్ష్మి* | *506* |
| 50. | సత్యానికి చేరువగా... | – *టి. శ్రీవల్లీరాధిక* | *515* |
| 51. | నాన్న | – *తెన్నేటి సుధ* | 527 |
| 52. | అపరిచితులు | – *బలభద్రపాత్రుని రమణి* | *532* |
| 53. | అమృతాన్ని సాధించు! | – *వారణాసి నాగలక్ష్మి* | *544* |
| 54. | "ఇదం శరీరం" | – *పోడూరి కృష్ణకుమారి* | *560* |
| 55. | అరకులోయ అప్పల్నర్సి | – *మంథా భానుమతి* | *573* |
| 56. | మూగవోయిన కోయిల | – *అల్లూరి గౌరీలక్ష్మి* | *586* |
| 57. | గుప్పిటలో గోదారి | – *ఆకెళ్ల వెంకటసుబ్బలక్ష్మి* | *598* |
| 58. | తోడికోడలు | – *చంద్రలత* | *603* |
| 59. | ఒక రాత్రి గడవాలి | – *వాడ్రేవు వీరలక్ష్మీదేవి* | *617* |
| 60. | సివమ్మ బడి | – *శ్రీదేవి మురళీధర్* | *629* |
| 61. | మగవాడి మనసు | – *అంబికా అనంత్* | *637* |

| | | | |
|---|---|---|---|
| 62. | తృప్తి | – *ఉంగుటూరి శ్రీలక్ష్మి* | *646* |
| 63. | ఎటు చూస్తే అటు | – *డి. సుజాతాదేవి* | *650* |
| 64. | ఖాళీ సంచులు | – *కె. వరలక్ష్మి* | *660* |
| 65. | నాన్న ఉండాలి | – *సి. ఉమాదేవి* | *674* |
| 66. | జీవని | – *కె.కె. భాగ్యశ్రీ* | *683* |
| 67. | ధరణి | – *కొండవీటి సత్యవతి* | *695* |
| 68. | కథా కౌముది | – *శైలజామిత్ర* | *702* |
| 69. | అందమా, ఇది నీ శాపమా? | – *ఝాన్సీ కెవి కుమారి* | *711* |
| 70. | ఈ ఒక్కరోజు | – *అయినంపూడి శ్రీలక్ష్మి* | *718* |
| 71. | నివాళి | – కె. వాసవదత్త రమణ | 726 |
| 72. | చీకటి | – *డా॥ పెళ్లకూరు జయప్రదారెడ్డి* | *736* |
| 73. | ఎండమావులు | – *శ్రీలత* | *745* |
| 74. | వండనన్నావ్! ఎందుకొండేవ్? | – *చాగంటి కృష్ణకుమారి* | *749* |
| 75. | తొలి వెలుగు | – *వావిలకొలను రాజ్యలక్ష్మి* | *761* |
| 76. | భూమి బిడ్డ | – *జాజుల గౌరి* | *770* |
| 77. | నాన్న కూతురు | – *మల్లీశ్వరి* | *789* |
| 78. | దీవారేం | – *షాజహానా* | *798* |
| 79. | మాన్యెం | – *జూపాక సుభద్ర* | *805* |
| 80. | ఎడారిలో వసంతం | – *గోగినేని మణి* | *816* |
| 81. | శాంతమ్మ | – *లక్ష్మీ రాఘవ* | *828* |
| 82. | సహజీవనం | – *బి.గీతిక* | *835* |
| 83. | 'ఉన్నాను! నేనున్నాను' | – *గురజాడ శోభాపేరిందేవి* | *844* |

| | | | |
|---|---|---|---|
| 84. | గతంలో జీవించకు నేస్తం! | – అంగులూరి అంజనీదేవి | 853 |
| 85. | సంఘసేవిక | – శివలెంక నాగ ఉదయలక్ష్మి | 861 |
| 86. | సముద్రానికి కన్నీటి తర్పణాలు | – రేణుక అయోల | 868 |
| 87. | అగుపించని అదృష్టం | – శ్రీపతి బాలసరస్వతి | 874 |
| 88. | విందైన వంటకం | – ఎస్వీ.కృష్ణజయంతి | 882 |
| 89. | రేపటి కోసం... | – పుట్ల హేమలత | 890 |
| 90. | పొడిచే పొద్దు | – కన్నెగంటి అనసూయ | 905 |
| 91. | బతుకమ్మా...! | – సమ్మెట ఉమాదేవి | 921 |
| 92. | గృహం – రుణం | – కోపల్లె మణి | 936 |
| 93. | ముత్యాలు | – ఆచంట హైమవతి | 944 |
| 94. | అసలు నిజం | – కస్తూరి అలివేణి | 951 |
| 95. | పిన్నీసు | – పెయ్యేటి శ్రీదేవి | 959 |
| 96. | అనుబంధం | – అద్దేపల్లి జ్యోతి | 967 |
| 97. | బ్రతుకు తీపి | – విశ్వనాధ రమ | 974 |
| 98. | మట్టి చేతులు | – డా.వాసా ప్రభావతి | 981 |
| 99. | ప్రసాదరావూ–వంట సరస్వతీ | – పొత్తూరి విజయలక్ష్మి | 997 |
| 100. | ఓదార్పు | – స్వాతి శ్రీపాద | 1005 |

# దానం

**- డా॥వి.ఎస్.రమాదేవి**

"సర్!... మా అమ్మ సాయంత్రం వస్తోంది. మీరు తప్పక శర్మగారితో చెప్పాలి సర్. లేకపోతే ఎవరూ మమ్మల్నిక్కడ లక్ష్యపెట్టరు" అన్నాడు మూర్తి ప్రాధేయపూర్వకంగా జగన్నాథంగారి దగ్గర డిక్టేషను తీసుకుని.

"రానీ... రానీ.. చూద్దాం. ఎప్పుడూ.. సాయంత్రమా రావడం... నేను ఫోనులో చెబితే బాగుండదుగాని, రేపు సాయంత్రం హోమ్ సెక్రటరీ 'ఫడ్కే'ని చూడటానికి వెళుతున్నాను. ఆ టైముకి మీ అమ్మగారిని అక్కడికి తీసుకురా... శర్మగారితో మాట్లాడతాను" అన్నారు జగన్నాథంగారు. అప్పుడప్పుడూ ఆయన తను ఓ పెద్ద ఆఫీసరనే సంగతి మర్చిపోతూ వుంటారు. అలాంటి క్షణాలేవో అవి ఆయన పిఏ మూర్తి ఒక్కడికే తెలుసు. మూర్తి అటు వెళ్ళగానే ఏదో ఫైలు పట్టుకొచ్చిన డిప్యూటీ సెక్రటరీ అంతు తేలుస్తున్నారు జగన్నాథంగారు. బహుశా ఇంటి దగ్గర భార్య తన అంతు తేల్చడానికి వేచి వుంటుందని గుర్తుకొచ్చిందో ఏమో! 'మంచాయనే కాని... ఏ క్షణం మండిపడతారో తెలియదు" అనుకుంటూ వుంటారు ఆఫీసుజనం.

హోమ్ సెక్రటరీ గది ముందు కల్నల్ శర్మ జగన్నాథం గారు ఏదో అతి సీరియస్‌గా మాట్లాడుకుంటున్నారు. మూర్తి వరండాలో బెంచీమీద ఎవరో పంజాబీ ఆవిడ కూర్చొని వుంటే ఆవిడతో ఏదో హిందీలో చెప్పి తల్లిని ఆవిడ పక్కనే కూర్చోబెట్టి తాను జగన్నాథంగారి దృష్టిపథంలోకి రావడానికి హైరానా పడుతున్నాడు.

దూరంగా బెంచీమీద కూర్చున్న మూర్తి తల్లి రాజేశ్వరమ్మ కొరడాదెబ్బ తిన్నట్టుగా ఒకసారి లేచి మళ్ళీ నీరసంతో కూర్చుంది... తను మర్చిపోలేదు ఆ వ్యక్తిని. ఆ వ్యక్తిలో వయసు తెచ్చిన ముఖంలోని మొరటుతనం, నిడివిలో మరికాస్త విస్తృతం తప్పితే, మరే విధమైన మార్పూ లేదు... తనేవేవో ఆలోచనల్లో పడింది. కాని దృష్టి ఆ వ్యక్తి మీదనే ఉంది. మరి కాసేపట్లో మూర్తి తల్లి దగ్గరకు వచ్చాడు.

"అమ్మా... రేపు నిన్నిక్కడ జాయిన్ చెయ్యమన్నారు. కల్నల్ శర్మగారు స్వయంగా చూస్తామన్నారు" అన్నాడు.

నిండు గర్భిణీకి ప్రసవం, నెలలు నిండని చూలాలికి గర్భస్రావం అవ్వడానికి వీలయ్యే మహారాజధాని నగరపు రోడ్లమీద ఆఘమేఘాలమీదనుంచి పోయినట్టుగా, యధేచ్ఛగా నడుస్తున్న జీవరాసుల్ని రకరకాల వాహనాల్ని లెక్కచేయకుండా అజేయంగా సాగిపోయే ఆటో స్కూటరు మీద పొత్తికడుపు ఒకచేత్తో, గుండెల్ని మరోచేత్తో పట్టుకుని రాజేశ్వరమ్మ, పక్కనే కొడుకు మూర్తి న్యూరాజేంద్రనగర్‌కి తిరిగి వెళుతున్నారు. మూర్తి తల్లికి తోవలో ఇదీ అదీ అని ఏవేవో చూపుతున్నాడు. ఆవిడ అలవాటులేని ఆటో స్కూటరు ప్రయాణపు ఆయాసం, జబ్బుతో కలిగిన నీరసం, మనసులో మెదులుతున్న మరో వ్యక్తి వీటన్నింటితో సతమతమవుతూ ఎలాగో ఇల్లు చేరింది.

మూర్తి భోజనం చేసి తల్లి మంచం దగ్గరకు వచ్చాడు. రాజేశ్వరమ్మ పాలు మాత్రమే తాగింది. కోడలు పిల్లల్ని నిద్రపుచ్చుతోంది. రాజేశ్వరమ్మకి కల్నల్ శర్మతో మాట్లాడుతూ కనబడిన ఆ వ్యక్తిని గురించి ఎలా అడగాలో అర్థం కావడం లేదు. అడగకుండా వుండనూ లేదు.

"ఏరా మూర్తీ! ఆ శర్మగారితో మాట్లాడుతూ నుంచున్నాయనేనా మీ సెక్రటరీగారు."

"అవునమ్మా! మన తెలుగాయనే.... ఒరిస్సాలో పనిచేసేవారు పూర్వం. అక్కడినుంచి ఇక్కడికి వచ్చారు నాలుగేళ్ళ క్రితం. రెండేళ్ళనుంచి నేనాయన దగ్గర పనిచేస్తున్నాను.

"పేరు"

"జగన్నాథంగారు"

"ఏ జగన్నాథంగారు"

"ఇంటిపేరు పూర్తిగా తెలియదు. కె.వి."

కాని రాజేశ్వరమ్మకు పూర్తిగా తెలుసు కొర్లిపర వెంకట జగన్నాథం! రాజేశ్వరమ్మ ఇంక వూరుకోలేకపోయింది.

"మూర్తీ! నువ్వెవరివో ఆయనకు తెలుసా?"

"ఆయన సంగతి మాకు తెలుస్తుంది కాని మా పీఏల సంగతి ఆయనకి అంతబాగా ఎలా తెలుస్తుంది? ఒకసారి ఏదో మాటలమీద ఏ వూరోయ్ మీది' అన్నారు. 'బొబ్బిలి' అని చెప్పాను. 'ఓ! మా వూరేనా!' అన్నారు.

"మరోసారెప్పుడో ఎవరి పిల్లవాడివి నువ్వు" అన్నారు. ... నాన్నపేరు కృష్ణమూర్తిగారని చెప్పాను. "ఆయనకు తెలిసినట్టు లేదు నాన్న పేరు".

"ఎందుకు తెలుస్తుందిరా... మీ నాన్న సంగతీ, నా సంగతీ.. ఆయన పెద్ద ఉద్యోగస్థుడు... బాగా డబ్బున్నాయన.. మనం ఎలా తెలుస్తాం. ఎప్పుడో తెలిసినా ఇన్నేళ్ళు ఎలా గుర్తుంటాం."

"నీకు తెలుసునా అమ్మా ఆయన"

"నా చిన్నప్పుడు తెలుసు... ఆయనా, ఆయన అన్నా, వాళ్ళకి నా యీడు చెల్లెలే వుండేది. మేమిద్దరం ఆడుకునే వాళ్ళం... తరవాత... నా పెళ్ళయి పోయింది మీ నాన్నతో.. వాళ్ళూ నెమ్మది నెమ్మదిగా ఒక్కొక్కళ్ళే ఊరు వదిలేసారు. వాళ్ళ తల్లి ఒక్కతే ఉండేది. కొద్దికాలానికి ఆవిడా పోయింది..."

తల్లి నిద్రలో పడిందనుకొని కొడుకు పడుకోవడానికి వెళ్ళిపోయాడు.

ఏనాటి జగన్నాథం ఈనాటికి మళ్ళీ తారసపడ్డాడు. మళ్ళీ జన్మలో తను అతని కళ్ళ పడకూడదనుకుంది. అదృష్టం... తనని అతను చూడలేదు. తానే అతనిని చూసింది. అతని సాయంతోనా తన రోగం కుదుర్చుకునేది. అంత కంటేమందూ మాకూ లేకుండా బొబ్బిలిలో గుట్టు చప్పుడు కాకుండా ప్రాణాలు వదలడం మంచిది. తనని ఆస్థి ఎక్కువ లేకపోయినా తప్పకుండా చేసుకుంటానని, తల్లిని ఎలాగైనా ఒప్పించగలనని అంత నమ్మకంగా తన తండ్రితో చెప్పి మూడవరోజు "కొన్ని అనివార్య కారణాల వల్ల ఈ పెళ్ళికి ఒప్పుకోలేకపోతున్నందుకు మన్నించాలని" తన తండ్రికొక ముక్క రాసి పారేసి, దొంగలా బొబ్బిలినుంచి పారిపోతాడా? ఆ అనివార్య కారణాలేమిటో? తనకు డబ్బులేదనేగా... 'పెళ్ళికి మనసు ముఖ్యం,మనిషి ముఖ్యం, డబ్బు కాదు' అని కథలు రాసిన పెద్ద మనిషేనా ఈయన? అసలు డబ్బులేక పోవడం, పైగా చేసుకుంటానన్న పెద్దమనిషి హఠాత్తుగా ఊరు విడిచిపోవడం... తనని ఎవరు చేసుకుంటారు సులభంగా? రోగిష్టి రెండవపెళ్ళి కృష్ణమూర్తి తనకి వండిపెట్టడానికీ, సేవలు చేయడానికీ ఎవతో ఒకతె దొరుకుతోంది చాలుననుకుని తన మెళ్ళో పుస్తె కట్టాడు... మూర్తి పుట్టాడు.. కృష్ణమూర్తి కన్నుమూశాడు. తను అక్కడా ఇక్కడా వంటచేసి గుట్టుగా బతికి కొడుకుని ఆ మాత్రం చదివించింది. తన కొడుకుని వంటలక్క కొడుకుగా ఆఫీసులో ఎవరూ చెప్పుకోకూడదని, గుండె రాయి చేసుకుని ఒక్కగానొక్క కొడుకుని ఇంతదూరం ఢిల్లీకి పంపింది. తనకీ మాయదారి

షుగర్ జబ్బు వచ్చి కొడుకు పదే పదే 'పెద్ద పెద్ద డాక్టర్లిక్కడ ఉంటారు... రమ్మని' ఉత్తరం రాసి, చివరికి కోడలుపిల్లని కూడా పంపితే ఇక తప్పదనుకుని బయలుదేరి వెంటవచ్చింది. ఆ జగన్నాథం క్రింద తన కొడుకు ఉద్యోగం చేస్తున్నాడని కాని, అతగాడి స్నేహంతో ఈ పెద్ద పెద్ద డాక్టర్లని కలవవలసి వస్తుందని కాని తనేనాడు తలచనైనా తలచలేదు... ఈ జబ్బు తగ్గడానికి ఏ మందులూ లేవట. రోజూ ఇంజక్షన్లు తీసుకోవడమే కాని! తనెక్కడ ఇంజెక్షన్లిప్పించుకోగలదు... తన స్థితికి బొబ్బిలి మందులు చాలు.... ఢిల్లీ మందులవసరం లేదు..."ఏదో ఆవేశంతో లేవబోయింది రాజేశ్వరమ్మ. ముసురుకొస్తున్న ఆలోచనలు లేవనీయలేదు. తప్పంతా జగన్నాథానిదేనా? అతని అన్న సోమనాథం చేసిన ఘనకార్యం! ఆ రోజు అట్లతద్దినాడు తనూ వాళ్ళ చెల్లి సీతా తెల్లవారు ఝామున దాగుడుమూతలాడుతూ వుంటే వెనకనుంచి వచ్చి తన కళ్లు మూయలేదా.. తాను తెల్లబోయి విడిపించుకుంటే ఆ మసక వెలుతురులో చటుక్కున తన పెదవులమీద ముద్దు పెట్టుకొని సీత అటు రావడంతోటే గబగబా వెళ్ళిపోలేదా! నిజానికి అప్పటివరకూ తనకు తెలియదు... ముద్దు బుగ్గలమీదే కాదు పెదవులమీద కూడా పెట్టుకుంటారని! అప్పుడే తనకి పదమూడో ఏడు వచ్చింది. అయినా అందరూ ఆ వయసులో అంత అయోమయంగా వుండేవారా! తను వట్టి శుద్ధమొద్దు... ఆ తరవాత వెంటనే అన్న ఉద్యోగానికీ, తమ్ముడు చదువుకీ వెళ్ళిపోయారు మెద్రాసు.... ఆనాటి సంగతి మర్చిపోయింది. రెండేళ్ళ తర్వాత ఒక రోజు తండ్రి వచ్చి జగన్నాథం తనని పెళ్ళిచేసుకోవడానికి ఒప్పుకున్నాడని చెప్పాడు.. చివరికి జరిగిందీ!.. అన్న తనొక ఆటవస్తువుగా చూస్తే, తమ్ముడొక మట్టి బొమ్మగా చూసాడు... తనొక వంటలక్కగా, ఒక స్టెనోకి తల్లిగా మిగిలిపోయింది. తనకు చింతలేదు. స్టెనోకి తల్లిగా చెప్పుకోవడానికి తనకి చిన్నతనం లేదు. అయితే ఆ అన్నదమ్ములిద్దరిలో ఏ ఒక్కరి దగ్గరనుంచీ తాను ఏ మాత్రం సాయం తీసుకునేదానికంటే ఏ ఆత్మహత్యో చేసుకోవడం మంచిది. లేదు.... లేదు... తను వెళ్ళిపోవాలి బొబ్బిలి. తన కొడుకికి తన బాధ తెలియకూడదు. తల్లి తన తొలి ప్రణయాలని గురించి కొడుకుకి ఎలా చెబుతుంది? అంతకంటే సిగ్గుచేటు మరొకటేముంది?

రాజేశ్వరమ్మకి తెల్లవారుఝామున కలత నిద్రపట్టింది. కలత నిద్రలో కలలో జగన్నాథం, సోమనాథంలు తన చేతిలో చెరో పదిపైసలూ పడేస్తున్నారు... ఉలిక్కిపడి లేచింది. కొడుకు 'ఏమిటమ్మా కలవరిస్తున్నావు" అంటూ దగ్గరకు వచ్చాడు.

"ఏమీ లేదురా.. రాత్రి నువ్వు మీ సెక్రటరీ గారి వూరు బొబ్బిలే అన్నావు కదూ... రాత్రంతా అవే కలలు. బొబ్బిలి వదిలి నేను బతకలేనురా... అక్కడ మాత్రం మందులు దొరకవా? డాక్టర్లు లేరా? నన్నక్కడికి పంపేయిరా బాబూ... ఇక్కడ ఈ ఢిల్లీ చలి ఈ ఒక్కరోజులోనే ప్రాణాలు తోడేసింది" అంది ఆయాసపడుతూ రాజేశ్వరమ్మ.

మరో పదిరోజులకి జగన్నాథంగారు అతి సంతోషంతో కాఫీ బోర్డునుంచి వెంటనే కాఫీ తెప్పించమని పి.ఏ.మూర్తికి హుకుం జారీచేశాడు. మరుక్షణమే డిక్టేషనుకు రమ్మని మరో హుకుం. మూర్తి ఆనందంతో వెలిగిపోతున్న జగన్నాథంగారి ముఖం ఎదురుగా కొంచెం ఇంచుమించు అదే పోలికలతో వున్న మరో పెద్దమనిషి ముఖం చూసి నిలబడిపోయాడు.

"రా... రా మూర్తీ... ఫైనాన్స్ సెక్రటరీకి డి.వో ఒకటి పంపాలి"

ఇంతలో ఆ పెద్దమనిషెవరో "నీ పీఏ తెలుగతనేనా" అన్నాడు.

"ఆ... ఆ.. మన బొబ్బిలే... బొబ్బిలి మనుషులు నాకంటె నీకే అందరూ బాగా తెలుసు. వాళ్ళ నాన్న రాచకొండ కృష్ణమూర్తట... ఆ అన్నట్టు మీ అమ్మగారికెలా వుందోయ్, ఏమన్నారు శర్మగారు?"

"మా అమ్మ గొడవపెట్టి బొబ్బిలి వెళ్ళిపోయిందండి. ఈ చలి తనకు పడదని చెప్పి. ఎంత చెప్పినా వుండలేదు.. పోనీ మీ ఇంటికి తీసుకొచ్చి మీతోనైనా చెప్పిస్తే వింటుందేమోననుకుంటే ఎంత బతిమాలినా ఒప్పుకోలేదండి."

'ఏం పేరు మీ అమ్మగారిది" అన్నారు ఆ కొత్తగా వచ్చిన పెద్దమనిషి.

"రాజేశ్వరమ్మ సర్...."

"మీ తాతగారి పేరు... అంటే మీ అమ్మ నాన్నగారి పేరు"

"కూచిమంచి రుద్రయ్యగారు"

పెద్దలిద్దరూ తుళ్ళిపడ్డారు. నుదుర్లు చిట్లించారు.

"సర్... డి.వో" అన్నాడు మూర్తి.

"ఆ... ఆ... తర్వాత చూద్దాం.. కాఫీకి చెప్పావా?.... మీ అమ్మగారికి చెప్పావా... మాదీ బొబ్బిలే అని?"

"చెప్పాను, సర్.. మిమ్మల్ని మా అమ్మ ఆ రోజున ఆసుపత్రిలో చూసింది. మీరు తనకి తెలుసునని. మీకొక అన్నగారు. ఒక చెల్లి వుండేవారని కూడా అంది..."

‘ఈయనే మా అన్నగారు. ఈవేళే మద్రాసునుంచి వచ్చారు. సరే నువ్వెళ్ళు కాసేపయ్యాక పిలుస్తాను.”

కాసేపటికి తెచ్చిన కాఫీ కప్పు నోటికందించుకుంటూ, ‘బహుశా జగ్గూ! నేను అంత సెంటిమెంటల్‌గా ఉండి ఉండాల్సింది కాదేమో! ఆ రోజుల్లో అంతగా ఏమీ ఆలోచించకుండా చిలిపిగా రాజేశ్వరిని ముద్దుపెట్టుకోవడం పొరపాటే అయినా, ఆ సంగతి నీతో చెప్పకుండా వుండాల్సింది.. ఆ వయసులో, ఆ రోజుల్లో ఇంత ఆలోచన ఎక్కడిది? చిలిపితనం, సెంటిమెంట్సు, పాపభీతి, కోరికలూ అన్నీ కలగాపులగంగా ఉక్కిరిబిక్కిరిగా అయిన రోజుల్లో నేనేం చేసానో, నా చేష్టలవల్ల మరొక జీవితం ఎలా మట్టిపాలవుతుందో ఆలోచించలేదు. నేను చేసింది పొరపాటని వెంటనే తెలిసింది... అదే పిల్లని నువ్వు చేసుకుంటానంటే అసూయ కలగలేదు. కాని అనాలోచితంగా చేసిన పాడు పని తను నీ భార్యగా మన యింటికి వస్తే ప్రతిక్షణం నాకు గుర్తుకు వస్తుందని భయపడ్డాను” అన్నారు సోమనాథం ఎటో శుష్కంగా చూస్తూ.

“నిజమే... నువ్వు కాదన్నా ‘ఇది పెద్ద విషయమేమీ కాదు’ అని మొండికేసి నేను రాజేశ్వరిని అన్న ప్రకారం చేసుకుని వున్నా బావుండి వుండేది ... ఈ రకంగా నేనా రోజుల్లో ఆలోచించలేకపోయాను” అన్నారు జగన్నాథం గారు ఎటో జీవం లేకుండా చూస్తూ....

“కనీసం మనం కొంత రాజేశ్వరికి ఈ సమయంలో ఆర్థికంగా నయినా సాయపడాలి. మూర్తి దగ్గర అడ్రసు తీసుకో.. రెండువేలు పంపుదాం!” అన్నారు కనీసపు పరిష్కారంగా సోమనాథంగారు.

పదిరోజుల్లో, పంపిన రెండువేలూ పదిలంగా తిరిగి వచ్చాయి. చిన్నకార్డు ముక్కతోపాటు, “మీ అన్నగారి సలహాపై మీరు చూపిన దయకు ధన్యవాదాలు, దానాలు పుచ్చుకునే వంశానికి నేను చెందను” రాజేశ్వరి అంటూ.

# కారుణ్యం

**- డా॥ మాలతీ చందూర్**

ఆరోజు ఆదివారం. స్కూలు లేదు కాబట్టి సుమతి తీరిగ్గా కూచుని పేపరు చదువుకుంటున్నది.

ఆ వేళప్పుడు సహజంగా వాసు కంటికి కనబడడు. ఎందుకంటే, ఆదివారం వాళ్ళమ్మ వాడిని బలవంతాన పట్టుకుని వంటికి నూనెరాచి తలంటు పోస్తుంది. వాసు జీవితంలో వాడి  పదేళ్ళ జీవితంలో తలంటు పోసుకోవడం అన్నది పెద్ద గండం.

అటువంటి తలస్నానం తప్పించుకోకుండా ఇటూ, అటూ తిరుగుతూండడం సుమతికి ఆశ్చర్యంగా ఉంది. పేపరు మధ్య నుంచి వాడిని గమనిస్తూ ఉంది. ఒకవేళ ఏదన్నా సినిమాకి డబ్బులు అడిగే ప్రయత్నంలో ఉన్నాడా అన్న అనుమానంతో.

"అత్తా" అన్నాడు వాసు. సుమతి బదులు చెప్పలేదు. 'అత్తా' అంటూ పిలిచి అసలు విషయం చెప్పకపోవడం వాడికి అలవాటే.

"అత్తా! పోలీసులకి మనం ఫోను చేస్తే వస్తారా?" అని అడిగాడు.

సుమతి వులిక్కిపడింది. సర్దుకుని "నీకు పోలీసుల్తో పనేమిట్రా? ఎవరిని పట్టిస్తావ్?" అడిగింది సుమతి.

"అదికాదు అత్తా– నూరు నంబరుకి ఫోన్ చేస్తే పోలీసులు వస్తారట కదా!"

"ఎందుకు? ఫైర్‌గాని, ఆక్సిడెంట్‌గాని అయితే వస్తారు" అంది సుమతి.

"అది నిజమే అనుకో. నాకిప్పుడు పోలీసు సహాయం కావాలి" అన్నాడు వాసు, చాలా సీరియస్‌గా మొహం పెట్టి.

"ఏం? ఎవరన్నా దొంగతనం చేశారా?" అడిగింది సుమతి.

"పోలీసులు అంటే ఒక్క దొంగల్ని పట్టుకోవటానికేనా? అన్యాయం జరుగుతూంటే మనకి సహాయం చేయరా? రక్షకభటులు అంటే అర్థం ఏమిటి?

కష్టంలో వున్న వాళ్ళని రక్షించే వాళ్ళు కాదా? నువ్వే కదా చెప్పావు?" అడిగాడు. వాసుకి అత్తచెప్పిన పాఠాలు అబద్ధమా అన్న సవాల్ చేస్తూ.

"కాదని అనటం లేదు. ఎవరికి సహాయం చెయ్యాలి. అసలు కారణం ఏమిటో చెప్పు"

"సహాయం అంటే ఒక్క మనుషులకేనా? జంతువులకి సహాయం చెయ్యకూడదా?" అడిగాడు వాసు.

సుమతికి విషయం కొద్దికొద్దిగా బోధపడుతోంది. ఈ వాసుగాడు ఏ జంతువునో, కుక్కనో, పిల్లినో రక్షించటానికి బద్ధకంకణం కట్టుకున్నాడు. వాడు ఎవరు చెప్పినా వినడు. సరాసరి పోలీస్ స్టేషన్‌కి వెళ్ళిపోతాడు.

"వాళ్ళ టామీ గురించేనా?" అడిగింది సుమతి.

"అవునత్తా పాపం అది ఆ మురుగేశన్ గేటు వదలి రాదు. కుయ్యో, కుయ్యో అంటూ అరుస్తూ కూచుంటుంది. వాళ్ళేమో గేటు తెరవరు. పైగా రాళ్ళేసి కొడుతున్నారు.

"పోనీ నీవు మనింటికి తీసుకురా" అంది సుమతి.

"మామ్మ ఒప్పుకోదు. మనింట్లో చుట్టూ స్థలం లేదుగా?"

"మరి ఏం చేస్తావ్?" అడిగింది సుమతి కుతూహలంగా.

"నోరులేని ఒక ప్రాణిని యిన్నాళ్ళు పెంచి – యివ్వాళ తరిమేస్తున్నారని పోలీసులకి అప్పజెబుతాను" అన్నాడు వాసు వుద్రేకంగా.

సుమతికి తన మేనల్లుడి మీద కొండంత ప్రేమ పెల్లుబికింది. మురుగేశన్ వాళ్ళ టామీ గురించి వారం రోజులుగా, రకరకాల కథలు వింటున్నది సుమతి. టామీ తెల్లగా, పొట్టిగా ఉండే బొచ్చుకుక్క. దానికి తోక ఎటువుందో, ముఖం ఎటువుందో కూడా తెలియనంతటి బొచ్చుపూల బంతిలాగా రోడ్డుమీద గర్వంగా నడుస్తూ పోతూండేది కొంతకాలం క్రితం. మురుగేశన్ పొద్దుట, సాయంత్రం గొలుసుకట్టి షికారుకి తీసుకెళుతుంటే టామీని చూస్తే చాలు తన జన్మ ధన్యం అవుతుందని ఆశగా రెప్పవెయ్యకుండా చూసేవాడు వాసు. ఆ కుక్క, దాని యజమాని యిద్దరూ అతి గర్వంగా షికారుకి వెళుతుండేవారు ఆ వీధిలో. వాసుకి యీ టామీతో

ఆడుకోవాలని – దానికి ట్రిక్స్ నేర్పాలని చాలా ఆశగా ఉండేది. కాని మురుగేశన్ టామీని ఎవరితోను ఆడుకోనిచ్చేవాడు కాదు.

మురుగేశన్‌కి పెద్ద యిల్లూ, చుట్టూ విశాలమైన ఆవరణా, ఇనపగేటు వున్నాయి. అతడు బిల్డింగ్ కంట్రాక్టరు. ఆవరణలో ఇనపసామానూ, ఇటుకలు, చెడిపోయిన లారీ, ఇళ్ళు కట్టడానికి కావలసిన సామాను చాలా పడి వుండేది. ముఖ్యంగా ఆ సామాను కాపలా కోసం కుక్కని పెంచుతున్నాడు. రాత్రిళ్ళు ఈ టామీ ఆవరణ అంతా తిరిగి కాపలా కాయాలని అతని వుద్దేశం.

అయితే కుక్కల్లో కాపలా కుక్కలు, లాప్‌డాగ్సు– అని రకాలుంటాయి. కాపలా కుక్కలు – అల్సేషియన్స్ – గుర్రాల్లాగా వుండి బాగా తిని ఇంట్లోకి ఈగని కూడా చొరనివ్వకుండా కాపలా కాస్తాయి. ఈ బొచ్చు కుక్కలు ముద్దుగా ఇంట్లో అంతా తిరిగి సోఫాలు కుర్చీలు ఎక్కి ఆట వస్తువుల్లాగా వుండే ప్రాణులు, పామేరియన్ జాతి కాపలాకి అంతగా పనికిరావు. ఈ విషయం వివరంగా తెలియని మురుగేశన్ అందంగా, ముద్దుగా వున్న బొచ్చు కుక్కపిల్లని తెచ్చి దాన్ని ఎంతో గారాబంగా పెంచి రాత్రిళ్ళు కాపలాకి అని వీధి వరండాలో కట్టేశాడు.

ఆ కుక్క వరండాలో పడుకుని వుండగానే రాత్రిళ్ళు వెనకచాటుగా యినుపకడ్డీలు ఎవరో ఎత్తుకుపోతున్నారట. ముందువైపున కుక్కని కట్టేశారు కాబట్టి వెనక సామాన్లు పోతున్నాయని వెనుకవైపుగా టామీని కట్టాడు. ముందువైపు బల్బూ, కొబ్బరికాయాలే పోయాయి. ఈ కుక్క వుండీ దొంగలు పడుతున్నారు కాబట్టి దీనికి దొంగలు వస్తే మొరిగే తెలివిలేదు. ఇది కాపలాకి పనికిరాదు. దీనికి తిండి దండుగ అని మురుగేశన్ టామీని వీధిలోకి తరిమేశాడు. గేట్లు మూసేసి, లోపలికి రానివ్వకూడదని, పాలూ, తిండీ పెట్టకూడదని కట్టుదిట్టం చేశాడు.

నోరూ వాయీలేని ఈ జీవికి నిన్న మొన్నటిదాకా తనని అందలం ఎక్కించిన యజమాని లోపలికి ఎందుకు రానివ్వటం లేదో అర్థం కాలేదు. దానికి ఆర్థించగల కళ్ళు ఉన్నాయి. అరవగల నోరూ వుంది. అప్పటిదాకా భోగభాగ్యాలు అనుభవించిన టామీ ఆ యింటి గేటు ముందు కూచుని ఆగకుండా అరుస్తోంది. విశ్వాసంతో యజమాని యింటివైపు చూస్తున్నది. "నేను చేసిన తప్పేమిటి? నన్ను ఎందుకు లోపలికి రానివ్వరు?' అని.

దీని అరుపులు మొదట్లో బలంగా, ఆరోగ్యంగా వుండేవి. తర్వాత క్షీణించి –కుయ్ కుయ్‌మని జాలిగా వుండేవి. తెల్లని టామీ బొచ్చు మట్టికొట్టుకుని పోయింది. దానికి అన్ని కుక్కల్లాగా ఆహారం కోసం చెత్తాచెదారం వెతుక్కోవటం చాతకాదు. వీధి కుక్కల్తో పోరాడటమూ తెలియదు. అందంగా – పూలబంతి లాగా వుండే టామీ చిక్కిపోయి, అలా గేటు దగ్గర పడివుంది. తన జాతికి సహజమైన విశ్వాసంతో.

ఆ వీధిలోని చిన్నపిల్లలు– వాసుతో సహా కలిపి టామీకి అన్నం – బిస్కట్లూ పెడదామని చాలా చూశారు. టామీ ఎవరు ఏం పెట్టినా తినేది కాదు. యజమాని గేటు వైపు చూసి, మూలుగుతూ కుయ్‌కుయ్‌మని హృదయ విదారకంగా ఏడ్చేది. ఈ టామీ దీనగాథ వారం రోజులనుంచీ – అందరి చెవుల పడుతోంది. ఎవరికి వారు "పాపం నోరులేని ప్రాణి –యిలాంటి పని చెయ్యొచ్చా?' అనుకునేవారే గాని మురుగేశన్ ఎదుటపడి ఎవరూ ఏమీ అడగలేదు.

రోడ్డుమీద కళేబరం పడివుంటే మన కెందుకని ముక్కు మూసుకుపోయే మనస్తత్వం సగటు మనిషిది. రోడ్‌మీద ఆక్సిడెంట్ అయితే సాక్ష్యం యివ్వాల్సి వస్తుందేమోననీ, పోలీసు స్టేషన్ చుట్టూ తిరగాలేమోనని భయపడి వూరుకునే 'సివిక్‌సెన్స్' మనది. మురుగేశన్ డబ్బున్నవాడు. అతనికి పెద్ద యిల్లుంది. పెద్ద బిజినెస్ ఉంది. అతనికి యిష్టమయింది. కుక్కని పెంచుకున్నాడు. అది కాపలా కాయలేదు. కాబట్టి తిండి దండుగ అని తరిమేశాడు. ఇది మనకి సంబంధించింది కాదు అని ఆ వీధిలోని పెద్దలు సరిపెట్టుకున్నారు.

కాని, లోకపు తీరు తెలియని మనుషులూ, ఈ సంఘం ఎటువంటి శిలా సదృశమైనదో తెలియని వాసు లాంటి పిల్లలు ఆ టామీని చూసి జాలిపడుతున్నారు. మురుగేశన్‌చేత ఆ టామీని మళ్లీ యింట్లో ఉంచుకునేటట్లు చెయ్యాలని పిల్లల అభిలాష. దీనికి వాసు నాయకుడు.

"అత్తా, పోలీసులకి చెబితే వాళ్ళు మురుగేశన్‌కి బుద్ధి చెప్పరా? పోలీసులు మనుషులని తప్ప – కుక్కలని రక్షించరా?" అని వాసు అడిగాడు సుమతిని.

పదేళ్ళు నిండని వాసు దృష్టిలో అన్ని ప్రాణులూ ఒకటే. భగవంతుని దృష్టిలో అన్ని ప్రాణులూ సమానము అయినట్లే– పసిపిల్లల దృష్టిలో పిల్లి ప్రాణానికి, మనిషి

ప్రాణానికి మధ్య తేడా లేదు. అన్యాయమన్నది మనిషికి జరిగినా, జంతువుకి జరిగినా ఒకటే, అయితే మనిషి చేసిన ఈ న్యాయ సూత్రాల్లో మనిషికి వున్న విలువ, జంతువుకి లేదు. రోడ్డుమీద ఒక గొడ్డుని చావబాదుతుంటే, పోలీసువారు పట్టించుకోరు. పట్టించుకోనక్కరలేదు. అది వారి రక్షణ విధులలో లేదు కాబట్టి.

"పోలీసులని తీసుకొచ్చి ఏం చేస్తావ్? అది మురుగేశన్ పెంచుతున్న కుక్క. అతనికి యిష్టంలేదు. తరిమేశారు. ఇది పోలీసుకేసు కిందరాదు" అంది సుమతి.

"అంతేనా? మరి కాపలా కాయలేదని ఉపయోగం లేదని వీధిలోకి తరిమాడుకదా – రేపు మురుగేశన్ ముసలివాడు అయితే – అతన్ని కూడా పనికిరాని వాడని తరిమేయొచ్చా? మనింట్లో మామ్మ ఉంది. ఎప్పుడూ మంచంమీద పడివుంటుంది అందుకని... '

"నోరుముయ్– అలాంటి మాటలు అనకూడదు. ఆ టామీకి, మామ్మకీ పోలిక తెస్తావా?"

"పోనీలే మామ్మనంటే నీకు కోపం వస్తుంది. రేపువాసు కాలు విరిగిపోతుందనుకో – స్కూలు కెళ్ళి చదువుకోలేననుకో.... " ఆగిపోయాడు వాసు – అత్త ముఖం చూసి బాధపడుతూ.

"వాసూ యిట్లాంటి చెడ్డమాటలు నీకు ఎవరు నేర్పుతున్నార్రా?" అడిగింది సుమతి నిదానంగా. వాడివాదనలోని బలాన్ని వొప్పుకోలేకుండా వుంది. అలాగని కొట్టి పారేయ్యలేకుండాను వుంది.

"ఇవి చెడ్డమాటలు కావు. పాపం ఆ టామీకి, వీధిలో తిరిగి బతకడం చేతకాదు. దాన్ని అలా తిండి పెట్టకుండా తరిమేయడం అన్యాయం"

"అయితే నన్నేం చెయ్యమంటావ్?"విసుగ్గా అడిగింది సుమతి.

"పోలీసులకి ఫోన్‌చేస్తే వస్తారా రారా?"

"వాళ్ళు రాకపోవచ్చు. నువ్వు, మీ స్నేహితులూ కలిసి పోలీసు స్టేషనుకెళ్ళి అసలు విషయం అక్కడున్న సబ్ యినస్పెక్టరుకి చెప్పండి"

"చెపితే ఆయన సాయం చేస్తారా" అడిగాడు వాసు ఆదుర్దాగా.

"ఆయన సాయం చెయ్యకపోయినా యస్.పి.ఏ.కి చెపుతారు."

"అత్తా యిటువంటి నోరులేని ప్రాణులని – ముఖ్యంగా కుక్కలని రక్షించేందుకు సొసైటీ వుందని చెప్పావు. ఆ మధ్య వాళ్ళెవరో కుక్కని ఇంట్లో కట్టేసి వారంరోజులు వూరు వెళ్ళిపోయారని."

"అప్పుడు కూడా యస్.పి.సి.వాళ్ళే ఆ కుక్కని రక్షించారు" అంది సుమతి.

"అయితే వాళ్ళ నంబరు టెలిఫోన్ డైరెక్టరీలో వుంటుందా?" అంటూ వాసు వుత్సాహంగా డైరెక్టరీ వెతకడం ప్రారంభించాడు.

ఆ తరువాత అరగంటకి, వాసు సుమతిని బతిమాలి, విసిగించి, రెండు రూపాయలు పుచ్చుకుని 'సొసైటీ ఫర్ ప్రివెన్సివ్ ఆఫ్ క్రూయాలటీ టు ద యానిమల్స్' జీవకారుణ్య సంఘం ఆఫీసుకి సరాసరి వెళ్ళి కథంతా వివరంగా చెప్పాడు.

ఆ రోజు ఆదివారం, యస్.పి.సి.ఏ వారు రారేమో అనుకుంది సుమతి. కాని జీవకారుణ్యానికి సెలవలూ... తిధివార నక్షత్రాలూ అక్కరలేదని మరోసారి నిరూపించబడింది. మనుషులలో మానవత పూర్తిగా నశించి పోలేదు.

ఎస్.పి.సియే యిన్‌స్పెక్టరుని వెంటబెట్టుకుని వాసూ, వాడి స్నేహితులూ విజయగర్వంతో, ఆ వీధిలోకి వచ్చి, మురుగేశన్ ఇంటి ముందు ఆగారు. కొత్త వ్యక్తి గేటు తెరుస్తుంటే – టామీ నీరసంగా అరుస్తోంది. "అది నా యజమాని గేటు మీరు వెళ్ళకూడదు" అన్నట్లు.

ఆ దృశ్యం చూస్తున్న యిన్‌స్పెక్టరు కళ్ళలో కన్నీళ్లు తిరిగాయి.

"వీటికున్న విశ్వాసంలో మనిషికి నూరోవంతు కూడా లేదు. తిండి పెట్టకపోయినా రాళ్ళు రువ్వినా అది చూడండి ఎలా కాపలా కాస్తున్నదో? సరి అయిన శిక్షణ యిస్తే – ఏ కుక్క అయినా ఇల్లు కాపలా కాస్తుంది" అంటూ టామీ అరుపుల మధ్యనుంచి లోనికెళ్ళారు యిన్‌స్పెక్టరు.

"సృష్టిలో ఏ ప్రాణిని హింసించినా, అందుకు జరిమానా, శిక్షా రెండూ వుంటాయి. కొన్నాళ్ళు పెంచిన కుక్కకి తిండి పెట్టక వీధిలోకి తరిమేహక్కు ఎవరికీ లేదు. కావాలంటే వంద రూపాయలు నెలకి ఇవ్వండి – బ్లూక్రాస్ వారు మీ తరఫున టామీని పోషిస్తారు" అన్నారు యిన్‌స్పెక్టరు.

దాంతో మురుగేశన్ చెట్టు దిగాడు. అతను యిన్స్పెక్టరు ఎదురుగానే గేటు తెరిచాడు. మట్టి కొట్టుకునున్న టామీ ఒక్క ఉదుటున యజమాని కాళ్ళనునాకడం ఆరంభించింది. దాని తోక వింజామరం లాగా గాలిలో ఎగురుతోంది. వారం రోజులకి టామీ మొదటిసారి పాలు తాగింది. దాని కళ్ళలోని విశ్వాసాన్ని, ప్రేమను చూసి – మురుగేశన్ తొలిసారి తాను మనిషై పుట్టినందుకు సిగ్గుపడ్డాడు. టామీ కంఠంలో దైన్యంలేదు. దాని మొరుగులో ఆనందం!

"అత్తా మనకంటే యస్.పి.సి.యే వాళ్ళు చాలా మంచివాళ్ళు. ఈ వీధిలోని వాళ్ళు చెయ్యలేని పని ఒక్క అరగంటలో వాళ్ళు చేసేశారు. మీ కెవ్వరికీ రూల్సు, రెగ్యులేషన్స్ తెలియవు" అన్నాడు పదేళ్ళ వాసు.

"తెలియకపోవడం" కాదు, వాటిని ఆచరణలో పెట్టగల తెగువా, ఉత్సాహమూ లేదు. మా హృదయాలు బండబారి పోయినాయి అనుకుంది సుమతి తనలో తాను.

# సువర్ణ గన్నేరు

**- డా॥ కె.రామలక్ష్మి**

**క**థ రాయాలంటే మనసు రావటం లేదు. రాయాలన్న ఆశ పీకుతున్నా మనసు ఎంచేతనో మొద్దుబారిపోయింది. ఈ మనసుకిదేం పిచ్చో ఉండుండి తన పని తాను చూసుకోవడం మానేసి వేటిని గురించో ఆలోచిస్తూ వుండిపోతుంది.

ఆదివారం ప్రొద్దుటంతా విశ్రాంతిగా హాయిగా స్లోగా పనిచేసుకుంటూ గడిపేయాలన్న నా కోర్కెని - మొగ్గలోనే తుంచేసింది రామ్మూర్తిరాక. రామ్మూర్తి దేవుడు కాదు. దెయ్యం. మనిషి రూపంలో వుంటాడేగాని స్వార్థం తెలియని మనిషి. ఏదీ తెలియని ఒక తరహా జడపదార్థం పోనీ అంటే జడపదార్థంలాగా పడివున్నా ఏ గొడవా లేకుండా వుండేది. అలా పడివుండక పెళ్ళిచేసుకున్నాడు. ఓ ఆడదాన్ని ఉద్ధరిద్దామనుకున్నాడో ఏమో! పిల్లల్ని కన్నాడు. తన సుగుణాలు వృధాగాపోకుండా యీ లోకంలో నిలబడి ఉండాలని కాబోలు!

కొందరికి పిల్లనెందుకిస్తారో తెలియదు. కన్నెచెర బాపితే చాలు. తమ పిల్లకి అనుకుంటారో ఏమో! అలాంటి దౌర్భాగ్యపు తల్లిదండ్రుల కడుపునే పుట్టి ఉండాలి రామ్మూర్తిని పెళ్ళాడిన రాధమ్మగారు. కురూపి కాదు పిచ్చిదంతకంటే కాదు. మరి యీ రామ్మూర్తిని పెళ్ళాడ్డానికెలా తలూపింది? అంటే 'అది రాత ఎవరికెవరు రాసిపెట్టారో- చెప్పలేరు' అనుకునేటంత వేదాంతిగా పెళ్ళినాటిరాత్రే మారిపోయివుండాలి రాధమ్మ. 'రాధమ్మ కాదంటే ఇది రాయమ్మ' అనే ధోరణిలో మాట్లాడే రాధమ్మలో నేటి ఓర్పుకి పరాకాష్ఠ. భారత నారీత్వపు నికృష్టపు దశ చూశానా అనిపించేది. అలాంటి చరిత్రకు నాయకుడు రామ్మూర్తి ఊరు తెల్లారకుండా గేటు దగ్గర నిలబడి అరుస్తున్నాడు 'పంతులుగారూ పంతులుగారూ' అంటూ. రామ్మూర్తి పేరు చెబితేనే ఒళ్ళు మండే నాకు అంత ఉదయం పూరు మునిగిపోయినట్లు రావడం, ఆయనగారి కోసం ఆర్తనాదాలు చేయడం మహా ఒళ్ళు మండిపోయింది నాకు.

"ఇంకా లేవలేదు. ఏం కావాలి?" అనుకోకుండానే కసిరినట్లు వుంది నా కంఠస్వరం.

"నా కూతురు చచ్చిపోయిందమ్మగారూ, కాస్త సహాయం చేయండి" అంటూ గోడకేసి తలబాదుకుని ఏడుస్తున్నాడు.

రామ్మూర్తి నాటకాలు తెలిసిన నాకిదేం బాధగా తోచలేదు. తాగుడుకి డబ్బు కావలసి వచ్చినప్పుడల్లా ఎందరి దగ్గిరో మామల్నీ, కొడుకుల్నీ, పెళ్ళాన్నీ చంపాడు! ఎన్నోసార్లు ఎప్పుడో చచ్చిపోయిన తల్లికి, తండ్రికీ తద్దినాలు పెట్టాడు. కొడుగ్గా చేయవలసిన ఘనకార్యం అదొక్కటే అయినట్టు.

"ఆయన నిద్రపోతున్నారు. ఏం లేదు. నీకిదో అలవాటయిపోయింది. వేంచేయి" కసిరాను.

"అమ్మగారూ, నిజం అమ్మగారూ, దేవుడిమీద ప్రమాణం చేసి చెపుతున్నా. దాన్ని బుగ్గి చేయడానికి కూడా పైసా లేదమ్మా. ఈ ఒక్కసారికి కరుణించు" ఆడదానికంటే అన్యాయంగా ఏడుస్తున్నాడు రామ్మూర్తి.

తాగుబోతుకి సిగ్గేమిటి? ఎగ్గేమిటి? ఆ నాల్గురూపాయిలో అర్ధరూపాయిలో జేబులో పడేదాకానే! అవి కాస్తా పడగానే – యాచకాంతే దాసరిః పదం అన్నట్టు ఏడుపు ఆపేసి ఆ డబ్బులు కాస్తా పట్టుకుని ఏ నాటుసారా కొట్టుకో ఉడాయిస్తాడు. ఏ ఏభయ్యో నూరో మిల్లీలు పడగానే చావుకి డబ్బిచ్చినవాళ్ళ వెధవాయితనానికి నవ్వుకుంటూ దారినపోయే వాళ్ళందరికీ లెక్చర్లిస్తాడు! ఆ సంగతి అందరికీ తెలుసు. అందుకే నాకు రామ్మూర్తిని చూస్తే పిసరంత కూడా జాలిలేదు. పొమ్మన్నాను.

ఆయనగారు నిద్రలేస్తూనే "ఎవరిమీదా ఆ కేకలు?" కుశలప్రశ్న వేశారు.

నాకు ఒళ్ళు మండిపోయింది. బహుశా నా మాటలన్నీ వినే వుంటారు. "లేకపోతే ఏమిటండీ మరీ అన్యాయం?" అన్నాను.

"నిజంగానే కూతురికి ఒంట్లో బాగోలేదేమో" అన్నారు.

"అయితే మటుకు చచ్చిపోయిందని చెపుతాడా? ఒళ్ళు తెలిసి లేడండీ. ఇంకా సూర్యోదయమేనా కాకుండా అలా తాగే మనిషి బ్రతికి వుంటేనేం ఛస్తేనేం?" అన్నా కసిగా.

"ఎందుకు సీతా అంత కోపం! మనం శపించకుండానే వాడు ఎలాగూ చస్తాడు ఎప్పుడో" అనేసి వారు స్నానానికి వెళ్ళిపోయారు.

టిఫిన్లు పూర్తి అయి అంతా సర్దుకునేసరికి మావారి చీట్లాట గుంపు వచ్చేసింది. ఇదొకరకం బెడద. వెనుకటికి ఎవరో నవాబుగారు భార్య చచ్చిపోయిందని కబురొస్తే యీ చెయ్యి కానివ్వండి అన్నాట్ట. అలాగే వుంటుంది వీళ్ళ ధోరణి! సెలవొస్తే చాలు– చతుర్ముఖ పారాయణం మినహా – ఇంకోపని తోచదు. మధ్యతరగతి తీరని రోగాల్లో యీ తాగుడూ పేకాట వీటి తర్వాత వ్యభిచారం– యీ మూడూ చెప్పుకోవాలి ముందు. మావారి స్నేహితుడు పెద్దజోకనుకుని ఓసారి "మధ్యతరగతి మూడు "మా"లు అంటూ మందు –ముక్క–ముండ" అన్నాడు. నాకారోజు నుంచి అతగాడు ఇంటికొచ్చినప్పుడల్లా తేళ్ళూ, జెర్రులూ పాకుతున్నట్లు వుంటుంది.

సాయంత్రం దాకా మళ్ళీ రామ్మూర్తిని జ్ఞాపకం చేసుకోలేదు. రాత్రి పడుకుంటూ "ఏం మనిషి ఆ రామ్మూర్తి, ఒంట్లో చీమూ, నెత్తురూ ఉండదా" అన్నా యథాలాపంగా.

"సీతా మానవుడి మీద జడ్జిమెంటు సాటిమానవుడు ఎలా ఇవ్వగలడు? రామ్మూర్తి ఓ శాపగ్రస్తుడనుకో..." అన్నారు ఒత్తిగిలి పడుకుంటూ.

"మానవుడేమిటండీ ఆ రామ్మూర్తి! దానవుడని కూడా అనడానికి వీల్లేదు! ఆ పిల్లలనూ తల్లినీ ఎప్పుడేనా చూశారా? బ్రతుకు వాళ్ళు భారంగా మోస్తుంటే, వాడు వాళ్ళని నిత్యం చంపేవాడు. ఆవిడ ఇక్కడా అక్కడా పనులుచేసి పిల్లలకి తిండి పెడితే పౌరుషం వచ్చి ఆవిడని చితక్కొట్టి తంతాడు. అదేం మనిషి? అదేం తత్వం? తను పెట్టడు. తల్లి పెడితే తప్పా?... ఏమండీ, పాపం ఆ చిన్నపిల్లది పట్టుమని పదేళ్ళు రానిది ఏడవకుండా వుండాలని పౌరుషంగా ముఖం పెట్టి నవ్వటానికి ప్రయత్నించేది – దాన్ని పట్టుకుని పావలా పరకా అప్పు తెమ్మని తంతాట్ట. ఎవరింటికి ఎన్నిసార్లు వెళుతుంది అప్పుకి? తన్నులు తిని ఏడుపు దిగమిఁగుకోవడం అలవాటు చేసుకుంది... వీడిని తండ్రి అనాలా! రామ! రామ!" నా అక్కసు వెళ్ళగక్కకుండా వుండలేకపోయాను. ఆదివారం అందరికీ సెలవేమోగాని యింటి ఆడవారికి సెలవుండదన్నమాట నిజం చేసి ఆదివారం కాస్తా గడచిపోయింది.

సోమవారం అంటే మళ్ళీ ఉరుకులూ పరుగులూ.... ఆయనగారి ఆఫీసు మరీ అన్యాయం. పని తొందరలో వుండి ఎవరొచ్చారో ఏమయిందో పట్టించుకోనేలేదు. ఆయన కూడా ముభావంగా పని ముగించి భోజనానికి కూర్చున్నారు.

వడ్డిస్తూ 'ఎవరండీ వస్త?" అడిగాను కుతూహలాన్ని అణచుకోలేక.

"రామ్మూర్తికి తెలిసినవాళ్ళు... రాత్రి రామ్మూర్తి రైలుకింద బుర్రెట్టి ప్రాణం తీసుకున్నాట్ట!" చాలా నెమ్మదిగా చెప్పారు.

ఉరమని పిడుగుపడ్డట్టు అదిరిపడ్డాను.

"రామ్మూర్తి చచ్చాడా!"

"ఔను సీతా రామ్మూర్తి ప్రాణం తీసుకున్నాడు ఎందుకో తెలుసా?!"

"ఎందుకేమిటండీ కైపులో ఒళ్ళు తెలియకుండా రైలుకింద తలపెట్టాట్ట! పక్కనే వున్న చిన్న గేటు కాపలావాడు రామ్మూర్తిని చూశాడట. చాలాసేపు రైలు కట్టవారగా కూర్చునే వున్నాడట రామ్మూర్తి. పెట్టెలు ఒకటి దాటి ఒకటి వెళ్ళిపోతుంటే వెర్రివాడిలా కూర్చునే వుండటం చూసి గేటువాడు కేకేశాడట కూడా. కాని వాడటు పరిగెత్తే లోపలే కదులుతూన్న ఆ పెట్టెలక్రింద తల దూర్చేశాడట. ఎంత భయంకరం కదూ!"

వడ్డించటం ఆపేసినట్లున్నాను. నా ముఖంలోకి చూశారు. "ఏం సీతా?" అంటూ.

"అలా ఎందుకు చేశాడండీ?" ఎక్కడో నూతిలోంచి వస్తున్నట్లు విన్పిస్తోంది నా మాట నాకే.

"వాడి కూతురు నిజంగానే చచ్చిపోయిందట సీతా. గన్నేరుపప్పు తినేసి ఆత్మహత్య చేసుకుందిట" అన్నారు సమాధానంగా.

నా మనస్సు ఎలాగో అయిపోయింది. పదేళ్ళైనా నిండని పసిది గన్నేరుపప్పు తిని చావడమా? అనిపించింది. చక్కని సువర్ణగన్నేరు పూలేరి దేవుడాటలాడవలసిన వయసులో ఇలాంటి పని చేసిందంటే దాని గుండె కూడా ఎప్పుడో ఆగిపోయిందా అనిపించింది నాకు.

"అయితే పొద్దుట వాడు చెప్పింది నిజమేనన్నమాట" నమ్మలేనట్లు అడిగాను.

"నిజమే సీతా! నిజమే అందరినీ బ్రతిమిలాడుకున్నాడట. కాని ఎవ్వరూ నమ్మలేదు నీలాగే. చివరికి రాత్రి పదో పదకొండో అయితే నాగభూషణం కొంపమీద పడ్డాడు. రెండు రూపాయలు పడేసి పొమ్మన్నాడట ఆయన కొడుకు. రామ్మూర్తి ఇంటికి పోలేదు.. వాళ్ళావిడి పాపం వెతకని చోటు లేదు... చివరికి ఎవరో చిన్నగేటు దగ్గర రైలుకింద ఎవరో పడ్డారని చెప్పుకుంటూంటే అటు పరిగెత్తిందట ఆ యిల్లాలు. ఎంత దారుణమో చూశావా సీతా! కూతుర్ని మట్టి చేయడం కోసం తాగుబోతు మొగుడికోసం వెతికి వేసారింది. చివరకు యిలా జరిగింది.. తెలిసినవాళ్ళంతా తలో చేయీ వేసి చేయవలసినవి చేసేశారు సీతా! పాపం రాధమ్మగారిని తలుచుకుంటేనే బాధ!" అంటున్న ఆయన మాటలకు అనుకోకుండానే నవ్వొచ్చింది నాకు.

"బాధా! బాధేమిటండీ. ఆవిడ బాధ విరగడైంది అనాలి!" అన్నా.

ఆయనేం జవాబు చెప్పలేదు. ఎటో చూస్తూ వూరుకున్నారు. కిటికీలోంచి పచ్చని ఆకుల మధ్య బంగారంగా పూశాయి సువర్ణగన్నేరు. గాలికి ఊగిసలాడుతున్నాయి. పచ్చి కాయలు కొరుకుతోంది ఓ నల్లని కోయిల.

"సీతా ఈ గన్నేరు కొట్టించెయ్!" అన్నారు అప్రయత్నంగా– వారి మనసులో ఏం మెదిలిందో గ్రహించగలిగాను నేను. మగవాడిని ఓదార్చటం అంత సులభం కాదు. వాళ్లు మనసు విప్పి ఏడ్వలేరు.

"ఎందుకండీ పచ్చని చెట్టు కొట్టించడం. సువర్ణగన్నేరు శివప్రీతి కదా!" అన్నాను వారి భుజం మీద చేయివేస్తూ.

"శివుడు నాశనకారుడు సీతా! మనకా పూజా వద్దు ఆ పూలూ వద్దు" అన్నారు ఆవేశంగా.

"బాగుంది! ఈ జీవితంలో నాశనం లేనిది ఏముందండీ మీ పిచ్చిగాని. రండి టైమైంది" అన్నాను.

ఏ ఆవూ మేయదు కదా, అందంగా పూస్తాయి , కళ్ళకి పచ్చగా చల్లగా వుంటాయి అని అతిగా పెంచిన సువర్ణగన్నేరు చెట్లు వెర్రి దెయ్యాల్లాగా తలలూపుతూ నవ్వుతున్నట్లు అనిపించింది నాకు కూడా.

'రామ్మూర్తికి డబ్బిచ్చి వుంటే' అన్న ఆలోచన బుర్ర దొలిచేస్తూంది. ఆ ఆలోచన రాకుండా చేయాలన్న నా ప్రయత్నమంతా బలీయంగా కూడగట్టుకొని రామ్మూర్తి రాక్షసత్వానికి బలిఅయిపోయిన చిన్నారి చుట్టూ, రాక్షసత్వాన్ని అధిగమించి మానవత్వం ఆఖరి క్షణంలో తలెత్తీ ప్రయోజనం లేదని జీవితాన్ని కడతేర్చుకున్న రామ్మూర్తి చుట్టూ వద్దంటున్నా తిరుగుతూనే ఉంది... 'మానవత్వంలో నమ్మకం పోగొట్టిన రామ్మూర్తిలో కూడా చేతకాని మానవత్వం దాక్కుని వుందన్నమాట' అనుకుంటూ పని చేసుకోవాలని ప్రయత్నాలు ప్రారంభించాను. ఎప్పుడు తలెత్తి చూసినా నా కళ్ళు తిన్నగా వెళ్ళి సువర్ణగన్నేరు చెట్లమీద వాలుతున్నాయి – అవి ఇదివరకెలా కనిపించినా యిప్పుడు చావుకి చిహ్నాలుగా కన్పిస్తున్నాయి.

# ఇంటర్నెట్ పెళ్ళిచూపులు

**- రంగనాయకమ్మ**

**ఇం**కా తెల్లారే లేదు. అప్పుడే మాటలా అమ్మకీ, అమ్మమ్మకీ! ఏం ముంచుకొచ్చింది. అబ్బ, గోల గోల!

దుప్పటి చెవుల మీదకి లాక్కుని రాంబాబు మళ్ళీ నిద్రకి పడ్డాడు. దుప్పట్లోకి దూరి పోతున్నాయి వెనక వరండాలోంచి దూసుకొచ్చే గోల మాటలు.

"అమ్మా, రామూకి ఇరవై తొమ్మిదేళ్ళు నిండిపోయినట్లే నిన్నటితో. ఇవ్వాల్టి నుంచీ ముప్పై మొదలు! ఇంకా పెళ్ళి లేదు! రాత్రసలు నాకు నిద్రపట్టలేదు."

"నాకు మాత్రం పట్టిందా నిద్ర? చెప్తే వింటాడా, పెడతాడా? తెనాలి వాళ్ళ సంబంధం ఎంత మంచిది! పిల్ల తెల్లగా బొమ్మలా వుంటుందంట! చూస్తే నచ్చేదే. ఒక్కసారి చూడమంటే వీల్లేదంటాడు."

'అప్పుడే ఇరవై తొమ్మిది నిండి పోయాయమ్మా! నిన్న మొన్న పుట్టాడు. అప్పుడే ముప్పయ్ వచ్చాయా! వాళ్ళ నాన్న వుంటే ఎంత సంతోషించేవారో! నిద్రే పట్టలేదు నాకు రాత్రి. అందుకే లేచిపోయాను.

"నిజమే వాళ్ల నాన్న ఉంటే ఈ పాటికి వంగదీసి తన్ని పెళ్లి చేసేవాడే. మొగ దిక్కులేని సంసారం. ఏం చేస్తాం, జరిగింది అలాగ, రాత్రంతా అదే ధ్యాస నాకు. నీకన్నా ముందే లేచాను. ఈ ఏడాదన్నా అయిపోవాలి. గట్టిగా చెప్పు వాడికి."

"అమ్మో, నేను చెప్తే అసలు వినడు. గట్టిగా చెప్పినా లేదు. మెత్తగా చెప్పినా లేదు. నలభై దాటాక చేసుకుంటాడేమోలే"

"అప్పుడెవరు చేసుకుంటారు వీణ్ణి?"

"అదే నా భయం, నువ్వే గట్టిగా చెప్పమ్మా! నా మాట అసలే వినడు."

"పిచ్చా నీకు? మూడేళ్ళనుంచీ మొత్తుకుంటున్నాం. ఏం విన్నాడు? ఉద్యోగం

చేసుకుంటున్నాడుగా? బతుకు దెరువు వుంది. వయసుని బట్టి  ముద్దూ ముచ్చటా వుండొద్దూ? అసలు పాతికేళ్ళకే అవ్వాలి.”

‘అదేనమ్మా,చెప్పు వాడికి గట్టిగా. నీ మాట కొంచెం వింటాడు.”

“సరే. లేవనియ్యి వాణ్ణి.”

“వయసు పెరుగుతుంటే అందం తగ్గుతుందమ్మా! ఇంకో రెండేళ్లు పోతే తల్లో తెల్ల వెంట్రుకలు మొదలవుతాయి. వాళ్ళ నాన్నకి పాతికేళ్ళకే బట్టతల! వీడికి నయమే ఇంకా. వీడి జుట్టు నల్లగా నిగనిగలాడుతూ నల్ల పట్టులా ఉంటుంది. చక్కటి కళ్ళు! చక్కటి ముఖం! మన పిల్లాడని కాదుగానీ, ఎంత బాగుంటాడమ్మా! రెండేళ్ళు పోతే అందాలన్నీ మారతాయి.”

“సావిత్రీ, ఊరుకో! వాడి అందం ఎటూ పోదులే. పెద్దయినా అందం గానే ఉంటాడు. లేవనియ్యి వాణ్ణి.”

రాంబాబు అప్పటికే దుప్పటి తన్నేసి లేచిపోయి రుసరుసలాడుతూ వచ్చిపడ్డాడు. “ఇంట్లో ఎవర్నీ నిద్రపోనివ్వరా మీరు? రాత్రి రెండు దాటాక పడుకున్నాను తెలుసా? అందాకా కొత్తపుస్తకం చదివాను. తెల్లారే లేదు. ఏంటీ గోల గోల చేస్తున్నారు?”

“అవున్నాయనా, మా బాధ మాది.”

“ఏం బాధ అమ్మమ్మా నీకు? కన్ను బాధా, పన్ను బాధా?”

‘ఇదుగో, ఇన్నాళ్ళూ చెప్పినట్టు కాదు. నీకు ముప్పయ్యో ఏడొచ్చేసింది తెలుసా? ఈ ఏడాదన్నా అయిపోవాలి నీ పెళ్ళి లేకపోతే ఊరుకునేది లేదు.”

“ఏం చేస్తావు? నిరాహారదీక్ష చేస్తావా? నువ్వసలే షుగర్ మనిషివి. టప్పున కోమాలోకి పోతావు.”

“నీ కబుర్లకేంలే. బలవంతంగా పడేసి పెళ్ళి చేయాల్సిందే నీకు.”

“బలవంతం ఎందుకు? ఎగురుకుంటూనే చేసుకుంటాను. నాకు కావలసిన అమ్మాయిని తీసుకురా!”

“కావల్సిన అమ్మాయి! లోకంలో లేనిదాన్ని తీసుకు రమ్మంటే ఎక్కణ్ణించి తెస్తాం? పీటలపెళ్ళి పనికి రాదు. సూత్రాలు గీత్రాలూ కట్టవు. కులాలు వొద్దు,

మతాలూ వొద్దు! సరే,  నీ ఖర్మ, వెతుక్కో అన్నామా లేదా? నీ విద్దూరాలన్నీ ఎవతి ఒప్పుకుంటుందీ, ఎక్కడ దొరుకుతుందీ?"

"దొరక్కపోతే పోనియ్యి!"

"పోనివ్వాలా? అంటే పెళ్ళే చేసుకోవా? దొరికిన దాన్నే. పుట్టి పెరుగుతోన్న దాన్నే, కాస్త అందచందాలు చూసి ఒప్పుకోవాలి, తెనాలి వాళ్ళ పిల్ల తెల్లగా..."

రాంబాబు వాకిట్లోకి జారుకున్నాడు. మొహం కడుక్కుని వచ్చేప్పటికి, తల్లి నవ్వు తెచ్చుకున్న మొహంతో కాఫీ తెచ్చి పక్కన పెట్టింది.

అమ్మమ్మ నోరు మళ్ళీ ప్రారంభం!

"ఇదుగో, సంబంధాలు నాలుగేళ్ళ నుంచీ చూస్తున్నాం, మంచి పిల్లలే దొరికారు. లోకంలో వున్న వాళ్ళు పనికిరారంటే, కొత్తగా పుడతారా?"

అమ్మ నవ్వింది.

"కొత్తగా ఇవ్వాళ పుడితే, అది ముప్పయ్యేళ్ళు చిన్నది అవుతుంది రామూకి."

అమ్మమ్మ చేతులు తిప్పింది.

"అది ఎదిగేప్పటికి వీడికి అరవయ్యేళ్ళొస్తాయి. అది చేసుకుంటుందా వీణ్ణి?"

రెండేళ్ళనించీ అమ్మా, అమ్మమ్మా చేస్తోన్న వెటకారాలన్నీ, వేస్తోన్న టీవి జోకులన్నీ అలవాటే రాంబాబుకి. 'మీరిద్దరూ, వాడేసిన జోకులే మళ్ళీ వాడేస్తూ వుంటారు. టీవీలు తెగ చూస్తారుగా? కొత్తవి నేర్చుకోండి! అక్కడేం దొరకవా?"

"చాల్లెద్దూ నీ వేషాలూ! కాలికేస్తే మెడకేస్తావు" అని విసుక్కుంది అమ్మమ్మ.

"అమ్మా, ఉప్పుడు పిండి చేశావా?" రాంబాబు అమ్మమ్మని తప్పించుకోవాలని.

"నిన్న అడిగావుగా? చేస్తున్నాలే. పొయ్యి మీద ఉంది. రామూ! నిన్నేమీ అడగం. ఒక్కమాట చెప్పు! ఈ ఏడాదన్నా చేసుకుంటావా? అది చెప్పు!"

"ఎలా చెప్పను? నాకు నచ్చే అమ్మాయి ఈ ఏడాదన్నా దొరుకుతుందని చెప్పనా?"

"అమ్మో  అంటే ఇంకెన్నేళ్ళు చేస్తావు? నలభై కూడా  దాటాలా?"

"ఏమో, అదే జరుగుతుందేమో!"

"చూడమ్మా, ఏవంటున్నాడో! నలభై నిండాక చేసుకుని, నలభై ఏళ్ళ కోడల్ని తీసుకొస్తాడా ఇంటికి?"

"వాడంతేలేమ్మా సావిత్రీ, ఊరుకో! ఒరే రాంబాబూ, నేను చచ్చిపోయే లోగాపెళ్ళి చేసుకోరా నాయనా! నీ పెళ్ళాన్ని నేనూ చూస్తాను."

"నువ్వు ఈ ఏడాదే చచ్చిపోతున్నావా అమ్మమ్మా?"

"ఏమో, ఎవరికి తెలుసు? యమధర్మరాజు ఎప్పుడు రమ్మంటే అప్పుడు పోవాల్సిందే"

"ఓహో, అతగాడు ఎందుకు రమ్మంటాడు నిన్ను? ఆయనతో నీకు బాగా దోస్తీ వున్నట్లుంది. నా కోసం ఒక్క అమ్మాయిని అడుగు! కాస్త పుస్తకాలు చేత్తో పట్టుకోవాలి ఆ అమ్మాయి.

"చేత్తో పట్టుకుంటే చాలా?" అంది అమ్మ.,

"ఆc చాలు, పుస్తకాన్ని పట్టుకున్న వాళ్లు తప్పకుండా దాన్ని తెరుస్తారు."

"నీకొచ్చిన సంబంధాలన్నీ చదువుకున్న పిల్లలే కదా?"

"ఆ చదువులు సరే, అవి ఎలాగూ కావాలి. అవి ఉద్యోగం కోసం, అవేకాదు, కాస్త కథలూ, నవలలూ చదివే జ్ఞానం వుండాలి. అది లేని వాళ్లు ఎలా ఉంటారో తెలుసా? అమ్మమ్మలాగ వుంటారు. దేవుడో దేవుడో అనుకుంటూ."

అమ్మమ్మ నవ్వి వూరుకుంది. వాణ్ణి చెప్పనియ్యి అని.

అమ్మ కొడుక్కి నచ్చ చెపుతున్నాననుకుంటూ, "నీ దగ్గిర బోలెడు పుస్తకాలున్నాయి. ఆ పిల్ల వచ్చాక అవన్నీ చదువుతుందిగా?" అంది.

"ఏ పిల్ల?'

అమ్మమ్మకి చప్పున ఏదో మెరిసింది.

"పుస్తకాలు చదివేటట్టయితే కట్నం తీసుకోను అని చెప్పరా, తప్పకుండా చదువుతానంటుంది."

కట్నం పిచ్చి మాట రాము దగ్గిర ఎప్పుడూ లేదని వాళ్ళకి తెలుసు. నాలుగేళ్ళ కిందటే ఆ వాదనలన్నీ చేసి, ఇక చాలించారు రెండేళ్ళనించీ. 'మన పిల్లాడు

మంచివాడేగానీ, తెలివితక్కువ వాడు’ అనే గట్టి అభిప్రాయానికి వచ్చేశారు తల్లీ కూతుళ్ళు. ఒక్కో ఆశా వదిలేసుకుంటూ రాజీలు పడుతూనే ఉన్నారు.

“సావిత్రీ, కాస్త ఏదన్నా తెచ్చిపెట్టు! వీడితో వాగీ వాగీ నీరసం వచ్చింది” అంది అమ్మమ్మ.

రాంబాబు చప్పున లేచి, వంటింట్లోకి పరిగెత్తి, రెండు గిన్నెల్లో వేడి వేడి ఉప్పుడు పిండి సర్దిపెట్టి, చెంచాలు గుచ్చి, తన గిన్నిలో కొంచెం బెల్లం పొడి వేసుకుని బైటకి వచ్చాడు.

“అమ్మమ్మా! నీకు బెల్లం వెయ్యలేదు.”

“అమ్మో, బెల్లం వేస్తే ఈ పూటే పోతాను నీ పెళ్ళి చూడకుండా.”

‘అలాగైతే బెల్లం వేసుకొస్తా, నీ గిన్ని ఇలాగియ్యి!’ ’

అమ్మమ్మకి కోపం రాదు. మనవడు ఎలా మాట్లాడినా పండగే. నవ్వింది.

అమ్మ, తను కూడా ఇంకో గిన్నితో అక్కడికి చేరింది.

“రామూ! నీకు దేవుళ్ళూ లేరు, దెయ్యాలూ లేవు. సరే, నీ ఇష్టం నీది కదా? ఆ పిల్ల ఇష్టం ఆ పిల్లకి వుండకూడదా?”

“ఏ పిల్ల?”

“ఆ పిల్లే. ఈ ఇంట్లోకి రాబోయే పిల్ల. దానికి నచ్చినట్లు అది వుంటుంది.”

“ఉండమను! ఆ పిల్ల నా కొద్దు! ఆ పిల్ల ఈ ఇంట్లోకి రాదు.”

“అదిగో అదే మరి, న్యాయం లేదు నీ దగ్గిర.”

‘నా దగ్గిర వున్నదే అసలైన న్యాయం. నా జీవితం నా నిర్ణయాల మీదే సాగాలి. మంచో చెడ్డో!”

“చెడ్డ కూడానా? అయితే తల్లిదండ్రులెందుకూ? పిల్లలకు చెప్పడానికి కాదా?”

“మీరు చెప్పేది మీరు చెప్పండి. సలహా లివ్వండి. అంతే! మంచివైతే తీసుకుంటాను.”

అమ్మమ్మకి ఒళ్లు మండిపోయింది.

“సావిత్రీ! నువ్వూరుకో! వాడంతే, వాడి నోట్లో నోరెట్టకు! ఇవ్వాళ కొత్తా? వెళ్ళు, నీ పని చేసుకో!”

అమ్మమ్మ ఉప్పుడు పిండి అవగొట్టి గిన్ని కింద పడేస్తోంటే, రాంబాబు లేచి చెంబుతో మంచినీళ్ళిచ్చాడు. అమ్మమ్మకి సంతోషం వేసింది కానీ, “నన్ను బుట్టలో పడెయ్యడానికి చాకిరీలు బాగానే చేస్తావు” అంది మొహం ముడిచేసి.

“నీ బోధలు బాగా వుంటే, మా అమ్మ ఇంత కన్నా బాగా వుండేది” అనేసి, రాంబాబు, ఎంగిలిగిన్నెలు తీసుకుపోయి, బైట పడేసి, అక్కడున్న గిన్నెలన్నీ తోమి పడేశాడు.

అమ్మ సంతోషించింది గానీ, “ఇవ్వాళ నీ పుట్టినరోజు. ఇవ్వాళే పుట్టావు. ఇవ్వాళేం పని చెయ్యక్కర్లేదు” అంది రుసరుసలాడుతూ.

“చూశావా, పుట్టగానే అంట్లు తోమేస్తున్నాను. ఎవరన్నా చేస్తారా నాలాగా?”

“బుద్ధిమంతుడివేలే”

“ఎందుకమ్మా అనవసరంగా దహించుకుపోతారు? అర్థం చేసుకోరేం?” అనేసి రాంబాబు స్నానానికి పోయాడు.

అమ్మా, అమ్మమ్మా మొహాలు మాడ్చుకుంటూ తిరగడం రాంబాబుకి అలవాటే. ‘ఇవ్వాళ తిక్క తిరగబెట్టింది. వీళ్ళకి” అనుకుంటాడు. అలాంటప్పుడు వాళ్ళని పట్టించుకోకుండా తిరుగుతాడు. కాస్సేపటికి వాళ్ళే దారికొస్తారు. చెప్తే వింటారు గానీ విన్నదాన్ని మర్నాటికే వదిలేస్తారు. తిక్క అంతే. కానీ అప్పుడప్పుడూ వాళ్ళే రామూని, “నీ తిక్కకేం లే” అంటారు. ఆ రెండు రకాల తిక్కలూ సామరస్యంగానే, ఆప్యాయతల తోనే సాగుతూ వుంటాయి. ఏనాడో తండ్రి పోయిన ఆ ఇంట్లో.

రాంబాబు కంపెనీకి బైల్దేరుతోంటే, అమ్మమ్మ వెనకాల వస్తూ, తెలిసిన సంగతులే మళ్ళీ చెప్పుకొచ్చింది.

“అన్నట్టు మంగని ఇవ్వాళే వాళ్ళ నాన్న తీసుకొస్తాడు. అసలు దాని పేరు మంగ కాదులే. రాధో దుర్గో ఏదో వుంది. మర్చిపోయాను. అది నా కళ్ళముందే పుట్టి పెరిగింది. మా ఊళ్ళో వున్నప్పుడు, వాళ్ళమ్మ పని చెయ్యడానికి వస్తే, తల్లి

వెంటబడి అదీ వచ్చేది. దానికి చంటిపిల్ల జబ్బో ఏదో వస్తే, వాళ్ళమ్మ అలివేలు మంగతాయారని పిలుస్తానని మొక్కుకుంటే, ఆ పూటే జబ్బు తగ్గింది. నాకూ తెలుసు. నువ్వు నమ్మవులే. అప్పట్నించీ మంగే అంటారు దాన్ని. నాకూ మా ఊళ్ళో అదే అలవాటు. మంగ నాన్న పోలయ్య చాలా మంచివాడులే. కులం తక్కువేగానీ, ఎంత బుద్ధిమంతుడో!...”

“అమ్మమ్మా! నేను తొందరగా వెళ్ళాలి” బూట్లు వేసుకుంటూ అన్నాడు రాంబాబు – “అదంతా తెలుసులే, ఆ అమ్మాయికి ఇక్కడేదో స్కూల్లో పని దొరికిందన్నావుగా? మనింట్లో వుంటుందా?”

“అబ్బే, ఎన్నాళ్ళూ. నాలుగు రోజులు పోయాక ఎక్కడన్నా చూసుకుంటుంది. వాళ్ల కులం వేరులే. ఎన్నాళ్లు కలిసి వుండగలం?”

“ఎందుకా సోది? కులం, గిలం.”

‘నోరు తెరిస్తే సోది అంటావు. సోది చెప్పటం ఎప్పుడన్నా చూశావా? వాళ్లు నిజంగా నిజం చెపుతారు. చేటలో బియ్యం పోసి వాళ్ళ ముందు పెడితే,మన చేతులు లాగుతూ భలే చెపుతారు. సోది మనిషి దొరికితే నీ పెళ్ళి మాట అడుగుదును.”

“నే పోతున్నా. అమ్మకి చెప్పు నీ సోది” అనేసి రాంబాబు గేటు దాటి పరిగెత్తాడు.

కంపెనీలోనూ రాంబాబు పక్క వాళ్ళు అమ్మమ్మ వాదాలూ. మొదట శుభాకాంక్షలు ప్రకటించి, ఇక పెళ్ళి సంబంధాలు చెప్పుకొచ్చారు. ఇద్దరైతే వట్టి మాటలతో సరిపెట్టారు గానీ, ఒక తోటి ఉద్యోగి, ఫోటోయే ఇవ్వబోయాడు జేబులోంచి తీసి.

అతను అది వరకూ రెండుసార్లు అలాగే తెచ్చాడు. “మా చెల్లెలు,. మా మరదలు” అంటూ.

అప్పుడు ఒక ఫోటో చూసి జడుసుకున్నాడు రాంబాబు. రెండోది తీసుకోనన్నాడు. చూసిన ఫోటోలో అమ్మాయి, కొయ్యబారి, విగ్రహంలా నిలబడివుంది. ముందు, నడుముని చుట్టుకున్న బెల్టులాంటి నగ కనబడింది. కొంచెం పైకి చూస్తే కాసులపేరు! చెవుల నుంచి భుజాల్ని అంటుకునే బుట్టల లోలకులు! ముక్కుకి

కూడా ఏదో! భుజం మీద పాము అంత జడ! దాని నిండా ఏదో! వేళ్ల నిండా ఏవో! చప్పున కళ్ళని కాళ్ళ దగ్గరికి దింపేస్తే, చెప్పుల మీద మువ్వల పట్టాలు!

చప్పున ఆ ఫోటోని ఆ మనిషి జేబులోకే గిరాటేశాడు.

"చూశావా?"

"కళ్లు లేవా నాకు?"

"ఉన్నాయిలే, ఉంటే మాత్రం తెరుస్తావా అసలు? బొమ్మ లాంటి పిల్ల. నచ్చలేదా?"

"పది సెకన్లలో తేల్చేసుకోవాలా?"

"అయితే ఆలోచించి చెపుతావా?"

'పది సెకన్ల దృశ్యం గురించి మళ్ళీ ఆలోచించాలా?"

"పూలజడ చూశావా ఎక్కడన్నా?"

"నేనెప్పుడూ చూళ్ళా"

"ఇప్పుడు చూడొచ్చుగా? అది పూలజడే. మా మరదలే" అంటూ ఫోటో మళ్ళీ తియ్యబోయాడు.

"వొద్దొద్దు. చూశాలే. నడుం దగ్గిర ఏంటీ అదీ?"

"అదీ తెలీదా? వడ్డాణం, మెళ్ళో నెక్లెస్ చూశావా? వాళ్ళ నాన్నగారికి బ్రాందీషాపు వుంది."

"ఓహో అదా? ఆ తాగుబోతుల పెళ్ళాల నగలన్నీ ఈ అమ్మాయి ఒంటి నిండా ఎక్కాయా?"

"భలే మాట్లాడతావే! పిల్లని చూడు, జాంపండులా లేదూ?"

"ఛీ! ఏం మాటలోయ్?' అని మొహం తిప్పేశాడు రాంబాబు.

ఆ మరదలి బావగారు కూడా మొహం తిప్పుకుని వెళ్ళిపోయాడు అప్పుడు.

ఆ మనిషే ఇప్పుడు కొత్త ఫోటో తెచ్చి ఇతని జేబులో పడేశాడు.

రాంబాబు దాన్నసలు మొదట గమనించనే లేదు. ఎందుకో జేబులో చెయ్యి పెడితే అది తగిలి బైటికి తీసి చూసి బెదురుకున్నాడు. జుట్టు భుజాల నిండా,

నుదురు నిండా లాక్కుంది. దాని పైన పూలదండలు అటూ ఇటూ, మెడలో లావుపాటి పిండి జల్లెడ లాంటి నగ ఏదోచుట్టుకుని వుంది. మొహం ఎలా ఉందో, బట్టలెలా వున్నాయో, ఏదీ చూడలేదు.

ఫోటో తీసికెళ్ళి ఆ మనిషి దగ్గిర పెట్టేశాడు.

“అప్పుడే చూశావా? నీ దగ్గిరే వుంచుకో రెండురోజులు.”

“వొద్దు.”

‘ఏం మనిషివోయ్! పాత ఫేషన్లూ నచ్చవు, కొత్త ఫేషన్లూ నచ్చవు. ఎలాంటి పిల్ల కావాలో అదన్నా చెప్పు, వెతుకుతాను.”

“అసలు పిల్లే వద్దు, వెతికే శ్రమ పడకు!” అనేసి, తన పని దగ్గరికి వెళ్ళిపోయాడు రాంబాబు.

అక్కణ్ణించి తప్పించుకున్నాననుకుంటోంటే, సాయంత్రానికల్లా గేటుదగ్గిరే స్నేహితుడు రమణ పట్టుకున్నాడు – “నీ కోసమే వస్తున్నా” అంటూ. ఆ స్నేహితుడు మధ్యాన్నమే రెండుసార్లు ఫోన్‌చేసి శుభాలు పలికాడు. “పప్పన్నం ఎప్పుడూ?” అని ఫోనులో నవ్వాడు. మళ్ళీ; “ఇప్పుడు పప్పన్నం చాలదులే, బిరియానీ కావాలి” అన్నాడు.

రాంబాబు జవాబే ఇవ్వకుండా ఫోను పడేశాడు. రాంబాబు అలాగే చేస్తాడని రమణకి తెలుసు. కోపం తెచ్చుకోడు.

రమణంటే రాంబాబుకి సగం ఇష్టం. సగం కోపం. ఎంతెంత మంచి పుస్తకాలు చూపించినా పట్టుకోడు, ముట్టుకోడు. సినిమాలు తెగ చూస్తాడు. చూసి వూరుకోడు. ఆ కథంతా రాంబాబుకి యాక్షన్లతో సహా చెపుతాడు. కొన్నిసార్లు రాంబాబుని కూడా లాక్కుపోతాడు సినిమాలకి.

రాంబాబు చాలా పశ్చాత్తాప్పడిపోయి ఆర్నెల్ల దాకా అటు చూడడు. ఒక్కోసారి, రమణతో, “నువ్వో పుస్తకం చదివితే, నీతో నేనో సినిమాకొస్తా” అని బేరం పెడతాడు.

“ఆ పుస్తకం నువ్వు చదివావుగా? నాకు చెప్పేద్దూ?” అంటాడు రమణ. చెప్తే శ్రద్ధగానే వింటాడు. నవ్వుతాడు. “నేను నీకు సినిమాల కథలు చెపుతాను. నువ్వు నాకు పుస్తకాల కథలు చెప్పు!” అని తనూ ఎదురు బేరం పెడతాడు.

“రమణా! నిన్ను చూశాకే, పుస్తకాలంటే పారిపోయే అమ్మాయిల వేపు చూడకూడదని శపథం చేసుకున్నాను” అన్నాడు రాంబాబు ఒకసారి.

తనకి ఫోటోలు చూపించే కొలీగ్‌తో కూడా ఒకసారి, “నువ్వు తెచ్చిన ఫోటోలు చూశాకే, నగల పిచ్చి అమ్మాయిల వేపు చూడకూడదని కొత్త శపథం చేసుకున్నాను” అన్నాడు.

అదేదో హాస్యం అనుకుని, అతను బాగా నవ్వాడు.

పెళ్ళి సంబంధాల కబుర్లు ఎవరు మొదలుపెట్టినా, చివరికి రాంబాబు మనసులో సరికొత్త శపథం ఒకటి పుట్టుకొస్తూ వుంటుంది. శపథాల జాబితా పెరిగిపోతూ వుంటుంది. ‘అమ్మో, నేను అలా వుండను. అలా చెయ్యను’ అనుకుంటాడు.

రమణంటే రాంబాబుకి సగం కోపం వున్నా, సగం ఇష్టం కూడా కాబట్టి, అతన్ని కాస్త మాట్లాడనిస్తాడు.

రాంబాబు పుట్టిన ఆ రోజు సాయంత్రం రమణ, రామూని వదలదల్చుకోలేదు. ఒక పార్కుకి లాక్కుపోయాడు. వాళ్ళిద్దరూ కాలేజీ రోజుల స్నేహితులు. తరుచుగానే మాట్లాడుకుంటూ కలుసుకుంటూ వుంటారు. రమణకి నాలుగేళ్ళ కిందటే పెళ్ళయిపోయింది. రెండేళ్ళ కూతురు కూడా.

ఇద్దరూ దగ్గిర పార్కులో చెట్టుకింద రాతి మీద చేరారు. ఇక రమణ మొదలు పెట్టాడు. పెడతాడని రామూకి తెలుసు. సిద్ధంగానే వున్నాడు.

“నీకేం మతిలేదా రామూ? ముప్పై కూడా దాటాలా? చెప్పు, ఏంటసలు నీ అభ్యంతరాలు?”

“మళ్ళీ మొదటికొచ్చావా? తెలీదా నీకు?”

“తెలుసులే. మళ్ళీ మొదట్నించీ అడుగుతా. ఇలా కూర్చుంటే ఇంకో ఐదేళ్ళు గడిచిపోతాయి. అప్పుడు ఏ ఆడపిల్లా నిన్ను ఒప్పుకోదు. తెలుసా?”

“అయితే తప్పకుండా ఇంకో ఐదేళ్ళు ఆగుతా. నీ మొహంలో మా అమ్మమ్మ కనపడుతోంది.”

“మీ అమ్మమ్మ కన్నా తెలివైన వాణ్ణనుకోకు. ఆవిడ ఎన్నో చూసి, ఎంతో అనుభవంతో చెప్పి వుంటుంది.”

“మా అమ్మమ్మ చెప్పేదే నువ్వూ చెపుతున్నావు. అమ్మమ్మ అనుభవం నీకెలా వచ్చింది?”

ఇదుగో, మొండివేషాలు తగ్గించు! ప్రేమ లేకుండా పెళ్ళేమిటంటావు. అయితే ప్రేమించూ! ఎవరొద్దన్నారు?”

“ఎవర్ని?”

రమణ అటూ ఇటూ చూశాడు. సరిగ్గా అప్పుడే ఒక పంజాబీ డ్రస్‌అమ్మాయి అటు వెళ్తూ కనబడింది.

“అదుగో, ఆ పిల్లని ప్రేమించు! వెళ్ళి చెప్పు, లే మరి!”

“చెప్పు తీసుకుని పళ్ళు రాలగొడుతుంది. పిచ్చి జోకులెందుగ్గానీ, ఇంకేదన్నా మాట్లాడు, నిన్న ఏం సినిమా చూశావు? ఇవ్వాళ ఏం సినిమా చూడబోతున్నావు? రేపు ఏం సినిమా చూడబోతావు? అవి చెప్పు.”

“రామూ! అలా దాటవెయ్యకు. కాస్త సీరియస్‌గా వుండు. నా పెళ్ళి ఎలా జరిగిందో నీకు తెలుసు కదా? పెద్దవాళ్ళు మాట్లాడారు. పెళ్ళి చూపులన్నారు. నాకూ నచ్చింది. పెళ్ళయి పోయింది. సుఖంగా లేమా;? మా పాపాయంటే మాకు ప్రాణంగా వుంటుంది.”

“మీ పాపాయంటే నాకూ ప్రాణంగానే వుంటుంది.”

“నా పెళ్ళి వల్ల నాకేం సమస్యలొచ్చాయి,చెప్పు?”

“నీ రకం పెళ్ళి వల్ల సమస్యలు నీకు కాదు, నాకూ?”

“నీకేం సమస్యో ఒక్కటి చెప్పు!”

“చాలా సార్లు చెప్పాను. చాలా మాట్లాడుకున్నాం. తెలీనట్లు నటించకు!”

నటించడం కాదు. మళ్ళీ అడుగుతున్నా. సాంప్రదాయాల పెళ్ళిళ్ళల్లో కష్టాలొచ్చేస్తాయా?”

“కష్టాలు ప్రేమ పెళ్ళిళ్ళల్లోనూ వస్తాయి. వాళ్ళు విడాకుల దాకా కూడాపోతారు.”

“అన్నీ తెలుసు నీకు. మరి సాంప్రదాయం అంటే అంత భయం ఎందుకు?”

“భయం కాదు, అయిష్టం.”

“రెండూ ఒకటే, మారు పేర్లు అవి, నువ్వు వెతికే ప్రేమ దొరికితే మంచిదే. కానీ ఎన్నాళ్ళు వెతుకుతావు? కాలం అంతా పోవడం లేదూ?”

“పోతేయేం? ఇవ్వాళ జరిగే పెళ్ళి రెండేళ్ళ తర్వాత జరిగితేయేం?”

“అప్పుడూ జరక్కపోతే?”

“ఇంకో రెండేళ్ళూ.”

‘అలా అరవై ఏళ్ల దాకానా?”

“ఆఁ. అంతే, అప్పుడు పెళ్ళే వద్దు.”

ఇద్దరూ నవ్వుల్లోకి దిగారు.

“రమణా! నువ్వు ఐదారు సంబంధాలు ఎగరగొట్టి, నీకు అందచందాలు నచ్చిందే చేసుకున్నావు. నీకు కావలసిన దాని కోసం ఆగావా లేదా? నేనూ అంతే కదా? మంత్రాలూ, పూజలూ, వ్రతాలూ, నగలూ, షోకులూ అంత తక్కువస్థాయి మనిషిని నేను ఇష్టపడలేను. కొంచెం జ్ఞాన నేత్రం వున్న అమ్మాయిలే వుండరా? వుంటారు. ఎప్పుడో ఎదురవుతారు.”

“ఎదురవకపోతే?”

“ఎదురవుతారనేది నా నమ్మకం. ఎదురు చూడాలంతే.”

“లాటరీ కోసం చూసినట్టా?”

“ఇది లాటరీ కాదు. అదృష్టం కాదు. లోకజ్ఞానం. నేను వున్నానంటే, నా లాగే తయారైన అమ్మాయీ వుంటుంది.”

“ఉండొచ్చు బాబూ! నీకు ఎదురవుతుందా అని. ఊరికే వాదాలు చేసి జీవితం పాడు చేసుకోకు! కాస్త చదువూ సంధ్యా అందం చందం వున్న మనిషి దొరికితే చాలని సంతోషం ఇంకా ఏం కావాలో తర్వాత నేర్చుకుంటుంది. ఆడవాళ్ళు పెళ్ళయ్యాక భర్త ప్రకారమే మారతారు.”

“అమ్మో, అలాంటి అమ్మాయి అసలే వద్దు నాకు.”

‘విను ముందు. మా సుజాత పెళ్ళయ్యాక చాలా మారింది. పెళ్ళికి ముందు

వంకాయ కూర తినేది కాదట. ఆ కూర నాకు ఇష్టం. అది వండినప్పుడు తనూ తింటుంది. ఇంకెన్ని కూరలు వండుతానూ అని అదే తింటుంది.”

“అదీ ఇదీ ఒకటి కాదు రమణా! మీ సుజాతకి వేరే కూర వండుకోవడం బద్ధకం కాబట్టి ఇష్టం లేనిదే తింటుంది. వేరే కూర వండుకోమని నువ్వూ అనవు. నీకా ధ్యాసే వుండదు. మీ ఇద్దరికీ సరిపోతుంది. పిచ్చి పోలికలు తీసుకు రాకు. తర్వాత మారుతుందిలే అని తిరుపతి మొక్కుల మనిషిని కట్టుకో మంటావా? తర్వాత మారకపోతే?”

“ఏం మారకపోతే? కొంప మునుగుతుందా? చిన్నప్పటినుంచీ అలాంటివే వింటూ పెరిగినప్పుడు అలాగే వుంటారు.”

“నేనూ అలాంటివే వింటూ పెరిగాను. మా అమ్మమ్మ నన్ను అలాగే పెంచింది. కాస్త ఊహ తెలిశాక నేను పుస్తకాలు చదువుకోవడం లేదా? పుస్తకాలే ముట్టుకోని మనిషి ఇంకెలా మారుతుంది?”

“పోనీ మారదనుకో! ఎవరి పద్ధతి వాళ్ళదీ. ఆమె గుళ్ళోకి వెళ్తుంది. నువ్వు లోపలికి వెళ్ళకు. గేటు బైటే నుంచో!”

“అమ్మో! అలాంటి మనిషితో అదో డ్యూటీ పడుతుందా? అయితే, మరీ జాగ్రత్తగా వుండాలి నేను.”

“పోనీ గుడికి కూడా వెళ్ళకు. ఆమే వెళ్తుందిలే. పెళ్ళి చూపుల్లోనే ఆ షరతు పెట్టెయ్యి!”

‘ఊరుకో రమణా! నువ్వు కదా అని ఇంతసేపు కూర్చున్నాను. షరతులతో బతకాలా కలిసి? అప్పుడు ఆమెకి నేను మూర్ఖుడిలా కనబడతాను. నాకు ఆమె మూర్ఖురాలిగా కనబడుతుంది. సంతోషం ఎవరికైనా వుంటుందా షరతుల వల్ల?”

“అరెరే! ఒక సంగతి చెప్పాలని మర్చేపోయానే! మా మేనమామ కొడుకు ఇప్పుడు ముప్పై మూడో యేట, ఇంటర్నెట్లో చూసి సెటిల్ చేసుకున్నాడట! అయితే అతను డాక్టర్‌లే. లేడీ డాక్టర్ కావాలని వెతికి ఇప్పటికి పట్టుకున్నాడు. అదంతా ఆస్పత్రి పెట్టుకునే బిజినెస్ కోసంలే. అది మనకెందుకుగానీ, ఇంటర్నెట్‌లో ఎలాంటి టైప్ వాళ్ళు కావాలన్నా ఇన్‌ఫర్మేషన్ దొరుకుతుందట రామూ!”

"తెలుసులే, అది వేరు!"

"అసలు చూశావా ఎప్పుడన్నా!"

"ఎందుకూ చూడ్డం? నేను పెళ్ళి చూపులకు వెళ్తానా? అదీ పెళ్ళిచూపులే కదా?"

"ఛా! అది పెళ్ళి చూపులా?"

"కాకపోతే ఏంటి? నెట్‌లో చూసినా, పెళ్ళి కోసం ఒక మనిషిని చూడ్డమేగా అది?"

"పోనీ అవుననుకో, ఒక మనిషిని వెతుక్కోపోతే ఎలాగ?"

'వెతక్కుండా, అసలు పెళ్ళి ఉద్దేశం లేకుండా , మొదట మామూలుగా పరిచయం కలగాలి. ఆ తర్వాత ఒకరంటే ఒకరికి తెలుస్తూ వుంటే, అప్పుడు ఆ అభిప్రాయం ఏర్పడితే ఏర్పడవచ్చు. అంతేగానీ, పెళ్ళి, పెళ్ళి అని వెతుక్కుంటూ ఇంటర్నెట్లో పడి తిరగాలా?"

"ఐడియాస్ కలిసిన వాళ్ళు దొరికితే, మొదట స్నేహమే అవుతుంది. స్నేహం కోసం చూడకూడదా?"

"స్నేహం కోసం అయితే, అమ్మాయిల్నే ఎందుకు వెతకాలి? అబ్బాయిల్ని వెతుకుతానా?"

"అబ్బా! కాలికేస్తే మెడకేస్తావు. నువ్వు చదివే పుస్తకాల మూలాన్నే నీకీ తిక్క బైల్దేరింది. అమ్మాయిల కోసం వెతికితే మాత్రం చూడగానే పెళ్లి చేసేసుకుంటారా? ఆ అమ్మాయి పద్ధతులేంటో, ఏం పుస్తకాలు చదువుతుందో, తిరపతి పిచ్చి ఎంత వుందో, అలాంటివి తెలుస్తాయి కదా? ఏ కాలేజీలోనో, కంపెనీలోనో, ఇంకెక్కడో పరిచయం అయిన అమ్మాయి గురించి అయినా అలాంటివి తెలుసుకుంటావు కదా? అలాగ ఇక్కడ కూడా తెలుసుకో!"

"మనకి మామూలుగా పరిచయం అయిన వాళ్ళతో మాట్లాడేటప్పుడు పెళ్ళి దృష్టితో వుండం. ఈ ఇంటర్నెట్‌లో చూడడం అయితే, ఇక అదే దృష్టి."

రమణ కాస్సేపు ఊరుకున్నాడు. తర్వాత, "నిజమేలే, నువ్వన్నది నిజమేగానీ... అంటూ జేబులోంచి సెల్ తీసి ఎవర్నో పిలిచాడు.

ఆ మనిషి, ఎంత ఖాళీయోగానీ వెంటనే పలికాడు. "నువ్వా రమణా " అన్నాడు.

"నాకో ఇన్ఫర్మేషన్ కావాలి. ఇంటర్నెట్‌లో పెళ్ళి సంబంధాలు చూడాలంటే అసలేం చెయ్యాలి?" అన్నాడు రమణ సూటిగా.

"నీకు పెళ్ళయి పోయిందిగా?"

రమణ గట్టిగా నవ్వాడు.

"పిచ్చి జోకులు వెయ్యకు! నా ఫ్రెండ్ కోసం అడిగా. ఆ వివరాలు చెప్పు కొంచెం అసలేం చెయ్యాలి?"

"చెప్తా, వంద డాలర్లిస్తావా?"

"డాలర్లా, గీలర్లా? చెప్తే చెప్పు, లేకపోతే ఫో!"

"నా పెళ్ళికి ముందు, ఒక పెళ్ళిళ్ళ డాట్‌కామ్ కోసం, ఆరు నెల్లకి, 800 డాలర్లు కట్టాను, తెలుసా? అంటే, అప్పటి లెక్కల ప్రకారం, నలభై వేలు!"

"అమ్మో! అయితే వొద్దులే. మా రాము అసలే ఖయ్యిమంటాడు."

"అన్ని డాట్‌కామ్‌లూ అలా వుండవులే. చవకవి చాలా వుంటాయిగానీ, వాటిలో ఎక్కువ వివరాలు దొరకవు. అంతే తేడా!"

"అసలు అమ్మాయిల ఫోటోలు కనపడతాయా వాటిల్లో?"

"కావాలంటే కనపడతాయి. మొదట రిజిస్టర్ చేసుకోవాలి. క్రెడిట్ కార్డు వుంటుందిగా? వెంటనే డబ్బు కట్టేస్తే అందులోకి చేరిపోతాం. మన ప్రొఫైల్‌ని చూసి అవతలి వాళ్ళు మనకి రాస్తారు. మనమూ వాళ్ళకి రాయొచ్చు. అసలు డబ్బు కట్టకుండా చూసేవి కూడా వుంటాయిలే. అయితే, అవతలి వాళ్ళతో మాట్లాడ్డం కుదరదు. చాలా తిరకాసులున్నాయి."

'ఆగాగు, రాము ఇక్కడే వున్నాడు. పార్కులో వున్నాంలే. రాము తెలుసుగా నీకు? అతనికి చెప్పు" అంటూ రమణ ఆ సెల్‌ని అందిస్తోంటే రాంబాబు దాన్ని తీసుకోడానికి కొంచెం మొరాయించాడు గానీ, తర్వాత దాన్ని చెవికి అంటించుకుని ఏదేదో అడిగాడు. "అన్నిటికన్నా చవక బేరం వాళ్ళని చెప్పండి" అన్నాడు. అంతా

అయ్యాక, సెల్‌ని రమణ ఒళ్ళో పడేసి, "అంటే, ఇంటర్నెట్ పెళ్ళిచూపులు చూడమంటావు నన్ను. అంతేగా?" అన్నాడు కోపంగా.

"తప్పదు రామూ! చూడగానే అయిపోతుందా యేంటీ? మంచి అమ్మాయిలు కూడా, మంచి అబ్బాయిలు ఎదురవక ఎంత ఇబ్బంది పడుతున్నారో! చూద్దాం. పరిచయం ఎలా అవుతుందో!"

ఆ చివరి వాదం నచ్చింది రామూకి కొంచెం. మంచి అమ్మాయిలకి కూడా ఈ సమస్యే వుంటుందిగా? నిజమే.

"సరేలే, స్నేహితుడివి చెప్పావుగా?"

ఇద్దరూ నవ్వుతూ లేచారు.

రాంబాబు ఇంటికొచ్చేప్పటికి బాగా చీకటి పడిపోయింది.

అమ్మమ్మ ఎదురొచ్చి, "మంగ వచ్చేసింది" అని చెప్పింది.

"మంగని దిగబెట్టి వాళ్ళ నాన్న వెళ్ళిపోయాడు. వాళ్ళు పొద్దున్నే బస్సు దిగారంట. ఆ స్కూలుకి వెళ్ళి, వాళ్ళతో మాట్లాడి హోటల్లో అన్నాలు తిని మధ్యాన్నం వచ్చారు.

"ఆ అమ్మాయేదీ?"

"అంట్లు తోముతున్నట్టుంది."

"అదేంటి? ఆ అమ్మాయి తోమడం ఏమిటి?"

"రాగానే మంచినీళ్ల కోసం అటు వెళ్ళింది. అక్కడ అంట్లు కనపడితే తోమేస్తుంటే, అమ్మ చూసి వద్దన్నా వినలేదు. ఇందాక వంట అయ్యాక మళ్ళీమొదలుపెట్టింది. సాయంత్రం ఆరిన బట్టలన్నీ తనే మడతపెట్టింది. గదులు ఊడ్చేసింది."

"ఏడ్చినట్టే ఉంది. పనిపిల్ల దొరికిందని అనుకుంటున్నారా?" అంటూ లోపలికొచ్చాడు రాంబాబు.

"వద్దన్నా వినలేదు. చేస్తేయేం? ఆడపిల్ల. సాయంగా వుంది మీ అమ్మకి. ఫర్వాలేదులే. మంగా, అయిందా? అన్నట్టు మంగ అసలు పేరు రాధంట. మంగా, ఒక సారిలా రా!" అని గట్టిగా పిల్చింది అమ్మమ్మ.

ఆ అమ్మాయి కొంగుతో చేతులు తుడుచుకుంటూ గబగబా వచ్చి, రాంబాబుని చూడగానే కొంచెం వెనక్కి తగ్గింది.

"మంగా! వీడే నా మనవడు" అంది అమ్మమ్మ నవ్వు మొహంతో.

ఆ అమ్మాయి కూడా కొంచెం నవ్వుతూ బెదురుగా చేతులు జోడించింది. మనిషి బలహీనంగా వున్నట్లు కనబడింది.

"నమస్కారాలెందుకు? ఎక్కడ మీ స్కూలు?" అన్నాడు.

చెప్పింది ఆ గుర్తులన్నీ.

'కొంచెం దగ్గిరే. అక్కణ్ణించి బస్సుందా?"

"బస్సు మీదే వచ్చామండీ."

"స్కూలు టైమింగ్సేమిటి?"

"ఎనిమిదిన్నర నించీ మూడు దాకా అన్నారు."

"ఆరు గంటలేనా? బాగుందే. ఏ క్లాసులికి చెప్పాలి మీరు?"

"ఫిఫ్త్ క్లాసు వరకూ అనుకుంటానండీ. ఇంకా సరిగా చెప్పలేదు."

"ఎలా దొరికింది ఈ ఉద్యోగం?"

"అడ్వర్టయిజ్‌మెంట్ చూసి అప్లై చేశాను. ఎమ్మేవాళ్ళు కావాలన్నారని చేశాను. మా నాన్నకి తెలిసిన ఒకాయనెవరో సాయం చేసినట్టున్నారు."

"మీరే యూనివర్శిటీ?"

"డిగ్రీ అయ్యాక ప్రైవేటు గానే చేశాను డిస్టెన్స్‌లో."

రాంబాబు అమ్మ కూడా అన్నీ వింది పక్కన నిలబడి. కొడుకుతో, "తర్వాత అడగొచ్చులే, నువ్వెళ్ళి స్నానం చెయ్యి!" అంది.

రాంబాబు ఇంకేమీ అనకుండా వెళ్ళిపోయాడు. స్నానం అవగొట్టి కంప్యూటర్ ముందు చేరాడు. రోజూ అయితే, కంప్యూటర్ తెరవడు. తప్పకుండా ఏదో ఒక పుస్తకం పట్టుకుంటాడు.

నెట్ తెరిచి మెయిల్స్ కోసం చూశాడు. ఒక్కటీలేదు. తను రమణకి తప్ప ఎవరికీ రాయడు. రమణకి అసలే బద్ధకం. ఇంకెవరిస్తారు?

రాంబాబు అమ్మ, రాధతో, "నీ సామాన్లు ఆ మూల చిన్న గదిలో పెట్టుకో! స్నానానికి వెళ్ళు" అని రాధకేవో చెప్పింది. అది అయ్యాక, "రామూ! అన్నానికి రా!" అంటూ కొడుకు గదిలోకి వచ్చింది. వస్తూ తలుపులు దగ్గరకి వేసింది. కంఠం తగ్గించి, "ఆ అమ్మాయిని 'మీరు, మీరు' అంటావెందుకు, నీ కన్నా చిన్నదేగా? పేరుతో పిలువు, చాలు" అంది.

"మంగా అనాలా?"

"మంగో, రాధో, ఏదైనా ఆ అమ్మాయి పేరే. అది సరేగానీ.,

"ఆ అమ్మాయికి అన్నం ఎక్కడ పెట్టాలి?" అంది కంఠం ఇంకా తగ్గించి.

రాంబాబుకి అర్థం కాలేదు.

"ఏంటమ్మా?"

"అదే, వెనుక వరండాలో స్టూలు వుందిలే. దాని మీద కూర్చుని తింటుంది. అక్కడే పెట్టమంటోంది అమ్మమ్మ. నీకు చెప్పి రమ్మంది. నువ్వొచ్చి గోల గోల చెయ్యకు సుమా!"

"ఎందుకూ? అక్కడెందుకూ? టేబుల్ మీదే తింటాంగా!"

"టేబులు చిన్నదిగా? అందరికీ సరిపోదు."

"రోజూ ముగ్గురం తినడం లేదు? నేను తర్వాత తింటాలే. ఇక్కడ నాకు పని ఉంది. ముందు మీరు ముగ్గురూ తినండి."

"అది కాదు రామూ! నీకు చెప్పలేదు. వాళ్ళది మనం ముట్టుకునే కులం కాదు అయినా ఇంట్లో తిరగనిస్తాం గానీ, కలిసి ఒక్కచోట ఎలా తింటాం చెప్పు? ఫర్వాలేదు, వరండాలో పెడతాను."

"అమ్మా! ఇంత పిచ్చా మీకు? అలాంటప్పుడు ఆ అమ్మాయిని ఇక్కడికెందుకు రమ్మన్నారు?"

'ఉద్యోగం దొరికింది పాపం, కొన్నాళ్ళు సాయం చేస్తే వేరే గది చూసుకుని వెళ్లి పోతుందిలే. వాళ్ళ నాన్న నా చిన్నప్పుడు అమ్మమ్మకి ఏదో సాయం చేశాడట! నాకు ఒకసారి జబ్బు చేస్తే వెంటనే వాళ్ళ బండి కట్టుకుని..."

"అదంతా తెలుసులే. అంత సాయం చేసిన వాళ్ళ పిల్ల తిండి ఎక్కడ పెట్టాలా అని ఆలోచిస్తున్నారా? అమ్మా! ఆ అమ్మాయిని కులం పేరుతో అవమానం చేస్తే, ఆ అమ్మాయికి కోపం వచ్చి పోలీసులకి  చెప్పిందంటే, నిన్నూ అమ్మమ్మనీ జైల్లో  పడేస్తారు. తెలుసా? జాగ్రత్తగా ఉండండి!"

"ఆ అమ్మాయి దాకా ఎందుకు? నువ్వే చెప్పేలాగ వున్నావు పోలీసులకి. పక్కన కూర్చో బెట్టుకుని తినలేం. నువ్వెన్ని చెప్పు!"

'అయితే, ముగ్గురూ కింద కూర్చుని తినండి! టేబులు చాలకే కింద కూర్చున్నట్టు చెప్పండి."

"అమ్మమ్మ కింద కూర్చుంటుందా? అసలే కాళ్ళ నెప్పుల మనిషి."

"అమ్మమ్మకి టేబుల్ మీదే పెట్టు. మీరిద్దరూ కింద కూర్చోండి."

"కింద అయితే మాత్రం పక్కపక్కన కూర్చుని తింటామా? దూరంగా కూర్చుంటే బాగోదు. ఫర్వాలేదు. వరండాలో పెడతాను."

"అప్పుడు తెలిసిపోదా ఆ అమ్మాయికి? అమ్మా! అలా చేశారంటే, నేను ఇప్పుడే ఇంట్లోంచి వెళ్ళిపోతాను. రమణ దగ్గరకి వెళ్ళి, రేపు వేరే గది తీసుకుని అప్పుడొచ్చి నా బట్టలన్నీ తీసుకుపోతాను. వెళ్ళనా ఇప్పుడు?'

"ఆఁ అంత పనీ చేస్తావు. అందుకేగా, పూట పూటా నీకు జడిసి చస్తుంటాం. సరే, టేబుల్ మీదే పెడతా గానీ, ఏ పళ్ళెంలో పెట్టను?"

"ఇదో సమస్యా? మనం తినే పళ్ళాల్లోనే పెట్టు! ఆ అమ్మాయి అన్నం తింటుందా. పళ్ళెం కూడా తింటుందా?"

"సరే, పెడతాగానీ, ఆ పళ్ళెం వేరే వుంచుతా, పూట పూటా అందులోనే పెడతా."

"ఏదో చెయ్యమ్మా! ఆ సంగతి ఆ అమ్మాయికి తెలీనివ్వకు. జాగ్రత్త! బాధ పడుతుంది. మీకు జైలే."

"ఆ అమ్మాయి కాదు, నువ్వు పడతావు అసలు బాధ!" అంటూ తల్లి రుసరుసలాడుతూ గుమ్మం దాకా వెళ్ళి, వెనక్కి తిరిగి, "ముందు నువ్వు తిను. తర్వాత ముగ్గురం తింటాంలే" అంటూ వెళ్ళింది.

రాంబాబు చప్పున లేచి వెళ్ళి టేబుల్ ముందు కూర్చుని గబగబా అన్నం పెట్టుకున్నాడు.

అమ్మమ్మ, రాధకి చిన్న గది చూపిస్తోంది.

“మంగా! నీ బట్టలూ అవీ అక్కడే పెట్టుకో! నీకో చిన్న మంచం వుందిలే, నువ్వు వెళ్ళేదాకా ఈ గదిలోనే వుండు! ఇక్కడ బియ్యం డబ్బాలూ అవీ వున్నాయిలే. అవన్నీ పక్కకి సర్దితే నీకు బాగుంటుంది. మంచం ఇటు జరుపుకో.”

“నాకు మంచం అక్కర్లేదండీ. చాప ఇవ్వండి చాలు.”

“మంచం వద్దా? చాపే ఇమ్మంటావా? సావిత్రీ, చాపే కావాలంట మంగకి. చాప తీసుకురా!”

రాంబాబు అన్నం తింటూ అన్నీ వింటూనే ఉన్నాడు.

తల్లి అప్పటికే బైల్దేరింది చాపతో.

“అమ్మా! చాప అవతల పెట్టు!” – రాంబాబు కోపంగా.

“మంగకి చాపే కావాలంట! మంచం అలవాటు లేదంట!”

అలవాటు లేకపోతే, అలవాటు చేసుకోమని చెప్పండి. అసలు ఆ అమ్మాయి అలా చెప్పలేదు. మంచం ఎక్కితే మనకి నచ్చుతుందో లేదో అని చాప అడిగి వుంటుంది” అంటూ లేచి

తల్లి చేతుల్లోంచి ఎడం చేత్తో చాప లాగి అవతల పారేశాడు.

అమ్మమ్మ, చిన్న గదిలోంచి అంతా విని నవ్వు మొహంతో, మంచం మీదే పడుకోమన్నాలే’ అంటూ వచ్చింది.

అప్పటికి మంగ, కొత్త కాశీదారం పట్టుకొచ్చి, మామ్మగారూ, మీకు కడతా” అంటూ అమ్మమ్మ మీద వాలి కుడిచేతికి గబగబా కట్టేసింది.

అమ్మమ్మ ఆ దారం చేతిని కళ్ళ కద్దుకుంది.

మంగ, రాంబాబు వేపు నవ్వుతూ చూసి, “మీరు కూడా కట్టుకుంటారా? చాలా వున్నాయి” అంది.

రాంబాబు నవ్వాడు. అమ్మా నవ్వింది. అమ్మమ్మా నవ్వింది. వాడు కట్టుకోడులే" అంది అమ్మమ్మ.

మంగ తెల్లబోతూ చూసింది.

రాంబాబు తిండి అవగొట్టి, తన గదిలోకి వెళ్ళిపోయాడు.

అంటరాని పిల్లతో, అంట వచ్చిన కులం మహిళలిద్దరూ, భోజనాల కోసం ఒకే టేబుల్ దగ్గరకుచేరారు. అసలే టేబుల్ ఎప్పుడో అరవై ఏళ్ల కిందట పోయిన గృహస్తు కొన్నది అది. దాన్ని మార్చాలని ఎవ్వరూ అనుకోరు. ఆ టేబులే వాళ్ళకి ముద్దు. తల్లీ కూతుళ్ళిద్దరూ, ఒకళ్ళ పళ్ళెం ఒకళ్ళ పళ్ళానికి తాకించి, ఒకళ్ళ భుజం ఒకళ్ళ భుజానికి ఒకళ్ళ భుజానికి నొక్కించి, ఒకే పక్కకి చేరిపోయారు. టేబుల్ అంతా అంటరాని పిల్లకి వదిలేశారు.

ఆ అమ్మాయికి పెట్టిన పళ్ళెం అంచు, కొంచెం వెనక్కి వొంగి వుంటుంది. మిగతా పళ్ళాలు అలా ఉండవు. వొంగిన అంచు పళ్ళెం పక్కనే, ఒక స్టీలు గిన్ని నిండా అన్నం, ఆ పక్కన కూర ప్లేటూ, పులుసు గిన్నీ, మజ్జిగ గిన్నీ, వాటి పక్కన పెద్ద చెంబుడు నీళ్ళూ, అన్నీ మళ్ళీ మళ్ళీ అడగకుండా!

రాంబాబు గదిలోంచి ఆ దృశ్యం అంతా చూశాడు. తల్లీ కూతుళ్ళిద్దరూ ఇటు వేపూ, ఆ అమ్మాయి దూరంగా, అటు వేపూ! ఆ రాధ, ఆ దూరాన్ని గ్రహించదా? ఏమో, కాశీదారాల మనిషి, ఏం ఆలోచిస్తుంది? ఆ అమ్మాయి ఒక్కసారి లేచి, ఎదురు తిరిగితే బాగుండును! "మామ్మగారూ! నాకు దూరంగా కూర్చోవాలని మీరు ప్రయత్నిస్తున్నారు. మిమ్మల్ని నేనెందుకు ఇబ్బంది పెట్టాలి? దూరంగానే తింటాలెండి" అని, తన గిన్నెలన్నీ తీసుకుని, దూరంగా పోతే ఎంత బాగుండును! వీళ్ళిద్దర్నీ రెండ్రోజులు జైల్లో పెట్టిస్తే ఎంత బాగుండును! బాగా సిగ్గొస్తుంది వీళ్లకి! కానీ, ఆ అమ్మాయి అసలు ఆ దూరాన్ని గ్రహించినట్టే లేదు. కాశీదారాల యువతీ రత్నం! మెళ్ళో కూడా ఏదో దారం ఉన్నట్టే వుంది!

రాంబాబు కంప్యూటర్ వేపు తల తిప్పేశాడు. ఆ రిజిస్ట్రేషన్ ఏదో అప్పటికే చేశాడు. తన ప్రొఫైల్ రాశాడు.

"నేను హేతువాదిని. మత నమ్మకాలు లేవు. కులాల పట్టింపులేదు. ఈ ప్రభుత్వాల మీద నమ్మకం లేదు. సాహిత్యం చాలా ఇష్టం" – అంతే రాశాడు. తన రంగులూ, ఎత్తులూ, బరువులూ ఏదీ చెప్పలేదు. తన రిజిస్ట్రేషన్, ఆ మర్నాటికి గానీ ఫైల్లోకి రాదని తెలుసు.

పార్కులో కూర్చున్నప్పుడు ఆ డాక్టరు చెప్పినట్టే, ఆ డాట్ కామ్‌లో వేరే ప్రొఫైల్స్ చాలా కనబడ్డాయి. దాదాపు అన్నీ కులాల, మతాల పట్టింపుల వాళ్ళవి అవి. అమ్మాయిల ఫోటోలు కనబడ్డాయి గానీ, ఈ కులాల వాళ్ళల్లో వెతికేదేమిటి?' అనుకుంటూ వాటిని తీసి పారేశాడు.

ఆ మర్నాడు సాయంత్రానికి రిజిస్ట్రేషన్, పని చేసింది. కాస్ట్ నో బార్ వాళ్ళ ప్రొఫైల్స్ కూడా దొరికాయి. కులాల పట్టింపులు లేనివాళ్ళవి! ఆశ్చర్యం వేసింది. 'ఇలాంటి వాళ్ళూ వున్నారా' అని! వరసగా ఐదు ఫోటోలు చూశాడు అమ్మాయిలవి. మూఢ నమ్మకాలు లేనివాళ్ళు కదా అని గౌరవంతో చూశాడు. కానీ, పెద్ద పెద్ద బొట్లూ, పూలదండలూ, ఎక్కడ చూస్తే అక్కడ, చెవులకీ ముక్కులకీ, మెడకీ చేతులకీ, నెత్తులమీదా, అన్ని చోట్లా నగలు! పెళ్ళిచూపుల ఫోటోలు కదా అని అలా తయారయ్యారేమో! రోజూ అలాంటి వేషంతో వుంటే వూపిరాడుతుందా అసలు! అనుకుంటూ ఆ ప్రొఫైల్సన్నీ కూడా చదవకుండానే తీసేశాడు.

ఒకచోట ఆగాడు. కొంచెం చూశాడు. క్రాపు కన్నా కొంచెం పెద్ద జుట్టు! నీట్‌గా కనపడింది. కాలర్ షర్టు! చెవులకి చిన్న చిన్న రింగులు! అవీ దండగే కానీ పోనీలే , ఏదో మరి, అలవాట్లు! ఇంకెక్కడా లేవు నగలు. లిప్‌స్టిక్ లేదు. చాలా ఆశ్చర్యంవేసింది.

వివరాలు  చదివితే, చదువూ, ఉద్యోగం తెలిశాయి. కులం ప్రసక్తి లేదు.

ఫోన్ తీసి, రమణని వెంటనే పిలిచాడు.

"పేరు కూడా కనబడింది. మల్లిక అట. నేనేం చెయ్యాలి ఇప్పుడు? పార్కులో ఆయనేదో చెప్పాడు. మరిచిపోయాను"

"నువ్వు అడగాల్సిందేదో అడుగు"

"సరేలే" అని ఫోన్ ఆపేసి, గబగబా మెయిల్ రాశాడు. "మీ ప్రొఫైల్ ఇప్పుడే చూశాను. మీరేం పుస్తకాలు చదువుతారు? సినిమాలు బాగా చూస్తారా? నగలు బాగా ఇష్టమా? ఈ ప్రభుత్వాల మీద మీకు నమ్మకమేనా? మీకీ హేతువాద భావాలు ఎప్పుడు వచ్చాయి?" అలా అలా పది ప్రశ్నలు అతి కష్టం మీద తయారుచేసి, చివరికి, "మీ జవాబు కోసం చూస్తానండీ" అని ముగించాడు.

'పెళ్ళి చూపుల్లో జరిగేది ఇదేగా?" అన్నాడు మళ్ళీ రమణతో.

హాల్లోంచి మాటలు వినపడుతోంటే, గబగబా అటు చూశాడు.

అప్పటికి మంగ బాగా ఆకలితో వుందేమో, గబ గబా తన గిన్నెలన్నీ ఖాళీ చేసేసింది.

"కొంచెం అన్నం కావాలా రాధా?" అంది సావిత్రి.

"వొద్దండీ. కొంచెం ఎక్కువైనా తినేశాను. ఇంకేం వొద్దు. బెండకాయ కూర చాలా బాగుందండీ. అయినా ఇవి మా ఊరు బెండకాయల్లా లేవు. నా సంచిలో బెండ విత్తనాలూ అవీ వున్నాయి. మా అమ్మ చాలా రకాలిచ్చింది. రేపు నాటుతా. మన పెరట్లో కాస్తే చాలా బాగుంటాయి" అంటూ లేచి తన పళ్ళెమూ, ఖాళీ గిన్నెలూ, వాకిట్లో పెట్టి, గబగబా వచ్చింది.

అమ్మమ్మ చేతిలోంచి ఎంగిలి పళ్ళెం తీసుకోబోతోంటే, అమ్మమ్మ "వొద్దొద్దు ఎందుకూ, ఎందుకూ' అంటోన్నా వినకుండా మంగ ఆ పళ్ళెం లాక్కుంది. సావిత్రి పళ్ళెం కూడా అందుకోబోతోంటే, "ఇది వొద్దులే, మామ్మగారి పళ్ళెం తీసుకో. కాళ్ళు నెప్పుల్లే మామ్మగారికి" అంటోన్నా వినకుండా అదీ అందుకుని రెండూ బైటికి తీసుకుపోయింది మంగ.

అమ్మమ్మ నెమ్మదిగా లేచి, ఆ పక్క మంచం మీదకి చేరింది. "మంగా! చిన్న పని చెయ్యమ్మా! అదుగో, ఆ మూల సీసా చూడు. అది మందులే. కొంచెం నా పాదాలకి రాయి" అంది.

మంగ చప్పున ఆ సీసా తెచ్చి మామ్మగారి పాదాల దగ్గిర కూర్చోబోతోంటే, అప్పటిదాకా రాంబాబు గది గుమ్మంలోంచి అదంతా చూసి, చప్పున లేచి వచ్చాడు. చేతిలో కాయితం అమ్మమ్మ మంచం మీద పడేసి, "రోజూ నేను రాస్తాగా? ఆ

అమ్మాయి నెందుకు అడిగావు?" అంటూ మంగ చేతుల్లోంచి  సీసా లాక్కున్నాడు. "మీరు వెళ్ళండి మీ గదిలోకి. రాత్రంతా ప్రయాణం చేసి వచ్చారు. పడుకోండి. లేకపోతే, కాస్సేపు ఏదన్నా చదువుకోండి" అంటూ తనే అమ్మమ్మ కాళ్ళ దగ్గిర కూర్చున్నాడు.

మంగ దూరంగా తప్పుకుని, "మీరు కంప్యూటర్ మీద పని చేసుకుంటున్నారు కదండీ? మీరు వెళ్ళండి. మామ్మగారికి రోజూ నేను రాస్తాను" అంటూ మళ్ళీ ఆ సీసా తను అందుకోబోయింది.

రాంబాబు దాన్ని అందనివ్వకుండా అమ్మమ్మని బెదర గొట్టాలని, "అమ్మమ్మా! రాధతో కాళ్ళు పట్టించుకోకు. ఆ అమ్మాయి పోలీసులకి చెప్పిందంటే, నిన్ను జైల్లో పడేస్తారు" అన్నాడు.

మంగ మొదట తెల్లబోయి తర్వాత నవ్వింది.

"నేనలా చెప్పనండీ" అంది.

"అలా అనకండి. చెపుతానండీ అనాలి! లేకపోతే మామ్మగారు నీకు చాపే ఇస్తుంది. మంచం తీసేస్తావనుకుంటుంది. అమ్మమ్మా!  రేపొద్దున్న ఆ మంచం వుందో లేదో చూడండి!"

అమ్మమ్మా, అమ్మా కూడా బాగానే నవ్వారు.

రాధ, రాంబాబుని ఆశ్చర్యంగా చూసింది.

అంటరాని కులం పిల్ల ప్రవేశించిన ఆ ఇంట్లో, ఆ రాత్రి, చిన్న చిన్న నవ్వులతో నిండింది.

మంగ నవ్వుతూనే తన గదిలోకి వెళ్ళిపోయింది.

రాంబాబు అమ్మమ్మ పాదాలకు మర్దనాలు పూర్తిచేసి, "మంగతో చేయించుకున్నావంటే చూడు, నేనే చెపుతాను పోలీసులికి" అంటూ లేచాడు.

అమ్మమ్మ నవ్వి, "చెప్పుకో! నీ మాటలు అబద్ధమని మంగే చెపుతుందిలే" అంది.

"మరి మంగ మంచిదేగా? మంచం ఇవ్వడానికి అంత ఏడ్చావెందుకూ?"

అనేసి, చేతులు కడుక్కుని, తన గదిలోకి పోయి మళ్ళీ కంప్యూటర్ ముందు చేరాడు. చప్పున లేచి వచ్చి దేనికోసమో వెతికాడు.

"ఇదుగో, నా పక్కమీద ఏదో పడేసి అక్కడెక్కడో వెతుకుతున్నావు. ఉయ్యాల్లో పిల్లని పెట్టుకుని ఊరంతా వెతికే మేళం నువ్వు" అంది అమ్మమ్మ.

ఆ కాయితం పట్టుకుని లోపలికి పరిగెత్తాడు.

రాంబాబు రాసిన మెయిల్‌కి జవాబు వచ్చేసింది! మల్లిక తండ్రి ఇచ్చాడు అది. ఆ అమ్మాయి ఎత్తూ, రంగూ, బరువూ, చదువూ, రాశాడు. మళ్ళీ అవే. అడిగిన ప్రశ్నలకి జవాబులు లేవు.

"నేను మల్లికతోనే మాట్లాడాలనుకుంటున్నాను" అని వెంటనే రాశాడు రాంబాబు. రాసేసి మూసేశాడు. లేకపోతే ఆ తండ్రి, తన బరువు అడుగుతాడని భయం పుట్టింది.

కంప్యూటర్ మూసేసి పక్కమీద వాలాడు. అప్పుడే బాగా గుర్తొచ్చింది. తన వయసు, తనకి ఇరవై తొమ్మిది సంవత్సరాలు నిండాయా! ముప్పయ్యోది మొదలైందా! రెండు రోజులు అయిపోయాయి! కాలం పరిగెత్తుతోంది. ఇంకా ముప్పై గడిస్తే అరవై! మూడో ముప్పై గడిస్తే, తొంభై! అప్పుడెలా వుంటుంది ఆరోగ్యం! ఎవరు చూస్తారు? అమ్మమ్మ కాళ్ళకి నూనెలు తను రుద్దినట్లు తన కాళ్ళకీ ఎవరో రుద్దాలా? వొద్దొద్దు, తనే రుద్దుకుంటాడు. చేతకాకపోతే? ఓపిక లేకపోతే? అందుకే పిల్లలు? ఇదేవిటి, ఇవేం ఆలోచనలు, ఇలా పోతున్నాయి. అసలు వయసు లెక్కలెందుకూ? అది అలా పోతూ వుండాలి.

చప్పున లేచి మళ్ళీ కంప్యూటర్ తెరిచాడు. వచ్చింది మల్లిక జవాబు!

"మీ జాతకం ఇస్తారా?" అని ఒకే ఒక్క వాక్యం!

అదిరి పడ్డాడు. "మీరు నాస్తికులమని చెప్పుకున్నారు కదా? జాతకాలేమిటి?" అని గబగబా రాశాడు.

కంప్యూటర్ ముందే కూర్చున్నట్టుంది ఆ అమ్మాయి. "మా డాడీకి కొంచెం ఆ నమ్మకాలు వున్నాయి. నా కోసం కాదు. పెద్దవాళ్ల కోసం. వాళ్ళడిగేది ఒకసారి

చెప్పవచ్చు. వాళ్ళు సంతృప్తి పడతారు. మీ జాతకమూ, మీ కులమూ కూడా చెప్పండి ఒక్కసారి!" – అని జవాబు పడింది.

ఈ కూతురా? బానిస కూతురు!

నెట్ మూసెయ్యబోయి ఒక్క వాక్యం రాశాడు.

"కులాల్నీ, జాతకాల్నీ నిలబెట్టి, మిమ్మల్నీ, డాడీల్ని ఆనందపెట్టడం కన్నా, వాళ్ళని భోరున ఏడిపించడమే అభ్యుదయం!"

ఇటునుంచి వెళ్ళిందో లేదో అటు నించి వచ్చేసింది. ఈ సారి ఇంగ్లీషులో. 'ఐయామ్ నాట్ సో రిజిడ్. ఐ రెస్పెక్ట్ మై పేరెంట్స్." అని! (నేను మరీ అంత మొండిదాన్ని కాదు. నేను నా తల్లిదండ్రుల్ని గౌరవిస్తాను.)

కట్! వృద్ధురాలై పోయిన యువతితో ఇంకేం మాటలు? "నువ్వు గౌరవించేది తల్లిదండ్రుల్ని కాదు యువతీ! కులాల్నీ, జాతకాల్నీ! నేను వెనక్కి పోతున్నా" అని రాశాడు గానీ, దాన్ని పంపక ముందే ఒక సందేహం వచ్చింది. "పోతే ఫో, నిన్నెవరు పిలిచారు?" అంటుందేమో! అది కాకపోయినా ఇంకేదో అంటుంది. జాతకాల మనిషి! ఇలాంటి వాళ్ళు సరిగా వాదించరు. మౌనంగావెనక్కి తగ్గడం మంచిది. రాసిన దాన్ని తీసేశాడు. నెట్ మూసి పారేశాడు. కంప్యూటర్ ఆపి పారేశాడు.

ఫోన్ తీశాడు.

"రమణా! నీకు చెప్పాలని కాయితం మీద రెండు మాటలు రాశాలే. ముగిశాయి. ఇప్పుడే పెళ్ళి చూపులు!"

"అదేమిటి? నిన్ననేగా రిజిస్టర్ చేసుకుని మెయిలిచ్చావు?"

"అదే మరి! జాతకం అడిగింది. తీసి పారేశా. ఇంటర్నెట్ నచ్చింది నాకు. పెళ్ళి చూపుల్ని టకీమని మూసెయ్యచ్చు. నిద్రలో లేచావా? నాకూ నిద్రొస్తుందిలే, పడుకో!"

"రామూ ఆగు, చిన్న మాట! జాతకాల వాళ్ళు నాకు తెలుసు. ఒక అబద్ధం జాతకం రాయిస్తా! 'ఈజాతకుడు కోటీశ్వరుడవుతాడు' అని రాయించుకొస్తా! తర్వాత, అవలేదేమని వాళ్ళు అడిగితే, 'నాకేం తెలుసు? జాతకాలే తప్పన్నమాట' అని వాదించొచ్చు!"

'ఏడిశావులే, నిద్రపో"అని, ఫోన్ ఆపేసి మళ్ళీపక్కమీద వాలాడు.

మంగ ఏదో కవరు తెచ్చి, సావిత్రి చేతిలో పెట్టబోయింది. "నాకు జీతం వచ్చిందండీ" అంటూ.

చూస్తే కవర్లో నోట్లు వున్నాయి. "ఎందుకూ?" అని తెల్లబోయింది సావిత్రి.

"ఇవి మీ దగ్గర వుంచండి అత్తమ్మగారూ! నేను ఇక్కడే తింటున్నాను కదండీ?"

సావిత్రి నవ్వింది. "అత్తమ్మ" అని పిలిచిందని. "అలాగే పిలువు, సరదాగా ఉంది" అంది. "తిండికా డబ్బిస్తున్నావు? అమ్మా! చూడు, రాధ ఏం చేసిందో!" అంటూ సావిత్రి నవ్వుతూ ఆ కవరు తల్లికి చూపించింది.

అంతా విని, అమ్మమ్మ కూడా నవ్వింది.

"మాకేం ఇవ్వొద్దమ్మా! బోలెడు పని చేస్తున్నావు. అది చాలు. మీ వాళ్లకి పంపించు. ఏం ఇబ్బంది పడుతున్నారో వాళ్ళు."

"వాళ్లకీ పంపుతానండీ. ఇది వుంచండి మామ్మగారూ! మీ దగ్గిర."

"వొద్దు మంగా! నీ తిండి ఎంతా! నీకే మేం జీతం ఇవ్వాలి. తీసుకెళ్ళు. దాచుకో దీన్ని" అంటూ అమ్మమ్మ ఆ కవరు ఇచ్చేసింది.

ఆ నెల రోజుల్లో మంగ చేసిన పని ఇంతా అంతా కాదు. వాకిళ్ళలో నాలుగు చోట్ల తవ్వి విత్తనాలు పాతింది. అవి అప్పుడే మొలకెత్తాయి కూడా. పూట పూటా వాటికి నీళ్ళు జిమ్ముతుంది. స్కూలునించి వచ్చేటప్పుడు కూరలు పట్టుకొస్తుంది. ఇంట్లో ఏది లేకపోయినా, చీటీ రాసుకుని సాయంత్రానికి తీసుకొస్తుంది. రాంబాబు పని బాగా తగ్గింది.

ఆ నెల్లాళ్ళూ రాంబాబు ఇంటికి వచ్చీ రాగానే కంప్యూటర్ ముందే చేరి గడిపాడు. ఏ పెళ్ళిళ్ళ డాట్‌కామ్‌లు తెరిచినా, ప్రొఫైల్స్ అయితే డజన్లు డజన్లు కనబడతాయి. చదువులూ, ఉద్యోగాలూ ముఖ్యం! వాటి వెంటే కులాలూ మతాలూ ముఖ్యం! నో క్యాస్ట్ బార్‌లో కూడాజాతకాలే! ఛీఛీ! జాతకాలు కూడా సైన్సే– అని వాదనలు! ముఖ్యం కానివి బుద్ధీజ్ఞానాలు! అవి ఏ ప్రొఫైల్స్‌లోనూ కనబడవు.

ఆ నెల్లాళ్లలోనే, ఎగిరి గంతులేసుకుంటూ సంభాషణలు సాగించిన సందర్భాలూ కొన్ని జరిగాయి. చివరికి, కళ్ళు బైర్లు కమ్మి బైటపడుతూ వచ్చాడు.

ఒక అమ్మాయికి, కాస్త చదువూ – సంధ్యా బాగానే ఉన్నాయి. ఫోటోలో వేషాలంకరణ డీసెంట్‌గానే వుంది. కానీ మొదటి మెయిల్లోనే, 'మీదేం కులం?" అని అడిగింది.

"అదేంటి? మీరు క్యాస్ట్ నో బార్‌లో ఇచ్చేరే!"

"మా పేరెంట్స్‌వి వేరు వేరు కులాలు. అందుకే క్యాస్ట్ నో బార్‌లో పెట్టారు. మా మమ్మీ అయితే, నన్ను తన కులంలోనే చేసుకోమంటుంది. డాడీ కులం చిన్నది. మమ్మీ, తన పెళ్ళప్పుడు బాగా ఆలోచించలేకపోయాననంటుంది. మీ కులం ఏమిటో చెప్తే, మీ కులం మమ్మీ కులం కన్నా పెద్దదయితే, మమ్మీ తప్పకుండా ఒప్పుకుంటుంది. అంతేకాదు. మీ కులం నచ్చితే, కట్నం ఇవ్వడానికి కూడా మా మమ్మీకి అభ్యంతరం వుండదు."

"మీరు రాసిన దాన్ని బట్టి మీ అభిప్రాయం తెలుస్తూనే ఉంది గానీ, మీ మమ్మీ అభిప్రాయమే మీ అభిప్రాయమా?"

"బోత్ ఆర్ సేమ్ (రెండూ ఒకటే)"

కట్! ఆ రోజు నెట్ మూతబడిపోయింది.

రాంబాబుకి కుతూహలం పెరిగింది. ఆ విద్యాధిక డిగ్రీల యువతులు ఎన్నెన్ని డిగ్రీల స్థాయిల్లో వెనక్కి పోతున్నారో చూడాలని.

అపర్ణ అనే అమ్మాయి, రాంబాబు ప్రొఫైల్ చూసి, తనే మొదట మెయిల్ రాసింది. "మీకు అమెరికాకి మారే అవకాశాలు వున్నాయా?" అని అడిగింది.

"ఇప్పటికైతే లేవు. అవకాశం వచ్చినా నాకా ఉద్దేశం లేదు. మా నాన్న నా చిన్నప్పుడే యాక్సిడెంట్ వల్ల పోయాడు. మా అమ్మనీ అమ్మమ్మనీ, నేనే చూసుకోవాలి. నాన్న పెన్షనూ, ఇప్పుడు నా జీతమే, ఇవే మా రాబడి, చిన్న ఇల్లు వుంది. అదే మా ఆస్తి. మా ముగ్గురికీ ఇక్కడే సంతోషం".

"అంటే మీరు మారేజ్ తర్వాత కూడా జాయింట్ ఫేమిలీ లోనే వుండిపోతారా?"

"జాయింట్ ఫేమిలీ ఎక్కడ? అన్నదమ్ముల ఫేమిలీ కాదు ఇది. మాఅమ్మమ్మకి,

మా అమ్మ ఒకతే.  మాఅమ్మకి, నేను ఒక్కణ్ణే. అమ్మమ్మనీ, అమ్మనీ, నేనే చూసుకోవాలి. ఇటీజ్ మై డ్యూటీ!"

"ఎందుకూ? మేరేజ్ తర్వాత మీరూ, మీ వైఫూ వేరే చోట వుండొచ్చు. మీ మదరూ ఆమె మదరూ, ఆ ఇంట్లోనే వుంటారు. వాళ్ళకి రేషన్ కొనియిచ్చి నెలకో సారి వెళ్ళి చూడొచ్చు కదా?"

"మీకు మేరేజ్ అయ్యాక, మీ పేరెంట్స్‌ని అలాగే వదిలేస్తారా?"

"మా పేరెంట్స్ ఇప్పుడే అంటున్నారు. ఓల్డ్ పీపుల్ హోమ్‌లోనే వుంటామని. పిల్లల దగ్గిర ఉండం అంటారు. అది నామోషీ అంటారు. మీరు కూడా మీ వాళ్లని ఓల్డ్ హోమ్‌లో  పెట్టి, మీ ఇంటిని రెంట్‌కి ఇచ్చెయ్యొచ్చు. నాకైతే ఐ హేట్ జాయింట్ ఫేమిలీ. ఆ ఫేమిలీలో ఎవరు ఎంజాయ్ చెయ్యగలరు? ఓల్డ్ పీపుల్‌ని పెట్టడానికి ఇప్పుడు ఎన్నో ఫెసిలిటీస్ వున్నాయి. కొన్ని హోమ్స్‌లో అయితే, అక్కడి వాళ్ళకి జబ్బులు చేసినా వాళ్ళే చూస్తారు. వాళ్ళని మనం ఎప్పుడూ ఇంటికి తీసుకురానక్కరలేదు. అలాంటి సౌకర్యాల్ని వాడుకోకపోతే, ఫూలిష్‌నెస్ అవుతుంది. వాళ్ళని ఓల్డ్ ఏజ్ హోమ్‌లో పెట్టేసి కొంచెం ప్రయత్నిస్తే అమెరికా పోయే అవకాశం కూడా... ఇప్పుడు ఆస్ట్రేలియా కూడా అవకాశాలుంటున్నాయి... "

ఆ వాగుడుని, ఆ తర్వాత చదవకుండానే మూసేశాడు నెట్‌ని. కానీ, యువతీ జనం ఎలా తయారవుతున్నారో అర్థమవుతున్నట్లుగా అనిపించింది రాంబాబుకి.

అమ్మమ్మ దగ్గరికి వెళ్ళి కూర్చున్నాడు.

'అమ్మమ్మా! పెళ్ళో పెళ్ళో అని మీరు చంపుతున్నారని, రమణ చెప్పినట్లు కంప్యూటర్లో పెళ్ళి సంబంధాల గురించి వెతకడం మొదలుపెట్టాను కదా నెల రోజుల్నించీ"

"దొరికిందా అమ్మాయి? చెప్పావు కాదే?"

"ఏ వుంది చెప్పడానికి? ఇందాకే చూశాను. ఆ అమ్మాయి, అత్తగారితో కలిసి వుండదట! అత్తగార్ని వృద్ధులుండే ఆశ్రమంలో చేర్చేసి, ఇల్లు అద్దెకిచ్చెయ్యాలట! తనతో నేను వేరే చోట వుండాలట. అమెరికాకు పోవాలట! చెయ్యనా అలాగ?"

“వొప్పేసుకున్నావా యేంటి కొంపదీసి? ఎవత్తెరా అదీ, అలా అడిగిందీ? వొప్పుకోకు సుమా! మీ అమ్మకి పెళ్ళయిన పదేళ్ళకే మీ నాన్న పోయాడు. ఇప్పుడు నువ్వు కూడా వదిలేస్తే అమ్మ ఏమవుతుంది? ఇద్దరం కలిసి ఎందులోన్నా దూకుతాం.”

“ఒకమ్మాయి ఎలా ఉందో నీకు  చెప్పానంతే. అలా నేనెందుకు చేస్తాను? పెళ్ళో పెళ్ళో అంటారు. మంచివాళ్ళు దొరకొద్దూ?”

“మంచి వాళ్ళెందుకుండరూ? లోకం గొడ్డుపోయిందా? ఏబ్రాసిది అదెవతోఅలా వాగింది గానీ” అని అమ్మమ్మ ఆ ఏబ్రాసిదాన్ని బాగా తిట్టింది.

ఆ రోజు రాంబాబు ఇంటికి వచ్చేప్పటికి మంగ నవ్వు గలగలా వినిపిస్తోంది దూరానికే. ఆ అమ్మాయికి ఆ ఇంట్లో బెదురు పూర్తిగా పోయింది.

రాంబాబుని, “రామూగారూ, రామూగారూ” అని పిలుస్తోంది. తనని ‘మీరు’ అనొద్దని రాంబాబుతో చాలాసార్లు చెప్పింది. ప్రతీసారి మంగ అలా అంటోంటే, రాంబాబుకి అమ్మమ్మలాగ ‘మంగా’ అన్నదే ఎక్కువసార్లు వచ్చేస్తోంది. అలా పిలిస్తే మంగ నవ్వుతుంది.

మంగ, ఒక్క పూట కూడా ఏ పనికీ బద్దకించదు. చీకట్నే లేచి, గిన్నెలు తోమడంతో మొదలుపెట్టి, గదులూ వాకిళ్ళూ వూడ్చి, మొక్కలకి నీళ్ళుపోసి... ఇంట్లో వున్నంతసేపూ ఏదో ఒకటి చేస్తూనే ఉంటుంది. లేకపోతే మామ్మగారికి పేపర్లో, భక్తిపుస్తకాలో, చదివి వినిపిస్తూ ఉంటుంది.

“మంగ బళ్ళోకి పోతే ఇంట్లో సందడే వుండదు.” అంటూ వుంటుంది అమ్మమ్మ. భోజనాలప్పుడు, టేబుల్ దగ్గర సుఖంగా కూర్చోవడం నెల్లాళ్ళకి తెలుసుకున్నారు. పెద్ద కులం తల్లీకూతుళ్ళు.

ఆరాత్రి రాంబాబు లోపలికి వచ్చేప్పటికి, “దెయ్యాలుంటాయా మామ్మగారూ?” అంటోంది మంగ.

“ఎందుకుండవు గానీ, బళ్ళో వుంటాయా?” అని సందేహిస్తోంది అమ్మమ్మ.

రాంబాబు హాల్లోకొచ్చి, “బళ్ళో దెయ్యాలేమిటి?’ అన్నాడు.

మంగే గబగబా చెప్పింది.

"అది కాదండీ రామూ గారూ! పొద్దున్న నేను వెళ్ళేప్పటికి, మా టీచర్లందరూ తెగ చెప్పేసుకుంటున్నారు. రాత్రంతా బళ్ళో తలుపులన్నీ తెగ కొట్టేసుకున్నాయట., గాలి లేకుండానే. మూసేసిన తలుపులు కూడా కొట్టేసుకున్నాయట! వాచ్‌మేన్ అదంతా చూస్తూ నించున్నాడట! అతను చెప్తోంటే మా వాళ్లందరూ, "అవును, దెయ్యాలు అలాగే చేస్తాయి' అంటారేమిటండీ? ఇవ్వాళ రోజంతా దెయ్యాల మాటలే! పిల్లలందరికీ ఆ కథలే చెప్పారు."

"ఆ దెయ్యం కథలు నువ్వూ నమ్మావా మంగా?" అన్నాడు రాంబాబు.

"నమ్మలేదు గానీ, వాళ్ళందరూ ఎందుకు నమ్ముతున్నారా అనిపించిందండీ."

"వాళ్ళే కాదు, నువ్వూ నమ్ముతున్నట్టే. ఆ కాశీదారాలు కట్టుకోలేదా చేతికి?"

"ఇవి మంచిదంటారు కదండీ? దెయ్యాలవీ దగ్గరకు చేరవంటారు."

"అదీ, అంటే నువ్వూ దెయ్యాల్ని నమ్ముతున్నట్టేగా."

మంగ ఆలోచనల్లో పడ్డట్టు, ఆశ్చర్యపోతున్నట్టు, రామూ ఏదో మంచి పాయింటే చెప్పినట్టు, తల వాలేసింది.

"నీ లాంటి తెలివిలేని వాళ్ళే మీ టీచర్లందరూ" అనేసి రాంబాబు తన గదిలోకి వెళ్ళిపోయాడు.

అమ్మా, అమ్మమ్మా, నోళ్ళు తెరిచేసి వూరుకున్నారు. అలవాటే ఆ నోళ్ళు తెరవడం!

తెల్లారి, మంగ చేతికి ఆ దారం లేదు. పనులన్నీ అయ్యాక, అమ్మమ్మ చెయ్యి పట్టుకుంది–"అమ్మగారూ, మీకూ వొద్దు. దెయ్యాలెక్కడుంటాయి?" అంటూ.

"అయ్యో, మంగా, ఉండనియ్యి, ఉండనియ్యి" అంటోన్నా వినకుండా ఆ దారం ఊడదీసేసింది.

రాంబాబు నిలబడి చూశాడు. హాలులో అలమారు తెరిచి, రెండు పుస్తకాలు వెతికి తీసి, "మంగా, ఇవి చదువు, అమ్మమ్మకి కూడా చదివి వినిపించు. దెయ్యాలుంటాయో లేదో తెలుస్తుంది మీకు" అంటూ అవి మంగకి ఇచ్చాడు.

అమ్మమ్మ కోపంగా, "ఏంటీ తెలిసేదీ? కొందరు చచ్చిపోయాక తప్పకుండా దెయ్యాలవుతారు" అంది మొహం చిట్లిస్తూ.

"అమ్మమ్మా! నువ్వు బతికున్నప్పుడే దెయ్యానివి; చచ్చిపోతే కొరిందెయ్యానివి!"

తల్లి కోపంగా, "ఏం మాటలవి, ఊరుకో. అమ్మమ్మ కసలే ఒంట్లో బాగాలేదు" అని మందలిస్తూనే, "అమ్మమ్మని దెయ్యం అంటున్నావు. అంటే, దెయ్యాన్ని నువ్వూ నమ్ముతున్నట్టేగా?" అని లాజిక్కు తీసింది.

"లేకపోతే ఏంటమ్మా? ఎంత మంచి మాట చెప్పినా, చెవికెక్కనివ్వదు" అనేసి వెళ్ళిపోయాడు రాంబాబు.

మంగ, తన చేతిలో పుస్తకాలు పడ్డాక, చుట్టూ వాళ్ళల్లో ఎవరేం మాట్లాడుకున్నారోగమనించలేదు. పుస్తకాలు తెరిచి చూస్తూ నిలబడి పోయింది. "చదువుతాను. రాత్రంతా కూర్చుని చదువుతాను. కొంచెం పిల్లల పరీక్ష పేపర్లున్నాయి. అవి దిద్దేసి ఇంక నిద్రపోను" అంది సంబరంగా. తన మాటలు ఎవరన్నా విన్నారో లేదో పట్టించుకోలేదు.

రాంబాబు గదిలోంచి ఆ మాటలు విన్నాడు. కొంచెం ఆశ్చర్యపడ్డాడు.

రాంబాబు తల్లి హాల్లోంచి, "రామూ, నువ్వు పాడైంది గాక ఆ పిల్లని కూడా పాడు చేస్తున్నావు" అంది గట్టిగా, కొడుక్కి వినపడాలని.

మంగ నవ్వి, "అలా అనకండి అత్తమ్మ గారూ! నేను కాస్త బాగుపడుతున్నాను" అంది.

అమ్మమ్మ, మనవడి మీద పంతంగా, "మంగా! ఆ దారాలు నీ దగ్గిర ఇంకా వున్నాయిగా? ఇంకోటి కట్టు నాకు. అది వుంటే బాగా నిద్ర పట్టింది ఇన్నాళ్ళూ" అంది.

మంగ నవ్వింది. "వొద్దండీ మామ్మ గారూ! మీ దగ్గిరికి రావాలంటే దెయ్యాలే జడుస్తాయి" అని మామ్మగార్నే వేళాకోళం చేసింది.

మంగ ఆ రెండు పుస్తకాలూ రెండు రోజుల్లో అవగొట్టి, "ఇంకేమన్నా ఇవ్వరా?" అంది రాంబాబు ఆ పొద్దున్న వెళ్ళిపోతోంటే.

"హాల్లోనే అలమార్లో వున్నాయిగా? నువ్వే జాగ్రత్తగా తీసుకో. ఎక్కడ తీశావో అక్కడే పెట్టాలి" అనేసి వెళ్ళిపోయాడు

"రమణా! పాత కాలపు పెళ్ళి చూపులైతే ఊళ్ళ వెంట తిరిగి రోజుకి ఒకటి చూడొచ్చు. నెట్‌లో అయితే, మన ఇంట్లో మనం కూర్చుని, రోజుకి పది చూడొచ్చు. కానీ, అవి ఇవీ అన్నీ శుద్ధ దండగే!"

"బోలెడు మంది నెట్ ద్వారానే సెటిల్ చేసుకుంటున్నారు తెలుసా? నిన్న మా ఆఫీసు వాళ్ళు కూడా చెప్పారు" అన్నాడు రమణ.

రమణకి చెప్పిన వాళ్ళు, "నెట్ సంబంధాలు చాలా జాగ్రత్తగా చూసుకోవాలి. చాలా మోసాలు వుంటాయి. ఒక సారి మాకు తెలిసిన వాళ్ళ అబ్బాయికేమైందంటే, నాకు సరిగా తెలీదు కానీ, ఏదో గొడవైంది. మోసం చెయ్యడానికి ప్రయత్నించాడని పేపర్లకి కూడా ఇచ్చారంట అవతలి వాళ్ళు. ఈ కుర్రాడు ఏమీ ఎరగడంట. చివరికి రెండు లక్షలిచ్చి ఆ గోల తప్పించుకున్నారు" అని చెప్పుకొచ్చారు.

రమణ నవ్వి, "ఏ తప్పూ లేనివాళ్లు రెండు లక్షలు ఎందుకిస్తారయ్యా?" అన్నాడు.

"అది కాదు, తప్పనేది ఎట్నించో జరిగిందనే కదా అర్థం? డబ్బుకోసం చాలా మోసాలు జరగడం చూడడం లేదా?" అన్నారు వాళ్ళు.

అదీ నిజం కావచ్చనిపించింది రమణకి. కానీ, ఆ మాటలేవీ రామూకి చెప్పలేదు. చెప్తే అసలే ఎగరగొట్టేస్తాడని తెలుసు. అందుకే, "బోలెడు మంది నెట్ ద్వారానే చూసుకుంటున్నారు" అని సరిపెట్టాడు.

'ఆ బోలెడు మందిలో నన్ను కూడా చేరమని సలహా ఇచ్చావు. అందుకే నాకీ పీడ పట్టుకుంది" అని విసుక్కుంటూ ఫోను ఆపి, నెట్ తెరిచాడు రాంబాబు.

ఒకమ్మాయి, ఫోనులోనే మాట్లాడింది.

"నాకు మూఢ నమ్మకాలు అస్సలు లేవు. సాయిబాబా అంటే ఐ బిలీవ్ హిమ్ వెరీ మచ్ (ఆయన్ని బాగా నమ్ముతాను) అంది. "బాబా గొప్ప ఫిలాసఫర్! చాలా ఎడ్యుకేటివ్‌గా చెపుతారు" అంది మళ్ళీ.

“ఏదైనా చిన్న ఉదాహరణ చెప్పండి, నాకు తెలుస్తుంది” అన్నాడు రాము.

“ఆయన పుస్తకం ఒకటి పంపుతాను మీకు. ఆధ్యాత్మికత వల్లే ప్రశాంతత దొరుకుతుందని ఆయన చక్కగా రాశారు అందులో.”

“మీకు ప్రశాంతత లేదా?”

“నేను యోగా చేస్తాను. అది చెయ్యకపోతే నాకు అనీజీగా వుంటుంది”

“యోగా అంటే, ఆత్మా-పరమాత్మా కలయిక అంటారు. అదే ‘యోగం’ అంటారు. ఆత్మల్నీ పరమాత్మల్నీ నమ్ముతారా మీరు? హేతువాదిని అన్నారని అడుగుతున్నాను.”

“యోగా అంటే అదేం కాదు. యోగా చేస్తే శరీరం దృఢపడుతుంది. నాకు రొంప జబ్బు తగ్గింది.”

“అయితే అది ఎక్సర్‌సైజ్ అవుతుంది, అంతేగా?”

“అంత సింపుల్ మీనింగ్ కాదులెండి. కొన్ని మంత్రాలూ స్తోత్రాలూ వినడానికి చాలా బాగుంటాయి. దేవీ స్తోత్రం విన్నారా?”

“అది సంగీతం అవుతుంది. రాగం బాగుంటే దేన్నయినా వినొచ్చు.”

“అలా కాదు, సంస్కృతం భాషే చాలా పవిత్రం!”

ఆఖరికి, పవిత్రాల్లోకి దిగింది, ఆ అమ్మాయి హేతువాదం ఒకే ప్రొఫైల్‌మీద కొంచెం ఆశ కలిగింది రాంబాబుకి. నో కులాలూ, నో పూజలూ, నో జాతకాలూ, నో అమెరికా గిమిరికా, నో జీతం లెక్కలూ, నో... నో... నో...!

అది చూస్తే కల లాగ అనిపించింది.

‘పెళ్ళిరోజు వచ్చేసినట్టుందే నాకు’ అనుకున్నాడు. ఫొటోలు ఇటూ అటూ మారాయి.

ఫోనులోనే సంభాషణలు.

అమ్మాయి తల్లే మాట్లాడింది.

“మాకు ఇద్దరూ ఆడపిల్లలే. ఇద్దరూ రెండు కళ్ళు. ఇద్దరూ మా కళ్ళముందే వుండాలని మా ఆశ. పెద్ద అల్లుడు మాకు నచ్చినట్టే దొరికాడు. రెండో అల్లుడు కూడా మా దగ్గిరే వుండాలి. అదండీ మా అభిప్రాయం”

"మీ ప్రొఫైల్లో ఇదేం లేదే!"

"అన్నీ ఎలా రాస్తాం? కలిసినప్పుడు మాట్లాడుకుంటాం గానీ"

"మీ అల్లుళ్ళకి తల్లిదండ్రులు వుండరా? మీ పిల్లలు మీకు కళ్ళయినట్టు, వాళ్ళ పిల్లలు వాళ్ళకి కళ్ళు కారా? ఆ అబ్బాయిలు మీ దగ్గిరికి వచ్చేస్తే, వాళ్ళ తల్లిదండ్రుల్ని ఎవరు చూస్తారు?"

"కావాలంటే, మా రెండో అల్లుడి తల్లి కూడా మా దగ్గిరే వుండొచ్చు. అందరం కలిసే పని పాటలు చేసుకుంటాం."

"ఆ అబ్బాయి తండ్రి?"

"మీకు తండ్రి లేడు కదా?"

"నా సంగతి ఎందుకండీ? నాకు తండ్రి లేడు కానీ అమ్మమ్మ వుంది. అమ్మమ్మ నేం చెయ్యాలి?"

"అందరికీ ఒక చోట ఎలా వీలవుతుంది? ఓల్డ్ హోమ్‌లు వున్నాయి?"

రాంబాబుకి ఆ రోజు ఎక్కువ భయం వేసింది. నో బార్, నో బార్ అన్నారని అందులో చిక్కుకు పోతానేమోనని. అత్తగారి రెండు కళ్ళ సిద్ధాంతానికి బలైపోకుండా ఒక్క పదహారు నిమిషాల్లో బైటపడ్డాడు, అమ్మాయితో మాట్లాడకుండానే!

ఆ తర్వాత కవిత సంగతి :

దాదాపు నచ్చినట్టే అనిపించింది. చదువూ సంధ్యా ఉద్యోగం వున్నాయి. పొందిగ్గా మాట్లాడింది. ఇంగ్లీషు గుప్పించలేదు. అయితే, ఆమె, పెళ్ళయ్యాక అత్తగారింటికి రాదు. ఇతనే వెళ్ళాలి. న్యాయమే. ఎవరికి వీలైతే వాళ్ళు మారవచ్చు. అయితే, అక్కడికి మారినా, అక్కడ ఉద్యోగం చెయ్యడానికి లేదు. వాళ్ళకి, కొన్ని ఖాళీ స్థలాలూ, నాలుగైదు అపార్టుమెంట్లూ వున్నాయి. వాటి చుట్టూ తిరిగి అద్దెలు వసూలు చేస్తూ, వాటి రిపేర్లూ, కంప్లయింట్లూ చూస్తూ, అదే ఉద్యోగం!

ఆ అమ్మాయి తమ ఆస్తులన్నీ చెప్పి, "ఉద్యోగంలో ఏం భద్రత వుంది? అది లేకుండా బతికే మార్గం మంచిది కదా? స్వతంత్రంగా బ్రతకొచ్చు. మీ జవాబులు రికార్డ్ చేశాం లెండి" అంది.

"ఎందుకూ?"

"ఏమో, రేపు మీరు మాట మారిస్తే?"

"అంటే, రేపు కేసు పెట్టాలనా? నమ్మకం లేని వాళ్ళతో ఇంకా సంబంధం ఎందుకు?"

"మా జాగ్రత్త మాదీ!"

ఆమె మాట్లాడుతూ వుండగానే ఫోను ఆపేశాడు.

"అమ్మమ్మా! మంచి వార్త చెప్తా నీకు. రెండు సంబంధాలు మంచివి వున్నాయి. ఇద్దరూ నన్ను ఇల్లరికంరమ్మని అడుగుతున్నారు. 'మీ అమ్మని కూడా తీసుకురా, ఇక్కడ పని చేస్తుంది' అంటున్నారు. నేను ఉద్యోగం మానేసి వాళ్ళింట్లో వుండి, వాళ్ళు అద్దెకిచ్చిన ఇళ్ళ చుట్టూ తిరిగి అద్దెలు వసూలు చేస్తూ వుండాలట! బాగుంది కదా? అమ్మా, నేనూ వెళ్తాం. నువ్వెక్కడుంటావు?"

"చాల్లే. నీ పిచ్చి కూతలు. చెప్పు తీసి వాళ్ళ మూతిపళ్ళు రాలగొట్టక, ఆ వెధవల్ని చూసి మురుస్తున్నావా?" అని లేచింది అమ్మమ్మ.

"మరి నాకు పెళ్ళి అవొద్దా?"

"ఏడిసింది, వెధవ పెళ్ళి."

"మరి పెళ్ళీ, పెళ్ళీ అని గోల పెడితే, అలాంటి గాడిదల మొహాలే చూడాలి. ఒక్క అమ్మాయి కూడా తలకాయ వున్నది కనపడ్డం లేదు."

"పోనియ్యి, ఆ మిషన్ని అవతల పారెయ్యి! ఎప్పుడో ఎవరో దొరుకుతార్లే."

"అదీ, ఇప్పుడు నువ్వు నాకు నచ్చావు. అలా అనండి, చంపకండి నన్ను!"

మమత కేసు అన్నిటి కన్నా వింత!

"మీ జీతం ఎంత?" అంది మొదటే.

చెప్పాడు.

"పే స్లిప్పు చూపిస్తారా?" అంది.

"చూపిస్తా" అన్నాడు.

"జీతం లక్షయినా లేకపోతే..." అని నసిగింది.

"మీ జీతం ఎంత మరి?" అన్నాడు.

"నాది తక్కువే లెండి. అది నా బట్టలకే సరిపోతుంది. అందుకే నా హజ్బెండ్ జీతం లక్షయినా వుండాలి."

"కారు వుండాలా?"

"అది చెప్పాలా?"

"స్వంత బిల్డింగు?"

"అదీ చెప్పాలా?"

"ఫామ్ హౌసూ?"

"అన్నీ చెప్పాలా?"

"హెలీకాప్టర్?"

"ఎన్ని చెప్పాలి?"

"దావూద్ ఇబ్రహీం అంటారే, అలాంటి పెద్ద మనిషి ఫోన్ నంబరు తీసుకుని మాట్లాడుకోండి! అది దొరక్కపోతే, ఏ వడ్డీవ్యాపారితోనన్నా! అలాగైతేనే మీకు అన్నీ వస్తాయి మేడమ్!"

"రమణా! కులాలు లేవు అంటారు, మాట్లాడేది కులాలే, జాతకాలు లేవంటారు. మాట్లాడేది జాతకాలే. మాట్లాడేది డబ్బే. మాట్లాడేది అమెరికా మత్తే. మాట్లాడేది నగల కోసమే. కార్లకోసమే. నెట్ తెరిస్తే, గుండె చెరువైపోతోంది!"

"ఆడపిల్లలేనా ఇలా వున్నది? అబ్బాయిలు కూడా ఇంతేనా?

"నాకు ఫొటోలిచ్చి కులాలు అడిగిన వాళ్ళందరూ అలా కాదు? అవన్నీ ఒప్పుకుంటే, తకీమనే కుదురుతుంది సంబంధం."

"రామూ! నా మాట విను! నేనో సంబంధం తీసుకొస్తాను. నోరు మూసుకుని చేసేసుకో!"

"నువ్వు నోరు మూసుకో ముందు!"

రాంబాబు గేటు తీసుకుని ఇంట్లోకి వస్తూ వరండా చివర కూర్చుని చదువుకుంటోన్న మంగని చూశాడు. ఎవరో గేటు తీసినట్టూ, లోపలికి వచ్చినట్టూ కూడా గమనించలేదు మంగ.

రాంబాబు లోపలికి వెళ్ళి బ్యాగు తన గదిలో టేబుల్ మీద పెట్టి, తల్లి ఇచ్చిన కాఫీ తాగుతూ బైటికి వచ్చాడు.

అప్పుడు చూసింది మంగ. "మీరు వచ్చేశారా?" అంది.

"నీ పక్క నించే వెళ్ళాను. గమనించలేదు నువ్వు."

" ఈ పుస్తకం రెండోసారి కూడా అయిందండీ. ఇలాంటి పుస్తకాలు చిన్నప్పుడే చదివితే ఎవరూ కాశీ దారాలు కట్టుకోరు."

"అంటే, నీ అభిప్రాయం ఏమన్నా మారిందా?"

"అయ్యో, తారుమారైంది, తల్లకిందులైంది. రామూ గారూ! బళ్ళో పిల్లందరికీ ఇలా సైన్సు పద్ధతిలో చెప్పాలండీ! పొద్దున్న మా టీచర్లకి ఈ పుస్తకం చూపించి చెప్తే, 'చాల్లే వూరుకో, చాల్లే వూరుకో' అన్నారు. నిజంగానే వూరుకున్నాను."

"ఏదన్నా నవల తీసి చదువుకో ఇవ్వాళ."

"చదువుతాను. అలమారులో పుస్తకాలన్నీ చదివేస్తాను. నేనిక్కడికి రాకపోతే, ఇవన్నీ తెలిసేవి కాదండీ నాకు. ఇక్కడికి రావడం ఎంత మంచిదైందో! నా ఆలోచనలన్నీ మారిపోతున్నాయి. మీతో మాట్లాడుతోంటే ఎన్ని తెలుస్తున్నాయో!"

"ఇప్పుడు పుస్తకాలు నిజంగా నచ్చుతున్నాయా?"

"అయ్యో, నేనిక వెనక్కి నడవను."

"మంగా! ఒక సారిలా రా!" అంటూ అమ్మమ్మ పిలిస్తే, పిలుపు చెవిన పడగానే మంగ అటు పరిగెత్తింది.

రాంబాబు మళ్ళీ కంప్యూటర్ దగ్గిర చేరాడు. రమ్య దొరికింది.

“ఇంటర్వ్యూకి మీ వూరు వస్తున్నాను” అని రాసింది. “ఒక సారి ఏదైనా పార్కులో కలిసి మాట్లాడదాం” అంది.

ఆ అమ్మాయికి తెలుగే రాదు.

తెలుగు పుస్తకమే ముట్టుకోని మనిషితో ఏం మాటలు సాగుతాయి– అనిపించినా, ‘సరే’ అన్నాడు.

తండ్రి ఉద్యోగం వల్ల, ఎక్కువ ప్రాంతాల్లో తిరిగారట. ఇంగ్లీషే కాదు, కన్నడం, తమిళం, కాశ్మీరీ కూడా వచ్చుట. తనతో కాశ్మీరీలో మాట్లాడుతుందేమో– అనుకుంటూ వెళ్ళాడు, ఒకరోజు సాయంత్రం పార్కుకి. మనిషిని చూడగానే, బహిరంగ ప్రదర్శనలు లేని బట్టలతో బాగానే వుంది. జుట్టు కూడా గిరజాల క్రాపు. అదీ బాగుంది. ఫొటోలో వున్నట్టే వుంది. ముఖ్యంగా, షర్టు జేబులో రుమాలు వుంచుకుంది. అది మరీ బాగుంది. చంద్రబింబంలా వుంది మొహం. చక్కని కళ్ళు!

“తెలుగు అస్సలు రాదా? ఫర్వాలేదు, నేర్చుకుంటే ఆర్నెల్లల్లో వచ్చేస్తుంది.”

“ఎందుకూ? తెలుగుతో ఏం అవసరం?”

“అది మీకూ మాతృభాషే కదా?”

“అయినా అది ఎప్పుడో పోయింది”

“తెలుగులో మంచి సాహిత్యం వుంది. అన్ని భాషల్లోనూ వుంటుందనుకోండీ.”

“ఇంగ్లీషు కన్నా ఇతర భాషల్లో ఏం వుంటుంది?”

ఎంత అజ్ఞానం! అయినా ‘పోనీలే, తెలుగు సంగతి తెలీక అలా అంటోంది’ అనిపించింది రాంబాబుకి. “మీ ఇంటర్వ్యూ అయిందా?”

“ఎప్పుడో అయింది. ఇది ఫైనల్, అంతే.”

“ఈ ఊళ్లోనే అయితే, అపార్టుమెంటు తీసుకోవాలా?”

“అదే చూడాలి. కానీ మంచి హాస్టల్ దొరికితే, హాస్టల్ నాకిష్టం. ఇల్లు పెట్టుకుంటే చాలా పనులుంటాయి. పడలేం.”

"వంట రాదా?"

"వంటా? అంటే?"

లేచి పారిపోదాం అనిపించింది రాంబాబుకి. "ఇదో టైపు కాబోలు" అని అలాగే కూర్చున్నాడు.

"ఓహో! కుకింగా? ఐ డోంట్ నో, ఐ కాంట్ డూ (నాకు తెలీదు, చెయ్యలేను). అయినా, వంట న్యూసెన్స్ ఎందుకు? అన్నీ పేకెట్స్ తెచ్చుకుని కొంచెం ఫ్రై చేసుకుంటే అయిపోతుంది. రోజుకి టెన్ మినిట్స్ కన్నా ఎక్కువ పట్టదు."

"రోజుకి పది నిమిషాల వంటా? రోజూ అలాగే అయితే, ఆరోగ్యం మాట?"

"నో ప్రాబ్లెమ్. ఫ్రూట్సూ, విటమిన్సూ, ఎలాగా వాడతాం. రోజూ జిమ్‌కి వెళ్తాను. స్విమ్మింగ్ కూడా. ఇంకేం సమస్య?"

"సరే, వంట పని తప్పుతుంది. అంట్లూ, గదులూ, బట్టలూ, ఆ పనులన్నీ?"

"సర్వెంట్స్ వుండరా? వాషింగ్ మిషనూ, డిష్ వాషరూ, నెలకోసారి గదుల్లో తుడిచే వాక్యూమ్ క్లీనూ, అన్నీ వున్నాయి కదా? తినేటప్పుడు పేపర్ ప్లేట్స్ ఉపయోగిస్తే డస్ట్‌బిన్‌లో పడెయ్యొచ్చు. అంట్ల పనే వుండదు."

"సర్వెంట్ రాకపోతే?"

"వచ్చినప్పుడే చేస్తారు.

"మా ఇంట్లో సర్వెంట్ వుండదు. మా నాన్న పోయాక ఆ పెన్షనే మాకు ఆధారంగా వుండేది. సర్వెంట్‌కి జీతం ఎలా ఇస్తాం? అప్పటి నించి ఇప్పటికీ పనులన్నీ స్వయంగా చేసుకుంటాం. నేను చాలా సార్లు అంట్లు తోమేస్తాను. ఇప్పుడు నా జీతం వున్నా, పని మనిషితో అవసరం వుండదు."

"మీది పూర్ ఫామిలీ కిందకి వస్తుందా?"

కాదనడం ఎందుకు? "అవును, అంతే."

"ఐసీ, నేనలా అనుకోలేదు. నా కసలు ఇంట్లో పని చెయ్యడం నచ్చదు. ఆఫీసులో చేస్తాం, జీతం వస్తుంది, సర్వెంట్స్‌ని పెట్టుకుంటాం"

పని నచ్చదట లేచిన దగ్గిర్నించీ కూర్చోడమే నచ్చుతుంది కావును! ఇక బైల్దేరాలి తను. ఎందుకు ఇంకా దేకుతున్నాడు ఇక్కడ?

"అసలు ఒక మాట అడగలేదు. మీకు, లగ్నాలూ, ముహూర్తాలూ, పూజలూ, దేవుళ్ళ గుళ్ళూ, ఆ అలవాట్లన్నీ వున్నాయా?"

"ఎస్. మనకు అన్నీ ఇచ్చేది దేవుడేగా? గాడ్ గివ్స్ అజ్ ఎవ్విరి థింగ్!"

కట్! ఇదీ గోవిందా అవుతుందని మొదటే అనుమానం. చింత లేదు.

"రమణా! తర్వాతేం జరుగుతుందో గానీ, ఇప్పటికి నా నెట్ అనుభవాలు చెప్పనా? నెట్ సంబంధం కుదరాలంటే, కనీసం లక్ష జీతం వుండాలి. అమెరికా పోయే అవకాశం వుండాలి. ఆ్రలెడీ అమెరికాలో వుంటే మరీ మంచిది. జాతకాలు కంపల్సరీ! గుళ్ళ వెంట తిరుగుళ్ళు కంపల్సరీ! ఇప్పటి అమ్మాయిలకి డబ్బు కుప్పలు కంపల్సరీ! డబ్బు! నగలు! నగలు! డబ్బు! టూర్లు!

రమణా! నేనూ ఒక తప్పు అభి్రపాయంలో పడ్డాను. నెట్ అమ్మాయిలంతా ఎవరు? నెట్‌కి బైటి వాళ్ళే! బైట తిరిగే మన మధ్య వాళ్ళే వాళ్ళంతా! వాళ్ళే నెట్‌లోకి ఎక్కారు. అంతే! లోకం ఇలా వుంది! పెళ్ళి చూపుల్లో షరతులే వుంటాయి గానీ, బుద్ధి ఎక్కడ వుంటుంది? పుట్టి పెరుగుతారు. పిల్లల్ని కంటారు, పెద్దతనంలో పోతారు. అంతే జీవితాలు! చీమలూ దోమలూ కూడా అంతే! కుక్కలూ నక్కలూ కూడా అంతే! ఒక మనుషులుగా బతకడంలో తేడా ఏముంది? ఈ పెళ్ళిళ్ళ నాటకాలెందుకు? ఈ చూపులు, ఇళ్ళల్లో జరిగినా, నెట్టుల్లో జరిగినా, ఒకటే. ఇది బోలుడు మందికి సరిపోవచ్చు గానీ, నాకు దండగ! నా ప్రొఫైల్‌ని తీసి పారేస్తున్నాను నెట్ నించీ!"

"సరే, మోసాలు లేకుండా బైట పడ్డావు. పోనియ్యి! నీకు మంచి సంబంధం నేను చూస్తాలే."

"నోరు మూస్కో మిత్రుడా!"

అమ్మమ్మ దగ్గిర కూర్చుని మంగ, పేపరు చదువుతూ మధ్యలో ఆపింది.

"మామ్మ గారూ! మా బళ్ళో కొందరు టీచర్లకి పిల్లల మీద ధ్యాస వుండదు. తమ పిల్లల్ని గురించే ఆలోచిస్తూ వుంటారు. వాళ్ళేం చంటి పిల్లలుకారు. ఎంసెట్లకో, దేనికో ప్రైవేట్లు చదువుతూ వుంటారు. జయమ్మ గారైతే, 'మా వాడు, ట్యూషన్‌కి వెళ్ళాడో లేదో, వచ్చాడో లేదో' అంటూ వుంటుంది అస్తమానూ. ఆ అబ్బాయి తన చేతుల్తో తను అన్నం తినడు, తల్లే తినిపిస్తుందట! తినేప్పుడు కూడా ఆ కుర్రాడు పాఠాలు చదువుతూనే వుండాలట. బట్టలు వేసుకుంటూ వుంటే, బూట్లు కట్టుకుంటూ వుంటే, ఈవిడే చంచాతో నోట్లో పెడుతూ వుంటుందట! ఆ అబ్బాయే స్వయంగా తినాలంటే ఆ టైములో చదువు లేకుండా పోతుందని ఈవిడికి భయమట! 'అంత శ్రద్ధగా పెంచుకుంటున్నాను నా పిల్లల్ని' అన్నట్టు చెపుతుంది. ఆవిడ, రాత్రుళ్ళు ఆ అబ్బాయి తొందరగా నిద్రపోకుండా, చదువుతూనే వుండాలని ఈవిడ కూడా పక్కన కూర్చుంటుందట! అబ్బ, ఎంత కోపం వస్తుందోనండీ, ఆవిడ మాటలు వింటోంటే, ఆ పిల్లాడికి ఎంత బాధండీ!"

ఆ జయమ్మ చేసే పని అమ్మకీ, అమ్మమ్మకీ కూడా నచ్చలేదు గానీ, "కొడుకు బాగా చదివి పైకి రావాలని ఆవిడ తాపత్రయంలే" అన్నారు.

వాళ్ళు అంత సుతారంగా అనడం మంగకి నచ్చలేదు. మంగ ముఖంలో అశాంతి రాంబాబుకి చాలా గొప్పగా అనిపించింది. మంగని ఇంకా ఇంకా అడిగి, ఆ సంగతులన్నీ మళ్ళీ విన్నాడు.

మంగ చాలా ఉత్సాహంగా, పాత సంగతి మళ్ళీ గుర్తొచ్చినట్టు చెప్పింది.

"కాశీ దారాల నమ్మకం పోయిందని చెప్పానా? మా టీచర్లు ఇప్పటికీ రక రకాలుగా అంటారు. 'అంత గొప్పదానివయ్యావా? మన పండితుల కన్నా ఎక్కువ తెలుసా నీకు? అంటారు. మారితే నచ్చదండీ వాళ్ళకి."

'వాళ్లకి నచ్చడం నీకెందుకు?"

"అబ్బే, నాకు అక్కర్లేదు. కానీ, వినరండీ."

మంగ మీద అమ్మకీ, అమ్మమ్మకీ, మంచి అభిప్రాయం వున్నట్టు, వాళ్ళ మాటల్లో రెండు మూడు సార్లు అర్థమైంది రాంబాబుకి.

అమ్మ అంది ఒకసారి అమ్మమ్మతో.

"ఎంత కుదురైందో ఈ పిల్ల! ఆ మధ్య మా ఆడ బిడ్డ కూతురు వచ్చి కొన్నాళ్ళు వుందిగా? ఇక్కడి పుల్ల తీసి అక్కడ పెట్టదు టీవీకి అంటుకుపోయి వుండేది. నాకు మండిపోయేది".

అమ్మో, ఆ పిల్ల సంగతి చెప్పకు! ఈ పిల్ల కొంచెం రంగు తక్కువ గానీ, చేరెడేసి కళ్ళు! ముచ్చటేస్తుంది చూస్తోంటే" అంది అమ్మమ్మ.

మంగ గురించి వాళ్ళిద్దరూ చెప్పుకునే మాటల్లో కొన్నే గానీ, మాటలన్నీ రాంబాబుకి తెలీవు.

ఈ పిల్ల తక్కువ కులంలో పుట్టింది గానీ, లేకపోతేనా?" అంటుంది అమ్మమ్మ అప్పుడప్పుడూ.

"అవును, నేనూ అలాగే అనుకుంటాను చాలాసార్లు" అంటుంది అమ్మ.

"ఎవడు చేసుకుంటాడో వాళ్ళ కులంలో, అదృష్టవంతుడు. సుఖపడతాడు. వాళ్ళమ్మ బాగా గుణం వున్న మనిషి, తల్లే నేర్పినట్టుంది పిల్లకి" అంటూ వుంటుంది అమ్మమ్మ చాలాసార్లు. అలాంటి మాటలు, ఇంట్లో రామూ లేనప్పుడే.

వాళ్ళ ఆలోచన లేమిటో, ఎందుకలా చెప్పుకుంటారో, వాళ్ళకే తెలీదు!

జయమ్మని గురించి కబుర్లు చెపుతూ కూర్చున్న మంగని చూస్తే అమ్మమ్మకి ముచ్చటేసింది.

మంగ, మొహం వాలేసి, "మామ్మ గారూ, ఒక మాట చెప్పాలండీ ఒక టీచరు గారింట్లో, మేడ మీద ఒక గది ఖాళీ అయిందంట. నాకు ఇస్తామన్నారు. రెండు నెలలయింది కదండీ నేనొచ్చి? రెండు రోజులు పోయాక ఆదివారం వెళ్తానండీ."

పిడుగుపడ్డట్టు అయింది అమ్మకీ, అమ్మమ్మకీ.

"వెళ్తావా? ఎందుకూ, ఎందుకూ?" అన్నారు గాభరా పడిపోతూ, ఇద్దరూ ఒక్కసారే.

"అమ్మమ్మ తొందరగా తేరుకుంది. "వెళ్ళొద్దు. నీ బరువు మేమేం మోస్తున్నాం? ఎక్కడికీ వెళ్ళొద్దు. నీ ఉద్యోగం ఎన్నాళ్ళో అన్నాళ్ళూ ఇక్కడే వుండు!" అంది గబ గబా.

అమ్మ మొహం చేటంతయింది. “అవును రాధా! నువ్వు వెళ్ళొద్దు! నాకు సాయంగా వున్నావు. ఇక్కడే వుండు! పెళ్ళయినప్పుడు వెళ్లిపోదువుగానిలే. అప్పుడెలాగా తప్పదు” అంది నవ్వుతూ.

మంగ తెల్లబోతూ నమ్మలేనట్టు చూసింది.

“కాదండీ. నా దగ్గిర మీరు డబ్బు కూడా తీసుకోరు. ఇక్కడ ఎన్నాళ్ళు తినమంటారు?” అంది.

“డబ్బెందుకూ? నువ్వు పని చేస్తున్నావేమో తింటున్నావు. ఊరికే తింటున్నావా?”

మంగ చప్పున మొహానికి చేతులు అడ్డం పెట్టుకుంది. కళ్ళు తడి అయిపోతోంటే కొంగుతో తుడుచుకుంది.

నిజంగా వుండమంటారా మామ్మగారూ? మిమ్మల్ని ఇబ్బంది పెట్టొద్దన్నాడు మా నాన్న.”

“మాకేం ఇబ్బంది లేదన్నామని మీ నాన్నకి ఉత్తరం రాయి” అని తేల్చి చెప్పేసింది అమ్మమ్మ.

రాంబాబు వచ్చాక, “మంగని మనింట్లోనే వుండి పొమ్మన్నాం” అని చెప్పింది అమ్మమ్మ.

“అవును, ఎక్కడో ఎందుకు? ఇక్కడే వుండనివ్వండి” అంటూ తన గదిలోకి వెళ్ళిపోయాడు.

మంగని ఎప్పుడు చూసినా చేతిలో పుస్తకం లేకుండా కనపడడం లేదు. చదివిన పుస్తకాల గురించి చాలా అడుగుతోంది. మాట్లాడుతోంది.

“రామూ గారూ! పుస్తకాలు రాసే వాళ్ళు చాలా గొప్ప వాళ్ళు కదండీ? ఈ పుస్తకంలో ఒక మంచి కథ వుంది. కట్నాలు తీసుకోకుండా ఒకాయన కొడుక్కి పెళ్ళి చేస్తాడు. ఈ కథ రాసిన రచయిత గారు, నిజంగా తన కొడుక్కి కట్నం తీసుకోకుండా పెళ్ళి చేస్తారాండీ? రాసినట్టే చేస్తారాండీ?”

రాంబాబు ఆశ్చర్యంగా చూశాడు మంగని. చదువుతోంది. మారుతోంది. తెగ ఆలోచిస్తోంది.

"చెప్పలేం. కొందరు, రాసినట్టే చేస్తారు. కొందరు చెయ్యరు."

"చెయ్యరా!" మంగ తెల్లబోయింది – "చెయ్యరాండీ? అయితే రాయడం ఎందుకు?"

"చదివేవాళ్ళని చెయ్యమని."

"పోనీ చదివే వాళ్ళందరూ చేస్తారా?"

"కొందరే చేస్తారు. అందరూ కాదు."

"అందరూ కాదా? మరి చదవడం ఎందుకు?"

రాంబాబు నవ్వాడు.

"నీకు నచ్చేవి నువ్వు నేర్చుకో. ఇంకా చదువు."

"ఇంకా ఏమిటి? చదువుతూనే వుంటాను. కొత్త పుస్తకాలు చేతుల్లోకి తీసుకోకపోతే నా కసలు నిద్రపట్టడం లేదు" అంటూ మంగ, పుస్తకం వేపు తల తిప్పుకుంది.

రాంబాబు మనసులో ఎప్పుడేం జరిగిందో అతనికే తెలీనట్టుగా జరిగింది. నిర్ఘాంతపోతూ ఆలోచించుకున్నాడు. నెల్లాళ్ళు అదే ధ్యాసగా ఆలోచించాడు. 'తొందరపడుతున్నానా?' అనుకున్నాడు. 'తొందర పడకపోవడం బండతనం' అనుకున్నాడు.

ఆ రోజు మంగ స్కూలుకి బైల్దేరుతోంటే, రాంబాబుఆమె చేతికి ఒక పుస్తకం ఇచ్చాడు.

"ఈ పుస్తకం చూడు చాలా బాగుంటుంది. ఎవరికీ ఇవ్వకు. నీ బ్యాగులో జాగ్రత్తగా పెట్టుకో" అన్నాడు.

"ఇంట్లోనే చదువుతాను కదా? మీ టేబుల్ మీద పెట్టి వుంచండి. సాయంత్రం తీసుకుంటాను."

"కాదు, బ్యాగులో పెట్టుకో. బస్సులో అయినా తిరగెయ్యి!"

కాదనలేక తీసుకుంది పుస్తకం. దాన్ని బ్యాగులో పెట్టేసింది. బస్సులో సీటు దొరగ్గానే కూర్చుని, ఆ పుస్తకం తీసింది. పుస్తకం తెరవగానే ఒక కవరు కనపడింది.

'రామూ గారి కవరేదో ఇందులో వుండి పోయిందే' అనుకుంది. దాన్నిచేతిలోకి తీసుకుంటే, 'రాధకి' అని ముత్యాల్లాంటి అక్షరాలు కనపడ్డాయి. గుండె ఆగినంత పనయింది. ఆ సీట్లో మంగపక్కనే ఇటూ అటూ ఆడవాళ్ళు. ఆ కవరు తెరిచే మార్గం లేదు.

స్కూలుకి చేరేప్పటికే ఆలస్యమై పోయింది. క్లాసు నిండా పిల్లలున్నారు. మధ్యాన్నం అన్నాల టైములో జయమ్మ మళ్ళీ మొదలు పెట్టింది కొడుకు గురించి. అతని తలకి నూనె రాసి తల దువ్వడం తనే చేస్తోంటే, ఆ కుర్రాడు పుస్తకం చదువుతూ వుంటాడట! స్నానం ఒక్కటే వాడు సొంతంగా చేసుకుంటాడు. మిగతా కాలంలో, అంగ వైకల్యం వున్న పిల్లాణ్ణి పెంచినట్టు పెంచుతూ అదంతా గొప్పగా చెప్పుకుంటోంది. ఆవిణ్ణి తప్పించుకోవడం మంగకి వీలు కాలేదు.

తన బ్యాగుని భద్రంగా కాపాడుకుంటూ తిరిగింది. ఆ ఉత్తరంలో ఏం ఉందో అని గుండె దడ దడ లాడుతూనే ఉంది.

స్కూలు వదిలేశాక మళ్ళీ బస్సు ఎక్కాల్సిందే. అక్కడా కుదరదు. ఒంటరిగా కూర్చుని చదవాలంటే రాత్రి పడుకునే దాకా ఆగాలి. అంత దాకా గుండె దడని భరించడం సాధ్యం కాదు. ఇంటికి చేరి లోపలికి వెళ్లకుండా నెమ్మదిగా డాబా మీదకి వెళ్ళిపోయింది. బ్యాగు తెరిచి, పుస్తకం తెరిచి, కవరు తెరిచి, ఉత్తరం బైటకి తీసింది. వేళ్ల దగ్గిర్నించే ఒళ్లంతా కంపించడం మొదలైంది. రామూగారు తనకి అంత రహస్యంగా ఉత్తరం ఇవ్వడం ఏమిటని ఆదుర్దా! ఆశ్చర్యం!

ఉత్తరం తెరిచింది.

రాధా!

మూడు నెలలనించీ లేని ఆలోచన నాకు నాలుగో నెల నించే మొదలైంది. ఉయ్యాల్లో బిడ్డని పెట్టుకుని ఊరంతా వెతికే రకం వాడినంటుంది మా అమ్మమ్మ నన్ను. నా కళ్ళ ముందు నిన్ను పెట్టుకుని ఊళ్ళన్నీ వెతికాను.

కానీ నిజం చెప్పాలి. నువ్వు నాలుగు నెలల కిందటి కాశీదారాల రాధవే అయితే, నా మనసు ఇప్పటికీ నీ వేపు తిరిగేది కాదు. నువ్వు మంచి అమ్మాయివి అని అప్పుడు కూడా తెలుసు. నీకు సహాయం చేసే వాళ్ళ కోసం, నువ్వు కూడా

బాధ్యతగా వుండాలనే జ్ఞానం నీకు వుంది. అయినా అది మా అమ్మమ్మని ఆనంద పెట్టగలదు గానీ, అది మాత్రమే నన్ను ఆకర్షించదు.

పుస్తకాలు చదివినా, వాటి నించీ ఏమీ తీసుకోలేని, నేర్చుకోలేని, మార్పులే లేని, రాళ్ళ వంటి మూర్ఖుల్ని చూశాను. నువ్వు ఆ కోవలోకి చేరవు. వెన్నెల తాకితే పుష్పాలు వికసించినట్లు, ఉత్తమ భావాలు అందితే నీ చైతన్యం ఉప్పొంగుతుంది. అభివృద్ధి, నీ లక్షణం! ఎదుగుదల, నీ స్వభావం! అది నాకు తెలిశాక, నేనింకా ఎన్ని దిక్కులు వెతకాలి? ఎందుకోసం వెతకాలి? నేను కోరేది నా సమీపంలోనే వుంది.

కానీ రాధా! ఇప్పటికే నీ మనసు ఏ ఉత్తముడికైనా అంకితమై వుందేమో నాకు తెలీదు. తెలీకే నా విన్నపం. నీ ముందు పెడుతున్నాను. ఏది నిజమో అదే చెప్పు! నీ అంగీకారమో, అనంగీకారమో, స్పష్టంగా చెప్పు! నాకు కావలసింది ప్రేమ! దయ కాదు. నీది అంగీకారం అయితే ఆనందిస్తాను, అనంగీకారం అయితే ఓర్చుకుంటాను. నీ మనసులో ఏది నిజమైతే అదే చెప్పు!

మా అమ్మా, అమ్మమ్మా, నీకు తెలుసు. వాళ్ళు మంచివాళ్ళు, కానీ మూర్ఖులు. 'కులం' అనేది వాళ్ళకి దాటలేని అగాధం! కానీ, ఈ సమస్య వాళ్లది కాదు, నాది. వాళ్ళు నన్ను ఎప్పటికీ తిరస్కరించరు. తిరస్కరించినా, ఆ కారణంగా నేను నిన్ను తిరస్కరించను.

నా మనసు చేసిన ఒత్తిడితోనే నేనీ నిర్ణయానికి వచ్చాను. ఈ ఇంట్లో నీకు ఎటువంటి దూషణలూ, అవమానాలూ, తిరస్కారాలూ, జరగకుండా నేను చూస్తాను మన సంతోషానికి ఏ అభ్యంతరాలూ అడ్డు పడని మార్గం నేను పాటిస్తాను.

నీకు నా మీద విశ్వాసం వుండడం ఒక్కటే చాలదు. దాని కన్నా ముఖ్యం, నీ ఆమోదం, నీ అనురాగం!

నీ జవాబు రాసిన లేఖని, మళ్ళీ పుస్తకంలో పెట్టి, అమ్మమ్మ ముందే నాకు ఇయ్యి! లేదా, నా గదిలో, టేబుల్ మీద పెట్టు!

నేను నీకు రాసిన ఈ ఉత్తరాన్ని నీ దగ్గరే జాగ్రత్తగా వుంచు! నీ నేరం ఏమీ లేదని రుజువు చేసే ఆధారం ఇది. అవసరమైతే, అలా జరుగుతుందని నేననుకోను. ఊహించలేనిదేదో జరిగితే, నా ఉత్తరాన్ని మా అమ్మ ముందు పెట్టు! అదంతా జరిగి తీరుతుందని శంకించకు! నిన్ను అలాంటి స్థితిలో పెట్టను.

నీ జవాబు కోసం ఎదురు చూస్తూ వుండనా రాధా? నీకు వీలు చిక్కకపోతే, చిన్నదే రాయి. అర్థం చేసుకుంటాను నీతో నేను సంతోషంగా బతకగలనని నమ్ముతున్నాను. నీకు కూడా నా మీద ఆ నమ్మకం వుందని నాకు నమ్మకం కలిగించు!

నీ లేఖ కోసం చూస్తూ,

నీ రాము

రాధకి కళ్ళు జల జలా వర్షించాయి.

కాయితాలు కవర్లో పెట్టి, కవర్‌ని పుస్తకంలో పెట్టి, పుస్తకం బ్యాగులో పెట్టి, కిందకి బైల్దేరబోయింది.

మరి జవాబు? ఎప్పుడు?

చప్పున కూర్చుంది. నోట్ బుక్కు తీసి, పెన్ను తీసింది.

రామూ గారూ!

ఈ సాయంత్రం డాబా మీద చదివాను మీ ఉత్తరం. ఇక్కడే ఇది రాస్తున్నాను. రెండు మాటలకన్నా ఎక్కువగా రాసే అవకాశం ఇప్పుడు లేదు నాకు. వెంటనే కిందికి వెళ్ళాలి. డాబా ఎందుకు ఎక్కానో జవాబు చెప్పుకోలేను. నా మనసులో ఇతరులెవరో వున్న పరిస్థితి లేదు. మీ మీద మనసు పెట్టుకునేటంత ధైర్యం నాకు లేదు. నన్ను అర్థం చేసుకోండి. ఇంతకన్నా నేను చెప్పలేను. సంతకం పెట్టడం లేదు. అర్థం చేసుకుంటారు మీరు. రామూ గారూ! ఇంకొక్క సంగతి రాస్తాను. ఒక నిజం చెపుతాను. మొదటినుంచీ మీరు నాకు కొత్త మనిషి లాగ కనపడ్డారు. ప్రతీ సారీ మిమ్మల్ని ఆశ్చర్యపోతూ చూస్తున్నాను. ఒక్కోసారి నిర్ఘాంతపోతూ చూస్తున్నాను. ఈ మనిషితో కలిసి జీవించడం ఎంత ఆనందంగా వుంటుందో కదా అని నా లోపల నేను, నాకే తెలీకుండా, ఎన్ని సార్లు అనుకున్నానో నాకు తెలీదు. కానీ అది నాకు అందని భాగ్యం అని కూడా అనుకుంటున్నది నేనే. కానీ, ఇంకా కొంతకాలం పోతే, మిమ్మల్ని అడగకుండా వుండలేకపోయేదాన్నని ఇప్పుడు అనిపిస్తోంది. ఇంకా చాలా రాయాలని వుంది. నా ఆలోచనలన్నీ చెప్పాలని ఉంది. ఇంత కన్నా ఇప్పుడు చెప్పలేను. ఇప్పుడు నేను మెలకువలో లేననిపిస్తోంది. నిద్రలో నిర్ఘాంతపోతూ వున్నాననిపిస్తోంది. అర్థం చేసుకుంటారు కదూ మీరు."

ఆ కాయితాన్ని అదే పుస్తకంలో పెట్టి చకా చకా కిందకి దిగింది.

లోపలికి వెళ్ళేటప్పటికి అమ్మమ్మ నిద్రపోతోంది. అమ్మ టీవీ చూస్తోంది. మంగ, ఆ పుస్తకం తీసుకు వెళ్ళి రాంబాబు గదిలో టేబుల్ మీద రెండు పుస్తకాల కింద పెట్టి వచ్చేసింది. గుండె దడ అప్పటికి తగ్గింది.

"రాధా! వంటింట్లో టీ వుంది. వెచ్చబెట్టుకుని తాగు" అంది సావిత్రి.

"మంగ వచ్చేసిందా?" అంటూ అమ్మమ్మ లేచింది.

ఇల్లంతా ఎప్పటిలాగే కనపడింది మంగకి. అయినా రోజులా గల గలా మాట్లాడలేకపోయింది.

"మామ్మగారూ, మీకు టీ వొద్దా?"

"కొంచెం తీసుకురా!"

సావిత్రి వేపు చూస్తూ, "మీ కండీ?" అంది.

"మళ్ళీ పెడతావుగా? నాకూ తీసుకురా కొంచెం."

మంగ వంటింట్లోకి వెళ్ళిపోయి, పది నిముషాల్లో రెండు కప్పులు తెచ్చి ఇద్దరికీ ఇచ్చింది. తను తన గ్లాసుతో తెచ్చుకుంది.

తాగడాలయ్యాక, అన్నీ తీసుకుపోయి తోమి, కడిగి, తుడిచి, సర్దేసింది.

రాంబాబు తొందరగా వచ్చేశాడు.

"రాధా! పొద్దున్న నీ కిచ్చానే. ఆ పుస్తకం వుందా నీ బ్యాగులో? ఒకసారి అది కావాలి, నాకు తెచ్చి ఇయ్యి!"

"మీ టేబుల్ మీదే పెట్టేశానండీ! మీకు టీ పెడతాను" అంటూ వంటింట్లోకి వెళ్ళిపోయింది మంగ.

ఒక కప్పు టీ కోసం పావు గంట చేసింది.

రాంబాబు అప్పటికే రాధ జవాబు నాలుగుసార్లు చదివేశాడు. "రాధా! టీ అయిందా? తీసుకురా!" అన్నాడు. మంగే ఇవ్వడం అప్పడప్పుడూ జరిగేదే.

మంగ, టీ కప్పు తీసుకు వెళ్ళి గదిలో టేబుల్ మీద పెట్టి వెంటనే వచ్చేసి మామ్మదగ్గిర కూర్చుంది మౌనంగా.

"ఏంటి మంగా, నీకు వంట్లో బాగోలేదా, వెళ్ళి పడుకో కాస్సేపు"అంది అమ్మమ్మ.

"అవును మామ్మగారూ! తల నెప్పి. కొంచెం పడుకుంటాను. లేచాక తోముతాను. గిన్నెలు. మీరు చెయ్యొద్దండీ" అని సావిత్రితో చెప్పి, తన గదిలోకి వెళ్ళిపోయింది.

రాంబాబు వచ్చి అమ్మమ్మ దగ్గిర కూర్చున్నాడు.

"అమ్మమ్మా! అమ్మా! మీ ఇద్దరికీ ఒక మంచి వార్త చెపుతాను. చెప్పనా?"

"వొద్దులే నాయనా! మమ్మల్ని ఎక్కడికో పంపుతానంటావు. అదేగా వార్త?"

"ఛీ! అలాంటిది నేను చేస్తానా? అవన్నీ వదిలేశాను. ఇప్పుడు ఆ నెట్టే మూసేశానుగా? అలాంటివి కావు. ఇది చాలా మంచి వార్త! ఒక అమ్మాయిని చూశాను. మాట్లాడాను. చదువుకున్న అమ్మాయే. టీచరు ఉద్యోగం చేస్తోంది. ఈ ఊళ్ళోనే."

"మంగ లాగానా?"

"ఆఁ, సరిగ్గా అలాగే, వాళ్ల తండ్రీ వాళ్లు ఏదో పల్లెటూళ్ళో వుంటారు. మన లాగ వాళ్ళూ పేదవాళ్లే..."

"మనం ఏం పేద వాళ్లం? మీ నాన్న కొన్న ఇల్లు వుంది. నీకు ఉద్యోగం వుంది. ఇంత కన్నా ఏం వుండాలి?"

"అయితే సరే, వాళ్ళకీ, ఆ ఊళ్ళో చిన్న ఇల్లు ఉంది. చారెడు పొలం వుంది."

"ఏవిట్లు వాళ్ళు? ఏ కులం? అది చెప్పు!" అంది తల్లి.

"అదే మీకు నచ్చదు. అసలు మన కులాన్ని మనం ఎంచుకుని పుట్టామా? వాళ్ళు మాత్రం కావాలని అందులో పుట్టారా?"

"సరేలే, నీ ఉపన్యాసాలు చాలా సార్లు విన్నా. అసలు సంగతి చెప్పు! ఏం కులం వాళ్ళది?"

"మీకు నచ్చదు అది. అంటరాని కులం అంటారే! ఆ కులమే. ఇప్పుడు ఆ పాత పద్ధతి పోయింది."

"అమ్మో! అలాంటి కులమా! అదే దొరికిందా నీకు? అంత తక్కువ కులమా! అలాంటి పిల్లని పెళ్ళి చేసుకుని ఆ పిల్లతో ఎలా వుంటావు?"

"అ అమ్మాయి చాలా మంచిదమ్మా! మన లాగే వాళ్ళందరూ మనుషులు కారా?"

"మళ్ళీ ఉపన్యాసాలెందుకు? అందరూ మనుషులే. అయితే మాత్రం, కాస్తన్నా పెద్ద కులం వుండొద్దూ?"

"కులం, మతం పుట్టింపులు పెట్టుకోం-అని చెప్పారా లేదా మీరు?"

"చెప్పాం. మాకేం పట్టింపుల్లేవు. మరీ అంటరాని పిల్లే దొరికిందా?"

"అవును, ఆ పిల్లే మంచిది, ఆ పిల్లే దొరికింది".

అమ్మమ్మకి ఏదో తెలివి వెలుగు వెలిగింది.

"అంటరాని పిల్లనే చేసుకోవాలంటే, మన మంగ కన్నా మంచి పిల్లలెవరున్నారు? ముత్యం లాంటి పిల్ల. పోనీ ఈ పిల్లనే చేసుకో. ఇంకో పిల్లెందుకూ?"

రాంబాబు కోపంగా చూశాడు.

"నా కిష్టమైన పిల్లని చేసుకుంటానా, మీరు చెప్పే పిల్లని చేసుకుంటానా? చేసుకునేది మీరా, నేనా?"

"నువ్వేలే గానీ, ఆ పిల్ల నీకే కాదు, మాకూ ఇష్టం అవ్వాలి. అందరం కలిసి వుండొద్దూ? మంచి పిల్లే కావాలంటే, మంగనే చేసుకో! ముత్యం లాంటి పిల్ల!" అంది అమ్మమ్మ మళ్ళీ.

సావిత్రి తెల్లబోయింది.

"అమ్మా! నిజంగా అంటున్నావా? మతి పోయిందా నీకు?"

"ఒప్పుకోకపోతే వాడు పెళ్ళే చేసుకోనంటాడే. అప్పుడేం చేస్తావు? మతిపోలేదు. కొత్తది వచ్చింది.'"

రాంబాబు లేచి నించున్నాడు.

"నాకు నచ్చిన పిల్ల మనింటికి రాత్రి తొమ్మిదింటికి వస్తానంది. అప్పుడుచూపిస్తా. రేపే మేం రిజిస్టరాఫీసుకి వెళ్ళి అప్లై చేస్తాం. ఇంకో నెలకి రిజిస్టరాఫీసులో సంతకాలు పెట్టేస్తాం. అంతే, పెళ్ళి అయిపోయినట్టే. అంతే, అప్పట్నించీ

ఆ అమ్మాయి మనింట్లో వుంటుంది. ఆ అమ్మాయి వచ్చాక కూడా మంగ ఇక్కడే వుండొచ్చు. కొత్తమ్మాయి నా గదిలో వుంటుంది కదా?"

"చూడమ్మా! ఎలా మాట్లాడేస్తున్నాడో! పెద్ద వాళ్ళని అడిగేదీ, పెట్టేది, ఏమన్నా వుందా? అన్నీ తనే నిర్ణయించేసుకున్నాడు" అంటూ కూతురు, తల్లితో మొరపెట్టుకుంది.

రామూ నవ్వాడు.

"పెళ్ళి నాదా, మీదా? అమ్మమ్మదా పెళ్ళి?"

అమ్మమ్మ నీరసంగా నవ్వి, "పెళ్ళి నాది కాదులే, నీదే గానీ, ఆ అమ్మాయి తొమ్మిది గంటలకి ఎక్కణ్ణించి వస్తుంది?"

'వాళ్ళ ఇంటినించి వస్తుంది. ఆఫీసు నుంచి ఇంటికి రావాలి."

"రాత్రి ఇక్కడే వుంటుందా? నీ గదిలో వుంటుందా?" అంది అమ్మమ్మ వెటకారంగా.

"అలా వుండదు. రిజిస్టర్ పెళ్ళి అయిపోయాకే నా గదిలో వుంటుంది. ఏదన్నా చిన్న విందు లాంటిది ఇద్దామా వొద్దా? అది మీ రిద్దరూ నిర్ణయించి చెప్పండి!"

"అది కూడా నువ్వే చేసుకో! నువ్వూ నీ పెళ్ళాం ఆలోచించు కోండి! మీ గొప్ప కులాంతర వివాహంలో మేం వేళ్ళు పెట్టడం ఎందుకూ?" అంది తల్లి నిష్ఠూరంగా.

"సరే, మీరు వేళ్ళు పెట్టకపోతే, అసలు విందులూ గిందులూ ఏం వొద్దు. కానీ విందు వుంటే, వొచ్చిన వాళ్ళందరూ మీ ఇద్దర్నీ తెగ పొగుడుతారు. అభ్యుదయ భావాలతో మీరే కులాంతరం చేశారంటారు. మీరెంత ఏడుస్తున్నారో వాళ్ళకేం తెలుస్తుంది? ఆ పొగడ్తలు మీకు అక్కరలేకపోతే మానెయ్యండి!"

"అదంతా తర్వాత గానీ, ముందు నీ పెళ్ళాన్ని చూపించు! అందంగా వుంటుందా?" అంది అమ్మమ్మ.

"నా కళ్ళకా, మీ కళ్ళకా? మీ కళ్ళకెలా వుంటుందో మీరే చూస్తారుగా? ముందు భోజనాలు కానిద్దాం తొందరగా మంగని కూడా పిలవండి!"

"మంగా, లేచి రామ్మా! అన్నాలు తినేద్దాం. ఎవరో అమ్మాయి వస్తుందట. తొందరగా రా!"

మంగ గబగబా లేచి వచ్చింది. చక చకా టేబుల్ మీద సర్దుళ్ళు చేసింది.

రాంబాబు, తన పళ్ళెంతో  దూరంగా వేరే కుర్చీ మీద కూర్చున్నాడు. ఎవరి మధ్యా మాటలు జరగలేదు.

భోజనాలు ముగిశాయి.

మంగ మొత్తం అంట్లన్నీ తోమి కడిగి తుడిచి సర్దేసింది.

అప్పటికి, తొమ్మిదికి ఇంకా పది నిమిషాలుంది.

రాంబాబు మంగతో, "రాధా! ఆ అమ్మాయి వస్తోందేమో రోడ్డు మీదికి వెళ్ళి చూద్దాం రా! ఇల్లు తెలీక ఎటన్నా వెళ్ళిపోతుంది" అన్నాడు.

ఇద్దరూ రోడ్డు మీదకి వెళ్ళారు.

మంగ, వల వలా ఏడ్చింది.

"నాకు భయంగా ఉందండీ?"

"భయం ఎందుకూ? మంగనే చేసుకోమంటున్నారుగా?"

"విన్నాను. అలా అన్నారు గానీ..."

"రాధా! నిజంచెప్పు! మా అమ్మా వాళ్లు నిన్ను మొదట తక్కువ కులం పిల్లని చూసినట్టు చూశారని నీకు అర్థమైందా

మంగ నవ్వింది.

"అలాగే చూస్తారని మా అమ్మ చెప్తే నమ్మలేదు గానీ, తర్వాత ప్రతీపూటా తెలిసిందండీ. కానీ, ఇప్పుడు అలా చూడడం లేదండీ నిజంగా. నేను వంట చేస్తున్నాను."

"నిజంగా? కానీ, నీతో పని చేయించుకోవాలని అలా మారారేమో!"

"నాతో ఈ 'అండీ' లేమిటి? 'రామూ' అను నన్ను"

"అమ్మో! నాకురాదు."

"వస్తుంది, అలవాటు చేసుకో! అమ్మా వాళ్ళకి నీ గురించి ఇప్పుడే చెప్పాలని ఆతృతగా వుంది నాకు. చెప్పనా, కొన్నాళ్ళు ఆగాలంటావా? నీకు పూర్తిగా ఇష్టమే కదా?"

"ఇదంతా కల కాదా?"

మంగ, చేతులతో మొహం కప్పుకుంది.

రాము, మంగ చేతులు పట్టుకున్నాడు.

"ఊరుకో! పద లోపలికి వెళ్దాం"

లోపల అమ్మా, అమ్మమ్మా, కొయ్యబారి పోయి కూర్చుని గోడ మీద గడియారం వేపు చూస్తున్నారు.

వీధి గుమ్మం దగ్గర్నుంచి రాంబాబు, "అమ్మా, అమ్మమ్మా! ఆ అమ్మాయి వచ్చేసింది. తీసుకొస్తున్నాను" అంటూ మంగని వెంట బెట్టుకుని, మంగ భుజం మీద చెయ్యివేసి, లోపలికి, హాల్లోకి, ప్రవేశించాడు.

అమ్మా, అమ్మమ్మా, ఇద్దరూ ఆతృతగా మంగ భుజాల మీద నించి దూరంగా బైటికి చూపులు సారించారు.

"ఏదీ, ఎవరూ?"

"కనపడ్డం లేదా మీకు? ఈ అమ్మాయే నా భార్య, పేరు మంగా, రాధ! అందంగా వుందా?"

మంగ, అమ్మమ్మ కాళ్ళ మీద పడి దణ్ణం పెట్టింది. తర్వాత అత్తగారి కాళ్ళ మీద పడి అక్కడే కూర్చుండిపోయింది.

"అత్తమ్మగారూ! నేనేమీ అడగలేదు. మీ అబ్బాయిగారే నన్నడిగారు. పొద్దున్నే ఒక ఉత్తరం రాసి, పుస్తకంలో పెట్టి నాకిచ్చారు. జవాబు చెప్పమంటే, చిన్న జవాబు రాశాను. నాకు ధైర్యం లేదని రాశాను. తర్వాత అంతా ఆయనే మీతో మాట్లాడారు."

"అంటే, నువ్వేనా? ఇంకో అమ్మాయి లేదా?"

మంగ కొంచెం నవ్వింది.

రాంబాబు, నూనె సీసా తెచ్చి, అమ్మమ్మ కాళ్ళ దగ్గిర కూర్చున్నాడు. పాదాల మర్దనాకి.

"నన్ను బుట్టలో వేద్దామని నీ ఎత్తులే" అని ఖయ్యిమంది అమ్మమ్మ.

మంగ అత్తమ్మగారు, మంగ వేపు ఇంకా తెల్లబోతూ చిరునవ్వుతో చూస్తూనే వుంది.

# సంఘజీవి

**- తురగా జానకీరాణి**

"**అ**మ్మా! నా పచ్చ  జాకెట్టు కుట్టావుటే?"

"లేదమ్మా! మధ్యాహ్నం భోజనాలయాక కత్తిరిస్తాను"

"అమ్మా మరి. నా పచ్చ జాకెట్టు....

"అదేనమ్మా కుట్టి యిస్తానంటున్నానుగా!"

"అమ్మా, మరే. సాయంత్రం నేను నా పచ్చ జాకెట్టు వేసుకుంటానే కుడతావూ?"

సుబ్బలక్ష్మి యింక అక్కణ్ణుంచి లేచి వెళ్ళిపోయింది. ఎంతసేపు సమాధాన పరిచినా ఈ కస్తూరి దాని ధోరణి అదిమారదు. పోనీ కదా అని ఓపికతో జవాబులు చెబుతోంటే మరీ సాగదీస్తుంది. విసుక్కుంటే ఏడుస్తుంది. అది ఏడుపు మొదలుపెట్టగానే యింటిల్లిపాది పడుకోరు. ఇది ఏడుపు మొదలెట్టిన నాడు యింట్లో ఎవరికీ నిద్రాహారాలుండవు.

రామకృష్ణకి పెళ్ళి నిశ్చయమై నెల దాటింది. మరో పదిహేను రోజుల్లో ముహూర్తం వచ్చేస్తోంది. చీరెలు, నగలు కొనడం, చేయించడం, యింట్లో వూరగాయలు పెట్టడం వీటితో సుబ్బలక్ష్మి సతమతమౌతోంది చీరెలు కొనడానికి దుకాణానికి వెళ్ళిన రోజు. కస్తూరి తనూ వస్తానని తయారైంది.

"నువ్వెందుకే!" అన్నాడు రామకృష్ణ. అది వినక, నీలం నైలాను చీరె కట్టుకుని, రెండు జడలు వేసుకుని వచ్చింది.

చీలమండలపైకి చీరె, ముఖమంతా సున్నంలా వుంది పౌడరు. ఎడమ కంట్లోకి పెట్టిన బొట్టూ చూసి రామకృష్ణ అది రావడానికి ఎంత మాత్రమూ ఒప్పుకోలేదు.

"అమ్మా! నేనూ వస్తా... నాకూ చీరె కావాలీ!" అని మొరాయించింది అది. ఇరవైయేళ్ళు నిండుతున్న పిల్ల మూడేళ్ళ పాపలా కింద కూర్చుని మారాం చేస్తుంటే ఏంచేయాలో పాలుపోలేదు  సుబ్బలక్ష్మమ్మకు. "వద్దమ్మా! అన్నయ్య కోప్పడుతాడు.

నువ్వు యింట్లోనే వుంటే నీకు మంచి చీరె తెస్తా. అన్నయ్య పెళ్ళికి నీకు ఎలాంటి చీరె కావాలో చెప్పు!" అని సుబ్బలక్ష్మి బతిమాలుతుంటే రామకృష్ణ చూశాడు. అది కాదని ఏడుస్తోంది.

"సరేలే అమ్మా, రానీయి. మరి అక్కడ నోరెత్తకుండా, ఏదీ ముట్టుకోకుండా చూడాలి" అని చెప్పాడు. సరేనంది కస్తూరి. అన్నట్లుగానే బుద్ధిగా కూర్చుంది. చివరికి వచ్చేటప్పుడు మాత్రం ఒక పల్చటి బట్ట, తనకి జాకెట్టు కావాలని అంటూనే సర్రున యింత పొడుగు చింపేసింది. అదివంకరగా చిరిగిందని దుకాణం వాడు గోల. అంత ఖరీదూ యిచ్చుకున్నారు.

'అమ్మాయిని ఎవరైనా డాక్టరుకి చూపించకపోయారా' అని ఒకరు పరామర్శ చేశారు. "యాభైమంది డాక్టర్లకి చూపించాం. అన్నీ అయినాయి. మా రాత యిల్లా ఉంది" అని జవాబిచ్చింది సుబ్బలక్ష్మి.

కస్తూరి నవ్వింది ముందు. కాసేపు దిగులుగా చూసింది. బట్ట చింపేసిందని అంతా గందరగోళం పడ్డప్పుడు ఏడిచింది. జుట్టు ముందుకు పీక్కుంది.

## 2

"వరలక్ష్మీ! నాకు కాఫీ యిచ్చేటప్పుడు దానికీ యిచ్చెయ్యమ్మా! వుండలేదు" అన్నది సుబ్బలక్ష్మమ్మ కోడలుతో.

"సరేనండీ. కానీ తాను ఎంత లేపినా లేవదు. కాఫీ యిస్తే అల్లా ఉంచేస్తుంది గానీ త్రాగదండీ" అని చెప్పింది కోడలు.

తనకీ తెలుసు ఆ సంగతి. కానీ ఏం చేస్తుంది. తన చేయి పడిపోయినాక అన్నింటికీ కోడలిమీద ఆధారమే. కాలూ పడిపోయింది రెండేళ్లనాడు. కానీ భగవంతుడి దయవల్ల కాలు వచ్చి ఈడుస్తూ నడువగలుగుతుంది. కాఫీ గ్లాసు పుచ్చుకుని మేడమీదకు వెళ్ళలేదు. కస్తూరి పెట్టే పేచీలు, తిక్కలూ తనకి తెలియదా? వదిన వచ్చిన ఈ నాలుగేళ్ళలో చాలా వరకు అల్లరీ ఆగం తగ్గేయి.

"పోనీ నిద్ర లేపి క్రిందికి రమ్మని నా దగ్గర కూర్చోపెట్టేయి" అన్నది సుబ్బలక్ష్మి. సరే నంది వరలక్ష్మి. పైకి వెళ్ళింది.

కాస్సేపటికి కస్తూరి, "అమ్మా! కాఫీ త్రాగావుటే?" అనుకుంటూ క్రిందికి వచ్చింది. జుట్టు వెనక గుర్రం కుచ్చులా కట్టింది. పెద్ద ఎర్ర బొట్టు జ్యోతిలా పెట్టింది ముఖాన. ఇంత కళగా వున్న ఈ ముఖాన్ని చూసి వెర్రి పిల్ల అని ఎవరనుకో గలరు?

"త్రాగానమ్మా!"

"వదిన నాకు యిప్పుడే యిచ్చింది. రేపట్నించీ క్రిందికి దిగి వచ్చి నీతో త్రాగమంది. పొద్దున్నే నేను మెట్లు దిగలేనే!" అన్నది.

సుబ్బలక్ష్మికి ఏమనాలో తోచలేదు. "వద్దులే. అక్కడికే పట్టుకొస్తుంది. సరే గానీ, ఏదైనా చదువుకోరాదుటే. ఏదో ఒకటి మాట్లాడుతూండకపోతే"

కస్తూరి ఆశ్చర్యపోయినట్లు చూసింది. "నేను ఎక్కడ మాట్లాడుతున్నాను. లేదే! నిన్న రెండు పుస్తకాలు చదివేశా. మరి నా ఎర్ర పరికిణీ పైన ఎంబ్రాయిడరీ డిజైను కుట్టుకుంటున్నాను. అమ్మా నా ఎర్ర పరికిణీకి ఫిల్టు వుంది. పొడుగు చాలడం లేదు అది విప్పి పెట్టవుటే?"

"సరే అల్లాగే, కానీ చూడు కస్తూరీ, నువ్వు యింక పరికిణీలు వేసుకుంటే బాగుండదు."

"అది ఫిల్టు విప్పితే సరిపోతుంది. ఎందుకే పారేయడం. ఫిల్టువిప్పి పెట్టవూ?"

"సరే విప్పుతా గానీ, చూడు కస్తూరీ, నీకు యిరవై నాలుగేళ్ళు కదా యింకా పరికిణీలు ఏమిటి చిన్నపిల్లలాగా?"

కస్తూరి సిగ్గుపడుతూ నవ్వింది. "పెళ్ళీడు వచ్చిందా నాకు?" అన్నది. సుబ్బలక్ష్మి వెంటనే సమాధానం తోచలేదు. సర్ది చెప్పకపోతే గొడవై పోతుందని, గొంతులో వచ్చిన పొరని దగ్గి, సవరించుకుని "ఏదో ఒకటి వచ్చింది. నిన్న ఏం పుస్తకాలు చదివావు?" అన్నది.

"రెండు నవల్సు చదివాను. అమ్మా వదిన అన్ని పుస్తకాలు తెచ్చింది కానీ, నాకు ఒక్కటీ యివ్వదే? ఇమ్మని చెప్పవే!"

"నువ్వు చింపి పాడు చేస్తావని ఇవ్వదు. ఐనా అది ఎందుకు నీకు? ఇంట్లో వున్నవన్నీ నీవేగా!"

కస్తూరి ఇంక మాట్లాడలేదు. పమిట అంచులా పేర్చి వేసుకోసాగింది. ఆ సర్దడం ఎప్పటికీ పూర్తి కాదు. లేచి నిలబడి వెనుకనుంచి పమిట తీసి సర్దుకుంది. కొసలు లాక్కుంది. భుజాలమీద చూసుకుంది.

వరలక్ష్మి వచ్చింది ఈలోగా. ఆమెకి ఈ సింగారం చూస్తే నవ్వొస్తుంది. కానీ నవ్విందంటే పెద్ద రభస అవుతుందని ముఖం ప్రక్కకు తిప్పుకుంటుంది. 'కస్తూరీ! స్నానం చేయకుండానే బొట్టూ, కాటుకా పెట్టుకున్నావేం?" అన్నది.

"మర్చిపోయా" అంటూ గబుక్కున బొట్టు తుడిచేసుకుంది కస్తూరి.

రామకృష్ణ తనకి బొంబాయిలో ఉద్యోగం ఆర్డరు వచ్చిందని చెప్పినప్పటినుంచి చాలా గాభరాగా ఉంది సుబ్బలక్ష్మికి. తన గతేమిటి. కస్తూరి గతేమిటి అని గుబులు వచ్చి కళ్ళ వెంబడి నీళ్ళు పెట్టుకుంది.

"ఎందుకమ్మా దిగులు! ఇక్కడే ఉంటే పెద్ద ఉద్యోగం రమ్మంటే ఎక్కడ వస్తుంది? చిన్నత్తయ్యని తెచ్చి ఇక్కడ వుంచుతా. నేను వస్తోనే వుంటా కదా!" అని మంచం మీదే కూర్చుని రామకృష్ణ చెప్పాడు.

ఇంటర్వ్యూకి వెళ్ళేనాడు తనతో ఈ మాటలు అని వప్పించుకుని వెళ్ళాడు. పొలం మీద అయివేజు రెండువేలూ ఈ తల్లీ కూతుళ్ళే అనుభవించినా అభ్యంతరం చెప్పడు అతను. బొంబాయిలో తనకి వచ్చే జీతం ఆరేడు వందలతో బ్రతుకుతానని చెప్పాడు. ఇంక ఏమిటి లోటు?

అడ్డాలనాడు బిడ్డలు గాని, గడ్డాలు వచ్చాక వాళ్లదారి వాళ్ళు చూసుకోకుండా ఉంటారా అని మనస్సు సమాధాన పర్చుకుందామని చూసింది సుబ్బలక్ష్మి. "ఎప్పుడూ నిన్ను విడిచి పెట్టి ఉండలేదురా! నేనూ వస్తా" అన్నది చివరికి దుఃఖంతో.

రామకృష్ణ తలవంచుకున్నాడు. "అక్కడ యిళ్ళు దొరకవమ్మా! ఒక గదీ, వంటిల్లు దొరకడం బ్రహ్మాండం. నువ్వొస్తే అది వుంటుందా? ఇంతమందీ ఉండేందుకు ఇల్లు దొరుకుతుందా?" అన్నాడు కొంచెం ఆగి. "అమ్మా, యిల్లు పెద్దది వెతికి తర్వాత తీసుకు వెడతాను. సరేనా?" అన్నాడు.

సుబ్బలక్ష్మికి ఏదో చాలా భయంగా వుంది. "మీరు వెడితే అది నన్ను బ్రతకనియ్యదురా" అన్నది వణికే కంఠంతో. రామకృష్ణ దీనికి ఏమీ సమాధానం చెప్పలేదు. నిజమే, కస్తూరితో అమ్మవేగలేదు. కానీ ఏం చేయడం.

"ఐతే ఈ ఉద్యోగం వద్దని వ్రాసేయమంటావా?" అన్నాడు.

అతని కంఠంలో విసుగు, బాధ వినిపించి, సుబ్బలక్ష్మి గతుక్కుమంది. "అల్లా వ్రాయమని ఎల్లాగ అంటానురా? నువ్వు పైకి వెళ్ళే అవకాశం వస్తే వద్దంటానా! నాన్నగారు బతికి వుంటే యిన్ని చిక్కులు వుండేవి కావు". రామకృష్ణ ఉద్యోగం మాట విన్నప్పటి నుంచీ గుండెల్లో పేరుకున్న బిగువంతా ఈమాట అంటుంటే బయటకు వచ్చింది. ఆమె ఏడుస్తోంటే, వరలక్ష్మి లోపల్నించి, కస్తూరి బయట వరండాలోంచి వచ్చారు. కస్తూరి ఏమీ అనకుండా తల్లి ప్రక్కన కూర్చుని ఏడవసాగింది. వరలక్ష్మి విషయం గ్రహించి తలవంచుకుని నిలబడింది.

రామకృష్ణ వెళ్ళి ఉద్యోగంలో జాయినై యిల్లు వెతుక్కున్నాడు. తను భరించగలిగే అద్దెలో ఒక గది, కటకటాల వసారా, వంటిల్లు వుండే యిల్లు దొరికింది. తిరిగి వచ్చి వరలక్ష్మిని, యిద్దరు పిల్లల్నీ తీసుకెళ్ళాడు. ఆమె వెళ్ళేరోజు కస్తూరి చేసిన గొడవకి అంతులేదు. కన్నతల్లి వెడుతోంటే కాళ్ళకి చుట్టుకునే చిన్న పిల్లలా ఏడిచింది. ముందునించీ ఈ పిచ్చిదానితో బాధపడుతున్న వరలక్ష్మి కూడా ఈ దుఃఖం చూసి కళ్ళు తుడుచుకుంది. మళ్ళా వస్తానని ఓదార్చింది. రెండు మూడు నెలల్లో వస్తామని తల్లికి మాట యిచ్చి బయలుదేరారు.

వాళ్ళు వెళ్ళిన వారానికి వుత్తరం వచ్చింది. పెద్ద ఇంటి కోసం ప్రయత్నిస్తున్నామంటూ. ఆ ప్రయత్నం ఏమైందోగానీ, ఆరేడు నెలల వరకు ఆమాటే లేదు. కస్తూరి రోజూ గొడవే. సుబ్బలక్ష్మికి నానాటికీ నీరసం ఎక్కువవుతోంది. ఆమెకి వరసకి ఆడపడుచు. ఏ దిక్కూలేని ఆవిడ కాంతమ్మ వచ్చి యింట్లో వుండి యిద్దరికీ అన్నీ చేసి పెడుతోంది.

కస్తూరి అన్నం తినలేదు ఒక రాత్రి. ఏమిటంటే కాంతమ్మ మధ్యాహ్నం విసుక్కుందిట ఐదుపాయల జడవేయమంటే. రాత్రి ఎనిమిది దాటినా, ఆమె అన్నానికి లేవకపోతే కాంతమ్మ ఎంతసేపో బ్రతిమాలింది. అప్పుడు దువ్వెన తెచ్చి జడవేస్తానంది. ఎంత చెప్పినా వినకపోతే ఆమె వెళ్ళి అన్నం తిని, యిల్లు కడిగేసి వచ్చి పడుకుంది.

కస్తూరి తల్లి పక్కనే కుర్చీ వేసుకుని అందులోనే కునికిపాట్లు పడసాగింది. "కస్తూరీ! నన్ను చంపకే. వెళ్ళి కాస్త అన్నం తినిరా!" అని తల్లి మెల్లగా చెబుతోంటే

వినక కాళ్ళు పైన పెట్టుకొని కూర్చుంది. సుబ్బలక్ష్మికి అసలు లేచే ఓపిక లేదు. అందరూ కడుపునిండా మెక్కి పడుకున్నారు. ఇంత యింట్లో పుట్టిన బిడ్డ అది ఒక్కతీ ఎంగిలి పడలేదంటే సుబ్బలక్ష్మికి కడుపులో దేవినట్లయింది.

"నా తల్లిగాదూ! రేపొద్దున్న నీకు ఏం కావాలంటే అదితెప్పించి పెడతాగా నేను తీసుకెళ్ళి పెరుగు అన్నం కలిపి పెడతా. రా తల్లీ! అని మూలుగుతూ లేచింది సుబ్బలక్ష్మి. కస్తూరి కదలదు, మెదలదు. "నాకు వద్దు" అన్నది.

"నేను చచ్చిపోనుటే నూతిలో దూకి!"అన్నది సుబ్బలక్ష్మి గట్టిగా.

ఈ అలజడికి కాంతమ్మలేచి కూర్చుంది. "ఏం మాటలు వదినా అవి. కాస్త వూరుకుంటే తిక్క తిరిగి వస్తుందని పడుకున్నా. నేను అన్నం పెడతాలే దానికి. నువ్వు పడుకో. "కస్తూరీ, అమ్మని ఏడిపిస్తావుటే!" అని ఆమె శాలువా తీసేసి లేచింది.

కస్తూరి కూచున్నదల్లా చటుక్కున లేచి తల్లి మంచం కింద మంచినీళ్ల గ్లాసు తీసి కాంతమ్మ వేపు విసిరి కొట్టింది. ఆ గ్లాసు ఆమె భుజానికి తగిలి క్రింద పడింది. కాంతమ్మ గూడు పగిలిపోయినట్లయి క్రింద కూలబడింది. పెద్దగామూలుగుతూ ఆమె ఎముక సవరించుకుంటోంటే సుబ్బలక్ష్మి లేచి వెళ్ళింది దగ్గరకి. కస్తూరి తననెవరో కొట్టినట్లు ఏడుపు మొదలుపెట్టింది.

ఈ రభసంతా పూస గుచ్చినట్లు వ్రాసింది రామకృష్ణకి. వచ్చి తీసుకుపొమ్మంది. పెద్ద డాక్టరుకి చూపించమంది. పదిరోజులకి జవాబు వచ్చింది. వరలక్ష్మిని పురిటికి ఆసుపత్రిలో చేర్పించానని. ప్రస్తుతం కదలడానికి వీల్లేదనీ. ఇద్దరు కొడుకుల తర్వాత యిప్పుడు ఒక కూతురు పుట్టింది వరలక్ష్మికి. పెద్దవాడిని కాన్వెంటులో చేర్చారుట.

ఈ ఉత్తరం వచ్చిన నాడు బాగానే వుంది గానీ, మరో వారానికే సుబ్బలక్ష్మి కొత్త సుస్తీ ఒకటి పట్టుకుంది. అది మధ్యలో మగత రావడం, తెలివి రాగానే ఆమె రామకృష్ణ రాలేదని బాధపడేది. ఇట్లాగే కన్ను మూస్తాను. వాడిని రమ్మని వ్రాయమని కాంతమ్మని పోరేది. చూసి చూసి నెల తర్వాత ఒకనాడు కాంతమ్మ టెలిగ్రామ్ ఇచ్చింది.

నాలుగోనాడు ప్రొద్దుటికి అతను దిగాడు. ఇల్లంతా మామూలుగానే వుంది. కస్తూరి బెంచీమీద కూర్చుని బుట్టెడు ముళ్ళగోరింటపూలు ముందుపోసుకుని మాలలు కడుతోంది. సుబ్బలక్ష్మి మంచం మీదవున్నా మూలుగుతూ ఏదో పద్యాలు చదువుకుంటోంది. కాంతమ్మ వంట చేస్తోంది. సామానంతా దింపి, తల్లి దగ్గరకు వెళ్ళి ఎందుకు వైరిచ్చారని అడుగబోయాడు.

"వచ్చావుట్రా! వచ్చావా? ఒక్కడివే వచ్చావా?" అంటూ సుబ్బలక్ష్మి సంబరంగా లేవబోయింది. ఓపిక చాలక పడిపోబోతే పట్టుకున్నాడు రామకృష్ణ.

"అన్నయ్యొచ్చాడేవ్!" అంటూ కస్తూరి పూలు వదిలేసి పరుగెత్తుకొచ్చింది. "అన్నయ్యా! పాపాయేదీ? వదినేదీ?" అంటూ వీధి తలుపు దగ్గరకి, సామాను దగ్గరకి పరుగులెత్తి వస్తున్న చెల్లెల్ని బిత్తరపోయి చూశాడు రామకృష్ణ. అది బాగా చిక్కింది. మెడ దగ్గర ఎముకలు బయటపడ్డాయి."వదినేది? పాపాయేది?" అంటూ మళ్ళీ దగ్గరకు వచ్చి భుజాన చేయి వేస్తున్న ఆమెని వారించి "అల్లా నిలబడి మాట్లాడు. ఏమిటా గొడవ? వదిన, పాపాయి రాలేదు" అన్నాడు.

కొంచెం ఆగి, "అమ్మ కులాసానే వుంది కదా! ఎందుకు వైరిచ్చారు? అసలు సెలవు లేదు నాకు" అన్నాడు కాంతమ్మతో.

"ఈవేళ నయంగా వుంది. ఆ రోజు డాక్టరు లాభం లేదని చెప్పాడు. తెలివి వచ్చినప్పటినుంచీ ఎందుకు వైరిచ్చావని మీ అమ్మ నన్ను సాధిస్తూనే వుంది" అన్నది కాంతమ్మ చిన్నబోయిన ముఖంతో.

"పోనీలే నాయనా. నువు నా కళ్లబడవేమోనని అనుకున్నాను. వచ్చావు" అన్నది సుబ్బలక్ష్మి. ఆమె గొంతు బొంగురుపోయింది. అమ్మ అంత దీనంగా మాట్లాడుతుంటే చూడలేక బొంబాయిలో వరలక్ష్మికి చేసిన వాగ్దానాలు మరువలేక తల వంచుకున్నాడు రామకృష్ణ.

రాత్రి భోజనాలయిన తర్వాత మంచం మీద దుప్పట్లు అవీ సర్దుతోంది కస్తూరి. "మంచినీళ్ళు ఇక్కడ కిటికీలో పెడతాను అన్నయ్యా" అని చెప్పింది.

తెల్లని చీరె కట్టుకుంది. తలలో ఇన్ని పూలు పెట్టుకుంది. కళ్ళనిండా పులుముకున్న కాటుకతో దాని పచ్చని ముఖం మెరుస్తోంది. కుదురుగా కుర్చీలో

కూర్చుంటే ఎంత చక్కగా వుందని ఎవరైనా అనుకుంటారు. భగవంతుడు పెద్ద శాపం పెట్టాడు దానికి. దానికి కాదు తమందరికీ.

ఏదో కులాసాగా నవ్వుకుంటూ అది తిరుగుతోంటే గుండెలు పగిలిపోతాయి. అది ఏడుస్తూ కూలబడితే మనస్సు నీరు కారిపోతుంది.

"అమ్మా!" అని ఏమిటో మెల్లిగా అనుకుని మంచం మీద వెల్లకిలా పడుకున్నాడు రామకృష్ణ.

"నాయనా పిలిచావా?" అన్నది అమ్మ.

"లేదమ్మా!" అని లేచి కూర్చున్నాడతను.

"ఇల్లా ఒక్కసారి వస్తావూ!" అన్నది

లేచి వెళ్ళి ఆమె మంచం ప్రక్కన నేలమీద కూర్చున్నాడు రామకృష్ణ. "వద్దు ఆ కుర్చీ లాక్కుని కూర్చో" అన్నదామె.

అమ్మ తనతో ఏదో చెప్పాలని పిలిచిందని అతనికి తెలుసు. ఆ చెప్పబోయేదేమిటో అతని అంతరంగంలో స్ఫురిస్తూనే ఉంది. 'నన్ను క్షమించు. నన్ను క్షమించు అమ్మా' అని లోలోపల మోకరిల్లి కళ్ళనీళ్ళతో వేడుకుంటున్నాడతను.

"రాముడూ, నేను అట్టే కాలం బ్రతకనురా!" అన్నది అమ్మ. గుండె ఎగసిపడుతోంది లోపల. అమ్మ పెద్దదయింది. రోగిష్టి అయింది. ఓపిక తీరి రాలిపోతుంది అని తెలుసు. కాని ఎంత సులువుగా అంటోంది ఈ మాట.

"అధైర్య పడకూడదమ్మా నువ్వు!" అన్నాడు పొడిగా.

"ధైర్యంగానే వున్నాను. నాకు అధైర్యం ఏమీ లేదు. నన్ను గురించి నాకు ఏ బెంగా లేదు కానీ..." ఆమె మాట మానేసి విడిచిన నిట్టూర్పు ఆ వూపిరిలో బిగబట్టిన ఆవేదన స్పష్టంగా వినిపించాయి రామకృష్ణకి. నీకు ఏమీ బెంగ అక్కర్లేదమ్మా. నేను వున్నానుగా అనగలిగే చెట్టంత కొడుకుని పెంచిపెద్ద చేసిన ఆమె చేతిని పట్టుకున్నాడతను కాని ఆమాట అనలేదు.

"ఏం చేస్తావో చెప్పు రాముడూ! నువ్విపుడు రాకపోతే ఈ ప్రాణి పోకుండా ఎంతో కొట్టుకులాడేది. నువ్విప్పుడు వచ్చావు. నా కడుపు బెంగ తీరింది" అన్నది.

రామకృష్ణ జవాబు చెప్పలేదు.

కాస్సేపటికి 'అదెక్కడుంది?' అన్నదామె.

"సావిట్లో ఉయ్యాల బల్లమీద పడుకుంది" అన్నాడతను ఉయ్యాల గొలుసుల కీచు శబ్దం విని.

ఆమె మళ్ళీ పెద్ద నిట్టూర్పు విడిచింది. "ఉయ్యాలలో పడుకోవలసిన పిల్లే అది. ఎందుకో భగవంతుడు దానికి ఏళ్ళు పెంచుతున్నాడు" అని ఏదో బాధ ఆపుకోలేనట్లు అని, "నాయనా! నాయనా!" అని పెద్దగా మూలిగిందామె. ఆమె ఏడుస్తుంటే రామకృష్ణ ఏమీ అనక అల్లాగే కూర్చున్నాడు.

**3**

"వదినా అన్నం తినవూ?" అని కస్తూరి కంచాలు అన్నీ పెట్టి వచ్చి పిలిచింది.

"తింటాలే! నువ్వూ అన్నయ్యా తినండి" అన్నది వరలక్ష్మి.

ముందు గదిలోకివెళ్ళి అన్నయ్యను పిలిచింది కస్తూరి. "తింటాలే. నువ్వు తినేయి" అన్నాడు.

ఆమె వెళ్ళి కంచంలో అన్నం పెట్టుకుని తినడం మొదలుపెట్టింది. పావుగంటలో తినేసి, కంచంలో చేయి కడుక్కుని, కంచం తీసి సింకులో పడేసి వచ్చింది. ముందు గదిలో సోఫా జరిపి అక్కడ చిన్న జంబుఖానా పరచి పడుకుంది. కాస్సేపు నిశ్శబ్దంగా గడిచాక, "వదినా! వదినా!" అని బిగ్గరగా పిలిచిందామె. "ఏమిటి?" అని వరలక్ష్మి లోపల్నించే అడిగింది.

"వదినా! వదినా!" అని మళ్ళీ బిగ్గరగా అరిచింది కస్తూరి.

'ఏమిటా పిలుపు?" అని కసిరాడు రామకృష్ణ.

"నా పక్క పిన్నులు మర్చిపోయా మన వూళ్ళో. వదిన తెచ్చిందేమో అడుగు" అన్నది కస్తూరి.

"తెలీదని మధ్యాహ్నం చెప్పిందిగా?" అన్నాడతను.

"ఔను.... చెప్పింది" అని పక్కకి తిరిగి పడుకుంది.

రామకృష్ణ చదువుతున్న పుస్తకం మూసేసి, కళ్లమీద చేయి అడ్డు పెట్టుకున్నాడు. నాలుగు నెలలనాడు తను అమ్మ దగ్గర్నుంచి కస్తూరిని తీసుకురావడం తప్పనిసరైంది. తీసుకురాగానే వరలక్ష్మి ఏమీ అనలేదు, కానీ ఆమె కళ్ళల్లో ఒక భయం కనబడింది అతనికి. ఆ భయానికి నాలుగు నెలలనుంచి బలమైన తార్కాణం ఈ రోజు ప్రొద్దున్న వరకు ఏమీ కనబడలేదు.

ప్రొద్దున్న కంపెనీలో పనిచేసే జోగారావుగారు, ఆయన భార్యా వచ్చారు. వాళ్ళకి కాఫీలు అవీ అందించింది కస్తూరి. చటుక్కున ఆమె మోడా లాక్కుని జోగారావు గారి భార్య పక్కన కూర్చుని, "ఏమండీ మీకు పెళ్ళయిందా?" అనడిగింది. ఆమె బిత్తరపోయింది.

"ఈమెని గురించేనా మీరు చెప్పారు?" అని ఇంగ్లీషులో ఆయన రామకృష్ణని అడిగాడు.

లోపల్నించి వరలక్ష్మి కస్తూరిని పిలిచింది మాట తప్పించడం కోసం.

కానీ కస్తూరి "ఏమండీ చెప్పరేం? అయిందా?" అన్నది మళ్ళీ ఆమె. "అయింది" అని జవాబు చెప్పింది.

"నాకు కాలేదు" అని సిగ్గుపడుతూ నవ్వింది కస్తూరి. అన్నవంక, జోగారావుగారి వంకా చూసి మళ్ళీ నవ్వింది.

"పోనీ, పెళ్ళి చేయకూడదూ" అనడిగాడు ఆయన ఇంగ్లీషులో.

"తెలిసి, తెలిసి ఎట్లా చేస్తాం? చేసినా లాభం లేదని చెప్పారు డాక్టరు" అన్నాడు రామకృష్ణ.

"ఏమైనా అల్లరి చేస్తుందా యింకా?" అని ఆమె తెలుగులోనే అడిగింది.

"లేదండి. ఊరికే మాట్లాడించి వేధిస్తుంది. కోపమొస్తే బక్కెట్లతో నీళ్ళు గుమ్మరిస్తుంది"అని చెప్పింది వరలక్ష్మి. తనూ కాఫీ తెచ్చుకుని కూర్చుంది.

తనని గురించే వాళ్లు మాట్లాడుతున్నారని తెలిసినా, చూస్తూ కూర్చుందే కానీ కస్తూరి ఏమీ కల్పించుకోలేదు. అప్పుడు మొదలెట్టింది.

"వదినా! నా పక్కపిన్నులు తెచ్చావా?" అంటూ. లేదే అని ఆమె చెప్పినా మళ్ళీ మళ్ళీ మాటల మధ్యలో అదే ప్రశ్న.

"పోనీ మర్చిపోతే, యిదుగోనమ్మా మర్చిపోతావు మళ్ళీ అని కాంతమ్మత్త యివ్వొద్దూ. ఉంచేసుకుంది కాబోలు" గోడవేపు తిరిగి ఏడవడం మొదలెట్టింది. అతను చాలా యిబ్బంది పడ్డాడు స్నేహితుల ఎదురుగా యిలాగ అవుతోంటే.

"అంతా చిన్నపిల్లల తంతు" అన్నది జోగారావు గారి భార్య జాలిగా.

"అదే చెప్పారు డాక్టర్లు. బ్రెయిన్ ఎదగలేదు మనిషితోపాటు. మళ్ళీ తన పనులన్నీ తనే చేసుకుంటున్నది. ఇంట్లో కూడా బట్టలుతుకుతుంది. కాఫీ కాస్తుంది. కూరలు తరిగిస్తుంది" అని చెప్పింది వరలక్ష్మి. కొంచెం సేపయాక కస్తూరి లేచి అవతలికి వెళ్ళింది. వరలక్ష్మి కూడా వెంట వెళ్ళింది ఏదో పసిగట్టి. రామకృష్ణ ఏమిటని అడిగేలోపు కస్తూరి ఒక బక్కెట్టు నీళ్ళు పట్టుకొచ్చి హాలులో గుమ్మరించేసింది. "నన్ను గురించి అందరికీ చెబుతావూ? పెళ్ళిచేయవూ? పెళ్ళి... చేయవూ?" అంటూ అరుచుకుంటూ బక్కెట్టు పుచ్చుకొని వెళ్ళింది. వాళ్ళు లేచి నిల్చున్నారు. వాళ్ళ చెప్పులు తడిచిపోయాయి. వాళ్ళు జాలిపడి ఆ తర్వాత కాసేపటికి వెళ్ళారు భూమి బ్రద్దలయి తను కృంగిపోతే బాగుండుననిపించింది రామకృష్ణకి.

ఆ తర్వాత ఏమీ జరగనట్టు అది తిరుగుతోంది మధ్యాహ్నం నుంచి. కళ్ళమీద చేయడ్డం దీసి దాని వంక చూశాడు రామకృష్ణ. అప్పుడే నిద్రపోతోంది. వరలక్ష్మి ఏం చేస్తోందో.

లోపలి కెళ్ళాడు. వరలక్ష్మి మధ్యాహ్నం నీళ్ళలో తడిసిన పుస్తకాలు ఆరబెట్టుకుంటోంది. "అన్నం తినవా వరం" అన్నాడు తను. "తిందాము ఇదిగో యివి లోపల పెట్టేసి వస్తాను. నానీ తడిసిన పుస్తకాలు చూస్తే ఏడుస్తాడు" అంటూ ఎలక్ట్రిక్ డ్రయరుతో ఆరబెడుతోందామె.

అతను అక్కడే కూర్చున్నాడు. "చూడు వరం! రేపు వెళ్ళి జోగారావుగారు చెప్పిన హోము చూసి వద్దామా!" అన్నాడు.

"నేను వద్దులెండి. మీరు వెళ్ళి చూసి రండి" అన్నదామె. రామకృష్ణ బాధ దిగమింగి ఆమె వంక చూశాడు. "దాన్నక్కడ చేర్పించుదామంటావా" అన్నాడు. "మీ ఇష్టం అని చెప్పాను కదా!" అన్నది.

పిల్లలకి స్వేచ్ఛ లేదు ఇంట్లో. వరలక్ష్మికి తనకీ ప్రతి క్షణం భయం. ఇంట్లో కస్తూరి ఎవరిని ఏమి చేస్తుందోనని. పెళ్ళయినప్పటినుంచి పూర్తిగా వరలక్ష్మి

చూసుకుంటోంది ఆడబడుచుని. జీవితాంతం యిదొక పెద్ద బండ తగిలిస్తే పెరుగుతున్న ఆమె సంసారం సంగతేంటి?

"చేర్పించేస్తాను. కాని అమ్మ ఏమనుకుంటుంది?" అన్నాడు. ఆమె మాట్లాడలేదు. పుస్తకాలు తుడిచి తువ్వాలుతో అద్దింది.

"ఇంత సంపాదించుకుంటూ చెల్లెల్ని చూడలేకపోయాడా అని అందరూ అంటారు కదూ!" అన్నాడు తను.

ఆమె అతనికి దగ్గరగా కూర్చుని, "అన్నీ మీరే అంటారు. మీ ఇష్టమని చెప్పాను కదా?" అన్నదామె.

"వదినా నా పక్క పిన్నులు తెచ్చుకున్నాను కాదు. జుట్టంతా ముఖాన పడుతోంది చూడు" అని సావిట్లోంచి మళ్ళా కేకలేస్తోంది కస్తూరి. ఇద్దరూ లేచారు. మర్నాడు పొద్దున్న తను ఆ "హోమ్"కి వెళ్ళడం గూర్చి ఒక నిశ్చయానికి వచ్చేశాడు రామకృష్ణ.

అక్కడ నెలకి అరవై రూపాయలు కట్టాలి. అంతా వాళ్ళదే పూచీ. ఒక మాదిరి హోమ్ అది. పిచ్చివాళ్ళూ కాదూ... మంచివాళ్ళూ కాదు.. చాలామంది ఏవో పనులు చేస్తూ, అందర్నీ పలుకరిస్తూ తిరుగుతుంటారు. రేప్రొద్దున్న తొమ్మిదింటికి తీసుకెళ్ళాలి.

"ఊరెడదాం బట్టలు సర్దుకో" అంటే సాయంత్రం అన్నీ చక్కగా సర్దేసుకుంది. తన్ని నమ్మి, విశ్వాసంతో సంబరంగా బట్టలు సర్దుకునేదాన్ని చూసి రామకృష్ణ కళ్ళల్లో నీళ్ళు తిరిగి, అక్కడ నిలబడలేక బాల్కనీలోకి వెళ్ళిపోయాడు. క్రిందికి చూశాడు. ఆరో అంతస్తు మేడమీద నుంచి లోపలి వాటాల్లోకి రోడ్డుమీదకీ ఎన్నిసార్లు నీళ్ళు, చెత్త గుమ్మరించిందో కస్తూరి.

సంఘంలో నలుగురిలో బ్రతుకదగ్గ సంఘజీవి కాదు. అడవిలో వదిలేయడానికి మనస్సులేని అడవి జంతువు కాదు. అంతులేని ప్రేమ అభిమానం దాచుకుని, చంటిపిల్లలా వాటిని విరజిమ్మివేసుకుంటుంది. పిచ్చి ప్రేమతో నొక్కిపెట్టి, ఊపిరాడకుండా కౌగలించుకుంటుంది. భరించడానికి వీలులేని ఆ మనిషిని ఏం చేయటం? ముసలిది కాకపోతే, రోగిష్టి కాకపోతే, ఓపిక ఉంటే, అమ్మ ఆజన్మాంతం చూసుకునేది. స్వార్థంతో క్షుద్రమైపోయిన తను ఏమీ చేయలేదు. భూదేవి లాంటి

వరలక్ష్మిని తను బాధపెట్టలేదు. అమ్మ బ్రతికితే మరో ఏడాది బ్రతుకుతుందేమో. పోనీ ఈ ఏడాదీ ఎల్లాగో గడపటానికి కూడా వీలు లేకుండా నరకం చేస్తోంది కస్తూరి. దినదిన గండం, నిట్టూర్చి లోపలికి వెళ్ళాడు రామకృష్ణ.

ఆదివారం పొద్దున్న దాని బట్టలు బెడ్డింగు అన్నీ బెంచీ మీద పెట్టి లోపలికి వెళ్ళి సూపరింటెండెంటుకి కనబడ్డాడు రామకృష్ణ. వరలక్ష్మి వెంట వెళ్ళింది. పాపాయిని కస్తూరి ఎత్తుకుంది. పేషెంటు ఎక్కడని అడిగి ఆయన ఇవతలికి వచ్చాడు. ఆమెని చూశాక లోపలికి పిలుచుకు వెళ్ళి మెడికో, సోషలు వర్కరుతో ఒక అరగంట సేపు మాట్లాడించాడు. ఆమె లోపల గదిలోకెళ్ళి మాట్లాడుతోంటే బయట సూపరింటెండెంటు దగ్గర కూర్చుని ఎన్నో ప్రశ్నలడిగాడు రామకృష్ణ. ఆయన అన్నివిధాలా ధైర్యం చెప్పాడు.

కస్తూరి బయటకు వచ్చి, అందర్నీ చూసి నవ్వింది. సోషలు వర్కరు వచ్చి తను వ్రాసిన రిపోర్టు సూపరింటెండెంటుకి యిచ్చింది.

'రైలు ఎప్పుడో సాయంత్రంటగా! ఆవిడ చెప్పింది. ఈలోగానాకు ఒక సబ్బు తెచ్చి పెడతావా అన్నయ్యా?" అన్నది. సరేనని తలూపాడు. "వదినని, పాపని దింపేసిరా, పోనీ, ఆవిడ అదే అన్నది" అన్నదామె మళ్ళీ.

అక్కడ వ్రాయవలసినవన్నీ వ్రాస్తోంటే కస్తూరి చూస్తూ కూచుందే కాని ఏమీ అనలేదు. ఏమిటని అడగలేదు.

"నేను వెళ్ళి నీకు సబ్బు తెస్తాను. ఆలస్యమైతే రేపొస్తా,. ఉంటావా? ఇక్కడ ఆవిడ అన్నీ చూపిస్తుంది" అన్నాడు రామకృష్ణ లేచి. ఆమె సరేనని తలూపింది. కుర్చీలో కదలకుండా కూర్చుని కిటికీలోంచి బయటకి చూస్తోందామె, వాళ్లు బయటకి వస్తోంటే కూడా ఆమె తల త్రిప్పలేదు. వరలక్ష్మి ఆమెతో ఏమీ చెప్పలేక యివతలికి వచ్చేసింది. మధ్యాహ్నం రామకృష్ణ ఫోన్ చేస్తే సూపరింటెండెంటు కస్తూరి బాగానే వుందని చెప్పాడు.

**4**

మునిమాపువేళ పాల చెంబు యింట్లో పెట్టి వెడుతూ గొల్లది వచ్చి, "ఎట్లా వుంది అమ్మగోరూ వంట్లో?' అని పలుకరించి, "అబ్బాయి దగ్గరనుంచి కబుర్లు తెలుస్తుండయ్యా?" అనడిగింది.

ఆయాసంతో పడుకోలేక మంచం మీద కూర్చున్న సుబ్బలక్ష్మమ్మ "నిన్నే ఉత్తరం వచ్చింది. దాన్ని పెద్ద డాక్టరుకి చూపించి మందు యిప్పిస్తున్నానని వ్రాశాడు" అన్నదామె. మినుకుమనే సంతృప్తి ఆమె కళ్ళలో వెలిగింది.

రాత్రి భోజనాల దగ్గర వరలక్ష్మి అడిగింది. అమ్మకి ఉత్తరం రాశారా అని, త్రుంచిన రొట్టె నోట్లో పెట్టుకోలేక అల్లాగే వదిలేసి చేతుల్లో తల పట్టుకున్నాడతను. కళ్ళవెంట బొటాబొటా కన్నీళ్ళు కారాయి అతనికి.

పెద్ద ఆవరణంలో వున్న ఆ భవంతిలో, ఒక పెద్ద గదిలో పడుకునుంది కస్తూరి. వెచ్చని దీపం, మెత్తని పక్క, లోటులేని పోషణ. కానీ దాని మనసులో లోపల ఏమి మెదులుతోందో ఎలాగ అతనికి అర్థమౌతుంది? ఎవరికీ అర్థం కాదు. దాని మనస్సు బాధతో మెలికలు తిరుగుతోంటే తనకి ఓదార్చాలని వుంటుంది. ఈ శరీరాన్ని చీల్చుకుని గుండె చేతులు జాచి వెళ్ళి దాన్ని కౌగలించుకోవాలనుంటుంది. ఉపశమనం కలిగించాలనుంటుంది. కానీ, లోతు తెలియనిదాని మనస్సుని చేరుకోవడం ఎట్లా? ఆకాశం లాగ అయోమయంగా వున్న దాని హృదయంలో బాధ ఎక్కడ ఎలా వుందో వెతికి పట్టుకోవడమెలా?

ఊపిరాడక, దారి తోచక అలాగే కూర్చుండిపోయాడు రామకృష్ణ. అమ్మకి చూపించలేక ఆ ముఖాన్ని చేతుల్లో దాచుకుని చిన్నపిల్లాడిలా ఏడిచాడు.

# మారిన కాలం–మారని మనిషి

– పవని నిర్మల ప్రభావతి

"ఈపీడ రేపటితో వదిలిపోతుంది నాకు!" నెత్తిమీదున్న గడ్డి గంప విసురుగా నేలమీద బోర్లా పడేస్తూ అంది శేషమ్మ. వసారాలో మంచం మీద కూర్చునివున్న వెంకటాద్రికి శూలాల్లా తగిలాయిమాటలు.

"ఔనౌను! రేపట్నుంచి గోళ్ళ గిల్లుకుంటూ రాణీలా కూర్చోవచ్చు నువ్వు. నేనేమో ఎముకలు విరిగేలా వూరువూరంతా చుట్టి రావచ్చు!" అన్నాడు భార్యకేసి మిర్రిచూస్తూ.

శేషమ్మ క్షణకాలం దిమ్మెరపోయింది. ఈ వేళప్పుడు భర్త అలా వసారాలో పని లేకుండా కూర్చుని వుంటాడని ఆమె ఊహించలేదు. మాట్లాడకుండా కొడవలి చూరులో దోపి, గడ్డిగంప తేవడం మూలాన మాడుమీద గుంటలా వున్న జుట్టు సరిచేసుకుంటూ గుడిసెలోకి వెళ్ళింది. "ఎట్లాగూ రేపటితో శని వదిలిపోతూనే వుండె. ఈ కాస్సేపు లోపల నేనేదైనా అంటే తెగ వుడుక్కుంటాడు. పోనీ కాసేపు నేనే నోరు మూసుకుంటే సరిపోయె!" అనుకుంటూ బుడ్డి దీపం వెలిగించే ప్రయత్నంలో పడింది.

వెంకటాద్రికి మాత్రం వెర్రికోపం ముంచుకు వస్తోంది. శేషమ్మకీ రోజు పీడగా కన్పిస్తున్న ఆ గుర్రం – ఆ బండీ తనకు మహాలక్ష్మిలా తోస్తాయి ఎల్లవేళలా! రేపటితోఈ గుర్రం బండి తమ కళ్ల ముందు నుంచీ, గుడిసె ముందు నుంచీ వెళ్ళిపోతాయి పీడ వదిలిపోతుందనీ, తనకి గడ్డికోసుకొచ్చే పని తగ్గిపోతుందని మురిసిపోతోందది. కానీ మహాలక్ష్మి కదిలిపోతుందనిపిస్తోంది తనకు.

వెంకటాద్రి లేచి గంపలో గడ్డి గుర్రం ముందు వేశాడు. అది ఆశగా తింటోంది. మెల్లిగా వెన్నంతా నిమిరాడు. ఆ స్పర్శకు ఏళ్ళ తరబడి అలవాటు పడిపోయిన ప్రాణి ఓ విధమైన పరవశత్వంతో క్షణకాలం అలా నిలబడి మెల్లిగా తిరిగి గడ్డి తినేస్తోందది.

మీ అమ్మ నిన్ను కన్నప్పుడు దగ్గరున్నాం నేనూ మా అయ్యా! నీకు "ముత్యాలు" అని ముద్దుగా పేరెట్టింది నేనే! నీకు పచ్చగడ్డి పరకలు కొరకటం నేర్పింది నేనే! నీకు కళ్ళెం తగిలించి బండికి కట్టింది నేనే! .. ఆనాటి నుంచి ఈ నాటివరకూ నువ్వూ – నేనూ ఒక తల్లి పిల్లల్లా (ఛ–ఛ ఒక్క తల్లి పిల్లలు మనుషులౌతే ఎంతగా తన్నుకు చస్తారు? ఆ పోలిక పెట్టడం నాదే తప్పు) స్నేహితుల్లా మెలిగాం. ఈ రోజు నిన్ను అమ్మెయ్యాలంటే నాకెంత బాధగా ఉందో నీకు తెలుసా?"

గుర్రం వెన్ను నిమురుతున్న వెంకటాద్రి చెయ్యి వణికింది. – "తిను – తిను అది ముక్కుతూ మూలుగుతూ ఏడుస్తూ తిడుతూ  తెచ్చిన ఈ గడ్డి – ఆఖరిసారిగా తిను. ఆ తర్వాత రేపట్నుంచీ నీ ఖర్మ ఎలా వుందో? నా ఖర్మ  ఎలా వుంటుందో?"

వెనక్కి వచ్చి వసారాలో మంచం మీద కూర్చున్నాడు వెంకటాద్రి. సంధ్య చీకట్లు బాగా ముసురుకున్నాయి. బుడ్డి దీపం  తెచ్చి వాకిటి గూట్లో పెట్టి  వెళ్ళింది శేషమ్మ. వెంకటాద్రి  చుట్టూరా చీకటిలానే పరచుకుంటున్నాయి ఆలోచనలు. అతగాడి కళ్ళ ముందు తన యవ్వనపు  రోజులు సినిమా రీలులా తిరగడం మొదలెట్టాయి.

అప్పటికి నెల్లూరు ఇంతగా పెరగలేదు. నాలుగు సినిమా హాళ్ళు. ఒక కాలేజీ మాత్రమే వుండేవి. అటు రైలు కట్టకు ఇవతలగానీ, అవతలగాని ఇన్ని ఇళ్ళులేవు! అక్కడా అక్కడా ఒకటి అలా విసరేసినట్లుండేవి ఇన్ని బస్సుల్లేవు! కోవూరుకూ, అల్లూరుకూ, బుచ్చిరెడ్డిపాళెంకీ పడుగుపాడుతూ, రాజు పాలేనికీ మధ్య జోరుగా పరిగెత్తుతుండేవి గుర్రపు బండ్లు. ఎవరో ఒకరో అలా కారున్న మహారాజులు మినహా స్వంత గుర్రపు బండ్లమీదే వెళ్ళేవారు చాలామంది!

వెంకటాద్రికి  పిల్లనిస్తానంటూ వచ్చిన రామయ్య, వెంకటాద్రి వాకిట్లో ఉన్న బండినీ వసారాలో ఓ మూలగా కట్టేసివున్న బలిష్టమైన గుర్రాన్ని చూసి తెగముచ్చటపడిపోయాడు. కాబోయే అల్లుడికంటే.. ఆ "ఆస్తి" చాలా గొప్పగా కనిపించిందతగాడికి. పిల్ల సుఖపడడానికి ఇంతకంటే ఏంకావాలి అనుకున్నాడు. "రాజా" లాటి గుర్రం. బండీ మహారాజులా సంపాదించుకోవచ్చని శేషమ్మ కూడా సంతోషించింది. తన భర్తా కలిగిన వాడేనని సంబరపడింది. దానికితోడు ఓ బిడ్డ తల్లి

అయ్యేవరకూ వెంకటాద్రి శేషమ్మను కాలు కింద పెట్టనివ్వలేదు. సినిమాకు పోవాలన్నా గుర్రపు బండిలోనే. రంగనాయకుల కోవెలకు వెళ్ళాలన్నా గుర్రపు బండలోనే. నెల్లూరంతా తిప్పి చూపించాలన్నా బండే! సంత జరిగినా, తిరణాల జరిగినా తేరుమీద వూరేగే దేవుడిలా వూరేగించేవాడు.

"బాడుగ పోతోంది మావాఁ' ప్రతి చోటికీ బండెందుకూ!" అనేది శేషమ్మ గునుస్తూ!

"నీ కంటే ఎక్కువేటి బాడుగ కాకున్నా సొంత బండీ. సొంత గుర్రం మనిష్టమొచ్చినప్పుడు మనిష్ట ప్రకారం తిరగొచ్చు! రెండు ట్రిప్పులు కోవూరుకో. పడుగుపాడుకో. రాజుపాలేనికో. బుచ్చికో ఏసుకున్నానంటే నాలుగురోజులు మనిద్దరం జలసాగా బండిమీద వూరేగొచ్చు... ఏమంటావ్." అనేవాడు. వెంకటాద్రి గర్వంగా! అసలా వీధిలో చాలామంది ఆడవాళ్ళు ముఖ్యంగా కొత్తకోడళ్ళు శేషమ్మ వైభవం చూసి ఈర్ష్యపడేవాళ్ళు.

అదృష్టమంటే దానిది! చక్కగా ఎక్కడికి వెళ్ళాలన్నా బండి మహారాణిలా!" అనుకొనేవారు శేషమ్మ వినేలా కూడా అనేవారు! ఆ మాటెంతో గర్వంగా మొగుడితో చెప్పుకొనేది శేషమ్మ.

"మనముత్యాలు చల్లగా ఉండాలేగాని మనకేమిటి లోటు?" అనేవాడు వెంకటాద్రి గర్వంగా. ఆ హుషారు కొద్దీ శేషమ్మ, వెంకటాద్రి అటు బండి కట్టుకెళ్ళగానే... ఇటు గడ్డికి పోయేది. ఎటు చూసినా కావలసినంత బీడు.... పచ్చని గడ్డి.. అక్కడక్కడా చిన్నచిన్న మడుగుల్లో గుర్రాలకు నెత్తిమీద పెట్టేందుకు తమాషాగా ఉండే రంగురంగుల పూలు! రెండు గంటలలో నాలుగు గంపల గడ్డీ దోక్కొని నాలుగు పూలు లాక్కొని ఇంటికి రావడం శేషమ్మకు అలవాటైపోయింది. గుర్రం తినంగా మిగిలిన గడ్డిబండిలో మెత్తగా పరచి, ఇంకా మిగిలితే గోనెపట్టలో వేసి, బండి క్రింద వుయ్యాలలా వ్రేలాడదీసి.... "పద ముత్యాలూ" అంటూ గుర్రాన్ని బండికి కట్టి.... 'నీ హస్తవాసి శేషూ! ముత్యాలు రోజుకో వన్నెతో పంచకళ్యాణిలా తయారవుతోంది!" అంటూ భార్యకేసి కన్నుగీటి. బండిలో బోర్లాపడుకొని చెలకోలకొయ్య శబ్దం చెయ్యగానే... పంచకళ్యాణిలానే పరుగుతీస్తుంది ముత్యాలు.... బండికి

ముత్యాలును అలవాటు చేస్తూ కొత్తలో బాగా కూర్చునేవాడు వెంకటాద్రి. "నే పుట్టినప్పట్నుంచీ చూస్తున్నారా ముత్యాలూ! ఈ నెల్లూరు రోడ్డు ఇట్లాగే వున్నాయి! ఎక్కడ గుంటో, ఎక్కడమిట్టో.... నాకే.. నాకేమిటి? ఈ రోడ్లేసిన కాంట్రాక్టర్లకి..... ఆ భగవంతుడికీ కూడా తెలీవు! వర్షమొస్తే చాలు.. ఇక రోడ్లే నదులు... అదుగో ఆ అండర్‌బ్రిడ్జి వుంది చూశావూ... అదో సముద్రమై పోతుంది! ఎక్కడి బండ్లక్కడ "ఆల్టు" అయిపోవలసిందే! కళ్లు మూసుకుని దూకేవు.... అన్యాయంగా ఇద్దరం ఛస్తాం!.... నే చెప్పినట్టిను.... అసలే ఈ రోడ్డు ఇరుకు.. దానికితోడు రెండు వేపులా మురిక్కాలువలు. మురిక్కాలవల మీదికి ఇళ్ళూ... జాగ్రత్తగా పరుగెత్తు!" అంటూ గుర్రానికి అస్తమానం హెచ్చరికలు చేసేవాడు. తెలిసిన వాళ్ళెవరైనా "అదేమిట్రా వెంకటాద్రీ! దానితో కబుర్లు చెబుతావ్! అదేం మనిషా? నీకు మతిపోయిందా?" అంటూ ఎగతాళి చేసే వాళ్ళు కూడాను.

అలాంటప్పుడు వెంకటాద్రి నవ్వేస్తాడు. "అది గుర్రంగా పుట్టింది గానీ, మనిషి కంటే మా బాగా మాట వింటుంది!"

... నిజమే! ఓ రోజు...నెల్లూరు నుంచి బుచ్చి వరకూ బేరం కుదుర్చుకున్నారు ఓ భార్యా, భర్త, భార్య తల్లీనూ తల్లీకూతుళ్ళు ఏనుగుల్లా ఉన్నారు.... ఆ అల్లుడు బొత్తిగా పీనుగులా వున్నాడు! బండిలో వాళ్ళు కూర్చున్నాక... కర్ణుడి రథంలా భూమిలోకీ బండీ గుర్రము దిగిపోతున్నాయనిపించింది. వెంకటాద్రికి... "బరువెక్కువైంది!" అంటూ గొణుక్కుంటుంటే... ఎక్కుడూ, దిగుడూవచ్చిన చోటల్లా, తుండల్లా వున్న తల్లీకూతుళ్ళు అలాగే కూర్చుని, చీపురుపుల్ల లాటి అల్లుణ్ణి మాత్రం దింపేశారు.... బండి విరుగుతుందని. అలాటి ఎందరినో అవలీలగా లాక్కువెళ్ళటం అలవాటయి పోయింది ముత్యాలుకు. రోడ్లకు ఎక్కడ గతుకులు వున్నాయో వర్షాకాలమైనా కనిపెట్టే మెలకువ వచ్చేసింది! ఎందరో పెళ్ళివారు, మరెందరో కొత్త దంపతులు. ఎందరో రోగులు.... ఎంతెంత దూరమో ప్రయాణించేవారు. ఓ అమ్మాయి... బాగా కలిగినింటి ఆడపడుచు. బండెడు నగలతో బండిలో కూర్చుంది. ట్రంకు రోడ్డు దాటేసరికి ఓ కుర్రాడు వచ్చి కలిశాడు స్టేషన్‌కు తీసుకెళ్ళమని చెప్పాడు... త్రోవ పొడుగునా ఇద్దరూ మదరాసు వెళ్ళిపోవాలని... పెళ్ళాడాలనీ... ఏదేదో మాట్లాడుకుంటున్నారు.. వెంకటాద్రికి అర్థమైపోయింది అసలు సంగతి. ఆ అమ్మాయి

తండ్రిపేరు కూడా తెలిసిపోయింది వాళ్ళిద్దరి మాటలలో. స్టేషనులో ఇద్దరూ దిగగానే.. వెంకటాద్రి వాళ్ళ వెనకాలే వెళ్లాడు.... మద్రాసుకు వెళ్ళే బండి ఓ గంట లేటుందని తెలిసింది. గబగబా స్టేషను మాష్టారు దగ్గరకెళ్ళి రహస్యంగా అసలు సంగతి చెప్పి, ఎలాగైనా తను తిరిగివచ్చేవరకూ వాళ్ళని ఓ కంట కనిపెట్టమని చెప్పి బండిలో వచ్చిపడ్డాడు!... "ముత్యాలూ పదరా అవతల కొంపమునిగిపోతోంది! అయినింటి ఆడపిల్ల... కళ్ళకు గంతలు కట్టిన గుర్రప్పిల్లలా ఎగిరిపడుతోంది. ఏది గుంటో, ఏది మిట్టో తెలియనంత దూకుడుగా దూసుకుపోతోంది. ఆ కుర్ర వెధవ.... షోకీలా వెధవ.... ఆ పిల్ల నగలు కాజేస్తాడు... నాశనం చేస్తాడు.. మనిద్దరం వుండగా... అలాటి ఘోరం జరగనివ్వకూడదు. .. పద పద..." అతగాడి భాష, బాధ! ముత్యాలుకు అర్థమైందిలా వుంది.... గాలిలో తేలిపోతున్నట్టు పరిగెత్తింది. ఆ అమ్మాయి తండ్రి... కబురు తెలిసి అదిరిపోయాడు. ఇంటిల్లపాదీ గాభరా పడిపోయారు. కారున్న సంగతే మరిచిపోయి.. బండిలోకి దూకాడు. ఆ తండ్రి కంగారులో.. బండి ఫర్లాంగు సాగాక... "అరె కారులో పోవలసింది! ట్రెయిన్ వస్తుందో ఏమిటో!" అంటూ బాధపడ్డాడు. "గాభరా పడకండి బాబూ! కారుకంటే తొందరగా తీసుకుపోతుంది మా ముత్యాలు స్టేషనుమాస్టారుకి చెప్పొచ్చానుగా!" అంటూనే స్టేషన్‌కు... నిజంగానే కారంతా వేగంగానే చేరుకుంది బండి! పిల్ల తండ్రిని చూచి కుర్రవాడు జారుకున్నాడు... అమ్మాయి కుక్కినపేనులా వచ్చేసింది తండ్రి వెంట!.... ఆ తర్వాత ఓ సంవత్సరం జరిగాక కాబోలు! ఓసారి వాళ్ళ కారు చెడిపోతే ఆ అమ్మాయి ఆమె భర్త వెంకటాద్రి బండిలో సినిమాకు వెళుతూ సరసాలాడుకుంటుంటే వెంకటాద్రి నవ్వుకున్నాడు... "విన్నావా ముత్యాలూ! ఈ పిల్లే– ఆ వెధవెవడితోనో లేచిపోయి.... ఇంచక్కటి బ్రతుకునీ బుగ్గిపాలు చేసుకుందారోజు! ఇవాళ చూడు... నన్నూ నిన్నూ గుర్తుబట్టలేదు! పోనీలే ఓ మంచి పని చేశాం కదూ!" వెంకటాద్రి మూగభాష ముత్యాలుకు అర్థమైనట్లు... చిన్నగా సకిలించింది.

పదేళ్ళు గిర్రున తిరిగాయి.

సినిమాహాళ్ళు పన్నెండు అయినాయి! ఇంటిమీద ఇల్లుగా ఇళ్ళు వెలసిపోయాయి! రోడ్లపక్కనున్న మురుగు కాలవలు మరింత మందంగా. .. మరింత కంపుకొడుతూ ప్రవహిస్తున్నాయి... రోడ్లు మరికాస్త ఇరుకుగా,ఇంకా ఎగుడు దిగుడులుగా..

తయారయ్యాయి. ఆడపిల్లల కాలేజీ వెలిసింది. వీధికి పది ఆస్పత్రులూ పదిహేనుమంది డాక్టర్లూ మొలుచుకు వచ్చారు. హోటళ్ళూ, లాడ్జీలు.... బ్రోతల్ హౌస్‌లూ....

సైకిల్ రిక్షాలు వచ్చేశాయి! బస్సులు, టౌన్‌బస్సులూ వచ్చేశాయి!

శేషమ్మ ఐదుగురు పిల్లల తల్లయింది! ఇంతక్రితం పచ్చిక బయళ్ళు లేవు... అక్కడంతా ఇళ్ళూ... ఆఫీసులూ... కొత్త కొత్త... 'నగర్''లూ వెలిసిపోయాయి! గుర్రప్పూలు కూడా అట్టేలేవు. రెండుగంటలు పోయేలా డోకుడు పారతో. కొడవలితో నేల చెక్కినా గంపతో గంపెడు గడ్డి పోగవటం లేదు. పచ్చిగడ్డి చిన్న మూట రూపాయి నుంచి రూపాయిన్నర ధర పలుకుతోంది! తిండి గింజలే దొరక్కుంటే, ఇక గుర్రానికి వులవలెలా వస్తాయి రోజూ!

వెంకటాద్రిని ఇవేమీ కదిలించలేదు.

"వూరికే బాధపడక శేషూ! రోజులన్నీ ఇట్లాగే వుండవులే! మంచి బాడుగలే వస్తాయిలే! గుర్రానికీ, మనకూ కావలసినంత దాణా దొరుకుతోందిలే!" అన్నాడు అనంతమైన విశ్వాసంతో!

కానీ... వెంకటాద్రికి ఆత్మవిశ్వాసం ఒక్కటీ అన్నం పెట్టడం లేదు! రిక్షాల జోరు హెచ్చింది..

"ముప్పావలా ఇస్తాను. వస్తేరా! రాకుంటే వెళ్లు... ముప్పావలా పారేస్తే.... మూడు మైళ్ళు వెళ్ళొచ్చు రిక్షాలో!" అంటూ .. తను ఆలోచించి ఏ సంగతీ చెప్పేలోగానే, రిక్షాలో కూర్చుని వెళ్ళి పోతున్నారు జనం.

"బాబూ! రిక్షాలో కూర్చోండి! ఎట్లాంటి చుక్క కావాలంటే అట్లాంటి చుక్క కాడికి తీసుకుపోతాపో! ఏ లాడ్జికి కావాలంటే ఆ లాడ్జికి తీసుకుపోతా!"అంటూ గుసగుసలుగా చెప్పి గాలం వేస్తున్నారు కొందరు రిక్షావాళ్ళు! ఏకంగా కన్నె పిల్లల్నీ పడుచుకుర్రాళ్ళనీ రిక్షాలలో కూర్చోపెట్టాక తెర అడ్డం వేసి.. ఏకాంత ప్రదేశాలకి తరలిస్తుండటం పరిపాటయిపోయింది!

"బండి కడతావా అబ్బీ!" అన్నారో పడుచు జంట.

"కడతాను బాబూ! ఎక్కడికెళ్ళాలి?" అన్నాడు వెంకటాద్రి.

కుర్రాడు కొంటెగా, ఆ అమ్మాయికేసి చూసి కన్నుగొట్టాడు. అమ్మాయి.. అంగీకార సూచకంగా చిరునవ్వు నవ్వి వూరుకుంది! ఆ అమ్మాయి... కాలేజీలో చదువుతున్న పిల్ల! పెళ్ళిగాని పిల్ల..! వెంకటాద్రి గుండె క్షణకాలం గుబగుబలాడింది. ‘దర్గామిట్ట దాటి.... ” ఆ కుర్రాడేదో చెప్పబోయాడు.

“నాకు వేరే బేరముందిలే బాబూ! ఇట్లాంటి పనులకు నే రాను!” అనేశాడు వెంకటాద్రి రోషంగా.

ఆ కుర్రాడు క్షణకాలం ముఖం గంటు పెట్టుకున్నాడు. ఆ అమ్మాయి ముఖం చిట్లించుకుంది.

“ఆ ఏడుపేందో ముందే ఏడవలేకపోయావ్? ఓ పావలా ఎక్కువ పారెయ్యమంటే పారెయ్యనూ?” అన్నారు కుర్రాడు ధుమధుమలాడుతూ!

‘పావలా కాదు.... పది రూపాయలు పారేసినా రాను... ఇట్లాంటి యవ్వారాలకుకాదు. నా బండి గుర్రం... నేనూ” తెగేసి చెప్పాడు వెంకటాద్రి.

“అతగాడితో మనకేమిటి... ఓ రిక్షా చూడు వెడదాం!” అని కాబోలు ఇంగ్లీషులో అంటోందా పిల్ల.

“తెగపడ్డ ఆడపిల్ల! బాప్‌రే! కాలం! చూడరా ముత్యాలు! ” అన్నాడు వెంకటాద్రి.

చూస్తుండగానే ఆ ఇద్దరూ ఓ రిక్షాలో కూర్చుని తెర అడ్డువేసుకుని తుర్రున ఎగిరిపోయారు.

“ఇది మరీ బావుంది! మనకెందుకు! ఎవరెట్లాంటి వాళ్లయితే? ఎంతకో అంతకు బాడుగకు పోవాలి గానీ ఇట్లాంటి నియమాలు మనకు కూడు పెడతాయా?” అంటూ తిట్టిపోసింది శేషమ్మ ఆ సంగతి చెబితే మెచ్చుకుంటుందని ఆశించిన వెంకటాద్రిని.

అసలీ మధ్య శేషమ్మ కూడా మారిపోయింది! ఒకప్పుడు గర్వకారణంగా వున్న గుర్రమూ, బండీ గుదిబండల్లా వున్నాయి ఆమెకు! తమ వీధిలో ముప్పాతిక మంది మగవాళ్ళు.... తలకో రిక్షా బాడుగకు తెచ్చుకున్నారు.

అప్పుడప్పుడు కొందరు మగవాళ్ళు సరదాగా తమ పెళ్ళాల్ని రిక్షాలో సినిమాకీ షికారుకీ తీసుకుపోతున్నారు కూడాను! రోజుకుమూడు నాలుగు రూపాయలు సంపాదించుకొస్తున్నారట బాడుగ పోను! ఇదెంత హాయిగా ఉంది! ఆ సైకిలుకి పచ్చి గడ్డి పనిలేదు.... కుడితి నీళ్లక్కర్లేదు. వులవలు అవసరంలేదు. ఎప్పుడైనా కాస్తంత ఆయిలూ, గాలీచాలు! చెయినో ఏదో చెడితే వేసుకోవడం! శేషమ్మ ఆలోచనలు సరికొత్త దారిలో పడ్డాయి!

ఈ వెధవ గుర్రాన్నీ బండినీ అమ్మిపారేసి, తామూ ఓ రిక్షా తీసుకుంటే తనకీ గడ్డి తెచ్చే కష్టం తప్పుతుంది.. తనమొగుడి సరివారిలో గొప్పగా రిక్షా తొక్కుతాడు. తన పిల్లలకూ తిన్నంత తిండి! పైపెచ్చు తను సొంత రిక్షాదారుడి భార్యా!

మొన్నను ఆ సుబ్బులుమొగుడు.. ఎవరో ఓ మారాజుని... ఓ అమ్మాయినీ.. అట్లా నాలుగు ఫర్లాంగులు తీసికెళ్ళి వదిలేసి వస్తే పదిరూపాయలు ఈనామిచ్చాడట. మహానుభావుడు. అసలు రాత్రిళ్ళు "ఖాతా"లలోనే ఎక్కువ ముట్టుతుందట. సుబ్బులు మొగుడికి! ఈ మధ్య దానికో బంగారు గొలుసు కూడా చేయించాడు వాడు.

తన మాంవ పిచ్చిగానీ తనొక్కడూ మడికట్టుక్కూర్చుంటే కాలం ఆగుతుందా? అందరూ "ఇట్లాంటి" బాడుగల్లో కావలసినంత సంపాదించుకుంటున్నారు. ఇంకా ఈ కూటికి గుడ్డకు తడుముకునే బ్రతుకెందుకు? రిక్షా కొని తీరాల్సిందే? ఈ పాడు బండిని, గుర్రాన్ని అమ్మి పారేయాల్సిందే!

శేషమ్మ ఆలోచనలు, ఆమె తలలో ఆగక వాగ్రూపంతో బయటపడడానికి ఎక్కువ రోజులు పట్టలేదు. వెంకటాద్రికి బయట ఎంత చికాకుగా ఉందో ఇంట్లోనూ అంతటి అశాంతి తయారయ్యింది.. ముత్యాలు రోజురోజుకూ నీరసించి పోతోంది! బాడుగల్లేవు! సరైన పోషణ లేదు. ఇంట్లో శేషమ్మ ఆదరణ అసలే లేదు. పిల్లల దగ్గర్నుంచి 'రిక్షా, రిక్షా' అన్నపాటే. బండి మోటుగా బండలా కనిపిస్తోంది అందరికీ.

"అది కాదే శేషూ! మీ ఆయనకేం తిక్కా? అందరూ రిక్షా మీద అంతలేసి సంపాదిస్తూంటే, ఈ బండి మెడక్కట్టుక్కూర్చున్నాడు" అంటూ వదినెలూ, అన్నలూ, ఇరుగు పొరుగులూ చివరకు తండ్రి కూడా ఎగతాళి చెయ్యటంతో .. శేషమ్మ తిక్క రేగిపోయింది.

పదిరోజులు క్రితం తెగేసి చెప్పింది.

"నాకు నగలూ నాణ్యాలూ చేయించకుంటేమానె, నాకూ పిల్లలకూ ఇంతకూడయినా పెట్టకుంటే ఏదో చూచుకోవాలి మేము? ఇక గుర్రప్పీనుగే వుండాలో నేనే వుండాలో తేల్చుకో! తలాకాస్త "ఎండ్రిన్" పోసి నేనూ పోసుకుంటా" అనేసింది.

వెంకటాద్రికి ఊపిరి సలపలేదు.

అతగాడి మౌనం ఆసరాగా తీసుకుని శేషమ్మ ఓ "దళారి"ని పట్టుకుని బేరం కూడా కుదిర్చేసింది బండికీ, గుర్రానికీ, అంతేకాదు ఓ కొత్తరిక్షా కొనిపెట్టమని కూడా చెప్పేసింది. అతగాడు రిక్షా ఖరీదు కుదుర్చుకొని వచ్చాడు కూడా!

"అన్నానికి రా!"

దగ్గర్లో వినిపించిన శేషమ్మ గొంతుకతో త్రుళ్ళిపడి కూచున్నాడు వెంకటాద్రి.

గతమంతా చెదిరిపోయింది. శేషమ్మ భూతంలా ఎదుట నిల్చుని ఉంది!

"పద వస్తున్నా"

తెల్లవార్లూ నిద్ర పట్టలేదు వెంకటాద్రికి.

తెల్లగా తెల్లారింది. బండినీ గుర్రాన్నీ కొన్న మనిషి ఎవరో మోతుబరి రైతుకు పాలేరు. వచ్చి కూర్చున్నాడు తోలుకు పోవటానికి.

వాకిట్లో కొత్తరిక్షా వచ్చి నిలిచివుంది. మధ్యవర్తి పోలయ్య కూడా నిల్చుని వున్నాడు.

"ఉండు పోలన్నా! శకునవేళ వచ్చావు ఆ బండిగుర్రం అట్టాదాటనీ.. ఆ డబ్బు నీ చేతిలో ఇట్లా వేస్తాను.... ఇంట్లో అట్టే పెట్టామంటే అదికాస్తా ఖర్చైపోతుంది!" అంటోంది శేషమ్మ సంతోషంగా...

వెంకటాద్రి వులకలేదు పలకలేదు.

బండికి గుర్రాన్ని కట్టిచ్చాడు. చెలకోల ఆ పాలేరు చేతికిచ్చాడు.. ఒక్కసారి గుర్రాన్ని ఆప్యాయంగా నిమిరాడు.

"వెళ్లు ముత్యాలూ! వెళ్ళు! మనిద్దరి నీతి, వేగమూ ఇప్పుడెవరికీ అక్కర్లేదు. నా దగ్గరున్నా ఇక నీకు దిక్కులేని చావే! రిక్షా మోజులో వున్న శేషు ఇక నిన్ను వుట్టినే చంపుతుంది..

అదుగో అక్కడుంది చూడు ఆ రిక్షా! దాని కొత్తచక్రాలూ, ఇనుప కమ్మలూ ఎంత తళతళ మెరుస్తున్నాయో! ఆమెరుపు నాలుగురోజులే! ఆ తర్వాత అవీ తుప్పు పడతాయి! అయినా ఆ తుప్పు పట్టిన చక్రాలే... ఎంత చక్రమో తిప్పుతున్నాయి!

నేనూ అది తొక్కటం నేర్చుకోవాలి. ఆ తెరలు దించాలి. టౌన్‌కుదూరంగా. చాటుమాటుగా ఆపుకోవాలి.... గొందుల్లో సందుల్లో దూరాలి... నీతినీ, అవినీతినీ కలగాపులగంగా కలిపి తొక్కాలి. ఒద్దొద్దు నువ్వు ఇలాటివి చూడలేవు – నీకు అలవాటు లేదు. మేం మనుషులం – అలాటిది మాకు స్వతహాగా లేకున్నా, కాలం నేర్పుతుంది. వెళ్ళు వెళ్ళు! ఆ రైతెవరో బాగా చూచుకుంటే హాయిగా బతుకుతావు. నిన్నూ ఏ సేద్యగాళ్ళకో వప్పజెప్పి స్వారీకి మాత్రం తయారైతే ఇక నీ ఖర్మ... వెళ్ళు...వెళ్ళు...ఇక ఈ కాలంలో మరెప్పుడూ గుర్రంగా పుట్టకు.... ఏ మిషనుగానో పుట్టు, గౌరవంగా వుంటుంది... అసలు మనమే ఈ కాలానికి సరిపోలేమేమో అదుగో! నా పెద్దకొడుకు! చూడు! ఆ రిక్షాని చూస్తూ ఎంతగా సంబరపడిపోతున్నాడో! అవును. మరి కాలం మారింది... ఈ కాలానికి అదే తగిందేమో! వెళ్ళు... వెళ్ళు!" వెంకటాద్రి మూగభాష ముత్యాలుకు అర్థమయింది! తలవిదిల్చింది. బండి కదలిపోయింది. శేషమ్మ సైకిల్ రిక్షాకు ఎర్రనీళ్ళు తిప్పి పోస్తుంది సంబరంగా.

"రిక్షా వాళ్ళు కూడా పస్తులుంటారని తెలిసిన రోజు . ఈ ఎర్రనీళ్ళు మరెవరికి తిప్పుతావే శేషూ?" అనుకున్నాడు వెంకటాద్రి. అతగాడికి అలవిగాని బాధతో బాటు ఆపుకోలేని నవ్వూ ముంచుకొచ్చింది!

# జ్యోతి

**- యద్దనపూడి సులోచనారాణి**

**"శాం**తా! శాంతా!" జ్యోతి గదిలోకి తెల్లకాగితం కోసం వెళ్ళిన విశ్వం ఉన్నట్లుండి బిగ్గరగా పిల్చాడు. పిలవటం కాదు, దాదాపు గావుకేక పెట్టాడని చెప్పొచ్చు.

"వస్తున్నానండీ" అసహజంగా, కోపంగా వున్న పిలుపుకి ఖంగారుపడిన శాంత చేస్తున్న పని వదిలిపెట్టి విశ్వం వున్న గదిలోకి పరుగెత్తుకు వచ్చింది.

"ఏమిటిదంతా? ఈ ఉత్తరాలన్నీ ఎవరు రాసింది? జ్యోతి ఏది?" ఎర్రబడిన నుదుటిమీద నరాలు ఉబ్బగా చేతిలో కొన్ని గులాబిరంగు కాగితాలు పట్టుకుని అన్నాడు విశ్వం.

"ఏమిటివి? నాకేం తెలుసు? జ్యోతి దొడ్లో జడవేసుకుంటోంది" భర్త ఉగ్రరూపం చూచి భయంతో బిగుసుకుపోతూ గబగబా సమాధానం చెప్పింది శాంత.

"ఇక్కడకు రమ్మను!" ఆజ్ఞాపించినట్లుగా అన్నాడు విశ్వం. భర్త మొహంలోకి, అతను గుప్పిట్లో గట్టిగా పట్టుకున్న కాగితాలవైపు పరీక్షగా చూసిన శాంత అక్కడ్నుంచి కదలి వచ్చేసింది.

"మీ అన్నయ్య పిలుస్తున్నారమ్మా" అంది శాంత. దొడ్లో సాయం కాలం నీరెండలో అద్దంలో అందంగా కన్పిస్తున్న ప్రతిబింబాన్ని వివిధ భంగిమల్లో చూచుకుంటూ తల దువ్వుకుంటున్న జ్యోతి వెనక్కు తిరిగి 'నన్నా!" అంది.

"అవును" శాంత యేదో పనిమీద వున్నట్లు అక్కడనుంచి వెళ్ళిపోయింది.

"ఎందుకు?" దువ్వుకుంటున్న దువ్వెన చేత్తో అలాగే పట్టుకొని లోపలికి వచ్చింది జ్యోతి. విశ్వం తన గదిలో లేడు. "నీ గదిలో వున్నారు" అన్నది శాంత ఆడబడుచుని క్రీగంట చూస్తూ.

"నా గదిలోనా? క్షణం సేపు అందంగా ఆర్చిలా వున్న కనుబొమ్మలు మరింత అందంగా వంకర తిరిగాయి.

"ఎందుకన్నయ్యా! పిల్చావట?" తన గదిలోకి రాబోతున్న జ్యోతి గుమ్మంలోనే హఠాత్తుగా ఆగిపోయింది. మొహంలో భయాన్ని సూచించే భావం ఒకటి తళుక్‌మని వెంటనే ఆరిపోయింది.

"తలుపు దగ్గరగా వేసి లోపలికిరా" గుమ్మంలో స్థాణువులా నిలబడిపోయిన చెల్లెల్ని కటువుగా పిల్చాడు విశ్వం. జ్యోతి కదలలేదు. లోపలకు రాలేదు. రెప్పవాల్చడం మర్చిపోయి బొమ్మలా అలాగే నిలబడిపోయింది.

"నిన్నే" మరోసారి కోపంగా అన్నాడు. ఆమె మెల్లగా లోపలికివచ్చి తలుపులు దగ్గరకు చేరవేసింది.

"ఏమిటీ ఉత్తరాలు? ఎవరీ సారథీ?" చెల్లెల్ని చూడగానే కొంచెం కోపం చల్లారి కంఠంలో మృదుత్వం తెచ్చి పెట్టుకుంటూ అన్నాడు.

టేబిల్ దగ్గరగా వచ్చి అంచునానుకుని నిలబడిన జ్యోతి అన్నగారి మాటకి సమాధానం చెప్పకుండా చేత్తో టేబిల్ అంచుమీద గీతలు గీస్తూ వుండిపోయింది.

"ఎన్నాళ్ళనుంచి ఇది?"

దానికి జవాబు రాలేదు.

"చెప్పు జ్యోతీ! నానుంచి ఎందుకు దాచావు! ఏ విషయంలోనయినా మనసు విప్పి చెప్పే స్వతంత్రం నా దగ్గర నీకుందనే నేను అనుకుంటున్నాను."

టేబుల్ అంచుమీద గీతలు గీస్తున్న ఆమె కదలలేదు సరికదా, కనీసం కళ్ళు కూడా ఎత్తలేదు.

"చెప్పు! ఏ విషయంలో నేను నిన్ను కాదంటున్నాను? ఈ విషయంలో రహస్యంగా ఎందుకు ఉంచావు? అసలెవరతను?"

చెల్లెలివంక పరీక్షగా చూస్తూ అన్నాడు విశ్వం.

అప్పటికీ మాట్లాడలేదు జ్యోతి.

"చెప్పమ్మా! ఈ వయస్సులో యిలాంటివి జరగటం సహజమే! దానికి సిగ్గుపడాల్సిన సంగతిగాని, భయపడాల్సిన విషయంగాని ఏముంటుంది? ఇలా కూర్చో!" చెల్లెల్ని చెయ్యిపట్టి ప్రక్కనున్న కుర్చీలో కూర్చోపెట్టూ "నాకూ ఓ విధముగా

బాధగానే ఉంది. మీ వదిన ఉత్తమొద్దు అన్న సంగతి నీకు తెలుసు. అమ్మ ఎలాగూ లేదు. నువ్వు మనసు విప్పి చెప్పే వ్యక్తి లేరని నాకు తెలుసు. నే నడుగుతున్నానుగా, నీకంత నచ్చితే అతను అన్నివిధాలా నీకు తగినవాడైతే రేపే నేను వెళ్ళి మాట్లాడ్తాను."

విశ్వం అన్న చివరిమాటకి చురుగ్గా కళ్ళెత్తి చూసింది జ్యోతి

"అవునమ్మా! నీ వివాహ విషయంలో నీకు పూర్తిగా స్వతంత్రం ఉంది. అని నేను చెప్పటం లేదనా? ఎవరితను? మాటవరసకి గూడా నీ నోట ఇతని పేరు వినలేదే నేను."

విశ్వం మృదువుగా మెల్లగా లాలించగా జ్యోతి ఆగి ఆగి చివరకు ఎలాగయితేనేం అంతా చెప్పింది.

సారథి కొత్తగా వచ్చిన బోటనీ లెక్చరరట. క్రొత్త అంటే మరీ స్వల్ప పరిచయం కాదు. వచ్చి ఆర్నెల్లయింది. వచ్చిన రెండునెలల్లోనే పరిచయమై స్నేహంగా మారింది. అతనికి తనంటే చాలా యిష్టం. ఇద్దరూ కలిసి ఒకసారి సినిమాకి, రెండుసార్లు పార్కుకి, అలా కాలేజీ తరపున పిక్నిక్‌కి వెళ్ళారుట.

నిదానంగా నిశ్శబ్దంగా చెపుతున్న చెల్లెలివంక ఊపిరి బిగపట్టి వింటూ ఒక్కొక్కటే అన్ని సంగతులూ తెలుసుకున్నాడు విశ్వం.

అంతా విన్న తర్వాత "అతని సంగతి వదిలెయ్యి, నీ సంగతి చె ప్పు. అతనంటే ఇష్టమేనా?" కళ్ళు క్రిందకి వాల్చుకున్న చెల్లెలి ముఖంలోకి పరీక్షగా చూస్తూ అన్నాడు.

"ఇష్టం లేకపోతే అతనితో సినిమాకు, పార్కులకు ఎందుకు వెళతాను!"జ్యోతిలో ఇందాకటి బెరుకుతనం పోయింది.

"మరి ఇన్నాళ్ళు నాకు తెలియకుండా ఎందుకు దాచావు?"

"దాచింది ఏముంది? ముందు నాకు ఒక అభిప్రాయమంటూ అతని మీద ఏర్పడాలి గదా! రేపు రాబోయే నా పుట్టినరోజు అతన్ని ఇంటికి పిల్చి నీకు పరిచయం చేసిన తర్వాత సంగతి చెప్పాలనుకున్నాను" ఆమె తొణుకు బెణుకు లేకుండా నిశ్చలంగా అంది.

"సరే! రేపు నేను అతన్ని కలుసుకుని మాట్లాడతాను. అడ్రసు తెలుసా?"

తెలుసునన్నట్లు తలూపుతున్న చెల్లెలివైపు అనుమానంగా చూస్తూ “అతడి రూమ్‌కి కూడా వెళ్ళావేమిటి?” అన్నాడు విశ్వం.

“లేదు, రమ్మని చాలాసార్లు అడిగాడు కాని, నేనే వెళ్ళలేదు.”

విశ్వం తేలికగా ఊపిరి విడిచాడు. “ఈ సంగతి కాలేజీలో ఎవరికైనా తెలుసా?”

తెలియదన్నట్లు తలూపింది జ్యోతి.

“సరే కానీ, ఒక సంగతి గుర్తుంచుకో. అతను నాకు ఏమాత్రం నచ్చకపోయినా...”

“లేదన్నయ్యా! నీకు తప్పకుండా నచ్చుతారు.

అన్నగారి మాటలు ఖండిస్తూ దృఢంగా అంది జ్యోతి.

విశ్వానికి  యేం మాట్లాడాలో తోచలేదు. గదిలోంచి వచ్చేసేముందు ఉత్తరాలు చెల్లెలుకిచ్చేసి “ఇవి ముందు జాగ్రత్తగా ఉంచు” అని చెప్పి ఇవతలకు వచ్చేశాడు.

అన్నగారు గదిలోంచి వెళ్ళిపోవడంతో జ్యోతికి ప్రాణం నిల్చినట్లయింది. తను నెలరోజులనుంచి ఎలా చెప్పాలా అని సతమతమౌతున్న సమస్య ఇంత సులభంగా పరిష్కారం అవుతుందని కల్లో కూడా అనుకోలేదు. ఫర్వాలేదు అన్నయ్య  తన మాటని కాదనడు. సారధి అన్నయ్యకి నచ్చకుండా ఉండదు. ఒకవేళ డబ్బు, హోదా ఇలాంటి విషయాల్లో అన్నయ్య సాకు చెప్పినా తను గట్టిగా పట్టుబడితే సరి. కూర్చున్న చోటు నుంచి లేచి వచ్చి కిటికీకి దగ్గరగా నిలబడింది. బయట ఆకాశంలో అప్పుడే పైకి వస్తున్న చంద్రుడు తనని చూసి చిరునవ్వు నవ్వినట్లయింది. రోజూ వీచే  చల్లటిగాలే ఇవ్వాళ కొత్తగాతోస్తోంది.

ఎంత బావుందీ ప్రపంచం! అదృష్టవంతులకు అనుకున్నవన్నీ లభిస్తాయి కాబోలు.

తను చిన్నప్పటినుంచి అదృష్టవంతురాలుగానే పరిగణింపబడ్తోంది. చాలామంది అన్నయ్య తనకు చేసే అపురూపమైన గారాబాన్ని చూసి “నీకేం? అంత చక్కటి అన్నయ్య వున్న అదృష్టవంతురాలివి!” అంటూ  అసూయపడటం సముచితమే.

ఆడపిల్ల అదృష్ట దురదృష్టాలు నిర్ణయింపబడేది అన్నయ్యలాంటి పుట్టింటి తరఫు వ్యక్తుల వల్ల కాదు  అడదాని జీవితంలో అదృష్టం ఎప్పుడూ భర్త వ్యక్తిత్వం

మీద ఆధారపడి వుంటుంది. వ్యక్తిత్వం లేని వ్యక్తి భర్తగా లభించడం కంటే భయంకరమైన శాపం ఇంకోటుంటుందా, విశ్వం లాంటి అన్నయ్య ద్వారా అదృష్టవంతురాలు అన్పించుకున్న తను సారధి లాంటి వాడిని పొంది జీవితానికి పరిపూర్ణత్వం సంపాయించుకుంటుందికిటికీ చువ్వలమీద తల ఆన్చి కళ్లు మూసుకున్న జ్యోతికి చల్లగా తన చెంపల్ని జుట్టుని మృదువుగా తాకుతున్న చల్లగాలిలో సారధి వ్రేళ్ళ తాలూకు స్పర్శ కనిపించి హాయి అనిపించింది.

ఆ రాత్రి పడుకోబోతుండగా "నీకు బుద్ధి లేదు శాంతా! ఇలాంటి విషయాలు మగవాళ్ళకంటే ఆడవాళ్ళ దృష్టికి తొందరగా అందుతాయి. ఆర్నెల్లనుంచీ నీ వెనుక జరుగుతున్న విషయం, నువ్వు కనిపెట్టలేకపోయావు" అన్నాడు విసుగ్గా విశ్వం. శాంతకి ఒళ్ళు మండిపోయింది. అంచక్కా పాఠాలు నేర్చుకోమ్మా అని పంపిస్తే ప్రణయకలాపం జరుపుతున్న ఆవిడ బాగానే వుంది. అమ్మా – తల్లీ అంటూ హామీ ఇచ్చి ఇప్పుడు తనని సాధించడం! "ఇంతకీ ఎవరుట అతను?" మనసులో దాచుకున్న కోపాన్ని బయటకి తెలియ నీయకుండా మామూలుగా అంది.

"ఎవరో బోటనీ లెక్చరరట మద్రాసునుంచి వచ్చాడుట"

"ఇంతకీ ఏం చేయదల్చుకున్నారు?"

"చేసేదేముంది? రేపు వెళ్ళి చూస్తాను. నచ్చితే ఇద్దరికీ పెళ్ళి చేసెయ్యటం!" వత్తిగిలి పడుకుంటూ అన్నాడు విశ్వం.

"మరి సుధాకరం?"

సుధాకరం, విశ్వం మొట్టమొదట్లో పనిచేసిన సీనియర్ లాయరుగారి మేనల్లుడు, అతను ముందూ వెనకా యెవరూ లేనివాడు. రేపో ఎల్లుండో ఫారిన్ వెళ్ళబోతున్నాడు. జ్యోతిని అతనికిచ్చి చేస్తే ఈడూజోడూగా ఉంటుందని అతనితోపాటు జ్యోతిని కూడా పంపించాలనీ విశ్వం సంకల్పం.

"అయినా, ఈ గొడవంతా వాళ్ళకు తెలియకుండా జాగ్రత్తపడటం మంచిది" అంది శాంత.

"అవును, ఇదేదో తేలేవరకూ జ్యోతిని కాలేజీకి పంపకపోవడం మంచిదేమో!"

శాంత మౌనం వహించింది.  అలాటి నిర్ణయానికి సలహాలు ఇవ్వటం, అవును కాదు అని చెప్పటం యెప్పుడూ అలవాటు లేదు. అతనలా  చెప్పినప్పుడు వినేసి ఊరుకోవటం – అంతే తెలుసు శాంతకి.

మర్నాడు కాలేజి టైముకి భోంచేసి బట్టలు వేసుకొని తయారవుతున్న జ్యోతిని చూస్తూ "మీ అన్నయ్య నిన్నివాళ కాలేజీకి వెళ్ళొద్దన్నారు" అంది శాంత.

పుస్తకాలు తీసుకోబోతున్న జ్యోతి ఆగి కళ్ళు పెద్దవి చేస్తూ "ఎందుకు?"

"ఏమో నాకేం తెలుసు?" శాంత విసురుగా అక్కడనుంచి వెళ్ళిపోయింది. అన్నింట్లో తనని సంప్రతించే విశ్వం జ్యోతి విషయంలో అంత దూరం ఉండటం శాంతికి నచ్చలేదు. నచ్చక చేసేదేం లేదు. అందువల్ల సందు దొరికినప్పుడల్లా  ఆ విషయమంతా ఆమె మీద చూపుతూ ఉంటుంది.

ఇష్టం లేకపోయినా అన్నగారిచ్చిన ఆదేశాన్ని  కాదనే సాహసం లేని ఆమె పుస్తకాలు టేబిల్‌మీద పడేసి ఇంట్లోనే ఉండిపోయింది.

ఆ సాయంత్రం కోర్టునుంచే... ఇంటికి వస్తూ జ్యోతి ఇచ్చిన అడ్రస్ వెతుక్కుంటూ సారధి  ఇంటికి వెళ్ళాడు విశ్వం.

విశ్వం వెళ్ళేసరికి సారధి ఇంట్లోనే ఉన్నాడు. అప్పుడే కాలేజీనుంచి ఇంటికి వచ్చినట్లున్నాడు. బట్టలు కూడా మార్చుకోలేదు. టేబిల్ మీద ఏవో పుస్తకాలు సర్దుతున్న సారధి సరాసరి చనువుగా లోపలికి వస్తున్న విశ్వాన్ని చూసి 'రండి' అన్నాడు. ఎవరో ఏమిటో అడక్కుండా గుమ్మానికి ప్రక్కగా వున్న బోర్డు చూశాడు కాబట్టి జ్యోతి ఇచ్చిన వర్ణన గుర్తుకు వచ్చిన విశ్వం సారధి  ఇతనే కాబోలు అనుకుంటూ "నేను".... అంటూ జేబులోంచి కార్డుతీసి ఇచ్చాడు.

"తెలుసు" కార్డుని క్షణంసేపు చూసిన సారధి నిర్లక్ష్యంగా ప్రక్కన పడేస్తూ అన్నాడు.

"జ్యోతి నా చెల్లెలు" దాదాపు తనంత పొడుగూ ఉండి తనకంటె బలంగా వున్న సారధిని నఖశిఖ పర్యంతం పరీక్షచేస్తూ అన్నాడు విశ్వం.

"తెలుసు, నేనిదివరకు మిమ్మల్ని చూశాను" అన్నాడు. సారధి మెల్లిగా.

"అలాగా" కూర్చుంటూ అన్నాడు విశ్వం. తను జ్యోతి అన్నగారిని అని చెప్పుకోకముందే తెలుసునన్నమాట. తెలిసినవాడు ఆర్భాటంగా ఏమీ హడావుడి పడడేం? విశ్వానికి ఏం మాట్లాడాలో తోచలేదు. సారధి గోడకు తగిలించి వున్న ఫ్లాస్క్ తీసి, బయటకెళ్ళి, ఎవరినో కుర్రాడిని పిలిచి కాఫీ తీసుకురమ్మని చెప్పాడు.

"థాంక్స్! నేనిప్పుడే తాగి వచ్చాను"

కాఫీ కోసం రాలేదన్నట్లు అన్నాడు. సమాదానంగా లోపలికి వస్తున్న సారధి నవ్వి ఊరుకున్నాడు.

విశ్వం చుట్టూ కలయచూశాడు. అంత పెద్దదీ అంత చిన్నదీ గాని సామాన్యపు గది. గదిలో టేబిల్. దానిముందు ఒక కుర్చీ తప్ప యేమీ లేవు. ఆ కుర్చీలోనే ప్రస్తుతం కూర్చున్నాడు. గోడవారగానున్న మంచం మీద పరుపులేదు. ఓ మాదిరి ఖరీదుగల దుప్పటి, మెత్తటిదిండ్లు వున్నాయి. ఆ గదిని చూస్తుంటే ఆర్థికంగా యజమానిగూడ ఎంత మామూలు మనిషో సులభంగా తెలిసిపోయింది. కాని జ్యోతి భర్తగా రాబోయే వ్యక్తికి డబ్బుందా లేదా అన్నది సమస్య కాదు. మనిషికి చదువు, తెలివితేటలు జ్యోతి సున్నితమైన మనసుని అర్థం చేసుకోగలిగిన సంస్కారం వుంటే చాలు!

విశ్వం తలతిప్పి మరోసారి సారధివైపు చూశాడు. "వంటరిగా వుంటున్నారా? ఫామిలీ ఎవరూ లేరా?" సంభాషణ ఎలాగో ఒకలాగు మొదలుపెట్టడం ముఖ్యం అనుకున్న విశ్వం తనే అడిగాడు.

"ఎవరూ లేరు" ఆ లేరనడంలో నిర్లక్ష్యంగా పెదవులు విరచటంలో సారధిని లేకపోతే అలాంటి వ్యక్తిని ఎక్కడో చూచినట్లునిపించింది విశ్వానికి.

"ఎవరూ లేరా?" సారధిని పరీక్షగా చూస్తూ అన్నాడు.

"ఉహూ! ఒక్కగానొక్క అక్క ఉండేది. ఆ అక్క చచ్చిపోయింది"

'అలాగా? తల్లీ, తండ్రీ –"

"ఎవరూ లేరు"

విశ్వానికి ఏం మాట్లాడాలో తోచలేదు. జ్యోతి అన్నగారు అని తెలుసుకుని కూడా మనిషి అలా ఉంటాడేం?

అదో స్వభావం కావచ్చు.

"మిమ్మల్ని ఎక్కడో చూచినట్లుంది?"

"నన్ను చూచి ఉండరు. నాలాటి మనిషిని చూసి ఉంటారు."

"మీ స్వంత వూరు?"

"బెజవాడ"

"బెజవాడ! అరె, అయితే మీరు మా నాన్నగారి పేరు వినే వుండాలి లాయరు విశ్వనాథంగారంటే తెలియని మనిషే వుండడు బెజవాడలో" విశ్వం ఉత్సాహంగా అన్నాడు. సారథి జవాబు చెప్పేలోగా, యింతలో కుర్రాడు ఫ్లాస్క్ తెచ్చి ఇచ్చాడు.

సారథి రెండు కప్పుల్లో కాఫీ పోసి ఒకటి విశ్వానికి యిచ్చాడు. ఏ కారణం వల్లనో తెలియలేదు కానీ, అతను సూటిగా విశ్వంవైపు చూడడం లేదు. ఎటో చూస్తున్నాడు, ఏదో మాట్లాడుతున్నాడు. బహుశా తను జ్యోతి అన్నగారిని అని చెప్పటం వలన ఖంగారుని అలా దాచుకోటానికి ప్రయత్నిస్తున్నాడేమో!

"బెజవాడలో ఎక్కడండీ మీరుండేది?"

సారథి జవాబు చెప్పాడు. విశ్వం ఉలిక్కిపడ్డాడు కాఫీ తాగుతున్న వాడల్లా సగంలో ఆపేసి కప్పు చేతిలో అలాగే పట్టుకుని "అరే! ఆ వీధి నాకు బాగా పరిచయమేనే! ఏ ఇంట్లో మీరున్నది?"

"రామశాస్త్రిగారింట్లో" తాపీగా కాఫీ తాగుతూ నిదానంగా జవాబు చెప్పాడు సారథి. విశ్వం కళ్ళు వెడల్పయినాయి. ఈసారి సారథి తలెత్తి సూటిగా విశ్వం కళ్ళల్లోకి చూస్తూ "మీరు మర్చిపోయి వుంటారు. బహుశా ఆ యింట్లో ప్రసాదరావుగారు అని హెడ్మాష్టరుగారుండేవారు. ఆయన మా మేనమామ."

సారథి నోటినుంచి వెలువడుతున్న ఒక్కొక్కమాట ఒక్కొక్క శూలంగా విశ్వం హృదయంలో దూసుకుపోయింది. "అయితే నువ్వు నువ్వు – " కాఫీ కప్పు టేబిల్ మీద పెట్టేసిన విశ్వం మాట పూర్తి చేయలేకపోయాడు.

"అవును, నేనే రాజ్యలక్ష్మి తమ్ముణ్ని. అప్పుడు అక్కడ లేను, గుంటూరులో చదువుకుంటున్నాను" కూర్చున్న విశ్వం చివాల్న లేచి నిలబడ్డాడు. క్షణంలో అతని మొహం కందగడ్డలా తయారయింది. పిడికిళ్ళు బిగపడ్తూ "ఐతే జ్యోతి ఎవరో నీకు తెలుసన్నమాట" అన్నాడు.

"మొదట్లో తెలియదు. తెలిసిం తర్వాత ఆ బంధాన్ని కావాలని నేనే మరింత బిగించాను. అనుకోకుండా భగవంతుడిచ్చిన ఈ అవకాశాన్ని నేను జారవిడవదల్చుకోలేదు –"

"బెదిరిస్తున్నావా?" ఉరిమి చూస్తూ అన్నాడు విశ్వం.

"లేదు, కొన్ని సంవత్సరాల క్రితం అక్కయ్యకు జరిగిన అన్యాయానికి ప్రతీకారం తీర్చుకునే అవకాశం కలిగిందని సంతోషిస్తున్నాను" నిశ్చలంగా, నిదానంగా, ఠీవిగా ఒక్కొక్కమాట తూచి తూచి అంటున్న సారధిని చూస్తుంటే విశ్వానికి కంపరమెత్తసాగింది. అతని మొహంలో కన్పించే చిరునవ్వు వెయ్యి గొంగళి పురుగుల్లా మారి విశ్వం వంటినిండా ప్రాకుతున్నట్లనిపించింది.

వెళ్ళిపోవటానికి ముందు కడుగువేస్తూ "సరే, నే వెడుతున్నాను. జ్యోతి అదృష్టవంతురాలు. నా కంఠంలో ప్రాణం వుండగా నీ చేతి కెప్పటికీ అందదు. జాగ్రత్త! ఈ సంగతి బయటకు తేవాలని గాని లేక దాన్ని అల్లరి చేయాలనిగాని చూశావా. ఈ ఊళ్ళో నాకున్న పేరు, పలుకుబడి నీ జీవితాన్ని మంటబెట్టి మసి చేస్తుంది. ఆ సంగతి మర్చిపోకు. జ్యోతికి నువ్వు ఏ ఉద్దేశంతో అయితే ఉత్తరాలు రాశావో ఆ ఉద్దేశ్యమే నీ పాలిటి ఉరితాడులా మార్చగలను–" విశ్వం పళ్ళు పటపటలాడినాయి. "బెదిరిస్తున్నారా? సారధి టేబిల్‌మీదున్న పుస్తకాల అడుగునుంచి ఓ ఉత్తరాల కట్టతీసి చూపిస్తూ "ఇదిగో, దానికి సమాధానం నా దగ్గర ఉందని మీరు మర్చిపోకండి" అన్నాడు. ఉత్తరాల మీద రాత జ్యోతిదే. సందేహం లేదు. మరో అడుగు ముందుకు వేయబోతున్న విశ్వం హతాశుడయినట్లు ఆగిపోయి మళ్ళీ కుర్చీలో కూలబడ్డాడు. ఇద్దరిమధ్యా భయంకరమైన నిశ్శబ్దం ఏర్పడింది. కాసేపాగి విశ్వం నీరసంగా తనే అన్నాడు – "సరే ఈ సంగతి వదిలెయ్యి. నువ్వు జ్యోతిని నిజంగా ప్రేమిస్తున్నావా లేదా, పోనీ అది చెప్పు."

"దానికి సమాధానం చెప్తే చచ్చిపోయిన అక్కయ్యకి అన్యాయం చేసినవాడిని అవనూ!" ఉత్తరాల కట్టని గాలిలోకి ఎగరేసి పట్టుకుంటూ అన్నాడు సారధి.

విశ్వం మళ్ళీ లేచి నిలబడ్డాడు. అతని మొహంలో క్షణం సేపు జారిపోయిన కోపం, అసహ్యం రెట్టింపు బలంతో వచ్చి మళ్ళీ తిష్టవేశాయి. "సరే, నీ నుంచి నా చెల్లెల్ని రక్షించుకోవటం ఎలాగో నాకుతెలుసు. నీ ఇష్టం వచ్చినట్లు చేసుకో" అంటూ ముందుకు కదిలాడు.

"దీన్నుంచి రక్షించినా నా ఆకర్షణ నుంచి మటుకు తప్పించలేరు. మీరు పట్టుదలకైనా బహుశా నాకు దూరం చెయ్యొచ్చుగాని జ్యోతిమీద నా ప్రభావాన్ని తీసెయ్యలేరు. ఒకవేళ మీ పేరు ప్రతిష్టలతో నన్ను దూరంగా నెట్టివేసినా, జ్యోతి మనసులోంచి తీసెయ్యడం సాధ్యం కాదు. నా కోసం జ్యోతి మంచాన పడకపోతే –

ముందుకడుగులు వేస్తున్న విశ్వం "నోర్మూయ్" అంటూ పులిలా వెనక్కు తిరగడం, తిరిగీ తిరగడంతోనే చేయిచాచి బలంగా సారధి చెంప మీద ఛెళ్ళుమన్పించడం అన్నీ క్షణంలో జరిగిపోయాయి!

అంతవరకూ టేబిల్‌ను అనుకుని అదోలా నిర్లక్ష్యంగా నిలబడ్డాడు. అంతవరకూ నవ్వుతున్న అతని కళ్ళు నిప్పులు కురిశాయి. విశ్వం అంత కంటె మండిపడుతున్న కళ్ళతో సారధి చేతుల్లోంచి బలంగా తన చేతిని గుంజుకుని, "నేనంటే ఏమిటో నీకు తెలుసుకోవాలని వుందా? జాగ్రత్త. ఖబడ్దార్" అంటూ గిరుక్కున వెనక్కు తిరిగి గబగబా బయటకువెళ్ళి పోయాడు.

కొయ్యబారిపోయిన సారధి తేరుకుని బైటకువచ్చి చూసేసరికి అప్పటికే విశ్వం కారులో కూలబడటం, అది కదిలిపోవడం కూడా జరిగింది.

ఉదయం నుంచి యింట్లో కూర్చున్న జ్యోతికి కాలమే ఆగిపోయి నట్లుంది. ఎంతసేపటికీ సాయంత్రం కాలేదు. దానికి తోడు అలవాటు ప్రకారం విశ్వం వేళకు యింటికి కూడా రాలేదు. బహుశా సారధి దగ్గరకు వెళ్ళి వుంటాడు. ఈ ఆలోచన వచ్చేసరికి జ్యోతి మొహం సంతోషంగా వికసించింది.

అన్నయ్యని చూసి సారధి, సారధిని చూసి అన్నయ్య వాళ్ళిద్దరూ ఎలా ఫీలవుతారు – బహుశా అన్నయ్యకు తనంటే ఎంత ప్రాణమో అతనికి చెపుతుండవచ్చు. రేపు కాలేజీలో సారధిని ఎలాచూడటం? ఎందుకు చూడగూడదు" ఇహ భయందేనికి? ఇవాళో రేపో పెళ్ళి చేసుకొని ఒకటి కాబోతున్న వాళ్ళకి.

ఊహల్లో తేలిపోతున్న జ్యోతికి రాత్రి అవటం గాని ఇల్లంతా నిశ్శబ్దం ఆవరించుకోవటం కాని తెలియదు. పరధ్యానంగా కూర్చున్న జ్యోతికి నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ బయట విశ్వం కారుహారన్ విన్పించటంతో ఉలిక్కిపడి కిటికీ దగ్గరకు పరిగెత్తుకొచ్చింది. అవును, విశ్వమే వచ్చింది ఆమె మనసు ఏదో తెలియని సంతోషంతో ఉక్కిరిబిక్కిరి అయిపోయి పరుగెత్తుకెళ్ళి 'సారధి వచ్చాడా? ఎలా మాట్లాడాడు" అని అడగాలనిపించింది. కానీ ఎలా? ఎంత అన్నయ్య అయితే మటుకు? బలవంతాన తనను తాను కుదుట పరుచుకుని మంచంమీద అలాగే కూర్చుంది.

వచ్చిన విశ్వం మామూలుగా బట్టలు మార్చుకుని భోంచేశాడు. భోంచేస్తూ "జ్యోతి ఏది?" అని అడిగాడు.

"ఇక్కడే వున్నానన్నయ్యా? ఏం కావాలి?" తనని పిలవక పోయినా ముందు గదిలోంచి సమాధానం చెప్పింది. విశ్వం మాట్లాడలేదు. లోపలికి రమ్మనమని పిలవనూ లేదు. వెంటనే సంగతేమిటో చెప్పక ఏమిటా ఊరింపు? కోపం వచ్చేసిన జ్యోతి వెళ్ళి మంచం మీద పడుకుంది.

ఆ రాత్రి విశ్వం జ్యోతిని పిలవలేదు. భోంచేసిన వెంటనే తల నొప్పిగా ఉందని పడుకున్నాడు.

'అతని దగ్గరకు వెళ్ళలేదూ?" తలనొప్పిగా వుందని పడుకున్న భర్తకి తలపట్టుతూ అడిగింది శాంత.

"ఎవరి దగ్గరికీ?" తెలియనట్లు ప్రశ్నించాడు.

"అదే! ఆ లెక్చరర్ దగ్గరికి!"

"వెళ్ళాను" విశ్వానికేం చెప్పాలో తోచటం లేదు. కొంచెం ఆగి ఊఁ!... జ్యోతికెలా చెప్పాలో తోచడం లేదు. అతను నాకు తెలుసు. అతనితో పెళ్ళి అవటం అనేది నేను బ్రతికుండగా జరగదు. జ్యోతికి నువ్వు మెల్లగా చెప్పు.

"బాగుంది. మధ్య నేనెందుకూ? ఎప్పుడయినా ఆమె విషయంలో దేనిలోనైనా నా ప్రసక్తి ఉందా? మీరే చెప్పండి" శాంత నిష్ఠూరంగా అంది. విశ్వానికి తలనొప్పి ఎందుకు వచ్చిందో శాంత కిప్పడు అర్థం అయిపోయింది.

"అబ్బబ్బ! నా మనస్సు బాగుండనప్పుడేనా నువ్విలా మాట్లాడేది?" శాంతని దగ్గరకు లాక్కుంటూ అన్నాడు విశ్వం.

అవును తనెలా చెప్తాడు? అసలేమని చెప్తాడు? కొన్ని సంవత్సరాల క్రితం అనుకోకుండా జరిగిన ఓ సంఘటన భయంకరమైన శాపంగా మారి జ్యోతి జీవితాన్ని కబళించడానికి తయారవుతుందని తనెలా కలగంటాడు. సారథిని చూడగానే తనకెలాగో అన్పించింది. ఆ పెదవి విరుపు – కనుబొమలు వంకర తిప్పటం – అచ్చు రాజ్యలక్ష్మి ... రాజ్యలక్ష్మి మరణానికి ఓ విధంగా కారణం కావచ్చు తను, కానీ బాధ్యుడుమటుకు కాదు.

ఆ రోజుల్లో తండ్రి అంటే తన కెంత హడలుగా ఉండేది? అక్కడికీ తను రాజ్యలక్ష్మిని ప్రేమిస్తున్నాను అంటే తండ్రి పెళ్ళి చేద్దామని చూశాడు. కాని పైకి చెప్పలేని ఏదో కారణం కూడా లేదు?

రహస్యం రాజ్యలక్ష్మి తల్లి జీవితంలో ఉంది. ఎందువల్లో యెవరికీ తెలియదు.

ఆవిడ మొగుడు వదిలేశాడు. మొగుడ్నే ఈవిడ వదిలేసింది అని కొందరంటారు.

ఏదయినా ఆవిడ భర్తని వదిలేసి పుట్టింట్లో అన్నగారి దగ్గర కూతుర్ని పెట్టుకొని వుంది. కొడుకును రెండో అన్నగారి దగ్గర గుంటూరులో ఉంచి చదివించడం మటుకు నిజం.

తెలిసి తెలిసి మొగుడ్ని వదిలేసిన ఆవిడ కూతుర్ని తన కుటుంబం లోకి తెచ్చుకోవటానికి ఏ తండ్రి సాహసిస్తాడు? అందులో విశ్వం వాళ్ళ కుటుంబం పేరు ప్రతిష్ఠలకీ, గౌరవ మర్యాదలకీ పేరుబడింది. ఎప్పుడూ ఏ విషయంలోనూ ఎవరిచేతా ఆ కుటుంబం వేలు పెట్టి చూపించుకోలేదు. అదీ గాకుండా విశ్వం తల్లి దండ్రులకి ఒక్కే కొడుకవడం కూడా చిక్కుతెచ్చింది. తనుకాకపోతే మరొకరు అన్నట్లు ఏ అన్నో తమ్ముడో వుంటే విశ్వం సాహసించి రాజ్యలక్ష్మి కోసం తల్లిదండ్రులని ఎదరించగలిగేవాడు. ఎప్పుడూ దేనికోసం తన మనసును కాస్తకూడా నొప్పించకుండా

తనపై పంచప్రాణాలు పెట్టుకున్నవాళ్ళకే అన్యాయం యెలా చేస్తాడు? అందుకే తన పెళ్ళి శాంతతో ఖాయపరుస్తున్నారని తెలియగానే ముందుగా రాజ్యలక్ష్మికి చెప్పాడు తనున్న పరిస్థితి వివరించి "నువ్వు మరో పెళ్ళి చేసుకో రాజూ! ఇద్దరం స్నేహితుల్లా విడిపోదాం. నీ భర్త యెలాంటి వాడయినా నేను గౌరవిస్తాను" అన్నాడు. విశ్వం యెంత విడమర్చి చెప్పినా రాజ్యలక్ష్మి బుర్రకెక్కలేదు. ఆ ఎక్కని బుర్ర అడ్డంగా ఆడిస్తూ "బాగుంది మనిషికి యెన్ని మనుసులుంటాయని నీ ఉద్దేశ్యం? మనం స్నేహితులుగా విడిపోయి, పెళ్ళి చేసుకొని మళ్ళీ కలవటమా? నా భర్తగా యింకో వ్యక్తి వస్తే నువ్వు సహించగలవేమోగాని, నీ భార్యగా ఇంకో మనిషిని నీ ప్రక్కన నేను చూడలేను. ఆ వచ్చిన వ్యక్తిని చీల్చి రక్తం తాగాలనిపిస్తుంది"అంది. విశ్వానికి ఏం చెప్పాలో తోచలేదు. ఆసారి యిద్దరూ కలతలు నిండిన మనసులతోనే విడిపోయారు.

విశ్వం పెళ్ళికి లగ్నం నిశ్చయించారు. అది తెలిసిన రాజ్యలక్ష్మి ఒకసారి వచ్చి వెళ్ళమని చీటిరాసి పంపింది, వెళ్ళి ఈ మాట చెప్పి మరీ బాధ పెట్టడం యిష్టం లేని విశ్వం వెళ్ళలేదు. అదే ఆఖరిసారయింది. విశ్వం పెళ్ళి వారం రోజులుందనగా ఓ రోజు రాత్రి బావిలోపడి చచ్చిపోయింది. ఈ ఉత్తరం బయటపడినట్లయితే అందరికీ విశ్వం రాజ్యలక్ష్మి చావుకి కారణం అని తెలిసేది. కానీ విశ్వం తండ్రి పలుకుబడి, డబ్బు లోకం నోరు మూయించేసింది. శాంతతో విశ్వం పెళ్ళి నిర్విఘ్నంగా జరిగిపోయింది.

కాలం మనిషిలో మార్పులు తేలేకపోయినట్లయితే మనిషికి జీవితం ఏనాడో నరకం అయి ఉంది. జీవితం మీద అప్పుడింత కాంక్ష కూడా ఉండేది కాదేమో! జరిగిన ప్రతిదాన్నీ మనసులోంచి తుడిచేసి మరమ్మతు చేసెయ్యటమే కాలంపని. విశ్వానికి కూడా అంతే జరిగింది. తర్వాత తండ్రి పోయాడు. మకాం హైదరాబాదుకు మారింది. ఇద్దరు పిల్లలు పుట్టారు, ఎన్నో జరిగిపోయాయి. వీటన్నిటి అడుగునా రాజ్యలక్ష్మి జ్ఞాపకం పీడకలలా మర్చిపోయాడు. మళ్ళీ యిన్ని సంవత్సరాల తర్వాత చచ్చిపోయిన రాజ్యలక్ష్మి బ్రతికినా ఇలా సాధిస్తుందని విశ్వం అనుకోలేదు. తనకైనా ఫర్వాలేదు బాధ్యుడు కాబట్టి భరించ వచ్చు. జ్యోతి తనకి ప్రాణాధికమైన వ్యక్తి. ఇదే మరీ నరకంగా అనిపించింది విశ్వానికి ఆరాత్రి యెంతకీ నిద్రపట్టని విశ్వం వారం

తిరిగే లోపల ఎలా సారథిని ఆ వూరి నుండి పంపెయ్యాలా అని ఉపాయాలు వెదకసాగాడు. ఈ వారం రోజుల్లో జ్యోతిని కాలేజీకి వెళ్లనివ్వటం గాని, సారథిని కలుసుకొనే ప్రయత్నం గాని చెయ్యకుండా యెలా కట్టుదిట్టం చేయాలో అది కూడా నిశ్చయించుకున్నాడు.

"సారథిని నువ్వు మర్చిపోవాలమ్మా! అతనితో మనకు పొత్తు కుదరదు, ఏ విషయంలోనూ మనకి సామ్యం లేదు."

మర్నాడు ఉదయం కాఫీ త్రాగుతుండగా అన్నగారంటున్న మాటలకి జ్యోతి కళ్ళు పెద్దవి చేసుకుని చూసింది. చెల్లెలి మనసు నొప్పించటం యిష్టంలేని విశ్వం "జ్యోతి! జీవితంలో పెళ్ళి ముఖ్యమైనదే కావచ్చు. కాని దానికి మించిన మరికొన్ని బాధ్యతలు కూడా ఉంటాయి. అవి విస్మరిస్తే మనిషికి నరకం యెక్కడో కాదు యిక్కడే కనిపిస్తుంది. సారథి నాకిదివరకు తెలుసు, తెలిసి తెలిసి నేను అతని చేతుల్లో నిన్ను పెట్టలేను. నువ్వు ఆలోచించుకో" అని జ్యోతి జవాబుకు చూడకుండా అక్కడనుంచి వెళ్ళిపోయాడు.

చాలాసేపటికి గానీ జ్యోతికి అన్నగారు చెప్పిందేమిటో అర్థం కాలేదు. సారథి అన్నయ్యకు నచ్చలేదా? ఇంతకు ముందు తెలుసా? ఇది ఎలా సంభవం? అన్నయ్యకి సారథి తెలిస్తే సారథికి అన్నయ్య ఎందుకు తెలియదు, తెలిస్తే తనతో మాటమాత్రం కూడా అనడా? ఏదో జరగకూడనిది జరిగింది. తను వెళ్ళి సారథిని అసలేం జరిగిందీ కనుక్కోవాలి– అనుకుంటూ గబగబా బట్టలు వేసుకుని కాలేజీకి తయారవుతుండగా శాంత లోపలకి వచ్చి "ఇదేదో తేలేదాకా నిన్ను కాలేజీకి వెళ్ళద్దన్నారు" అంది. "కాలేజీకి వెళ్ళవద్దా!" కోపంతో జ్యోతి మొహం ఎరుపురంగు తిరిగింది. "నాకు తెలియదు. ఆయన చెప్పమన్నారు, చెప్పాను. ఆయనమాట లక్ష్యంలేదు అనుకుంటే నిక్షేపంలాగా వెళ్ళవచ్చు. మధ్య నేనేదో అంటున్నానని మటుకు నువ్వనుకోకు."

"వదినా" హఠాత్తుగా జ్యోతి కళ్ళలో నీళ్ళు తిరిగాయి. పుస్తకాలు టేబిల్ మీదకు విసిరేసి వెళ్ళి మంచం మీద వాలిపోయింది. అన్నయ్య వద్దన్న పని తను చేయలేదు.

ఆ బలహీనత చూసే ఈ అధికారం. వెంటనే లేచి కాలేజీకి వెళ్ళి తీరాలి అనిపించింది. కాని మనసులో యే మూలో అన్నయ్యకి కోపం వస్తుందేమోనని భయం జ్యోతిని మంచం మీదనుంచి లేవకుండా నీరసంగా అలాగే పడేసి వుంచింది.

"జ్యోతి యిష్టాయిష్టాలతో నిమిత్తం లేకుండా మూడు రాత్రిళ్ళు మూడు పగళ్ళు గడిచిపోయాయి. అభిమానంతో, అవమానంతో కుమిలి పోతున్న జ్యోతి "నన్ను కాలేజీకి యెందుకు వెళ్ళనివ్వరు?" అని అడగలేదు. పోనీ చదువుమధ్యలో ఆపేస్తారా? ఆపేయనీ రేపు అందరూ జ్యోతి కాలేజికి యెందుకు రావటంలేదని అడిగితే అన్నయ్యే సమాధానం చెప్పుకోవాలి మూడు రోజుల్లోనే తీసేసి, చిక్కిపోయి యెలాగో అయిపోయిన చెల్లెల్ని విశ్వం చూసీ చూడనట్లు ఊరుకున్నాడు. అన్నగారు కన్పించినా చూడనట్లే పక్కకు వెళ్ళిపోయేది జ్యోతి.

మడతలుగా పెట్టి బట్టలన్నీ పెట్టెలో సర్దుకుంటున్న సారధి వెనక తలుపు చప్పుడవడంతో వెనక్కు తిరిగి చూశాడు. ఓర వాకిలిగా వేసివున్న తలుపుల్ని తోసుకుని సుడిగాలిలా లోపలికి వచ్చింది జ్యోతి.

"నువ్వా?" సంభ్రమాశ్చర్యాలతో సారధికి నోటమాట సరిగా రాలేదు.

"మీరు సాయంత్రం లోపల నన్నోసారి కలవమన్నారని వనజ చెప్పింది."

"అవును! ముందు నువ్వు లోపలికి రా" జ్యోతిని సొంతం గదిలోకి లాగి తలుపులు వేసాడు.

"పెట్టె సర్దుకుంటున్నారెందుకు?"

"నీకు తెలీదా! వూరు వెడుతున్నాను."

"ఎందుకిపుడు?"

"నా అంతట నేను వెళ్ళటం లేదు. బలవంతాన మీ అన్నయ్య పంపిస్తున్నాడు."

"అన్నయ్యా!"

"అవును, వనజ నీకేం చెప్పలేదూ?"

"లేదు, ఫోనుచేసి మీరెలాగైనా సరే రమ్మన్నారనీ, అర్జంటనీ చెప్పింది."

సారథి జ్యోతి దగ్గరగా వచ్చి భుజాలమీద చేతులువేసి కళ్ళలోకి చూస్తూ "అవును కానీ, నువ్వు రాగలవని కల్లో కూడా అనుకోలేదు. జన్మలో మళ్ళీ కన్పించవనుకున్నాను. నాకు ట్రాన్స్‌ఫర్ అయింది. నీకు తెలియదా?"

"ట్రాన్స్‌ఫరా?" ఆమె కళ్ళు వెడల్పయినాయి.

"అవును. అది మీ అన్నయ్య పుణ్యంగానీ నన్ను గురించి మీ అన్నయ్య నీకేం చెప్పలేదూ?"జ్యోతి చూపులు సారథి మొహం మీదనుంచి గుండెల మీదికి వాలిపోయాయి.

"చెప్పు, యెలాగూ వెళ్ళిపోతున్నానుగా – నిజం తెలుసుకోవాలని వుంది"

"ఏం చెప్పలేదు మన పెళ్ళి జరగదని, మీరు మంచివారు కాదని మటుకు" అన్నాడు."

"నిన్ను కాలేజీ మానివేయించింది నా వల్లనేనా?"

జ్యోతి కళ్ళు ఒక్క క్షణం సేపు రెపరెపలాడినాయి.

"నాకీ ట్రాన్సఫర్ ఆర్డర్ రాగానే మొదలు రిజైన్ చేసి ఇక్కడే ఉండిపోవాలనుకున్నాను. కాని నా సంగతి నీకు తెలుసుగా. బీదవాడిని. జీతం దొరికితేగాని భోజనం లభించదు."

ఆమె కళ్ళెత్తి చురుకుగా సారథి మొహంలోకి చూసింది. "నేను మంచివాడిని కాదని మీ అన్నయ్యని నిదర్శనాలు చూపించమని నువ్వెందు కడగవు? ఒక్కటే జ్యోతి! నేను మీ అంతస్థుకి తగను. నాకు మీలా డబ్బు లేదు. నిజమేలే! నన్ను చేసుకుని నువ్వేం సుఖపడతావు?"

సారథి నిష్ఠూరంగా అంటూ ఆమె భుజాలు వదిలేశాడు. కాని ఆమె అతని చేతుల్ని వదలలేదు. పట్టుకుని భుజాలమీద వుంచుకుంటూ "నన్నేం చేయమంటారో చెప్పండి" అంది. మొహం తిప్పేసుకో బోతున్న సారథి గిరుక్కున తిరిగి చూశాడు. "నిజంగా ఒక్క డబ్బే సమస్య ఐతే పర్వాలేదు . అన్నయ్యని నేను ఒప్పించగలను" నిశ్చలంగా చూస్తూ అంది.

"మనుష్యుల స్వభావం నీకు తెలియదు. ఉత్త పిచ్చి అమ్మాయివి" సారథి వంగి ఆమె కళ్ళమీద ముద్దు పెట్టుకుంటూ అంటున్నాడు.

"మీరు వెళ్ళకుండా చూసే మార్గం లేదూ?"

"ఉన్నది – ఒకే ఒక మార్గం"జ్యోతిని గుండెలకి దగ్గరగా లాక్కుని కళ్ళలోకి లోతుగా చూస్తూ అన్నాడు.

"ఏమిటది?"

"నువ్వు నాతో వచ్చెయ్యటం, మనిద్దరం ఈ ఊరునుంచి వెళ్ళిపోయి వెంటనే పెళ్ళిచేసుకోవటం! ఆపైన క్షమాపణలు కోరుకోవటం, పెళ్ళయి పోయిన తరువాత క్షమించక చేసేదేం లేదు – ఏం మాట్లాడవేం? ముందు అసలు ఈ సంగతి చెప్పు. నేనంటే నిజంగా ఇష్టమా?"

లాలనగా, ఓ విధమైన జాలిగా అడుగుతున్న మాటలకి ఆమె లేత మను యిట్టే కరిగిపోయింది.

"మనం వెళ్ళిపోతే అన్నయ్యకు తెలియదా?" గుండెలమీద భయం సూచిస్తున్నట్లుగా చేయిపెట్టుకుంటూ అంది.

"ఆ సంగతంతా నాకు వదిలెయ్యి. నేను చూసుకుంటాను" దృఢంగా అన్నాడు సారధి.

"అయితే పదండి – వచ్చేస్తాను"

ఇద్దరి చూపులూ కలుసుకున్నాయి.

క్షణం సేపు జ్యోతివైపు పరిశీలనగా చూసిన సారధి ఆమెని వదిలేసి దూరంగా వెళ్ళిపోతూ "ఊహుఁ! వద్దు. ఆ తర్వాత నానుంచి నీ జీవితం నాశనం అయిందని నన్ను తిడ్తావు. వద్దులే నన్ను మర్చిపో, నేను దూరంగా వెళ్ళిపోతున్నాను. అసలే ఆ నెల్లూరు నీళ్ళు, నీకు పడవు. ఏదన్నా అయితే... " సారధి మాటలు సాంతం పూర్తికాకమునుపే జ్యోతి గబాల్న ముందుకువచ్చి అరచేతితో నోరు మూసేసింది.

"వచ్చేస్తానని చెప్పలేదూ! మీరు చెప్పింది నిజమే! మనం పెళ్ళి చేసుకుంటే ఏ సమస్యా ఉండదు. అన్నయ్య ఇప్పుడు కాకపోయినా కొంత కాలం తర్వాతనైనా మార్తాడు. మారకపోయినా ఫర్వాలేదు."

తన దగ్గరగా వచ్చి చెపుతున్న జ్యోతిని చేయిపట్టి మరింత దగ్గరగా లాక్కున్నాడు సారధి! అవును. జ్యోతిని ఎలాగైనా తనతో తీసుకువెళ్ళిపోయి పెళ్ళిచేసుకోవాలి!

అది విశ్వానికి తిరుగులేని శిక్ష! లేకపోతే మూడు రోజుల్లో తనని ట్రాన్స్‌ఫర్ చేయిస్తాడా? జ్యోతిని ఓసారి కన్పించమని యధాలాపంగా చెప్పాడు వనజకి. ఒకవేళ కన్పిస్తే తనని యెప్పుడూ మర్చిపోలేనంత మధురమైన స్మృతి ఒకటిజ్యోతి మనసులో ముద్రించి వెళ్ళాలనుకున్నాడు. కాని ఆమె మాటవరసకి అన్న తనమాట పట్టుకుని యిలా వచ్చేస్తానంటున్నది. అవును! అదే, అదే విశ్వం మీద పగ తీర్చుకోవటం అంటే జ్యోతిని తనతో తీసుకెళ్ళిపోవటమే మందు.

"జ్యోతీ! నిజంగా అంటున్నావా? నిజమే అయితే నేనెంత అదృష్టవంతుణ్ణి!"

"నిజంగానే చెప్తున్నాను. కాని నేను యిలా వచ్చేస్తే ఇబ్బంది కదూ? రెండో చీర కూడా లేదు."

"ఫర్వాలేదు, నేనంత దరిద్రుణ్ణి కాదు. మొదట మనం మద్రాస్ వెళ్ళిపోదాం" ఆమెని గుండెలకు అదుముకుంటూ అన్నాడు. రూపు తెలియని కసితో కూడిన విచిత్రమైన భావంతో అతని గుండెలు నిండి పోయాయి. కళ్ళలో దాని తాలూకు సంతోషం ఉప్పొంగుతూ కన్పించింది. కాని జ్యోతి కివేం తెలియవు. తనను ప్రేమించే తన కోసం ఉన్నట్లుండి ట్రాన్స్‌ఫర్ అయిపోయి వెళ్ళాల్సి వచ్చి, తనని ఇహచూడడేమోనని బెంగపడుతున్న సారథి కోసం భవిష్యత్తునే నిర్భయంగా త్యాగం చేసెయ్యాలని, తనే దేనికీ వెనుదీయకూడదని అనుకుంటోంది.

జ్యోతి వెళ్ళిపోయి నాలుగు నెలలయిపోతోంది. ఎక్కడుందీ, ఏమయిందీ జాడే లేదు. పరువు ప్రతిష్ట మాట అటుంచి ముందు విశ్వానికి జ్యోతి సారధి చేతిలో యేం బాధలు పడ్తోందోనన్న బెంగతో ప్రాణం, పోతోంది. వాళ్ళ జాడ తెలుసుకోవటానికి ఎంతో ప్రయాసపడ్తున్నాడు.

మద్రాసుకి దూరంగా ఓ మామూలు పల్లెటూళ్ళో హైస్కూలు టీచరుగా చేరాడు సారథి. ఆ మారుమూల ఊళ్ళో వున్న జ్యోతికి అన్నగారు పడే బాధగానీ, పేపర్లలో వేయించడం గానీ తెలియదు. తను చేసిన ఈ పనికి విశ్వం మండిపడ్తుంటాడని, తన పేరు వినటానికి కూడా అసహ్యించుకుంటాడని అనుకుంటోంది. ఆ వూరు వచ్చేసి కూడా దాదాపు రెండునెలలవుతోంది. సారధి జ్యోతిని విశ్వానికి ఉత్తరం వ్రాయమన్నాడు. రాయనని స్పష్టంగా జవాబు చెప్పింది

ఆమె. సారథి తర్కించలేదు. అతను విశ్వంమీద పగ తీర్చుకోవటానికయితే జ్యోతిని తీసుకొచ్చిన మాట నిజమే! కాని ఆమెలో కొన్ని కొన్ని అపురూపమైన గుణాలు, నిండయిన ఆ వ్యక్తిత్వం అతన్ని వద్దన్నా ఆకర్షించి ముగ్ధుడ్ని చేస్తున్నాయి. తను కోరినంతగా జ్యోతిని బాధపెట్టలేక తనమీద తనే కోపం తెచ్చుకుంటున్నాడు. తను సవ్యంగా చూస్తున్నంతకాలం ఆమెకి విశ్వం గుర్తురాడు. ఎలాగయినా విశ్వానికి తమ వునికి తెలియాలి. అతను రావాలి. జ్యోతిని తను హింస పెడ్తున్నట్లు అతను గ్రహించాలి. అందుకే సారథి జ్యోతిని అన్నగారికి ఉత్తరం రాయమని వేధించసాగాడు.

"పోనీ, అతను రాకపోతే రాకపోతాడు. డబ్బయినా పంపమని రాయి" స్కూలుకు వెళ్ళబోతూ అన్నాడు సారథి.

"అంటే! మీరు నాకు అన్నం పెట్టలేని స్థితిలో వున్నారని అన్నయ్యకు తెలియాలా?"

"ఏమయినా అనుకో. నాకు కావాల్సింది డబ్బు! డబ్బు కోసమే నిన్ను నేను పెళ్ళి చేసుకున్నాను. అది దొరకనప్పుడు నువ్వు కూడా నాకు అనవసరం" సారథి వెనక్కు తిరిగి చూడకుండా వెళ్ళిపోయాడు.

కోపంతో, అవమానంతో జ్యోతి మంచంమీద పడివెక్కి వెక్కి ఏడ్చింది. సారథి ఎందుకిలా మారిపోతున్నాడు? ఎంతో ప్రేమగా తన గుండెల్లో గులాబీలు పూయించిన అతనే తిరిగి యిలా ముళ్లు గుచ్చుతున్నాడెందుకు? మళ్ళీ ఒక్కొక్కసారి అతని కళ్ళల్లో ఎంత అనురాగం తొణికిసలాడ్తుంది? ఏమయినా జ్యోతి లేత గుండెలు యీ తిరస్కారానికి, అవమానానికి తట్టుకోలేకుండా వున్నాయి. రోజురోజుకీ సారథి తిరస్కారం నిర్లక్ష్యము పెరిగిపోజొచ్చినాయి. తను మొదట చూసినవన్నీ పైపై మెరుగులనీ, తాత్కాలికంగా తెచ్చి పెట్టుకున్న గుణాలనీ అర్థం కాసాగింది! ఓరోజు సారథి బలవంతంమీద అన్నగారి పేర తను వున్న వూరు పేరు తెలియబరుస్తూ ఉత్తరం రాసింది.

వారం రోజులు తిరిగేసరికి విశ్వం వూరు వెతుక్కుంటూ వచ్చి వూడిపడ్డాడు. చిక్కిపోయి, నల్లబడిపోయి, పది సంవత్సరాలు యెదిగి పోయినట్లున్న అన్నగార్ని దగ్గరగా వచ్చినా కూడా జ్యోతి గుర్తుపట్టలేక పోయింది.

"జ్యోతీ! నిన్ను మళ్ళీ కళ్ళతో చూస్తాననుకోలేదమ్మా" అన్నాడు విశ్వం. "అన్నయ్యా!" అంటూ తన చేతుల్లో వాలిపోయిన జ్యోతిని దగ్గరకు లాక్కుంటూ, ఆ స్పర్శలో ఆ పిలుపులో అప్పుడుగాని జ్యోతికి తను వదిలేసుకొని వచ్చిన వస్తువు ఎంత విలువైందో అర్థం కాలేదు.

"వద్దమ్మా! ఒక్క క్షణం కూడా ఇక్కడుండవద్దు నువ్వు. వెళ్ళి పోదాం" విశ్వం త్వరత్వరగా అన్నాడు.

"ఎక్కడి కన్నయ్యా!" బరువుగా అంది జ్యోతి.

"ఇన్నాళ్ళనుంచి ఎక్కడున్నావో అక్కడికి"

జ్యోతి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. అన్నయ్య ఇంత తేలికగా తనని క్షమిస్తాడని కల్లో కూడా అనుకోలేదు! "నేను కావాలని అన్నీ వదిలేసుకొని అతనితో వచ్చానన్న సంగతి నువ్వు మర్చిపోయావా?"

"నీ మొహం, అసలు జరిగిన పొరపాటంతా నాది. ఆ రాత్రే నీకు సారధి అంటే యెవరో చెప్పాల్సింది చెప్పకపోవటమే ఇంత అనర్థం తెచ్చింది. చెప్తే నీ లేత గుండెలు బాధపడ్తాయనుకున్నాను. కాని అది నా పొరపాటే, నీ బ్రతుకును యిలా బండలు చేస్తుందనుకోలేదు."

"ఎవరేమిటి అతను?" జ్యోతి చిత్రంగా చూసింది.

విశ్వం మెల్లగా జరిగిందంతా చెప్పాడు.

బుగ్గన చేయి ఆన్చుకుని అన్నగారు చెప్పిందంతా ఒక్క అక్షరం కూడా పొల్లుపోకుండా వింది జ్యోతి. అంతా చెప్పింతర్వాత చివరికి ముగిస్తూ "కేవలం నన్ను సాధించడానికే అతను నిన్ను పెళ్ళిచేసుకున్నాడని నా భయం. అలాగయితే నీ జీవితం యీ పాటికి నరకంగా తయారయి ఉండాలి" అన్నాడు. జ్యోతికి అసలు విషయం ఇప్పుడిప్పుడు అర్థం కాసాగింది. అదా సారధి సాధింపులో అర్థం?"

"చెప్పు, అతను ఇవేం నీకు చెప్పలేదూ?"

"లేదన్నాయ్! దైవసాక్షిగా చెప్పలేదు. మామూలుగానే వున్నారు. నన్ను బాగానే చూస్తున్నారు. దేనికీ లోటులేదు నాకు" చివరిమాట కావాలనే జ్యోతి అబద్ధం చెప్పింది.

ఇంతలో స్కూల్‌నుంచి సారధి రానేవచ్చాడు. అన్నాచెల్లెళ్ళిద్దరూ నిశ్శబ్దంగా చూస్తూ కూర్చుండిపోయారు. సారధి విశ్వాన్ని చూడనట్లే లోపలికి వెళ్ళిపోయాడు. జ్యోతి మనసు చివుక్కుమంది.

కాఫీ పెట్టలేదా ఇంకా" లోపల బట్టలు మార్చుకుంటున్న సారధి కటువుగా పిల్చాడు. అన్నగారి మొహంలోకి ఓసారి చూసి జ్యోతి లేచి వంటింట్లోకి వెళ్ళిపోయింది. లోపల రక్తం ఉడికిపోతున్నా ప్రశాంతత తెచ్చిపెట్టుకొని మౌనంగా కూర్చున్నాడు విశ్వం. "బుద్ధిలేదూ! ఎన్నిసార్లు చెప్పాను. నాబట్టలిలా లుంగల్లా పడేసి ఉంచవద్దని. తిని కూర్చుంటూ ఊరికే ఒళ్ళు పెంచుకోకపోతే కొంచెం ఇంట్లోపని చేసుకోకూడదు!"

విశ్వానికి వెంటనే లేచివెళ్ళి జ్యోతిని ఉన్నపళంగా ఆ యింట్లోంచి బయట కొచ్చెయ్యమని చెప్పాలనిపించింది. కాని ఎలా? ఊరుకాని ఊళ్ళో స్టేషన్ నాలుగుమైళ్ళు. చీకట్లో జ్యోతిని తీసుకెళ్ళి తనేం చేస్తాడు? ఐనా తన పిచ్చిగాని జ్యోతి వస్తుందా?

సారధి అరుపులకు సమాధానంగా జ్యోతి కాఫీ గ్లాసు తెచ్చి ఇచ్చింది. ఇంకోటి తీసుకొచ్చి విశ్వాని కివ్వబోయింది. "వద్దమ్మా, నే వెడతాను. మళ్ళీ ఇంకోసారి వస్తాను. ఇప్పుడు బయలుదేరితే స్టేషన్‌కి ఓ గంటలో చేరుకోవచ్చు."

విశ్వం లేచాడు అయిందేదో అయిపోయింది. పెళ్ళి చేసుకొంటే చేసుకున్నాడు. కాని సారధి సవ్యంగా ఎందుకు మాట్లాడడు? విశ్వం ఇప్పుడేదయినా అంటే అతను మరింత రెచ్చిపోవచ్చు. అందుకే ఏమి అనకుండా లేచాడు. సాధ్యమైనంత త్వరలో జ్యోతిని ఇక్కడ నుంచి తీసుకు వెళ్ళేమార్గం చూడటం – అంతే!

"చీకటిపడిపోయింది ఎలా వెడతావు?" బయటకు చూస్తూ అంది జ్యోతి.

"ఫర్వాలేదు. వస్తాను, మళ్ళీ వస్తాన్లే" విశ్వం లేచి వెళ్ళిపోయాడు. మంచీ మర్యాదా తెలియని ఆ ఇంట్లో ఉండి, మరింత అవమానం కలగ చేయటం ఇష్టంలేని జ్యోతి నిశ్శబ్దంగా చూస్తుండిపోయింది.

అన్నయ్యవచ్చి వెళ్ళిపోయాడు. ఎన్నాళ్ళనుంచో ఎదురుచూసిన అన్నయ్య.

"ఇంత చీకట్లో వెడుతుంటే చూస్తూ ఊరుకున్నావా? యేదన్నా అయితే ఫలాని ఇంటికి వచ్చి వెళ్ళాడని అందరూ నన్ను కర్కోటకుడు అనీ అనుకోవాలా?"

తన వెనకవచ్చి అంటున్న సారధివైపు కళ్ళెత్తి చూసింది జ్యోతి. జీవితంలో అంతకు ముందెప్పుడూ అతనంటే కలగని అషహ్యామైన భావం ఒకటి గుండెల్లో కలిగింది. తనని తీసుకువచ్చే రోజున ఎన్ని కబుర్లు చెప్పాడు. పెళ్ళి అయిపోగానే వెళ్ళి అన్నయ్యని క్షమాపణ కోరుకుందాం అన్నాడు. అన్నయ్య దగ్గరకు తిరిగి వెళ్ళవచ్చు అనే ధైర్యంతోనే సారధితో అంత ధైర్యంగా రాగలిగింది. కానీ తిరిగి వెళ్ళడానికి దారులేం లేకుండా అన్ని దారులూ మూసేశాడు సారధి.

ఇష్టం వున్నా లేకపోయినా ఈ శిధిలాలయంలో జీవితం వెళ్ళబుచ్చక తప్పదు.

మర్నాడు రాత్రి ఇంకా అదోలా ఉన్నజ్యోతిని దగ్గరకు లాక్కుంటూ సారధి "నన్ను క్షమించు జ్యోతి! నిన్న పశువులా ప్రవర్తించని మాట నిజమే. మీ అన్నయ్యని చూడగానే నాకు అక్కయ్య జ్ఞాపకం వస్తుంది. దాంతో నాకు మంచి చెడు వివక్షత ఉండదు. పిచ్చివానివలె ప్రవర్తిస్తాను. నువ్వంటే మీ అన్నయ్యకెంత ప్రాణమో అక్కయ్యంటే నా కంత ఇష్టం" జాలినిండిన స్వరంతో మృదువుగా చెపుతున్న సారధికి యేం సమాధానం చెప్పాలో తోచలేదు జ్యోతికి. కాని అదంతా నటన అని తన మనస్సు మళ్ళించే ప్రయత్నమనీ అనుమానం రాకపోలేదు. తన కళ్ళ ముందు అన్నగారికి జరిగిన అవమానం జన్మలో మర్చిపోలేదు.

ఆ మర్నాడు కూర్చుని తను సుఖంగా ఉన్నదని – తనమీద యే మాత్రం అభిమానమున్నా తనని చూడటానికి రావద్దనీ, జ్యోతి అన్నయ్యకు ఉత్తరం రాసింది. ఉత్తరం చివరలో "ఒక్కసారి రమ్మని రాస్తాను. అప్పుడు మటుకు ఎన్ని ఇబ్బందులున్నా రావటం మానకు" అని రాసింది. విశ్వం ఉత్తరం చదివి నిట్టూర్పు విడిచాడు. జ్యోతి తన కోసం యేం చేయకుండా అన్నగారిని అన్ని వైపులనుంచి సున్నితంగా బంధించివేస్తోంది.

మరి నాలుగు నెలలు గడిచిపోయినాయి. అవసరంగా ఉన్నప్పుడు ఎప్పుడేనా డబ్బుకోసం రాస్తుంది జ్యోతి.

వెంటనే పంపిస్తాడు విశ్వం. అదొక్కటే విశ్వానికి తృప్తి. కొన్నాళ్ళు పాత బడితే సారధి తనమీద పాత పగను మర్చిపోవచ్చునని అతనికి నమ్మకం.

రెండు నెలలు గడిచిపోయాయి. జ్యోతి దగ్గర్నుంచి డబ్బుకోసం కబురులేదు. ఉత్తరం లేదు. చివరికి ఉండబట్టలేక క్షేమం తెలియపర్చమని ఉత్తరం రాశాడు.

సమాధానము ఆలస్యంగా సారధి దస్తూరితో ఉత్తరం వచ్చింది. జ్యోతికి జ్వరంగా ఉందనీ, డాక్టర్సు టైఫాయిడ్ అంటున్నారనీ, మందులు ఇప్పించడంలో ఏమీ లోపల చెయ్యటం లేదని రాశాడు. సారధి ఉత్తరం చాలా మామూలుగా యెలాంటి వైషమ్యాలు లేకుండా వుంది. ఉత్తరం చూసిన ఆ రాత్రికి రాత్రే బయలుదేరాడు విశ్వం.

అతను ఊహించింది నిజమే అయింది. ఊరు చేరుకొనేసరికి జ్యోతి చావు బతుకుల్లో ఉంది. "వచ్చారా మీరు? టెలిగ్రాం యిద్దామనుకుంటున్నాను..."

ఎదురుగుండా వచ్చిన సారధి మొహం కళ్ళల్లో నీళ్ళు తిరగడం తరువాయిగా ఉంది. గడ్డం మాసిపోయివుంది. మనిషిని చూస్తే నిద్రాహారాలు లేనివాడిలా ఉన్నాడు.

"వెళ్ళండి, కనీసం మీరు చెప్తేనయినా మందు తాగుతుందేమో? నా పొడే గిట్టడంలేదు తనకి" గది బయట ఆగిపోతూ అన్నాడు.

విశ్వం లోపలికి వెళ్ళిపోయాడు. పీక్కుపోయిన దవడలతో, గుంటలుపడ్డ కళ్ళతో, చిక్కి శల్యమై మంచాని కంటుపోయిన జ్యోతి అన్నగారిని గుర్తుపట్టే స్థితిలో లేదు.

చాలాసేపయిం తర్వాత కొద్దిగా స్పృహ తెలిసిన జ్యోతి తనమీదకు వంగి పరీక్షగా చూస్తున్న విశ్వం మొహం తడుముతూ "ఎవరూ?" అంది.

"నేనేనమ్మా!" పెదవులు నొక్కిపట్టి దుఃఖాన్ని ఆపుకుంటూ అన్నాడు విశ్వం.

"అన్నయ్యా! నువ్వేనా?..." గుర్తుతెలిసి గబుక్కున లేవబోతూ లేవలేక నీరసంగా వెనకకు వాలిపోయింది జ్యోతి.

విశ్వం చూస్తుండిపోయాడు. ఏం చెప్పాలో అతనికి తోచడం లేదు. కొంచెం ఆగిన తర్వాత జ్యోతి ఎండినపుల్లలా అయిన తన చేతిలో అన్నగారి చేతిని తీసుకొంటూ "ఇక్కడ నీకెంత అవమానం కలిగినా సరే నన్ను విడిచి వెళ్ళకు" అంది నీరసంగా.

"వెళ్ళనమ్మా! వెళ్ళను. నీకు కొంచెం నయం అవగానే నా వెంట తీసుకువెళ్ళిపోతాను" గబగబా అన్నాడు విశ్వం.

"ఆ పని మట్టుకు చెయ్యకు! ఈ జన్మలో ఇంక తిరిగి రాలేను. రావాలని లేదు. "నా ప్రాణం పూర్తిగా పోయింది" అని గట్టిగా తెలుసుకుని గాని వెళ్ళకు,

జ్యోతి కళ్ళనుంచి నీళ్ళు ప్రక్కలకి జారిపోయినాయి కొద్దిసేపట్లో మళ్ళీ స్పృహపోయింది.

అర్ధరాత్రి యెప్పుడో మెలకువ వచ్చిన జ్యోతి "అన్నయ్యా!" అంటూ మళ్ళీ పిల్చింది.

"ఏమిటి? ఇక్కడే వున్నాను" యెర్రబడ్డ కళ్ళతో కుర్చీకి జారగిలబడి కూర్చున్న విశ్వం ముందుకు వంగి ఆదుర్దాగా అడిగాడు. ఈ రాత్రి గడవదనీ, గడిచిందంటే ఇహ ఫర్వాలేదనీ డాక్టరు చెప్పాడు. కాని యీ రాత్రి గడుస్తున్నందన్న నమ్మకం విశ్వానికి కనిపించడం లేదు.

"నేను చచ్చిపోతే నా చితికి నిప్పు యెవరు అంటిస్తారు?"

"జ్యోతీ!... " విశ్వం వెనక్కు తగ్గాడు.

"అడుగుతున్నాను చెప్పు. నన్ను ప్రేమించని వాళ్లు నాకు కొరివి పెడితే నేను పిశాచంగా మారతాను? అన్నయ్యా! ఆ తంతు అంతా నీ చేతుల మీద నువ్వే పూర్తిచెయ్యి."

"నువ్వు కళ్ళు మూసుకుపడుకో" విశ్వం జ్యోతి తల నిమురుతూ అన్నాడు.

నిన్ను చూస్తుంటే మళ్ళీ బ్రతకాలనిపిస్తోంది. నీ చెల్లెలిగా మామూలుగా తిరగాలనిపిస్తోంది. కాని.... కాని" యేదో చెప్పబోయి ఆగిపోయింది జ్యోతి.

"చెప్పు – ఏమిటిది?"

"అతను నీమీద పగ తీర్చుకోవటం కోసమే నన్ను పెళ్ళి చేసుకున్నాడేమో? కాని నేను అతన్ని కావాలని మనసారా ప్రేమించే చేసుకున్నా. అందుకే నీ దగ్గరకి తిరిగి రాలేకపోయాను. నన్ను క్షమించు."

"జ్యోతీ!" దూరంగా కూర్చున్న సారథి పిచ్చివాడిలా జుట్టు పీక్కున్నాడు.

జ్యోతి చెప్పింది నిజమే! కావాలని ప్రతీకారం కోసమే– విశ్వాన్ని సాధించటం కోసమే పెళ్ళి చేసుకున్నాడు. కాని తర్వాత అతడు మారాడు. ఆ మార్పు జ్యోతి గుర్తించలేదు. అదికూడా నటన అనుకుంటోంది. తనలో వచ్చిన ఈ మార్పు ఎలా తెలియజేయాలో తోచక తికమక పడుతున్నాడు సారథి. కాని అప్పటికే సమయం

మించిపోయింది. తెల్లవారుఝాముకి అన్నగారి వొళ్ళో తలపెట్టుకుని జన్మ జన్మలకి విశ్వం లాంటి అన్నయ్యే కావాలని భగవంతుడ్ని అడుగుతానంటూ ప్రాణం విడిచింది జ్యోతి. చనిపోయే ముందు ఒక్కసారి కూడా – మాటవరసకి కూడా – సారధిని గురించి అడగలేదు.

జ్యోతి చనిపోయిం తర్వాత విశ్వం లేచి సారధి దగ్గరగా వస్తూ పిడికెళ్ళు బిగించి, పళ్ళు నూరుతూ, "చూడు, ఇహ నేనంటే ఏమిటో నీకు చూపిస్తాను జ్యోతిని పెట్టిన బాధలకి" విశ్వం మాటలు సొంతం కాకుండానే సారధి వెనక్కు తిరిగాడు. అతని చూపుల్లో వెనకటి ధీరత్వం గాని, నిర్లక్ష్యంగాని లేవు. పులిలా నిప్పులు కక్కుతున్న కళ్ళతో తన మీదికి వస్తున్న విశ్వాన్ని చూస్తూ నిదానంగా "నీ యిష్టం వచ్చింది చేసుకో. ఏం చేసినా నీ చెల్లెలు నీకు తిరిగి రానట్లే, నా మామూలు జీవితం కూడా నాకు తిరిగి రాదు. జ్యోతి లేని జీవితం ఎలాటిదయినా నాకు ఒకటే" నిశ్చలంగా అన్నాడు.

రేగిపోయిన జుట్టుతో, నలిగిపోయిన బట్టల్తో, శూన్యం నిండిన కళ్ళతో ఎలాగో ఏమీ చేతకాని వాడిలా నిలబడిపోయిన సారధిని క్షణం సేపు పరీక్షగా చూసి కుర్చీలో కూలబడుతూ "మారినవాడివి ఆ మార్పు అది గుర్తించేలా ఎందుకు చేయలేకపోయావు?" అన్నాడు.

సారధి మొహం తిప్పుకుని బయటకు చూస్తుండిపోయాడు. అతను దానికి సమాధానం ఏం చెప్పగలడు? తనంటే ఏమిటో తను తెలుసుకొనే లోపలే, అది గ్రహించే లోపలే అప్పటికే దెబ్బతిన్న మనసుతో జ్యోతి దూరంగా వెళ్ళిపోయింది. దూరంగా వెళ్ళిపోయిన జ్యోతిని అందుకోవటం అతనికి సాధ్యం కాలేదు.

సారధికి కళ్ళలో నీళ్ళు నిండి టప్‌మని క్రిందపడ్డాయి.

"అతని మాటేమోగాని, నేను అతన్ని మనసారా ప్రేమించే వచ్చానన్నయ్యా" అన్న జ్యోతి మాటలు శూలంలా సారధి గుండెల్ని చీల్చసాగాయి.

తను ప్రేమించలేదని జ్యోతికెలా తెలుసు? జ్యోతి ప్రేమలో తన పగ మంచులా కరిగిపోయింది. ఈవిషయం తెలియబరిచే అవకాశం తన కివ్వకుండానే జ్యోతి వెళ్ళిపోయింది.

నీళ్ళు నిండిన కళ్ళని తుడుచుకుంటూ సారధి వెనక్కు తిరిగి "ఆ ఏర్పాట్లేవో మీరే చూడండి. అందులో నా చేయి కలిస్తే జ్యోతి ఆత్మకి శాంతి కూడా ఉండదేమో" అన్నాడు.

"సారధీ-!" జీవితంలో మొదటిసారిగా సారధిని పేరు పెట్టి, పిలుస్తూ విశ్వం చేతుల్లో మొహం దాచుకుని వెక్కి వెక్కి ఏడవసాగేడు.

విశ్వం బయట కేడుస్తున్నాడు. సారధి హృదయం లోలోపలే రోదించసాగింది.

ఇద్దరూ నిశ్శబ్దంలో చలనం లేని బొమ్మల్లా నిలబడిపోయారు.

# మట్టిగోడల మధ్య గడ్డిపోచ

- శివరాజు సుబ్బలక్ష్మి

**ఆ**ఏడు వేసంగి ఎండలు మండిపోతున్నాయి. పొద్దువాలినా వేడి తగ్గలేదు. పసిపిల్లలు తట్టుకోలేక కంఠం జారిపోయేలా గోలపెడుతున్నారు. ముసలి అవ్వ ఆపుకారా పక్కన పెట్టుకుని కంఠం తడుపుకుంటూ తడిబట్ట వంటికి చుట్టుకు వచ్చే పోయేవాళ్ళని "టయిము ఎంత అయిందర్రా" అంటూ గడుపుతోంది.

ఆ వూరిని చుట్టివున్న పుంత, సగం పడిపోయిన మట్టి గోడలు, శిధిలావస్థలో ఉన్న. నిత్యం ధూపదీప నైవేద్యాలందుకునే శివాలయం. వూరి మధ్యన వున్న మోటబావి. దాని పక్కనే ఉయ్యాలలూగే వూడల్ని పెంచుకున్న ముసలి మర్రిచెట్టు. ఆ వూరికి వచ్చినవాళ్ళు వీటిలో ఏ ఒక్కటీ చూడకుండా వెళ్ళటానికి లేదు. ఆ వూరి ఘనత అల్లాగే చెప్పుకు తిరుగుతారు రికామీ పెద్దలు.

పార్వతికి ఆ వూరికి రావటం రెండోసారి. ఈసారి ఆ వూరికి కోడలుగా రావటం మనస్సుకి బాధగా వున్నా పైకి అందరిలాగే వుత్సాహంగా వున్నట్లు మసులుతోంది. వేడికి తోడు చీకటి కలిగి విసిగిన ప్రాణాల్ని విసిగిస్తోంది.

పార్వతికి పగలు ఎండ భరించటమే హాయి అనిపిస్తోంది. పొద్దుగూకిందంటే తెలియని భయం చుట్టుకుంటోంది. ఎప్పుడో ఒక రోజు బావకి... తరవాత వూహించేందుకు మనస్సు వప్పుకోటం లేదు. అత్తగారి పిలుపుతో మనస్సుని కట్టేసి లోపలికి పరుగెట్టింది.

పడమటింటి వసారాలో నిల్చున్న రావమ్మ, కోడలి పరుగుచూసి ముక్కుమీద వేలేసుకుంది.

పార్వతి తన తప్పు తెలుసుకుని సిగ్గుతో తలవంచుకుంది.

"నీకు ఎన్నిసార్లు చెప్పినా ఆ పరుగు మానవా ఏం?" అంటూ కోడల్ని మందలించింది రావమ్మ.

పమిటకొంగు బొడ్డులో దోపుకుంది. తలుపు వెనక్కి జరిగి తల వంచుకుని దిగులుగా నిల్చుంది పార్వతి.

కాస్సేపు మౌనంగా నిల్చున్న రావమ్మ "సరేలే వెళ్ళి వసారాలో పీటలు వేసి మంచినీళ్ళు పెట్టు" అని కోడలికి పురమాయించి వీధి గుమ్మంవేపు వెళ్ళింది.

పార్వతి వచ్చి అప్పుడే వారం తిరిగింది. వచ్చిన కొత్తలో వున్నంత భయం లేకపోయినా, ఏమిటోలా వుంటోంది. ఏదో విసుగు పుడుతోంది. తనమీద తనకే.

"ఏరా బాచీ ఇంతవేళ దాకా ఏమి చేస్తున్నావురా?" అప్పుడే వస్తున్న కొడుకుని అడిగింది రావమ్మ. కండువా కొంకెకి తగిలించి లోపలింట్లోకి వెళ్ళాడు భాస్కర్రావు.

అందరి భోజనాలూ అయ్యాయి అంటే పార్వతికి చేతినిండా పని. ఆ రోజు అదనంగా ఇల్లుకూడా అలకమని పురమాయించింది. రావమ్మ. మట్టిముద్దలో చెయ్యి పెట్టాలంటే వొళ్ళు జలదరించింది పార్వతికి.

ఎట్లాగో అలకటం పూర్తయిందన్న ఇదితో వూపిరి గట్టిగా పీల్చుకుంది.

"మాసికలు పెట్టినట్లు ఆ అలకడం ఏమిటే! మళ్ళీ వోసారి కలిసేటట్టు పాముకురా" అని కిటికీ వూచల్లోంచి అత్తగారి కంఠము వినవచ్చింది.

తలెత్తి చూడకుండానే పార్వతి మళ్ళీ మొదలుపెట్టింది. అలకటం పూర్తిచేసి, తలుపులు మూసి, అరికెన్ లాంతరు తగ్గించి పెరట్లో గట్టుమీద పెట్టి తను వేసుకునే మడతమంచం ఈడ్చుకువచ్చింది నేరేడుచెట్టు కిందికి.

కొంచెము దూరములో అత్తగారి మంచం కనపడుతోంది.

చెట్టు ఆకులు గాలికి గలగల్లాడుతున్నాయి. ఆకులమధ్యనించి నక్షత్రాలు మిణికుమిణుకుమంటూ తనకేసి చూస్తున్నట్టు వూహించుకుని కొంతసేపు వాటితో కలిసి మనస్సు తేలిగ్గా వున్నట్టు మంచముమీద ఇటూ అటూ దొర్లింది పార్వతి.

మంచం చేసే కిటకిట చప్పుడికి రావమ్మ తలెత్తి చూసి "ఆ చెట్టు కింద ఎందుకే ఇల్లా లాక్కో మంచము" అని కేక పెట్టి మళ్ళీ పడుకుంది.

ఈ సారి కదలకుండా చూస్తూ పడుకుంది. కానీ నిద్రరావటం లేదు. అసలు అక్కయ్య ఎందుకు నూతిలో పడింది? అన్న ప్రశ్న మనస్సులోకి వచ్చి కూర్చుంది

పార్వతికి. అది మరిచిపోవాలని ఏవేవో గుర్తుకు తెచ్చుకునేందుకు ప్రయత్నిస్తోంది. అక్కయ్య పెళ్ళి అయిన కొత్తరోజులు ఎంత బాగుండేవో గుర్తుకు రాసాగాయి.

అప్పటికి తనకి ఏడు ఎనిమిది ఏళ్ళ కంటే వుండకపోయినా అన్నింటికీ అప్పగారితో పోటీకి వెళ్ళటం చూసి మేనత్తలు బుగ్గలునొక్కుకు, "రేపు మీ అప్పకి పెళ్ళి అవుతే ఏం చేస్తావు?" అని అడగటం. తడుముకోకుండా "నేనూ చేసేసుకుంటా' అనటం, వాళ్ళు అన్నట్టుగానే అక్కయ్య పెళ్ళిరోజు దగ్గరకి వస్తూన్నకొద్దీ ఇంట్లో అన్నింటికీ తన పేచీలు ఎక్కువై, అమ్మప్రాణం విసిగి కొట్టడం, బామ్మ అడ్డుకుని "ఎందుకే దాన్ని కొట్టి చంపుతావు?" ఇంకో నాలుగేళ్ళు పోతే దాన్ని వో అయ్య చేతిలో పెట్టేదేనాయె" అంటూ సమరిస్తూ వోదార్చటం.

"అమ్మయ్యో నాలుగేళ్ళు వేగడమే! వచ్చేయేడే ఆ రామాన్ని పిలిపించి ముడెట్టించి వాళ్ల అత్తయ్య దగ్గరికి పంపేస్తా' అని అమ్మ బెదిరించటం.

మనుమడి పేరు విని బామ్మ తృప్తిగా నవ్వుకోవటం, "నేనేం చేసుకోనులే" అంటూ తను శోకం పొడిగించటం గుర్తుకి వచ్చాయి.

మళ్ళీ వేరే ఆలోచనకోసం మనస్సు వెతుకుతోంది. ఆ ఏడు సంక్రాంతి నెల వుందనగానే ఇంట్లో హడావిడి మొదలయ్యింది. పెరటి గోడలకు సున్నాలు మొదలుపెట్టి ఇల్లంతా పూసుకొచ్చారు. గడపలకి రాత్రిళ్ళు రంగులు పూస్తున్నారు. ఎవరి కాలికయినా రంగు అంటుకుందీ అంటే బామ్మచేతిలో చచ్చారన్నమాటే. అని ఒక సాయంత్రం తులసి కోట దగ్గర తీర్మానం చేసి పిల్లలకి తెలియచెప్పి, పటికబెల్లం విందుచేసింది బామ్మ.

"అన్ని వుట్టి మాటలే, బామ్మ ఎప్పుడూ కొట్టదు. అమ్మనే కోప్పడుతుంది, కొట్టొద్దని" అని తను చెప్పే మాట పూర్తి కాకుండానే ఇంకో పటికబెల్లం చేతికిచ్చి "అలా అని వాళ్ళకి చెప్పొద్దని" బతిమాలటం పూర్తికాకుండానే నాన్న బట్టలమూట, బామ్మ ముందు పెట్టించాడు. ఎంతో మంచిమంచి బట్టలు, మెరిసిపోయే గుడ్డలు! ఇంకా జరీపంచెలు, ఏవేవో చీరలు – అన్నీ చూస్తుంటే ఎంత బాగున్నాయో అనిపించింది. 'అన్నీ ఖరీదయినవే తెచ్చే వెందుకురా అబ్బీ'అంది బామ్మ.

'ఆ ఇదే మొదటిసారి ఆయె. ఆ మాత్రం వుండకపోతే బాగుండదని' అన్నాడు నాన్న.

'ఇంతమాత్రం  పెట్టకపోతే ఏం బాగుంటుందీ' అని అమ్మ అనటం. 'మరి నా పెళ్ళికి అలాంటి అంగోస్త్రం గుడ్డలు కొనిపించావేం?' అని చిన్నత్తయ్య అడగడం. 'అప్పుడు నా పెత్తనం ఏమివుంది? అంతా మీ అమ్మగారిదేగా' అని అమ్మ అక్కడనుంచి వెళ్ళిపోవటం, పండగకి వచ్చిన అక్కయ్య అత్తగారితో లాకుల దగ్గరికి షికార్లు, అక్కయ్య మరిదిని అన్నింటికీ ఎగతాళి చేసి ఏడిపించడంతో ఎంతో సరదాగా గడిచింది ఆ పండగ.  రాత్రిళ్ళు కూడా పగలుగానే సందడిగా జరిగింది.

అక్కయ్య బావని తలుపు వెనకనుంచి చూడటం బావ రహస్యంగా  పుస్తకాలు అక్కయ్య చేతిలో పెట్టడం, తను వెళ్ళి బామ్మకి చెపితే బామ్మ చెవిలో ఏదో చెప్పి, 'భడవా నీకెందుకే అవి అన్నీ' అని తన్ని తిట్టడం  గుర్తుకి వచ్చాయి.

అవును తనెందుకు చెప్పిందో మళ్లీ బావ రెండేళ్ల దాకా రాలేదు. అనుకునేవారు. ఆ ఏడు అక్కయ్య మామగారు పోయారుట. అత్తగారు, కోడల్ని చూడననిపట్టు పట్టిందట. అక్కయ్య మాత్రం వారంలో రెండురోజులు టపాసంచి కోసం ఎదురుచూసేది. ఒక్కోసారి రాకపోతే కోపంతో ఆ రోజంతా విసుక్కుంటూ వుండేది.

ఆ ఏడు వేసంగుల్లో బావ వస్తున్నాడని మళ్ళీ ఇల్లంతా సుబ్బరంచేయిస్తున్నారు. నీళ్ళ గది గోడ పడిపోయింది. కట్టిస్తున్నారు. దక్షిణం వేపు గదికి గుమ్మాలకి  గుడ్డలు కట్టి, పెద్ద పెద్ద అద్దాలు, ఫోటోలు ఎవరెవరివో తెప్పించి పెట్టారు.  గది అంతా కాయితాల పందిరిలా ఎన్నో రంగుల కాయితాలు కట్టారు.

హడావిడిగా వున్న ఇంట్లో బావ వక్కడే వచ్చాడన్న మాటతో అంతా వకసారి దిగులుపడ్డారు.  అంతా తలోసారి వెళ్ళి "ఏం బాబు మనవాళ్ళు ఎవరూరాలేదేం' అని అడగడం, బావ ముభావంగా నవ్వి వూరుకోవడం చూస్తూన్న తను 'బావని మాట్లాడవద్దని చెప్పి పంపారేమో వాళ్ళ వాళ్ళు, మూడు మాటల కథలాగా' అంటూంటే, 'వూరుకోవే ముదిపేరక్కా' అంటూ బామ్మ నవ్వు కొంగులో దాచుకుంటూ పక్కకి తప్పుకుంది.

బావకి కావలసినవి కనుక్కునే పని నర్సిగాడికి పడింది. వాడి అల్లరి భరించలేక వో బంతి చేతిలో పెట్టి బావ వాడిని బయటకి తరిమాడు.

ఏది కావాల్సినా తన్ని పిలవడంతో ఏదో ఘనంగా వుంది. ఆ సంతోషంతో మెళ్ళో  గొలుసు చూసుకోలేదు.

సంధ్యవేళ మెడ తడుముకుంటే కనబడక ఇల్లంతా కాలు కాలిన పిల్లిలా తిరుగుతోంది. బావ గదిలోకి తొంగిచూసింది. ఇంకెవరో కూర్చుని కబుర్లు చెపుతున్నారు.

గొలుసు పోయిందని ఇల్లంతా మారుమోగింది. అంతా తలోటి తిట్టడం, హడావిడిగా పెంటకుప్పలు వెతకటం, ఏడుపుతో తన కళ్ళు వాయటం చూసిన బావ గంభీరంగా ఏమీ ఎరగనట్టు "పోతేపోయిందిలే, ఇది పెట్టుకో" అంటూ మెళ్ళో పెట్టి కొక్కెం తగిలించాడు. పక్కన వున్న పిల్లలు గొల్లుమని నవ్వారు. ఇల్లంతా ఆ మాట చేరి నవ్వుతున్నారు. మేనత్త కూతురు వచ్చి పార్వతి బుగ్గలు గిల్లి మా అన్నయ్య వొచ్చే దాకా ఈ అన్నయ్య కట్టాడులే అని ఎగతాళి చేసింది.

తన మెళ్ళో వున్నది తన గొలుసేనని అప్పుడు తెల్సుకుంది. సిగ్గుపడటం, మళ్ళీ బావ పిలిచినా ఆ చుట్టుపక్కలకి వెళ్ళకుండా తప్పించుకు తిరగడం గుర్తుకు వచ్చాయి.

గాలి బుడగలు ఎగరేసుకున్నంత సందడిగా మళ్ళీ వో వారం గడిచిపోయింది.

ఈసారి అక్కయ్యని తీసుకుని బావ వెళ్ళిపోయాడు.

మళ్ళీ వెనకటిలాగే ఇల్లు నిద్దరపోవటం మొదలుపెట్టింది. తనకి ఎవరు వూరెళ్ళినా ఎందుకో ఏడుపు వస్తుంది. అల్లాగే అక్కయ్య వెళ్ళేటప్పుడూ ఆగలేదు, 'తప్పు, ఏడుపేమిటే' అని బామ్మ కసిరింది.

అక్కయ్య వెళ్ళిన కొత్తలో ఎక్కువ వుత్తరాలు వచ్చేవి కావు. ఎప్పుడయినా బావ వో కార్డు రాసేవాడు. అంతే, అక్కయ్య వస్తోన్నట్లు వచ్చిన ఉత్తరం ఆ ఇంట్లో ప్రతి ఒక్కరూ చదువుకున్నారు. ఈ సారి ఇల్లు అంతా ఎట్లాగ వున్నది అల్లాగే వున్నా వక్క అన్నయ్య గది మాత్రం శుభ్రం చేయించారు.

వస్తుందనుకున్న రోజుకి అక్కయ్య రాలేదు. మరో పదిరోజుల పోయాక పాలేరును తోడిచ్చి పంపారు. అంతా తలోసారి అక్కయ్యని కౌగలించుకుని పలకరిస్తున్నారు. చాలా చిక్కి నల్లపడిపోయింది పిల్ల అనుకుంది అమ్మ.

"ఎల్లా వుందే కొత్త కాపురం?" అని బామ్మ అక్క వీపు మీద చెయ్యేసి అడిగింది అప్పటిదాకా ఆపుకున్న దుఃఖం వక్కసారి పైకి వచ్చింది.

'ఏందుకే అంటూ వోదార్చి లోపలికి తీసుకెళ్ళారు. అక్క మరిది పోయాడని అప్పుడు తెలుసుకున్నారు ఇంటిల్లిపాదీ. 'ఇది విన్నారా!' అంటూ నాన్నతో 'మనమ్మాయిని చేసుకోబట్టి పిల్లాడూ, తండ్రీ పోయాడని సాధిస్తోంది వియ్యపురాలు' అని అమ్మ చెప్పింది.

"ఏదో అనుకుంటారులే! ఇంతకీ అతను జాగ్రత్తగా చూస్తున్నాడా?" అని నాన్న అడగటం.

"నీ కెందుకే అవతలికి పో" అని అమ్మ కసిరితే అక్కడ నించి తను వెళ్ళిపోవటం బుర్రలో తిరిగాయి.

ఈసారి అక్కయ్య బండెక్కే ముందు నాన్నతో "పార్వతికి అప్పుడే పెళ్ళిచెయ్యకు చదివించండి" అని పదిసార్లు చెప్పింది.

అమ్మ ఈ సారి కంట తడిపెట్టింది. వారానికి వకసారయినా వుత్తరం వ్రాయమని అక్కయ్యతో ఎన్నోసార్లు చెప్పింది.

ఈసారి అక్కయ్య వచ్చి వెళ్ళాక అసలు తోచడం లేదు. ఎవరికీ, ఎప్పుడేనా అక్కయ్య దగ్గరనుంచి వో ఉత్తరం వస్తుంది. అదే కాలక్షేపం ఆ ఇంట్లో, తెల్లవారటం, పొద్దుగూకటం, బామ్మ మడికట్టుకోవటం – అన్నీ సవ్యంగానే జరిగిపోతున్నాయి. అమ్మ వీర్రాజు మేష్టార్ని పెట్టి పురాణాలు నేర్పిస్తోంది. రుక్మిణీ కల్యాణం కంఠస్తం చేయిస్తున్నారు మాస్టారు. పద్యం వదిలేసి మంచి భర్త ఎల్లా ఉండాలో అని ఉపన్యాసధోరణిలో చెప్పుకు పోతున్నారు.

బామ్మ వచ్చి 'అవి ఎందుకు లెద్దురూ? పద్యం క్షుణ్ణంగా చదవటం చెప్పండి' అని విసుక్కుంది.

"అల్లాగే అల్లాగే" అంటూ నసిగి మేష్టారు పుస్తకం అటూ ఇటూ తిరగేసి ఆ రోజుకి చాలించారు.

కొద్దిరోజుల్లో పెద్దవాళ్ళ జతలో కలిపారు. ఇప్పుడు కొత్తరకం నిబంధనలు – వీధిలోకి ఎక్కువ వెళ్ళకూడదు. వంచాళింపుగా నడవాలి. గట్టిగా నవ్వకూడదు. పెద్దవాళ్ళు కింద కూర్చుంటే మంచాలూ ఏవీ ఎక్కి కూర్చోకూడదు. ఈ పాఠాలు బామ్మ రోజూ కొద్ది కొద్దిగా చెపుతుంది.

ఇప్పుడు మరీ బాధగా వుంది. పొద్దుగూకులూ నాలుగు గోడలమధ్యే వుండాలంటే, అక్కయ్యకి తను వుండేది కనక కాలక్షేపం అయ్యేదేమో! తనకి ఎవరూలేరు... నరసిగాడు వున్నా ఎప్పుడూ బొంగరాలు, గోళీలు ఈ ధ్యాసతోనే సరిపోతుంది.

బామ్మ పాఠాలు కూడా లేకుండా అత్తయ్యగారి వూరికెళ్ళింది. మళ్ళా మూడోనాడే నాన్నతో తిరిగి వచ్చేసింది. వచ్చిన దగ్గరనుంచి రాముడు బావని తిడుతోంది.

"కిరస్తానీ దాన్ని చేసుకున్నాడు రేపు" అంటూ మధ్య మధ్య ఏడుపుతో అమ్మకి చెప్పేది కొన్నాళ్ళు జరక్కుండానే అమ్మ నాన్నని ఎక్కడెక్కడికో పంపేది.

వో రోజు రాత్రి టెలిగ్రామ్ రావటం అంతా వక్కసారి గొల్లుమనటం జరిగింది. పిల్లంటే పిల్లా అది అంటూ బామ్మ అక్కని వర్ణించి ఏడుస్తుంటే అక్క ఏమయిందో అర్థం కాలేదు. కొంతసేపటికి విషయం తెలిసినా ఏడుపురాలేదు. మర్నాడు అమ్మా, నాన్నా అక్కయ్య అత్తారివూరు వెళ్ళాల్సి వచ్చింది. అంతా తలోరకంగా అమ్మకి చెప్పారు.

అక్కయ్యని ఎవరూ చూడలేదు. బావకి ఏదో వైరాగ్యం వచ్చినట్లు వున్నాడని ఇంకెవరో అమ్మకి చెపుతున్నారు.

"మీ అమ్మాయి పాదం ఎలాంటిదయినా కడుపులో పెట్టుకున్నాను. అయినా ఇల్లా అన్యాయం చేసిపోయింది" అంటూ గట్టిగా బొబ్బలుపెట్టి అత్తగారు ఏడుస్తోంది.

"అబ్బో! అంత ఇదిగా సూత్తె నూతిలో ఎందుకు దూకుద్దీ" అని గుసగుసలాడేరు వచ్చినవాళ్ళు. మర్నాడే తిరుగుప్రయాణం. అమ్మా నాన్నని చూస్తే దుఃఖం ఆగటం లేదు. ఎద్దుబండి పుంత దాటుతోంది. ఎవరో పెద్దలు నాన్నని దిగమని సైగచేశారు. ఏదో కొంతసేపు మాటలు జరిగాయి. నాన్న ముఖం కండువాతో దాచుకోవటం, మళ్ళా బండి కదలటం గుర్తుకు వచ్చి ఏడుపు ఆగటం లేదు.

అమ్మ తేరుకునేసరికి చాలా నెలలు గడిచాయి. ఓరోజు చీకట్లో మళ్ళీ ఆ పెద్దలు దిగబడ్డారు. నాన్న బామ్మఅంతా ఏమిటో మాట్లాడుకున్నారు.

అమ్మ వచ్చి "నువ్వు వొప్పుకోవద్దు వాళ్ళు అడిగితేనని" రహస్యంగా చెప్పింది.

ఎవరూ వచ్చి అడగలేదు. అమ్మని నాన్న కోప్పడ్డం మాత్రం అందరికి వినబడింది. అచ్చి రాలేదు. కనక గుళ్ళో పెళ్ళి అని వప్పించారుట. అమ్మకి ఇష్టం లేదు. అయినా అయిపోయింది. అక్కకి అన్యాయం జరిగింది అని మనస్సు ఘోష పెట్టినా తన ఇష్టాయిష్టాలతో పని యెవరికి? రామంబావ చేసుకునుంటే ఇల్లా జరిగివుండేది కాదు అన్న ఆలోచన మళ్ళా వెనక్కు వెళ్ళింది. అయినా తనకు చదువా సంగీతమా! ఏమి వున్నాయి కనుక! చేసుకోలేదన్న బాధ ఎందుకు! ఏమో బామ్మ 'మంచి మొగుడు రావాలని' దీవించినప్పుడల్లా రామంబావనే తలచుకోవటం. "ఛీ! ఇప్పుడు జరిగిందేమిటి? పెళ్ళి చేసుకోకపోయినా రామంబావ ఎల్లాగాచేసుకోడు, అనుకొని తల దిమ్ముగా ఉంది. భోజనాల దగ్గర అత్తగారు అన్న మాటలు మళ్ళీ కొత్తరూపంతో తిరుగుతున్నాయి.

ఆ రాధ వూళ్ళో ఉంటే నీకు ఇంటిగొడవ ఎందుకు పడుతుందిలే. అయినా దీన్ని మళ్ళీ వకదాన్ని కట్టిపెట్టారుఅని విసుక్కోవడం.

ఎవరు కట్టారట? అసలు రాధ ఎవరు? అక్కయ్య అలా చెయ్యడానికి ఆమే కారణమేమో! రకరకాల ప్రశ్నలు తిరుగుతున్నాయి. రాధ పేరుమీదే ఈర్ష్య పుడుతోంది. పోనీ ఆవిడనే చేసుకోక ఇదేమిటి? దీనికి సమాధానం మనస్సు ఇవ్వటం లేదు. నూతి గోడమీద తెల్లగా మనిషి కనపడుతోంది. భయంతో వంట్లో వణుకుపుట్టింది. ఒకవేళ అక్కయ్యవచ్చి అక్కడ కూర్చోలేదు గదా! వెళ్లి చూస్తేనో అనిపించింది. మళ్ళీ భయంతో వంట్లో దడ ఎక్కువయింది. గుండెలు గట్టిగా పట్టుకు నూతివేపు పరుగుపెట్టింది.

తనుచూసిన మనిషి నూతిలోకి దూకుతోంది. గట్టిగా అరవాలని, కంఠము ఎత్తి పిలవాలని ఎంతో ఆర్భాటం చేసినా మాట రావటం లేదు. తన్ని ఎవరో గట్టిగా పట్టుకున్నట్టు వుంది. కింద పడిపోవడం తెలుస్తోంది. అత్తగారి కేకలికి ఇంటిల్లిపాదీ అక్కడ చేరారు.

తెలివి వచ్చాక లేచి కూర్చోబోయింది పార్వతి. "ఏమయిందే తల్లి నీకు? నేను చెట్టుక్రింద వేసుకోకే అనిచెపుతూనేవున్నా మాట వినిపించుకుంటేనా? అయినా వాడిని

అనాలి. దాన్ని ఆలనా పాలనా కనుక్కోడాయె. ఇదివరకు ఆవిడని నెత్తినెట్టుకు వూరేగాడు. ఎవరు ఎన్ని అన్నా లెక్క చెయ్యకుండా. ఇప్పుడు మాత్రం ఎవరు వద్దన్నారు కనుక!" అంటూ స్వగతం చెప్పుకుపోతంది రావమ్మ.

పార్వతి వెక్కి వెక్కి ఏడుస్తోంది. పక్క ఇంట్లో ఎవరితోనో వీబూతి పెట్టించింది కోడలికి రావమ్మ.

తెల్లవారి వకరొకరే పరామర్శకి వస్తున్నారు. పార్వతి తప్పుకుతిరుగుతోంది. వచ్చినవాళ్ళకి వో కథలా చెప్పుకు వస్తోంది రావమ్మ.

కొడుకు ఆ విషయమే అడగలేదు అని మనస్సులో పీకుతోంది. తనే అడిగేసింది వడ్డిస్తూ. "అబ్బీ! రాత్రి జరిగిన గొడవ విన్నావా!" అని రావమ్మ.

భాస్కరరావు ముభావంగా వూకొట్టి వెళ్ళిపోవటం అర్థంకాక రావమ్మ తెల్లపోయి చూస్తూ నిల్చుండిపోయింది.

కోడల్ని తనైనా జాగ్రత్తగా చూడాలి అనుకుంది. ఇప్పుడు ఏ పని చెయ్యనివ్వటం లేదు.

తన పక్కనే మంచము వేయిస్తుంది. చుట్టుపక్కల అమ్మలక్కలకి కొడుకుమీద నేరాలు చెప్పుకునేది. "చిన్నపిల్లదాన్ని కట్టుకున్నాడన్న మాటేగాని ఇంతవరకూ కన్నెత్తి చూడలేదంటే నమ్ము. ఇది అట్టే గడసరి కాదు, నన్ను పట్టుకు పాకులాడుతుంది పాపం" అని రావమ్మ పక్కింటి ఆవిడకి చెప్పటం కొడుకు విన్నా ఎరగనట్లు వెళ్ళిపోయినాడు.

ఎండలు వెనకపట్టి జల్లులు పడుతున్నాయి. ఇంట్లో వుక్క, బయట వానతో నిద్రపట్టక అటూ, ఇటూ తిరుగుతోంది రావమ్మ.

పార్వతి వెనక వసారాలో వేసుకుంది మంచం. కొద్దిగా జల్లుపడుతున్నా ముడుచుకు పడుకుంది. బావ నిజంగా ఎంత మంచివాడో అని అంతా అనుకునేవారు. నిజానికి బావలో తనకేమీ మంచితనం కనపడటం లేదు వేళకి వచ్చి తిని పోవటం తప్ప. అత్తగార్ని అంతా తిట్టుకున్నారు. తనకి ఎన్నో చెప్పి పంపారు. ఆవిడని గురించి, కానీ నిజంగా ఆవిడలో వున్న జాలి, అమ్మకి కూడా లేదేమో. తన్ను ఎంత

ప్రాణంగా చూసుకుంటుందో  పాపం! బావతో ఎప్పుడూ మాట్టాడకూడదు అన్న నిర్ణయానికి వచ్చేసింది పార్వతి.

దానితోడు రాధకి కొడుకు పుట్టాడని ఎవరో అత్తగారితో రహస్యంగా చెప్పడం వింది. అక్కయ్య పోవటానికి కారణం తెలిసినట్లు మనస్సుకి స్థిమితం వచ్చింది. బావ మాట ఇంక తనకెందుకు? ఏదో వున్నన్నాళ్ళూ అత్తగారి దగ్గరే ఉండాలి. తరువాత ఏం చెయ్యాలి? తనకి నుయ్యంటే భయం. అక్కయ్య ఎల్లా చెయ్యగలిగిందో? తను ఏదో చేసినట్లు వూహించుకు ఏడుస్తోంది పార్వతి.

భాస్కరం మొదటిసారి అనవచ్చు పార్వతిని పిలవటం.

"ఎందుకురా? అది పడుకుంది" అని తల్లి సమాధానం.

"ఇంకా  ఎనిమిదన్నా కాలేదు. అప్పుడే పడకేమిటి?" అని విసుక్కుంటూ వసారాలోకి చూశాడు.

"బాగుందిరా వరస. నువ్వేమో వూరుచుట్టి రెండో జాముకి కానిరావాయె. అది చిన్న పిల్ల ఏం చెయ్యమంటావు నిద్దరోక" అంటూ తను వెన్నువాల్చింది రావమ్మ బావ తన మంచందగ్గరకి రావటం చూసి లేచి నిల్చుంది పార్వతి.

బుగ్గమీద నీటిచారలు కళ్ళ కాటుక కిందకి జరిగి మరీ పెద్దగా కళ్ళ కనబడుతున్నాయి రేగిన జుట్టుపై గుడ్డిదీపపు కాంతి పడి గాలి అలలా కదులుతోంది.

భాస్కరం రెప్పవెయ్యకుండా చూస్తున్నాడు.

"ఏమంటున్నావురా అబ్బీ" అంటూ తల్లి రావటం చూసి, భాస్కరం లేని గాంభీర్యం తెచ్చుకుని "పిలిస్తే పలకదేం?" అని పార్వతిని విసుక్కుని విసురుగా తన గదివేపు వసారాలోకి వెళ్ళిపోయాడు.

"పోనీ ఏమిటో అడక్కపోయావే" అని మెల్లగా పార్వతి కళ్ళల్లోకి చూసింది. నిండిన కళ్ళనీళ్ళు  ఎండిన చారికలపైకి దిగుతున్నాయి. "ఏమిటో వాడి మనస్సు రాయిలామారింది. ఇదివరకు ఇల్లాగే వుండేవాడా!" అని తనలోనే అనుకుని, "పోనీ, నువ్వేనా వెళ్ళి కనుక్కోవాయె" అంటూ పార్వతిని  కొద్దిగా కోప్పడి, భాస్కరం గదిలో విడిచివచ్చింది రావమ్మ.

పార్వతికి ఇప్పుడు అయోమయంగా వుంది. అకారణంగా అత్తగారికి ఈ కోపమేమిటి? అసలు ఈ ఇంట్లో అంతా తన్ని అదోలా ఎందుకు చూస్తున్నారు? తనలో లోపమేమిటి? తన తోటి సుశీల గుర్తుకి వచ్చింది. వాళ్ళ అత్తారింట్లో ఎప్పుడూ తనమాటే వస్తూ వుంటుంది అని చెప్పింది. సుశీల అత్తగారు ఎన్నిసార్లో బామ్మతోటి అమ్మమ్మతోనూ అనటం 'మీ పార్వతిలాంటి కోడలు రావాలంటే ఏం అదృష్టం పట్టాలో, ఆ కాస్త శాఖా భేదానికీ ఏమిటి లెద్దురూ! మీరు వూ అంటే రేపే పెట్టిస్తా ముహూర్తం' అంటూ తన్ని దగ్గరకి లాక్కోవటం జ్ఞాపకం వచ్చి పార్వతి సిగ్గుతో ఇంకా ముడుచుకు మూలకి జరిగి కూర్చుంది. మళ్ళీ మళ్ళీ ఆవిడ మాటలే మనస్సులో తిప్పుకుంటోంది.

వర్షపుగాలి తుప్పర్లతో వంటికి తగిలి చలితో కలిసి హాయిగా వుంది ప్రాణానికి. ఎప్పుడో కునుకుపట్టింది.

రామం బావ వళ్ళు అంతా కితకితలు పెడుతున్నాడు. తను నవ్వుతూ తప్పించుకుంటోంది. ఛా అంటూ గట్టిగా పైకి నవ్వి కళ్ళు తెరచింది అరికెన్ లాంతరు వెల్తురులో దగ్గరగా బావ కళ్ళు మెరుస్తున్నాయి.

నిజమో కలో తెలియక కళ్ళు మూసుకుంది. "ఎందుకు నవ్వుతున్నావు?" అని బావ అడగడంతో భ్రాంతి విడచి భయం చుట్టుకుంది. అరిచేతుల వెనక మొహాన్ని దాచుకుంటోంది. తన చేతులు బావ చేతుల్లో ఇరుక్కున్నాయి. దీపపు పురుగులా కదిలేందుకు వ్యవధిలేదు. తనకి ఇష్టంలేదు. చెప్పేందుకు ప్రయత్నిస్తే , గొంతురాక మూగవోయినట్లుంది. తన మొహంలో భావాలు తెలవకుండా దీపం రెపరెపలాడి గాలిలో కలిసింది. జీవితంలో తనకి ఇంక కోరికలు వుండకూడదు. ఉన్నా అవి తనలోనే భద్రంగా దాచుకోవాలి.

మామూలుగానే తెల్లవారింది. ఇంట్లో అంతా కాలంతో పరుగుపెట్టినట్లు పనులు పూర్తి చేసుకుంటున్నారు. నీరులేని ఏటిలా మనస్సు కదలటం లేదు. చెట్టు మొదట్లో చలనం లేకుండా కూర్చుంది. పాల చెంబుతో వస్తున్న భాస్కరం పార్వతిని చూసి నవ్వాడు. మడిబట్ట ఆరవేసే అత్తగారిలో ఎండవేడి రగిలింది. వడగాలిలా మాటలు పార్వతిని చుట్టుకున్నాయి. గతంలో పార్వతి అంటే జాలి. ఆ క్షణంలో

పార్వతి మనస్సు పెరిగింది. ఆ వూరి ఆకారం ఆ ఇంట్లో కదిలింది. తుప్పలూ, పుంతలూ, శిధిలాలూ, వాటిని చుట్టి మొండిగోడలు. అందులో తను జీవించాలి గడ్డిపోచలా. మొండి మనసుల నీడలేని ఎడారి సుడిగాలిలో కూలిపోయిన భవనం. అక్కయ్య జీవితం శూన్యంలో వెలిగించిన ప్రమిదలా తను ఎంతకాలం నిలవగలనో అనుకుంది పార్వతి.

కాలం వేసిన ఎగుడు దిగుడు బండలపైన జీవితం సాగుతోంది.

# పువ్వులన్నీ శ్రీవారివే

- నాయని కృష్ణకుమారి

**కొం**డ మంచి మనిషి మనస్సులా చల్లగా ఉంది. ఎటుచూచినా పచ్చదనం. చెట్లన్నీ ఆకుల గొడుగులు విప్పి వచ్చేపోయే యాత్రికులకు ఎండ తగలకుండా సేవ చేస్తున్నట్లున్నాయి. సంపెంగ చెట్లు బంగారు రంగు పూలను స్వర్ణాభరణాలుగా అలంకరించుకుని మెరిసి అల్లికల చిక్కదనంతో, చెట్ల తలాడింపుల్లో, అంతా మైమరపు కలిగించే సౌందర్యమే! కొండచరియల్లో కంటికి కనిపించని అద్భుతశక్తి ఏదో గాలం వేసి తన వైపుకు లాక్కుంటున్న అనుభూతి. "ఎక్కడో ఉన్న తనను వెతికి పట్టుకోమని అదృశ్యశక్తి మనల్ని సవాలు చేస్తున్నట్లుగా ఉంటుంది నాకు" అంటుంది లక్ష్మి.

"అదృశ్యశక్తా, మశాణమా! నువ్వో సెంటిమెంటల్ ఫూలువి. నీకెప్పుడూ శక్తి ముక్తి అంటూ ఒకటే గోల! అది కేవలం ప్రకృతి పట్ల మనిషికుండే అంతులేని ఆకర్షణ మాత్రమే" అంటాడు శ్రీధర్. శ్రీధర్ ఒక రకంగా నాస్తికుడు, ఆస్తిక నాస్తిక వాదాలు జరిగేటప్పుడు అతడే పక్షమూ వహించడు. "అసలు దేవుడంటే ఏమిటి? మీరెన్నయినా చెప్పండి. ఆ ప్రశ్న నాకర్థమే కాదు. అటువంటప్పుడు ఉన్నాడని గానీ లేడనిగానీ నేనెట్లా చెప్పగలను" అంటాడు. అతని మాటలు వింటుంటే లక్ష్మికి ఒక తార్కికుడు మాట్లాడినట్లుంటుంది. దేవుడి ఉనికిని ప్రశ్నిస్తే మాత్రమేం? అతను మంచి మనిషి. ఒకరికి చెరుపు తలపెట్టడు. తనకు చేతనైన సహాయం అవసరమైన వాళ్ళకు అందించే ఆర్ద్రత కలవాడు. దేవుడున్నాడని నిరంతరం పూజలుచేసి ఎదుటి వాళ్ళను కసిరికొట్టే మనుషుల కంటే ఎన్నో రెట్లు ఉన్నతంగా కనిపిస్తాడు. లక్ష్మి బుద్ధి అస్తిత్వం వైపు మొగ్గుతుంటుంది. మనసు మూలల్లో ఎక్కడో దేవుడనే భావన వెలుగుతున్నట్లుంటుంది. అయినా రోజూ ఒక విగ్రహం ముందు దీపం వెలిగించి కాయో, కర్పూరమో అర్పించి, దణ్ణం పెట్టుకునే ఆచారాన్ని ఆవిడ ఎప్పుడూ పాటించలేదు.

"నీదంతా విచిత్రం లక్ష్మి, దేవుడున్నాడనుకునే దానివి రోజూ పూజెందుకు చెయ్యవ్" అంటాడు శ్రీధర్.

"బహుశ నేను ఎగతాళి చేస్తానని మానేసి ఉంటావ్. అవునా?" అని రెచ్చగొడతాడు.

"ఏమన్నా అనుకో ఒకటి మాత్రం నిజం. దేవుడున్నాడు అనుకున్నందువల్ల నాకు దృఢమైన అండ దండ లభించినట్లుగా ఉంటుంది. నన్ను ఆదుకునే చేతిని చాచుకుని ఎప్పుడూ నా వెనక వెనకే ఆ దేవుడు నడుస్తున్నట్లుగా ఉంటుంది. ఎంతో మనశ్శాంతి చల్లగా నిలువెల్లా విరిసినట్లుగా ఉండటానికి ఆ భావనే కారణమని నా నమ్మకం"

"అటువంటి భావన నీకు కలగడానికి నీ ఆత్మ స్థైర్యం కారణం కావచ్చు కదా!"

"పోనీ నీవు దానికి స్థైర్యమని పేరుపెడ్తే నేను దైవభావన అని పిలుస్తున్నాను. ఇందాక నేను అదృశ్యశక్తి అంటే నీవు ప్రకృతి అన్నట్లే యిది కూడా పేరులో ఏముంది పోదూ!" అంటూ తేలిగ్గా వాదనను తుంచేస్తుంటుంది లక్ష్మి. ఇటువంటి విషయాల్లో ఆ దంపతులకు ఏకాభిప్రాయం ఎప్పుడూ కుదరదు. పైకి వాదిస్తున్నా లోలోపల ఒకరి అభిప్రాయాలను మరొకరు గౌరవించే పద్ధతిని అవలంబిస్తూనే ఉంటారు.

అట్లా ఒక నాస్తికుడు, ఆస్తికురాలూ ఇద్దరూ కలిసి శ్రీవారి కొండ మీదికి పదిరోజులపాటు ఉందామని విచ్చేశారు. నగర జీవితంతో విసిగిపోయిన యిద్దరికీ ఈ మార్పు చాలా బాగుంది. లక్ష్మికి తెల్లవారుఝామున దూరంగా లీలగా వినిపించే సుప్రభాత శ్లోకాలూ, ఒళ్ళు నిమిరి సేదతీరుస్తున్నట్టుగా మెల్లమెల్లగా దగ్గర చేరే పిల్లగాలుల హొయలూ, దేవుడి గుడినుండి, బయటకి వ్యాపించే కర్పూర పరిమళచ్ఛాయలూ ఇవన్నీ ఎంతో ఇష్టం. వీటిని అనుభవిస్తున్న వేళలో మనసంతా ఒక అలౌకికానుభూతి నిండి తనను తాను శాంత సరోవరంలో శ్వేత హంసను చేస్తున్న చర్య చాలా ఇష్టం. ఆ అనుభవం మళ్ళీ మళ్ళీ కావాలనే ఆవిడ కొండ మీదికి వస్తూ ఉంటుంది. శ్రీధర్ రావడానికి ఒకే ఒక బలీయమైన కారణం ఉంది.

నలభైనాలుగు డిగ్రీల వేసవి వేడిమి నుండి పారిపోయి కొండ చల్లదనాన్ని కొల్లగొట్టాలనే అతని రాక.

వాళ్ళిద్దరికీ శంకుమిట్ట కాటేజీలలో ఒక కాటేజీ కేటాయింపబడింది. లక్ష్మి చెల్లెలి భర్తా, ఆయన అన్నదమ్ములూ ఉమ్మడిగా ఒక కాటేజీ నిర్మాణానికి దానమిచ్చారు వాళ్ళుగానీ వాళ్ళద్వారా వచ్చిన వాళ్ళుగానీ సంవత్సరంలో ఒక నెలరోజులు ఆ కాటేజీలో ఉండే వెసులుబాటుంది. ఇరవైనాలుగ్గంటల్లో కాటేజీ ఖాళీ చెయ్యాలన్న సామాన్య సూత్రం వీరికి వర్తించదు. లక్ష్మి తన చెల్లెలి ద్వారా కొండ మీద పదిరోజులపాటు ఉండగలిగే అర్హతను సంపాదించుకుంది.

శంకుమిట్టలో బస ఏర్పడిన యాత్రికులందరికీ ఒక విశ్రామ స్థలం ఉంటే తీర్చిదిద్దిన కాలిబాటలూ, గడ్డి కత్తిరింపులు, పువ్వుల పొదలూ అన్నీ అపారమైన అందాన్ని చిన్న చిన్న ముక్కలుగా కత్తిరించి ఆ స్థలంలో వెదజల్లినట్లుంటాయి. దానికి నడిబొడ్డున విష్ణుదేవుని శంఖచక్రాలూ తిరునామమూ లైట్ల వెలుగులో ఎంతో దూరానికి మనోహరంగా కనిపిస్తాయి. ఆ ప్రదేశాన్ని శంకుమిట్ట అనడానికి కారణం కూడా ఆ శంఖమే.

ఎండ వేడిమి నుండీ పని ఒత్తిడి నుండీ తప్పించుకు వచ్చిన యాత్ర కనుక లక్ష్మీ శ్రీధర్ లిద్దరూ రోజూ కొండ మీద అటూ ఇటూ తిరిగి వస్తుండేవారు. ఉచిత బస్సుల్లో ఒక చోటు నుండి మరో చోటుకు పోవడం హాయిగా, గమ్మత్తుగా అనిపించేది. పొద్దున్నే ఫలహారానికొక హోటలైతే మధ్యాహ్నం భోజనాని కొకటీ రాత్రి భోజనానికి మరొకటిగా మంచి హోటళ్ళ వేటలో పడేవారు. సాయంకాలాలు శంకుమిట్ట ఉద్యానంలో గడ్డిపరుపు మీద కూచుని చల్లదనాన్ని అనుభవిస్తూ ఉండేవారు. తమ చుట్టూ కన్ను కోరే రకరకాల పుష్ప విన్యాసాలు. “కాసిని పూలు కోసుకుంటే బాగుండును” అనేది లక్ష్మి సగం స్వగతంలాగా సగం ప్రకాశంలోనూ!

“కొయ్యకూడదు. కొండమీద పూలన్నీ శ్రీవారివే” అని రొక్కించేవాడు శ్రీధర్.ఆ మాటలే అక్కడక్కడా చిన్న బోర్డుల మీద కూడా వ్రాసి కనబడుతూ ఉండేవి.

“ఇన్ని పువ్వులు ఏం చేసుకుంటాట్ట ఆ శ్రీవారు. ఆడకూతుళ్ళ తలల్లో ఉంటే ఆయన చూపు మెచ్చదా?” అని గొంతు పెంచేది లక్ష్మి. ఏవన్నా చేసుకోనీ ఒంటినిండా

దిగేసుకుంటాడు. మధ్యలో నీకెందుకట! అని వాదనను పెంచడానికి చూచేవాడు శ్రీధర్.

"అలంకరించుకున్నాకే గుళ్ళో నిలువు జీతం కొలువులోకి ఎక్కిపోయాడుగా! ఇంకా ఎందుకో అది సరే అన్ని పువ్వుల్నీ సొంతం చేసుకుని అన్నీ నావే అంటున్నాడు గానీ వాటి బరువు బాధ్యతలన్నీ తనవేనా, యేం?" అని లంకించుకుంది లక్ష్మి. ఆవిడ తనతో వాదిస్తుంటే వినడం శ్రీధర్‌కు ఇష్టం. కేవలం వాదనను పెంచడం కోసమే తానూ అడ్డదిడ్డంగా వాదనలోకి దిగుతుంటాడు. పువ్వుల విషయంలో బరువులేమిటి బాధ్యత లేమిటి నీకు పనిలేక బుఱ్ఱ సరైన మార్గంలో ప్రయాణించడం లేదు" అని రొక్కించాడు. "కాదు మహానుభావా! ఇవి పువ్వులే అయితే ఈ పువ్వులు మరి వేటికైనా ప్రతీకలు కాకూడదా. ఈ పువ్వులన్నీ నావి అన్నవాడు బహుశా ఈ పువ్వులే ఇక్కడికొచ్చే అసంఖ్యాక భక్తజనమైతే ఈ జనమంతా నా వాళ్ళే అంటాడా? వాళ్ళ మంచిచెడ్డల బాధ్యతల్ని నెత్తిన వేసుకుంటాడా?" "ఏమో వేసుకుంటాడేమో! కాదని నీతో ఏమైనా చెప్పాడా?" శ్రీధర్ కళ్ళు కొంటెతనంతో మెరుస్తున్నయ్.

సరేలే సంబరం కొండమీది కొచ్చి అప్పుడే మూడురోజులు గడిచిపోయినయ్. ఇంతవరకూ నేనాయన మొహమూ, ఆయన నా మొహమూ చూడలేదు. ఇక ఆయన నాకేం చెప్తాడు నేనేం వింటాను." అని నిరాశను ధ్వనిస్తూ ఊరుకుండిపోయింది లక్ష్మి.

"చూద్దుగానిలే ప్రవాహం లాంటి జనాన్ని చూస్తున్నావుగా. నువ్వో ప్రముఖ వ్యక్తివై ఉంటే వరసలో ఉన్న జనాన్ని నిలిపేసి నీకు దగ్గరుండి దర్శనం చేయించేవారు మరి!"

"ఇటు చూడు ఆ పెద్ద మబ్బు! గుళ్ళో నిలువు కాళ్ళ కొలువుచేసే ఆ నల్లటాయన లాగా లేదూ?" అన్నది శ్రీధర్‌తో. అందుకు ప్రతిగా గొంతులో మరింత ఉద్వేగాన్ని దట్టించుకున్న శ్రీధర్ లక్ష్మీ ఇటు చూడు! చిన్నపాప! రెండు జెళ్ళు. నీలం గౌను త్వరగా వచ్చేయ్" అని ముందుకు పరుగు తీశాడు. అయోమయంగా లక్ష్మీ శ్రీధర్ వెనక పరిగెత్తింది. అప్పటికే అతడు ఆ పిల్లను పొదివి పట్టుకున్నాడు. బుజ్జగిస్తున్నాడు. "నీ పేరేంటి పాపా!"

"చునీత"

మీ అమ్మ పేరు

"లాత"

నాన్నపేరు

"లామచామి"

ఒక్కదానివే ఇటెక్కడి పోతున్నావ్.

మా అమ్మ కనిపించట్లేదు. పాప ముఖం రంగులు మారుతోంది. ఏడుపు పైకి తన్నుకొస్తున్నట్లు ముఖరేఖలు కుంచించుకు పోతున్నాయ్.

"భయంగా ఉందా?"

"ఎందుకూ? ఈ కొండ చామిది కదా! ఇక్కడ భయం ఉండదంట. మా బేబీ చెప్పింది". ఇదంతా వింటున్న లక్ష్మి మనస్సులో ఉవ్వెత్తున ఎగసిన ఆనందతరంగం చెమ్మగిల్లిన కళ్ళతో పైకి చూస్తే ఆ నల్లమబ్బు అక్కడే ఉంది.

"బలే చతురుడివే! పువ్వులు ఇవ్వకూడదా అన్నానని ఈ పువ్వును నా చేతుల్లో పెట్టావా. బరువు బాధ్యతల్ని నీ తలమీదికెత్తుకుని ఫలితానికి సంబందించిన తృప్తితో నా గుండెను నింపేశావు గదయ్యా" అనుకుంది.

మొగ్గలాంటి ఆ నీలిగౌను చిన్నారి రెండు చేతుల్నీ అటూ ఇటూ పట్టుకుని లక్ష్మీ శ్రీధర్ లిద్దరూ గుడికి అభిముఖంగా నడవసాగారు. వాళ్ళ మనసులు రెండూ సాయంకాలపు జాజి మొగ్గల్లాగా విరియనారంభించాయి.

# గాలి రథం

**– ఆర్. వసుంధరాదేవి**

ప్రక్క వీధిలోని దర్గానుంచి మౌజీన్ అజా యిచ్చాడు. అతని గొంతు జలుబుతో పగిలి వికారంగా అపస్వరాలు పలుకుతోంది. వల్లీ లేచి కూర్చున్నాడు కళ్ళు నలుముకుంటూ. ఇంకా తెల్లవారలేదు. మొదటవాడికి తానెక్కడున్నదీ సరిగ్గా జ్ఞాపకం రాలేదు. ఏదో పొరపాటు జరిగిపోతున్నట్లు మనుసునిండా ఆదుర్దా, దిగులు – చుట్టూ చూశాడు. రైల్వే ఓవర్ బ్రిడ్జి క్రింది ఒక సందు అది. గబుక్కున జ్ఞాపకం వచ్చేసింది. అది వాడి మేనమామ వుండే చోటు. వెనుక సగానికి తడికెలు అడ్డంపెట్టుకొని వాళ్ళు ఉంటున్నారు. ముందు సగంలో డీల్‌వుడ్ చెక్కలు తెచ్చుకొని వాటితో పెట్టెలు, షెల్ఫులు పడక్కుర్చీలు చేస్తాడు మస్తాన్ మామూ... ఆస్పత్రివాళ్ళు 'లాభంలేదు తీసుకెళ్ళండ'ని చెప్పాక నేరుగా అమ్మని యిక్కడికి తీసుకొచ్చారు మూడురోజుల క్రిందట. ముందుపక్క ఖాళీ జాగాలో వుంటున్నారు. మురికి పట్టిన తెల్లదుప్పట్లో ఆసాంతం ముసుగు క్రిందవున్నది అమ్మ. ప్రక్కనే వాడి అక్క మెహర్ ఒంటిమీద గుడ్డలన్నీ చెదిరిపోగా అస్తవ్యస్తంగా వుట్టి నేలన పడుకొని ఒళ్ళు తెలియకుండా నిద్రపోతున్నది. నిన్న పగలంతా అమ్మ ప్రక్కనే కూర్చుని గుడ్డ పేలికతో యీగలు తోలుతూనే ఉంది...

గాలి చల్లగా తాకింది. 'రాయీ రాయీ కరిగే వేళన దేవతలు గాలిరథం ఎక్కి తిరుగుతారు. అందుకే అప్పుడు గాలి తోలుద్ది. అడివిలో పెరిగే మానులకీ, కొండల్లో రాతికీ రాతికీ మధ్యన పుట్టే చెట్టుకీ ఎవరు పోషణ చేస్తారు? ఆ గాలీ, ఆ దేవుడూను' అమ్మమాటలు జ్ఞాపకం వచ్చి చుట్టూ చూశాడు వల్లీ – గాలిరథం కోసం వెతుకుతున్నట్లు.

వల్లీ మనసులో దిగులు, వెలితి అట్లాగే వున్నవి. నెలరోజుల క్రిందటివరకూ రాత్రిళ్ళు అమ్మ ప్రక్కలోనే పడుకునేవాడు. నిద్రలో మెలకువ వచ్చినా, భయం వేసినా, పీడకల వచ్చినా అమ్మ పొట్ట తడుముతాడు. భయం పోతుంది. దెబ్బతగిలినా, నొప్పి కలిగినా, నాయన కొట్టినా ఏడ్చుకుంటూ అమ్మదగ్గరకి చేరుతాడు. ఒకచేత్తో

చీరకొంగు  పట్టుకుంటాడు. రెండో చెయ్యి గుడ్డిగా ఆత్రంగా అమ్మ పొట్టమీద తచ్చాడుతుంది. ఆ పొట్టను గట్టిగా పిడికిల్లో పట్టుకుంటాడు. అమ్మవాడిని దగ్గరకు లాక్కుని గట్టిగా కావలించుకుని ఏడ్పు ఉధృతం తగ్గాక ఒదిలేస్తుంది... ఎనిమిదేళ్ళ వాడైనా వాడికి చిన్నప్పటి అలవాట్లు పోలేదు. అమ్మకు బాగా లేనప్పటినుంచి వాడు అమ్మదగ్గర  పడుకోవటం లేదు.

ఎనిమిదేళ్ళ  వయసుకంటే ముదురుగా కనిపించే ముఖం వల్లీది. నలుపు, పొట్టి – అంతా తల్లిపోలిక. పదిహేనేళ్ళ  మెహర్  తండ్రి పోలికలతో సన్నగా, తెల్లగా వుండి పెద్ద కళ్ళతో నాజూకైన ముఖంతో  అందంగా వుంటుంది. ఏడాది క్రిందట రసూల్ బావతో మెహందీ అయి పట్నం వచ్చేసింది.

వల్లీ అమ్మ ఫతిమాబీ కూలినాలి చేసి ఇల్లు నడుపుతుంది. వ్యవసాయం, నాట్లు, కోతలు, ఇండ్లలో బియ్యం బాగుచేసివ్వడం, ఇల్లు కడగడం,  పిండి దంచడం ఏ పనైనా చేసి డబ్బు తెస్తుంది. నాయన బాబాసాబ్ ఎప్పుడో ఒకరోజు కూరగాయలో, పళ్లో వ్యాపారం చేస్తాడు.  మిగతా రోజుల్లో  అమ్మని కొట్టి, బాధించి పావలో, అర్థో పట్టుకెళ్తాడు తాగటానికి. ఇదివరకెప్పుడో  స్కూల్లో చదువు చెప్పేవాడని అమ్మ చెప్పింది. ఆమె బాబాసాహెబ్‌కు మూడో భార్య. మొదటి యిద్దరూ చచ్చిపోయారు.  బాబాసాబ్ తెల్లటి మనిషి, పలచగా పొడుగ్గా వుంటాడు. బోడిగుండు,  మేకగడ్డం, గళ్లలుంగీ పైకి యీడ్చి గట్టిగా చెక్కి, పైన ఒదులుగా వుండే తెల్లచొక్కా వేసుకుంటాడు. బక్క మనిషి, బక్క కోపంతో వల్లీని వూరికే  చావబాదుతాడు  ఒక్కోసారి.

ఫతిమాబీ రోజూ పనిలోంచీ యింటికొచ్చేప్పుడు వల్లీకి  తినడానికి ఏమైనా తీసుకొస్తుంది. బొరుగులో,  బెల్లమో, కారపు చుట్టలో ఏదో ఒకటి. అవి జేబులో వేసుకుని నీళ్లు తెచ్చివ్వడమో అంగడికి పోయి రావటమో కట్టెపుల్లలందివ్వటమో ఏదో ఒక పని చేసిపెడుతూ  అమ్మ వెనకనే  తిరుగుతుంటాడు వల్లీ.

ఒకసారి బడిపంతులు వల్లీని బడికి పంపమని ఫతిమాబీతో చెప్పాడు. రెండు రోజులు పంపింది. “ఆ సదువులు ఎన్ని ఏళ్లు సదివించాలి? కూసోబెట్టి మేపొద్దా? బడికీ గిడికీ అక్కర్లేదు. బతకటానికి చదువక్కర్లేదు” అన్నాడు బాబాసాబ్. వల్లీ చదువు నిలిచిపోయింది. వల్లీని ఎవరింట్లోనైనా పనిలో పెట్టాలని చూశాడు బాబాసాబ్.

ఫతిమాబీ ఒప్పుకోలేదు. “పసివాడు. ఇంకా వాడికంత తెలివిలేదు” అన్నది. దెబ్బలు తిన్నది. రెండు రోజులు వాడిని తండ్రి కళ్ళ బడకుండా తప్పించింది.

అమ్మకు జబ్బుచేసిన ఈ నెలరోజుల్నుంచీ ఏదీ సరిగా వుండటం లేదు. వాడు ఎక్కడున్నాడు. ఏమి చేస్తున్నాడని కనుక్కునేవాళ్ళూ, పిలిచేవాళ్ళూ తలిచేవాళ్ళూ లేరు. ఒక పూట తింటే ఇంకోపూట గంజి తాగితే మరోపూట శుద్ధ పస్తు అవుతున్నది. రసూల్ బావ డబ్బు తెచ్చి యిచ్చిననాడు తింటారు. లేకపోతే లేదు. రసూల్ కమలానగర్ కాటాగుంపుకు చేరినవాడు. ఎప్పుడూ అక్కడ పేకాట క్లబ్బు దగ్గరే వుంటాడు. పేకాడే వాళ్ళకి టీలు, బీడీలు, సిగరెట్లు తెచ్చివ్వడం వాడి పని. గెలిచినవాళ్ళు వాడికి డబ్బు యిస్తారు. ఇదే కాకుండా జేబులు కత్తిరించడం, ఒంగి బేరం చేస్తున్న పరదేశస్థుల జేబుల్లోని నోట్లకట్టలను సంగ్రహించడం కూడా కద్దు. కొత్త మొగాన్ని మాయమాటల్తో మోసగించి వాళ్ల సంచులూ వస్తువులూ కొట్టయ్యడం కూడా చేస్తాడు. కాని అడపా దడపా పోలీసులకు ముట్టజెప్పవలసిందీ, తాగుడువలనా ఖర్చులు జాస్తి. నల్లగా, పొట్టిగా, దిట్టంగా ఉండి గుబురు మీసాలూ చిన్నకళ్ళూ చప్పిడిముక్కు గళ్ళలుంగీ, మెళ్ళో మఫ్లరు, గుండెలో బండదనమూ వుండే రసూల్ బావంటే వల్లీకి భయం. అమ్మకి బాగాలేదని అక్క మెహర్ మామూ దగ్గర వుండటాన రసూల్ వీళ్ళింటికే వస్తున్నాడు. అడపాదడపా డబ్బు ఇస్తున్నాడు. లేకుంటే శుద్ధపస్తులుండే వాళ్ళే.

పట్నంలో ఆసుపత్రినుంచి అమ్మను ఊరికి తీసుకెళ్ళటానికి వాళ్లకి డబ్బులేదు. అందుకే నేరుగా మామూ ఇంటికి వచ్చారు. వాళ్ళు రావడం మోనీకి ఇష్టంలేదు. అయినా పెద్దగా ఏమీ అనలేకపోయింది. మామూకి చెముడు. ఆమె ఏమి మాట్లాడినా తనను తిట్టేస్తున్నదనుకుంటాడు. ఆమెను చావబాదుతాడు. అందుకని భయపడి వూరుకున్నది. అయితే, ఎవరి అన్నం వాళ్ళు చేసుకునేట్లు ఏర్పాట్లు చేసింది. ఆ మనిషి ఎన్నాళ్ళు యీడుస్తుందో ఎవరికి తెలుసు? అన్నది.

ఆసుపత్రి నుంచి వచ్చినప్పటినుంచీ అమ్మమగతలో వుండిపోయింది. నిన్న ప్రొద్దున చూచి చచ్చిపోయిందన్నారు. నిన్న రోడ్డుమీద పోయే జనం యిటే చూస్తూ పోయారు. కొందరు డబ్బులిచ్చారు. చుట్టుపక్కల ఇండ్లవాళ్ళు కూడా తలో రూపాయీ

రెండూ ఇచ్చారు. అవి తీసుకుని నాయనా, బావా ఎటో వెళ్ళిపోయారు. వాళ్ళకోసం అక్కా, మామూ నిన్నంతా ఎదురు చూస్తూనే ఉన్నారు. ఎక్కడో పాతూరు దర్గా దగ్గర తాగి పడున్నారని మామూ కొడుకు బాసూ చెప్పాడు. "యీ మనిషిని ఇట్లా పారేసి వున్న డబ్బంత తాగి సచ్చారా" అని మామూ చిందులు తొక్కాడు. మళ్ళీ డబ్బు కోసం బయల్దేరాడు. రాత్రి ఇంటికి రాలేదు.

కూర్చున్న చోటినుండి గబుక్కున లేచాడు వల్లీ. ఇవాళ ఎట్లయినా డబ్బులు సంపాదించాలి. మసగ వెల్తురుగా వుంది. బస్టాండుకు వెళ్ళాడు. లైసెన్సు కూలీవాళ్ళు షెడ్డులో పడుకుని నిద్రపోతున్నారు. ప్రొద్దున్నే బయల్దేరే బస్సులు వచ్చి ప్రయాణీకుల్ని నింపుకుని వెళ్ళిపోతున్నవి. బళ్ళారి బస్సులో నాలుగు సామాన్లు వేశాడు. పావలా ఇచ్చారు. హైదరాబాదు బస్సు వచ్చింది. ఉత్సాహంగా పరుగెత్తాడు. వాడిలాంటి పిల్లాళ్లు ఇంకో ఇద్దరు పోటీగా వున్నారు. కిటికీ కమ్మీలు పట్టుకుని పైకి ఎగిరి వేళ్ళాడుతూ ఆత్రంగా లోపలివాళ్ళను చూశాడు. సన్నగా తుంపర ప్రారంభమైంది. బస్సులో కూర్చుని వున్న ఒకామె "ఒరే పైన హోల్డాలుంది. దించి లోపల వెయ్యి ముప్ఫయి పైసలిస్తాను" అన్నది.

సరేనని పైకెక్కాడు. హోల్డాలు బరువుగా వుంది. దానిని దించలేదు. డబ్బులు రాకుండా పోతాయని ఆదుర్దా పుట్టింది. పైనుంచి నిచ్చెన మీదుగా దానిని జారవిడిచాడు. క్రిందికి దిగివచ్చి మొయ్యలేక యీడ్చుకుంటూ బస్సు వాకిట్లోకి తెచ్చాడు. ఆమె పది పైసలిచ్చింది.

"ఎంతమ్మా – మీరు ముప్ఫయిపైసలిస్తానన్నారు" అన్నాడు పైసల్ని చూస్తూ.

"ఒక్క సామాను దించటానికి ముప్ఫయిపైసలిస్తారా.... నేను పది అన్నాను. నీవెట్లా విన్నావో" అంటూ ఇంకో అయిదు పైసలిచ్చింది.

వాడు కొంచెం బ్రతిమలాడి ప్రయోజనం లేక క్రిందికి దిగాడు. ఇంకేమైనా బస్సులొస్తాయేమోనని చూస్తూ నిలబడ్డాడు. లైసెన్సు కూలీ నిద్రలేచి వచ్చాడు. రసూల్ బావంతే వున్నాడు. ఒళ్ళు విరుచుకుంటూ నేరుగా వల్లీ దగ్గరకొచ్చి తలమీద గట్టిగా మొట్టికాయ వేశాడు. పైసలు లాక్కోడానికి జేబులో చెయ్యి పెట్టాడు. వల్లీ జేబు గట్టిగా పట్టుకుని వదల్లేదు. వాడు వల్లీని ఎడపెడా బాదేశాడు. పావలా క్రిందికి దొర్లింది. అది తీసుకుని నవ్వుతూ వెళ్లిపోయాడు వాడు.

వల్లీ షెడ్డు మెట్లమీద కూర్చున్నాడు గట్టిగా ఏడుస్తూ. కూలీవాడు అటుగా వెళ్తూ వల్లీని చూసి నవ్వుతూ పోయాడు. వల్లీలో అమ్మ దగ్గరకి పరుగెట్టాలన్న తపన రేగింది. లేచి చొక్కా చేత్తో కళ్ళు తుడుచుకొని బయల్దేరాడు. బ్రిడ్జిసందు మొగుదలకు వచ్చాడు. తాముండేచోట మనుషులు చాలామంది తిరుగుతున్నారు. బురిఖీలు వేసుకున్నవాళ్ళు ముగ్గురు కనిపించారు. ఒక బురిఖీ తెల్లగా మెరుస్తూ లేసువేసి అందంగా కనిపిస్తున్నది. ఏం జరుగుతుందో అని గబగబా నడిచాడు. తమ సందు గోడకు రోడ్డుమీదకు రెండు తడికలు కొత్తగా పెట్టారు. లోపల ఏమిటో జరుగుతున్నది. ఎవరి పనులమీద వాళ్ళు తిరుగుతూ మాట్లాడుకుంటున్నారు. వాడినెవరూ పలకరించలేదు.

రెండు తడికల సందులోనుంచి లోపలికి తొంగిచూశాడు వల్లీ. తడికల చాటున చెక్క పలకలమీద అమ్మని పండబెట్టి అక్కా, ఇంకొకామె నీళ్లు పోస్తున్నారు.

“అల్లా మనిషిని మట్టితో చేశాడు. అందుకే రోజూ నీళ్ళు పోసుకున్నా, రుద్దితే మళ్ళీ మట్టే వస్తది. ఆఖరికి ఈ బొమ్మ మళ్ళీ మట్టిలోనే కలిసిపోద్ది” అమ్మ చెప్పింది.

అమ్మ నీళ్లు పోసుకుని ఎన్ని దినాలైంది. వల్లీ తన ఎడంచేతి మీద కుడిచేతి బొటనవేలితో రుద్ది చూసుకున్నాడు. నల్లని మట్టి పాముకుని తీగలు పారింది. దులిపేసుకున్నాడు.

నాయన పెద్ద మెరిసే ఎర్రగుడ్డను తెచ్చి నేలమీద చక్కగా పరిచి, మడచి చించాడు. రెండు సన్నని పేలికల్ని పట్టుకుని ప్రార్థనలు చదివి తడికల్లోంచి అందించాడు.

“నీళ్ళు పోసే దానికి దర్గానుంచి పలకలు తెచ్చినాం గదా, పెట్టె తీసుకుని మౌజీన్‌రావాలా? వాడు రాడు... గరీబోల్లని ఎవరు సూస్తారు? అల్లా.... అల్లా... నిన్నంతా ఆ దర్గాకాడా యీ దర్గాకాడా కూసునే వుండాం. మనిషి పోయిందయ్యా, పెట్టె యిమ్మంటే ఒకడూ పలకడు” అన్నాడు.

మాట్లాడుతూనే గుడ్డను పరీక్షించి మడతలు పెట్టి చదును చేశాడు బావా. మామూ చూస్తూ నిలుచుని నాయన మాటలకు తలూపుతున్నారు. అమ్మని తెచ్చి

ఎర్రగుడ్డమీద పండబెట్టారు. నాయన చకచకా ఆ గుడ్డని అమ్మమీదికి మడిచి కట్లు కట్టాడు. చివరికి ఒక ఎర్రటి మూట తయారైంది.

వల్లీకి భయం వేస్తున్నది. జట్కా వచ్చింది. మూటని జట్కాలో పెట్టారు. అక్క పెద్దగా ఏడ్చింది. "అమ్మా" అని అరిచాడు వల్లీ.

వాడి మనసు నిండా ఆదుర్దా, భయం.

వాడికి ఏమేమో జరిగిపోతున్నది, ఏమో చెయ్యాలని తొందర పుడుతున్నది. కాని ఏం చెయ్యాలో తెలియటం లేదు.

నాయన, బావ జట్కాలోకి ఎక్కారు. మామూని ముందు జట్కా పక్కన కూర్చోమంటున్నారు. బండి కదలటానికి సిద్ధమైంది.

వల్లీ శక్తికొద్దీ "అల్లా, అల్లా" అని అరుస్తున్నాడు. నాయన ఏమనుకున్నాడో "నువ్వుకూడా రారా" అన్నాడు.

వల్లీ మొఖం సంతోషంతో చాటంతైంది. కళ్ళు తుడుచుకున్నాడు. మళ్ళీ ఒద్దనేస్తారేమోనన్నట్లు ఆత్రంగా బండిలోకి ఎగిరాడు. ఎర్రమూట నడిమధ్యన పడ్డాడు.

"ముర్దాపైన పడతావ్ సువ్వర్" అని కేకవేశాడు నాయన. వల్లీ సర్దుక్కూర్చున్నాడు.

బావ నవ్వుతూ "అల్లా అని అరుస్తుండావ్. అల్లా పిలిస్తే పల్కుతాడేంరా?.. దేవుడి ప్రార్థనలు నేర్చుకోవాలంటే సంవత్సరమన్నా ఇడవకుండా దర్గాకి పోవాలి. శుచిగా ఉండాలి. దర్గాలో అందర్నీ చూస్తూ వాళ్లు ఎట్టచేస్తే మనం అట్ట చెయ్యాలి. వాళ్లు ఒంగితే ఒంగాలి. లేస్తే లేవాలి. అట్ట సంవత్సరం చేస్తే ప్రార్థనలు తెలుస్తయ్" అన్నాడు.

బావనోట్లోంచీ సారా కంపు కొట్టింది.

"అరే వల్లీ పాపం పున్నెం మంచీ చెడ్డా ఏం లేవురా. సదూకున్నోళ్ళు మాటాడేవి అవి" అన్నాడు.

వల్లీ బావవైపు అపనమ్మకంగా, అయిష్టంగా చూశాడు. అమ్మ అన్నీ వున్నయ్యని చెప్పింది.

బండి బరువుగా బయల్దేరింది. "అరే, నిన్ను మా గేర్‌లో కాకా హోటెల్లో చేర్పిస్తా. బాగా కాఫీలు, టిఫిన్లూ, రెండుపూటలా తిన్నంత అన్నం, పైన మీ నాయన చేతికి నెలకు నలభై రూపాయలిస్తరు. ఇద్దరూ బతుక్కోవచ్చు.. రెండేళ్ళు బోయి కాస్త సాగినావంటే ఆఫీసర్ల క్లబ్బులో బాయిగా చేర్పిస్తా. నెలకి జీతం. పైన టిప్పులు జాస్తి. బతికిపోతావ్... అది మా క్లబ్బు అట్టాటిది కాదురా. వాళ్ళ దెగ్గిర అన్నీ కొత్త పచ్చనోట్లే వుంటయి. పచ్చనోటు తప్పించి ఇంకోటుండదు. డబ్బు పెట్టేవోళ్ళు, పెట్టిచ్చేవోళ్ళు; కంట్రాక్టర్లు, పెద్దోళ్లు.... పేకాటకి , బుడ్డీలకి అన్నిటికీ కొత్త పచ్చనోట్లే మారుస్తారు.. హె.... హ్హొ..."

గాలి దుమారం లేచింది.

"గాలి.. రాతికీ రాతికీ మద్దెన పుట్టే చెట్టుకు ఎవరు పోషణ చేస్తారు గాలీ, ఆదేవుడూనూ.... " జ్ఞాపకం వచ్చింది వల్లీకి.

దుమ్ము గాలిలో జట్కా కనపడకుండా పోయింది క్షణంలో.

# తీరని కోరిక

**– ద్వివేదుల విశాలాక్షి**

**జా**ము ప్రొద్దు ఎక్కేసరికి ఊరంతా ప్రాకిపోయింది. రావ్ బహద్దూర్ రంగరాజు గారి మరణవార్త ఊళ్ళో చిన్నా పెద్దా అనే తేడా లేకుండా అంతా తీర్థ ప్రజల్లా దేవిడీ వైపు నడక సాగించేరు.

"వయసు పైబడిందన్న మాటేగాని ఎంతో ఆరోగ్యంగా ఉండేవారు! చేయెత్తు మనిషి చేతికర్ర ఊపుకొంటూ మెలి తిరిగిన మీసాలు సవరించుకొంటూ హుందాగా దారంట నడుస్తుంటే ఎంతటి మొనగాడికైనా, చేతులు జోడించి నమస్కారం పెట్టాలనీ, పక్కకి తప్పుకుని దారి విడవాలనీ అనిపించేది కదండీ..." ఆ ఠీవి ఆ రాజసం పుట్టుకతో రావాలి కాని డబ్బు ఉంటే మాత్రం వస్తుందా? మన ఊళ్ళో సుబ్బిసెట్టికి లేదూ... వాణ్ణి తగలెయడానికి సరిపోయినంత సొమ్ము.... వాడు దారంట పోతుంటే గడపలో వాలిన కాకి కూడా ఒక గంతు వెయ్యదు కదండీ.. పెట్టి పుట్టాలండీ ఇటువంటి గౌరవాలు అందుకోడానికి"

దేవిడీ తలుపులు బారుగా తీసి వున్నాయి. రోజూలా వచ్చేపోయే వాళ్ళని అటకాయించి పేరేమిటి... ఊరేమిటి అని ప్రశ్నించి మరీ వదిలే అరకయ్య ఎక్కడా కన్పించలేదు. జన ప్రవాహం ఇనుపకమ్ముల గేటు దాటి ఇంటి ముందు అంతా పరుచుకుని ఉంది. ఊరిలో పేరు గాంచిన పెద్దలు, ఇంకా రంగరాజుగారి బంధుకోటికి చెందివారు. ఇంటిముందు వరండా దాటి హాలులో అడుగుపెట్టుతూ రావ్ బహద్దూర్ గారి భౌతికకాయాన్ని నలుగురు మనుష్యులు సాయంపట్టి తెచ్చి హాలులో మధ్యగా అమర్చిన దివాన్‌పై ఉంచేరు.

ఠీవిగా చేతికర్ర ఆడించుకొంటూ రోజూ ఆ వేళకి మేడ దిగి వచ్చి తన కోసం వేచివున్న మిత్రుల్ని బంధువుల్ని ఆదరంగా పలకరిస్తూ వారితో కాసేపు కబుర్లు చెప్పడం. ఆ వెనుక కాఫీ ఫలహారాలు సేవించి నమ్మిన బంటు వీరాయి వెనుక

రాగా అలా పురవీధుల్లో ఓసారి కాలు జాడించి రావడం. ఆ సమయంలో ఎదురైన వారి యోగక్షేమాలు కనుక్కొంటూ చేతనైన మాట సాయం, డబ్బు సాయం చేస్తూ భోజనాల వేళకి తిరిగి ఇల్లు చేరుకోవటం రంగరాజు గారి దినచర్యలో ఒక భాగం.

ఒకరోజు అలవాటుగా అలా చాంద్రాయణం పూర్తి చేసుకొని ఇంటికి తిరిగి వస్తుంటే మొగలో పెంకులు ఊడి, వాసాలు దిగజారి శిధిలావస్థలో ఉన్న ఆ ఇంటి గుమ్మంలో ఒక కొత్త ముఖం కన్పించింది ఎవరా– అని క్షణకాలం ఆగి పరీక్షగా చూసేరు రంగరాజు గారు. అంతకుపూర్వం అయిదారు నెలల క్రిందటి వరకు ఆ ఇంట్లో బ్రతుకనేర్చిన బడిపంతులు ఒకడు ఉంటుండేవాడు. అతడు అప్పుడప్పుడు దేవిడీకి వచ్చి రాజుగారి దర్శనం చేసుకొని వారి పెద్దల గొప్పతనాన్ని, వారి వంశ వైభవాన్ని పొగిడి అంతో ఇంతో డబ్బు లంకించుకొని మరీ వెళ్తుండేవాడు. ఇప్పుడు అక్కడ నిల్చి ఉన్న ఈ కొత్తవ్యక్తి ఎవరు? ఎక్కడినుంచి వచ్చేడు? నాలుగు అడుగులు నడిచి మరొకసారి వెనుదిరిగి చూసేరు రంగరాజుగారు.

యజమాని కను సౌంజ్ఞల్ని కోటి మాటలకన్నా మిన్నగా అర్థం చేసుకోగల వీరాయి ఒక్క అడుగు వెనుకగా నిలిచి, రాజుగారు ఇంట్లో కాలుపెట్టే లోపునే సంగతి సందర్భాలు వివరంగా తెలుసుకొచ్చి వివరించేడు. భృత్యుడు తెచ్చిన సమాచారం విని "ఓహో" అన్నారు రంగరాజు గారు – చిన్నగా నవ్వుతూ. "ఓహో" అన్నమాటని తిరగేసి. మరగేసి ఎటునుంచి ఎలా చూసినా విశదమయే భావం ఒకటే.. అదేమిటంటే రేపో.. మాపో మన ముందుకి రావలసిన మనిషేనన్న మాట – అని.

అక్కడ పాతింటి పొట్టి పంతులు కూడా దర్పానికి, దాతృత్వానికి ప్రతినిధిలా అలా దారంట నడచిపోతున్న రంగరాజుగారిని చూడగానే ఎవరితడు – అనే కుతూహలాన్ని చూపకుండా ఉండలేకపోయాడు. "ఆ వెళ్తున్నది ఎవర్రా రామిగా" అంటూ పక్కనే ఉన్న చాకలి రామిగాడ్ని ప్రశ్నించేడు.

రంగరాజుగారి పేరు ప్రఖ్యాతులు ఆ చుట్టుప్రక్కల పాతిక గ్రామాల వరకు వ్యాపించి ఉండగా, ఆ ఊళ్ళో స్వంత ఇల్లు పెట్టుకొన్న ఆసామి పొట్టిపంతులికి అతడెవరో తెలియక పోవడం చాకలి రామిగాడికి ఆశ్చర్యం కలిగింది. ముసలాయన,

ఎదురెండవల్ల దృష్టి తిన్నగా అనక అలా అడిగాడేమోనని "రాజుగారు బాబూ" అన్నాడు వాడు.

"ఏ రాజుగారు?"

పొట్టి పంతులు అలా అడగడంలో తప్పు లేదు. ఆ గ్రామ జనాభాలో సగానికి పైగా రాజులే. అయితే రాజుగారు అని పిలిపించుకొనే అర్హత జమీందారీలు పోయినా ఒక్క రంగరాజు గారికే మిగిలి ఉందని మాత్రం అతడికి తెలియదు.

ఈసారి రామిగాడు పొట్టి పంతులి అవజ్ఞతను క్షమించలేకపోయేడు.

"ఏటి... ఏ రాజుగోరా?" అన్నాడు ఆకు మీద పురుగుని చూసినట్లు పొట్టి పంతుల్ని చూస్తూ.

ఆ గ్రామంలో మనుష్యులకే కాదు చెట్టుకి, పుట్టకి కూడా తెలుసు "రాజుగారు' అంటే ఎవరో. వారి వంశం ఎటువంటిది. వారి వంగడం అటువంటిది. వారి వితరణ బుద్ధి అటువంటిది. వారి ఇంటి ఆచారాలు అటువంటివి. రాజుగారి దేవిడీలో కాలం ఇంతగా మారినా ఈనాటికీ అడిగి, లేదనిపించుకొన్న అర్థి లేడు. వారి దర్శనం చేసుకొని వట్టి చేతులతో తిరిగి వచ్చిన యాచకుడు లేడు.

రంగరాజుగారి ముత్తాత వెంకటపతిరాజుగారు వట్టి చేతులతో, కట్టు బట్టలతో భార్యా బిడ్డల్ని వెంటపెట్టుకొని ఆ గ్రామం వచ్చారుట. సాటి కులస్తుల మధ్య ఏదో విధంగా బ్రతకలేక పోతామా అనే నమ్మికతో, యలమంద్ర గ్రామం చుట్టుపట్ల అంటుమామిడి తోటలకి ప్రసిద్ధి. మామిడిపళ్ళు కొని, తాంద్ర పోసి చుట్టుపక్కల గ్రామాల్లో, పట్టణాల్లో అమ్ముకుంటూ కూటికి, గుడ్డకి లోటు లేకుండా కాలక్షేపం చెయ్యడం మొదలుపెట్టారుట వెంకటపతిరాజుగారు.

నూరు దాకా నన్ను పెంచు, ఆ వెనుక నిన్ను పెంచుతానంటుందిట డబ్బు. మొదట్లో జీవనం గడవడమే కష్టంగా ఉండే రాజుగారికి అనుకోని విధంగా సిరి తోసుకువచ్చిందిట. రాజుగారు వాసం కోసం నిట్రాట పాక వేసుకోవాలని నేల తవ్వుతూంటే అక్కడ భూమిలో లంకెబిందెలు దొరికాయనీ, అతడు విజయదశమి నాడు పూజ చేస్తుంటే దేవి ప్రత్యక్షమై అక్షయ సంపద ఇచ్చిందనీ, అతడు తెల్లదొరల సహాయంతో విదేశాలకి తాంద్ర ఎగుమతి చేసి ఆ వ్యాపారంలో లక్షలకి లక్షలు

లాభం గడించేడనీ... వెంకటపతి రాజుగారి లక్ష్మీ ప్రసన్నం గురించి ఇటువంటి రకరకాల కథలు ప్రచారంలో ఉండేవి. ఆ లక్ష్మీకటాక్షానికి కారణం ఏమైనా రావ్ బహద్దూర్ రంగరాజుగారి తాతగారి తాతగారి తరం నాటికి వారిల్లు దేవిడీగా మారిపోవడం, వారిని మకుటంలేని మహారాజుగా గ్రామస్తులంతా గౌరవించడం, వారి తీర్పుల్ని, తీర్మానాల్ని తూచా తప్పకుండా పాలిస్తుండడం వంటి ఆచారాలు అమలులోకి వచ్చేయి. అది మొదలు ఆ గ్రామంలో కాని, చుట్టుపక్కల గ్రామాల్లో కాని రాచకులం వారు ఎంతమంది ఉన్నా, వారెంత ఐశ్వర్యవంతులైనా, పేరు లేకుండా 'రాజుగారు' అని పిలిపించుకునే గౌరవం వెంకటపతిరాజుగారి వంశీయులకే దక్కింది.

మొదటినుంచీ వారి కుటుంబం ఆంగ్ల పరిపాలకులకి అండగా ఉండి, వారివల్ల బిరుదులు, సన్మానాదులు అందుకొంటూ ఉండేది. రంగరాజుగారు కూడా తాత, తండ్రులనాటి ఆనవాయితీలనే పాటిస్తూ, బ్రిటిష్ వారికి రంగరాజు ఆప్తమిత్రుడు అనే భావం కలిగేలా మసలుకొంటూ దానివల్ల "రావ్‌బహద్దూర్" బిరుదం అందుకొన్నారు.

కాని, దేశాన్ని ఓ ఊపు ఊపుతూ, ప్రజల్ని పరవళ్ళు తొక్కిస్తూన్న స్వాతంత్ర్య సమరం జోలికి పోకుండా, ఆ బిరుదు అతన్ని అట్టే కాలం ఆపి ఉంచలేకపోయింది. ఒక్కగానొక్క కొడుకుని విడిచి ఉండలేక తల్లి భద్రావతీదేవి ఎంతగా వారించినా లక్ష్యపెట్టక తన మనసుకి న్యాయం అని తోచిన దారిలో ధైర్యంగా ప్రయాణం సాగించేరు రంగరాజుగారు. ఆనాటి అందరి దేశభక్తుల్లాగే జీవితంలో అతి ముఖ్యమైన చాలా భాగం ఆయన జైలు నాలుగు గోడల మధ్య గడిపి వచ్చేరు.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. తమ కష్టం ఫలించింది అన్న తృప్తితో జైలు నుండి బైటికి వచ్చిన రాజుగారికి, బైట కథ, కంచే చేను మేసింది, అన్నట్లు కన్పించింది. జమీందారీలు పోవాలనీ, ఈనాములు రద్దు చేయాలనీ, దున్నేవాడికే భూమి మీద హక్కు ఉండాలనీ, ఇటువంటివే ఇంకెన్నోనినాదాలు, చట్టాలు ముందు ముందుకు తోసుకురాసాగేయి. అయినా వారు చలించలేదు. ఏదో విధాన తన జీవితకాలం తమ వంశం పరువు ప్రతిష్టలకి, ఆచారాలకి లోటు రాకుండా నడుపుకు రావాలనుకొన్నారు. ఈనాటి వరకు నడుపుకొస్తున్నారు కూడా.

అటువంటి రంగరాజుగారి విషయంలో ఆ పాతింటి పొట్టి పంతులు ఎవరో దారిన పోతున్న దానయ్య అన్నట్టు మాట్లాడ్డం చాకలి రామిగాడు సహించలేక పోయేడంటే అందులో ఆశ్చర్యపోడానికేముంది? పొట్టి పంతులు కూడా తన తప్పుని, రాజుగారి గొప్పతనాన్ని ఆ రోజు గడవకుండానే తెలుసుకొని లెంపలు వేసుకొన్నాడు.

ఈ రోజు అందరితోపాటు అతడూ వచ్చేడు రంగరాజుగారి అంతిమ దర్శనం చేసుకోవడానికి. వరండా మెట్ల దగ్గర నిలబడి హాలులోకి చూసేడు. హాలు మధ్యగా ఉన్న దివాన్ మీద మల్లెపువ్వు లాంటి తెల్లటి దుప్పటి పరిచేరు. తలవైపు ఎత్తుగా రెండు తలగడలు పెట్టి, రాజుగారి ముఖం ఎంత దూరానికైనా అగుపించేలా ఎత్తిపెట్టేరు. ముఖంలో ఇంకా కళ తగ్గలేదు. నిర్మలంగా నిద్రపోతున్న వ్యక్తిలా కనిపిస్తున్నారు రాజుగారు. ఎవరో కాళ్ళ దగ్గర దోసెడు గులాబులు పోసి దండం పెట్టారు.

రంగరాజుగారికి గులాబీలంటే ప్రాణం. ఏటి ఒడ్డున ఎంతో పెద్ద గులాబీ తోట వేయించేరు. ఎక్కడ ఏ కొత్తరకం గులాబి పువ్వు చూసినా దాని అంటు తెప్పించి తమ తోటలో వేయించేవరకు ఆయనకి నిద్ర పట్టేది కాదు. హరి మీద గిరి పడ్డా, మిన్ను విరిగి మీద పడ్డా రోజూ సాయంకాలం ఒకసారి ఆ తోటలోకి వెళ్లి పేరుపేరునా గులాబీల్ని పలుకరించిరావడం అతని రోజువారీ కార్యక్రమంలో తప్పడానికి వీలులేని ఒక భాగం. “పువ్వులంటే మీకు పానం బాబూ, ఆ పువ్వులాగే ఎగిరిపోనారు బాబూ” పాతికేళ్ళు నిండని పార్వతి రాజుగారి తల దగ్గర నిలిచి వెక్కి వెక్కి ఏడుస్తున్నది. దాని మొగుడు అప్పన్న దాన్ని ఊరడిస్తున్నాడు. “ఊరుకోయే.. ఎంతేడిత్తే మాత్తరం బాబు తిరిగి వత్తారా!” అంటూ.

వారిద్దరికీ రంగరాజుగారే వివాహం చేయించేరు. పార్వతి తండ్రి రాత్రి పూట పొలంలో పాము కరచి చచ్చిపోయేడు. పెళ్ళీడుకొచ్చిన పిల్ల పార్వతి తల్లీ తండ్రీలేని పార్వతిని చూసి ఊళ్ళో అంతా జాలిపడ్డారు. “మా ఇంట ఉండు” అంటే... “మాతో ఉండు” అంటూ వెంటపడ్డారు. తమ అవసరానికి దాని అందాన్ని, వయసునీ వాడుకోవాలనుకొన్నారే కాని, దాన్ని ఒక ఇంటిదాన్ని చెయ్యాలన్న బుద్ధి వారిలో ఒకరికీ కలగలేదు. ఈ వార్త విన్న రంగరాజు గారు తాము పూనుకొని

పార్వతి పెళ్ళి జరిపించేరు. అప్పన్నకి దేవిడీలో నౌకరీ ఇప్పించేరు. వారి బ్రతుక్కో దారి చూపించేరు.

అందుకే ఏడుస్తున్నది పార్వతి. తన జీవితాన్ని నిల్పిన వ్యక్తి కోసం.... తండ్రిని కోల్పోయిన నాటికన్న మిన్నగా, ఆమె ఏడుపుకి ఆ గోడలకి తాపడం చేసిన రాళ్ళు కరుగుతున్నాయి కాని పార్వతిని యింతగా అభిమానించిన రంగరాజుగారిలో మాత్రం చలనం లేదు.

ఒక్క పార్వతి పెళ్ళి అన్నమాటే గాదు. ఊళ్ళో ఏ కార్యంజరిగినా రంగరాజుగారి చెయ్యి ఆనకుండా అయ్యేది కాదు. మంచికైనా, చెడుకైనా తమ వల్ల ఈ సహాయం కావాలంటే వారి ముందుకి వచ్చిన వారు ఎవరూ నిరాశతో వెనుతిరిగి వెళ్ళవలసిన అవసరం కలిగేది కాదు.

అంత ఉదారుడు. దయార్ద్ర హృదయుడు. కాబట్టే అతడు దారిన పోతుంటే అంతా చెయ్యెత్తి దండం పెట్టేవారు. అందరిలాగే ఓరోజు పొట్టిపంతులు కూడా తల వంచి నమస్కరించేడు. స్వరాజ్యం వచ్చి జమీలు, జమీందారులు పోయినా ఒకనాడు ఆ ఊరికి మకుటంలేని మహారాజులాంటి రంగరాజుగారికి, రాజుగారు ఆ నమస్కారాన్ని చిరునవ్వుతో స్వీకరించి కుశలు ప్రశ్నలు వేసేరు.

"పిల్లలా?" అంటూ ప్రశ్నించేరు.

"ఐదుగురు. పెద్దవాడు భిలాయ్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. రెండోవాడు విజయనగరంలో బియ్యే చదువుతున్నాడు. ఇద్దరు ఆడపిల్లలకి పెళ్ళిళ్ళు అయేయి. మూడోది పెళ్ళికి ఉంది. రైల్వే సర్వీసులో ఎక్కడెక్కడో తిరిగి ఈనాటికి ఉద్యోగ విరమణ చేసి తాతలనాటి ఈ పాత యింటిని వెతుక్కొంటూ ఈ ఊరు వచ్చేను. మిగిలిన కాలం ఈ గడ్డ మీద గడుపుదామని" ఎంతో నమ్రతగా జవాబు చెప్పేడు పొట్టి పంతులు.

ఇవన్నీ రంగరాజుగారికి తెలియని విషయాలు కావు. కొత్త ముఖాన్ని ఆ గడపలో చూసిన మొదటి రోజునే వీరాయి వల్ల తెలుసుకొన్నారు. అందువల్లనే ఏదో ఓ రోజు అతడు తమ దర్శనానికి వస్తాడని ఎదురు చూసేరు. అతడు ఆ గ్రామంలో వాసం ఏర్పరచుకొని నెలలకి నెలలు గడుస్తున్నా రాజుగారి దర్శనానికి రాలేదు. మీ

వల్ల ఈ సహాయం కావాలంటూ చేయిజాచి అడుగలేదు. అతడి తత్వం రాజుగారికి అంతుపట్టకుండా పోయింది. ఇల్లు చూస్తే ఓ మూలనుంచి విరిగిపడ్తున్నది. పెళ్ళికి, గుమ్మటంలా ఆడపిల్ల ఇంట్లో తిరుగుతున్నది. బియ్యే పాసై యింట్లో కూర్చున్న కొడుక్కి ఉద్యోగం కావాలి. ఇవన్నీ తాము తల్చుకొంటే అవలీలగా అయిపోయే పనులు. కాని కావలసిన వ్యక్తి ఎన్నిసార్లు ఎదురుపడినా ఆ ప్రసక్తే తేకపోతే... కనీసం దేవిడీకి వచ్చి ఒక్కసారి దర్శనం అయినా చేసుకొని వెళ్ళకపోతే –రాజుగారితోపాటు వీరాయికి కూడా అర్థం కాకుండాపోయింది. ఈ పొట్టి పంతులి వాటం, “పిచ్చి బామ్మడు రాజుగారంతటి వారి ఎదుటపడి సెప్పుకోడానికి బయపడ్తున్నాడేమో”– అనుకొన్నాడు.

“రాజుగారు పోయేరుట – నిజంగానా... స్టేషన్‌లో ఎవరో చెప్తే నమ్మలేకపోయేను. అంత ఆరోగ్యంగా తిరుగులాడే మనిషి.. ఇంత అకస్మాత్తుగా.... నేనైతే నెలరోజులుగా ఆయన్ని కలుసుకోలేదనుకోండి... ” ఆత్రంగా మూకని తోసుకొని ముందుకి వస్తున్నాడు అప్పుడే హైదరాబాదు నుంచి తిరిగి వచ్చిన ఎమ్మెల్యే. ప్రయాణపు బడలికైనా తీర్చుకోకుండా ఆ స్వాతంత్ర్య సమరవీరుడి అంతిమదర్శనం కోసం ఉరుకులు, పరుగులుగా ఇక్కడికి వచ్చి పడ్డాడు.

నిజానికి అతడికే అన్నమాట కాదు. ఇటీవలి కాలంలో ఎవరికి కూడా రాజుగారి దర్శనం అంత సులువుగా దొరకడం లేదు. ఆ విషయం ఆశ్రితుల మధ్య, స్నేహితుల మధ్య చర్చకు రావడం కూడా జరిగింది. వారి దర్శనార్థం వచ్చినవారి నుంచి వర్తమానం తీసుకొని రాజుగారి దగ్గరకి వెళ్ళే వీరాయి అంతలోనే తిరిగివచ్చి “ఇప్పుడు ఈలు కాదని సెప్పమన్నా రండి” అనేవాడు. రంగరాజుగారిలో వచ్చిన ఈ మార్పు ఎవరికీ అంతుపట్టని విషయంగా తయారయింది. అత్యంత సన్నిహితంగా తిరిగే వీరాయికి కూడా రాజుగారి ఈ విధమైన ప్రవర్తనకి కారణం తెలిసి రాలేదు. వాడు గ్రహించిందల్లా ఒక్కటే! రాజుగారు దేనికోసమో రాత్రీ పగలూ ఎదురు చూస్తున్నారు. అనుకొన్నట్లు అది జరుగలేదు. ఆ ఆరాటంతో, ఆ విసుగుతో మిగిలిన ఆచారాలన్నీ మానుకొంటున్నారు – అని.

గ్రామాల్లో మనుషులతో పాటు తోటల్లో పువ్వులు కూడా రాజుగారిని కడసారి చూడ్డం కోసం తరలి వచ్చినట్లు ఉన్నాయి. ముఖం ఒక్కటి తప్పితే మిగిలిన శరీరం అంతా రకరకాల పువ్వులతో నిండిపోయి ఉంది. తల వైపు బల్ల మీద వెలుగుతున్న ఊదొత్తుల సువాసన. పువ్వుల పరిమళం హాలు దాటి వరండాలోకి కూడా గుబాళిస్తున్నాయి.

గొప్పవారి చావు బీదవారింట పెళ్ళికన్నా ఘనంగా ఉంటుందని ఇందుకే అంటారు కామోసు – అనుకున్నాడు పొట్టి పంతులు. పరదా కట్టిన భాగంలోంచి ఉండుండి వినిపిస్తున్న ఆ ఏడుపులే లేకుంటే అది చావు కొంపలాగే లేదు.

సూర్యాస్తమయానికి ఇంక అట్టే సమయం లేదు. రావ్ బహద్దూర్ రంగరాజు గారి అంతిమ యాత్రకి ఏర్పాట్లు అతి ఘనంగా జరుగుతున్నాయి. రాజులు, రాజరికాలు గతకాలపు కథలుగా మారిపోయినా, జమీలు, జమీందారీలు ప్రజాస్వామ్యంలో కరిగిపోయినా ఒకనాటి వారి వంశప్రతిష్టకి, గౌరవానికి ఏకైక ప్రతినిధిగా నిలిచిన రంగరాజుగారి మరణం ఒక వ్యక్తి మరణంగా పరిగణించడానికి వీలులేదు. అది తరతరాలుగా దేశంలో పరిఢవిల్లిన ఒకానొక సంస్కృతి మరణం; ప్రజాస్వామ్యంలో కరిగిపోయిన రాజరికపు మర్యాదల మరణం.

మరునాటినుంచి దేవిడీ మామూలు గృహంలా మారిపోతుంది. అర్భకులకు, ఆర్తులకు ఇకముందు అక్కడ ప్రవేశం ఉండదు. తండ్రి జీవితం అతడు అలవాటు పడిన గాడిలో గడచిపోవాలని అంతవరకు ఊపిరి బిగపట్టి, అతడి దానధర్మాలకి, రాచరికపు మర్యాదలకి తలవంచి ఊరుకొన్న తనయులు, ఆ కాయం అటు కదలగానే ఆ ఇంట కొత్త అలవాట్లని, కొత్త జీవన విధానాన్ని ప్రవేశపెట్టారు. ఈ కాలానికి పనికిరాని కోట కడతారు.

ఈ విషయం గ్రామంలో అందరికీ తెలిసిందే. అంత వయసు వచ్చిన తండ్రిని, అతడికి పరిచితమైన జీవితం నుంచి తప్పుకోమనీ, అలవాట్లని మార్చుకోమనీ నిర్బంధించడం న్యాయం కాదనీ ఊరుకొన్నా. పట్టు తప్పిపోయి చెట్టునుంచి విడిపడనున్న ఈ ఊడని పట్టుకొని తాము ఎంతోకాలం ఊగులాడలేమని ఆ కొడుకులు ఏనాడో గ్రహించుకొన్నారు. అందుకే వారు వాస్తవాన్ని గుర్తించి దానికి అనువుగా తమ జీవితాలను మలచుకొన్నారు.

పెద్దకొడుకు కలప వ్యాపారం పెట్టి అణాపైసల లెక్కలల్లో తన జీవిత సాఫల్యం చూరగొంటున్నాడు. చిన్న కొడుకు కాలేజీ చదువులు చదువుకొని సుఖంగా బ్రతకడానికి జీవనోపాధిగా ఒక మంచి ఉద్యోగం సంపాదించుకొన్నాడు. మిగిలినవారు కూడా అన్నల అడుగు జాడలో నడుస్తూ పాతకథలో పాత్ర లాంటి తండ్రిని చూసి తమలో తామే నవ్వుకొంటారు.

తిండికి, బట్టకి లోటు లేకుండా రంగరాజుగారి ఆశ్రయంలో కాలం గడిపివేస్తున్న ఆశ్రితులంతా చచ్చిపోయిన రంగరాజుగారి కోసం కన్నా, తమ బ్రతుకులు తలచుకొని గోడుగోడున ఏడుస్తున్నారు. బ్రతికున్న రోజుల్లో ఎదుటివారి కంటతడి చూడలేక, ఏదో విధంగా వారిని ఆదుకొనే రంగరాజుగారు ఈనాడు ఇంతమంది తన ఎదుట ఏడుస్తున్నా తనకేం పట్టనట్లు పెద్దగా నిద్రపోతున్నారు.

శవ వాహనం ఊరిలోని ముఖ్యమైన వీధులగుండా ప్రయాణం మొదలుపెట్టింది. దేవిడీకి వచ్చి రాజుగారి దర్శనం చేసుకోలేని ఆడంగులు, పిల్లలు, వృద్ధులు వెళ్ళి వీధి అరుగుల మీద చేతులుజోడించి నిలబడ్డారు. బాజాల ధ్వని విని అరుగు మీదికి వచ్చింది పొట్టి పంతులు పెళ్ళాం.

"ఈ రోజు ఉదయం వరండాలో పచార్లు చెయ్యడం మా అబ్బాయి చూసేడుట. ఇంతలో ఎంత ఘోరం జరిగిపోయింది! అందుకే అంటారు వాన రాకట – ప్రాణం పోకట చెప్పటం కష్టం" అని పొరుగింటావిడతో అంది పొట్టి పంతులు పెళ్ళాం.

ఆ రోజు ఉదయం రాజుగారు అలా వరండాలో పచార్లు చేస్తుండగానే వచ్చేడు వీరాయి ఎంతో ఉత్సాహంతో. వాడి ముఖం చూడగానే ఎంతోకాలంగా కళ తప్పిన రాజుగారి కళ్ళల్లో కాంతి కనిపించింది. "ఏమిటి వీరాయి?" అన్నాడు.

"మరే.... మరేనండీ... పొట్టి పంతులు లేడూ.... ఆరు ఆ పాతింటి పొట్టి పంతులు.

"హమ్మయ్య .... ఇంత కాలానికి వచ్చేడన్నమాట" తనలో తనే మెల్లగా అనుకొన్నాడు రాజుగారు.

పరీక్షగా వింటే ఆ మాట వీరాయికి కూడా వినిపించి ఉండేది. కాని వాడు తన ధోరణిలో తాను ఉన్నాడు. రాజుగారి స్వగతాలు వినపడే పరిస్థితి కాదు అది.

రంగరాజుగారు పొట్టి పంతులు గురించి ఇంతగా పట్టించుకోవడానికి ప్రత్యేక కారణం అంటూ ఏమీ లేదు. అతడు పుట్టిన ఊరని తమ గ్రామంలో నివాసం ఏర్పరచుకోడానికి వచ్చేడు. ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నాడు. అంతో ఇంతో తమవల్ల లబ్ది పొందితే, అది వారికొక విధమైన తృప్తి. అంతగా ఇయ్యాలనుకొంటే తనంతట తానుగా అందియ్యకూడదా?

అంటే.... ప్రతి పనికి ఒక పద్ధతి, ఒక మర్యాదా ఉంటుంది.

అర్థి అన్నవాడు చెయ్యి జాపి అడగడం, దాత అయినవాడు ఔదార్యం చూపుతూ ఇయ్యడం లోకంలో రివాజు.

"కింది హాలులో కూర్చోబెట్టు.... ఇప్పుడే వస్తున్నామని చెప్పు" ఉత్సాహంతో అన్నారు రంగరాజుగారు.

"అదికాదు బాబూ.... ఆరికి నాటరీలో రెండు నచ్చల రూపాయలు వచ్చేయట. ఆరి కుర్రోడు... ఆ పట్టణంలో ఉద్యోగం సేత్తున్నవోడు ఉత్తరం రాసేట్ట.. ఊరంతా ఈ కబురే గనంగా సెప్పుకొంటుంటే...."

"ఏమిటి వీరాయి... ఈ మాట నిజమేనంటావా?" నమ్మలేనట్లు తడబడుతూ అడిగేరు రాజుగారు.

"నిజం బాబూ! ఆ పొట్టాయనే పక్కింటోరితో సెప్తుంటే..."

నేడు బహుళ ప్రచారంలో ఉన్న లాటరీ టిక్కెట్టు గురించి, అవి చెప్పా చెయ్యకుండా మనుషుల జీవితాన్ని తారుమారు చెయ్యడం గురించి రంగరాజుగారు విని ఉండకపోలేదు. కాని కాని... అటువంటి అదృష్టం పొట్టి పంతుల్నే వెతుక్కొంటూ రావడం...."

"అతడు రాడు... ఇంక అతడు రాడు" మెల్లగా తనలో తనే గొణుక్కొన్నాడు రాజుగారు.

"ఎవరు బాబూ... పొట్టిపంతులా?"

"అవును... అతడు... రావలసిన అవసరం లేదు. అతడు ఇంక రాడు."

"ఎందుకు రాడు బాబూ! తమరు పిలుస్తున్నారంటే రెక్కలు కట్టుకొచ్చి వాల్తాడు–"

రంగరాజు గారు వీరాయి మాటలు వినలేదు అవి అతడికి వినిపించలేదు. నెమ్మదిగా సోఫాలో జేరబడి కళ్ళు మూసుకొన్నారు.

“ఇంక రాడు – ఇంక అతడు రాడు” రాజుగారి నోటిలోంచి నిరాశతో అతి నెమ్మదిగా వచ్చేయి ఆ మాటలు.

ఆ మాట, ఆ స్వరం అదోలా వినిపించింది వీరాయికి. సోఫాలో ఒక పక్కకి వాలిన తల ఏదో అనర్థాన్ని సూచించింది.

“బాబుగారూ –బాబుగారూ” దగ్గరగా వంగి గట్టిగా పిలిచేడు వీరాయి. ఒక్క అదటున మెట్లు దిగి “సిన్నమ్మగోరో” అంటూ ఇంట్లోకి పరుగుపెట్టేడు.

రంగరాజుగారి అంత్య సమయంలో ఆయన దగ్గర ఉన్నది వీరాయి ఒక్కడే! అందుకే అంతా అతన్ని అడగడం మొదలుపెట్టేరు. “రాజుగారు పోయేముందు ఏమన్నారు? ఎలా ప్రాణం పోయింది?” అంటూ.

వీరాయి జరిగింది జరిగినట్లు చెప్పలేదు. పొట్టి పంతులుకి లాటరీలో రెండు లక్షలు వచ్చాయని వినగానే రంగరాజుగారు గుండాగి చచ్చిపోయేరంటే అది వారి జీవితానికి గౌరవప్రదమైన ముగింపు కాదనిపించింది వాడికి. అందుకే ఆ విషయాన్ని మరుగుపరచి రాజుగారి వంటి గొప్పవారి చావు ఎలా ఉండాలో ఊహించి, అలాగే జరిగినట్టు వర్ణించి చెప్పేడు.

“ఏటినేదు బాబూ, సోఫాలో కూచుని ‘ఈరాయి’ అని పిల్చేరండి. ‘ఏటిబాబూ’ అన్నానండి.

“దేవుని పిలుపొచ్చిందిరా, నాను ఎల్లిపోతున్నా నన్నారండి”.

“ఒద్దు బాబుగోరూ... మీరు నేందే నే బతకలేనన్నానండీ”

“పిచ్చోడా నువ్వు మాత్తరం ఉండిపోతావట్రా... నీకు పిలుపు వత్తే నువ్వూ ఎల్లి పోతావు” అన్నారండి. “రామ.... రామ” అంటూ గమ్మున కల్లు మూసేసుకున్నానండి.”

అని చెప్పాడు వీరాయి.

శవవాహనం ఊరంతా తిరిగి రాజుగారికి ప్రీతికరమైన గులాబితోట చేరుకొంది. తోట మధ్యగా వారు తమ అంతిమ విశ్రాంతి మందిరంగా నిర్మించుకొన్న హాలులో మధ్యగా ఉన్న తిన్నెమీద అగ్నిహోత్రుడు వారి భౌతికకాయాన్ని అతి ఆప్యాయంగా ఆలింగనం చేసుకొన్నాడు.

నాలుకలు చాచి నాలుగు దిక్కులకు సాగుతున్న ఆ అగ్నిగుండంలో వారి భౌతికకాయంతో పాటు వారి జీవితంలో తీరని ఒకే ఒక కోరిక కూడా బూడిద అయిపోయింది. మచ్చలేని వారి జీవిత కథ చిలవలు, పలవలు కల్పించి చెప్పుకోడానికి ఆ ఊరివారికి మిగిలిపోయింది.

# ఎంతపని జరిగింది!

**- డా॥సి.ఆనందారామం**

ఇది జరిగింది పూర్వకాలంలో కాదు -

ఇప్పుడు... ఈనాటి అణుయుగంలో...

అది పల్లెటూరు కాదు.

పేరు పొందిన పట్టణం.

ఆ స్థలం రచ్చబండకాదు - ఆధునిక నాగరికత అడుగడుగునా తొణికిసలాడే క్లబ్.

అక్కడ చేరినవాళ్ళు మోతుబరి రైతులుకారు.

దేశ విదేశాల్లో పెద్ద పెద్ద డిగ్రీలు తీసుకున్న విద్యాధికులు-

అందరూ ఒక్కసారి గుండె బాదుకున్నారు...

ఒక్క కంఠంతో పలికారు!

"ఎంత పని జరిగింది!"

ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు.... ఒక్కొక్కరి ముఖంలో ఒక్కొక్క రకమయిన భావం...

కొందరి ముఖాల్లో కుతూహలం... మరి కొందరి ముఖాల్లో ఏదో భయం... కొన్ని ముఖాల్లో ఆశాభంగం... మొత్తంమీద అందరి ముఖాల్లోనూ అద్దంలోలాగ కనిపిస్తున్నది కసి...

'ఛీ! ఛీ! పాడురోజులు! మరీ బరి తెగించిపోయారు! పెళ్ళికి విలువే లేకుండా పోయింది-" అంటూ వాపోయాడు పరమేశ్వరశాస్త్రి...

"ఒక భార్య ఉండగా మళ్ళీ ఆవిడెలా పెళ్ళి చేసుకుందయ్యా!" అని ఆశ్చర్యపోయాడు రాజారావు.

"చూస్తూ ఉండు! ఈ వన్నెల విసనకర్ర నాలుగు రోజుల్లో మూటాముల్లె సర్దుకుని వెళ్ళిపోకపోతే నా పేరు కాశీపతి కాదు–" జోస్యం చెప్పాడు కాశీపతి.

"మొగవాడి దౌర్జన్యం! అగ్నిసాక్షిగా పెళ్ళిచేసుకున్న భార్యను వదిలి మరోదాన్ని తెచ్చుకున్నాడు. ఇప్పుడు ఆవిడ గతి ఏం కావాలి?" పురుషజాతి మీద కోపంతో పళ్ళు నూరింది వనజాక్షి...

"ఇదే ఆడదయితే, ఇన్ని కాదు, మరెన్ని కష్టాలొచ్చినా ఇలా చెయ్యగలదా?" ఉసూరుమనిపోయింది, మిసెస్ సోమశేఖరం.

మిత్రబృందంలో ఇంతటి ఆందోళనను లేవదీసిన కథానాయకుడు... క్లబ్‌లో 'జగన్'గా ఇంటి దగ్గిర 'జగ్గు'గా ఆఫీస్‌లో జగన్నాథంగా వ్యవహరింపబడే వ్యక్తి చిరునవ్వుతో నచ్చి కూచున్నాడు...

ఆ చిరునవ్వు చూస్తే వాళ్లందరికీ వొళ్లు మండిపోయింది. ఇంతచేసి అతి మామూలుగా ఎలా నవ్వుతున్నాడో చూడు!

"ఏమిటోయ్ సంగతులు!" కదిలాంచాడు శాస్త్రి.

"మీరే చెప్పాలి!"

"మాకేముంటాయోయ్! అడ్వంచర్స్ మా చేత కాదు." చెప్పాననుకున్నాడు రాజారావు....

"నేను చేసిన పని మీకు 'అడ్వంచర్'లా తోస్తోందా! ఇంత సామాన్యమైన విషయం..." నిజంగా ఆశ్చర్యపోయాడు జగన్...

"చాల్లే... సామాన్యమైన విషయంట! ఎలా ఉంది కొత్తకాపురం?" కుతూహలం పట్టలేక అడిగేసాడు కాశీపతి, తన జోస్యం ఎన్నాళ్ళలో నిజమవుతుందో తేల్చుకోవాలని....

"పాత కాపురంలాగానే ఉంది..."

మామూలుగా అన్నాడు – జగన్ సమాధానం కోసం వొళ్లంతా చెవులు చేసుకొన్న కూర్చున్న మిసెస్ సోమశేఖరానికి చాలా ఆశాభంగం కలిగింది.

"ఆ మాత్రం దానికి మళ్ళీ ఎందుకు పెళ్ళి చేసుకోవటం?"

జగన్ చిరునవ్వుతో "కొత్త అనుభవాల కోసం కాదు?" అన్నాడు.

వొళ్ళు మండింది మిసెస్ సోమశేఖరానికి!

"అయితే పాత కాపురంలోనే ఉండచ్చుగా!"

"కాపురంలా ఉన్నన్నాళ్ళూ అలాగే ఉన్నాంగా! కాపురం కాపురంలా ఉండదని తెల్సుకున్నాకే విడిపోయాం!"

"విడిపోయాం, అనకండి – వదిలేసానని అనండి..." అక్కసుగా అంది మిస్ వనజాక్షి....

"సారీ! అలాగే అనాలి కాబోలు! రాధ కూడా అలాగే అనమంది..."

"రాధ అంటే నీ మొదటి భార్యనా?"

తెలిసిన విషయాన్నే మరోసారి అడిగాడు రాజారావు.

"ఒకప్పటి భార్య!"

సరిదిద్దాడు జగన్...

"ఆహా! ఏలాంటి మాటలు వింటున్నాను!" తల కొట్టుకుంటున్నాడు పరమేశ్వరశాస్త్రి....

"ఇంతకూ నువ్వు రాధతో ఈ విషయం మాట్లాడావన్నమాట!" కాశీపతి కుతూహలంగా అడిగాడు...

"ఆవిడతో మాట్లాడకుండా ఇలాంటి విషయం ఎలా పరిష్కరించుకోగలను!" ఆశ్చర్యంగా అన్నాడు జగన్.

"పాపం, ఆవిడ ఎంత ఏడుస్తోందో?" జాలిపడింది మిస్. వనజాక్షి.

"ఇప్పుడు ఏడవడం లేదు. కానీ, మీలాంటివాళ్ళు ఎవరైనా పరామర్శకి వెళితే తప్పకుండా ఏడుస్తుందిట! అలా ఏడవకపోతే బాగుండదుట!" కొంటెగా అన్నాడు జగన్.

ఎర్రగా చూసింది వనజాక్షి...

"ఇంతకూ మీరెందుకు విడిపోయారయ్యా! ఆవిడను అనుమానించావా?" కాశీపతి ప్రశ్న.

"పనిలేకపోతే సరి!"

"పోనీ, ఆవిడ నిన్ను అనుమానించిందా?"

"ఆవిడకి ఇలాంటివేమీ పట్టవు!"

"బాగానే ఉంది. నువ్వు ఆవిడని తిట్టి, కొట్టి, బాధించే దుర్మార్గుడివి కాదే!"

"బాధ కలగాలంటే పురాణాల్లోలాటి రాక్షసులయి ఉండాలా? మన బ్రతుకు మన మనసుకు నచ్చినట్లుగా లేక పోతే అది కూడా బాధే!"

"అంతమాత్రానికే విడిపోతారా? సర్దుకోవచ్చుగా!" జగన్ మాటలు అసలు కొరుకుడు పడక అడిగేసింది మిసెస్ సోమశేఖరం...

"విడిపోయి సుఖపడగలిగే అవకాశాలున్నప్పుడు సర్దుకుని అవస్థపడవలసిన అవసరమేముందీ?"

"ఇంత అన్యాయమా?" పరమేశ్వరశాస్త్రి ఆవేదన...

"ఇందులో అన్యాయమేముందీ? మన బ్రతుకు మనచేతుల్లో ఉంది. నేను సుఖపడాలని నిర్ణయించుకున్నాను? సుఖపడుతున్నాను!"

అక్కడున్న అందరికీ ఈ మాటలు అతి దారుణంగా వినిపించాయి. 'నేను హత్య చేస్తున్నాను–' అన్నప్పటి కంటే ఘోరంగా వినిపించాయి...

"అసలేం జరిగిందో చెప్పు!"

కుండపగలకొట్టినట్లు అడిగేసాడు కాశీపతి.

"ఏముంది చెప్పటానికి ! ముగింపు ఇది కాదేమో కాని కథ మాత్రం ఇంచుమించు అందరి కథే! ప్రస్తుతం మనం ఉంటున్న సాంఘిక వ్యవస్థలో పెళ్ళి కాకముందే అమ్మాయీ, అబ్బాయీ కలుసుకుని ఒకరినొకరు పూర్తిగా అర్థం చేసుకోవటానికి లేదు. నాబోటి వాళ్లెవరైనా అందుకు ప్రయత్నిస్తే అర్థం మాట దేవుడెరుగు! అభాండా లెదురవుతాయి. రాధా నేనూ ఒకరినొకరం పూర్తిగా అర్థం చేసుకోకుండానే పెళ్లి చేసుకున్నాం! కొన్నాళ్ళు బాగా గడిచినా, రాను రాను మా భావాలు అనేక విషయాల్లో పరస్పర విరుద్ధం అని గ్రహించాం! రాధకు విసుగొచ్చి వాళ్ళింటికి వెళ్ళిపోయింది. ఇంతలో నాకు మాలతితో పరిచయమయింది... మాలతి

నన్ను పెళ్ళి చేసుకుంటానన్నది. రాధ దగ్గరకు వెళ్ళి ఈ విషయం చెప్పాను...”

“చిక్కగా పేడనీళ్లు కలిపి ముఖాన జల్లి ఉంటుంది...”

మధ్యలో అడ్డుకుని అంది మిస్ వనజాక్షి....

వనజాక్షిని గుండెలు ఝల్లుమనిపిస్తోనే ఒళ్లు మండించే లాగ అల్లరిగా నవ్వాడు జగన్...

రాధ మనసు పన్నీరులాంటిది. పేడనీళ్లు జల్లలేదు. పరిస్థితి అర్థం చేసుకుంది...”

“ఆడది? ఏం చేస్తుందీ?” నిట్టూరుస్తూ అంది మిసెస్ సోమశేఖరం.

“అవును. రాధ కూడా అదే అంది! నేను ఆడదాన్ని, విడిపోవాలనే ఆలోచన నా కెప్పుడో వచ్చింది. అయినా ఏం చెయ్యలేకపోయాను. అలా చేస్తే నన్ను సంఘం బ్రతకనివ్వదు. ఇప్పుడు మీరే దారితీసారు. ఇంక నాకు బోలెడు సానుభూతి! మెనీ థేంక్స్! అంది...”

“విడిపోయి ఏం చేద్దామని” మిన్ను విరిగి మీదపడినంత దిగ్భ్రాంతితో అడిగింది మిసెస్ సోమశేఖరం...

“కొన్నాళ్ళు, మీ అందరినీ సానుభూతి చూపించనిస్తుందట!... ఆ సానుభూతితో తన శీలం పెంపొందించుకుని ఆ తరువాత తనూ తనకు తగినవాణ్ణి పెళ్ళి చేసుకుంటుందట!”

“పెళ్ళి చేసుకుంటుందా? ఒకసారి పెళ్ళయి మొగుడొదిలేసిన ఆడదాన్ని ఎవరు చేసుకుంటారు!”

ఆత్రంగా అడిగింది మిస్.వనజాక్షి.

రాధ అందమైనది. చదువుకుంది. డబ్బుకూడా ఉంది. ఇన్ని క్వాలిఫికేషన్స్ ముందు.... మొగుడొదిలేసిన ఆడదనేడిస్ క్వాలిఫికేషన్ కరిగిపోవచ్చు! లేదా సంఘం చూపే సానుభూతితో అది కూడా మరో క్వాలిఫికేషన్ కావచ్చు! ఏం చెప్పగలం?”

ఏమీ చెప్పలేక పోయారు.... మళ్ళీ జగన్ అన్నాడు..

"రేపు ఆదివారం, నేనూ మాలతీ మీ కందరికీ పార్టీ ఇస్తున్నాం మీరంతా తప్పకుండా రావాలి..."

అందరూ తలలూపారు. అది అంగీకారంగా తీసుకుని వెళ్ళిపోయాడు జగన్.

అతడలా తిరగగానే "ఇంతోటి పెళ్ళికి పార్టీ ఒకటి! ఎంత ఘోరం!" అన్నాడు పరమేశ్వరశాస్త్రి.

అది ఘోరమనే సంగతి అందరూ ఒప్పుకున్నారు. అందుకే ఆ రాత్రి ఎవరికీ నిద్రపట్టలేదు. కలత నిద్రలో రకరకాల కలలు...

నాగవేణి వేశ్యలకుటుంబంలో పుట్టింది. ప్రొహిబిషన్ ఏక్ట్ వచ్చాక పోలీసుల బాధ పడలేక ఒక మంచివాణ్ణి చూసి లక్షణంగా పెళ్ళిచేసుకుంది. వాడి సహాయంతో మరొకర్ని నోరెత్తనివ్వకుండా తన వ్యాపారం దర్జాగా చేసుకుంటోంది... పరమేశ్వరశాస్త్రి నాగవేణి దగ్గరకి వెళ్ళాడు. నాగవేణి చిరునవ్వుతో ఆదరించింది....

'వేణీ! నా భార్య ఒత్తి రోగిష్టిది. నువ్వు నా దగ్గరే ఉండిపోరాదూ! నీకే లోటూ రాకుండా చూస్తాను." అన్నాడు శాస్త్రి.

నాగవేణి వయ్యారంగా కళ్ళూ, ముక్కూ తిప్పుకుని "అంతకంటేనా పంతులుగారూ! కాని... నన్ను తెచ్చి ఇంట్లో పెట్టుకుంటే మీ పరువేం కావాలి!" అంది.

"పోనిస్తూ వెధవ పరువు! మానవజీవితమంతా కలిపి నిండా నూరేళ్ళు లేదు. ఇందులో వాళ్ళకోసం, వీళ్ళకోసం ఎంతని తగలబెట్టుకోనూ! వచ్చెయ్యి"

తప్పకుండా వస్తాను పంతులుగారూ! ఒక్కణ్ని నమ్ముకుని బ్రతకటం నాకు మాత్రం సుఖం కాదా!"

పరమానందంతో అంది నాగవేణి.

అదిరిపడి లేచాడు పరమేశ్వరశాస్త్రి. గుండె ఇంకా దడ దడలాడుతోంది! అమ్మయ్య! ఇదంతా కలే కదా! నాగవేణితో పబ్లిక్‌గా తను సంసారం సాగిస్తే ఇంకేమైనా ఉందా? నలుగురిలో మళ్ళీ తను తలెత్తుకోగలడా? పరువు ప్రతిష్టలు పోయాక ఎందుకొచ్చిన బ్రతుకిది! ఛీ! చీ! పాడు కల! పీడ కల!

లేచి కాళ్ళూ చేతులూ కడుక్కుని మంచినీళ్ళు తాగి రామనామం జపిస్తూ పడుకున్నాడు శాస్త్రి. మళ్ళీ నిద్రరాక.

సుమతి ఒక విధంగా సార్ధక నామధేయురాలే! ఆవిడ భర్త వేశ్యాలోలుడు. ఈవిడ బుట్టలో మొగుణ్ణి మొయ్యటం మినహాగా అచ్చు సుమతిలాగే బ్రతికింది. సుమతి భర్తకు కుష్టురోగమూలేదు. ఏ రోగమూ లేదు. ఒక్కటే  పెద్దరోగం. .. పొగరుమోతు రోగం. సుమతి శాంతంగా అన్నీ సహించటానికి సిద్ధపడ్డా సుమతి అన్న శంకరం మాత్రం సహించలేకపోయాడు. "వెధవ కాపురం లేకపోతేనేం?" అని సుమతిని తీసుకొచ్చేసాడు... కాలేజీలో చేర్పించాడు. సుమతి బి.ఏ. పాసయింది. మొదట్లో కొంచెం దిగులుగా ఉండేది కాని, ఇప్పుడు ఎదురు తిరిగి బ్రతకటం నేర్చేసుకుని చిరునవ్వులు చిందిస్తూ కళకళలాడుతూ ఉంటుంది. సుమతి ఎప్పుడు కనిపించినా చూపులు తిప్పుకోలేదు రాజారావు... సుమతి చిరునవ్వు నవ్వి తల వంచుకుని వెళ్ళిపోతుంది.

"సుమతీ! నిన్ను ప్రేమిస్తున్నాను–" అన్నాడు రాజారావు తెగించి.

సుమతి తడబడలేదు. పారిపోలేదు. వెకిలిగా నవ్వలేదు. నిదానంగా స్థిరంగా సమాధానం చెప్పింది....

"నాకు మీరంటే దురభిప్రాయం లేదు.  మీరు నన్ను పెళ్ళి చేసుకోగలిగితే మిమ్మల్ని సుఖపెట్టి నేను సుఖపడగలను..."

"పెళ్ళి... పెళ్ళి" తడబడ్డాడు రాజారావు.

సుమతి ఆరిందాలా అర్థం చేసుకున్న దానిలా నవ్వింది.

"నాకు తెలుసులెండి! నన్ను పెళ్ళిచేసుకోవటం తేలిక పని కాదు. ఇంకముందు నా దగ్గిర ప్రేమ  ప్రస్తావన  తేకండి. లేనిపోని ఉద్రేకాలకు లొంగి బ్రతుకు అల్లరి చేసుకోవాలని నాకు లేదు."

చిరునవ్వుతోనే చేతులు జోడించింది సుమతి... ఏమి సౌందర్యం! ఏమి సంస్కారం! ఎన్ని జన్మలు తపసు చేయాలి ఇలాంటి స్త్రీ భార్యగా దొరకటానికి?

"సుమతీ! నేను నిన్ను పెళ్ళి చేసుకుంటాను...."

సుమతి నవ్వింది. ఆ నవ్వులో మెరుపులు... కళ్ళలో మెరుపులు.. మంగళ వాయిద్యాలు మ్రోగుతుండగా పదిమంది పెద్దల ఎదుట పచ్చని మాంగల్యాన్ని అంతకంటె పచ్చని సుమతి మెడలో...

అదిరిపడి లేచి కూచున్నాడు రాజారావు.

ఏమిటిది? కలేనా? అయ్యో! అవును. కలే! తను అంత సాహసం చె య్యగలడా? సుమతి అందమైనదే! మంచిదే! కానీ చూస్తూ చూస్తూ కొన్నాళ్ళు మొగుడితో కాపురం చేసి ఆ మొగుడొదిలేసిన దాన్ని ఎలా చేసుకోవటం? అబ్సర్డ్!

కానీ, ఆ కలే నిజమయితే, సుమతి తన ఇల్లాలయితే ఎంత కమ్మగా ఉంటుంది బ్రతుకు!

కళ్ళు మూసుకుని మానసికంగా సుమతితో సంసారం చేస్తూ పడుకున్నాడు రాజారావు.

లక్ష్మీపతి కాశీపతి మేనమామ.... ఆయన ఒక్కగా నొక్క కూతురు జ్ఞానాంబిక... కాశీపతికోసమే ఆ పేరు పెట్టారట ఆ పిల్లకి జ్ఞానాంబికకి రూపం లేదు, చదువబ్బలేదు. మాటలో... నవ్వులో....కదలికలో.. చవటతనంతో ఊగిసలాడుతూ ఉంటుంది. లక్ష్మీపతికి బాగా డబ్బుంది.. 'నా కూతుర్ని చేసుకుంటావా? బాగా ఆలోచించి చెప్పు. ఆహారం పట్లా, వ్యవహారం పట్లా మొహమాటం పనికిరాదు... దర్జాగా అడిగాడు లక్ష్మీపతి కాశీపతిని.

"అదేం మాట మామయ్యా! నీ మాట ఎప్పుడు కాదన్నానూ! ఇందులో ఆలోచించేందుకు ఏముందీ?" వినయంగా అన్నాడు కాశీపతి.

ఆ వినయానికి ముగ్ధడవలేదు లక్ష్మీపతి. గుర్రుమన్నాడు.

"నా మాట కాదనలేక నువ్వు జ్ఞానను చేసుకోనక్కరలేదు. దానికి లక్ష సంబంధాలొస్తున్నాయి. మేనల్లుడివి కదా, అని నిన్నడిగాను. నీ కిష్టమయితేనే..."

మేనమామ కంఠంలో విసురుకు కంగారు పడి పోయాడు కాశీపతి.

"భలేవాడివి మావయ్యా! ఇష్టం లేకుండా పెళ్ళి చేసుకోవటానికి నేను పసిపాపాయినా? జ్ఞాన అంటే నాకిష్టం కనుకనే...."

"సరేలే' ఉద్ధరిస్తున్నట్లు అన్నాడు లక్ష్మీపతి.

జ్ఞానాంబికకూ కాశీపతికీ వివాహ ముహూర్తం నిశ్చయమయి పోయింది. జ్ఞానాంబికను తలుచుకుంటే మనసులో ఏ కోశానా ఏలాంటి ఉత్సాహము కలగటం లేదు సరికదా, ఏదో విరక్తి కలుగుతోంది కాశీపతికి.

జ్ఞానాంబికతో సంసారం ఊహించుకుంటున్న కొద్దీ ఎక్కడలేని తెగింపూ వచ్చేసింది. ధైర్యంగా లక్ష్మీపతి దగ్గర కొచ్చేసాడు.

" నీ కూతుర్ని నేను చేసుకోలేను!.... "

"ఇప్పుడెలారా! ముహూర్తం కూడా నిర్ణయించుకున్నాక..."

"నీకేం మావయ్యా! డబ్బున్నవాడివి. ఏదైనా సాధించగలవు"

"సరేలే! వెళ్ళు!"

జ్ఞానాంబిక తనకు భార్య కాదు. గుండెలమీది నుంచి ఏదో పెద్ద బండ తీసినట్లు ఎంత రిలీఫ్!

కానీ మావయ్య డబ్బు తనకు రాదు! తనూ తన గుమస్తా ఉద్యోగమూ... ఏదో ఒక పెళ్ళాంతో బ్రతకవచ్చు. కానీ ఏదో ఒక ఉద్యోగంతో ఎలా బ్రతకటం?

గబాలున లేచి కూర్చున్నాడు కాశీపతి.

తన కల నిజమయితే తనకు మంచిదా? చెడ్డదా? ఏమో! తనకే అర్థం కావటం లేదు. ఎవరైనా దేవతలు అడ్డుపడి ఈ పెళ్ళి కాకుండా చెయ్యాలే తప్ప తనకు తానై మావయ్యతో ఏమీ చెప్పలేడు. కానియ్యి! ఏదెలా జరగాలో అలా జరుగుతుంది. అశాంతితో అటునుంచి ఇటు దొర్లాడు కాశీపతి...

కారు డ్రైవర్ సూర్యం! ఎంతో చక్కని రూపం. డిగ్రీలు లేకపోయినా జనరల్ బుక్స్ బాగా చదువుతాడు. ఆ విజ్ఞానం అతని తీరులో కనిపిస్తూ ఉంటుంది. మనసు కూడా ఎంతో మంచిది. ఎందుకో మరి నలభై దాటినా పెళ్ళి చేసుకోలేదు.

"సూర్యం! నన్ను పెళ్ళి చేసుకుంటావా?" ధైర్యం చేసి అడిగేసింది మిస్ వనజాక్షి.

"నా మనసులోనూ ఈ కోరిక ఉంది. ధైర్యం చేసి అడగలేకపోయాను..." చిరునవ్వుతో అన్నాడు సూర్యం.

"ఏమని పిలవాలి నేను మిమ్మల్ని? 'మేడమ్!' అనాలా? 'వనజాక్షి!' అనాలా!" చిలిపిగా నవ్వాడు.

గుండె జల్లుమంది మిస్ వనజాక్షికి.... నరనరంలోనూ ఏదో తీయని ప్రకంపనం... వణికిపోతూ లేచి కూర్చుంది మిస్ వనజాక్షి.

కల! ఒట్టి కల! అంతేలే! లేకపోతే సూర్యం తనకు మొగుడేమిటి? నలుగురూ తనను మిస్ వనజాక్షి అన్నా ఫరవాలేదు కాని మిసెస్ డ్రైవర్ సూర్యం అంటే ఎలా భరించటం? ఛ! ఛ! సిగ్గుచేటు!

మళ్ళీ పక్కమీద వాలిపోయింది. వనజాక్షి... ఎందుకో కడుపులోంచి పొంగివచ్చింది దుఃఖం... కారే కన్నీళ్ళను తుడుచుకునే ప్రయత్నం చెయ్యకుండా అలాగే పడుకుంది.

ఇంచుమించు పది సంవత్సరాల తరువాత కనిపించాడు రామం! అతడిని చూస్తూనే నిలువునా వణికింది మిసెస్ సోమశేఖరం నిలబడలేకపోతుంది. ఎంత నిగ్రహించుకున్నా కళ్ళలో నీళ్ళు తిరుగుతున్నాయి. రామం పరిస్థితి కూడా అలాగే ఉంది. తూలిపోబోతున్న మిసెస్ సోమశేఖరాన్ని పొదివి పట్టుకున్నాడు. అతడి గుండెలమీద వాలిపోయింది మిసెస్ సోమశేఖరం! ఎంత శాంతి! ఎంత తృప్తి! ఇలాంటి అమర సుఖానికి తనకు తానుగా దూరమయింది. ఆనాడు తన కులం కాని రామాన్ని చేసుకోవటానికి పెద్దవాళ్ళను ఎదిరించలేకపోయింది. ఈనాటివరకూ గుండెల్లో ఆరని మంటతో బ్రతుకుతోంది.

"రామం! నిన్ను వదిలి బ్రతకలేను! – నీతో వచ్చేస్తాను!"

"రాగలవా?"

"రాగలను! ఈ పదేళ్ళుగా నిన్న మరచిపోవాలని ఎంతగా ప్రయత్నించానో చూడు! ఇప్పటికీ ఈ గాయం ఎంత పచ్చిగా ఉందో? నువ్వు నా కోసం ఇంతవరకూ పెళ్ళి చేసుకోకుండానే వున్నావుగా! ఇన్ని రోజులుగా దొంగ బ్రతుకు బ్రతికాను. ఇప్పుడు నా కోసం నేను, ఒక్క సంవత్సరం. .. ఒక్కరోజు.. పోనీ, ఒక్క క్షణం బ్రతుకుతాను..."

"నీ భర్త ... పిల్లలు..."

"ఏదీ లెక్కచెయ్యను. ఎవరూ అక్కర్లేదు! నువ్వు మాత్రమే కావాలి!"

"ఆల్‌రైట్! మనం దొంగతనంగా వెళ్లిపోనక్కరలేదు. లీగల్‌గా నీ భర్తకు విడాకులిచ్చేయి. మనం పెళ్ళి చేసుకుందాం!"

విడాకులు! మళ్ళీ పెళ్ళి...

ఒక్క ఉదుటున లేచి కూచుంది మిసెస్ సోమశేఖరం! ఒళ్ళంతా ఇంకా కంపిస్తోంది. ఏం కల ఇది! ఇంకా నయం! దేవుడి లాంటి భర్త! రత్నాల్లాంటి పిల్లలు! తనకిదేం రోగం! పోనీలే! కలే ఇది !

కళ్లు మూసుకోగానే చిరునవ్వుతో రామం రూపం ప్రత్యక్షమయింది., అలా ఎప్పుడూ ప్రత్యక్ష మవుతూనే ఉంటుంది.

"వద్దు రామం! రావద్దు – వెళ్ళిపో! నా కళ్ళముందు నుంచి వెళ్ళిపో!" తన చుట్టుప్రక్కల ఆమడ దూరంలో ఎక్కడాలేని రామాన్ని ఉద్దేశించి ఆక్రోశించింది మిసెస్ సోమశేఖరం.

జగన్ పార్టీ బ్రహ్మాండంగా ఏర్పాటు చేసాడు. జగన్, మాలతి ప్రక్క ప్రక్కన నిలుచుని అతిథుల్ని ఆహ్వానించారు. కళ్ళ పండువగా ఉన్న ఆ జంటను చూడగానే అందరికీ కళ్ళు కుట్టాయి.

"ఎంతపని జరిగింది!" అనుకుని మరోసారి గుండె బాదుకున్నారు అందరూ...

అవును! ఘోరం జరిగిపోయింది... ఇద్దరు మనుష్యులు మన మధ్య బ్రతుకుతున్న మనుష్యులు.. మనకు మనమై ఆపాదించుకున్న సాంఘిక శృంఖలాలను చేధించుకుని సుఖపడి పోతున్నారు! హమ్మ బాబోయ్! సుఖపడిపోతున్నారు! ఓరి దేవుడోయ్ సుఖపడిపోతున్నారు!

# మా బతుకు మాది

**- డి.కామేశ్వరి**

'**మం**చినీళ్ళ సీసా  మర్చిపోయాను' అనుకుంటూ తలుపు తీసుకువెళ్ళిన సుజాత మంచినీళ్ల సీసాతో తిరిగి వచ్చి తలుపు దఢాలున వేసింది.

ఎఱ్ఱబడ్డ ఆమె మొఖం,  ఆ విసురు చూసి 'ఏమిటి ఏమైంది?" అన్నాడు ఆశ్చర్యంగా ప్రసాద్.

సుజాత తిరస్కారంగా  చూసి తల తిప్పుకుంది జవాబివ్వకుండా.

'ఏమిటీ' అన్నాడు మళ్ళీ.

'ఛ.  వయసుకి తగ్గట్టు ఉండరు. అనవసరంగా వెళ్ళాను'  అంది కోపంగా.

'ఏమైంది సరిగా చెప్పు' విసుగ్గా అన్నాడు.

'వెళ్లి చూడండి. ముసలాళ్ళు సరసాలు. పచ్చిగా  అలా హాల్లో..' తిరస్కారంగా అంది.

సంగతి విని ప్రసాద్ తేలిగ్గా నవ్వేశాడు.

'అది ఇంకా ఏమిటో అనుకున్నాను.  ఏమిటోయ్ పాపం మా  అమ్మా, నాన్నలని మరీ ముసలాళ్లని చేసి మాట్టాడకు, ఆయన మొన్నేగా రిటైర్ అయింది. ఏభై ఎనిమిది  అంటే ఈ రోజుల్లో నడి వయసు కింద లెక్క. పాపం వాళ్ళకి ప్రత్యేకించి  ఓ గది లేదు. ఏదో అవకాశం చూసి  సరసాలాడుకుంటే పానకంలో పుడకలా నువ్వు వెళ్ళావు' హాస్యంగా అన్నాడు.

'ఛీ... ఊరుకోండి. పెద్దవాళ్ళు  కాస్త డిగ్నిఫైడ్‌గా ప్రవర్తించాలి. ఇలా చీప్‌గా...'

"ఏయ్ సుజా... వాళ్ళిద్దరూ భార్యాభర్తలు. కానిపని ఏం చేస్తున్నారు. ప్రతీ దానికి  పెడర్థాలు తీస్తే ఎలా? అసలు మనం పిల్లల గది వాళ్ళకిచ్చి పిల్లల్ని హాల్లో పడుకోమనాలి.  మనదే తప్పు.'

'అవును పాపం ఈ వయసులో వాళ్ళకి గదులివ్వాలి. మరి చదువుకునే పిల్లలకి ప్రైవసీ లేకుండా ఎలా?' దురుసుగా అంది సుజాత.

'సర్లే పడుకో, వాళ్ల పాట్లు ఏవో వాళ్ళే పడతారు నీకేం బాధ' అంటూ లైటార్పేశాడు ప్రసాద్.

అవతల హాలులో కమలమ్మ 'ఛ... కోడలేమనుకుందో మనల్ని చూసి' సిగ్గుగా అంది.

'అంటే..'

'మీరు మరీను, వయసుతో పాటు సరసాలు ఎక్కువవుతున్నాయి. నలుగురూ తిరిగే హాలులో...' భర్త వంక కోపంగా చూసింది.

'ఏం చేశాం... నీవు పడుకుంటే, నీ మంచం మీద కూర్చుని నవ్వుతూ కబుర్లు చెప్పుకుంటున్నాం. అదీ తప్పేనా, అయినా సరసాలాడే వయసింకా దాటిపోలేదు మనకు. మనిష్టం మనది. ఎవరో ఏదో అనుకోవడానికి ఏం వుంది ఇందులో. అసలు ఇలా హాల్లో పడుకోవడం ఎంతో ఇబ్బందిగా ఉంది. ఖర్మ, మన ఖర్మ కొద్దీ మనకో ఇల్లంటూ లేకుండా పోయి కొడుకింట్లో ఉండాల్సి వచ్చింది' రామ్మూర్తిగారు చాలా అసహాయంగా, అసంతృప్తిగా అన్నారు. 'సరేలే, లైటార్పి పడుకోండి' అందావిడ అటు తిరిగి పడుకుంటూ,

'అంకుల్ సాయంత్రం మీ ఆఫీసు దగ్గరకు వస్తాను. మీతో కాస్త మాట్లాడాలి. ప్లీజ్ నా కోసం కాసేపు వెయిట్ చేస్తారా. మీతో అర్జంటుగా మాట్లాడాలి' అన్నాడు ప్రసాద్.

'ఏమిటి సంగతి, ఏ విషయం మాట్లాడాలి? పోనీ మీ ఇంటికి రానా, మీ నాన్ననీ చూడచ్చు' అవతల నించి సాంబశివరావు అన్నాడు.

'వద్దులెండి నేనే వస్తాను ఆఫీసుకి, వెయిట్ చేయండి.'

సాయంత్రం ప్రసాద్ వచ్చాక ఇద్దరూ క్యాంటీన్లో కాఫీ తాగుతుండగా ప్రసాద్ చెప్పిన విషయం విన్న సాంబశివరావు ఆశ్చర్యంగా చూసాడు. 'ఎందుకు హఠాత్తుగా మీ నాన్న ఈ నిర్ణయం తీసుకున్నాడు. కారణం ఏదైనా ఉందా? ఇంట్లో ఏదన్న గొడవలా...'

'అబ్బే చెప్పుకోవాల్సినంత ఏం గొడవలు లేవు. గత ఏడాదిగా కలిసే ఉంటున్నాంగా. అందుకే సడన్‌గా నాన్నగారు ఇలాంటి నిర్ణయం తీసుకోవడం బాధనిపించింది. ఎన్ని రకాలుగా అడిగినా ఆయనేం చెప్పడం లేదు. నిర్ణయం తీసుకున్నాక చెప్పారు. నామాట వినడం లేదు. మీకు బాగా ఫ్రెండ్ కదా. మీరు చెబితే వింటారేమో నన్న ఆశతో చెబుతున్నాను. కొడుకుండీ ఓల్డ్ ఏజ్ హోమ్‌కి పంపేశాడు అన్న నింద నా మీద పడదా అంకుల్, అది ఆయనకెందుకు అర్థం కావడం లేదో మరి. అయినా అంత ఖర్మ ఏం వచ్చింది. మీరొకసారి మాట్లాడండి. మనసులో మాట చెబుతారేమో.'

'పద ఇప్పుడే వస్తాను, మాట్లాడటానికి వేరే ముహూర్తం కావాలా ఏంటి? నీ స్కూటరుందిగా వెళదాం రా' అన్నారు సాంబశివరావు.

'ఏమిటోయ్ నల్లపూసవయ్యావు, ఎన్నాళ్లైంది కనిపించి' మిత్రుడిని చూసి అన్నాడు రామ్మూర్తి. స్నేహితుడు కొడుకుతో కలిసి రావడం చూసిన రామ్మూర్తికి సంగతి అర్థమైంది.

'నాయనా నీలా నేనింకా రిటైరవ్వలేదుగా ఎప్పుడు బడితే అప్పుడు రావడానికి. ఏదో మీవాడు నీ మీద కంప్లైంట్ చేస్తే ఆఫీసు నుంచి ఇటే వచ్చాను. ఏమిటీ సంగతి ఏదో గొప్ప నిర్ణయం తీసుకున్నావట.'

'ఓ మావాడు రాయబారానికి పంపాడా నిన్ను' నవ్వుతూ కొడుకు వంక చూసారు రామ్మూర్తి.

ప్రసాద్ ముఖం గంటు పెట్టుకుని 'రాయబారం ఏముంది? మిత్రుడి మాటలైనా మీకు రుచిస్తాయేమోనన్న ఆశతో చెప్పానంతే' అంటూ లోపలికి వెళ్ళిపోయాడు.

'ఏమిటి రామ్మూర్తి, ఏమైంది? నువ్విలాంటి నిర్ణయం తీసుకున్నందుకు పాపం మీ వాడు చాలా నొచ్చుకుంటున్నాడు.'

'అది సరే, రేపు ఉదయం తొమ్మిది గంటలకు నిన్నో చోటికి తీసుకువెళతాను. వీలుంటుందా రావడానికి. వస్తే అక్కడ ఈ విషయం మనం మాట్లాడుకుందాం, నీ సందేహనివృత్తి అప్పుడు చేస్తాను. ఎనిమిదిన్నరకల్లా వస్తాను, రెడీగా ఉండు'

'ఎక్కడికో చెప్పు. వీలవడానికేముంది? ఆదివారమేగా తప్పకుండా వెళదాం. ఎక్కడికి తీసికెళతావు' కుతూహలంగా చూశారు సాంబశివరావు.

'రేపటి వరకు నన్నేం అడక్కు. మిగతా విషయాలుంటే చెప్పు' రామ్మూర్తి నవ్వుతూ అన్నారు. లోపల్నించి కమలమ్మ కాఫీ తెచ్చి ఇచ్చి 'బాగున్నారా..,. చాలా రోజులైంది వచ్చి' అంటూ నవ్వుతూ పలకరించింది.

'ఏవో పనులమ్మా. ఇంకో నాలుగు నెలల్లో మావాడి జాబితాలోకి చేరతాను గదా. అప్పుడు ఇంక తీరికే అంతా. అవును ఏమిటి మీ ఆయన గారేదో గొప్ప నిర్ణయం తీసుకున్నారట. నీకు చెప్పే చేశాడా?' సాంబశివరావు నవ్వుతూ అడిగాడు.

కమలమ్మ భర్త వంక అర్ధవంతంగా చూసింది. ఆయన చిద్విలాసంగా నవ్వుతూ కూర్చున్నాడు.

'గొప్ప నిర్ణయం అని మేం అనుకోలేదు. కానీ తెలివైన నిర్ణయం అని మాకనిపించింది' కమలమ్మ గడుసుగా అంది.

'ఓహో... అయితే ఇద్దరూ కలిసి చేసిన నిర్ణయమేనన్నమాట. మా వాడి సస్పెన్సు రేపటి దాకా పొడిగించాడు. సరే వేచి చూడక తప్పదు గదా' కాఫీ కప్పు కింద పెట్టి లేచి నిల్చున్నాడు సాంబశివరావు.

ఉదయం తొమ్మిది గంటలకు రామకృష్ణ మఠం నుంచి బస్సు బయలుదేరింది. బస్సు ఎక్కాక 'రామకృష్ణాశ్రమం' నడుపుతున్న ఓల్డ్ ఏజ్ హోమ్‌కా తీసుకెళుతున్నావ్?' సాంబశివరావు అడిగాడు.

'ఓ నీకు తెలుసన్నమాట. కీసర గుట్ట దగ్గర వీళ్ళదో ఆశ్రమం ఉంది. ప్రతి ఆదివారం ఇక్కడ నుంచి బస్సు వెళుతుంది. నీకు ఆ ప్రదేశం చూపిస్తే నే తీసుకున్న నిర్ణయం సరైందేనని అంగీకరిస్తావు, ఓసారి  నీకు అదంతా చూపించాలి రమ్మని పిలుద్దామనగానే మావాడు ఈ కబురు నీకు చేరేసాడు'.

'ఇలాంటి నిర్ణయం ఎందుకు తీసుకున్నావు?"

'మాకు ప్రశాంతంగా, హాయిగా ఏ బాదర బందీ లేకుండా ఉండాలనిపించింది. పిల్లల ఇళ్ళలో ఉండి వాళ్ళని ఇబ్బంది పెడతూ మనం ఇబ్బందిగా ఎందుకు బతకడం,

చూడు సాంబశివం ప్రతివారికీ చిన్నో, పెద్దో ఏదో తలదాచుకునే కొంప ఉండాలి. మా దురదృష్టం కొద్దీ రిటైరయ్యేలోగా చిన్న ఇల్లైనా కొనలేకపోయాను.'

'మన మధ్య తరగతి సంసారులకి సొంత ఇల్లూ అందని ఆశ అవుతుంది అనుకో. కానీ మరీ ఇలా ఎవరూ లేని వాళ్ళలా మీరిక్కడ ఉండడం మీ అబ్బాయికి ఇష్టం లేనట్టుంది నా దగ్గర బాధపడ్డాడు' అన్నాడు సాంబశివం.

రామ్మూర్తిగారు అదోలా నవ్వారు. 'లోకం ఏమనుకుంటోందన్న బాధ ఓ వైపు, మరోవైపు మేం ఇంట్లోంచి వెళితే ఎదుర్కోవలసిన ఇబ్బందులు తల్చుకుని భయపడుతున్నాడులే. తల్లిదండ్రుల మీద ప్రేమ, భక్తికంటే స్వార్థం ఎక్కువైంది. ఈనాటి పిల్లల్లో, ఆడవాళ్ళు ఉద్యోగాలు చేయడం ఆరంభించాక ఇంట్లో పెద్ద వాళ్ళకీ ఇంపార్టెన్స్ పెరిగిందీ మధ్య. ఇల్లు కాపలా, పిల్లల సంరక్షణ, అమ్మమ్మలు నాయనమ్మలుంటే ఇంటి పని బాధ్యత, తాత ఊరికే ఉన్నాడని పిల్లల చదువుల బాధ్యత ఇన్ని లాభాలున్నాయి గదా – అన్నింటినీ మించి పిల్లలని వదలి నిశ్చింతగా ఉద్యోగాలు చేసుకోవచ్చు ఆడ, మగా. అంచేత మన వాళ్ళకి పెద్దవాళ్ళ విలువ తెలిసి వచ్చిందిలే' నవ్వుతూ అన్నాడు రామ్మూర్తి.

'మరి మన విలువ గుర్తించి నిర్లక్ష్యం చేయనప్పుడు మరి ఇలాంటి నిర్ణయం ఎందుకు తీసుకున్నట్టు.'

'చూడు సాంబశివరావూ.... మాకు ఈ రెండుగదుల కొంప జైలు ఖానాలా అనిపిస్తుందయ్యా వాళ్లకో గది, చదువుకున్నా, పడుకున్నా ఆ గది ఒక్కటే. అపార్ట్‌మెంట్ లైఫ్‌లో ఇమడలేకపోతున్నా. ఇది వరకు రోజుల్లో వయసు పైబడ్డ వాళ్ళు కాస్త కాళ్ళు చాపుకుని వీధి వరండాలో పడక కుర్చీలో కూర్చుని వచ్చిపోయే వాళ్ళతో కబుర్లు, పేపరు చదవడం, మొక్కల పని చేస్తూ, నీళ్ళు పోస్తూ ఇటు అటూ తిరిగి కాలక్షేపం చేసేవారు. ఆడవాళ్ళంటే మండువాలు, వెనక వరండాలుండేవి. నలుగురూ కలిసి కబుర్లాడుకుంటూ పనులు చేసుకునేవారు. అప్పడాలు ఒత్తుకుంటూ, పప్పులు బాగు చేసుకుంటూ, ఏం లేకపోతే వామనగుంటలు ఆడుతూ, రామాయణ, భాగవతాలు చదువుకునే వారు. మా చిన్నప్పుడు ఇంటి నిండా జనం ఉండేవారు. ఆ జనం ఫ్రీగా తిరిగే ఇళ్ళు, పెరళ్ళు వుండేవి. మనవలతో ఆడుకుంటూ, కోడళ్లు పనిచేసుకుంటే

చంటిపిల్లలని ఆడించేవారు అమ్మమ్మలు , మామ్మలు. తాతలు పిల్లలకి విద్యాబుద్ధులు నేర్పేవారు.

ఇప్పుడు ఇల్లు చిన్నది. హాలులో మా ఇద్దరికీ రెండు దివాన్లు రాత్రికి పడకలవుతున్నాయి. పిల్లలు చదువుకోవాలి అంటూ వాళ్లకి గది ఇచ్చారు. రోజంతా హాలులో కాస్త కాలు చాపుకు కింద కూర్చునే చోటులేదు. వాళ్ళ స్నేహితులొస్తే వాళ్ళకి ఇబ్బందిగా ఉంది. అన్నింటి కంటే మా ఆవిడ పాపం చాకిరీకి తట్టుకోలేకపోతుందయ్యా. పెళ్ళయిన కొత్తలో అత్త, ఆడబిడ్డలు, మరదులకి చాకిరీ, పిల్లలు పుట్టాక వాళ్ళకి. ఇప్పుడు మనవలకి, పాపం అనిపిస్తుంది. కోడలు 8 గంటలకల్లా వెళ్ళాలి. ఉదయం ఆ అమ్మాయి కాస్త సాయం చేస్తుందనుకో కానీ మొత్తం బాధ్యత, భారం ఈవిడ మీద పడుతుంది. పనిమనిషి చేత పనులు చేయించడం, అది రాకపోతే తను చేసుకోవడం. వంట – వార్పు, మధ్యాహ్నం కాస్త నడుం వాల్చేసరికి స్కూలు నుండి పిల్లలు వస్తారు. ఏడైతే గానీ కోడలు రాదు. మళ్ళీ సాయంత్రం వంట... ఇది ఆవిడ సంసారంలా బాధ్యత నెత్తిన పడింది. పాపం ఆవిడకింకెప్పుడు విశ్రాంతి...?'

'అవుననుకో... పిల్లలకి మన ఆసరా. వాళ్ళు మనకు అండ గదా'

'ఆ... వినడానికి బాగానే ఉంటుందయ్యా. మన పిల్లలని మనంపెంచుకున్నాం అంటే అప్పుడు ఓపిక వేరు. అంతేకాక కొట్టుకున్నా, తిట్టుకున్నా మనిష్టం. అంతేకాక రిటైరయ్యాక బాధ్యతలుండవు. హాయిగా సినిమాలకి, షికార్లకి తిరగొచ్చు. మంచి పాట కచేరీకో, డ్యాన్సు ప్రోగ్రాంకో, గుళ్ళు గోపురాలు చూడడానికి ఊర్లు వెళ్ళాలని ప్లాన్లు. ఏదీ కుదరడమే లేదు. ఇల్లు బందిఖానా అయింది. పొద్దుట పని, సాయంత్రం పిల్లలొచ్చే వేళ, పిల్లలొచ్చాక వంటరిగా వదిలి ఎలా వెడతాం, కొడుకు, కోడలు వచ్చేసరికి రాత్రవుతుంది. అంతరాత్రి ఇంకెక్కడికి వెళ్ళేది. పిల్లలకి సెలవులప్పుడు వెళ్ళండి అంటాడు మా వాడు. ఆ రోజు మాకంటే వాళ్ళకుండే ఏదో ప్లాన్ చేసుకుంటారు తిరగడానికి. పోనీ అప్పుడైనా మమ్మల్ని కలుపుకోరు. నేనేం నేరంగా అనడం లేదు. వాళ్ల ఫ్యామిలీ వాళ్ళు వెళ్ళాలనుకుంటారు. అయ్యో, అమ్మా, నాన్న అనుకోరుగా. ఎంతకని పుస్తకాలు... ఎంతకని టీవీ...ఆ టీవీ కూడా పిల్లలున్నంత సేపు పిల్లలు

చదువుకుంటున్నారు డిస్ట్రబెన్స్ అంటారు. ఉదయం ఎవరూ లేనప్పుడు చూడాలి. మంచి సీరియల్స్ మధ్యాహ్నం, రాత్రుళ్ళు గదా వస్తాయి. మా ఆవిడ పాపం కొట్టుకుంటుంది టీవీ కోసం. పెట్టే సరికల్లా 'సౌండన్నా తీసేయండి పిల్లలు చదవరు' అంటుంది కోడలు, శని, ఆది వారాలొచ్చాయి అంటే పిల్లలు కార్టూన్లు పెట్టుకుంటూ మమ్మల్ని అసలు చూడనివ్వరు గదా. చూడు, ఇవన్నీ చెబితే చిన్న విషయాల్లాగే ఉంటాయి. అనుభవించిన వారికే అర్థం అవుతాయి.

దక్షిణాన గుడులన్నీ తిరిగి రావాలని ఎంతో ఉంది. 'ఇప్పుడెలా అమ్మా' ఎండకాలం సెలవుల్లో వెళ్ళండి అంటాడు. ఆ ఎండల్లో మేం ప్రయాణం చెయ్యలేక మానుకున్నాం. ఊళ్ళో మంచి నాటకాలు, ప్రోగ్రాంలు ఎన్నో అవుతున్నాయి. హాయిగా ఇద్దరం వెళ్ళి కూర్చోవచ్చు. కానీ ఇంటి కాపలా అయిపోయింది మా బతుకులు. చూడు సాంబశివరావు అందుకే కాస్త మాకై మేము ఈ ఆఖరురోజుల్లో బాదర బందీలు లేకుండా ఉండాలని ఉందయ్యా. ఇంకా మా బతుకులు ఎన్నాళ్ళకి తెల్లారతాయో, పదేళ్ళో, పదిహేనేళ్ళో, ఇరవైయ్యేళ్ళో ఎవరికి తెలుసు. మేం కాటికి కాచుకున్న మరీ ముసలాళ్ళం కాదు గదా? మాకు ఇవి తీరని సరదాలు. ముచ్చట్లు. వాటిని తీర్చుకోవాలనుకోవడం తప్పా. చూడు ఆఖరికి మేం ఇద్దరం మాటామంతీ కష్టం, సుఖం చెప్పుకోడానికి మాకంటూ ఓ గది లేదు. మొన్న ఓరోజు మా కోడలు మా ఇద్దర్నీ కాస్త సన్నిహితంగా చూసి ముఖం చిట్లించుకుని విసవిసా వెళ్ళిపోయింది మేమేదో కాని పని చేస్తున్నట్లు. నాకింకా అరవై అన్నాలేదు. అన్ని సరదాలు, సరసాలు చంపేసుకు బతకాలంటావా? పిల్లలు చిన్న వాళ్ళప్పుడు వాళ్ల పెంపకం, పెద్దయ్యాక బరువు బాధ్యతలు అన్నీ తీరాక విశ్రాంతి కోరుకోవడం తప్పుకాదు గదా? మేం వెళ్ళడం తప్పు కాదు కదా?' అంగీకారంగా తల ఆడించాడు సాంబశివరావు.

'అవునులే పోనీ మీ వాడికి వివరంగా చెప్పకపోయినా సంగతి ఇదీ అని' చెప్పాను. ఇన్ని మాటలలో కాకుండా 'మాకు కాస్త ప్రశాంతంగా ఇష్టం వచ్చిన వేళకి నచ్చిన చోటికి వెళ్ళాలని ఉంది. ఈ బాదరబందీ లింక మాకొద్దు అని నా నిర్ణయం చెప్పాను. చెప్పాగా మేం ఇంట్లోంచి వెళితే వాళ్ల ప్రాబ్లమ్స్ తలుచుకుని గాభరాపడుతున్నాడు. అదే అలవాటవుతుంది. ఉద్యోగం చేస్తున్న వాళ్ళందరి ఇళ్ళల్లో

తల్లిదండ్రులు ఉంటున్నారేమిటి. ఏదో మాలా ఓ కొంప లేని వాళ్ళు ఉంటారు. నాకేదో పెన్షను వస్తుంది. ప్రావిడెంట్ ఫండ్, గ్రాట్యుటీలు చేతిలో ఉన్నాయి గదా! ఓ లక్ష పెట్టి రూము కొన్నాను. మిగతాది కాస్త బ్యాంకులో ఉంది. అవసరాలకి, పెన్షన్‌లో ఇద్దరికీ చెరో పదిహేను వందలు అక్కడ భోజనానికి కట్టాలి. ఇంకో వెయ్యి పై ఖర్చులకు సరిపోతుంది. ఈ మాత్రంగా నైనా లేనివాళ్ళు పిల్లలతో ఉండక తప్పదు. వాళ్ళకంటే మేం నయం కదా – అందుకే ఎవరికీ ఇబ్బందిలేని నిర్ణయం తీసుకుని స్వతంత్రంగా ఎవరిపాటికి వారుండడం మంచిది గదా!'

'నీవన్నది నిజమేలే– ఈరోజుల్లో ఎవరికీ భారంగా ఆధారపడాలనుకోడం లేదు.'

'ఇదేదో వాళ్ల మీద కోపంతో తీసుకున్న నిర్ణయం కాదని వాడికి చెప్పు. వాడిని చిన్నబుచ్చాలని కాదు. లోకం ఏమనుకోదు– ఈ రోజుల్లో ఎవరి గోల వారిది. అడిగినా నాలుగు రోజులడుగుతారు. వాళ్ల ప్రాబ్లమ్స్ వాళ్ళే సాల్వ్ చేసుకుంటారు, అలవాటైపోతుంది. ఇది వరకులాగ జాయింట్ ఫ్యామిలీలు ఇంకా ఈ అపార్ట్‌మెంట్ సంస్కృతిలో, ఈ పట్టణాలలో కుదరదు. కాస్త హాయిగా తిరిగే చోటు కూడా లేక జైలులా ఉంది మాకు. అందుకే స్వచ్ఛమైన గాలి, నీరు ఉండి మానసిక ప్రశాంతత దొరికే చోటికి వెళుతున్నారని నువ్వే వాడికి చెప్పాలి.'

మాటల్లో బస్సు ఆశ్రమం చేరింది. చుట్టూ బోలెడు ఖాళీ స్థలం మధ్యలో ఆశ్రమం, ఆఫీసు, దగ్గరే చిన్న ప్రార్థనా మందిరం. గేటులోంచి బస్సు లోపలికెళ్ళి ఆగింది.

'పద ముందుకు ఆఫీసు దగ్గరకెళదాం' దారి తీశాడు రామ్మూర్తి.

ఆఫీసులో కూర్చున్నాయన రామ్మూర్తిని చూసి పలకరింపుగా నవ్వాడు.

'ఎప్పుడు వస్తున్నారు' అనడిగాడు.

'ఇదిగో పెన్షన్ పేపరులో అడ్రసు మార్పించి, పోస్టాఫీసు, బ్యాంకులకి కొత్త అడ్రస్సు చెప్పాలి. ఫస్ట్‌కల్లా వద్దామని అనుకుంటున్నాను. ఈయన సాంబశివరావని మా స్నేహితుడు. ఈ ఆశ్రమం పరిసరాలు చూపించాలని తీసుకొచ్చాను.'

'ఆ.. వెళ్ళండి, చూపించి రండి. ఈలోగా టీ తెప్పిస్తాను' అన్నాడు మేనేజర్.

ఆశ్రమం అంతా తిప్పి చూపించాడు రామ్మూర్తి, ఒక్కో గదిలో రెండు మంచాలు, ఓ టేబుల్, కుర్చీ, ఒక ఇనుప బీరువా, గదికి అనుకుని చిన్న ఎన్‌క్లోజ్‌డ్ వరండా, ఎటాచ్డ్ బాత్ భార్యాభర్తలు కల్సి ఉండవచ్చు. వరండాలో స్టౌ పెట్టుకుని ఉదయం కాఫీ కలుపుకునే ఏర్పాట్లు చేసుకున్నారు కొందరు. వంట గది, పెద్ద గ్యాస్ స్టౌలు, డైనింగ్ హాలులో ఒక్కసారి పాతిక ముప్పై మంది కూర్చునే పెద్ద టేబుల్, రిక్రియేషన్ రూములో పేపర్లు, మ్యాగజైన్లు, క్యారమ్, ఛెస్ ఆడుకోవడానికి బోర్డులున్నాయి. ఉదయం కాఫీ టిఫిను ఏడున్నరకి ఇస్తారు. మధ్యాహ్నం లంచ్‌లో పప్పు, కూర, పులుసు, పచ్చడి, పెరుగుతో భోజనం. నాలుగు గంటలకు టీ, బిస్కట్లు, ఏదైనా ఒక పండు రాత్రి ఏడున్నరకల్లా రొట్టె, కూర, అన్నం, పప్పువగైరాలతో డిన్నర్. డైనింగ్ రూమ్‌కి రాలేని వారికి క్యారియర్ గదికే పంపిస్తారు. కాస్త దూరంలో చిన్న గుడి, ఓ యాభై మంది దాకా కూర్చుని ప్రార్థన. భజన, మెడిటేషన్ వగైరాలు చేసుకోగలిగినంత మండపం ఉన్నాయి. అంతేకాక వాకింగ్‌కు వెళ్ళడానికి చుట్టూ బోలెడు స్థలం, ఆఫీసు ముందు చిన్న గార్డెను, చుట్టూ పెద్ద మొక్కలు, చాలా ఆహ్లాదకరంగా ఉంది వాతావరణం.

ఆ వాతావరణం చూసి 'చాలా బాగుందయ్యా! సిటీ ట్రాఫిక్, జనానికి దూరంగా హాయిగా ఉంది' మనస్ఫూర్తిగానే అన్నాడు సాంబశివరావు.

'అందుకే బాబూ, చూడగానే నాకీ ఆశ్రమం నచ్చింది. ఊర్లోకెప్పుడు కావలిస్తే అప్పుడు వెళ్లడానికి బస్సులున్నాయి. పిల్లల్ని, బంధువులను చూసి రావచ్చు. వాళ్ళు ఇక్కడికొచ్చి ఓ పూట గడిపి వెళ్ళొచ్చు. ఒంటరితనం అనిపించకుండా ఆవిడకి నేను, నాకావిడ ఉండనే ఉన్నాము. ఇంత కంటే ఏం కావాలి? మనం కోరుకునే ప్రైవసీ మనకు ఉంటుంది. పిల్లల మీద ఆధారపడ్డాం అని మనం, భారమయ్యామని పిల్లలు అనుకోనక్కరలేదు. ఏమంటావు?' అన్నాడు రామ్మూర్తి. సాంబశివరావు అంగీకారంగా తల ఆడించాడు. ఆయన మొహం చూస్తే బాగా ఇంప్రెస్ అయినట్టే కనిపించింది. మధ్యాహ్నం లంచ్ అక్కడే చేసి సాయంత్రానికి ఇద్దరూ తిరిగి వచ్చారు.

'నాన్న ఏమన్నారు అంకుల్, మాట్లాడారా' ప్రసాద్ మర్నాడు కలిసి ఆరాటంగా, అడిగాడు.

సాంబశివరావు నవ్వి 'నేనూ అక్కడ ఓ రూము బుక్ చేసుకుందామని అనుకుంటున్నానోయ్, అంత హాయిగా, ప్రశాంతంగా ఉందక్కడ' అన్నారు.

ప్రసాద్ ముఖంలో అసహనం, ఆరాటం చూసి భుజం తట్టి 'చూడు ప్రసాద్, రోజులు మారాయయ్యా. ఈనాటి తల్లిదండ్రుల దృక్పథాల్లోనూ మార్పు వచ్చింది. వాళ్ల బాధ్యతలు తీరాక ఎవరికీ భారం కాకుండా మిగిలిన బతుకు బతకాలనుకుంటున్నారు. వయసులో ఉండగా తీరని కోరికలు వయసు పైబడక ముందే తీర్చుకోవాలని ఆశిస్తున్నారు.'

'ఇప్పుడు వాళ్ళకి మేము ఏమి లోటు చేశాము. అయినా వాళ్లకి తీరని కోరికలంటూ ఏమున్నాయి?'

'మీరేదో లోటు చేశారని కాదు.'

'మరి'.

'నేను చెప్పేది పూర్తిగా విను. ఈ అపార్ట్‌మెంట్ సంస్కృతి వచ్చాక భార్యా, భర్త, పిల్లలు సంసారాలలో తల్లిదండ్రులకి చోటెక్కడుంది. మరీ గతిలేని వారు, సర్దుకు బతక్క తప్పని వారు పిల్లల ఈసడింపులకి గురవుతూ బతుకుతున్నారు. అదృష్టవశాత్తు మీ నాన్నకి తన బతుకు తాను బతకగలిగే ఆదాయం ఉంది. కాబట్టి ఈ నిర్ణయం తీసుకున్నాడు. ఇందులో నువ్వు బాధ పడాల్సింది ఏమీ లేదు. ఎవరేం అనుకుంటారోనన్న భయమూ లేదు. నీ సంసారం, నీ పిల్లలు, నీ బాధ్యతలు నువ్వే పరిష్కరించుకోవాలి. నాణానికి రెండు వైపులా చూడాలి. అలా చూస్తే మీ నాన్న నిర్ణయం సరైనదేనని నాకు అనిపించింది. 'లివ్ అండ్ లెట్ లివ్' అన్నది ఏ కాలానికైనా వర్తించే మాట. అంచేత అనవసరంగా మనసు పాడుచేసుకోకు. వాళ్ళు మీకు దూరంగా వెళ్ళినంత మాత్రాన మీకు పూర్తిగా దూరమైనట్లు కాదుగా. మీకు ఎప్పుడు కావాలంటే అప్పుడు వెళ్ళి వాళ్ళను చూసిరావచ్చు. అలాగే వాళ్ళకి కొడుకు, కోడల్ని, మనవలను ఎప్పుడు చూడాలనిపిస్తే అప్పుడు వచ్చి వెళుతూ ఉంటారు. మనుషులు దూరంగా ఉన్నప్పుడే అభిమానాలు మరింతగా పెరుగుతాయి. ఈ విషయాన్ని ఎప్పటికీ గుర్తు పెట్టుకో' అంటూ అభిమానంగా భుజంపై తట్టాడు సాంబశివరావు.

# నిర్ణయం

**- అబ్బూరి ఛాయాదేవి**

**అ**మూల్య పెళ్ళిచూపుల ఏర్పాటు మా ఇంట్లోనే జరిగింది.

అమూల్య కమల కూతురు.

కమలకీ, నాకూ దూరపు బంధుత్వం ఉంది. బంధుత్వం కన్నా చిన్నప్పటినుంచీ స్నేహమే ఎక్కువ. కాలేజీ చదువు పూర్తయ్యే వరకూ కలిసే చదువుకున్నాం. తరువాత ఎవరి దారివారిదైనా, మళ్ళీ పదేళ్ళపాటు ఒకే ఊళ్ళో ఉన్నాం. వాళ్ళాయనకీ మా ఆయనకీ ఈ ఊళ్ళోనే ఉద్యోగం అవడం వల్ల. తరువాత వాళ్ళకి నాగపూర్‌కి బదిలీ అయిపోయింది. అయినా, మా మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు కొనసాగడమే కాకుండా, ఈ ఊరొచ్చినప్పుడల్లా మా ఇంటికి కాకుండానూ, మా ఇంట్లో ఓ పూటయినా ఉండకుండానూ వెళ్ళరు. వాళ్ళ పిల్లలిద్దరికీ కూడా మా దగ్గర బాగా చనువు.

అమూల్య ఇప్పుడు నాగపూర్‌లోనే ఇకనామిక్స్ లెక్చరర్‌గా పనిచేస్తోంది. ఒక ఏడాది నుంచి. టెంపరరీ ఉద్యోగమే. పెళ్ళి సంబంధాలు మూడేళ్ళ నుంచీ చూస్తోంది కమల. కమల భర్త నారాయణ రావు ఉద్యోగ వ్యవహారాల్లో ఎప్పుడూ తీరిక లేకుండా ఉంటాడు. పిల్ల పెళ్ళి గురించిన బాధ్యత అంతా తనదే అన్నట్లు తాపత్రయ పడుతోంది కమల.

అలా అని, నారాయణ రావు ఏమీ పట్టించుకోనట్లు ఊరుకోడు. అతనికి జాతకాల పట్టింపు చాలా ఉంది. ఎంత మంచి కుర్రవాడైనా, ఎంత మంచి కుటుంబమైనా, జాతకాలు కుదరకపోతే – స్థూలంగా కుదరడమే కాదు. సూక్ష్మాంశాల్లో కూడా సంతృప్తికరంగా కుదిరితే గాని 'ఓ.కె.' అనడు. అంచేత మేము సూచించిన సంబంధాలకి చాలా వరకు పురిట్లోనే సంధి కొట్టింది.

జాతకాల్లో నమ్మకాలున్న ఛాందసులు కూడా చాలా మంది తక్కిన ముఖ్య విషయాల్లో ఏదైనా సంతృప్తికరంగా లేకపోతే, ఆ విషయాన్ని సూటిగా చెప్పలేక,

జాతకాలు కుదరలేదని తప్పించుకోవడం నేనెరుగుదును. (జ్యోతిష్కులందరూ ఒక్కలా చూడరు. ఒక్కలా చెప్పరు కదా!) జాతకం అనేది ఆపద్బాంధవిలా ఉపయోగపడుతుంది. శాసించడమే కాదు. లోపాయికారీగా సరిపుచ్చుకునే చిట్కాలుంటాయి. ఈ జాతకాల విషయంలో.

నారాయణరావు అలా కాదు. ఏదైనా సంబంధాన్ని ఎవరైనా సూచిస్తే (తగిన సంబంధం అనుకున్నదే సూచిస్తారు కదా బంధుమిత్రులైతే), ముందుగా జ్యోతిష్కుడికి కుర్రవాడి జాతకం చూపిస్తాడు. అది కూడా ఎవరో ఒక జ్యోతిష్కుడికి కాదు – వాళ్ళ కుటుంబానికి సన్నిహితులైన జ్యోతిష్కుడికే. ఆయన చెప్పిందే వేదం. సరే, జాతకం కుదిరిందనుకుంటే, తల్లీకూతుళ్ళు రంగంలో కొస్తారు. కుటుంబ పరిస్థితులన్నీ క్షుణ్ణంగా కమల పరిశోధిస్తే, కుర్రవాడి రూపురేఖలూ, ప్రవర్తనా అమూల్య పరీక్షిస్తుంది.

ఈ పరిశోధనలూ, పరిశీలనలూ, పరీక్షలూ జరగడానికి ఎన్ని సానుకూల పడాలి ఈ కాలంలో. అమూల్య తల్లిదండ్రులూ నాగ్‌పూర్‌లోనూ, పెళ్ళికొడుకు ఏ కలకత్తాలోనో, బెంగుళూరులోనో, బొంబాయిలోనో, ఢిల్లీలోనో, అల్హాబాదులోనో, అమెరికాలోనో ఎక్కడో ఉంటాడు ఉద్యోగం రీత్యా. కుర్రవాడి తల్లిదండ్రులు ఏ కాకినాడలోనో, విశాఖపట్టణంలోనో, గుంటూరులోనో, నెల్లూరులోనో ఉంటారు. కుర్రవాడి పినతండ్రో, మేనమామో ఎవరో ఈ ఊళ్ళో మాకు బాగా తెలిసినవాళ్ళయి, వాళ్ళ ద్వారా సంబంధం వస్తుంది. కుర్రవాడి తల్లిదండ్రులూ, పిల్ల తల్లిదండ్రులూ కలుసుకోవాలి. పిల్లనీ, పిల్లవాణ్ణి చూడాలి. నచ్చితే పిల్లకీ, పిల్లవాడికీ చూపులు ఏర్పాటు చేయాలి. వీళ్ళు వాళ్ళ ఊరైనా వెళ్ళాలి. వాళ్ళు వీళ్ళ ఊరైనా రావాలి. లేదా, మధ్యలో మా ఊళ్ళో కలుసుకోవాలి. అయినా, మళ్ళీ ఒకరి ఇల్లు ఒకరు చూసుకోవాలి. వారి జీవన విధానం ఎలా ఉందో తెలుసుకోవడానికి. ఇటువైపు వాళ్ళకీ, అటువైపు వాళ్ళకీ సెలవులు దొరకాలి. మంచిరోజులు కుదరాలి. ఎంత తతంగం ఉంది! ఏ స్టేజ్‌లో నైనా సంబంధం నచ్చలేదనిపించవచ్చు.

బజారులో ఓ దుకాణంలో నూనె, ఓ దుకాణంలో మిరప్పొడి, ఆవపొడి, వగైరాలు కొని ఓ చోట మామిడికాయలు కొని ముక్కలు కొట్టించి తీసుకొచ్చి ఇంట్లో ఊరగాయ పెట్టడం అంత సులభం కాదు. పెళ్ళి సంబంధాలు కుదర్చడం.

ఈ చిత్ర బంధంలో ఇరుక్కున్నాను నేను. మా అయనకి ఈ వ్యవహారాలంటే తలకాయ నొప్పి. కమల నా స్నేహితురాలు కాబట్టీ, నన్ను సంబంధాలు చూడమని బ్రతిమాలబట్టీ నేను కలుగజేసుకోక తప్పలేదు. నాగ్‌పూర్‌లో ఉండడం వల్ల, తెలుగు వాళ్ల సంబంధాలు అక్కడ అనుకూలమైనవి దొరకడం లేదని, నా మీద మోపింది కొంత బాధ్యత.

క్రిందటి నెల్లో జరిగిన పెళ్ళి చూపులు ఇక పెళ్ళికి దారితీస్తాయని గట్టి నమ్మకం కలిగింది నాకు. జాతకాలు బాగా సరిపోయాయని నారాయణరావు గారు పచ్చజెండా చూపించారు. పెద్దవాళ్ళకి ఒకరి కుటుంబ పరిస్థితులు మరొకరికి సంతృప్తి కలిగించాయి. హోదాలు సరితూగాయి. పిల్లా, పిల్లవాడూ అందచందాల్లోనూ చదువు సంధ్యల్లోనూ ఒకరికొకరు తగినట్లుగా ఉన్నారు. కుర్రవాడి పేరు సుధాకర్, బెంగుళూర్‌లో "ఇస్రో" లో సైంటిస్ట్‌గా పనిచేస్తున్నాడు. అమూల్యకి అన్ని విధాలా తగినవాడనిపించాడు.

ఏదో ఆఫీసుపని మీద ఈ ఊరొస్తున్నాడనీ ఒకటి రెండు రోజుల కన్న ఉండడనీ, వీలైతే ఆ సమయంలో అమూల్యని నాగ్‌పూర్ నుంచి పిలిపించగలరా అని సుధాకర్ వాళ్ళ మేనమామ అడిగితే, సరేనని కమలకి ఫోన్ చేసి చెప్పాను. అమూల్య కాలేజీకి సెలవు పెట్టి వచ్చిందిక్కడికి. పెళ్ళి చూపులయ్యాయి. ఇద్దరూ ప్రత్యేకంగా ఒకచోట కూర్చుని కొంతసేపు మాట్లాడుకున్నారు కూడాను.

కానీ, అమూల్య "నా నిర్ణయం వెంటనే చెప్పలేను ఆంటీ, నేనింకా ఆలోచించుకోవాలి" అంది నాగ్‌పూర్‌కి తిరిగి వెళ్ళేముందు. సుధాకర్ మాత్రం అంగీకారం తెలిపినట్లున్నాడు – అతని తల్లిదండ్రులు మాకు కబురుపెట్టారు ఓ పదిరోజుల తరువాత – వాళ్లకీ సంబంధం నచ్చింది అంటూ. "కట్నం కానుకలూ మాకు అక్కర్లేదు. పెళ్ళి ఘనంగా చేస్తే చాలు" అని కూడా కబురు పెట్టారు. (ఘనంగా అంటే అధమం యాభైవేలు ఖర్చవుతుందని కొందరి అనుభవాల బట్టితెలుసుకున్నాను) ఏమైనా, నారాయణరావుగారికి కమలకీ ఖర్చుల బాధలేదు.

బాధంతా అమూల్య గురించే. వాళ్ళు ఒప్పుకున్న సంగతి ఫోన్‌లో చెప్పగానే కమల సంతోషించింది గాని, అంత ఉత్సాహం చూపించలేదు. అది పసిగట్టి. గుచ్చి

గుచ్చి అడిగాను. "ఫోన్‌లో చెప్పడం కుదరదు. నేను వివరంగా ఉత్తరం రాస్తాను" అంది.

కమల దగ్గర నుంచి ఉత్తరం వచ్చింది. అమూల్య ఒక నిర్ణయానికి రాలేకపోతోందనీ, దానికి నచ్చచెబుతూ నన్ను ఉత్తరం రాయమనీ రాసింది. తల్లే నచ్చచెప్పలేకపోతే నేనేం చెయ్యగలను? ఇది అసలే సున్నితమైన వ్యవహారం. అమూల్య జీవితానికి సంబంధించిన విషయం. నేను వెంటనే జవాబు రాయలేదు.

తుఫానులా వచ్చింది కమల. వస్తున్నట్లు ముందుగా ఏ కబురూ లేకుండా వచ్చి, హడావిడిగా మూడుసార్లు వీధిగుమ్మం దగ్గర బెల్ నొక్కింది. వస్తూనే ప్రశ్నల వర్షం కురిపించింది.

"నా ఉత్తరం అందిందా? జవాబు రాయలేదేం? ఆ సంబంధం గురించి నీ అభిప్రాయం ఏమిటి? పోనీ, వేరే ఏదైనా చూశావా?" అంటూ.

"కూర్చో ముందు, తీరిగ్గా మాట్లాడుకుందాం?" అని చెప్పి, చల్లని మంచినీళ్ళిచ్చాను తాగడానికి. కుశల ప్రశ్నలు వేశాను – తన రాక గురించి తెలుసుకుందామని. నారాయణరావుకి ఏదో సెమినార్ ఉందిట ఇక్కడ. అతనితో బాటు తనూ వచ్చిందట. ఇద్దరూ అతని ఆఫీసు గెస్టుహౌస్‌లో దిగారుట. రేపు సాయంత్రం తిరుగు ప్రయాణం అని చెప్పింది.

మంచినీళ్ళు సగం తాగి గ్లాసు పక్కన పెడుతూ, మళ్ళీ అడిగింది ఆ సంబంధంగురించి నేనేమనుకుంటున్నదీ రాయలేదేమని... ఏం రాయను? వాళ్ళ నమ్మకాలు వాళ్ళవి, వాళ్ళ ఊహలు వాళ్ళవి. నేను చెప్పినట్లు వింటారు కనకనా? తెలిసిన మంచి సంబంధాలు సూచించగలం గాని, ఒప్పుకోమని గట్టిగా నొక్కి చెప్పలేం కదా మన వాళ్ళకయినా?

"అమూల్య ఏమంటోంది?" అన్నాను చిరునవ్వు నవ్వుతూ.

నా ప్రశ్నకి సమాధానం చెప్పకుండా హేండ్‌బేగ్ తెరిచి ఓ ఉత్తరం తీసి నా చేతికిస్తూ.

"అమూల్య రాసింది నీకు" అంది. ఉత్తరం తీసుకుని చదవసాగాను.

"ఆంటీ డియర్,

నేను సందిగ్ధావస్థలో ఉన్నాను. సుధాకర్ విషయంలో నిర్ణయం మమ్మీ నాకే వదిలేశానంటోంది. కానీ నేను ఎటూ నిర్ణయించుకోలేకుండా ఉన్నాను. అతడు అందంగా లేడనీ, మంచి పొజిషన్‌లో లేడనీ కాదు. అన్నీ పైకి బాగానే ఉన్నాయి. కానీ అతనితో మాట్లాడాక ఎందుకో ఒక కచ్చితమైన నిర్ణయానికి రాలేకపోతున్నాను. అతన్ని ఎలా అర్థం చేసుకోవాలో తెలియడం లేదు. అతనికి వ్యక్తిగతంగా సింపుల్‌గా రిజిస్టర్ మేరేజ్ చేసుకోవడం ఇష్టంట. కానీ, వాళ్ళ అమ్మా, నాన్నగార్ల మనసుల్ని కష్టపెట్టడం ఇష్టం లేక సాంప్రదాయ బద్ధంగా వివాహం చేసుకోవాలనుకుంటున్నాడుట. అంటే ఇక ప్రతి విషయంలోనూ అతని ధోరణి అదే అనుకోవాలా?.."

సొంత అభిప్రాయాలంటూ ఉన్నాయిగా! కొన్ని విషయాల్లో సర్దుకుపోవడంలో తప్పులేదనుకున్నాడేమో. కట్నం తీసుకోవడం లేదుగా. అంతవరకు నయమే.

"....ఇంకోటి – అమెరికా వెళ్ళాలనీ, అక్కడ ఉద్యోగం చెయ్యాలనీ ఏమైనా అనుకుంటున్నారా అని అడిగాను అతన్ని – ఎందుకంటే, ముఖ్యంగా నా ఉద్యోగంలో ఇంకా ఎంతో సాధించాలని ఉందినాకు. అమెరికాలో అయితే అవకాశాలు ఎక్కువ కదా. సుధాకర్ మాత్రం ఆ విషయమై ఇప్పుడప్పుడే ఏమీ చెప్పలేనన్నాడు. భావి జీవితం గురించి అతని అభిప్రాయాలేమిటని అడిగాను. తనకేమి స్పష్టమైన ఉద్దేశం లేదుట. ఎలా ఉంటుందో చూడాలి అన్నాడు వేదాంత ధోరణిలో అన్నట్లు! ఇటువంటి వాడితో నేను జీవితమంతా గడపగలనా అనిపిస్తోంది ఆంటీ..."

ఆ భయానికర్థం లేదు. భవిష్యత్తంతా మన ఆధీనంలో ఉంటుందా? అనుకున్నవన్నీ అవుతాయా?

".... పైగా, సరదాగా చిలిపిగా మాట్లాడే రకంలా లేడు. గంభీరంగా మొహం పెట్టుకుని అడిగినవాటికి ముక్తసరిగా సమాధానాలిస్తాడు. హిందుస్థానీ సంగీతం ఇష్టమేనా అని అడిగితే, అప్పుడప్పుడు వినడానికి నాకు అభ్యంతరం లేదన్నాడు! అదేనా మాట్లాడేతీరు! నా అభిరుచులేమిటని కూడా అడగలేదు. 'బోర్' అనిపించింది..."

ఇప్పుడు చిలిపిగా సరదాగాఉంటే, పెళ్ళయ్యాక జీవితమంతా అలా ఉంటాడని నమ్మకమా? పిచ్చిపిల్లా! 'బోర్' అన్నమాట మరిచిపో, సుఖపడతావు. నీ ఆనందం ఎవరి ద్వారానో, దేని ద్వారానో దొరుకుతుందనుకోవడం భ్రమ!

"అమ్మ భయపడుతోంది – మంచి సంబంధం చెయ్యి జారిపోతుందేమోనని, అలా అని నేను ఒప్పేసుకోనా? ఇంతకుముందొచ్చిన సంబంధాల్లో అమెరికాలో ఉంటున్న కుర్రవాళ్ళున్నారు. కానీ వాళ్ళజాతకాలు సరిగ్గా లేవని – అందులో ఒకరికి 'మారకం' ఉందనీ, మరొకరికి 'ద్వితీయ కళత్రయోగము'ందనీ కొట్టి పారేశారు నాన్నగారు. ఇప్పుడీ సుధాకర్ అందరికీ నచ్చాడు. నాకూ బాగానే ఉన్నాడనిపించింది పైపైకి. కానీ, అతని మాటల ధోరణిని బట్టి అతని స్వభావం నాకు అంతుబట్టడం లేదు ఆంటీ. అతన్ని మళ్ళీ ఓసారి కలుసుకుని మాట్లాడితే మంచిదంటారా?..."

ఎన్నిసార్లు మాట్లాడినా ఏం లాభం? మనిషి స్వభావాన్ని అంత చులాగ్గా అంచనా వెయ్యగలమా? మాటలు వేరు, ప్రవర్తన వేరు. అప్పుడప్పుడు కలుసుకోవడం వేరు. కలిసి ఉండటం వేరు. అంచనాలు ప్రమాదకరం. తప్పితే, ఫలితంగా నిరాశ, నిస్పృహ, ఆవేదన!

".... పూర్వపు రోజుల్లోనైనా పుట్టాను కాను. ఎవరో ఒకర్ని కట్టబెట్టేవారు. ఏ సంగతీ నిర్ణయించుకుని చెప్పమని తొందర పెడుతోంది అమ్మ.... మీ సలహా ఏమిటి?.."

ఉత్తరం మడిచి, కమల కేసి చూసి చిరునవ్వు నవ్వాను. కమల ఆత్రుతగా చూసింది. నాకేసి.

"ఈ రోజుల్లో కూడా ఈ పెళ్ళిచూపులూ, పెద్దవాళ్ళు, సంబంధాలు కుదర్చడం – వీటితో వచ్చిన ఇబ్బందే ఇది!" అన్నాను.

"ఈ రోజుల్లో అయితే మాత్రం? వాళ్ళ పాటున వాళ్ళకొదిలేసి తల్లిదండ్రులు చేతులు ముడుచుక్కూర్చోవాలనా?" అంది కమల నిరసనగా.

"అది కాదు కమలా, పెద్ద చదువులు చెప్పించారు. తగిన వయస్సుంది. ఆర్థికంగా కూడా స్తోమత ఏర్పడుతోంది. ఇంక తనంతట తనే తన జీవిత భాగస్వామిని. ఎంచుకోవచ్చుకదా. అందుకు మనం ప్రోత్సహించాలి" అన్నాను.

"దాని మొహం, ఏం ఎంచుకుంటుంది? దాని డిపార్ట్‌మెంట్ వాళ్లలో ఎంచుకునేందుకు ఎవరున్నారు? ఒకళ్ళిద్దరు యోగ్యులుగా కనిపించినా వాళ్లు పెళ్లయిపోయినవాళ్ళే. లేదా ఇంకేదో లోపాలున్న వాళ్ళు. దానికి పరిచయస్థులెంతమంది

ఉన్నారని? ఇంతకు ముందు చదువుకుంటున్న వాళ్ళతోనే పరిచయం. వాళ్ళు కుర్రకుంకలు...”

“సరేలే, ప్రేమించేముందు ఇవన్నీ ఆలోచిస్తారా?” అన్నాను నవ్వుతూ.

“అందుకే ప్రేమ గుడ్డిదన్నారు! పెళ్లనగానే ముందూ వెనకా ఆలోచించుకోవద్దూ? పెళ్ళంటే నూరేళ్ళపంట! ఆచి తూచి అడుగు వెయ్యాలి...”

“అవును కమలా, పెళ్ళి “నూరేళ్ళపంట” అనుకోవడం వల్లే సంబంధం కుదర్చడం ఇంత కష్టమవుతోంది. మీ ఆయన జాతకాలు చూపిస్తారు – జీవితాంతం కలిసి మెలిసి ఉంటారా లేదా, దీర్ఘాయుష్మంతుడవునా కాదా, భోగభాగ్యాలతో తులతూగుతారా లేదా, పిల్లలు పుడతారా లేదా – ఇలాంటివన్నీ తెలుసుకోవడానికి. నిజం చెప్పు. జాతకాలు చూసి పెళ్లి చేసుకున్న వాళ్ళందరూ కలకాలం కలిసి బతుకుతున్నారా, కలిసి మెలిసి జీవిస్తున్నారా? ఎంతమంది స్త్రీలు నడివయస్సు రాకుండానే వితంతువులు కావడం లేదు? ఎంతమంది విడిపోవడం లేదు? పిల్లలు పుట్టాక కూడా ఎంతమంది కలతలతో కుమిలిపోతూ కాపురాలు చెయ్యడం లేదు? ఎంతమంది ఆత్మహత్యలు చేసుకోవడం లేదు...?”

కమల మధ్యలో అడ్డుకుని, “శుభం పలకరా మంకెన్నా అంటే ఏదో అన్నట్లు నువ్వు మరీ అలా మాట్లాడతావేమిటి? మన ముందు జాగ్రత్త కొద్దీ మనం చూసుకుంటాం జాతకాలు. ఆ తరువాత వాళ్ళ కర్మని బట్టి ఉంటుంది” అంది.

“అదే చెబుతున్నాను. ఇప్పుడు అమూల్య కూడా అదే ధోరణిలో ఆలోచిస్తోంది. – పెళ్ళి ‘నూరేళ్ళపంట’ జీవితాంతం ఫలానా వ్యక్తితో నేను సుఖంగా బతకగలనా – అని, వివాహబంధం శాశ్వతంగా ఉండాలనీ, ఉంటుందనీ మన నమ్మకం! కానీ నిజంగా శాశ్వతమా? ఎవరో ఒకరు ముందుపోక తప్పదు కదా– అయ్యో, వీళ్ళు ఒంటరిగా ఎలా బతుకుతారు, పిల్లలతో ఎలా తంటాలు పడతారు – అని ఆగుతుందా మృత్యువు...?”

కమల నిర్ఘాంతపోయినట్లు చూస్తోంది నా వైపు! నేను కొనసాగించాను.

“... అలాగే, వివాహం చేసుకున్నాక ఆ వ్యక్తితో కాపురం చేయడం అసంభవం అనిపిస్తే విడిపోక తప్పదు. పర్యవసానాలు ఎలా ఉన్నా, ఇవ్వాళ నచ్చిన వ్యక్తి

జీవితాంతం తనకు నచ్చేటట్లు ప్రవర్తిస్తాడన్న హామీ ఉందా? అతనికి నచ్చే విధంగా జీవితాంతం తమ నడుచుకోగలదా?... కలసి ఉండాలనుకున్నప్పుడు – బ్రతికున్నన్నాళ్ళూ ఆ వివాహ బంధం సుస్థిరంగా ఉండాలనుకున్నప్పుడు ఒకరినొకరు నిత్యం అవగాహన చేసుకుంటూ, అహాన్ని కొంత త్యాగం చెయ్యక తప్పదు ఇద్దరికీ– ఎవర్ని చేసుకున్నా అంతే. అది అర్థం చేసుకుంటే , ఈ విషయంలో అమూల్య సులభంగా ఒక నిర్ణయానికి రాగలుగుతుంది. ఇప్పుడు మీ దగ్గరున్న స్వేచ్ఛ, సుఖాలూ ఇక ముందు కూడా ఇదే ప్రకారంగా కొనసాగాలనో, ఇంకా ఎక్కువ సుఖాలు కావాలనో అమూల్య తీవ్రంగా కోరుకోవడం సహజం. కానీ, భవిష్యత్తులో ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కోగల మనస్థైర్యాన్ని అలవరచుకోవాలి. అంతేగాని, మన ఊహల ప్రకారమే జీవితం సాగాలంటే ఎల్లప్పుడూ సాగదు. దేనికైనా సిద్ధపడి ఉండాలి మానసికంగా ....” అంటూ నేనింకా కొనసాగించబోతూంటే కమల అడ్డుకుని.

“నీకు ఏ బాదరా బందీ లేదు కాబట్టి ఈ కబుర్లన్నీ చెప్పగలుగుతున్నావ్!” అంది కుర్చీలోంచి లేస్తూ.

కమల నన్ను సరిగ్గా అర్థం చేసుకోనట్టుంది!

ఇంక నేనేం మాట్లాడను?

“కాఫీ చేస్తానుండు” అంటూ నేనూ లేచాను.

అమూల్య అర్థం చేసుకుంటే చేసుకుంటుంది. లేకపోతే లేదు తనకి కూడా నా మనసులో ఉన్నట్లే రాయాలని నిశ్చయించుకున్నాను.

# అనుబంధాలు

**- పోలాప్రగడ రాజ్యలక్ష్మి**

గౌతమీ ఎక్స్‌ప్రెస్ తెల్లవారుజామున గోదావరి బ్రిడ్జి మీంచి నడుస్తోంది మెల్లగా.

గోదావరి అలలమీంచి వస్తూన్న చల్లని గాలి ప్రేమలా హాయిగా ఉంది. అమ్మ ప్రేమ అందరికీ ఆనందమే. ఈ నదిలోని నీరులా ప్రాణం పోస్తుంది. ఆ ఆలోచనల ఆనందం అంతా ఇంతా కాదు. గౌతమీ నదిలా సుదీర్ఘం అనుకుంది సీతమ్మ.

ఇంతలోనే గోదావరి స్టేషన్ దాటి, రాజమండ్రి  స్టేషన్ వచ్చింది.

షాలు తీసుకుని వంటినిండా కప్పుకొని బ్రీఫ్‌కేస్ తీసుకుని, రైలుదిగి, స్టేషన్ ఇవతలికి  వచ్చి, తన కోసం స్టేషన్‌కి బాలూని పంపుతానంది అక్క. రాలేదేమిటి? అనుకుని అటూ ఇటూ పరిశీలనగా చూసింది.

ఆటోలు, రిక్షాలు... జనం... హడావిడిగా వుంది. అందరూ తొందరగా ఇళ్లకు వెళ్ళాలనే  ఆతురత, హడావిడీను, అనుకుంది.

దూరాన టాక్సీకి జార్లపడి నుంచున్న డ్రైవర్ని ఉద్దేశించి కుడిచేతిని  ఊపుతూ, టాక్సీని  పిలిచింది. అతను వస్తూనే రామసీతమ్మ చేతిలోని బ్రీఫ్‌కేసు తీసుకుని వినయంగా  "ఎక్కడకి వెళ్ళాలండీ?" అని అడిగాడు.

ఆవిడ మాట్లాడలేదు.

'ఎక్కడికి వెళ్ళాలండీ?" మళ్ళీ అడిగాడు.

"మా అక్కగారింటికి" అంది.

"తమరు ఊరిపేరు చెప్పాలండీ!" అన్నాడు.

"అవును. నీకు ఊరు పేరు చెప్పలేదుకదా! చెప్తాను. పెట్టి కార్లో పెట్టు" అంది ఆవేశంగా. కోపంగా చూస్తూను.

‘ఊ... అడవి వెళ్ళాలి” అంది.

‘మీరేదో కొత్తగా మాట్లాడుతున్నారు. ఈ జిల్లా మొత్తం నేను ఎరగని ఊరు లేదండి. ‘ఆవిడి’ అనే ఊరు మాత్రం ఉంది” అన్నాడు కారు డ్రైవరు వినయంగా.

“అదేలే, మేము చిన్నప్పటినుంచి అలా సరదాగా పిలిచేవాళ్లం” అంటూ వెళ్ళి టాక్సీలో కూర్చుంది రామసీతమ్మ.

పైమీద కండువా తలపాగాలా చుట్టుకుని స్టీరింగు దగ్గర కూర్చుని కారు నడుపుతూ, “అమ్మా మీరు ఒక్కరే వస్తున్నారు. ఎక్కడినుంచండీ?” అన్నాడు ఆసక్తిగా.కొద్దిగా చిరునవ్వుతో “అమెరికానుంచి. మా అక్కగారి అమ్మాయి పెళ్ళి అనీ” అంది రామసీతమ్మ.

“ఆడోళ్ళు.. ఒక్కరూ వచ్చారాండీ! భయం వేయలేదాండీ?” అడిగాడు డ్రైవరు.

కొంచెం నవ్వుతూ రామసీత అంది. “చేతినిండా డబ్బు, చదువు వున్న ఏ ఆడపిల్ల అయినా ఎంతదూరమేనా వెళ్లగలదు. ఈ కాలంలోను. ఇంకా మారని మన పల్లెటూళ్ల వాళ్లు తప్పు.” అంది.

టాక్సీ శరవేగంతో పోతోంది.

చిన్నతనంలో ఇక్కడ పుట్టి పెరిగింది తను. జననీ జన్మభూమి నిర్మలత్వం, ఎంత హాయిగానో అనిపిస్తుంది, ధవళేశ్వరం రోడ్డుమీంచి కారుమెత్తగా పోతూంటే, కుడివైపు, కాలవనీరు సుడులు తిరుగుతూ ప్రవహిస్తోంది.

కొద్దిగా మబ్బు పట్టింది. చల్లని గాలి వీస్తోంది. ఆ గాలితోబాటు చిన్ననాటి జ్ఞాపకాలు మోసుకువచ్చి మనసుని కుదిపింది. వళ్ళు ఒక్కసారి పులకరించింది రామసీతకి.

అమ్మ, నాన్నగారూ పుట్టిన ఊరు. అన్నీ కళ్ళముందు రూపు కట్టాయి. కళ్ళు కొంచెం చెమర్చాయి. గుండె దడదడలాడింది. గొంతునొప్పితో ఇబ్బంది పడసాగింది. ఆ బాధని మరచిపోవడం కోసం ప్రకృతిలోకి చూసింది.

తన చిన్నతనంలో, దాదాపు ఏభైయేళ్ళ నాటి మాట.

అమ్మ, ఆ వేళ చాలా బాధపడింది. అన్నం తినలేదు. అక్క కూడా మంచం ఎక్కి పడుకుంది ఏడుస్తూను.

"ఏం జరిగింది ఎందుకలా ఏడుస్తున్నావు అని ఎన్నిమార్లు అడిగినా, "నువ్వు చిన్నపిల్లవి నీకు తెలియదు" అందేకాని అమ్మచెప్పలేదు. వాళ్ళ బాధ తన మనసుని కలచివేసి, వ్యాకులపడింది. ఇల్లంతా తిరిగింది.

నాన్నగారిని అడిగితే, రాసుకుంటున్న కాగితాల కేసి నుంచి తనవైపు చూసి "పెద్దదానివైనాక ఈ బాధలన్నీ ఎలాగూ తప్పవు. వెళ్ళి ఆడుకో" అన్నారు. కాని పట్టుదలగా, అమ్మని గట్టిగా అడిగింది కోపంగాను.

నా మాటలకు ఆవేశం వచ్చి, "ఏముంది నే చెప్పడానికి? నా మాట విలువ ఈ ఇంట్లో ఉందనా? నన్నో మనిషిగా చూస్తున్నారా? మీ నాన్నగారు నాకు చెప్పకుండా గోదావరి అవతల సంబంధం కుదుర్చుకుని వచ్చేసారు. పైగా, తాంబూలాలు పుచ్చేసుకున్నారట. తన చెల్లెలు కొడుకుట. విన్నావా? ఈ విడ్డూరం. నా వళ్లు రపరపలాడిపోతోంది. ఈ పరిస్థితిలో ఏం చెయ్యాలో తోచక తల బద్దలు కొట్టుకోవాలనిపిస్తోంది' అంటూ చేతిలోని గిన్ని భళ్లున పడేసింది. ఆవేదనతో ముఖం ఎర్రబడింది.

"అమ్మా! అమ్మా!" అంటూ ఆమె రెండు చేతులూ పట్టుకున్నాను గట్టిగాను.

నన్ను విదలించబోయింది.

నేను ప్రేమగా ఆమెను చుట్టేసి లాలనగా కళ్ళలోకి చూస్తూ కొంచెం నవ్వుతూ "నీకు ఉన్న దైవభక్తికీ, పంచకావ్యాలు చదివిన సంస్కారమూర్తివి ఇలాగేనా ఆవేదన పడటం?" అన్నాను వినయంగా చూస్తూ.

"ఈ పరిస్థితిలో, ఏం చేసినా భర్తకి ఎదురు తిరిగిందని బంధువులూ స్నేహితులూ కాకుల్లా పొడుస్తారు. నేనే ఓర్పుగా ఉండాలి. అంతేనా కన్నతల్లి ప్రేమకి దూరంగా గౌతమీ నది అడ్డుగా నిలిచింది. ఇప్పుడు మళ్లీ నా కూతుర్ని గౌతమీనది అవతలకి తీసుకువెళ్తోంది. మరి నా ఆవేదన మరింత అవుతోంది' అంది జాలిగొలిపేలా, బేలగాను, కళ్లనీళ్ళు తుడుచుకుంటూను.

కోపంగా వీధి గదిలోంచి నాన్నగారు ఆవేశంగా అరుస్తూ వచ్చారు.

"నా కంఠంలో ప్రాణం వుండగా ఈ ఇంట్లో ఆడపెత్తనం సాగనివ్వను. అరిచి గీపెట్టినా ఈ పెళ్ళి జరగవలసిందేను. ఏం నా చెల్లెలు కొడుక్కి, ఇచ్చి పెళ్ళి చేస్తే మేనరికం అని, అన్నయ్య కూతురని ప్రేమగా చూస్తుంది. మన పిల్లకి కూడా అత్తవారి

ఇల్లని భయముండదు. అని నేను ఆలోచించాను. నేనేదో పెద్ద తప్పుపని చేసినట్టు పెద్ద గొడవ ఇంట్లో. అది చిన్నపిల్ల. నీ మాటలతో దాన్ని భయపెట్టకు. ఇంక ఈ ఇంట్లో ఎవరిమాటలు వినబడినా ఊరుకోను. జాగ్రత్త. నా మాటకు ఎదురు చెప్పావో నేను వెళ్ళి సన్యాసుల్లో కలుస్తాను" అన్నారు గుడ్లురిమి చూస్తూను.

అంతే. ఆయన మాటలకు అంతా అవాక్కు అయిపోయాము.

ఇల్లంతా నిశ్శబ్దంగా మారిపోయింది. నాన్నగారు అనుకున్న ప్రకారం అక్క పెళ్ళి వైభోగంగా జరిపించేసారు.

రామసీత కళ్ళు తుడుచుకుంటూ, ప్రకృతిలోకి చూసింది.

అప్పుడే కడియం బ్రిడ్జిమీంచి కారు వెడుతోంది. ఆకాశాన మబ్బులు పరుగులు పెడుతున్నాయి.

శ్రావణమాసం కదా? బంతులూ, గులాబీలు, కనకాంబరాలూ విరబూసాయి. పసిపాపల బోసినవ్వులా పూలతోట అంతా చూస్తూంటే హాయిగా ఉంది. సైకిళ్లమీద, అరటి గెలలు పట్నంలో అమ్ముకుందుకు పట్టుకువెడుతున్నారు. ఎంతదూరం వెళ్ళినా గౌతమీ నది అందాలు పల్లెటూరి వాతావరణం మరిచిపోలేదు. పులకించే హృదయంతో అనుకుంది రామసీత.

"మీ బంధువులందరినీ వదిలి అమెరికాదాకా వెళ్ళిపోయారు మీరు. బెంగగా ఉండదాండీ!" అన్నాడు టాక్సీ డ్రైవరు, వెనక్కి తిరిగి చూస్తూను.

ఆ మాటలకి ఒక నిట్టూర్పు విడిచింది రామసీత బాధగా.

"రక్త సంబంధమున్నవారి ప్రేమలు ఎక్కడికి పోతాయి? కానైతే పూర్వకాలంలా వెర్రిప్రేమలు తగ్గాయి విద్య ఇచ్చిన వివేకం వల్ల. ధనమూలమిదం జగత్తు అన్నారు కదా? విదేశాలలో సంపాదించిన డబ్బు వల్ల ఇంకా ప్రేమ, గౌరవం పెరుగుతోంది మనవాళ్లకి. "మా చెల్లెలు అమెరికాలో వుంది' అంటూ ఆనందంగా కళ్లు మెరిసిపోతోంటే చెప్పుకుంటున్నారు" అంది.

"అంతేలెండి. ఈ రోజుల్లో భార్యాభర్తల ప్రేమ కూడా డబ్బుతోనే కొలుస్తున్నారు. మొన్నటిదాకా ఎడ్లబండితోలే వాణ్ణి అండి. నువ్వు సంపాదించింది ఎడ్లు తినడానికే సరిపోతుంది అని నా భార్య గొడవ చేసేదండి రోజూను. టాక్సీ నడపడం నేర్చుకున్నాక,

మరిన్ని డబ్బులు మిగులుతున్నాయి. ఇప్పుడు నా పెళ్లాం నేనంటే ఎంతో ప్రేమ చూపిస్తుందండి” అని డ్రైవరు తనబాధ చెప్పాడు.

అతనితో ఎక్కువ మాట్లాడడానికి ఇబ్బంది పడింది రామసీత.

ఇంతలో కారు గతుకుల రోడ్డులోంచి ఇబ్బందిగా నడుస్తోంది కవిగారి కవితలాగాను. కాసేపయాక కారు వేగంగా పోతోంది. రావులపాలెం బ్రిడ్జి వచ్చింది. బాణంలా దూసుకుపోతోంది గోదావరి బ్రిడ్జిమీంచి:

అమ్మ గోదావరి దాటడానికి, ఎంత బాధపడేదో మళ్లీ జ్ఞాపకం రాసాగాయి. గోదావరి ప్రయాణం, పెద్ద యజ్ఞంలాగా ఉండేది. లంక అంతా నడచి వెళ్లాలి. తెల్లవారగట్ల లేచి వాళ్లేవాళ్లం. వానాకాలం అయితే గోదావరి అద్దరికీ ఇద్దరికీ తాడి ఉండేది. పడవలో వెడుతూంటే పడవ అటూ ఇటూ ఊగుతూండేది. కొందరైతే, బుట్టలూ తట్టలూ, మేకల్ని కూడా తీసుకువచ్చేవారు. చిన్న పిల్లలకి భయం తెలియక, ఇది ఒక అనుభూతిగా ఆనందపడేవాళ్లం.

వేసంకాలం అయితే పాత్రేవు పడేది. అది మరీకష్టం ఇసకలో నడవడం, ఎండకు పైన నెత్తిమాడేది. క్రింద ఇసుక కాలేది. అల్లాంటప్పుడు లంకలో నడవడం కష్టం. పైగా కనీసం నలుగురేనా సాయంతో వెళ్లాలి. ఒంటరిగా వెడితే రకరకాల భావాలు.. చెట్టుచాటునా పుట్టచాటునా ఏమైనా ఉంటాయి అని. పరుగుపరుగున నడవవలసి వచ్చేది. అందువల్ల గోదావరి దాటే ప్రయాణం అంటే కష్టాల్లోకెల్లా కష్టంగా వుండేది.

అమ్మ బెంగ అంతా ఇంతా కాదు. కొన్నాళ్లు కన్నవారింటికి వెళ్లినప్పుడు, మళ్లీ తన కూతుర్ని గోదావరి అవతల ఇచ్చినప్పుడూ ఆవేదన పడేది. డబ్బు ఉన్నా సుఖంలేని రోజులు. పరదేశీయులు పాలించే రోజులు. కిరసనాయిలు దీపానికి కూడా నోచుకోని రోజులు. ఆముదపు దీపాలతో రాత్రిళ్లు భయంభయంగా గడిపేవారం. పసికూన కూడా ఫేన్‌లేందే పడుకోదు ఇప్పుడు. సుఖాలు అలవాటైపోయాయి. డబ్బుతో ఈ రోజుల్లో అంతా సుఖమే.

ఏ అమ్మయినా తనని కన్నవారూ, తను కన్నవారూ దగ్గరగా ఉండాలనే తపిస్తుంది. గోదావరి బ్రిడ్జి కడతారు అని ఓరోజు ఆంధ్రపత్రికలో వచ్చిన వార్తకి అమ్మ ఆనందం గౌతమీ నది అంత. ఆవేళ పేపరులోని వార్త ప్రత్యేకం ఆ వీధిలో వెళ్లేవాళ్లందరినీ పిలిచి మరీ చెప్పింది. అరుగుమీద పేపరు పట్టుకుని కూర్చుని. కళా

వెంకట్రావుగారు శంకుస్థాపన చేస్తారుట, మనకి పరదేశీ పాలన పోయింది కదా అంతా ఆనందమే అని, తన బిడ్డను, మనుషులనూ చిటికెలో వెళ్లి చూడొచ్చును అనుకుంది పాపం.

ఏ పన్లేనా అనుకున్నంత సులువుగా అవుతాయా?

అమ్మ గోదావరి బ్రిడ్జి కట్టడం చూడనేలేదు. వెళ్లిపోయింది. ఈ ముసలితనంలో నాకు పెద్ద బెంగ తీరింది. తనకూ తనవారికీ వారధి రాబోతోంది. తన పుట్టింటికీ, తన కూతురింటికీ దూరాలు తీరాయి అని సంతోషం ఆమెకి. మరింత ఆయుష్షుని కూడా ఆ భగవంతుడు ప్రసాదించివుంటే? ఎంత బాగుండును.

అలా కాకుండా అమ్మ వెళ్లిపోయింది. తల్లి గౌతమీ నదిలో కలిసిపోయింది. అమ్మ బొమ్మకూడా లేదు.

ఈనాడు ఇలా కారులో చిటికెలో రావులపాలెం బ్రిడ్జిమీంచి సరదాగా ప్రకృతి అందాలుచూస్తూ ప్రయాణం చేస్తున్నాను. అమెరికా నుంచి అవిడి దాకా కాలు కందకుండా ప్రయాణం చేస్తున్న నన్ను చూసి, ఆమె ఆనందం అవధులు దాటును అనుకుంది రామసీత.

తల్లి జ్ఞాపకాలతో కళ్లు తడి అయ్యాయి.

ఒకవైపు కొబ్బరిచెట్లు పొట్టిగానూ కొన్ని పొడుగ్గాను వున్నాయి. బరువైన కొబ్బరిబొండాలతో సగటు మనిషి సంసారపుభారంతో ఉన్నట్లు తోచింది. మరోవైపు పడవలు వెళ్లే కాలువ, గలగలమని సంగీత ధ్వనులతో ప్రవహిస్తుంది. కోనసీమను చూసేవారి చూపులో రసజ్ఞత ఉంటే, ప్రకృతి అంతా కన్నులపండుగగా తోస్తుంది. కాశ్మీరుని మరిపిస్తుంది. పనసతోటలూ, పసుపుపంటలూను.

కారు శరవేగంతో పోతోంది. రామసీతమ్మ ఆలోచనల్లాగానూ, ఆకాశంలో మబ్బుల్లాగానూ, సన్నని తుంపర పడుతోంది, పన్నీటి జల్లులాగా, సూర్యుడు మబ్బుల్లోంచి ఉండుండి కనిపించీ కనిపించనట్లు తెల్లని కాంతులు కనిపిస్తున్నాయి.

కారు అవిడి ఊరులోకి వచ్చింది.

పల్లెటూరు కావడంవల్ల తమ పనులు మానుకుని, ఈ కారు ఎవరింటికి వస్తోంది. కారులోనివారు ఎవరు అన్నట్లు వాళ్ల కళ్లు కారుమీద ఉన్నాయి.

"ఆ ఎత్తయిన అరుగులు, ముందు కాంపౌండువాలు ఉన్న గేటు దగ్గర కారు ఆపు" అని చెప్పింది రామసీత.

వాకిలి ముందు కారు ఆగడంతో డోర్ తీసుకుని దిగింది. వాకిట్లో ఆకాశంకేసి ఒకసారి చూసి, మెడ నెప్పిపుట్టి కాబోలు భూమికేసి ఒకమారూ చూస్తున్నారు. అక్కాబావాను. "వచ్చావా చెల్లాయీ" అంటూ నీ కోసమే ఎదురుచూస్తున్నాము" అంది ఆప్యాయంగా కౌగిలించుకుంటూను అక్క తల్లి ప్రేమను గుర్తు చేస్తూను.

"అక్కా! బావ ఏమిటి ఆకాశంలోకి ఎదురుచూస్తున్నాడు?" అంది కొంటెగా.

"ఆ.. నీకోసమే మరదలుగారూ ఆకాశంలోంచి విమానంలో, తిన్నగా అమెరికా నుంచి వచ్చి మా నెత్తిన దిగుతావని" అన్నాడు.

"చెల్లాయి... ఆయన మాటలకేం గాని ఈ మబ్బులో పొద్దు కనిపించక వెతుకుతున్నాము. సూర్యుడు కనిపించకపోతే ఆయనకీ, ఆయనగారితో బాటు నాకూ భోజనం వుండదుమరి." అక్క బావని చేత్తో చూపిస్తూ..

కొంటెగా పకపకా నవ్వుతూ, "బావా! దేశం శరవేగంగా మారిపోతున్నా నువ్వు మాత్రం మారలేదు" అంది రామసీత.

"ఇదిగో మరదలా మాటలు మాత్రం జాగ్రత్తగా రానీ, అమెరికాలో బెడ్డు కాఫీయేగా నీకూ?"

కొంటెగా అన్నాడు నవ్వుతూను.

"భూమినీ ఆకాశాన్నీ నమ్మిన రైతుని నేను"

"అవునుగాని అక్కయ్యా! నీ కూతుర్ని బొంబాయి కుర్రాడికి ఇచ్చి చేస్తున్నావు నువ్వు బెంగ పెట్టుకోవా? దూరం అని?"

"అమ్మలాగా ఆరోజుల్లోలాగా, అమాయకపు ప్రేమలు లేవు. ఎక్కడ వున్నా సుఖంగా వుండాలన్న కోరిక. ఎక్కడ వున్నా తల్లి ప్రేమ అనంతం. తల్లి గోదావరిలా ప్రేమపూరితమైనది "అక్కగారి ఆప్యాయతకు రామసీత ఎంతో ఆనందించింది.

"అమెరికాలో వున్నా అక్కాబావ మీద ప్రేమతో వచ్చావు కదా?" అంది.

"పిన్ని వచ్చింది. పిన్ని వచ్చింది." అని పిల్లలు అందరూ ఆనందంగా అరుస్తూ, "మాకేం తెచ్చావు?" అంటూ అడిగారు.

వాళ్లందరినీ ఆప్యాయంగా ముద్దుపెట్టుకుంటూ,

"చాలా తెచ్చాను" అంది సంతోషంగా.

అందరి కబుర్లతోనూ, నవ్వులతోనూ పెళ్లిపందిళ్లు నవ్వుల పువ్వుల పందిళ్లుగా అయ్యాయి.

ఎన్నాళ్లకో కలుసుకున్న ఆ అక్కాచెల్లెళ్ల ప్రేమను చూస్తే గుండెలు పులకరించక మానతాయా? ఆ అనుబంధాలు అయినవారిలో వర్ణనాతీతం,

మాటలకందని మమకారాలు. దూరం వెళ్లినకొద్దీ, దగ్గరవుతాయి. కాని దూరం చేయవు అనుకుంది రామసీత స్వానుభవంతో.

# మృత్యోర్మా అమృతంగమయ

**– నందుల సుశీలాదేవి**

"**అ**మ్మా! ఒక్కసారి రఘువాళ్ళింటికి వెళ్ళి వచ్చేస్తానే" ఏడేళ్ల వయస్సున్న నాని తల్లిని ఒకటే సతాయిస్తున్నాడు.

"ఎండలో ఎందుకురా నానీ! అన్నంపెట్టేస్తున్నా. నీకిష్టంకదా కొబ్బరికోరూ, శనగపప్పు కూర చేశాను. చేతులు కడుక్కొనిరా!" భోజనాల బల్లమీద కంచం పెడుతూ అంది తల్లి జానకి.

"ఇప్పుడే వచ్చేస్తాను. రఘు కొత్త కామిక్ పుస్తకం ఇస్తానన్నాడు. తొందరగా వచ్చేస్తాను"

"అన్నం చల్లారిపోతుంది రా నానీ!"

నానీ రివ్వున బయటకు పరుగెత్తాడు.

కంచం బోర్లించి పెడుతూ అనుకొంది జానకి. 'పుస్తకాలుంటే వీడికి అన్నం, నీళ్లు అక్కరలేదు. పెద్దయ్యాక ఏ లైబరీలోనో ఉద్యోగం చేస్తే సరి'

మార్కెట్‌లోకి ఏ కొత్త పుస్తకం వచ్చినా కొడుకు కోసం కొని తెస్తూనే వుంటాడు కృష్ణ.

మజ్జిగపులుసులోకి పోపు పెడుతుంటే నళిని పరుగెత్తుకొని వచ్చింది. "జానకిగారూ! ఘోరం జరిగిపోయింది. ఎట్లా మీకు చెప్పేదండీ"

జానకి అయోమయంగా చూసింది.

కాంతం వచ్చి జానకిని పొదివి పట్టుకొంది.

"నానీ, మరికొంతమంది పిల్లలు నళినీవాళ్ల డాబా ఎక్కారు. బాదంకాయలు అందటం లేదని నానీ పిట్టగోడ ఎక్కేడు..."

కాంతం వెక్కివెక్కి ఏడ్చింది. జానకి ఇంక వినిపించుకోలేదు పరుగుపరుగున బయటకు వచ్చింది. నళిని ఇంటిముందు జనం మూగివున్నారు. జనం దారి ఇచ్చేరు.

ఎదురుగా రక్తపుమడుగులో నానీ!! కెవ్వున విరుచుకొని పడిపోయింది జానకి. జానకి మొహం మీద ఎవరో నీళ్ళు చల్లేరు. ఇంకెవరో కృష్ణకి కబురు తెలిపారు. మరెవరో అంబులెన్సుని పిలిచారు.

భర్త కారులో తనని పొదివిపట్టుకొని కూర్చోవటం తెలుస్తోంది జానకికి.

అంతలో మగత కమ్ముతోంది.

"నానీ! నానీ!". ఆ తల్లిగుండె కన్నీరు కారుస్తోంది. హాస్పిటల్‌కి చేరటం–నానీ శరీరాన్ని ఇంటెన్సివ్‌కేర్ యూనిట్‌లోనికి తీసుకొనివెళ్లటం అంతా కలలోలాగా అనిపిస్తోంది.

కృష్ణ అడుగుతున్నాడు డాక్టర్‌ని–

"మా అబ్బాయి పరిస్థితి ఏమిటండీ!"

"మెదడుకి తగిలిన దెబ్బ! రక్తం బాగా పోయింది. ఇంకో గంట గడిస్తే కాని ఏం చెప్పలేం! ధైర్యంగా వుండండి. న్యూరోసర్జన్ చూస్తున్నారు"

క్రమంగా జానకి తనని తాను అదుపులోనికి తెచ్చుకుంది. నానీ డాబామీద నుండి పడిపోయాడు! వాడి పరిస్థితి విషమంగా వుంది! కృష్ణకోసం తనని తాను సంబాళించుకోవాలి.

అతనికోసమైనా తాను ధైర్యాన్ని తెచ్చుకోవాలి.

తామిద్దరూ ఒకరినొకరు కావాలనుకొని జీవితాలను పెనవేసుకొన్నారు.

నానీ పుట్టాక తమ జీవితం మరింత అర్థవంతమయింది. ఒక్క బిడ్డ చాలనుకొన్నారు. నానీ మీద కోటి ఆశలు శిఖరాల్లా పేర్చుకొన్నారు.

కృష్ణ–తనూ–నానీ! నిన్నటివరకూ అందమైన స్వప్నం! నానీ పెరిగి పెద్దవాడయి ఎన్నో ఎన్నో ఉన్నత స్థానాలకు వాడు ఎదగాలని తాము కనే కలలన్నీ ఏమవుతాయి? లేదు–లేదు–నాకేమీ కాదు. పట్టణంలోని అతి పెద్ద హాస్పిటల్‌లో తామున్నారు. నిష్ణాతులైన డాక్టర్ల పర్యవేక్షణలో నానీ పసిప్రాణం పదిలంగా వుంటుంది.

అంతలో భయానకమైన దృశ్యం ఒకటి జానకి కనుల ముందు మెరిసింది. రక్తపు మడుగులో గిలగిలా కొట్టుకొంటున్న నానీ! ఆ దృశ్యం తనను పిచ్చెత్తించేలా చేస్తోంది. క్షణంలో అన్నం వడ్డించేసేదే! కంచంలో వాడికి అన్నం కలిపి పెట్టేంతలో ఇంత దారుణం జరిగిపోయింది. గుండె భగ్గున మండిపోతోంది.

కాని...కాని... కృష్ణకు ఈ క్షణంలో తననుండి ఓదార్పు కావాలి. నెమ్మదిగా తెప్పరిల్లింది.

"ఏమండీ" అని పిలిచింది.

సమస్తం కోల్పోయిన భావంతో కళ్ళు అగ్ని గోళాల్లా భగభగమండుతుంటే భార్యవైపు చూశాడు కృష్ణ. "జానకీ!" అన్నాడు.

జానకి నీరసంగా కదిలింది. కృష్ణ దగ్గరగా వచ్చింది. అతని ఒడిలో తలపెట్టుకొంది.

కాంతం, నళిని కళ్ళు తుడుచుకొన్నారు. కృష్ణకు కంఠంలో ఏదో అడ్డుపడినట్లుగా వుంది. నోటమాట రావటంలేదు. పేరుపొందిన న్యూరోసర్జన్ పర్యవేక్షణలో మానవయత్నంగా అందవలసిన వైద్య సహాయం నానీకి అందుతోంది.

ఇరుగూ, పొరుగూ, స్నేహితులూ, ఆఫీసు వాళ్ళూ అందరూ తమకే సంభవించిన ఆపదలా తమకి సహాయ సహకారాలు అందజేస్తున్నారు.

కొందరు బ్లడ్ బ్యాంకుకి పరుగులు తీస్తున్నారు.

మరికొందరు డాక్టర్లడిగిన మందులన్నీ క్షణంలో తెచ్చి అందిస్తున్నారు.

నానీకి మెరుగైన వైద్య సహాయం అందుతోంది.

కాని కాని అంతరాంతరాలలో నానీ పరిస్థితిలోని తీవ్రత తనకు అవగాహన అవుతోంది.

ఆ పసిదేహం అంతటి ప్రాణాంతకమైన ప్రమాదాన్ని తట్టుకోలేకపోతోంది.

గంట గడవాలి అన్నారు డాక్టర్లు! గంట అంటే అరవై నిమిషాలు! నిమిషానికి అరవై సెకన్లు!

వాచీలో సెకన్ల ముల్లు అతినెమ్మదిగా కదుల్తోందనే భావన! తమ దంపతులకు ఇంత నిరీక్షణ మరి ఏనాడూ రాబోదు.

కృష్ణ జానకి తల నిమిరాడు. "జానకీ! పెద్ద డాక్టర్‌గారితో మాట్లాడి ఇప్పుడే వస్తాను".

కృష్ణ లేచి వెళ్ళాడు. పది నిమిషాలలో కృష్ణవెంట డాక్టర్ కూడా వచ్చాడు.

జానకి దీనంగా తలెత్తింది.

ఆయన కంఠం సవరించుకొన్నాడు. "అమ్మా! మీరు ధైర్యంగా వుండాలి. మా ప్రయత్నం మేం చేస్తున్నాం. మెదడుకి తీవ్రమైన గాయం అయింది. జరగకూడని ఘోరం జరిగింది. పసివాడిని రక్షించాలనే మా ప్రయత్నం ఫలించేలా లేదు. అయినా చివరికంటా మా ప్రయత్నాలు మేం కొనసాగిస్తాం. మీరు ధైర్యం వహించండి"

జానకిని గట్టిగా పట్టుకొంది నళిని.

జానకి కళ్ళవెంట నయాగరాలు ప్రవహించాయి.

తమ ఆశలన్నింటినీ ఆవిరిచేస్తూ నానీ వెళ్ళిపోతున్నాడు. వాడి బుల్లి ప్రాణాల్ని ఇంతమంది డాక్టర్లూ కాపాడలేరా?

రోజూ వాడికి స్నానం చేయిస్తూ వెయ్యేళ్ళు చల్లగా బతకాలని తాను వాడికి మాడున నూనె పెడుతూ ఇచ్చే దీవన బూటకమేనా?

వాడు చిరంజీవిగా వుండాలి. వాడి జీవితం ఏడేళ్ళ కాలమేనా? కాదు-కాదు-వాడు చనిపోకూడదు. బతకాలి-బతకాలి. ఏదో విధంగా ఎక్కడో అక్కడ వాడు జీవించాలి.

జానకి కళ్ళు నెత్తురుని చిమ్ముతున్నాయి.

తన బిడ్డ జీవించాలి!

ఏదో రూపంలో వాడు జీవించాలి! చెదిరిన జుట్టుతో, అగ్నికణాల్లా వున్న కళ్ళతో తలెత్తింది నెమ్మదిగా... అక్షరాలు పేర్చుకొంటూ-తన ఆలోచనను పెదవులగుండా బయటపెట్టింది జానకి!

కృష్ణతో చెప్పిన ఆమె మాటలకు భయంకరమైన నిశ్శబ్దం అక్కడ నాట్యం చేసింది-ఎవరినోట వెంటా మాట రాలేదు. కృష్ణ శిలలా కాసేపు కూర్చొని పోయాడు. తర్వాత తనని తాను సంభాళించుకొంటూ డాక్టర్‌దగ్గరకు వెళ్ళాడు.

డాక్టర్ రాగానే జానకి కళ్ళు తుడుచుకుంది.

"డాక్టర్‌గారూ! నాకు నిజం కావాలి. నానీ మాకు దక్కడు కదూ" అంది.

డాక్టర్ అనునయంగా అన్నాడు.

"అమ్మా! మీరు అన్నీ తెలిసినవారే! బాబు జీవితం క్షణాలలోకి వచ్చింది"

జానకి పెదవులు అదురుతుండగా అంది-

"డాక్టర్‌గారూ! కొన్నాళ్ళకిందట పేపరులో ఓ స్వచ్ఛందసంస్థ చేసే సేవలను గురించి చదివాను. ప్రమాదవశాత్తూ చనిపోయినవారి అవయవాలను దానం చేస్తే, తగిన వ్యక్తులకు అవి అమర్చేలా కృషి చేసే ఓ స్వచ్ఛందసంస్థ ఈ ఊళ్ళోనే వుందిట కదా! నా కొడుకు ఎలాగో దక్కడంటున్నారు కాబట్టి! వాడి..వాడి..."

వెక్కి వెక్కి ఏడ్చింది జానకి. అంతలోనే తనని తాను సంబాళించుకొంది.

"డాక్టర్‌గారూ! నా కొడుకు అవయవాలలో కన్నులు, కిడ్నీలు, గుండె, లివర్ ఏవయినా సరే మరొకరికి ఉపయోగపడతాయంటే అవన్నీ మేమిద్దరమూ ఇష్టపూర్వకంగా దానం ఇస్తాం. మాకు నానీ ఒక్కడే సంతానం. కాని వాడివలన కొంత మందికి జీవితం లభిస్తుంది. వాడు ఏదో రూపంలో ఎక్కడో అక్కడ జీవించివున్నాడనే భావన మాకు రవంత మనశ్శాంతిని ఇస్తుంది"

వెక్కివెక్కి ఏడుస్తున్న జానకిని పొదివిపట్టుకొని తన కళ్ళను తుడుచుకున్నాడుకృష్ణ.

రుద్ధకంఠంతో అన్నాడు–

"జానకి చెప్పినట్లు చేయండి. మరో కొన్ని నిమిషాలలో నానీ వుండడని అంటున్నారుగా! వాడి అనంతరం వాడి అవయవాలు కొంతమందికైనా కొత్త జీవితాన్ని ఇస్తాయంటే వాడి జీవితం ధన్యమైనట్లే! మీరు వెంటనే ఆ విషయాలు చూడండి"

జానకి తలను గుండెకు హత్తుకొని వెక్కివెక్కి ఏడ్చాడు కృష్ణ. కాసేపట్లో ఓ బృందం జానకి, కృష్ణవద్దకు వచ్చేరు. వారిలో ఒకామె అంది–

"నా పేరు శాంత. అవయవాలు దానంచేసే పుణ్యాత్ములనుండి అవి సేకరించి అవి ఉపయోగపడే పేదరోగులను ఎంపికచేసి వారికి అవి అమర్చడంలో సహాయపడే స్వచ్ఛందసంస్థ మాది. అందరూ కూడా మీలా ఆలోచిస్తే..."

ఎర్రబడిన కళ్ళను మెల్లగా తెరచి అంది జానకి

"మీకు ఎక్కడెక్కడ మా ఇద్దరి సంతకాలు అవసరమో తీసుకోండి" అని.

అంతలో డాక్టర్ కూడా అక్కడకు వచ్చాడు–

"నిత్యం జనన మరణాలతో పోరాడే వృత్తి మాది. కాని మీ యొక్క ఏకైక సంతానాన్ని పోగొట్టుకోబోతూ కూడా ఎంత పెద్ద మనస్సుతో ఈ నిర్ణయం తీసుకొంటున్నారు. నూటికీ కోటికీ ఇటు వంటివి చూస్తుంటాం" అన్నాడు.

జానకి, కృష్ణ వణుకుతున్న వేళ్ళతో అవసరమైన కాగితాల మీద సంతకాలు పెట్టారు.

డాక్టర్లు చెప్పిన క్షణాలు రానేవచ్చాయి.

నానీ పసిదేహం నుండి ప్రాణవాయువు అనంతాకాశంలో లీనమయిపోయింది.

రెండు గంటలలో నానీ నేత్రాలనూ, కిడ్నీలనూ గుండెనూ, లివర్‌నూ ఎవరెవరికి అవసరమో ఫోనుల ద్వారా, ఇంటర్నెట్‌ల ద్వారా ఏర్పాట్లు జరిగిపోయాయి.

నానీ శరీరాన్ని అప్పగించిన తరువాత కృష్ణ ఆఫీసువాళ్ళంతా తోడురాగా పసివాడిని ఖననం చేసేటందుకు బయలుదేరి వెళ్ళాడు.

ఏ విధంగా ఇల్లు చేరిందో జానకికి తెలియదు. చుట్టూరా ఆప్తులు – స్నేహితులు – సమీప బంధువులు! ఎవరి ఓదార్పూ ఆమె మనసుని తాకటం లేదు. తన నానీ బతికేవున్నాడు.

నానీ నేత్రాలు ఇద్దరికీ చూపు ప్రసాదిస్తాయి. నానీ కిడ్నీలు ఇద్దరు బాలుర జీవితంలో వెలుగులు నింపుతాయి. వేరొక పసివాడు నానీ గుండెతో బతుకంతా నిండుగా గడుపుతాడు.

మరొక వ్యక్తికి నానీ లివర్ నూతన జీవితాన్ని ప్రసాదిస్తుంది. తన కడుపులో చిచ్చుపెట్టినా నానీ కొందరికి కొత్త జీవితాన్ని ప్రసాదించాడు.

వాడు చిరంజీవిగా మిగిలాడు.

ఆమె గుండె ఆక్రోశిస్తోంది.

"నాన్నా! నానీ! నా కన్నతండ్రీ! నువ్వు ఎక్కడో ఒకచోట జీవించే వున్నావురా! ఆ ఊహ నాకు రవ్వంత శాంతినిస్తోందిరా బాబూ! నువ్వు కొందరిలో జీవించివున్నావనే తలంపు నా ఈ గర్భశోకాన్ని భరించే శక్తినిస్తోందిరా! నానీ! నానీ!"

వెక్కి వెక్కి ఏడ్చిందిజానకి. జానకి నిస్త్రాణగా వాలిపోయింది. కాలం పరుగులు పెడుతూనే వుంది.

ఆ రోజు మబ్బుగా ఉంది.

క్యాలెండర్ చూసి జానకి అనుకుంటోంది.

'నానీ వెళ్ళి ఆరునెలలు అయిపోయింది'

వర్షం పడేలా వుంది.

ఆరేసిన బట్టలు లోపలకు తీసుకొని వచ్చింది.

అంతలో ఫోను మోగింది.

జానకి కంఠం వింటూ అవతలివారి స్వరం కొంచెం ఉద్వేగంగా పలికింది. "నేను సాంఘిక సంక్షేమ శాఖనుండి మాట్లాడుతున్నాను. మీరూ, మీవారు చేసిన త్యాగానికీ, మీ బాబు మరణంలో మీరు చేసిన సేవాతత్పరతకూ మీ దంపతులకు అవార్డు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. గవర్నర్‌గారి చేతిమీదుగా అందుకొంటారు..."

అవతలివారి మాటలు పూర్తికాకుండానే జానకి అంది. ''మేము అవార్డులకోసమో, రివార్డుల కోసమో, పారితోషికాలకు ఆశపడో మా అబ్బాయి అవయవాలను దానం చేయలేదు. మావాడి మరణం కొంతమంది ప్రాణాలను నిలబెట్టింది. మాకు తీరని నష్టం జరిగినా మరికొందరికి ఎంతో మేలు జరిగింది. అది మాకు ఎంతో ఓదార్పునిస్తోంది.

మావాడు చిరంజీవిగా మిగలేదన్న తృప్తి మాకు వుంది. ఏవేవో సన్మాలు చేసి, సత్కారాలు అందించి మమ్మల్ని అవమానం చేయవద్దు. మీ ప్రతిపాదనను తిరస్కరిస్తున్నాం..."

ఫోను రిసీవర్ పెట్టేసింది.

కనులలో తిరిగిన నీటిని కంటిలోనే అణచి వేసుకొంటూ బట్టలను మడతలు వేయసాగింది జానకి బరువెక్కిన హృదయంతో.

# అయ్యో, ఒక్కరయినా చెప్పలేదు!

**- నిడదవోలు మాలతి**

**అ**మెరికా వెళ్ళడానికి ఆయత్తమవుతున్నాను.కనిపించిన ప్రతివారూ సలహాలు ఇవ్వడం మొదలెట్టారు.

ఒక మహావీరదేశభక్తుడి వచనాలు, “ఇదుగో చూడు, నువ్వు పరదేశం వెళ్తున్నావు. అంటే నువ్వు అక్కడ మనదేశానికి అనధికార ప్రతినిధివి అన్నమాట. గాంధీగారి వారసురాలినని మరువకు.”

“ఏ గాంధీ?’ అన్నాను భక్తిప్రమత్తులతో. ఎందుకంటే నాకింకా ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ రోజులు మనసులో మెదులుతున్నాయి.

ఆ మ.వీ. దేశభక్తుడు నావేపు అసహ్యంగా చూసి విసురుగా చేతులూపుకుంటూ వెళ్ళిపోయాడు.

నాకు లెక్కల్లో డిగ్రీ వుంది. చిన్నచిన్న తప్పుల్తో పైథాగరస్ సిద్ధాంతం మీద చిన్న ఉపన్యాసం ఇవ్వగలను. అంతకంటె ఓ చూపు వాసి తక్కువగా ఐన్‌స్టీన్ గురించి కూడా మాటాడగలనేమో కానీ శంకరుడి గురించో పాణిని గురించో అడిగితే కటకట!

హడావుడిగా లైబ్రరీకి వెళ్ళి ఓ కట్ట పుస్తకాలు తెచ్చేను – మహాత్మాగాంధీ, ఇందిరాగాంధీ, అరబిందో, గురు మహారాజ్‌జీ, బాబాలూ, కోబ్రాలూ, హిందూమతం, ఎలిఫెంటా గుహలు, మీనాక్షి దేవాలయం, బృందావన్ గార్డెను – ఒకటేమిటి కనిపించిన ప్రతి విషయం మీదా ఓ పుస్తకం తీసేసుకున్నాను.

ఇంకా అమెరికా వెళ్ళి, అమూల్యమైన అభిప్రాయాలతోనూ, అనన్య సామాన్యమైన వస్తు సంచయంతోనూ తిరిగొచ్చిన వారిని కూడా సంప్రదించేను. వాళ్లందరూ కూడా అప్రతిహతమైన సలహాలే ఇచ్చేరు.

ఉదాహరణకిః

“నువ్వు నువ్వే, గుడ్డిగా వాళ్లని అనుకరించి మన జాతికి తలవొంపులు

తేకు.” “నువ్వు తప్పనిసరిగా గుర్తు పెట్టుకోవలసిన విషయం రోములో రోమనుడి వలె మనవలె.”

“నూలు చీరెలు పుష్కలంగా పట్టుకెళ్లు. అక్కడ నూలు బట్టల ధరలు మండిపోతున్నాయిట.”

“చీరెలు పట్టుకెళ్లకు. అక్కడెవరూ చీరెలు కట్టుకోరు.”

“అమెరికన్లు ఇండివిడ్యూలిస్టిక్”

“అమెరికనులు సెల్ఫ్ రిలియంట్”

“అమెరికనులు చిత్తశుద్ధిగలవారు.”

“ఓహో అమెరికా! అదొక భూతలస్వర్గం. డాలర్లంటే రోడ్డుమీద చిత్తుకాయితాలే అనుకో.”

“అక్కడ అమ్మాయిలందరూ బాపూ బొమ్మలే. నాకో డేటు సంపాదించిపెట్టరాదూ?” మా తమ్ముడి స్నేహితుడు సన్నగా నసిగేడు.

మరో మేనగోడలు రహస్యంగా, బాంబే ఫేషన్ పత్రికలో ప్రకటించిన లేటెస్టు ఫేషను నైలాన్‌పాంటీలు ఓ రెండు పేకట్లు పంపమంది నేను అమెరికాలో దిగగానే.

ఇంకా ఫోర్కు ఎలా పట్టుకోవాలో, ఎప్పుడు థాంక్యూ చెప్పాలో, ఏ కారు కొనాలో, ఏ టూత్‌పేస్టు వాడాలో.. లాటి విషయాల్లో ఎనలేని సలహాలు ఉచితంగా వచ్చేసేయి వెల్లువలయి.

ఆఖరికి నేను న్యూయార్కులో దిగేను సగం నిండిన సూట్‌కేసుతోనూ, పచ్చళ్ళూ; పొళ్ళూ పూరాగా నిండిన చేతి సంచీతోను, కష్టములవారు నన్ను మతిమాలినదానినిగా గుర్తించి వుంటే. ఆమాట నాకు తెలీకుండా జాగ్రత్త పడ్డారు.

వారం రోజులపాటు తినడం, పడుకోడం, తినడం. పడుకోడం కార్యక్రమం అయిన తరవాత, ఓ రోజు వుదయమే తెలివొచ్చింది.

మేలుకొని, కళ్ళు తెరిచి, వొళ్లు విరుచుకుంటూ కిటికీలోంచి చూశాను. శీతాకాలపు తొలిమంచు సుతారంగా కురుస్తోంది!

ఆహా! నా జీవితంలో తొలి హిమానీ తుంపరలు!

ఓహో... నాడెందము ఆనందమందిరమయి, నందనవనమయి నందివర్ధనాలు విరగబూసింది.

తెల్లని మంచు దూదిపింజల్లా గాలిలో విలాసంగా తేలి, వయ్యారంగా చెట్టుకొమ్మలమీదా, ఇళ్ళమీదా, కారులమీదా వాలుతున్నాయి.

గుప్పుమని హృదయములో ఉత్సాహం ఉరకలు వేసింది. లేచి, గబగబా మొహం కడుక్కుని, కాఫీ తాగి, కోటూ, బూటూ మఫ్లరూ, టోపీ చుట్టబెట్టుకున్నాను. దసరాల్లో గంగిరెద్దు గుర్తుకొచ్చింది కానీ అట్టేసేపు నిలవలేదు ఆ తలపు. వీధిలో అడుగుపెట్టి మోము ఎత్తి కళ్ళతోనే అమందానందం అనుభవిస్తున్నాను.

చల్లని మంచు లేతపుప్పొడిలా మొహంమీద వాలుతోంది మృదువుగా, నామానసవీణ ఘల్లున మోగింది. రెండోకాలు తీసి ముందుకి వేశాను. థమ్... ముందుకి వేసినకాలు ఇంకా ఇంకా ముందుకి సాగి, నాకాయాన్ని సాష్టాంగప్రణామ ఫక్కీలో నేలపాలు చేసింది.

క్షణకాలం ఆగి, నన్ను నేను కూడతీసుకుని, మెల్లిగా లేచి మళ్ళీ రెండోపాదం ముందుకి వేశాను.

థమ్. రెండోసారి నేలకరిచాను. కాని లేవక తప్పదు. అలనాటి బ్రూస్‌లా మళ్ళీ లేచి, మానవాళికి ఏ మాత్రమూ జయంట్ స్టెప్ కాని అడుగు వెయ్యడానికి, "బలి తల మోపిన పాదము" కాని పాదము ఎత్తి, చుట్టూ చూశాను ఈ పద్మవ్యూహంలోంచి ఎలా బయట పడడమా అనుకుంటూ.

నాలుగడుగుల దూరంలో చిరునవ్వుతో నన్ను తిలకిస్తున్న అమెరికన్ ఒకాయన ముందుకొచ్చి చెయ్యి అందించాడు.

నేను గబుక్కున ఆ చెయ్యి దొరకపుచ్చుకుని ఆ మంచుగుండంలోంచి బయటపడ్డాను.

తరవాత అతని చెయ్యి వదిలేసి, నాదారిన పోబోతూ అన్నాను. "ఇంతవరకూ తెలీనేలేదు. ఒక్కరయినా చెప్పలేదీ మాట నాకు."

"ఆఁ?" అన్నాడు అతను అయోమయంగా చూస్తూ.

"మంచులో జారిపడతాం అని."

(ఈ కథ నేను అమెరికా వచ్చేక ఇంగ్లీషులో రాసిన మొదటి కథ. 1982లో ఇంగ్లీషులో విస్కన్‌సిన్ రివ్యూలో ప్రచురింపబడింది.)

# దేవుడి ఇల్లు

**- ఉషారాణి భాటియా**

గుడిలో చాలా సందడిగా ఉంది. జనం ఒకళ్ళమీద ఒకళ్ళ మీద ఒకళ్ళు పడిపోతూ ముందుకి తోసుకు వస్తున్నారు. జనప్రవాహం గుడిలోపలికి వస్తున్నట్టు వుంది గానీ బైటికి  వెళుతున్నట్టు లేదు. అదిచిన్న గుడి. ఉక్కగా, ఇరుగ్గా ఉంది. విగ్రహం ముందు దీపం తప్ప అంతా చీకటిగా ఉంది. దభీమని కొబ్బరికాయ కొడుతున్న శబ్దం. బ్రాహ్మణుని మంత్రోచ్ఛరణ, స్త్రీల మాటలతో వాతావరణం హోరుగా గలగల మంటోంది.

కిందపడిన పూలనీ, ప్రసాదాన్నీ పిల్లలు తీయబోతుంటే, పెద్దలు వారిని వారిస్తున్నారు. గుడిలోపలికి ప్రవేశిస్తున్న పూజారులకి భక్తులు ఒదిగి తోవ చేస్తున్నారు. సాయంత్రం అరుగంటలవుతుంది. గుడిలోపల ఎంతమంది జనం వున్నారో దాదాపు అంతమంది బైట గుంపుగా చేరి పూలు, పళ్ళు కొంటున్నారు. కాస్త ఎత్తుగా కొండ వైపుగా వున్న గుడికి సన్ననిమెట్లున్నాయి. మెట్టు కనబడకుండా జనం సరిగా పైకీ కిందికీ వెళుతున్నారు. ఆ తోపుడు, తొందరలో కొందరు పక్కవారిని గుర్రుగా చూస్తూ లోలోపల గొణుక్కుంటున్నారు. చేతిలో హారతి పళ్ళెం, ప్రసాదం గట్టిగా పట్టుకుని ప్రవాహంలో కొట్టుకుపోతున్నట్టు ఊగిసలాడుతూ ముందుకి పోతున్నాడు. గుడిమెట్లు తడిగా, నలిగిన పూవులతో అడుగులు జాగ్రత్తగా వేయవలసిన అవసరం కల్పిస్తున్నాయి. కానీ భక్తులు ధైర్యంగా, ఉత్సాహంగా అతి తొందరగా  ముందుకు పోతున్నారు.

ఆ రోజు భక్తులలో స్త్రీల సంఖ్య ఎక్కువగా ఉండటం వల్ల రకరకాల రంగు రంగుల చీరలు కదలాడుతున్నాయి. అందులో రెండే రెండు చీరలు  విలక్షణంగా వున్నాయి. ఒకటి ఎర్రంచు నారింజరంగు పట్టుచీర, రెండోది నీలంగళ్ళ పోచంపల్లి జరీచీర. ఈ చీరలు కట్టుకున్న స్త్రీలు ఇద్దరూ చూడముచ్చటగా కళకళలాడుతున్నారు. ఒకామె ముప్పయ్యోపడిలో ఉంది. పేరు తులశమ్మ, రెండో ఆమెకి నలభై దాటింది. ఆమె పేరు లలితమ్మ. అందం కన్న వాళ్ళిద్దరిలో ఆకర్షణ ఎక్కువ అనవచ్చు. మల్లెలు

తురుముకున్న పెద్ద తలముడులు, ఒంటినిండా మెరుస్తున్న నగలు, ఆనందమూ తృప్తీ నిండిన ముఖాలు – వాళ్ళిద్దరూ ఆ వేళ నెమ్మదిగా అడుగులేస్తున్నారు. కుడిచేతిలో పూల పళ్ళాలు, ఎడం భుజం మీదుగా నాజూకుగా వేళ్ళాడుతున్న పర్సులు, చేతికి వాచీలు – అధునాతనంగా వున్న భక్తులు వాళ్ళు. వాళ్ళ నడకలో, మాటలో, చూపులో హుందాతనం, నెమ్మది ఉట్టిపడుతున్నాయి.

గుడిమెట్లు ఎక్కి వెళుతున్నప్పుడూ వాళ్ళకి తొందరలేదు. దిగుతున్నప్పుడూ తొందరలేదు. తాపీగా, చేతులు కలుపుకుని గలగలమని నవ్వుకుంటూ, కబుర్లు చెప్పుకుంటూ కిందిమెట్టుకి చేరుకున్నారు.

అప్పుడప్పుడే చీకటి పడుతోంది. గుడిముందు దీపాలు దివ్యంగా వెలుగుతున్నాయి. చల్లగాలి ప్రారంభమయింది. కిందిమెట్టు వారగా, వాళ్ళ కాళ్ళకి ఏదో మెత్తగా తగిలింది. పరీక్షగా చూస్తే అక్కడ ఒక స్త్రీ కూర్చుని ఉంది. ఎర్రగళ్ళ సాదా చీర, జారుముడి, రబ్బరుగాజులు, మట్టికాళ్ళు – ఆమె చేతిలో పళ్ళు, పూలు కొబ్బరికాయలు లేవు. తలెత్తి దీనంగా పైకి చూసింది.

“ఎవరో బిచ్చగత్తె” అంది చిన్నావిడ తులశమ్మ.

“ఊహూ! మన లచ్చమ్మలా ఉంది” అంది లలితమ్మ.

ఇంతలో ఆ స్త్రీ లేచి నిలబడింది. “దండాలండి అమ్మగారూ” అంది చేతులు జోడిస్తూ, ఆ స్త్రీ లిద్దరూ ఆగి లచ్చమ్మ వంక ఎగాదిగా చూశారు.

“నువ్వేనా! ఎవరో అనుకున్నాను. ఇక్కడేం చేస్తున్నావు? గుడికి వచ్చావా? ఏమైనా మొక్కుకున్నావా?” అడిగింది లలితమ్మ.

“మాకేటీ మొక్కులండీ? మాది రోజూ మొక్కుల బతుకే. వినేవాళ్ళు. ఇచ్చేవాళ్ళు ఉండాలిగానీ” అంది లచ్చమ్మ.

“అదేమిటే! అలా మనసు చిన్న చేసుకుంటావు? ఇది దేవుడి ఇల్లు. ఆయన్ని అడిగితే దొరకని వస్తువు లేదు. పైకి పోయి దండం పెట్టుకో” సలహా ఇచ్చింది లలితమ్మ స్నేహితురాళ్ళిద్దరి పాదాలూ ముందుకి సాగాయి.

“అమ్మగారూ! నాకో చిన్నసాయం చేసి పెట్టండి” అంటూ లచ్చమ్మ సందేహంగా వారిని అడ్డగించింది.

ఆ ఇద్దరు స్త్రీలలో లలితమ్మకి లచ్చి బాగా తెలుసు. కష్టకాలంలో పిడికెడు బియ్యం, ఓ గుడ్డముక్క నాలుగు పైసలు అడిగే చనువు వుంది ఆమెతో., పండుగలు, పూజలు జరిగే రోజుల్లో ఎన్నోసార్లు ఆమె గుమ్మం ముందు తచ్చాడి, ఏదో ఇంతమూట గట్టుకుపోయేది. ఆమె కబురంపితే పరుగున వెళ్ళి ఇంటెడు చాకిరీ చేసి వచ్చేది. ఇంట్లో పనిమనిషి కాకపోయినా అంతకంటే ఎక్కువగా సేవ చేసేది. అందుకనే ఈ రోజు గుడి ముందు పెద్దామెను ఆపింది. తులశమ్మని మటుకు పూర్వం చూసి ఎరుగదు.

"ఫరవాలేదు. చెప్పవే ఏం సాయం కావాలి?" అడిగింది లలితమ్మ, తులశమ్మ ముఖం గంభీరంగా మారిపోయింది. చేయి పర్సు తెరిచేందుకు ప్రయత్నించింది.

"మీరు పెద్దోళ్ళు చదువుకున్నవారు. నా కష్టం మీకే అర్థమవుతుంది" అంటూ లచ్చమ్మ వాళ్ళ కాళ్ళకి అడ్డుగా వచ్చి నిలబడింది. ఇంటికి తొందరగా వెళ్ళాలనే తొందర అంతగా లేకపోయినా స్నేహితురాళ్ళిద్దరూ ముఖాలు విసుగ్గా పెట్టారు.

"చూడు లచ్చమ్మా! అదేదో ఇంటి దగ్గర మాట్లాడుకుందాం. ఇక్కడ కాదు. మేము ఇళ్ళు చేరుకోవాలి" అంది లలితమ్మ.

"అమ్మగారూ! రేపటికి ఆలస్యమవుతుందండీ! నాకీ కష్టం ఇయ్యాల రాత్రేనండి. అందుకనే దేవుడికాడికి వచ్చాను" అంది లచ్చమ్మ దీనంగా. స్నేహితురాళ్ళిద్దరూ ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు.

"సలహాయే కదా! ఫరవాలేదు. ఏదో ఒకటిచెప్పి త్వరగా ముగిద్దాం పద. ఆ వైపు తిన్నె దగ్గిర కూర్చుందాం. అక్కడ వెలుగ్గా కూడా ఉంది" అంది లలితమ్మ ఓదార్పుగా. కాస్త అయిష్టంగా యిబ్బందిగా కుడివైపుకు దారితీసింది తులశమ్మ. లచ్చమ్మ వెనకాలే తల ఒంచుకు నడిచింది.

"చెప్పు ఏమిటో" ఏకకంఠంతో అడిగారు స్నేహితురాళ్ళిద్దరూ అసహనంగా.

"అమ్మగారూ! దేవుడు ఎలాటి మాటలు చెబుతాడండీ? మంచి మాటలే ఇనటం ఆయనకి అలవాటా? లేక చెడ్డమాటలు కూడా ఇంటాడాండీ? ఈ దేవుడు ఉలకడు. పలకడు. నేను ఏంటి చేసేదండీ!" లచ్చమ్మ గొంతు బొంగురుపోయింది.

లలితమ్మకి చిర్రున కోపం వచ్చింది.

"ఏం చెప్పాలో త్వరగా చెప్పవే" అంది.

"కోప్పడకండి అమ్మగారూ! నా గోల అలాటిది. మనం ఆడవాళ్లమంతా ఒకటే కదండీ. ఎవరికీ అన్యాయం చేయకూడదు కదండీ" అడిగింది లచ్చమ్మ.

"అవునే చెయ్యకూడదు. అది తప్పు. ఇందులో దేవుణ్ణి అడిగేదేముంది? నీకు బుద్ధిలేదా?" తులశమ్మ కలుగచేసుకొని అడిగింది.

"నేను చదువులేని మొద్దుని. నాకు భయమూ వేస్తున్నది. భారంగానూ ఉంది. ఈ భారంగా వుండడమే తప్పు, ఒప్పు తెలియటమా అండీ?" లచ్చమ్మ అమాయకంగా వారి వంక చూసి చెప్పుకుపోయింది.

"నాలుగు రోజులుగా ఆ పెద్దాయన మాటలు విని తల దిమ్మెక్కి పోయినాదండీ! నాకా మొగదిక్కు లేదు. ఇద్దరు పిల్లల్ని పెట్టుకుని, ఆడనీ ఈడనీ పని చేసి గడుపుతున్నాను. ఆ పెద్దాయన అన్నాడు కదా, నా ఆడది రెండు నెలలు వూరెళుతోంది. నువ్వు పగలంతా నా ఇంటికాడ వుండి, వండి, వార్చి రాత్రికి గుడిసెకి ఫో" అని.

స్నేహితురాళ్ళిద్దరికీ ఇక ఓర్పు నశించింది. ఇంటికి వెళ్ళడానికి ఉద్యుక్తులయ్యారు.

"అమ్మగారూ! పూర్తిగా వినండమ్మా. మా కులం వాళ్ళు అంటారు కదా! ఆడి మనసు మంచిది కాదు. రేపు అమ్మగారొస్తే డొక్క చీలుస్తారు" అని.

లలితమ్మ అందుకుంది. "అంతేకాదు. పిచ్చిదానా? రేపు ఆ పెద్దమనిషి నీతో అడ్డదిడ్డంగా ప్రవర్తిస్తే ఏం చేస్తావు?"

తులశమ్మ కూడా అంది. "ఇట్లాంటి పనులు ఒప్పుకోక. ఆ మనిషి మనసు మంచిదయితే పెళ్ళాన్నే నీతో మాట్లాడమని అడగవచ్చు కదా."

స్నేహితురాళ్ళిద్దరూ ఇంటిముఖం పట్టారు. "ఇంతకీ లచ్చమ్మా! ఈ మాట అడిగేందుకు గుడికి ఎందుకు వచ్చావే?" ఆగి అడిగింది లలితమ్మ.

'దేవుడు, మనిషి మనసులోనే వున్నాడు. మంచీ చెడూ లాంటి పెద్దమాటలు నాకు తెలియవండీ! ఈ మెట్ల మీద కూచుంటే కాస్త బుద్ధి తగులుతుందేమో అని వచ్చానండీ. పై మెట్టువరకూ వెళ్ళకుండానే మీలాటి గొప్పోళ్లు తగిలి మంచి మాట

చెప్పారండీ . కష్టాలు భరించలేక డబ్బుకి ఆశ పడింది పాడు మనసు" సిగ్గు పడుతూ తల ఒంచుకు గొణిగింది లచ్చమ్మ.

'అదేమిటే! దేవుడి గుమ్మం వరకూ వచ్చి అలా వెళ్ళిపోకూడదు. తప్పు. పై వరకూ వెళ్ళి ఏదయినా కోరుకో. ఇంద ఈ డబ్బులు తీసుకో" తులశమ్మ లచ్చి చేతిలో రూపాయి పెట్టబోయింది.

'వద్దండి అమ్మగారూ! ఈడ నుంచే దణ్ణం పెట్టుకుపోతానండి" అంటూ పోబోతున్న లచ్చమ్మని పట్టుకుని ఆపింది లలితమ్మ. "అడగకూడదుగానీ, ఇంతకీ, ఆ పెద్దమనిషి ఎవరేమిటి?" కుతూహలంగా చూస్తూ అడిగిందామె.

లచ్చమ్మ ఓ క్షణం ఆగి ఇటూ అటూ చూసింది.

"అమ్మగారూ! మరెవరితో అనబోకండి. ఇటు నుంచి తిన్నగా పోయి ఆ మూడో సందులో తిరిగితే రెండంతస్తుల మేడ లేదండీ. దానికి ఆనుకుని వున్న ఇటిక రంగు మేడండి..."

లచ్చమ్మ వెళ్ళిపోయింది. మెట్టు ఎక్కి దేవుడి ఇంటికి కాదు, మెట్లు దిగి తన గుడిసె వైపుకి. ఆమె ఎన్నడూ చూడని, ఊహించని, పూజించని, అర్చనలు చేయని –కానీ నిత్యం ఆమె మనసులో వున్న – దేవుడు ఆమెని శాంతపరిచాడు.

కానీ ఆ గుడిమెట్లు విడవకుండా అనేకసార్లు ఎక్కిదిగి, దేవుడి ఇంట్లో అర్చనలు చేసి, తమ కోర్కెలు తీర్చమని వేడుకున్న ఆ దేవుడు – స్నేహితురాళ్ళిద్దరినీ కలతగా అశాంతిగా వదిలివేశాడు.

ఇటికరంగు మేడ యజమానురాలు తులశమ్మ వంక చూసే ధైర్యం లేక తల ఒంచుకు నెమ్మదిగా అడుగులు వేసింది లలితమ్మ.

**(వనిత, మాసపత్రిక, జూన్, 1993)**

# పసిడి సంకెళ్ళు

**– వేదుల శకుంతల**

**పొ**ద్దుటినుంచి మనసంతా కలతగా, చికాకుగా ఉంది, అపర్ణకి! అసలు ముందు రోజు సాయంత్రం నుండే మొదలైంది. నీర్సం, నిరుత్సాహం! రాత్రి భర్తతో చెప్పింది – "నాన్న ఉత్తరం రాసేరు" అని.

'ఆహా! ఏమని? అంతా కులాసాయేనా?' అని అడిగేడు ప్రసాదు.

"యోగక్షేమాలన్నీ మామూలే! అక్కా– చిన్న చెల్లి – అన్నయ్యా వదినా కూడా పండుగకి వస్తున్నారట! తప్పకుండా బాబిగాడితో బయలుదేరి నన్ను రమ్మని రాసేరు."

"అంటే నాకు ఆహ్వానం లేదన్నమాట?" అని చిన్నగా నవ్వేడు ప్రసాదు.

అపర్ణ కోపంగా చూసింది. "ఎలా ఉంటుంది? ఆహ్వానాన్ని అందుకునే పరిస్థితిలో ఉన్నామా? ఇల్లు కదిలి వెళ్ళే స్థితా మనది?"

"చూడు అపర్ణా! నువ్వూ బాబిగాడు వెళ్లి రండి. నేను ఇంట్లో మ్యానేజ్ చేస్తాను. మీ పుట్టింట్లో హాయిగా పండుగ సరదాలు జరుపుకుని రండి!" అన్నాడుఅనునయంగా.

"ఊ! బాగా చెప్పారు. మీరు ఇంట్లో మ్యానేజ్ చేస్తారా? ఎలా? ఆఫీసుకు వెళ్ళరా?"

"పండుగకి రెండు రోజులు సెలవు ఎలాగూ ఉంటుంది. నేను మరి రెండు రోజులు సెలవు పెట్తాను. ఫర్వాలేదు. అంతగా అయితే ... పనిమనిషి లక్ష్మిని రెండురోజులు ఇంట్లో ఉండమని చెప్దాం!"

"సరేలెండి. ఈ ఏర్పాట్లన్నీ చెప్పుకుందుకు బాగుంటాయి. జరగడం అంత సులభం కాదు" అంటూ అపర్ణ పడుకుంది. పగలంతా అలసిపోతుంది. కనుక పడుకోగానే నిద్రలోకి జారిపోతుంది.

తెల్లవారగానే – మళ్లీ పనులు మొదలు. ఐదేళ్ళ బాబిగాణ్ణి తయారుచేసి స్కూలుకి పంపాలి. ప్రసాదుని ఆఫీసుకి పంపాలి. మామగారి సేవలు.. ఆడపడుచు సంరక్షణ. ఉఫ్! మనసంతా కలతగా, చికాకుగా ఉండక ఏమవుతుంది?

దానికి తోడు – ఆకాశం అంతా మబ్బులు పట్టి – వాతావరణం డల్‌గ అనిపిస్తోంది. మెల్లగా గాలి కూడా ప్రారంభమైంది. అపర్ణకి సన్నగా తలనొప్పి కూడా ప్రారంభమైంది. కణతలకి అమృతాంజనం పట్టించి, అసహనంగా, మంచంమీద వాలింది!

బియ్యే ప్యాసై – ఎమ్ఎ. చదవాలనుకుంటున్న సమయంలోనే చాలా మంచి సంబంధం వచ్చిందమ్మా! చదువుకేమిటి? తర్వాత ప్రైవేటుగానైనా ఎమ్.ఏ. చేయవచ్చును' అని తండ్రి తనని ఒప్పించి పెళ్ళి జరిపించాడు. నిజమే! ప్రసాదు ఉత్తముడు. సంసారం ఎంతో అన్యోన్యంగా .. అసలు చదువు మాటే మరిచిపోయి– అనురాగ స్రవంతిలో తేలిపోయింది. బాబిగాడికి మూడేళ్లు నిండేసరికి అనుకోని అవాంతరాలు వచ్చి పడ్డాయి. అత్తగారు అకాల మరణం చెందేరు. మరిది చాలా దూరప్రాంతానికి ట్రాన్స్‌ఫరై వెళ్ళిపోయాడు. పెళ్ళికాని ఆడపడుచు. బొత్తిగా ఇన్నోసెంట్! ఆమె కంటే బాబిగాడు నయం! వాడి పనులు వాడు చేసుకుంటాడు. ఆ అమ్మాయి మాత్రం ఇరవై ఏళ్లు నిండినా – అన్నం కూడా సరిగా తినలేదు. స్నానం చేయడం – బట్టలు కట్టుకోవడం – అన్నం తినడం. అన్నీ దగ్గర ఉండి చెప్తూ ఉంటే చేస్తుంది. ఇక మామగారు ... పక్షపాతం మనిషి! ఆర్నెల్ల క్రితం – బిపి ఎక్కువైన సందర్భంలో చాలా ఉద్రేకపడి స్ట్రోక్ వచ్చి – పక్షవాతానికి గురయ్యారు.

ఒక మనిషి సహాయం ఎప్పుడు ఉండాల్సిందే!!

అపర్ణ విద్యావతే– సహనవంతురాలే! వివేకం గల గృహిణే! అయితే... తనకంటూ కొన్ని సరదాలు... కోరికలు ఉండడం సహజం కదా? ఆర్నెల్ల నుండి బొత్తిగా ఇల్లే సర్వం అన్నట్లుగా బందీ అయిపోయింది. ఏ చిన్నపాటి సరదా తీరడం లేదు. బాబిగాడు, కొన్ని కాకపోతే కొన్ని అయినా చేయాల్సిందే! నాదీ ఓ బ్రతుకేనా?' అనుకుంటూ అపర్ణ తండ్రి రాసిన ఉత్తరం తల్చుకుని– ఉండిపోయింది. మగతగా నిద్రలాంటిది పట్టుంటే –

ఠక్కున మెలకువ వచ్చింది!

బయట వర్షంమొదలైంది. టప్... టప్... అంటు పెద్ద చినుకులు పడుతున్న శబ్దం వినిపిస్తోంది. దిగ్గున లేచింది అపర్ణ.

'అయ్యో! పెరట్లో ఆరేసిన బట్టలు తడిసిపోయాయేమో' అనుకుంటూ గబగబా సందులోంచి పెరట్లోకి వెళ్ళింది. సగం సగం తడిసిన బట్టల్ని అదరాబాదరా లాగేస్తూ భుజం మీద పడేసుకుంటూ – 'ఏం పిల్లో, వర్షం వస్తుంటే పెరట్లోబట్టలు తీసుకురావాలని కూడా తోచదు. ఊ! అదే తెలిసి ఉంటే – నేను బాధపడడం దేనికి? ఛీ! ఛీ! అయోమయం పిల్ల! ఏ నాడో చేసేను పాపం! అనుభవిస్తున్నాను ఈనాడు!' అనుకుంటూ అపర్ణ – ఆడపడుచుని తిట్టుకుంటూ ఇంట్లోకి వచ్చింది. వంటిల్లు దాటి మధ్యగదిలోకి వచ్చేసరికి – వెలుగు అంతగా పడని ఈ చీకటి గదిలో – ఓమూల చాపమీద – ముడుచుకుని రెండు చేతులు పొట్టలోకి దూర్చుకుని – పడుకుని ఉంది సుశీల.

అపర్ణ ఒక్క క్షణం అలా ఆడపడుచును చూస్తూ నిలబడిపోయింది. చలికి ముడుచుకుని పడుకున్న కుక్కపిల్లలా... అమాయకంగా కన్పించింది సుశీల. అపర్ణకి 'పాపం!' అనిపించింది. కప్పుకోవాలని కూడా తెలియని పసికందులా.... తోచింది. భుజం మీద ఉన్న బట్టలన్నీ అక్కడ పడేసి – పక్కగదిలో నుంచి ఒక దుప్పటి తీసుకువచ్చి, ఆడపడుచుకు కప్పింది. 'ఈ వయస్సుకి ఎన్నెన్ని కోరికలో ఉండి పరుగులు తీసే పరువపు కలలు కంటూ ఉండాల్సిన పిల్ల! ముడుచుకుని ముగ్ధలాపడుకున్న వెర్రిమాలోకం!' అనుకుంది.

ముందుకు కదిలి – మామగారి గదిలోకి చూసింది!

మంచంమీద పడుకున్న మామగారు... చూపులు గుమ్మంవైపు ఉన్నాయి. తెరచి ఉన్న కిటికీ తలుపులోనుంచి వానజల్లు పడుతోంది. దుప్పటి తడిసిపోతోంది. వీపు – ఒక పక్కంతా తడిసి కదలలేని స్థితిలో కిటికీవైపు, గుమ్మంవైపు చూస్తున్నారు.. ఆ మూగజీవి! పిలవడానికి మాట సరిగా రాదు. సైగలు తప్ప– స్పష్టంగా మాట్లాడలేరు. తడిసిపోతున్న పక్కలో అలాగే – చైతన్యహీనంగాపడుకుని – కోడలు వస్తుందేమో, చూసి సద్దుతుందనే ఆశతో – గుమ్మం వైపు చూస్తున్నారు– తొందరగా కిటికీ తలుపులు మూసింది

అపర్ణ – ఆ స్థితిలో మామగార్ని చూసి – ఆర్ద్రమైపోయింది! 'అయ్యో!' అనుకుంటూ గబగబా ఆయన్ని పక్కకి దొర్లించి మెల్లగా ఆ దుప్పటి లాగేసి – బట్టలు మార్పించి మరొక దుప్పటి పరచి ఆయన్ని జాగ్రత్తగా పడుకోబెట్టింది.

మామగారు – అపర్ణవైపు నీరు నిండినకళ్లతో చూస్తూ కృతజ్ఞత తెలియజేసేరు. 'నిన్ను చాలా శ్రమ పెట్టున్నానమ్మా' అన్న ఆర్ధంతో గొణిగి – స్ట్రోకు తగలని చేయి మెల్లగా పైకి ఎత్తి నుదుటికి తాకించుకున్నారు.

అపర్ణ మనసు చెమ్మగిల్లి – ఇక అక్కడ నిలువలేక 'టీ చేసి తీసుకువస్తాను' అనేసి గదిలోంచి బయటకి వచ్చేసింది.

ఆ రాత్రి....

అపర్ణ –పనంతా ముగించి నిద్రపోయేముందు తండ్రికి ఉత్తరం రాసింది. "నాన్నా! మీరు రాసిన ఉత్తరం అందింది. పండుగకి అందరూ వస్తున్నారనీ, నన్నూ, బాబిగాడిని రమ్మని రాసేరు. చాలా సంతోషం! తండ్రిగా మీకు గల అభిమానం చూపించేరు. – మంచిదే! మరి తల్లిగా నా ఆత్మీయ అనురాగాలని చూపించుకోవద్దూ?

"నాకు బాబిగాడు ఒక్కడే కొడుకు కాదు నాన్నా! నాకు ముగ్గురు సంతానం! అందులో ఇద్దరు మరీ పసివాళ్ళు! మా మామగారు. మా ఆడపడుచు బాబిగాడికంటే – చిన్నపిల్లలు! ఇన్నాళ్ళూ.... నేను చాలా అవివేకంతో ఆలోచించాను నాన్నా! వాళ్లునాకు బంధనాలనీ. .. అడ్డంకులనీ... చాలా అసహ్యంగా యోచించాను. కానీ తెలుసుకున్నాను.. నాకు ఒక్కడే సంతానంకాదు. ముగ్గురు! వాళ్ళు నాకు పసిడి సంకెళ్లు! ఇవి బాధించవు. తృప్తిని... మనశ్శాంతిని కల్గిస్తాయి! నాన్నా! మీ అందరి ఆశీస్సులు నాకు పంపండి.

ఈ పసిడి సంకెళ్ళు... తెంచుకోలేను! నాకిక్కడే పండుగ!!!

# గతానికి ఘడియ పెట్టు

– గోవిందరాజు సీతాదేవి

**హై**ద్రాబాద్ నగరంలో ఎన్నెన్నో ప్రవేటు సంస్థలు. వాటిలో ఓ సంస్థలో శ్రీదేవికి టైపిస్టుగా ఉద్యోగం వచ్చింది. ఒకవైపు వుద్యోగం వచ్చిందన్న సంతోషం మరొకవైపు ఆఫీసులో యెలా ఉంటుందో అన్న భయంతో గుండె దడదడా కొట్టుకుంటూ వుండగా అడుగులో అడుగు వేస్తూ సెక్షన్ లోనికి వచ్చింది. మేనేజరు సెక్షన్‌లో ఒక్కొక్కరినీ పరిచయం చేయసాగాడు.

'ఈమె మిస్ శ్రీదేవి.'

"ఇతను శ్రీధర్, ఆయన కుటుంబరావు, ఆమె భవానిదేవి, యింకా ఒకరిద్దరు రాలేదు. వస్తారు."

శ్రీదేవి అందరికీ నమస్కారాలు చేసింది. వారూ నమస్కారం చేశారు.

'భవానీదేవిగారూ, శ్రీదేవిగారికి అంతా కొత్త కదూ కాస్త మీరు ఆమెకి తెలియంది చెప్పండి."

"అలాగే సార్" తీవ్రంగా అంది భవానీదేవి.

ఆయన వెళ్ళిపోయారు శ్రీదేవికి చేయవల్సిన పనిచెప్పి సీటు చూపించి. శ్రీదేవి అక్కడున్న అందరినీ కలియజూసింది.

కుటుంబరావు అన్న ఆయన అందరికన్న వయసులో పెద్దవాడిలా కన్పిస్తున్నాడు. అంటే దాదాపు యేభైయేళ్ళు వుండవచ్చునన్నమాట. చాలా మామూలు బట్టలు అవీ సామాన్యగృహస్తు అని చెప్పకనే చెప్తోంది. శ్రీధర్ యువకుడు అందంగా వున్నాడు. అతని ముఖంలో హుషారు కన్నా హుందాతనం కన్పిస్తోంది.

నమస్కారం అన్నప్పుడు చిన్నగా నవ్వి ప్రతి నమస్కారం చెప్పి తర్వాత యింక ఇటువైపు చూడకుండా పని చేసుకోసాగాడు. భవానీదేవి పొట్టిగా లావుగా వుంది

బిగువైన పొట్టిజడా ఆ జడలో ఓ ఎఱ్ఱ ముద్దమందార పువ్వు. మెడలో ముత్యాలు పగడాలు కలిసినేసిన రెండు వరుసల దండా అవిగాక నల్లపూసల గొలుసూ ఇరుకుగా వున్న జాకెట్టూ నైలెక్సు చీరలో ఆవిడ ఫ్రీగా లేకుండా అనీజీగా కన్పించసాగింది. పదకొండు గంటలు కావస్తూండగా వచ్చింది మరొకామె.

ఆమె పేరు ఊర్వశి అని ఆవిడ ఎప్పుడూ ఆఫీసుకు ఆలశ్యంగా వస్తూంటుందనీ ఆఫీసరు మందలిస్తే ఏడ్చి రాగాలు పెడుతుందనీ భవానీదేవి చెప్పింది.

ఊర్వశి దగ్గరకి రాగానే భవానీదేవి కబుర్లు చెప్పటం ఆపింది.

ఊర్వశి సరాసరి శ్రీదేవి దగ్గరగా వచ్చి తనని తనే పరిచయం చేసుకుని అడిగింది.

"మీ పేరు ఏమిటి?"

"శ్రీదేవి"

ఊర్వశి కిసుక్కున నవ్వింది.

"ఎందుకలా నవ్వారు?" శ్రీదేవికి కాస్త కోపం వచ్చింది.

"శ్రీదేవి అనేసరికి... సినిమా హీరోయిన్ గుర్తుకొచ్చి"

శ్రీదేవి మాట్లాడలేదు. కానీ ఊర్వశిని పరీక్షగా చూసింది. మిగల ముగ్గిన జామపండు రంగులో సన్నగా పొడుగ్గా వుంది. వాయిల్‌చీరా, జాకెట్టు చాలా సామాన్యంగా కన్పిస్తోంది.

ఊర్వశి తన సీటు దగ్గరకి వెళ్ళి కూర్చుంది. భవానీదేవి శ్రీదేవికి ఏం చేయాలో చెప్పసాగింది. శ్రీదేవి టైపువర్కు చేయటంలో మునిగిపోయింది.

వారం రోజులు గడచిపోయినాయి. శ్రీధర్ రెండు మూడుసార్లు పలకరించాడు. అదైనా ఆఫీసులో వున్నప్పుడు కాదు. వెళ్ళిపోతున్నపుడూ, ఒకసారి మార్కెట్‌లో కల్సినపుడూ. మితభాషిలా అన్పిస్తాడు. అడిగిన దానికి మాత్రమే జవాబిస్తాడు కానీ ఒక ప్రశ్నా వేయడు. ఎక్కడ కన్పించినా పల్కరింపుగా చిన్నగా నవ్వుతాడు. అంతే, పరిచయాన్ని పెంచుకోవాలన్న ధ్యాస కన్పించదు అతనిలో.

ఎందుకింత గర్వం అతనికి? యెం.కాం. అనా? ఓసారి ఊర్వశితో ఈమాట అంది శ్రీదేవి.

"మీరు భలేవారు. శ్రీధర్‌కి గర్వమా? పొరబడ్డారు. అతనికి గర్వం అసలు లేదు. శ్రీదేవి వూరుకుండిపోయింది. కానీ లోలోపల అనుకుంది ఊర్వశికి అతనంటె అభిమానమా! లేక నేను అర్ధం చేసుకోలేకపోయానా? ఒకవేళ ఈమాట ఆవిడ అతనితో చెప్తే అతను అపార్థం చేసుకోడు కదా! శ్రీదేవి యింక జాగ్రత్తగా మాట్లాడసాగింది. రోజులు గడిచిపోతున్నాయి.

## 2

ఒకరోజు శ్రీదేవి అర్ధగంట ఆలశ్యంగా ఆఫీసుకు వచ్చింది. ఎపుడూ నిశ్శబ్దంగా వుండే సెక్షన్‌లో గలగలా నవ్వులూ మాటలూ విన్పిస్తుంటే ఆశ్చర్యపోయింది. భవానీదేవి సీటు దగ్గర కూర్చుని ఓ యువకుడు కబుర్లు చెప్తున్నాడు. అతని కబుర్లకే కాబోలు అందరూ నవ్వుతున్నారు.

శ్రీదేవిని చూస్తూనే భవానీదేవి కబుర్లూ నవ్వు ఆపి తన దగ్గర కూర్చున్న అతని పరిచయం చేసింది."శ్రీదేవీ యితను శివకృష్ణ. యిన్నాళ్ళూ శెలవులో వూరు వెళ్ళాడు. శివకృష్ణా ఈమె మిస్ శ్రీదేవి."

శివకృష్ణ శ్రీదేవిని చూస్తూ "నమస్కారమండీ" అన్నాడు.

'నమస్కారం' అంటూనే వెళ్ళి తన సీటులో కూర్చుంది.

"భవానీదేవిగారు! మన సెక్షన్‌లోని వచ్చి చేరిన శ్రీదేవి గారికి చిన్న టీపార్టీ ఇస్తాను గనుక మీరు నాయందు దయవుంచి నా ఆతిధ్యాన్ని స్వీకరించ మని ప్రార్థన" అంటూ ఫ్యూన్‌ని పిలిచి టీ తెమ్మమన్నాడు.

శ్రీదేవి యిబ్బందిగా చూసింది.

"నే చేరి వారం అయిపోయింది.'

"ఫర్లేదు నేను ఆ రోజున లేను కనుక యీ రోజు పార్టీ యిస్తున్నాను."

టీ వచ్చింది అందరూ తాగారు. శ్రీదేవి బిల్లు యివ్వబోయింది. శివకృష్ణ ఇవ్వనీయలేదు.

ఇంతలో ఊర్వశి వచ్చింది. ఆవిడకి యెదురు వెళ్లికుశలప్రశ్నలు వేయసాగాడు శివకృష్ణ. "ఊర్వశిగారూ బావున్నారా మీ శ్రీవారు పిల్లలు మీ అత్తగారూ మామగారూ వగైరా అంతా క్షేమమే కదూ" నాటకీయంగా సాగింది అతని ధోరణి.

ఊర్వశి ఈ అవకాశాన్ని వదులుకోకుండా తన సంసారంలో కష్టాలు ఏకరువు పెట్టసాగింది. శివకృష్ణ ఆవిడ చెప్పేదంతా విని సానుభూతి కురిపించేలా ఊర్వశిని ఓదార్చి తర్వాత కుటుంబరావు దగ్గరకి వెళ్ళాడు. యితనిలా కబుర్లు చెప్తుంటే శ్రీధర్ మాత్రం తన పని తను చూసుకుంటూ వుంటాడు. కానీ అనవసర ప్రసంగం చేయడు.

శ్రీధర్‌కి గర్వం అన్నమాట వినిపిస్తూ వుంటుంది.

'ఏం గొప్పట ఈయన' శ్రీదేవి అనుకుంటూ వుంటుంది.

ఈ రోజు శివకృష్ణ శ్రీదేవి దగ్గరకి వచ్చి కూర్చున్నాడు. కబుర్లు చెప్పటానికి. శ్రీదేవికి సంతోషంగా ఉంది తనని గుర్తించాడని. అంతే తనూ కబుర్లు చెప్పసాగింది.

ఫ్యూన్ వచ్చాడు.

'అయ్యా ఆఫీసరుగారొచ్చారు. యిక్కడికే వస్తున్నారు.' శివకృష్ణ గభాలున వెళ్ళి తన సీటులో కూర్చున్నాడు. అందరూ ఫక్కున నవ్వారు. శ్రీధర్ మాత్రం నవ్వలేదు. అతని దృష్టి అంతా పనిమీదనే.

రోజులు గడిచిపోతున్నాయి. శ్రీదేవి శివకృష్ణ పరిచయం క్రమంగా పెరగసాగింది. సినిమాలు షికార్లు హోటళ్ళు సెలవుల్లో వూరంతా తిరగేస్తున్నారు యిద్దరూ. యీ విషయం ఆఫీసులో ఆ నోటా ఆనోటా పాకిపోతూ వుంది. రకరకాల వ్యాఖ్యానాలు చేయసాగారు అందరూ. యిలా చేయటంలో ప్రథమురాలు భవానీదేవి.

"ఈ కాలం ఆడపిల్లలు పెళ్ళీ పెటాకులు లేకుండా అడ్డమైన వాళ్ళతో తిరగడం సరదాలన్నీ తీర్చుకోవటం తర్వాత అమ్మమ్మలు కాబోయే వయస్సులో సిగ్గులేకుండా పెళ్ళి అంటూ ఆర్భాటంగా చేసుకోవడం యిదంతా చూస్తూంటే నాకే సిగ్గుగా వుంది. నా జాతి అని చెప్పుకోవటానికి"

లంచ్ టైములో వుపన్యాసం దంచుతోంది భవానీదేవి. ఊర్వశి కుటుంబరావు 'నిజం' అన్నట్టుగా తల వూపుతున్నారు. శ్రీధర్ అయిష్టంగా ముఖం పెట్టాడు. "చూడండీ వాళ్ళిద్దరూ లేనప్పుడిలా కామెంట్ చేయటం సభ్యత కాదు" అన్నాడు.

భవానీదేవికి కోపం వచ్చింది. మూతి మూడు వంకర్లు తిప్పింది. శ్రీధర్ చికాకుగా లేచాడు. ఇంతలో శ్రీదేవీ, శివకృష్ణ అక్కడికి వచ్చారు.

‘రండి రండి మీరు లేకుంటే అసలు సందడే లేదు’ ఆత్మీయంగా ఆహ్వానిస్తోంది భవానీదేవి.

శ్రీధర్ ఒక్కక్షణం ఆశ్చర్యపోయి అంతలోనే సర్దుకుని వెళ్ళిపోయాడు. శివకృష్ణని చూసి పలకరింపుగా నవ్వినా అతను నవ్వడు. గర్వంగా చూస్తాడు. అందుకే యింక శివకృష్ణను పలకరించటం మానేశాడు శ్రీధర్. కారణం లేకుండా యిద్దరి మధ్యనా యిలా ఎందుకు జరుగుతుందో అర్థం కాక ఆలోచించకూడదు అని మానేశాడు. ఇలా గడిచిపోతున్నాయి రోజులు, నెలలు.

## 3

ఒకటి రెండుసార్లు సినిమాహాల్లో కన్పించారు శ్రీధర్‌కి శివకృష్ణ శ్రీదేవి. వారిని పల్కరించే ప్రయత్నం చేశాడు. కానీ శివకృష్ణ చూడనట్లు తప్పించుకుని వెళ్ళిపోవటం కాస్త బాధ కల్గించింది. ఆ తర్వాత శ్రీధర్ అసలు వారిద్దరినీ పట్టించుకోవటం మానేశాడు.

హైదరాబాద్‌లో మతకలహాలు చెలరేగినాయి. సిటీ అంతా ఉద్రిక్తంగా వుంది. ఎక్కడ చూసినా గొడవలుగా వున్నాయి. ఆఫీసులకి రావటం తిరిగి ఇళ్ళకి వెళ్ళటం ఆడవారికి చాలా యిబ్బందిగా భయంగా వుంది. ఎన్ని రోజులు శెలవుపెట్టి ఇంట్లో కూర్చోగలరు.

ఒకరోజు సాయంకాలం అయిదున్నర కావస్తుండగా ఆఫీసులు వదలి బైటకి రాబోతున్నారు అందరూ. సిటీలో అల్లర్లు చెలరేగిన కారణంగా కర్ఫ్యూ పెట్టేశారని తెల్సి శ్రీదేవి వొణికిపోయింది. తను వున్న ఏరియాలో కూడా కర్ఫ్యూ వుంది. చాలాదూరం తను ఒకర్తె వెళ్ళాలి. బస్సులులేవు. ఆటోలు లేవు ఎలా ఎలా? శివకృష్ణ కోసం చూసింది. అతను అప్పటికే వెళ్ళిపోయాడు. రోడ్డుమీదకి వచ్చింది. రోడ్డు నిర్మానుష్యంగా వుంది. అంతక్రితం ఆ పరిసరాల్లో జరిగిన అల్లర్లకి సాక్ష్యం అన్నట్లుగా రాళ్ళు వగైరా చెల్లాచెదురుగా పడి వున్నాయి. ఎక్కడ చూసినా పోలీసులు “వెళ్ళిపోండి ఇళ్ళకి వెళ్ళిపోండి” చెప్తున్నారు.

శ్రీదేవికి అసలే భయం. దుఃఖం ముంచుకు వస్తూంది. ఆలోచనలు పరిపరి విధాల పోతున్నాయి. తను క్షేమంగా ఇల్లు చేరటం ఎలా? కాళ్ళు వణుకుతున్నాయి. వళ్ళంతా చెమట పట్టేస్తోంది.

ఈరోజు అసలు ఆఫీసుకి వెళ్ళద్దు అంది తల్లి. ఆమె మాట వినకుండా తనే వచ్చింది. యిప్పుడెలా? శివకృష్ణ కనీసం మీరింటికి ఎలా వెడతారు అని అడగనైనా అడగకుండా తన క్షేమం తను చూసుకుని వెళ్ళిపోయాడు. అందుకు కోపం వస్తుంది.

చివరగా శ్రీధర్ తన పని అంతా పూర్తి చేసుకుని ఇంటికి వెళ్ళడానికి బైటకి వచ్చాడు. తను శ్రీదేవిని చూడలేదు. తలవంచుకుని నడవసాగాడు.

'శ్రీధర్‌గారూ' బిగ్గరగా అరిచింది శ్రీదేవి.

శ్రీధర్ వెనక్కి తిరిగి చూశాడు. ఆగి 'ఏమిటి?' అన్నట్లు ముఖం పెట్టాడు.

"సిటీలో చాలా అలజడులుగా వున్నాయని కర్ఫ్యూ పెట్టారు."

ఔను. అర్జెంట్ పని పూర్తిచేయవల్సి వుండిపోవాల్సి వచ్చింది. ఆఫీసులో ఔను... మీరింకా ఎందుకున్నారు?"

'నేనూ మీలానే వుండి పోవల్సి వచ్చింది. ఇంటికి యిప్పుడెలా వెళ్ళాలో తెలియకుండా వుంది."

'వుండండి ఎక్కడన్నా ఆటో దొరుకుతుందేమో చూసి పిలుచుకు వస్తాను' శ్రీధర్ వెళ్ళబోయాడు.

"ఒద్దు ఒద్దు లాభం లేదు ఆటో రాడు. నేను ఒక్కదాన్ని యిలా నిలుచోవాలంటే భయంగా ఉంది. "దయచేసి మీరు వెళ్ళిపోకండి."

"వెళ్ళను కానీ మనం యిలా యిక్కడ నిలబడడం మంచిది కాదు. చీకటి పడకుండా ఇల్లు చేరటం చాలా మంచిది. పదండి నేనూ వస్తాను మీ ఇల్లెక్కడ?"

శ్రీదేవి చెప్పింది. ఈ సమయంలో తను అడక్కుండా తనకి తానుగా సహాయపడతానంటున్న శ్రీధర్ మీద కాస్త గౌరవభావం కల్గింది. అంతే, అతన్ని అనుసరించింది. మెయిన్‌రోడ్డు మీద నడుస్తూ అడ్డగించిన పోలీసులకి నెమ్మదిగా విషయం చెప్తున్నాడు. ఇంతలో సందుల్లోంచి గుంపులుగా చేరిన జనం ఏవేవో విసరసాగారు. పోలీసులు వారి వెంట పడ్డారు. అందినట్లుగా బాదుతున్నారు.

"ఆగండి శ్రీదేవిగారూ, మనం యిప్పుడు ముందుకి వెళ్ళటం క్షేమం కాదు. రండి వెనక్కి పోదాం" అంటూ చేతిని పట్టుకుని వెనక్కి తీసుకు వచ్చేశాడు.

'పరుగెత్తుతూ' రొప్పసాగింది శ్రీదేవి.

"ఒద్దు ఒద్దు అలా పరుగెత్తడం ప్రమాదం!" నడవసాగారు శ్రీధర్. శ్రీధర్ చేతిలోవున్న శ్రీదేవి చెయ్యి వణుకుతూంది. కానీ అతను ఆ విషయం పట్టించుకోవడం లేదు. అతను తెలివిగా ఆలోచిస్తూ చుట్టూ కలయజూస్తూ శ్రీదేవిని సందు గొందుల గుండా ఎలాగో తీసుకు వెళ్ళగలిగాడు.

'అమ్మయ్య అదే మా ఇల్లు' వేలితో చూపించింది.

"వెళ్ళిపోండి నేనిక్కడే వుంటాను త్వరగా వెళ్ళి తలుపు వేసుకోండి "

"మీరూ రండి"

"యిప్పుడా! రాను. రాలేను. మా అమ్మ నా కోసం ఖంగారు పడుతూ వుంటుంది మీరు వెళ్ళిపోండి."

శ్రీదేవి ఇంటి ప్రహరీ గేటు దగ్గరకి చేరి వెనక్కి చూసింది. చాలా మంది రౌడీల గ్యాంగు శ్రీధర్ వున్న వైపే పరుగులు తీస్తున్నారు. లోపలికి పరుగెత్తి కిటికీ లోనించి చూసింది. శ్రీధర్ కన్పించలేదు కానీ ఏదో గొడవా పోలీసులు గందరగోళం.

శ్రీదేవి తల్లి వచ్చి చప్పున కిటికీ మూసేసి కూతుర్ని కౌగలించుకుని అంది.

"అమ్మా నీ కోసం కోటి దేవుళ్ళకి మొక్కుకున్నాను ఎలా వచ్చావే" కూతురు చేతులు ముఖం తడుముతూ అంతక్రితం ఇరుగు పొరుగు వారి అమ్మాయిలు. ఎంత యిబ్బందులు పడి ఇల్లు చేరారో చెప్పసాగింది. శ్రీదేవికి ఆ మాటలు విన్పించటం లేదు. శ్రీధర్ క్షేమంగా ఇల్లు చేరగలిగాడా! లేదా!

తర్వాత వరసగా మూడు రోజులు సిటీ అంతా కర్ఫ్యూ వుండటం వల్ల శ్రీదేవి ఆఫీసుకి వెళ్ళలేకపోయింది. నాలుగోరోజు వెళ్ళింది కానీ శ్రీధర్ రాలేదు.

ఆఫీసు నుంచి ఇంటికి వెడుతున్న శ్రీధర్ అల్లరి మూకల మధ్య చిక్కుకు పోవటంలో పోలీసులు చేసిన లాఠీఛార్జిలో గాయపడ్డాడట. మరో రెండురోజులు సెలవు పెట్టాడట.

యిది వినగానే శ్రీదేవి మనసు బాధపడిపోయింది.

తనని సురక్షితంగా చేర్చినట్లు అతను ఎవరికీ చెప్పలేదులా వుంది. పాపం

శ్రీధర్ ఎలా వున్నాడో? అన్యమనస్కంగానే పనిచేసుకోసాగింది. శివకృష్ణ వచ్చాడు. “హలో  శ్రీదేవిగారూ” అంటూ.

శ్రీదేవి మాట్లాడలేదు. సీటు దగ్గరగా వచ్చి చిన్నగా అడిగాడు.

“మీ అలుకకి కారణం.”

శ్రీదేవి చెప్పింది. అతను చిన్నగా నవ్వేశాడు.

“ఇంతేనా! ఆరోజు నేను అర్జెంట్ పని వుండి వెళ్ళాను. తిరిగివచ్చాను మిమ్మల్ని యింటికి తీసుకు వెళ్ళాలని కానీ మీరు అప్పటికే లేరు.

‘నిజమా’ నమ్మదగిన మాటగా లేకున్నా నమ్మేసింది.

శివకృష్ణ అందరినీ పలకరించి తన సీటులో కూర్చున్నాడు.

ఆ సాయంకాలం యిద్దరూ కల్సి ఆఫీసునుంచి బయలుదేరారు. కాఫీ తాగుతూ అడిగింది శ్రీదేవి “మన పెళ్ళి ఈ నెల్లో జరిగిపోవాలి అన్నారు యింకెప్పుడు?”

“వచ్చేనెల చూద్దాం”

“వీల్లేదు. మా అమ్మకి చెప్పేశాను. ఈ నెలలో జరగాలి. మీరు చాలా వాయిదాలు వేస్తున్నారు. యింక నేను టైము యివ్వను. వారం రోజుల్లో జరిగిపోవాలి మన పెళ్ళి. గుడిలో దేవుడి ముందు దండలు మార్చుకుందాం. అంతే చాలు. కానీ ఓ నలుగురు స్నేహితులని పార్టీకి పిలుద్దాం.”

“అలాగే కానీ.... యింకా నాకు టైముకావాలి”.

‘వీల్లేదు. యిప్పటికే  ఆఫీసులో గుసగుసలాడుతున్నారు. వాళ్ల నోరు మాయించాలి. కనుక  మన పెళ్ళిరోజు నిశ్చయించాను శుక్రవారం  ఉదయం తొమ్మిది గంటలకి. నేనే అన్ని ఏర్పాట్లూ చేస్తాను సరే కదూ.”

‘మా వూరికి  వెళ్ళి మా అమ్మకి కాస్త చెప్పి రావద్దూ’

“ఒద్దు చెప్తే ఈ పెళ్ళి జరగనీయరు”

“మా అమ్మ చాలా మంచిది నా మాట మన్నిస్తుంది.”

“అయినా సరే. ముందు వెళ్ళవద్దు పెళ్ళికాగానే వెడదాం యిద్దరం”

శ్రీదేవి అతన్ని మరోమాట మాట్లాడనీయలేదు.

'సరే అలాగే' అని వెళ్ళి పోతుంటే మళ్లీ అడిగింది.

"తప్పకుండా వస్తారు కదూ! యీ పెళ్ళి నా భవిష్యత్ జీవితానికి ముఖ్యమైన మలుపు. గుర్తువుంచుకోండి."

'ఓ.కె' శివకృష్ణ వెళ్ళిపోయాడు.

శ్రీదేవి సంతోషంగా ఇల్లు చేరింది. తల్లికి చెప్పేసింది ఈ వార్త. ఆ ముసలి తల్లి కళ్ళలో కోటిదీపాలు వెలిగాయి.

"ఈ రోజుల్లో ఆడపిల్ల పెళ్ళి అంటే మాటలతో పని కాదమ్మా మూటలతో పని. ఆ మూటలు మన దగ్గర లేకపోగా నీ జీతం డబ్బుల్లో నేనూ బ్రతకవల్సి వస్తూంది. మీ నాన్న లేనందుకు ఆ కుర్రాడికి యింత మంచి మనసు ఆదేవుడు యిచ్చినందుకు ఆ దేవుడికి మరీ మరీ దణ్ణంపెట్టడం తప్ప నేనేం చేయగలనమ్మా."

శ్రీదేవికి తల్లిమాటలు విన్పించడం లేదు. పెళ్ళి కోసం ఒక వంద రూపాయలు మాత్రమే ఖర్చు చేయాలని ప్లాను చేసుకుంది. అదెలా చేయాలా అని ఆలోచించసాగింది.

## 4

శివకృష్ణకి బట్టలు తనకో పట్టుచీరా యిదివరకే కొని వుంచుకుంది. తన ఆఫీసులో వారిని అందరినీ స్వయంగా పెళ్ళికి పిలిచింది. కుటుంబరావు చాలా సంతోషించాడు. "తప్పక వస్తానమ్మా" అన్నాడు.

"శ్రీధర్‌గారూ, మీకు ఎన్ని పనులున్నా ఈ నా పెళ్ళికి తప్పక రావాలి. వస్తారు కదూ."

శుభలేఖలోకి చూస్తూ అన్నాడు 'తప్పక వస్తాను' .

ఊర్వశి శ్రీదేవి ముఖంలోకి అదోలా చూసింది. ఏదో చెప్పాలని చెప్పబోయి ఆగి ముఖాన నవ్వు పులుముకుంది. "నేనే వచ్చి నీకు పెళ్ళికూతురి అలంకరణ చేస్తాను" శ్రీదేవి. "థాంక్స్ ఔను ... భవానీదేవి ఆఫీసుకి రాలేదు ఎందుకూ?" అడిగింది. తెలియదంది ఊర్వశి.

ఇల్లు చేరింది. శ్రీధర్ మరోసారి కలుస్తానన్నాడు కానీ కలువలేదు. ఎందువల్ల రాలేదు. ఆం తనే వస్తాడు." అనుకుని తన ప్రయత్నం తను చేసుకోసాగింది.

పెళ్ళికూతురి అలంకరణలో శ్రీదేవి మరీ అందంగా కన్పిస్తోంది. కుటుంబరావు శ్రీధర్ వచ్చారు. వారికి ఊర్వశి కాఫీలు యిచ్చింది. పూలదండలు రెడీగా వున్నాయి.

శ్రీధర్ చేతిలో ఏదో ప్రజంటేషన్. శ్రీదేవి ముఖంలోకి చూడసాగాడు శ్రీధర్.

"శివకృష్ణ యింకా రాలేదేం శ్రీదేవి" కుటుంబరావు అడిగాడు.

"వస్తారు తప్పకుండా వస్తారు."

టైము దాటి పోతూవుంది శివకృష్ణ రాలేదు. పదిన్నర అయింది. అతను రాలేదు అతిధుల ముఖాల్లో ఆందోళన కన్పిస్తోంది. పదకొండు గంటలు అవుతూండగా ఆఫీసు జవాను వచ్చాడు. ఓ చిన్న ఉత్తరం శ్రీదేవి చేతిలో పెట్టాడు. ఆతురతగా విప్పింది ఉత్తరాన్ని.

"సారీ శ్రీదేవి.

నీకు మాట యిచ్చినట్లుగా నేను రాలేకపోయాను. అమ్మవచ్చింది. ఆమె కుదిర్చిన సంబంధం భవానీదేవి చెల్లెలి మెడలో మంగళసూత్రం కట్టేశాను. నన్ను అపార్థం చేసుకోకు.

శివకృష్ణ."

శ్రీదేవి కాళ్ళకింద భూమి కదిలిపోతున్నట్టే వుంది. తలగిర్రున తిరిగి పోయింది. మనసులో తుఫానుకి తట్టుకోలేక పోతూవుంది. కళ్ళు వర్షిస్తున్నాయి.

విషయం అక్కడున్న అందరికీ తెల్సిపోయింది.

"అయ్యో" అని జాలి చూపి వెళ్ళిపోయారు. శ్రీధర్ వెళ్లలేదు.

"శ్రీదేవిగారూ ఏ ఒక్కరికీ జీవితంలో అనుకున్నవి అనుకున్నట్టు జరగవు. దీనికి బాధ పడకూడదు. మీరు ధైర్యంగా వుండండి. ఇంటికి పదండి."

శ్రీదేవికి దుఃఖం ఆగలేదీ ఓదార్పుకు.

వెక్కి వెక్కి ఏడ్వసాగింది.

శ్రీధర్ ఆమె దగ్గరగా వచ్చాడు.

"మీరు... మీరు కాస్త సంబాళించుకోవాలి. ఓ స్నేహితుడిగా చెప్తున్నాను."

"శ్రీధర్‌గారూ యింత జరిగి ఈ పెళ్ళి ఆగితే ఈ జన్మకి మరి నా పెళ్లి కాదు"

"యెందుకు కాదూ తప్పక అవుతుంది. కొన్నాళ్ళు మీరు మనస్సుకి విశ్రాంతి యిస్తే"

"కాదు కాదు యే పురుషుడూ ముందుకురాడు నన్ను పెళ్ళాడేందుకు"

"యిప్పుడు యిందుకా మీరు బాధపడుతున్నారు."

'శివకృష్ణ చేసిన మోసానికి మరింక జీవితంలో పెళ్ళి కాదు. మీలా మగాడినైతే నాకీ బాధా దుఃఖం వుండేది కాదు. యింక ఒక్కటే దారి చావు ఒక్కటే దారి.

"ఛీ ఛీ మీలాంటి చదువుకున్న అమ్మాయిలు యిలామాట్లాడ కూడదు."

"స్త్రీ యెంత చదువుకున్నా ఉద్యోగం చేస్తున్నా పెళ్ళి విషయం వచ్చే సరికి పురుష అహంకారానికి బలి అయిపోతూనే వుంది. ఈ దేశంలో ఆడపిల్లగా పుట్టడం శాపం యిప్పుడేం చేయను శివకృష్ణ చెప్పిన తియ్యటి మాటలకి మోసపోయాను. యిప్పుడు శిక్ష అనుభవిస్తాను శ్రీధర్‌గారూ యిప్పుడేం చేయను. చూడండీ మీరు నాకో సహాయం చెయ్యగలరా!"

"చెప్పండి తప్పక చేస్తాను."

"ఆ రోడ్డు మీద ఎవరన్నా పోతుంటే ఆపి అడగండి యీ గుడిలో ఓ ఆడపిల్ల పెళ్ళి ఆగిపోయి విలపిస్తోంది. మీలో ఎవరన్నా జాలిపడి ఆ పిల్లని పెళ్ళాడతారా? అయితే రండి" అని చెప్పండి.

శ్రీధర్ చప్పున దగ్గరగా వచ్చి శ్రీదేవి చెయ్యి పట్టుకున్నాడు.

"మీరు జరిగిందానికి యింతలా కదిలిపోకూడదు"

"నీకు తెలియదు నాస్థితి వెళ్ళండి ఎవరన్నా దొరికితే తీసుకురండి తలవంచి మూడు ముళ్ళూ వేయించుకుంటాను."

"యిది పిచ్చి నిర్ణయం. శివకృష్ణ చేసిన పనికి మీరు మిమ్మల్ని యిలా శిక్షించుకోవటం అవివేకం" కోపంగా అన్నాడు.

"అవివేకం అని నాకు తెల్సు. కానీ మరోదారి లేదు వెళ్ళండి వెతుక్కురండి పెళ్ళికొడుకుని"

'యెవరన్నా  దొరికితే నే తీసుకువస్తాను మీరు తలవంచుతారుసరే.... ఆ తర్వాత హాయిగా బ్రతగ్గలరా"

"కానీ మరోదారి లేదు."

శ్రీధర్ తల అడ్డంగా వూపుతూ.

'ఈ విషయం వదిలెయ్యండి ముందు జరగవల్సిన విషయంలో  సరైన నిర్ణయం తీసుకోండి. జీవితంలో యిలాంటివి జరిగినప్పుడు ఆవేశం కాదు కావల్సింది ఆలోచన".

"నిజమే కానీ నాకేం ఆలోచన తోచటం లేదు."

"నేను చెప్తాను వినండి. గతానికి గడియ పెట్టండి. మనసుని సమాధాన పర్చుకోండి అప్పుడు నాదగ్గరకి రండి నేను మిమ్మల్ని పెళ్ళిచేసుకుంటాను."

"శ్రీధర్ గారూ" శ్రీదేవి నీళ్ళు నిండిన కళ్ళు యెత్తి శ్రీధర్ వైపు చూడసాగింది. ఆమె కళ్ళలో "నమ్మకం" కాదు ఆశ్చర్యం  కనిపిస్తోంది.

"నిజంగా చెపుతున్నాను. మనస్ఫూర్తిగా  చెపుతున్నాను."

"నా విషయం అంతా తెల్సిన మీరు ఈ నిర్ణయానికి యెలా రాగలిగారు. ఇది కలా నిజమా?

"కలకాదు. నిజం చెప్పాను కదూ గతానికి గడియపెట్టండి. ఇద్దరం కల్సి "వర్తమానం అనే వాకిలి తెరుద్దాం"

శ్రీదేవి చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు శ్రీధర్.

# స్వేదబిందువులు

**- పోల్కంపల్లి శాంతాదేవి**

**శి**వనారాయణ అద్దెకని కట్టించిన రెండుపోర్షన్లలోకి ఒకేసారి రెండు ఫామిలీలు దిగాయి. విశేషం ఏమిటంటే పెళ్ళయి ఇంకా నెల కూడా కాని నూతన దంపతులు వాళ్ళు.

దిగిన మరునాడే అవతలింటి శ్రీలక్ష్మికీ, ఇవతలింటి మంజులకి మాటలు కలిశాయి. స్నేహం చిగురించింది. వాళ్ల మగాళ్ళు ఆఫీసులకెళ్ళిపోగానే వీళ్ళిద్దరూ పెరట్లో బట్టలారేస్తూనో, అంట్లు కడుగుతూనో మాటల్లో పడేవాళ్ళు.

“అబ్బా! రోజూ ఈ అంట్లు  కడగడం, బట్టలుతకడం అంటే నాకు విసుగేస్తోంది. అర్జంట్‌గా పనిమనిషిని చూడమని చెప్పాను మా ఆయనకు” అంది పెళ్ళయినప్పటినుండి మంజులా ప్రసాద్ అని వ్రాసుకునే మంజుల.

“పనివాళ్ళు  చేస్తే నాకు నచ్చదు. వాళ్ళేదో హడావిడిగా పైపైన చేసిపోతారు. అంట్లు కడిగితే జిడ్డుపోదు, అంటుపోదు. మళ్ళీ కడుక్కుంటేగాని శుభ్రమనిపించదు నాకు. బట్టలైనా నేను వుతుక్కుంటేనే హాయిగా కట్టుకోగలను. అయినా మన పని మనం చేసుకోవడంలో అదో తృప్తి. డబ్బులూ మిగులుతాయి. పని శుభ్రంగా వుంటుంది. ఇంటిపని నాకు విసుగనిపించదు” ఇంకా భర్తపేరు తన పేరుతో కలుపుకోని శ్రీలక్ష్మి  అంది.

“నాకైతే పనంటే బోర్. మా ఆయనకు మంచి జాబే వుంది. జీతం బాగానే వస్తుంది. పనిమనుషులు చేసే పనులూ కూడా చేసి ఆయనకి డబ్బులు మిగిల్చి ఏం చేయాలి? ఇరవై అయిదేళ్ళు వచ్చేవరకు పుట్టింట్లో ఎలాగూ కష్టాలు పడ్డాను. ఇంట్లో చాకిరీ సరే. బి.కాం. చదివాను కదా ఇంట్లో ఏం తోస్తుందని కాన్వెంట్‌లో టీచర్‌గా చేసేదాన్ని. ముచ్చటగా ఓ చీర కొందామన్నా వీలయ్యేది కాదు. మధ్యతరగతి కుటుంబం కావడం వల్ల ఎప్పుడూ ఏవో అవసరాలు వచ్చి నా జీతాన్ని దిగమింగేవి.

ఎప్పుడూ ఏ కోరికా తీరేది కాదు. నేనప్పుడే డిసైడ్ చేసుకున్నాను మంచి ఉద్యోగం చేసే వాడికిచ్చి చేస్తే తప్ప పెళ్ళి చేసుకోకూడదని! పెళ్ళయ్యాక రాణీలా సుఖపడాలని! మంచి ఉద్యోగస్తుడు కావాలన్న నా కోరిక తీర్చడం కోసం మాకున్న ఒక్కగానొక్క ఇల్లు అమ్మాల్సి వచ్చింది. నా పెళ్ళి చేసి మా వాళ్లు అద్దె ఇంట్లోకి మారారు."

"నీ తరువాత ఇంకా ముగ్గురు ఆడపిల్లలున్నారన్నావు. వాళ్ళ పెళ్ళిళ్ళు?"

"అది ఆలోచించాల్సింది నేను కాదు. తమ స్థోమతేమిటో గుర్తించకుండా వరుసగా నలుగురాడపిల్లలకి జన్మనిచ్చారే వాళ్ళు."

"మరీ ఇంత నిర్దాక్షిణ్యంగా ఆలోచించే ఆడపిల్లలు కూడా వుంటారని నాకు తెలియదు. నేనూ, మా తల్లిదండ్రులకు నలుగురు సంతానంలో పెద్దదాన్ని. బిఎస్సీ అయ్యాక అన్నామలై యూనివర్శిటీ నుండి ప్రైవేట్‌గా బి.ఇడి. కూడా చేశాను, టెంత్ పాసైనప్పటినుండి చిన్నపిల్లలకి ట్యూషన్స్ చెప్పేదాన్ని. డిగ్రీ పాసయ్యాక కాన్వెంట్‌లో టీచరుగా వేశాను. ఇంటిదగ్గర ట్యూషన్స్ కూడా చెప్పేదాన్ని. అంతా కలిపితే నెలకి వెయ్యి రూపాయల దాకా వచ్చేది. అంతా నాన్నచేతికి ఇచ్చేదాన్ని. శ్రీరాముడికి ఉడుత సాయంలా నాన్నకి ఆర్థికంగా నేనామాత్రం సాయపడుతున్నానని ఓ విధమైన తృప్తితో ఫీలయ్యేదాన్ని. నా కోసం శక్తికిమించిన సంబంధాలు చూస్తుంటే నేనే వారించాను. నా పెళ్ళికోసం తిండికి గింజలొచ్చే ఆ చారెడు పొలం అమ్మొద్దని చెప్పాను. నన్ను పోషించగల మామూలు ఉద్యోగస్తుడైతే చాలునన్నాను. నా పెళ్ళికోసం మా వాళ్ళని కష్టపెట్టలేదన్న తృప్తి నాకుంది."

"అంత త్యాగం అనవసరమంటాను. కన్నందుకు మనల్ని మంచిచోట ఇవ్వాల్సిన బాధ్యత వాళ్లకి లేదా ఏం? పెళ్ళయ్యి ఒకసారి పుట్టింటి గడపదాటాక ఇక దేనికీ దేబిరించక్కర్లేకుండా వుండాలని నా పాలసీ?

'అత్తింట అష్టభోగాలున్నా పుట్టింటి మీద ఏడ్చేవాళ్ళెంత మంది లేరు?"

"నేను మాత్రం వాళ్ళలో చేరను."

"ఉదయమనగా వెళ్ళి ఇప్పుడొస్తున్నావు! ఎక్కడికెళ్ళావేమిటి?" ఉదయం తొమ్మిదింటికి వెళ్ళి సాయంత్రం నాలుగింటికొచ్చిన శ్రీలక్ష్మి నడిగింది మంజుల.

"లిటిల్‌ఫ్లవర్ స్కూల్లో టీచర్‌గా జాయినయ్యాను ఈ రోజు. మాథ్స్ టీచర్ పోస్ట్ ఖాళీగా వుందట మా స్కూల్లో. అనుభవమున్న వాళ్ళయితే సాలరీ ఎనిమిదివందల దాకా ఇస్తారంట చేస్తావా?"

"పెళ్ళికాకముందు ఎలా చేశానో గాని ఉదయం నుండి సాయంత్రం దాకా నోరు నొప్పిపుట్టేలా అరిచి అరిచి చచ్చే టీచరు పని మాత్రం ఇప్పుడు చేయలేను. అయినా నేను జాబ్ చేయాల్సిన అవసరం ఏమిటిప్పుడు? మా ఆయనకి జీతం బాగానే వస్తుంది. త్వరలో ప్రమోషన్ కూడా వచ్చి జీతం పెరుగుతుందట. మేం హాయిగా బతకటానికి ఆ జీతం చాలు."

"మీ ఆయనకి ఎంత జీతం వచ్చినా నీదవుతుందా ఏమిటి?" శ్రీలక్ష్మి ఎగతాళిగా అంది.

"ఆయనే నావాడయ్యాక ఆయన జీతం నాది కాకపోవడం ఏమిటి?" ఆశ్చర్యంగా అడిగింది మంజుల.

"ఆయన నీవాడేమోగాని ఆయన జీతం మాత్రం నీది కాదు. ప్రతి ఆడపిల్లకీ పెళ్ళైనా కాకపోయినా తనకంటూ కొంత సంపాదనుండాలి. అది జాబ్‌వల్ల కావచ్చు. ఏదైనా కుటీర పరిశ్రమల వల్ల కావచ్చు. తన అవసరాలను, తన సంపాదనతో తీర్చుకోవడంలోనే మన ఆత్మగౌరవం నిలుస్తుందని నా ఉద్దేశం. పావలాపువ్వులకోసం, పదిరూపాయల జాకెట్‌గుడ్డకోసం భర్తమీద ఆధారపడడం ఏ ఆడదానికీ ఆత్మగౌరవం కాదు."

"భర్త అంటే పరాయివాడా? ఇందులో ఆత్మగౌరవం ప్రసక్తి ఏముంది?"

"భర్త నీవాడే అయినా అతడి సంపాదన నీ ఇష్టప్రకారం ఖర్చుపెట్టుకోడానికి ఒప్పుకోడు. తన ఇష్టప్రకారమే ఖర్చు పెడతాడు. అదే నువ్వు సంపాదించుకుంటున్నా వనుకో! ఖర్చుపెట్టడంలో నీకు స్వేచ్ఛ ఉంటుంది."

"కొందరు భర్తలు తమభార్యల జీతం డబ్బులు కూడా తామే లాగేసుకుని పావలా పువ్వులకోసం, పదిరూపాయల జాకెట్‌గుడ్డకోసం తమని దేబిరించేట్టు చేస్తున్నారంటే అతిశయోక్తి కాదని నువ్వొప్పుకుంటే ఆడదాని సంపాదనకు అర్థమేమిటి?"

"ఎక్కడో పదిశాతం కేసులు అలా వుంటాయేగాని చాలామంది ఆడవాళ్ళు తమ సంపాదనను తమ ఇష్టంవచ్చినట్లుగా ఖర్చుపెట్టుకోగలుగుతున్నారు. పెళ్ళికాక ముందు తండ్రులకు, పెళ్ళాయ్యాక భర్తలకు ఆర్థికంగా చేదోడు వాదోడుగా వుండగలుగుతున్నారు. సంసారం చేసుకునే గృహిణి కంటే సంపాదించే స్త్రీ సమాజంలో ఎక్కువ గౌరవాభిమానాలు పొందగలుగుతోంది. ముఖ్యంగా ఆత్మగౌరవంతో బతకగలుగుతోంది."

"ఏమిటో ఇదంతా కోరి తెచ్చుకుంటున్న కష్టాలనిపిస్తుంది. ఉద్యోగం పేరుతో బయట చాకిరీ, గృహిణిగా ఇంట్లో చాకిరీ మరీ అంత సుఖం లేని బతుకు దేనికి?"

"మంచు బిందువులో సౌందర్యాన్ని చూడగలిగినట్టే స్వేదబిందువులోనూ సౌందర్యాన్ని చూడగలిగితే సుఖమన్నదానికి అర్థం నీకు తెలుస్తుంది"

"మంజూ మొన్న వెయ్యిరూపాయలు బీరువాలో వున్న లక్ష్మీ డబ్బాలో పెట్టాను. ఇప్పుడు చూస్తే ఆరువందలే ఉన్నాయి. మిగతా నాలుగు వందలు నువ్వు తీశావా?" ప్రసాద్ అడిగాడు.

"తీశాను!"

"ఏం చేశావు అంత డబ్బు?"

"ఎంత డబ్బండీ నాలుగు వందలేగా? మొన్న షాపింగ్‌చేసి పూసల అర్చీ, ఫ్లవర్‌వేజ్, టేబిల్‌క్లాత్, కర్టెన్లూ తేలేదూ? బాగున్నాయని మెచ్చుకున్నారే?"

తలపట్టుకున్నాడు ప్రసాద్. "ఆ డబ్బు నీ పాకెట్‌మనీలోంచి ఖర్చు చేశావేమో అనుకున్నాను."

"నాకు పాకెట్‌మనీ ఎక్కడిదీ? ఎవరిస్తారు?" ఆశ్చర్యంగా అడిగింది.

"వచ్చేప్పుడు మీ వాళ్ళిచ్చారేమో. అందుకే అంత లగ్జరీగా ఖర్చుపెట్టి ఇంటి డెకరేషన్‌కని తెచ్చావేమో అనుకున్నాను."

"నాకు పాకెట్‌మనీ ఇచ్చి పంపేంత శ్రీమంతులేం కాదు మావాళ్ళు. నా పెళ్ళి చేసి పంపేసరికి వాళ్ల తలప్రాణం తోకకొచ్చింది" విసురుగా అంది మంజుల.

"నేనూ అంత శ్రీమంతుడినేం కాదు మంజూ! కటింగ్స్ పోను నా చేతికి వచ్చే మూడువేల జీతంలో వెయ్యిరూపాయలు నాన్నకి పంపాలి. ఊరిదగ్గర చెల్లి పెళ్ళికని చేసిన అప్పుంది... అందుకని, మిగిలిన రెండువేలల్లోనే మన సంసారం నడవాలి. ఎంత గుట్టు నేర్చుకుంటే అంత అందం. ఈ నెల ఖర్చులకని పెట్టిన వెయ్యిరూపాయల్లో ఫస్ట్‌వీక్ పోకముందే నాలుగువందలు హుష్‌కాకీ చేశావు. ఆరువందలతో ఈ నెల గడవాలి. చాలకపోతే ఎవరిదగ్గరైనా అప్పుచేద్దాం అనే రకం కాదు నేను. అప్పు చెయ్యడమంటే పరమ చిరాకు నాకు."

కన్నీళ్ళ పర్యంతమైంది మంజులకు. ఫ్లవర్‌వాజ్ తీసి నేలకేసి కొట్టి, గుమ్మానికి కట్టిన పూసల ఆర్చీ పీకేసి కర్టెన్లు చింపి పోగులు పెట్టాలనిపించింది కాని తమాయించుకుంది.

"మొన్న శ్రీలక్ష్మివాళ్ళ స్కూల్‌కి ఇంపోర్టెడ్ శారీస్ అమ్మే ఆమె వచ్చిందట. శ్రీలక్ష్మి ఈ శారీ కొందట. మూడొందల రూపాయలు. రెండు ఇన్‌స్టాల్‌మెంట్స్‌గా కట్టాలట. శారీ బాగుంది కదా! నేను చెబితే ఇలాంటిదే మరొకటుంది తెచ్చి పెడతానంది శ్రీలక్ష్మి!" చీర విప్పి భుజం మీద వేసుకుని చూపుతూ అంది మంజుల.

"పెళ్ళి చీరలు బీరువానిండా వున్నాయి. రోజుకో చీర కట్టినా కట్టిన చీర కట్టకుండా ఏడాది వరకూ కట్టొచ్చు. అన్ని చీరలుండగా ఇప్పుడీ ఇంపోర్టెడ్ చీర తక్కువబడిందా?"

"చీర చాలా బాగుంది అదీ గాక నా దగ్గర ఇంపోర్టెడ్ ఒక్కటి కూడా లేదు."

"మీ ఆడవాళ్ళకి బాగుండని చీరలు కూడా వుంటాయా?"

"మొన్న మూడువేలదాకా ఎరియర్స్ వచ్చాయన్నారు కదా? పెళ్ళయ్యాక పెళ్ళాం మొదటిసారి ముచ్చటపడి కోరిన కోరిక! తీర్చకపోతే నా మీద మీకున్న ప్రేమనే శంకించాల్సి వస్తుంది?"

"మగడి ప్రేమను అతడు తెచ్చే చీరల్లోనూ నగల్లోనూచూడడం చాలా దారుణం మంజూ! అది సంస్కారంలేని ఆడవాళ్ళు చేసేపని."

చివుక్కుమన్నట్లుగా అయింది మంజూకు. ముఖం ఎర్రబడింది. "మరి ఎందులో చూడాలి ఆ ప్రేమ?" చురుగ్గా అడిగింది.

"ఇందులో!" అతడి బిగికౌగిలింతలో ఊపిరాడనట్లుగా అయింది ఆమెకు.

ఆ సాయంత్రమే శ్రీలక్ష్మిని అడిగింది మంజుల. "మీ స్కూల్లో మాథ్స్ టీచర్ పోస్ట్ ఖాళీగా వుందన్నావు అది ఫిలప్ అయ్యిందా?" అని.

**– వనితాజ్యోతి మాసపత్రిక, సెప్టెంబర్ 1998**

# ఉరి

**– పరిమళా సోమేశ్వర్**

"గణ గణమంటూ  చర్చి బెల్లు పన్నెండు గంటలు కొట్టింది.

ఆ ధ్వని తరంగాలు చీకటిని చీల్చుకుని చెట్లు మీదుగా, యిళ్ళ కప్పులమీదుగా ప్రయాణం చేస్తూ రంగయ్య గుడిసెలోకి కూడా అతని చెవులగుండా పోయి గుండె 'ఝల్లు' మనేట్లు  చేసినయ్.

ఆ గగుర్పాటుకు అతని రోమాలన్నీ నిక్కబొడుచుకున్నయ్. అతని కాళ్ళూ చేతులూ  చల్లగా అయినట్లనిపించింది.

గుడిసె మధ్య వెలుగుతున్న కిరసనాయిలు బుడ్డి వెదజల్లే గుడ్డి వెలుతురులో అతని కళ్ళు నిప్పుకణికల్లా మెరుస్తున్నయ్.

అతని పెదవులు ఎన్ని నెలలుగానో నీటి చుక్క నెరగక పగిలి బీటలు వారిన నల్లనిరేగడి నేలలోని మట్టిగెడ్డల్లా ఉన్నయ్.

అసలే వికృతంగా, మోటుగా వున్న అతని ముఖం భయంతో, అనేకరకాల సందేహాలతో, ఆవేదనతో భయంకరంగా తయారయింది.

కిరసనాయిలు బుడ్డీనుండి వొచ్చే మసక వెలుతురు తాలూకు నీడలు అతని ముఖంమీద అటూ యిటూ ఊగుతూ అతని ముఖానికి ఒక వింత ఆకృతిని, దానిమీద గల భావముద్రకూ ఒక విలక్షణమైన అర్థాన్ని యిస్తున్నయ్.

గుడిసెలో ఒక మూల ఎండిన గోగిపుల్లలా వున్న అతని భార్య రత్తి కాళ్ళు ముడుచుకుని పడుకుంది. అమాయకంగా అలసట తీరేలా నిద్రపోతున్న రత్తి ముఖం చూస్తుంటే రంగయ్య గుండె ద్రవించిపోతోంది.

రోజూ తను కూడా అంత నిశ్చలంగా ఆదమరచి నిద్రపోయేవాడు. కాని సాయంత్రం జైలు వార్డెను చెప్పిన సంగతి విన్న దగ్గరినుండి తనకి నిద్రాహారాలు మీదనే విరక్తి కలిగింది. "తెల్లవారుఝామున నాలుగు గంటలకల్లా పని పూర్తి చేసేయ్యాలి.  ఓ గంట ముందుగానే అక్కడ సిద్ధంగా ఉండాలి" అది వార్డెను ఆజ్ఞ!

ఆ ఆజ్ఞ పిడుగులా అతని గుండెను తాకింది. ఆమాట విన్న దగ్గరనుండి రంగయ్య మనసు మనసులో లేదు. రంగయ్య సెంట్రల్ జైలులో 'హాంగ్‌మన్' గా పనిచేస్తున్నాడు. అతని ఉద్యోగంలో చేరి పట్టుమని రెండేళ్ళు కూడా కాలేదు. అంతకుముందు రాళ్లు మొయ్యటం, ఇళ్లు కట్టేటప్పుడు యిటుకలు సిమెంటు అందించడం పెద్ద పెద్ద భవనాలకు సున్నం వేయటం మొదలయిన పనులు చేస్తుండేవాడు రంగయ్య. రత్తి అక్కడా యిక్కడా పాచి పని చేస్తూండేది.

కాని రత్తి రోగిష్టిదవటం వల్ల ఏ యింట్లోనూ వరసగా నెలరోజులపాటు నిలకడగా పని చెయ్యగలిగేది కాదు చీటికీ మాటికీ నాగాలు పెట్టే రత్తిని ఏ గృహిణీ పనిలోకి పెట్టుకుంటానికి ఒప్పుకునేది కాదు. ఇటు రంగయ్యకు కూడా రోజూ తప్పకుండా పని దొరుకుతుందన్న గ్యారంటీలేదు. అందుకే నెలలో కనీసం పదిరోజులన్నా పస్తులుండేవారు ఆ దంపతులు.

అలాటి సమయంలోనే సెంట్రలు జైలులో హాంగ్‌మన్ ఉద్యోగానికి ఖాళీ ఉందని తెలిసి దరఖాస్తు పట్టుకున్నాడు రంగయ్య.

తీరా ఉద్యోగం దొరికిన తరువాత తను చెయ్యవలసిన పనేమిటో తెలుసుకుని గజగజ వణికిపోయేడు రంగయ్య. "ఖూనీలు చేసిన నేరస్తులను ఉరితీయడమే నీ పని" అని జైలు అధికారులు చెప్పినప్పుడు కళ్లు తిరిగి పడిపోయినంత పనయింది.

"పస్తులన్నా ఉంటాను కానీ, యిలాంటి పాపపు పనులు మాత్రం చెయ్యను" అనుకున్నాడు.

కాని ఆ జైలులో పనిచేసే చప్రాసీలు అతనికి అభయమిచ్చేరు. "పేరుకు మాత్రమే నీకీ డ్యూటీ నిజంగా ఉరి తీయవలసిన అవసరం నీకు ఎన్నడూ రాదు. ఈ రోజుల్లో చాలావరకు ఆజన్మాంతర ఖైదును విధిస్తున్నారే గాని ఎంతటి నేరస్థుడయినా ఉరిశిక్ష అనేది పడటం లేదు" అంటూ ధైర్యం చెప్పేరు.

ఆ మాటలు విన్నాక యింక కాళ్ళదగ్గరకొచ్చిన ఉద్యోగాన్ని కాదనలేకపోయాడు రంగయ్య. నెలకింత ఖంగుమంటూ జీతంరాళ్ళు జేబుల్లో పడేసే సర్కారు ఉద్యోగాన్ని ఎంత తెలివితక్కువవాడు మాత్రం వదులుకుంటాడు? పైగా తనకీ ఉద్యోగం దొరికిందంటే రత్తి మూలుగుతూ ముక్కుతూ ఆ యింటా ఈ యింటా పాచిపని

చెయ్యనక్కరలేదు. తను ప్రతిరోజూ సూర్యోదయమవగానే ఏం పనిదొరుకుతుందా అని నోరు తెరుచుకుని వేచి ఉండనక్కరలేదు. తన నెల జీతంతో తమ యిద్దరి కడుపులు నిండుతయ్. రత్తికి మందూ మాకూ యిప్పించి యింటిదగ్గరే విశ్రాంతిగా ఉండేటట్లు చూడవచ్చు. ఆ ఆశతోనే ఈ ఉద్యోగంలో చేరేడు రంగయ్య. మొదటి నెలజీతం అందుకున్న రోజున తను చేసిన పనిలో పొరపాటేమీ లేదన్న విశ్వాసం ధృవపడింది అతనిలో.

రెండేళ్ళు ఏ చీకూ చింతా లేకుండా కొద్దిపాటి ఒడిదుడుకులతో సాగిపోయింది రంగయ్య జీవితం. నెలరోజుల క్రితం ఆ జైల్లోకి ఖైదీగా సత్యం వచ్చిన రోజునుండీ రంగయ్య మనసు రెపరెపలాడ సాగింది.

అతనికి ఉరిశిక్ష విధించేరట!

అయితే అతను మామూలు ఖైదీకాదు. చాలా ఖరీదైన ఖైదీ. ప్రభుత్వం మూడుసంవత్సరాల నుండి అతనిని గాలిస్తున్నదనీ, అతనిని సజీవంగా పోలీసులకు అప్పుజెప్పిన వారికి లక్షరూపాయల బహుమతిని కూడా ప్రకటించిందనీ విని రంగయ్య ఆశ్చర్యపోయాడు. ప్రభుత్వ ప్రకటన విన్న వారికెవరికైనా ఆ నేరస్థుడు ఎంత ప్రమాదకరమైన వ్యక్తో అతని రూపురేఖలు ఎంత భయంకరంగా ఉంటాయోనన్న ఆలోచన రాకపోదు. కాని అలాటి ఆలోచనలకు విరుద్ధంగా ఎంతో నిర్మలంగా ప్రకాశవంతంగా ఉన్న చిరునగవు ముఖంతో వెలిగిపోయే ఆ పాతికేళ్ళ యువకుడిని చూసి రంగయ్యే కాదు. జైలు అధికారులే ఆశ్చర్యపోయేరు.

"అతను పదిమందిని హత్య చేశాట్ట!" అన్న వార్త విని రంగయ్య మరింత ఆశ్చర్యపోయేడు.,

"అబద్ధం నేన్నమ్మను" అన్నాడు అప్రయత్నంగా.

"అబద్ధమా? ఏది అబద్ధం? అతను పదిమందిని హత్య చేయటమా? లేకపోతే లక్షరూపాయలు ఊరికే ప్రకటించేరా యితనికోసం? ఏం పనిలేక ఈ కుర్రాణ్ణి జైల్లో పెట్టేరనుకున్నావా?" అన్నారొకరు.

రంగయ్యకు ఏం సమాధానం చెప్పాలో తెలియలేదు.

కాని అంతటి చురుకైన కళ్ళు. ఇంత కాంతివంతమైన ముఖం గల యీ కుర్రవాడు హత్య చేసేడంటే ఎలా నమ్మడం?

అటూ యిటూ చూసి అతను మెల్లగా చెప్పేడు రంగయ్య చెవిలో "ఈ కుర్రాడి చేతిలో చచ్చిపోయిన వాళ్ళందరూ డబ్బున్న మారాజులేనట" అని.

"డబ్బున్న మారాజులా? వాళ్ళను చంపటం అంత తేలికయిన పనేనా?" గుండెమీద చెయ్యి వేసుకున్నాడు రంగయ్య.

"కాదు కాబట్టే యీ కుర్రాడిని అందరూ "గుండెలు తీసిన బంటు" అంటున్నారు.

"పాపం వాళ్ళు యీ అబ్బాయికి ఏమి అన్యాయం చేసేరో యేమో!"

"ఇతనికి వాళ్ళేమీ అన్యాయం చెయ్యనూలేదు. వాళ్ళ ముఖాలితనికి తెలిసిందీ లేదు. ఈతని పేరు వాళ్ళకు తెలియదు. వాళ్ళ సంగతి యీయనకు తెలియదు. అయినా చంపేశాట్ట!"

"ఎందుకో!"

"అదంతా ఓ పెద్ద కథలే! ఈ కుర్రాడికి ఓ పెద్ద గాంగు ఉందట. వాళ్ళపని పగలల్లా నరమానవుడి కంట బడకుండా బ్రతకటం' రాత్రయేసరికి రోజుకో ఊరిమీద పడి ఊరి పెత్తందార్లందరినీ సఫా చెయ్యటమూనట. గమ్మత్తేమిటంటే వీళ్లు డబ్బున్న వాళ్లనే చంపుతారే తప్ప పేదోళ్ళ జోలికి చచ్చినా పోరట."

ఆ విషయాలు విన్న పది పదిహేను రోజులదాకా రంగయ్యకి మనసు మనసులో లేదు.

సత్యం ముఖం చూసి, అతను హంతకుడన్న విషయం విన్నాక ఎంత ఆశ్చర్యపోయేడో అతను చేసిన హత్యల ఉదంతం విన్నాక అంతకు రెట్టింపుగా ఆశ్చర్యపోయేడు.

"అతను పేదోళ్ళ జోలికి చచ్చినా పోడట!"

పేదోళ్ళను చూసి జాలిపడే దెవ్వరీ రోజుల్లో? పేదోళ్ళను చూస్తే పెద్దవాళ్లందరికీ అసహ్యం, కోపం, పేదరికం మహా పాపమైనట్లు, ఆ పేదరికాన్ని అనుభవించే ప్రజలంతా పాపాత్ములైనట్లూ భావించి గొప్పింటి వాళ్లంతా వారికి దూరంగా వుంటారు. కుక్కలు, పిల్లులు, నల్లులు, బల్లులు మొదలైన జంతుజాలం వలె పేదవాళ్లని కూడా

ప్రాణికోటి లోని ఒకభాగంగా భావిస్తారే తప్ప వాళ్ళూ తమలాంటి మనుషులేనన్న సమదృష్టితో గౌరవభావంతో ఎవరూ చూడరు. అవసరమైనప్పుడు గుర్రాన్ని బండి తోలటానికి, ఎడ్లను పొలం దున్నటానికి, కుక్కలను యింటికి కాపలా వుంచటానికి, పిల్లుల్ని ఎలుకల్ని చంపటం కోసం పెంచుకున్నట్లు పేదవాళ్ళను కూడా రిక్షాలు లాగడానికి, ఇళ్ళు కట్టించుకోవడానికి, పాయఖానాలు కడగటానికి, చెప్పులు కుట్టించుకోవటానికి, శవాన్ని తగలబెట్టడానికి యిలా రకరకాలుగా ఉపయోగించు కుంటారు డబ్బున్న మారాజులు.

అలా తమ పనులకోసం తోటి మనుషులను ఉపయోగించుకునే గొప్పవాళ్లకు వీళ్లమీద దయాదాక్షిణ్యాలు వుండవు సరికదా పైగా కోపం వచ్చినప్పుడు, సక్రమంగా పనిచేయించుకోదలచుకున్నప్పుడు జంతువులను అదలించినట్లు వీళ్ళను అదిలించడం, తిట్టటం, కొట్టటం, ఇంకా తిక్క రేగితే చంపెయ్యటం కూడా కద్దు.

అదంతా చూసి చూసి డబ్బున్న వాళ్ళు పేదవాళ్ళని ద్వేషించటం వాళ్ళ సహజలక్షణం అన్న అభిప్రాయాన్ని చిన్నతనంలోనే యేర్పరచుకున్నాడు రంగయ్య. అందుకే భాగ్యవంతుల చేతుల్లో నానారకాలుగా హింసింపబడే తనలాటి పేదవాళ్ళు అతని కంటికి వింతగా కనబడేవాళ్ళు కాదు. అంతేకాదు. పట్టపగలు పదిమందీ చూస్తుండగా నడిరోడ్డుమీద హత్యచేసిన భాగ్యవంతులెంతమందో జైలు గడప తొక్కకుండా, కోర్టు ఛాయలకు పోకుండా, నిశ్చింతగా, కులాసాగా బ్రతకటం తను కళ్ళారా చూసేడు.

కాని పాపం యీ కుర్రవాడు గొప్పవాళ్లను చంపినందుకు జైల్లో పడ్డాడు. రేపో మాపో ఉరితీయబడతాడు కూడాను. అందుకే అన్నారు. భాగ్యవంతుల ప్రాణాలతో ఆడటం, నిప్పుతో చెలగాటం లాటిదేనని.

రంగయ్య వీలుచిక్కినప్పుడల్లా సత్యంతో మాటలు కలపడానికి ప్రయత్నించేవాడు. సాధారణంగా సత్యం ఎవరితోనూ మాట్లాడేవాడు కాదు. ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూ అటూ యిటూ పచార్లు చేస్తుండేవాడు. కాని అతను మాట్లాడటం మొదలెట్టాడంలే ఆ వాగ్ధాటికి అడ్డు వుండేది కాదు. ఆవేశంగా అతను మాట్లాడుతుంటే ఉజ్జ్వలంగా ప్రకాశించే అతని కళ్ళవంక రెప్పవాల్చకుండా చూసేవాడు రంగయ్య.

"మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చి పాతికసంవత్సరాలుదాటుతున్నయ్. కాని బానిసత్వం నుండి బయటపడినందుకు మనకు దక్కిన ఫలితాలేమిటి? ధనవంతులు మరీ ధనవంతులవుతున్నారు. పేదవాళ్ళ స్థితి మరింత దిగజారి పోతోంది. లక్షాధికారులు కోట్లు గడించడానికి ఒక పూట అన్నంతినేవాడు పస్తులుండడానికి తప్ప స్వాతంత్ర్యం వల్ల ఒరిగిందేమీ కనబడటం లేదు. దేశంలో యింతటి అవినీతి, దారిద్ర్యం ఓ పక్కన సిరిసంపదలు, విలాసాలు మరో పక్కన పెచ్చుపెరిగిపోతూ వుండగా దేశంలో ఆహారధాన్యాల కొరత ఎలా ఏర్పడుతోంది? దేశం పారిశ్రామికంగా యింతటి అభివృద్ధిని పొందుతున్నా, విద్యా వైజ్ఞానికరంగాలలో ఎంత ముందడుగు వేసినా దేశంలో నిరుద్యోగ సమస్య ఇంతటి తీవ్రరూపం దాల్చటానికి కారకులెవ్వరు? ఈ అనర్థాలన్నిటికీ కారణం ఒక్కటే? దేశ సంపద నంతటినీ కొద్దిమంది స్వార్థపరులు గుప్పెట్లో పెట్టుకుని మిగిలిన కోట్లాది ప్రజలను నానాగడ్డీ కరిపిస్తున్నారు. ధరలు పెరిగినా, నిరుద్యోగ సమస్య రోజుకు పదింతలయినా, ఆకలి చావులు వందలనుండి వేల సంఖ్యలోకిమారినా యీ కొద్దిమంది మారాజులకు చీమ కుట్టినట్లన్నా ఉండదు. పైగా ప్రజలను పీడించటానికి, దోచుకోవటానికి వీరికి మరింత అనువుగా ఉంటుంది. అందుకే పరిస్థితులు ఎంతగా విషమిస్తే వారికి అంత లాభదాయకం. ఇలాంటి చీడపురుగులను నాశనం చేస్తే కాని దేశం బాగుపడదు. పుస్తకంలోని ఒక పేజీకి చెదలు పట్టినవంటే ఆ పేజీని చింపి మిగతా పేజీలకు పాకకుండా చూడాలి. అలాగే ఒక చిన్నభాగం యిలా అవినీతితో, స్వార్థపరత్వంతో కుళ్ళిపోతుంటే మిగతా సమాజం యొక్క శ్రేయస్సు దృష్ట్యా ఆ కొద్ది భాగాన్ని నిర్మూలించక తప్పదు" అనేవాడు సత్యం.

అలా వ్యక్తుల్ని చంపడం వల్లనే కోరుకున్న నవసమాజ స్థాపన జరగగలదని అతనికి తట్టకపోవడం చిత్రం. చెదపట్టిన కాగితాన్ని చింపేస్తే దక్కొచ్చు. వ్యక్తుల్ని ఏరిపారేసినంత మాత్రాన సామాజిక విప్లవం జరుగుద్దా?

సత్యం మాటల్లోని నిజాయితీని మెచ్చుకున్నా అతని మాటలు వింటుంటే రంగయ్య కెందుకో విచారంగా ఉండేది. రంగయ్య అక్షరజ్ఞానం లేనివాడేం కాదు. కాస్తో కూస్తో చదువనూ, రాయనూ వచ్చు. పైగా తన చుట్టూ వున్న సమాజాన్ని, పరిస్థితులను అర్థం చేసుకోగల తెలివితేటలు, ఊహా కొంతవరకు అతనిలో లేకపోలేదు.

"భాగ్యవంతులు పేదోళ్లని ప్రేమించటం లేదని యిన్నాళ్ళూ మొత్తుకున్నాం. ఇప్పుడు పేదవాళ్లు కూడా ధనవంతులను ద్వేషించటం మొదలుపెట్టడం వల్ల సమస్యలు తీరిపోతాయా?" అన్నాడు రంగయ్య దిగులుగా.

"సమాజంలో హెచ్చుతగ్గులున్నంతకాలం యీవర్గద్వేషం, రక్తపాతం తప్పవు. అందుకే వర్గరహితమైన సమాజాన్ని నెలకొల్పటానికి మేమంతా ప్రయత్నం చేసేం. అవసరమైతే రక్తాన్ని బలిగొనటానికి రక్తాన్ని త్యాగం చెయ్యటానికి కూడా సిద్ధపడ్డాం" అన్నాడు సత్యం.

రంగయ్యకి అతని మాటలు సగం అర్థమయేవి. సగం అర్థమయ్యేవి కావు. అతనికి బాగా తెలిసిందల్లా ఒక్కటే విషయం. అదేమిటంటే "యీ సత్యం హత్యలు చేసి ఉండవచ్చు. కాని యేం చేసినా యితను స్వార్థం కోసం స్వప్రయోజనం కోసం చెయ్యలేదు" సమాజం కోసం చేసేడు. దేశం కోసం చేసేడు అందుచేత అతనింతటి కఠినశిక్షకు అర్హుడు కాడు. అతను చేసింది తప్పే కావచ్చు. కాని అతని ఆశయాలలో కల్మషం లేదు. అలాటివాడికి ఉరిశిక్ష ఎందుకు వెయ్యాలి? ఎయిర్ కండిషన్డు రూములలో యూఫోము బెడ్ల మీద పడుకుని తమ స్వార్థం కోసం కాలు కదల్పకుండా కనుసైగతోనే ఎన్నో మారణహోమాలను, హింసాకాండలను జరిపించే అహింసా వాదులకంటే సత్యం ఎన్నోరెట్లు మెరుగు అనుకునేవాడు రంగయ్య.

సత్యం జైలుకి వచ్చిన దగ్గరనుండి ఎంతో మంది అతనిని చూట్టానికి వచ్చేవారు. ఆ వచ్చిన వాళ్ళలో తెలుగు మాట్లాడే వాళ్లు కొందరు. హిందీ మాట్లాడేవాళ్లు కొందరు. ఇంగ్లీషు మాట్లాడేవాళ్లు కొందరు.

ఏ భాషలోనయినా అనర్గళంగా, అనాయాసంగా మాటలాడే సత్యంని చూసి చకితుడయ్యేవాడు రంగయ్య.

వాళ్లందరూ సత్యంతో ఏదో వాదించేవారు. నచ్చచెప్పటానికి ప్రయత్నించేవారు. అదేమిటో కొలది రోజుల తర్వాత గాని తెలియలేదు రంగయ్యకి. అతనికి ఉరిశిక్ష తప్పించేందుకు గాను సుప్రీంకోర్టుకు అప్పీలు చేసుకోమని వాళ్ళు ప్రాధేయపడితే అతడు ఒప్పుకొనేవాడు కాడు. చివరికి అతని తరఫున ఒకతను సుప్రీంకోర్టుకు అప్పీలు చేసుకుంటే అతని అభ్యర్థనను త్రోసిపుచ్చింది కోర్టు.

సత్యంకి ఉరిశిక్ష ఖాయమయింది.

అది విని రంగయ్య గుండెలు గుభేలుమన్నాయ్. అలా అనటానికి సత్యంకి చావు దాపురించటం ఒక్కటేకాదు. ఆ చావు తన చేతులమీదుగా జరగవలసి ఉండటం కూడా  కారణమే.

సత్యంకి ఉరిశిక్ష ఖాయమని తేలిన తరువాత అతనిని చూట్టానికి ఎవరు పడితే వాళ్లు రాకూడదని నిషేధించేరు.

సత్యంని కొద్దిరోజులలో ఉరి తీయబోతున్నారన్న వార్త విని చాలామంది అతనికోసం ఏడ్చేరు. అందులో ఒకరుపక్కనే ఉన్న రంగయ్యను నలుగురైదుగురు చప్రాసీలను చూచి "సత్యం ఎందుకు చచ్చిపోతున్నాడో తెలుసా? మీ కోసం మీ లాంటివాళ్ల కోసం ...." అన్నాడు.

ఆమాట విని అందరూ ఒకరి మొహాలొకరు చూసుకున్నారు. అందరి మనసులూ  కలుక్కుమన్నయ్.

సత్యం మాత్రం తనను మృత్యువు సమీపిస్తున్నందుకు విచారిస్తున్న ఛాయలనేమీ కనపర్చలేదు.

పైగా సంతోషపడుతున్నట్లు కూడా కనబడ్డాడు. కారణం అతడే చెప్పేడొకసారి. "ఈ స్థితిలో నేను బ్రతికి ఉన్నందువల్ల ప్రయోజనం ఏమీ లేదు. పైగా చనిపోవటం వల్ల కొన్ని లాభాలు కూడా ఉన్నయ్. నా మరణవార్త విని కనీసం కొద్దిమంది ప్రజలలోనయిన చైతన్యం వస్తే అంతే చాలు...." అన్నాడు.

రోజులు నడుస్తున్నయ్. సత్యంని ఉరితీసే  సమయం ఆసన్నమవుతున్న కొద్దీ రంగయ్య మనసు నీరసించసాగింది.  శరీరం కంపించసాగింది.

ఏ క్షణంలోనైనా, ఏ కారణం చేతనైనా సరే యీ ఉరిశిక్ష తప్పిపోతే బాగుండునని కోరుకునేవాడు.

అలా రంగయ్య కలవరపడుతున్నాడే తప్ప సత్యం మాత్రం నిశ్చింతగా కనపడేవాడు.

మృత్యువు ఆగమనం కోసం వేచి ఉన్నట్లు అతని కళ్ళు అనిమిషంగా, తీక్షణంగా చూస్తుండేవి. మూడురోజులలో అతనిని ఉరితీస్తారనగా సత్యం మాటలాడటం పూర్తిగా

మానివేసాడు భోజనం చేసేవాడుకాదు. ఎటో దూరంగా.... అతి దూరంగా, సాధారణ నేత్రాల చావుకందని ప్రదేశాలలోకి ఎక్కడికో చూస్తుండేవాడు.

అతని ఈ భంగిమని చూసి రంగయ్య నరాలు మరింత బిగుసుకుపోయినయ్. ఒకప్పుడు అగ్ని జ్వాలలు చిమ్మి, ఇప్పుడు శీతల హిమాచలం వలె ఘనీభవించుకుపోయిన యీ వ్యక్తిని తన చేతులలో ఎలా చంపటం?

రంగయ్య అవస్థ చూసి రత్తి గుబులుపడింది. వెంటనే తను ధైర్యం తెచ్చుకుని భర్తకు ధైర్యంచెప్పింది. "నీ డ్యూటీ నువ్వు చేస్తున్నావు. అతనిని చంపాలన్న కోరిక నీకు లేదుకదా. ఐనా చంపటానికి మనం ఎవరం? చంపేవాడు, చంపించేవాడు ఆ భగవంతుడే!" అన్న ధోరణిలో మాట్లాడేది.

కాని ఆ మెట్ట వేదాంతం రంగయ్య మనసును సమాధానపరచేది కాదు. అసలే ఒక నిండుప్రాణాన్ని బలికొనవలసి వస్తోందే అన్న చింత. దానికి తగ్గట్టు సత్యం వంటి నవయువకుడు, ఉత్సాహవంతుడు, ధైర్యశాలి, ఆదర్శశీలి అయిన పురుషుడిని ఉరితీయవలసి వస్తోందని మరింతబెంగ.

చివరికి ఆఖరి రోజు రానే వచ్చింది.

"నీకిష్టమైన బట్టలు, నీ కిష్టమైన తిండి ఏమిటో చెప్పు. తెచ్చి యిస్తాం" అన్నారు జైలు అధికారులు.

దానికి సత్యం నవ్వి "దేశంలో కోట్లాది ప్రజలు కడుపునిండా తిండిలేక, వంటినిండా బట్టలేక దిక్కుమాలిన బ్రతుకు బ్రతుకుతున్నారు. వాళ్ళ కష్టాలు తీరేమార్గాలేమిటో చూడండి. రేపీపాటికి ఈలోకాన్ని వీడిపోయే నా తిండీ బట్టను గురించి మీకెందుకంత దుగ్ధ?' అన్నాడు.

అతనిమాటలు వింటుంటే అందరి కళ్ళ వెంబడి నీళ్లు తిరిగినయ్. ఆ సమయంలో అంత స్వచ్ఛంగా నవ్వగలిగిన అతనిని చూసి ముగ్ధులయ్యేరు.

అక్కడ వున్న వాళ్ళలో కాస్త తల నెరిసిన ఉద్యోగి ఉరిశిక్ష విధింపబడిన వారి ప్రవర్తనను గురించి తన అనుభవాలను కొన్నింటిని చెప్పసాగేడు. "ఎంతటి ఉద్ధండులయినా గుండెలు తీసిన బంట్లయినా, ఎన్ని ఖూనీలు చేసినవారైనా తమకి

ఉరిశిక్ష ఖాయమని తెలిసేక డీలా పడిపోయేవారు ఉరితీసే రోజు దగ్గర పడుతున్న కొద్దీ వాళ్ల శరీరంలో, మానసికావస్థలో ఎన్నో విపరీతమైన మార్పులు కనపడేవి. కొందరు వెక్కి వెక్కి ఏడ్చేవాళ్ళు. కొందరా వార్త వింటూనే మూర్ఛపోయేవారు. గుండె ఆగిపోయిన కేసులు కూడా ఒకటి. రెండు లేకపోలేదు. ఏమైనా తనకు చావు ఖాయమని, అందునా ఆ చావు బలవంతాన సంభవిస్తుందనీ తెలుసుకున్న ఏ మనిషి సహజంగా ఉండలేడు. ఆ పరిస్థితి నుండి ఎలాగైనా తప్పించుకు పోదామని ప్రయత్నిస్తాడు. లేదా ఆత్మహత్యకి కూడా పాటుపడతాడు..” ఆ కథలన్నీ వింటుంటే రంగయ్యకి పై ప్రాణాలు పైనే పోతున్నట్లుండేది.

“నీ వాళ్ళెవరైనా ఉన్నారా? ఎవరినైనా చూస్తావా? అన్న ప్రశ్నకు “ఈ దేశ ప్రజలందరూ నా వాళ్ళే. పుట్టిన క్షణం నుండి పాతికేళ్ళుగా దురవస్థను చూస్తూనే ఉన్నాను. వాళ్లకోసం ఏమీ చెయ్యకుండానే, వాళ్ల దుస్థితిని రూపు మాపకుండానే చనిపోతున్నందుకు నాకు సిగ్గుగా ఉంది. ఈ అవమానాన్ని నేను భరించలేను. నన్ను వెంటనే ఉరితీయండి. నన్ను చంపండి”అన్నాడు.

ఆ సాయంత్రం వార్డెను రంగయ్యను పిల్చి తాడు, ముసుగు, బల్ల మొదలైన సరంజామా నంతటినీ సిద్ధం చెయ్యమని చెప్పేడు.

“సరిగ్గా తెల్లవారుఝామున నాలుగుగంటలకు అతని ప్రాణం పోవాలి” అని హెచ్చరించేడు.

అప్పటినుండి రంగయ్యకి భయంతో నాలుక పిడచకట్టుకుపోయింది. రత్తికీ ఈ మధ్యనే సుస్తీ చేసింది. అందువల్ల పెందరాళే అన్నం తిని నిద్రపోయింది. కాని రంగయ్య ఆ రాత్రి అన్నం తినలేదు. కంటిమీద కునుకు రావటం లేదు.

గుడిసె బయట గాఢాంధకారం. తన మనసులోని చీకటికి బయటనున్న ఆ గాఢాంధకారం తోడై అతనిని భయపెడ్తోంది. అందుకే కిరసనాయిలు బుడ్డిని ఆర్పకుండా, కన్నార్పకుండా గుడిసె మధ్యలో కాళ్ళు ముడుచుకుని కూర్చున్నాడు రంగయ్య. మరో రెండుగంటల్లో తను ఉరితీసే ప్రదేశానికి వెళ్ళి అన్నీ సిద్ధం చేయాలి. కాని ఎలా వెళ్ళటం. కొద్దిగజాల దూరంలో వున్న జైలుగోడలు అతని కంటికి భయంకరంగా కనపడుతున్నయ్.

ఈ ఆపదనుంచి తప్పించుకోవటానికి ఒక్కటే మార్గం. తనీ ఉద్యోగానికి రాజీనామా యిచ్చెయ్యాలి. కాని ఆ తరువాత జీవితాంతం తను చేసిన పనికి పశ్చాత్తాపపడవలసి ఉంటుంది. లేమి యెలాంటిదో అనుభవ పూర్వకంగా తనకు తెలుసు. తెలిసి తెలిసి మళ్లీ దారిద్ర్యాన్ని కొని తెచ్చుకోవటమా? తనొక్కడేకాదుగా ఇలాటి ఉద్యోగం చేస్తున్నది? తనలాటి ఉద్యోగస్థులు ప్రపంచంలో చాలామంది వున్నారు. వాళ్ళందరూ తనలానే బాధపడుతున్నారా? ఒక్కొక్కరి ఉద్యోగాలు ఒక్కోరకంగా ఉంటయ్. రోగి ప్రాణాన్ని కాపాడటానికి డాక్టరు శరీరభాగాలను కత్తితో కోస్తారు. అంతమాత్రాన అతనిని హింసాకారుడంటామా? అతనిలో దయాదాక్షిణ్యాలు లేవనగలమా? తనసంగతీ అంతే! ఉద్యోగ ధర్మ నిర్వహణలో తనొక వ్యక్తి మెడకు ఉరితాడును బిగిస్తున్నాడు. అందులో తప్పేమన్నా వుంటే అది తనది కాదు.

అలా మనసు కుదుటపరుచుకోవటానికి శాయశక్తులా ప్రయత్నించసాగాడు రంగయ్య.

చివరికెలాగైతేనేం అన్నటైముకి సిద్ధం చేసేడు. ఏదో అతని కాళ్ళూ, చేతులు ఆడుతున్నాయే తప్ప రంగయ్య మనసుమాత్రం శూన్యంగా ఉంది. అతనికి బాహ్యస్పర్శ నశించిపోతున్నట్లు అనుభూతి కలుగుతోంది.

అంతటి వెర్రి భయంలోనూ, అంతటి శీతల గంభీర వాతావరణంలో కూడా... ఏదో ఒక క్షణంలో యీ ఉరి తప్పిపోతే బాగుండును అన్న కోరిక అతని మనసులో మినుకు మినుకు మంటూనే ఉంది.

సరిగ్గా ఉరి తీసేముందు "అతనిని క్షమించా"నంటూ ప్రెసిడెంటు దగ్గరనుండి ఉత్తరువు రావచ్చు. లేదా అతని మెడకు తగిలించిన ఉరిత్రాడులో ఏదో లోపం ఉండి, సమయానికి పుటుక్కున తెగిపోవచ్చు. హఠాత్తుగా సత్యంకి ఏదో విపరీతమైన జబ్బు వచ్చి అతని ఉరిశిక్ష తేదీ పొడిగించబడచ్చు. ఇందులో ఏం జరిగినా తనకి పాపం తప్పుతుంది. సత్యం ప్రాణం దక్కుతుంది' అనుకున్నాడు రంగయ్య.

కాని అతననుకున్న వానిలో ఏ ఒక్కటీ జరగలేదు.

సత్యంని ఉరితీసే ప్రదేశానికి తీసుకువచ్చేరు.

అతనితో పాటు జైలు వార్డెను, జైలు సూపర్నెంటు, ఒక డాక్టరు, ఒక పోలీసు ఉన్నారు.

వీళ్ళందరి సమక్షంలో రంగయ్య సత్యం మెడకు ఉరి తాడును బిగించాలి.

"చివరగా నువ్వు చెప్పదల్చుకున్నదేమయినా ఉన్నదా?" సూపర్నెంటు అడిగాడు.

సత్యం తన సహజమైన ధోరణిలో అన్నాడు. "కొద్ది క్షణాలలో నా మెడకు ఉరి బిగించపోతున్నారు. నా ప్రాణాన్ని తీయబోతున్నారు. కాని మీరు యీ ఉరిని వేస్తున్నది నాకు కాదు. అల్లకల్లోలంగా ఉన్న దేశంలో నిప్పురవ్వల్లా ఎగిరి పడుతున్న వందలాది చైతన్యమూర్తులను. చంపుతున్నది నన్ను కాదు, యుగయుగాలుగా హింసాద్వేషాల వికటాట్టహాసాల మధ్య హీనస్వరంతో ఎలుగెత్తి చాటుతున్న మానవతిని. ఆ సంగతిని మీరందరూ గుర్తుంచుకోండి. అదే నేను చెప్పవలసిందీ, చెప్పగలిగిందీను" అన్నాడు సత్యం.

"నీ చివరి కోరిక యేమిటి?" అన్న ప్రశ్నకు.

"మనిషిని మనిషిగా చూడాలన్నదే మొదటికోరికా, ఆఖరి కోరికా కూడాను. హెచ్చుతగ్గులు లేని సామాజిక వ్యవస్థే నా ఆశయం. ఒకరు పాటుపడే నవసమాజమే నా సుందర స్వప్నం."

ఆవేశంగా, అదేపనిగా అనుకుంటున్న మాటలు అందరి హృదయాలనూ కదిలించి వేసినయ్.

సూపర్నెంటు ఆదేశం ప్రకారం రంగయ్య వణుకుతున్న చేతులతో ముఖం మీద నల్లని ముసుగు వెయ్యబోతూ అతనిని సమీపించేడు. సత్యం ముఖం మీద ముసుగువెయ్యబోతే అతని వంక ఆఖరిసారిగా చూసేడు. సత్యం భావరహితంగా తీక్షణంగా సూటిగా రంగయ్య కళ్లలోకి చూసేడు. తెల్లగా విశాలంగా వున్న అతని కళ్ళలోని భావమేమిటో అర్థం చేసుకుందామని అతను ప్రయత్నిస్తుండగానే చటుక్కున అతని చేతులలోని ముసుగు జారి సత్యం ముఖాన్ని కప్పి వేసింది.

క్రిందికి దిగివచ్చి ఉరితాడును బిగించి పట్టుకున్నాడు రంగయ్య.

సూపర్నెంటు ఏదో అంటున్నాడు రంగయ్య వంటి మీద స్పృహలేదు.

గడియారం 'ఠంగు ఠంగు' మంటూ నాలుగు గంటలు కొట్టటం, సూపర్నెంటు 'వన్,టూ,త్రీ.... రెడీ...' అనటం, సత్యం మెడకు ఉరిత్రాడు బిగుసుకుపోవడం, అన్నీ క్షణాల్లో జరిగిపోయినయ్.

సత్యం ప్రాణం గాలిలో కలిసిపోయే సమయంలో ఒక భయంకరమైన కేక వినవచ్చింది. ఆ కేక వచ్చింది సత్యం కంఠం నుండి కాదు, రంగయ్య గుండెను చీల్చుకు వచ్చింది.

స్పృహతప్పి పడిపోయిన రంగయ్యను జైలు ఆవరణలోకి తీసుకుపోయేరు. డాక్టరు ప్రథమచికిత్స చేసినతరువాత తేరుకుని కళ్లు తెరిచేడు రంగయ్య.

ఒక గంటసేపైనతరువాత యిద్దరు పోలీసులు అతనిని వెంటపెట్టుకుని యింటిదగ్గర దింపేరు.

అప్పుడు తెలతెలవారుతోంది.

గుడిసెలలోని వాళ్లందరూ ఎవరి పనులలో వాళ్ళున్నారు.

రత్తి రోజూ అలవాటు ప్రకారం ఈ రోజు పొయ్యిలోకి కావలసిన కట్టెలు, పొయ్యిమీదకు కావలసిన పదార్థాలను తెచ్చుకోవటానికి బజారుకు వెళ్లింది.

అతనిని దించిన మనుష్యులు వెళ్ళిపోయేరు.

రంగయ్య ఒంటరిగా గుడిసెలో కూర్చున్నాడు. అతని కళ్ళముందు ఏవేవో దృశ్యాలు కదులుతున్నయ్. అతని గుండెలో ఏవేవో మాటలు ప్రతిధ్వనిస్తున్నయ్.

ఉరిత్రాడు... సత్యం చూపు... ఏమిటా చూపులోని భావం? "రంగయ్యా? నేను చచ్చిపోతున్న దెవరి కోసమో తెలుసా? నీ కోసం, నీలాంటి వాళ్లకోసం" అని ఆ చూపులోని భావం? "ఈ ఉరిని వేస్తున్నది నాకుకాదు. అల్లకల్లోలంగా వున్న నిప్పురవ్వల్లా ఎగిరిపడుతున్న వందలాది చైతన్యమూర్తులకు" నల్లముసుగు సత్యం కళ్ళు.... 'వన్, టూ, త్రీ రెడీ....! కెవ్వున కేక, డాక్టర్... తెల్లకోటు,.. జైలు వార్డెను, పోలీసులూ. "ఈదేశ ప్రజలందరూ నా వాళ్ళే.... ఈ అసమానతను నేను భరించలేను. నన్ను వెంటనే ఉరితీయండి!, ఠంగ్... ఠంగ్.. ఠంగ్...ఠంగ్! వన్ టూ త్రీ... రెడీ! సమాజంలో హెచ్చు తగ్గులున్నంతకాలం వర్గద్వేషం, రక్తపాతం తప్పవు.... రక్తం

...రక్తం... నల్లనిముసుగు... ఠంగ్ ఠంగ్! వన్ టూ త్రీ... రెడీ!

"మీరు చంపుతున్నది నన్ను కాదు, యుగయుగాలుగా హింసాద్వేషాల వికటాట్టహాసాల మధ్య హీనస్వరంతో ఎలుగెత్తి చాటుతున్న మానవతని... "సత్యం కళ్ళు... నల్ల ముసుగు..." నేను చచ్చిపోతున్నది ఎవరి కోసమో తెలుసా? నీ కోసం – నీలాంటి వాళ్ల కోసం... వన్... టూ...త్రీ...! రెడీ!..." ఒక గంట తరువాత బజారునుండి తిరిగివచ్చిన రత్తి, నులకమంచంలో చేష్టలు దక్కి స్థాణువులా పడివున్న రంగయ్యని చూసి స్తంభీబూతురాలైంది.

# ఔట్‌సోర్సింగ్

– జొన్నలగడ్డ రామలక్ష్మి

సంపన్న దేశాల్లో ఏ పనికైనా గంటకు కనీసం ఐదొందల రూపాయలొస్తుంది. మన దేశంలో గంటకు ఇరవయ్యిచ్చినా మహద్భాగ్య మనుకునేవారు కోకొల్లలు. అందుకని సంపన్నదేశాలు తమ పని మనదేశంలో కంపెనీల కప్పగిస్తే అదే ఔట్ సోర్సింగ్. అందువల్ల విదేశీ కంపెనీలకు పని చౌక. మన కంపెనీలకు మంచి లాభాలు. మన పౌరుల నిరుద్యోగ సమస్యకు చక్కని పరిష్కారం. ఐతే ఔట్ సోర్సింగ్ ఇంటిపనులకూ విస్తరిస్తుందని నేనూహించలేదు. అదెలా జరిగిందంటే...

మూడేళ్ళుగా మా ఇంట్లో పనిచేస్తున్న లక్ష్మికి పనంటే శ్రద్ధ లేదు. టైము పట్టింపు లేదు. రోజూ ఉదయం ఆరున్నర లోపులో వీధి గుమ్మం కడిగి ముగ్గు పెట్టాలంటే ఏ రోజూ ఎనిమిది దాటకుండా ఆపని చేయదు. గిన్నెలకు విమ్మూ, బట్టలకు దుమ్మూ వదలవు. ప్రతిరోజూ దానితో నాకు ఏదో ఒక గొడవే. విసిగిపోయి ఒకరోజున, "ఈ నెలాఖరు కింక మూడు వారాలుంది. వచ్చే నెల నుంచి వేరే ఇల్లు చూసుకో" అని చెప్పేశాను. అది కాళ్ళావేళ్ళా పడినా నా మనసు కరగలేదు.

అప్పుడు మా వారు, "ఇక్కడ మనమిచ్చే నెల జీతం ఫారిన్లో ఓ గంట పనికిఏ ఇస్తారు. గతి లేక చవగ్గా పని చేస్తున్న వీళ్ళ పట్ల మనం ఎంతో కొంత అవగాహన చూపి అడ్జస్టవాలి. నువ్విప్పుడు లక్ష్మికి బదులు మరో దేనిని కుదుర్చుకున్నా పరిస్థితిలో మార్పుండదు. ఆలోచించుకో అంటూ నన్ను మందలించారు.

సమాధానంగా, "సరే గురివిందగారూ! మీరు సత్యాన్ని మళ్లీ పిలవండి' అన్నాను మా వారికి నా విసురు అర్థమైంది.

మాకో కారుంది. డ్రైవింగ్ స్కూల్లో చేరితే మా ఇద్దరికీ డ్రైవింగ్ లైసెన్సులొచ్చాయి కానీ ఒక్కరికీ డ్రైవింగ్ మీద కాన్ఫిడెన్సు రాలేదు. అవసరానికి డ్రైవర్ని పిల్చుకునే వాళ్ళం కానీ కావాల్సి నప్పుడల్లా డ్రైవర్ దొరికేవాడు కాదు. పర్మనెంట్‌గా పెట్టుకుందామంటే నెలకు కనీసం మూడువేల ఐదొందలివ్వాలి. మాకేమో నెలకు

వారం రోజులు కూడా పనుండదు. అలాంటప్పుడు ఇంటర్ చదివిన సత్యం రెండు వేల జీతానికే ఒప్పుకుని, "డ్రైవింగే కాదు – కథలు ఫెయిర్ కాపీ చేస్తాను. బ్యాంకు పోస్టాఫీసు, షాపింగు వగైరా పనులన్నీ చేస్తాను. అన్నింటిలోనూ నాకు ట్రెయినింగిచ్చి ఓ సర్టిఫికెటిస్తారనే ఆశతో మీ దగ్గర తక్కువ జీతానికి ఒప్పుకుంటున్నాను. నాకు డ్రైవరుగా స్థిరపడాలని లేదు సార్! మీ సర్టిఫికెట్‌తో నా చదువుకు తగ్గ ఉద్యోగం సంపాదించొచ్చని నా ఆశ" అంటూ బ్రతిమాలాడు.

సరేనన్నాడు శ్రీవారు. కానీ సత్యం డ్రైవింగుకి తప్ప మరి దేనికీ పనికిరాడని తెలుసుకునేందుకు వారం రోజులు కూడా పట్టలేదు. అతడి దస్తూరి ముత్యాల కోవే కానీ, రాతలో పేజికి పదితప్పు లుంటాయి. కూరగాయలు తెస్తే సగం పుచ్చులు, కవర్ల మీద అడ్రసులు ఒకదాని కొకటి రాస్తాడు. స్టాంపులు తక్కువ అంటిస్తాడు. ఒక బ్యాంకు చెక్కు ఇంకో బ్యాంకులో డిపాజిట్ చేస్తాడు, క్రమంగా ఇంప్రూవ్ అవుతాడని ఎదురు చూశారాయన. కానీ నానాటికీ తీసి కట్టవుతూంటే విసిగిపోయి, "నువ్వు డ్రైవరుగా తప్ప పనికిరావు. మాకు పర్మనెంటు డ్రైవర్లక్కర్లేదు. కావాల్సొచ్చినప్పుడు పిలుస్తూంటాంలే" అన్నారు.

సత్యం నొచ్చుకోలేదు. తనకు అన్ని పనులూ బాగా అడిగి తీసుకుని వెళ్ళిపోయాడు. అతణ్ని పనిలోంచి తీసేయడం న్యాయమేనని అప్పుడొప్పుకున్నాను. ముమ్ముందు నన్నాయన లక్ష్మి విషయంలో సమర్థించరని తెలియక! ఇప్పుడా తప్పు దిద్దుకున్నాను.

అడవిలోనైనా, ఊళ్ళోనైనా, సాధువైనా, ప్రాణికి క్రూరమృగాల బాధ తప్పదు. ఎటొచ్చీ అడవిలో ఐతే క్రూరమృగాలు ఏ జాతివా జాతివి విడిగా వేటాడతాయి. ఊళ్ళో అన్ని జాతుల క్రూరమృగాలూ సహజీవనం చేస్తాయి. అడవిలో ఇదీ క్రూరమృగమనీ గుర్తించడం బహుసులభం. ఊళ్ళో ప్రతిమనిషీ తాను సాధువునసీ, పక్కమనిషి క్రూరమృగమనీ అనుకుంటాడు. మా విషయంలో ఇది అక్షరాలా నిజం!

మా అమ్మాయి, అల్లుడు ఆస్ట్రేలియాలో ఉన్నారు. అబ్బాయి కోడలు గల్ఫ్‌లో ఉన్నారు. అందరూ కాపిటలిస్టులకు ఊడిగం చేసి, మస్తుగా డబ్బు సంపాదిస్తున్నారు.

నేనూ, మావారూ ఇండియాలో ఉండి కాపిటలిజాన్ని దుమ్మెత్తే రచనలు చేస్తూ నాలుగు చేతులా సంపాదిస్తున్నాం. కాపిటలిస్టులు – మా కథలతో బాక్సాఫీసు బద్దలు కొట్టే సినిమాల తీస్తూ మా టీవీ సీరియల్స్‌కి భారీగా అడ్వర్టైజ్‌మెంట్స్ ఇస్తున్నారు.

చూసేవారికి అన్యోన్యంగా అనిపిస్తాం. కలిసి కాపిటలిజాన్ని ద్వేషిస్తాం. కానీ మా ఇద్దరికీ – ఒకరికొకరు కాపిటలిస్టులే కనబడ్డం ఇబ్బందిగా ఉంది. దానికి పరిష్కారం తోచక – ఒకసారి ఇంటర్నెట్ టెలీ కాన్ఫరెన్స్‌లో నేను మా అబ్బాయినీ, వారు మా అమ్మాయినీ సలహాలడిగాం.

అబ్బాయి వెంటనే, "ఎదుటివాడు చేసే దోపిడీని గుర్తిస్తే రచయిత తను చేసిన దోపిడీని గుర్తిస్తే సంఘసంస్కర్త. నా మాట విని –రచయితలే తప్ప సంఘసంస్కర్తలు కాని మీరు, డ్రైవింగు నేర్చుకుని, మీ కారు డ్రైవ్ చేసుకోండి. ఇంట్లో అన్ని గాడ్జెట్సూ కొనుక్కుని మీ పనులు మీరే చేసుకోండి" అన్నాడు.

అమ్మాయి వెంటనే, "గాడ్జెట్సుంటే పనినాకక్కర్లేదనేది ఇంటి పనుల్లో వేలెట్టని మగాళ్ళు. ఇండియాలోలా చవగ్గా పనివాళ్లు దొరికితే గాడ్జెట్సుకీ పనిమనుషులుండా లంటాన్నేను" అంది.

అబ్బాయి సూచన మీద మేము వెంటనే ఇంటి పనులకు డిష్ వాషర్, వాక్యూం క్లీనర్, వాష్ మెషీన్ రాత పనికి కంప్యూటరూ కొన్నాం. పట్టుబట్టి నేర్చుకుంటే వారం రోజుల్లో డ్రైవింగూ వచ్చేసింది. అమ్మాయి సూచన మీద లక్ష్మిని పనిమనిషిగా కొనసాగించాలనుకున్నాం. కానీ –లక్ష్మికి అనుమానమొచ్చినట్లుంది. "సరేనమ్మా! ఇక నా దారి నేను చూసుకునే టైమొచ్చింది. చిన్న ఉపకారం చేయండమ్మా! నా పనులు చక్కగా చేస్తానని ఓ సర్టిఫికెట్టు ఇప్పించండి" అంది.

ఇస్తే నష్టమేమిటిలే అనుకుని వెంటనే మా వారు సత్యం గురించి రాసినట్లే – నేనూ దాని గురించి చాలా గొప్పగా రాసి ఓ సర్టిఫికెట్టిచ్చి పంపాను.

ఆ తర్వాత నెలాఖరు కింకా నాలుగు రోజులందనగా – ఓ రోజు ఉదయం ఆరింటికల్లా కాలింగ్‌బెల్ మోగింది. మెలుకువొచ్చింది. కానీ మత్తింకా వదల్లేదు. ఐనా కూడా – కదిలితే చాలు. మెలకువొచ్చిందనుకుంటానని బిగుసుకుపోయిన

శ్రీవారిని పసికట్టి, అసంకల్పిత ప్రతీకారచర్యగా ఆయన వీపు తట్టి "పక్కింటాయన కాబోలు – వెళ్ళి చూడండి" అన్నాను.

మా పక్కింటి రామచంద్ర కన్నడిగుడు. తెలుగుదేశంలో ఉన్నందున తెలుగువారితో కలిసిపోవాలన్న తాపత్రయంతో తెలుగు పేపరు తెప్పించి చదువుతాడు. అంతా అర్థం కాదు కదా ఉదయం ఆరున్నరకల్లా ఆఫీసుకి బయల్దేరాల్సిన రామచంద్ర ఆలోగా భాషాపరంగా తనకొచ్చిన డౌట్సుని కాగితం మీద రాసుకొచ్చి మా వారి నడిగి తీరిన వాటికి టిక్కులెట్టుకుని వెడుతూంటాడు.

"ఆయనై ఉండడు. పనిమనిషేమో!" అన్నారాయన. తప్పించుకునేందుకు.

"ఇంతవరకూ లక్ష్మి ఎప్పుడైనా ఆరింటికొచ్చిందా?' అది మత్తును జయించిన సంకల్పిత ప్రతీకార చర్య.

తనకూ పక్కింటాయనే అని రూఢి అయిందేమో, గొణుక్కుంటూనే లేచి వెళ్ళారు. వీధి తలుపు తీసిన చప్పుడూ, ఆ వెంటనే కెవ్వుమన్న ఆయన కేకా వినపడ్డాయి. ఏమైందోనని పరుగున వెడితే, అక్కడో మెరుపుతీగ లాంటి పిల్ల. ఇంటి ముందు ముత్యాల ముగ్గు, నేనూ కెవ్వుమన్నాను. ఆ పిల్లకిలాంటి కేకలు అలవాటేనేమో, ఏ మాత్రం చలించలేదు. "ముగ్గెట్టమని నన్ను లక్ష్మి పంపిందమ్మా వస్తానూ!" అనేసి మేము తేరుకునేలోగా వెళ్ళిపోయింది.

మా ఇద్దరికీ ఆశ్చర్యంగా అనిపించినా, క్రమంగా డెయిలీ రొటీన్లో పడ్డాం. సరిగ్గా ఏడింటికి ఇంకో మెరుపు తీగ వచ్చింది. లక్ష్మి పంపిందంటూ డిష్ వాషర్లో అంట్ల గిన్నెలు పడేసి ఆన్‌చేసి వెళ్ళింది. ఏడున్నరకింకో అమ్మాయొచ్చి వాక్యూమ్ క్లీనర్‌తో ఇల్లంతా పావుగంటలో శుభ్రం చేసి వెళ్లింది. ఎనిమిదింటికి మరో అమ్మాయొచ్చి వాష్ మెషీల్లో బట్టలు వేసి ఆన్‌చేసి వెళ్ళింది.

వాళ్ళెవరో తెలియదు. పనులు నీటుగా చేశారు. తామెవరో చెప్పకుండా అన్నీ లక్ష్మి చెబుతుందని హడావిడిగా వెళ్ళిపోయారు.

శ్రీవారు మురిసిపోయి "లక్ష్మి మన కోసం మంచి ఏర్పాటు చేసింది. పనివాళ్ళూ అదిరారు. వాళ్ళ పనీ అదిరింది" అన్నారు.

“దానికి నెలకు ఐదొందలిస్తున్నాం. వీళ్ళను చూపించి బిల్లు కూడా అదరగొడుతుందేమో తెలియదు” అన్నాను. అనుమానంగా, భయంగా, అసంతృప్తిగా.

సరిగ్గా తొమ్మిదింటికి వచ్చింది లక్ష్మి. ఇదంతా ఏమిటని నిలదీశాను.

“అన్నింటికీ మెషీన్లున్నాయని కదా మీరు నన్నీ నెలాఖరు నుండి పనిలో నుంచి తీసేస్తానన్నారు. మెషీన్లున్నా పనివాళ్ళుంటే ఎంత సుఖంగా ఉంటుందో మీకు రుచి చూపించాలని నేనీ ఏర్పాటు చేశాను. ముందు నాకిది చెప్పండమ్మా! మా వాళ్ళ పని ఎలాగుంది?” అంది లక్ష్మి.

“పని బాగానే ఉంది. కానీ బిల్లు పెంచితే నేనూరుకోను” అన్నాను అమ్మాయి చెప్పిన సలహా గుర్తుంచుకుని.

“ఏ పనికైనా గంటకు ముప్పై రూపాయలే అయినప్పుడు బిల్లెందుకు పెరుగుతుందమ్మా?” అందామె తాపీగా.

నాకు గుండె గుభీల్మంది. లక్ష్మి పని మా ఇంట్లో రోజుకి రెండు గంటలు. అంటే నెలకు అరవై గంటలు. దానికి ఐదొందలిస్తున్నాను. ఇప్పుడీ కొత్త పనివాళ్ళతో అదే పనికి రోజుకి అరవై చొప్పున నెలకి పద్దెనిమిదొందలు.

నా లెక్క విన్న లక్ష్మి నవ్వి “ఈ రోజు మా వాళ్లు నలుగురూ కలిసి మీ ఇంట్లో గంటైనా పని చేసుండరు. మీరేమో రోజుకి రెండు గంటలని లెక్కేశారేంటమ్మా?” అంది.

“పోనీ గంటే అనుకున్నా నెలకు తొమ్మిదొందలైంది కదా! అంత నేనివ్వను”.

“భలే వారమ్మా! మెషీన్లో ఐతే బట్టలు వారానికొకసారే కదా ఉతికేది! అలాగే అంట్లగిన్నెలు మూడు రోజులకోసారి మెషీన్లో పెట్టుకుంటే సరిపోతుంది. నెల కెన్ని గంటలు తప్పిపొయ్యాయో మీరే లెక్కేసుకోండి” అంది లక్ష్మి ధీమాగా.

ఇది నేనాలోచించలేదు కానీ ఆ వెంటనే మరో అనుమానమొచ్చి “గంటల్లెక్కన డబ్బిస్తున్నామని మీరు పనికి గంటలు గంటలు నాన్చేస్తే?” అన్నాను.

“అలా జరక్కుండా అన్ని పనులకూ టైము ఫిక్సు చేశామమ్మా! వీధిగుమ్మం కడిగి ముగ్గేయడానికి ఆరు నిముషాలు. అంట్లగిన్నెలకో పావుగంట. బట్టలకో

పావుగంట. ఇల్లు తుడవడానికి ఐదు, ఒత్తాలంటే ఇంకో పది నిమిషాలు. అదనంగా పనుంటే ముందే టైము మాట్లాడుకుంటే – నాన్చామన్న ఫిర్యాదుండదు"

ఇది చెబుతూంటే నేను నెలకెన్ని గంటలో లెక్కేస్తున్నాను. వీధిలో ముగ్గుకి మూడు, అంట్లగిన్నెలు రెండ్రోజులకోసారి అనుకుంటే నెలకు ఏడున్నర. ఇల్లు రోజూ తుడిస్తే నెలకు రెండున్నర. వారానికి రెండ్రోజులు ఒత్తించుకుంటే నెలకు అదో గంటన్నర. అన్నీ కలిపి పద్నాలుగు గంటలు దాటిందంతే! గంటకు ముప్పై చొప్పున ఐదొందల లోపే ఔతుంది.

"ఆలోచించండమ్మా! వాడేది మీ మెషీన్లే. కాబట్టి మాలో వంకెట్టడానికి లేదు. గంటల్లెక్క కాబట్టి నాగాలెడితే మాకే నష్టం. మిషనుందని కాక అవసరాన్ని బట్టే పని చేయించుకునే మీలాంటి వాళ్ళకు డబ్బుకి డబ్బు ఆదా ఔతుంది. సుఖానికి సుఖమూ ఉంటుంది." అంది లక్ష్మి.

"ఔనూ, ఇంత కాలం మాకు నువ్వొకత్తెవే పని చేస్తున్నావు. ఇప్పుడేమో ఇంతమందీ కలిసి పనిచేసినా అప్పటికంటే తక్కువౌతోంది. మరి మీకెలా కిడుతుంది?" అన్నాను కుతూహలంగా.

"ఏం చేస్తామమ్మా – శతకోటి దరిద్రాలకు అనంతకోటి ఉపాయాలు, మీలాంటి వాళ్ళందరూ మెషీన్లు కొనేసుకుంటే, మాకు కూడెలాగొస్తుందని బెంగెట్టుకున్న సమయంలో – మొన్నే అమెరికానుండొచ్చిన మా చుట్టాలబ్బాయి ఓ ఔట్‌సోర్సింగు కంపెనీ పెట్టమని సలహా ఇచ్చాడు. మీరిచ్చిన సర్టిఫికెట్‌ధర్మమా అని నేను పెట్టే కంపెనీకి కూడా లోన్ కూడా దొరుకుతుందిట" అంది లక్ష్మి.

అది చెప్పిన వివరాలు విని ఆశ్చర్యపోయాను. ట్రయల్ బేసిస్‌మీద లక్ష్మి ప్రస్తుతం ఓ ఔట్‌సోర్సింగ్ కంపెనీ నడుపుతోంది. ఇప్పుడు లక్ష్మి ఇదివరకటిలా నాలుగిళ్ళు కాదు. వందిళ్లలో పని కొప్పుకోగలదు. తమ సరుకు అమ్ముడు పోవడం కోసం మెషీన్ల కంపెనీల వాళ్ళిచ్చే ఫ్రీ ట్రెయినింగుకి వాళ్ళ పేటలో చదువుకొనే అమ్మాయిలందరూ వెళుతున్నారు. ఇప్పటికే అలాంటివాళ్ళో పదిమంది –లక్ష్మి దగ్గర తమ పేర్లను రిజిస్టర్ చేసుకున్నారు. లక్ష్మి వాళ్లకు పని అలాట్ చేసి వాళ్ళకొచ్చే దాంట్లో పావలా వాటా తీసుకుంటుంది. అంటే ఇప్పుడు లక్ష్మి ఏ పనీ చెయ్యకుండానే నెలకో ఐదువేల దాకా సంపాదిస్తుంది.

పనిపిల్లలకి ఇది బాగుంది. వాళ్ళిప్పుడు పనిమనుషులు కారు. లక్ష్మి కంపెనీలో ఎంప్లాయీస్. మేము కూడా వాళ్ళని పనిమనుషులనకుండా స్కిల్డ్ వర్కర్లనో, స్పెషలిస్టులనో అనాలి.

"ఈ ఐడియా బాగుంది. దీన్నింకా వివిధ రంగాలకు విస్తరింప జేయొచ్చు" అన్నాను సాలోచనగా.

"ఔనమ్మా – మెషీన్లున్నా పనులు చేసుకోలేనివాళ్ళ కోసం నేనిది ప్రారంభిస్తే – వంటొచ్చీ చెయ్యలేని వాళ్ళ కోసం ఔట్ సోర్సింగు సెంటరింకొకటి మొదలౌతుంది. దాంట్లోనూ నాకు వాటా ఉంది."

"వంటకు ఔట్‌సోర్సింగెందుకూ? టిఫిన్ సెంటర్సున్నాయిగా?"అన్నాను.

"ఆ సెంటర్సులో ఐతే వాళ్ళేం పెడితే అది తినాలి. ఇక్కడలా కాదు" అంది లక్ష్మి.

ఊరి మొత్తానికి కావాల్సిన వెజిటేరియన్ మెనూ తీసుకుంటే – నిత్య వాడకంలో ఉండే వంటకాలు యాభై రకాలకు మించవట. వాటిని తయారుచేయడానికి ఊళ్ళో కొందరు స్పెషలిస్టులకు కాంట్రాక్టు ఇస్తారట. ఎవరి మెనూతో వాళ్ళు భోజనం ఆర్డరిస్తే – కంపెనీ ఆ మెనూలోని వంటకాలు సేకరించి భోజనం సప్లై చేస్తుందిట. ఈ పద్ధతిలో ఒకే ఇంట్లో నలుగురు సభ్యులు. ఒకే సమయంలో నాలుగు రకాల ఐటమ్స్‌తో భోంచెయ్యొచ్చుట. ఇది సక్సెస్ ఐతే నాన్ వెజ్‌కీ ఎక్స్‌టెండ్ చేస్తారట.

"మీకు నచ్చితే వచ్చే నెల నుంచి మీ ఇంట్లో ఔట్‌సోర్సింగ్ పద్ధతి మొదలెడదాం" అంది లక్ష్మి.

"నేను నచ్చలేదంటే?"

"ఇప్పటికే నాకు నలభైమంది కస్టమర్లు దొరికారమ్మా! ఇంకా చాలా మంది వాకబు చేస్తున్నారు. నేను చెప్పిన రేట్సు ఫస్టు కస్టమర్సుకి ప్రత్యేకం. ఈ వేళ ఒప్పుకునేవాళ్ళకివే రేట్సు ఏడాది దాకా వర్తిస్తాయి. ఆ పైన మీ ఇష్టమమ్మా!

నేను వెంటనే ఒప్పేసుకుని, "నీది చాలా గట్టి బుర్ర. మా ఇళ్ళలో పుట్టుంటే, ఈ పాటికి అంబానీలని మించిపోయేదానివి" అన్నాను మెచ్చుకోలుగా.

"మీ ఇంట్లో పుట్టకపోయినా నాకీ అవకాశమొచ్చింది – మీ సర్టిఫికెట్ వల్లనే కదమ్మా! అందుకే మీకీ రోజు ట్రయల్సు చూపించాను. మిగతావాళ్ళకి ట్రయిల్సులేవు. నోటి మాటే!" అనేసి వెళ్ళిపోయింది లక్ష్మి.

నేనూ చాలా ఎగ్జైటయ్యాను. ఆయనకిదంతా చెబితే, "ఇది వరకు దాని జీతం పదో పరకో పెంచితే సరిపోయేది. కానీ లక్ష్మి ఇప్పుడు ప్రతి పనికీ ఇంతంటూ రేట్లు ఫిక్సు చేసింది. ప్రతి పనికి రేటు పెరిగితే –లాంగ్ రన్‌లో మనం దోపిడీ ఐపోతామేమో కాస్త ఆలోచించు" అంటూ హెచ్చరించారాయన.

"ఎప్పుడు దోపిడీ అనిపిస్తే అప్పుడే వద్దంటాం. మనమేం కాంట్రాక్టు రాయడం లేదు కదా!" అన్నాను.

ఈ విశేషాలన్నీ టెలికాన్ఫరెన్సులో పిల్లలతో పంచుకున్నాం.

"ఔట్ సోర్సింగ్ చాలా గొప్ప కాన్సెప్టే కానీ ఎక్కడో తేడా ఉంది. మనవాళ్ల సేవల్ని విదేశాల్లో ఉన్నవాళ్ళు మెచ్చుకుంటున్నారు. స్వదేశానికి వెనక్కెళ్ళినవారు ఏవగించుకుంటున్నారు. మరి స్వదేశంలో స్వదేశీయులకు లభించే సేవలెందుకు మెరుగ్గా ఉండడం లేదో కారణం తెలియదు" అన్నాడు అబ్బాయి.

"నేను చెప్పగలను. స్వదేశీయులకు ప్రొటెస్టు చేయడం రాదు. అందుకని స్వదేశీయుల సేవ కుద్దేశించిన ఉద్యోగాలు – ప్రతిభ కంటే సర్టిఫికెట్లకే ప్రాధాన్యాన్నిస్తాయి. అమ్మనే తీసుకో – తనకే మాత్రమూ నచ్చని లక్ష్మిని ఆకాశానికెత్తేస్తూ సర్టిఫికెట్టిచ్చింది. ఆ సర్టిఫికెట్టే లక్ష్మికి బ్రతుకు తెరువైంది. లక్ష్మి సేవల్లో తేడా వస్తే ఆ బాధ్యత అమ్మది. అమ్మలాంటి వాళ్ళది" అంది అమ్మాయి.

"నేను దాని సేవకు కాదు, ప్రతిభకు సర్టిఫికెట్టిచ్చాను. చూస్తూండు. లక్ష్మికి నేను సర్టిఫికెట్టిచ్చినందుకు మనమంతా గర్వపడాల్సిన రోజొస్తుంది" అన్నాను.

నామాట నిజమైంది. రెండు నెల్ల తర్వాత లక్ష్మి సర్వీసుని శ్రీవారు తెగ పొగిడారు.

ఆ తర్వాత నెల్లాళ్ళకు డీమాట్ అకౌంట్సు నడిపే కొన్ని సంస్థలు, బ్యాంకులపై ఓ ప్రముఖ కంపెనీ పబ్లిక్ ఇష్యూ విషయంలో గడబిడ చేశాయన్న ఆరోపణ వచ్చింది.

స్టాక్‌మార్కెట్‌ని అదుపు చేసే సెబీ సంస్థ. ఆ సంస్థల్లో షేర్ అకౌంట్లను నిషేధించింది. అందువల్ల మేమిప్పుడు కొత్త బ్యాంకులో డీమాట్ అకౌంట్సు ఓపెన్ చేసి – మా షేర్లనక్కడికి మార్చుకోవాల్సొచ్చింది.

పనిమీద ఒకరోజున నేనూ,శ్రీవారూ బాగా పేరున్న ఓ ప్రయివేట్ బ్యాంకు కెళ్ళాం. అక్కడ కౌంటర్లో మనిషి, 'డీమాట్ అకౌంట్ ఓపెనింగ్‌కి చాలా ఫారాలు నింపాలి. చిన్న అక్షరం కూడా తప్పుండకూడదు. మా ఉద్యోగుల సమయం, మీ సమయం ఎంతో విలువైనదన్న ఉద్దేశ్యంతో డీమాట్ అకౌంట్ ఓపెనింగు పనిని ఔట్ సోర్సింగు కిచ్చాం. ఫోన్లో చెబితే పోయేదానికి మీరు అనవసరంగా ఇక్కడికొచ్చారు. రేపు ఓ మనిషి ఫారాలతో సహా మీ ఇంటికొచ్చి అన్ని ఫార్మాలిటీసూ పూర్తి చేస్తాడు" అన్నాడు.

అక్కణ్ణించి బయటకొచ్చాక, "మన దేశంలో సమర్థులకు లోటు లేదు. ఔట్ సోర్సింగ్ వల్ల అలాంటివారందరికీ అవకాశమొస్తోంది. అనుభవంలేని లక్ష్మి కూడా ఔట్‌సోర్సింగ్‌తో తన సేవలనెంతో గొప్పగా మెరుగుపరిచిందంటే – మరి అంతర్జాతీయ ప్రఖ్యాతి గాంచిన ఈ ప్రైవేట్ బ్యాంక్ సేవ లింకెంత గొప్పగా ఉంటాయో ఊహించలేకపోతున్నాను" అన్నారు శ్రీవారు ఉత్సాహంగా.

మర్నాడు ప్రైవేటు బ్యాంకు ద్వారా ఔట్ సోర్సింగ్ ఏజంటుగా మా దంపతుల చేత డీమాట్ అకౌంట్స్ ఓపెన్ చేయించడాని కొచ్చిన వ్యక్తిని చూసి తెల్లబోయాం. అతడు సత్యం!

సత్యంలో ఏ మార్పూ లేదు. అతడు ఫారాలు ఫిల్ చేయడంలో ఎన్నో అక్షరాలు తప్పు రాస్తే అసలు కంటే సవరణలకు మేము చేసిన సంతకాలే ఎక్కువ. ఇంకా ఒక చోట దొక చోట రాసీ, కొన్నిచోట్ల అనుమానాలొచ్చీ అతగాడు, మా ఇంటికీ, బ్యాంకుకీ మధ్య కనీసం పదిసార్లు తిరిగాడు.

శ్రీవారు సత్యాన్నేమీ అనలేక, "నీకీ ఉద్యోగం ఎలా వచ్చింది?అనడిగాడు ఆశ్చర్యంగా.

విదేశీ సేవలకైతే బాంకింగ్ ప్రొఫెషనల్సు రిఫరెన్సు కావాలి కానీ, స్వదేశీ సేవలకు ఎవరు సర్టిఫికెట్టిచ్చినా సరిపోతుందట. తెలిసినవారెవ్వరూ సర్టిఫికెటివ్వక సత్యం మా వారి నాశ్రయించి సర్టిఫికెట్టూ, ఉద్యోగమూ సంపాదించుకున్నాడు.

'ఆ కృతజ్ఞతతోనే మీ డీమాట్ అకౌంట్స్ పని నేను తీసుకున్నాను సార్!" అన్నప్పుడు కృతజ్ఞత సత్యం కళ్ళలోనూ కనిపించింది.

సత్యానికుద్యోగమిచ్చిన ఆ ఔట్ సోర్సింగ్ కంపెనీ భవిష్యత్తుని తల్చుకునేమో– శ్రీవారూ భారంగా నిట్టూర్చి, "పని పూర్తయినట్టేనా – మళ్లీ వస్తావా?" అన్నారు.

సత్యం నవ్వి మళ్ళీ వస్తే ఆ వచ్చేది మీ ఋణం తీర్చుకునేందుకే సార్! మీక్కావలసిన వాళ్ళెవరికైనా మా కంపెనీలో ఉద్యోగం కావాలంటే – నా రిఫరెన్సు చాలని గుర్తుంచుకోండి సార్!"అని వెళ్ళిపోయాడు.

# ఎంతో చిన్నది జీవితం

**– తమిరిశ జానకి**

**ది**నపత్రిక చదువుతున్నాడన్నమాటే గానీ సత్యమూర్తి మనసు పూర్తిగా దాని మీద లగ్నమైలేదు. ఆలోచన్లు చుట్టుముడుతున్నాయి. సొంత ఊరు....ఆ పరిసరాలు... తమ్ముడు కళ్లముందు మెదులుతున్నారు.

తనకి నా అన్నవాళ్ళు ఇక్కడ కొడుకు, అక్కడ తమ్ముడు అంతేగా... చిన్నతనం నుంచీ తమ్ముడికీ తనకీ అనుబంధం ఎక్కువే. వాడడిగితే తన ప్రాణం ఇవ్వడానికైనా ఇప్పటికీ తను సిద్ధమే. ఈ మధ్యకాలంలో వాడి మాటల్లోనూ ప్రవర్తనలోనూ కొద్దో గొప్పో మార్పు వచ్చినా తనకేమీ ఇబ్బందిగా అనిపించలేదు. అసలు ఆ విషయం తను పట్టించుకోలేదు అంటే సబబుగా ఉంటుందేమో! బహుశా దానికి కారణం వాడంటే తనకి ప్రాణం కావడం వల్ల కాబోలు! తనకి చదువు అబ్బింది పెద్ద చదువులు, పెద్ద ఉద్యోగం.

వాడికి చదువు అంటలేదు. ఆ పల్లెటూళ్ళో పొలాలూ, తోటలంటూ ఆ పనులు చూస్తూ నాన్నగారికి సాయపడుతుండేవాడు. ఆయన పోయాక మొత్తం అన్నీ తనే చూసుకుంటున్నాడు. తన వాటాకి వచ్చిన పొలం, తోట, తోటపక్క స్థలం, అన్నిటిమీదా అజమాయిషీ వాడే తీసుకున్నాడు. చూసుకుంటున్నాడు. వాటిమీద ఆదాయానికి తానెప్పుడూ ఆశపడలేదు. ఒక్క రూపాయిగానీ ఓ బియ్యం బస్తాగానీ అక్కడినుంచి తెచ్చుకున్నది లేదు. దేవుడి దయవల్ల పెద్ద ఉద్యోగాలే చేసి బాగానే ఏ లోటూ లేకుండా ఉన్నాడు తను.

ఒక్కగానొక్క కొడుకు శ్రీధర్ కూడా బాగా చదువుకుని సాఫ్ట్‌వేర్ ఇంజనీర్రై ఓ కాలు ఇక్కడా, ఓ కాలు అమెరికాలో వేస్తూ నెలకి లక్షలు లక్షలు సంపాదిస్తున్నాడు. చిన్నవయసులోనే అప్పుడే ఈ నగరంలో రెండు ఇండిపెండెంట్ ఇళ్ళు. రెండు ఫ్లాట్లు. ఓ రెండు షాపులు కొని అద్దెలకిచ్చాడు. ఎన్ని పెళ్ళి సంబంధాలొచ్చినా ఊ అనడు ఆ అనడు. ముప్ఫయ్యేళ్లొచ్చేశాయి కదరా అంటే ఇదేమంత పెద్ద వయసు అంటాడు.

భార్యపోయిన తనకి అండాదండా అన్నీ వాడే. తనకి ఒక్కడైనా ఉన్నాడు సంతానం. తమ్ముడికి పిల్లల్లేరు. అందుకేనేమో వాడిపట్ల  ఆపేక్ష రాను రాను మరింతగా పెరిగింది తనకి.

మనిషి కోరికలకి ఒక అంతం అంటూ ఉంటుందా? ధన దాహం తీరేదేనా? ప్రతివాడూ డబ్బు పోగుచేసుకోవాలని చూడటమే కానీ మానవ సంబంధాలకి విలువ నిస్తున్నారా?

ఇలాంటి ఆలోచన్లతో ఈ మధ్య ఆధ్యాత్మికతవైపు మొగ్గుచూపుతోంది మనసు. అందుకే సొంత ఊళ్ళో  ఉన్న ఆస్తిపాస్తులు తమ్ముడి పేరున  రాసెయ్యాలన్న  ఆలోచన ఈ మధ్య మొదలైంది.

"ఏమిటి నాన్నగారూ...  పేపర్ ఒళ్ళో పెట్టుకుని ఏదో ఆలోచిస్తున్నారు?" లోపలి గదిలోంచి  వచ్చి తండ్రికి ఎదురుగా సోఫాలో కూర్చున్నాడు శ్రీధర్.

వంటవాడు రామయ్య రెండు  కప్పుల్లో కాఫీ తీసుకొచ్చి ఇద్దరికీ అందించి...ఆ పూట వంట ఏం చెయ్యమంటారని అడిగి వెళ్ళాడు.

"నువ్వేమో పెళ్ళిమాట ఎత్తనివ్వట్లేదు. ఎప్పుడు ఇండియాలో ఉంటావో ఎప్పుడు అమెరికా తుర్రుమంటావో తెలియదు. నన్ను కూడా అక్కడికే వచ్చెయ్యమని అన్నా అంటావు. ఆ పల్లెటూళ్ళో మన పొలం, స్థలం అన్నీ బాబాయ్ పేరున రాసేద్దామను కుంటున్నాను. నీకవన్నీ ఆసక్తిలేని విషయాలు కదా? ఏమంటావు?"

"మీ ఇష్టం నాన్నగారూ..."వెంటనే బదులిచ్చాడు.

"నాకు నువ్వున్నావు. నువ్వే నా ఆస్తి. చాలు. బాబాయ్‌కి పిల్లల్లేరు."

"మీరింతగా చెప్పాలా నాన్నగారూ. ఇన్నాళ్ళూ బాబాయే కదా అవన్నీ చూశాడు. నేను ఏవీ పట్టించుకోలేదు.  ఇంకా ముందు ముందు ఇంతకంటే బిజీగానే ఉంటాను. ఖాళీ ఉండదు. మీ ఇష్టప్రకారమే చెయ్యండి. నాకు ఏ అభ్యంతరం లేదు" శ్రీధర్ మాటల్లో మృదుత్వం... మనసులో మృదుత్వం తొంగి చూసింది.

వ్యతిరేకించని కొడుకుని గొప్పగానూ, తృప్తిగానూ చూసుకున్నాడు సత్యమూర్తి. మీ కొడుకుని నేను ఉండగా బాబాయ్‌కిచ్చేస్తారా అన్నమాట పొరపాటున కూడా

నోటినుంచి రాలేదు. ఇంత మంచివాడిని కొడుకుగా తనకి ఇచ్చిన ఆ భగవంతుడెంత దయామయుడు.

కానీ తమ్ముడిమీద ఆపేక్షతోనూ జాలితోనూ సానుభూతితోనూ కొడుకుపట్ల అన్యాయంగా ప్రవర్తిస్తున్నాడా? లేదు... లేదు. చదువు, ఉద్యోగం పట్నవాస జీవితం ఏమీలేనితమ్ముడికి... ఆ దంపతులకి న్యాయం చేస్తున్నాడంతే.. తనకి తనే చెప్పుకున్నాడు సత్యమూర్తి.

"అయితే ఒకరోజు మన ఊరెళ్ళి వద్దాం. నువ్వూ సంతకం పెట్టాలి. ఇప్పుడే బాబాయ్‌తో మాట్లాడతాను."

కాఫీ తాగి కప్పుకింద పడుతూనే ఫోన్ చేతిలోకి తీసుకున్నాడు. అంతా విన్నాక "సరే నీ ఇష్టం అన్నయ్యా" అన్నాడు రాఘవ. అంతేగానీ "నాకు రాసెయ్యడం ఏమిటి? వద్దన్నయ్యా' అని మాత్రం అనలేదు. కానీ.... అదేమీ పట్టించుకోలేదు సత్యమూర్తి.

వద్దని అననందుకు సంతోషించాడు.

ఊళ్ళో అడుగుపెడుతుంటే శ్రీధర్ మనసులో చిన్న పులకరింత కలిగింది. మొదటిసారి అమెరికా వెళ్లినప్పుడు కూడా అలాంటి ఆనందం కలగలేదు అనిపించింది. జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి అని ఎందుకంటారో అనుభవానికి వచ్చినట్టయింది.

ఈ ఊరొదిలి పెట్టి వెళ్ళిపోయాక, ఈ పదిహేనేళ్లలో మళ్లీ ఒక్కసారి కూడా తనిక్కడ అడుగుపెట్టనందుకు ఆశ్చర్యం, బాధ కూడా కలిగాయి.

ఇంట్లో అడుగు పెడుతుంటే అమ్మ నవ్వుతూ పిలిచినట్టనిపించింది. పెద్దవాళ్ళు ముగ్గురూ పలకరింపుల్లో పడ్డారు.

వంటింటి వెనకవైపు వరండాలోకి నడిచాడు శ్రీధర్. అక్కడ రుబ్బురోలు చూస్తూనే కాళ్ళు ఆగిపోయాయి. రోటిముందు కూచున్న అమ్మ కందిపప్పు పచ్చడి రుబ్బే దృశ్యం నిలిచింది. కంటిముందు పిన్ని వంట చేసేదికాదు. రెండుపూట్లా వండి వడ్డించడం అమ్మే చేసేది. ప్రతిరోజూ ఏదో ఓ పచ్చడిని రోట్లో చేస్తూనే

ఉండేది అమ్మ. ఆవిడ చేసే పచ్చళ్ళ ఘుమ ఘుమలు, రుచులు గుర్తొచ్చి నీళ్ళూరాయి నోట్లో. అప్రయత్నంగా రోలు దగ్గరికి నడిచాడు. "అమ్మా... కాసేపు రుబ్బనా? నీ చెయ్యి నెప్పి పెడుతోందేమో!"

"మా నాయినే... ఆ మాటన్నావు... అంతేచాలు. నువ్వెళ్ళి చదువుకో. నోట్సులు రాసి రాసి నీ చెయ్యి నెప్పెడితే నేనేమన్నా రాసి పెట్టగలుగుతున్నానా? నేనూ చదువుకున్న దాన్నయితే నీకు ఆ సాయం చేసి పెట్టగలిగేదాన్ని."

"ఏమిటి సోది చెప్తున్నావు వాడికి?" నాన్నగారి గొంతు ఖంగుమనగానే తలవంచుకుని మౌనమై పోయిన అమ్మ మనోఫలకం మీద చెక్కుచెదరలేదు.

"మాట్లాడమ్మా. ఫర్వాలేదు. మాట్లాడు. నేను వింటాను" కలలో పలవరింతలా నిద్రలో నడకలా రోటికి మరింత దగ్గరగా అడుగులు వేశాడు.

"ఏమిట్రా ఒక్కడివీ ఇక్కడేం చేస్తున్నావు?"

ఉలిక్కిపడి చూశాడు. రోటి దగ్గర అమ్మ ఏదీ?

ప్రశ్న అడిగిన బాబాయ్ సమాధానం కోసం ఎదురుచూడలేదు. వీధి గుమ్మంవైపు వెళ్ళిపోయాడు హడావిడిగా మళ్ళీ ఏదో పని గుర్తొచ్చినట్లుంది.

సిల్కు పరికిణీ కాళ్ళకి అడ్డం పడుతుంటే ఒక చేత్తో పట్టుకుని ఎగురుతోంది చెట్టుకింద ప్రసూన మామిడిపిందెలు  అందుతాయేమోనని.

"నేను కోసిస్తాను ఉండు. ఎందుకంత కష్టపడతావు?"

"నువ్వూ ఎగరాల్సిందే, నాకంటే  కొంచెమే కదా పొడుగు నువ్వు?"

"అయితే ఏం? అందకపోతే చెట్టెక్కగలను."

"మా అమ్మ నన్ను చెట్టెక్కనివ్వదుగానీ.... లేకపోతే నేనూ ఎక్కగలను" రివ్వున వచ్చింది సమాధానం.

'ఎందుకు చెట్టెక్కనివ్వదు మీ అమ్మ?"

"ఆడపిల్లని కదా! పడితే చెయ్యో కాలో విరిగితే పెళ్ళి కాదని భయంట."

"మగపిల్లాడిని చెయ్యోకాలో విరిగితే పెళ్ళికి భయం కాదా?"

"ఏమో బాబూ! నా కవన్నీ తెలియవు' అంటూనే మళ్ళీ ఓ ఎగురు ఎగిరింది పరికిణీ అడ్డుపడి కొద్దిగా తూలింది.

"పడిపోతావు" గబుక్కున చెట్టు దగ్గరకి పరిగెత్తాడు.

గాలితో మామిడాకుల గుసగుసలు తప్ప ఎవ్వరూ లేరక్కడ. చిన్నబోయింది మనసు.

ఇప్పుడెక్కడుందో ప్రసూన? పెళ్ళయిపోయి ఉంటుందా? ఎందుకవకుండా ఉంటుంది?

ఈ పాటికి ఒకళ్ళో యిద్దరో పిల్లల్తో పెద్ద పేరక్క కబుర్లు చెప్తూ ఉండి ఉంటుంది.

"బావున్నారా బాబూ?"

ఆత్మీయత మాటలో తొణికిసలాడిన గొంతు, గతం నించి వర్తమానంలోకి వచ్చి వెనక్కి తిరిగి చూశాడు.

"నువ్వు... నువ్వు సింహాచలంవి కదూ?""

"ఔను బాబూ... గుర్తుపట్టేశారు తమరు..." మొహంలో సంతోషం కొట్టొచ్చినట్టు కనబడింది. నిష్కల్మషమైన నవ్వు పెదవులమీద.

గుర్తుపట్టినంత మాత్రానికే ఎంత ఆనందం ఈ మనిషికి!

మరీ ఇంతలా... వయసుకి మించిన ముసలితనంతో ఉన్నాడేమిటి?

ఎన్నేళ్ళుగానో ఈ ఇంటిని, ఈ కుటుంబాన్ని అంటిపెట్టుకొని... వీళ్ళ బాగోగులు వీళ్ళ కష్టసుఖాలు... ఆస్తులు, అంతస్తుల్లో వీళ్ళ ఎదుగుదల అన్నీ చూస్తున్న ఇతను.. తాను ఎదిగాడా? మరింత కుంచించుకుపోయినట్లు కనిపిస్తున్నాడే గానీ ఎదిగినట్లు ఏ మాత్రం ఛాయలే లేవే?

తనని చూసి మురిసిపోతే నిష్కపటంగా ఆత్మీయత ఒలికిస్తున్న అతని కళ్ళల్లోకి చూస్తూ మనస్ఫూర్తిగా అడిగాడు... "పిల్లలు బావున్నారా సింహాచలం?"

"మంచి వైద్యం చేయించలేక... పట్నం తీసుకుపోయి అక్కడాసుపత్రిలో చూపించే తాహతూ లేక చేతికంది వచ్చిన పెద్దకొడుకుని పోగొట్టుకున్నాను బాబూ. రెండో కొడుకూ.. మూడోది కూతురూ ఇద్దరూ కూడా వెర్రివాళ్ళూ.... ఏమీ తెలియని వాళ్ళు... ఏ పన్లూ చెయ్యలేరు. పట్నాల్లో ఇటువంటోళ్ళకి అన్నీ నేర్పించి చేతిపన్లు

కూడా నేర్పించే సంస్థలేవో ఉంటాయట కదుబాబూ! పట్నాల్లో ఉండేటోళ్ళు అదురుష్టవంతులు" చిన్నగా నిట్టూర్చాడు సింహాచలం.

మనసు కలుక్కుమంది.

మొదటినుంచీ ఈ ఇంటికే అంకితమైపోయిన కుటుంబం కదా సింహాచలం వాళ్లది.

బాబాయ్‌కి.. డబ్బుకి లోటులేదు. సింహాచలం పిల్లల విషయంలో డబ్బు సాయం చేసి వాళ్ళ బాగుకోసం ప్రయత్నించి ఉండవలసిందేమో!

అయినా బాబాయ్ గురించి ఆలోచించే ముందు తన గురించి తాను ఆలోచించుకోవడం మంచిదేమో!

నాన్నగారికీ ఆస్తిపాస్తులున్నాయి. తనూ నెల జీతం లక్షల్లో తీసుకుంటున్నాడు. నగరంలో ఆస్తులు చేర్చాడు. ఒక్కడే కొడుకు అయినందుకు నాన్నగారి ఆస్తులూ తనవే. అయితే? లేనివాళ్ళకి గానీ... అవసరంలో ఉన్నవాళ్ళకిగానీ... ఎవరికైనా సాయం చేశాడా?

చిన్న ప్రశ్న క్షణాల్లో కొండంతయి నిలిచింది కళ్ళముందు.

అంతర్మథనం మొదలైంది. తీవ్రంగా ఆలోచిస్తూ వీధిలోకి నడిచాడు.

కాళ్ళెటు తీసుకుపోతే అటే నడుస్తున్నాడు. ఆ రోజుల్లో తను చూసిన ఇళ్ళే అన్నీ.... ఆ ఎత్తు అరుగుల ఇల్లు శీనువాళ్లది కాదూ? పదోతరగతి వరకూ తనతో కలిసి చదివాడు. ఆ తర్వాత తనూ, అమ్మా నాన్నగారి దగ్గరికి సిటీకి వెళ్ళిపోవటం జరిగింది. నాన్నగారు బదిలీల మీద తిరుగుతుండటం ఒక్కొక్కసారి ఉద్యోగాలు మారిపోవటం. ఈ కారణం వల్ల అమ్మనీ తననీ, తన పదోతరగతి వరకూ ఇక్కడే ఉంచారు.

హుషారుగా గబగబా ఎత్తు అరుగుల ఇంటి దగ్గరకి ముప్పిరిగొన్న ఆనందంతో చేరాడు. అరుగుమీద కూచున్న ఆవిడని తేరిపార చూశాడు.

శీనూ వాళ్ళమ్మే... ఔను అలాగే వుంది. అప్పుడు బాగా సన్నగా వుండేది. ఇప్పుడు చాలా లావయ్యింది. ఆవిడ కూడా ఎగాదిగా చూసింది. "ఎవరు కావాలి? ఎవరు నువ్వు?" అని అడిగింది.

"నేనండీ శ్రీధర్ని. శీనూతో కలిసి పదవతరగతి వరకూ చదువుకున్నాను. పార్వతీశం గారి మనవడిని... రాఘవరావుగారు మా బాబాయ్‌గారు. శ్రీనూ ఇంట్లో ఉన్నాడాండీ?"

"పిలుస్తాను" అంతకంటే ఇంకొక్కమాట మాట్లాడకుండా లోపలికి వెళ్ళిపోయింది. నిర్ఘాంతపోయాడు శ్రీధర్. చదువుకునే రోజుల్లో వీళ్ళింటికి వచ్చినప్పుడల్లా చక్కగా కబుర్లు చెప్పేది. తనచేత పద్యాలు పాడించుకునేది. ఇన్నేళ్ళ తర్వాత హఠాత్తుగా గుమ్మంలో నిలబడితే ఆశ్చర్యంతో కూడిన ఓ చిన్న పలకరింపైనా లేదే? మాటవరసకైనా లోపలికి రమ్మనలేదే?

ఆవిడ వెళ్ళిన కాసేపటికి బయటకి వచ్చాడు శ్రీను.

వచ్చినవాళ్ళెవరో వాళ్ళమ్మ చెప్పినట్టుంది.

ఎంతో మామూలుగా యథాలాపంగా అడిగాడు. "ఎప్పుడొచ్చావు?" తను ఆశించినది వాడి మొహంలో కనిపించలేదు. ఎంతో ఇబ్బందిగా అనిపించింది. ఇన్నేళ్లల్లో ఎప్పుడూ రాలేదేమిట్రా? అప్పుడప్పుడు ఈ ఊరు రావచ్చు కదా? అన్న మందలింపుగానీ... ఆత్మీయతగానీ మాటల్లో చూపించలేదు. చివుక్కుమంది మనసు. మళ్లీ అంతలోనే.... ఆ మనసే సర్ది చెప్పుకుంది తనకి తనే... సొంత ఇల్లు... సొంత మనుషులు ఉన్న సొంత ఊరు రావటానికి ఏమాత్రం ఆసక్తి లేకుండా ఏళ్లకి ఏళ్లు గడిపిన తనమీద వాడికెందుకుండాలి ఆసక్తి? లోపలికి రమ్మనలేదు శీను. అలా నడుద్దామా అంటూనే అరుగుమీద ఉన్న చెప్పులు తొడుక్కుని వచ్చాడు.

పక్కనే నడుస్తూ స్నేహితుడి కుశలం అడిగాడు శ్రీధర్.

"నీలాగా పెద్ద చదువు చదువుకోలేదు. నీలాగా పట్నంలో లేను. నీకుమల్లే ఉద్యోగస్తుడిని కాను" పుల్ల విరిచినట్లు వచ్చింది మాట.

ఊహించని సమాధానంతో మాట పెగల్లేదు.

"ఇలా అంటున్నానని ఏమీ అనుకోవద్దు. మా ఇంటివైపు రాకు. మా నాన్న మీ బాబాయ్ వేరు వేరు పార్టీలు. ఇద్దరికీ పడదు. ఊళ్ళో రాజకీయాలెక్కువైపోయాయి. మన చిన్నప్పుడు ఉన్న పరిస్థితులు కాదిప్పుడు. ఈ మధ్య మీవాళ్ళూ మా వాళ్ళూ చాలా కొట్టుకున్నారు."

"మనిద్దరి స్నేహం మధ్య రాజకీయాలెందుకూ?" అర్థం కానట్టు చూశాడు.

"అలా అనుకుని సరిపెట్టుకోవడానికి మనిద్దరం చిన్నపిల్లలం కాదుగా?"

రాజకీయాలకి ఎలాంటి శక్తి ఉంటుందో శ్రీను అన్న ఈ ఒక్క మాటలో కనపడింది శ్రీధర్‌కి. ఆనాటి స్నేహితులు ఊళ్ళో ఇంకా ఎవరెవరున్నారని అడుగుదామనుకున్న వాడు కాస్తా మిన్నకుండిపోయాడు. అడగాలనిపించలేదు. కలతపడ్డ మనసుతో శ్రీను దగ్గర సెలవు తీసుకుని తాను చదువుకున్న బడివైపు సాగిపోయాడు. అక్కడికి వెళ్ళేసరికి సేదతీరింది మనసు. వేలాడే సంచీ భుజాన వేసుకుని తాను బిరా బిరా బళ్ళోకి పరిగెత్తడం గుర్తొచ్చి పెదవులు చిన్నగా విచ్చుకున్నాయి శ్రీధర్‌కి. బడి దగ్గర.... తంగేడు చెట్టుకి అవతలగా కూచుని రుచి రుచిగా వేడి వేడిగా పుణుకులు చేసి అమ్మేది అవ్వ. పిల్లలందరూ గుమిగూడే వారక్కడ. ఆకుల్లో పెట్టి ఆప్యాయత రంగరించి చేతికందించేది. తను కూడా రోజూ అవి తింటూ ఇంటికెళ్ళేవాడు. ఇప్పుడు రోడ్డు పక్కవి కొనుక్కుతినమంటే అమ్మో అంటాడు. శుచిగా శుభ్రంగా అత్యంత రుచిగా ఏ కల్తీలు లేకుండా చేసేది అవ్వ. యాభయ్యేళ్ళు ఉండేవేమో తనీ ఊర్నించి వెళ్ళిపోయే నాటికి... ముసలితనం కాకపోయినా అవ్వ అనే పిలిచేవారందరూ. పురికొసతో జుట్టు ముడివేసుకుని... అలసట అంటే ఏమిటో తెలియనట్టు... ఎప్పుడూ నవ్వు మొహంతోనే ఉండేది.

ఒకరోజు కాస్త దూరంగా నిలబడి చూస్తుంటే అవ్వ పిలవటం గుర్తొచ్చింది.

"దా.... బాబూ... తీసుకో."

"అమ్మ డబ్బులివ్వలేదు. ఇవ్వనంది" సిగ్గుపడుతూ చెప్పాడు.

"నువ్వు బాగా చదువుకుని... పెద్ద ఉద్యోగం చేస్తావు కదా! అప్పుడిద్దువుగానిలే ఈ అవ్వకి డబ్బులు. మరేం ఫర్వాలేదు. రోజూ తీసుకో మొహమాటం పడకు" వేడి వేడి పుణుకులు ఆకులో చుట్టి అరచేతిలో పెట్టింది. అప్రయత్నంగా తనకి తెలియకుండానే అవ్వ కూచునే జాగా దగ్గరికి అడుగులు వేశాడు శ్రీధర్ మధురమైన గతాన్ని నెమరు వేసుకుంటూ.

"ఏంటి బాబూ ఇక్కడ నుంచున్నారు?"

ఉలిక్కిపడి చూశాడు. తన చేతులు రెండూ దోసిల్లా పెట్టి ముందుకు చాపి ఉన్నాయి. పుణుకుల ఘుమఘుమలేవి? ఏదీ అవ్వ? కళ్ళు తడి అయ్యాయి శ్రీధర్‌కి.

ప్రశ్న అడిగినవాడు... పొద్దున్న బస్‌స్టాండ్ నించి ఇంటికి తీసుకొచ్చిన జట్కావాడు వెంకన్న.

మొహమాట పడకుండా అతన్ని అడిగేశాడు శ్రీధర్ "ఇదివరకు ఒక అవ్వ పుణుకులు వేసి అమ్ముతుండేది ఇక్కడ కూచుని... ఇప్పుడెక్కడుంది?"

"ఏం చెప్పమంటారు? వాళ్ళాయన జరమొచ్చి పోయాడు. పెద్దకొడుకు పట్నం పారిపోయాడు. రెండోవాడు పాము కరిచి చచ్చిపోయాడు. అప్పట్నించీ అవ్వ మనుషుల్లో లేదు. ఎవ్వరితో మాట్లాడదు. తిండి తినదు. ఒక్కత్తీ ఇంట్లో బొమ్మల్లే కూచునుంటుంది. ఎవరైనా కాస్త అన్నం తీసుకుపోయి చేతిలో పెట్టి తినమని బలవంతం చేస్తే కాస్త తింటుంది. లేకపోతే లేదు"వినటానికే కష్టం అనిపించింది శ్రీధర్‌కి. "నన్ను వాళ్ళింటికి తీసికెళ్తావా ఇప్పుడు?"

"పదండి బాబూ తీసుకెళ్తాను" వెంటనే కదిలాడు అతను. పడిపోతున్న పూరిపాకలో చెక్కబొమ్మల్లే ఉంది అవ్వ.

"నువ్వు బాగా చదువుకుని, పెద్ద ఉద్యోగం చేస్తావు కదా... అప్పుడిద్దువుగానిలే ఈ అవ్వకి డబ్బులు" చెవుల్లో పదే పదే మారుమోగాయి అవ్వ మాటలు.

"అవ్వా!" శ్రీధర్ గొంతు గద్గదికమైంది.

"అవ్వా! నిన్ను చూడాలని వచ్చారీ బాబుగారు"

ఊహు.. వెంకన్న మాటలకి కూడా తలెత్తలేదు అవ్వ.

"ఇంతే బాబుగారూ! ఎవ్వరొచ్చి పలుకరించినా తల కూడా తిప్పదు. చూడదు". మాట్లాడించడం అనవసరం అన్న భావం తొంగి చూసింది వెంకన్న మాటల్లో. "అవ్వా! నాకు పుణుకులు చేసి పెట్టవా?" జాలిగా అడిగాడు శ్రీధర్. చటుక్కున తలెత్తింది అవ్వ. ఆ కళ్ళల్లో మెరుపు చూడగలిగాడు. ఏదో మాట్లాడాలన్నట్టు ఆమె పెదవులు అల్లల్లాడాయి. శ్రీధర్ వంకే తేరిపార చూస్తోంది. ఆమె రెండు చేతులూ అపురూపంగా అందుకుని కళ్ళకి అద్దుకున్నాడు శ్రీధర్. వింతగా చూశాడు వెంకన్న.

"అవ్వ చేతి పుణుకులు నేను తప్పకుండా మళ్లీ తింటాను వెంకన్నా. అవ్వని మామూలు మనిషిని చేస్తాను. ఆ బాధ్యత ఆనందంగా స్వీకరిస్తాను" శ్రీధర్ స్వరంలో బాధ్యతాయుతమైన పట్టుదల ధ్వనించింది.

మధ్యాహ్నం భోజనాలై గదిలో నడుం వాల్చినప్పుడు పక్కగదిలోంచి వినపడిన బాబాయ్ మాటలు నిద్రమత్తుని ఎగరగొట్టాయి శ్రీధర్‌కి. "రాజకీయాల్లో నిలదొక్కుకోవాలంటే ఎంత డబ్బో తగలేస్తేగానీ అవ్వదు. మనడబ్బెందుకూ తగలేసుకోవడం? అప్పనంగా అన్నయ్య ఇస్తున్నాడు తనదంతా నాకు.. మంచిదే. రాజకీయ అవసరాల కోసం... విరివిగా ఖర్చుపెట్టుకోవచ్చు ఇప్పుడు."

"ఆ తోటా పొలం స్థలం మీ అన్నయ్య ఇచ్చేది మెల్లిగా తర్వాత మంచి ధర రాగానే అమ్మి పారేస్తే సరి. బోలెడు డబ్బు సమకూరుతుంది. మీ కోరిక తీరుతుంది" వంత పాడుతున్న పిన్నిమాటలూ వినిపించాయి.

"బాబాయ్! నువ్వు నన్ను క్షమించాలి."

శ్రీధర్ వైపు నవ్వుతూ చూశాడు రాఘవ.

"ఏవిట్రోయ్! ఏవో పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతున్నావు?"

"నేనొక నిర్ణయానికొచ్చాను. నాన్నగారు నాకిస్తానన్నవి నాకే కావాలి. లాయరుగార్ని రేపు రావద్దని చెప్పేసెయ్యి. నేను సంతకం చెయ్యబోవటం లేదు."

"ఏమిట్రా మాట్లాడుతున్నావు?" కంగారు పడిపోయాడు సత్యమూర్తి. పిన్నీ బాబాయ్ మొహాలు వెలవెలపోవటం గమనించాడు శ్రీధర్.

"బాబాయ్! నేను నాన్నగారికొక్కరికే కొడుకును కాదు. మీకూ కొడుకునే. నాన్నగారి బాధ్యత నాకెంత ఉందో మీ ఇద్దరి బాధ్యత కూడా నాకంత ఉంది ఈ క్షణం నుంచీ."

ఈ ఉపోద్ఘాతం దేనికో అర్థంకాక శ్రోతలు ముగ్గురూ ఆత్రుతగా చూస్తున్నారు.

"తోట దగ్గర స్థలంలో నేనొక బడి కట్టించాలని..."

"బడెందుకురా? " మాట సగంలోనే అడ్డుకున్నాడు రాఘవ.

"మామూలు బడి కాదు. సింహాచలం పిల్లల్లాంటి వాళ్ళు ఈ ఊళ్ళోనూ.... ఈ చుట్టుపక్కల ఊళ్ళల్లోనూ ఇంకా ఎందరో ఉంటారు కదా?"

"ఎందుకు లేరూ ఉన్నారు"

"అటువంటి పిల్లలకి ఆటాపాటా చదువు చేతి పన్లూ నేర్పి వాళ్లని కూడా ప్రయోజకుల్ని చేసే శిక్షణా కేంద్రం... తిండీ బట్టా ఉండడానికి వసతీ అన్నీ ఇచ్చే విధంగా.. నా అన్నవాళ్ళు లేని, ఒంట్లో శక్తిలేని వృద్ధులకి కూడా ఆసరా కల్పించాలనుకుంటున్నాను. ఆ పొలం తోటల మీద వచ్చే ఆదాయం వాళ్ళకే ఖర్చు పెట్టదల్చుకున్నాను. నా సంపాదనలో కొంతభాగం కూడా వాటికే ఖర్చుపెడతాను. మీ ముగ్గురి ఆశీర్వాదం నాక్కావాలి."

"హఠాత్తుగా నీకీ ఆలోచన ఎందుకొచ్చిందిరా?" ఇంకా ఆశ్చర్యం నుంచి తేరుకోలేదు సత్యమూర్తి.

"ఒక అవ్వ... మన సింహాచలం... నా కళ్ళు తెరిపించారు నాన్నగారూ ఎటొచ్చీ ఈ ఊళ్ళో నేను అనుకున్నవి ప్రారంభించేవరకూ అవ్వని ఒంటరిగా వదిలేయ్యదల్చుకోలేదు. మన ఊళ్ళో వైద్యం చేయించి, తాత్కాలికంగా అక్కడ ఏదైనా వసతి ఏర్పాటు చేస్తాను."

"కానీ... ఒరే నీ ఆలోచనలు బావున్నాయి. నీ నిర్ణయాలు బావున్నాయి. నీ పెళ్ళి సంగతి ఏమిటి మరి?"

"చేసుకుంటాను నాన్నగారూ... నా ఆలోచనల్లతో ఏకీభవించే అమ్మాయి తటస్థ పడకుండా ఉంటుందా? అప్పుడు చేసుకుంటాను. త్వరలో తటస్థ పడాలని దీవించండి" నవ్వుతూనే చేతులు జోడించాడు.

సత్యమూర్తితో పాటూ రాఘవ కూడా మనస్ఫూర్తిగా దీవించాడు. వంటింటి గుమ్మంలో కూచుని ఉన్న పిన్ని తలుపు పట్టుకుని లేచే ప్రయత్నం చేస్తుంటే చటుక్కున వెళ్ళి ఆమెకి చేయి ఆసరా ఇచ్చాడు శ్రీధర్.

ధనం ఇవ్వలేని తృప్తి మనిషితోడు ఇవ్వగలదని ఆమెకే కాదు రాఘవకి కూడా అనిపించింది. ఉన్న ధనాన్ని సద్వినియోగపరిస్తే తోడులేని మనిషే ఉండడు కదా అని కూడా అనిపించిన మాట వాస్తవం.

**– ఆంధ్రభూమి వారపత్రిక, 3జూన్, 2010**

# చిన్నదేవేరి

– డా॥ చాగంటి తులసి

ఇప్పుడు గుండెలు బాదుకుని లబోదిబో మని తల మొత్తుకుంటున్నారు. నేరకపోయి భజనకి వెళ్ళమన్నామే అని నెత్తి నోరు కొట్టుకుంటున్నారు. వెయ్యి చెప్పు లక్ష చెప్పు భజనకెళ్ళి భ్రష్టుపనులు చేస్తుందని ఎవరన్నా కల్లోనన్నా అనుకోగలరా? మనస్సుకి శాంతిగా ఉంటుందీ, లేనిపోని ఆలోచనలతో, ఊహలతో బెంగపట్టుకుని మనిషి నీళ్ళు కారిపోకుండా ఏదో ఆ బాబా ఆసరా, ఆ దేవుడి ఆసరా అని అందులో పడిపోతే మంచిదీ అనుకున్నారే కాని విపరీతంగా ఇలా కథ తిరుగుతుందని ఎలా అనుకోగలరూ? దాని బుద్ధి భ్రష్టు అయ్యేది అయితే భజనేం చేసిందీ? ఈ త్రాష్టుడు కాకపోతే మరోడు దొరికి ఉండేవాడు! చెడిపోయింది! ఇంక దాన్ని దారికి తీసుకురావడం దాన్ని పుట్టించిన బ్రహ్మతరం కూడా కాదు!

పెళ్ళి కాకుండా అలా మోడులా ఉండిపోతే అందరికి దుఃఖమే! ఓ కొమ్మని పట్టుకొని అల్లుకుపోవడమే కావాలి? ఎవరు కాదంటారు? ఆ ఆసరా ఇవ్వలేదని, ఇవ్వలేకపోయేరనీ దుఃఖపడుతూనే ఉన్నారు! దాని నుదుటిని రాసిపెట్టందే ఎంత దుఃఖపడితే మాత్రం ఏం లాభం అని గుండెరాయి చేసుకున్నారు!

“పోనీ అమ్మా, ఎవణ్ణో ఒహణ్ణి పట్టుకుంది. మంచి మాటే!” అని అనుకోడానికి వీలా? ఆ పట్టుకున్నవాడు త్రాష్టుడాయె! పట్టుకోక పట్టుకోక పెళ్ళాం, పిల్లలూ ఉన్న వాణ్ణా పట్టుకోవడం? పిల్లలన్నా ఒకళ్ళా యిద్దరా? నత్తాః నావాః ఎనమండుగురు పిల్లలు.

ఇంత గ్రంథం జరిగినా ఇదిగో ఇప్పుడు కదా తెలుస్త! ఎవరికి ఎప్పుడూ దానిమీద అనుమానమన్నా ఉంటేనా? ఆన పెట్టడానికి హద్దులు గియ్యడానికీ! దాని పనేమిటో అదో మాలోకం మనిషిలా ఉండే దాయిరి! ఏం తెలుస్తుందీ? ఒక్క యింట్లోనేనా, దాని ఆఫీసువాళ్ళూ ఆమాటే అంటారాయిరి! అంతమంది మొగాళ్ళ

మధ్యకి రోజూ వెళ్తోంది. పొద్దున పదిగంటలనుంచి ఐదుగంటలవరకూ ఆ ఆఫీసులో టైపు కొడుతూ వాళ్ల మధ్యే ఉంటుందా? పోనీ అందులో ఉన్న వాణ్ణి ఎవణ్ణైనా బాగుండిపోయేది! పెళ్ళికాని కుర్రాళ్ళు వుండనే వున్నారు! నిజమే అనుకో. ఆ కుర్రాళ్ళు దీనికన్నా చిన్నవాళ్ళే అయ్యుంటారు. అయినా ఓ చిన్నవాణ్ణి కట్టుకున్నా తీరిపోయేది! అంతేకానీ పట్టుకు పట్టుకు పెళ్ళాం, పిల్లల వాణ్ణా పట్టుకోవడం?

అయ్యోరామా! మన జాతి కాకపోయినా బుర్రబద్దలు కొట్టుకునే వారుకారు! చెప్పొద్దూ, అందరిలాగే ముందు లబోదిబోమన్నా తర్వాత సద్దుకుపోయేవారు! అయినా ఈ రోజుల్లో జాతీ గీతీ ఎక్కడా?! నానా రకాలు! ఎలాగా అన్నీ కలుస్తూనే ఉన్నాయి! చూడు ఏం రాతో! పట్టుకు పట్టుకు పెళ్ళాం పిల్లలవాణ్ణా పట్టుకోవడం!!

వెర్రిమొద్దు కాని ఏం సుఖపడదామనీ, ఏం బావుకుందామనీ వాడి వల్లో పడ్డాదీ! వాడుతెచ్చే రాళ్ళు వాడికి వాడి పెళ్ళాం పిల్లలకే చాలవు! ఇది వాడికి పెట్టాలి కాని వాడు దీనికి పెట్టడం అన్నది సున్నానే! వాడున్నాడే వాడు దేవాంతకుడు! ఇది వాణ్ణి పట్టిందా? కాదు కాదు వాడూ దీన్ని పట్టేడు! వాడి చూపుల్లో చిక్కుకుపోయింది! నిజం చెప్పొద్దూ, వాడు ఉండడమూ, అలాగే ఉంటాడు! ఎనమండుగురు పిల్లల తండ్రిలా ఎక్కడన్నా కనబడతాడా? అబ్బే! పూలరంగడిలా ఉంటాడు! వయస్సు పైబడ్డా ఎక్కడా మొహంలో ముదరతనమే కనిపించదాయిరి! సూది ముక్కు, తళ తళమెరిసే కళ్ళు – గీసిన గీతలా కలిసిపోయి ఎర్రటి పెదాలురెండూ పరుచుకుని ఉంటాయి. నవ్వితే ఆ పెదాల మధ్య మెరుస్తూ చక్కటితెల్లటి పలువరుసా! అందగాడు మరి! నన్ను చూడు – ఇంకోసారి నావేపుచూడు అన్నట్టు ఉంటాడాయిరి! దానికితోడు ఆ పాటో! ఎంత కమ్మగా పాడతాడనీ! ఎంతటి భక్తిలేని నాస్తికుడయినా పాట వింటూ తన్మయత్వంతో ఊగిపోవల్సిందే? అదిగో ఆపాటే కొంపముంచింది! దీనిదీ తియ్యటిగొంతుకా? తేనె లొలికేటట్లు పాడుతుంది. ఇది భజనకి వెళ్లడం మొదలెట్టిన దగ్గర్నుంచి భజన మరీ రక్తికట్టేది. వాడు అప్పుడు అప్పుడూ మధ్య మధ్యలో ఎగనామం పెట్టేవాడా – అలాంటిది ఇది భజనకి వెళ్ళడం మొదలెట్టిన దగ్గర్నుంచీ అందరికన్నా ముందరే వచ్చి హాజరు! ఈ బొంగురుగొంతుకా– ఆ కీచుగొంతుకా – అటో అపస్వరం– ఇటో అపస్వరం– భొయ్యి భొయ్యిమని హార్మనితో

గట్టిగా పెంకులు ఎగిరి పోతూ అరుస్తూ చేసే భజన రూపమే మారిపోయింది. మొగాళ్ళ గొంతుకల్లో వాడిదీ – ఆడాళ్ళ గొంతుకల్లో దీనిదీ అంచక్కా శ్రావ్యంగా చెవికింపుగా వినిపిస్తూ ఉంటే బొంగురు గొంతు కలవాళ్ళూ, కీచుగొంతు కలవాళ్ళూ, అపస్వరాల వాళ్ళూ గొంతు తగ్గించి, మందితో కలిసి నెమ్మదిగా భజన ముక్కలు అందం నేర్చుకున్నారు. భక్తి లేనివాళ్ళు కూడా పరవశించేటట్టు వీళ్ళు భజన చేస్తూ వుంటే భజన కొచ్చే వాళ్ళూ సావిడి పట్టకుండా నిండిపోయేవారు. అంతమందికీ భక్తి కలిగించే ఆ కమ్మటి గొంతుక లిద్దరికీ  భక్తీ లేదు, పాడూ లేదు. అంతా వేషమే! కపటమే! అభినయమే ఎవడికబ్బా ఇలాంటి సంగతని తెలిసేడుస్తుంది!

అన్నం అంతా చిమిడిపోయింది. అన్నగారికి తెలిసింది. దాంతో సున్నం ఉడికినట్లు కుతకుతా ఉడికిపోయేడు. దానిమీద ఎగిరేడు. ఎగిరేడంటే ఎగరడూ? అది చేస్తున్న పని అప్రాచ్యపు పనాయిరి! దారి తప్పిందాయిరి! చెడా మడా తిట్టి దార్లో పెట్టాల్సిన వాడూ, పెద్దవాడూ ఇంటి బాధ్యతలు నెత్తిమీద ఉన్నవాడూనూ! పరువూ, ప్రతిష్టా కావలసిన వాడూ, ఉన్నవాడూనూ!! ఊరుకుంటాడా?? ఎలా ఊరుకుంటాడు? చూస్తూ చూస్తూ చెల్లెలు గోతిలో పడ్తూ ఉంటే ఊరుకోవడం ఎలాగ? దాని బాగోగులు మంచి చెడ్డలు చూడ్డూ??

“నువ్వుచేస్తున్నది తప్పే! కానిపనే” అని నయాన్ని చెప్పి చూసేడు. ఉహూఁ దానికి చీమ కుట్టినా అనిపించలేదు.

“నువ్వింత జడ్డిదానివేమే! కళ్ళు మూసుకుపోయాయేమే? ఇది ప్రేమా వల్లకాడూ కాదే! వాడు నీ డబ్బు కోసమే నిన్ను పట్టాడే!!” అని వాడి అసలు రంగు బైటపెట్టేడు.

అదిగో – దాంతో అంతా బైటికి వచ్చింది. నిప్పుకొండలో నిప్పు రగులుకుని రగులుకుని ఉందేమో లోపల ఉన్న లావా వేడి సెగలతో, పొగలతో పైకి బుస్సు బుస్సు మంటూ పొంగుకుంటూ వచ్చింది! అది ఓ నిప్పుకొండనీ! నుసి కప్పుకుని ఉందనీ ఆ అన్నగారికీ తెలీదు.

ఎలా తెలుస్తుందీ? మర్యాదా మప్పితము – చెప్పినమాట వినడమే తప్ప ఎందుకూ, ఏమిటీ అని ఎప్పుడన్నా అని ఎరుగునా? ఆడపిల్లకి అంతకన్నా చదువెందుకూ – ఏదో స్కూలు ఫైనలు అయిందిగా చాలు. రెండు ముక్కలు చదువుకుంది అని

అన్నప్పుడు అది పెదవి విప్పిందా? లేదే! పెద్దాడి చదువు ఇంకా పూర్తికానేలేదు. దీని తర్వాత వాడు చదువుకి అంది వచ్చేసేడాయిరి! మొగ పిల్లలకి చెప్పించడమే న్యాయమాయిరి– ఆడపిల్లలకి అంతంత డబ్బు పోసి చెప్పించడం మళ్ళీ అంతకి మరింత డబ్బుపోసి ఓ అయ్య చేతిలో పెట్టడం దండగాయిరి! వచ్చేయే అనుకో రాష్ట్రం అంతటికీ ఫస్టుమార్కులే దానికి వచ్చేయి! ఎవరు కాదనగలరూ? తెలివైందీ! ఎందుకు రావూ! అయినా మాత్రం మొగ పిల్లాడికి చదువు ముఖ్యంకాని, ఆడదానికి అంత ముఖ్యమా? మొగపిల్లాడిమీద పెట్టిన డబ్బు ఎక్కడికీ పోదు. అది పెట్టుబడే! ఆడపిల్ల మీద డబ్బు పెడితే నీళ్ల ధారేకదా! అదీ సంగతి! అందుకని దానికి చదువు అక్కర్లేదూ అన్నారు. ఎలా చెపితే అలా వినుకునే పిల్ల! పెళ్ళిచేసి అత్తారింటికి పంపించేస్తాం – ఇంట్లో అందాకా కూర్చో అన్నారు. అలాగే కూర్చుంది. అయితే అక్కడే వచ్చింది చిక్కంతా! ఇదిగో ఈ మాఘంలో పెళ్ళిచేస్తాం ఆ మాఘంలో పెళ్ళిచేస్తాం అన్నారు. అలా అనుకుంటూనే మాఘాలెన్నో ఆఘ మేఘాలమీద వచ్చి వెళ్ళిపోయేయి. ఇప్పటికీ మాఘమాసం వస్తూనూ ఉంది వెళ్తూనూ ఉంది. ఓ అయ్యకి కాళ్ళు కడిగి కన్యాధార పోసే ఘడియ ఏ మాఘంలోనూ, రాలేదు!

సరి, తర్వాత ఏమైందీ? ఉత్తినే కూర్చుంటే ఏం తోస్తుందీ? కాలక్షేపంగా నేనా ఉంటుంది. టైపూ షార్టుహేండూ నేర్చుకో అన్నారు. అపుడన్నా నోరువిప్పి ఏమన్నా మాట్లాడిందా? అబ్బే, అలాగే వెళ్ళి నేర్చుకుంది. తెలివైంది! ఇట్టే చూస్తూ ఉండగానే పరీక్షలూ పాసయి పోయింది. భేషుగ్గా టైపు కొడుతుందని పేరూతెచ్చుకుంది. ఇది ఇలా కూర్చునే ఉంది! అటు అన్నగారి చదువూ పూర్తైంది. ఉద్యోగమూ అయింది. చూస్తూ ఉండగానే ఓ ఇంటివాడూ అయ్యేడు, పిల్లల్నీ ఎత్తేడు. అదలాగే ఉండిపోయిందాయిరి! దాని తర్వాత వాళ్ళు జమా జట్టీల్లా పెరిగిపోయి మా చదువుల సంగతేమిటి, మా పెళ్ళిళ్ళ సంగతేమిటీ అని వరసాగ్గా నిల్చున్నారాయిరి!! అన్నగారిమీదే అంతా పడ్డాదాయిరి? ఇంట్లో గోళ్ళు గిల్లుకుంటూ కూర్చునేకన్నా టైపిస్టుగా జాయినవ్వు, నీకు కాలక్షేపానికి కాలక్షేపం. వేణ్ణీళ్ళకి, చన్నీళ్లూనూ అన్నారు. నిజం చెప్పొద్దూ పాపం మాటలు అప్పుడన్నా నోరువిప్పి ఏమన్నా అన్నాదా?? అబ్బే! అదేమన్నా అంటుందా? అణుకువైన పిల్ల! అదెందుకంటుందీ?

ఉద్యోగంలో చేరనూ చేరింది. జీతం రాళ్ళని ఇంట్లో ఇవ్వనూ ఇచ్చింది. ఇప్పటివరకూ ఇస్తూనే ఉంది. దానికి ఖర్చు అన్నది లేనే లేదాయిరి! ఓ సరదానా! ఓ షోకా? అబ్బే! ఏ మాటకామాట చెప్పుకోవాలి. దాని కలాంటి వేమీ తెలీనే తెలీవు! గొప్ప చెప్పడం కాదు కాని దాని లాంటిది ఈ భూ ప్రపంచంలో మరొకత్తి కనిపించదు.

పల్లెత్తుమాట ఎప్పుడూ ఎవరినీ అని ఎరుగదు! కన్నెత్తి ఎప్పుడూ ఎవరినీ చూసీ ఎరుగదు పరమ సాత్వికురాలు! దాని బతుకలా మోడులా అయిపోయిందని ఇంట్లో అందరికీ దుఃఖమే! ఏం చెయ్యలేక పోయేమే అని అందరికీ బాధే!

ఆడయ్యేది మగయ్యేది మనిషన్న తర్వాత ఏదో ఒక ఆసరా ఉండాలి? ఏదో ఒక పట్టుకొమ్మ ఉండాలి. ఆనుకోడానికి పట్టుకొమ్మన్నది లేకపోతే మనిషి ఒంటరితనాన్ని భరించలేక పిచ్చెక్కిపోతాడు. వాడి మనస్సుకి చెదలు పట్టేస్తాయి?అదిగో, అదిగందుకే దాన్ని భజనకి వెళ్ళవే అన్నారు. పట్టుకొమ్మ పరమేశ్వర భక్తి అయితే మరేం పరవాలేదనుకున్నారు. బతుకు తేలిగ్గా వెళ్ళిపోతుందనుకున్నారు. అంతేకాని కథ యిలా తిరుగుతుందని ఎవరన్నా కల్లోనన్నా అనుకున్నారా? అదో నిప్పు కొండ అనీ, అదెప్పుడో అప్పుడు బద్దలవుతుందనీ ఎవరన్నా అనుకున్నారా??

"మీకు నా మీద ఉన్నది ప్రేమా? వల్లకాడా? ముందు చెప్పండిరా! తర్వాత ఆ మనిషికి నా మీద ప్రేమే ఉందో, వల్లకాడో ఉందో నేచెప్తానూ" అంటూ అది లేచేసరికి అంతా నోళ్ళు తెరుచుకుని అట్టే ఉండిపోయేరు. దీనికి మాట్లాడ్డం వచ్చా అన్నట్టు ఉండేదాయిరి! చ(రుమని ఇంతెత్తుకు లేచి ఇలా కరిచేటట్లు మాట్లాడుతుందని ఏం ఎరుగుదురూ?

"డబ్బు కోసం కాదురా మీరు నన్ను ఉద్యోగంలో పెట్టిందీ! నామీద అభిమానమా? నాడబ్బుమీద అభిమానమా? ముందు చెప్పి ఏడవండి.ఆ తరవాత ఆ మనిషికి నా మీద అభిమానమే ఉందో ఆపేక్షో ఉందో నే చెప్తాను!" అని సివంగిలా అరుస్తూ మీద మీదకి వచ్చింది! అంతా నోట మాటరాక నిలబడిపోయేరు.

"నామీద ప్రేమే ఉండి ఏడిస్తే స్కూలు ఫైనలు మొత్తం రాష్ట్రానికే ఫస్టు తెచ్చుకుని పాసయ్యేనే – కాలేజీ చదువులు ఎందుకు చెప్పించలేదూ? ఇంట్లో ఎందుకు కూర్చోపెట్టేరూ? ఏం మాట్లాడరేం?" అని సవాలు చేసింది.

"ఇంట్లో కూర్చోబెట్టి ఇంక చేతకాక టైపుకెందుకు పంపేరూ? కాలక్షేపానికా. ఉద్యోగానికెందుకు పంపేరూ? నాకు బతుకంతా తిండి పెట్టి పోషిద్దామనుకున్నారా! ఒక్కతిని అంత డబ్బు ఏం చేసుకుంటానని పాపం మీరు నా డబ్బుల్ని ఖర్చు పెడ్తున్నారు? అవునా? అంతేనా?

నా బతుకూ భవిష్యత్తూ ఏమవుతుందని కాదురా మీ ఏడుపులు నాకు తెలీదనుకోకండి! ఇహ నా దగ్గర్నుంచి నా డబ్బులో ఓ పైసా అన్నా మీకు దొరకదనీ మీ బాధ! పైకి బుడి బుడి ఏడుపులు ఏడిస్తే సరిపోతుందనుకుంటున్నారు."

"ఎవరిదిరా స్వార్థం;? నీది కాదూ?! ముందు నువ్వు చెప్పరా తర్వాత ఆయనకి నాడబ్బే కావాలో, నేను కావాలో మా ఇద్దరికీ మధ్య స్వార్థమే ఉందో పదార్థమే ఉందో నేచెబుతానూ!" అని వరసబెట్టి అది అడుగుతూ ఉంటే చూస్తూ నిలుచున్నారే కాని ఒక్కరూ నోరు విప్పి జవాబు చెప్పలేకపోయేరు.

"ఐహికం ఎలాగూ లేదు. ఆముష్మికంలో పడు! భజనకి వెళ్ళు! దేవుణ్ణి నమ్ముకో! బాబాని తలచుకో! నీకెలాంటి చిక్కులూ ఉండవు! నీ మనస్సు స్ఫటికంలా స్వచ్ఛంగా ఉంటుంది. సాధన చెయ్యి! సాధన నీకు అవసరం అన్నారు. అవునా? అదో మత్తు! ఆ మత్తులో ఆ నిషాలో పడిపోతే మరి ధోకా లేదు. బతుకు వెళ్ళిపోతుందనుకున్నారు! గమ్మత్తు ఇన్నాళ్ళూ నాకళ్ళు మూసుకునే ఉన్నాయి. ఆముష్మికం అనే సరికి ఐహికం అంటే ఏమిటో తెలిసి వచ్చింది! మీ బాబా భజనే తోవ చూపెట్టింది! ఐహికమూ తెలిసింది! ఆముష్మికమూ తెలిసింది! మీ బాబానే తోవ చూపెట్టేడు! ఐహికానికి, ఆముష్మికానికీ నిచ్చెనలు వెయ్యడం ఎలాగో తెలిసిపోయింది!!

ఇప్పుడు మీ అందరికీ "నీ నామరూపములకు" అని నేమంగళం పాడుతూ ఉంటే అయ్యో పాపం కష్టంగా ఉందా??!!

ఆడదాన్నయి ఉండీ మరో ఆడదాని బ్రతుకులో చిచ్చుపెడుతున్నానా! ఆహాఁ! ఆడవాళ్ల మీదెంత జాలిరా నా తండ్రీ!! అవిడ కోసమా నీ బాధ! ఇప్పుడు నీ బాధంతా నా కోసం కూడా కాదు, పాపం ఆవిడ కోసమా?? నిజం చెప్పు! నీ

బాధేమిటో!! నా డబ్బు పోతుందనేనా?? నువ్వు నోటంటా చెప్పకపోయినా నీ కడుపులో సంగతి నాకు తెలీదనుకోకు!

ఆవిడ బతుకులో చిచ్చే పెడుతున్నానో, పువ్వులతోనో నింపుతున్నానో ఆ సంగతి ఆవిడకి, నాకూ సంబంధించింది రా! ఆవిడ పడే బాధేమిటో ఆవిడ పడుతుంది. మీ కెందుకు నాయనా ఆ కష్టం?!

తోడబుట్టిన దానిమీద మీకున్న కనికారం నాకు తెలీనిదా? పరాయి ఆడదాని మీద పాపం ఎంత జాలీ!!

ఆవిడొక్క ముక్క కాని అన్నదీ అంటే, ఆయన ఉద్యోగం ఊడిపోతుందా? ఇద్దరు పెళ్ళాలు చట్టరీత్యా ఉండకూడదా? నా బతుకు బుగ్గయిపోతుందా? ఆవిడ నా బతుకుని బుగ్గి చేస్తుందా? ఆ సంగతి నాకూ ఆవిడకే సంబంధించిందిరా! నా బతుకు బండలే అవుతుందో బాగే పడుతుందో మేమిద్దరం చూసుకోగలం!

సవితికీ దాని పిల్లలకీ ఊడిగం చేస్తూ నీచపు బతుకు బతికి ఆఖరికి కొరగాని చావు చస్తానా? తోడ బుట్టిన వాళ్ళకీ – వాళ్ళ పిల్లలకీ ఊడిగం చేసి చస్తే సర్వోత్తమమూ – సొంతంగా ఎంచుకుని నెత్తి మీద పెట్టుకున్న సవితికీ, ఎంచుకున్న మొగాడి పిల్లలకీ ఊడిగం చేస్తే హేయమూనా??"

దాని మాటలు వింటూ ఏ తర్కానికీ లొంగని దాని మాటలకి జవాబు చెప్పలేక అంతా వెర్రి మొహాలు వేసుకుని నిల్చున్నారు!

"ఆయన దగ్గరనే పడి ఉన్నా లోకం ఊరుకోదా? చట్టము ఊరుకోదా? వినండి బాగా వినండి! ఆవిడ నా అప్పగారు! ఆ పిల్లలు నే నెన్నుకున్న మహారాజు పిల్లలు! ఆమె పట్టపురాణీ! నేను చిన్న దేవేఁరిని! మీరూ, మీ చట్టాలూ, ఊరుకోకపోతే ఉరిపెట్టుకోండి! గింజుకు చావండి! భేషుగ్గా చావండి! కాని ఈ సంగతి మాత్రం మర్చిపోకండీ! నేను, నేను చిన్న దేవేఁరిని– నేను చిన్న దేవేఁరిని!!' అని అది గట్టిగా అరుస్తూ చెప్పేసరికి అందరూ మొహాలు దించుకున్నారు.

# సంగమం

**- విజయలక్ష్మీ రామకృష్ణన్**

**మం**డు వేసవి, మధ్యాహ్నం ఒంటిగంటయింది.

ప్రసాద్ లంచికి వెళ్ళడానికి బయలుదేరాడు.

'కింద క్యాంటీన్‌లో భోంచేస్తే పోదటండీ. ఈ ఎండలో నడుచుకుంటూ ఆ త్రీస్టార్ హోటలుకెళ్ళి అక్కడ రెస్టారెంట్‌లో తింటేగాని తృప్తిగా ఉండదా మీకు" అన్నాడు సహోద్యోగి.

"చిన్నప్పుడు మా అమ్మ డబ్బాలో చపాతీ, కూర, పై గిన్నెలో కాస్త పెరుగున్నం పెట్టి ఇచ్చేది. పుస్తకాల మూటతో పాటు, లంచి బాక్సును కూడమోసుకుంటూ బస్సులో పడి స్కూలుకెళ్ళేవాణ్ణి. పెద్దయ్యాక ఇంటి నుంచి లంచ్ బాక్సు తెచ్చుకోవటం అన్నా, హోటల్ నుంచి క్యారియర్ తెప్పించుకోవడం అన్నా చిరాకు నాకు. బెంగపడకండి. ఎండలో నేను మాడిపోను. సరేనా" జవాబిచ్చాడు ప్రసాద్.

ఎయిర్ కండిషన్డ్ ఆఫీసు తలుపు నెమ్మదిగా తెరచి, మళ్ళీ భద్రంగా మూసి మెట్లు దిగుతున్నాడు. ఆఫీసు ముందుగా ఒక ఆటో రిక్షా ఆగింది. డ్రయివర్‌కు డబ్బులిస్తున్న స్త్రీ వంక చూచి చకితుడయ్యాడు. మెట్టు మీదే నిల్చిపోయాడు.

ఆమె మెట్లెక్కుతూ ప్రసాద్‌ను చూసి, "నువ్వేనా? మీరు – ప్రసాదా" అంది.

"అనూరాధవా" అన్నాడు బదులుగా.

"నిన్ను చూద్దామనే వచ్చాను. ఎవరో చెప్పారు నువ్వీ ఆఫీసులో పనిచేస్తున్నావని" అంది.

"నేను లంచికి వెళుతున్నాను. పద భోంచేస్తూ మాట్లాడుకుందాం" అన్నాడు ప్రసాద్.

"సరే పద" మంది.

"దగ్గరే నడుస్తావా. మళ్ళీ ఆటో పిలవమంటావా?"

"నడవగలను. కానీ నేను విజయవాడ వచ్చి పదిహేనేళ్ళయింది. సిటీ ఎంతగానో మారిపోయింది. ఇక్కడే పుట్టీ పెరిగిన నాక్కూడ దార్లు తెలియకుండా పోయాయి. అందుకే ఆటోలో  తిరగడం" అంది అనూరాధ.

ప్రసాద్ భోంచేస్తూ అడిగాడు – "ఎప్పుడూ రావడం అమెరికా నుంచి? వచ్చి ఆటోల్లో తిరుగుతున్నావేంటి?"

"నాన్న చీరాల వెళ్ళారు పొద్దుట. 'ఎండలో తిరగవద్దు– సాయంత్రం ఎటైనా వెళ్తే టాక్సీ  తెప్పించుకో. నే రాత్రి  పొద్దుపోయిగాని రాను' అన్నారు. నాన్న వెళ్ళాక అమ్మతో నా స్నేహితురాలు డాక్టర్ రమాదేవిని చూసి వస్తానని  చెప్పి ఇటు వచ్చాను.'('

"పోనీ అటే వెళ్ళకపోయావూ. నీ ఫ్రెండ్ కారిచ్చి పంపించేది" అన్నాడు ప్రసాద్.

"నిన్ను చూడ్డానికి వెళ్తున్నానని చెప్తే, రమా కూడా వద్దంటుంది."

"అయితే, ఈ అబద్ధాల అలవాటు ఇంకా పోలేదన్నమాట నీకు."

అనూరాధ నవ్వుతూ, "నేనెప్పుడో చెప్పానా, అబద్ధాలకు సున్నం పూస్తే న్యూట్రల్ అయిపోతాయి. ఇహ తప్పు చేసినట్లు కాదు" అంది.

అనూరాధ నెమ్మదిగా ఆరాలు తియ్యటం  మొదలు పెట్టింది.

ప్రసాద్ భోంచేస్తూ బదులు చెప్తున్నాడు.

"సాయంత్రం నువ్వింటికెళ్ళేటప్పుడు నేనూ వస్తాను మీ ఇంటికి. అందరినీ చూడాలని  ఉంది" అన్నది.

'ఏమా చొరవ! ఫరవాలేదు. అమెరికా నీళ్ళు ఒంటబట్టాయి' అనుకున్నాడు. 'అందరినీ' అన్న ఆమెమాటకు చిన్నగా, చిలిపిగా నవ్వుకున్నాడు ఆమె చూడకుండా.

"మరి నా పనయ్యేంతవరకూ ఎక్కడుంటావ్? ఇంక రెండు  మూడు గంటల పనుంది నాకు ఆఫీసులో" అన్నాడు.

"నువ్వే చెప్పు సలహా" అంది ఆమె.

ఒక క్షణం ఆలోచించి, "మా ఆఫీసులో  కాన్ఫరెన్సు రూముంది.  ఖాళీగానే ఉంది. ఈ మధ్యాహ్నం మీటింగ్సు ఏమీ లేవు. ఆ రూములో పేపర్లు పత్రికలు

కూడా ఉంటాయి. అక్కడుండు. నేను కాస్త త్వరగా తెమలడానికి ట్రై చేస్తాను. అట్లాగే మా ఇంటికి వద్దువుగాని" అన్నాడు ప్రసాద్.

ఆఫీసు నుంచి బయలుదేరేముందు రోజూ తనతో స్కూటర్‌మీద వచ్చే కుర్రాడు డేవిడ్‌ను పిలిచి, "వీరు మా ఇంటికి వస్తున్నారు. ఆటోలో వెళ్తాం. నువ్వు స్కూటర్ ఇంటికి తీసుకురా" అని తాళాలిచ్చాడు.

"బంధువులాండి" అన్నాడు డేవిడ్ అనూరాధను చూస్తూ.

"నీకెందుకయ్యా, నేను నీకన్నా పెద్దవాణ్ణి. మాటా, మర్యాదా నేర్చుకో" అన్నాడు.

చక్కని కుర్రాడు. పాపం సిగ్గుపడిపోయాడు.

"ప్రసాదేమీ మారలేదు. సాయం చెయ్యడానికి ముందుకు దూకుతాడు. కానీ, మాటలతో చురకలు పెట్టడం హాబీ. ఆవిడెవరో గాని, ఎట్లా వేగుతుందో ఈ మనిషితో" అనుకుంది అనూరాధ.

అయిదయింది. మండిపోయే సూర్యుడు మండిపోతూనే ఉన్నాడు. ప్రసాద్ ఆటోరిక్షా పిలిచాడు. సిటీ పెరిగే కొద్దీ, ఊళ్ళో రోడ్లు మరింతగా ఎత్తుపల్లాలు సంతరించుకుంటాయి. వాహనాల్లో తిరిగేవారిని రోడ్డు తన వంపులతో కుదేసి కులుక్కుమంటుంది.

దారిలో "ఇంట్లో ఎవరెవరున్నారు?" అనడిగింది.

ప్రసాద్ ఇంకో పక్కకు చూస్తూ, "సరోజిని ఉంది. మధ్యాహ్నం నే లేకపోయినా అన్నం తింటుంది. కానీ నేనింటికెళ్ళేవరకు పాలు మాత్రం తాగదు" అన్నాడు.

"కూతురు కాబోలు. అదేమిటి – అంత పాతకాలం పేరు పెట్టుకున్నారు' అనుకుంది.

నాగార్జునా కాంప్లెక్సు దగ్గర ఆగింది ఆటో. అనూరాధ దిగి బెరుకు బెరుగ్గా చూసింది. ఆటో చప్పుడుకు ఇంట్లోంచి బయటకొచ్చిన నాగమ్మ ప్రసాద్‌తో వచ్చిన అనూరాధను చూసి 'ఎవరబ్బా' అనుకుంది.

ఇంటి ముందు వరండాలో ఓ పేము కుర్చీలో భయం లేకుండా దిండు మీద కూర్చుని చోద్యం చూస్తోందో పిల్లి కూన. ప్రసాద్ పిల్లిని జోకొట్టి, 'పాలు తాగావా' అన్నాడు. పిల్లి పిల్ల కిందకు దూకి ప్రసాద్ పక్కనే నిలబడింది.

నాగమ్మ. "అదెందుకు తాగుతుంది? ఏవన్నా చెప్పండి. కుక్కకున్న విశ్వాసం పిల్లి కుండదు. పక్కింటి రాజుగారి కుక్కపిల్ల ఆయన్ని గేటులో చూడగానే పరుగెత్తి కెళ్ళి ఆయన వెనక తోకాడించుకుంటూ తిరిగి వస్తుంది. ఈ సరోజినమ్మ – మన బంగరు బొమ్మ. నువ్వొచ్చి మాట్లాడించే వరకు గు(ర్రుమని కూడా అనదు. పెద్ద రాజకుమార్తె. కుర్చీ లెక్కి కూర్చోడం తెలుసు" అని గ్లాసులో పాలు దాని గిన్నెలో పోసింది.

అనూరాధ షాకు తిన్నది. ఇంట్లో ఎవరెవరంటే – సరోజినన్నాడేంటి అనుకుంది. పిల్లి సేవ అయ్యాక అనూరాధను చూస్తూ నాగమ్మ, "బాబుకు మజ్జిగలో నిమ్మకాయ పిండి, ఒక కల్లు ఉప్పు వేసి కలిపి ఫ్రిజ్‌లో ఉంచుతానండీ. మీక్కూడా మజ్జిగిమ్మంటారా, టీ పెట్టనా?" అనడిగింది.

"నాకూ మజ్జిగే ఇవ్వు" అంది అనూరాధ.

నాగమ్మ ఆ రోజు వచ్చిన పోస్టు తెచ్చి ప్రసాదుకిచ్చింది. ఉత్తరాలు చదివి, గ్లాసు కింద పెట్టి, "నాగమ్మా, మేము వాకింగుకి వెళ్ళి వస్తాం, ఈమె అనురాధగారు. అమెరికా నుంచి వచ్చారు. ఏం టిఫిను చేస్తావో మరి" అన్నాడు ప్రసాద్.

నాగమ్మ కంగారుపడిపోతూ, "అయ్యో నాకేం వచ్చండీ – చెప్పి చేయించడానికి అమ్మయినా లేకపోయో – ఏదో తంటాలు పడతాలెండి. త్వరగా రండి. వేడిగా తింటేనే రుచి" అన్నది.

ప్రసాద్ లేచి, "పద అట్లాగే అరగంట తిరిగి వద్దాం. పక్కనే ఇంకో బిల్డింగ్ కడుతున్నారు. చూపిస్తాను" అన్నాడు.

"ఇంట్లో చెప్పిరావూ" అంది అనూరాధ సందేహంగా.

"ఇంట్లో ఎవరూ లేరు చెప్పడానికి"

"ఏం ఊరెళ్ళరా?" అంది.

"అసలు ఉంటేగా, ఊరెళ్ళడానికీ, సినిమాకెళ్ళడానికీ" అన్నాడు.

అనూరాధ కర్థం కాలేదు.

నడుస్తూ వాళ్ళ కాంప్లెక్సులోని సౌకర్యాలు, పక్కన కడుతున్న కట్టడం వివరాలు

చెప్తున్నాడు ప్రసాద్. ఆమెకేమీ వినబడడం లేదు. పాముకుబుసం విడిచినట్టు గతం పొరలు పొరలుగా రాలిపోతోంది.

ప్రసాద్, అనూరాధ కాలేజీలో క్లాసుమేట్సు, ప్రేమించుకున్నారు. పెళ్ళి చేసుకుందామనుకున్నారు. ప్రసాద్ ఆ సంగతి తల్లితో చెప్పాడు. ఆమె మండిపడ్డది. తన అన్న కూతురు సరళ తప్ప ఇంకో ఆడపిల్ల తనింటికి కోడలిగా రాగూడదన్నది. ప్రసాద్ ససేమిరా అన్నాడు. మర్నాడు అతని తల్లి కొడుక్కు తెలియకుండా అనూరాధ ఇంటికెళ్ళి మేనరికం ఎప్పటినుంచో అనుకున్నదేనని. వాళ్ళకి తాను మాట కూడా ఇచ్చినట్లు కొడుక్కు కూడ సరళంటే ఇష్టమే ఉండేది – అనూరాధను చూసేవరకూ – అని నచ్చచెప్పింది.

అనూరాధ తండ్రి రుద్రుడైపోయాడు. కూతుర్ని పిలిచి ప్రసాదును మరి చూడకూడదని శాసించాడు. ఎవరో అమెరికా నుంచి ఆడపిల్లలను చూడ్డానికి ఆంధ్రదేశం వచ్చిన పెళ్ళికొడుకుని పట్టుకొచ్చి నెల తిరక్కుండా కూతురి పెళ్ళి జరిపించాడు. తనను చూసేవరకూ మేనమామ కూతురంటే ప్రసాదు కిష్టమేనని, ఆ అమ్మాయి కూడా ఆశలు పెంచుకుందని విని ఖిన్నురాలైంది. అనూరాధ. ఇంకొకరి మనిషిని దొంగిలించలేక తండ్రి తెచ్చిన సంబంధానికి ఒప్పుకుంది.

అమెరికా వెళ్ళిపోయింది. రెండేళ్ళకు కొడుకు పుట్టాడు. క్రమంగా భార్యాభర్తలకు పడకుండా పోయింది. భర్త పెడదారి పట్టాడు. విడాకులు తీసుకుంటానని తండ్రికి రాసింది. డైవోర్స్ తీసుకుంటే మళ్ళీ తన గడప తొక్కద్దని రాశాడు తండ్రి. కొడుకుని పెంచుకుంటూ చికాగోలో ఒక హాస్పిటల్ ఫార్మసీలో ఉద్యోగం చేసుకుంటూ ఒంటరిగా జీవిస్తోంది అనూరాధ. కిందటి నెల్లో ఢిల్లీలో అమెరికన్ సహకారంతో హాస్పిటల్ మేనేజ్‌మెంట్ మీద ఇంటర్నేషనల్ వర్క్‌షాపు జరిగింది. అనూరాధ పనిచేసే హాస్పిటల్ వాళ్ళు అనూరాధను ఫార్మసీ ప్రతినిధిగా ఖర్చులు పెట్టుకు పంపారు.

కొడుకును వెంట తీసుకువచ్చింది. ఇండియాలో అడుగుపెట్టగానే ఇంటిమీద మనసు పోయింది అనూరాధకు. రాత్రంతా నిద్ర రాలేదు. అర్ధరాత్రి తండ్రికి ఉత్తరం

రాసింది. "మీరు పిలిస్తే తప్ప ఇంటికి వచ్చి చూడకూడదన్న బెట్టు నాకు లేదు. నన్నూ, నా కొడుకును చూడ్డానికి మీరిష్టపడితే నా హోటల్‌కు ఫోన్ చెయ్యండి. సమయానికి నేను లేకపోతే మెసేజ్ వదలండి" అని రాసి, ఉత్తరం కొరియర్ మెయిల్లో పంపించింది.

ఏనాడో కోపం తగ్గినా, కూతురి అడ్రసు కూడా తెలియని నిస్సహాయ స్థితిలో నిరుత్సాహంగా రోజులు వెళ్లబుచ్చుతున్నారు అనూరాధ తల్లిదండ్రులు. వాళ్ళకు కూతురి జాబు పూలవానే అయింది. తండ్రి స్వయానా ఢిల్లీ వెళ్ళి కూతుర్ని మనుమణ్ణి వెంటబెట్టుకుని ఆగ్రా, జైపూర్ చూపించి ఇంటికి తీసుకువచ్చాడు.

అరగంట వాకింగులో ప్రసాద్ చూపిస్తున్న ఇళ్ళలో ఏ మాత్రం ఆసక్తి కనబరచని అనూరాధను చూసి, 'ఎందుకీమె నన్ను వెతుక్కుంటూ వచ్చింది' అనుకున్నాడు ప్రసాద్.

ఇల్లు చేరారు.

వాకిట్లోనే స్వాగతం పలికింది నాగమ్మ. "వచ్చారా, రండి రండి. ముఖాలు కడుక్కుని రండి టిఫిన్ తీసుకుందురుగాని" అంది.

ప్రసాద్, అనూరాధ డైనింగ్ టేబిల్ దగ్గరకు చేరారు. వేడి వేడి పునుగులు, పచ్చడితో ప్లేట్లలో పెట్టింది. గ్లాసులో ఐస్‌వాటర్ పోసింది.

ప్రసాద్ కూర్చుంటూ, తృప్తిగా "దొరుకునా ఇటువంటి టిఫిను" అని రాగం తీశాడు.

అనూరాధ నవ్వుకున్నది. 'భోజన ప్రియత్వం పోలేదు' అనుకుంది. కాలేజీ రోజుల్లో ఏ హోటల్ ఏ రోడ్డులో వుందో, ఏ అయిటమ్ ఏ హోటల్లో బాగుంటుందో – అందరూ ప్రసాద్‌నే అడిగేవారు. అనూరాధకు తెలిసిన మనిషినే మళ్ళీ తెలుసుకుంటున్నట్లుంది. ఏదో దుఃఖం, ఎంతో దుఃఖం. ఎంత మింగినా, మిగిలి మిగిలి పొంగిపోయే దుఃఖం గొంతులో సుళ్ళు తిరిగింది. పట్టలేక అడిగింది.

"అంటే నువ్వు పెళ్ళి చేసుకోనే లేదా?"

ప్రసాద్‌కు ఇటువంటిదేదో వస్తుందని తెలుసు. తేలిగ్గా నవ్వేస్తూ, "లేదు, ఎట్లా చేసుకోను? సౌత్ ఇండియాలో అమ్మాయిలందరికీ ఒకటే కోరిక. పెళ్ళయి

అత్తవారింటి కెళ్ళడమంటే హైదరాబాద్‌లోనో, మద్రాసులోనో, బెంగుళూరులోనో బతకడం, బందరు, ఏలూరు, నెల్లూరు లాంటి ఊళ్ళలో స్థిరపడ్డానికి ఇష్టపడరు. ఇంకో మెట్టు పైవాళ్ళకు పెళ్ళికొడుకంటే, అమెరికా నుంచో, ఆస్ట్రేలియా నుంచో వచ్చినవాళ్ళే. ఇంక నా కెట్లా పెళ్ళవుతుంది?"

"అమ్మా, అమ్మా నన్ను నమ్మండి. ఎన్ని సంబంధాలో వచ్చాయి ప్రసాద్ బాబుకు. అమ్మగారెంతో చెప్పారు. అందరి దగ్గర ఏడ్చేవారు. బాబుదే వద్దంటే వద్దని మొండి పట్టుదల" అంది నాగమ్మ.

అనూరాధ చిరాగ్గా, "ఏమిటీ నీ కారణం? నువ్వేదో పెద్ద దేవదాసు ననుకున్నావా?" అంది.

ప్రసాద్ అనూరాధ వంక ధైర్యంగా చూస్తూ, "సరే విను. నాకు తెలియకుండా మీ ఇంటికెళ్ళి, నేను నిన్ను చూశాక మనసు మార్చుకున్నానని కట్టు కథ చెప్పి నమ్మించిన అమ్మ మీద కోపం, నిన్ను చూద్దామని కబురంపితే నువ్వు రానన్నావని నీ మీద కోపం – నన్ను నిర్బలుణ్ణిగా చేశాయి. నిరుత్సాహం, అశక్తత నన్ను చుట్టుముట్టాయి. అమ్మను ఎదిరించి పెళ్ళాడవచ్చు. నాన్న పోయాక పిల్లలే ప్రాణంగా పెంచిన అమ్మకు మా మీద అనురాగమే కాదు. అధికారం కూడా ఏర్పడ్డాయి. ఆమె కిష్టంలేని కోడలు ఇంటికి వస్తే, ఆ అమ్మాయి జీవితం అశాంతి పాలుకాక తప్పదు. నేను దూరమైతే అమ్మను ఎవరు చూసుకుంటారు? నీ పెళ్ళి అయిపోయిందని తెలిసిన తర్వాత, నా పెళ్ళికి తొందర చెయ్యడం మొదలుపెట్టింది అమ్మ. "నీకు నచ్చని అమ్మాయిని నేను చేసుకోలేదు. నాకు నచ్చని అమ్మాయిని చేసుకోమని నన్ను నిర్బంధపెట్టకు" అని చెప్పేశాను. అమ్మ ఏడ్చింది. నేను ఏడవలేదు. అదే తేడా. అప్పట్లో అమ్మ మీద నాకు జాలి కూడా కలగలేదు."

"అంటే, నీ ఒంటరి జీవితం నీ తల్లికి విధించిన శిక్షనుకున్నావా?" అంది అనూరాధ జుగుప్సతో.

నాగమ్మకు నచ్చలేదు వాళ్ళధోరణి. గబుక్కున లోపలకు వెళ్ళి ప్లేటులో జామపళ్ళు పట్టుకొచ్చింది. "చెట్టుక్కాసిన కాయలు బాబూ, తీసుకోండి" అంది.

ప్రసాద్‌కు కోపం వచ్చింది. 'చెట్టెక్కాక పుట్టక్కొస్తాయా కాయలు? శబరి మా తల్లిలాగా ఎప్పుడూ ఆ పండు కావాలా, ఈ కాయ కావాలా అని ఏమిటి నీ గోల" అని విసుక్కున్నాడు.

నాగమ్మ రోషపడిపోయి, "ఆ శబరి మాలక్ష్మికి. నాకూ సాపత్యమేమిటి బాబూ? శబరమ్మ తల్లి కాయలు కోసి కూరలు వండిందా, పిండి రుబ్బి గారెలు కాల్చిందా, పాలు కాచి పాయసం చేసిందా? ఓ బాదం ఆకులో కాసిని రేగుపళ్ళో, నేరేడు పళ్ళో పెట్టి రాములారంతటి సామినే మెప్పించింది. నాకు మిగిలిన మెప్పేమిటి బాబూ – మిగిలిందల్లా నా కోసం ఎదురు చూసే అంట్ల గిన్నెలూ, నా అరిగిపోయిన చేతులూ తప్ప" అంది నాగమ్మ.

అనూరాధ మార్చి మార్చి చూసింది వాళ్ళిద్దరినీ. వాళ్ళ మాటలూ, ఆ మాటల్లోని అర్థాలూ, అర్థాలకు రంగులు పులిమే అలుకలు, ఆపేక్షలూ, ఆవేదనలూ – వీళ్ళూ మనుషులంటే! ఈ గడ్డ విడిచిపెట్టి ఎక్కడో బతుకుతూ ఎంత కోల్పోయాను' అనుకుంది. ఆమె ఈ లోకంలోకి రావడానికి కాసేపు పట్టింది.

'ఔనూ, మీ సిస్టర్ ఎక్కడుందిపుడు' అనడిగింది.

"చాలామందమ్మాయిలలాగే సుశీల కూడా ఆస్ట్రేలియా కెళ్ళింది పెళ్ళి చేసుకుని. డిగ్రీ వచ్చాక కంప్యూటర్ క్లాసులు తీసుకుంది. అక్కడ కలిశాడాబ్బాయి. "మన కులం కాదు, మనకొద్దు' అంది అమ్మ. 'కులం ఆరా తీసి ఆపైన స్నేహం పెంచుకోలేదు నేను. అయినా, మనకన్నా పెద్దకులమే" అంది సుశీల. అమ్మ గొంతు పెంచి, "పెద్దయితే ఎవడి క్కావాలి. మన కులం గొడ్డు పోయిందా? తగిన పెళ్ళికొడుకే దొరకడా నీకు" అందమ్మ. ఆఖరుకు సుశీల బ్రహ్మాస్త్రం ప్రయోగించింది.

"అమ్మా, నేను అన్నయ్యను కాను. నీ మెప్పుకోసం నా బతుకు బలి చేసుకోవడానికి" అంది. అంతే ఆ సాయంత్రానికే అమ్మకు హార్ట్ ఎటాక్ వచ్చింది. అదే మొదటి ఎటాక్. హాస్పిటల్లో పెట్టాము. రెండువారాల తర్వాత ఇంటికి తీసుకొచ్చాము. సుశీల సంతోషం పట్టలేకపోయింది. అమ్మ కోలుకున్నదన్న సంతోషం కంటే, కోలుకోకపోతే అందుకు తాను బాధ్యురాలన్న నింద తప్పినందుకు ఎక్కువ సంతోషించింది.

"అప్పుడే వచ్చింది నాగమ్మ ఇంటి పనికి. నాగమ్మ భర్త మా ఆఫీసులో ఫ్యూన్‌గా ఉండేవాడు. పిల్లల్లేరు వాళ్ళకి. ఇట్లాగే ఎండాకాలం పనుందని పొరుగూరెళ్ళాడు. పదిమంది బంధువులనూ చూసి వచ్చాడు. రోడ్డుమీద బస్సు కోసం నిలబడ్డాడు. నీడగా కూర్చోడానికేమీ లేదా పల్లెటూర్లో. పక్కన సోడా షాపు లేదు. ఏముంది– వడదెబ్బకు పోయాడు. ఏ అండాలేని నాగమ్మ అమ్మకు తోడైంది. అమ్మ దగ్గర కూర్చుని మా ఇంటి వంటలన్నీ నేర్పింది. మొదట్లో స్నేహంగానే ఉండేవారు. చివరి రోజుల్లో నిష్కారణంగా తప్పు పట్టేది నాగమ్మను."

అకస్మాత్తుగా ఒక ఆలోచన వచ్చింది అనూరాధకు.

"ప్రసాద్ నేనొక సంగతడుగుతాను. నేను ఇందాకటి నుంచి నీ గురించి అన్ని అజలు అడిగాను కదా, నా సంగతి నువొక్కటీ అడగలేదేం" అంది.

ప్రసాద్ నవ్వుతూ, "నువ్వడిగావు, నేను చెప్పాను. నేను అడగలేదు. నువ్వు చెప్పలేదు. అందువల్ల నీకు నచ్చిన లాభమేమిటి, నాకు కలిగిన నష్టమేమిటి?" అన్నాడు.

"నువ్వు ఏమీ మారలేదనుకున్నాను కానీ ప్రసాద్, పూర్వం నీకు లాభనష్టాల బేరీజు వేయడం తెలీదు. ఆ విద్య కొత్తగా నేర్చుకున్నావు" – నిష్టూరమాడింది.

డేవిడ్ వచ్చాడు. స్కూటర్ నిలబెట్టి తాళాలు ప్రసాద్‌కిస్తూ, "రేపుదయం ఆఫీసు కెళ్తారా సార్" అనడిగాడు. అనూరాధ కేసి అనుమానంగా చూస్తూ.

'ఆఁ సరిగ్గా ఎనిమిదింటికి రా" అన్నాడు ప్రసాద్.

'ఆమె ఎవరబ్బా' అన్న ఆలోచన డేవిడ్ తల్లో తొలుస్తూనే వుంది.

డేవిడ్ వెళ్ళిపోయాక అనూరాధ, "నువ్వడగకపోయినా నేను చెప్తాను. నిన్ను వెతుక్కుంటూ వచ్చింది నా కష్టం, సుఖం నీతో చెప్పుకుందామనేగా" అంది.

"అదేం నీ స్నేహితురాలు రమాదేవితో చెప్పుకోలేదా' అన్నాడు ప్రసాద్.

"ఎందుకు చెప్పుకోలేదు. చెప్పుకున్నాను. ఆమె కన్నా నువ్వు నాకు దగ్గరి ఫ్రెండుననుకుంటున్నావా ఏమిటీ? ఆమె సలహాలు, సానుభూతి చాలక నిన్ను చూడ్డానికి వచ్చాను. పిలవని పేరంటం. పద బయట కూర్చుని మాట్లాడుకుందాం" అంది అక్కడ నాగమ్మ ఉన్నదనే ఉద్దేశ్యంతో.

నాగమ్మ కర్థమైంది.

"వద్దమ్మా బయట వేడికి వేడి, దుమ్ముకు దుమ్ము, నేవెళ్ళి కాస్త ఊడ్చి నీళ్ళు చల్లి వస్తాను. చల్లబడ్డాక బయట కూర్చుందురుగాని" అంటూ అక్కడ నుంచి తప్పుకుంది.

అనూరాధ తన కథంతా వివరించింది.

ప్రసాద్ కలవరపడ్డాడు.

"నువ్వేదో అమెరికాలో సుఖంగా ఉన్నావనుకున్నాను. ఇంత దుఃఖమా, నీ జీవితంలో అనూ" అన్నాడు.

'అనూ!' మర్చిపోయిన పాత పిలుపు! ఆమె మనసు శాంతితో, సంతృప్తితో నిండిపోయింది. తేరుకుని, "బాగుంది, నువ్వు నన్ను జాలి తలుస్తున్నావా ప్రసాద్? నాకేమయ్యా కరదీపిక లాంటి కొడుకున్నాడు. ఖాళీ జీవితం నీదిగా చేసుకున్న నిన్ను చూసి నేను జాలి పడాలి" అంది.

"నీ కొడుకు – అదే భరత్‌ను చూడాలనుంది అనూ. ఒకసారి వస్తాను మీ ఇంటికి. మీ నాన్నగారు భరత్ ముందు అరుస్తారేమో నా మీద. కాస్త ముందుగా చెప్పు" అన్నాడు ప్రసాద్.

"ఊఁహూఁ. నేనేం చెప్పను. మా నాన్న నీకన్నా చాలా పెద్ద. అరవనీ, అరిస్తేనేం మా ముందు? నువ్వరవలా డేవిడ్‌ను నా ముందు" అంటూ నవ్వింది.

ప్రసాద్ కూడా హాయిగా నవ్వాడు.

నవ్వాపుకుని అన్నాడు. "నీకూ, మాకు తేడా ఇప్పుడు తెలిసింది అనూ, నీ దుఃఖానికి కారకులైనది మేము ముగ్గురం. మీ నాన్న, నేను, నీ కొడుకు తండ్రి – మా ఎవరి మీదా ఇసుమంత కోపం గాని, కక్షగాని నువ్వు పెంచుకోలేదు. మనసా, వాచా ఎవరినీ నిందించలేదు. నేనూ, మాఅమ్మ అహానికి, ఆగ్రహానికి లొంగిపోయాను. మా సుఖానికి, మా మనశ్శాంతికి మేమే నీళ్ళు వదులుకున్నాం. అమ్మకు మరణంతో విముక్తి కలిగింది. నాకు నీ రాకతో, నీ మాటతో, నీ చూపుతో, నీ నవ్వుతో విముక్తి కలిగించావు" అన్నాడు నిజమైన కృతజ్ఞతతో.

"సరేగాని, మీ మదర్ పోయి ఎన్నాళ్లయింది? ఎట్లా పోయారు?"

"అమ్మ పోయి రెండేళ్లయింది. ఓనాడు గుండె మీద చెయ్యేసి, ఏంటో నొప్పిగా ఉందిరా" అంది. నా కర్మకాలి ఆ రోజు రాష్ట్ర వ్యాప్తంగా బంద్. టాక్సీలు తిరగలేదు. ఇప్పుడే వస్తానంటూ బయట కెళ్ళిన నాగమ్మ ఎవరినో బతిమాలి ఆటో తీసుకు వచ్చేసరికి  గంటయింది.

"ట్రాఫిక్ లేని వీధులు  చూసుకుని సందులూ, గొందులూ తిరిగి హాస్పిటల్ చేరేటప్పటికి  ఇంకో గంట పట్టింది. అమ్మ ఆరు గంటలే ఉంది హాస్పిటల్లో. "వెంటనే తీసుకువస్తే ఎట్లా ఉండేదో –  చాలా లేటయింది. ఐయామ్ సారీ" అన్నాడు డాక్టర్.

"అమ్మ పోయాక నాగమ్మ అమ్మ చార్జి తీసుకుంది. నేనింట్లో ఉండేదే నాలుగ్గంటలు. "కాఫీ  పెట్టనా, కాజాలు తింటావా, కారప్పూస కావాలా" అంటూ ప్రాణాలు తోడేస్తుంది. కొత్తలో ఓ రోజు, "ఏంటమ్మా, నాక్కావాలంటే నేనడగనూ, విసిగించకు" అన్నాను, అమ్మ పోయిందని మర్చిపోయి, నాగమ్మ తెల్లబోయింది. ఆమె ముఖంలో వెన్నెల కురిసింది. నా ఎదుట కళ్ళు  తుడుచుకోను ఇష్టంలేక అవతలకు వెళ్ళిపోయింది.

"నా పనులు స్వయంగా చూడలేని నిస్సత్తువ ఒకవైపు, నెమ్మదిగా తన స్థానం నాగమ్మ ఆక్రమిస్తోందన్న భయం మరోవైపు – తనకూ, నాగమ్మకూ మధ్య కష్టపడి గోడ కట్టుకుంది అమ్మ. ఆ గోడ ఎప్పుడు పడిపోయిందో తెలియదు. అమ్మ పోయి నాగమ్మ  మిగిలిందో. నాగమ్మను తరిమేసి మళ్ళీ అమ్మ వచ్చిందో – ఒక్కోసారి అయోమయంగా  ఉంటుంది. నువ్వూ నాగమ్మా ధన్యజీవులు అనూరాధా" అన్నాడు.

"నేనొక్క వరమడగనా?" అంది అనూరాధ సంభాషణ తప్పిస్తూ.

"వరాలడగటానికి  గుడికెళ్ళు. నేనేం దేవుణ్ణి కాను" అన్నాడు ప్రసాద్.

అనూరాధ నవ్వి, "చూడు భరత్ చికాగోలో వాడి స్కూల్లో ఆర్కెస్ట్రాలో వయోలిన్ వాయిస్తాడు. ఎట్లాగూ  ఇక్కడకు వచ్చాం కదాని మన రాగాలు కాస్త తెలుస్తాయని. వయోలిన్  పాఠాలకు ఏర్పాటు చెయ్యమని నాన్నకు చెప్పాను. రేడియో స్టేషనులో పనిచేశారట. రిటైరయ్యారట – పురుషోత్తం గారు. ఆయన దగ్గర నేర్చుకుంటున్నాడు. కొత్తలో కింద కూర్చుని వాయించటం  నచ్చలేదుగాని, ఇప్పుడు అలవాటైంది. అమ్మమ్మ

దగ్గర గారాలు పోతున్నాడు. ఏటేటా వస్తాడట కర్ణాటక సంగీతం నేర్చుకోవడానికి. నాకూ ఏటా సెలవు దొరకదు. ప్రతి ఏడాది రెండుటికెట్లంటే – ఖర్చూ ఎక్కువే. వాడు వస్తాడు వచ్చే సమ్మర్లో కూడా. మధ్య మధ్య నువ్వు కాస్త చూస్తుండు. మాటా., మర్యాదా నేర్పించు. సరేనా" అంది.

ప్రసాద్ ఆనందావేశంతో అవాక్కయ్యాడు.

ఆ తర్వాత వారం రోజులకే అనూరాధ ప్రయాణమైంది.

భరత్ ఇంకా సెలవులున్నాయని తాతగారింట్లోనే ఉండిపోయాడు. రైలు కదిలింది ఢిల్లీకి. అనూరాధ కనుమరుగైంది.

భరత్ తాతగారి వెనకాల ప్రసాద్ చెయ్యి పట్టుకుని నడుస్తున్నాడు.

నిన్న కరిగి నేటితో కలిసిపోయింది. తెల్లబోయిన నేడు క్షణం పాటు స్తంభించి పోయింది. తేరుకున్న తర్వాత నిన్నా, నేడూ చేతిలో చెయ్యేసుకుని ముందుకు సాగాయి.

# మొగ్గ

**– శారదా అశోక వర్ధన్**

**జూ**బిలీ హిల్స్ కొండలమీద, హైదరాబాద్ నగరంలో పదిగదుల విశాలమైన బంగ్లా అది. ఇల్లు చూస్తేనే ఇంట్లో వారి హోదా తెలిసిపోతుంది. అది ప్రఖ్యాత వ్యాపారవేత్త శ్రీగంగిగారిల్లు! ఇంటిచుట్టూ అమర్చిన దీపాలకాంతిలో తాజ్‌మహల్‌లాగా దేదీప్యమానంగా వెలిగిపోతోంది ఆ యిల్లు ఆ రోజున! అత్యాధునికమైన కట్టడం! లేత క్రీం రంగు డిస్‌టెంపర్ గోడల మధ్య అక్కడక్కడా వేసిన పాచిరంగు గ్రీన్‌కలరు డిజైను ఆ దీపాల వెలుగులో పచ్చిగడ్డి పరచినట్టు మెరిసిపోతూ వున్నాయి. ఎరుపు,నీలం, ఆకుపచ్చ బల్బులు వెలుగుతూ, ఆరిపోతూ మిణుక్కు మిణుక్కుమనే నక్షత్రాల్లా అగుపిస్తూ చూసేవారి కది ఒక చిన్న తారామండలంలా అనిపిస్తోంది. ఇంటిముందు షామియానా, షామియానాలో గజానికొక బల్బు, ట్యూబ్‌లైట్లు అమర్చిపెట్టారు. ఆ వెలుగులో వెన్నెల కూడా వెలవెలపోతోంది. చూస్తూ వుండగానే రంగురంగుల కార్లు – ముచ్చటగా ముద్దుగొలిపే చిన్న సైజువీ, పొడుగ్గా పడవల్లాగా కనిపించేవి ఎన్నో కార్లూ 'రకరకాల స్కూటర్లు' మోటారు సైకిళ్ళు ఎన్నో ... ఎన్నెన్నో! ఆశ్చర్యంతో చూస్తూ వాటిని లెక్కపెట్టాలని చూసినా చాతకాక పక్కనే నుంచుని అలా వాటికేసి కాస్సేపూ చూస్తూ నుంచున్నాడు పెంటయ్య! రోజూ చూసే ఇల్లే...! రోజూ చూస్తున్న మనుషులే... అయినా ఈ రోజు, ఆ ఇల్లూ.. ఆ మనుషులూ అంతా కొత్తగానే కనిపిస్తున్నారు పెంటయ్యకి. జారిపోతున్న లాగు (నిక్కర్ని) పైకి లాక్కుంటూ ఒదులుగా వున్నా, వాడికి బుద్ధి తెలిశాక వేసుకున్న కొత్త డ్రెస్ కనుక విసుక్కోకుండా పైకి లాక్కుంటూ, దూరంగా నిలబడి చూస్తున్నాడు వేడుకలని పెంటయ్య. అది ఆ ఇంట్లోని చిన్నారి ఫాల్గుణి ప్రథమపుట్టిన రోజు పండుగ!

ధగధగా మెరుస్తున్న వెండి కుర్చీలో, మందారం రంగులో గొడుగులా విచ్చుకుని, జరీపువ్వుల తళతళలతో మెరిసిపోతూ ఎంతో అందంగా వున్న గౌను వేసుకుని,

తెల్లటిసాక్సూ,తెల్లటి షూసూ వేసుకుని ఆ షూసు ఆపాప అడుగు వేసినప్పుడల్లా లైటు లాంటి కాంతినిస్తూ ఉంటే. సంగీతం లాంటి శబ్దం వినిపిస్తూవుంటే, కుర్చీ దిగుతూ ఎక్కుతూ ఆడుకుంటోంది ఫాల్గుణి! చేతులకి బంగారు మురుగులూ, మెడలో రకరకాల గొలుసులూ ఫాల్గుణి తెల్లటి శరీరచ్ఛాయకి పసుపురంగు వన్నె రంగరించినట్లు కాంతినిస్తున్నాయి. అవన్నీ చిరాగ్గావున్నాయేమో. మధ్య మధ్య పీకేస్తూంది ఫాల్గుణి. వెంటనే వాళ్ళమ్మ శ్రావ్య, అమ్మమ్మ కాంచనా వెళ్ళి వాటిని మళ్లీ సరిగ్గా సర్దుతున్నారు.

పెంటయ్య తన బట్టలకేసి చూసుకున్నాడు. పేలికల్లా వెలవెలబోతున్నాయి. జారిపోతున్న లాగుని మళ్ళీ పైకి లాక్కున్నాడు. లాగు కనిపించనంత పొడుగ్గా వున్న షర్టుని చూసి కొంచెం మడతపెట్టి పట్టుకోవడానికి ప్రయత్నించి విఫలుడయ్యాడు. అది కొంటున్నప్పుడే చెప్పాడు తల్లికి 'ఇవి చాలా పెద్దగున్నయమ్మా, కొంచెం చిన్నసైజు కొనమని' కానీ నర్సమ్మ వింటే కదా! 'ఎదిగే పిల్లోడికి కరెట్టు సైజు కొంటే ఎంబడే పొట్టిగయిపోతది. పెద్దసైజు కొంటే కనీసం కొన్నొద్దులు తొడుగుకోవచ్చు!' అంటూ ముదురు నీలంరంగు లాగూ అదేరంగు గళ్ళచొక్కా కొంది. అదైతే మురికి ఆగుతుందని! ఆ టైములో నర్సమ్మ స్నానం చేయించి ఆ బట్టలు తొడుగుతుంటే పెంటయ్యకి ఎంత సంతోషం వేసిందో! కిటికీ గూట్లో పెట్టిన సగం పగిలిన అద్దంలో వాడి మొహం ఎన్నిసార్లు చూసుకున్నాడో! తలకి బాగా నూనెరాసి నున్నగా దువ్వుకున్న మొహం, గుండ్రంగా ఎంతో బాగా అనిపించింది వాడికి. రోజూ వాడికి వాళ్ళమ్మ అలా తల దువ్వాలనీ, నీళ్ళు పొయ్యాలనీ, ముద్దు పెట్టుకోవాలనీ అనిపిస్తుంది. కానీ టైమేదీ? రోజూ నర్సమ్మ నాలుగింటికి లేస్తుంది. ఇంటిముందు నీళ్ళు చల్లి ముగ్గుపెడుతుంది. ఆ తరువాత చల్లనీళ్ళే నాలుగు చెంబులు స్నానం చేస్తుంది. చాయ్ పెడ్తుంది. అప్పుడు 'పెంటీ... పెంటీ.. లేరా... లేటయితది మనం బోవాల'.. అంటూ పెంటయ్యని నిద్రలేపడం మొదలు పెడుతుంది. లేపగా లేపగా ఒక గంటకి మెల్లగా లేస్తాడు వాడు. నూరిపెట్టి తయారుగా వుంచిన బొగ్గుపొడిని చేతికందిస్తుంది తల్లి. పళ్ళు తోముకుని, ముఖాన్ని నీళ్లతో కడుక్కుని, తల్లి అందించిన చాయ్ గ్లాస్ తీసుకుని తాగేలోగానే తల్లి పదిసార్లు చెప్తుంది' బిరాన పో బిడ్డా! అమ్మ కోపమైతది' అంటూ వెంటనే వెళ్ళిపోతాడు వాడు పరుగులాంటి నడకతో. అయ్యగారి కారుతుడవడం దగ్గరినుంచి చెట్లకి నీళ్ళు పొయ్యడం, బజారుకెళ్ళి ఏది తెమ్మంటే

అది తేవడం ఫాల్గుణిని ఎత్తుకు తిప్పడం, అన్ని పన్లూ ఏది చెబితే అది చెయ్యాలి.

పదిగంటలకి అమ్మగారు వంటామెకి చెప్పి టిఫిన్ పెట్టిస్తారు. వంటామె ఆమెకి నచ్చినంత కొసరి కొసరి పెడుతుంది. అసలు పెట్టాలా వొద్దా అని ఆలోచిస్తున్నట్టు తన సొమ్మేదో పోతూన్నట్టు! మళ్ళీ ఎన్ని పన్లు! కనబడడానికి చెప్పడానికీ రాని పన్లు. అయ్యగారి షర్టూ, పాంట్లూ ఇంకేమైనా అమ్మగారి బట్టలూ సందుచివర వున్న చాకలి కొట్లో ఇవ్వడానికీ, ఇచ్చినవి తేవడానికీ, ఇంటికెవరికైనా వచ్చినా లేదా ఇంట్లో వాళ్లకైనా కాఫీలూ, టీలూ అందించడానికీ, కప్పులు కడగడానికి దుప్పట్లు వెయ్యడానికీ, తియ్యడానికీ ఇలా ఎన్నోసార్లు తిరుగుతాడో ఆ ఇంట్లో. ఇంట్లోనే ఎవరూ లెక్కపెట్టలేరు! మధ్యాహ్నం అందరి భోజనాలూ అయ్యాక వంటావిడ వెంకటలక్ష్మమ్మ పెంటయ్యకీ, నర్సమ్మకీ కలిపి అన్నం, చారు, మిగిలినవేవో గిన్నెల్లో పెట్టి ఇస్తుంది. తోటలో ఒక మూల విస్తరాకుల్లో పెట్టుకుని, నర్సమ్మా, పెంటయ్యా ఇద్దరు తింటారు. తినేలోగానే, అమ్మగారో, అయ్యగారో పిలుస్తూనే వుంటారు. 'జల్దీ జల్దీ తినుపో' అని తొందరచేస్తుంది నర్సమ్మ కాస్త ఆలస్యం అయితే అందరి దగ్గరా 'తిరిగే దున్నపోతులా గంటసేపు తింటావేంటీ?' అంటూ.

రోజూ తన తల్లి ఫాల్గుణికి వెండి కంచంలో ముద్దలు కలిపి చెట్టుని చూపిస్తూ, పిట్టని చూపిస్తూ గంటసేపు తిప్పీ తిప్పీ తినిపిస్తూ వుంటే వాడికెంతో ముచ్చటగా వుండి అటే చూస్తూ వుంటాడు వాడు. అలా చూస్తూవుంటూ తన్మయత్వంతో ఫాల్గుణి స్థానంలో తనని ఊహించుకుంటూ, అమ్మగారు కోప్పడ్తారు కూడా! నీకు కడుపు నిండా టిఫినూ, తిండీ పెట్టినా దాని కంచం వైపు అలా చూస్తావేమిట్రా దిష్టితగలేట్లు' అంటూ పెద్దమ్మగారు కాంచనమ్మగారి తిట్లు! లేకితనం, లేకిబుద్ధి....' అమ్మగోరు శ్రావ్యమ్మగారి మాట. 'వాడంతేనండి' ఎంతపెట్టినా చాలదు వాడికి. ఆబ! అంటూ వంటింట్లోంచి వంటమనిషి వెంకటలక్ష్మి వంతపాట! ఆవిడ వంటింట్లో కూర్చుని మెక్కడం ఎన్నోసార్లు చూశాడు పెంటయ్య. కానీ ఎవరికీ చెప్పలేదు ఒక్కతల్లికి తప్ప 'ఏయ్... ఊకో బిడ్డా... మనకెందుకు? యాడనన్న నోరిప్పితివి మన పానాలు దీస్తరు అల్లు! పెద్దోల్ల సంగతి!... ఏమనబోకు బిడ్డా!ఎవ్వరి తెరువుకు బోకు నువ్వ."' అంటూ సలహా ఇచ్చేది నర్సమ్మ.

ఆరోజు అమ్మగోరు తన తల్లికి డబ్బిచ్చి 'ఒసేయ్, పెంటికి కొత్త బట్టలు కొనవే' అన్నప్పుడు మురిసిపోయాడు వాడు. తల్లితో మార్కెట్‌కెళ్ళి చొక్కాలాగూ కొనుక్కుని ఇంకా మురిసిపోయాడు. ఆ సాయంత్రం బట్టలు వేసుకుంటూ ముస్తాబవుతూంటే తల్లి ఫాల్గుణికి ముస్తాబు చేస్తున్నట్లుగా పొంగిపోయాడు.

దూరం నుంచి ఫాల్గుణి కేకు కట్‌చెయ్యడం, బెలూన్లతోనూ, బూరాలతోను ఆడుకుంటూన్న ఇతర పిల్లలనీ చూస్తూ, తనకీ ఆడుకోవాలని అనిపించినా, తనకెవ్వరూ ఇవ్వలేదు కాబట్టి మాట్లాడక ఊరుకున్నాడు! కానీ కళ్ళారా చూడ్డానికి కూడా నోచుకోలేనట్లు అమ్మగోరు. పెద్దమ్మగోరూ ఊరికే వాణ్ణి పిలిచి అందరికీ కేక్ ముక్కలు, టిఫిన్లు అందించమనడం, మంచినీళ్ళూ, కాఫీలూ అందించమనడం. ఖాళీ కప్పులు తెచ్చి కడగమనడం. ఆ సమయంలో పెంటికి అవన్నీ చెయ్యాలని అనిపించకపోవడంతో అయిష్టంగానే అన్ని పన్లూ చేస్తున్నాడు. వాడి కొత్తబట్టలు నలిగిపోయాయనీ, కాఫీ ఒలికి వాడి చొక్కా మీదపడితే. వాడి చొక్కా పాడయిందని వాడు బాధపడుతూవుంటే కాఫీ ఒలకబోసినందుకు అమ్మగోరు తిట్టడం – వాడికి ఏడుపొచ్చింది. అందరూ కేకుముక్కల్ని మరీ మరీ తింటూ, వాడికి నోట్లో నీళ్ళూరాయి. అన్నీ దిగమింగుకుని, ఏదో లోకంలో వున్నట్టు, వింతగా చూస్తూ పన్లు చేసుకుపోతున్నాడు పెంటి.

ఉన్నట్టుండి పరుగెత్తుకొచ్చి పెంటి కాళ్ళను చుట్టేసి, ఎత్తుకోమని చేతులందించింది ఫాల్గుణి! ఆ కదలికకు తూలిపడ్డాడు పెంటి. వాడి చేతుల్లోని కేకుముక్కలూ స్వీట్లూ వున్న ప్లేట్లు కిందపడి బద్దలయ్యాయి. ఆ చప్పుడుకి ఝడుసుకుందేమో ఫాల్గుణి ఏడుపు లంకించుకుంది. అది చూసి అందరూ అటు పరుగెత్తుకొచ్చారు. శ్రావ్యకి పిచ్చి కోపం వచ్చింది. "వెధవ! ప్లేట్లన్నీ అలాపగల కొట్టేస్తావా?' అంటూ వాణ్ణి లోపలి గదిలోకి తీసుకెళ్ళి ఆ చెంపా ఈ చెంపా వాయించింది. కాంచనగారు వాడి నిర్లక్ష్యాన్ని గురించి, అ సమర్ధతను గురించీ పాఠాలు వల్లించేసింది.

పెంటి కళ్ళనుంచి చెంపలమీదుగా జారిన కన్నీళ్ళు వాడిషర్టుని తడిపేశాయి! అవమానం వాణ్ణి అక్కడ నిలవనియ్యడం లేదు. ఆ దృశ్యాన్ని చూసస్తూ అవాక్కయిపోయింది నర్సమ్మ. పెంటిని ఎత్తుకుని గుండెలకి హత్తుకుని ఓదార్చాలనిపించింది. కానీ, బోలెడుపన్లు. అందరూ ఏదో ఒకటి చెప్తూ పిలుస్తున్నారు.

“నర్సమ్మా, మంచి నీళ్లు కావాలి.”

“నర్సమ్మా, టీ కప్పులు పట్టుకెళ్ళు”

“నర్సమ్మా ఈ కుర్చీ అక్కడ వెయ్యి”

నర్సమ్మకి ఊపిరాడడం లేదు.

ఏడుస్తున్న పెంటిమీదే తన ధ్యాస! కానీ, ఆ పన్లు ఒదలేసి వాణ్ణి దగ్గరకు చేరదీసుకునే స్వేచ్ఛ తనకి లేదు! తను అక్కడున్న వాళ్ళందరికీ బానిస! ఆమె గుండె, పెంటి దుఃఖాన్ని చూసి బద్దలయిపోతోంది. అక్కడున్న వాళ్లందరూ కేకుముక్కలూ, స్వీట్లూ తింటూ వుంటే, తన కొడుకు అవేవీ తినకపోగా, దెబ్బలు తిన్నాడు. ఆమె కళ్ళు నీటికుండలయ్యాయి. పమిటకొంగుతో కళ్లు తుడుచుకుంది.

ఎక్కడివాళ్ళక్కడికి వెళ్ళేసరికి రాత్రి పదిగంటలు దాటింది. ఏడ్చి ఏడ్చి పెంటి ఆ మూల కూర్చునే నిద్రపోయాడు. పెద్ద కేకుని ముక్కలు కోస్తూన్నట్టు కల గంటూ, చిన్నగా నవ్వుకుంటున్నాడు. శ్రావ్య ఇచ్చిన కేకు ముక్కలూ స్వీట్లూ తీసుకుని, పెంటిని నిద్రలేపి ఇంటికి బయలుదేరింది నర్సమ్మ.

పెంటిని ఒళ్ళో కూర్చోబెట్టుకుని ఇగో ఈ కేకు ముక్కతిను బిడ్డా' అని నోట్లో పెట్టింది. తుపుక్కున ఉమ్మేశాడు పెంటి! కొన్ని గంటల క్రితం ఆ కేకు ముక్కల్ని ఎంతో కోరుకుని దాని కోసం విలవిలలాడిపోయిన వాడికి ఇప్పుడది నోట్లోకి పోవడం లేదు. వాచిపోయిన బుగ్గలని తల్లి మెల్లిగా నిమురుతూ వుంటే అది కేకు ముక్కలకన్నా తియ్యగా అనిపించింది.

'అమ్మా! నేనొకటడుగుత... ఒద్దనవుగద!”అన్నాడు. కళ్ళలోని నీటి తెరలను పమిట చెంగుతో తుడుచుకుంటూ “అడుగుబిడ్డా... ఏంగావాలె నీకు?” ముద్దులవర్షం కురిపించింది వాడి నుదుటిమీద. గట్టిగా గుండెకి వాణ్ణి హత్తుకుంటూ, ఆ పరిష్వంగంలోని హాయిలో తేలిపోతూ “అమ్మీ! రేపటి సంది నేను బడికి పోతనే పనికి బోను! సదువుకుంట!.. కాదనకే!” అన్నాడు జాలిగా చూస్తూ.

నర్సమ్మలోని మాతృత్వం కొవ్వొత్తిలా కరిగిపోయింది. కన్నీరు కాలువలై పొంగింది. సెంద్రయ్య మామ మాటలు గుర్తుకొచ్చాయి. 'నర్సీ.. నాగ్గిట్ట కొడుకు

బుడితే ఆణ్ణీ నా లెక్క లారీ డ్రైవర్ని సెయ్యనే... నీ యవ్వ! ఇస్కూలుకి బంపించి. దొరలెక్క సదివిపిస్త' అని! కళ్ళల్లో నీళ్ళు తిరగినాయి., యాక్సిడెంటులో చనిపోయిన చంద్రయ్య గుర్తుకొచ్చి! నర్సమ్మ వాణ్ణి "అట్టాగే బిడ్డా! రేపు పొద్దుగల్ల మూల మలుపుకాడున్న గా బడికిబోయి పెద్ద పంతుల్ని గలిసి నిన్ను ఇస్కూల్ల ఏస్తా! నువ్వు బుగులు బడకు" అంది. బలవంతంగా కేకు ముక్కల్ని తినిపిస్తూ.

ఆ మాటలూ, ఆ కంఠస్వరం వాడికి కోటి వీణలు మోగినట్టనిపించింది. ఆమె పొత్తిళ్ళలోని వెచ్చదనం మెత్తదనం వంద పరుపులకు సరితూగదనిపించింది. ఆ వడిలో హాయిగా ఆదమరచి నిద్రపోయాడు పెంటి! మర్నాడు వెళ్ళబోయే స్కూలూ జీవితం గురించి కమ్మగా ఊహించుకుంటూ కలలు కంటున్నాడు. తల్లి ఒళ్ళో మొగ్గలా ముడుచుకుపోయి పడుకుంటూ! రేపు ఈ మొగ్గ వికసించి పువ్వవుతుంది. ఆ ఆనందంలో తనకి స్వేచ్ఛ లభిస్తుంది. నర్సమ్మ కూడా ఊహల్లో తేలిపోతూ, వాణ్ణి పక్కమీద పడుకోబెట్టి, గుండెలకి హత్తుకుంటూ నిద్రలో మైమరచిపోయింది.

# రెక్కల చూపు

**- శీలా సుభద్రాదేవి**

"**రా**జయ్య మామ కనిపించిండా సీనివాసూ!" కళ్లని సందు మొగలో దీపంలా వెలిగించినా చేతుల్తో, యాంత్రికంగా బీడీలు చుడుతూనే సావిత్రి అడిగింది అప్పుడే పుస్తకాల సంచితో లోపలికి వచ్చిన శ్రీనివాసుని.

సెకనులో పావోవంతు కాలంపాటు కళ్ళల్లోకి రాబోయిన చిరాకుని మనసు నిండావున్న జాలి కడిగేయగా స్కూలు డ్రస్సు మార్చుకుంటూనే "కనిపించిండు కానీ ఉత్తరం ఏదీ లేదన్నాడు" అన్నాడు.

తిన్నగా వెనకవైపు గుమ్మం తలుపు తీసుకొని పెరట్లోకి వెళ్ళి కాళ్ళూ, చేతులూ మొఖం కడుక్కొని దండెంమీద తువ్వాలు గుడ్డతో తుడుచుకొని వచ్చి తల్లి పక్కనే చతికిలబడి తునికాకు చేట అందుకున్నాడు.

"నేను చేసుకుంటాలేరా - ఇస్టవ్వుపైన చాయి ఎచ్చపెట్టిన. జరంత తాగి సదూకో" అంది ప్రేమగా వాడిని చూపులతోనే తడుముతూ.

"పర్లేదులేయే. రేపు ఆదివారం, ఇస్కూలు సెలవు కదా! రేపు చదూకుంటలే"

"నీయంతున్నప్పుడు నీయన్న ఎంకటేసుకూడా గిట్లనే నేనుకూడా బీడీలు చుడ్తనే అంటూ ఇంటి కాడున్నంతసేపూ నాకు సాయం సేసేటోడు. ఎంత జల్దీ చుట్టి కట్టలు కట్టేసేటోడో నా పిచ్చి తండ్రి!..." కాసేపు గొంతు పెగల్లేదు.

అప్పటికి ఈ విషయం ఏ వెయ్యోసారో వినివున్నా అప్పుడే మొదటిసారి విన్నట్లుగా ముఖం పెట్టి ఆసక్తిగా విన్నాడు బీడీలు చుడ్తూనే శ్రీనివాసు.

"ఒదినే! నీ పనిగిట్టా ఖతమైనాదె? కట్టలిచ్చేందుకు పోయొద్దాం. మళ్ళీ సీకటడతంది. సీకట్లో పోయినామంటే కచ్చర కచ్చర తునికాకు మనమొగాన కొడ్తడు. బీడీలు సుట్టనేక సావాల. ఎగస్ట్రా పైసలు కూడా కోతెడతాడు ఆ సచ్చినోడు" అల్లంత

దూరం నుండి పురాణంలా చెప్పుకుంటూ వచ్చింది పొరుగింటి లక్ష్మమ్మ.

'ఇంగో జరంతే వుంది. అర్ధగంటలో అయిపోతంది. పోయొద్దాం. వచ్చేటప్పుడు గిట్టా బియ్యం, కూరగాయలు కొనుక్కొచ్చుకోవాలి. రేపు ఆదివారం మా ఎంకటేసుగాని ఒస్తడో ఏందో..."

"జరంత సేపు ఈడనే కూసుంటలే" అంటూ తను కూడా నాలుగాకులు ముందరేసుకొని బీడీలు చుడ్తూ "ఎంకటేసు కాడ్నుంచి కారటు గిట్టా పడిందా?"అంది లక్ష్మమ్మ.

శ్రీనివాసు మౌనంగా వుండిపోయాడు.

"రాలేదు గానీ.. ఎట్లగూ రేపొస్తడని కారటు ఏయలేదేమో. లేకపోతే ఆడు ఇంగిలీసులో రాస్తే బాస సమజుకాక రాజయ్య ఇంకేడనో యిచ్చిండో" కొడుకుని తలంచుకొని గొంతులో గర్వరేఖ మెరిసింది.

కట్టిన బీడీ కట్టల్ని లెక్కపెట్టి చేతి సంచిలో సర్దుకొని చీర కాస్త దులుపుకొని సరిచేసుకుంది సావిత్రి. "సీనివాసూ ఇల్లు కనిపెట్టుకొని వుండు. నేను పొయ్యొస్తా. వచ్చినంక వంట చేత్తా. అన్నట్లు ఇయ్యాల రెడ్డెమ్మ గారింట్లో ఆళ్ళ బాబు పుట్టిన రోజు దావతు. మితాయి తెచ్చినా, గూట్లోని డబ్బాలో పెట్టినా, నువ్వొకటి తిని అన్నకి కూడా జరంత వుంచు" అంపకం చెప్పి "పద ఒదినే" అంటూ పక్కింటి ఆమెతో కలిసి బయల్దేరింది.

కింద పడిన కచ్చరంతా చేటలో ఎత్తి శుభ్రం చేసాడు శ్రీనివాసు. డబ్బాలోని మితాయి ముక్కని తీసుకొని తిని తిరిగి లెక్కలు హోమ్‌వర్క్ చేసుకోవటానికి వీధరుగు మీద పుస్తకాలు తెరుచుకొని కూర్చున్నాడు.

'ఎనిమిదో తరగతి వరకూ లెక్కలూ, ఇంగ్లీషు అన్న చక్కగా చెప్పేటోడు. రెండేళ్ళ నుండీ సొంతంగానే చదూకోవల్సి వస్తున్నాది. స్కూలు నుండి వచ్చిన వెంటనే చదుంకుంటే మంచిగనే సమజైతది. పబ్లికు పరీక్ష వుంది. అన్నగిట్ల చెప్తే ఇంకా మంచి గుంటుండె. రేంకు తెచ్చుకునేటోడ్ని' ఆలోచనల్లోంచి బయటపడి చదువులో మునిగిపోయాడు.

సంధ్యవాలి ఇంట్లో చీకట్లు ముసురుకున్నాయి.

“ఏందిరా సీకటడిపోయింది. ఇంట్లో దీపమన్నా ఎలిగించినావు కాదు” అంటూ వచ్చింది సావిత్రి.

“చదుంకుంటూ చూడలేదే. ఇంకా బయట ఎల్తురుంది కదా” అంటూ పుస్తకాలు సర్దుకొని తల్లి వెనకే గదిలోకి వెళ్ళాడు.

ఒకటే గది. అదే పడక గదీ చదువుకొనే గదీ అన్నీను. దానికి ఆనుకొని చిన్న గది ఉంది. పేరుకి గదే కాని వంటకి కిరోసిన్ స్టవ్వు, బిందె ఒకవైపు పెట్టగా ఒకరిద్దరు మనుషులు నాలుగడుగులు వేసేటంత మేర వుంటుంది. సావిత్రి తల్లిది ఆ యిల్లు. పుట్టిన పిల్లలందరూ ఏవో రోగాలొచ్చి చిన్నప్పుడే పోవటంతో సావిత్రి మాత్రం మిగిలింది. కూతుర్ని తమ్ముడికే ఇచ్చి పెళ్ళిచేసి తల్లి కూడా సావిత్రి దగ్గరే వుండేది. తల్లీ కూతురు నాలుగైదిళ్ళు బాసాన్ల పని చేసుకునేవాళ్ళు. సావిత్రి భర్త యాదగిరి రిక్షా నడిపించేవాడు. పొద్దున్నా సాయంత్రం స్కూలు పిల్లల్ని విడిచేవాడు. మిగతా సమయంలో బయట బేరాలు చూసుకునేవాడు.

తల్లీ కూతురు మధ్యాహ్నంపూట ఇంట్లో బీడీలు చుట్టడం చేస్తుంటారు. రెండు రోజులకొకసారి కాంట్రాక్టరు దగ్గరకి వెళ్ళి తునికాకు తెచ్చుకొని చుట్టటం పూర్తిఅయ్యాక కట్టలు ఇచ్చి పైసలు తెచ్చుకుంటారు. వెంకటేసు తర్వాత చంద్రకళ అని కూతురు కూడా ఉండేది.

ఒకసారి సినిమాకు రిక్షాలో తీసుకువెళ్ళి తిరిగి వస్తున్నప్పుడు లారీకి గుద్దుకొని యాదగిరి, చంద్రకళ అక్కడికక్కడే చనిపోయారు. సావిత్రి తల్లికి కూడా బాగా దెబ్బలు తగలటంతో మరో వారానికి పోయింది.

అప్పటినుండీ సావిత్రి వంటరిదైపోయి మగపిల్లలిద్దర్నీ పెంచుతోంది. వుండడానికి చిన్న కొంప వుండడంతో తినో, తినకో కాలక్షేపం జరిగిపోతోంది. ఇరుగూ, పొరుగూ కూడా ఆమెలాంటి పేద బతుకులే అయినా మాట సాయం వుండడంతో అదే కొండంత ధైర్యంగా బతుకు వెళ్ళమార్చుతోంది సావిత్రి.

పిల్లలు చదువుతున్నది గవర్నమెంటు స్కూలు కావటంతో చదువుకి ఇబ్బంది కలగలేదు. బీడీ కార్మికుల పిల్లలకు వచ్చే స్కాలర్‌షిప్ కాకుండా బాగా చదవటం

వలన ప్రతి సంవత్సరం సాంఘిక సంక్షేమ శాఖవాళ్ళ మెరిట్ స్కాలర్‌షిప్పు కూడా పిల్లలిద్దరూ పొందేవారు.

పెద్దవాడు వెంకటేసు పదవతరగతి పాసై సిగరెట్టు ఫ్యాక్టరీలో కొత్తగా పనికి కుదిరాడు. ఒక ఏడాది గడిచేవరకూ బాగానే వున్నాడు. తర్వాత వాడి ధోరణిలో క్రమంగా మార్పు రావటం మొదలైంది. సరిగా ఇంటి పట్టున వుండేవాడు కాదు. వున్న కాసేపూ ఏవో పుస్తకాలు పట్టుకొని ఏ మూలనో కూచునేవాడు. మాటలు తగ్గిపోయాయి. ఒక్కొక్కప్పుడు రెండు మూడురోజులు ఎక్కడికో వెళ్ళివచ్చేవాడు. సావిత్రికి ఏమీ అర్థం కాకుండా పోయింది. వీడెందుకిలా మారిపోయాడో తెలియటం లేదు.

కొన్ని నెలలు గడిచాక ఒకరోజు పనికని వెళ్ళినవాడు మళ్ళీ రాలేదు. కొన్ని రోజుల తర్వాత ఒక ఉత్తరం మాత్రం వచ్చింది. పోస్టుమేన్‌ని ఎవరు రాసారని అడిగితే వెంకటేసు పేరు చదివి చెప్పాడు. శ్రీనివాసు వచ్చాక చదివించుకుందామని అనుకుంది కాని, అంతవరకూ ఓపిక పట్టలేక ఒక్కొక్క అక్షరం పట్టిపట్టి చదివింది. చదివాక ఏం చెయ్యాలో తోచలేదు. చిన్నకొడుక్కి కూడా చెప్పలేని అశక్తత గుండెల నిండా కమ్మేసింది. ఆ వుత్తరం ఎక్కడ దాచాలో తెలియలేదు. వంటింట్లో పైన పెంకుల చూరులో సన్నగా మడచి దూర్చింది.

మళ్ళీ ఎంతకాలం ఎదురు చూసినా మరో ఉత్తరం అందుకోలేదు. అయినా ఏదో ఆశ ఎదురుచూసేలా చేస్తోంది. ఎప్పుడో తన కొడుకు వస్తాడని ఎదురు చూస్తూనే ఉంది. ఎవరూ లేని ఏకాంత సమయంలో తిరిగి ఆ ఉత్తరం తీసి చదువుకొంటుంది. రోజులు గడిచి చూరులో కారిన వాన నీటికి ఉత్తరంలోని అక్షరాలు చెరిగిపోయినా ఆమె మనసుతో చదువుకోగలుగుతూనే ఉంది. ఉత్తరం చిరిగి పీలికలౌతుందేమోనని ప్లాస్టిక్ కవర్లో పెట్టి మళ్లీ దాచేసింది.

సావిత్రి గతాన్నంతటినీ ఆలోచిస్తూ బెండకాయలు కోస్తూ యథాలాపంగా చూరులోకి చూసింది.

“అటేపు చూస్తున్నావేంది?” అన్నాడు శ్రీనివాసు తను కూడా పైకి చూస్తూ.

ఆమె ఏమీ మాట్లాడలేదు.

"అవు మల్ల యాదిమర్సిన. రేపు ఇస్కూలుకి నిన్ను పిలుసుకు రమ్మని మాపెద్ద మేడంగారు చెప్పమన్నరు. నాకు స్కాలర్‌షిప్ వచ్చిందంట"

"అట్టాగే రేపు పొద్దుగాల్నే వస్త. నువ్వుమంచిగ సదువుతున్నావ బిడ్డా! నువ్వన్నా మంచిగ సదూకోని పెద్ద కొలువు చెయ్యాల. మీ అయ్య ఇస్కూలుకి బడి పిల్లగాళ్ళని రిక్షాలో గొంచుకు పోయేటోడు. పెతీ దినం ఎంకటేసునీ, సీనివాసునీ పెద్ద సదూలు సదివిస్తననేటోడు. మంచిగ సదివి పెద్ద కొలువు సేస్తడని అనుకొంటే యీ ఎంకటేసు అజాపజా లేకుండపాయె. ఏడున్నడో, తింటన్నడో లేదో, ఏం జేస్తన్నడో.... " చెమ్మగిల్లిన కళ్ళు తుడుచుకుంటూ మరోసారి చూరువైపు చూసింది.

'అన్నఏడకు పోయిండే? మా ఇస్కూల్లో టీచర్లు కూడ అడుగుతుంటరు మద్రాసు సినిమాల్లో చేరేందుకు గిట్టా పోయిండా అని" ఉల్లిపాయలు వలుస్తూ నెమ్మదిగా అన్నాడు.

తల్లి ఏమీ మాట్లాడలేదు. మనసులో చెలరేగే అలజడికో, ఉల్లి ఘాటుకో కళ్ళల్లోంచి నీళ్ళు కారుతూనే వున్నాయి.

వాతావరణం ఒక్కసారి బరువెక్కినట్లయింది.

మౌనంగానే వంట పూర్తిచేసి కొంచెం కూరా, అన్నం ఓ గిన్నెలో పెట్టి వుంచి మూతపెట్టి మిగతాది శ్రీనివాసుకు పెట్టి సావిత్రి కూడా భోజనం పూర్తిచేసింది. ప్రతీ శనివారం రాత్రి వెంకటేసు వస్తాడేమోనని ఆ విధంగా అన్నం, కూరా వుంచుతూనే వుంటుంది.

శ్రీనివాసుకి బొంతవేసి తాను చాపేసుకు పడుకుంది. శ్రీనివాసు పుస్తకాలు ముందేసుకు కూర్చున్నాడు.

వారానికి నాలుగు రాత్రులైనా గడిచే విధంగానే సావిత్రికి ఆ రాత్రి కూడా కలత నిద్రలోనే గడిచిపోయింది.

గత కొన్ని నెలలుగా గడిచినట్లుగానే ఆ ఆదివారం కూడా సావిత్రి నిరీక్షణ ఫలించకుండానే తిరిగిపోయింది. సోమవారం చీకట్నే లేచి వాకిలి ఊడ్చి, కళ్ళాపు చల్లి ముగ్గుగీత గీసి శ్రీనివాసుని లేపింది.

"నేను పనికి పోతున్న. రాత్రన్నం జరంత వుంది. చింతకాయ తొక్కు ఏసుకుతిని ఇస్కూలికి పో. నేను ఇళ్ళల్లో బాసాన్ల పని అయినంక ఒక్క గంట కొట్టేయాలకి వస్తానని చెప్పు" అని తలుపు దగ్గరకేసి పోయింది.

అన్ని యిళ్ళల్లోను బాసాన్ల పని పూర్తి చేసుకొని, పొద్దుమీకి వచ్చి బట్టలు ఉతుకుతానని చెప్పి రెడ్డెమ్మ గారింట్లో మిగిలిన అన్నం నాలుగు ముద్దలుంటే పులుసేసుకు తిని స్కూలుకి వెళ్ళింది.

"ఎంకటేసు జాడేమన్నా తెలిసిందా సాయిత్రక్కా" అంటూ స్కూలు ఆయా పలకరించింది.

"ఒక్క ఉత్తరం పడింది. మళ్ళీ ఏ కబురూ తెలీలేదు" కళ్ళొత్తుకుంటూ అంది సావిత్రి.

"బంగారమసుంటి పిల్లగాడు. ఏడకు పోయిండో ఏందో" జాలిగా అంది ఆయా.

అప్పుడే అటువైపు వచ్చిన ఒక టీచరు "శ్రీనివాసు స్కాలర్షిప్పు కోసమా" అంటూ మేడం రూములోకి వెళ్తూ "ఈ సినిమాల వల్ల పిల్లలు చెడిపోతున్నారండీ. వెంకటేసు ఎంత బుద్ధిగా వుండేవాడు. అలాంటి వాడికి కూడా ఏం బుద్ధి పుట్టిందో, ఏ సినిమాల్లోనో చేరటానికి బొంబాయో మద్రాసో పోయుంటాడు"అంది.

'నా కొడుకు బంగారమమ్మా. అలాంటి చెడుదారులు పోడు' మనసులోనే విలవిల్లాడింది సావిత్రి.

"స్కాలర్షిప్పులోంచి పదో తరగతి పబ్లికు పరీక్షకి నలభై అయిదు కట్టేస్తాను. మిగతా యాభై అయిదు రూపాయలు తీసుకో. ఇదుగో ఇక్కడ సంతకం పెట్టు" అంటూ మేడం సావిత్రి చేత సంతకం పెట్టించుకొని పైసలు చేతిలో పెట్టింది.

"శ్రీనివాసు బాగానే చదువుతున్నాడు. ఈ ఏడాది పబ్లికు పరీక్ష కనుక ఇంటి దగ్గర కూడా మంచిగ చదివించాలి. మంచి మార్కులతో పాసయితే పై చదువుకి కూడా స్కాలర్షిప్ వస్తుంది" అన్న మేడం మాటలకు సావిత్రి ముఖం వెలిగింది.

"అట్లగేనమ్మా" అని నమస్కారం పెట్టి పక్కనే వున్న శ్రీనుతో –

"అమ్మ ఏమందో విన్నవు గదా, జరమంచిగ చదవాలి బిడ్డా" అని చెప్పింది శ్రీనివాసు బుద్ధిమంతుడిలా బుర్ర ఊపాడు.

సావిత్రి, వెంకటేసు నుండి ఉత్తరం కోసం రోజూ ఎదురుచూస్తూనే వుంది. శ్రీనివాసు బుద్ధిగా చదువుకొని పరీక్షలు బాగా రాశాడు. తల్లికి సాయంత్రం పూట బీడీలు కట్టడంలో సాయం చేస్తూనే వున్నాడు. పగలు ఎలక్ట్రికల్ షాపులో పనికి పోతున్నాడు.

ఒకరోజు సావిత్రి బీడీ కట్టలు ఇవ్వటానికి వెళ్ళి, అలా బజారు పని చూసుకుని వచ్చేసరికి రోజులా శ్రీనివాసు వీధిగుమ్మంలో కనిపించలేదు. 'తలుపు దగ్గరికి వేసి ఏడికైనా పోయిండా ఏంది' అనుకుంటూ తలుపు తోసుకొని లోనికి వెళ్లింది. శ్రీనివాసు ఇంట్లోనే ఏవో పుస్తకాలు చదువుతున్నాడు. తల్లిని చూసి ఒక్కక్షణం తొట్రుపడ్డాడు.

"ఏం జేస్తున్నవురా" అంది సావిత్రి అనుమానంగా వాడిని చూస్తూ.

"ఏం లేదు. పుస్తకం చదూతున్నాను" పుస్తకం మూసేస్తూ అన్నాడు శ్రీనివాసు.

"పరీక్షలయినయి కదరా. ఇంకా చదువుడేంది?' అంది యింకా అనుమానం తీరక సావిత్రి.

"ఇందాక జగ్గన్న వచ్చిండు. అతని దగ్గర ఏదో పుస్తకం వుంటే తోచట్లేదని తీసుకున్నా"

"జగ్గన్నంటే ఎంకటేసు దోస్తుకదరా? ఏమన్నా చెప్పిండా అన్న గురించి" ఆతృతగా అడిగింది.

"జగ్గన్న నిన్న రాత్రి వచ్చిండు. ఇప్పుడు తిరిగి పోతున్నని చెప్పిండు. అన్న మంచిగే వున్నాడు. రానీకి కుదరదు. దగ్గర్లో వీలుంటే వస్తనని కబురంపిండంట. ఇంకేం చెప్పలే"

'అంతనైనా తెలిసింది సాల్లే. నే జెప్పలే నా బిడ్డ ఎప్పుడో వస్తడని' తృప్తిగా అనుకుంది.

శ్రీనివాసు ఏం మాట్లాడలేదు.

ఆ రాత్రి సావిత్రికి నిద్రపట్టలేదు. శ్రీనివాసు కూడా నిద్రపోలేదు.

తర్వాత శ్రీనివాసు అప్పుడప్పుడు ఎక్కడికో వెళ్ళి ఏ అర్ధరాత్రికో రావటం, పుస్తకాలేవో తెచ్చుకొని పొద్దుపోయేవరకూ చదువుతూ కూర్చోవటం చాలాసార్లు చూసింది సావిత్రి. మొదట్లో భయపడినా తర్వాత మరి పట్టించుకోలేదు.

ఒకరోజు అర్ధరాత్రి జీపు చప్పుళ్ళూ, విజిల్సూ ఎవరో పరిగెత్తే అలికిడీ వినిపించి ఉలికిపడి సావిత్రి, శ్రీనివాసు లేచారు.

బరువైన బూట్లతో పరుగెడుతున్న చప్పుడు. నిశ్శబ్దాన్ని బద్దలు చేస్తున్నాయి. నిద్రలోంచి ఉలికిపడిన పిట్టలు ఒక్కసారిగా అరచి గాలిలోకి ఎగిరిన సందడి.

గుండెలు అరచేతిలో పెట్టుకొని ఊపిరి కూడా పీల్చకుండా నిశ్శబ్దంగా వుండిపోయారు. కిటికీ తెరచి చూద్దామని లేచిన శ్రీనివాసు, తెరవొద్దన్నట్లుగా తల్లి తల ఊపేసరికి అలాగే కూర్చుండిపోయాడు. అంతలోనే భయంకరమైన నిశ్శబ్దం అంతటా ఆవరించింది. అంతకుముందు ఏమీ జరగనట్లే క్రమంగా ప్రశాంతంగా అయిపోయింది. కానీ సావిత్రి గుండెల్లో సంచలనం సద్దుమణగలేదు. అలాగే కదలకుండా కూర్చొంది.

ఏవో మెత్తటి అడుగుల చప్పుడు మెల్లగా వినిపించింది. పెరటి తలుపుదగ్గర వినీ వినిపించినట్లుగా గొళ్ళెం కొట్టిన చప్పుడు అయింది.

లేచి వెళ్ళబోతున్న శ్రీనివాసు చెయ్యిపట్టి ఆపింది సావిత్రి. అలాగే గోడవారనే చతికిలబడిపోయారు. మళ్ళీ ఏ శబ్దమూ వినబడలేదు. వాళ్ళ గుండె చప్పుడు వాళ్ళకే స్పష్టంగా వినపడేలా కొట్టుకుంటున్నాయి గుండెలు. ఒక్కో నిమిషం, ఒక్కో యుగంలా కాళరాత్రిలా గడిచి తొలి వెలుగురేఖలు విచ్చుకొన్న గుర్తుగా పక్షుల కలకలం, జనం లేచిన సందడి మొదలయ్యింది.

మెల్లగా లేచి సావిత్రి వీధి తలుపు తెరిచింది. ఇరుగు పొరుగు ఆడవాళ్ళు వాకిలి ఊడ్చడం అవీ చేస్తున్నారు. కానీ కళ్ళెత్తితే ఏ రహస్యాలు బయటపడిపోతాయో అన్నట్లు అందరూ వాళ్ళల్లోకి వాళ్ళే చూసుకుంటూ యాంత్రికంగా అలవాటైన రీతిలో పనులు చేసుకుంటున్నారు.

అప్పుడే పెరటి తలుపులు తెరచిన శ్రీనివాసు అక్కడ ఏదో మూటని చూసి ఆశ్చర్యపోయాడు. తీయాలా, వద్దా అని ఒక్క క్షణం తటపటాయించి మెల్లగా మూట అందుకొన్నాడు. ఒక్క నిమిషం దాన్నే అటూ యిటూ పరిశీలించి తన వైపువస్తున్న తల్లి ముఖంలోకి చూశాడు. ఆమె కూడా ఏమీ అర్థం కానట్లు చూస్తూ ఎందుకో అప్రయత్నంగానే తలుపులు దగ్గరకి చేరేసింది. చివరకు మెల్లగా మూట విప్పాడు. అందులో మాసిపోయి మచ్చలు మరకలతో వున్న ఫేంటు, షర్టు, పుస్తకాలు, ఒక డైరీ, పెన్ను వంటి వస్తువులు వున్నాయి. వాటిని గుర్తించిన శ్రీనివాసు 'అన్నా' అంటూ ఒక్కసారి బావురుమన్నాడు.

సావిత్రికి అంతా అర్థమైపోయింది. ఆమె కాళ్ళు నిలవలేకపోయాయి. కళ్ళు నీటి కడవలయ్యాయి. కుప్పకూలిపోయినట్లు అక్కడే తలుపుకు చేరబడిపోయింది. ఎంతసేపు ఏడ్చిందో చిన్న కొడుకు వోదారుస్తుంటే కళ్ళద్దుకుంది. నీళ్ళింకిపోయిన కళ్ళతో శ్రీనివాసుకేసి చూసింది.

కాని ఇప్పుడు ఆమె చూపు చివర వెంకటేశో, శ్రీనివాసో మాత్రమే లేరు. ఇంకా... ఇంకా. అసంఖ్యాకంగా..

**–ఆంధ్రజ్యోతి వారపత్రిక దీపావళి ప్రత్యేక సంచిక. 1997**

# నిర్ణయానికి అటూ ఇటూ

- ఇంద్రగంటి జానకీబాల

సావిత్రి ఆటోలోంచి నెమ్మదిగా దిగి, అతనికి డబ్బులిచ్చి ఎదురుగా ఉన్న ఖరీదైన ఇంటివైపు కాస్త ఆశ్చర్యంగా చూసింది. కుడిచేతిలో ఉన్న చిన్న బ్యాగును ఎడం చేతిలోకి మార్చుకుని గేటు తీసుకుని లోపలకి అడుగు పెట్టింది. చక్కని పూలమొక్కలతో నిండుగా ఎంతో అందంగా ఉందా వాతావరణం. వీధి తలుపు తీసే ఉంది. కళ్ళెత్తి ఎదురుగా ఉన్న చెల్లెలు సునీతను చూడగానే ఒక్కసారి ఒళ్లు జలదరించింది సావిత్రికి. అది ప్రేమో –జాలో –భయమో– ఏమో ఏదీ విడమర్చి చెప్పలేని ఒక భావం. ఒక బాధ ఆమెని ఒక్కక్షణం కుదిపేసింది. అంతలో సునీత అక్కని చూసి ఆశ్చర్యంతో 'రావే అక్కా! రా' అని గట్టిగా అరిచింది. సావిత్రి పరుగులాంటి నడకతో ఆమెని చేరింది. ఆసరాగా ఉన్నదాన్ని వదిలేసి, అక్కయ్య భుజం మీద చేతులు వేసింది సునీత. ఆమె కళ్ళల్లో సన్నటి కన్నీటి పొర.

"ఎన్నాళ్ళకొచ్చావే – ఇన్నాళ్ళకి నా మీద ప్రేమ కలిగిందన్నమాట– నేను గుర్తుకొచ్చానన్నమాట" సునీత గొంతు బొంగురుపోయింది. ఇద్దరూ అక్కడే ఉన్న సోఫాలో కూలబడ్డారు. సావిత్రి వెంటనే ఏం మాట్లాడలేకపోయింది.

"లక్ష్మీ! లక్ష్మీ! చల్లటి మంచినీళ్ళు పట్రా" అంటూ అరిచింది సునీత.

సావిత్రి నెమ్మదిగా గొంతు పెగుల్చుకుంది. "ప్రేమలకేం బోలెడున్నాయి. గుర్తుకు రావటానికి నేను మర్చిపోతే కదా! అయినా నాకు క్షణం ఇల్లు కదలి రావడానికి కుదరదని నీకు తెలీదా ఏం?" అని చెల్లెలివైపు నిశితంగా చూసి "ఏమిటి నువ్విలా అయిపోయావు? బొత్తిగా నడవలేకపోతున్నావా?" అంది.

"ఏం చెప్పను? నా ఖర్మ, కీళ్ళ వాతం, మోకాళ్ల నొప్పులు అంటే ఏమో అనుకుంటారు. కానీ అడుగుతీసి అడుగు వేయలేకపోతున్నాను. ఇదిగో ఈ వాకర్ పెట్టుకుని నాలుగడుగులు వేయడమే గగనంగా ఉంది. ఎవరో ఒకరు నా కోసం

ఉండాల్సిందే – ఇంట్లో ముగ్గురు పనివాళ్ళు, ఇళ్ళూ, బట్టలు, అంట్లు ఒకరు– వంటచేసి, వడ్డించటానికి మరోకామె. ఇదిగో ఈ లక్ష్మి రోజస్తమానూ నాకు సాయంగా ఉంటుంది. ప్చ్! సరేలే గాని – బావగారెలా ఉన్నారు?"

"ప్చ్! ఎలా ఉంటారు? వారమేసి రోజులు మంచం మీంచి లేవలేకపోతున్నారు. బాత్‌రూంకి కూడా పట్టుకుంటే గానీ వెళ్ళలేరు. అందుకే నీ గురించి తెలుస్తున్నా రాలేకపోయా– మరిదిగారేరి?"

"ఇప్పుడే బయటకి వెళ్ళేరు. ఓ గంటలో వస్తారు" అంది సునీత.

"అవునూ – బట్టల రాముడొచ్చి చెప్పాడు ఇద్దరూ వృద్ధాశ్రమంలో చేరుతున్నార్ట. నిజమేనా?" సావిత్రి గొంతులో ఒక బాధ ధ్వనించింది. వెంటనే సునీత సమాధానమూ చెప్పలేదు. తలొంచుకుంది. బాధతో ఆమె కళ్ళలో నీళ్ళూరాయి. తల కదిలిస్తే అవి జలజలా రాలుతాయి. సావిత్రి సంగతి గ్రహించింది.

"ఏమొచ్చింది? పెద్ద ఇల్లూ, వాకిలీ – డబ్బూ అన్నీ ఉన్నాయి. మీరు మిగిల్చి పిల్లలకి యివ్వాలనే బాధ లేదు. ఖర్చు పెట్టుకోండి. డబ్బు పెట్టి నౌకర్లను పెట్టుకోండి" అంది సావిత్రి.

"నిజమే అక్కా! అంతా నిజమే. నేనంటూ అస్సలు లేవలేకపోతుంటే నౌకర్లతో గడిచే మాటేనంటావా? ఎంత డబ్బు ఇచ్చినా వాళ్ళు అప్పుడప్పుడు మానేస్తారు. ఆ రోజు ఇంట్లో నరకమే. తెల్లారి లేస్తూనే కాఫీ లేకపోతే ఆయనకేమో ఒకటే విసుగు. కోపం. నేను కదల్లేక పోతున్నాను. నేను లేచి పనిచెయ్యకపోతే ఇల్లెలా గడుస్తుంది? ఆయనకేమో అస్సలు పనిరాదు. స్టవ్ వెలిగించటం రాదు. పాలు కాయటం రాదు.

పట్టకారుతో గిన్నె పట్టుకోవడమే రాదు, నేనేం చెయ్యను? ఆయన లేస్తూనే కోపంతో చిందులు వేస్తుంటే నాకు ప్రాణం చచ్చిపోయినట్లుంటుంది. నేనింత దురదృష్టవంతురాలినేమా అని ఏడుస్తూ ఉంటాను. హాయిగా ఆయనకింత వండిపెట్టే అదృష్టం. ఆయనకి సేవచేసే భాగ్యం లేకపోయిందే అని కుమిలిపోతున్నాను" సునీత గొంతు పూడుకుపోయింది.

సావిత్రి నెమ్మదిగా చెల్లెల్ని వీపురాస్తూ ఓదార్చింది. పది నిముషాలకి సునీత తన బాధనించి తట్టుకుంది.

"నా గోలకేం గానీ, నువ్వెలా ఉన్నావు? నీ ఆరోగ్యం బాగుంది కదా? బావగారు మంచంలోనే ఉన్నా, నువ్వు బాగున్నావు కనుక నీ సంసారం సజావుగా సాగిపోతోంది. నువ్వు అదృష్టవంతురాలివి. మొగుడికింత చేసి పెట్టుకోవడం కంటే ఏం కావాలి చెప్పు!"

సావిత్రి మనస్సులో ఎక్కడో సన్నటి చీపురుముల్లు గుచ్చుకున్నట్లు విలవిల్లాడింది.

"ఏం అదృష్టమో– ఏం ఆరోగ్యమో –ఏమో సునీ, నీకంటే నేనే ఏడేళ్ళు పెద్దదాన్ని. నాకుమాత్రం ఓపిక ఎక్కణ్ణుంచి వస్తుంది! గుండెల్లో బరువు – ఒకటే ఆయాసం – కాస్త పనిచేస్తే ఆయాసం. ఇంట్లో పని తప్పదు. ఆయనకి సేవ తప్పదు. రాత్రి కంటిమీద కునుకు కూడా నమ్మకం లేదు. ఒక్కోసారి మంచి నిద్రలో ఉండగా 'సావిత్రి – సావిత్రీ' అంటూ పిలుస్తారు. బాత్‌రూంకి వెళ్లాలనో – మంచినీళ్లు కావాలనో– ఫాన్ తగ్గించమనో – దుప్పటి సరి చెయ్యమనో, అలాలేస్తే నాకు మళ్లీ నిద్రపట్టదు. పొద్దున్నే లేవక తప్పదు. లేస్తే నీరసం, ఎప్పుడైనా ఓ అరగంట ఆలస్యంగా లేస్తే మీ బావగారు రంకెలు వేస్తూ ఉంటారు."

"ఇంత మొద్దు నిద్రేమిటే నీకు – నాకు గాబరాగా ఉంది. తొందరగా కాఫీ కలుపు" అంటూ ఇల్లు ఎగురగొడతారు. అక్కడితో ఆగరు తెలుసా. 'నీకు నా పనులు విసుగ్గా ఉంటే ఇంత విషమిచ్చి చంపేయ్ పీడా విరగడై పోతుంది. ఏం ఫరవాలేదు. అలనాడు సావిత్రివి యముడితో పోట్లాడి మొగుణ్ణి బతికించుకుంది. ఇప్పుడు నువ్వు ఆధునిక సావిత్రి కదా యముడి దగ్గరకి పంపేయ్' ఇలా ఏవేవో మాట్లాడతారు. ఓపిక తెచ్చుకుని పని చెయ్యడమే" అంది సావిత్రి.

"అబ్బబ్బ! ఆపవే– అక్కా! పాపం ఆయన మంచంలోఉండి ఉండి ఎంత విసిగిపోయి ఉంటారో అర్థం చేసుకోవాలి"

"అవున్లే! ఆయన విసిగిపోతున్నారు. నేనెంత అల్లాడిపోతున్నానో ఒక్కసారి ఆలోచించి చూడు – నా అనారోగ్యం, నా శక్తి లేకపోవడం ఎవ్వరూ పట్టించుకోరు– అందరి సానుభూతి ఆయనమీదే" సావిత్రి మాటల్లో రోషం, దుఃఖం ఉన్నాయ్.

"ఎందుకు పట్టించుకోరు? అయినా నీకేమంత అనారోగ్యం లేదుగా, నాలా మోకాళ్ల నొప్పులతో అసలు నడవలేకపోవడం, నిలబడలేకపోవడం లేదుగా"

"అంటే – నువ్వు నిలబడలేకపోవడమొక్కటే న్యాయబద్ధమైన కారణమా" సావిత్రి సూటిగా అంది.

"మరి?!"

"నాకు గుండె దడదడ లాడినప్పుడు పడుకుంటే అరగంట వరకు లేవలేను తెలుసా"

"పోనీ. ఆ తర్వాత లేస్తావుగా" సునీత రపీమని అంది.

సావిత్రి చెల్లెలి ముఖంలోకి విస్మయంగా చూసింది. కానీ అప్పుడు సునీత అక్కవైపు చూడటం లేదు. లోపలికి చూపు తిప్పి "లక్ష్మీ" అని పిలుస్తోంది.

"లక్ష్మీ కాస్త ఉప్మా చెయ్యి – అక్కయ్య వచ్చినప్పట్నుంచి కబుర్లలోనే పడిపోయాం" అంది.

సావిత్రి కూడా సర్దుకుంది. "పచ్చిమిరపకాయలు, అల్లం తరిగిపెట్టు– నేనొచ్చి చేస్తా ఉప్మా" అంది సావిత్రి.

"అక్కా! నీ చేతి వంట తిని ఎన్నాళ్ళయిందో" అంది సునీత ఆనందంగా.

"ఇంతకీ – మీరెళ్ళడం నిజమేనా" సందేహంగా అంది సావిత్రి.

"నిజమే, ఆయన ఎనభైవేలు ఆశ్రమానికి కట్టారు. మాకో గది ప్రత్యేకంగా ఇస్తారు. కాఫీలు, టిఫిన్లు, అన్నాలు, మందులూ, డాక్టర్లు అన్నీ వాళ్ళే చూస్తారు. మా ఆయనకి పుస్తకాలుంటే మరేం అక్కర్లేదని నీకు తెలుసుగా"

"అదేవిటే 'గాలితో పాటుగా రామా హరీ వారు గారెలే తింటారు రామా హరీ' అన్నట్లుగా వట్టి పుస్తకాలతోనే సరిపోతే బాధేముంది? ఇన్ని కష్టాలెందుకు? అన్నపానాదులు కావాలి కనుకనే కదా ఈ తిప్పలు" సావిత్రి మాటలు పూర్తవుతుంటేనే సునీత గలగలా నవ్వి.

"భలే చెప్పావే అక్కా" అంది.

"బాత్‌రూం ఎటూ" అంటూ సావిత్రి నెమ్మదిగా లేచింది.

గొప్ప ప్రొఫెసర్ ఉద్యోగం చేసి, పుస్తకాలు రాసి , ప్రచురించి పేరు ప్రఖ్యాతులు సంపాయించి రిటైరై హాయిగా, ఆరోగ్యంగా తిరుగుతున్న వివేకానందకి భార్య సునీత మోకాళ్ళ నొప్పులతో కదలలేక పోవడం పెద్ద ఎదురుదెబ్బగా తయారైంది. అతనికి భార్యమీద ప్రేమలేదంటే అన్యాయమే. ఆమె ఓపికగా అన్నీ అమర్చి, అతన్ని ప్రేమగా ఆదరించి, వినయంగా మాట్లాడి, సౌమ్యంగా సహకరించినంతకాలం అతను భార్యను పల్లెత్తు మాటని ఎరుగడు. సునీత కూడా భర్తని దేవుడిలా చూసుకుంటూ వచ్చింది. ఏవిటో దేవుడే వాళ్ళని చల్లగా చూడలేకపోయాడు.

'శరీర మాద్యంఖలు ధర్మసాధనం' అని కాళిదాసు అలనాడు పార్వతిని సున్నితంగా మందలించాడు. ఆరోగ్యం జాగ్రత్త. తర్వాతే తపస్సు అదీ అంటూ హెచ్చరించాడు. పాపం! సునీతకన్నీ తెలుసుకానీ ఆమె చేతిలో వున్న విషయం కాకుండా పోయిందీ కీళ్ళవాతం. ఏమేమి మానేయాలో డాక్టరు చెప్పగా తు.చ. తప్పకుండా మానేసింది. ఒళ్ళు తగ్గించింది. కానీ మోకాళ్లలో కీళ్ళు అరిగిపోయాయంటే ఆమేం చేస్తుంది? కటక్ కటక్ మనే శబ్దంతో, సలపరింపులతో బాధపడుతూనే, నోరు మెదపకుండా ఓపికున్నంత వరకు చేసుకుంటూ వచ్చింది.

అందరి పిల్లల మాదిరిగానే వాళ్ళ పిల్లలూ అవకాశాలొచ్చి రెక్కలు కట్టుకుని అమెరికా రివ్వున ఎగిరిపోయారు. నిజమే మరి– మనకున్న చిన్నచిన్న బాధలతో పిల్లల భవిష్యత్తు పాడుచేస్తామా!

ఈ నాలుగేళ్ళలో సునీత కనీసం క్షణకాలం కూడా నిలబడలేని స్థితికొచ్చింది. మింగే మందులు మింగుతున్నా రోగం ఎక్కడుందో అక్కడుండకుండా ముందుకు సాగుతోంది. ఆపరేషన్ గురించి ఆలోచన రాకపోలేదు. అవన్నీ వివేకానందకి విసుగు, అందుకే ప్రస్తుతం ఆ సంగతి పక్కన పెట్టాడు. అతనికిప్పుడు వెంటనే కావల్సింది జీవితం సజావుగా, వేగంగా, ఉత్సాహంగా గడపడం. అందుకే అతను ఇద్దరం "ఓల్డేజ్ హోమ్'కి వెళ్దాం అన్నాడు. సునీతకి చెప్పేందుకు సమాధానమేం లేదు. మౌనమే అంగీకారం అతనికి పుస్తకాలంటే ఇష్టం. రాసుకోవడం అంటే ఇష్టం. మేధావులతో సంభాషణలంటే ఇష్టం – అతనికొచ్చే కీర్తి ప్రతిష్టలంటే ఇష్టం. అతనెక్కడున్నా ఇవన్నీ అతనికి కావాలి. అతనికో గది. అందులో స్నేహితులు –

అతనికో షెల్ఫ్, అందులో అతనికిష్టమైన పుస్తకాలు – అతనికో మంచం దానిమీద మెత్తని పరుపు – అతనెక్కడ ఉన్నా అతని ప్రపంచం అతనితో ఉంటుంది.

సునీతకి ఆ యిల్లంటే ఎంతో ఇష్టం. పిల్లల ఆటపాటలతో అలరారిన ఆ యిల్లంటే ఆమెకి స్వర్గం. ఆ పూల మొక్కలంటే ప్రాణం. ఆ మల్లెలు. ఆ జాజులు, ఆ కనకాంబరాలు, ఆ చామంతులు ఆ పూలంటే ప్రాణం. కానీ వీటివేటిని ఆమె నిలబెట్టుకోలేదు. తనతో తీసుకెళ్ళలేదు. ఎన్నోసార్లు సునీత అనుకుంది. తన భర్త కాస్తసహకరిస్తే తనఅందమైన ప్రపంచాన్ని నిలబెట్టుకోగలదు.

కానీ మగవాడిగా అతనికా అవసరం లేదు. వేడి వేడి ఉప్మా ప్లేట్లలో పెట్టి తెచ్చింది సావిత్రి. ఆమె వెనకాలే లక్ష్మీ గాసులతో మంచినీళ్ళు పెట్టి వెళ్ళిపోయింది.

'మరిప్పుడు బావగారి దగ్గరెవరున్నారు" అంది సునీత.

"మొన్న విజ్జీ వచ్చింది. వాళ్ళన్నయ్యను చూద్దామని – ఓ వారం ఉంటానని చెప్పింది. నేను అడిగాను. ఒక్కసారి మా సునీని చూసివస్తా మీ అన్నయ్య దగ్గరుంటావా అని – అలాగే వదినా పాపం సునీతస్సలు నడవలేకపోతోందిట అంది – నేను సరేనని అన్ని సర్దుబాట్లు చేసి, ఒక్కరోజు కోసం ఇలా వచ్చాను.'

"అదేమిటే ఒక్కరోజేనా"

"ఇంకా నయం. మా ఆడపడుచుల్లో ఆ పిల్ల ఒక్కత్తే కాస్త మంచిది పాపం! అడగ్గానే సరేనంది."

ఇద్దరు ఉప్మా ఊదుకుంటూ తింటూ కాసేపు మరేం మాట్లాడకుండా కూర్చున్నారు.

"ఈ ఇల్లు ఏం చేస్తారు?"

"అద్దెకిచ్చేశాం – నెలకి పదివేలు– ఫస్టుకొచ్చి చేరుతారు"

వివేకానంద వస్తూనే వదినగారిని పలకరించి క్షేమసమాచారాలు అడిగాడు. నాలుగు రోజుల్లో తనూ, సునీత "ఓల్డేజ్ హోమ్'కి వెళ్ళిపోతున్నట్లుగా ఆనందంగా చెప్పాడు.

"అదేదో వేరే చోటుగా బాధపడాల్సిందేమీ లేదు. మనకి చేతకానప్పుడు అదే మార్గం. అలనాపాలనా ఉంటుంది. ఆడది ఇంట్లో ఆరోగ్యంగా తిరుగుతూ, పనిపాటలు

చేసుకోలేకపోతే ఎంత నరకమో నాకిప్పుడు అర్థమౌతోంది" అంటూ వివేకానంద కలుపుగోలుగా మాట్లాడాడు.

ఎప్పుడో ఈ వివేకానంద నోటివెంటనే విన్నమాటలే సావిత్రికి గరగరమంటున్న పాత సినిమా డైలాగుల్లా చెవిలో వినిపించడం మొదలయ్యింది.

"తిండి యొక్క పక్క వెలితిగా దినగవలయు

చెప్పకయే ఇంటి పనుల జేయవలయు

ఊరికే కొట్టినను వడియుండవలయు

ఇట్టి కన్యను వెతికి గ్రహింపవలయు"

– అంటూ ఇల్లెగిరిపోయేలా, రాగయుక్తంగా నవ్వుతూ అతను చదివిన కాళ్ళకూరి నారాయణరావుగారి పద్యం గుర్తుకొచ్చింది సావిత్రికి. అతని వాక్చాతుర్యంతో చుట్టూ బంధువుల్ని కూర్చోబెట్టుకుని అలరించిన రోజులు మనసులో మరగవేస్తున్నాయి.

"నీ చెల్లెలి ఖర్మకాలి, కాళ్లుపడిపోయి, వాళ్ళు వృద్ధాశ్రమంలో చేరుతున్నారు. నీకేం పోయే కాలంవచ్చిందే? నువ్వు బాగానే ఉన్నావుగా – పని చేస్తున్నావుగా" మంచంలోంచి మహర్షి అరుస్తున్నాడు.

"చేస్తున్నాను అంటే విధిలేక, తప్పనిసరై చేస్తున్నా – నిన్న డాక్టరేం చెప్పాడు? హార్ట్ ఎన్‌లార్జ్‌మెంట్ అయ్యింది... విశ్రాంతిగా ఉండమనలేదూ?" సావిత్రి సాగదీస్తూ చెప్పింది.

"అవును! ఆ గుప్పెడు మెతుకులు నువ్వు వండి పడేశాక నీకు విశ్రాంతిగాక పనేం చచ్చింది?"

"నాకెంత బాధ ఉందో మీకెంత చెప్పినా అర్థం కాదు."

"ఎందుక్కాదు! అదుగో మీచెల్లెలి కాపురం చూసాక నీకీ పాడు బుద్ధి పుట్టింది. నాకీ యింట్లోనే బావుంటుంది. నా జీవితం ఇక్కడే వెళ్ళిపోవాలి. నేనెక్కడికీ రాను. ఇదే నా నిర్ణయం. నువ్వేం చేసుకుంటావో చేసుకో" మహర్షి వంట్లో శక్తి తగ్గినా కంఠం కంచు కంఠమే.

సావిత్రేమీ మాట్లాడలేదు. అతనికున్న ఆ నిర్ణయించే అధికారం గురించే అలోచిస్తోంది. అతనే మళ్ళీ అందుకున్నాడు.

"నువ్వు చేసుకున్న పుణ్యం వల్ల నీ మొగుడుకింత చేసుకోగలుగుతున్నానని గ్రహించు. అదే నీ చెల్లెలు ఆ మాత్రం చేసుకోలేక అఘోరిస్తోంది."

"ఇంక – నా గుండెలో ఊపిరున్నంత కాలం ఇలా చాకిరీ చేస్తూ ఉండాల్సిందే. – ఒక్కసారే విశ్రాంతి" సావిత్రి నీరసంగా అన్నప్పటికీ కాస్త గట్టిగానే ఉంది.

"ఎవరికే నువ్వు చాకిరీ చేస్తున్నది? కట్టుకున్న మొగుడికేనా – అంత మాత్రానికేనా చచ్చిపోతావేం?"

ఈ వాదన ఎప్పటికీ తేలేది లేదని, సావిత్రి గ్రహించింది. ఆమె గుండె బాగా బరువెక్కింది. అక్కడే ఎడం చేత్తో గుండె అదుముకుంటూ చతికిలబడింది.

కోర్టు బోనులాంటి 'యు' ఆకారం వాకర్ పట్టుకుని నెమ్మదిగా గెంతుకుంటూ న్యాయం కోసం సునీత ప్రపంచం అంతా తిరుగుతున్నట్లు కనిపిస్తోంది సావిత్రికి. దృశ్యానికీ నేపథ్య సంగీతంలా మహర్షి మాటలు దూరంగా వినిపిస్తూ సాగుతూనే ఉన్నాయి.

# కాపలా

**– డా॥ముక్తేవి భారతి**

"**కు**క్కగారి గొలుసుగారు ఊడిపోయారు. కాస్త కట్టరా" రామలక్ష్మి గొంతు ఖంగుమంది. చదువుతున్న పుస్తకం బల్లమీద పడేసి లేచాడు రామం. ఎప్పుడయితే గౌరవవాచకం చెవిని పడిందో అప్పుడే అర్థమయింది పరిస్థితి. అందులో గొలుసుగారు అని కూడా తల్లి అనేసరికి పరిస్థితి కొంచెం డేంజర్‌లో పడిందని అర్థమవటానికి అరనిమిషం పట్టలేదు రామానికి. రామలక్ష్మి ముఖం ఎప్పుడయితే ఎర్రబడిందో అప్పుడే ఇంట్లో అంతా నిశ్శబ్దం. ఇంచుమించుగా వారంలో మూడురోజులైనా రామలక్ష్మికి ఇంట్లో అందరి మీదా కోపం రాక తప్పదు. ఈ మధ్య వారంలో ఆరు రోజులూ ఇదే పరిస్థితి. కారణమేమిటంటే – బిక్కీ వచ్చి అప్పటికి మూడు వారాలైంది.

బిక్కి రావడానికి ముందు ఇంట్లో చాలా గొడవ జరిగింది. వాదోపవాదా లయ్యాయి. వాగ్దానాలు కూడా అయ్యాయి. ఇంట్లో అందరూ  ఓ రాజీ మార్గానికొచ్చిన తర్వాత బిక్కీ ఇంట్లో ప్రవేశించింది.

"చాకిరీ, ఈ పిల్లలు చాలక దీన్ని నేను చూడలేను. అంత్య నిష్ఠూరం కన్నా, ఆది నిష్టురం మేలు' అంది ఖచ్చితంగా రామలక్ష్మి.

"నువ్వేం చూడక్కర్లేదు. అన్నీ మేమే చూసుకుంటాము." ముక్తకంఠంతో ఇంట్లో అందరూ అన్నారు.

అంతే. ఆ తర్వాత రెండు రోజులయేసరికి బిస్కట్లు, ప్లేటు, గొలుసు, బెల్టు – ఒకటేమిటి ఆఖరికి  – ఓ మూల మంచి చోటు, పడుకుందుకు ఓ దుప్పటిఅన్నీ సిద్ధమయిపోయాయి. ఒక శుభ సమయంలో గృహప్రవేశం చేసింది బిక్కీ. ఇంట్లో ఎంతో సందడి. ఎవరొచ్చినా బిక్కీ ముచ్చట్లే– ఒకళ్ళపైన ఒకళ్ళు పోటీపడి దానికి తిండి పెట్టడం, ఒళ్ళో కూచోపెట్టుకోడం, చెప్పలేనంత హడావిడి. బిక్కీ తప్ప మరో ప్రపంచం లేదనుకునే జడభరతులయ్యారింట్లో అందరూ – ఒక్క రామలక్ష్మి తప్ప!

నెలరోజులు గడిచాయి. వస్తాయి వస్తాయి అనుకున్న పరీక్షలు వచ్చేసాయి. అందరూ ఎవరి గొడవలో వారు మునిగిపోయారు. స్నేహితుడింటికి వెళ్ళి చదువుకొనే వాడొకడయితే, తలుపు తీసుకుని గది దాటి బయటకి రానివాడు మరొకడు. ఇంట్లో వాతావరణమే మారిపోయింది.

“అరే – పన్నెండవుతోందే” గబుక్కున పుస్తకం కింద పడేసి వంటింట్లోకి నడిచేడురామం.

రామలక్ష్మి అన్నం తింటోంది. కాసేపు అటు ఇటు చూసేడు. “ఏం కావాలి” అంది రామలక్ష్మి.

‘ఏం లేదు, బిక్కీకి అన్నం పెట్టావా అని” నసిగాడు రామం. ‘ఓహో ఇప్పుడు గుర్తొచ్చిందా – అది తిని గంటయింది. వెళ్ళు – వెళ్ళి చదువుకో” రామం మాట్లాడకుండా గదిలోకొచ్చేశాడు.

వాగ్దానాలు చేసిన వారంతా వాటి విషయమే మరచిపోయారు. తెల్లారేసరికి పాలు పోయటం – తర్వాత బిస్కట్లు, తర్వాత – అన్నం ఇలా ఒక దాని తర్వాత ఒకటిగా బిక్కీ పనులన్నీ రామలక్ష్మే చేస్తోంది. గుమ్మంలో రామలక్ష్మి నిలబడితే చాలు తోకాడిస్తూ దగ్గరకొస్తుంది. కోపంగా ఉంటే దానికీ తెలుస్తుంది. ఓ మూల నక్కి కూచుంటుంది. ఎవరిమీద ఏమి కోపగించినా బిక్కీని మాత్రం శ్రద్ధగా చూస్తోంది రామలక్ష్మి. రెండు నెలలు తిరిగేసరికి బొద్దుగా, ముద్దుగా తయారయింది బిక్కీ.

జ్ఞాపకమొచ్చినప్పుడు అడుగుతుంటారు ఇంట్లో అంతా – ‘పాలు పోసావా, అన్నం పెట్టావా’ అని. అలాంటప్పుడు రామలక్ష్మికి ఒళ్ళు మండిపోతుంది.

“అంత ప్రేమున్న వాళ్ళయితే మీరే పొయ్యలేక పోయారా – ఎలాగూ నేనే అన్నీ చూసుకుంటా కదా అని తెలిసి – గడుసుతనం!” రామలక్ష్మి మూతి తిప్పుకుంటూ లోపలకెళ్ళిపోయింది. మరీ విసుగ్గా వున్నపుడు “దీన్ని బయట వదిలేయండి’ అంటుంది.

“నిజంగా వదలేయనా?” పెద్దబ్బాయి అన్నాడు తల్లితో.

“ఆ వదిలేయ్”

“నిజంగానేనా?” రెట్టించాడు.

"ఏం, నన్నుద్ధరించటానికే దీన్ని తెచ్చినట్టు మాట్లాడుతున్నావే!"

"సరే, సాయంత్రం మా ఫ్రెండ్ వస్తాడు. ఎప్పటినుంచో కుక్క పిల్ల కావాలంటున్నాడు దీన్ని ఇచ్చేస్తాను. ప్రేమగా పెంచుకుంటాడు. ఒక మాట చెప్పనా మమ్మీ. అది ఇంట్లో వుంటే నీకు కొంత కంపెనీ. అదే, నీకు కాలక్షేపం.

పెద్దబ్బాయి మాటలకి విస్తుపోయింది. కళ్ళల్లో గిర్రున తిరిగాయి నీళ్ళు. ఇదా నాకు కంపెనీ! దానిమీద ఇష్టంతోటి, ఇంటికి కాపలాగా వుంటుందని తెచ్చారనుకుంది. ఇన్నాళ్టికి – ఇప్పుడర్థమయింది అసలు విషయం. అయినా మనింట్లో మణి మాణిక్యాలేమున్నాయని కాపలాకి? నిజమే – అది నాకు కాపలా, నేను దానికి కాపలా.

రామలక్ష్మి మాట్లాడకుండా లోపలికెళ్ళి పోయింది ఎర్రబడ్డ ముఖంతో.

అమ్మకి అంత కోపం ఎందుకు వచ్చిందో అర్థంకాక తికమకపడ్డాడు అబ్బాయి.

ఆనాటి నుంచీ బిక్కీ అంటే ప్రత్యేకమైన అభిమానం ఏర్పడి పోయింది రామలక్ష్మికి. అబ్బాయి దీన్ని బయట వదిలేస్తాడేమో అనే భయం కూడా లేకపోలేదు. వదిలేస్తే దిక్కులేని అనాథలా రోడ్డున పడుతుంది. అలా కావడానికి వీల్లేదు. ఎవరూ చూడక్కర్లేదు. నేనే చూసుకుంటాను దీన్ని. గుమ్మంలో కూచున్న బిక్కీ అమాయకంగా రామలక్ష్మి కేసి చూస్తోంది పాపం. నోరులేనిది. ఆ నిమిషంలో ఎంతో జాలేసింది దానిమీద రామలక్ష్మికి.

అప్పుడప్పుడు పాలు పోశావా అని, అన్నం పెట్టావా అని అడిగే వాళ్ళు ఈ మధ్య అది కూడా అడగడంమానేశారు. దాని బాధ్యతంతా రామలక్ష్మిదే అనే భావం ఇంట్లో అందరికీ కలిగింది. మనో ధైర్యం కూడా వచ్చింది. ఎవరెక్కడ కెళ్ళినా, ఎప్పుడొచ్చినా ఫరవాలేదు. బిక్కీ వుందిగా ఇంట్లో!

కాలం గడుస్తోంది. రామలక్ష్మికి ఇల్లే సర్వస్వం అయిపోయింది. ఎప్పుడయినా బయటకి వెళ్ళాలంటే బిక్కీకి పాలు ఎవరు పోస్తారు. అన్నం ఎవరు పెడతారు అనే బెంగ! ఒక్కోసారి రామలక్ష్మికి ఇంట్లో వాళ్ళ మీదే కాకుండా లోకం మీదే కోపం వస్తుంటుంది. అలాటప్పుడు బిక్కీ దగ్గరకిపోయి కూచుంటుంది.

ఆ రోజు పెద్దబ్బాయి తల దువ్వుకుంటూ "ఈ రోజు ఇంగ్లీషు సినిమా కెడుతున్నాం. నిన్ను తీసుకెడదామంటే – "నసిగాడు. రామలక్ష్మి నవ్వింది. "ఏం నేను ఇంగ్లీషు సినిమా చూడకూడదా?"

"అది కాదు" అద్దంలో మరోసారి ముఖం చూసుకుని బయటకి వెళ్ళిపోయాడు పెద్దబ్బాయి.

మరో రోజు 'నేనూ వస్తా మీతో' అంది రామలక్ష్మి. టై సరిచేసుకుంటూన్న రాజశేఖరంతో.

"రా నీకభ్యంతరం లేకపోతే. మా ఫ్రండ్సుతో కలిసి వెడుతున్నా."

"ఏం ఫర్వాలేదు. నేనూ వస్తాను" రామలక్ష్మి జుట్టుముడి వేసుకుని గబగబా డ్రస్ చేసుకుని, చెప్పులు తొడుక్కుంది.

"నిజంగా వస్తున్నావా?"

"భయపడకండి. మీ వెంటపడి రాను– ఊరికే అన్నానంతే,"

రాజశేఖరం ఒక్క నిమిషం నిలబడ్డాడు. కొంచెం బరువుగా రెండడుగులు ముందుకు వేశాడు. ఒక్కసారి వెనక్కి తిరిగి చూశాడు. బిక్కీని ఒళ్ళో కూచో పెట్టుకుని ఒళ్ళు నిమురుతోంది రామలక్ష్మి. గబగబా నడిచి ముందు కెళ్ళిపోయాడు.

ఇంట్లో మిగిలింది తను. కాదు కాదు కాళ్ళ దగ్గర కూచున్న బిక్కీ కూడా. రామలక్ష్మికి నవ్వొచ్చింది ఎందుకో.

"బిక్కీ– నిన్నీ ఇంటికి తెచ్చినప్పుడు కోపగించాను, విసుక్కున్నాను. కానీ ఎంత పూలునో చూశావా! నువ్వు ఈ ఇంటికి కాపలా. నేనూ ఈ యింటికి కాపలా. ఈ ఇంటివాళ్ళు గొప్పోళ్ళే బిక్కీ! నిన్ను నన్ను కూడా పోషిస్తున్నారు. కాకపోతే నీ మెడకి ఓ గొలుసు కట్టారు. తప్పించుకు పోతావని. ఎవర్నన్నా కరుస్తావని. నేను అరుస్తాననుకో కరవను. నీకు ఒక్క గొలుసు బంధం. నాకు గొలుసుల గొలుసులు బంధాలు. ఎక్కడికి తప్పించుకుపోతామే మనం బిక్కీ?" రామలక్ష్మి చేతిలో వున్న బిస్కట్లు దాని నోటి కందిస్తూ అప్రయత్నంగా చూసింది గోడకేసి. పెళ్ళినాటి ఫోటో... అబ్బ ఎంత

సన్నగా ఉందప్పుడు! ఇప్పుడో? రామలక్ష్మికి పాతికేళ్ళ గతం కళ్లముందు కదలాడింది. ఇంట్లో వాళ్ళ నెదిరించి రాజశేఖరాన్ని రిజిష్టరు పెళ్ళి చేసుకొంది. చదువుకునే రోజుల్లో వుండే ఆదర్శాలు ఒకటి ఒకటి దూరమైపోయాక, కేవలం పిల్లల తల్లిగా, మిసెస్ శేఖరంగా మిగిలిపోయింది. అయితే మాత్రమేం!

"మమ్మీ– నిన్ను అమ్మమ్మ ఊరు పంపించం. నువ్వు లేకపోతే బోర్‌గా వుంటుంది" అంటారు పిల్లలు.

రాజశేఖరం మాటలు తక్కువ మాట్లాడినా అతని మనసు నిండా ఉన్నది తనేగా! రామలక్ష్మికి గొప్ప తృప్తి మనసు నిండా నిండింది. రామలక్ష్మి గోడమీదున్న ఫోటో కేసి చూస్తోంది. వీధిలో కారు హారన్ మోగటంలో ఈ ప్రపంచంలోకి వచ్చింది.

మిసెస్ నళినీ మోహన్ కారు దిగింది.

"ఓచిన్న పార్టీ. రేపు నువ్వు రావాలి."

"పార్టీయా?"

"ఆ. నా బర్త్‌డే పార్టీ. అన్నట్టు ఇవి నీకు చూపించాలని నిన్నటి నుంచి ఒకటే ఇదిగా వుంది నాకు." తళతళలాడుతున్న వజ్రాల దుద్దులు.

"అబ్బ చాలా ఖరీదుంటాయేం?"

"ఆ ముప్పయివేల పయినే. దుద్దులే కాదు. రింగు కూడా తెచ్చారుమద్రాసు నుంచి" గల గల మాట్లాడింది మిసెస్ నళినీ మోహన్.

"వెంకటలక్ష్మికి ఫోన్ చేశాను. వస్తానంది. అది వచ్చేదేమిటిలే, భర్త తీసుకొస్తాడుగా, నిన్న పంతొమ్మిదివందల ఏభై పెట్టి మంచి చీర కొన్నాను. చూస్తావుగా రేపు" గలగలా మాట్లాడి, గబగబా కారెక్కింది.

రాళ్ళు, రప్పలు, చీరలు, నగలు ఇవి చూసుకు తృప్తి పడిపోతోంది పాపం నళిని! జీవితంలో ఏం పోగొట్టుకుందో తెలుసుకోలేని వెర్రిది. విలాసాల్లో వినోదాల్లో మునిగి తేలుతూ జీవితాన్ని అనుభవించేస్తున్నాడు మోహన్ మద్రాసులో. అతని భార్యగా సంఘంలో బతికేస్తోంది నళిని.

ఎంత దురదృష్టవంతురాలో నళిని! ఎంతో జాలేస్తుంది నళినిని తల్చుకున్నప్పుడల్లా రామలక్ష్మికి.

రామలక్ష్మికి రాజశేఖరం మాటలు గుర్తొచ్చాయి వెంటనే. 'సంసారం అనే సామ్రాజ్యాన్ని ఏలే మకుటం లేని మహారాణి నువ్వు" అని. నిజమే మరి. రామలక్ష్మి కళ్ళు గర్వంతో మెరిశాయి ఆ క్షణంలో.

"బిక్కీ – మనమే హాయిగా ఉన్నాం మనం ఈ ఇంట్లో భాగస్వాములం, అరే, ఈ మధ్య నీకు ఇంగ్లీషులో చెప్తే కాని అర్థం కావడం మానేసింది కదూ – మనం పార్టనర్స్. ఈ ఇల్లు నువ్వు కాపలా కాయి. ఈ ఇంట్లోవాళ్ళని నేను కాపలా కాస్తాను" అవునుమరి, ఏ వయ్యారిభామో రాజశేఖరాన్ని కొట్టేయకుండా కాపలా కాసుకోవద్దూ తను! ఏ చిన్నదో అమాయకుడైన తన అబ్బాయిని వలలో వేసుకోకుండా కాపలా కాసుకో వద్దూ తను! ఒళ్ళో వున్న బిక్కీ నల్లని కళ్ళతో రామలక్ష్మిని చూస్తూ అటు ఇటు కదిలింది – "కూచో, నాకు పనులు లేవనుకుంటున్నావా?" బిక్కీని కిందకి దింపేసింది రామలక్ష్మి.

బిలబిలమంటూ నలుగురు స్నేహితుల్ని వెంటేసుకు వచ్చాడు రామం లోపలికి.

"మమ్మీ, ప్లీజ్–"

"ఏమిటీ?"

"ఫైవ్ కప్స్ ఆఫ్ టీ ప్లీజ్"

"నాకు తెలియదు" రామలక్ష్మి టీ ఇస్తానందో ఇవ్వనందో తెలుసుకోకుండా ముందు గదిలోకెళ్ళి స్నేహితులమధ్య కూచున్నాడు రామం!

తిన్నగా వంటింట్లోకి నడిచి టీ కోసం నీళ్ల గిన్నె స్టౌ మీదుంచింది రామలక్ష్మి.

# ఎవరి విలువలు నాన్నా?

- జె.భాగ్యలక్ష్మి

**"ఉ**ట్టి కెగరలేనమ్మా  స్వర్గానికి ఎగిరినట్టుంది నీ కథ." సుదర్శనం కాస్త కోపంగానే అన్నాడు.

"మీరెన్నయినా అనండి నాన్నగారూ... నేను మాత్రం ఫారిన్‌కు వెళ్ళి తీరాలి." సరిత పట్టుదలగా జవాబిచ్చింది.

"నువ్వు వెళ్ళాలి  అనుకోగానే వెళ్ళిపోతావేమిటి? అందరికీ ఉంటాయి గొంతెమ్మ కోరికలు. అనుకోగానే తీరిపోతాయేమిటి?"

"అనుకోగానే తీరిపోవు, ప్రయత్నం చేయాలి. అదే నేను చేస్తానంటున్నది"

"ఏమిటమ్మా ఆ ప్రయత్నం? కాస్త మా చెవిన కూడా వేయి. విని ధన్యులమవుతాము. మా పిల్ల మాకే పాఠాలు చెప్పేంతగా ఎదిగిపోయిందని సంతోషిస్తాం" అంది సౌదామిని.

'మీకెంత చెప్పినా అర్థం కాదు. మీకై మీరు పంపలేరు. నా ప్రయత్నం నేను చేసుకొంటానంటే వినరు" అని సర్రున కుర్చీ లాగి డైనింగ్ టేబిలు వద్ద నుండి లేచింది సరిత.

అప్పుడే రాత్రి భోజనాలు ముగుస్తున్నాయి. ఇంటి విషయాలు, ఇతర విషయాల చర్చలుకూడా అప్పుడే జరుగుతాయి. సౌదామిని  ఎన్నోసార్లు చెప్పింది. "సరదాగా మాట్లాడుకొంటూ భోం చేయండి. అంతేగాని అన్నాల ముందు కూర్చుని తర్జనభర్జనలు చేయకండి. కోపతాపాలు చూపించుకోకండి. అది ఆరోగ్యానికి మంచిది కాదు" అని. కాని ఒక్కొక్కసారి ఇవి తప్పేవి కావు.

ఉదయం నుండి తలా ఒక దిక్కుకు పోయే కుటుంబ సభ్యులందరూ కలిసేది రాత్రి భోజనాల దగ్గరే. సరిత యం.ఏ. పూర్తి చేసింది. ఇప్పుడిప్పుడే పబ్లిక్ రిలేషన్స్ అండ్ ఆడ్వర్టయిజింగ్  డిప్లొమా పూర్తయింది. ఏదైనా మంచి ఉద్యోగంలో చేరాలని

ఆ అమ్మాయి తాపత్రయం. తన తమ్ముడు విభు బి.టెక్‌లో చేరాడు. తన చదువు పూర్తవటానికి ఇంకా ఐదేండ్లు పడుతుంది. తండ్రి అగ్రికల్చరల్ సైంటిస్టు. తల్లి పార్ట్‌టైమ్ లెక్చరరు. ఆమె క్లాసులు సాయంకాలాలుంటాయి. వీళ్ళందరూ వాళ్ళ వాళ్ళ పనుల్లో ఉంటున్నా రాత్రి భోజనాలు కలిసి చేయటం మొదటి నుండి వస్తున్న పద్ధతే. అది ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది.

భోజనాలైన తర్వాత కూడా ఆ విషయమే మాట్లాడుకున్నారు. "చూడు సరితా,ఈ విషయం ఇదివరకే చాలాసార్లు చెప్పాను. నీవు చక్కగా చదువుకున్నావు. అడ్వర్టయిజింగ్ ఏజెన్సీలో నీకు ప్లేస్‌మెంట్ కూడా రాబోతుంది. ఎక్కడో ఒకచోట ప్రారంభించి కాస్త అనుభవం వచ్చాక పెద్ద పదవుల కోసం చూడాలి గాని, ఒక్కసారిగా ఆకాశం అందుకోవాలనే దురాశ పనికిరాదు."

''ఇవన్నీ పాతకాలం మాటలు నాన్నగారూ, ఎక్కడో ఒకచోట ప్రారంభించడమంటే అట్టడుగు నుండి అనా మీ ఉద్దేశం."

ఇంతలో సౌదామిని కలిగించుకొని 'నిచ్చెనకాని, మెట్లు కాని కింద నుంచే ప్రారంభమవుతాయి. కింది మెట్లు ఎక్కకుండా ఒకేసారి పై అంతస్తుకు ఎలా చేరుకొంటావు సరితా?"

"అక్క హైజంప్ గురించి మాట్లాడుతోందిలేమ్మా కాకపోతే లిఫ్ట్ అనుకో. అక్కడ ఒక మెట్టు కూడా ఎక్కనవసరం లేదు" అని విభూ చమత్కరించాడు.

సరిత నవ్వింది. "వాడు కరెక్టుగా చెప్పాడమ్మా. నిచ్చెన, మేడ మెట్లు ఏనాటి మాట. అట్టడుగున ప్రారంభిస్తే అక్కడే ఉండిపోతాం. ఇప్పుడంతా వేగం. 'స్టార్ట్ బిగ్, థింక్ బిగ్' అంతా మార్కెటింగ్ అమ్మా. మనల్ని మనం ఎలా మార్కెట్ చేసుకోగలం అనే దానిని బట్టి సాఫల్యాలు, విజయాలు, పేరు ప్రతిష్ఠలు."

"ఎక్కడ నేర్చుకొన్నావే ఇవన్నీ. ఇవి మేము నేర్పిన బుద్ధులైతే కాదు" అంది సౌదామిని.

సుదర్శనం నవ్వాడు. "ఈ తరం పిల్లలు నేర్చుకోటానికి వెయ్యి మార్గాలుంటాయి మినీ. అన్నీ కుటుంబం నుండే వస్తాయనుకోకూడదు. కాకపోయినా ఈమె చేసిన డిప్లొమాలో మార్కెటింగ్‌కు ప్రాముఖ్యం ఎక్కువ కదా! అదే మనకు నేర్పిస్తోంది."

"ఇంతకూ నన్ను ఫారిన్‌కు పంపుతారా లేదా?"

"మాకంత స్తోమత లేదమ్మా.నిన్ను చదివించగలిగినంత చదివించాం. విభూ నిలదొక్కుకోటానికి ఇంకా ఆరేడేండ్లు పట్టవచ్చు. అప్పటివరకు బాధ్యతలున్నాయి కదా" అన్నాడు సుదర్శనం.

"ఇప్పుడు నేను ఉద్యోగం చెయ్యను పెళ్ళి చేసుకుంటాను అంటే..." సరిత నిలదీసినట్లు అడిగింది.

భార్యాభర్తలిద్దరికీ నోట మాట రాలేదు. తమ పెంపకంలో సరిత ఇలా తయారయిందంటే నమ్మలేకుండా ఉన్నారు. పిల్లల్ని స్వతంత్ర భావాలతో, స్నేహంగా పెంచిన మాట నిజమే కాని తను ఇంత స్వార్ధంగా ఆలోచిస్తుందని....

"సరే పెళ్ళి చేసుకో" తన ఆలోచనలు కట్టిపెట్టి సౌదామిని అంది.

'నీకు చదువు, ఉద్యోగం, కెరీర్ వీటి మీద ఎక్కువ శ్రద్ధనుకొన్నాం. పెళ్ళి చేసుకోవాలంటే ... నీ ఇష్టం. ఇంతకూ ఎవరతను?"

"ఎవరు.. ఏమిటి?" అర్థం కానట్లు అడిగింది సరిత.

"అవునమ్మా, నీవు పెళ్ళి చేసుకోబోయే వ్యక్తి ఎవరు అని అడుగుతున్నా" సుదర్శనం విశదపరచాడు.

'భలే జోక్‌వేశారు నాన్నగారూ, అటువంటి వ్యక్తి ఉన్నాడని నేనెప్పుడయినా మీతో అన్నానా?"

"మరి ఈ పెళ్ళి మాటేమిటి?" సౌదామిని అడిగింది.

"కాదమ్మా నేను చెప్పేదేమిటంటే నేనిప్పుడు పెళ్ళి చేసుకొంటే మీకు ఖర్చవుతుందా కాదా?"

"అయితే...."

"ఆ డబ్బు లక్షో, రెండు లక్షలో నేను ఫారిన్ వెళ్ళటానికి ఇవ్వమంటున్నా" గొప్ప పరిష్కారం కనిపెట్టినట్లు చెప్పింది సరిత.

సౌదామిని సీరియస్ అయిపోయింది. "నీ మార్కెటింగ్ టెక్నిక్కులన్నీ మా దగ్గరే చూపిస్తున్నావా? నీ పెళ్ళికి లక్షలు లక్షలు కూడబెట్టామని నీతో ఎప్పుడన్నాము?

మా పెళ్ళికి వందరూపాయలు కూడా ఖర్చు కాలేదు. సింపుల్, రిజిస్టరు మ్యారేజి. అటువంటి మేము నీకు కట్నమిచ్చి పెళ్ళి చేస్తామని ఎలా అనుకొన్నావు?"

సరిత కొంచెం వెనక్కు తగ్గింది. "మీ ధోరణి మీదే కాని మీ పిల్లలకు ఏమి కావాలో, వాళ్ళ భవిష్యత్తేమిటో ఆలోచించరు" అంటూ అక్కడ నుండి లేచి వెళ్ళిపోయింది.

ఆ రాత్రి సుదర్శనం, సౌదామిని సరిత గురించి మాట్లాడుకొన్నారు. 'వీళ్ళనూ వాళ్ళనూ చూసి పిల్లలు ఏవేవో కోరుకుంటే ఆ కోరికలన్నీ ఎక్కడ తీర్చగలం? కాకపోయినా సరితకు ఇంత ఫారిన్ మోజేమిటి? తన చదువుకు తగిన ఉద్యోగాలు మన దేశంలో లేవా?" అనుకున్నారు.

'ఏదో ఇన్‌స్టిట్యూట్‌లోనో, యూనివర్శిటీలోనో చదువుకోటానికి సీటొచ్చింది అనుకొంటే ఆ పద్ధతివేరు. పోనీ ఉద్యోగం వచ్చిందంటే అదీ లేదు. ఉద్యోగం వెతుక్కోటానికి ఫారిన్ వెళ్తానంటే ఏ దేశం రానిస్తుంది? అన్నీ సవ్యంగా ఉన్నా వీసా దొరికేది ఎంత కష్టం! ఎన్నెన్ని లక్షలు బ్యాంకు డిపాజిట్లు చూపించాలి? ఎంతెంత ఖర్చులుంటాయి?" తనలో తనే అనుకుంటున్నట్లుగా పైకే అనేశాడు సుదర్శనం.

"ఊరుకోండి. దాని మాటలు పట్టించుకోకండి. ఇక్కడ 'యాడ్ ఏజెన్సీలో చేరిపోయిందంటే ఫారిన్ గీరిన్ అంతా మరచిపోతుంది" అంది సౌదామిని.

కానీ ఆ విధంగా జరగలేదు. సరిత తాను విదేశాలకు వెళ్తాననే జపం వదలలేదు. అమ్మా నాన్నా ఎదురుపడితే ఇదే మాట. తమ్ముడితో కబుర్లలో ఇదే మాట. ఏ ఏ దేశాల్లో ఏ సౌకర్యాలున్నాయో, ఎంత జీతాలున్నాయో, తన ఫ్రెండ్స్, వాళ్ళ బంధువులు ఫారిన్‌లో ఎంత హాయిగా ఉంటున్నారో చెపుతూ ఉంటుంది. స్నేహితులతో ఫోన్ల మీద సుదీర్ఘమైన కబుర్లు. ఎన్నెన్నో ఆరాలు. ఎక్కడెక్కడికో వెళ్తుంది. ఎవరెవరినో కలుస్తోంది.

ఒకరోజు సుదర్శనం అడిగాడు "నీకు ఈ ఫారిన్ పిచ్చేమిటమ్మా? మనదేశంలో ఉండి దొరికిన ఉద్యోగం చేసుకొంటూ ముందుకు పోవటంలో ఉన్న సుఖం, విదేశాలలో ఎక్కడుంది? ఎన్నాళ్ళున్నా పరాయి వాళ్ళమే కదా! మన, తన అనే వాళ్ళెవరుంటారు?"

సరిత మాట్లాడలేదు.

"ఆ అడ్వర్టయిజింగ్ ఏజెన్సీలో వాళ్ళు నీకింకా ఉత్తరం పంపలేదా?"

"పంపారు" అంది సరిత క్లుప్తంగా.

"ఎప్పుడు చేరాలి?"

"పదిహేను రోజులు టైమిచ్చారు"

అప్పుడే అటు వచ్చిన విభూ "గ్రేట్" అన్నాడు.

"ఇంతకూ పార్టీ ఎప్పుడు?" అని అడిగాడు.

"నీ మొఖం" అని గొణిగింది సరిత.

"అదేంటమ్మా నీకు ఫస్ట్ జాబ్‌వచ్చిన సందర్భంలో పార్టీ కూడా లేదా?" అని గొణిగాడు.

"పార్టీ మాత్రమేనా? నీకు చక్కటి టీ షర్టు కూడా కొని పెట్టాను. కాని ఫారిన్ వెళ్ళేముందు" అని తేల్చి చెప్పింది సరిత.

సుదర్శనానికి చికాకనిపించింది. 'ఇంకొక్కసారి ఫారిన్ అన్నావంటే ఊరుకోను. బుద్ధిగా మీడియా మార్కెటింగ్‌లో చేరు."

"ఇక్కడ కూరుకుపోతే ఇక బయటపడను. ఫారిన్‌లో ఉన్న అవకాశాలు, ఆ ధనార్జన ఇక్కడెక్కడున్నాయి?" విసురుగా అడిగింది సరిత.

"పరుగెత్తి పాలు తాగేదానికన్నా.."

"నాకూ తెలుసమ్మా ఆ సామెత. ఇంతగా మనదేశం, మన దేశం అనే మీరు మాత్రం పల్లెటూరు వదిలి చదువులకు పట్టణాలకు, ఉద్యోగాలకు మహా నగరాలకు ఎందుకొచ్చారు? డబ్బు కోసమే కదా! ఇక్కడ మాత్రం మన, తన అనేవాళ్ళు ఎవరున్నారు? మీ తల్లిదండ్రులకంటే మీరొక అడుగు ముందుకు వేశారు. మీ కంటె మీ పిల్లలు ఒక అడుగు ముందుకు వేస్తే మీకెందుకీ బాధ?"

"షటప్" అని సౌదామిని అక్కడినుండి వెళ్ళిపోయింది. తండ్రి వైపు గుర్రుగా చూసి సరిత కూడా తన గదిలోకి వెళ్ళిపోయింది.

"ఇదేదో చిన్న విషయమనుకొంటే ఈ సరిత మొండిపట్టుదలతో ఇది పెద్ద సమస్యగా మారేటట్టుంది. దీనికేదో మార్గం చూడాలి" అనుకొన్నాడు సుదర్శనం. గట్టిగా తల విదిలించి టి.వి. ఆన్ చేసి క్రికెట్ చూడసాగాడు.

రెండు రోజులు ఇంట్లో సరిత ఉద్యోగం గురించి గాని, ఫారిన్‌కు వెళ్ళే సమయం గురించి గానీ ఏ మాటలూ లేవు. అంతా సర్దుకొందనుకొన్నారు తల్లిదండ్రులు. ఒక సెలవు దినం మాధ్యాహ్నం భోజనం చేసి సుదర్శనం పడుకొన్నాడు. విశ్రాంతిగా. సౌదామిని తన క్లాస్ నోట్స్ తయారుచేసుకొంటోంది. అప్పుడే సరిత బయటి నుండి వచ్చింది. సౌదామిని తలెత్తి చూసి 'మేం భోంచేశాం. నువ్వు అన్నం పెట్టుకొని తిను" అంది.

సరిత మొహం కడుక్కొని, బట్టలు మార్చుకొని వచ్చి అమ్మ దగ్గరగా కూర్చుంది.

"వెళ్ళి భోంచెయ్" అంది సౌదామిని.

"నేను ఫ్లారెన్స్ వాళ్లింటికి వెళ్ళాను. అక్కడే భోంచేశాను" అంది సరిత.

సౌదామిని తల ఊపి తన పనిలో నిమగ్నమయింది.

కూతురు అక్కడే కూర్చోటం గమనించి, "ఫ్లారెన్స్ యం.బి.ఎ. పూర్తి చేసిందా?" అని అడిగింది.

"లేదు సెకండియర్ చేస్తోంది."

"ఇంకెంత తొమ్మిది నెలలే కదా. తనకూ మంచి జాబ్ వస్తుంది" అంది సౌదామిని.

"తనేమిక్కడ పనిచేయదు. ఫారిన్ వెళ్తుంది"

"దీస్ యంగ్‌స్టర్స్!" అని గొణుక్కుంది సౌదామిని.

"మీ అందరికీ ఫారిన్ పిచ్చి బాగా పట్టినట్టుంది."

"పిచ్చి కాదమ్మా... అవకాశం. ఫ్లారెన్స్ అన్న డేవిడ్ మా సీనియర్ కదా. ఇప్పుడు చూడు హాయిగా ఆస్ట్రేలియాలో ఉద్యోగం చేసుకొంటున్నాడు."

"అది మంచిదే అయితే ఫ్లారెన్స్ అక్కడికి వెళ్తుందన్నమాట" అంది సౌదామిని.

"అది వచ్చే సంవత్సరం సంగతి. నేనీ సంవత్సరమే వెళ్దామనుకొంటున్నాను."

"ఎక్కడికి?" సౌదామిని ఆశ్చర్యంగా అడిగింది.

"ఆస్ట్రేలియాకి"

"నీవెలా వెళ్తావు? ఏదైనా యూనివర్శిటీలో సీటు దొరికిందా లేక ఉద్యోగం వచ్చిందా?"

"రాలేదు. అక్కడికి వెళ్తే వస్తుంది."

"అని డేవిడ్ చెప్పాడా?"

"నేనే కనుక్కొన్నాను."

"ఆస్ట్రేలియాకు ఎలా వెళ్తావు? టూరిస్టుగానా? టూరిస్టుకు వర్క్ పర్మిట్ ఉండదని తెలుసా?"

"తెలుసు. నేను డేవిడ్‌కు స్పౌస్‌గా వెళ్తాను. ప్రాబ్లెం ఉండదు."

సౌదామిని నోట మాట రాలేదు. కళ్ళు విప్పార్చుకొని కూతుర్నే చూడసాగింది.

"ఏమన్నావు?" అంది గొంతు పెగల్చుకొని.

"స్పౌస్‌గా వీసా తీసుకొని వెళ్తాను"

"డేవిడ్ భార్యగా వెళ్తావా? నీకు డేవిడ్‌తో పెళ్ళయిందా?"

"కాలేదు. దానికీ దీనికీ సంబంధమేమిటి?"

"మరి భార్యగా ఎలా వెళ్తావు? దానికి ప్రమాణమేమిటి?"

"ఈ కాలంలో అన్ని సర్టిఫికెట్లూ దొరుకుతాయి."

సరిత చెంప ఛెళ్ళుమంది. సౌదామిని ఎన్నడూ తన పిల్లలను కొట్టలేదు. ప్రేమగా పెంచింది. వాళ్ళకు ఫ్రెండుగా నచ్చజెప్పింది. కానీ ఈ క్షణం ఇటువంటిది. పునాదులతో సహా తను కూలిపోతున్నట్లనిపించింది. ఇదెటువంటి సంస్కారం? తన పిల్లకు ఇటువంటి బుద్ధులెలా వచ్చాయి? దానికున్న విలువలేమిటి? ప్రమాణాలేమిటి? ఆఫ్టరాల్ ఒక ఉద్యోగం కోసం ఎవరికైనా భార్యగా వెళ్ళిపోతుందా? అదీ దొంగ సర్టిఫికెట్‌తో.

ఇంతలో నిద్రలేచిన సుదర్శనం హాల్లోకి వచ్చాడు. తల్లీ కూతుర్ల టెన్షన్ గమనించి "ఏమయింది?" అన్నాడు.

సరిత తనను తాను సర్దుకొని "నేను ఆస్ట్రేలియాకు వెళ్ళాలనుకొంటున్నాను." అంది.

"ఎప్పుడు వెళ్తున్నావేమిటి?" అన్నాడు తండ్రి వ్యంగ్యంగా.

"టిక్కెట్టుకూ, ఇతరత్రా యాభైవేల ఖర్చుంటుంది. మీరెంత త్వరగా ఇస్తే అంత తొందరగా ఏర్పాట్లు చేసుకుంటాను" అంది నిబ్బరంగా.

"ఇంత డబ్బు ఏర్పాటు చేయాలంటే కాస్త టైం పడుతుంది. కాని నువ్వు ఏ బేసిస్‌మీద ఆస్ట్రేలియా వెళ్తున్నావో చెప్పలేదు."

"ఇప్పుడు బ్యాంకుల్లో పర్సనల్ లోన్సు కూడా ఇస్తున్నారు కదా.."

"అయితే..."

"డబ్బు ఏర్పాటుకు..."

"ఏమిటి తాత సొమ్ము దాచినట్లు అంత దర్జాగా అడుగుతున్నావు?" అంది సౌదామిని కోపంగా.

"తాత లేదుగా,. తండ్రి సొమ్మే అడుగుతున్నాను. ఆయనకు నా పట్ల బాధ్యత ఉందా లేదా? నా భవిష్యత్తు కోసం ఖర్చు పెట్టాలా వద్దా?" నిక్కచ్చిగా అంది.

"అంత హక్కుగా అడగవలసిందేమీ లేదుగాని నువ్వు ఆస్ట్రేలియా ఎలా వెళ్తున్నావో ముందు చెప్పు."

"నా ఫ్రెండు అన్న అక్కడున్నాడు. అతని భార్యగా వీసా తెచ్చుకొంటాను."

సుదర్శనానికి కళ్ళు తిరిగినంత పనయింది. ఇంత నీచమా? ఇంత స్వార్ధమా? ఇరవై మూడేండ్ల పిల్ల ఇంత వక్రంగా ఆలోచిస్తుందా?

"నీకు నీతి నిజాయితీలు లేవా? జీవితంలో విలువలంటూ లేవా? ఇంత చదువూ చదివి ఇదేనా నీవు నేర్చుకొన్నది? కోరినది ఇచ్చి అపురూపంగా పెంచుకొన్నందుకు ఇదా నువ్విచ్చే ప్రతిఫలం?..." ఇక మాట్లాడలేకపోయాడు.

"ఇంతకూ ఆ డేవిడ్ భార్యగా ఎలా వెళ్తుందో అడగండి" అంది సౌదామిని.

సుదర్శనం భావయుక్తంగా కూతురివైపు చూశాడు.

"కొందరున్నారు వాళ్ళు అన్ని సర్టిఫికెట్లూ ఏర్పాటు చేస్తారు" అంది సరిత.

"ఇంత మోసమా? మరొకటి మరొకటి కాదు. పెళ్ళి సర్టిఫికెట్! దాని అర్థం బోధపడిందా?"

కాస్సేపు ఆగిఆగిసరిత అంది. "మోసాలు చెయ్యని వాళ్ళెవ్వరున్నారు? చిన్న మోసం, పెద్దమోసం అని మనమన్నంత మాత్రాన మోసం మోసం కాకుండా పోదు. విలువలనేవి నీతి నిజాయితీ అనేవి అన్నిటికీ అన్వయించాలి కదా! మనకు అనుకూలంగా ఉంటే విలువలు లేకపోతే లౌక్యం అనుకొంటే ఎలా?"

"ఏమిటి నీ సిద్ధాంతం? దేని గురించి నువ్వు మాట్లాడేది?" తీవ్రంగా అడిగాడు సుదర్శనం.

"నాన్నా నేనొక సంగతి చెపుతాను. మీరు చెప్పిన విషయమే. మీరే ఆలోచించండి. జానకి అత్త పెళ్ళి ఎలా చేశారు. దొంగ జాతకం వ్రాయించి, దానిని బియ్యపు గాదెలో దాచి పాత జాతకంలా కనిపించేలా చేసి, అవునా? మీరొకసారి ఫీల్డ్ వర్కులో ఉన్నప్పుడు భోజనాల టైమ్‌కు జీపులో వెళ్తున్నారు. అది చిన్న ఊరు. హోటళ్ళనేవి లేవు. అందరికీ ఆకలి, మీరేం చేశారు. మీ డ్రైవరు, హెల్పరు. అడ్వయిజర్లతో పాటు ఒక మఠంలో భోంచేశారు. అందులో ప్రవేశం బ్రాహ్మణులకు మాత్రమే. కాని మీరందరూ బ్రాహ్మణుల్లా నమ్మించారు. అవునా?"

"దీనికీ దానికీ తేడా లేదూ? ఒకరికి మేలు చేయాలని..."

"ఇక్కడా అంతే. నాకు మేలు చేయాలని డేవిడ్ సాయం చేస్తానన్నాడు."

"యూ ఫూల్..."

"నేను ఫూల్‌ని కాదు నాన్నగారూ. ప్రాక్టికల్ మనిషిని. డేవిడ్‌ను నమ్మవచ్చో నమ్మకూడదో, పరాయి దేశంలో ఏం మోసం చేస్తాడో అని మీరనుకోవచ్చు. ఆ విషయంలో నిశ్చింతగా ఉండండి. ఇక నిజాయితీ అంటారా? దానికొక్క స్పష్ట నిర్వచనం చెపుతారా? ఆఫీసుకు లేటుగా వెళ్ళటం. ఆఫీసు టైంలో వేరే పనులు చేసుకోవటం. దొంగ కారణాలతో సెలవులు పెట్టటం, లోన్లు తీసుకోవటం, దొంగ మెడికల్ బిల్లులు, ట్రావెల్ బిల్లులు సబ్‌మిట్ చేయటం, సబార్డినేట్ల చేత స్వంత పనులు చేయించుకోవటం. ఎక్కడైనా కొంత లాభం ఉందంటే కులం సర్టిఫికెట్లు, వెనుకబడిన సర్టిఫికెట్లు, పుట్టినతేదీ మార్చే సర్టిఫికెట్లు, తక్కువ ఆదాయం సర్టిఫికెట్లు.. ఒకటేమిటి

గౌరవనీయులం, విలువలు గల వాళ్ళం అనే వారు వీటి గురించి ఆలోచించను కూడా ఆలోచించదు. నిత్యమూ జరిగిపోతూనే ఉంటాయి. మాట్లాడే అవకాశం వస్తే మాత్రం మహానుభావులు, మహర్షులు అయిపోతారు. మాకు, యంగర్ జనరేషన్‌కు గొప్ప ఆకాంక్షలున్నాయి. త్వరగా పైకి పోవాలి. డబ్బు సంపాదించాలి అనే తపన ఉంది. మెటీరియలిస్టిక్ అని మీరంటారు కాని ఇక్కడా అంతే. డిగ్రీల తేడా. 'ఎంతో ఆర్జించాలి' అనే తపన అందరికీ ఉంటుంది. ధనం కాకపోతే పదవి లేదా కీర్తి, ప్రఖ్యాతి, బిరుదులు, ప్రశంసలు ఎవరేమనుకుంటారో అని మీరు వెనుకాడుతారు. మేము మొహమాటం లేకుండా సాహసం చేస్తాం. ప్రాక్టికల్‌గా ఆలోచిస్తాం."

సుదర్శనానికి మాటలు పెగల్లేదు. కాస్సేపు మౌనం రాజ్యం చేసింది. చివరకు 'ఇటీజ్ ఆల్‌రైట్ బేబీ, నువ్వు ఆస్ట్రేలియా వెళ్ళువుగాని, అయితే డేవిడ్‌తో నేనొకసారి మాట్లాడాలి" అన్నాడు.

"ఎందుకు నాన్నా?"

"నిన్ను దొంగ సర్టిఫికెటుతో కాకుండా అసలు సర్టిఫికెటుతో పంపుతాను. మీకిద్దరికీ సమ్మతమా?"

సరిత ఆశ్చర్యపోయింది. "దీని గురించి నేనాలోచించలేదు నాన్నగారూ. బహుశా డేవిడ్ కూడా ఆలోచించలేదేమో? ఇదే సరయిన పరిష్కారం అని మీరనుకొంటే... ఇటీజ్ ఓకే విత్ మీ."

సుదర్శనం, సౌదామిని ఒకరినొకరు చూసుకొన్నారు. వీళ్ళ విషయంలో ప్రేమలు, పెళ్ళిళ్ళు అనేవి కూడా అంత ముఖ్యం కాదు. గో గెటర్స్ , కావల్సింది పొందాలి. అంతే. "కాలం మారింది"అంది సౌదామిని. "కాదు విలువలు మారాయి" అన్నాడు సుదర్శనం. "ఎవరి విలువలు నాన్నా?" అంది సరిత.

**– పత్రిక మాసపత్రిక, జూన్ 2004**

# మొగ్గ నవ్వింది

**– పింగళి బాలాదేవి**

"గుడ్ మార్నింగ్ మమ్మీ" అంటూ వచ్చాడు ధనరాజ్.

"గుడ్ మార్నింగ్ రాజ్. రా లోపలికి" ఆహ్వానించింది ఎమిలీ ఆ ఆంధ్రయువకుడిని. ధనరాజ్ లోపలికి పూర్తిగా వచ్చి ఎమిలీ ముందున్న సోఫాలో కూర్చున్నాడు. ఎమిలీ స్కెచ్ బోర్డుమీద ఉన్న తన చిత్రానికి రంగులు వేస్తూండేది. ఆమె లేతగులాబీ రంగు శాటిన్‌గౌను, మెడలో అదే కలర్ శాటిన్ స్కార్ఫ్. గాలికి కదిలిన రాగి రంగుజుట్టు, గులాబీ, పసుపు రంగు కలసిన శరీర ఛాయతో మిలమిలమెరిసిపోతున్నది. నలభై ఏళ్ళు పైబడినా, అంత వయస్సున్నదనిపించదు.

"ఇళ్ళు ఎప్పటికి అయిపోతాయి రాజ్?" అందామె కుంచె క్రింద నున్న రంగుల ట్రేలో పెట్టి, అతని ప్రక్కగా వచ్చి కూర్చుని.

"అయిపోయినట్లే వరదలు రాకమునుపే ఈసారి కూలీలు రక్షణ పొందుతారు. మీ దయవల్ల" ధనరాజ్ నెమ్మదిగా అన్నాడు, వినయంగా గదిలో వెంటిలేటర్లలోంచి కిటికీల్లోంచి వెలుగు కిరణాలు చొచ్చుకుని వస్తున్నాయి. దూరంగా నీలపు కొండలు, పచ్చని పంటలు, పయనించే నల్లమబ్బులు, నీలపు కిటికీ తెరలు గాలికి రెపరెపలాడి ఎగుర్తున్నప్పుడు, కనిపిస్తున్నాయి. కనులకింపుగా.

"తోటల్లోకి వెళ్తున్నావా? ఇవాళ 'పేమెంట్‌డే' కదా. డబ్బు కావాలి" అంటూ లేచి, డబ్బు తీసుకుని వచ్చి కట్టలు ధనరాజ్ చేతుల్లో పెట్టింది.

ధనరాజ్ నల్లని తన లాంగ్‌కోటు జేబులో డబ్బుకట్టలు పదిలపర్చుకుని అన్నాడు. "వస్తాను మమ్మీ"

"బ్రేక్‌ఫాస్టు చేశావా? తొందరగా లంచ్‌కి రా. మరీ ఆలస్యం చేయక. పని తొందరలో పడి" అభిమానంగా, ఆప్యాయంగా అంది ఎమిలీ అతన్ని చూస్తూ.

"ఓకే. మమ్మీ మీ మాట నే కాదనగలవా?" అన్నాడతను.

"సరే. తొందరగా రావాలి. మర్చిపోకు" అని హెచ్చరిస్తూ గుమ్మందాకా వచ్చి నిల్చుంది గుర్రం ఎక్కి వెళ్లిపోతున్న అతడిని చూస్తూ.

కొండ దారి మీదుగా వెళ్తున్న ధనరాజ్‌కి వెనుకగా మరో గుర్రపు డెక్కల చప్పుడు వినిపించడంతో గుర్రం వేగం తగ్గించేందుకు కళ్లెం లాగిపట్టుకుని వెనక్కి తిరిగి చూశాడు. మేనేజరు రాంజీ. 'విష్' చేసి అతని పక్కకి తన నల్లగుర్రాన్ని తెచ్చాడు. ఇద్దరూ దగ్గరగా వెళ్తూ, ఆ ఏటి తేయాకు పంటల గురించి, కూలీల గురించి హిందీలో మాట్లాడుకుంటూ పర్వతసానువుల మీద చెట్ల దగ్గరికి వచ్చారు. అక్కడ దూరంగా షెడ్లలో తేయాకు బంగీలు తయారు చేస్తున్న కొందరు కూలీలు పరుగులు మీద వచ్చారు. వారి దగ్గరికి. కొందరు పచ్చని తేయాకుల్ని ఎండ పెడ్తున్నారు. కొన్ని పచ్చివి. కొన్ని రసం తీసి ఎండవేస్తున్న బంగారు రంగు ఆకులు. ఆ ప్రదేశమంతా చక్కని సువాసనతో నిండి ఉంది.

ఆ వచ్చిన కూలీలిద్దరు గుర్రాలను ముందుకు నడిపిస్తుండగా, రాంజీ, ధనరాజ్ ముందుకుసాగారు పచ్చని చెట్ల మధ్యలో, బురద బురదగా ఉన్న సన్నని దారిలో కొద్దిదూరంలో తేయాకు తోటలు దగ్గరపడ్డాయి. ఆకుపచ్చని చెట్ల మధ్యలో తెల్లతెల్లగా పూలు నక్షత్రాల్లా ఉన్నాయి. మనిషి చేతికి అందేంత ఎత్తులో దుబ్బుగా పెరిగాయి. ఆ చెట్లు ఆడవాళ్ళు అతి సున్నితంగా ఆకుల్ని మొగ్గల్తో సహా తుంచి బుట్టలో వేస్తున్నారు. లేయెండ చురుకుగా, వెచ్చగా ఉంది. అవన్నీ గమనిస్తూ ముందుకు సాగాడు ధనరాజ్. అందంగా, ఎప్పుడూ మడత నలుగని ఫూల్‌సూట్‌లో ఉన్న అతన్ని చూస్తే గౌరవం. అందర్నీ పరిశీలిస్తున్న ధనరాజ్ కళ్లు కొత్తగా చెట్లమధ్యలో నిల్చుని అతి సున్నితంగా కందిపోతున్నాయేమో అనిపించే తన మృదువైన చేతివేళ్లతో ఆకుల్ని తుంపుతున్న ఆ యువతిని ఆశ్చర్యంగా చూశాయి. పదహారేళ్ల లోపు వయస్సుండవచ్చును. మంచి శరీరఛాయలో బంగారుకాంతితో మెరిసి పోతున్నదామె, మొహంలో విశాలంగా ఉన్న ఆమె నయనాలు రెండు ఎడారుల్లో ఒయాసిస్సులా ఉన్నాయి. బెదుర్తున్న లేడిలా అటూ ఇటూ ఆకుల్ని కోస్తూ బుట్టలో నింపుతున్నది. మేలిముసుగు జారిపోతున్నా గమనించని ఆమె, తన మీది ధనరాజ్ చూపుల్ని గమనించి వణికిపోయి భయంభయంగా బుట్టతో సహా వెనుకగా అడుగులేస్తూ మేలిముసుగు పైకి లాక్కుని, బెదురు చూపుల్తో నక్కి నక్కి చెట్ల వెనక దాక్కోడానికి ప్రయత్నిస్తూ, ఆ యువతి

ధనరాజ్ దృష్టిని తప్పించుకుని పోయినా, అటే చూస్తూ నిల్చుండిపోయాడు ధనరాజ్ చాలాసేపు. అతనికి సుపరిచితమైన పోలికలేవో ఆ యువతిలో కనిపిస్తున్నాయి. "ఎవరా అమ్మాయి" అని రాంజీని అడిగాడు. గతుక్కుమన్న రాంజీ, ఏం చెప్పాలో తెలియక కంగారూ, భయంతో అన్నాడు "ఎవరో కూలి అమ్మాయి. మనకెందుకు? పోదాం రండి" నిజం చెప్తే తన ఉద్యోగం ఊడ్తుందన్న భయంతో. ధనరాజ్ తన సునిశిత బుద్ధితో రాంజీ ఏదో దాస్తున్నాడని గమనించాడు. టైము చూసుకుని, తను వెళ్ళాల్సి ఉండడంతో ముందుకి సాగాడు ధనరాజ్. మరేమీ అడక్కుండా అదీగాక, ఆ చిరపరిచితమైన పోలికలు ఎవరివా అని ఒకే ఆలోచన మనసులో.

మరునాడదే వేళకి, ఆ యువతిని మరోవరుసలో చూశాడు. తన వెనుకగా వచ్చి నిలుచున్న ఆ యువకుడిని, స్త్రీ సహజమైన భయంతో, తప్పించుకోలేక, బెదురుగా చుట్టూ చూసి తడబడి, కంగారుగా ఆకులు కోయసాగిందామె. ఆమెని అంత దగ్గరలో చూసిన ధనరాజ్, పోలికలు ఎవరివో పూర్తిగా గుర్తించాడు. కోపంగా ఆమె రెక్కపట్టుకుని లాగి, అన్నాడతను తీక్షణంగా "ఎందుకంత భయపడ్తావు నన్ను చూసి? ఎవరు నువ్వు? ఏం పేరు? నన్ను చూసి పెద్దపులిననుకుంటున్నావా? నేను అందరి లాంటివాడిని కాదు"

ఆమె బెదుర్తున్న కళ్లతో, వణుకుతూ "సలీమా నా పేరు. నన్ను వదలండి. మీరు దయచేసి వెళ్ళిపొండి" అంది జాలిగా.

వెనక్కి కదిలి, ఫెల్ట్‌హాట్ ముందుకు లాక్కుని మృదువుగా "నన్ను చూసి భయపడ్తున్నావు. నేనేం చేయను నిన్ను. చెప్పాను కదా?" అన్నాడు.

"శ్యామ్ సాబ్ చూస్తే నన్ను బ్రతకనివ్వరు. మీకు దండం పెడ్తాను" కంగారుగా అంది. బెదిరిన లేడిలా చుట్టూ చూస్తూ. ఆమె కళ్లలో కోరమీసాలూ, నల్లని లాంగ్ కోటూ కదిలాయి. బెదిరిస్తూ.

నిజం చెప్తే గాని రాంజీని వదలకూడదని అనుకున్న ధనరాజ్ ముందుకు దూకుడుగా వచ్చి అన్నాడు. "రాంజీ, నా దగ్గర ఏదో దాచాలని ప్రయత్నిస్తున్నారు కదూ మీరు? పోలికలెవరివో నేను గుర్తుపట్టాను. నిజమెందుకు చెప్పరు మీరు? చెప్పనా ఎవరి పోలికలో?

"నాన్నగారు బాబూ" కంగారుగా అంటూ వెనక్కి చూశాడు. రాంజీ. తమని సమీపిస్తున్న ఆ లాంగ్‌కోటుని చూసి, చల్లబడిపోయాడు ధనరాజ్ పక్కకి తిరిగి చూస్తే సలీమా లేదక్కడ.

"పిట్టనెవరు వదిలారు రాంజీ పంజరంలోంచి? నేను చెప్పిన మాట మీద మీకెవరికీ లక్ష్యం లేదన్న మాట" కోపంగా అన్నాడు శ్యామ్ సుందర్ – ధనరాజ్ తండ్రి. అతను ఆ టీ ఎస్టేటు ఓనరు. ఎమిలీ భర్త. ఆంధ్రప్రదేశ్ నుంచి పొట్టకూటికై ఎస్టేటు సూపర్‌వైజరుగా చేరడానికి వచ్చి ఆ ఎస్టేటుని, దాని అసలు ఓనరు ఎమిలీని తనదిగా చేసుకున్నవాడు.

"క్షమించాలి దొరగారు! పొరపాటయిపోయింది" భయంగా తలవంచాడు రాంజీ. "నువ్వింటికి వెళ్లు రాజ్" కఠినంగా అన్నాడు శ్యామ్ సుందర్. వెళ్తున్న ధనరాజ్‌ని గమనిస్తూ నిల్చున్నాడక్కడే. స్త్రీలందరిలో ఆమె కోసం చూస్తూ తొందరగా ముందుకి సాగిపోయాడు ధనరాజ్.

మరో రోజు కొండదిగి వస్తున్న సలీమాని రాంజీ ఏదో కోపంగా అరుస్తున్నట్లనిపించి  ధనరాజ్ నవనాడులూ క్రుంగినట్లుగా అనిపించాయి. అతడి హృదయంలో ఏదో ఝరి సలీమా వైపు ప్రవహిస్తున్నది. ఆమెని ఎవరేమన్నా అతని గుండె కలుక్కుమని తరుగుకుపోతూంది. సలీమా ఆకులు కోస్తున్నప్పుడు ఆమె వెనుకగా నిల్చున్నాడు ధనరాజ్. రెండు లేత ఆకుల్ని మధ్య నున్న మొగ్గతో పాటు త్రుంచుతున్నదామె. భయపడకుండా తన పనితాను చేసుకుపోతోందామె. "మగవాళ్లు అంత అందంగా ఆ పని చేయలేరు కదూ సలీమా? మొగ్గనలా ఆకుల్తో సహా చెట్టునించి వేరు చేస్తున్నావు కదా – అది ఏడవదూ తల్లినించి వేరు చేసినందుకు? చెట్లకి కూడా  ప్రాణముంటుంది తెలుసా? ఆ చెట్టు చూడు – కన్నీరెలా వదుల్తోందో?" అన్నాడు ధనరాజ్ సలీమాని మాట్లాడించాలని.

"చదువుకున్నవాళ్ళు మీరు" అంది సలీమా నెమ్మదిగా

"నువ్వు చదువుకోలేదా?" తాను కూడా మొగ్గలు కోయడానికి ప్రయత్నిస్తూ అన్నాడు.

"ఏదో కొద్దిగా ఖురాను, భాగవత, భారత రామాయణాలు చదివాను – అదీ మా తాత ఉన్నప్పుడు. ఇప్పుడేం లేదు. కడుపునింపుకుందికీ పని తప్ప. నేనిప్పుడు పాకిస్తాన్ వెళ్లలేను కదా. విభజనప్పుడు తాత అమ్మ వచ్చారిక్కడికి"

సలీమా ఎంత వినయంగా, తెలివిగా హృదయవిదారకంగా మాట్లాడ్తుంది! ఆమె చదువుకుంటే? ఎందుకో ఎవరో తమ బూటు కాళ్లతో ఇనుపనాడాల క్రింద ఒక గులాబీ మొగ్గను నొక్కుతూ కాలు తీస్తూ వేస్తూ బాధిస్తున్నారు. ఆ కాలు పూర్తిగా తొలగించి, మొగ్గమీది దుమ్ము, ధూళి దులిపితే? ఆలస్యమవుతే రేకలు మరి తెరుచుకోవేమో?

తర్వాతొక మూడు రోజులు వరుసగా సలీమా కనిపించలేదు. కానీ ధనరాజ్ ఆమెకోసం వెదకడం మానలేదు. అది వరకులా రాంజీ చూపించే కొన్ని వరుసల చెట్లే కాక, పూర్తిగా ఎకరాలతో నిండిన తోటంతా చూస్తున్నాడు. ఏ మూలయినా సలీమా ఉండకపోదాని. ఆమెనెందుకో ఉద్ధరించాలని ఉరకలు వేస్తున్నదతని వేడిరక్తం. అతనిలో సలీమాలో ఉన్న రక్తమే ఉన్నది. మానసికంగా ఆమె మీద ఏదో ప్రేమ. పవిత్రతా భావాలు మెదల్తున్నాయి అతనిలో.

ఒకరోజు బుట్టలో, షెడ్డులో, ఆకుల్ని తెచ్చి ఇచ్చిన సలీమాతో ఎవరో కూలీ పరాచికాలాడ్డానికి ప్రయత్నించడం అప్పుడే అక్కడికి పని మీద వచ్చిన ధనరాజ్ కంటపడింది. అతని కళ్లు రక్తాన్ని చిమ్మాయి. "రాంజీ – వాడినిలా తీసుకుని రండి" అన్నాడు. రాంజీ ధనరాజ్ భావం గ్రహించి కూలీని నానాతిట్లు తిడ్తూ, కొరడాతో వాతలు పడేట్లుగా కొడ్తూ తీసుకుని వచ్చాడు ధనరాజ్ ముందుకి. రాజ్ అతన్నేమీ అనకుండా రక్తవర్ణం నిండిన తన కళ్లతో రాంజీ వైపు అధికారపూర్వకంగా చూస్తూ ఆ "కొరడానిలా ఇవ్వండి" అన్నాడు రాంజీ బెదుర్తూ కొరడా అందించాడు. ధనరాజ్ కొరడాని లాగిపట్టి తన అరచేతిలో దెబ్బకొట్టుకున్నాడు గట్టిగా. కూలీలందరూ గజగజ వణికారు. ధనరాజ్ నవ్వి అన్నాడు. "దెబ్బ తగుల్తుంది, కాని మనసుకి కాదు రాంజీ. ఇది మాత్రం సరయిన దారి కాదు. కొరడా నా దగ్గరే ఉండనీండి" అతడు అందర్నీ సున్నితంగా మందలించి, సలీమా వైపు చూశాడు. ఆమె కృతజ్ఞతాపూర్వకంగా అతన్ని చూసి వెళ్లిపోయిందవతలికి.

ధనరాజ్ రాంజీతో ఆఫీసు గదిలోకి వచ్చాడు. అతని చేతిమీద అరంగుళం మందాన వాతపడి ఉంది. టీ తాగి, సిగరెట్టు వెలిగించి, రాంజీ వైపు చూసి అన్నాడు ధనరాజ్. "రాంజీ మీరు నిజం చెప్పలేదు నాకు, ఆమెలో నా తండ్రి పోలికలు స్పష్టంగా ఉన్నాయి. దాచినా దాగవు. నా కళ్ళు కప్పడం మీ ఎవరి తరమూ కాదు. మరొకరెవరయినా ఇలాంటి పనిచేస్తే నేనేం చేసేవాణ్ణో నాకు తెలీదు నాకు రక్తం పంచిన తండ్రి కనుక ఏం చేయలేదు" కొంచెం ముందుకి వంగి అన్నాడు – "మనలో మాట. అసలు కథేంటి రాంజీ!"

రాంజీ మొదట తటపటాయించినా, ఆ ఆంధ్రయువకుడు అసాధ్యుడని గ్రహించి అన్నాడు నెమ్మదిగా. "నిజం మీరు చెప్పిందే. ఒక ముస్లిం స్త్రీకి పుట్టింది సలీమా – బాబుగారికి ఎమిలీ దొరసానమ్మగారితో పెళ్లి కాకముందు ఆ సలీమా తల్లి ఫాతిమా పదేళ్ల క్రితం పోయింది. సలీమాకి అయిదేళ్లప్పుడు తాత ఉండేవాడు ఈ మధ్యనే పోయాడు. బాబూజీ ఈ విషయం ఎంత దాచాలని చూసినా, ఆ పిల్లలో పోలికలు దాచలేరు. మీ కళ్లపడకూదని చాలా ప్రయత్నించారు. ఈ మధ్యనే పనిలోకి వస్తున్నది – ఎమిలీ దొరసానమ్మ గారి మాట మీద. ఎమిలీ దొరసానమ్మగారి తండ్రి చండశాసనుడుగా ఉండేవారు. మీ నాన్నగారు మంచివారుగా నటించి... క్షమించాలి చిన్నబాబూ" భయపడి ఆగాడు రాంజీ.

"ఫర్వాలేదు చెప్పండి. దొంగతనం ఎప్పటికీ దొంగతనమే. దాన్ని నిరసించడానికి ప్రతీవాడికీ హక్కుంది". అన్నాడు ధనరాజ్.

"దొరగారి అమ్మాయి ఎమిలీ గారిని పెళ్లి చేసుకున్నారు. ఆమె.... చాలా గుణవంతురాలు... మీకే తెలుసు. మీరంటే ఆమెకి చెప్పలేని ప్రేమ. అన్నాడు రాంజీ. అతనికి ధనరాజ్ అంటే చెప్పలేని అభిమానం ఏర్పడింది. ముఖ్యంగా ఉడుకురక్తంలో ఉరుకులెత్తే ఆదర్శభావాల్ని చూసి మరీ.

ధనరాజ్ తీవ్రంగా ఆలోచనలో మునిగాడు. సలీమా తన చెల్లెలు. తను ఆస్తులన్నింటికీ హక్కుదారుడై అత్యంత వైభోగాలనుభవించడం అతనికిష్టంలేదు. ఎమిలీకి తెలుసీ విషయం. తనకి బిడ్డలు లేనప్పుడు తన భర్త పిల్లలే ఇద్దరూ అయినప్పుడు సలీమానెందుకు వదిలిందామె? తనకీ సలీమాకి ఏ తేడా ఉంది? సలీమాకి హక్కుంది తనతోపాటు ఇద్దరిదీ ఒకటే రక్తం. తల్లులు వేరయినా తండ్రి చేసిన తప్పుకి సలీమా

ఎందుకు శిక్షించబడాలి? ఆమెనెలాగయినా ఇక్కడ్నించి రక్షించాలి. మానవులంతా సమానమని అన్ని మతాలు చెప్తాయి. త్రివేణీ సంగమంలాంటి తమ జీవితంలో ఏమయినా సరే సలీమాని తాను ఒక మనిషిగా ఎందుకు నిలబెట్టలేదు? జీవితకాలం తేయాకు తోటల్లో ఆకులు త్రుంచుతూ బ్రతకవలసింది కాదు సలీమా. అదే మరో పిల్లయితే ఏ సోనార్‌గాచ్ఛిలాంటి జాగాల్లోకి తార్పుడయిపోతుంది. మగవాడయితే టెర్రరిస్టు కాంపుల్లో ఉంటాడు. ఇటువంటి వాళ్లకి మరోదారిలేదా?

ఆ సాయంత్రం తన గదిలో అడుగుపెట్టిన తన పుత్రుడిని చూసిన శ్యామ్‌సుందర్ హృదయం ఝల్లుమంది – ఒక్కసారిగా పక్కమీంచి లేచి అతని రగ్గుని కాలి వేళ్లతో మంచం చివరికి తోసి తలగడని ఆనుకుని కూర్చున్నాడు. "రా ధనరాజ్. ఎమిలీని చూశావా?" అన్నాడు కొడుకుని చూసి.

మంచం దగ్గరే నిల్చుని అన్నాడు ధనరాజ్. "నేనింకా మమ్మీ దగ్గరకు వెళ్లలేదు. ఇంతకీ సలీమాని ఏం చేయదల్చుకున్నారు?"

"సలీమా విషయం నీకెందుకు?" అన్నాడు శ్యామ్‌సుందర్ గంభీరంగా. అతడి కోరమీసాలు, ఒత్తైన నల్లని జుట్టూ, దబ్బపండు శరీర ఛాయ బలంగా కండలు తిరిగిన శరీరం, నలుబదారేళ్లు దాటినా, సడలని వయస్సతనిది.

"మీరు సలీమా కన్యాయం చేస్తున్నారు నాన్నగారు. మీ జీవితమంతా ఆడవాళ్లని అన్యాయం చేయడమేనా... మా అమ్మ కామేశ్వరి, సలీమా తల్లి ఫాతిమా, అమాయకురాలు ఎమిలీ? ఇప్పుడు సలీమా జీవితం మిగిలిందా మీకు?" ఆగి ఆగి తండ్రిమీద గౌరవం కొద్దీ, మృదుత్వం నింపుకుని అన్నాడు ధనరాజ్.

"ఆపింక ధనరాజ్, నిన్ను నీతులు నేర్పమని కాదు తీసుకువచ్చింది. ఎమిలీతో మంచిగా ఉండి ఆస్తిని సాధిస్తావనేగాని! నేను చెప్తున్నాను. సలీమా విషయ మెత్తడానికి వీలుకాదు. అది నా స్వవిషయం.

"నాన్నగారూ. ఆస్తికే ఆశపడిన వాడినయితే రాకనేపోదును. ఈ రోజు "నాకు కొడుకు కావాలని" అన్నారు కనుకనే వచ్చాను. ఏడాది పిల్లవాడప్పుడు లేని మమకారం నేడెలా వస్తుంది మీకు? ఆ రోజునించి అమ్మ పోషణలో పెరిగాను. నా బ్రతుకు

నాకు తెలుసు. నేను మీకంటే చిన్నవాడినే. మీ కొడుకునే. కాని మనిషిగా నేనీ అన్యాయాలు సహించలేను" అన్నాడు ధనరాజ్ నెమ్మదిగానే.

"నిన్ను ఆంధ్రాలోనే ఉంచవలసింది నాకు సాయపడ్తావని ఈ అస్సాం కొండల్లోకి లాక్కురావడం పొరపాటయింది" విసుగ్గా అన్నాడు శ్యామసుందర్.

"ఎందుకు తీసుకువచ్చారో చెప్పారు. మీకు మరో వారసులు లేరు. నాకేం తక్కువ లేదక్కడ. అమ్మపోయిందని వచ్చాను. నేను సలీమాని చదివిస్తాను. పక్షపాతం వద్దు మీకు. నేనెంతో సలీమా అంతే మీకు" ఇంకా సహనంతో అన్నాడు రాజ్.

"రాజ్ – ఆఖరిమాట. సలీమా విషయంలో నువ్వు కలగచేసుకుంటే, ఎమిలీ ఆస్తిని కూడా నీకు రానీకుండా చేస్తాను. జాగ్రత్త" బెదిరించాడు ధనరాజ్. శ్యామ్‌సుందర్ ధనరాజ్ కిందపడిన పైపుతెచ్చి అందించాడు తండ్రికి. "క్షమించండి నాన్నగారూ. నాకు డబ్బు మీదాశలేదు. మనుషుల ప్రేమాభిమానాల మీద తప్ప" అన్నాడు అతను.

శ్యామ్‌సుందర్ విసుగ్గా, కోపంగా వెళ్లిపోయాడు. ధనరాజ్ కళ్లకి తెరిచి ఉన్న లాకర్ తాళాల్తో సహా కనిపించింది. దగ్గరికి వెళ్లి. లాకర్ తాళాలు వేసి పక్కమీద పడి ఉన్న తండ్రి లాంగ్‌కోటు మీద పెట్టాడు. తర్వాత తలుపు గొళ్లెం పెట్టి మేడ మీదనించి క్రిందికి వచ్చాడతను.

ఆ సాయంత్రం తన గదిలో బట్టలవీ సర్దుకుంటున్న ధనరాజ్‌కి తలుపు మీద మునివేళ్లతో తట్టిన చప్పుడు వినిపించి తలుపు తీసి, చూస్తే ఎమిలీ – "ధనరాజ్ – ఏం చేస్తున్నావు" అంటూ లోపలికి వచ్చింది. సాధారణంగా ఆమె ఎప్పుడూ ఆ సమయాల్లో తన గదికి రావడం అతనెరుగడు గత నాలుగేళ్లుగా అక్కడే ఉన్నా.

"ఏం లేదు మమ్మీ – నాకు మా ఊరు, ఆ గోదావరి నది, లాంచీలు, లంకలు చూడాలని ఉంది" అన్నాడతను ఆవేదనగా.

"అబద్ధమాడ్తున్నావు కదూ నువ్వు! రాజ్ – మమ్మీ మీద నీకు జాలి, దయ లేవా! నాన్నలాగ అమ్మని అన్యాయం చెయ్యాలని చూస్తున్నావు కదూ?" భుజం మీద చెయ్యివేసి, కాతర నిండిన గొంతుకతో అంది ఎమిలీ.

ఆమె హస్తాన్ని తన చేత్తో నొక్కిపట్టి మొహం పక్కకి తిప్పి తన చేతి మీద గడ్డమాన్చి అన్నాడు రాజ్. నా మమ్మీ అంటే నాకెప్పుడూ ప్రేమ అభిమానం అన్నీ

ఉంటాయి. చెరగకుండా మమ్మీ. సలీమా నా చెల్లెలు. నాతో తీసుకుని వెళ్లాలనుకుంటున్నాను" అన్నాడు కన్నీళ్లతో.

"ధనరాజ్. నీకు తెలీదేమో – స్త్రీ ధనం స్త్రీదేను. సలీమా నాకూ కూతురే. నువ్వు నా కొడుకయినప్పుడు నా మాట విను. ఆమెను కాన్వెంటు స్కూల్లో చదువుకోసం చేర్చిరా. చదువయ్యాక మనమే పెళ్లి చేద్దాం. సెలవులకి వస్తూంటుంది. మీ నాన్నగార్ని ఒప్పించే పూచీ నాది. సరేనా? ఏడుస్తావెందుకు! ఎంత అమాయకుడివి! నా మాట నమ్ము" అంటూ తన చేత్తో కన్నీళ్ళు తుడిచి, అతని ఫాలభాగాన ముద్దుపెట్టుకుంది. ఎమిలీ

"నువ్వెంత మంచిదానివి మమ్మీ" అంటూ ఆమె చేతిని పెదాల్తో మృదువుగా స్పృశించి, ముద్దుపెట్టుకున్నాడు ధనరాజ్. కన్నీళ్లు అతడి తలమీద పడ్డాయి. ఎమిలీ కళ్లలోంచి.

మర్నాడు తనతో రమ్మని ధనరాజ్ ఇచ్చిన ఆహ్వానానికి ఉక్కిరి బిక్కిరి అయినట్లయి ఎంతో ఉత్సాహంతో ప్రేమతో ఆరాధనతో అంది సలీమా – "నాకెందుకు బాబూ చదువు. పెళ్లి అవన్నీ? ఈ తేయాకు తోటల్లో గడిచిపోతే చాలదూ మా అమ్మలాగా?"

"నువ్వు నా చెల్లెలివి సలీమా. మీ అమ్మ బ్రతుకు నీకు తెలుసు. నువ్వు తనలా మరో తోడేలు బారిన పడడం నాకిష్టం లేదు. ఎమిలీ మమ్మీ దేవత. నిన్ను చదివిస్తానని, పెళ్లి చేస్తాననీ అంది"

"నాకిదివరకే తెలుసు మీ నాన్న మానాన్న ఒకరే అని. ఆ భయంతోనే మీ నుంచి తప్పించుకుందామని ప్రయత్నించేదాన్ని మీ మంచితనం నాకు తెలుసు ఆ రోజన్నారు. మొగ్గతో ఆకుల్ని తుంపితే చెట్టు ఏడవదా అని. అవి ఒకరి కోసం పుట్టాయి బాబూజీ. వాటికి అందులోనే ఆత్మసంతృప్తి ఉంది. నిస్వార్థంతో స్వార్థం సాధిస్తున్నాయవి. నేనూ ఆ మొగ్గల్లాంటిదాన్నే. నన్నిక్కడే వదిలేయండి."

"సలీమా – నేను నీ అన్నని. బాబూజీ, బాబూ అనడం మానేయి. అన్నా అను. నువ్వు నా లాగే బ్రతకాలి. రాక తప్పదు" అన్నాడు ధనరాజ్ ఆమెని పొదివి పట్టుకుని సలీమా కన్నీళ్లతో ఒదిగిపోయింది ఆ కౌగిలిలో.

తేయాకు తోటల్లో ఎమిలీ, తండ్రి శ్యామసుందర్‌తో పాటు కలిసి తిరుగుతున్న ఒకరోజు సలీమా మొదట కనిపించిన చోట – రెండాకుల మధ్య మొగ్గతో పాటు తుంపి, ఎమిలీ కందించి అన్నాడు ధనరాజ్.

"మొగ్గ బాగుంది కదు మమ్మీ?"

"బాగుండడమే కాదు. అది నవ్వింది కూడా" అంది ఎమిలీ వాసన చూస్తూ.

"సలీమా చెప్పిందా?" అన్నాడు ధనరాజ్ నవ్వుతూ

ఎమిలీ నవ్వింది. శ్యామ్‌సుందర్ నవ్వేడు. ఎమిలీ చేతిలో మొగ్గ కూడా నవ్వింది.

# మానవత్వం ఓడిపోలేదు!

– వింధ్య వాసిని

**ఉ**దయం అయిదు గంటల సమయం.

చలికి ముడుచుకుని, రగ్గు ముసుగు పెట్టుకుని పడుకుని ఉన్న అర్జునరావు పక్క మంచం మీద చేయివేసి చూశాడు. ఖాళీగా ఉందక్కడ. "అప్పుడే లేచిపోయిందేమో ఈశ్వరి. బాబోయ్ ఈ చలిలో యింత పొద్దున్నే లేచి ఏం చేస్తున్నట్టు" అనుకున్నాడు.

'ఇదుగో ఏమోయ్ ఓ సారిలా రా" అని ముసుగు తియ్యకుండానే కేక వేశాడు.

"తెల్లారి ఏమిటా గావుకేకలు! మీ పాటికి మీరు పడుకోకుండా..." అంటూ వచ్చింది ఈశ్వరి.

"ఏమిటే నావి గావుకేకలా? అవున్లే నీకలా అర్థం కాదు" అంటూ విసురుగా ఆమె చేయిపట్టి మంచం మీదికి లాగేడు.

"చాల్చాలు వదలండి. తలకి ఆముదం అంటుకున్నాను. నీళ్ళు కాగిపోతున్నాయి. అవతల స్నానం చెయ్యాలి."

"ఇంత ప్రొద్దుటే స్నానమేమిటోయ్"

"శనివారం కదండీ. వెంకటేశ్వరస్వామి పూజచేసుకోవద్దూ. మీ కంటే ఏ పూజలు అవసరం లేదు, నేనూ మానేస్తే ఎలాగు? అయినా బొత్తిగా పూజలు, జపం, ధ్యానం అంటే పట్టవేమిటండీ మీకు"

"మహాతల్లీ నమస్కారం. వెళ్ళి స్నానం, పూజ, జపం, ధ్యానం అన్నీ చేసుకో. నన్నిలా వదిలేసి పుణ్యం కట్టుకో, మరో గంటయినా హాయిగా నిద్రపోతాను."

మళ్ళీముసుగు పెట్టాడు అర్జునరావు.

ఇవాళ శనివారం, వెంకటేశ్వరస్వామి పూజ, శుక్రవారం లక్ష్మి పూజ, గురువారం

సాయిబాబా పూజ,మంగళవారం గౌరీపూజ,  సోమవారం శివపూజ, ఇదీ తంతు. ప్రతీరోజూ ఏదో ఒక ప్రత్యేకత ఉండనే ఉంటుంది.

ఈశ్వరి తెల్లారే నిద్రలేచి పని చేసుకున్న రోజే నయం. పొరపాటున ఆమె ఆలస్యంగా లేచినరోజు అర్జునరావు దుంప తెంచుతుంది. సమయానికి పనులు కావు. ఆఫీస్‌కు టయిం అయిపోతూ ఉన్నా భోజనం తయారు అవదు. అతడెంత కోపంగా కేక వేసినా, చిందులు తొక్కినా ప్రయోజనం మాత్రం అంతగా ఉండదు.

అయితే ఈశ్వరిలో ఒక సుగుణం ఉన్నది. ఏదయినా ఒకటి గట్టిగా నిర్ణయించుకుంటే, దానికి కట్టుబడి ఉంటుంది. ఆదివారం తప్ప మిగిలినరోజులన్నీ ఆమె ఇష్టం.  ఆదివారం మాత్రం భర్త చెప్పిన రీతిగా నడుచుకోవాలి. దేనికీ అడ్డు చెప్పకూడదు. ఇది ఎన్నేళ్ళ క్రితమో ఇద్దరూ కలిసి తీసుకున్న ఒప్పందం. అందుకే ఆదివారాలు  మాత్రం, అర్జునరావు తెల్లవారి ఎంత సేపు నిద్రపోయినా  కోపగించదు. ఆమెనీ లేవనియ్యకుండా, తన పక్కనే ఉండమని  బలవంతం చేసినా, విసుక్కోదు. అతని  కెంతో మోజయిన  బెడ్‌కాఫీ ఇచ్చేస్తుంది. తనే తలంటి స్నానం  చేయిస్తుంది. అయిదు నిమిషాల్లో దేవుడి పూజ ముగించి వేస్తుంది. అతను కోరిన వంటకాలు వండి వడ్డిస్తుంది. అతను వేసిన  ప్రోగ్రాం ప్రకారం ఎటు వెళదామన్నా, అతనికి నచ్చేవిధంగా తయారయి వెంట బయలుదేరుతుంది. రాత్రి ఎంతసేపు  అతను నిద్రపోకుండా, కబుర్లు చెప్పినా  వింటూ కూర్చుంటుంది.

“ఒక్కోవారం ఒక్కో దేవుడికిలాగే ఆదివారం  పతిదేవుడికి కేటాయించుకున్నావా? నీవు పూజించే దేవుడికన్నా  నేను సులభంగా వరాలిచ్చేస్తాలే” అని ఎగతాళిచేస్తూ ఉంటాడు అర్జునరావు.

అతను నాస్తికుడు కాదు. కానీ ఈశ్వరి  పద్ధతి చాదస్తమూ విసుగు పుట్టి, అలా మాట్లాడుతూ ఉంటాడు అంతే!

అర్జునరావుకి ప్రతీరోజూ దేవుడి దగ్గర దీపం వెలిగించటం, పూజచేసుకోవడం, ఉపవాస దీక్షలు పట్టటం వంటి నియమాలూ, ఆచారాలూ అలవాటు లేవు.

మనసును నిర్మలంగా ఉంచుకోవటం, తనమనసుకు సంతృప్తినీ, సంతోషాన్నీ కలిగించే విధంగా ప్రవర్తించడం, ఒకర్ని నొప్పించకుండా నడుచుకోవడం. ఇవే

అతను ఎంచుకున్న నియమాలు, వీలయినంతవరకూ ఇతరుల్లో మంచిని చూడటం, శక్తిమేరకు సహాయ పడటం ఇవే అతని ఆచారాలు, ఇందునే మామూలుగా, భార్యాభర్తలిద్దరూ ఘర్షణ పడుతుంటారు.

ఏవిధమయిన సమస్యలు, కష్టాలు లేకుండా జీవితం సాఫీగా సాగిపోతున్నా, పిల్లలు లేరనే లోటుతో లోలోపల బాధపడుతుంటారు ఈశ్వరీ అర్జునరావులు.

సంతానం కోసం, ఈశ్వరి చేయని పూజలు, వ్రతాలు లేవు, ఎవరేది చేయమని చెప్పినా ఆచరిస్తుంటుంది. ఇద్దరి ఆరోగ్యాలనీ ఎందరో వైద్యులు పరీక్ష చేయటమూ అయింది. ఎవరు చూసినా, ఇద్దర్లో ఏ లోపమూ లేదని చెప్పేవారే. కాని ఏం లాభం? ఇన్నేళ్ళయినా వాళ్ళ కోరిక మాత్రం తీరలేదు. ఈశ్వరి మాత్రం ఎప్పటికో ఏదేవుడయినా కరుణించక పోతాడా అని ఎదురు చూస్తూ ఉంటుంది.

కొన్ని రోజులుగా అర్జునరావు మనసులో ఒక కోరిక ఉంది. పిల్లలు పుడతారో లేదో అని ఇలా ఏళ్ల తరబడి కాచుకోవటం అతనికి విసుగ్గా ఉంది. అసలు పుట్టకపోతే పోయారు. ఎవరి నయినా తెచ్చి పెంచుకుంటే బావుంటుంది అనిపిస్తుంది అతనికి.

అతనాకోరిక ఈశ్వరి ముందర వెలిబుచ్చినపుడు ఘర్షణ తప్పలేదు.

"అయినా మనకేమంత వయసయి ముసలి వాళ్ళమయి పోయామని ఇలా ఆలోచిస్తున్నారు? నేను గొడ్రాలిననీ, మనకు పిల్లలు పుట్టరనీ అనిపిస్తుందా మీకు" అని కళ్ళనీళ్ళ పర్యంతం అయింది.

అలిగి ఒక రోజంతా భోజనం మానేసింది. తన ఉద్దేశ్యం అదికాదని ఆమెకు నచ్చజెప్పి, బుజ్జగించేసరికి, తల్లక్రిందులు తపస్సు చేసినట్లయింది అర్జునరావుకి.

అర్జునరావు అయితే ఆ దెబ్బతో మళ్ళీ ఆ విషయాన్ని ప్రస్తావించే సాహసం చేయలేదు కానీ, ఈశ్వరి ఆలోచిస్తూనే ఉంది చాలారోజులవరకు.

"ఆయన పైకి చెప్పుకోరుగానీ ఇంట్లో పసిబిడ్డ తిరగాడాలని ఎంత ఇష్టంగా ఉందో... అందుకే అలా అడిగేరు... ఆ ఇష్టంతో.. నన్ను నిజంగానే గొడ్రాలు అనుకుని మళ్ళీ పెళ్ళి చేసుకుందాం అనుకుంటారేమో ఇంకా కొన్నాళ్ళు ఇలాగే సాగితే... అయినా ఆయన కోరికలో తప్పేముంది? దేవుడి దయవల్ల తమకు భుక్తి

లోటులేదు. ఒకరిని పెంచుకున్నాక, తమకు సంతానం కలిగినా లక్షణంగా భరించగల స్తోమతు ఉంది.. ఈ మగాళ్ళని ఎవరు నమ్మేరు!.. ఎప్పుడెలా మనసులు మార్చుకుంటారో...” ఇలా సాగేయి ఈశ్వరి ఆలోచనలు.

అప్పటిక ప్పుడు నిర్ణయించుకుని, ఆలస్యం చేయకుండా ఆవేళే అతనికి, తన అంగీకారాన్ని తెలపాలని అనుకుంది.

అంతటితో ఇద్దరూ ఒక మాటమీదికి వచ్చి, ఆ ప్రహసనం అక్కడికి ముగిస్తే, వాళ్ళిద్దరూ ఈశ్వరి అర్జునరావులు ఎందుకవుతారు?

“మరి ... మీరావేళ చెప్పింది బాగానే ఉంటుందేమో అనిపిస్తుందండీ నా క్కూడా...”

“ఏ రోజోయ్.... ఏం చెప్పాను!”

అతనికి తెలుసు, ఆమె ఏ విషయం మాట్లాడుతున్నదీ. కానీ తను అడిగిన వెంటనే,మండిపడి, గొడవచేసి, ఇన్నాళ్లయ్యాక అంగీకరించబోతున్నదని, తనా విషయం పూర్తిగా మరచిపోయిన వాడిలా అయోమయంగా అన్నాడు.

అతను సాయంత్రం ఆఫీసునుండి వచ్చి కాఫీ టిఫిను ముగించి, తీరుబాటుగా న్యూస్‌పేపర్ పుచ్చుకుని కూర్చున్న సమయంలో మొదలయింది సంభాషణ.

“అది కాదండీ... మీరా రోజు చెప్పలేదు.” మనం ఒక పాపాయిని తెచ్చి పెంచుకుందామని.... అదే బాగుంటుందేమోనని...’

‘ఏం మనకప్పుడే వయసయిపోయిందా? ఇక పిల్లలు పుట్టరనిపిస్తోందా?” అతను మామూలుగానే అంటున్నా తన మాటలు తనకే ఒప్పజెప్పుతున్నాడని ఈశ్వరికి తెలుసు. అయినా ఉక్రోషాన్ని తమాయించుకుని, “ఎందుకండీ అంత కోపం, మీ మాట కాదన్నాననేనా.. మనకు పుట్టరని కాదు. ఇప్పటికి ఒక పాపాయిని తెచ్చుకుందాం. ఇంట్లో పసిబిడ్డ తిరుగాడాలని నాకూ ఉందండి.”

అతని పక్కనే నేలమీద చతికిలబడి, అతని మోకాళ్ళకి తల అన్చుకుని అంది ఈశ్వరి. అర్జునరావు మనసు కరిగిపోయింది. చేతిలో పేపర్ పక్కన పడేసి, భార్య తల నిమురుతూ, “అవును మరి, ఎన్నాళ్ళని నీకు నేనూ నాకు నువ్వు పాపాయిలాగా ఉంటాం? మనిద్దరికీ వేరే పాపాయి కావాలి” అన్నాడు మృదువుగా.

"మరి ఎవర్నడుగుదాం.. ఒకసారి మా ఊరికి వెళ్ళివద్దామండీ.. మనకోరిక అమ్మకీ, నాన్నకీ చెబితే వాళ్ళే ఏర్పాటు చేస్తారు. ఏవరయినా మన బంధువుల్లో ప్రయత్నించమందాం... అసలు నా మనసులో ఒకటుంది... మా అక్కయ్యకి నలుగురు పిల్లలు కదా? ఒక్కర్ని మన కివ్వమంటే బావుండదూ? మా అక్కయ్య కూతరయితే మనకి బావుంటుంది కానీ... వాళ్ళే మంటారో మరి..."

ఈశ్వరి చెబుతూనే ఉంది. అర్జునరావు ఆలోచిస్తున్నాడు. అప్పటికప్పుడు భార్యకి ఏ సమాధానమూ చెప్పలేదు. అతని మనసులో ఉన్నదివేరు.

కానీ అతని మౌనాన్నే అంగీకారం అనుకున్న ఈశ్వరి అక్కడినించి లేచి లోపలికి వెళ్ళిపోయింది.

"కూరేం వండమంటారు?" అనడిగింది మళ్ళీ ఇటువచ్చి.

"నీ ఇష్టం ఏదయినా త్వరగా ముగించెయి. సినిమాకి వెళదాం"

"సినిమాకా?"

"ఏం వద్దా?"

"అహ అదేంకాదు. ముందే చెబితే బావుండేది కదా అని. ఇప్పుడిక హడావిడిగా తయారు కావాలి... పోనీ కూర ఏదీ చెయ్యను.... వచ్చిన తర్వాత రెండు ఆమ్లేట్స్ వేసుకుని, తింటే పోతుంది" అంటూనే ముఖం కడుక్కోబోయింది.

ఎంత హడావిడిగా తయారు కావలసి వచ్చినా, ఈశ్వరి సినిమా అనగానే వద్దు అనదని అర్జునరావుకి తెలుసు. ఆమెకి సినిమాల పిచ్చి ఎక్కువే.

సినిమా కూడా, వీళ్ళలాగా పిల్లలు లేని దంపతుల గురించే, వాళ్ళొక పిల్లవాణ్ణి తెచ్చి పెంచుకున్న తర్వాత, వాళ్లకో కుఱ్ఱాడు, పుడతాడు. పిల్లలిద్దరూ పెరిగి పెద్దయాక కన్నకొడుకు వాళ్ళని ధిక్కరించి ఇల్లు వదిలి వెళ్ళిపోతాడు పెంపుడు కొడుకే తల్లిదండ్రుల నుద్ధరించి, సినిమా సుఖాంతం చేస్తాడు. ఇదీ కథ.

రాత్రి భోజనాలు అయిన తర్వాత మళ్లీ ప్రస్తావించింది ఈశ్వరి, "మరి ఎప్పుడు ఊరు వెడదామంటారు" అంటూ.

వక్కపొడి నముల్తూ, మంచంమీద వెల్లకిలా రెండు చేతులమీద తలపెట్టుకుని పడుకుని, పైన తిరుగుతున్న ఫేను వంక చూస్తూ "ఊరికా? ఎందుకూ?" అన్నాడు అర్జునరావు.

"ఏమిటండీ అప్పుడే మర్చిపోయారా? మనం సాయంకాలం అనుకున్న విషయం.." నమ్మలేనట్లుగా అడిగింది.

"ఉహు మరచిపోలేదు... నాకు బాగానే గుర్తుంది"

"మరి.."

"మనం ఒక పాపని పెంచుకోవాలని అనుకుంటే, ఈ ఊళ్ళో ఎక్కడా పాపలు దొరకరా? మీవాళ్ళతో సంప్రదించడం ఎందుకూ?"

"అదేం మాటండీ .. పిల్లని తెచ్చి పెంచుకోవడం అంటే అంత సులభం అనుకున్నారా? కులం, మతం, కుటుంబ చరిత్ర ఇలాంటి మంచిచెడ్డ లెన్నో విచారణ చేయాలి ముందుగా.

అసలీ సమస్యలేవీ ఉండవనే, మా అక్కయ్య కూతుర్ని అడుగుదామండీ అన్నది. అది ఒప్పుకుంటే బావుంటుంది. అలా కాని పక్షంలో వేరే ప్రయత్నాలు చేయాలి కదా?"

"ఉహు, నాకవన్నీ ఇష్టం లేదు. ఎవరు కన్న బిడ్డ అయితేనేం మన ఇంటికొచ్చాక మనబిడ్డే అవుతుంది. ఆ మాత్రానికి కులం, మతం చూడాల్సిన అవసరమేమిటి? మన కులమతాలే మన బిడ్డ వీను... ఏమిటోయ్ నీకీ పిచ్చి"చిరునవ్వుతోనే అన్నాడు అర్జునరావు.

ఒళ్ళు మండిపోయింది ఈశ్వరికి.

"ఛీ. ఇదేం మాటలు, ఎవరు పడితే వాళ్ళు కన్న బిడ్డని తెచ్చి ఏ వివరాలు తెలుసుకోకుండా మన ఇంట్లో ఎలా చేర్చుకుంటారు? ఉహు... నేను చచ్చినా ఒప్పుకోను."

"సరేలే. నిన్ను ఒప్పుకోమని బలవంతం చేస్తున్నదెవరు? నీ ఇష్టం కాకుండా ఈ ఇంట్లో నా ఇష్టం ఏనాడు సాగింది కనుక. నేను మాత్రం ఏ ఊరికీ రాను. ఎవరితో ఏమీ చెప్పను. నీ ఇష్టం. ఏమయినా చేసుకో" అనేసి విసురుగా అటు తిరిగి పడుకుని కళ్ళు మూసుకున్నాడు అర్జునరావు.

ఈశ్వరి కింకా మాట్లాడాలనీ, అతన్ని సమాధానపరచాలనీ ఉంది. కానీ అతను నిద్రకుపక్రమించేసరికి తనకూ కోపం వచ్చేసింది. తను బిగుసుకుని, లైట్ ఆర్పేసి, ఇటుతిరిగి పడుకుంది.

ఈ గొడవ అంతా ఇద్దరి మనసుల్లో మరుగున పడి మళ్ళా ఆ ఇంట్లో మామూలు పరిస్థితులు ఏర్పడేందుకు మూడురోజులు పట్టింది.

పుట్టింటికి ప్రయాణం అయింది ఈశ్వరి. అర్జునరావు ఆమెను సంతోషంగానే సాగనంపేడు కానీ, వెంట రమ్మని ఎంతగా బ్రతిమాలుకున్నా, తను మాత్రం బయలుదేరలేదు.

ఈశ్వరి వెళ్ళటమూ అయింది. మూడు రోజులకూ తిరిగి రావడమూ అయింది. ఎంతో ఉత్సాహంగా వెళ్ళిన మనిషి, ముఖం వేలాడేసుకొని ఇంటికొచ్చింది.

ఆమె చెప్పకముందే జరిగిందేమిటో ఊహించగలిగాడు అర్జునరావు. అయినా ఏమీ తెలియనట్లే "విశేషాలేమిటి?" అని అడిగి చెప్పించుకున్నాడు.

"మా అమ్మతో విషయం చెబితే, నువ్వే వెళ్ళి అక్కనీ బావనీ అడుగు అన్నదండీ. వెంటనే బయలుదేరాను అక్క ఇంటికి.

అంత ఆశగా నేను వెళ్ళి నీ పిల్లల్లో ఒక్కర్నియ్యవే, నేను పెంచుకుంటానని అడిగితే, తోడబుట్టిన చెల్లెలు అన్న అభిమానం అయినా లేకుండా ఎన్ని మాటలు అన్నదో.

హు, అవన్నీ నా నోటితో చెప్పలేను. నాకు అహంకారమట... నా మొగుడు పెద్ద ఉద్యోగంలో ఉన్నాడని... అదెప్పుడూ అంతేనండీ.... మా బావ వ్యాపారంలో వేలకు వేలు సంపాదించి తెస్తున్నా సంతృప్తిలేదు. ఆయన ఎక్కువగా చదువుకోలేదని, హోదా గల ఉద్యోగం చేయటం లేదనీ చిన్నతనంతో కుళ్లుతూ ఉంటుంది" అంటూ కళ్ళు తుడుచుకుంది ఈశ్వరి.

"పోన్లెద్దూ ఆవిడేదో అన్నదని అంతగా బాధపడిపోవాలా? నిన్ను చూసినవాళ్ళెవరూ నీకు అహంకారమని అనుకోరులే."

"నలుగురు పిల్లల్ని పెంచుకోలేనంత గతిలేనివాళ్ళం కాదు లేయే అన్నదండీ. మరో నలుగురు పుట్టినా, మహారాజులా పెంచి పెద్దచేయగలరట.అసలు దీన్ని అడగడానికి ఎందుకొచ్చేనా అనిపించిందండీ.

పిల్లలను కననివాళ్ళకి పెంచటం ఏం తెలుస్తుంది? అలాంటివాళ్ళకి కడుపు తీపి తెలిసిన తల్లిదండ్రులెవరూ పిల్లల్ని పెంపకానికివ్వరు అని కూడా అనేసింది.

ఇంక ఊరుకోలేకపోయాను. నోటి కొచ్చినట్లు నేనూ నాలుగు దులిపాను. బావగారు వచ్చేదాకా ఉండటం కూడా దండుగ అనిపించి, వెంటనే బయట పడ్డాను, అక్కడినుంచీ"

ఇన్నీ విని అర్జునరావు అసలేమీ అనకపోయినా బావుండేది. కడుపులో దాచుకున్న మాటలన్నీ బయటకి వచ్చేశాక ఈశ్వరి మనసు శాంతించి ఉండేది.

"నాకు తెలుసోయ్ ఇలా అవుతుందని. అందుకే నేను రానన్నది."

"అవున్లెండి. మీ తెలివితేటలు అందరికీ ఎక్కడ్నించి వస్తాయి. అన్నీ తెలుసుకోగలరు మీరు. నేను బుద్ధిలేనిదాన్ని. సిగ్గు లేకుండా వెళ్ళి, మాటలు పడి వచ్చాను" అని ఎగిరిపడుతూ, భర్త ఎదురుగా ఉండకుండా లోపలికి వెళ్ళి పోయింది ఈశ్వరి.

తనతో మాటమాత్రం అనకుండా భర్త ఇంతపని చేస్తాడని ఈశ్వరి కలలో కూడా ఊహించి ఉండలేదు.

అర్జునరావు ఊళ్ళో లేడు. ఆఫీసుపని మీద ఊరువెళ్లాడు. రాత్రి పదిన్నరకి తలుపుకొట్టిన చప్పుడుకి నిద్ర మెలుకువ వచ్చింది ఈశ్వరికి.

లేచి వెళ్ళి తలుపు తీసింది. అతని భుజం మీద నాలుగేళ్ళ పసిబిడ్డ నిద్రపోతూ ఉంది. మరో చేతిలో సూట్‌కేస్ ఉంది.

చూస్తున్నది కలో నిజమో అర్థం కాలేదు ఈశ్వరికి. ఏం చేయాలో తోచని వెర్రిదానిలా అలాగే చూస్తూ నిలుచుండి పోయింది భర్తవైపు.

"పాపని లోపల పడుకోబెట్టు" అంటూ, ఆమెకు అందించాడు అర్జునరావు.

అనాలోచితంగానే పాపని ఎత్తి గుండెల కాన్చుకున్న ఈశ్వరికి ఎందుకో ఒళ్ళు జల్లుమన్నది. "ఎవరీ పాప?" అని మనసును తొలుస్తున్న సందేహ నివృత్తి ని వాయిదా వేసి, పాపని తీసుకెళ్ళి పక్కమీద పడుకోబెట్టింది.

అర్జునరావు చల్లనీళ్ళతోనే స్నానం చేసి వచ్చాడు. అంతరాత్రి అన్నం తినటం

కష్టం అని, అతను స్నానం చేసేసరికి, గబగబా పిండి తడిపి చపాతీలు తయారుచేసింది ఈశ్వరి.

పప్పు, చపాతీలు వడ్డించి, ఓ కప్పు బోర్నవిటా కలిపి అతనికి అందించింది. అతని ముఖంలో కనిపిస్తున్న అలసట గమనించి మౌనంగా ఉండిపోయింది.

అతను సిగరెట్ వెలిగించుకుందుకు అగ్గిపెట్టె అందిస్తూ అడిగింది, "ఎవరండీ ఈ పాప?" అని.

సీరియస్‌గా సిగరెట్ వెలిగించుకుంటూ అన్నాడు అర్జునరావు. "ఎవరు అంటే ఎవరో నాకే తెలియనప్పుడు నీకెలా చెప్పను? మన ఇంట్లో మన పాపగా పెంచుకుందామని తీసుకొచ్చాను."

"అంటే ఎక్కడ దొరికిందీ పాప మీకు?"

"దొరకడమేమిటి, అదేమయినా మనం పోగొట్టుకున్న వస్తువా?"

"పోనీ ఎక్కడ కనిపించింది? ఎక్కడినుంచి తెస్తున్నారు? మీ కెవరు అంటగట్టేరు చెప్పండి"

ఈశ్వరికి కోపం వచ్చేస్తోందని తెలుసు. కానీ ఏం చేయగలడు? అతనికి నిజంగానే తెలీదు, ఆ పిల్ల ఎవరో, పోనీ జరిగిన విషయం చెబుతాను అనుకున్నాడు.

"రాత్రి నే వచ్చిన రైల్లో నాతోటి ప్రయాణికుల్లో ఈ పిల్ల, వాళ్ళమ్మా ఉన్నారు. రాత్రి నిద్రలో చాలామటుకు అంతా జోగుతున్నారు. ఈ పిల్లని వదిలేసి వీళ్ళమ్మ ఒక్కతే అవతలికి వెళ్ళటం నేను చూసాను. బాత్‌రూంకి కాబోలు అనుకున్నాను.కానీ ఆ చీకట్లో రైలు ఒక బ్రిడ్జిమీద వెళుతుండగా, పెద్దగా కేకవేయడంతో ఆమె దూకేసిందని అర్థం అయింది. గొలుసు లాగి రైలు ఆపాం, కానీ ప్రయోజనం ఏమి లేకపోయింది. బ్రిడ్జికింద ఉధృతంగా ప్రవహిస్తున్న ఏటినీళ్ళలో, ఆ చీకట్లో మనిషి కోసమయినా, శవం కోసమయినా ఏమని వెతుకుతాం?

ఈ పిల్లనేం చేయాలి అన్న ప్రశ్న వచ్చింది. ఏ శరణాలయంలోనో చేర్పించమని అందరూ నాకే సలహా ఇచ్చారు. నేను మాత్రం అప్పటికప్పుడే నిర్ణయం చేసుకున్నాను. ఈ పాప మనతో ఉండాలని. అందుకే తీసుకొచ్చేసాను".

"ఇంత రాత్రివేళ మీరు మాత్రం ఇంతకన్నా ఏం చేస్తారు. ఉదయం ఆలోచించి, పోలీస్‌స్టేషన్‌లోనో, అనాధ శరణాలయంలోనో అప్పగిస్తే సరి" తేలికగా అన్నది ఈశ్వరి.

"వద్దు ఈశ్వరీ. ఈ పాపని మనమే పెంచుకుందాం. ఇలా జరగాలని రాసి పెట్టబడి ఉందేమో అసలు లేకపోతే, ఎప్పుడూ రిజర్వేషను లేకుండా ప్రయాణం చేయని నేను ఇలా జనరల్ కంపార్ట్‌మెంట్ ఎక్కవలసి రావటం ఏమిటి?"

"మీరొక్కరేనా నిర్ణయించుకోవలసింది? నా ఇష్టాఇష్టాలతో పనిలేదా? ఆ పిల్లని కన్నతల్లి ఎవరో ఏమిటో, ఏ అక్రమ సంబంధం వల్ల కలిగిన సంతానమో, ఛీ తలుచుకుంటే ఒళ్ళు జలదరిస్తుంది. ఇలాంటి దిక్కులేని అప్రాచ్యపు పిల్లని మనం పెంచుకోవడమేమిటి? వద్దు, నామాట వినండి."

"నిజంగా ఆ పిల్ల తల్లిదండ్రులే పాపమో చేసి ఉంటే, అందుకీ పసిబిడ్డ ఎలా బాధ్యురాలవుతుంది. అంతో ఇంతో చదువుకున్నదానిలా చాదస్తంగా మాట్లాడతావేమిటి?"

"చదువుకుంటే మాత్రమేం? కులం, మతం, ఆచార, సాంప్రదాయం అన్నీ వదిలేసి వీధిన పడాలా? ఆ పిల్లమీద అంత జాలి ఉంటే, ఏ అనాధశరణాలయంలోనో చేర్చి ధనసహాయం చేయండి, వద్దనను. మన ఇంట్లో ఉంటే మాత్రం నేను భరించలేను."

'ఓహో నీ నిర్ణయం అదే అయితే, నేనూ నా నిర్ణయం చెబుతున్నా చూడు. ఈ పిల్ల మనింట్లోనే ఉంటుంది. నువ్వేం దాన్ని సాకనక్కరలేదు. అన్నీ నేనే చూసుకుంటాను.

ఇంతవరకూ నేను, ఎప్పుడూ, ఏ విషయంలోనూ నీ మాటని కాదనలేదు. అన్నీ నీ ఇష్టంగానే జరుపుకుని వస్తున్నావు. కానీ ఈ ఒక్క విషయంలో నీకు చేతనయితే రాజీపడు. లేదా పట్టించుకోకుండా ఉండు.... అంతేగాని నన్ను వేధించొద్దు ఈశ్వరీ" అంటూ నిద్రపోతున్న పాప పక్కన పడుకున్నాడు అర్జునరావు.

అంతే. ప్రచ్ఛన్న యుద్ధానికి అదే ప్రారంభం. భార్యాభర్తలిద్దరి మధ్యా కళ్ళకు కనిపించని తెరలేవో దిగినట్లయింది.

కలత నిద్రలో రాత్రి గడిపిన  ఈశ్వరి బాగా పొద్దెక్కేదాకా  నిద్ర లేవలేదు. కళ్ళు తెరవగానే పక్కన మంచంమీద  భర్త, అతని మెడచుట్టూ చేతులేసి నిద్రపోతున్న పాప కనిపించారు.

రాత్రి హడావిడిగా సరిగ్గా గమనించలేదు ఈశ్వరి. ఇప్పుడు ఉదయపు వెలుగులో పరిశీలనగా పాప ముఖంలోకి చూసింది. నల్లగా, ఒత్తుగా, మెడదాకా మాత్రం ఉన్న జుట్టు వంకరలు తిరిగిముఖాన పడి నుదురునంతా కప్పేసింది. నిద్రలో మూసుకుని ఉన్న చిన్న కళ్ళు, కొద్దిగా రోజారంగు కనిపిస్తున్న  పలుచని బుగ్గలు, సున్నాలాగా చుట్టినట్లున్న పెదవులు , చిన్నారి ముక్కుతో రబ్బరు బొమ్మలా ఉంది.

లేచి వెళ్ళి స్నానం చేసి పూజగదిలో కూర్చుంది. ఎప్పటిలా విష్ణుస్తోత్రం, లలిత సహస్రనామాలు పారాయణం చేసుకుంది.  కనులు మూసుకుని, తనకు సంతానాన్ని ప్రసాదించమని దేవుణ్ణి కోరుకుంది. వెంటనే అవతల నిద్రలో ఉన్న పాప ముఖమే కన్నులముందు సాక్షాత్కరించింది. 'ఛీ, పాడుపిల్ల' అనుకుని అపరాధం అయినట్లు చంపలు వాయించుకుని  లేచి ఇవతలి కొచ్చేసింది.

పాపకు శైలజ అని పేరుపెట్టి, ఇంటికి దగ్గరగా ఉన్న ఒక నర్సరీ స్కూల్లో చేర్చాడు అర్జునరావు. స్కూల్లో పాపని వదిలి, తీసుకురావడానికి, మధ్యాహ్నం అన్నం తినిపించటానికీ ఆయాను  ఏర్పాటు చేశాడు. ఉదయం ఇంట్లో ఉన్నంతసేపు  పాప అవసరాలన్నీ తనే చూసుకుని  ఆఫీసుకు వెళుతున్నాడు.

ఈశ్వరి కిదంతా కంటగింపుగా ఉంది. అసలీయన కెందుకింత పట్టుదల, ఈ పిల్లని గురించి, ఆయన చెప్పినదంతా  నిజమేనా అసలు? లేదా ఇంకేదయినా తనకు తెలీని కథ ఉన్నదా అని అనుమానం కూడా రాకపోలేదు. ఒకటి రెండుసార్లు, కానీ ఇన్నేళ్ళ కాపురంలో భర్త అబద్ధం చెప్పటం ఆమె ఎన్నడూ  ఎరుగదు. తను ఏ పని చేసినా, తప్పయినా, ఒప్పయినా, పైకి చెప్పేందుకు జంకే మనిషి కాదు అతను. అందుకే అతను చెప్పిందే నిజం అయి ఉండాలని నమ్మింది చివరికి.

అతను మాత్రం ఏమీ జరగనట్టే మసులుకుంటున్నాడు. అవసరం అయినప్పుడు ఈశ్వరితో మామూలుగానే మాట్లాడుతున్నాడు.

ఈశ్వరి తనూ అలాగే ప్రవర్తించాలని ప్రయత్నిస్తోంది. కానీ, ఇద్దరి మనసులు ఎంత దూరం అయాయో, అందువల్ల ఎంత అశాంతిగా ఉందో ఇద్దరికీ తెలుస్తూనే ఉంది. అయినా ఒకరిది పంతం అయితే, మరొకరిది పట్టుదల అయికూర్చుంది.

ఆవేళ సాయంత్రం అర్జునరావు ఇల్లు చేరేసరికి కొద్దిగా ఆలస్యం అయింది. శైలజ లాన్‌లో మట్టితో ఆడుతూ ఉంది. బొమ్మలు పెట్టుకుని. స్కూటర్ శబ్దం వినిపించగానే, చేతులు గౌనుకి తుడిచేసుకుని, గేటు దగ్గరకి పరిగెత్తి వెళ్ళింది.

"ఇంత లేటయిందేం నాన్నా, నేనొచ్చి ఎంత సేపయిందో" అని పలకరించింది.

"సారీ బేబీ... కొంచెం పని ఉండి ఆలస్యం అయిపోయిందమ్మా" అని రెండుచేతుల్తో శైలజని ఎత్తుకుని లోపలికొచ్చాడు అర్జునరావు.

"డ్రస్ మార్చుకోవాలి కదూ నువ్వు" అంటూ తనే అతని ఒళ్ళోంచి దిగేసింది శైలజ.

"వద్దులేమ్మా మనం షికారుకి వెళ్ళద్దూ. కాఫీ తాగేసి వచ్చేస్తాను. నువ్వు పాలు తాగేవా?"

"ఊ.. ఉండు అయితే నేను ముఖం కడుక్కుంటాను" అంటూ తుర్రుమని లోపలికి వెళ్ళిపోయింది.

ముఖం కడుక్కోవడమంటే పూర్తిగా బట్టలు తడిపేసుకుంటుందని తెలుసు. అందుకే రెండు గుక్కల్లో కాఫీ తాగేసి బాత్‌రూం దగ్గరికి పరిగెత్తాడు అర్జునరావు.

పాపను రెడీ చేసుకుని, షికారుకి తీసుకుని బయలుదేరాడు స్కూటర్‌మీద.

చాలామట్టుకు రోజూ జరిగే తంతు ఇదే. అంతా చూస్తూ, కోపంతో మండిపోవడమే కానీ, ఏం చేయలేకపోతోంది ఈశ్వరి. తనిలాగే మొండికేస్తే, అతను విసిగిపోయి, భయపడి, ఎప్పటికయినా ఈ పిల్లని ఏ అనాథ శరణాలయానికో పంపించేస్తాడన్న నమ్మకం, రోజులుగడిచిన కొలదీ సడలిపోతోంది.

ఆ పిల్ల 'నాన్నా' అని పిలిచినప్పుడంతా ఈశ్వరి మనసు కలచివేసినట్లు అవుతుంది. వాళ్ళిద్దరూ తన ఉనికిని మరిచిపోయి కథలు, కబుర్లు చెప్పుకోవటం చూసినప్పుడల్లా ఉక్రోషంతో ఉడికి పోయినా, ఈ పిల్లే తమకి కావలసినవారెవరి బిడ్డో అయితే ఎంత బావుండేది అనిపిస్తుంది.

‘అమ్మ ఎందుకలా కోపంగా ఉంటుంది? నాతో మాట్లాడదేం? అని రోజుకొక్కసారయినా అడక్కుండా ఉండదు శైలజ.

“ఆవిడ అంతేనమ్మా, నాతోనూ మాట్లాడదు. పోనీ మనమే కబుర్లు చెప్పుకుందాంలే” అని సర్దిచెపుతూ ఉంటాడు అర్జునరావు.

వచ్చిన నెలరోజులకే బొద్దుగా ముద్దబంతి పువ్వులా తయారయింది శైలజ “ఎంతముద్దుగా ఉందో” అని ఎప్పుడయినా అనిపించినా, దగ్గరకి తీయటానికి మాత్రం చేతులు రావు ఈశ్వరికి, “ఆయనయితే, ‘సర్వం జగన్నాథం’ అని ఇంట్లో కలిపేరు కానీ, ఆ పిల్లని నేనెలా అక్కున చేర్చుకునేది” అనిపిస్తుంది.

చీకటి పడుతుండగా పాపతో ఇల్లు చేరాడు అర్జునరావు. ఎప్పటిలా స్కూటర్‌దిగి లోపలకి నడుచుకు రావలసిన శైలజని అతను భుజం మీద వేసుకుని రావటం చూసింది ఈశ్వరి. ఏమయిందో అనుకుంది కానీ అడగలేక పోయింది.

కళ్ళు మూసుకుని ఉన్న పాపని పదిలంగా మంచం మీద పడుకోబెట్టి మళ్ళీ బయలుదేరాడు అర్జునరావు.

“నేవెళుతున్నా తలుపేసుకో ఈశ్వరీ. పాపకి జ్వరం వచ్చినట్లుంది. ఏదయినా ముందు తెస్తాను” అంటూ వెళ్ళిపోయాడు.

ఆ రాత్రి ఇద్దరికీ జాగరణే అయింది,

పాపకి టెంపరేచర్ బాగా ఎక్కువయింది. పిచ్చిదానిలా నిద్రలో ఏదో మాట్లాడుతూ ఉంది.

తను తెచ్చి వేసిన మందు వల్ల ఫలితం ఏమీ కనిపించక అర్జునరావు పదిన్నరకి వెళ్ళి డాక్టర్ని పిలుచుకొచ్చాడు.

అతను వ్రాసి ఇచ్చిన మందులు రాత్రంతా గంట గంటకీ శైలజ చేత మింగిస్తూ నుదట తడిచేస్తూ కూర్చునే ఉన్నాడు. ఈశ్వరికి ఏం చేయటానికి తోచకుండా అయింది.

భర్త పడుతున్న బాధ చూస్తే, ఒక వైపు జాలేస్తోంది. ఏమిటో దారిన పోయే తద్దినాన్ని తెచ్చి తల మీద పెట్టుకుని ఇంత శ్రమ పడుతున్నారు అని మరోవైపు చిరాకుగా ఉంది.

తెల్లవారుజామున కొద్దిగా నిమ్మళించింది శైలజకి.  కలవరింతలు లేకుండా నిద్రపోతోంది. అప్పుడే కొంచెం సేపు విశ్రాంతి తీసుకుని ఆఫీస్‌కి బయలుదేరాడు అర్జునరావు.

"పది నిమిషాల్లో  సెలవు పెట్టి వచ్చేస్తానింటికి" అని చెప్పి వెళ్ళిపోయాడు.

పది నిముషాల్లో వస్తానన్న మనిషి గంటయినా పత్తాలేదు. పదిన్నరకి కాబోలు ఆఫీసు జవాను వచ్చాడు. స్కూటర్  తీసుకుని.

"అయ్యగారు అర్జంట్‌గా కేంపు వెళ్ళాల్సొచ్చిందమ్మా. మూడురోజులకి బట్టలు సర్దియ్యమన్నారు. ఇంటి కొచ్చేందుక్కూడా టయిం లేదట" అన్నాడు హడావిడిగా. చీటి ఒకటి అందిస్తూ.

అర్జునరావుకిలాంటి అర్జంటు కేంపులు మామూలే. అందుకే చీటీని విప్పి చదువుకుంది.

"ఈశ్వరీ,

సారీ, ఇంటికి వచ్చి వెళ్ళేందుకు  టయింలేదు. ఫైల్సుకొన్ని సరిచూసుకొని, ట్రెయిన్ అందుకోవాలి. మూడురోజులవుతుందేమో, తిరిగి రావటానికి.

నిన్నరాత్రి అనుభవంతో నా నిర్ణయం  పొరబాటేమో అనుకోవలసి వచ్చింది. ఎవరో కన్నబిడ్డని తెచ్చి అమ్మా నాన్నా రెండూ నేనే అయి పెంచుదాం అని అనుకోవటం ఎంత తెలివితక్కువో తెలిసింది. నేనే ఓడిపోయాను ఈశ్వరీ! తిరిగి ఇంటికి రాగానే, శైలజని ఎటయినా పంపించే ఏర్పాటు చేస్తాను.

అంతవరకూ కాస్త కనిపెట్టుకుని ఉంటావు కదూ? నా కోసం అయినా, దానికి నువ్వు అమ్మవి కానక్కర్లేదు. మామూలు మనిషిగా, సాటిమనిషి పట్ల చూపించాల్సిన  మానవత్వపు దృష్టితో అయినా జ్వరంతో మంచాన ఉన్న ఆ పసిదాని మంచి చెడ్డలు చూస్తావని ఆశిస్తున్నాను.

నువ్వు రోజూ పూజలు చేసే దేవుడు నీ పూజగదిలో, పటాల్లో విగ్రహాల్లో మాత్రమే ఉన్నాడని అనుకుంటావు కదూ? ఎంత పిచ్చిదానివి నువ్వు. ఈ ప్రపంచంలో ఆ దేవుడు సృష్టించిన ప్రతీ ప్రాణిలోనూ ఆయన అంశ ఉంటుందని నీకెప్పుడూ

అనిపించదూ? అంత దైవ భక్తి ఉన్న నీ మనసు మరికాస్త విశాలమయి ఉంటే ఎంత బాగుండేది?

పోనీలే ఉంటాను మరి టయిం అవుతోంది.

ప్రేమతో, 'అర్జున్' అని ఉంది.

అప్పటికప్పుడే ఉత్తరాన్ని ఎన్ని సార్లు చదువుకుందో, చదువుకుంటూ ఆలోచిస్తూ, ఎంతసేపలా కూర్చుండి పోయిందో ఈశ్వరికి గుర్తేలేదు.

శైలజకి మెలకువ వచ్చిందేమో 'నాన్నా' అని పిలుస్తోంది. నీరసంగా ఉత్తరాన్ని తీసిపెట్టి పాప దగ్గరకి నడిచింది ఈశ్వరి.

ఆమెని చూసి కళ్ళు చిట్లిస్తూ "నాన్న లేడూ?" అడిగింది.

'ఉహు' అంది ఈశ్వరి ఇంకేం చెప్పాలో తెలియలేదు. దగ్గరకి వెళ్ళి నుదురు తాకి చూసింది. జ్వరం లేదు అనుకుని సంతృప్తి పడింది. చిత్రంగా తన ముఖంలోకి చూస్తున్న శైలజని, "పాలు తాగుతావా?" అనడిగింది.

"అప్పుడే ఆఫీసుకు పోయాడా నాన్నా"

"ఊరెళ్ళారు. ఇప్పుడే రారు. ముఖం కడుక్కుందువురా" అని చేతులుచాచి ఎత్తుకోబోయింది.

ఇదేమీ గమనించనట్లుగా శైలజ తనే లేచి బాత్‌రూమ్‌కి నడుచుకుని, వెళ్ళిపోయింది. గౌను ముడుచుకుని, గొంతుక్కూర్చుని పళ్ళు తోముకుంది. రాత్రంతా జ్వరంతో మూలుగుతూ ఉన్న పిల్ల తెల్లారేసరికి అంత హుషారుగా తిరగడం ఆశ్చర్యంగా ఉంది ఈశ్వరికి.

కానీ పాలుతాగేసి ఆడుకోకుండా శైలజ మళ్ళీ వెళ్ళి పడుకుంది. దాంతో విషయం అర్థమయిపోయింది. నాన్న లేడు. ఇప్పుడే రాడు అని తెలిసిన తర్వాత తన పనులు తనే చేసుకోవాలని తెలుసుకున్నందుకే నీరసంగా ఉన్నా లేచి తిరిగిందన్నమాట.

"పసిబిడ్డ అయినా ఎంత పట్టుదల" అనుకుంది ఈశ్వరి.

హఠాత్తుగా గుర్తొచ్చినదానిలా, "నేను స్కూలుకు వెళ్ళొద్దా" అనడిగింది శైలజ.

"ఒద్దులే, జ్వరం బాగయాక పోదువుగాని" అని చెప్పింది.

ఆవేళ రెండుపూటలా కొద్దిగా బ్రెడ్, పాలు ఇచ్చింది శైలజకి. రాత్రయేసరికి, మళ్ళీ అడిగింది. "నాన్న రాలేదేం?" అని.

"ఊరు వెళ్ళాడు కాదూ, ఇప్పుడే రాడు"

మాట్లాడకుండా మంచంమీద మూలకి ముడుచుకుని పడుకుంది శైలజ. ఈశ్వరి మనసు పరిపరి విధాల పోతోంది. ఉదయం పదేపదే చదువుకున్న భర్త ఉత్తరంలో మాటలో గుర్తొచ్చి కలవర పెడుతున్నాయి.

అర్ధరాత్రి నిద్రలో "నాన్నా నాన్నా" అని కలవరిస్తోంది శైలజ. ఉలిక్కిపడి లేచిన ఈశ్వరీకి, అంతదాకా తను లైట్ కూడా ఆర్పకుండా నిద్రపోయానని గుర్తొచ్చింది.

పాపకి మళ్ళీజ్వరం వచ్చిందేమోనని చూసింది. దగ్గిర కూచుని, మెల్లిగా జో కొట్టింది. కొంతసేపు పాప చిన్నారి చేతిని తన చేతిలో ఉంచుకుని, అలాగే నిద్రపోయింది.

శైలజ ఇప్పుడు బాగుంది. స్కూలుకి వెళ్ళి వస్తూంది. అర్జునరావు కేంపు ఇంకా మూడురోజుల పొడిగించబడింది.

ఇష్టంగానో అయిష్టంగానో శైలజకి దగ్గరవటం తప్పనిసరి అయింది ఈశ్వరికి. మధ్యాన్నం నుంచీ తలనొప్పిగా ఉంది ఆమెకు. సాయంత్రం ఇంటికి రాగానే పసికట్టేసింది శైలజ. "డల్‌గా ఉన్నావేం?" అనడిగింది. పాలల్లో బిస్కెట్ అద్ది కొరుక్కుని తింటూ.

జవాబు చెప్పకుండా కణతలు నొక్కుకుంటూ పడుకుంది ఈశ్వరి. "తల నొప్పికదూ? తైలం రాసుకుంటే పోతుంది" అంటూ ఎక్కడనుంచో అమృతాంజనం సీసా తెచ్చి పక్కమీద కూర్చుంది.

ఈశ్వరి జవాబు కోసం చూడకుండా, తన చిన్న వేళ్ళతో తైలాన్ని అద్దుకుని ఆమె నుదుటికి రాసి మెల్లిగా నొక్కుతూ ఉంది శైలజ.

"నాన్న ఇవాళే వస్తాడా?"

"అవును"

"నాన్న వచ్చాక కూడా నా దగ్గిర నువ్వే పడుకోవూ?"

సరిగ్గా అప్పుడే ఊరినుంచీ వచ్చిన అర్జునరావు ఇంట్లోకి రావడమూ, నేరుగా లోపలికొచ్చి వీళ్ళిద్దర్నీ చూడటమూ జరిగింది.

ఈశ్వరి తప్పు చేస్తూ పట్టుబడిన దానిలా గభాలున లేచి కూర్చుంది. ఈ కొన్నిరోజుల సాన్నిహిత్యానికే, ఆ పసి పాప తన మీద ఏర్పరచుకొన్న ప్రేమాభిమానాన్ని జీర్ణించుకోలేకుండా ఉంది మనసు.

దుస్తులు మార్చుకుంటూ, "ఏమిటోయ్ సుస్తీనా?" అడిగాడు అర్జునరావు.

"అబ్బే లేదు. కొద్దిగా తలనొప్పిగా ఉంటేను, అమృతాంజనం రాస్తానని తనే కూర్చుంది శైలజ."

'ఓహో' అన్నాడు ఏదో అర్థమయిన వాడిలా. సాయంత్రం అంతా తండ్రీ కూతుళ్ళిద్దరూ కరువుదీరా కబుర్లు చెప్పుకున్నారు తన కోసం అతను తెచ్చిన కొత్త ఫ్రాక్ వేసుకుని మురిసిపోతూ వెళ్ళి ఈశ్వరికి చూపించింది. 'బావుందామ్మా?' అంటూ.

శైలజ తన్ని 'అమ్మా'అని పిలవటం ఎప్పటినుంచి ప్రారంభించిందీ ఈశ్వరికి గుర్తులేదు. "చాలా బాగుందమ్మా" మనస్ఫూర్తిగా అన్నది.

రాత్రి శైలజ నిద్రపోయేక, "సారీ, బాగాట్రబుల్ ఇచ్చిందా శైలూ.... బాగా తిట్టుకుని ఉంటావు కదూ నన్ను' అనడిగాడు అర్జునరావు.

"అబ్బే. అదేంలేదు." తడబడింది ఈశ్వరి. ఏదో చెప్పాలనుంది ఆమెకి. మాటలు అందటం లేదు.

"హైద్రాబాద్‌లో ఒక కాన్వెంట్ స్కూల్లో చేర్పిద్దామనుకుంటున్నా శైలజని. పెద్దగా ఖరీదయిన స్కూలేం కాదు. నెలకి వందరూపాయలు పంపితే చాలు. అదయినా నీకిష్టమయితేనే... లేదంటే దిక్కులేని వాళ్ళని చేర్చుకునే అనాథ శరణాలయమేదో ఒకటి దొరక్కపోదు."

మంచం మీద బాసింపట్టు వేసుక్కూర్చుని మాట్లాడుతున్న అర్జునరావు, ఈశ్వరి ముఖంలోకి చూడటంలేదు.

అందుకే ఏడుపు గొంతుతో, ఏమండీ, నన్ను 'క్షమించరూ' అంటూ ఆమె తన ఒడిలో తలదాచుకునే సరికి  బిత్తరపోయి నిమురుతూ.

"నేనెంత మూర్ఖురాల్నో తెలుసుకున్నాను. ... శైలజ మనతోనే ఉంటుంది. 'అమ్మా' అని పిలిచే దాని పిలుపునుండి దూరం కాలేను.. మీరింకేం చెప్పొద్దు"అంటున్న భార్య తలని గుండెలకి అదుముకున్న అర్జునరావు కళ్ళకి నీటి పొర ఏదో అడ్డు పడినట్లయి, కళ్ళు మూసుకున్నాడు.

# దోపిడి

**- ముదిగంటి సుజాతారెడ్డి**

నెల రోజులనుంచి పొలం కొయ్యడం ధాన్యం నూర్చడం బస్తాలకెత్తడం పనులతో నర్సమ్మ ఒళ్ళంతా హూనమైంది.

రోహిణికార్తె ప్రవేశం కన్నా ముందే ఎండిపోయింది పొలంబావి. మృగశిరకార్తెలో పడ్డ కాస్త వర్షాలకు బావిలో ఇన్ని నీళ్ళూరాయి. ఆ నీళ్ళతోనే కష్టంగా పొలాన్ని తడిపి యాదయ్య దున్ని చదును చేశాడు. మంచి విత్తనాలనెంచుకొని వడ్లు కొనుక్కొచ్చి నారు పోసాడు. పొద్దున్నే నాటు పెట్టాలని నర్సమ్మ చంకలో పిల్లాన్ని వేసుకొని మొగునికి అన్నం ఇంత చింతకాయ తొక్కు మూటలో కట్టుకొని పొలానికి వచ్చింది.

“పోరగాన్ని ఇంటికాడనే ఒదిలెయ్యక అన్ని ఎందుకు మోసుకొచ్చినవే! ఆడు పని చెయ్యనిస్తడ నిన్ను!” అని కోపానికి వచ్చాడు ఆమె భర్త యాదయ్య.

“ఈన్ని ఇంటికాడ వుంచితే ఏడ్వడ! ఏడిస్తే ఆన్ని గిక్కడకి ఎవరు తీస్కోస్తరు? మీ అమ్మకు కండ్లు సక్కంగ కనపడ్తలేవు. పొరలు ఒచ్చినయి. గా పొరలు పట్నం పోయి తీయించుకు రమ్మంటే పోకపోతివి! వండి పెడ్తే తింటున్నది, కుక్కి మంచంలో పడి వుంటున్నది. ఆ ముసల్దానికి కండ్లుంటె నాకింత ఆసరైతదంటె ఇనవు!” అని విసుక్కుంది నర్సమ్మ.

ఏడాదినర్ధం కొడుకు నర్సమ్మ చంకలోనే నిద్రపోయాడు. వాన్ని పొలం గట్టుమీదున్న చెట్టునీడలో గుడ్డవేసి పడుకోబెట్టింది. వాడివైపు కాస్సేపు పరీక్షగా చూసింది నర్సమ్మ.

“ఈడు గింత బువ్వ తింటె బాగుండును. బువ్వ చూస్తేనే ఓకరిచ్చుకుంటున్నాడు. నా రొమ్ములు పాల కోసం రగ్తం వచ్చేదాకా పీల్చేస్తున్నడు! మళ్ళేమైందో నాకు– అసలే కూడు సయిస్తలేదు. నీరసం ఎక్కువైంది.”

‘మల్ల నెల తప్పినట్లున్నవే పిల్లా! అన్నది అత్త. గట్లయితే పొలం పనులెట్ల అని గుబలయితున్నది!” అనుకొని లేని ఉత్సాహం తెచ్చుకొని నర్సమ్మ నాటు వేసేందుకు పొలం లోకి దిగింది. బురదలోకి కాళ్ళు మోకాళ్ళ వరకు దిగినయి. బురద అంటకుండా నర్సమ్మ చీర పైకెత్తి గోచీ పెట్టుకుంది. బురదలో రెండు కాళ్ళూ దూరంగా పెట్టి పాదాలు బలంగా అణిచిపెట్టి ఒంగి దబదబా నాటు పెట్టడం మొదలుపెట్టింది నర్సమ్మ.

అంతకుముందే యాదయ్య పొలంలో ఓ మూలకు పోసిన వరినారు పీకి చిన్నచిన్న కట్టలుగా కట్టి పొలంలో అక్కడోటి అక్కడోటి వేసి పెట్టాడు. తీరికగా చుట్ట తాగుతూ పొలం గట్టుమీద కొడుకు దగ్గర కూర్చున్నాడు. కూర్చున్న యాదయ్య మారాజు లాగా కన్పించాడు.

నర్సమ్మ ఒక్కతె పొలం నాటు వేసుకుంది. కూలికి ఎవర్నైనా పెట్టుకుంటే ఖర్చు అని నర్సమ్మ భర్త కూలికి పిలుస్తానన్నా వద్దంది. తర్వాత ఒక్కతె కలుపు తీసుకుంది. పొలానికి ఎరువులు వేసేటప్పుడు పురుగుమందు కొట్టేటప్పుడు నర్సమ్మ యాదయ్య వెంటవుండి సాయపడింది. నర్సమ్మ కష్టం ఫలించి ఆయేడు పంట బాగానే పండింది.

“బురదలో ఎండనక వాననక కష్టపడ్తే ఇన్ని గింజలు ఇంటికి వచ్చినయి. ఆటిల్లో రెండు బస్తాలను తిండికి వుంచుకొని కడుమ ధాన్యం అమ్మి అప్పు కట్టాలె! గీ అప్పు తీరితే బేంకోళ్ళు మళ్ళ అప్పు ఇస్తమన్నరు. గీసారి అప్పు పైసల్తో బావిలో బోరు ఏయించాలె! గప్పుడు నీళ్ళకు కరువుండదు. ఏడాదికి రెండేంది మూడు పంటలు పండిచ్చుకోవచ్చు. గిప్పుడేందో కొత్త కొత్త వంగడాలు ఒచ్చినయంట! తక్కువ కాలంలోనే పంట చేతికి ఒస్తదంట! ఏడాదికి మూడు పంటలు పండించుకుంటే ఇగ గా అప్పు కూడా జల్దే తీర్చుకోవచ్చు!” అనుకుంది నర్సమ్మ.

“గిప్పుడే పచ్చిధాన్యం అమ్మితే ధరతక్కువే పలుకుతది! కానీ ధాన్యం అమ్మకుండ గుమ్ముల్లో పోసుకుంటె ఎండి తరుగుపోతయి ఇగ ఎలుకలిన్ని తింటయి. గదీ అంతకే దిగుతది! ఇంకో దిక్కు బేంకు అప్పు వడ్డీ పెరుగుతది! ఎంతో అంతకు గిప్పుడే ధాన్యం అమ్మి అప్పు కడ్తే మంచిది! వరి ఈనినప్పుడు వరి కంకులు పండబారినప్పుడూ

బేంకోళ్ళు వచ్చి చూసిపోయిండ్రు. ఇగ అప్పు కట్టకుంటే ఏమంటరో! ఇప్పుడు అప్పు జల్దీ కడ్తే మళ్ళ అప్పు బరోసాతోటి బిరాన ఇస్తరు!" అని నర్సమ్మ బ్యాంకు అప్పు తొందరగా కట్టాలని ఆరాటపడింది.

వ్యవసాయం పనులకు బ్యాంకు అప్పు ఇస్తుందని నర్సమ్మ పినతల్లి కొడుకు రాజయ్య చెప్పాడు. రాజయ్య పట్నంలో ఉద్యోగం చేస్తున్నాడు. ఒకరోజు చుట్టపు చూపుగా అక్క నర్సమ్మ ఇంటికి వచ్చాడు. వాళ్ళు ఒక ఎద్దుతో మరో ఎద్దు జోడిలేక ఈయేడు వ్యవసాయం ఎట్లా చేద్దామని బాధపడటం చూసాడు. మంచి విత్తనాలు కొనాలన్నా డబ్బు కావాలి! ఎరువులకూ పురుగుమందులకూ డబ్బు కావాలి! వ్యవసాయమంటే పెట్టుబడి వుండాలి! కేవలం రెక్కల కష్టంతో ఈకాలంలో వ్యవసాయాలు సాగవు. అక్కబావల పరిస్థితిని చూసి రాజయ్య ఉపాయం చెప్పాడు.

"బావా! ఎవసాయం పనులకూ ఎడ్లు కొనుక్కునేందుకు సన్నకారు రైతులకు బ్యాంకులు లోనులిస్తయి. మల్ల పంట పండినంక లోను కట్టుకోవచ్చు. ఒడ్డీ ఏమంత వుండదే అక్కా!" అన్నాడు.

"ఒరే తమ్ముడా! గా అప్పు ఎట్ల దొర్కుతదో జర్ర సూడరా!" అని నర్సమ్మ పట్నం పోతున్న తమ్మున్ని బతిమాలింది.

"గదెంతపనే! గిప్పుడే నాతో బావను తోలు నేను బావకు బ్యాంకు లోను ఇప్పిచ్చే తోల్త" అన్నాడు రాజయ్య ఆత్మవిశ్వాసంతో.

రాజయ్యతో భర్తను పంపించలేదు నర్సమ్మ. కాని రాజయ్య వెళ్ళిన నాటినుంచి నర్సమ్మ పోరు మొదలైంది.

"ఎవసాయం పనులు ముంచుకొస్తున్నయి. మిగశిర ఒచ్చేస్తున్నది. ఎద్దు లేకపోతే ఒక్క ఎద్దుతో పొలమెట్ల దున్నతం! జల్దిపోయి గా అప్పు – గదే బేంకులోను తీస్కరా! ఎందుకు ఎన్క ముందాడుతున్నవు!" అని నర్సమ్మ జోరీగలాగా వెంటపడ్తే యాదయ్య పట్నం పోవాలని చివరకు తయారయ్యాడు. కాని కష్టపడి పైసలు ఖర్చుపెట్టుకొని పోతె పని అయితదో కాదో అని యాదయ్యకు సందేహం.

"గా రాజయ్య ఏతులమారి! గట్లనే మాట్లాడ్తడు! అని తోటి ఏ పనీగాదు! ఊకెనన్నా పొగబెట్టి పోయిండు!" అని యాదయ్య యాష్టపడ్డాడు. ఏ పనికీ ముందుకు దూకని స్వభావం అతనిది.

'గా రాజయ్య నీ తమ్ముడు గదా! నువ్వే పోరాదె! నువ్వు పోతె పని జల్ది అయితదేమో!" అన్నాడు యాదయ్య పట్నం పోవడం తప్పించుకోవాలని.

"ఏందయ్య గట్లఅంటవు! బూమి నీ పేర వుంది అప్పు నీకు ఇస్తరు గాని ఏమీలేని ఆడదానికి నాకెందుకిస్తరు! ఇగ మాటలు పక్కకుపెట్టి జల్ది పట్నం పోయి గా అప్పు సంగతి ఏదో సూడరాదు! పొలం పనులు మొదలుపెట్టాలంటె ముందల ఎద్దుగావాలె! ఎద్దు గావాలంటె అప్పులేంది కాదు!" అంది నర్సమ్మ.

యాదయ్య ఆమె పోరు పడలేక బయల్దేరాడు. చివరకు వెళ్ళేటప్పుడు కూడా "నువ్వు రారాదే ఇద్దరం పోతె పని జల్ది అయితది. నాకేమో"– నసిగాడు యాదయ్య.

"గీ పోరగాన్ని ఏసుకొని నేను రావాలంటె తిప్పలయితది. గంతేగాదు. అత్త ఇంట్ల ఒక్కతె ఎట్ల రావాలె. గిదంత ఇడిసిపెట్టి! బయమెందుకు నువ్వు పో! పోతె రాజయ్య వున్నడు గద. అంత ఆడే సూసుకుంటడు. అప్పు ఇప్పిస్తడు! ఇగో ఆ పైసలు తీస్కొని ఒచ్చేటప్పుడు బస్సులో జాగర్త! బస్సుల్లో కీసలు కత్తిరిచ్చి పైసలు కొట్టెటోళ్ళుంటరు! జాగర్త మరి!" హెచ్చరించింది నర్సమ్మ.

"సరేలేవే! నాకు ఎరికే! జాగర్తగనే వుంట!" అంటూ యాదయ్య పట్నం వెళ్ళాడు.

బ్యాంకులో పనిచేసే ఒకతను తెలుసునని రాజయ్య యాదయ్యను అతనింటికి తీసుకెళ్ళాడు. రాజయ్య అతన్ని అప్పు గురించి అడిగాడు.

"మా బ్యాంకు సన్నకారు రైతులకు అప్పులిస్తున్నది. నిజమే. వ్యవసాయం పనులకు అంటె విత్తనాలకు ఎరువులకు అప్పులిస్తున్నది" అన్నాడు బ్యాంకు ఉద్యోగి.

'గా అప్పు మా బావకిప్పియ్యాలె సార్! ఒక్క ఎద్దుతో ఈయేడు ఎవసాయం సాగేటట్లు లేదు" అన్నాడు రాజయ్య.

"అప్పు ఇప్పించే భారం నాది. కేవలం యాదయ్య సంతకం. అదే వేలిముద్ర వేస్తే చాలు. మిగతా పనంతా నేను చూసుకుంటాను. లోను శాంక్షన్ చేయించి చేతిలో పెడ్త! కానీ!" ఆగాడతను.

"చెప్పండి సార్! మీరు పనిచేసి పెడ్తే మీ కష్టం వుంచుకునెటోళ్ళం కాదు సార్! సెప్పండి" అన్నాడు రాజయ్య.

"ఆ!ఁ ఏం లేదు. లోను సాంక్షన్ చేయించినందుకు నాకూ ఏదో ఇంత ముట్టాలి గదా! అదంతా మీకిష్టమైతేనే లోను వ్యవహారం చూస్తాను. లేకపోతే" –అన్నాడతను.

"మరి మా బావ పట్నంల ఎక్కువ రోజులుండడు సార్! రేపే పోతనంటున్నడు. గంత జల్ది అయితదసార్?" అడిగాడు రాజయ్య.

"అదంతా చేసేది నా భారం. లోను రేపటివరకు కావాలంటున్నవు గాదా! సరే! రేపు మధ్యాహ్నం కల్లా సాంక్షన్ చేయించి నీ చేతిలో డబ్బు పెడ్త! చాలునా!" అన్నాడతడు.

రాజయ్య యాదయ్య వైపు చూసాడు.

"మరేమంటవే బావా! లోను ఇప్పిచ్చినందుకు కమిషను అడ్గుతుండు. సరే నంటవా?" అడిగాడు రాజయ్య.

యాదయ్య కాస్సేపు మాట్లాడలేదు. ఆలోచించి తలూపాడు.

"కానీ! ఏం జేస్తం. ఎంతకో అంతకు. నువ్వు ఎట్ల జెప్తే గట్లనేరా! గిప్పుడు పైసలు అక్కరున్నయి. ఎక్కడికి పోతం!" అని ఒప్పుకున్నాడు యాదయ్య.

బ్యాంకు ఉద్యోగి తన కమిషను తీసుకొని అన్న సమయానికి డబ్బు యాదయ్య చేతిలో పెట్టాడు. ఏ బాదరబందీ లేకుండా డబ్బు తొందరగా చేతిలో పడ్డందుకు యాదయ్య సంతోషించాడు. వెంటనే ఊరికి బయలుదేరాడు.

వర్షాలు సమయానికి కురిశాయి. చెరువులు కుంటలు నిండాయి. దాంతో బావుల్లోకి నీళ్ళు వచ్చాయి. ఎరువులు సమయానికి వేయడంతో ఎప్పటికన్నా ఆయేడు యాదయ్య పొలంలో పంట బాగా పండింది.

"గింత తిప్పలు పడ్డందుకు గీ పంట చేతికొచ్చింది. అప్పు పైకం పోంగ గిన్ని గింజలు తిండికి మిగిలినయి" అని నర్సమ్మ తృప్తిపడింది.

'గీ అప్పు తీరినంక బోరు కోసం అప్పు తీసుకోవాలె. ఎప్పుడు గిట్లనే ఆనలు పడ్తయని నమ్మకమేంది. బోరు వుంటె వానల కోసం కంట్లె ఒత్తులు ఏసుకొని చూసే

అక్కరుండదు. బోరు ఏసుకొని వచ్చేయేడు పంట బాగ పండితే గిన్ని పైసలు మిగిల్తే నల్లబూసల్లోనికి గిన్ని బంగారు గుండ్లు వేయించుకుంట! ఎప్పట్నుంచి గది మనుసులో వుంది!' అనుకుంది నర్సమ్మ. మనస్సులోని మాట ఆపుకోలేక నర్సమ్మ ఆ మాట యాదయ్యతో అంది.

"సరేలేవే! గిట్లనే నీకు మనసుంటె నేనెందుకు కాదంట!" అన్నాడు యాదయ్య.

"రత్తయ్య గింజలు తీస్కపోయేటందుకు బండి ఇస్తనన్నడు గదా! గింజలు మార్కెట్లో అమ్మి గట్లనే పట్నం దాకా పోయి బేంకు అప్పు కూడా కట్టిరా! గా పైసలు ఇంట్ల పెట్టుకుంటె కర్సు అయితయేమో! దొంగలంటున్నరు! గదో భయం! అందుకే అప్పు కూడా కట్టిరా! అంది నర్సమ్మ.

అక్కడే పొయ్యిలో పుల్లలు వేస్తున్న యాదయ్యతల్లి అంది.

"పిల్లా! నువ్వు సుత యాదయ్య ఎంట పోరాదె! ఆడు గా పైసలు ఏమాగం చేస్తడొ ఏందొ! నువ్వు ఎంట వుంటే గా అప్పేందో కట్టి పొద్దుగూకేతలకు ఇంట్ల పడొచ్చు!"

నర్సమ్మకు అత్త చెప్పింది బాగానే అనిపించింది. కాని పొద్దున్నే వంట చెయ్యాలి. ముసలిదానికి అన్నీ తయారుచేసి పెట్టాలి. తమకోసం సద్ది కట్టుకోవాలి. పొద్దున్నే కోడి కూయకముందే బయలుదేరాలి! అవన్నీ తలచుకుంటె నర్సమ్మకు అసాధ్యమనిపించింది. "గీ పోరనితోటి బండిమీద పోయి మార్కెట్లో ఎంత సేపైతదో. గక్కడి నుంచి పట్నం పోవాలె. గదంతా నా తోటి కాదు! నాకు పెయిలో బొత్తిగ బాగుంటలేదు అత్త! చక్కర్లు ఒస్తున్నయి" అంది నర్సమ్మ నీరసంగా.

'సరేలేవే! గీ పరేషాన్లతో నువ్వేం ఒస్తవు! ఎండలు కూడా శానా వున్నయి. నేను గింజలమ్మి బ్యాంకులో పైసలు కట్టే వస్త! నువ్వేం బుగులు పెట్టుకోకు. నా ఎంట వెంకటయ్యను తీస్కపోత. బండి ఆడు ఎన్కకు తోలుకొస్తడు. నేను గక్కడి నుంచి పట్నం పోత" అని యాదయ్య వెంకటయ్య కీ విషయం చెప్పి రత్తయ్య బండి తేవడానికి వెళ్ళాడు. బండిని రాత్రేతెచ్చి ఇంటిముందు పెట్టుకుంటె పొద్దున్నే తొందరగా బయలుదేరవచ్చుననుకున్నాడు యాదయ్య. వెళ్ళి రత్తయ్య బండి తెచ్చి ఇంటి ముందు పెట్టి యాదయ్య తినకుండానే మళ్ళా కండువా భుజానవేసుకొని బయటకి బయలుదేరాడు.

“మల్ల ఎటు పోతున్నవు? గా తాగేటందుకేనా? గౌండ్లాయన దగ్గర సేసిన అప్పు పెరుగుతున్నది. గింజలమ్మితే గా అప్పు కూడా కట్టేది వున్నది” అంది నర్సమ్మ.

“గా పైసలెన్నే? కొద్దిగానే వున్నయి. శాన రోజులైంది. ఇయ్యాల కొద్దిగ దప్పయితున్నది. కుతిలేస్తున్నది. గింత తాగొస్త. నువ్వు అమ్మకు బువ్వ పెట్టు. నువ్వు కూడా తిను. నాకోసం చూస్కుంట కూసోకు. పోరగాడు పండుకున్నడా?” అంటూ జవాబు కోసం ఎదురుచూడకుండానే యాదయ్య బయటకి వెళ్ళిపోయాడు.

“నువ్వు కూడా తిను. అంటే ఇయ్యాల బాగనే వుంది కత అన్నమాట! గీ తాగుడుతో బేజారయితున్న. సేతిలో పైసలున్నా లేకపోయిన గదిమాత్రం ఆగుతలేదు” గొణుక్కుంటూ నర్సమ్మ అత్తకు అన్నం పెట్టింది.

“గందుకే పిల్లా! అమ్మేకాడికి నువ్వు కూడా పో! పైసలు సేతిలో పడ్తే యాదయ్య బుద్ధి ఎట్లయితదో! ఏం చేస్కవస్తడో తెల్వదు!” అంది అత్త వణికే కంఠంతో.

“ఇగ అప్పుకట్టాలె అన్న గ్యానం లేదా? లేకపోతే మల్లయేడు ఎవసాయం ఎట్ల నడుస్తదని ఫికరు లేదా? లేకపోతే నేను ఎంటబడి ఎన్ని పనులని చూస్కుంట” అని విసుక్కుంది నర్సమ్మ.

మర్నాడు యాదయ్య రేచుక్క పొడవకముందే బండి కట్టుకొని ధాన్యంతో బయలుదేరాడు. అతని వెంట వెంకటయ్య వున్నాడు. బండి కదిలేటప్పుడు నర్సమ్మ సద్దిమూట తెచ్చి యాదయ్యకిచ్చింది.

“జోకే కాడ జాగర్తగ చూస్కో! నాల్గు జాగల ధాన్యం ధర తెల్సుకొని అమ్ముగాని తొందరపడి ఎక్కడికో అక్కడికి అమ్మకు” అని జాగ్రత్తలు చెప్పింది నర్సమ్మ.

“నాకు తెల్వదానే!” విసుక్కున్నాడు యాదయ్య.

“ఏది సెప్పినా యాష్టపడ్తవు. పైసలు లెక్కపెట్టుకునే కాడ జాగర్త. పైసలు లోపటి కీసలో పెట్టుకో! దొంగలుంటారు జాగర్త!” చెప్పింది నర్సమ్మ.

“నేను గంత తెల్వితక్కువోన్నానే! గంత బేకూబునయితే నా మీద గంత నమ్మకం లేకపోతే నువ్వు కూడా రారాదె! ఇద్దరం పోదం! పోరగాన్ని అమ్మ చూస్కుంటది ఒక్కరోజుకు. అట్లనే పట్నం మీ తమ్ముని కాడికిపోయి అప్పు కట్టి మాపటేలకు ఆఖరి బస్సుకు తిరిగొచ్చేద్దం” అన్నాడు యాదయ్య బండినాపి.

"గీ ఇల్లు పోరగాడు గివన్ని అత్త ఏడ చూస్కుంటది! కండ్లు కన్పడక ఎన్కులాడుకుంట తిరుగుతది. గామెకేం చేతనయితది! అందులో నాకు చక్కర్లు వస్తున్నయి. పెయి బాగ లేదు!" అంది నర్సమ్మ.

"అయితే! నామీద ఒదిలెయ్యి! ఊకే గదిసెయ్యి గిది సెయ్యి అని సెప్పి సెప్పి నన్ను సంపకు" కోపంగా అన్నాడు యాదయ్య.

"గంత కోపమెందుకయ్యా! జాగర్త అని సెప్తే సెడ్డమాటా?" అంది. నర్సమ్మ ముఖం చిన్నబోయింది.

"సరే! మంచిది! కమ్మరి ఈరయ్య కాడికి పోయి పెయి సూయించుకో! సూది ఏస్తడేమొ ఏయించుకో! సరే పోయొస్త" అనియాదయ్య ఎడ్లను అదిలించాడు. బండి ముందుకు కదిలింది.

ధాన్యం బండితో పోయిన యాదయ్య రాత్రికి వస్తానన్నవాడు రెండురోజులైనా రాలేదు. ధాన్యం అమ్మినాక వెంకటయ్య బండిని వెనకకు తోలుకొచ్చాడు. యాదయ్య డబ్బుతో పట్నం వెళ్ళాడు. "పట్నం పోయి గిన్ని రోజులేం చేస్తున్నడు? ఏమన్న అయిందా ఏంది?" అని నర్సమ్మ శంకించి భయపడింది.

మూడోరోజు వచ్చాడు యాదయ్య. ముఖం పీక్కుపోయి కన్పించింది. మనిషిలో ఉత్సాహం లేదు. ముఖమంతా నల్లబడింది. మెల్లగా నడుస్తూ వస్తున్న యాదయ్యను చూసి నర్సమ్మ భయపడి పోయింది.

"ఏమైందయ్యా! గట్లున్నవు. బ్యాంకు పైసలు కట్టినవ లేద?" ఒక్క గుక్కలో అడిగింది నర్సమ్మ.

"రెండు రోజులు బ్యాంకులో స్ట్రయికు – బంద్ వుండె" గొణిగాడు యాదయ్య.

"ఇయ్యాలైన కట్టివచ్చినవ? లేద?" కలవరిస్తూ అడిగింది నర్సమ్మ.

యాదయ్య ముఖం దించుకున్నాడు. అతని చూపులు నేలకు అతుక్కొని పోయాయి. పైకి లేవడం లేదు.

"ఏమైందంటే నోరు తెరుస్తలేవు! ఏం జేసి ఒచ్చినవు?" ఏడ్పు గొంతుతో ప్రశ్నించింది నర్సమ్మ.

యాదయ్య ఏం మాట్లాడలేదు.

"ఏం జేసినవయ్యా? పల్కవేందీ?' ఏడుస్తూ అరిచింది నర్సమ్మ.

"పట్నంలో గదేందో గుర్రాలాట మల్కపేటలో వున్నదని గక్కడ పైసలు పెడ్తే రెండింతలైతవని నీ తమ్ముడు రాజయ్య సెప్పిండు. గక్కడ" – చూపులు నేలమీదే వుంచి అన్నాడు యాదయ్య.

"గక్కడ ఏమైందో మల్ల సెప్పవేంది?"

"పైసలు కడ్దమంటె బ్యాంకు బంద్ వుండె. ఇగ మీ తమ్ముడు గక్కడికి మల్కపేటకు తీస్కపోయిండు గా ఆటలో పైసలు రెండింతలైతవంటె"– మళ్ళా ఆగాడు యాదయ్య.

మొత్తం పైసలు గంగలో పోసినవా? గంతేనా? సెప్పు? యాదయ్య అంగి పట్టుకొని గుంజింది నర్సమ్మ.

"గంతేనే!" అన్నాడు యాదయ్య మెల్లగా.

"నాయినో! ఎంత పని జేస్కొని ఒచ్చినవు దేవుడో!" అని పెద్దగా అరుపులతో గుండెలు బాదుకొని ఏడ్చింది నర్సమ్మ. నేలమీద కూలబడిపోయింది.

'గిన్నిరోజుల సేసిన రెక్కల కష్టాన్ని ఒక్కరోజుల పాడుసేసినవు గదరో! నీ బుద్ధి పాడుగాను. ఇంక సారబుడ్లు కరీదైనయి దొర్కుతయి గక్కడ పట్నంలో గవి కూడ తాగినవా?" ఏడ్పు ఆపకుండానే అడిగింది నర్సమ్మ కోపంగా.

"ఆఁ. మీ తమ్ముడు గవి తాగుదమని తెచ్చిండు" నిస్సహాయుడైనట్లుగా చెప్పాడు యాదయ్య.

"ఇంకేమైన చేసినవా? గక్కడ పైసలకు ఆడపోరలు దొర్కుతరట" ఏడ్పు ఆపి కోపంగ అడిగింది నర్సమ్మ.

"గదంత నాకేమెరుక? నీ తమ్ముడు తీస్కపోతె పోయిన" అమాయకంగా అన్నాడు యాదయ్య.

"ఓరి నాయనో! నీ నోరు పడిపోను! గన్ని పైసలెట్ల తాగినవురో! రెక్కల కష్టమంత నీకప్ప జెప్తే ఒక్కరోజులో పాడుజేసినవు గదరో! నిన్ను బొందపెట్ట. నీకు

ముండలు కావలసి వచ్చింర్రా! పంటంత మంట గలిపినవు గదరో! నువ్వు నాశనం గాను! నిన్నేత్తుకపోను! ఇల్లంత నాశనం సేసినవుగదరో! తిప్పలు పడి పండిచ్చిన పంటనంత మాయం జేసినవు గదరో! గన్ని పైసలెట్ల తగలబెట్టినవురో! పెండ్లం పిల్లలైన యాదికి రాలేదారా? నీకు!" అని నర్సమ్మ పెద్దగా శోకాలు పెడ్తూ నేలమీద పడి దొర్లుతూ ఏడ్చింది.

'ఏందే పిల్లా! ఎవడైనా సచ్చిండా ఏంది?" అంటూ ముసలిది ఇంటివెనుక వున్నది మనుమన్ని ఎత్తుకొని లోపలికి వచ్చింది.

యాదయ్య గుడ్లప్పగించి నర్సమ్మను చూస్తుండిపోయాడు.

"ఆడది జేసిన కష్టమంత గిట్లనే దోపిడైతున్నది! మల్ల!" అంటూ ముసలిది మనుమన్ని కింద దింపి నర్సమ్మ పక్కన కూర్చుంది.

**– విసుర్రాయి 1998**

# ఉపాసన

**– జలంధర**

"**ఊ**ర్ధ్వ మూల మధఃశాఖమ్"

ఆ కంఠ మాధుర్యం అది.

గబగబ పూజ ముగించి, "మంత్రహీనం... క్రియాహీనం అని చెబుతూ అక్షింతలు, నీళ్ళ వదిలారు ఆ పెద్దాయన.

అన్నీ అమెండ్‌మెంట్సే.... పూజలో కూడా... అని" మనస్సు నవ్వింది. పట్టు పంచతోనే గేటు దగ్గరకు పరుగులాంటి నడకతో వచ్చాడు.

ఫలకం మీద బంగారు రంగుతో ఆర్. వెంకట్రామన్ – తెల్లటి పాలరాతి అక్షరాలు.

ఆయన చీఫ్ జడ్జి, అమ్మా,నాన్న పెట్టిన పేరు వెంకటరమణ మూర్తి. కానీ, పదవుల్లో పైపైకి పోవాలంటే, పై అధికారంలో ఉన్న దక్షిణాత్యులను సంతోషింప చెయ్యాలంటే, నేను మీ "మంద మనిషినే" అని గుర్తు చెయ్యడానికా అన్నట్లు పేరు మార్చుకున్నాడు.

అడిగిన వారికి సంజాయిషీకి "న్యూమరాలజీ" అడ్డం పెట్టుకున్నాడు.

కంటికి చెయ్యి అడ్డం పెట్టుకుని, తూరుపుదిక్కుకు చూశాడు  వెలుతురులో వెతుక్కుంటూ.

భగవద్గీత శ్లోకం చెప్పుకుంటూ దగ్గరగా వచ్చాడు ఆయన చూడాలంటున్న వ్యక్తి.

రెండు చేతులూ పైకెత్తి ఆకాశం వంక చూస్తూ, సుస్పష్టమైన ఉచ్ఛారణతో, సుస్వరంతో శ్లోకం చదువుతున్న ఆ వ్యక్తిని దగ్గరకు రానిచ్చి తేరిపార చూశాడు వెంకట్రమణయ్య. ఆజానుబాహువు, చక్కటి వర్చస్సు, మంచి ముఖ కవళికలు,

చారెడు కళ్ళు... తెల్లటి పంచ, పైన ఉత్తరీయం, చేతికి వేలాడుతున్న సంచీ.

"నమస్కారం..." అప్రయత్నంగా అన్నాడు వెంకట్రమణయ్య. అవతలి వ్యక్తి చిన్న వాడని మనకు చెపుతున్నా.

ప్రతి నమస్కారం చేసి చిరునవ్వు నవ్వాడతను. అతని వంకే చూస్తున్నాడు ఆయన. ఆయన రిటైర్ అయి, ఈ ఇంటికి మారిన వారం రోజులుగా ఈమనిషి, ఈ సుస్వరం ఎవరిదా? అన్న జిజ్ఞాసతో ఇవ్వాళ్టికి పట్టుకోగలిగాడు అతణ్ణి.

"మీకేం కావాలి?" మెల్లగా అడిగాడు అతను.

ఆ మాటతో 'మీకు పని లేకపోతే, నా దారికి అడ్డు తొలిగితే, నేను వెళ్ళిపోతాను' – అన్న ధ్వని ఉన్నది.

కానీ, వెంకట్రమణయ్యకు మాత్రం "ఏం కోరుకుంటున్నావు నువ్వు?" అని వరాలిచ్చే దేముడిలా ఏమిటి ఆ ప్రశ్న అనిపించింది.

"అసలు మీకేం కావాలని ఇలా ప్రొద్దున్నే భగవద్గీత శ్లోకాలు చదువుతూ...."

ఆయన ప్రశ్నను మధ్యలో ఆపడానికి అతనుతన చేతి సంచీని చూపించాడు.

అందులో, బియ్యం కాయగూరలు, డబ్బులు....

"అంటే... తిరిపెమా? క్షమించాలి. నా ఉద్దేశ్యం..."

"మీరంత ఖంగారుపడటం ఎందుకు? దీనిపేరు ఇదేగా..." అన్నాడు ఆ యువకుడు.

ఖంగు తిన్నాడు వెంకట్రమణయ్య.

"మీరు చూస్తే చదువుకున్నవారిలా ఉన్నారు. ఇలా..." మళ్ళీ ప్రశ్నించాడు.

"చదువుకున్నంత మాత్రాన, చదువుకున్న వాడిలా బ్రతికే రోజులా ఇవి?"

ఆ సమాధానం ఆయనకు అంతగా రుచించలేదు. ప్రతి కష్టపడలేనివాడూ, అదృష్టవంతుణ్ణి చూసి ఈ మాట అనడం సహజమైపోయింది.

"అది సరే... మరి ఇది వృత్తి అనుకుంటే, నోరు తెరిచి బిచ్చం కావాలని అడగరేం? పైగా.... పైగా... మీకేం కావాలి అని మా బోటివాళ్ళను ప్రశ్నిస్తున్నారు. వీరముష్ఠి అంటే ఇదేనేమిటి?!" వెటకారంగా, తర్కం జోడించి. కళ్లజోడు

సవరించుకుంటూ అన్నాడు వెంకట్రమణయ్య ఎంత రిటైర్ అయినా పదవి ఇచ్చిన 'పవరు' పొగరు అంత తొందరగా పోవు.

"ఎందుకు అడగడం?!" నవ్వుతూ అన్నాడు అతను.

"మరి ఎలా?"

"అయ్యా! మనం పూర్తిగా మనవి మనం నమ్ముకోం. ఎదుటివాళ్లను నమ్మం. రాతిలో ఉండే కప్పకు కూడానీరు ఏర్పరుస్తుంది సృష్టి శక్తి. నాకేం కావాలో ఇవ్వాలో అలాగే మీ మనస్సుకూ తెలుస్తుంది. అడిగామనా చెట్టు కాయ కాస్తుంది?!"

"అంటే– మీరు వస్తారని గ్రహించుకుని,. వాకిట్లో నిలబడి మీకు చెల్లుబడి చేయించుకోవాలనా?!" వెటకారంగా అన్నాడు వెంకట్రమణయ్య.

ఏ ఇంటి ముందూ ఒక్క నిముషం కన్నా ఆగడు, ఏదీ అడగడు అతను మరి.

మాట్లాడలేదు ఆ యువకుడు. అతను మౌనం "అంతేగా మరి" – అన్నట్లు అర్థమై తాటి ప్రమాణాన లేచాడు. అసలే బ్లడ్ ప్రెషరు పేషెంటు అయిన ఆ పెద్దాయన.

"అంటే... అంటే.... మీకు భిక్ష పెట్టడం కేవలం మా అదృష్టముంటే ప్రాప్తిస్తుందనా తమరి ఉవాచ?!" – వ్యంగ్యంగా అడిగాడు.

సూటిగా చూశాడతను. ఎండ మెల్లిమెల్లిగా పెరుగుతోంది.

"నేను మీ ప్రాప్తంగురించి మాట్లాడలేదు. నా ప్రాప్తం గురించే నా అక్కర..... ఇలా ప్రతిగుమ్మం ముందూ నిలబడి, భగవద్గీత శ్లోకాలు చెప్పుకుంటూ, ఈ ఇంటి వారు చల్లగా ఉండాలి. ఈ ఇంట్లో 'పాజిటివ్ ఎనర్జీ' ఉండాలి అని ప్రార్థిస్తూ, ఇ క్కడ ఉండే చెట్టూ, పుట్టా అన్నింటికీ తేజోశక్తిని, ప్రాణశక్తిని 'జనరేట్' చెయ్యమని 'మెసేజ్' ఇస్తూ నడిచిపోవడం ప్రాప్తం అనుకుంటాను. నాకూ, నా ప్రవర్తనకూ మధ్యజరిగే 'సింథసిస్' ఈ సమర్పణ రూపం దాల్చొచ్చుగా...." అన్నాడు ఆ యువకుడు జోలె చూపెడుతూ.

అవాక్కయిపోయాడు వెంకట్రమణయ్య. అతను చూపిస్తున్న జోలిలో వెయ్యడానికి తనవి రిక్తహస్తాలు... తన దగ్గరేమున్నదీ చెవులో తులసిదళం తప్ప?!"

ఆ క్షణంలో ఆయనకు మెళ్లో ఉండే బంగారు గొలుసు, చేతికి ఉండే ఉంగరాలూ గుర్తుకురాలేదు. అవి సంపద జాతికి చెందినవి. అవి దానానికి ఉపయోగించకూడదని సాంఘిక శాస్త్రం, అర్థశాస్త్రం చెప్పింది మరి.

అలా ఆలోచిస్తూనే పక్కకు తప్పుకోగానే, ఆయనను దాటుకుంటూ వడివడిగా అడుగులు వేస్తూ ఏదో శ్లోకాలు చదువుకుంటూ దాటిపోయాడు ఆ వింత వ్యక్తి.

తెలివి తెచ్చుకుని లోపలికి వెళ్ళిన వెంకట్రమణయ్యకు మతి మతిలో లేదు అతను అతని రూపు, అతని మాటలు.... ముగ్గు మీద పడిన సుస్పష్టమైన అతని నీడ...

ఏవో జ్ఞాపకాలు... ఏవేవో ఆలోచనలు. ఎక్కడో చూసినట్లుండే అతని రూపం.

సుష్టుగా టిఫెన్ తింటున్నా నాలుగు అధరవులూ వేసుకుని భోజనం చేస్తున్నా అతనే గుర్తుకు వస్తున్నాడు. ఆయనలో ఉప్పొంగుతున్న ఎన్నో ఆలోచనలు ఎవరితోనైనా పంచుకోవాలని ఉన్నది. కానీ చెప్పలేడు.

'తత్త్వమసి' అన్న వేదాంత గ్రంథం తీశాడు 'ఉపనిషత్ సారం' పేజీలు తిరగేశాడు. తన లైబ్రరీ అంతా సర్దాడు. అందులో కొన్ని పుస్తకాలు తను "చాలాగొప్ప వేదాంత భ్రాంతితో" అన్న బహుమతిగా ఇచ్చినవి.

ఏమన్నాడు ఆ యువకుడు?!

అతని మాటలే పదే పదే వినబడుతున్నాయి.

అద్దంలో తన గుండెల మీద జంధ్యం కనపడింది.

"యజ్ఞోపవీతం పరమం పవిత్రం...." శ్లోకం వచ్చు.... అర్థం అనవసరం. 'ఏది గౌరవమిస్తుందో అది ముఖ్యం కానీ, దేన్ని ఎలా గౌరవించాలో అదిముఖ్యం కాదు' అన్న పద్ధతి మీద ఎదిగాడు ఆయన.

ఎనిమిదవ ఏట పంచశిఖలు.... ఉపనయనం, గాయత్రి ఉపదేశం... ఏమిటి నేర్చుకున్నాడు?! భువర్లోక, సత్యలోకాల నుంచి వచ్చే ధీ శక్తిని ఎప్పుడైనా తనను ఆవహించమని మనస్ఫూర్తిగా కోరుకున్నాడా?! అహాన్ని నిజాయితీ అనే ధ్వజస్తంభానికి కట్టి భగవదర్పణగా చేసే క్షణాలు అవి.

"ఊర్ధ్వ మూల మథః శాఖమ్..." రెండు చేతులూ ఆకాశం వైపు చూపుతూ శ్లోకం చదువుతూ వెలుతురు వాకిళ్ళను వెతుక్కుంటూ వెళ్లే ఆ యువకుడు.

ఆ రాత్రి కలత నిద్రే.. కొడుకు ఆలస్యంగా వచ్చాడని తెలుసు. అప్పుడు తను వెళ్ళి మాట్లాడాలని ప్రయత్నించినా ప్రయోజనం లేదు.

మర్నాడు ప్రొద్దున్నే మరింత తొందరగా లేచి, స్నానం, పూజ ముగించుకుని అతని కోసం ఎదురుచూశాడు వెంకట్రమణయ్య.

అదే మేఘ గంభీరమైన స్వరం.... ఆత్మకు మేలుకొలుపు లాంటి సుస్వరం.

ఆపాడు అతణ్ణి.

ఏదిచ్చినా స్వీకరించటానికి సిద్ధంగా ఉన్నాడతను. సిద్ధంగా ఉంచుకున్న బియ్యం, డబ్బులు అతనిసంచీలోకి జారవిడుస్తూ.

"మీరు ఉండేది ఎక్కడ?"అని ప్రశ్నించాడు వెంకట్రమణయ్య.

నవ్వాడతను.

"బంజరులో చెట్టు కింద..."

"వర్షమొస్తే.."

"చిన్న పర్ణశాల ఉన్నది."

ఎవరుంటారు మీతో?"

"ఒక్కడినే..."

"మరి మీ ఒక్కరికీ ఇంత తిరిపెం....?"

"నా చుట్టూ చదువుకునే పిల్లలు ఒక పాతికమంది ఉన్నారు. మేమందరం వండుకుని తింటాము."

"ఎక్కడ?"

"అక్కడే..." నవ్వుతూ చెపుతూ కదిలాడతను.

"మీరు మా ఇంటికి రేపు భోజనానికి రావాలి..."

గభాలున అన్నాడు వెంకట్రమణయ్య.

"నేనా?!"

'ఆ... మీరే.. ఇవ్వాళ ఏకాదశి, రేపు ద్వాదశి..."

"నేను బ్రాహ్మడిని కానే...." సూటిగాచూస్తూ అన్నాడతను.

ఖంగు తిన్నాడు వెంకట్రమణయ్య. వెంటనే సర్దుకుని, "బ్రాహ్మడు... అంటూ అర్థం ఏమిటి? లోకాం సమస్తాః సుఖినోభవన్తు...." అనుకునే ఉన్న బ్రాహ్మణత్వం ఎవరికి ఉన్నది?! ఏదిచ్చినా ఒప్పుకుంటా నన్నారు. మరి ఆహ్వానం?!"

అతను నవ్వుతూ వస్తానని తలపంకించాడు.

"రంగా! ఇవ్వాళ మధ్యాహ్నం నువ్వు ఇంటికి భోజనానికి రావాలిరా!"

"ఎందుకు నాన్నగారూ! కొంచెం బిజీగా ఉన్నానే... తప్పనిసరైతే వస్తాను" భార్య అందించిన కాఫీ తాగుతూ అన్నాడు రంగారావు.

"రావాలి.... ఇవ్వాళ నీ కొక విచిత్రమైనది చూపిస్తాను. నువ్వు చూడాలి. అతను మనింటికి భోజనానికి వస్తున్నాడు".

"నిజంగానా? మీకే అలా అనిపించింది. తప్పకుండా చూడవలసిన వ్యక్తే మనకు ఉపయోగించేవాడే అయ్యుంటాడు. ఎవరు చీఫ్‌సెక్రటరీయా, మినిష్టరు గారి అబ్బాయా, లేక ప్రధాని పి.ఏ.నా?!"

"వీళ్ళెవరు కారు"

"మరి? ఓహో.... నా ప్రమోషన్ కోసం వాళ్లెవరికో పార్టీ ఇవ్వాలి. అన్నారు వారి తాలూకానా?! తప్పకుండా వస్తాను" అన్నాడు కొడుకు.

"కాదురా! వీళ్ళెవరూ కాదు.... " అతని గొంతులో ఆర్తికి ఉలిక్కిపడింది కోడలు.

మనస్సెంత చిత్రమైంది! ఇది ఒక సమయంలో పరిపరివిధాల ఆలోచించగలదు. ఆ తిరిపెం ఎత్తే ఆ వ్యక్తి తన కొడుకు జాబితాలో ఏ ఒక్క వ్యక్తి నీడలో నిలబడటానికి కూడా అర్హుడు కాడేమో! ఆర్థికస్థాయి రీత్యా అతనిని వీళ్ళతో పోలుస్తూంటే ప్రాణం చివుక్కుమంటోంది ఎందుకనో! వీళ్లంతా ప్రజా ప్రతినిధులు. నిజమే కానీ, అతను తమ ముంగిట నిలిచి, సత్సంకల్పంతో వైబ్రేషన్స్ కల్పించే వ్యక్తి. అతని దీక్షలో నిజాయితీ ఉన్నది.

అదే సమయంలో మనస్సు మరొక విషయానికి కూడా బాధపడింది.

తమ బిడ్డ తన దృష్టిలో, లోకం దృష్టిలో తనకు ఉపయోగించని పని ఏదీ చెయ్యడన్న అభిప్రాయం కలిగించాడా?! ఇన్నేళ్లు నిండు జీవితం తరవాత ఇదేనా తనను గురించి ప్రపంచం అర్థం చేసుకునేది?! మరి అతను?

ఆయన తల తిరిగిపోయింది. ఎవరు అతను? ఎవరు?

మర్నాడు అతను, అతని జోలె సిద్ధం 12 గంటలకు వస్తానని పైకి వెళ్ళిపోయాడు.

మామగారు వంటవాడిని ఇంత హడావిడి ఎందుకు పెడుతున్నారో బొత్తిగా అర్థం కాలేదు కోడలికి.

వచ్చేవాడు ఒక్కడు. పైగా 'మాదాకవళం' కోసం వచ్చాడతను.

అతను ప్రధాన ద్వారం దాటి లోపలికి అడుగుపెట్టగానే, "మొన్న మీరు పాజిటివ్ ఎనర్జీ గురించి చెప్పారు. మీవంటి వారి ఆలోచనే ఆశీర్వచనం. మా ఇల్లు బిడ్డా, పాపలతో కళకళలాడాలని దీవించండి" అన్నాడు వెంకట్రమణయ్య.

లోపల ఉన్న కోడలు ఆ మాటలకు ఉలిక్కిపడింది. మనసు చివుక్కుమన్నది. ఏమిటీ మామగారి చాదస్తం?! అయినా, శంకరమఠానికి వెళ్ళినా సంవత్సరాదాయం ఎంత? అక్కడి వాళ్ళు ఎంత జేబులో వేసుకుంటున్నారు? అని ఆరాలు తీసే లౌక్యుడు ఈయన. ఇదేమిటి ఇవ్వాళ ఇంత బేలగా?!

అతణ్ణి కూర్చోబెట్టి, మంచినీళ్ళు ఇచ్చేలోపల, వచ్చాడు టకటక బూట్లు శబ్దం చేసుకుంటూ కొడుకు రంగారావు.

"నాన్నగారూ! నాకు అసలే టైం తక్కువ. అతిథులు వచ్చారా? వాకిట్లో కార్లు లేవే...." అంటూ ఆ అపరిచితుణ్ణి చూసి ఆగిపోయాడు.

అతడు కూడా లేచి నుంచుని రంగారావును పరిశీలనగా చూస్తూ నిలబడిపోయాడు.

"మీరు.. నువ్వు.... నువ్వు కృష్ణవు కదూ?..." సందేహంగా అన్నాడు రంగారావు.

"మీరు.... రంగా.." అతడు మాట పూర్తి చెయ్యకముందే – "ఒరేయ్ కృష్ణా!" అంటూ రెండు చేతులూ చాపాడు రంగారావు. ఒకరి కౌగిలిలో ఒకరు ఇమడిపోయారు.

ఆ ఇద్దరి వంకా చూస్తూ నిలబడిపోయాడు వెంకట్రమణయ్య. ఇతడు కృష్ణా! రంగారావుతో చదువుకున్న కృష్ణ ఆంధ్రాయూనివర్శిటీలో న్యూక్లియర్ ఫిజిక్స్‌లో రీసర్చ్ స్కాలర్!

"ఓరి భగవంతుడా!" ఒక్కసారిగా కదిలిపోయాడు వెంకట్రమణయ్య.

ఏవేవో ఆలోచనలు... మరేవేవో జ్ఞాపకాలు.

'ముందు భోజనాలకు పదండి."

లోపల నుండి తెర తొలగి మళ్ళీ మూసుకున్నది. తలుపు పక్కన ఇత్తడి ఫ్లవర్‌వాజ్ తొట్రుపాటుకి కింద పడింది.

"కోడలు లేదా నాన్నా?" భోజనాల దగ్గర రంగా తండ్రిని అడిగాడు.

"ఒంట్లో బాగాలేదని... ఇప్పుడే వెళ్ళి పడుకుంది..."

"అయినా, అంత చదువు చదివీ,అంత ఉన్నత కుటుంబంలో పుట్టీ ఇదేమిటిరా?! ఈ మాదాకవళం ఏమిటీ? ఆ స్టూడెంట్సుకు చదువు చెప్పడం ఏమిటి? ఏమిటీ గోల?" చనువుగా అడిగాడు రంగారావు.

లోపల నుంచి రెండు చెవులు ప్రతి అక్షరం శ్రద్ధగా వింటున్నాయి. ఆ వ్యక్తి కంటిగుండా అనుభూతి వెల్లువ జలధారగా కురుస్తోంది.

"ఎంత చదువు? ఏం చదువిది? ప్రొఫెసర్ల దయమీద, అభిమానం మీద ఆధారపడ్డ చదువు. ఇంత ఫీజు కట్టగలిగితే కానీ చెప్పని చదువు.... అప్పట్లో అది చాలా గొప్పగా అనిపించింది నాకు. అప్పులు పెరిగే తరుణంలో ఆస్తులన్నీ నేను నా చదువు వల్ల కూడా నడిచిపోయాయి. ఏదో ఇంటర్వ్యూకు వెళ్ళాలంటే డిపాజిట్టుతో సహా వెయ్యి రూపాయలు కావలసి వచ్చాయి.

"అప్పుడు ఏం తాకట్టు పెట్టానో తెలుసా మా అమ్మ ప్రాణం.... నా కోసం, మా ఇంట తరతరాలుగా ఉన్న జలతారు జరీచీర. కళ్ళనీళ్ళతో చేత పెట్టింది మా అమ్మ. దాన్ని ఒక మధ్యవర్తి ద్వారా కలిగినింటివారికి అమ్మించాను. కాని ఆ పరిస్థితి

నా చేత చాలా ఆలోచింప చేసింది. బ్యూరోక్రసీలో చదువు, ఉద్యోగం రెండు కూడా ఏవో అత్యంత విలువైనవి తాకట్టుపెట్టి ఈ బానిసత్వం కొనుక్కోవాలా? అనిపించింది. విద్యావంతుడికి వెయ్యి రూపాయల సహాయానికి సెంటిమెంటు తాకట్టు పెట్టించే ఈ ప్రపంచం డెస్మండ్ మారిస్ అన్నట్లు మనుషుల జూ అని అర్థమైంది.

"అమ్మలో రాచరికపు అమాయకత్వం ఆ జరీ చీరతో మంచాన పట్టించింది. కనీసం అమ్మను బ్రతికించుకుందామని, ఆ జరీ చీర కోసం ప్రయత్నం చేశాను. కానీ దాన్ని తాకట్టు పెట్టుకున్న వారు నాలుగింతలు ధర అడిగారు అమ్మమంచాన పట్టి మరి లేవలేదు. ఈ విశాల ప్రపంచంలో నేను ఒంటరివాణ్ణి అయ్యాను."

గదిలో కాస్సేపు నిశ్శబ్దం తాండవించింది అందరి మనస్సులు అతని కథతో బరువెక్కిపోయాయి.

"ఆ తర్వాత?" కుతూహలంగా అడిగాడు రంగారావు. అతను ఏ కష్టం లేకుండా చదువుకున్నాడు. అంతేకాదు, చదువు విలువ తెలియనక్కర్లేకుండా చదువుకున్నాడు.

"డబ్బు సంపాదించడం కష్టమేమీ కాదు ఇలా సంపాదించాలీ అన్న నియమమే లేనప్పుడు.. ఈ సత్యాన్ని తరువాత జీవితం చేదు అనుభవాలతో నేర్పింది."

"కాస్సేపు పడుకుంటాను బాబూ వెంకట్రమణయ్య మెల్లిగాలేచి వాళ్ళమాటలు వినబడేటట్లు పక్కగదిలో పడుకోడానికి వెళ్ళాడు ధారగా కారిపోతున్న కన్నీరు తుడుచుకుంటూ – కోడలు గభాలున బైటకి వెళ్ళిపోయింది.

ఏదో అడగబోయి ఎదురుగా లైఫ్ఎన్లార్జ్ చెయ్యబడ్డ భార్య ఫోటో చూసి ఆగిపోయాడు ఆయన. పెద్ద పట్టుచీర పెద్ద కుంకుమబొట్టు, రవ్వల నగలు, నవ్వులో అహంకారం.

"ఎంతపని చేశావు మహాలక్ష్మీ?" మనిషితో మాట్లాడుతున్నట్లు అప్రయత్నంగా అన్నాడు. వెంకట్రమణయ్య.

ఆయనకు గతంలో ఆ సంఘటన కండ్లకు కట్టినట్లు గుర్తుకు వస్తోంది. "జమీందారులింటి పట్టుచీర ఎవతో తాకట్టు కోసం ఎవడో తెచ్చాడు. కాని జరీయే. కొంటే ముప్పై వేలు పైన ఉంటుంది. ఆడికి వెయ్యి రూపాయలిచ్చి పంపేశాను

సంతోషంగా చెప్పింది. ఆ మోజులోనే ఆ పట్టుచీర కట్టుకుని, నగకట్టు దిగేసుకుని జమీందారిణిలా ఫీలైపోయి ఫోటో కూడా తీయించుకున్నది.

ఆ తరవాత పది రోజులకే ఏమండోయ్ ఇది విన్నారా!! ఆ చీర అమ్మిన అబ్బాయి మళ్ళీ ఆ చీర కావాలంటున్నాడట. అమ్మినవాడు వచ్చి చెపుతున్నాడు. నాలిగింతలు ఖరీదు అడిగాను. సాయంత్రం లోపల డబ్బుతో రాకపోతే కరిగించేస్తానని బెదిరించాను. కంసాలిని రమ్మనండి.... " అన్నది.

భార్య చిన్న చిన్న కక్కుర్తులకు, బుల్లి బుల్లి పాపాలకు, పుల్లవిరుపు మాటలకు అలవాటు పడడం ఆచారాల్లో ఒకటిగా అలవాటు చేసుకున్న మొగవాళ్లలో వెంకట్రమణయ్య ఒకడు.

ఆ పట్టుచీర.... కరిగించబడి వెండిగిన్నెగా రూపాంతరం చెందింది. "మన మనుమడికి అన్నప్రాశనదీంతోనే చేద్దాం" అనుకునే ఆవిడ శాశ్వతంగా ఉండలేదు.

కానీ ఆవిడ కిరాతకం ఈ కుర్రాడి జీవితాన్నే మార్చేసింది. తన రాజరికపు ఆఖరు కుదుల్లు కదిలిపోయాయన్న భ్రాంతితో. ఆ చీరతోపాటే చనిపోయింది రాజ్యాలు పోయినా, రాచరికం పోని ఒక జమీందారిణి.

కళ్ళ ముందు నల్లగా కాలిపోయిన జరీ చీర దృశ్యం, నిద్రపట్టక, లేచి మెల్లగా హాల్లోకి వచ్చాడు ఆయన.

"నా అనుభవాల వలన జీవితపు విలువల పట్ల చాలా మార్పు వచ్చింది. రంగా! లెక్చరర్‌ను అయితే పిల్లలకు పాఠాలు చెప్పచ్చు. కానీ, ఉద్యోగం నాకు రాదు... కానీ, అది విద్యాదానానికి ఆటంకం కాదుగా.. జ్ఞానం తెచ్చుకోవడానికి, యూనివర్శిటీలే అక్కరలేదు అని అర్థమైంది. నేను చదువుకున్న సైన్సు నాకుచాలా నేర్పింది.

"మన మునివేళ్ళలో యాంటీనాల వంటి శక్తివంతమైన నాడీ మండలం ఉన్నది. అది ఆకాశం నుంచి అక్కడ నిక్షిప్తమైన ఎనర్జీని తీసుకోగలదు. రెండు చేతులూ పైకెత్తి . ఆ ఎనర్జీని ప్రార్థిస్తే, మనలోకి ఆ అమృత వర్షిణి లాంటి శక్తి వస్తుంది. అది దాచుకోవాలనో, నిక్షిప్తం కావాలనో ప్రయత్నిస్తే లాభంలేదు. ఆ

శక్తిని పంచాలి. ఏ యూనివర్శిటీ చెప్పని వెన్నో నేర్చుకున్నాను. అవన్నీ నా దగ్గరకు వచ్చే వాళ్లకు నేర్పుతున్నాను. ”

‘ఏమిటిరా ఈ పిచ్చి?! నాకేం అర్థం కావటంలేదు. జీవితంలో జ్ఞానానికే చోటున్నది అన్నట్లు బ్రతుకుతున్నావు... ఇందాకటి నుంచి నువ్వు అన్నీ అవ్వే మాట్లాడుతున్నావు. మరి పెళ్ళి.. పిల్లలు?”

“అవన్నీ కూడా ‘భిక్షలా’ మనని కనికరించాలి కానీ, మనం భిక్షమెత్తకూడదురా! నేను కోరుకున్న అమ్మాయి, నేను దేశాటనం పట్టినప్పుడు , ‘మరీ రాననుకుని మరొక డబ్బుగలవారింటి కోడలయిందట. నా తల్లి పోయింది. డిగ్రీ అర్థం లేనిదైంది. కానీ, నా చుట్టూ నా బోటివారెందరో.... వారందరికీ నేను చెయ్యగలిగింది చేస్తున్నాను – అంతే!”

“గురుకుల మన్నమాట....” కుర్చీలో చేరగిలబడుతూ అన్నాడు వెంకట్రమణయ్య.

“అబ్బే.... అదేం లేదండీ. విద్య నేర్చుకుంటాను అన్నవాడికి అక్కడ అన్నీ దొరుకుతాయి. అంతే.”

“మరీ అంత దినదిన గండంగా.... పోనీ, గవర్నమెంటు ద్వారా ఏదైనా ఎయిడూ అదీ....” అన్నాడు వెంకటరమణయ్య గట్టిగా నవ్వాడు కృష్ణ.

“ఎందుకూ? అవి మా బోటివాళ్ళకు కాదు. అయినా, ఈ తృప్తి చాలు నాకు”.

“తృప్తి... ఒరేయ్! నీ కన్నా కొన్ని వందల రెట్లు అధికం ఉన్నది నాకు. అందమైన భార్య, మంచి ఉద్యోగం, బోలెడు ఆస్తి, సంఘంలో పలుకుబడి, ... అయినా నువ్వు చెపుతున్న ‘తృప్తి’ – అది లేదనిపిస్తుందేమిటిరా?! ఏదో చికాకు....” ఎక్కడో చూస్తూ అన్నాడు రంగారావు. మామూలు పరిస్థితుల్లో ఇలా మాట్లాడే అంత బలహీనుడు కాదు రంగారావు. కానీ ‘కృష్ణ’ సమక్షంలో అతనికి దాచుకోవాలనిపించలేదు.

“కారణం నాకు తెలిసి ఒకటీ... మనకు చిన్నప్పుడు గోళీకాయల మీద కోరిక. పెద్దవాళ్లమైన తరవాత ప్రమోషన్‌మీద, పాలరాతి బంగళామీద, మరింత

పొడుగాటి కారు మీదా అలా అంచలంచలుగా పెరుగుతుంది. కావలసిన వస్తువులు మారుతున్నాయి. కానీ 'కోరిక' మాత్రం మామూలే. దొరికిన తృప్తి, దొరకని అసంతృప్తి కూడా ఈ 'కోరిక' చుట్టూ పరిధులే.

"మరి మనకు కావలసిన వస్తువుల మీద ఈ కోరిక. అసంతృప్తికి కారణం అంటావా?!"

'కాదేమో... ప్రపంచం అంతా సమృద్ధిగానే ఉన్నది. దానితో మనకు పేచీలేదు. సమస్య నాకు అన్నీ కావాలి' అనుకుంటేనూ, ఆ తరవాత నాకే ఉండాలి' అనుకుంటేనూ వస్తుందేమో ఏది మనకు అవసరమో అది ఎప్పుడూ ఉంటుందో ఏదిమనకే కావాలని కోరుకుంటామో అది దుఃఖాన్ని ఇస్తుంది."

"నువ్వేదైనా ఉపాసన చేస్తున్నావా బాబు ఆప్యాయంగా అడిగాడు వెంకట్రమణయ్య.

'ఉపాసనా?!' బావుంది.ఒకప్పుడు ఆ పేరు నాకు చాలాచాలా ఇష్టం. ఉపాసన హుఁ ఇదేనేమో నేను చేసేది. ఎక్కడో ఉండే మహాశక్తిని ఈ ప్రపంచాన్ని పునీతం చెయ్యమని కోరుకోవడం ఒకవేళ ఉపాసనే అయితే –"

"ఏమిటిరా ఈ మెటాఫిజికల్ నాన్సెన్స్ ఇదంతా నిజమంటావా?!" సీరియస్‌గా అడిగాడు రంగారావు.

ఇలాంటి మాటలు. నిజాలైతే మామూలు ఉద్యోగాలు, ప్రమోషన్లు, సంపాదన లంచాలు ప్రపంచ ధర్మాలు... వీటన్నిటికీ అర్థం ఉండదు మరి. అందుకనే ఎప్పుడూ ఒక తెగ మనుష్యుడు ఇవి! రంగారావు వేరొక తెగ మనిషి.

ఇది నా పద్ధతి రంగా. ఇవ్వాళ్టి సైంటిస్ట్ క్వార్ట్ విడగొట్టలేననవచ్చు. కానీ, నా దృష్టిలో అది నిజం కాదు గొప్ప థాట్ వాటితో నాకు తెలిసీ క్వార్ట్స్ బ్రేక్ వేసినప్పుడు ఆకుపచ్చ, ఎరుపు, పార్టికల్స్‌గా మారుతాయి. అక్కడే మేటర్ ఎనర్జీ అవుతుంది. ఆ టెక్నిక్‌ను జీవితంలోకి అనువదించాలని ప్రయత్నిస్తున్నాను మరి నాన్నగారు అన్నట్లు దీనిపేరు ఉపాసన అయితే... "నవ్వుతూ అన్నాడు. ఘల్లున మ్రోగాయి కర్టన్‌కు ఉన్న మువ్వలు.

నా పేరు ఉపాసన.... నేను ఈ ఇంటి కోడలిని కళ్లముందు నిలబడిన ఆ అద్భుత సౌందర్యరాశి.

"నా భార్య ఉపాసన... " అన్నాడు రంగారావు.

మౌనంగా చూశాడతను... సన్నగా.... నవ్వుకున్నాడు.

మీకు నేనుగుర్తు లేనా?! కవ్వింపు గొంతుకలో దాచుకుంటూ మామూలుగా అడిగినట్లుందామె.

ఆ మాటల్లో ఒకప్పుడు తనను ప్రేమించి, ఆరాధించి పిచ్చివాడైపోయిన కృష్ణను గుర్తించిన ఆమె

నేను మర్చిపోతేగా.. ఇంక నేను బయలుదేరతాను. రంగా.... లేచాడతను ఏం జరగనట్లు.

"నీకు... నీకు నేనేం చెయ్యగలనురా? ఏం చెయ్యాలి చెప్పు.... " అతని రెండు చేతులూ పట్టుకుని ఆర్తిగా అడుగుతున్నాడు రంగారావు.

"నాకేమీ వద్దు"

"నిజంగానా?"

"ఆం- నిజంగా! వీలైతే నా తృప్తి నీకు ఇచ్చి వెళ్ళాలని ఉన్నది. కానీ, అది నీకు నువ్వే సంపాదించుకోవలసింది ... వస్తాను."

"బాబూ! కృష్ణా!" ఆర్తిగా వినబడింది వెంకట్రమణయ్య గొంతు.

వెనక్కు తిరిగాడతను.

"ఇదుగో ఈ వెండిగిన్నె మా కానుకగా, జ్ఞాపకంగా తీసుకువెళ్లు..."అతని సంచిలో వేస్తూ అన్నాడాయన.

ఏదో అపరాధానికి క్షమాభిక్ష దొరికినట్లున్నది ఆయనతీరు, ఆ కంటితీరు.

దానివంక ఒక్క క్షణం పరిశీలనగా చూశాడు కృష్ణ.

మెల్లిగా సంచిలోనించి బైటకు తీసి,

"బాబూగారూ! మీ ఇంట పుట్టబోయే చిన్నబిడ్డకు ఇది నా కానుకగా ఇవ్వండి....." అంటూ కన్నార్పకుండా తనవైపే చూస్తున్న ఉపాసన పట్టిన దోయిలిలో పెట్టాడతను.

అందరికి నమస్కరించి  వెళ్లిపోయాడు.

"ఊర్ధ్వ మూల మధః శాఖమ్..."

గాలిలో మౌనంగా అతడు చదివే శ్లోకార్థచ్ఛాయలు.

వాకిట్లోకి అతణ్ణి సాగనంపడానికి  వచ్చారు తండ్రీ కొడుకు.

మధ్యదారిలోనే ఆగిపోయింది ఉపాసన. వెలుగులోకి వెళ్లిపోతున్నాడతను.

వెనక్కు తిరిగి చూసింది.

పెద్ద మేడ, రెండు కార్లూ, బరువైన మంగళసూత్రాలు – ఇవన్నీ ఇవన్నీ ఎంత అర్థరహితమైనవి?!

ఎండపడి ఆమె చేతిలో వెండిగిన్నె మెరుస్తోంది.

అప్రయత్నంగా ఆకాశం వంక చూసిందామె.

'ఊర్ధ్వ మూల మధః శాఖమ్...."

# జ్వలిత

– డా॥ఆలూరి విజయలక్ష్మి

**ఆ**కాశ వీధుల్నించి కురిసిన అమృతధారలతో అభ్యంగన స్నానం చేసిన ప్రకృతి రివ్వున వీస్తున్న చలిగాలికి సన్నగా వణుకుతూంది. ఎరుపు చుక్కల తెల్ల తివాచీలా ఉన్న పారిజాతాల మీద కొబ్బరాకులపై నిలిచిన నీటి చుక్కలు గాలితెర స్పృశించినప్పుడల్లా పరవశంతో జారుతున్నాయి. వర్ణచిత్రంలా ఉన్న నింగిని, క్షణానికో రూపు దాలుస్తున్న మేఘమాలను, పెరటినిండా రంగుల్ని అద్దుతున్న రకరకాల పూల మొక్కల్ని చూస్తూ వరండాలో కూర్చుని "వాక్‌మన్" లో త్యాగయ్య కృతుల్ని, అన్నమయ్య సంకీర్తనల్ని మైమరచి వింటున్న సృజన ఫోన్ గణగణమని మోగడంతో ఉలిక్కిపడింది. అయిష్టంగా లేచి వెళ్ళి ఫోన్ ఎత్తింది.

"ఓ...! నో...!" రుద్రకంఠంతో అంటూ వణుకుతున్న చేతుల్తో ఫోన్ పెట్టేసింది సృజన. "మమ్మీ! రుక్కు ఇక్కడకు వస్తూ, కదుల్తున్న ట్రెయిన్లోనుంచి జారిపడిందట. గవర్నమెంట్ హాస్పిటల్లో చేర్చారు" చెప్తూనే హాండ్‌బాగ్ తీసుకుని బయటకు పరుగెత్తింది సృజన. నాలుగు ఫర్లాంగుల దూరంలో ఉన్న హాస్పిటల్‌కు రిక్షాలో వెళ్ళేప్పటికి నాలుగు యుగాలు గడిచినట్లనిపించింది సృజనకు. రుక్మిణి ఏ వార్డులో ఉందో తెలుసుకునేటప్పటికి మరో పావుగంట పట్టింది. స్పృహ లేకుండా, శరీరమంతా బాండేజీలతో నిండి ఉన్న రుక్మిణి గుర్తు పట్టలేని విధంగా ఉంది. దుఃఖంతో గొంతు పూడుకుపోయిన ఎవరినీ ఏమీ ప్రశ్నించకుండా మౌనంగా రుక్మిణీ బెడ్ పక్కన నుంచుంది సృజన.

"ఈ అమ్మాయి పేరెంట్స్‌కి టెలిగ్రాం ఇప్పించానమ్మా! కానీ వాళ్ళు ఎంత త్వరగా వచ్చినా కనీసం పది గంటలు పడుతుంది" ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ ధర్మారావు సృజన పక్కకు వచ్చి చెప్పారు.

"రుక్మిణి పేరెంట్స్ వచ్చేదాకా ఇక్కడ నేను ఉంటాను సర్." ఆయన భావం అర్థమయిన సృజన జవాబిచ్చింది.

"మంచిదమ్మా, మన ఆఫీస్ ఫ్యూన్ సత్యన్నారాయణను ఇక్కడ ఉంచి వెళ్తాను. ఏమన్నా అవసరమైతే నాకు ఫోన్ చేయించు. ప్రాణానికి రిస్కేమీ లేదనిచెప్పారు డాక్టర్లు. ఈ అమ్మాయి నీ బెస్ట్ ఫ్రెండ్ కదా అని నీకు ఫోన్ చేయించాను. నువ్వు ఉండగలవా.... నీకు భయమయితే వేరే ఎవరినన్నా పురమాయిస్తాను." సందేహంగా చూసారు ప్రిన్సిపాల్.

"అబ్బే అదేం లేదు సర్. నాకు భయమేమీ లేదు. నేను ఉంటాను." సృజన భరోసాగా చెప్పాక స్థిమితపడ్డారాయన.

"సరే అయితే నేను ఉదయమే వస్తాను. వెళ్ళేప్పుడు మీ నాన్నగారికీ విషయం చెప్పి వెళ్తాను." ఫ్యూన్ సత్యన్నారాయణకు పదిసార్లు జాగ్రత్తలు చెప్పి వెళ్ళిపోయారు ప్రిన్సిపాల్.

కనురెప్పల కింద నల్లగా కమిలి, ఉబ్బిన రుక్మిణి ముఖాన్ని చూస్తూ ఆమెతో తన పరిచయాన్ని గుర్తుకు తెచ్చుకుంటూంది సృజన.

మూడున్నర సంవత్సరాల క్రితం తనతోపాటు ఇంజనీరింగ్ కాలేజీలో చేరింది రుక్మిణి. అందరు ఆడపిల్లలకు మల్లే అందమైన అలంకరణమీద, రకరకాల దుస్తుల మీద మోజులేని రుక్మిణి అతి సామాన్యమైన దుస్తులు వేసుకున్నా అందరి కంటే ప్రత్యేకంగా కనబడేది. ఆమె నడకలోని ఠీవి, ఆమె కళ్ళల్లోని ఆత్మవిశ్వాసం. ఆమె నిర్భయ ప్రవర్తన అందరి దృష్టినీ ఆకర్షించాయి. ర్యాగింగ్ టైమ్‌లో ఆమె చూపిన ధైర్యం, తెగింపు చూసి తనలాంటి అమ్మాయిలకు ముచ్చటనిపించినా ఆమె ధోరణికి అబ్బాయిలు రెచ్చిపోయారు. దెబ్బతిన్న పురుషాహంకారం, విద్యార్థుల కుల రాజకీయాలు కలిసి ఆమెనేమన్నా చేస్తాయేమోనన్న భయంతో తను మమ్మీనీ, డాడీని ఒప్పించి రుక్మిణిని కొన్నాళ్ళు తమ ఇంట్లో ఉంచింది. ఆమెతో పరిచయం పెరిగే కొద్దీ ఆమె తెలివితేటల్ని, సూక్ష్మ జ్ఞానాన్ని, జ్ఞాపకశక్తిని చూసి అబ్బురపడిపోయే తను, రుక్మిణి ఏదో ఒకనాడు చరిత్ర సృష్టిస్తుందని అనేది.

చరిత్ర సృష్టిస్తుందని తను నమ్మిన రుక్మిణి ప్రమాదవశాత్తూ రైల్లో నుంచి జారిపడలేదని, కావాలని రైల్లోంచి దూకిందని నర్సులు చెప్పుకుంటూంటే విని నిర్ఘాంతపోయింది సృజన. వారం క్రితం సెలవులకు ఇంటికి వెళ్ళిన రుక్మిణి ఇంకా సెలవులు ఉండగానే ఎందుకు తిరిగి వచ్చిందో, రైల్లోంచి దూకి ఆత్మహత్య చేసుకునేంతగా ఆమెకు బతుకుమీద ఎందుకు విరక్తి కలిగిందో అర్థంకాలేదు సృజనకు.

ఆలోచిస్తున్న సృజనకు రుక్మిణి కుటుంబం గురించి తనకేమీ తెలియదని గుర్తుకొచ్చింది. ఆమె తల్లిదండ్రులు, తోబుట్టువుల ప్రసక్తి వస్తే రుక్మిణి ముఖం కఠినంగా మారడం. ఒకోసారి విచారంతో దీనంగా అవడం, ఒకోసారి క్రోథంతో ఎర్రబడడం కళ్ళముందు నిలిచింది. స్వల్పమైన అంశాలకే తీవ్రంగా ప్రతిస్పందించే ఆమె వైఖరి తననెన్నో సార్లు తికమక పెట్టేది. ఉత్తినే ఉద్రేకపడిపోవడం. ఆవేశంతో అరవడం, అకారణంగా ఏడవడం. అంతలోనే సర్దుకుని అతి దీనంగా క్షమాపణ వేడుకోవడం, చాలా అరుదుగానే జరిగినా, తనకు బెరుకుగా అనిపించి దూరంగా జరగాలనుకునేది. కానీ ఆమెసహజ లక్షణాలయిన స్నేహశీలత, ఆత్మవిశ్వాసం. విశాల దృక్పథం, సంస్కార వర్తనం చూసి 'అమ్మో! ఈమె స్నేహాన్ని కోల్పోతే ఎలా?' అనిపించి మరింత దగ్గరయేది. కలసి చదువుకోవడంతో, కలసి సంగీతం వినడంతో, కలిసి పుస్తకాల్లోని విషయాల గురించి చర్చించుకోవడంతో ఆ స్నేహం వృద్ధి అయింది. ఆమెకు అయిష్టాన్ని, దుఃఖాన్ని కలిగించే ఆమె కుటుంబ ప్రసక్తి తీసుకురాకుండా జాగ్రత్త పడుతూ తమ స్నేహాన్ని కొనసాగించింది తను. ఆలోచిస్తూ, రుక్మిణి ఎప్పుడు కళ్ళు విప్పుతుందోనని ఆత్రంగా వేచి చూస్తూ అర్ధరాత్రి దాకా మెలకువగా ఉన్న సృజన మెల్లగా నిద్రలోకి జారుకుంది.

గుండెను కోసేలా, అతి దీనంగా ఉన్న ఏడుపు చెవుల్లో పడి మేల్కొన్న సృజనకు తన పక్కన కూర్చొని రుక్మిణి మంచంపై తల మోపి విలపిస్తున్న స్త్రీ ఆమెకు అవతల ముఖం ముటముటలాడించుకుంటూ, అసహనంగా కదుల్తూ, కర్కశంగా చూస్తున్న పురుషుడు కనిపించారు. ఒక క్షణం వారి వంక భావరహితంగా చూసింది సృజన. బక్కపలచగా, తుఫానులో తడిసి ముద్దయి కూర్చున్న పిట్టలా ఆమె లావుగా, భీకరంగా, సౌకుమార్యమంటే ఏమిటో తెలియనట్లున్న అతను – ఇద్దరి వంక మార్చి

మార్చి చూసి బహుశా వీళ్ళు రుక్మిణి తల్లి తండ్రులేమోననుకుంటూ అప్రయత్నంగా ఆమె భుజం మీద ఓదార్పుగా చెయ్యేసింది సృజన.

"రుక్కుకేం ఫరవాలేదు. మీరు బాధపడకండి" సృజన మాటల్ని విని తలెత్తిన ఆమె ముఖం కన్నీటి చారికల్లో దయనీయంగా ఉంది.

"రాత్రి మానాన్నగారు డాక్టర్స్‌తో మాట్లాడారు. ప్రాణానికి రిస్కేమీ లేదని చెప్పారు. ప్రిన్సిపాల్‌గారితో కూడా డాక్టర్స్ భరోసాగానే చెప్పారు. మీరు ధైర్యంగా ఉండండి. రుక్కు తొందరగానే కోలుకుంటుంది." విరిగిపడుతూ వున్న దుఃఖ కెరటాల్లో అల్లల్లాడుతున్న రుక్మిణి తల్లి సరోజినిని ఓదార్చడానికి ప్రయత్నించింది సృజన.

ఇంటికి వెళ్ళి కాసేపు విశ్రాంతి తీసుకుని రుక్మిణి తల్లిదండ్రులకు భోజనం తీసుకుని వచ్చిన సృజన రుక్మిణి తండ్రి వెళ్ళిపోయాడని తెలిసి ఆశ్యర్యపడింది. తెలివిలేకుండా పడివున్న బిడ్డను అక్కున చేర్చుకుని, ఆమె ఆరోగ్యం కోసం ఆరాటపడవలసిన తండ్రి తల్లీ బిడ్డలిద్దర్నీ వాళ్ళ మానాన వాళ్ళను వదిలేసి ఎలా వెళ్ళిపోయాడో అర్థం కాలేదామెకు. రుక్మిణికి స్పృహవచ్చి హాస్పటల్ నుంచి డిశ్చార్జి ఆయేదాకా సరోజినీకి ఎంతో అండగా నిలబడింది సృజన. సెలవులై పోయి కాలేజీ తెరవడం వల్ల పగలు కాలేజీకి వెళ్ళినా, మిగతా సమయంలో దిగులుతో కుంగిపోయి ఉన్న రుక్మిణిని ఉత్సాహపరచడానికి, సంతోషంగా ఉంచడానికి ప్రయత్నిస్తోంది.

రుక్మిణి ఆరోగ్యం కొంతవరకు కుదుటపడి డిశ్చార్జి అయిన రోజున ఇంటికి రానని ఆమె మొరాయిస్తుంటే, సరోజిని బ్రతిమాలి బ్రతిమాలి ఫలితం కనబడక కుమిలి కుమిలి ఏడవసాగింది. ఇంటికి వెళ్ళడానికి రుక్మిణి ఎందుకంతగా ప్రతిఘటిస్తోందో అర్థం కాక ఆశ్చర్యంగా చూస్తోంది సృజన.

"అమ్మా! ఆ నరకంలోకి నా కంఠంలో ప్రాణముండగా అడుగుపెట్టను. నన్ను విసిగించకు" కటువుగా చెప్పి తల తిప్పుకుంది రుక్మిణి.

"ఇంటికి రాక ఎక్కడికి వెళ్తావు? ఎలా బ్రతుకుతావు? నీ మొండితనం నీదే తప్పు అర్థం చేసుకుంటానికి ప్రయత్నించవా?" నిస్సహాయంగా చూసింది సరోజిని.

"ఈ దరిద్రపు బతుకు బతకలేక కదా చావాలనుకుంది? కానీ నాకు చనిపోయే అదృష్టమెక్కడ! అన్ని దౌర్భాగ్యాలకూ తోడు ఇప్పుడీ అవిటితనం" కట్లు కట్టి ఉన్న

కాలి వంక, చెయ్యి వంక చూచుకుంటూ సెల్ఫ్ పిటీతో అగాధాల్లోకి జారిపోతున్న స్నేహితురాలి వంక విచారంగా చూస్తూంది సృజన.

"అమ్మా! నాన్న పారిపోయిన రోజునే అందరం ఇంత విషం మింగి ఛస్తే ఎంత గౌరవంగా ఉండేది? ఎందుకమ్మా ఈ దిక్కుమాలిన బతుకు?' అకస్మాత్తుగా పెద్దగా వెక్కిళ్లు పెడుతూ ఏడుస్తూంది రుక్మిణి. మౌనంగా రుక్మిణి మాటల్ని వింటూన్న సృజన తుళ్లిపడింది. 'నాన్న పారిపోయాడా? మరి ఆరోజు ఆంటీతో కలిసి వచ్చిన వ్యక్తి ఎవరు? ఆయనను రుక్మిణి తండ్రిగానే భావించి మాట్లాడుతుంటే ఆంటీ తనను వారించలేదెందుకని?' ఏడుస్తున్న తల్లీకూతుళ్ళిద్దరి వంక మతిపోయినట్లు చూస్తూంది సృజన.

"ఆంటీ! రుక్కు ఆరోగ్యం చక్కబడేదాకా మా ఇంట్లో ఉంటుంది. మీరు దాని గురించి ఎక్కువగా ఆలోచించకండి." ముందుగా తెప్పరిల్లిన సృజన మృదువుగా చెప్తూంటే ఆమె చేతుల్నందుకుని కన్నీళ్ళు కార్చింది సరోజిని.

"చిన్నదానివైనా నీకు చేతులెత్తి మొక్కుతున్నానమ్మా! ఇన్నాళ్ళూ చేసిందానికి తోడు ఇంకా నీ సహాయం తీసుకుని నీ ఋణాన్నెప్పటికి తీర్చుకోగలనమ్మా."

"భలే వారు ఆంటీ! స్నేహంలో ఆత్మీయతలే తప్ప ఋణాలుండవు. రుక్కు మా ఇంట్లో ఉంటుంది. మీరు నిశ్చింతగా వెళ్ళండి." అంది సృజన.

కృతజ్ఞతాభారంతో వంగిపోతూ సృజన తల్లిదండ్రులిద్దరి దగ్గర సెలవు తీసుకుని వెళ్లిపోయింది సరోజిని. నిర్లిప్తంగా సమస్తం కోల్పోయినట్లు కూర్చున్న రుక్మిణిని మామూలు మనిషిని చెయ్యడానికి ప్రయత్నిస్తూంది సృజన.

రుక్మిణి సృజన ఇంటికి వచ్చిన రెండు నెలలకు దాదాపు పూర్తిగా కోలుకుంది. ఇంతకుముందు అప్పుడప్పుడు కొద్దిరోజులు సృజన ఇంట్లో ఉన్నప్పటికీ, ఇంత దగ్గరగా సృజన కుటుంబాన్ని పరిశీలించలేదు. ఈ రెండు నెలలుగా ఈ కుటుంబ సభ్యుల ఆత్మీయతతో తన మనసు గాయాల్ని మాన్పుకుంటున్న రుక్మిణికి తనకు జీవితంలో ఏమి దక్కకుండా పోయిందో భూతద్దంలో కనిపిస్తూంది.

"పుస్తకం ముందు పెట్టుకుని ఏమిటమ్మా ఆలోచనలు? పరీక్షలు దగ్గర కొస్తున్నాయి. ముందు చదువు. ఆలోచించడానికి జీవితమంతా ఉంది." రుక్మిణికి పాలు తెచ్చిన సృజన తల్లి కాత్యాయని మందలించింది.

"సారీ ఆంటీ!" పుస్తకం తెరచి చదువుమీద మనసు లగ్నం చెయ్యడానికి ప్రయత్నించింది రుక్మిణి.

"ఆ ఛాప్టర్ అయిపోయిందా?" అప్పటి వరకు అన్న రాజేష్‌తో ఉత్తుత్తి యుద్ధం చేస్తూ ఇల్లంతా సర్దిన సృజన స్నానం చేసి పుస్తకం పట్టుకుని రుక్మిణి పక్కన కూర్చుంది. అమ్మకు వంటింట్లో సహాయం చేస్తూ, ఇంజనీర్స్ మీద జోక్స్ పేలుస్తూ చెల్లెల్ని ఉడికిస్తున్న 'మెడికో' రాజేష్ టెన్నిస్ బ్యాట్ పుచ్చుకుని బయటకు వెళ్లాడు.

"కబుర్లతో కాలక్షేపం చెయ్యకుండా చదవండి." ఉమెన్స్ కాలేజీలో ఎకనమిక్స్ లెక్చరర్‌గా పనిచేస్తున్న కాత్యాయని కాలేజీలో ఫంక్షన్‌కు వెళ్తూ హెచ్చరించింది.

ఆఫీసు నుంచి వచ్చిన సృజన తండ్రి పరమహంస ఇద్దర్నీ చిరునవ్వుతో పలకరించి తనగదిలోకి వెళ్ళాడు.

ఎంత ప్రయత్నించినా రుక్మిణి చదువు మీద దృష్టి సలపలేకపోతూంది. గడిచిపోయిన తన జీవితమంతా పదే పదే కళ్ళముందు నిలుస్తూంది.

"మమ్మీ వంట చేసి వెళ్ళింది కదా! కిచెన్‌లో ఇంతసేపటి నుంచి ఏం చేస్తున్నారు డాడీ." ఫోన్‌ని రిసీవ్ చేసుకుని మళ్ళీ వంట గదిలోకి వెళ్తున్న తండ్రివంక గారాలు పోతూ చూసింది సృజన.

"ఇద్దరూ కూర్చుని బంగారు తల్లుల్లా చదువుకుంటున్నారు కదా! వేడి వేడి పకోడీలు చేసి పెడదామని ఉల్లిపాయలు కట్ చేస్తున్నాను మీరు చదువుకుంటూ ఉండండి. జస్ట్ ఫైవ్ మినిట్స్‌లో వేడి పకోడీలు రెడీ." చిన్నగా నవ్వుతూ చెప్తున్న పరమహంస వంక అపురూపంగా చూస్తుంది రుక్మిణి.

"ఓ రియల్లీ! మా డాడీలాంటి మంచి డాడీ ఎవరికైనా ఉంటారా?" అల్లరిగా నవ్వుతూ ఒక్క పరుగున వెళ్ళి పరమహంసను చుట్టేసింది సృజన. కూతురి నుదుటి మీద ఆప్యాయంగా ముద్దుపెట్టుకుని "వెళ్ళు నాన్నా! చదువుకో" అని కిచెన్‌లోకి వెళ్లాడు పరమహంస.

అరమోడ్పు కళ్ళతో ఆ మనోహర దృశ్యాన్ని చూస్తోంది రుక్మిణి. తాను స్వప్నించే ఆదర్శ కుటుంబం ఇది. అన్యోన్యంగా జీవిస్తున్న ఈ కుటుంబంలోని అమ్మ, నాన్నతో సమానంగా స్వేచ్ఛను, మర్యాదను, అధికారాన్ని అనుభవిస్తున్న వ్యక్తి. ఈమె తన

బిడ్డల్ని లాలిస్తుంది. శాసిస్తుంది. తన బలమైన బాహువుల మధ్య పొదవుకుని రక్షిస్తుంది. ఈ కుటుంబంలో నాన్న కళ్ళకు పురుషాహంకారపు పొరల్లేవు. ఈయన తన భార్యను ప్రేమ, గౌరవాలతో సమాదరిస్తాడు. బిడ్డలకు అవధుల్లేని అనురాగాన్ని పంచుతాడు. "మీ విజయాల్లో, వైఫల్యాల్లో మీ వెంట మేముంటాము. మీ అడుగు ముందుకే పడాలి.' అంటూ ఉత్తేజాన్నీ, భరోసానీ ఇచ్చే ఈ తల్లిదండ్రుల ఛాయలో పెరిగిన పిల్లలు జీవితంలోని ఉత్తమమైన విలువలన్నిటికీ రక్షకులవుతారు. ఈ మమతల పొదరింట్లో మసలిన పిల్లలు సమాజానికి శాంతినీ, స్నేహాన్నీ, ఆనందాన్నే పంచుతారు తప్ప హింసనూ, దౌర్జన్యాన్నీ, క్రౌర్యాన్నీ కాదు.

చెంపకు చేయి చేర్చి కళ్ళు మూసుకుని భావుకంగా ఆలోచిస్తున్న రుక్మిణికి కుటుంబ పునాది సవ్యంగా లేకపోతే కలిగే దుష్ఫలితాలు, వాటిని తాము అనుభవిస్తున్న వాస్తవం కూడా గుర్తొచ్చి హృదయం చెమర్చింది.

"ఏమిటి రుక్కూ! అంత ఆలోచన!" రుక్మిణి చేతిలోంచి జారిపడిన పుస్తకాన్ని తీసి అందిస్తూ అడిగింది సృజన.

"ఈ కుటుంబంలో పుట్టిన నువ్వెంత అదృష్టవంతురాలివో! కళ్లల్లో పెట్టుకుని కాపాడే అమ్మ నాన్న, ప్రాణం పెట్టే అన్న ఇంతకంటే బ్రతుక్కి ఇంకేం కావాలి." ఏదో లోకంలో ఉన్నట్టు చెప్తోంది రుక్మిణి.

"నీకు మాత్రం లోటేముందమ్మా నీ కోసం ఆంటీ ఎంతగా ఆరాటపడతారు. మీ అన్నయ్య, చెల్లి మాత్రం నీకోసం ప్రాణం పెట్టరా. ఇంక మీ నాన్నగారూ..."

ఒక్కసారి పెద్ద పెట్టున వెక్కివెక్కి పడుతున్న రుక్మిణిని చూసి విభ్రాంతితో మాట్లాడడం ఆపింది సృజన. ఆమె ఏడుపు తండ్రికి ఎక్కడ వినపడుతుందోనని భయపెడుతూ గది తలుపుమూసింది.

"అయ్యో రుక్కూ! ఏమిటది. ఎందుకిలా ఏడుస్తున్నావు? నేనేమన్నా పొరపాటుగా మాట్లాడానా?" గాబరాగా అడిగింది సృజన.

వెక్కుతూనే లేదన్నట్లు తల తిప్పింది రుక్మిణి.ఆమె ఏడుపు ఉధృతం తగ్గే వరకు మౌనంగా ఊరుకుంది సృజన. కొద్దిసేపట్లో సంబాళించుకుని కళ్ళు తుడుచుకుంది రుక్మిణి.

"సృజనా! నాకు మాత్రం లోటేమిటని అడిగావు కదూ! అసలు నాకు ఉన్నవే లోట్లు, తండ్రిలేని లోటు, డబ్బులేని లోటు, ప్రేమ, గౌరవ మర్యాదలు లేని లోటు, వెచ్చని కుటుంబం లేని లోటు" రుక్మిణి కళ్ళల్లో చివ్వున నీళ్లుబికాయి.

"ఇన్ని లోటుల్తో నిండిన నా బ్రతుకు గురించి మీకందరికి తెలిస్తే నన్ను చులకన చేస్తారేమోనని భయం. నాకున్న ఈ కాస్త మనశ్శాంతి దక్కకుండా పోతుందేమోనన్న భయం. అసలు బతకాలంటేనే భయం. ఇన్ని భయాలతో అనుక్షణం నేను చచ్చి బతుకుతున్నాను సృజనా!" రుక్మిణి శరీరం సన్నగా కంపిస్తూంది. కాసేపు రుక్మిణిని మాట్లాడించకుండా మౌనంగా ఉంది సృజన. కానీ, ఎన్నాళ్ల నుంచో తనను వేధిస్తున్న అనుమానాన్ని వెలిబుచ్చకుండా ఉండడం ఆమెకు సాధ్యం కాలేదు.

"రుక్కూ! ఆరోజు మీ నాన్నగారు పారిపోయారన్నావు కదా! మరి నీకు యాక్సిడెంట్ అయినప్పుడు ఆంటీతో వచ్చారే, ఆయనెవరు? మీ బంధువా?"

సృజన ప్రశ్నతో రుక్మిణి ముఖం కఠినంగా మారింది. చెప్పడానికి ఇష్టం లేనట్లు బిగపట్టిన పెదాలు మెల్లగా విచ్చుకున్నాయి.

"కాదు మా అమ్మను ఉంచుకున్న వ్యక్తి" రుక్మిణి ముఖం ఎర్రబడింది. ముక్కుపుటాలదురుతున్నాయి.

"నన్ను కూడా ఉంచుకుందామనే కోరికతో నేను 'మెచ్యూర్ అవగానే నా మీద అత్యాచారము జరపబోయిన నీచుడు" రుక్మిణి కంఠం కసితో జీరపోయింది. నిలువు గుడ్లేసుకుని రుక్మిణి వంక చూస్తూంది సృజన. ఆమెకు పరిచయమున్న పరిధిలో ఇలాంటి లైంగిక సంబంధాలు లేవు. అందుకే వినడానికే గాభరా పడుతూంది.

"సృజనా! ఈరోజు నా గురించి నీకు అంతా చెప్తాను" రుక్మిణి ఇన్నాళ్ళూ బలవంతాన వేసుకుని ఉంచిన నిగ్రహపు ముసుగుజారిపోయింది. తన చుట్టూ తన రక్షణ కోసం వేసుకున్న రహస్య పరదాల్ని స్వయంగా చింపేయడానికి పూనుకుంది. ఉద్వేగంతో చలిస్తున్న రుక్మిణి తనకు ఊహ తెలిసినప్పటినుంచి జరిగిన జీవితాన్ని గుర్తుతెచ్చుకుంటూంది.

అమ్మ, నాన్న, అన్న, తమ్ముడు, చెల్లి తాను కలిసి సంతోషంగా గడిపిన అతి కొద్దికాలం, ఆ తరువాత ప్రారంభమైన చీకటి రోజులు, పార్టీల్లో మర్యాద కోసం,

సరదాగా ప్రారంభమైన నాన్న తాగుడు అలవాటుగా, వ్యసనంగా మారి తన జీతమంతా తాగుడికే తగలేయడం. అదేమని అడిగిన అమ్మను చావగొట్టి చెవులు ముయ్యడం, అమ్మవైపు బంధువులు, నాన్నవైపు బంధువులు నాన్నకు హితవు చెప్పి చెప్పి ఫలితం కనబడక వదిలెయ్యడం ఊరినిండా నాన్న చేసిన అప్పులు, అప్పుల వాళ్ళు ఇంటిమీదకు దండెత్తి వచ్చి యాగీ చెయ్యడం, నాన్న తాగి బజార్లో స్పృహ తప్పి పడిపోతే ఏ రిక్షావాడో దయతలచి ఇంటికి చేర్చడం, స్పృహవచ్చాక నాన్న అమ్మను తిట్టి, కొట్టి, హింసించి దాచి ఉంచిన పదీపరక పట్టుకుపోయి తాగుడికి ధారబోయడం. ఇంటిల్లిపాదీ ఆకలితో అలమటించి పోవడం, తాగుడికి జీతం చాలక, ఎక్కడా అప్పు పుట్టక నాన్న లంచాలు పట్టడం, పట్టుబడి చివరకు ఉద్యోగానికి ఉద్వాసన రావడం, అన్నీ నిన్న, మొన్న జరిగినట్లు పచ్చిగా ఉన్న జ్ఞాపకాలన్నిటినీ సృజన ముందు పేరుస్తూంది రుక్మిణి.

"ఉద్యోగం పోయిన రోజునే రెక్కలు రాని మమ్మల్ని, చదువు, దమ్మిడీ ఆస్తి, ఒంటిమీద చిన్నమెత్తు బంగారం, ఇంట్లో అమ్ముకోదగిన ఒక్క వస్తువు లేని అమ్మను దిక్కులేని అనాధల్ని చేసి నాన్న పరారైపోయాడు. దుర్భరమైన దారిద్ర్యం, ఎవరి పంచన చేరితే వాళ్ళు చేసే అవమానాలు, ఎవరి గుమ్మంలో అడుగు పెడితే వాళ్ళు తలుపులు మూసేసుకోవడం ఎనిమిది, ఆరు అయిదు, మూడు సంవత్సరాల వయస్సున్న మేము తినడానికే తప్ప సంపాదించి తేవడానికి శక్తిలేని వాళ్లమవడం. నాన్న తెచ్చిన దాంతో గుట్టుగా కాలక్షేపం చెయ్యడమే తప్ప అమ్మకు అంతవరకు బయటిప్రపంచం తెలియకపోవడం. ఆకలి మా ప్రధాన సమస్య అయింది. కడుపు నిండా కాకపోతే మానె, మా ప్రాణాలు నిలపడానికి సరిపడానైన పెట్టలేకపోతున్నాని అమ్మ ఏడ్చేది. పరిస్థితి అర్థం చేసుకునే వయసులేక, ఆకలికి తట్టుకోలేక అమ్మను వేధించే వాళ్ళం. ఆకలికి తట్టుకోలేకే అన్న చిల్లర దొంగతనాలు చెయ్యడం, నేను అడుక్కోవడం నేర్చుకున్నాము. ఇంత చేసినా మా అందరి ఆకలి తీరలేదు. చివరకు ఆకలితోనే నా చిన్నారి తమ్ముడు చచ్చిపోయాడు" చున్నీతో ముఖాన్ని కప్పుకుని కదలి కదిలి ఏడుస్తూంది రుక్మిణి. ఆమె చెప్తున్నది కళ్ళు విప్పార్చుకుని వింటున్న సృజన గుండె చెరువై కళ్ళలో చివ్వున నీళ్ళుబికాయి. గుండెలవిసిపోయేలా ఏడుస్తున్న రుక్మిణిని ఎలా సముదాయించాలో సృజనకు అర్థం కాలేదు.

"తాను పని చేసి సంపాదించి తెచ్చి మమ్మల్ని బతికించుకోలేనని గ్రహించిన అమ్మ ఒక కఠోర నిర్ణయాన్ని తీసుకుంది. అప్పటివరకు తన దారిద్ర్యాన్ని ఆసరాగా చేసుకుని తనను కబళించాలని ప్రయత్నించి ఫెయిలవుతున్న అతనికి ఉంపుడు గత్తెగామారి మా ప్రాణాల్ని నిలిపింది. కానీ, మా కోసం ఆనాడే చచ్చిపోయిన మా అమ్మ మీద మాకు మాత్రం పీకలదాకా కోపముండేది. బయటి ప్రపంచం మమ్మల్ని మాటల ఈటెలతో రెచ్చగొట్టేది. ఆ కసినంతా అమ్మ మీద తీర్చుకుంటూ అమ్మను మాటల్తో చిత్రవధ చేసేవాళ్ళం." తల్లిమీద జాలితో, విషాదంతో నిండిపోయాయి రుక్మిణి కళ్ళు.

"కొండంత దుఃఖాన్ని సహిస్తూనే మా భవిష్యత్తుకు మంచి బాటలు వెయ్యడానికి ప్రయత్నించింది అమ్మ. అన్న చదువుకోకుండా తిరుగుతూంటే, అమ్మ 'చెడిపోకురా నాన్నా! చదువుకో', అని మందలిస్తే "నువ్వు చెడిపోలేదా?" అని ఎదురు తిరిగేవాడు. ఉక్రోషంతో ఏడ్చేవాడు. అమ్మను పచ్చితిట్లు తిట్టి అలిగి అన్నం తినకుండా బయటకి పోయేవాడు. కంటికి మింటికీ ఏకధారగా ఏడుస్తూ కొడుకుతో పాటు పస్తులుండేది అమ్మ. అమ్మమీద కసితో, పారిపోయిన నాన్న మీద కసితో, నాన్న స్థానంలోకి వచ్చిన ఆయన మీద కసితో, మొత్తం ప్రపంచం మీద కసితో అన్న దారితప్పిపోయాడు. జులాయిగా తిరుగుతూ, సెక్స్ సినిమాలు చూస్తూ, వార్తపత్రికల్లోని బూతు సీరియల్స్ చదువుతూ పొద్దు పుచ్చుతున్నాడు" అన్నను తలచుకుని ఆవేదనతో ఒక నిమిషం మాట్లాడలేకపోయింది రుక్మిణి.

"మొదట నేను కూడా అన్నలాగే మొండిగా, మూర్ఖంగా ప్రవర్తించినా, వయసు పెరిగినకొద్దీ విచక్షణతో ఆలోచించడం నేర్చుకున్నాను. అమ్మ జీవిత మంతా నిండిన హింసను, నిస్సహాయతను సానుభూతితో అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాను. అవమానాలు, తిరస్కారాలు పొందినప్పుడల్లా రోషంతో నాకళ్ళు జ్వలించేవి. అమ్మ పిల్లలుగా మేము పొందుతున్న అవమానాల్ని, తిరస్కారాల్ని అమ్మను ఉంచుకున్న ఆయన పిల్లలు పొందడం లేదు సరికదా సానుభూతిని, జాలిని పొందుతున్నారని కూడా నాకు అర్థమైంది. గత్యంతరం లేని పరిస్థితుల్లో ఆయన ఆశ్రయంలోకి చేరిన అమ్మ అనుక్షణం మహాపరాధం చేసినట్లు ఒదిగి ఒదిగి బతుకుతూంటే,. ఆయన అమ్మను చేరదీయడం వల్ల మన మగసిరి, కీర్తి పెరిగినట్లు గర్వంగా తిరుగుతున్నాడని

కూడా గ్రహించాను. ఈ అన్యాయాన్ని సరిదిద్దే శక్తిలేని నేను ఈ అవమానకర జీవితాన్ని తప్పించుకోవడానికి ఏకైక మార్గం – బాగా చదువుకుని, వ్యక్తిగా నేను ఉన్నత శిఖరాలకు చేరడమేనని కూడా తెలుసుకున్నాను.”

ఏదో ఒక ఆవేశతరంగం తనను బలంగా తోస్తున్నట్లు చెప్పుకుపోతూంది రుక్మిణి. రెప్పవాల్చడం, ఊపిరి పీల్చడం మరిచిపోయి వింటూంది సృజన.

“అదిసరే, ఇన్నేళ్ళ నుంచి ఇంతగా దుఃఖాన్ని సహించటం నీకు అలవాటయింది కదా, ఇప్పుడు కొత్తగా ఆత్మహత్య చేసుకునేంతటి కష్టమేమొచ్చింది?” సృజన ప్రశ్న విని రుక్మిణిముఖం పాలిపోయింది.

ఈ ప్రశ్నకు సమాధానం చెప్పడం ఆమెకు ఇష్టం లేదు. ఒక భయంకర స్వప్నంలా తనను కాటేస్తున్న ఆ అనుభవాన్ని ఆమె బలవంతంగా తోసేస్తున్నా దాని నుంచి విముక్తం కాలేకపోతూంది.

“ఈ ప్రశ్నకు జవాబిస్తే నువ్వు తట్టుకోలేవు సృజనా! ఇలాంటి దారుణాలు జరుగుతాయనేది నీ ఊహకు కూడా అందదు. మనుషుల మధ్య సహజంగా ఉండవలసిన సంబంధాలెంత వికృతంగా మారుతున్నాయో, విలువల క్షీణత మనుషుల్నెంత వేగంగా ఆదిమ ఆటవిక సమాజం వేపు వెనక్కు నెట్టుతూందో నీకంతగా తెలియదు.’ అనుకుంటూ సృజన వంక జవాబు చెప్పలేని నిస్సహాయతతో చూచింది రుక్మిణి.

“చెప్పు రుక్కూ” సృజన రొక్కించడం చూసి ఇంక తప్పక చెప్పసాగింది రుక్మిణి.

‘నాకు ఊహ తెలిసినప్పటినుంచి నేను పడిన కష్టాలు, అవమానాలు నా చుట్టూ సుళ్ళు తిరిగి నా హృదయాన్ని నలిబలి చేసాయి. నా బతుకు చుట్టూ ఎన్ని ఒత్తిడులో! ఎన్నెన్ని పీడకలలో! పైకి మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శించినా, లోలోన అభద్రతా భావంతో నేను గజగజ వణికిపోతాను.”

రుక్మిణి వంక జాలిగా చూస్తూంది సృజన.

“ఈ అభద్రతా భావమే నేను “సైకో”లా, విచిత్రంగా ప్రవర్తించేలా చేస్తుంది. కొండంత దుఃఖాన్ని మోస్తూ, శారీరక, మానసిక హింసను అనుభవిస్తూ మమ్మల్ని పెంచి పెద్దచేసి బతుకులో నిలబెట్టేందుకు శక్తివంచన లేకుండా ప్రయత్నించిన

అమ్మ ఔన్నత్యం, అందుకు ప్రతిఫలంగా ఆమెకు మేము అందిస్తున్న దూషణలు, తిరస్కారాలు గుర్తుకొచ్చి ఒక క్షణం  అపరాధ భావంతో క్రుంగిపోతాను. మరుక్షణం గౌరవంగా పెంచలేనప్పుడు మమ్మల్నిలా అవమానాలపాలు చెయ్యకుండా అప్పుడే చంపిపారేస్తే  పోయేది కదా అనే కోపం, పసితనం పోని నామీద ఆ దుర్మార్గుడు జరపబోయిన అత్యాచారపు భయంకర ముద్ర నన్ను వణికింప జేస్తుంది."

ఆ అకృత్యం అప్పుడే జరుగుతున్నట్లుగా విహ్వలంగా చూసింది రుక్మిణి.

'అంతలోనే ఆవేశం లేకుండా ఆలోచిస్తాను. నాలుగు రోజులు అమ్మని చేరదీసి, మోజుతీరాక మమ్మల్ని తరిమేయకుండా అతను తన భార్య, పిల్లలు, బంధువర్గమంతా ప్రతిఘటించినా వినక ఇన్నేళ్ళుగా మా సంరక్షణ భారాన్ని మొయ్యడానికి కారణం ఏమిటి? ఇంతటి దయను చూపించడానికి ప్రేరేపించిన అతనిలోని మానవతా శకలానికి చెయ్యెత్తి నమస్కరించనా లేక అతనిలోని చెడు గుణాల్ని, నాపై జరపబోయిన అత్యాచారాల్ని తలచుకుని ద్వేషించనా? కందిరీగల  తుట్టలా ఆలోచనలు నామెదడును చుట్టుముడుతూంటే బతుకును తరిచి చూడడానికి భయం, బతకడానికి భయం. అంతలోనే బతకాలని, బాగా బతకాలనే వెర్రి కోరిక. ఎక్కడ ఆనందప్రదమైన కుటుంబాన్ని చూసినా అది మాకు దక్కకుండా పోయిందే అన్న ఉక్రోషం." ఆపకుండా రుక్మిణి చెప్పుకుపోతూంది.

ఆమెలోని సంఘర్షణ సృజనకు అర్థమవుతూంది.

కానీ, ఆమె తాను అడిగినదానికి జవాబు చెప్పకుండా దాటేస్తూందని గ్రహించింది.

"నువ్వు నా ప్రశ్నకు జవాబివ్వలేదు రుక్కూ! బతుకుమీద అంతటి విరక్తి ఎందుకు కలిగింది?" సూటిగా అడుగుతున్న సృజనను తప్పించుకోలేకపోయింది రుక్మిణి.

కొద్ది క్షణాలు విహ్వలంగా  చూస్తూ కూర్చున్న రుక్మిణి చివరకు పెదవి విప్పింది.

"నా అన్న నన్ను "రేప్‌చెయ్యబోయాడు"

ఇంక ఆపై మాట్లాడలేక బలంగా ఊపిరి పీలుస్తూ, ఏడుపుని ఆపుకుంటూ కంఠాన్ని సవరించుకోసాగింది రుక్మిణి.

ఆమె వంక శిలలా చూస్తూంది సృజన.

"అవును సృజనా! సెక్స్ సినిమాలు, బూతు పుస్తకాల ప్రభావంతో, కడుపులో పడిన మందు నిషాతో కళ్ళు మూసుకుపోయిన నా అన్న నన్ను రేప్ చెయ్యబోయాడు. బలమంతా ఉపయోగించి అన్నను ప్రతిఘటించిన నాకు, బ్రతుకుమీద,ప్రపంచం మీద, సమస్త మానవ సంబంధాల మీద రోతపుట్టింది. మనిషిలోని మానవతను చంపేసి పశువుగామారుస్తున్న విష సంస్కృతిని ధ్వంసం చేయ్యాలన్న ఉద్రేకం, వక్రమార్గంలో పడి తనను తాను నాశనం చేసుకుంటూ మానవ జన్మకే కళంకంగా మారిన అన్నను చంపిపారేయాలన్న కసి, తండ్రి స్థానంలో ఉన్న వ్యక్తిచేత, తోడబుట్టిన అన్న చేత అత్యాచారానికి గురవబోయిన నా ఈ శరీరం మీద విపరీతమైన జుగుప్స, భరించలేని టెన్షన్‌తో, నిగ్రహించుకోలేని దుఃఖంతో రైలెక్కాను. నా గుండెల మీద నుంచి రైలు చక్రాలు దొర్లుతున్నంత బాధ, నా మెదడులోని ప్రతికణమూ చిట్లిపోతున్న చప్పుడు, రైల్లోంచి ఎప్పుడు దూకేసానో గుర్తు లేదు."

షాక్‌లో ఉన్న సృజన గుండె మీద చెయ్యేసుకుని చేష్టలుదక్కి చూస్తూంది.

"నా సమస్యలకు, జరిగిన సంఘటనలకు ఆత్మహత్య పరిష్కారం కాదని నాకు తెలుసు. క్షణికోద్రేకంతో చేసిన పనికి ఇప్పుడు బాధపడుతున్నాను. బ్రతుకు ఇంతకు పదింతలు దరిద్రంగా ఉన్నప్పటికీ, ప్రతికూలంగా ఉన్న పరిస్థితులతో పోరాడి గెలవడానికే ప్రయత్నించాలి తప్ప పిరికిగా చావగూడదు. జీవితంలో నిలదొక్కుకుని నా కలల్ని సాకారం చేసుకోవడానికి నా సర్వశక్తుల్నీ ఒడ్డాలే తప్ప ఓడిపోగూడదు."

రుక్మిణి చేతిని ఆప్యాయంగా పట్టుకున్న సృజనకు ఆమె చేతినుంచి తన చేతిలోకి శక్తి తరంగాలు వేగంగా ప్రవహించినట్లనిపించింది.

# ఆర్య

**- కొమరవోలు సరోజ**

**అ**మ్మ ఎందుకిట్లా చేసింది?

నేనన్న మాటలకు ఎంత కష్టం కలిగితే మాత్రం ఈ రకంగా తన అయిష్టాన్ని వ్యక్తపరచాలా? మాటలతో తను అర్థం చేసుకోదనా! తను అంత మొండిఘటమా! మీర అంత మూర్ఖురాలా! అసలీ పరిస్థితి రావటానికి కారకులెవరు? చనిపోయిన నాన్నా! సున్నితమైన అమ్మ మనస్సా? తన మాటలా? చేతలా?లేక ప్రవర్తనా? అయినా అమ్మేం తప్పు మాటందని తనంతగా నోరు పారేసుకుంది! మిథున్ కుమార్ ఇంటికి వెళ్ళవద్దన్నది. ఒకరకంగా చూస్తే అమ్మ చెప్పింది నిజమేగా మరి! అతనికి పెళ్ళయింది. నలుగురు పిల్లల తండ్రి. అతని భార్య అతనికి ఏ విషయంలోనూ అడ్డుచెప్పదు. అడ్డుచెప్పినా అతను ఆగే రకం కాదని తనకి బాగానే తెలుసు. సరిగ్గా నెలరోజుల క్రిందట అతనితో పాటు వాళ్ల ఇంటికి వెళ్ళినప్పుడు "ఆంటీ మా నాన్నకు మీలాంటి మంచి స్నేహితులు కూడా వున్నారని ఈ రోజే తెలిసింది" అని పిల్లలు ఉమ్మడిగా చెప్పిన రోజు...మిథున్‌తో కలిసి వెళ్ళే స్నేహితులు ఎలాంటి వారైవుంటారో ఊహించలేనంత పసితనంకాదు తనది. మిథున్ తనవాడు కాలేదనే బాధతోనే తను ఒంటరిగా మిగిలిపోయింది. ఆనాడు కట్నం డబ్బుకోసం మిథున్ నాన్నగారి బెదిరింపులకి భయపడి లొంగిపోయి మనస్సులేని మనువు చేసుకున్నాడు. అయితే ఇంతకాలం అతను తనను మరచిపోలేకపోయాడనే చేదు నిజం ఆనందాన్నిస్తే, అమ్మకు ఆవేశాన్ని అసంతృప్తినీ తెచ్చి పెట్టింది.

తనూ, మిథున్ మనసులు ఇచ్చి పుచ్చుకున్నారు. పెళ్ళి అవుతుందని ఖచ్చితంగా నమ్మారే కాని... ఒకవేళ కాకపోతే ... అని ఏనాడూ ఊహామాత్రంగా కూడా ఊహించలేదు. హఠాత్తుగా ఉరుములు లేకుండా పడిన పిడుగులాగా మిథున్ పెళ్ళి శుభలేఖ వచ్చింది. అప్పుడు కూడా మిథున్ పేరు పక్కన తన పేరు కోసం చూసుకుంది సర్‌ప్రైజ్ చేస్తున్నాడేమోనని. కాదని చెబుతూ అపరిచితమైన 'ఉమ' అనే పేరు తనని

వెక్కిరించింది. ఆరోజు తనకు గుండె ఆగిపోతుందేమో అనిపించింది. తరువాత నాల్గు రోజులకు క్షమాపణలతో డజను ఎఱ్రగులాబీలు మిథున్ పంపించడం జరిగింది. తను చేసేదిలేక తనలో తను కుమిలిపోతూ కాలం వెళ్ళదీయటం నేర్చుకుంది. అమ్మకు ఈ సంగతి చూచాయిగా తెలిసినా కూడా చాలా మామూలుగా వుండిపోయింది. గతాన్ని తల్చుకుంటూ... కొంచెం కొంచెం కాఫీ తాగుతూ రంగురంగుల క్రిస్‌మస్ దీపాలవంక తదేకంగా చూస్తూ ఆలోచిస్తోంది ఆర్య.

అది డిశంబరు నెల కావటం వల్ల సాయంత్రం అయిదు గంటలకే చీకటిపడిపోయింది. ప్రకృతి, పరిసరాలూ, ఇళ్ళూ అన్నీ నిశ్శబ్దాన్ని సూచిస్తుండడం వల్ల కళ్ళముందర, బిల్డింగుల ముందర చెట్లకు అమర్చిన రంగురంగుల విద్యుత్ దీపాల తోరణాలూ, ఇళ్ళ ముందుజింకల ఆకృతిలో ప్లాస్టిక్ తీగలతో తయారుచేసిన జింకలకు పట్టిన చిన్న చిన్న నీలి రంగు, పసుపు రంగు, గులాబీ ఆకుపచ్చరంగుల బల్బుల విద్యుత్ దీపాలు కన్నుల పండువగా విందు చేస్తున్నాయి. క్రింద నుండి ఎవరో బజర్ గట్టిగా నొక్కుతున్నారు. కానీ ఆర్యకు లేవాలనిపించలేదు.

అయిదు నిమిషాలయ్యాక ఎవరో తలుపు తీస్తే లోపలకి వచ్చినట్టుందా వ్యక్తి. తలుపు చప్పుడైతే... తల్లి వచ్చిందేమో అనుకుంది ఆర్య. తల్లి కాదుకదా, కనీసం మిథున్ కూడా కాదు. ఆర్యని ఆశ్చర్యంలో ముంచెత్తుతూ లోపలికి అడుగు పెట్టింది మిసెస్ ఉమా మిథున్‌కుమార్. ఆర్య నోట్లో మాట నోట్లో వుండగానే "కూర్చుంటున్నాను. మీతో కాస్త మాట్లాడాలి" అంటూ కూర్చుంది ఉమ చాలా చొరవగా. ఆర్య లోపలికి వెళ్ళింది కాఫీ పెడ్తానంటూ. ఆమె వెనుకే వంటగదిలోకి వెళ్ళి... "దయచేసి మీరు వచ్చి కూర్చోండి. కాఫీలాంటివేమీ వద్దు" చెప్పింది ఉమ. "పోనీ జ్యూస్..." ఆర్య మాటకు సమాధానంగా మంచినీళ్ళుచాలు" అంటూ తనే డిష్ డ్రైనర్‌లో ఉన్న గాజు గ్లాసు తీసుకుని సింక్‌టాప్‌లో నుండి మంచినీళ్ళు తీసుకుని లివింగ్‌రూమ్‌లోకి నడిచింది.

"చెప్పండి ఉమా" తను కూడా ఉమకు ఎదురుగా కుర్చీలో కూర్చుటూ అడిగింది ఆర్య. "మీ అమ్మగారు మీతోనే వున్నారని చెప్పినట్లు గుర్తు" ఉమ ప్రశ్నకు జవాబుగా ఔనన్నట్టు తల ఊపింది ఆర్య. "మీరు మిథున్‌గార్నిపెళ్ళి చేసుకోవడానికి

ఇప్పుడు కూడా సుముఖంగానే ఉన్నారా?' ఎదురుచూడని ఈ ప్రశ్నకు ఉలిక్కిపడిన ఆర్య ఒక్కసారి తనచేయి గిల్లుకుని... వాస్తవమే. ఇది కల కాదని గట్టిగా నమ్మింది. ఆశ్చర్యంలో మునిగిపోయి నోటమాట కరువైంది. నాలుగు నిమిషాలు నిశ్శబ్దం రాజ్యమేలాక తిరిగి ఉమే మాట్లాడింది. "నా పెళ్లయి పదిహేనేళ్ళు కావస్తోంది. ఆయనకు మనసులో ఏముంటుందో నాకు ఈ నాటికీ అంతుబట్టలేదు. ఇండియాలో ఉన్న పన్నెండు సంవత్సరాలూ నా పోషణ భారమంతా మా అమ్మానాన్నలదే. పిల్ల సుఖపడుతుంది కదా అని నాన్నగారు లక్షన్నరకట్నమిచ్చి పెళ్ళి చేస్తే.... సుఖం మాటెట్లా వున్నా మాకు మనశ్శాంతి కరువైంది. రోజుకో క్రొత్త సమస్య. కొన్నాళ్ళేమో నా చదువు ఆయనకు చాల్లేదని, బోడి 'బి.ఏ' అంటూ ఒకటే గోల. అట్లాగని పోనీ నన్ను వదిలేశాడా అంటే అదీ కాదు. నామీద ఒక్క పైసా ఖర్చు పెట్టడం కూడా అతనికిష్టం లేదు. పిల్లల్ని సరిగ్గా పెంచటం లేదని కొన్నాళ్లుయుద్ధం. మాఅమ్మానాన్నలతో నేను మాట్లాడకూడదని, యింకా కొన్నాళ్ళు అక్రమ సంబంధాలు అంటగట్టి ఇంకా మరికొన్నాళ్ళూ ఒకటేమిటీ నేను కథల్లో విన్నవీ, కన్నవీ రంగు రంగుల కాయితాల్లాగా నా జీవితమనే పుస్తకంలో దర్శనమిచ్చాయి. నేను ఏడవని రోజులేదు. అసలా ఏడుపుకి కళ్ళు పోతాయేమో అనుకున్నాను. అయితే గతాన్ని మరీ అతిగా తవ్వి తలకెత్తుకోవటం నాకిష్టంలేదు. అందువల్ల అవసరం అనుకున్నంత వరకూ మీకు చెప్పాలనుకున్నాను. మూడేళ్ళ క్రిందట ఈ దేశానికి రావటంజరిగింది. ఎక్కడికి వెళ్ళినా దురదృష్టం నన్ను వెన్నంటే వుంది ఇంతవరకూ. అతని వాంఛ తీర్చుకోవడానికి తప్ప నేనెందుకూ పనికిరాని వ్యక్తిని. ఎదురు చెప్పడానికీ అతనితో సై అంటే సై అని ఎక చెక్కాలాడటానికీ, తాగి తందనాలాడడానికీ ఏదీ చేతకానిదాన్ని. నాకు తెలిసిన, నచ్చిన పద్ధతుల్లో నేను సర్దుబాటు చేసుకుని అతన్ని ఆనందంగా వుంచడానికి నా శాయశక్తులా ప్రయత్నించాను.

ఈదేశం వచ్చాక కూడా పెద్దగా చెప్పుకోతగిన మార్పులేదనే చెప్పాలి. నా బట్టలు నేనే కొనుక్కోవాలి. నా టెలిఫోన్‌బిల్ నేనే కట్టుకోవాలి. నాకు సంబంధించిన ప్రతి దానికీ డబ్బు నేనే సంపాదించుకోవాలి. నాకు నా పరిస్థితి ఏ మాత్రం తృప్తిగా లేదు. ఏది ఎట్లా ఏడ్చినా, నా ముఖాన కాస్త డబ్బన్నా తగలేస్తే బాగుండుననుకుంటూ,

అదే విషయాన్ని ధైర్యం చేసి అడిగితే.... నానా రభసా చేశాడు. అతను కూర్చుని మంచి మాటలు మాట్లాడటమనేదే లేదు. సాధారణంగా స్త్రీలు కోరుకునే చీరలూ, నగలూ, ఆ సరదా కూడా లేదు. నా ప్రాణం విసుగెత్తిపోయింది. గతాన్ని ఎక్కువగా తల్చుకోవాలని లేదని ముందే చెప్పాను కదా! అట్లాగే భవిష్యత్ గురించి భయంగానీ, బంగారు కలలుగానీ ఏవీ నాకు లేవు. వర్తమానం మాత్రమే నా ఆలోచన. సరిగ్గా నేను ఇండియా వెళ్ళి పోదామన్న ఆలోచనతో సతమతమవుతున్న సమయంలో మీ రాక నాకో పరిష్కారాన్ని సూచించింది. మీ ఇద్దరి గత జలసేతు బంధం కూడా అర్థమైంది. నేను నా పిల్లల్ని తీసుకుని ఎల్లుండి సాయంత్ర ఎయిర్ కెనడాలో ఇండియా వెళ్ళిపోతున్నాను. పిల్లల్ని అక్కడే చదివించుకుంటాను. ఇక్కడ చేసే కూలి పని అక్కడా దొరుకుతుంది. పిల్లలు పెద్దయ్యాక వాళ్ళకేం కావాలో వాళ్ళే నిర్ణయించుకుంటారు. ”

“అయితే ఏమిటి మీరనేదింతకీ?” నోరు విప్పింది ఆర్య.

“మీకింకా వివరంగా చెప్పాలేమో కదా! వినండి. నేను మళ్ళీ మిథున్ కుమార్ దగ్గరకి ఎలాంటి పరిస్థితిలోనూ వెనక్కు రాబోవటం లేదు. డైవోర్స్ ఇవ్వడానికి నాకెలాంటి అభ్యంతరం లేదు. అతన్నే మనసులో ప్రతిష్టించుకున్న మీరింకా అవివాహితే కాబట్టి మీకూ అతనికి కావాలంటే పెళ్ళి చేసుకోవచ్చు. ఈ మాటలు నేను బాధపడ్తూ చెప్పటం లేదు. బాధా, దుఃఖం, డిప్రెషన్ ఇటువంటి వన్నీ ఏనాడో అనుభవించి ఇప్పుడు అన్నింటికీ అతీతంగా వున్నాను. ఇంక నేను బయల్దేరుతాను” చెప్పవలసింది అయిపోయిందన్నట్టు ఉమ లేచి నిలబడింది. ఆర్య దేవుడు దగ్గరున్న కుంకుమ భరిణ తీసుకుని ముందు తను బొట్టుపెట్టుకుని... ఉమకు బొట్టుపెట్టి రెండు అరటిపండ్లు ఇచ్చింది. “మీకు నాతో మాట్లాడాలనిపిస్తే... ఫోన్ చేయవచ్చు. లేకపోతే ఉత్తరం అయినా వ్రాయొచ్చు” చెప్పి అడ్రసు, టెలిఫోన్ నెంబరూ వ్రాసిన చిన్న కాగితం ఇచ్చి వెళ్ళిపోయింది ఉమా మిథున్ కుమార్.

ఆ కాగితం పట్టుకుని చాలాసేపు శిలా ప్రతిమలాగా నిలబడిపోయింది ఆర్య.

అమ్మ ఎక్కడికి వెళ్ళిందో తెలియటంలేదు. ఈ దేశంకాని దేశంలో ఆవిడకెవరు తెలుసు. పోలీస్ రిపోర్టిస్తే ఎట్లా వుంటుంది. ఆవిడ వెళ్ళి అప్పుడే రెండు రోజులు కావస్తోంది. అమ్మ లేకపోవటం, మిథున్ భార్య వచ్చి మాట్లాడడం అంతా ఏదో అయోమయంగా ఉంది. తనకీ సాఫ్ట్‌వేర్ పుణ్యమా అని కెనడా ఇమిగ్రేషన్‌వచ్చింది. తనకున్నది తల్లి ఒకతే కనుక తనకీ తల్లికీ ఇమిగ్రేషన్ రావటం. ఇక్కడికి వచ్చి ఇంకా రెండేళ్ళు కూడా కాలేదు. ఇంతలో ఎన్ని మార్పులు! ఆరోజు బ్రాంచ్‌కి "శరవణభవన్"కి వెళ్ళకుండా వుంటే మిథున్ కనిపించేవాడు కాదేమో! అంతా విధి! లేకపోతే వెంటనే అతను తనను గుర్తుపట్టడం. ఎందుకు జరగాలి! సరే జరిగినదే అనుకుంటే మళ్ళీ తనెందుకు అతనితో పరిచయం పెంచుకున్నట్లు! అంతా తన తలరాత! మిథున్ తనని ఇప్పుడు పెళ్ళి చేసుకుంటానన్న తను సిద్ధంగా ఉందా! ఆలోచనల వేడి ధాటికి తట్టుకోలేక తల్లక్రిందులవుతోంది ఆర్య. తలమీద పెద్ద బరువు పడినట్లు.

ఇనుప సుత్తితో గట్టిగా కొడుతున్నట్లు విపరీతమైన నొప్పి. తలంతా వేడెక్కి కారపు నీళ్ళతో తలంటి పోసుకున్నట్లు భరించలేనంత మంట. నెమ్మదిగా లేచి టైలనాల్ త్రీ వేసుకుని, ఐసు ముక్కలు ఒక చిన్న టవల్లో వేసి మూటలా కట్టి తలమీద పెట్టుకొని పడుకుంది. సుమారు అరగంట తరువాత మెల్లగా నిద్రపట్టింది. నిద్ర లేచేసరికి తెల్లగా తెల్లవారింది. కిటికిలో నుండి సూర్యకిరణాలు అపార్ట్‌మెంట్ లోపలికి వచ్చి పూర్వా సంధ్యా ప్రవర్తతే అని సుప్రభాతం పాడుతున్నట్లు అనిపించి, ఆహా నిద్ర ఎంతటి వ్యధనైనా తాత్కాలికంగా మరచిపోయేటట్లుగా చేస్తుంది కదా! అనుకుంటూనే సుబ్బలక్ష్మిగారి శ్రీ వెంకటేశ్వర సుప్రభాతం ఆడియో కేసెట్ పెట్టుకుని. బ్రష్ చేసుకుని... కాఫీ కలుపుకుని త్రాగుతూ కూర్చుంది ఆర్య. ఉమ రావటం, ఆమె ప్రయాణం. అలసిన ముఖం, విసిగిన మనసు,మంచితనం మూర్తీభవించిన ఆమె మాటలూ వద్దన్నా గుర్తుకొస్తూనే వున్నాయి. ఉమ స్థానంలో తననూ, తన స్థానంలో ఉమనూ నిలబెట్టి ఆలోచిస్తే.. ఉమకు ఉన్నంత సహృదయం తనకు ఏమాత్రం లేదనిపించింది. ఫోన్ రింగైంది. రెండు మూడుసార్లు వద్దనుకుంటూనే మూడోసారి ఫోనందుకుంది. అమ్మ చేసిందేమో, లేకపోతే ఇంత ప్రొద్దున్నే తీరిగ్గా కూర్చుని ఎవరో టెలీమార్కెటింగ్ కంపెనీవాళ్ళు. వీళ్ళకప్పుడే తెల్లవారింది" తిట్టుకుంటూ ఫోన్ విసురుగా క్రెడిల్ మీద పెట్టి మళ్ళీ వచ్చి కుర్చీలో కూర్చుంది. టీ.వీ ఆన్ చేసినా

ఆమెకు ఆ బుల్లితెర మీద కనబడుతుంది. టీవీలో ప్రసారం అవుతున్న కార్యక్రమం కానేకాదు.. తల్లి, మిథున్‌కుమార్., ఉమ.... ఈ మూడు ముఖాలూ మార్చి మార్చి కనబడుతూ బుర్రను తినడం మొదలైంది. టీవీ రిమోట్‌ను కసిగా నొక్కి ఇంకా మరింత కసిగా నేలమీద విసిరికొట్టింది. ఆడలేక మద్దెల వోడు అన్నట్లు. మళ్ళీ తలపోటు వెధవది... కళ్ళుమూసుకుని కూర్చుంది. తలుపు శబ్దానికి లేచి నిలబడింది ఆర్య. తల్లి తలుపు తీసుకుని లోపలికి వచ్చింది. "అమ్మా" ఆర్యపిలుపుకి సమాధానంగా, వేదాంతిలా ఒక చిరునవ్వు నవ్వి... స్థిత ప్రజ్ఞుడి చందంగా బెడ్‌రూమ్‌లో కెళ్ళి తన బట్టలు సర్దుకోసాగింది కృష్ణవేణమ్మ.

"ఎక్కడి కెళ్ళావమ్మా! నేనేదో పొరపాట్న అంటే మాత్రం మరీ అంత కోపమా! నేనెంత తల్లడిల్లి పోయానో తెలుసా! ఇంకా కొంచెం సేపు నువ్వు రాకపోతే పోలీస్ రిపోర్టిద్దామనుకుంటున్నాను" ఈసారి కూడా కృష్ణవేణమ్మ మౌనంగానే వుండిపోయింది. తన బట్టలు పెట్టెలో సర్దుకోవటం మాత్రం ఆపలేదు. "ఆర్యా! నేను ఇంకొక్క గంట మాత్రమే ఇక్కడ ఉంటాను. నా బట్టలూ, పాస్‌పోర్టూ, పోతన భాగవతం ఇవే నాకు సంబంధించినవి. వీటితోనే నేను నీతో కలిసి వచ్చాను. ఈరోజు వాటిని మాత్రమే నాతో తీసుకువెళ్తున్నాను. నా రక్తాన్ని పంచుకుని, పేగు తెంచుకుని పుట్టిన నిన్ను నిన్నుగానే వదిలి వెళ్తున్నాను. అస్సలు నేను నీతో రాకుండా వుండాల్సింది. వచ్చినా రెండు నెలలుండి వెళ్లిపోవాల్సింది. నువ్వు దాదాపు నలబైఏళ్ళ దానివి. నా అవసరం నీకులేదు. నీ మొండితనం వల్లనైతేనేమి, నా పేదతనం వల్లనైతేనేమి నీకు పెళ్ళి చేయలేకపోయాను. నీకు ఏదో నాకు చేతనైనంతలో చదువు చెప్పించాను. ఈ నాటికి దేవుడి దయవల్ల ఈ దేశానికి రాగలిగావు. నువ్వు స్థిరపడటం చూసి తల్లిగా నేను ఉప్పొంగిపోయాను. నీవల్ల ఎవ్వరూ బాధపడకుండా చూసుకో."

"అమ్మా నీ పట్టుదల మానుకోవా? అసలీ గుండేమిటీ, ఈ తెల్లచీరా, ఈ ముసుగూ? ముఖానికీ, మోచేతులకూ విభూది పట్టీలు!" దుఃఖంతో ఏడుపు ఆపుకుంటూ అంది ఆర్య. "ఈపని ఏనాడో చేసి వుండాల్సింది. మా అమ్మమ్మా, నాయనమ్మా, తాతమ్మా ఈ రకంగానే జీవితాన్ని వెళ్ళబుచ్చారు. మాఅమ్మకి ఈగతి పట్టలేదు కాబట్టి హాయిగా చాటెడు పసుపు, చాటెడు కుంకుమా, గంపెడు పూలతో వెళ్లిపోయింది. సృష్టిలోని దురదృష్టమంతా నా జీవితంలో పొడసూపింది. లేకపోతే

నువ్వు నా కడుపులో వుండగానే మీ నాన్న యాక్సిడెంటయి చనిపోవటం, అందుకోసం వచ్చిన మా నాన్న నన్నూ, మీ నాన్న శవాన్నీ మార్చి మార్చి పిచ్చి చూపులు చూస్తూ... గుండె ఆగి అక్కడికి అక్కడే చనిపోవటం... నా అనే వాళ్ళెవరూ  ఆదుకోకపోవటం.... భోరుభోరున ఏడుస్తున్న నన్ను కాస్త ధైర్యం చెప్పి... పురుడుపోశారు ఒక జడ్జిగారి భార్య. ఆ తరువాత వాళ్ళ ఔట్‌హౌస్‌లో వుండటం, నీకోసం, నాకోసం... వంటమనిషిగా, మారటం, కృష్ణవేణమ్మగారు పాపం చాలా మంచి మనిషి, ఇంటి మనిషి కంటే ఎక్కువగా చుట్టాలకూ పక్కాలకూ మర్యాద చేస్తారు అనే పేరు రావటం, నన్నింతకాలం ఈమాత్రం బ్రతకనిచ్చింది. నేను ఆనాడే గుండు చేయించుకుని తెల్లచీర కట్టుకుంటానంటే... ఆధునిక భావాలున్న ఆ జడ్జీగారి భార్య నన్ను ఆ ప్రయత్నం నుండి మరలించారు. కాబట్టి నిన్న మొన్నటివరకూ నువ్వు చూసిన ఆ జుట్టు ముడీ, రంగుచీరలూ, రవికెలూను, అయితే ఈనాటికి నా కన్న కూతురే వాటికి ఆక్షేపణ చెబుతుందనీ విమర్శిస్తుందనీ నేను అనుకోలేదు. అయితే ఒక  విధంగా చూస్తే.... నాకు జ్ఞానోదయమైనట్లే.... ఆరోజు నువ్వన్నావు గుర్తుందా? నాన్న లేకపోయినా నువ్వీ వేషంలో వుంటూ... నాకు నీతులు చెబుతున్నావా? అని... ఆలోచిస్తే నిజమేనేమో అనిపించింది నాక్కూడా. అవును అసలు నీ వయస్సు వాళ్లకు నేను చెప్పడమేమిటి!" "ఇంతకీ ఎక్కడికి వెళ్దామని!" "ప్రపంచం విశాలమైంది. అదీకాక గుడిసె  కట్టుకుంటానంటే ఆమాత్రం చోటు దొరక్కపోదు." "టిక్కెట్టుకు డబ్బు లెక్కడివమ్మా నీకు!" విస్తుపోతూ అడిగింది ఆర్య. "నువ్వు నీ ఉద్యోగానికి, బ్యాంకుకీ వెళ్లినప్పుడు ఈ బిల్డింగులో వాళ్ళకి కొందరికి వంటచేసి పెట్టడం, అప్పడాలూ, వడియాలూ, రొట్టెలూ, దీపారాధనకి వత్తులూ... నా మాత్రం వోపికలేని వాళ్లకి సహాయపడటం... ఇటువంటివి చేశాను. ఈ విషయం చెప్పలేదు. నువ్వు నొచ్చుకుంటావేమోనని. జీవితంలో చాలాఅవసరాలకి డబ్బు కావాలి కానీ.... నాకు అంత తొందర్లో ఈ రకంగా ఈ అవసరం వస్తుందనుకోలేదు. ఏదయితేనేం, భగవంతుడు ఈమార్గాన్ని నాకు ప్రసాదించాడు." క్రింద నుంచి బజర్ మ్రోగింది. "ఎవరూ?" అడిగిందిఆర్య. "టాక్సీ" "అమ్మా, టాక్సీ పిల్చావా?" ఆర్య ప్రశ్నకు "అవును" చెప్పింది కృష్ణవేణమ్మ.

టాక్సీ వెళ్ళిన దిక్కే చూస్తూ కొంతసేపు పరిసరాలను కూడా మరచిపోయింది ఆర్య. అమ్మకి ఎంత పట్టుదల! ఎంత సున్నితం! అసలే గాయపడిన హృదయం అమ్మది. ఆ గాయాన్ని మాన్పే ప్రయత్నం మాట అటుంచి పెద్ద రణంగా మార్చింది తను. ఆలోచిస్తూనే... తన అపార్ట్‌మెంట్‌లోకి వెళ్ళి... ధన్‌మని తలుపుమూసి.... సోఫాలో పడి భోరు భోరున ఏడ్చింది ఆర్య.

టొరాంటో పియర్సన్ విమానాశ్రయంలో బయల్దేరింది ఎయిర్ కెనడా విమానం. కృష్ణవేణమ్మ కళ్ళముందున్నది పోతనగారి భాగవతం మొదటిభాగం. అలనాడు భాగవతరచనకు శ్రీకారం చుట్టిన బమ్మెర పోతనామాత్యునికి దర్శనమిచ్చాడు శ్రీరామచంద్రుడు. ఈనాడు కృష్ణవేణమ్మకు ఆ పుటలలో దర్శనమిచ్చినవాడు భాగవతాన్ని ఘంటంతో లిఖిస్తున్న 'పోతన్నగారు!" కృష్ణవేణమ్మకు శరీరం పులకించింది. మనస్సంతా తన్మయత్వంతో తాదాత్మ్యం చెందుతుంది.

"ఎవర్ని నమ్మి ఎవరున్నారూ, పోండిరా పొండి" అనే పాట జ్ఞప్తికి వచ్చి... తనలో తనే నవ్వుకుంది. తనకిప్పుడు సరిగ్గా అరవైరెండేళ్ళు. ఈ జీవిత ప్రయాణం ఇంకా ఎన్నేళ్ళు సాగాలో బాల్యమందో, మంచి ప్రాయమందో, ముదిమియందో లేక ముసలియందో.... అనే పద్యం... చుట్టముల మీది భ్రమదీసి చూరజెక్కి.... అనే పద్యం నరసింహ శతకంలోని కళ్ళకు కట్టినట్లు ఆ శతక పుస్తకం ఆమె ముందు లేకపోయినా ఉన్నట్లే కనిపిస్తూ.... చెవులలో ఎవరో సున్నితంగా పద్య పఠన చేస్తున్నట్లనుభూతి కలిగింది. ఎవరి గమ్యాన్ని వారు చేరుకోవాలి. ఎవరి వృత్తిధర్మం వారు తు.చ. తప్పక నెరవేర్చాలి. కనుకనే.... విమానం ప్రయాణీకులందర్నీ వారి వారి గమ్యస్థానాలకు చేర్చడానికి తన విధి నిర్వహణను చేసేస్తోంది.

ఏడ్చి ఏడ్చి సొమ్మసిల్లి నిద్రపోయిన ఆర్య ఎప్పుడో అర్ధరాత్రికి కానీ లేవలేదు. అమ్మసంగతి తనకు తెలుసు. ఆమె ఇంక తన దగ్గరకు రాదు. కొంతకాలం వ్యవధి ఇచ్చిన తరువాత తను వెళ్తే.... అప్పటికి అమ్మ మనసు కొంత కుదుటపడుతుందేమో!

మిథున్‌నే కాదు తననసలు  ఎవర్నీ పెళ్ళి చేసుకోకపోతేనే మంచిదనిపిస్తోంది. ఉమకి ఫోన్ చేసి చెప్పాలి. ఆమె ఏదైనా  కౌన్సిలింగ్‌కి వెళ్ళి భర్తలో  మార్పు కోసం ప్రయత్నిస్తే బాగుంటుందని.

కృష్ణవేణమ్మకు ఇష్టమైన మాడుగులవారి భాగవత కథా గానసుధ సి.డి. వింటూ .. ఏదో స్ఫురించినట్లు ఒక నిర్ణయానికి వచ్చింది ఆర్య. ఆ గట్టి నిర్ణయమే ఆమెకు కొండంత బలాన్నిచ్చింది. మొదటిది మిథున్‌కుమార్‌ని కలవకూడదు. రెండవది ఈ టొరాంటో నగరం నుంచి ఏదైనా చిన్న ఊరికి  మారిపోవటం. ఈ నా సమస్యకు ఇదే సరైన పరిష్కారం  అనుకుని మళ్ళీ నిద్రలోకి జారిపోయింది ఆర్య....

# దీపం

**– శేషూ అప్పారావ్**

**"అ**మ్మాయ్ సుధా! అప్పుడే ఆరుదాటినట్లుంది. కాస్త దీపం వెలిగించగానే నాకు అన్నం పెట్టు తల్లీ!" నీరసంగా అంది సుధ అత్తగారు కమలమ్మగారు.

"తల్లీ సుధా! దీపం త్వరగా వెలిగించి ఇలా తీసుకురా! పేపరు మొదటి పేజీకూడా పూర్తవకుండానే పోయింది కరెంటు" విసుగు ధ్వనించింది మామగారి మాటల్లో.

"అమ్మా! హోమ్‌వర్క్ చాలా వుంది. ఈ చీకట్లో తమ్ముడు నా పుస్తకాలు చించేస్తున్నాడు. దీపం త్వరగా వెలిగించి తీసుకురా!" ఏడుపు గొంతుతో తల్లిని అడిగింది పదేళ్ల హిమ మూడేళ్ళ తమ్ముడు రవిపై ఫిర్యాదు చేస్తూ?

"సుధా! ఈ ఫైల్ మీద పని తప్పని సరిగా పూర్తిచేయాలి రేపు ఇన్‌స్పెక్షన్ వుంది. త్వరగా దీపం వెలిగించి తీసుకురా వెధవ ఆఫీసుపని! రాత్రీ పగలూ ఎన్ని గంటలు పని చేసినా పని తరగదు. ప్రాణానికి సుఖంలేదు" నిరుత్సాహం తొంగి చూసింది భర్త భాస్కర్ మాటల్లో.

"నేనూ మనిషినే! చీకట్లో నాకూ చికాకుగానే వుంటుంది. కళ్ళు కనిపించవు. మీ పనులు కాస్సేపు లేటయితే కొంప మునగదు" ఖయ్యిమంది సుధ.

అత్తమామలు ముఖాలు చిన్నబోయాయి. హిమ నీళ్ళు నిండిన కళ్ళతో తల్లివైపు చూస్తోంది.

తెల్లబోయి భార్యవైపు చూస్తున్నాడు భాస్కర్. అతనికి భార్యకు ఎందుకు కోపం వచ్చిందో అర్థం గావటం లేదు. శారద పెళ్ళికి వెళ్ళి వచ్చిన దగ్గరనుండి మామూలు మనిషిలా లేదు. ఏదో అసంతృప్తితో బాధపడుతోంది. ఎప్పుడూ శాంతంగా, చిరునవ్వుతో వుండే భార్య ఇలా ఎందుకు "బిహేవ్" చేస్తోందో అతనికి అంతు చిక్కటం లేదు.

గబగబా నాలుగు కొవ్వొత్తులు వెలిగించి అందరి దగ్గరా తలొకటీవుంచి వంట పనిలో పడింది సుధ.

యాంత్రికంగా అందరికీ భోజనం వడ్డించింది సుధ. సీరియస్‌గా వున్న సుధ ముఖం చూసి ఎవరూ నోరువిప్పి మాట్లాడలేదు. తలనొప్పిగావుందంటూ భోజనం చెయ్యకుండానే పడుకోడానికి వెళ్ళి పోయింది సుధ.

నిద్ర పట్టక మంచం మీద అటూ ఇటూ దొర్లింది సుధ. ఆలోచనలతో తల వేడెక్కుతోంది. ఛీ! తనదీ ఓ బ్రతుకేనా? గొడ్డులా చాకిరీ చెయ్యడం, జీతం భత్యం లేని ఉద్యోగం తనది. బయట ఉద్యోగాలు ఆరు లేక ఏడుగంటలైతే, తనది మటుకు ఇరవై నాలుగు గంటల ఉద్యోగం. ఏ రకమైన గుర్తింపూ లేని వ్యర్థజీవితం తనది! అన్ని రంగాల్లోనూ స్త్రీలు ఎంతో పురోగమిస్తూ, సమాన హక్కులంటూ పురుషులతో సమానంగా బ్రతకడానికి కంకణం కట్టిన ఈ ఆధునిక యుగంలో తను ఒక మామూలు గృహిణి.

శారదా నీరదా ఎంత అదృష్టవంతులో, వాళ్ళిద్దరూ గుర్తుకురాగానే సుధ కళ్ళవెంట బొటబొటా కన్నీళ్ళు రాలాయి.

రెండురోజుల క్రితమే శారద వివాహమయింది. శారదా, మొగుడూ ఇద్దరూ డాక్టర్లు, సర్జన్లు. వాళ్లది ప్రేమ వివాహం. పెద్ద ఉద్యోగాల్లో ఉన్నారు. వాళ్ళిద్దరినీ చూస్తే ఎంతో ముచ్చటేసింది. వాళ్ళిద్దరూ చాలా అధునాతనంగా వున్నారు. మంచి స్నేహితుల్లా వున్నారు. శారదా, నీరదా చలాకీగా తిరుగుతూ ఆడామగా అందరితోనూ ఇండియన్ పాలిటిక్స్ నుంచీ ఆమెరికన్ సినిమాల వరకూ అన్ని టాపిక్స్ చాలా ఇంటరెస్టింగ్‌గా మాట్లాడుతూంటే చాలా ముచ్చటగా అనిపించింది చూసే వాళ్ళకి.

శారదా, నీరదా తనూ ఒకే ఊళ్ళో వుండి హైస్కూల్‌అయ్యే వరకూ చదువుకున్నారు. తనకి నాన్నగారు ఊళ్ళో వున్నంత మటుకూ హైస్కూల్ అవ్వగానే మంచి ఉద్యోగంలో వున్న భాస్కర్‌కి ఇచ్చి పెళ్ళిచేశారు. ధనిక కుటుంబాల్లో పుట్టిన శారదా, నీరదా పై చదువులకి వెళ్ళారు.

ఏదో ఇల్లూ, వాకిలీచక్కపెట్టుకుంటూ తృప్తిగానే బ్రతుకుతోంది తను ఇన్నాళ్ళూ, గానీ, ఎందుకో ఈ మధ్య జీవితం అంటే విరక్తి కలుగుతోంది. ఎప్పుడూ ఒకే

రకమైన దినచర్య. "సుధా! సుధా!" అంటూ తనని క్షణం కూడా ఊపిరి పీల్చుకోనివ్వరు ఇంటిలో ఎవ్వరూనూ!

నీరద అమెరికన్ యూనివర్శిటీలో ప్రొఫెసర్. అక్కడే ఇంజనీరింగ్‌లో మాస్టర్స్, పి.హెచ్‌డి. చేసింది. అక్కడే పుట్టి పెరిగిన ఒక తెలుగబ్బాయిని ప్రేమించి పెళ్ళి చేసుకుంది. ఇద్దరు చక్కని పిల్లలు నీరదకి. అమెరికన్ 'ఎక్సంట్' లో తెలుగు మాట్లాడుతూ, ఎంతో చక్కని 'మేనర్స్'తో చక్కగా ముద్దుగా వుంటారు వాళ్ళిద్దరూ. నీరదా, మొగుడూ నాజుగ్గా ఒకళ్ల నొకళ్ళ పేర్లతో పిల్చుకుంటూ "స్వీట్‌హార్ట్" "డియర్" "డార్లింగ్" "థ్యాంక్స్" లాంటి పదాలని ఒకళ్ళ దగ్గర మరొకళ్ళు నాజుగ్గా వాడుకుంటూ చాలా చక్కగా వుంటారు.

నీరద తమ ఇంటికి రాకుండా వుంటే బాగుండును. "ఈసారి తప్పకుండా మీ ఇంటికి వచ్చి రెండు రోజులు వుంటామే సుధా" అంటూ ఆప్యాయంగా తన భుజం మీద చెయ్యివేసి చెప్పింది నీరద.

తను ఏమీ మాటాడలేదు.

"తప్పకుండా రండి. వచ్చి మా ఇల్లుని పావనం చెయ్యండి" అంటూ ఎంతో సంతోషంగా తన భర్త వాళ్ళందరినీ ఆహ్వానించాడు. అతిసామాన్యమైన భారతదేశ సంసారం తమది.

"ఏమే సుధా" అంటూ కాలిజోడు నుంచీ కళ్ళజోడువరకూ ప్రతీ దానికి ఆధారపడే పాతకాలపు భర్త భాస్కర్. బహూశ తననీ, తన భర్తనీ చూసి "పాతరాతి యుగం" మనుషులనుకుంటూ నీరదా, భర్తా నవ్వుకుంటారేమో! తనకీ, తనభర్తకి వేషంలో గానీ, ఆకారంలోగానీ ఎక్కడా నాజూకుతనం లేదు. ఇరవై ఎనిమిది ఏళ్ళ వయసుకే తను బాగా లావు అయింది. శారదా నీరదా, తనూ ఒకే వయస్సు వాళ్ళైనా వాళ్ళిద్దరికంటే తను పదిఏళ్ళు పెద్దగా కనిపిస్తుంది.

రిటైర్ అయిన దగ్గర నుంచే తోచకుండా వుంది మామయ్యగారికి. ఎవరు గుమ్మంలోకి వచ్చినా వాళ్ళకి ఊపిరి సలపనివ్వకుండా మాట్లాడి విసిగించేస్తూ వుంటారు ఆయన. నీరద భర్త ఏమనుకుంటాడో!

అత్తగారు ఎక్కువ మాట్లాడరు. ఆవిడ ఎక్కువసేపు నీరసంగా పడుకుని వుంటారు. "సుధా! సుధా!" అంటూ అస్తమానం దేనికో దానికి పిలుస్తుంటారు.

"సుధా! తలనొప్పి బాగా వుందా?" ఆప్యాయంగా సుధ నుదుటిమీద చెయ్యివేసి అన్నాడు భాస్కర్.

విసురుగా తలతిప్పి పడుకుంది సుధ.

"తన మనసులో బాధ ఏమిటో చెప్తే బాగుండును. రేపు నీరదా వాళ్ళు వస్తే మళ్ళీ మామూలు మనిషి అవుతుందేమో సుధ" మనసులోనే మధనపడుతూ నిద్రకుపక్రమించాడు భాస్కర్

అప్పుడే నీరద వచ్చి రెండు రోజులైంది. నీరద కుటుంబం అంతా చక్కగా సుధ కుటుంబంతో ఇమిడిపోయారు. భాస్కర్ రెండు రోజులు శలవు పెట్టి ఇంటి పట్టునే వున్నాడు. భాస్కర్, సుధాకర్, మావగారూ ఎక్కువ రాజకీయాల గురించి చర్చించుకుంటున్నారు.

సుధాకర్ వచ్చిన దగ్గర నుంచి, "మిమ్మల్ని చూస్తే మానాన్నగారిని చూసినట్లు వుందండీ," అంటూ ఎంతో ఆప్యాయంగా వుంటూ, మామగారి కబుర్లని ఓపికగా వింటున్నాడు.

వీధి గుమ్మం దగ్గర అరుగు మీద కూర్చుని పిల్లలంతా ఆడుకుంటున్నారు. అమెరికన్ యాక్సెంట్‌తో నీరద పిల్లలు తెలుగు మాట్లాడుతూంటే వాళ్ళ తెలుగుని ఆటపట్టిస్తున్నారు హిమా, రవీనూ, పిల్లలంతానవ్వులూ, కేరింతలతో ఆడుకుంటున్నారు.

అత్తగారి గదిలో ఆమెపక్కనే కూర్చుని అత్తగారు చెప్పే కబుర్లు వింటోంది నీరద అంత చదువుకున్న పిల్ల అయినా తన దగ్గర కూర్చుని అలా కబుర్లు చెబుతుంటే ఆవిడ ఎంతో సంతోషపడుతున్నారు.

వంటింట్లో సాయంకాలం వంటచేస్తోంది సుధ.

"సుధ! నువ్వు ఒక్క దానివే కష్టపడుతున్నావు. నీకు సాయం చేయనా!" అంటూ పీటవాల్చుకుని సుధ పక్కనే చతికిలపడింది నీరద.

"రోజూ వుండే పనేగా! నీ సాయం అక్కరలేదుకానీ హాయిగా కబుర్లు చెప్పు. మళ్లీ అమెరికా వెళ్ళిపోతే ఎన్నాళ్ళకు వస్తావో!" ఆప్యాయంగా స్నేహితురాలిని చూస్తూ అంది సుధ.

"సుధా! నువ్వెంత అదృష్టవంతురాలివే! ఎంతచక్కగా కుటుంబాన్ని తీర్చిదిద్దుకుంటున్నావు." "నీట్"గా సర్దబడి వున్న ఆ వంటిల్లుని పరికించి చూస్తూ మెచ్చుకోలుగా అంది నీరద.

"చాల్లే! నీ వేళాకోళం నువ్వూను" నిష్టూరం ధ్వనించింది సుధ గొంతులో.

"నిజం సుధా! నిన్ను చూస్తే ఒక రకంగా కొంచెం అసూయగా కూడా ఉంది. ఇంట్లో అందరికీ నువ్వంటే ఎంతో గౌరవం, ప్రేమాను. నీ దగ్గరకు వచ్చిన దగ్గరనుండీ చూస్తున్నా... అందరి నోట్లోనూ ఒకే మాట – సుధా! సుధా అంటూ" నవ్వింది నీరద.

"అసూయా! నన్ను చూస్తే అసూయా, విద్యలో ఉన్నత శిఖరాలను చేరుకుని స్త్రీ స్వాతంత్ర్యమూ, స్త్రీల సమాన హక్కులూ అక్షరాలా అమలులో పెట్టి, పెద్ద పెద్ద హోదాల్లో వున్న నీ ముందూ, శారదముందూ నేనెంత? నా బ్రతుకెంత?" సుధ గొంతు జీరబోయింది. కళ్ళల్లో నీళ్ళ తెరలు రాలాయి.

"సుధా! పెద్ద పెద్ద ఉద్యోగాల్లో వున్న మాలాంటి వాళ్ల జీవితాలు నీలాంటి గృహిణులకు పూలబాటగానే కనిపించవచ్చు. కానీ.... ఉద్యోగం, కుటుంబం, పిల్లలు బాధ్యతల మధ్య మేము ఎలా నలిగిపోతామో ఆ దేవుడికే తెలియాలి. అటు పెద్ద చదువులు చదివి, ఉన్నత శిఖరాలు అధిష్టించిన మేము ఆ పదవులని త్యజించలేము, అలాగని, ఇటు పిల్లల బాధ్యతలనూ పూర్తిగా విస్మరించలేము. రెంటికీ న్యాయం చేకూర్చాలనే తపనలో నలిగి పోతుంటాము" కొద్దిగా అసంతృప్తి తొంగి చూసింది. నీరద మాటల్లో.

అప్పటివరకూ తన జీవితంలోనే అసంతృప్తి నిండి వుందనుకున్న సుధ – నీరద లాంటి వాళ్ళ జీవితంతో కూడా అసంతృప్తి నిండి వుంటుందని తెలుసుకుని నివ్వెరబోయింది.

"సుధా! అయిన వాళ్ళందరి జీవితాల్లోనూ వెలుగును వెదజల్లుతున్న నీ గృహిణి, "జాబ్"ఎంత గొప్పదే! ప్రమోషన్స్, హాలిడేస్, సిక్‌లీవ్... ఇవేమీ లేకుండా, ఆశించకుండా ఎంత మహోన్నత 'జాబ్' నిర్వర్తిస్తుందిస్త్రీ" ఆరాధనా పూర్వకంగా సుధవైపు చూస్తూ అంది నీరద.

"నీరదా! నన్ను ఎంత "సిన్సియర్" గా మెచ్చుకుంటున్నానే! నేను, నిన్నూ, శారదనూ, మీ సంసారాలనూ చూసి ఎంతో అసూయపడ్డాను. అసంతృప్తితో నరకాన్ని సృష్టించుకున్నాను. నా ప్రవర్తనతో నా ఇంటిలో అందరినీ బాధ పెట్టాను" కొద్దిగా సిగ్గు పడుతూ అంది సుధ.

'నిజంగా? మమ్మల్ని చూసి "ఇన్‌ఫీరియర్"గా ఫీలయ్యావా? ఆశ్చర్యంగా స్నేహితురాలి వైపు చూసింది నీరద.

"అవును నీరదా! కానీ, నీరాక వల్ల, నీతో మనసు విప్పి మాట్లాడుకోవడం వల్లా నా కళ్ళు తెరుచుకున్నాయి. ప్రతిమనిషి జీవితంలోనూ ఏదో ఒక అసంతృప్తి వుంటుంది. తన కంటే ఉన్నత దశలో వున్న వాళ్ళను చూస్తే బాధగా ఉంటుంది. కానీ మనకున్న పరిస్థితుల్నీ, మనకున్న అవకాశాలతో జీవితాన్ని సుఖమయం చేసుకోడానికి ప్రయత్నించాలి. ఇంకొకళ్ళు ఏవో సుఖపడిపోతున్నారనుకుంటూ మన జీవితాల్లో నరకం సృష్టించుకోవడంలో అర్థం లేదు. మన చుట్టూ వున్న వాళ్ళని ఆనందపరచటంలోనే వుంది నిజమైన తృప్తి." సుధ కళ్ళు ఒక రకమైన తృప్తితో మెరుస్తున్నాయి.

'ఎంత చక్కగా చెప్పావే సుధా! ఇంతకీ నువ్వు ఏ కాలేజీలో చదువుకున్నావు?" స్నేహితురాలిని వేళాకోళం చేసిన నీరద.

భోజనాల వేళకాగానే, అదేదో "రొటీన్" లా కరెంటు పోయింది.

"అత్తయ్యా! నేను మీ గదిలోకి భోజనాన్ని తెస్తాను" అంటూ ఒక చేత్తో భోజనాన్నీ మరొక చేత్తో ఒక కొవ్వొత్తినీ పట్టుకుని అత్తగారి గదిలోకి వెళ్ళింది సుధ!

# కరువు

– డా॥సోమరాజు సుశీల

**చా**లా సంవత్సరాల క్రితం ఒకరోజు నేను మా ఫ్యాక్టరీలో మంచిపనిలో ఉండగా "ఇంటి నుంచి ఫోనొచ్చింది. పెద్దమ్మగారు మాట్లాడుతారట" అని అంటూ మా పిఏ నా చేతికి ఫోను ఇచ్చింది. పెద్దమ్మ గారంటే మా అమ్మ చిన్నమ్మగారంటే మా అత్తగారు. ఫ్యాక్టరీ అమ్మ అంటే నేను. ఈ విధంగా మేం ముగ్గురమ్మలం మా సామ్రాజ్యాన్ని పరిపాలిస్తూ ఉండేవాళ్ళం అన్నమాట. మా అమ్మ సాధారణంగా నాకు ఫోను చేసేది కాదు. మా అత్తగారు మాత్రం కాఫీ పొడి అయిపోయిందనో, రిజిస్టరు ఉత్తరం వచ్చిందనో, కరెంటు ఒక ఫేజు రావడం లేదనో ఏదో ఒకపనిమీద రెండుమూడుసార్లు అయినా చేసేవారు. మా అమ్మ అలాంటి గృహనిర్వహణ సమస్యలు పట్టించుకునేది కాదు. ఎంతయినా ఆవిడకి మా ఇల్లు కూతురిల్లే కదా! అందుకని ఎంతలో ఉండాలో అంతలో ఉండాలని తరచూ అంటూ ఉండేది. తనకి చేతనయిన పనిచేసి ఏదో ఒక పుస్తకం చదువు కుంటూ ఉండేది. ఈ సమయంలో అంత అర్జెంటుగా ఆవిడ ఫోనెందుకు చేసిందా అనుకుంటూ ఫోను తీసుకుని 'ఏమిటమ్మా' అని అడిగాను.

'రవి వస్తున్నాడుటే! ఇప్పుడే ఉత్తరం వచ్చింది" అంది. "ఎప్పుడట?" అన్నాను. 'బహుశా మళ్ళీ నెల పదహారున. ఇంకా రిజర్వేషన్ కన్ఫర్మ్వ్వలేదట. ఇంటికొచ్చాక నీతో కొంచెం మాట్లాడాలి" అంది.

"ఏం ఉంటాయిలే! నువ్వు నాకు చెప్పేవి. నేను వినవలసినవి. ఇంటికొచ్చాక మాట్లాడుకుందాం" అని ఫోనుపెట్టేశాను.

రవి అంటే మా ఒక్కగానొక్క తమ్ముడు. నాకన్నా పధ్నాలుగేళ్ళు చిన్న. మా అమ్మానాన్నలకి నలుగురు ఆడపిల్లల తర్వాత ఎన్నో పూజలు, వ్రతాలు చేశాక మురిపిస్తూ పుట్టిన గారాబాల కూచి. పాపం వాడు ఉద్యోగస్తుడవడం మా నాన్న చూడనే లేదు. రవి బాగా చదువుకుని ఎవరి సహాయ సహకారాలు లేకుండానే

గవర్నమెంటులో పెద్ద ఉద్యోగం సంపాయించుకున్నాడు. పోస్టింగ్ మాత్రం అస్సాంలో, అందులోనూ ఎక్కడో అడవుల్లో, అప్పట్లో సెల్‌ఫోన్ల వాడకాలు, విమానాల్లో ప్రయాణాలు సామాన్యులకి అంతగా అలవాటవలేదు. అందుకే వాడు ఎప్పుడూ నాలుగురోజులు ప్రయాణం చేసి రైల్లోనే వచ్చేవాడు. ఎక్కువగా ఫోన్లు చేసేవాడు కాదు. ఇన్లాండు కవరు మీద అమ్మపేరున నెలకొక ఉత్తరం వ్రాసేవాడు. దాన్ని ఆవిడ మళ్ళీ ఇంకో ఉత్తరం వచ్చేవరకూ భగవద్గీతలాగా పారాయణం చేసేది. కొడుకంటే అంత ప్రేమెందుకని మా అక్కచెల్లెళ్ళు, మా పిల్లలు అందరం ఆవిడని వెక్కిరిస్తూనే ఉండేవాళ్ళం. కానీ ఆ విషయంలో మాత్రం మా ఎవరినీ ఖాతరు చేసేది కాదు.

రోజూ ఫ్యాక్టరీ నుంచి ఇంటికొచ్చాక ఎవరితోనూ ఏమీమాట్లాడకుండా తిన్నగా నా గదిలోకి వెళ్ళిపోయి ఒక అరగంట మంచం మీద దొర్లడం నా కలవాటు. ఆ సమయంలో ఎవరూ నా జోలికి వచ్చే ప్రయత్నం చేయరు. కానీ ఆ వేళ మాత్రం మా అమ్మ మంచినీళ్ళ గ్లాసుతో నా గదిలోకి వచ్చి నీళ్ళు బల్లమీద పెట్టి కుర్చీ లాక్కుని కూచుంది. ఆవిడలా ఎందుకు చేస్తుందో మాత్రమే కాకుండా నాతో ఏం మాట్లాడాలనుకుంటోందో కూడా నాకు తెలుసు. రవి వస్తున్నాడని తెలియగానే ప్రతి ఆరు నెలలకీ జరిగే కథే ఇది. "ఉసిరికాయలేనా?" అని అడిగాను.

"అవునే! మీ రాజుగారి తోటలో చెట్టుకి ఎప్పుడూ కాయలుంటాయంటావు కదా! ఒక్క కిలో తెప్పిస్తే చాలు అంది.

'ఏం బాగుంటుందమ్మా! నేను ఆయనని పలకరించి ఏడాదయింది. ఏవేవో సమస్యల్లో ఉన్నారుట. ఇప్పుడు ఉసిరికాయలకోసం పలకరిస్తే "ఏమనుకుంటారు? చూద్దాంలే ఇంకా చాలా టైముంది. అయినా ఇంట్లో కొలువుతీరిన ఊరగాయలు చాలవా? నీకంతా చాదస్తం" అని కొంచెం విసుగ్గా అన్నాను. మా అత్తగార్ని నేను ఎంత విసుక్కున్నా ఆవిడేం పట్టించుకోరు. "సర్లే! నీ కోపం తగ్గాక మాట్లాడుకుందాం" అని వెళ్ళిపోతారు. కానీ మా అమ్మ అలా కాదు. నా గొంతులో చిన్న మార్పు కనపడితే నా మీద మూడురోజులు అలుగుతుంది. అవన్నీ మా నాన్న చేసిన అలవాట్లు మరి. ఆవిడకలా జరిపారు. అమ్మ గబుక్కున కుర్చీ జరిపి లేచి మాట్లాడకుండా

వెళ్ళిపోతుంటే “సర్లేవే! రేపు ఆయనతో మాట్లాడి డ్రైవరుని పంపి తెప్పిస్తాలే” అన్నాను. “ఫరవాలేదులే! నీకు వీలయితేనే చెయ్యి” అని బయటకు వెళ్ళిపోయింది.

వాడు రావడానికి ఇంకా పదిహేను రోజులు టైముంది. కానీ మా అమ్మ హడావిడి మొదలయింది. మా అమ్మకి కొన్ని గట్టి నమ్మకాలున్నాయి. రవికి ఉసిరావకాయ అంటే చాలా ఇష్టం అనీ, బీరకాయ ఉల్లికారం పెట్టి కూరచేస్తే చల్లారినా బాగుంటుంది కాబట్టి వాడేవేళప్పుడు వచ్చినా వీలుగా ఉంటుందనీ, పెరుగు పులిస్తే తినలేడు కాబట్టి సాయంత్రం అయిదు గంటలకి తోడుపెడితే 10 గంటలకి కమ్మటి పెరుగవుతుందనీ.... ఇలా రకరకాల ప్లాన్లు.. వాడెప్పుడు వచ్చినా వారం రోజుల కన్నా ఉండడం కుదరదు. కొత్త ఉద్యోగం కదా సెలవు దొరకదు. అంత కాస్త టైంలో ఈవిడ చేయాలనుకున్నవన్నీ తినడం వాడివల్ల అయ్యేపనేనా? మా అక్కచెల్లెళ్ళందరం “అమ్మా! మా కోసం ఎప్పుడయినా ఇలా చేశావుటే! కొడుకంటే మరీ అంత పక్షపాతం పనికిరాదు” అని గొడవపెట్టేవాళ్ళం. ‘పొండే! దొంగ మొహల్లారా! నేనేమీ చెయ్యకుండానే ఇంతవాళ్ళయ్యారు పాపం! తిన్నదంతా పరగడుపే! నా వయసొచ్చాక తెలిసొస్తుంది” అని మమ్మల్ని కసిరేది.

ఆ రోజుల్లో అస్సాం నుంచి ఆంధ్రాకు ఒకటే రైలుండేది. ఆ రైలుని విజయవాడలో దిగి ఇంకో రైలో, బస్సో పట్టుకుని వాడే రాత్రి పదిన్నరకో వచ్చేవాడు. అప్పుడప్పుడు కలకత్తా వరకు వచ్చి అక్కడ నుంచి డైరెక్టుగా హైదరాబాదు వచ్చేవాడు. కాబట్టి కచ్చితంగా ఫలానా టైముకి వస్తాడని తెలిసేది కాదు. ఈవిడ మాత్రం వాడు రాసిన ఉత్తరం ఆధారంగా ఒక మూడు రోజులపాటు ఏ వేళప్పుడు వస్తాడో అని అన్ని వేళల్లోనూ ఎదురుచూస్తూ ఉండేది. ప్రతిరోజూ వంటంతా చేసి (అందులో బీరకాయకూర తప్పనిసరి) బల్లమీద పెట్టించేది. రోజుకి మూడుసార్లు పెరుగుతోడు పెట్టించేది. వాడి రూములో దుప్పట్లన్నీ ఉతికించి – ఇస్త్రీ చేయించి రెడీ చేసేది. తను తెల్లవారకుండానూ, పొద్దుగూకగానేను స్నానం చేసి, మంచి చీరకట్టుకుని చక్కగా తయారయి చేతిలో పుస్తకం పట్టుకుని గుమ్మంలో ఎవరొచ్చినా కనబడేలా కూచుని చదువుకుంటూ ఉండేది. ఆవిడలా లేకపోతే అమ్మకి ఆరోగ్యం బాగాలేదని దూరాన వున్న కొడుకు దిగులు పడతాడట పాపం. రోజూ 9 గంటలకే పడుకునే ఆవిడ పదిన్నరయినా పక్క సర్దుకునేది కాదు.

మా కెవరికీ రాలేదుగానీ మా అమ్మకి చాలా మంచి అలవాట్లుండేవి. ఎప్పుడూ ఇంట్లో ఉన్న ఆడవాళ్ళు పిల్లలు మంచి బట్టలు కట్టుకుని సంతోషంగా ఉండాలని, అలా చేస్తేనే లక్ష్మి నిలుస్తుందని ఆవిడ నమ్మకం. ఇంటికెవరయినా అతిథులు వచ్చినా రాకపోయినా ఒకేలాగా కళకళ్ళాడుతూ ఉండేది. ఎంత పని చేసినా బట్ట నలిగేది కాదు. జుట్టు చెదిరేది కాదు. ఇప్పుడాడపిల్లలు ఇంట్లో ఉన్నంతసేపు నైటీలతో తిరుగుతూ చాలా అందవిహీనంగా కనిపిస్తారు. చీర కట్టుకుంటే పని కుదరదనీ, అడ్డం వస్తుందనీ ఏవేవో వంకలు పెడతారు. అసలు నూలు చీరకన్నా సౌకర్యంగా ఉండే వస్త్రధారణ ఉందా? బయటకు వెళ్ళేటప్పుడు మాత్రం గంటల తరబడి సింగారించుకుంటేగానీ బయటకు అడుగుపెట్టరు. ఇంట్లో వాళ్ల కర్మ. ఎప్పుడూ జిడ్డుమొఖాల్ని చూడాల్సిందే. ఎందుకంటే ముస్తాబయ్యాక క్షణం ఉండరు కదా ఇంట్లో!

మా అమ్మ మంచి మంచి టిఫిన్లు, స్వీట్లు చేయడంలో దిట్ట. ఓరోజు నా కొడుకు ఆవిడ దగ్గర చేరి "అమ్మమ్మా! జాంగ్రీ చేయవా! చాలా రోజులయిందీ" అని గారాబంగా అడిగాడు. పాపం మా అమ్మ చాలా సంబరపడిపోయి "నా తండ్రే! తప్పకుండా చేస్తాగానీ నీకు జాంగ్రీ అంటే ఎప్పట్నించి ఇష్టం కలిగిందీ? ఇంక రెండు రోజులాగరా! రవి మావయ్య వచ్చేస్తాడుగా! రాగానే ముందు అదే చేసుకుందాం" అంది. వీళ్ళకి కాస్త దూరంగా నిలబడి సంభాషణ వింటున్న మా అమ్మాయి "తియ్యరా! రూపాయి తియ్యి. అక్కని, ఏడాది పెద్దదాన్ని చెప్తున్నానని గౌరవం లేకుండా నాతోనే కడతావూ పందెం?" అని వాడ్ని దబాయించింది. వెంటనే వాడూ, వాడ్ని తరుముకుంటూ అదీ పరిగెత్తుకుంటూ పోయారు. అంటే ఇంక మా ఇంట్లో జరగాల్సిన విశేషాలు, వండుకోవాల్సిన పిండివంటలూ అన్నీ రవి మావయ్య కోసం ఆగవలసిందేనన్న మాట.

అలా ఆవిడ ఎదురుచూడగా చూడగా వాడు రావడమూ, వారం రోజులిట్టే గడిచిపోవడమూ అయ్యేది. వాడున్నన్నాళ్ళూ ఇంటినిండా అమ్మవైపు బంధువులే! మా పిన్నిలూ, మావయ్యలూ, అత్తయ్యలూ, అందరూ ఏదో ఒక టైంలో వచ్చి తొంగిచూసి వెళ్ళిపోయేవారు పిల్లందరికీ కనీసం ఒక హోటల్లో టిఫెన్లు తినే కార్యక్రమం,

రెండు సినిమాలకి వెళ్ళడం ఉండేది. కానీ జీవితంలో మంచి మంచి సందర్భాలన్నీ ఎప్పుడో అప్పుడు ముగుస్తాయి కదా.

ఇలాంటి సందళ్ళు కొన్నిసార్లు జరిగాక మా అమ్మ ఇంతమంది పరివారాన్ని వదిలేసి, ఎక్కడున్నారో తెలియని మా నాన్నని వెతుక్కుంటూ పరలోకాలకి వెళ్ళిపోయింది. ఇంక ఆశలేదని చెప్పాక కూడా అంత దూరాన ఉన్న కొడుకు వచ్చేదాకా ఉగ్గపట్టుకుని ఉండి, వాడి చేతిలో సునాయాసంగా ప్రాణాలు వదిలింది. జరగవలసిన విధులన్నీ అయ్యాక వాడు తిరిగి వెళ్ళిపోయాడు. వెళ్ళేటప్పుడు "అమ్మలేకపోయినా ఆరునెలలకోసారి వస్తుంటాలే! నాకు మాత్రం ఎవరున్నారు అక్కా! మీ అందరిలో అమ్మని చూసుకోవడమేగా" అని బాధపడ్డాడు.

చూస్తుండగానే ఏడెనిమిది నెలలు గడిచిపోయాయి. అందరం రొటీన్లో పడి పోయాం. రోజుకొకసారయినా ఏదో ఒక సందర్భంలో అమ్మని గుర్తు చేసుకుని నవ్వుకోవడమో, బాధపడడమో చేసేవాళ్ళం. మా అత్తగారు చాలా డీలాపడిపోయి అన్నిటికీ నన్నే సలహాలు అడిగేవారు. ఆవిడ కొంచెం ఖాయిలా పడటంతో నాకు ఇంట్లో పని ఎక్కువయింది. కొందరు గిట్టనివాళ్ళు "కూతుళ్ళు బాగానే కోలుకున్నారుగానీ వియ్యపురాలు తేరుకోలేకపోతోంది" అని కామెంటు చేసేవారు. మళ్ళీ రవి దగ్గరి నుంచి ఉత్తరం వచ్చింది. "అక్కా! మద్రాసులో కాన్ఫరెన్సుంది. నేను జనవరి ఆరవ తేదీ కల్లా వచ్చి పండగెళ్ళాక మద్రాసు వెడతాను. అత్తయ్య గారి ఆరోగ్యం ఎలా ఉంది?" అని వ్రాశాడు. మా చెల్లెళ్లందరికీ ఫోను చేసి వాడు వస్తున్నాడని చెప్పాను.

కొత్త సంవత్సర ప్రవేశపు హడావిడి అయ్యాక ఫ్యాక్టరీలో పని ఎక్కువయింది. చాలా బిజీగా ఉండి ఆలస్యంగా ఇంటికి వచ్చాను. వంటావిడ జ్వరం అని ముసుగుపెట్టిందిట. ముందు చెప్పలేదేం అని అత్తగార్ని అడిగితే "వంట వేళకి లేస్తుందేమోననుకున్నాను" అన్నారు. ఫ్రిజ్జు తీసి చూస్తే ఒక్క కూరకాదు కదా పచ్చిమిరపకాయలు కూడా లేవు. అందరిమీదా అరుస్తూ బుట్టలో ఉన్న నాలుగు బంగాళదుంపలు వేయించి చింతకాయపచ్చడి నూరి చారు పెట్టాను (మా ఇంట్లో పెద్ద కరివేపాకు చెట్టుంది. ఎంత చారయినా పెట్టుకోవచ్చు).

పొద్దుటి పాలు ఎవరూ తోడు పెట్టలేదు. ఫ్రిజ్జులోను పెట్టలేదు. దాంతో ఆ పూటకి మజ్జిగ లేనట్లే. మా ఆయన నన్ను చూసి భయపడి మాట్లాడకుండా తినేసి వెళ్ళిపడుకున్నారు. నామటుక్కు నాకు మా ఆయన భోజనం అయిపోతే ఇంట్లో పనులన్నీ అయిపోయినట్లే! ఏదో ఒకటి తినేసి తలుపులన్నీ వేసి పడుకున్నాం. నిద్రపట్టబోతుండగా కిటికీ దగ్గర అలికిడయినట్లయింది. ఎవరో దొంగలొచ్చినట్లున్నారండీ! మసుల్తున్నారూ" అని మా ఆయన్ని లేపాను. ఇంకా పదకొండవలేదు. ఇంత పెందరాడే ఏ దొంగా రాడు" అన్నారు. ఇంతట్లోకీ "అక్కా! నేను! రవిని. తలుపుతీయండి" అని వినిపించింది.

"మీ తమ్ముడొచ్చినట్లున్నాడు! వెళ్ళు" అని లైటు వేశారు. "వస్తున్నా నాన్నా" అని బయటకు పరిగెత్తాను. తలుపు తీసి చూస్తే మూడు రోజులు ప్రయాణం చేసి చేసి తుక్కయిపోయి, ఇంటికొచ్చిన బిడ్డ! నా గుండె నీరయిపోయింది. ఈ వేళ ఆరో తారీకా! ఎలా మర్చిపోయామందరం! ఇంకా ఏడాదన్నా కాలేదు. ఓ ఎదురు చూసేవాళ్ళు లేరు. బల్లమీద ఉసిరి ఆవకాయలేదు. బీరకాయ కూర లేదు. కమ్మటి పెరుగు లేకపోతే మానె పుల్లమజ్జిగన్నా లేదు. ఎంత దుఃఖం వచ్చిందో! అమ్మ లేనంతమాత్రాన ఇంత దారుణంగా ఉంటుందా?" అనుకుంటూ వాడ్ని పట్టుకుని "అమ్మలేదుగదరా కన్నా! ఇంక అంతా కరువే" అని బావురుమన్నాను.

# కృష్ణవేణి

**- సి.వేదవతి**

**నా** కెందుకో చిన్నప్పటి నుంచీ 'సౌందర్యం' అంటే మనస్సు. ఈ సౌందర్యారాధన నాకు పుట్టుకతో వచ్చిందే కనుక పుడకలతో కానీ పోదని అనుకుంటూ ఉంటారు.

మనిషిలోనో, మనస్సులోనో, వేపపూతలోనో, వెన్నెల వెలుగులోనో తొంగి చూచే రవ్వంత సౌందర్యమైనా చాలు నా ప్రాణానికి–ఆ కాస్త పరిమళంతో ప్రొద్దూకులూ పరవశించి పోగలను. కాకులు దూరని కారడవిలో కూడా కాస్త సుందరతను దర్శించుకోవచ్చునని నా మతం. సత్యం, శివం, సుందరం అయిన ఈ సృష్టి యావత్తూ సౌందర్య విరాజితమే!

మనుషులైనా అంతే. ఎంత వికారంగా ఉన్న మనిషిలోనయినా సరే, ఏదో ఒక మూల, ఏదో ఒక రూపంలో నలకంత అందం గోచరించకుండా ఉండదు. మాటలోనో, మూతివిరుపులోనో, నవ్వులోనో, పలువరుస తీరులోనో ప్రచ్ఛన్నంగా దాక్కుని ఉంటుంది ఆవగింజంత అందమైనా!

అశాశ్వతమైంది భౌతిక సౌందర్యం. అది ఉన్నా ఒకటే, లేకపోయినా ఒకటే! మనిషికి ముఖ్యమైంది మానసిక సౌందర్యం–అంటారు కొంత మంది ఆ మాట కాదనను. కాని మానసిక సౌందర్యంతో పాటు రవ్వంత రంజింప చేసే రమణీయకత కూడా మనిషికి ఉండాలి. అది లేకపోతే, ఆ కాస్త ఊహా మాత్రంగానయినా నేను దర్శించుకోలేకపోతే ఏదో బాధ వచ్చి విలవిలలాడి పోతాను.

మా పదిహేనేళ్ళ కాపురంలోనూ నేను చేస్తూ వచ్చిన పని అదే! వంటింట్లో వంటకాల్లోనూ, ముంగిట్లో ముగ్గుల్లోనూ కూడా నా సౌందర్య ప్రయత్నాన్ని ఏదో విధంగా ప్రదర్శించు కుంటూనే ఉంటాను. గృహిణినయినా, తల్లినయినా, అడుగడుగునా రసానందంతో స్పందించి పోయే గుండెని మాత్రం అదుపులో పెట్టుకోలేకపోయినాను.

ఆయనగారికి మాత్రం ఆ అందమూ ఆనందమూ–అంతా అకౌంట్స్ లోనే అందుబాటు అవుతూవుంటాయని అనిపిస్తుంది. లెఖ్ఖలూ, అకౌంట్సూ అంటే ఆయనకు ఎక్కడ లేని ఉత్సాహం, హెచ్చువేతలు, తీసివేతలు కూడికల్లోనే సౌందర్య భావనా, రసస్పందనా ఏ మూల దాక్కుని ఉంటాయో నాకు మాత్రం తెలియదు.

అందుకే ఆయనగారి అకౌంట్సులో అందాలు వెదకడం నేను మానుకున్నాను. నా హృదయగతమైన భావుకతా సౌందర్యాన్ని వెతికి పట్టుకునే నేర్పు ఆయనకు లేకుండా పోయింది.

ఈ విషయంలో తప్పితే, మా సంసారం సామరస్యంగా సాగిపోతూందనే చెప్పవచ్చు. తొమ్మిదేళ్ళ మహేష్, ఏడేళ్ళ మంజులా అందుకు సాక్షులు.

అకౌంట్స్‌లోనూ, ఆర్జనలోనూ కూడా ఆయనగారు కొంత పై అంకె అందుకున్నారు. కొంత స్థాయీ, స్టేటస్ కూడా పెరిగాయి.

అద్దె కొంపలతో అప్పటికే విసుగు వచ్చేసింది మాకు. కొంత కూడబెట్టుకున్న సొమ్ము ఉంది. కొంత అకౌంటెంట్ జనరల్ వారి అకౌంట్స్‌లో నుంచి అప్పు సంపాదించారు. స్థలం కొని ఇల్లు కట్టడం ప్రారంభించారు. అకౌంట్స్ సెక్షనంతా ఆయనగారిది, అలంకరణల డిపార్టుమెంటు నాది.

నా అభిరుచికి తగినట్లుగా ఇంటిని రూపుదిద్దుకోవాలని నా ఆరాటం. ఆ ఆదేశంతో నేను ఏవో ఊహలు అల్లుతుండే సరికల్లా– ఆయనగారు అకౌంట్స్ పుస్తకం నాముందర పెట్టి ఈలోకం లోకి ఈడ్చుకు వస్తుండేవారు.

మేము స్థలం కొని ఇల్లు కడుతూ ఉండిన ప్రాంతంలో చుట్టుపక్కల పెద్ద బిల్డింగులు ఏమీ లేవు. సామాన్యపు పెంకుటిళ్ళు, పూరిళ్ళు మాత్రం ఉన్నాయి. తయారయితే, మేము కడుతూ ఉండిన ఇల్లు ఒక్కటే ఆ ప్రదేశానికంతా అందమయిన భవంతి అవుతుంది.

డ్రాయింగ్ రూమ్‌లో షోకేస్‌లా ఈ గోడంతా అలమర అమరాలి. కిచెన్ షెల్ఫ్‌కు డెకొలమ్ షీట్‌తో తలుపులు పెడితే చూడటానికి నీట్‌గా ఉంటుంది. వరండా పక్కగా పూలమొక్కలు పెట్టుకోవటానికి అనువుగా సిమెంట్ తొట్లు కట్టాలి. దక్షిణంవైపున ఒక చిన్న సిట్‌ఔట్‌గా పెంచితే బాగుంటుంది.

ఇట్లా–కట్టే ఇంట్లోకి బయటికీ పదిమాట్లు తిరుగుతూ పదిరకాలుగా ప్లాను వేస్తూ ఉండే దానిని. అయితే ఆయనగారి అకౌంట్స్ మాత్రం మధ్యేమార్గంలో సుదర్శన చక్రంలా అడ్డుకుని నన్నూ నా ప్లాన్లనీ అదుపులో పెడుతూ ఉండేవి.

కొత్త ఇంటికి మెరుగులు దిద్దుకునే తొందరలో, హడావిళ్ళలో అదాటుగా ఎప్పుడో చూచాను మా పక్క ఇంటి పెంకుటింట్లో ఇల్లాలిని.

పేరుకు అది పెంకుటిల్లే గాని దానికన్నా బాగా కప్పిన పూరిల్లే నయమేమో అనిపించేట్లుగా ఉంది. పెంకులన్నీ అస్తవ్యస్తంగా ఉండి సూర్యుణ్ణీ, చంద్రుణ్ణీ, వానదేవుణ్ణీ కూడా లోపలకు ఆహ్వానించేట్లుగా సందులు కనిపిస్తున్నాయి.

పిల్లలయితే నలుగురో ఇంకా ఎక్కువమందో కనిపిస్తూ ఉండేవారు. ఆ ఇంటాయన మాత్రం ఇంతవరకూ నాకు కన్పించలేదు. నేను పడమటి వైపు నుంచి ఇంటి ఎలివేషన్ ఎలా వచ్చిందా అని కాస్త ఎడంగా నించుని పరీక్షిస్తున్నాను. ఆవిడ గంజినీళ్లో ఏమిటో గిన్నెతో పట్టుకువచ్చి బయట ఒలకపోసి వెనక్కు తిరిగింది.

అప్పుడు చూచాను ఆవిణ్ణి... వేలుముడి వేసి విడిచిన ఆవిడ కబరీ భారాన్ని చూచి కదిలిపోయాను. ఏదో కడుపు నిండిన అనుభూతితో!

ఆవిడ రూపం అతిలోకం ఏమీ కాదు. సామాన్యమైనదే. ఒంటిమీద చీర మామూలు చీర. వెలిసి పోయిన చీర. చీర కట్టుకోవటం లోనూ ప్రత్యేకత ఏమీ లేదు.

కాని ఆ శిరోజాలు, ఆ తలకట్టు, కాస్త నొక్కుతో కారుమేఘంలా, కారు చీకట్లా చుట్టుకుపోయిన ఆ కేశపాశం చూచేటప్పటికి నా సౌందర్య ప్రయత్నం పురివిప్పిన నెమలిలా నాట్యం చేసింది.

అవన్నీ ఆవిడ వెంట్రుకలేనా? సవరమేదన్నా దోపి ఉండదుకదా! అంత నిరాడంబరంగా ఉన్న మనిషి సవరం పెట్టి అంత సిగ సంతరించుకుని ఉండదు. ఊహు... అదంతా ఆవిడ కేశసంపదే అయి ఉంటుంది!

సౌందర్యం ఏ పాటిదయినా, ఏ కోణంలో ఇరుక్కుని ఉన్నా, చూచి ఆనందించగలది నా మనస్సు–అని మొదట్లో చెప్పుకున్నాను. కాని ఇప్పుడది నాకు కించిదసూయ కూడా కలగజేసిందని ఒప్పుకోక తప్పదు.

'కాకి పిల్ల కాకికి ముద్దు' అన్నట్లుగా అద్దంలో చూచుకుంటే ఎవరిముఖం వారికి అందంగానే కనిపిస్తుంది. అలాగే నా ముఖమూ నాకు బాగానే ఉన్నట్లు అనిపిస్తుంది. వేషంలో కూడా చాలా మటుకు శ్రద్ధ తీసుకుంటూనే ఉంటాను.

కాని నాకు బొత్తిగా నచ్చనిది నా తలకట్టు. చిన్నప్పటి నుంచీ నాకు బారెడు జడుండాలని కోరికగా ఉంటే, అది బెత్తెడు దాటి పెరగనని మొరాయించేసింది.

పెళ్ళి చూపులప్పుడు పెళ్ళిలో మా వాళ్ళు నాకు సవరం పెట్టి జడవేశారు. అది చూచి నిజమే అనుకుని, నా జడ కొలత సుమారు ఇన్ని అడుగుల ఇన్ని అంగుళాలు ఉంటుందని కౌంట్ చేసి అకౌంట్‌లో వేసుకున్నారట ఆయనగారు.

పెళ్ళయిన కొత్తల్లో తలకు భారంగానూ, అడ్డంగానూ ఉంటే సవరం తీసి మూలకు పెట్టేశాను. నా జడ నిజస్వరూపాన్ని చూచి ఆయనగారు కాస్త బాధపడ్డమాట నిజం. ఆయన అకౌంట్‌లో మళ్ళీ సబ్‌ట్రాక్షన్ చేయవలసి వచ్చిందే అని విసుక్కుని ఉంటారు.

కాస్త వయస్సు ముదిరీ పిల్లలుపుట్టీ, ఇప్పుడు మరీ నల్లపూసయింది నా జడ! పొడుగు లేక పోవటానికి తోడు ఒత్తు కూడా తగ్గిపోయి పలచబడి పోయింది.

సవరం పెట్టి జడ వేయాలన్నా కుదరక బన్ పెట్టి ముడి వేయాలన్నా ముడిపడక మహావేధిస్తూ ఉంది జుట్టు. అందుకే ప్రాణం విసిగి ఆ ఉన్న నాలుగు వెంట్రుకలూ రిబ్బన్‌తో బంధించి అలా గాలికి వదిలివేశానిప్పుడు.

"పెళ్ళి చూపులప్పుడు చాంతాడంత జడ చూపించి మోసం చేశారు నన్ను! సవరం సంగతి తెలిస్తే లక్షరూపాయలు కట్నం ఇచ్చినా చేసుకునేవాణ్ణి కాదు" అంటూ సరసం ఆడుతుంటారు ఆయన.

అంత అందమైన శిరోజ బంధం చూచిన సౌందర్య భావనతో నా మనస్సంతా నిండిపోయింది. చక్కగా సంస్కారం చేసి దువ్వి వాలు జడ వేస్తూ, కొత్త నమూనాలో ఆ జుత్తంతా పైకి తీసి సిగచుడితే... తిరిగి చూచేలోపల ఆవిడ ఇంట్లోకి వెళ్ళిపోయింది. ఊహల మాలికలతో జడలు అల్లుకుంటూ నేనూ లోపలకు నడిచాను.

లోటు బడ్జెట్ వల్ల నాకు కావలసిన హంగులన్నీ సమకూర్చుకోలేకపోయినా, మా ఇల్లు చాలా వరకు సంతృప్తికరంగానే తయారయి పోయింది.

బంధువర్గం, మిత్ర బృందంతో పాటు కొత్త ఇంటి ఇరుగు పొరుగు వారిని కూడా గృహప్రవేశం నాడు భోజనానికి పిలిచాము. పెద్ద వేణీబంధంతో నలుగురు పిల్లల్నీ తీసుకుని ఆవిడ కూడా వచ్చింది.

మాటల సందర్భంలో ఆమెపేరు 'కృష్ణవేణి' అని తెలుసుకుని నవ్వి అన్నాను. "పుట్టినపుడే మీకింత కృష్ణవేణి ఉందా ఏమిటి? లేకపోతే మీ వాళ్ళకెలా తెలిసిందీ ఆ పేరు పెట్టాలనీ!"

మొదట్లో ఆవిడ అర్థంకాక నా వంక తెల్లబోయి చూచింది. అంతలోనే మళ్లీ అర్థం చేసుకుని నవ్వి – "ఆ.... అదొక్కటేనండీ నన్ను విడిచిపెట్టకుండా ఉన్న సంపద!" అన్నది.

ఇంట్లోకి తెచ్చి నన్ను పడేసినాక ఆయనగారు ఒక తన పని ఏమీ లేనట్లుగా గృహ నిర్మాణపు అకౌంట్స్ క్లోజ్‌చేసి ఆఫీసు అకౌంట్స్‌లో మునిగిపోయినారు.

నిలువుటద్దం మీద నలకంత మాసిక కనిపించినా, ఒళ్లు తుడుచుకున్న తడి టవల్ ఏ కుర్చీమీద కనిపించినా నాకు ప్రాణం విలవిలలాడిపోతుంది. ప్రతివస్తూవూ నిర్ణీత స్థలంలో ఉండాలి. పిల్లల పుస్తకాలయినా ఎగాదిగా పడి ఉండకూడదు. చేసిన ప్రతి పనీ పర్‌ఫెక్టుగా ఉండాలి. ఇటువంటి మనస్సు పెట్టుకుని ఆ ఇంటిని పర్‌ఫెక్టుగా ఉంచటానికి నేనెంత తంటాలు పడేదాన్నో చెప్పలేను.

ఇంటి బయట కూడా ఆవరణం శుభ్రం చేయించి, రకరకాల పూల మొక్కలు తెప్పించి పెట్టాను. సగంపరిశ్రమ ఇంట్లోనూ, మిగతా సగం ఇంటి బయటా చేస్తూ ఉండేదానిని. ఈ రంధిలో పడిపోయి నా ఆరోగ్యం విషయం బొత్తిగా నిర్లక్ష్యం చేసిన మాట నిజం.

కృష్ణవేణి ఎప్పుడైనా మా యింటికి వస్తూ పోతే ఉండేది. మనిషి ఏదో దిగులుతో కృశించి పోతున్నట్లుండేది. కాని నా దగ్గరకు వచ్చినపుడు మాత్రం తెచ్చిపెట్టుకున్న ఉత్సాహంతో ఏదో పిచ్చాపాటీ మాట్లాడుతూనే ఉండేది. ఆవిణ్ణి చూచినా, పిల్లల వాలకం చూచినా, ఎంతో లేమితో బాధపడుతున్నట్లు తెలుస్తూనే ఉంది. కాని ఒక్కనాడయినా ఆమె తన సంసారపు స్థితి గతుల్ని గురించి కానీ ఇబ్బందుల్ని

గురించి కానీ నా దగ్గర ప్రస్తావన తెచ్చేది కాదు. అందుకే ఆవిడ మీద నాకు ఒక విధమైన సద్భావన కలిగింది.

కృష్ణవేణి భర్త ఏదో కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడట. కాని అతడు ఉదయం పూట కానీ సాయంత్రం వేళ కానీ ఇంట్లో ఉండి పెళ్ళాం బిడ్డలతో కాల గడపటం నేనింతవరకూ చూడలేదు. ఎక్కడకు వెళుతుంటాడో ఏం రాచకార్యాలు చేస్తుంటాడో అని నాలో నేను అనుకుంటూ ఉండేదానిని.

ఆ రోజు నేను కర్టెన్ క్లాత్ కుడుతూ కూర్చున్నాను. కృష్ణవేణి పెద్ద కొడుకు పదేళ్ళ వాడు వచ్చి వాకిట్లో నుంచున్నాడు.

"ఏమిటి రామూ! ఏం ఇలా వచ్చావు?" అని అడిగాను.

వాడు ఏమీ జవాబు చెప్పకుండా నిలుచున్నాడు.

"అమ్మేం చేస్తుందీ? భోజనాలయ్యాయా" అన్నాను మళ్ళీ!

"అమ్మ పొద్దుటీనుంచీ పడుకునే ఉంది. ఈ వేళ అన్నం వండలేదు" అన్నాడు వాడు.

"అదేం?" అన్నాను ఆశ్చర్యంగా! అప్పటికే ఒంటిగంట కావస్తోంది. ఈ వేళ జ్వరం వచ్చిపడుకుందో ఏమిటో! నాకిక కుట్టుపని చేయబుద్ధి కాలేదు. కట్టిపెట్టి కృష్ణవేణి ఇంటికి వెళ్ళాను. ముసుగు పెట్టుకుని పడుకుని ఉంది కృష్ణవేణి.

"జ్వరమా ఏమిటమ్మా!" అన్నాను ముసుగు తొలగిస్తూ...

కన్నీళ్ళు చారికలు కట్టిన ముఖంతో ఎర్రబడి ఉబ్బిపోయిన కళ్ళతో లేచి కూర్చుంది. కృష్ణవేణి జుట్టుముడి వీడి ఇంత పొడుగున జీరాడుతూఉంది.

నన్ను చూచి మోకాళ్ళమీద తలపెట్టుకు కూర్చుంది. భుజాల కుదుపు చూస్తుంటే వెక్కి వెక్కి ఏడుస్తోందని తెలిసిపోయింది.

ఆవిడకు ఏం కష్టం వచ్చిందో నాకు తెలియలేదు. నిరుపేదగా కనిపించినా కృష్ణవేణి చాలా అభిమానవంతురాలే! ఆవిడ మంచి కుటుంబంలో పుట్టి ఇప్పుడు ఈ బీదరికపు స్థితిలోకి వచ్చినట్లు నాకు అనుమానంగా ఉండేది.

'ఏమిటీ నీ బాధ కృష్ణవేణీ! ఎందుకు అలా దుఃఖపడుతున్నావు? ఈ వేళ వంట కూడా చేయలేదట కదా" – అన్నాను మంచం మీద కూర్చుంటూ.

"అంతా నా నుదుటి వ్రాత – ఏం చెప్పనండీ"– అన్నది కృష్ణవేణి కాస్త తల యెత్తి.

"చూడూ, నీకు చెప్పాలని ఉంటే చెప్పు. లేకపోతే లేదు. కానీ మనసులో దుఃఖం మరొకరితో చెప్పుకుంటే కొంత భారం తీరుతుంది" – అన్నాను అనునయంగా ఆమె భుజం మీద చేయివేసి.

కృష్ణవేణి కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ చెప్పిన కథనం ఇది.

పరువుగల మధ్యతరగతి కుటుంబంలో పుట్టిందామె,. ముగ్గురు ఆడపిల్లల తర్వాత చాలా ఎడంగా తండ్రి ఇంచుమించి రిటైరయ్యే రోజుల్లో పుట్టింది. పెద్ద పిల్లలు ముగ్గురికీ కాస్త అంతస్తులకు మించిన సంబంధాలే తెచ్చి పెళ్ళిళ్ళు చేశాడు తండ్రి. కృష్ణవేణి దగ్గరకు వచ్చేటప్పటికి ఒంట్లోనూ స్థితి తప్పిపోయింది.

థర్డ్‌ఫారమ్ చదువుకునే పిల్లకు ఏదో సంబంధం కట్నం లేకుండా చేసుకునేవాళ్లు వచ్చారని అర్థాంతరంగా చదువు మానిపించి పెళ్ళి చేసాడు. అంతటితో కన్నందుకు తన బాధ్యత వదిలిందని తృప్తి కూడా పడి ఉంటాడు ఆ కన్న తండ్రి.

కృష్ణవేణి భర్త వయసు వచ్చిన దగ్గరి నుంచీ వ్యసనాలకు అలవాటు పడిపోయినాడు. పెళ్ళాం వస్తే బాగుపడతాడని తల్లీ తండ్రీ పెళ్ళి కూతుళ్ళను వెతకటం మొదలుపెట్టారు. పెళ్ళికూతుళ్ళు దొరక్కపోతే కట్నం లేకుండా చేసుకుంటామని ఎరపెట్టారు. ఆ ఎరకు తగులుకు పోయిన చేపపిల్ల కృష్ణవేణి.

తాళి కట్టించుకున్న భార్య కనుక కాపురానికి వచ్చింది. సంసారం చేసింది. బిడ్డల్ని కన్నది. మొగుడికి వండి పెడుతున్నది. బిడ్డల్ని పెంచుకు వస్తున్నది.

ఆ మొగుడికి ఇన్నేళ్ళు గడిచే సరికి స్త్రీ సంబంధమయిన వ్యసనం కాస్త వెనక పట్టిందికాని, అంతకు అంత పేకాట పిచ్చి పట్టుకున్నది. కంపెనీకి వెళ్ళి ఉద్యోగం వెలగపెట్టి నాలుగు రాళ్ళు తెస్తాడు. వచ్చిన జీతంలో సగమో, ముప్పాతికో పేకాటలో అర్పణ చేసి చేతులూగించుకుంటూ ఇంటికి వస్తాడు.

పేకాటలో కూర్చుంటే అతడికి ఒళ్ళు తెలియదు. రాత్రీ పగలూ తేడా తెలియదు. అదొక మత్తు! అదొక లోకం!

నిజానికి అతడికి వచ్చే  జీతం పొదుపుగా వాడుకుంటే సంసారం సాఫీగానే సాగిపోతుంది. కృష్ణవేణి ఎంతో చెప్పి చూచింది. బ్రతిమలాడుకుంది. కాళ్ళా వేళ్ళా పడ్డది. కళ్ళ నీళ్ళు పెట్టుకున్నది. ఉహూ... అతడు ఇదేమీ వినిపించుకునే స్థితిలో లేడు. ఆ స్టేజీ దాటి పోయాడు. చేతిలో డబ్బులేకపోతే అప్పులు చేసి కూడా ఆడటం మొదలుపెట్టాడు.

నిన్న ఒకటో తారీఖు, ఇంట్లో బియ్యం గింజలు లేవు. జీతం రాళ్ళలో కొద్దిగా నయినా తెస్తాడనీ, బియ్యం తేవచ్చుననీ కూర్చుంది కృష్ణవేణి. ఈ వేళ తెల్లవారు ఝామున వట్టి చేతులూగించుకుంటూ ఇంటికి వచ్చాడు. ఆ నాలుగు రాళ్ళూ పేకాటలో సమర్పించుకుని వచ్చాడు.

తెల్లవార్లూ కంట్లో వత్తులు వేసుకుని కూర్చున్న కృష్ణవేణికి  ఏం మాట్లాడాలో తెలియలేదు. తాను ఏమన్నా ఎదరు తిరిగి పోట్లాడుతాడు తప్ప ప్రయోజనం ఉండదు.

“ఇంట్లో ఈ పూటకి బియ్యం గింజలు లేవు. తెచ్చి పడేస్తే ఉడకేస్తాను” అన్నది.

‘తెచ్చిపడేస్తే ఉడకేస్తావు! మహా ఘనకార్యం చేస్తావు! ఈ పూటకు ఎక్కడన్నా అప్పుతీసుకురా!” అన్నాడతడు విసుక్కుంటూ.

‘ఊహు! నా వల్ల కాదు. ఇళ్ళవెంట అప్పులకు మాత్రం నన్ను పంపవద్దు!” అన్నది అభిమానవంతురాలు కృష్ణవేణి.

‘ఏం ఇంతలోనే ఏమయిందీ? మహాగొప్ప ఘరానా కుటుంబంలోంచి పుట్టుకువచ్చావా ఏమిటి? పక్కింటి మేడలోకి వెళ్ళి వస్తుంటావుగా? ఆవిణ్ణి అడిగి తీసుకురా ఈ పూటకి” అన్నాడతను గొంతు పెంచి.

‘నా వల్ల కాదంటే వినరేం? నెల జీతం పేకాట్లో ఎందుకు నాశనం చేసి వచ్చారు? పిల్లలూ నేనూ ఏమయిపోతామనుకున్నారు? చావనన్నా చస్తాను గాని అడుక్కుతినటానికి  బయలుదేరలేను” అన్నది దుఃఖంతో, రోషంతో కృష్ణవేణి.

"అయితే నట్టేట్లో పడి చావండి. పీడా విరగడైపోతారు!" అనుకుంటూ విసురుకుంటే వెళ్ళిపోయాడు – భార్యనూ కుటుంబాన్నీ భరించవలసిన భర్త!

"చదువన్నా చెప్పించాడు కాదు మా నాన్న! ఏ చిన్న ఉద్యోగమో చేసుకుని పిల్లల కింత తిండి పెట్టకునే ఆశాలేదు. బయటకు వెళ్ళి కూలో నాలో చేసుకుని డబ్బులు సంపాదించుకుని పొట్టపోసుకునే తెగకు చెందిన దాన్నీ కానయితిని. అప్పులకూ బయలుదేరలేను. అడుక్కోనూ లేను. అబిమానం పాతి పెట్టలేను.

"ఎందుకూ పనికి రాని వ్యర్థురాల్ని – ఏడవడం తప్ప ఏమీ చేతకాని దాన్ని – ఏం చేయను చెప్పండీ!" అంటూ బావురుమంది కృష్ణవేణి.

నాకు ఏమని సముదాయించాలో తోచలేదు. ఆమె భుజం తట్టి ఇంటికి వచ్చేశాను. కుక్కర్‌లో ఒక శేరు బియ్యం పడేసి వండి అన్నమూ పచ్చడీ,చారూ, అరగంటలో ఆమె ఇంటికి పంపించాను.

మర్నాడు కృష్ణవేణి మా ఇంటికి వచ్చింది. ఏదో చెప్పాలని వున్నట్టూ చెప్పలేక పోతున్నట్లూ కనిపించింది.

"ఏమిటి కృష్ణవేణి? బియ్యం ఏమన్నా కావాలా? ఇంటికి వచ్చాడా మీ ఆయన?" అన్నాను ఆదరంగా.

"చూడండీ! ఇట్లా సాయం మీరు ఎన్నాళ్ళని చేస్తారు? ఈ దౌర్భాగ్యురాలికి దినం గడవడం కాదు. తనువు గడవాలి. మీ ఋణం ఈ జన్మలో తీర్చగలుగుతానా? మీది ఎంతో మంచి మనస్సు, గొప్ప వారందరికీ ఇంత గొప్ప బుద్ధి ఉండదు. నాకు ఏ పనీ చాతకాదు. ఇంటి పని తప్ప. ఒట్టి పనికిమాలిన దాన్ని. మీకేమయినా ఇంటి పనుల్లో సాయం కావలసివస్తే నన్ను పిలవండి. ఏదో ఒక పని చేసి పెట్టి మీరు ఏ తృణమో ఇస్తే పిల్లల్ని బ్రతికించుకుంటాను అన్నదామె.

ఈ మాటలు కృష్ణవేణి ఎంత అభిమానం చంపుకుని అన్నదో నాకు అర్థం అయింది. కిందా మీదా కాని మధ్యరకపు అంతస్తు అడుక్కోనివ్వదు. కాయ కష్టమూ చేసుకోనివ్వదు.

కొత్త ఇంటిమీది మోజుతో స్పాట్‌లెస్‌గా, ఫర్‌ఫెక్టుగా ఇంటిని తీర్చిదిద్దడంతో ఒంట్లో ఓపిక బొత్తిగా తగ్గిపోయింది నాకు. పని మనిషి చేసి పోయే పనులు కాక

బండెడు పనులతో మరీ విసిగి పోతున్నాను. ఇంటి పనుల్లో సాయం చేస్తానని కృష్ణవేణి అనగానే నాకు ప్రాణం లేచి వచ్చినట్లయింది. అప్పటినుంచీ ఏదో వంక పెట్టుకుని నేనామను పిలవడం, ఆమె వచ్చి నాకు సాయం చేయడం, నేనేదో తోచింది ఇవ్వడం –అలవాటయిపోయింది. పప్పు రుబ్బాలన్నా, పూరీలు చేసి పెట్టాలన్నా, బట్టలు ఇస్త్రీ చేసి పెట్టాలన్నా, పిల్లలకు తలంటిపోయాలన్నా కృష్ణవేణిని కేకవేయంది చేసుకోలేని స్థితికి వచ్చాను.

ఈ ఏర్పాటు బాగానే ఉందనిపించింది. ఆవిడ అభిమానం చంపుకుని అడుక్కునే పని లేకుండా పోతున్నది. నాకూ ఊరికే దానం ధర్మంగా ఇస్తున్నాననే కించ లేకుండా పోయింది.

ఏడాదో రెండోళ్ళో గడిచాయి. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి పాతికేళ్ళు దాటినా స్థితి గతులు మాత్రం మారలేదు. ఇంకా అధ్వాన్నంగా తగలబడుతున్నాయి. అవినీతి, స్వార్థం, లంచగొండితనం ఎక్కడ పడితే అక్కడ స్వైరవిహారం చేస్తున్నాయి. నిత్యజీవితావసర వస్తువులు కూడా చీకటిమరుగున పడిపోతున్నాయి. ధరలు చూడబోతే చుక్కల్లోకి చూస్తున్నాయి.

కూలీ నాలీ జనానికి కాని కాలం వచ్చింది. మధ్యతరగతి వాళ్ళకు బ్రతుకు మహాభారం అనిపిస్తున్నది.

కృష్ణవేణి మొగుడు మాత్రం యధాప్రకారం పేకాటపిచ్చిలో, మునిగి తేలుతున్నాడు. ఇష్టమైతే చేతిలో ఆ సమయానికి ఉంటే పది రూపాయలు ఇస్తాడు. లేకపోతే లేదు. కృష్ణవేణికి నేను ఇచ్చే తృణమో, పణమో ఆమె ఇబ్బంది తీర్చలేకపోయినా, ఏదో మరీ ప్రాణం మీదకు వచ్చినపుడు అడ్డుపడుతూనే ఉంది.

కాస్తో కూస్తో ఆర్థికస్తోమతున్న వాళ్లకు మాత్రం కాలం మరీ అంత గడ్డుగా లేదు. ధరలు ఇది వరకటి కన్నా రెట్టింపయినా చీకటి బజార్లో కావలసి వచ్చినా కొంటూనే ఉన్నారు. జీవితం అనుభవిస్తూనే ఉన్నారు.

మాకు కొత్త కారు వచ్చింది. ఆయనగారికి కొత్త కారులో ముందు తిరుపతికి వెళ్ళి వెంకటేశ్వర స్వామిని దర్శించుకుని రావాలని సంకల్పం కలిగింది. పిల్లలకు కూడా శెలవు రోజులు కావడంతో అనుకున్నదే తడవుగా ప్రయాణం అయినాము.

"కాస్త ఈ వారం రోజులూ ఇల్లూ వాకిలీ కనిపెట్టి చూస్తూ ఉండు కృష్ణవేణీ! గొడ్డూ, గోదా కాంపౌండ్‌లోకి వచ్చాయంటే మొక్కలన్నీ పాడు చేస్తాయి" అన్నాను వెళ్ళబోయే ముందు.

"అలాగేనండీ! నేను పక్కన ఉండి మొక్కల్ని పాడు చేయనిస్తానా?" అన్నది కృష్ణవేణి.

తీరా ప్రయాణమై సూట్‌కేసులూ, అవీ కారులో పెడుతూ ఉండగా కృష్ణవేణి ఏదో సందేహిస్తూ నా దగ్గరకు వచ్చింది. పెద్దాడికి మూడు రోజుల్నించీ జ్వరం. ఆయన రాత్రి కూడా ఇంటికి రాలేదు. ఆస్పత్రికి తీసికెళితే ఏదో మందు రాసిచ్చారు. ఒక్క పదిరూపాయలు... అన్నది.

నాకేమిటో చిరాకనిపించింది. అసలే ప్రయాణపు హడావిడి! అడగడానికి కూడా సమయం, సందర్భం ఉండక్కరలే! ఆవిడ ఇబ్బందులూ చిక్కులూ ఎప్పుడూ ఉండేవే. తీరా కారులో కాలు పెట్టబోయే ముందునన్నిట్లా వేధిస్తే ఎలా?

"ఇప్పుడెలాగూ వీలయ్యే సమయంగా లేదు. కృష్ణవేణీ! ప్రయాణం పెట్టుకున్నామా మరి? బోలెడు ఖర్చు. ఎలాగో తిప్పలు పడు ఈసారికి! ఊరి నుంచి వచ్చాక చూస్తానులే" అన్నాను.

కృష్ణవేణి అలాగే నిలుచుండిపోయింది. కారు బర్రున కదలిపోయింది. అప్పుడలా అన్నానే కాని దారి పొడుగునా నా మనస్సు వేధిస్తూనే ఉంది. కృష్ణవేణి దీనవదనం నా కళ్ళముందు మెదులుతూనే ఉంది.

ప్రయాణంలో ఏమీ ఉత్సాహం చూపించలేక పోయినాను. ఆ కారణంగానో మరేదో నాకే తెలియలేదు. పిల్లలూ ఆయనామటుకు దారి పొడుగునా అల్లరి చేస్తూనే ఉన్నారు.

స్వామి దర్శనం కూడా ఐశ్వర్యవంతులకు అందుబాటులో పనే! టికెట్లు కొనుక్కుని సలక్షణంగా స్వామి దర్శనం చేసుకున్నాము. స్వామి సౌందర్యమూర్తి. స్వామి సృష్టించిన ఈ ప్రకృతి పరమసుందరమైనది. తలనీలాలు ఇచ్చి తమను తాము వికారం చేసుకోవటం స్వామికి ఇష్టంగా ఉంటుందా? ఉహు ఉండదు ఆయనకూ నాకు

మళ్లేనే వ్యధ కలుగుతుంది. ఇదంతా మనం కల్పించుకున్న భ్రమ, ఆనవాయితీ–అనిపిస్తుంది. నాకు ఎప్పుడూ.

ఇప్పుడూ అలాగే అనిపిస్తున్నది. అయితే నా ఊహకు వ్యతిరేకంగా ఆయనగారు తన మాటే నెగ్గించుకున్నారు.

"ఇంత దూరమూ వచ్చి అలాగే వెళ్ళిపోతామా? నేను ముందే మనస్సులో అనుకున్నాను–స్వామికి వెంట్రుకలిస్తానని"–అని పట్టుపట్టారు. తాను ఇవ్వటమే కాక, పిల్లలిద్దరి వెంట్రుకలు గూడా స్వామికి సమర్పించారు.

"మీకు పుష్కలంగా జుట్టు ఉంది కనుక ఇచ్చారు. నాకు తల మీద ఉన్నవే నాలుగు పరకలు! మూడు కత్తెరలు కూడా ఇవ్వలేను. అని మొరాయించాను నేను. స్వామికి కోపం రాదన్న గాఢనమ్మకంతో.

తిరుపతి యాత్ర సలక్షణంగా ముగించుకుని రెండు మూడు రోజులు రెస్ట్ హౌస్‌లో రెస్ట్ తీసుకుని తిరుగు ప్రయాణం అయాము మేము.

ఆయన్నీ పిల్లల్నీ చేస్తుంటే నాకేదో వికారం కలగటం మొదలెట్టింది. ఇదెక్కడి మనస్సు! రేపట్నుంచీ మొలుచుకురావా వెంట్రుకలు? స్వామికి సమర్పించిన సౌందర్యాన్ని గురించి ఇంతలా బాధపడకూడదు!

ఇలా ఎంత సమాధానపరుచుకుందామని చూచినా, నామనస్సు తన నిర్వేదం మానలేదు.

ఇంటికి దగ్గరపడుతుంటే మళ్ళా కృష్ణవేణిని గురించి జంఝూటన పట్టుకుంది నాకు. పిల్లాడికెలా ఉందో? నన్ను తప్ప నోరు విడిచి ఎవరినీ అడిగేది కాదు కృష్ణవేణి. ఒక్క పది రూపాయలు ఇచ్చివస్తే ఆమెకు ఆ ఇబ్బంది తీరిపోయేది. తిరిగి వచ్చినాక నాకే సాయమోచేసి పెట్టేది.

తిరిగి రాగానే నిజంగానే ఆవిడ సాయం కావలసి వచ్చింది నాకు. వారం రోజులుగా చీపురు వెయ్యని ఇల్లు, గుడ్డపెట్టి తుడవని సామాను–నాకు మాలోకంగా కనిపించాయి.

కృష్ణవేణిని పిలిచి రావటానికి వెళ్లి వచ్చిన పిల్లలు– "మమ్మీ మనకంటే ఆవిడే ముందు తిరుపతి కెళ్ళి వచ్చింది" అన్నారు.

"ఆవిడ తిరుపతి వెళ్ళి రావటమేటర్రా మీమొహం! వెళ్ళి ఆడుకోండి కాస్సేపు! నాకు చచ్చేంత పని ఉంది." అని పనిలో మునిగిపోయాను. నేను వంటింట్లో సామానంతా కడిగి వంట ప్రయత్నంలో ఉండగా వచ్చింది కృష్ణవేణి.

"ఎప్పుడొచ్చారండీ! కులాసాగా స్వామి దర్శనం చేసుకువచ్చారా" అని ఆమె పలకరిస్తుందని అనుకున్నాను. మాట్లాడకుండా ఆమె నించునే సరికి నేనే – "రా! కృష్ణవేణీ! మీ అబ్బాయికి జ్వరం తగ్గిపోయిందా?'' అన్నాను వంగి ఏదో పనిచేసుకుంటూనే.

కృష్ణవేణి మాటాడకుండా కళ్లు తుడుచుకునేసరికి నాకేమిటో గాభరాగా అనిపించింది. పిల్లాడికేమయినా అయిందా? అయ్యో రామ! ఎంత పని జరిగింది?

'ఏమిటి ఏమయింది కృష్ణవేణీ! పిల్లాడికి తగ్గలేదా?" గాభరాగా అడిగాను.

"నన్నింక 'కృష్ణవేణి' – అని పిలవకండి'' అన్నదామె తల వంచుకుని కాస్త గద్గద స్వరంతో. చప్పున ఆమెవంక పరీక్షగా చూచాను. తలకు చెవుల మీదుగా ఏదో గుడ్డ కట్టి ఉంది. తల మీదకు పైట చెంగు కప్పుకుని ఉంది.

'అదేమిటి;? అయ్యయ్యో! నీ జుత్తంతా ఏమయింది? ఏం జరిగింది? చెప్పవూ కృష్ణవేణీ?" అన్నాను – ఎంతో సంక్షోభంతో!

"నాకున్న సంపదంతా అదే కదండీ! అవసరానికి అడ్డురాకపోతే ఎలా? దాన్ని సవరాల షాపులో వదుల్చుకుని పిల్లాణ్ణి బ్రతికించుకోగలిగాను. వాడికి కాస్త నయమే ఇపుడు" అన్నది ఆమె కిందకు చూస్తూ.

నాకు ముచ్చెమటలూ పోశాయి. కాళ్ళలో వణుకు పుట్టుకువచ్చింది. "ఎంత పని చేశావు కృష్ణవేణీ! నీ ముఖం ఎలా చూడను?" అన్నాను కడుపంతా చెరువైపోయి

"అదేనండీ నా బాధ! నా ముఖం మీరెలా చూస్తారు? నన్ను మీరు కృష్ణవేణి అని పిలుస్తూంటే అందరూ పిలిచినట్లు అనిపించేది కాదు. శ్రద్ధగా నూనె రాసి, జుట్టు దువ్వి జడవేసుకోక పోయినా, మీ పిలుపు వింటూంటేనే నా కేశభారం, నా కృష్ణవేణి గుర్తుకు కలిగేది. ఇప్పుడెలా చూస్తారు నా మొహం! ఉహు – చూడలేరు! 'కృష్ణవేణి' అని కూడా పిలవలేరు!" అన్నదామె ముఖమెందు చేతులతో కప్పుకుంటూ...

నిజమే! కృష్ణవేణి ముఖం ఎలా చూడను? ఆమెకు అర్థం అయ్యేట్లు ఎలా చెప్పను?

ఆవిడ ముఖం చూడలేక పోవటానికి ఇప్పుడు నా సౌందర్య ప్రియత్వం కాదు అడ్డువచ్చేదని ఆమెకు ఎలా చెప్పను? కొన్నాళ్ళు పోతే ఆమెకు మళ్ళీ కేశభారం రావచ్చు. అప్పుడు ఆమె మళ్ళీ వెనుకటి కృష్ణవేణి కావచ్చు.

కాని నా నిర్వేదం నన్ను ఎప్పటికీ విడిచి పెట్టేలా లేదు. నా అంతరాత్మ నన్ను ఎప్పటికీ వేధించుకు తినేలాగ ఉంది.

**– ఫిబ్రవరి 1974 (ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక)**

# శీనయ్యగారి సైకిలు

– తురగా జయశ్యామల

"నాన్నా! నేను చెబుతున్నది వినిపించుకోండి. ఇందులో బాధపడడానికేమీ లేదు...!" మూర్తి మాట పూర్తి కానే లేదు.

"బాధపడవద్దంటారేమిరా! దానికి, నాకూ వున్న సంబంధం ఈనాటిదా? దాదాపు నలభై సంవత్సరాలది.. ఒక్కసారిగా తెంపుకోమంటావేం?" శీనయ్యగారి మాటల్లో కోపం కంటే ఆవేదన ఎక్కువగా ఉంది.

నిస్సహాయంగా చూసాడు మూర్తి. "మీరేమిటో మాట్లాడుతున్నారు. ఈ రోజుల్లో మనుషులు మధ్యనే మమతలు చచ్చిపోతున్నాయి. సెంటిమెంట్స్ ఎండిపోయి, మరలా... డబ్బు సంపాదన ఒక్కటే జీవితాశయంలా... మరబొమ్మల్లా బ్రతుకుతున్నారు. సెంటిమెంటు పేరుతో ఈ పాత సైకిలుని ఎన్నాళ్ళుంచమంటారు?" అన్నాడు.

"ఒరేయ్ మూర్తీ! నాకు చెప్పకు మాటలు. మమతలు, మనుష్యుల విలువలు తెలీక మరల్లా ఈ కాలం వాళ్ళు బ్రతుకుతున్నారు గాని యింకా మా తరం వాళ్ళకి ఈ మమతలు, సెంటిమెంట్స్ పోలేదురా!" అన్నారు గట్టిగా.

అంతవరకు తండ్రీ, అన్నగార్ల సంభాషణ వింటూ గోడవార నుంచున్న చలపతి కలుగజేసుకుంటూ "అది నిజమే అనుకో నాన్నా! కాని అనుబంధాలు, సంబంధాలు అంటూ ప్రాణం వున్న మనుష్యుల మీద పెంచుకుంటే బాగానే ఉంటుంది గాని, యిదేమిటి వింత – ప్రాణం లేని ఇనుప వస్తువు మీద."

అతని మాట పూర్తి కాకుండానే అందుకున్నారు శీనయ్యగారు.

"ఒరేయ్ అది మీకు ప్రాణం లేని ఇనుప వస్తువులా అన్పించవచ్చు. కన్పించవచ్చు. కాని నా కలా కాదురా! దాదాపు పాతిక సంవత్సరాలు మనకందరికీ తిండి పెట్టిన తల్లిరా! నన్ను... నా బరువుని మోసిన తల్లిరా!"

"కాదనడంలేదు నాన్నా! కాని, మీరు కూడా కాస్త ప్రాక్టికల్‌గా ఆలోచించండి. కాలాన్ని బట్టి, పరిసరాలని బట్టి కూడా మనని మనం మార్చుకోవాలి. అసలే ఈ పట్టణాలలో చారడేసి అద్దిళ్లల్లో, ఇటువంటి ఉపయోగం లేని వస్తువులు... ఎంతకాలం పెట్టుకోగలం చెప్పండి!"

"అవునురా! అదిప్పుడు ఉపయోగం లేని వస్తువే... కానీ ఒకప్పుడు అది నా జీవిత రథసారధిరా! ఈ రోజున ఈమాత్రమన్నా వుండగలిగామంటే, అది ఆ నాడు వుండబట్టేరా?"

తండ్రి వాదనలో నిజమున్నప్పటికి, నేటి పరిస్థితి అర్థం చేసుకోని మొండితనం కన్పించి మూర్తికి విసుగొచ్చింది.

"నిజమే నాన్నా! పోనీ రిపేరు చేయించి ఎవరేనా వాడుకుందామనుకున్నా వీలుకాని, శిధిలావస్థలో వుంది కదా మరి! అది అసలు అమ్మినా కొనడం మాట అటుంచి, ఊరికే కూడా తీసుకోరెవరూ" అనేసి అక్కడ నుంచి వెళ్ళిపోయాడు.

"మీ మాటని, మీ పెద్దరికాన్ని కాదంటున్నామని, బాధపడతారేగాని, ఆసలు విషయం అర్థంచేసుకోరు. దాని కోసం మీరు ఇంత బాధపడడంలో అర్థం లేదు. పనికిరాని వస్తువులతో ఇంటిని నింపుకొని ఇరుకు చేసుకోవడం కంటే; అవతల పారేయడమే మంచిది!"

చలపతి విసురుగా అని అక్కడ నుంచి కదిలిపోయాడు.

చలపతి మాటలకు శీనయ్యగారికి కోపమొచ్చినా, అంతలోనే దిగమ్రింగు కున్నాడు.

ఆవేశకావేశాలను అణుచుకోవడం ఆయనకు కొత్త కాదు. అందులోనూ, ఆయన గడిపిన గతకాల జీవితం సర్దుకోవడం, సహనం వహించడంలోనే ఎక్కువగా గడిచిపోయింది.

మూగపోయినట్లుగా కూర్చుండిపోయిన ఆయన మదిలో ఎన్నెన్నో ఆలోచనలు. పట్టుమని ఆరడుగుల వెడల్పు లేని ఆ చిన్నగదిలో ఓ పక్కగా చిన్న నవారు మంచం, – శీనయ్యగారు పడుకునేది. దానికి కొంచెం యివతలగా ఓ వాలు కుర్చీ. మంచానికి

ఆ మూలగా అక్కడక్కడా చిరిగి మాసిపోయిన పాత దుప్పటి కప్పి వుంచిన ఓ పాత సైకిలు. అవిగాక శీనయ్యగారు... అంతకుమించి ఆ గదిలో యింకేమీ లేవు.

ఆయన ఆలోచనలు గడిచిపోయిన పాతిక ముప్ఫై సంవత్సరాల గతంలోకి వెళ్ళిపోయాయి.

పాతిక ముప్ఫై సంవత్సరాల క్రితం పల్లెటూర్లలోనే కాదు, పట్టణాలలో కూడా డాక్టర్లు ఎక్కువ వుండేవారు కాదు. యిప్పుడంటే ప్రతి వీధిలోనూ ఓ డాక్టరు బోర్డు కన్పిస్తూంది గాని, ఆ రోజుల్లో డాక్టరు అవసరమొచ్చినప్పుడు ఎక్కడున్నాడోనని తెలుసుకోడానికి కూడా ఎంతో ప్రయాసపడవలసి వచ్చేది. పల్లెటూళ్ళ సంగతయితే చెప్పనే వద్దు. గవర్నమెంటు హాస్పిటల్, హెల్త్ సెంటరూ అంటూ వుండేవిగాని, అందులో మందులుంటే డాక్టరుండేవాడు కాదు. డాక్టరుంటే మందులు ఉండేవి కాదు. అందుకే ఆనాడు చిన్న చిన్న ఆర్.ఎం.పి. (రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనరు) డాక్టర్లంటూ వుండేవారు కొందరు. లేకపోతే నాటు వైద్యం పల్లె ప్రజలకు శరణ్యంగా వుండేది.

తల్లిదండ్రులకు పదిమంది సంతానంలో ఒకడుగా జన్మించిన శీనయ్య (అసలు పేరు శ్రీనివాసరావు) ఎమ్.బి.బి.యస్. చదవకపోయినా ఆర్.ఎమ్.పి. డాక్టరుగా ఆ పల్లె ప్రజలకు సేవ చేయాలనే సదాశయంతో ఆ పల్లెటూళ్ళో స్థిరపడ్డారు. అనుకున్నట్లుగానే ఓ రోజు మంచి ముహూర్తం చూసుకొని బోర్డు పెట్టారు ఇంటి బయట. అద్దెకు తీసుకున్న నాలుగు గదుల పెంకుటింట్లో ముందుగదిలో ఆయన కూర్చోవడానికి ఓ కుర్చీ, ముందు ఓ బల్ల. పేషెంట్లు కూర్చోవడానికి ఓ పొడవాటి బల్ల. అంతకుమించి ఫర్నిచరులేదు. చేతి క్రింద కాంపౌండరుగాని, నర్సులుగాని లేరు. అయినా చాలా రోజులు ఒక్క పేషెంటు వచ్చిన పాపాన పోలేదు. అయినా అధైర్యపడలేదు ఆయన. భార్య లక్ష్మీకాంతం అన్ని విధాలా బాసటగా నిలిచింది.

ఒకరోజు అర్ధరాత్రి ఎవరో బయటనుంచి అరవడం మొదలు పెట్టారు. నిద్రలోంచి మెలకువ వచ్చిన శీనయ్యగారు లేచి, తలుపు తీసారు.

ఎదురుగా ముగ్గురు వ్యక్తులు నుంచుని వున్నారు మసకవెలుగులో.

“ఎవరూ?” అనడిగారు శీనయ్యగారు.

"సార్! యిక్కడెవరో డాక్టరున్నారంట మీరేనా?' ఆ ముగ్గురిలో ఒక వ్యక్తి అడిగాడు. వాళ్ళు పేద కూలీలో, రైతులో.. నీరుకాని .. పంచలు... కండువాలు.

"ఆ! అవును! నేనే డాక్టర్ని! ఏమిటి?"

"బాబు! ఒకసారి మా యింటికి రావాలయ్యా! సందెకాడ మా ఆడది ప్రసవించింది బాబూ! యిప్పుడేమో జ్వరం... చంటి బిడ్డకు కూడా జ్వరంగా వుంది బాబూ! ఎవరో మీ సంగతి చెబితే యిలా వచ్చాం. ఈడకి దగ్గరే బాబూ, మాయిల్లు!" బ్రతిమాలుతున్నట్టుగా అడిగాడా వ్యక్తి.

టైము చూసుకుంటే అప్పుడు అర్ధరాత్రి రెండు గంటలు దాటుతోంది. భార్య పిల్లలు నిద్రలో వున్నారు. ఆ సమయంలో వెళ్ళడమా? మానడమా? అని ఆలోచించాడు. కాని, ఈ పల్లె ప్రజలకు ఇటువంటి కష్టసమయంలోనే కదా సేవ చేయాలని ఇక్కడకి వచ్చింది. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి తను. వెంటనే భార్యను లేపి విషయం చెప్పి, మెడికల్ కిట్ పుచ్చుకొని వారి వెంట వెళ్ళాడాయన. వాళ్ళిల్లు దగ్గరే అని చెప్పాడుగాని, దాదాపు తమ ఇంటికి ఒకటిన్నర మైలు దూరం వుంది. నడిచి వెళ్ళి, నడిచి వచ్చారాయన, వెంట వాళ్ళ మనిషి తోడురాగా!

ఆ అమ్మాయికి... పిల్లకి కూడా తర్వాత నాలుగయిదు రోజులు వరుసగా వైద్యం చెయ్యాల్సి వచ్చింది, తగ్గేవరకు, ఉదయం, సాయంత్రం తనే వెళ్ళి చూసి వచ్చేవాడు. పచ్చి బాలింతరాలు... బాగుపడితే మొట్టమొదటి కేసుతోటే తనకు మంచి పేరు రావాలి. అందువల్ల రోజూ రెండుపూటలా అంత దూరం నడిచివెళ్ళి నడిచివచ్చేవాడు., అంతకుమించి ఆ ఊళ్ళో ఏ వాహనాలూ లేవు. అనుకున్నట్లుగానే ఆ బాలింతరాలికి, పసిపిల్లకి కూడా జ్వరం నయమయింది. ఆనోటా ఈ నోటా శీనయ్యగారి పేరు చాలామందికి తెల్సి, చిన్న చిన్న జ్వరాలకి, లేవలేని వాళ్ళకి చూడమంటూ కేసులొచ్చేవి.

బోర్డు పెట్టుకొని కూర్చున్నా అందరూ తన దగ్గరకే వచ్చి చూపించుకోరని... పిలిచిన వాళ్ళిళ్ళకు కూడా వెళ్ళి చూడాలని అర్థమయింది శీనయ్యగారికి. ఊళ్ళో అయినా రోజు నడిచి తిరగడం కష్టం కాబట్టి. క్రిందా మీద పడి ఎలాగో ఓ సైకిలు అమర్చుకున్నారాయన. రోజూ ఉదయం ఇంటి దగ్గరకొచ్చేవారు ఉదయం పది

గంటలలోపు వచ్చి వెళ్ళిపోయేవారు. ఊళ్ళో కేసులన్ని సాయంత్రాలు ఆయనే సైకిలు మీద తిరిగి చూసి వచ్చేవారు.

అలా ప్రారంభమయింది ఆయన వైద్యవృత్తి జీవితం. ఆ తర్వాత త్వరితంగానే ఆయనకెంతో పేరు వచ్చింది. విచిత్రంగా ఎటువంటి రోగాలయినా ఇట్టే తగ్గిపోయేవి. ఆయన చెయ్యి పడగానే.... దాంతో ఆ పల్లె ప్రజలకు ఆయనంటే అభిమానమూ.. ఆయన వైద్యం మీద నమ్మకమూ పెరిగాయి.

'ఆ శీనయ్యబాబు చెయ్యిపడితే చాలు... ఎటువంటి రోగమయినా తగ్గుతుంది. హస్తవాసి మంచిది...!' అని చెప్పుకోసాగారు. ఆ వూళ్ళోనే కాదు ఆ చుట్టుప్రక్కల పదిపదిహేను పల్లెల్లో కూడా శీనయ్యగారి పేరు విని వైద్యం కోసం రెండెడ్ల బండి మీద రోగులను తీసుకొని పది, పదిహేను, ఇరవై మైళ్ళు దూరమయినా వచ్చేవారు. వారిలో కలరా, టి.బి. లాంటి అంటువ్యాధుల వాళ్ళు కూడా వచ్చేవారు. ఒక్కోసారి ప్రసవ సమయాలలో స్త్రీలకు ఎన్నో రకాల కాంప్లికేషన్స్ వచ్చేవి. పురిటిలోని పసికందులకు విరోచనాలు, జ్వరం, కామెర్లు వంటివి వచ్చేవి. అటువంటి రోగాలని చాలా సూక్ష్మంగా కనిపెట్టి, వాళ్ల కోసం ఎంత దూరమయినా సైకిలు మీద వెళ్ళి వైద్యం చేసి వచ్చేవారు శీనయ్యగారు.

ఆ ఊళ్ళోనే గాక, ఆ చుట్టుపక్కల పల్లెల్లో కూడా రోజూ దాదాపు నలభయి, యాభయి మైళ్ళ దూరం తిరిగేవారా సైకిలు మీద. అలా ఆ సైకిలు ఆయన జీవితంలో ఒక భాగమైపోయింది. ఒక్కోసారి పొరుగూరు నుంచి వచ్చిన పేషంట్లని ఒకటి రెండు రోజులు జాగ్రత్తగా పరీక్షించి వైద్యం చేయవలసి వచ్చేది. అటువంటప్పుడు ఆయన ఆ రోగిని, వాళ్ళతో వచ్చిన బంధువులను తమ ఇంటి వెనుకాల వున్న చిన్న చావిడిలో రెండు మూడు రోజులుండమని వైద్యం చేసేవారు. రోగికి కావల్సిన పథ్యం, పానం అతనితో వచ్చిన వారికి భోజనం ఏర్పాట్లు అన్నీ లక్ష్మీకాంతమ్మగారే తయారుచేసి యిచ్చేవారు. అందుకే శీనయ్యగారితో పాటు లక్ష్మీకాంతమ్మగారిని కూడా దేవతలా చూసేవారందరూ. వ్యాధి తీవ్రత తగ్గాక రోగిని యింటికి పంపించి ఆ పైన వాళ్లింటికి వెళ్ళి చూసేవారు. అలా ఎన్ని కేసులో....

ఇంత చేసినా శీనయ్యగారు సంపాదించింది,మంచివాడు – హస్తవాసి మంచిదన్న పేరు ప్రఖ్యాతులు. అంతకుమించి ఆస్తిపాస్థులు ఏమి

సంపాదించలేకపోయారు. పిల్లల చదువులు.. యింట్లో యిబ్బంది లేకుండా జరిగిపోతే చాలనుకునే వారేగాని, అంతకుమించి దురాశలకెప్పుడూ వెళ్ళలేదాయన. ఆయన దగ్గరకు వైద్యానికి వచ్చేవారందరూ నిరుపేద పల్లెటూరి ప్రజలు. వాళ్ల చేలల్లో పండిన కాయగూరలు అవీ తెచ్చిచ్చేవారు. పాడిపంట కలిగినవాళ్ళు పాలు, పెరుగు, నెయ్యి అవీ తెచ్చిచ్చేవారు. శీనయ్యగారు వద్దని చెప్పినా!

"బాబుగారూ! ఏదో మా పొలాల్లో పండినవి. వాటికేమిటి బాబూ!" అంటూ మూటలు గుమ్మంలో పెట్టి వెళ్ళిపోయేవారు. ఆ తర్వాత వైద్యం పూర్తయినాక ఎంతిస్తే అంతే పుచ్చుకునేవారేగాని, ఇంతివ్వమని దండించి ఎప్పుడూ పుచ్చుకునేవారు కాదు. అందుకే చాలీచాలని అవసరాలతో సంసారం సాగిపోతుంది.

ఏది ఎలా వున్న ఆయన తన వాహనాన్ని మాత్రం ఎన్నడూ అలక్ష్యం చేసేవారు కాదు. ఏ చిన్న రిపేరు వచ్చినా యింట్లో ఖర్చులు మానేసి అది బాగుచేయించుకునే వారు. అది ఆయన ప్రాణం కూడా కాపాడిందోసారి. ఉన్న ఊరికి పదిహేను మైళ్ళ దూరంలో ఉన్న పల్లెటూరు వెళ్ళి అక్కడ పేషెంటుని చూసి సాయంత్రం చల్లపాటు వేళ తిరిగి వస్తున్నారు ఇంటికి. రాయలసీమలోని అన్ని పల్లెప్రాంతాల్లాగానే ఆ పల్లెలు కూడా వేరుశెనగలు, జొన్న, సజ్జచేలు.... వాటిలో సన్నని కాలి బాటలు.

అలాగే ఓ బాటలో శీనయ్యగారు సైకిలు తొక్కుకుంటూ వస్తున్నారు. ఆయన ముందు చూసుకోలేదు. దారి కడ్డంగా రెండు గోధుమవన్నె త్రాచులు పెనవేసుకొని పడుకొని ఉన్నాయి. ఆయన గమనించేలోపులే సైకిలుచక్రాలు ఆ పాముల తోకల మీదుగా వెళ్ళిపోయాయి. జరిగింది గమనించాక ముచ్చెమటలు పోసి, సైకిలు తొక్కుతూనే వెనక్కి తిరిగి చూసారాయన. కోపోద్రిక్తమైన ఆ త్రాచుపాములు రెండూ తోక మీద నిలువునా నిలబడి బుసలు కొడుతున్నాయి. ఆ దృశ్యం చూడడానికే మహా భయంకరంగా అన్పించి, మరల వెనక్కి తిరిగి చూడడానికి కూడా దడిసి స్పీడుగా సైకిలు తొక్కుకుంటూ వెళ్ళిపోయారాయన. ఆ తర్వాత చాలా రోజులు ఆ దృశ్యం అలా మనసులో మెదిలి, ఎప్పుడయినా పగ తీర్చుకుంటాయేమోనన్పించేది. అప్పుడే కాదు.... ఆ తర్వాత కూడా రెండు మూడు సంఘటనలు జరిగాయి. అన్నింటికి భగవంతుడి మీదే భారం వేసే వాడాయన. సైకిలుంది కాబట్టి సరిపోయింది గాని... లేకుంటే ఏమయ్యేదో తెలిసేది కాదు.

ఒక్కరోజు సైకిలులేకుండా ఆయనకు గడిచేది కాదు. అది లేకపోతే ఆయన వృత్తే లేదు. ఆ వృత్తే లేకపోతే జీవనమే లేదు. అలా ఒక రోజు కాదు. ... వారం కాదు.. నెలకాదు... సంవత్సరం కాదు. దాదాపు పాతిక ముప్పై సంవత్సరాలు ఆ సైకిల్‌మీద తిరిగారాయన, రోజుకి ముప్పై, నలభై మైళ్ళు చొప్పున. దానికి ఆయనకి వున్న సంబంధం కడుపున పుట్టిన పిల్లలకి ఆయనకి వున్న అనుబంధమే. ఇప్పుడు ఆయనకి తిరిగే ఓపిక పోయింది. యింటికి వచ్చిన వారెవరికో వైద్యం చేయడం, సలహా లివ్వడం తప్ప... బయట వూళ్ళకి వెళ్ళడం లేదు.

కూతురికి పెళ్ళిచేసాడు. ముగ్గురు కొడుకులు. గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి దొరికిన ఉద్యోగాలలో స్థిరపడ్డారు. పెద్దవాడు మూర్తి, రెండోవాడు కృష్ణ... పెళ్ళాం పిల్లలతో ఒరిస్సాలో వుంటున్నాడు. మూడోవాడు చలపతి.... యింకా వివాహం కాలేదు.

మూడు గదులున్న చిన్న యింట్లో మూర్తి, భార్య, ఇద్దరు పిల్లలు శీనయ్య దంపతులు. చలపతి యింతమంది వున్నారు. ఈ చిన్న యింట్లో సామాను. మనుష్యులు... ఎప్పుడూ ఏదో ప్లాట్ ఫాం మీదున్నట్లుగా అన్పిస్తుంది మూర్తికి. ఏ రెండుమూడు నెలలకోసారి మూర్తికి చిరాకు పుట్టి యిల్లు సర్దడం మొదలుపెడతాడు. అన్నింటికన్నా ముందుగా ఎవరికి ఉపయోగంలేని ఆ సైకిలు మీదే పడుతుందతని దృష్టి, ఎప్పటికప్పుడు అదితీసి ఏ పాత సామాన్లకొట్టులోనో పారెయ్యాలంటాడు.

'అదొక్కటే అడ్డం వచ్చిందా?' అని శీనయ్యగారి కోపం. 'ఈరోజున ఆ సైకిలు ఎవరికీ ఉపయోగపడని మాట నిజమే! కాని ఒకప్పుడు అది తమందరి జీవనాధారం. ఆ పల్లెటూళ్ళో ఆ నాడు ఆ సైకిలే గనుక లేకుంటే వస్తులతో చావాల్సి వచ్చేది!' అని అనుకుంటారాయన.

అంతలో లక్ష్మీకాంతంగారు ఆయన దగ్గరకు వచ్చారు. తండ్రి కొడుకుల మధ్య ఆ సైకిలు గురించిన సంభాషణ ఆవిడ వింటూనే వున్నారు. వెనుక గదిలోంచి వినకుండా వుండాలన్నా, వినపడకుండా వుంటుందనుకున్నా అదేమన్నా రాజప్రసాదమా? ఏమన్నానా? దగ్గరకు వచ్చి కూర్చున్న భార్య ముఖంలోకి చూసారాయన.

"ప్రతిసారి ఎందుకు చెప్పండి. ఈ గొడవంతాను. దానికి మీకూ వున్న అనుబంధం మీకు తెల్సు... నాకు తెల్సు. మీ మనస్సులో వున్నది మీ మనసులో

వుంచుకోండి. పిల్లలని కాదని మనమేం చేయగలం?" నచ్చ చెబుతున్నట్లుగా అన్నారావిడ.

"ఏం చేయడమేమిటి? ఇవాళ పనికిరాని వస్తువు అని దానిని పారేయమంటున్నారు. రేపు, నీకు ఉద్యోగం లేదు. సంపాదన లేదు... ఏ పని చేయడానికి ఓపిక లేదు.. అందువల్ల యింట్లోంచి పొమ్మంటారు! అంతేనంటావా?"

శీనయ్యగారి స్వరంలోని తీవ్రతకి లక్ష్మీకాంతమ్మగారు విస్మయంగా చూసారు, ఆయన ముఖంలోనికి.

ఆ ముఖంలోని, కళ్ళలోని భావాలను, భయాలను ఆవిడ అర్థం చేసుకోలేకపోలేదు. ఆయనతోపాటే ఆవిడ కూడా ఈ ప్రపంచాన్ని, మనుష్యులని ఎంతగానో చదివింది. ఎన్నో అనుభూతులను పొందింది. అయినా అనువుగాని చోట అధికులమనరాదు అన్న జీవిత సత్యం కూడా ఆవిడకి తెల్సు. అందుకే యిలా అందావిడ.

"అలా అంటారని ఎందుకనుకోవాలి. మన పిల్లల మీద నమ్మకం వుంచుకోవాలి. పరిస్థితులను బట్టి , పరిసరాలను బట్టి మనము మారడంలోనే అర్థమూ, ఆనందమూ వుంటాయి. మీకు అది అమ్మడం యిష్టంలేకపోతే, ఎవరికేనా వూరికే ఇచ్చేయండి. అంతేకాని, ఆ సైకిలు కోసం మీరూ, వాడూ రోజూ వీధిన పడటం ఎందుకు? రేపు పోయాక చితిలో పారేసి మంట చేయడానికైనా అది చెక్క కూడా కాదు.... ఇనుప ముక్క!" రాను రానూ మాటలు కోపంగా అనేసి, అక్కడ నుంచి లేచి విసురుగా లోపలికెళ్ళిపోయారావిడ.

ఆవిడ మాటలకు నిర్ఘాంతపోయినట్లుగా కూర్చుండిపోయారు శీనయ్యగారు. ఎదురుగా చిరుగుల దుప్పటి కప్పి వుంచిన సైకిలునే చూస్తూ.

మర్నాడు రోజూ కంటె పెందరాళే లేచి, కాలకృత్యాలు ముగించుకొని హడావిడిగా ఎక్కడికో వెళ్ళాలన్నట్లుగా తయారవుతున్న శీనయ్యగారిని ఆశ్చర్యంగా చూసారు యింట్లో అందరూ.

గబగబ చెప్పులేసుకుని బయటకు వెళ్ళిపోయిన ఆయన, పది నిమిషాల తర్వాత ఓ రిక్షాను పిలుచుకుని వచ్చారు.

"ఒరేయ్ చలపతీ! ఆ సైకిలు తీసి ఆ రిక్షాలో పెట్టు... అది ఆ సైకిలు షాపు రహమాన్‌కి యిచ్చేస్తున్నాను... డబ్బుకి కాదు, వూరికేనేలే!" అంటూ మరల వీధిలోకి వెళ్ళిపోయారు. సైకిలు తీసుకొని చలపతి వెంటరాగా.

(ఈ కథలోని శీనయ్య పాత్రకు స్ఫూర్తి మా నాన్నగారు శ్రీమోచర్ల సూర్యప్రకాశరావుగారు. అందుకే ఈ కథ ఆయన స్మృతికే అంకితం)

# స్పర్శ

**– గంటి భానుమతి**

**కా**లానికున్న శక్తేమిటో ఈ రోజున అనుభవపూర్వకంగా తెలుసుకున్నాను. ఇన్ని రోజులూ కత్తికున్న ఓవైపు మాత్రమే చూశాను. ఇవాళ బాగా అర్థం అయింది కత్తికి అవతలివైపున ఎలా ఉంటుందో. నేను ఓ డాక్టర్‌ని. పొద్దున్న నా కడుపులో ఆపరేషన్ చేశారు. ప్రస్తుతం ఆస్పత్రిలో భరించలేని నొప్పితో, మంచంమీద వున్నాను.

సముద్రం ఎండిపోవచ్చు. అనడానికి కచ్ ప్రాంతం చూస్తే నమ్ముతారు. ఊళ్ళకు ఊళ్ళే నేలమట్టం అవుతాయనడానికి నిదర్శనం మొహంజొదారో. నా విషయంలో అదే జరిగింది. ఓ సర్జన్‌కి కడుపులో సర్జరి.

ఎంతోమందికి ఆపరేషన్ చేసిన నేను, ఆపరేషన్ చేయించుకోవాల్సి వచ్చింది. ఏదో తెలీని భయం. ఇలాంటి భయం ఇదివరకు రోగుల కళ్ళల్లో వుండిందా చూడలేదు. పట్టించుకోలేదు. నా చేతిని పట్టుకునేందుకు వాళ్ళు చేసే ప్రయత్నాలు, ఆ కళ్ళల్లో సందేహాలు ఇప్పుడు అర్థం అవుతున్నాయి అవి ఓ ఆశ్వాసనకోసం, చిన్నపాటి ధైర్యం కోసం అని.

పేషెంట్ల చేతులు పట్టుకునే అలవాటు నాకు మొదట్నుంచి లేదు. ఆపరేషన్ చేసేటప్పుడు తప్పదు. అది వేరే విషయం.

అప్పుడు పేషంట్ మత్తులో వుంటాడు. స్పందనలు అవి ఏవీ వుండవు. నాకు అప్పుడు ఏమీ కనబడదు. ఆ ఎముక, మాంసం, ఆ ఆర్టరీలు, వెయిన్‌లు, నరాలు. వీటిని ఎలాగూ ముట్టుకోక తప్పదు. నా వృత్తి అది. నా దినచర్యలో అదో భాగం. ఆ టచ్ వేరు.

నేను చదువుకునేప్పుడు నాకు ఎలా నేర్పారో ఏం నేర్పారోఅదే చేస్తుంటాను.

ఒక్కసారి మూలిగాను. నాకేం తెలీలేదు. కానీ బాధ. భరించలేని నొప్పి. ఏదో శబ్దం రూపంలో బయటకొచ్చింది. అవే మూలుగులు. వాటిని వినడానికి

యిష్టపడలేదు. కానీ, ఈ రోజున నేను మూలుగుతున్నాను. వారు వీరయ్యారు.

ఎవరైనా మూలుగుతుంటే, ఓ యంత్రంలా నా పని నేను చేసుకుపోయేవాణ్ణి. కానీ యిప్పుడు ఎవరైనా, నాపక్కన కూచుని నా ఫీలింగ్స్‌ని పంచుకుంటే బావుణ్ణు అని అనిపిస్తోంది.

మత్తుగా వుంది.. కళ్ళు మూసుకుపోతున్నాయి.,

ఎవరెవరో వచ్చి వెళ్తున్నారు. వాళ్ళ కదలికల్లోంచి వచ్చే సన్నటి శబ్దాలు ఎక్కడ్నించో వినిపిస్తున్నాయి.

"దుప్పటి సరిచెయ్యండి... ఆ ఇంజెక్షన్ .. అదో కాప్స్యూల్ నిద్రకి.... ఏ.సి. తగ్గించండి..."

ఇలాంటి ఆజ్ఞలు నేనూ యిదివరకు జారీ చేశాను.

ఏవో ప్రశ్నలు అడగడానికి ప్రయత్నించేవాళ్ళని నర్సుల మీదకి వదిలేసేవాణ్ణి. నీట్‌గా షేవ్ చేసుకుని, పేషెంట్ మంచం దగ్గర నుంచుని కేస్ షీట్ చూసి, మందులు మార్చడం, అవసరం అయిన పరీక్షలు లాంటివి రాసి, నన్నంటి పెట్టుకున్న వాళ్ళకి చెప్పేవాణ్ణి. అంతేకానీ, పేషెంట్ మొహం చూడ్డానికే మాత్రం ప్రయత్నించేవాణ్ణి కాదు.

కానీ.. ఈ రోజు..

ఈ తెల్లని గోడలున్న గదిలో... డెట్టాల్ వాసనతో నిండిన వాతావరణంలో. పడుకుని వున్నాను.

నేనిప్పుడు ఓ డాక్టర్ని కాదు.

ఓ పేషెంట్‌ని. పొద్దున్న ఆపరేషన్ అయింది.

నాకు పెళ్ళయింది. భార్య వుంది. యిద్దరు పిల్లలున్నారు.

ఇంటర్ ఫస్టియర్. ఇంటర్ సెకండియర్. బైపిసి తీసుకుని కాబోయే డాక్టర్లు వాళ్ళు.

ఇర్వింగ్ వాలెస్‌ని, జెఫ్రీ ఆర్చర్‌ని యిష్టపడతాను.

చలికాలం అంటే ఇష్టం. ఆకు రాలే కాలంలో, యూనివర్శిటీ ఆర్ట్స్ కాలేజీ

దగ్గర్నుంచి, లైబ్రరీ వరకు చెట్లకింద నడుస్తూ వెళ్ళడం అంటే యిష్టం. ఇలా ఎన్నో యిష్టాలున్న మనిషిని. ఎవరెవరో నన్ను హేండిల్ చెయ్యడం... భయంగా అనిపిస్తోంది.

యింతవరకు నాకు నొప్పి అన్నది పెద్దగా తెలీదు. కానీ యిప్పుడు అది అనుక్షణం నాకు నీడలా తోడుగా వుండిపోతున్నది.

ఏదో భయంగా ఉంది. భయానికి చాలా కళ్ళు. గతంవైపే చూస్తున్నాయి.

నిద్రవచ్చేస్తోంది. కళ్ళు వాలిపోయాయి. రెప్పలు మూసుకుపోయాయి.

ఏవో దృశ్యాలు... మొదటిసారి చచ్చిపోతున్న రోగి, భయంకరంగా నాలుక ముందుకొచ్చి, లోపలికి పోయే తీరు, నిశ్చలంగా గోలీకాయల్లా వున్న గుడ్లు... కళ్ళు తిరిగిపోయాయి. అది చదువుకునే రోజుల్లో...

ఏదో నచికేతుడంటే యముడి దగ్గరికెళ్ళి వచ్చాడు. అక్కడ జ్ఞానాన్ని యోగనిద్ర అంతటిని ఉపదేశం పొంది, అన్నిమాలిన్యాలనీ పోగొట్టుకుని, మృత్యురహితుడై పోయాడు.... కానీ .. అది అందరికీ సాధ్యం అవుతుందా... పొగలు.. మేఘాలు..

యమధర్మరాజు దున్నపోతునెక్కి నా వైపుగా వస్తున్నట్లుగా అనిపించింది. పక్కనే చిత్రగుప్తుడున్నాడు. బ్రహ్మానందం కావచ్చు. బాబూమోహన్ కావచ్చు. మేఘాల్లోంచి దిగుతూ నావైపుగానే వస్తున్నారు. పరిగెత్తాను. కానీ.. అమ్మో!...

"డాక్టర్..."

మెల్లిగా తట్టి లేపింది సిస్టర్.

ఏదో మాత్ర, మంచినీళ్ళు యిచ్చింది సిస్టర్.

మళ్ళా కళ్ళు మూతలుపడ్డాయి. మరో దృశ్యం.

"డాక్టర్ ఎలాగైనా బతికించండి. ఎంత డబ్బయినా ఫర్వాలేదు"

"అలాగే.. మా శాయశక్తులా... అలాగే.."

కానీ, ఆ అలాగే వర్కవుట్ అవలేదు. ఆ పేషెంట్ చనిపోయాడు. అందరూ ఒక్కసారిగా ఏడుపు.... అమ్మో!

ఉలిక్కిపడి కళ్ళు తెరిచాను. ఒకణ్ణే మంచం మీద.. నిశ్శబ్దంగా వున్న గదిలో భయంగా అనిపిస్తోంది.

"మేమంతా వున్నాం. మీరు ఎవరూ వద్దు. అసలే మాత్రం డిస్టర్బెన్స్ వుండకూడదు. రేపట్నించి మీరంతా రావచ్చు. రాత్రి వుండచ్చు. కానీ ఈ ఇరవయి నాలుగ్గంటలు మా పర్యవేక్షణలో వుండాలి" ఎవర్నీ వుండనియ్యలేదు. అందుకే ఒక్కణ్ణే... ఇలా... ఈ గదిలో .. మంచం మీద...

కళ్ళు మూసుకున్నాను. ఏవో దృశ్యాలు

ఆపరేషన్ చేస్తున్నాను.. సక్సెస్... కాని.. మర్నాడు కాంప్లికేషన్స్ డెవలప్ అయ్యాయి. పోయాడు. ఆ రోజున ఏదో మామూలు విషయంలా తీసుకున్న నాకు... ఇవ్వాళ ఎందుకో భయం! పేషెంట్ .. ఎక్కడికో వెళ్ళి పోతున్నాను... ఎక్కడికీ?

కొండలు కోనలూ, వాగులూ నదులూ, తిప్పలు తిన్నెలు, పర్వతాలు సముద్రాలు.. సముద్రాన్ని ఆకాశాన్ని వేరుచేస్తున్న గీత... ఎంతసేపు అలా వెళ్ళానో తెలీలేదు. ఏవో స్పర్శలు. ఎవరూ? నా పేషెంట్లా! ఉహూ.. పరీక్షలు.. డ్యూటీ సిస్టర్స్ వాళ్ళ పని వాళ్లు చేసుకుపోతున్నారు. మళ్ళా హాస్పిటల్.. నా నొప్పి... కొంచెంగా తెలుస్తోంది. రిపోర్టులు రాస్తున్నారు.

బైట మాటలు వినపడ్తున్నాయి.

రైలు కూతలు, బస్సు వాహనాల రొదలు వినపడ్తున్నాయి.

షిఫ్ట్‌మార్పు, నా రూంలో కూడా హడావిడీ.

ఖడక్‌గా.... గంజి పెట్టిన యూనిఫారాల్లో వున్న స్టాఫ్ మళ్ళా మళ్ళా వచ్చిపోతున్నారు.

నా దగ్గర వచ్చి నుంచుంది ఆమె.

నల్లగావున్న ఆ సిస్టర్ వచ్చి దుప్పటి సరిచేసింది.

తలగడని అన్నివైపులా నొక్కి నొక్కి గుండు గుండులా చేసి తలకింద పెట్టింది. ఏఫీషియెంట్ సిస్టర్. ఈ హాస్పిటల్ ఎఫీషియెన్సీకి పెట్టింది పేరు.

ఏసి అడ్జస్ట్ చేసింది.

బ్లైండ్స్‌ని తెరిచింది. కర్టెన్ సరిచేసింది.

గుమ్మం వరకూ వెళ్ళింది. మళ్ళా ఏదో గుర్తొచ్చినట్లుగా లోపలికొచ్చింది. నాప్‌కిన్ తీసుకెళ్ళింది పక్కనే వున్న బాత్రూంలోకి.

ముఖాన్ని తుడిచింది.

చిరునవ్వు చెదరడం లేదు.

"నొప్పిగా వుందేమో కదా!" కొత్తపదాలు! మనస్సుని స్పృశించాయి.

'నొప్పిగా ఉందా!"

అదొక్కటే మాట ఆమె నాతో అన్నది.

ఎందుకో కళ్ళలో నీళ్లు తిరిగాయి.

ఆ మాటలకి ఎంత శక్తి!

బాధ, నొప్పి అనుభవ పూర్వకంగా తెలుసుకున్నాను.

ఆమె నా బాధని, నా భావాల్ని అర్థం చేసుకుని, తన పలకరింపుతో నా బాధ బరువు తగ్గినట్లుగా అనిపించింది.

ఆ మనిషి ఒక్క క్షణం తీసుకుని నా బాధని అర్థం చేసుకుని అనగలిగింది. నొప్పిగా వుందేమో కదా! మాటలకెంత శక్తి!

ఆ చర్మం కింద మానవతా పరిమళం. అద్భుత సౌందర్యం

ఆరోజు రొటీన్‌లో చిన్న మార్పు కనపడింది. కాదు... వచ్చింది.

నా నాడి చూస్తున్నప్పుడు కాదు.

నా బి.పి. చూస్తున్నప్పుడు కాదు.

నా నోట్లో థర్మామీటరు పెట్టినప్పుడు కాదు.

నాకు మందు, మాత్రా యిచ్చినప్పుడూ కాదు.

ఆమె అన్న మాటలు... గుండెల అడుగున, లోతుల్లో , ఎక్కడో స్పృశించింది.

ఆమె మాటలు దేవుడు అన్నట్లుగా అనిపించింది.

మనిషి తెలిపే దిక్సూచిలాగా అనిపించింది.

ఆ తర్వాత నేను ఏ పేషెంటునైనా పరీక్ష చేస్తున్నప్పుడూ నాలోని మనిషి జీవించడం మొదలెట్టాడు. శరీరాన్ని కాదు, ఓ మనిషిని పట్టుకున్నట్లుగా ముట్టుకున్నట్లుగా అనిపించేది.

స్టెత్ పెట్టినప్పుడు వాళ్ళ కళ్ళల్లో భావాలు నాకు వినపడేవి గుండె చప్పుళ్ళలోంచి ఏం పర్వాలేదు. తగ్గిపోతుందన్నట్లుగా బుజాన్ని తట్టి అనడం నేర్చుకున్నాను. నా జీవశక్తిని అమృతంగా మార్చడానికి ప్రయత్నిస్తున్నాను.

అందుకే కదా మృత్యోర్మా అమృతంగమయ అన్నది.

**– 23.6.2004 నవ్య వారపత్రిక**

# ఆడపిల్ల

**– సోమంచి ఉషారాణి**

“ఏవండీ! రేప్పొద్దున స్టేషన్‌కి వెళ్ళాలి. అమ్మ వస్తోంది” అంది శాంతి భర్తతో.

“ఇప్పుడెందుకొస్తోంది ఆవిడ?”

ఏమీ ఎరగనట్లే అడిగాడు శేఖర్ పేపర్ తిరగేస్తూ.

“అదేమిటి ! అలాగంటారు? మన ఒప్పందం మర్చిపోయారా?”

అమ్మకు ఇద్దరం ఆడపిల్లలమే.

నాన్న యాక్సిడెంట్‌లో పోతే కష్టపడి మమ్మల్ని చదివించి, పెళ్ళిచేసింది. ఆవిడకంటూ ఏమీ మిగుల్చుకోలేదు. ఇప్పుడు మేము సంపాదిస్తుండగా కూడా ఆవిడ కష్టపడడం ఇష్టంలేక అక్క దగ్గర కొన్నాళ్ళూ, నా దగ్గర కొన్నాళ్ళూ ఉంచుకుంటామని పెళ్ళికి ముందే చెప్పాను కదా!”

శాంతి సీరియస్‌గా అని లోపలికి వెళ్ళిపోయింది.

“ఎవరికైనా అత్తారింట నుంచి ఆస్తులూ, వస్తువులూ వస్తే నాకు అత్తగారే వస్తున్నారు. హు ఏం చేస్తాం’ అనుకుని భార్యకి కోపం వచ్చిందని బతిమాలుకోవడానికి ఆమె వెనుకే వెళ్ళాడు.

“ఇప్పుడు నేనేం అన్నాను శాంతీ! ఏదో మర్చిపోయి....!

“సరే బజారుకెళ్ళి సరుకులు తెచ్చుకుందామా?”

“తెచ్చుకో! నన్నడగడం దేనికీ?”

“అదేమిటీ డబ్బులివ్వండే...”

“నీ జీతం ఉందిగా!”

“అబ్బా! మీకు మతిమరుపు బాగా ఎక్కువైంది”

“నాకేం మతిమరుపు లేదు. నా దగ్గర డబ్బు లేదు”

"లేదా! మీ జీతం అంతా ఏమైంది?"

"నా జీతం లెక్కలు నీకు చెప్పవలసిన అవసరం లేదు. మగాళ్ళకేవో లక్ష ఖర్చులుంటాయి"

"ఆహా! ఆడవాళ్ళకుండవా ఖర్చులు?"

"ఉంటే పెట్టుకో! నీ జీతం నేనడిగానా?"

"నీ జీతం... నా జీతం ఏమిటి? మనం ఏమనుకున్నాం? నా జీతం బ్యాంకులో వేద్దాం. రేపు పిల్లలు పుట్టినా, సడన్‌గా ఏ అవసరం వచ్చినా ఎవరినీ అడగక్కరలేదు. మీ జీతంతో ఇల్లు నడుపుదాము అనుకున్నామా?"

"నేను కాదన్నానా? ఈ నెల ఖర్చయిపోయింది"

"అదే ఎలా ఖర్చయిందీ అని అడుగుతున్నాను."

శేఖర్ ఏమీ మాట్లాడలేదు

నిన్నగాక మొన్న పెళ్లయిన పెళ్ళాం అలా నిలదీయడం అతనికి నచ్చలేదు.

ఆఫీసులో సరదాగా రేసులుకి వెడదామంటే వెళ్ళాడు. రెట్టింపు డబ్బు వస్తోందన్న ఆశతో రేసుల్లో పెట్టాడు. కానీ, నష్టం వచ్చింది.

ఆ విషయం చెబితే...

అయినా ఎందుకు చెప్పాలి? తన కష్టార్జితం ఆ మాత్రం స్వతంత్రంగా ఖర్చు చేసుకునే అధికారం తనకు లేదా?

"మాట్లాడరేం? మీ వాళ్లకి పంపారా?"

శేఖర్ బుర్రలో ఒక ఆలోచన వెలిగింది.

"అవును అమ్మకి ఒంట్లో బావుండలేదుట! నాన్న ఉత్తరం రాస్తేనూ..."

" ఆ మాట చెప్పడానికి అంత ఆలోచిస్తారేం?

అవసరానికి మనం వాళ్లకిస్తే కాదంటావా? పోనీ లెండి, రేపు బ్యాంకులో డబ్బుతీసి సరుకులు తీసుకువస్తాను. రండి భోజనం చేద్దాము" నవ్వుతూ భర్త చేయి పట్టుకుని డైనింగ్‌టేబుల్ దగ్గర కూర్చుని అన్నం వడ్డించింది. శాంతికి అన్నం సయించలేదు. తిన్నది కూడా వాంతి అయిపోయింది.

శేఖర్ కంగారుపడ్డాడు.

శాంతి నవ్వి, "ఫర్వాలేదు, మీరు తినండి, నాకీ మధ్య ఇలాగే ఉంటోంది. రేపు డాక్టరు దగ్గరకు వెళ్లాలి" అంది.

'అంటే?'

'అవు'నన్నట్లు నవ్వింది శాంతి.

అయితే సినిమాల్లో చూపించినట్లు ఎగిరి గంతేసి ఆమెను ఎత్తేయలేదు శేఖర్.

"వాట్ నాన్‌సెన్స్! మనం అప్పుడే పిల్లలు వద్దనుకున్నామా? పైగా నవ్వుతున్నావా? రేపే వెళ్లి వెంటనే అబార్షన్ చేయించుకో!"

శేఖర్ కోపంగా కంచంలో చేయి కడిగేసుకున్నాడు.

"అదికాదండీ! మొదటే జాగ్రత్తపడితే ఒక్కోసారి అసలు పిల్లలు పుట్టే అవకాశమే ఉండదని..."

"అని... ఎవరు చెప్పారు? అసలు మనం ఏం అనుభవించాం? ఏం కూడబెట్టాం? నా కిష్టంలేదు. అంతే!"

శేఖర్ అంత నిక్కచ్చిగా అంటుంటే శాంతికి ఏడుపు వచ్చింది.

"ఎందుకేడుస్తావు? అప్పుడే కడుపూ, కానుపా! ఛ! మనం సరదాగా తిరగడం, సంతోషంగా ఉండటం నీ కిష్టం లేదా? పైగా ఉద్యోగస్తురాలివి. పిల్లలని ఎవరు చూస్తారు?" శేఖర్ ఆవేశంగా అన్నాడు.

"మా అమ్మ చూస్తుందిలెండి" అంది ఉక్రోషంగా శాంతి.

"అయితే మీ అమ్మని ఇక్కడే పర్మినెంట్‌గా సెటిల్ చేద్దామనుకుంటున్నావా? అమ్మ! ఇంత గుండెలు తీసిన బంటువనుకోలేదు"

"కేర్ సెంటర్‌లో పెట్టినా డబ్బుకట్టాలి కదా! ఆ డబ్బు మా అమ్మ మీద ఖర్చుపెడితే మనవాళ్ళని ధైర్యంగా ఉంటుంది. అందుకని అలా అన్నానుకానీ..."

"అబ్బా నంగనాచి! ఏమీ ఎరగనట్లు ఎలా మాట్లాడుతోందో! రేపు వెళ్లి అబార్షన్ చేయించుకో... నో డిస్కషన్..!"

"అదికాదండీ! ఈ ఒక్కసారికీ నామాట వినండి. ఆ తరువాత నేను మీ మాట వినకపోతే అడగండి" శాంతి సర్దిచెప్పాలని చూసిన కొద్దీ శేఖర్ బెట్టుచేశాడు.

శాంతి ఏడుస్తూ పడుకుంది.

శేఖర్‌కి ఏం చేయాలో పాలుపోలేదు. ఎంత నచ్చజెప్పుకున్నా అతని మనసు అంగీకరించటం లేదు.

కొత్తగా పెళ్లయిన భార్య! ఇంకా పెళ్లయి ఏడాది కాలేదు. తనతో సమానంగా సంపాదిస్తున్న భార్యను కష్టపెట్టడం అతనికీ బాధగానే ఉంది.

ఈ ఆడవాళ్ళు ఎంత చదువుకుని, ఉద్యోగం చేస్తున్నా సెంటిమెంట్ వదులుకోరు. ఏడుపు వాళ్లకి భగవంతుడిచ్చిన మహాయుధం!

"సరేలే! అయిందేదో అయింది. ఎలాగూ కనేది ఒకళ్లనే కనుక ముందే చెబుతున్నాను. మగపిల్లవాడయితే సరే! ఆడపిల్లయితే మటుకు అబార్షన్ తప్పదు" అన్నాడు.

శాంతి తెల్లబోయింది.

అతడిలా ప్లేటు ఫిరాయిస్తాడనుకోలేదు.

ఎంత చదువుకున్నా ఈ మగాళ్లింతే!

వాళ్లని కన్నతల్లి ఆడది!

కట్టుకున్న పెళ్లాం ఆడది!

వాళ్లు మాత్రం ఆడపిల్లల్ని కనరట... కాదు కననివ్వరట!

ఎంత అమానుషం...!

ఇరవై ఒకటో శతాబ్దంలో అడుగిడుతూన్నా వీళ్లు మారరు.

"ఈ రోజుల్లో ఇంకా ఆడా, మగా ఏమిటండీ? ఎవరో ఒకరు..." శాంతి మెల్లగా నచ్చజెప్పబోయింది.

"అదే కుదరదంటున్నాను. నా మాటకు విలువ ఉందా? లేదా?" శేఖర్ అసహనంగా అన్నాడు.

శాంతికి చాలా కోపం, ఉక్రోషం వచ్చాయి. కానీ అది సమయం కాదని ఊరుకుంది. రెట్టించిన కొద్దీ మగవాళ్లింకా రెచ్చిపోతారు. పురుషాహంకారం వాళ్ల నరనరాల్లోనూ ఇమిడిపోయింది. దాన్ని వదిలించుకోవడం అందరికీ సాధ్యం కాదు.

"చూద్దాంకాదు, చేద్దాం సరే నను" రెట్టించాడు శేఖర్. ఇనుము వేడిమీద ఉన్నప్పుడే వంగదీయాలి, లేకపోతే లొంగుతుందా?

"సరే లెండి" శాంతి అయిష్టంగానే అంది.

మర్నాడు జానకమ్మ రైలు దిగింది.

శేఖర్‌కి అత్తగారిని చూస్తే అత్తగారిలా అనిపించదు. ఇద్దరే ఆడపిల్లలూ, వయసులో ఉండగానే భర్తపోవడం, భర్తపోయినా చేతికి బంగారు గాజులూ, మెళ్లో గొలుసూ, దుద్దులూ, నుదుట చిన్న నల్లబొట్టు ఇంత వయసు వచ్చినా ఆమె తెల్లగా, నాజూగ్గా అందంగానే ఉందంటే వయసులో ఇంకెంత అందంగా ఉండేదో!

పెద్దకూతురు కాంతికి బహుశా తండ్రి పోలిక వచ్చిందేమో అంత అందంగా ఉండదు. కానీ శాంతి మళ్లీ తల్లి పోలిక! వాళ్లిద్దరినీ చూస్తే అక్కా చెల్లెళ్లు అనుకుంటారుగానీ తల్లీ కూతుళ్ళలా ఉండరు.

"బావున్నారా బాబూ! అమ్మాయి కులాసానా?"

జానకమ్మ ఆప్యాయంగా అడుగుతుంటే ఈ లోకంలోకి వచ్చాడు శేఖర్

"కులాసాయేనండీ! మీరూ, మీ పెద్దమ్మాయీ వాళ్ళూ..."

"అంతా బానే వున్నారు"

"మీరు స్కూటర్ మీద కూర్చోగలరా? ఆటో పిలవనా?

"నేనేమైనా ముసలిదాన్నా! కూర్చుంటాలెండి" అందావిడ

"ఈ బుట్ట నా కాళ్ల దగ్గర పెట్టుకుంటాను. సూట్‌కేస్ పట్టుకుని కూర్చోండి" అన్నాడు.

శేఖర్, సూట్‌కేస్ ఇద్దరి మధ్యా పెట్టి కూర్చుందావిడ. కొంత ఇబ్బందిగా ఉన్నా శేఖర్ ఏమీ అనలేకపోయాడు.

తల్లిని చూసి సంతోషంగా పరిగెత్తుకొచ్చి కౌగిలించుకుంది శాంతి. కుశల ప్రశ్నలయ్యాక జానకమ్మ స్నానానికి వెళ్లాక.

"ఏమిటి! ఇంకా అలాగే ఉన్నావు? ఆఫీసుకు రావడం లేదా?" శేఖర్ మెల్లిగా అడిగాడు.

"అమ్మ వచ్చిందికదా! అదీ కాక నాకు ఒంట్లో తేలిగ్గా లేదు అందుకనీ..."

భర్తకేసి ప్లీజింగ్‌గా చూసింది శాంతి.

"సరే! నీ ఇష్టం. లీవ్ లెటర్ ఇచ్చి. నాకు వడ్డించు.. ఇదిగో చూడు... మీ అమ్మ దగ్గర రాత్రి జరిగినదేదీ చెప్పకూడదు. అర్థమైందా?" అని వార్నింగిచ్చి మరీ వెళ్లాడు శేఖర్?

"ఏమిటమ్మా అలా ఉన్నావు? ఏమైనా విశేషమా?"

తల్లి అభిమానంగా అడిగేసరికి శాంతికి దుఃఖం వచ్చేసింది.

"ఏంటమ్మా! ఏం జరిగింది? నాతో చెప్పకూడదా?"

తల్లి గుండెల్లో తలదాచుకుని ఏడిస్తే శాంతికి కొంత ఉపశమనం కలిగింది. తల్లితో చెబుదామా అనుకుంది కానీ భర్త ఇచ్చిన వార్నింగ్ గుర్తుకు వచ్చింది. అదీగాక తమ మధ్య భేదాభిప్రాయాలు తలెత్తాయంటే తల్లి బాధపడుతుంది. రాగానే ఆమెనెందుకు నొప్పించడం?

"ఏం లేదమ్మా! వేవిళ్ళు, అందుకని నిన్ను చూడగానే ఏడుపు వచ్చేసింది" అంది కళ్లు తుడుచుకుని సిగ్గుపడుతూ.

"దొంగా! మరి చెప్పవేం? హడలగొట్టేశావు" అంది ఆప్యాయంగా శాంతి నుదుట ముద్దుపెట్టుకుంటూ

"రామ్మా! భోజనం చేద్దాం. అక్కయ్య కబుర్లేంటి చెప్పు" అంటూ సరదాగా కబుర్లు చెప్పుకుంటూ భోజనం చేశారు.

"కాసేపు పడుకోమ్మా. లేచాక మాట్లాడుకోవచ్చు. నేనివ్వాళ సెలవు పెట్టాను. నాకూ నిద్రవస్తోంది" అని పడుకుంది శాంతి.

జానకమ్మ కూతుర్ని చూసి నిట్టూర్చింది.

పిచ్చిపిల్ల! అప్పుడే ఎంత పెద్ద ఆరిందలా మారింది!

పెళ్లయితే ఆడపిల్లలింతేనేమో!

పెద్దకూతురు పిల్లలు పుట్టలేదని బెంగపెట్టుకుందన్న చేదు నిజాన్ని ఈ సంతోషసమయంలో చిన్న కూతురికి చెప్పలేక ఆ బరువునీ, బాధనీ మోస్తున్న ఆ కన్నతల్లి చిన్నకూతురు మరో విధంగా బాధపడుతుందనీ, ఇక్కడ కూడా చేదు అనుభవాలు ఎదుర్కోవలసి వస్తుందనీ ఊహించలేకపోయినా నిద్రలోకి జారింది.

పదిరోజులు సరదాగానే గడిచోయిపోయాయి.

తల్లి కూతురికి వేవిళ్లని నోటికి రుచికరమైనవి చేసిపెట్టేది. సాయంత్రం ఆఫీసునుంచి వచ్చాక ముగ్గురూ సినిమాలకో, ఏవైనా ప్రదేశాలకో, గుడికో వెళ్ళేవారు.

శేఖర్ అత్తగారిని అభిమానంగానే చూసేవాడు. ఆవిడ మాట గౌరవించేవాడు. జానకమ్మ అతని మంచితనానికి మురిసిపోయింది. కాంతి జీవితం తలుచుకుని బాధపడేది.

పెద్దల్లుడు శంకర్ కూడా మొదట బాగానే ఉండేవాడు. కానీ ఈ మధ్య పిల్లలు పుట్టలేదని సతాయింపు ఎక్కువైంది. అత్తగారని కూడా చూడకుండా తనకేసి అదోలా చూసేవాడు.

ఆ చూపులు నచ్చలేదు. అయినా...

కూతురు బాధపడుతుందని అవన్నీ భరించి కూతురికి సాయంగా ఉండిపోయింది.

"నీ కన్నా మీ అమ్మే బావుంటుంది. ఏదో ఉద్యోగం వెలగబెడుతున్నావని చేసుకున్నాను హు..." అని నిట్టూరిస్తే

కాంతి తనకు వినబడుతుందని "మెల్లిగా మాట్లాడండి.. అయినా తల్లిలాంటి స్త్రీని పట్టుకుని ఏమిటా మాటలు? అమ్మ వింటే బాధపడుతుంది" అనేది.

"నేను ఆవిణ్ణి పట్టుకుని ఎక్కడన్నానే? హు అంత అదృష్టం కూడానా?" అని శంకరం అంటుంటే కాంతి కోపంగా వెళ్లిపోయేది

శంకర్ పకపకా నవ్వుకునేవాడు.

"పిచ్చితల్లి! నాకు చెప్పుకోలేకా, భర్తకి నచ్చచెప్పలేకా ఎంతగా నలిగిపోయేదో!' తను కూడా అక్కడ ఉండలేకపోయింది.

"డాక్టరుకి చూపించుకున్నావా? స్కానింగ్ చేశారా?" అడిగాడు శేఖర్ శాంతిని.

శాంతి దీనంగా చూసి తలవంచుకుంది.

శేఖర్‌కి అనుమానం ఎక్కువైంది.

'మాట్లాడవేం? ఆడపిల్లని అన్నారు కదూ!" కోపంతో అతని గొంతు స్థాయి పెంచాడు.

"గట్టిగా అరవకండి. చదువుకున్న వాళ్ళుంకూడా మూర్ఖంగా ఆడపిల్లని అబార్షన్..."

"షటప్! నేను ఆరోజే చెప్పాను. మళ్ళీ మొదటికొచ్చావే? నా మాటంటే అంత లెఖ్ఖలేదా?" గట్టిగా అరిచాడు శేఖర్.

"నేను చెప్పేది పూర్తిగా వినండి. ప్లీజ్!" శాంతి బతిమాలుతున్న కొద్దీ శేఖర్ కోపంగా అరిచాడు.

"నేను వినను. రేపు సెలవు పెడుతున్నావ్. అబార్షన్ చేయించుకుంటున్నావు. దట్సాల్" అని విసురుగా బయటికి వెళ్ళిపోయాడు.

శాంతి ఎంత పిలుస్తున్నా వినిపించుకోలేదు.

'ఏమిటమ్మా? ఏం జరిగింది?' అంది జానకమ్మ కంగారుగా, శాంతి జరిగింది చెప్పింది.

భర్తని ఒప్పించలేకపోయినందుకూ, అబార్షన్ చేయించుకోవలసి వస్తున్నందుకూ రోషంగా ఉంది శాంతికి.

'హు! ఏం చదువుకున్నా ఎంత సంపాదిస్తున్నా ముదిత, బతుకు చర్విత చరణం!

'పెద్దల్లుడు పిల్లలు పుట్టలేదని ఆమెని నిందిస్తుంటే, చిన్నల్లుడేమో అప్పుడే పిల్లలు వద్దనీ, పుట్టినా ఆడపిల్ల వద్దనీ! ఎవరికి చెప్పగలదు? చెప్పినా వింటారా?'

జానకమ్మ నిట్టూర్చడం తప్ప ఏం చేయగలదు?

'పోనీలే శాంతీ! చిన్న విషయానికి మీ ఇద్దరికీ మనస్పర్థలెందుకు? మీరు సంతోషంగా ఉండటం ముఖ్యం. మరోసారి...

"అప్పుడూ ఆడపిల్లయితే? ఇలా భ్రూణహత్యలు చేసుకుంటూ పోవలసిందేనా? దీనికి అంతమెక్కడా? పురుషాహంకారానికి లొంగి ఎన్నాళ్లు జీవించాలి? ఏమైనా సరే..."

"అయితే నీకూ నాకూ ఇక సంబంధం లేదు. నీ దారి చూసుకోవచ్చు" అప్పుడే వచ్చిన శేఖర్ విసురుగా అన్నాడు.

"ఏం! నేను బ్రతకలేననుకున్నారా?

స్త్రీకి పురుషుడి అవసరం ఎంత ఉందో పురుషుడికీ స్త్రీ అవసరం అంతే ఉంటుంది. ఈ రోజుల్లో ఆడపిల్లలు కూడా మగవాళ్ళతో సమానంగా చదువుకుని.."

"అందుకే అంతపొగరు! ఎంత చదువుకున్నా మొగుడు దగ్గర లొంగి ఉన్నప్పుడే ఆ కాపురం సజావుగా సాగుతుంది. నువ్వెంతంటే నువ్వెంతా అనుకుంటే... మన హైందవ సంప్రదాయానికి అర్థమే లేదు. మీరు పెద్దవారు ఉండి కూడా ఏం మాట్లాడరేం అత్తగారూ!"

శేఖర్ జానకమ్మ కేసి కోపంగా చూస్తూ అడిగాడు.

"నేనూ ఒక ఆడదాన్నయి ఉండి, ఒక ఆడపిల్లకి అదీ కన్న కూతురికి...

"నువ్వు కూతుర్ని కనకమ్మా?" అని ఎలా చెప్పమంటావు బాబూ! అమ్మాయి అన్నదాంట్లో మాత్రం తప్పేం ఉంది?" అంది జానకమ్మ.

"ఎంతైనా మీరూ ఆడవారూ, శాంతి తల్లి!మిమ్మల్ని అడగడం నాదే బుద్ధితక్కువ. అందులోనూ ఆడపిల్లల్నే కన్న మహాతల్లి మీరు. అంతకన్నా ఏమంటారు లెండి" వ్యంగ్యంగా నవ్వాడు శేఖర్

జానకమ్మ మౌనంగా అక్కడినుంచి వచ్చేసింది.

ఇంతలో శేఖర్ తల్లిదండ్రులు వచ్చారు. అందరూ మామూలుగా నవ్వుతూ కుశలప్రశ్నలు వేసుకున్నారు.

"నాన్నగారికి ఒంట్లో బావుండలేదురా! బాగా దగ్గూ, ఆయాసం వస్తోంది. ఇక్కడ చూపించుకుందామని వచ్చాము. మంచి డాక్టర్ ఎవరో కనుక్కుని, రెండురోజులు సెలవుపెట్టి నాన్నని..."

తల్లిమాట పూర్తికాకుండా విసుగ్గా చూశాడు శేఖర్.

"అమ్మా! నాకిప్పుడు సెలవు దొరకదు. అయినా ఉత్తరం రాయకుండా ఎందుకు వచ్చారు?"

"బావుంది నాయనా! అయ్యొచ్చేదాకా అమావాస్య ఆగుతుందా? ఆయన పరిస్థితి చూడలేక, నువ్వు కాదనవని..."

"ఊ సరేలే! శాంతి! అన్నం వడ్డించు. నిద్రవస్తోంది" అని కోపంగా అక్కడనుంచి వెళ్ళిపోయాడు.

శాంతి మౌనంగా భర్తకి వడ్డించింది. జానకమ్మ వియ్యంకులకి మళ్ళీ అన్నం వండింది. శేఖర్ పడుకున్నాక అందరూ కలిసి భోజనం చేశారు. అత్తమామలు బాధపడుతుంటే శాంతి వారిని ఓదార్చింది. మాటల్లో శేఖర్ డబ్బు పంపలేదని అర్థమైంది.

"నేను సెలవు పెట్టి మావయ్యగారిని చూపిస్తాను. మీరుబాధపడకండి అత్తయ్య గారూ! పడుకోండి" అని వంటిల్లు సర్ది బెడ్‌రూమ్‌లోకి వెళ్ళేసరికి శేఖర్ హాయిగా నిద్రపోతున్నాడు.

"డబ్బేం చేశారు?"

మర్నాడు శాంతి అడిగిన ప్రశ్నకు ఉలిక్కిపడ్డాడు శేఖర్.

"ఏ డబ్బు?" అన్నాడు ఏమీ ఎరగనట్లు.

"అదే, ఈ నెల జీతం".

"అదీ... చెప్పానుగా! మళ్ళీ అడుగుతావేం?"

"ఆ డబ్బు ఏం చేసుకున్నారో అడగను. మళ్ళీ నెలనుంచీ మీ జీతం ఇస్తేనే ఇంట్లో సరుకులు కొంటాను. లేకపోతే ఇంట్లో అందరూ పస్తే! మావయ్యగారిని మీరు డాక్టరు దగ్గరికి తీసుకెడతారా? నేను తీసుకెళ్లనా?"

"నాకు కుదరదని చెప్పాగా! నాకు ఆఫీసులో చాలా పనుంది. నీ అబార్షన్ సంగతి ఏం చేశావు?"

"నాకూ కుదరదని చెప్పాగా! మగపిల్లలు తల్లిదండ్రుల్ని ఎంత బాగా ఆదరిస్తున్నారో చూస్తున్నాంగా!" నిరసనగా అనేసి అక్కడ నుంచి వెళ్ళిపోయింది శాంతి.

శేఖర్ ఆఫీసుకి వెడుతుంటే, "బాబూ! మేం డాక్టరు దగ్గరికి వెళ్ళొస్తాం" అన్నాడు శేఖర్ తండ్రి.

'మంచిది' అని శేఖర్ వెళ్ళిపోతుంటే అతని తల్లిదండ్రులు నిట్టూర్చారు 'ఆడపిల్లని కనలేకపోయామే' అని!!

'జానకమ్మా! నువ్వు అదృష్టవంతురాలివి. మాలాంటి మగపిల్లలు కన్న తల్లిదండ్రుల కోసమే వృద్ధాశ్రమాలు వెలిశాయేమో!" బాధపడుతూ కోడలు వెంట బయలుదేరారు శేఖర్ తల్లిదండ్రులు.

శాంతికి అత్తమామలు తనవైపు ఉంటారన్న ధైర్యం కలిగింది.

**(ఆంధ్రజ్యోతి వీక్లీ)**

# అనురాగ స్మృతి

– డా. సి.భవానీదేవి

"త్వరగా రండి. అన్నం చల్లారిపోతున్నది" ప్రభావతి ఆరోసారి కేకేసింది.

"వస్తున్నా ఉండు ప్రభా! న్యూస్ చూసేటప్పుడు వడ్డించొద్దని ఎన్నిసార్లు చెప్పాను. నీకస్సలు బుద్ధిలేదు" విసుక్కుంటూ టి.వి. ముందు నుంచి లేచాడు నారాయణ.

ప్రభావతి మనస్సు కలుక్కుమంది. "విసుక్కోకుండా ఏ పనీ చేయడు కదా!" అనుకుంది కోపంగా.

"ఆ! అదే న్యూస్.. ఎన్ని ఛానెళ్లలో అయినా అదే కదా! ఎంతసేపింక.... డాక్టర్ లేటుగా భోజనం చేయొద్దని చెప్పలేదూ" గొణిగింది.

నారాయణ మొహంలోని సీరియస్‌నెస్ చూసి ఇంకేం మాట్లాడలేదు.

కంచం ముందు కూర్చున్న నారాయణకు కంది పచ్చడ్ని చూడగానే ప్రాణం లేచొచ్చింది.

"కంది పచ్చడి చేశావా! చెప్పవేం" అంటూ నోట్లో నీళ్ళూరుతుంటే అన్నం కలుపుకోవడం మొదలుపెట్టాడు.

"ఆ! నన్నెక్కడ చెప్పనిచ్చారు. పిలుస్తుంటే ఒకటే చిరాకాయె" అంటూ వెన్నముద్ద తెచ్చి కంచంలో వేసింది ప్రభావతి.

వేడి వేడి అన్నంలో కందిపచ్చడి, వెన్న కలిపి తింటుంటే తనకిష్టమైన విధంగా వంటచేసి పదిసార్లు పిలిచి భోజనం పెడ్తున్న భార్య మీద ప్రేమ ముంచుకొచ్చింది నారాయణకి. తలెత్తి ప్రభావతి కేసి చూశాడు.

ఆవిడ తనేమంటాడో అని ఎదురుచూస్తున్నది.

"కంది పచ్చడి బాగుంది ప్రభా!" అనాలనుకున్న మాటలు గొంతులోనే ఆగిపోయాయి.

అమ్మో! ఇంకేమన్నా ఉందా! ఆడవాళ్ళు ఏ పని ఎంత బాగా చేసినా మెచ్చుకుంటే నెత్తిమీదికెక్కి కూర్చోరూ!

తన మొహంలోని భావాన్ని బయటపడనీయకుండానే తల దించుకుని 'చారు' అన్నాడు. ప్రభావతికి వళ్ళు మండింది. గుండ్రాయిలా కూర్చుని గుటుక్కు గుటుక్కు మంటూ ఇంతింత ముద్దలు మింగుతాడేగానీ 'బాగుంది' అనడీయన.

వేడి వేడి చారు అన్నంలో పోసింది. 'బాగుంది చారు' మనసులోనే అనుకుని మజ్జిగన్నం తిని లేచాడు త్రేన్చుతూ.

"ప్రభావతి వంట బాగా చేస్తుంది. తన ఆరోగ్యం బాగుండటానికి కారణం ఆవిడ శ్రద్ధే!" అన్నీ స్వగతాలే!

ప్రభావతి వంటిల్లు సర్దుకుని వచ్చేసరికి ఉయ్యాల బల్లమీద పడుకుని వున్నాడు నారాయణ.

"శయనించారూ! ఉయ్యాల బల్ల ఒకటి నా ప్రాణానికి. దీని మీద పడుకుంటే ఇంక ఏదీ గుర్తుండదు మీకు" అంటూ ఇన్‌లాండ్ కవర్, పెన్ను తెచ్చిచ్చింది ప్రభావతి.

"ఏంటే నీ గోల" మళ్ళీ విసుక్కున్నాడు నారాయణ.

"బావుంది వరస. అన్నీ నా గోలలే. అమ్మాయికి పండక్కి డబుల్‌కాట్స్ ఇస్తామని అల్లుడికి ఉత్తరం రాసి పడెయ్యండి" పక్కనే కూర్చుంటూ హుకుం జారీ చేసింది.

ఉలిక్కి పడ్డాడు నారాయణ.

'డబుల్ కాట్సా! నీకేమైనా మతిపోయిందా! ఉగాది ఇంకా మూడ్నెల్లుంది. ఎనిమిది వేలన్నా అవుతాయి. ఎలా తేవాలి" రుసరుసలాడాడు.

"అవన్నీ మీకెందుకు. ముందు అమ్మాయి మీద అల్లుడి గెంతులు తగ్గుతాయి. అసలే పిల్ల లేవలేనిది కూడా"

ఆవిడ చాటుగా కళ్ళొత్తుకోవడం నారాయణ కంటపడింది.

'సరేలే...' అయిష్టంగా రాయడం మొదలుపెట్టాడు.

ఎలా రాయాలో దాదాపు డిక్టేషన్‌లా రాయించింది ప్రభావతి.

ఉత్తరం రాయటం పూర్తిచేసి అతికించాక  అడిగాడు.

"డబుల్‌కాట్స్ ఎలా ఇవ్వగలం ప్రభా! నా చేత వాగ్దానం చేయించావు?"

"అబ్బో! మీరు వాగ్ధాలన్నీ తీరుస్తున్నట్లు... నా పొలం మీద అయివేజు వస్తుందిగా. అదిచ్చి కొందాం" అందావిడ ప్రేమగా.

"వద్దు ప్రభా! నీకసలే ఆరోగ్యం బాగాలేదు. డాక్టర్ చెప్పిన టెస్టులు  చేయంచుకో. ఇప్పటివరకు మీ పుట్టింటి వాళ్ళు నీకిచ్చిన బంగారం కానీ, పొలం మీద ఆదాయం కానీ నువ్వు వాడుకుంది లేదు. కొన్నాళ్ళు నా చెల్లెళ్ళు, తమ్ముళ్ళు... ఇప్పుడు మన పిల్లలు. ఇంక నువ్వు అనుభవించేది ఎప్పుడు..."

నారాయణ వాదనలో నిజం ఉందని ప్రభావతికి తెలుసు.  అయినా ఆ తల్లి మనసు ఊరుకోలేదు.

"నీ... నా .. ఏంటండీ! అన్నీ మన బాధ్యతలే!" అంది నిట్టూరుస్తూ.

"ఇంత చేసినా.. 'వదినా! మాకు నీ నగలు తాకట్టు పెట్టి పెళ్ళి చేశావు' అని నీ ఆడపడచులు అనలేదు. ఇంక పిల్లల కోరికలు సముద్రాల్లో అలలే" నారాయణ గొంతునిండా కోపం.

"పోన్లెండి.. వాళ్ళ సంగతి ఎందుకు.  మీరన్నారా.... నా ఆదాయం కలిపేగా మీరు ఆస్తి పెంచుకున్నారు" అడిగింది ప్రభావతి.

"అదా!  అది వేరు. అయినా పిచ్చిదానా! నువ్వు వేరు. నేను వేరు కాదు" నారాయణ సమర్థించుకున్నాడు.

"అదీ మగవాళ్ళ మాట. అదే నేను మీ ఆదాయం కోరితే. నా స్వంతానికి వాడుకుంటే ఇంత సహృదయత ఉండదు. పోన్లే! వదిలేయండి పిల్లకి మాత్రం డబుల్‌కాట్స్ నేనే కొనిస్తాను" ప్రభావతి నిర్ణయం చెప్పేసింది.

ప్రభావతి అన్నదంటే మాటమీదే నిలబడుతుంది. నారాయణకీ తెల్సు ఆ విషయం. ప్రభావతి ఆ బాధ్యత తనమీద పెట్టనందుకు అతనికి లోపల ఆనందంగానే ఉంది. ఎంతైనా ప్రభావతి లాంటి భార్య దొరకటం తన అదృష్టం. డబ్బు, సేవ, వినయం అన్నీ కలగలిపి దొరికింది.

‘ఏంటి ఆలోచిస్తున్నారు’’ లైటు తీసేస్తూ అడిగిందామె.

‘ఏంలేదు’ చీకట్లో ఆమెకేసి ప్రేమగా చూశాడు.

కానీ ఆ చీకటిలో అతని చూపులోని ప్రేమ తరంగాలు ఆమెదాకా పయనించనే లేదు.

ప్రభావతి పడుకుంది. కాస్సేపటికి హాయిగా నిద్రపోయింది. నారాయణ ఆమెకేసి చూస్తున్నాడు. కాస్తంత చామనచాయ అయినా కళ గల మొహం. మనిషి అందగత్తె కాదుగానీ మనసు వెన్న. తనది అంటూ లేకుండా జాయింట్ ఫ్యామిలీకి త్యాగం చేసింది. ప్రభావతి వెంట తెచ్చుకున్న ఆస్తి వల్లే తనింతగా ఎదిగాడు. తన అక్కచెల్లెళ్ళు కూడా ‘మా వదిన చాలా మంచిది’ అంటుంటారు. బంధువులంతా ఆమెని పొగుడుతారు. కానీ తనే.... ఎందుకో ఒక్కసారి కూడా ‘ఈ పని బాగా చేశావు’ అని గానీ, ‘నువ్వు నాకు ఇష్టం’ అని గానీ ప్రేమ పూర్వకంగా అనలేదు. మొగుడిగా మొగాడిగానే అధికారం చూపిస్తాడు. అనురాగాన్ని కూడా అధికారికంగానే!

ఒకటి రెండుసార్లు చెయ్యి చేసుకున్నాడు కూడా. అతనికి కాస్త ‘ఆడపిచ్చి’ వున్నా ప్రభావతి నోరు మెదపలేదు. తల్లీ తండ్రీ లేని ప్రభావతి తన వల్ల ఏం పొందింది? చాకిరీ తప్ప...

ఏంటివ్వాళ ఇటువంటి ఆలోచనలు వస్తున్నాయి. ఏదో పేపర్లో కవితలో చదివాడు. బతికుండగానే ఇష్టమైన వాళ్ళందరికీ చెప్పేయాలట. .. నిజమేనేమో!

ఆలోచిస్తుండగానే ఎప్పుడో నిద్రపట్టింది.

తెల్లారినా వంటింటి చప్పుళ్ళూ లేవు. మెలకువ వచ్చి చూసేసరికి ప్రభావతి అలాగే నిద్రపోయి ఉంది.

“ప్రభా!” లేపాడు. పలకలేదు.

చేతితో తట్టాడు. చల్లని మృత్యుస్పర్శ.

ఉలిక్కి పడ్డాడు.

అంతే! ఆ తర్వాత రావలసిన వాళ్లు వచ్చారు. జరిగేవి జరుగుతున్నాయి. ప్రభావతి పెట్టిన, ఆమె దాచుకున్న స్వంత డబ్బే అన్నింటికి... ఆమె చివరి ప్రయాణానికి

కూడా సరిపోతున్నది. చావులో కూడా తనని శ్రమ పెట్టలేదు... తను మాత్రం ప్రభావతిని జీవితమంతా శ్రమపెట్టాడు. ఆమె బతికుండగా ఒక్కనాడయినా కృతజ్ఞతలు చెప్పాడా! బయటి వాళ్ళయితే చెప్పేవాడు. భార్య గదా! చెప్పలేకపోయాడు.

ఇప్పుడు నారాయణ ఎంత ఏడ్చినా ప్రభావతికి వినిపించదు. అతని మనసులోని భావాలన్నీ కుప్ప పోసినా ఆమె ఇంక వినలేదు. ఆ అదృష్టాన్ని అతను కోల్పోయాడు.

మర్నాడు పేపర్లో ప్రభావతి ఫోటోకి రెండు వైపులా రెండు దీపాలతో 'అనురాగ స్మృతి' అంటూ ప్రచురించిన సంతాప ప్రకటనలోని హృదయాలను చదవటానికి ఫోటోలోని ప్రభావతి చిరునవ్వుతో ప్రయత్నిస్తోంది. కానీ ఆమెకది సాధ్యం కాదు. ఎందుకంటే ఆమె ఇప్పుడు ఒక స్మృతి మాత్రమే!

**– (పత్రిక, మాసపత్రిక, మే 2002)**

# చింతచెట్టునీడలో వెచ్చని పరిమళాల పాట

-కుప్పిలి పద్మ

**తొ**లివాన కురిసినప్పుడు నేల్లోంచి వుబికి వెచ్చగా వొచ్చే మట్టివాసన కమ్ముకొంటున్నట్టు ఆ పాట మెల్లమెల్లగా చుట్టుకొంటుంది...

యెయిర్‌పోర్ట్‌కి వెళ్లే దారి నుంచి కుడివైపుకి తిరిగి ఓ రెండు కిలోమీటర్లు లోపలికి వెళితే రైలులైను దాటితే హుస్సేన్‌సాగర్ .

ఆ రైలులైనుకి ఆ మెయిన్ రోడ్డుకి నడుమ చిన్న కాలనీ. ఆ కాలనీలో అన్నీ యిండిపెండెంట్ ఇళ్లే. ఆ కాలనీకి దక్షిణం వైపు విశాలమైన ఆకుపచ్చ తోట. ఈ తోట చివర్న పశ్చిమాన పురాతన సౌధం. ఆ సౌధంలో రాత్రంతా ఒంటరి వీనస్‌లా వెలుగుతుండే చిన్ని విద్యుత్ దీపం. ఆ తోటకి కుడివైపునున్న సన్నని కాలిబాటకి ఓ పక్కంతా ఏపుగా పెరిగిన లేతాకుపచ్చ యూక్లిప్టస్ తోట. ఆ తోటకి ఆనుకొని చిన్ని రేకుల ఇల్లు. ఆ రేకుల యింటికి ఎదురుగా పురాస్మృతులెన్నింటినో నిండుగా నింపుకొంటూ ఏపుగా పెరిగిన చింతచెట్టు శాఖోపశాఖలుగా, ఆ చింతచెట్టు నీడ వొత్తుగా పరుచుకొన్న చోట పాత నులకమంచంపై నర్సింతాత పడుకొని వున్నాడు. నిలువెత్తు మనిషి....

ఆ నిలువెత్తు మనిషి చుట్టూ ఎటు చూసినా పిల్లలే పిల్లలు. జేగురు రంగు తిరిగిన తెల్లని తలపాగా చుట్టూ నడిచి నడిచి స్థిరపడిన బొబ్బలు కట్టిన పాదాల చుట్టూ బొజ్జ మీదా మొత్తంగా అతని చుట్టూ ఎటు చూసినా పిల్లలే పిల్లలు. అతను కథ చెపుతూ నిద్రలోకి జారుకున్నాడు. ఆ నిద్ర బరువైన ఊపిరిగా చిన్న గురగ్గా మెల్లమెల్లగా ఫ్యాక్టరీలో సైరన్‌లా ఎక్కువవుతుంటే పిల్లల బుగ్గల నిండా నవ్వులే నవ్వులు. ఇళ్లలో పనివేళయిందని వెళ్ళేవాళ్ళు, ఆ యిళ్ల పనుల్నుంచి తిరిగొచ్చేవాళ్లు, తల్లో పేలు చూపించుకొంటున్నవాళ్ళు, చూస్తున్న వాళ్లు, కబుర్లు చెప్పుకొంటున్నవాళ్లు, గొడవ చేబాకండి తాతయ్యని పడుకోనియండి అని పిల్లలపై అరుస్తూనే ఆ గురక్కి

ముసిముసిగా నవ్వుకుంటున్న స్త్రీలు, చాయ్ తాగే వేళకి గురక కట్టిపెట్టి నర్సింతాత, 'అం మేకల్ని పోరగాడు తోలుకెల్తు.....'' కథ ఆపిన చోట నుంచి మొదలుపెట్టాడు. కథ చెపుతూచెపుతూ నిద్రలోకి వెళ్లి మెలకువ రాగానే ఆపిన చోట నుంచి నర్సింతాత ఎలా మొదలు పెడతాడాని రేలాకి బోల్డంత కుతూహలం. ఆశ్చర్యం. తాతలా తను కథ చెపుతూ నిద్రలోకి వెళ్లి మెలకువ రాగానే కత చెప్పాలని ప్రయత్నించినా అలా చెప్పలేక పోయింది. "తాతంత అయ్యాక అలా కథ చెప్పగలనులే," అనుకొంది.

సాయంకాలపు ఆఖరి సూర్యకాంతి ఛాయ కూడా తెరమరుగయ్యే వేళ ఇళ్లకి చేరుకొనే పెద్దాళ్లు. ఇంటి వెనగ్గా యూక్లిప్టస్ చెట్లకి పక్కగా వున్న వేపచెట్టు కింద వేడినీళ్లతో చల్లనీళ్లతో స్నానాలు చేయటం. కణకణలాడే బొగ్గుల పొయ్యి మీద పెళపెళలాడే జొన్నరొట్టెలు చేస్తుంటే ఆ పొయి చుట్టూ చిన్నాళ్లు పెద్దాళ్లు చేరి సందడి సందడిగా కమ్మని పప్పు జొన్నరొట్టెలు తింటూండేవారు. దోమలు తగ్గడానికి నెగడు వేసేవాళ్లు. దాని చుట్టూ చేరి కబుర్లు చెప్పుకొంటూ పాటలు పాడుతూ దప్పు దరువు వేసేవాళ్లు. పాట వెనక పాట... ఈ కోలాహలాన్నంతా ఆ పాత నులకమంచంపై పక్కకి తిరిగి మోచేతిపై తలాన్చి మురిపెంగా చూసుకొనేవాడు నర్సింతాత.

పెళ్ళయిన కొత్తలో ఇక్కడికొచ్చాడు పాలమూరు నుంచి. అప్పటికిదంతా అడివి లెక్కనుండేది. కాలనీలో ఇళ్లు రావటం వాళ్లకి పనిచేయటం. అప్పట్నుంచి ఇక్కడే. పిల్లలు వాళ్ళ పెళ్ళిళ్లు వాళ్ల పిల్లలు... యిప్పటికి కాలనీ నిండా యిళ్లు. స్కూల్స్, పెద్దపెద్దాళ్లుంటే కాలనీగా. ఆ రైలుకట్ట కింద దుకాణాలు. హుస్సేన్‌సాగర్ స్టేషన్ దాటితే చూస్తుండగానే సాగర్ చుట్టూ రోడ్డు... నెక్లెస్‌రోడ్డు... నెక్లెస్ రోడ్డు మిలమిలాడుతూ విద్యుద్దీపాలు అలా ఖైరతాబాద్ వైపు వెళితే పెద్ద పెద్ద ఫ్లైఓవర్లు. ఈ కాలనీలో ఇళ్ల స్థలాలు చూపించటం. కొడుకులు కన్‌స్ట్రక్షన్ కంపెనీలలో పని. కోడళ్ళు కూతుర్లు యిళ్లలో పని. ఎప్పుడో వేసుకున్న చిన్ని ఇల్లు సర్కారోళ్లది. నర్సింతాతని నమ్ముకొని ఏదో ఒక పని దొరుకుతుందని ఆ వూరి నుంచి సిటీకొచ్చేవాళ్లు ఈ పదేళ్లలో మరీ ఎక్కువయ్యారు. అందరికీ ఏదో ఒక పని చూపించే నర్సింతాతంటే దేముడే మరి.

యెలక్షన్ యేజంట్ నర్సింతాత దగ్గరున్న వోట్లు లెక్క పెట్టాడు. ఆ వోట్లని తను చెప్పిన నాయకుని పార్టీకి వేస్తే యింటి పట్టా యిప్పిస్తానన్నాడు. ఒకసారి ఓట్ల

లిస్ట్‌లో వస్తే తనని అక్కడ నుంచి యే సర్కారోళ్లు తరిమేయలేరని నర్సింతాతకి గట్టిగా నమ్మకం  కుదిరింది. స్థలాల రేట్లు బాగా పెరిగాయి. ఏదోఒక పార్టీ ఏజెంటుని నమ్ముకోకపోతే ఏదో ఒకరోజు తనున్న యింటికి ముప్పు రావొచ్చనిపించింది నర్సింతాతకి.

ఆ రోజు ఎప్పట్లానే నర్సింతాత యింత తిని పిల్లలందరిని చుట్టూ వేసుకొని పాటలు నేర్పిస్తూ మధ్య మధ్య కథలు చెపుతున్నాడు. రేలా గొంతెత్తి పాడుతుంటే ఆ లేతస్వరం ఆ చింతచెట్టు శాఖల్లోంచి కోయిలమ్మలు మౌనంగా ఆ పాటని మేస్తున్నాయ్.

అప్పుడొచ్చారు వాళ్లు.

వాళ్లని చూసి రేలా పాట ఆగింది.

వేసవి తొలి ఎండకి అలసి ఆ చెట్టు నీడన విశ్రమించిన మేకలు బెదిరి మేమే మన్నాయి. పిల్లలంతా కథలు, పాటలు మరిచి ఆత్రంగా వాళ్లనే చూస్తున్నారు. సిల్కు లాల్చీ, యెడమ చేతికి తళతళలాగే బంగారు గొలుసు. ఆ చేతివేళ్లకి రెండేసి వుంగరాలు. కళ్లకి నల్లని జోడు. ఘుమఘుమలాడుతూ రెపరెపలాడుతూ వాళ్లు వచ్చారు.

వస్తూ వస్తూ పెద్దాయన, “ఈ యిల్లు ఎవరిది?” అని అడిగాడు

“నాదే  బాబయ్య.”

“మంచిది మంచిది. ఈ స్థలంలో అపార్ట్‌మెంట్ కడుతున్నాం. రేపట్నుంచి పని మొదలుపెడతాం. మా సూపర్‌వైజర్ ఇక్కడే వుంటాడు. కాస్త చూసుకో, కొత్త కదా,” అన్నారు వాళ్లు. నర్సింతాత నమ్రతగా తలాడించాడు.

“కానీయండి. మేం బయలుదేరుతాం,” అన్నారు వాళ్ళు.

గొడ్డలితో చింతచెట్టు వైపు పనివాళ్లతో సూపర్‌వైజర్ వచ్చాడు.

“ఇదేంటయ్యా,” నర్సింతాత అడిగాడు.

“చింతచెట్టు అడ్డయ్యా, పునాదికి దెబ్బ.”

“మీ స్థలం అక్కడుంది. చెట్టు యిక్కడుంది.” తాత గిలగిలలాడుతున్నాడు

“వేళ్ళు పాకుంటాయి. పునాదికి దెబ్బ. ఈ వూడలు చూడు. అసలీ చెట్టుంటే

వెంటిలేషన్ సమస్య. ఆ వేపచెట్టు, ఈ చింతచెట్టు కొట్టాల్సిందే. రేపట్నుంచి స్థలంలో పని." అన్నారు వాళ్లు.

నర్సింతాత ప్రాణం విలవిలలాడింది.

చెట్టుని నరుక్కోవటం ఏంటి? వేళ్లు పునాదికి నష్టం చేయడం ఏంటి? వేళ్ళు నరుక్కోవడం ఏంటి. తరతరాలుగా వస్తున్న చెట్టు. నర్సింతాత చూస్తుండగానే ఆ నడిరాత్రికి సగం చెట్టుని నరికేశారు.

పాటలు లేవు, నెగడు లేదు. ఆ ప్రాంతమంతా పెట్రోమాక్స్ లైట్ల వెలుగు. పిల్లలంతా దిగులుదిగులుగా ఓ మూల గుంపుగా కూర్చున్నారు. ఆ రాత్రి నర్సింతాత రొట్టెలు తినలేదు. తన తల్లి, భార్య పోయిన రోజు దుఃఖపడిన దానికి రెట్టింపు దుఃఖం అతనిని కమ్ముకొంది.

తెల్లారేసరికి నర్సింతాత ఇల్లొక్కటే బోడిగా కనిపించింది. కొన్ని సంవత్సరాలుగా అలవాటుపడిన చింతచెట్టు నీడ జీవనం కాస్తా మండుటెండలో పడేసరికి నర్సింతాత కొండంత అండని కోల్పోయినట్టు దిగులయ్యాడు. చూస్తుండగానే నేల చదును చేసి పునాదులు వేశారు. స్లాబ్ పోశారు. ఆ ఇసుక సిమెంట్ ధూళికి నర్సింతాత పెద్దోళ్ళు పిల్లలు అలవాటు పడిపోయారు. నర్సింతాత దిగులుగా చింతచెట్టు మొదట్లో రాత్రివేళ పడుకునేవాడు.

"అపార్ట్‌మెంటాళ్లకి మంచినీటి కనెక్షన్ వేస్తున్నారంట. మనకి ఇక్కడ వీధిపంపు వేస్తారేమో కనుక్కోరాదా" నర్సింతాతని ఓ రోజు కోడలు అడిగింది.

నీళ్ళుంటే కాస్త తెరిపిగా వుంటుందని నర్సింతాత రాజకీయ ఎలక్షన్ ఏజెంట్ దగ్గరకి వెళ్లాడు. ఏజెంట్, 'ఆ అదేమంత భాగ్యం' అంటూ ఆ పని చేయిస్తానన్నాడు. ఎలక్షన్స్ ఆట్టే దూరం లేవనే ముందు చూపు వుందా ఏజెంట్‌కి.

అక్కడ పబ్లిక్ కుళాయి వచ్చింది. ఆ నియోజకవర్గం ఎమ్మెల్యే ఆ పంపుని ఓపెన్ చేసినట్టు ఓ సిమ్మెంటు పలకపై రాయించి ఆ కుళాయికి అతికించాడు ఏజెంట్.

'ఎమ్మెల్యే రాకుండానే వచ్చినట్టు రాయించారే,' అనుకొంది రేల. చూస్తుండగానే అపార్ట్‌మెంట్ నిట్టనిలువుగా నిలబడింది. వొక్కొక్కరే గృహప్రవేశం చేస్తున్నారు.

గృహప్రవేశం జరిగే ప్రతిసారీ కిక్కిరిసిన కార్లు బారులు బారలుగా. ఆ రోజు ఓ వంక గృహప్రవేశం జరుగుతోంది. రాజకీయ ఏజెంట్ వచ్చాడు.

"రోజులన్నీ ఒక్కలాగే వుండవ్ పెద్దాయనా. ఈ చివర్నుంచి ఆ చివరికి అలా వదిలేస్తే మరొకరొచ్చి ఇల్లేసుకుంటారు. నువ్వుండగా యిలా సఖ్యంగా వున్న నీ పిల్లలంతా రేపా జాగా కోసం తగువులాడుకుంటారు. నువ్వుండగానే ఎవరి ఇల్లు వాళ్లకి వేయించుకొంటే స్థలానికి స్థలం, అంతా పక్కపక్కనే వుండొచ్చు. ఏమంటావ్?"

"సర్కారు... అయినా పోరగాళ్లు వేసుకుంటారో లేదో."

"సర్కారు సంగతి నేనున్నాను కదా. ఏదో కాస్త యిస్తే." అన్నాడు ఏజెంట్. రెండు రాత్రులు అంతా కూర్చుని ఎవరి గది వాళ్లు ఒకదానికొకటి అనుకొని కట్టుకోవాలని నిశ్చయించుకున్నారు. ఏజెంట్‌కి అప్పు చేసి అంతా డబ్బులు అప్పజెప్పారు. రెండ్రోజుల్లో ఇరవై కాపురాలుగా నర్సింతాత పరివారమంతా ఎవరి గదుల్లోకి వాళ్ళు వెళ్లిపోయారు.

"మీరిలా ఆక్రమించుకొంటే ఎలా... ఇది గవర్నమెంట్ ల్యాండ్," అంటూ అపార్ట్‌మెంట్‌లోని ఒకాయన తగాదాకి వొచ్చాడు.

"ఏదో పేదోళ్లం. వదిలేయండి," అంటూ నర్సింతాత బతిమాలుకున్నాడు.

ఆ రోజు వుదయం నర్సింతాత వుదయపు చల్లదనాన్ని నలుక మంచం మీద పడుకొని కప్పుకొంటున్నాడు.

"మీకు సిగ్గులేదా... మరోసారి ఇక్కడ ఇలా బయట స్నానాలు చేసారంటే పోలీసోళ్లకి చెపుతా. ఆక్రమించుకొన్న స్థలం నిమిషాల మీద లేపించేస్తాం" అరుస్తున్నాడు ఫ్లాట్ నెంబర్ 101.

"యేమయిందయ్య?" నర్సింతాత కంగారుగా అడిగాడు.

"మీవాళ్లంతా ఇలా ఆరుబయట స్నానాలు చేస్తే ఎలా. మా ఆడవాళ్లు అటూ ఇటూ తిరుగుతుంటారు. ఇబ్బందవుతుంది," అన్నాడాయన.

వుండడానికే చిన్న చిన్న గదులు. స్నానాలు గదికి స్థలం ఎక్కడుంది. అనుకుంటూనే , "లేదులే బాబయ్యా, మేం బయట స్నానాలు చేయం," అని నర్సింతాత అతనిని బతిమాలుతున్నాడు."

"యేంటయ్యా ప్రతిదానికి మన మీద కొస్తాడు ఏంటి వాళ్లకి భయపడేది మనకి పట్టాలు త్వరగా యిమ్మను. అప్పుడు చూపిస్తా నా తడాఖా," అన్నాడు నర్సింతాత మనవడు.

"ఆ పెద్దాళ్లతో మనకేంటిరా!" అంటూ నర్సింతాత స్నానాలు చేయడానికి పాత తడికెలతో చిన్ని అడ్డు కట్టాడు. యిందులో ఇరుక్కొని స్నానం చెయ్యాలని మగాళ్లంతా విసుక్కుంటూనే వున్నారు. ఇంటి ముందున్న నీడ తగ్గుతుంటే నర్సింతాత యూక్లిప్టస్ చెట్ల చిల్లుల నీడలో మంచం వేసుకొని పడుకొని వున్నాడు. పిల్లలంతా చేరి కథలు వింటున్నారు. నర్సింతాత నిద్రలోకి జారుకున్నాడు. పిల్లలు వొకొక్కరే మంచం దిగి ఆ చెట్ల మధ్యన దొంగాట ఆడటం మొదలెట్టారు. కేరింతలు కేరింతలుగా సాగుతోంది ఆట.

"ఏమీ... బుద్ధిలేదు. ఏంటా గోల. అటుపొండి," 409 ఫ్లాట్‌లోని ఆవిడ అరుస్తోంది.

"టి.వి. చూస్తుంటే మీ అరుపులే. పడుకోనివ్వరూ, అరుపులే అరుపులు.

నర్సింతాత వులిక్కిపడి లేచాడు.

లేచిన కాసేపటికి పిల్లలు ఆడుకొంటుంటే వాళ్లకి డిస్టబెన్స్‌గా వుందని అర్థమయింది. నర్సింతాతకి. "సర్లేమ్మా... పిల్లలు గొడవ చేయకుండా చూస్తా," ఎప్పట్లానే బతిమాలుతున్నాడు.

"వాళ్లు టీవీలు, టేప్ రికార్డర్లు పెట్టటం లేదా, చెవులు చిల్లులు పడేట్టు. సాయం కాలాలు వాళ్ల పిల్లలు ఆడటం లేదా. ఎప్పుడు చూసినా మన మీద ఏడుపే," నర్సింతాత కోడలు కోపంగా అంది.

"వాళ్లతో మనకెందుకమ్మా. వూరుకో...." అంటూ పిల్లలందరినీ దగ్గర కూర్చోపెట్టుకొని కథ చెప్పటం మొదలు పెట్టాడు నర్సింతాత. ఆ రోజు నుంచి పిల్లలు మధ్యాహ్నం వేళ ఆడుకోవటం బంద్ అయిపోయింది.

ఓ రోజు వుదయమే ఏజెంట్ పట్టా పత్రాలంటూ నర్సింతాతని తీసుకెళ్లాడు. పట్టా పుచ్చుకొని నర్సింతాత ఇంటికి వచ్చాడు. యింటి ముందు ఆడవాళ్లంతా గొడవగొడవగా మాట్లాడుకుంటున్నారు.

"ఏమయింది?" అని అడిగాడు నర్సింతాత.

"అటు చూడు", అంది మనవరాలు.

ఈ యింటికి, అపార్ట్‌మెంట్ ముందున్న రోడ్డుకి మధ్య ఫెన్సింగ్ కడుతున్నారు.

"ఎందుకు" అని అడిగాడు తాత.

"మనమంతా అటు నుంచి తిరుగుతుంటే గోలగా వుందంట," అంది చిన్న మనమరాలు.

ఇళ్లలో పనికి వెళ్లాలన్నా బోరింగు నుంచి నీళ్లు తెచ్చుకోవాలన్నా, పిల్లలు బడికి వెళ్లాలన్నా, దుకాణం నుంచి సరుకులు తెచ్చుకోవాలన్నా అదొక్కటే దారి. ఎడమవైపంతా తోట.

"ఎలా తిరగాలి" అడిగింది కోడలు.

'ఈ తీగెల ఫెన్సింగ్‌ని ఇటు నుంచి దాటి యీ తుమ్మచెట్లలోంచి ముందుకెళ్లి రోడ్డెక్కాలి," అంది మరో మనవరాలు.

"ముళ్లచెట్లు చీకట్లో పురుగు పుట్రా వుంటుంది. అయినా చిటికెలో నడక వెళ్లొచ్చే దానికి యెంత చుట్టూ తిరగాలి. చిన్నపిల్లలు బడికి ఎలా పోతారు" అంది పెద్ద కోడలు.

"పట్టా వచ్చిందిగా మనకేంటి భయం. అడుగుదాం," అంది పెద్ద కూతురు.

"వద్దులేమ్మా, పెద్దాళ్లతో తగాదా ఎందుకు. ఆ దారినే కాస్త బాగు చేసుకుందాం" అన్నాడు.

'ఎంత కాదనుకున్నా మనది ఆక్రమించిన స్థలం అంటారు. పై వాళ్లతో ఎందుకొచ్చిన తగదా," అన్నాడు పెద్దల్లుడు.

ఆ రోజు నుంచి నర్సింతాత పరివారమంతా ఆ ముళ్లచెట్ల నడుమ నుంచి చిన్ని కాలిబాటని తయారుచేసుకున్నారు. రోజూ ఎవరో ఒకరికి ఫెన్సింగ్ తీగ ముళ్లు గుచ్చుకోవటం, రాసుకోవటం, యిరుకు స్నానాలకి ముళ్లదారికి ఆటలు లేని మధ్యాహ్నానికి అంతా అలవాటు పడిపోయారు.

"టి.వి. కొందాం... కొందాం... " పిల్లలు ఆడవాళ్లు అంతా తాత చుట్టూ చేరారు.

"టి.వి. కొనటం సరే... మనకి కరెంటు లేదు కదా" అన్నాడు తాత. కరెంట్ యిప్పించమని యేజెంట్‌ని అడగమన్నారు.

"ఏం పట్టానో, ఏం కరెంటో. కష్టమంతా ఆ ఏజెంట్‌కి పెట్టాల్సొస్తోంది."

పెద్దకొడుకు విసుక్కున్నాడు.

నర్సింతాత ఆ ఏజెంట్ చుట్టూ తిరిగి కాస్త డబ్బులిచ్చి యింటికి కరెంట్ కావాలన్నాడు.

ఈ సాయంకాలం అంతా చేరి నెగడు వేసుకొని రొట్టెలు తింటూ పాటలు పాడుతున్నారు. పాట వెనక పాట, పాటలే పాటలు. డప్పుపై దరువేస్తూ....

"యేమ్మా... యేంటా గోల, వెధవ నూసెన్స్...." నాలుగైదు ఫ్లాట్స్ వాళ్ళు కలిసి కట్టుగా కిందకొచ్చి అరవటం మొదలుపెట్టారు.

"మీరిలా పాటలు పాడుతోంటే నిద్రపోలేం. వేరే పనీ చేయలేం," అరుపులే అరుపులు.

బయటి నుంచి అప్పుడే అపార్ట్‌మెంట్‌లోకి వస్తున్న రెండొందల ఒకటో నెంబర్ అమ్మాయి, "పాటలు బాగ పాడతారు. పాడొద్దంటే ఎలా," అంది.

"మీరేంటి వాళ్లకి సపోర్ట్. మీరొక్కరే. మీకేం తెలుసు వీళ్ల వలన పిల్లలు చదువు కోలేకపోతున్నారు," గయ్యిమన్నాడు వో ఫ్లాట్ వోనర్.

"పాట వద్దంటే ఎలా... వాళ్ల ఇళ్లలో వాళ్ళు పాడుకుంటుంటే వద్దనటం ఏంటి", అందామె.

"మీకు వీళ్ల సంగతి తెలీదు. అయినా మీకెందుకండీ వాళ్ల గొడవ. మనమంతా ఒకే అపార్ట్‌మెంట్‌వాళ్లం. ఒకే మాటమీదుండాలి. మీరు వెళ్లండి. మనం తర్వాత మాట్లాడుకుందాం." అంటూ ఆమెని అక్కడ నుంచి పంపించడానికి ప్రయత్నించారు. ఆమె కదల్లేదు.

"మేం పాడం లేండయ్యా," తాత బతిమాలేస్తున్నాడు.

పచ్చని నిండైన చింతచెట్టు శాఖోపశాఖలుగా వత్తైన నీడనిచ్చే చింతచెట్టు మొదలకంటా నరికేశారు. కాలనీలో అందరి అవసరాలని తల్లిలా ఆదుకొనే వేపచెట్టుని

నరికేశారు. ఆటలన్నీ లాక్కున్నారు. దారి కట్టేశారు. సందడినంతా లాగేసుకున్నారు. ఎవరు వీళ్లు. వీళ్ళంటే తాతకి ఎందుకింత భయం. తామంతా తాత మాట వింటారు. తాతేంటి వీళ్లని కాళ్లావేళ్లా బతిమాలు కుంటాడు. ఎందుకిలా ఆలోచనలు రేలాలో.

"పోలీసోళ్లకి ఫోన్ చేయండి. గవర్నమెంట్ ల్యాండ్. ఆక్రమించేశారు. పక్కవాళ్లకి న్యూసెన్స్." అరుస్తున్నాడు వొకతను.

"పట్టా వుంది సార్"

"పట్టా, దొంగ పట్టా. అవేం చెల్లవ్," అన్నారిం కొకరు

"ఎందుకయ్యా యింత గొడవ. మేం పాడం. డప్పు వేయం. మీకెలాంటి గొడవ వినిపించదు," బతిమాలుతూ, "పదండి యింట్లోకి," అన్నాడు తాత.

అపార్ట్‌మెంట్‌లోకి వాళ్ళు, చిన్న చిన్న గదుల యిళ్లలోకి వీళ్ళు వెళుతుండగా మండుటెండల్లో తొలివాన కురిసినప్పుడు నేలలోంచి ఉబికి వెచ్చగా వచ్చే మట్టి వాసన కమ్ముకొంటున్నట్టు, రేల పాడుతోన్న పాట మెల్లమెల్లగా చుట్టుకొంటోంది.

ఆ పాటని ఎలా వదిలించుకోవాలో తెలియక వాళ్లు అయోమయంగా దారులు వెతుకుతున్నారు. ఆశ్చర్యంగా ఆనందంగా ఆత్మీయంగా ఆ పాటతో స్వరం కలిపింది రెండొందల ఒకటో నెంబర్ ఫ్లాట్‌లోని యువతి. రేల పాట మరింత వెచ్చగా గాఢంగా స్పష్టంగా ప్రవాహంలా... తొలివాన కురిసినప్పుడు నేలలోంచి వుబికి వెచ్చగా వొచ్చే మట్టివాసనలా కమ్ముకొంటోంది.

# వెండి కిరీటం

- ఆచార్య ఎస్. శరత్‌జ్యోత్స్నారాణి

**ర**వి మాటలకు మొదటిసారిగా షాక్‌కు గురైంది శ్రీమతి గంగ. ప్రముఖ రచయిత్రిగా పాఠకుల మన్ననలను, ఎన్నో అవార్డులను, సత్కారాలను అందుకున్న గంగకు రవి మాటలు చెవుల్లో మారుమోగుతున్నాయి.

రవి మాటలకు ఆమె మనస్సు మొద్దుబారిపోయింది. ప్రాణంగాపెంచిన రవి అలా మాట్లాడాడంటే ఆమెకు నమ్మబుద్ధి కాలేదు. భర్త ఉన్నంత కాలం ఆయన ప్రేమలోకంలో కరిగిపోయింది. తన ఇద్దరు బిడ్డలను ఎంతో ప్రేమగా పెంచి విద్యాబుద్ధులు చెప్పించింది. భర్త పోయిన తర్వాత కూడా పిల్లలకు తండ్రిలేని లోటు తెలియకుండా, తల్లీతండ్రి తానై బిడ్డల భవిత కోసం ఆరాటపడింది. కాని తన ఇంట్లో నేడు తనకో చిక్కుప్రశ్న ఎదురవుతుందని ఊహించలేదు గంగ. తన రక్తం తనని ప్రశ్నిస్తుందని కలలో కూడా అనుకోలేదు.

మనస్సును ఎంత సమాధానపరుచుకుందామనుకున్నా గంగకు రవి మాటలు గునపాల్లా గుండెల్లో గుచ్చుతూనే ఉన్నాయి. ఆ రాత్రంతా గంగకు నిద్ర దూరమయింది. తెల్లవారిన తరువాత నునులేత కిరణాలు కిటికీలో నుండి స్వాగతం పల్కుతూ తాకినా, ఏ అనుభూతి లేని రాతిబొమ్మలా మంచం మీద కూర్చుందే తప్ప ప్రతిరోజులా కాసేపు వీణ వాయించి, అలా వరండాలో తన రాక కోసం ఎదురుచూసే మొక్కలను పలకరించి, గాలికి ఊగిసలాడే కొమ్మల కబుర్లు వింటూ ఆ భవనం వెనుకనున్న గార్డెన్‌లో కూర్చోలేకపోయింది గంగ.

గంగ అభిరుచికి తగ్గట్టుగా భర్త రఘురాం ఎంతో ప్రేమతో దగ్గర ఉండి బిల్డింగ్ పూర్తి చేసి దానికి గంగ పేరు పెట్టి, గంగకు ఇష్టమైన ఎన్నోరకాల పూలమొక్కలను కడియం నుంచి తెప్పించి వేశాడు. ఆలోచనల అలల మధ్య కూర్చున్న గంగ పనిపిల్ల పిలుపుతో ఈ లోకంలో అడుగుపెట్టింది,.

పని పిల్ల లింగమ్మ, తన రూమ్‌లోకి వచ్చి అమ్మగారూ అని పిలిచిన పిలుపుకు "ఆ... ఏమిటి లింగమ్మ చెప్పు ఇలా వచ్చావేం?" అని అడిగింది గంగ. అమ్మగారి మొగం వైపు పదే పదే చూస్తూ నిల్చుంది లింగమ్మ.

'అది కాదమ్మా! టైమ్ పది దాటిపోయింది. మీరింకా టిఫిన్ చేయలేదు. మీ ఆరోగ్యం పాడైపోతుంది. మీరు టిఫిన్ చేయడానికి కిందికి వస్తారేమోనని ఇంతవరకు ఎదురు చూసానమ్మా.మీరు ఎంతకీ రాకపోయేసరికి నేనే మీ రూంకి వచ్చానమ్మా" అంది లింగమ్మ.

"అమ్మా! మీరు నిన్న రాత్రి కూడా అన్నం తిన్నట్లు లేదు. గిన్నెలోని అన్నం అంతా అలానే ఉంది. రండమ్మా కిందకి, లేకపోతే నన్నే టీ, టిఫెన్ పట్టుకు రమ్మంటారా?" అంది లింగమ్మ వినయంగా, లింగమ్మ మాటలకు నవ్వుతూ 'ఏమీ లేదు లింగమ్మ. రాత్రి ఆకలి అనిపించలేదు. ఎందుకంటే నిన్న మధ్యాహ్నం లేటుగా భోజనం చేసి పడుకున్నాను" అంది గంగ. అమ్మా! అయితే కిందకు వెళ్ళి కాఫీ తెస్తానని వెనుదిరిగి వెళ్ళబోతున్న లింగమ్మను "లింగమ్మా ఇంతకీ బాబు టిఫెన్ తిన్నాడా?" అని అడిగింది. ఆ మాటలకు "ఔనమ్మ గారు అబ్బాయిగారు కోడలుగారు టిఫెన్ తిని ఆఫీసుకు వెళ్ళి చాలా సేపైంది. అయితే అబ్బాయిగారు మీతో చెప్పి వెళ్ళలేదా అమ్మగారు" అన్న లింగమ్మ ప్రశ్నకు అవాక్కయింది గంగ. అంతలోనే తేరుకుని, "ఏమీ లేదు లింగమ్మా! అబ్బాయి ఆఫీసుకు వెళ్ళొస్తానన్నాడు. నేనే ఏదో ఆలోచనలో పడిపోయి, మర్చిపోయి మళ్ళీ నిన్ను అడిగాను. సరేలే కిందకి పోయి వంటపని చూసుకో. నేను కిందకు వస్తాను" అంది గంగ. వికలమైన మనస్సుతో గంగ బాత్‌రూమ్‌లోకి వెళ్ళి స్నానం చేసి పూజగదిలోకి వెళ్ళి దేవుణ్ని మనసారా ధ్యానించి వరండాలో ఉన్న ఈజీ చైర్‌లో కూర్చుంది. లింగమ్మ తనతో అన్నమాటలు మరోసారి గుండెను చీల్చినట్లయింది.

రోజూ అమ్మతో కలిసి బ్రేక్‌ఫాస్ట్ చేసే రవి ఈ రోజు అమ్మని పిలవకుండా అమ్మకు చెప్పకుండానే భార్యతో కలిసి ఆఫీసుకు వెళ్ళిపోయాడు. కనిపెంచిన తల్లిని అకారణంగా శత్రువులా చూడడం వల్ల ఆ తల్లి భరించలేకుండా పోయింది. తాను చేసిన తప్పు ఏమిటి? అని పదే పదే ప్రశ్నించుకుంది. చివరకు ఓ విషయం గుర్తుకొచ్చింది. అది తప్పుగా అనిపించలేదు. ఏదో లీలగా నెలక్రితం జరిగిన ఓ

సంఘటన గుర్తుకు వచ్చింది. కొడుకు రవి కంటే రెండేళ్ళు ముందుపుట్టిన కూతురు ప్రగతి. పెళ్ళయి బొంబాయిలో అత్తవారింట ఉంటుంది. ఎన్నో నవలలు రాసిన గంగకు స్వర్ణకంకణాలతో పాటు విదేశాలలో ఉన్న తెలుగు అసోసియేషన్స్, తానా, ఆటా వారిచే బంగారు పతకాలు, ప్రభుత్వం చేసిన గొప్ప సత్కారాలు, సన్మానాలు ఆమెకు ఎంతో ఆనందాన్ని కల్గించాయి.

ఇటీవల ఆమె రాసిన 'కాగితపు బతుకులు' అనే నవల పేపర్లో డైలీ సీరియల్‌గా రావటం, దానిని ఉత్తమ నవలగా ఎంపికచేసి, ఓ ప్రముఖ సంస్థ ఆమెకు సన్మానం చేసి వెండి కిరీటాన్ని ప్రదానం చేసి, ఆమె పట్ల ఉన్న గౌరవాన్ని ప్రకటించింది.

నెలక్రితం హాలిడేస్‌కి వచ్చిన కూతురు ప్రగతి, మనుమరాలు శ్వేతకి రాజమండ్రిలో జరిగిన సన్మానపు తాలూకు వెండి కిరీటాన్ని గ్లాస్ బీరువాలోంచి తీసి చూపించి "ఎలా ఉంది ప్రగతి?" అంది గంగ. "చాలాబాగుంది అమ్మ. ఈ కిరీటాల కంటే, ఈ లోకంలో లభించే అందమైన వస్తువుల కంటే, నీ కడుపున పుట్టడం నాకెంతో ఆనందంగా ఉందమ్మా" అంది ప్రగతి. "అమ్మా ఇవే మాటలు మీ అల్లుడు నాతో ఎప్పుడూ అంటూ ఉంటారు."

కూతురుతోనూ మనుమరాలుతోనూ పదిరోజులను పదినిమిషాల్లో హాయిగా సంతోషంగా గడిపింది గంగ.

కూతురు బొంబాయికి ప్రయాణం కడుతుంటే బీరువాలో ఉంచిన వెండి కిరీటాన్ని తెచ్చి కూతురు చేతుల్లో పెట్టింది ప్రేమగా గంగ. కూతురు వద్దు అంటూ ఆ వెండి కిరీటాన్ని అమ్మ చేతుల్లో పెడుతుంటే "అమ్మాయి నీకు నేను ఏమిచ్చినా తీసుకోవు. నీకు నాన్నపోలిక. నన్ను బొంబాయికి రమ్మని ప్రతి ఏటా అడుగుతావు. నీ దగ్గరకు రావాలని ఉన్నా ఈ ఇంట్లో మీ నాన్న నా తోడుగా ఉన్నట్లుగానే ఉంటుంది. అందువల్లనే రాలేకపోతున్నాను. నీకు తెలియని మరో కారణం, నీ తమ్ముడు రవిని విడిచి ఉండలేను అంది గంగ. ఆ మాటలకు నవ్వుతూ ప్రగతి "మరి నేను వెళ్ళొస్తానమ్మా..." అని బయలుదేరింది.

ప్రగతి వెళ్ళిన నెలరోజులకు రవి భార్య పల్లవి గ్లాసు బీరువా తీసి చూస్తే వెండి కిరీటం కనిపించలేదు. గాబరా పడ్తూ "అత్తయ్యా మీరొకసారి ఇటురండి.

బీరువాలోని వెండి కిరీటం కనిపించడం లేదు" అంది. అందుకు గంగ "ఏమిటమ్మా, ఆ వెండి కిరీటాన్ని నేనే శ్వేతకిచ్చాను. ఈ విషయం నీకు చెప్పాలని అనుకుంటూ మర్చిపోయాను" అంది గంగ. అందుకు "అదేంటి అత్తయ్యా? ఇచ్చేటపుడు మీరు ఒక్కమాటైనా నాకు చెప్పలేదు" అంది నిష్ఠూరంగా.

"అదేంటి పల్లవీ! అడిగినవన్నీ ఇస్తున్నానా ఏమిటి? అది చిన్న పిల్ల. ముచ్చటపడి అడిగింది. ఇచ్చాను. అప్పటికీ, మీ వదిన వద్దులే అమ్మా అని అన్నా నేనే ఇచ్చాను" సంజాయిషి ఇస్తున్నట్లుగా గంగ.

అత్తగారి మాటలకు ఎదురు చెప్పకుండా అక్కడి నుంచి వచ్చేసింది పల్లవి.

రవి డ్యూటీ నుంచి రాగానే పల్లవి వెండి కిరీటం విషయం ఎపుడు చెప్పిందో, ఏమో ఆ రోజు సాయంకాలం గార్డెన్‌లో కూర్చున్న తల్లితో రవి సీరియస్‌గా వెండి కిరీటం ప్రసక్తి ఎత్తి, "అమ్మా బొత్తిగా నీకు ఏమీతెలియదు. అన్నీ అక్కకే ఇచ్చేస్తే ఏం బాగుంటుంది. అయినా నీ తిండి, తిప్పలు దగ్గర నుంచి అన్నీ మేమే. ఐ మీన్ పల్లవి చూసుకొంటుంది కదా! కనీసం మాకు చెప్పకుండా అక్కకు అలా ఇవ్వడం ఏమీ బాగోదు. ఇచ్చేటప్పుడు పల్లవితో ఒక్కమాట అంటే ఏమిపోతుంది? నీవు అలా చేయడం మంచి పద్ధతి అవునోకాదో నీవే ఆలోచించుకో" అని గబగబా అనేసి వెళ్ళిపోయాడు రవి.

రవి మాటలకు మొదలు తెగిన మానులా కుంగిపోయింది. ఒకే కడుపున పుట్టిన బిడ్డలైన ప్రగతి, రవి మధ్య తేడాలను ఏనాడూ గుర్తించలేదు గంగ. రవి మనస్సులో తనపట్ల వున్న ప్రేమ ఎలాంటిదో అర్థం చేసుకోవడానికి ఇపుడు తన వయసు అయిపోయింది.

చిన్నప్పుడు అక్క చెయ్యి పట్టుకొని నడిచిన రవి, అక్క ఒక్కక్షణం కనిపించకపోతే "మమ్మీ అక్క ఏది?" అని పదిసార్లు ఇల్లంతా కలియతిరిగే రవి, అక్కే సర్వస్వం అన్నట్లుగా కలిసిమెలిసి పెరిగిన అనుబంధాన్ని మరిచి ఈనాడు ఇలా మారిపోతాడని ఆమె అనుకోలేదు. నిజానికి గంగ తన తిండితిప్పలకు, మందులకు ఎవ్వరిపైన ఆధారపడి జీవించడం లేదు. పైపెచ్చు కొడుకు కోడలు ఇద్దరూ ఉద్యోగస్తులైనా,

వేలకు వేలు సంపాదిస్తున్నా, ఇంట్లో నెలకు కావలసిన వెచ్చాలన్నీ గంగే షాప్ నుంచి తెప్పిస్తుంది.

వాళ్ళ సంపాదన గురించి, ఖర్చు గురించి ఏనాడూ ప్రశ్నించి ఎరుగదు గంగ. దానికి కారణం తన భర్త రఘురాం పెన్షన్ నెలకు పదివేలు పైనే వస్తుంది. అంత డబ్బు తానేమి చేసుకుంటుంది? తన బిడ్డల సుఖాన్ని ప్రతి క్షణం కాంక్షించే గంగకి లౌక్యం తెలియదు. ఈరోజు తన ప్రాణం అనుకున్న "సుపుత్రుడు" రవి తన కోసం ఒక్క పైసా ఖర్చు చేయకపోగా ఎవరో సాహిత్యాభిమానులు సత్కరించి ఇచ్చిన వెండి కిరీటాన్ని తన మనవరాలుకు ఇచ్చినందుకే "ఆలోచించుకో" అని చెప్పి వెళ్ళితే జీవితాంతం తమ రక్తాన్ని, ధనాన్ని, సర్వస్వాన్ని ధారపోసిన తల్లిదండ్రుల మానసిక పరిస్థితి ఎలా ఉంటుందోనని ఊహించుకోలేకపోయింది గంగ. తల్లిదండ్రుల ప్రేమను మమతలను అర్థం చేసుకొనే బిడ్డలు ఈ లోకంలో ఉంటారనుకున్న గంగ లాంటి తల్లులున్న ఈ దేశంలో మంచితనానికి మరణమే పెద్ద శిక్ష కాబోలు!

**– 'మనదేశం' మాసపత్రిక, అక్టోబర్ – 2004**

# మౌనరాగాలెన్నినాళ్ళో!

**- కె.బి.లక్ష్మి**

"**య**శోదని చూసుకోవడానికి ఎల్లుండి వస్తార్ట. కాస్త ఆ ఏర్పాట్లు చూడు. చూడ్డం లాంఛనమే. మనింట్లో పిల్లని చేసుకోవాలని వాళ్ళకి ఉందిట. పద్మత్త చెప్పిందీ సంబంధం. బాగా వున్నవాళ్ళు, వాళ్ళొచ్చి వెళ్ళాకా నిన్ను తీసుకెళ్ళి ఇల్లూ వాకిలీ చూపిస్తాను. చూద్దువుగాని. మీ అమ్మపోయిన ఆర్నెల్లలోనే ఈ సంబంధం మన పిల్లను వెతుక్కుంటూ రావడం అదృష్టం..." నాన్నగారు నిన్న మొన్న చిన్నన్నయ్యతో చెప్పినట్లుంటాయి ఈ మాటలు.

ఆవేళ ఆరేసిన బట్టలు మడత పెడుతూ ఈ మాటలు యధాలాపంగా విని తను ఎంత మురిసిపోయిందో! కోరి వచ్చిన సంబంధం. వరుడు ఎలా వుంటాడో! తన కిష్టమైన కపిల్‌దేవ్‌లా వుంటాడా? చెల్లాయి కిష్టమైన కమల్‌హాసన్‌లా వుంటాడా? ఏమో! రెండ్రోజులాగితే తెలుస్తుందిలే అని బింకాలు పోయింది.

చూసీ చూడగానే నచ్చిందన్నారు. వారం తిరక్కుండా పెళ్ళి చేసెయ్యాలన్నారు. అత్తగారు అర్జంటుగా అమెరికాలో వున్న కూతురి కానుపుకి వెళ్ళిపోవాలట. ఈ లోపల పెళ్ళి జరిగిపోవాలట. వాళ్ళ మాటలు వింటుంటే తనకే వూపిరాడనట్లుంది. ఇంక నాన్నగారికెలా వుంటుందో అనిపించింది.

పెళ్లికొడుకు గవర్నర్‌గారి బాడీగార్డులా వున్నాడు. రంగు నలుపు, కట్నం వద్దన్నారు. పెట్టిపోతలు మీ ఇష్టం అన్నారు. అత్తగారు వంట గురించి, మామగారు చదువు సంధ్యల గురించి అడిగారు. చిన్నాడపడుచు నల్లతాచులాంటి నా జడని, పర్సనాలిటీని మెచ్చుకుంది. పెళ్లికొడుకు మాట్లాడలేదు. పేరు మురహరి. వాళ్ళ ఊరికి మా వూరికి మధ్యదూరం మూడుగంటల ప్రయాణం.

కట్నం తీసుకున్న ఇద్దరక్కలకూ చేసినట్లే నా పెళ్ళీ చేశారు. బొడ్లో జాకెట్టు దోపుకుని నాన్నగారు కన్యధార పోస్తుంటే అందరం అమ్మ గుర్తొచ్చి కంటతడి పెట్టాం. ఆడపెళ్ళి వారు అప్పగింతల సీమ రాకుండానే ఎందుకేడుస్తున్నారని మగపెళ్ళివారు

ఆశ్చర్యపోయారు. విషయం తెలిసి మా ప్రేమాభిమానాలకు ఆనందపడ్డారు. అది సహజమే కదా! వీళ్లింత ప్రత్యేకంగా ఫీలవుతున్నారేమిటి అనుకున్నాను. ఏమిటో! ఏ భావమూ సరిగ్గా మనసుకి హత్తుకోనంత హడావుడిగా పెళ్ళయి అత్తవారింట అడుగు పెట్టాను.

"మీ అత్తగారు, మామగారూ అమెరికా వెళ్ళిపోతే సినిమా హాలంత ఈ ఇల్లు నువ్వూ మీ ఆయనే ఏలాలి" అంది చిన్నక్క కావేరి సరదాగా.

"ఇల్లు మంచి అభిరుచితో కట్టారు గానీ సరైనఫర్నిచర్ లేదు. పనిమనిషి రాకపోతే చచ్చావే.చచ్చేంత చాకిరీ!" అంది ప్రాక్టికల్‌గా ఆలోచించే పెద్దక్క కాంత.

వ్రతాలు, పూజలు మనుగుడుపులు, అత్తమామల అమెరికా ప్రయాణంతో సహా పదిరోజుల్లో పెళ్ళిసందడి సద్దుమణిగింది. నలుగురిలో వుండి వచ్చినదాన్ని. మరీ మేమిద్దరం, ఆయన బైటికెళ్తే ఒంటరిదాన్ని. పల్లెటూరి సంబంధం, అత్తా మామా, ఆడపడుచులు ఉంటే హాయిగా ఉమ్మడి కుటుంబంలో కలిసిమెలిసి ఉండొచ్చనుకున్న నా కలల బుడగ ఠాప్‌మంది. పెళ్ళికి వచ్చిన వంట బ్రాహ్మలు, పురోహితుల్లా అత్తింటి వారు కూడా ఎవరికి వారే! ఆర్ద్రత, అభిమానం అన్నమాటలకి అర్థాలు తెలీని వాళ్లల్లా వున్నారు. భయం వేసింది. "కలవారి కోడలు కలికి కామాక్షి" ఎలిమెంటరీ వాచకంలోని పాట గుర్తొచ్చి ఏడుపొచ్చింది.

మురహరి దగ్గర తనకిష్టమైన గుణాలు విశ్వరూపంలో వున్నాయి. సిగరెట్ తాగడం హీరో లక్షణం అనుకునేదాన్ని. అపుడపుడు మగవాడు డ్రింక్‌వేస్తే స్టయిల్ అనుకునేదాన్ని. మురహరి పెట్టెల కొద్దీ సిగరెట్లు తగలేస్తాడని, గ్లాసు అక్కర్లేని సీసా దాసుడని తెలిసి నిర్ఘాంతపోయాను. చెడు స్నేహాల వల్ల అపుడపుడు అమ్మాయిల అనుభవం ఉందని విని షాక్ తిన్నాను. అతనికో తోడు నేర్పరచి తాము పక్కకి తప్పుకునే ప్రయత్నమే అత్తమామలు వేగిర పడిన ఈ పెళ్ళి అని తెలిసి బిగుసుకుపోయాను. ఇవన్నీ తెలిసికూడా డబ్బుగల సంబంధం, పెళ్ళయితే అన్నీ అవే సర్దుకుంటాయని నాకేం చెప్పకుండా నాన్నగారి పెళ్ళికి సరేనన్నారని తెలిసి నా ప్రాణాలు పోతే బావుండుననుకున్నాను. అమ్మ వుంటే ఇలా జరిగేదా అని ఆక్రోశించాను.

ఆడపిల్ల పెళ్ళికోసం ఎందుకింత ఆత్మవంచన? నా డిగ్రీ నాకు అన్నం పెట్టదా? కట్నం వద్దన్న ఒక్క ప్లస్‌పాయింట్ తప్ప మిగతావన్నీ నెగటివ్ అయిన ఈ సంబంధం చేయకపోతే ఏం? కనిపెంచిన తండ్రికి కట్టబెట్టబోయేవాడి గురించిన నిజాలు చూచాయిగానైనా చెప్పాలన్న ఇంగితజ్ఞానం వుండొద్దా? డబ్బుతో పొగరెక్కిన సకల గుణాభిరాముడు అల్లుడయితే అమ్మాయిని ఏం చేస్తాడో! ఎలా చూస్తాడోనన్న జంకులేదా? ఎంత అన్యాయం?

తాగినమైకంలో, తాగని అహంకారంతో మురహరి నా తండ్రి మధ్యతరగతి మర్యాదల్ని మళ్లీమళ్ళీ చెప్పి నా మనసుని చితక్కొట్టేవాడు. ఈ ముష్టిబట్టలు మా యింట్లో పనివాళ్ళు కూడా కట్టరన్నాడు. పెళ్ళికి మావాళ్ళు పెట్టిన కట్టుడుచీరలు పాలేర్ల పెళ్ళాలకి ఇప్పించాడు. అవన్నీ నేనెంతో ఇష్టపడి కొనుక్కున్న అందమైన చేనేతచీరలు, కనిపిస్తే కంచిపట్టులో లేదా అమెరికా నుండి దిగుమతయిన దిక్కుమాలిన చీరలో. అంతే! అందుకు విరుద్ధంగా చేస్తే అతనికి వెయ్యిమంది దుశ్శాసనులు పూనుతారు. ద్రౌపదికి శపథాలు చేయడానికైనా ఐదుమంది భర్తలున్నారు. నాకు మొగుడు, విలనూ రెండూ మురహరే.

'అక్కరకు రాని చుట్టము' పద్యంలోలా ఇలాంటి మొగుడిని గ్రక్కున విడువంగవలయు అని ఎవరైనా కొత్త నీతిశతకం రాస్తే బాగుండు. ఇంతదూరం వచ్చాకా ఇలాంటి ఆలోచన వల్ల ప్రయోజనం వుందా? సమాధానం దొరకని ప్రశ్నల గురించి ఆలోచిస్తుండగానే పల్లవి, శ్రీరాం పుట్టారు.

జీవితాలు కథలు కావు నిజమే. అలా అని పరిష్కారాలు సులువుగా వడ్డించిన విస్తళ్లలా దొరకవు. అయినా కాలికి రాని చెప్పుని వదిలేయక తప్పదు. లేకపోతే ఆసాంతం అగచాట్లేకదా! గ్రాడ్యుయేషన్ కూడా లేనివాళ్ళు బతకడంలేదా? పిల్లల్తో సహా బతకడానికి కావల్సినంత జీతం రాదనుకుంటే స్వయం ఉపాధులెన్నో వున్నాయిగా! చేతనైన చిన్న పథకం ఏదో మొదలెట్టచ్చు. కనీసం టైలరింగ్ నేర్చుకోవచ్చు. ఈ హితబోధలన్నీ స్త్రీల ప్రత్యేక పేజీల్లో చదివి చదివి, టీ.వి రేడియోల్లోను, మహిళానాయకుల ప్రసంగాల్లోనూ వినివిని విసుగొచ్చింది.

"చదువు గ్రాడ్యుయేషన్, భర్త దుర్మార్గుడు కాని చెడ్డవాడు. ప్రేమ రాహిత్యం, మధ్యతరగతి, ఇద్దరు పిల్లలు. ఉద్యోగం లేదు. భవిష్యత్తు పెద్ద క్వొశ్చెన్ మార్క్? జవాబు చెప్పే ధీశాలి వుంటే తక్షణం దరఖాస్తు పంపచ్చు" అని ఓ క్లాసిఫైడ్ ప్రకటన ఇస్తే! ఫ్ఛ్! బొత్తిగా వర్క్అవుట్ అవదు. కావేరి, కాంతక్కకి చెప్పి ప్రయోజనం లేదు. గుప్పెట తెరిచానంటే నా ముందు సానుభూతి వరదలు, ఆపైన పెదవి విరుపులు! రెండు మూడుసార్లు దగ్గరేకదాని, అందర్నీ చూసినట్లుందని, వాళ్లతో గడిపితే ధైర్యంగా ఉంటుందని పుట్టింటికి వెళ్ళి, ఓ వారం వుండి వచ్చేదాన్ని. ఓరోజు పెరట్లో మొక్కలకి గొప్పులు తవ్వుతున్న తోటమాలీ గోపన్న తాతకి సాయం చేస్తున్నప్పుడు.

"యశోదమ్మా, తప్పుగా అనుకోనంటే ఓ మాట చెబుతా తల్లీ!" అన్నాడు.

"చెప్పు తాతా! ఇందులో అనుకోడానికేముంది?" అన్నాను గులాబీ మొక్కల కొమ్మలు ట్రిమ్ చేస్తూ.

"చిన్నయ్య నొదిలి నువ్వొక్కదానివీ ఊరికెళ్ళద్దమ్మా. నువ్వుంటే కాస్త భయం, భక్తిగా వుంటాడు. నువ్వు లేకపోతే స్నేహితులు చెప్పిందే వేదం. అన్నీ ఎదవ స్నేహాలమ్మా. తాగిస్తారు. తాగుతారు. తిప్పుతారు. డబ్బు కలవాటు పడిన ఆడవాళ్ళు కూడా వూరకుండనీరమ్మా, నువ్వుంటే రేత్తిరికి ఇంటి కొస్తాడు. తాగుడు కూడా బాగా తగ్గిందమ్మా పెళ్ళయ్యాకా..." అన్నాడు.

కస్సున ముల్లు దిగిన వేలు చురుక్కుమంది. ఎర్రగారక్తం. చటుక్కున మురికి చెయ్యి అని మర్చిపోయి వేలేనోట్లో పెట్టుకున్నాను. రక్తం కట్టింది. నా జవాబుకోసం చూడకుండా గోపన్న తలొంచుకుని, చెప్పడానికింకేం లేనట్లు తనపని తను చేసుకుపోతున్నాడు. తోటమాలే అయినా బాగోగుల గురించి ఆలోచించే గోపన్న కన్నతండ్రికంటే ఎంతో ఉన్నతుడిగా, ఆత్మీయునిగా కనిపించాడు.

"థాంక్స్! తాతా!" అన్న నా మాటలకి తలెత్తి కళ్లచివర గీతలు స్పష్టంగా కనబడేలా నవ్వాడు.

అంతే! అప్పట్నుంచీ పుట్టింట్లో శుభకార్యమైనా సరేవెళ్లడం మానుకున్నాను.

"నాకంటే పన్లున్నాయ్. నువ్వెళ్లడానికేం?" అని మురహరి అన్నా "మీరు రాకుండా నాకు వెళ్లాలని లేదు" అనేదాన్ని. ఊరుకునేవాడు.

ఇంటికెళ్లి పిల్చినా యశోద రాదని, డబ్బుందని అహంకారమని, ఇదిలేందే క్షణమైనా వుండలేని గొప్పమొగుడు దీనికే వున్నాడనీ, పాతికేళ్లు పెంచిన పుట్టింటి మమకారాల్ని ఇట్టే తెంచేసుకుందనీ, పెళ్లిళ్లల్లో, శుభకార్యాల్లో 'దగ్గరేకదా! యశోద రాలే' దేమంటే పిల్లల చదువులో, జ్వరాలో, చుట్టాలనో అబద్ధాలు చెప్పలేక ఛస్తున్నామని నా మీద నిందలు.

"మన అత్తింటివారికి అంతఃకరణలు తక్కువ. అంతా మెకానికల్. ఎట్టి పరిస్థితుల్లోను నీ పుట్టింటిని వదులుకోకు" అని నా తోడికోడలు రత్న చెప్పినా వినలేదు. నా జీవితం నాకు ముఖ్యం. ఇది నాకై నేను విధించుకున్న శిక్ష.

అంత పెద్దకోపంలో నేను, చిన్నపిల్లలిద్దరు. పనిమనిషి వచ్చి దానిపని అది చేసుకుపోయేది. ఔట్‌హౌస్ అద్దెకు ఇద్దామన్నా ప్రెస్టేజ్‌కి భంగమని దాన్ని పాడుపెట్టి వుంచారు. నేను కాలక్షేపం కోసం ట్యూషన్లు చెప్పడానిక్కూడా వీల్లేదు.

మురహరి స్నేహాలవల్ల, డబ్బువల్ల చెడిపోయాడుగానీ వ్యక్తిగా మంచివాడే. నేనంటే ఎలావున్నా పిల్లలంటే ప్రేమ ఉంది. కానీ నిర్లక్ష్యం, జడలువిప్పిన పురుషాహంకారం ముందు ఈ కాసిని మంచిగుణాలు పిపీలిక సదృశాలు. అతనే క్షణంలో ఎలా వుంటాడో తెలీదు. రొటీన్ లైఫ్. అన్నీవున్నాయి. ఏవీలేవు. సర్దుకున్నకొద్దీ సర్దుకోవడమే అవుతోంది.

రానురాను ఉచ్చు బిగుసుకుంటున్నట్లు, సాలెగూటిలో చిక్కుకున్నట్లు పరిస్థితులు సంక్లిష్టంగా మారుతున్నాయి. చేదును మింగిన కొద్దీ ఊరుతోంది. మనసుకు సూటిగా తగిలే దెబ్బల్ని ఇంకా ఎంతకాలం తట్టుకోవాలి. శక్తిచాలడంలేదు. కన్నీరు, దుఃఖం, బేలతనంకాదు. మోసాన్ని, అబద్ధాల్ని, నిర్లక్ష్యాన్ని, కానితనాన్ని భరించలేని వేదన. ఇతని తత్వాన్ని దాచి తప్పుచేశానా? పోనీలే అని సహించి తప్పుచేశానా?

ఎంత అవమానం? ఎలా తట్టుకోడం? నన్ను నేనే ఓదార్చుకోవాల్సిరావడం ఎంత దుర్భరం? ఒకమాట, నవ్వు, ప్రియమైన పలకరింపు, ఆత్మీయతలేని పొడిజీవితం. ఏది అడిగినా మొహంమీద కొట్టినట్లు జవాబుచెబితే మౌనంగా నిష్క్రమించి, రహస్యంగా

ఏడ్చి, పైకి మామూలుగా వుండేలా చేసే పరోక్ష శక్తి ఏమిటి? నా సంస్కారమా? ఆత్మబలమా?

"మాటా మంతీ, ముద్దూ ముచ్చటా లేదేమంటే"

"నువ్వే రావా" లన్నాడు.

నేను ఇల్లాల్నా? వెలయాల్నా? రానురాను అదీలేదు. ఇద్దరి పడకలూవేరు. ఒకరి బాడీ లాంగ్వేజ్ ఇంకొకరికి తెలిసే అవకాశం లేదు.

పలకరించినా చీదరిస్తూ, ఏం మాట్లాడినా నెగటివ్ ఎప్రోచ్‌తో టీజింగ్‌గా కసురుతూ ఎలా వుండగలరు? రక్తసంబంధం, అనుబంధాలు వదిలేసినా సాటి మనిషిపట్ల కించిత్ గౌరవం లేకుండా ఎలా వుండగలుగుతున్నారు? ఎవరయినా వున్నారన్న జంకు, మర్యాదా లేని మొండితనం, మూర్ఖత్వం సున్నిత హృదయం మీద సమ్మెట పోట్లుకావా?

చిరునవ్వులు చిందే నా పెదవుల వెనుక ఉగ్గబట్టలేని ఉద్విగ్నభరిత దుఃఖం! దుఃఖాన్ని సాగరంతో ఎంత బాగా పోల్చారు! చెలియలి కట్టదాటదు, ఇంకిపోదు.

మురహరిది టూ టిపికల్ పర్సనాలిటి. అయినా లోపాల్ని ఎత్తిచూపకుండా అతన్నొక మంచి తండ్రిగా, ఆదర్శభర్తగా చెలామణి చేశాను ఇంటా, బైటా, ఇలా చేయడం వల్ల నాకు వ్యక్తిత్వం వున్నట్లో లేదో నాకు తెలీదు. అతను మంచివాడు కాదని ఇవాళ నేను చెప్పినా ఎవరూ నమ్మరు.

అతనితో కలిసి మెలిసి జీవిస్తూ, ఇంట్లోనే వుంటూ సహాయ నిరాకరణ చేయడం సాధ్యమా? నాలాంటి జీవితాలకి ఇల్లొదిలేసి వెళ్ళిపోవడం, ఒంటరిగా బతకడం, స్వయం ఉపాధి, ఇంకోమొగుడు, మరో విడాకులు, రాజీపడిపోవడం ఇవేనా ముగింపులు? నావన్నీ నేనే చేసుకుని, అతను చేశాడని లేబుల్ తగిలించి, ఘనంగా ప్రకటించి మురహరి ముద్దుల భార్యగా చెలామణి అవుతూ నాకు నేనే అన్యాయం చేసుకున్నాననిపిస్తోంది. పగలంతా నేను నటిని, స్వేచ్ఛానాట్యం చేసే ఆనందభైరవిని. రాత్రి నిశీథిలో నిశ్శబ్దంగా కన్నీటి వరదలు పుట్టించే షణ్ముఖ ప్రియను!

మధ్యలో ఓసారి మా అత్తగారు, మామగారు అమెరికా నుండి వచ్చినపుడు ఆస్తుల పంపకాలు అయిపోయాయి. ఇల్లు, కొంతపొలం, కొన్ని స్థలాలు మురహరి

వాటాగా వచ్చాయి. ఆస్తులేం కట్టుకుపోతామా? దాదాపు ఎక్కడివాళ్లక్కడ తెగతెంపులు చేసుకున్నట్లే!

వీటికితోడు మురహరి ఆరోగ్యం వున్నట్టుండి పాడయింది. సన్నగా దగ్గుతో మొదలయిన అనారోగ్యానికి ఆయాసం, కడుపులో మంట తోడయ్యాయి. ఏమీ తినలేకపోతున్నాడు. బాగా నీరసించి పోయాడు. నా మాట వినడు. చెప్పేవాళ్లు లేరు. ఆఖరికి బాధను తనే భరించలేని స్థితిలో డాక్టర్‌కి చూపించుకున్నాడు. కాస్త అల్సర్. ఆయనిచ్చిన మందులతో ఉపశమనం కలిగినా,,

"ఎందుకైనా మంచిది. డ్రింకింగ్, స్మోకింగ్ రెండూ ఉన్నాయి గనుక ఓసారి హైదరాబాద్ తీసుకెళ్లి జనరల్ చెకప్ చేయిస్తే మంచిది" అన్నాడు డాక్టర్.

"ఆ రెండూ బాగా తగ్గించేశానన్నాడు" మురహరి.

"ఏదైనా ఎఫెక్ట్ ఎఫెక్టే! జాగ్రత్త పడ్డంలో తప్పులేదు" అని బలవంత పెట్టాడు డాక్టర్. ఎక్కడి కెళ్లాలో, ఏంచెయ్యాలో కూడా చెప్పాడు.

అన్ని టెస్టులూ అయ్యాయి. అదృష్టవశాత్తూ అంతా నార్మల్, అల్సర్ వుంది. వేళకి ఆహారం, పానీయాలు, మందులు ఇస్తూ జాగ్రత్తగా చూసుకోమని, సాధ్యమైనంత వరకూ ఇంటిభోజనం తప్ప బైటితిండి తినకుండా వుంటే మంచిదని స్పెషలిస్ట్‌లు సలహాలిచ్చారు. మొదట్లో కాస్త వెగటుగా మొహం పెట్టినా, మెల్లిమెల్లిగా పెట్టింది తిని, తాగి మందులు వేసుకోడం మొదలుపెట్టాడు. నేను నర్స్, అతను పేషంట్. అంతే! ఆ అవసరానికి మించి మాటలు, సాన్నిహిత్యం లేవు.

రోజులు ఆగవుగా! మనిషి తేటపడ్డాడు. బాగా బలం పుంజుకున్నాడు. నల్లని బుగ్గలు మెరుస్తున్నాయి. అయినా ఆహారనియమాలు వదలకుండా పాటిస్తూనే వున్నాడు. కనీసం పిల్లలతో కలసి భోంచేస్తున్నాడు. వాళ్లతో సరదాగా, ప్రేమగా వుంటున్నాడు. సంతోషమనిపించింది.

ఐదారు బిజినెస్‌లు మార్చాడు. డబ్బుపోగొట్టుకున్నాడు. కొంతపొలం, కొన్ని స్థలాలు అమ్మేశాడు. ప్రస్తుతం వున్న బిజినెస్‌లో కుదురుకున్నాడు. ఫర్వాలేదు. నడుస్తోంది. అటు బిజినెస్, ఇటు జీవితం.

ఇవాళ్టికి పెళ్లయి ఐదేళ్లు. మనం ఏడుస్తున్నామని ఏళ్లాగుతాయా? నవ్వొచ్చింది. ఇలాంటి వైవాహిక జీవితాన్ని కూడా లాక్కెడుతూ గుర్తుపెట్టుకున్నందుకు! ఉదయం మామూలుగా మొదలైంది. పిల్లలు స్కూళ్లకు వెళ్లారు. మురహరి ఇంకా లేచినట్లు లేదు. తను లేచేదాకా ఎవరూ లేవకూడదు. మధ్యాహ్నం పన్నెండయినా సరే, అది రూలు. నా పని నేను చేసుకుంటూపోతున్నాను.

"యశోదా!"

మురహరి పిలుపు, కాస్తాలస్యమైతే పక్కింటికి వినిపించేలా అరుస్తాడని పరుగులాంటి నడకతో పడగ్గది చేరాను. చూపుడువేలుతో రమ్మని పిలిచాడు. దగ్గరికి వెళ్లాను. శుభ్రంగా తయారై బైటికి వెళ్లడానికి రెడీగా వున్నట్లున్నాడు.

"నీ ఉద్దేశం ఏమిటి? నేనంటే ఏమనుకుంటున్నావ్? " అడిగాడు ఉన్నట్టుండి.

తలవంచుకుని మౌనంగా నిలబడ్డాను.

"తలెత్తి మాట్లాడు. నిన్నే అడిగేది"

"ఏమీ అనుకోవడంలేదు"

"అనుకోనిదానివే ఈ తతంగమంతా నడిపించావా? ఒకటికాదు, రెండు కాదు ఐదేళ్లు! మైగాడ్! నన్నెంత వెర్రివెధవని చేశావ్. ఎందుకిలా చేశావ్? ఎంత గొప్పనటివి నువ్వు!"

ఇన్నేళ్ల తర్వాత ఎందుకిలా పంచాయతీ పెడుతున్నారో అర్థం కాలేదు. అతని మొహం చూడాలని లేదు. మొహం తిప్పుకున్నాను. దేనికైనా సిద్ధంగా వున్నదానిలా గట్టిగా నిలబడ్డాను.

"ఏం చేశావో తెలుసుకోవాలని లేదా?"

"లేదు. చెప్పాలంటే చెప్పండి"

"నీ మొగుడు ఒకరోగ్ అని నీకు తెలుసు. మనిషిగా పుట్టాడు గనక మాట్లాడుతున్నాడు తప్ప వాడి నిజస్వరూపం నీకు స్పష్టంగా తెలుసు. తెలిసీ మంచివాడిగా ఎందుకు ప్రాజెక్ట్ చేశావ్?"

"అది నా స్వార్థం. ఒకళ్ల సింపతీ అంటే నాకు అసహ్యం"

"అంత అసహ్యమైతే పట్టుకుని వేలాడ్డమెందుకు? బైటికి పోలేకపోయావా?"

"అవన్నీ మీకనవసరం. దాంపత్య జీవితం పట్ల నాకు కొన్ని నిర్దిష్టమైన అభిప్రాయాలున్నాయి. నామీద నాకు నమ్మకం వుంది. పారిపోవడం, వెన్ను చూపించడం నాకు నచ్చని విషయాలు.

"ఇన్నాళ్లూ లేనిది, నువ్వొచ్చీరాగానే, చెప్పీచెప్పగానే మారిపోతాననుకున్నావా? నీ నమ్మకాలు నిజాలవుతాయని ఏమిటి గ్యారంటీ?" నిలదీశాడు.

"మార్తారని అనుకోలేదు. మారితే బావుండుననుకున్నాను. మీరన్న గ్యారంటీ గురించి ఇవాళ కాదు మాట్లాడుకోవాల్సింది. వస్తువు కొనుగోలు చేసేముందే ఆలోచించాలి. అక్కడే నేను పొరబడ్డాను. ఆ పొరపాటు సరిచేసుకునే ప్రయత్నమే!"

"వస్తువు, కొనుగోలు అంటున్నావ్. నువ్వేం కట్నం ఇచ్చావని?"

"నా జీవితం. దానివిలువ మీలాంటి వాళ్లకి తెలీదు."

"నిజమే, తెలీదు. ఇన్నాళ్లూ నేను జీవించేదే జీవితం అనుకున్నాను. కానీ ఆ మూడక్షరాల అర్థం నువ్వొచ్చాకే తెలిసింది. మా అమ్మకి నేనక్కర్లేదు. అమెరికా అన్నయ్యలే కావాలి. కాదు, అమెరికాయే కావాలి. అందుకే ఆవిడ అక్కడే వుంటుంది. పొలంపన్లు, పంచాయతీ బోర్డు, పాలిటిక్స్‌తో మా నాన్న బిజీ. నా అక్క చెల్లెళ్ల షోకులకి నేను పడను. ఎటుచూసినా ఒంటరితనం మాయింట్లో అమ్మా నాన్నలకి, తల్లీపిల్లలకి, అన్నాచెల్లెళ్లకీ మధ్య మీరంతా చెప్పే ఆప్యాయతలు, అభిమానాలు లేవు. డబ్బే లింకు. ఎవరి లైఫ్ వాళ్లది. అందుకే స్నేహితులు మంచి మాటల్తో నన్ను లొంగదీసుకోగలిగారు. డబ్బుకావాలి వాళ్లకి. నాకు నన్ను అభిమానించి, హీరోలా చూసేవాళ్ల కంపెనీ కావాలి. దాంతో ఇలా తయారయ్యాను. ఎవరికి వాళ్లు సెటిల్ అయిపోయారు. నన్ను నీకు అంటగట్టి ఎవరిదారి వాళ్లు చూసుకున్నారు..."

"ఇవన్నీ నాకెందుకు?"

"నా కోసం విను. నువ్వొచ్చేదాకా నేనంటే ఏమిటో నాకే తెలీదు. చెప్పేవాళ్లూ లేరు. నాకు తెలిసిన ఆడవాళ్లెవరూ మా అమ్మ, చెల్లి, కజిన్స్ ఎవరూ నీలా లేరు. యూ ఆర్ డిఫరెంట్. సాధింపులు, గొడవలు లేకుండా అంతమౌనంగా, సహనంగా వుండడం ఓ సగటు భార్యకి సాధ్యమా? అదే నన్ను బాగా ఆలోచింపచేసింది.

నువ్వొచ్చిన సంవత్సరంలోనే నేను మానసికంగా మారాను. కానీ వ్యసనాలుగా మారిన అలవాట్లను మానలేకపోయాను. ఇపుడొచ్చిన బుద్ధి ఇంకాస్సేపటికి వుండేదికాదు. నేనెంత దరిద్రంగా బిహేవ్ చేస్తున్నానో తెలుస్తోంది. మారాలన్న ప్రయత్నాన్ని వదిలేశాను. మురహరి మురహరే! మారడు అనుకున్నాను. కానీ ఆశ్చర్యం!... ఆగి నావైపే చూస్తూ నిలబడ్డాడు. ఏం చేస్తాడాని నాకూ కుతూహలంగానే వుంది.

"ఇది వరకు నేను కనబడితే 'ఫలానా వాళ్లబ్బాయి... అబ్బే అడక్కండి బాగోతం' అని వెటకారాలు, చిన్న చూపు ఉండేవి. నువ్వొచ్చాకా నేను మారడం అలావుంచి వాళ్ల మాటల్లో బాగా తేడా వచ్చింది. అవన్నీ నా గురించేనా? అని అనుమానం వచ్చింది. కొన్ని నా చెవుల్లో పడేవి. కొన్ని నా స్నేహితులు మోసుకొచ్చేవారు. కొందరు నన్ను నిలబెట్టి అడిగేవారు..."

"ఏమని?" అడక్కుండా వుండలేకపోయాను.

"మురహరి పెళ్లయ్యాకా బాగా మారాడని. పెళ్లాం పిల్లల్ని ఎంతో ప్రేమగా చూసుకుంటున్నాడని, నగలు, బట్టలు ఒకటేమిటి? యశోద అడక్కుండానే సమస్తం అమరుస్తున్నాడని. ఆమెను వదలి క్షణమైనా వుండడని, అందుకే ఆ పిల్ల పెళ్లయి ఐదేళ్లయినా తొలికాన్పుకి కూడా పుట్టింటికి వెళ్లలేదని. "ఏమయ్యా యశోదమ్మ వచ్చాకా బాగా మారావు. పోన్లే, కోనేటిరాముడి దయవల్ల ఇన్నాళ్లకు నీకు మంచి రోజులొచ్చా" యంటూ పూజారిగారు. ఏదో ఇలాగే అందరూ. దాంతో నాకు తెలీకుండానే నా వ్యసనాలు చాలా మటుకు తగ్గాయి. నిజం చెప్పు. నాలాంటివాణ్ణి ఎవరైనా మంచి వాడంటారా? నువ్వెందుకు నన్నంత ఆదర్శవ్యక్తిగా అందరికీ చెప్పావు. నీ అంతట నువ్వు చెడ్డవాడని చెప్పినా వాళ్లు నమ్మలేనంతగా ఎందుకు మంచితనాన్ని ఆపాదించావు?"

"నా భర్త ఎలా వుండాలని ఆశపడ్డానో అవే చెప్పాను."

"అబద్ధాలెందుకు?"

"అబద్ధాలు ఒకనాటికి నిజాలు కావాలన్న ఆశ. తథాస్తు దేవతలుంటారనీ మంచి మాటలకి వాళ్లు దీవిస్తారని ఆశ. అలా ఏమీ జరగకపోయినా నా జీవితాన్ని చూసి నలుగురూ నవ్వేకంటే, యశోద మొగుడు ఇలాంటివాడన్న ఎగతాళి, సానుభూతి

భరించేకంటే నేను అన్ని విధాలా అదృష్టవంతురాలినని అందరూ అసూయపడ్డమే మంచిదనిపించింది. నా కష్టాలెటూ ఎవరూ తీర్చేవికావు.”

“ఆశలు చాలానే వున్నాయే! అంతలా మారడానికి ఇదేమైనా తెలుగు సినిమాయా? టీవీ సీరియలా?”

“వాటికి కొన్ని గంటల నిడివి, నిబంధన వుంటుంది. కానీ ఇది లైఫ్. చచ్చేదాకా టైం వుంది. లైఫ్‌డ్రామాలో ఓ పాత్రని మార్చడానికి ప్రయత్నించడంలో తప్పులేదనిపించింది. ఆడపిల్లల్ని ఎంతగా పెంచి వ్యక్తిత్వం ఇచ్చినా వాళ్లకి మంచి భర్తల్ని తేవడంలోనే ఫెయిలవుతున్నారు. ఎవరైనా సరే వాళ్లంతట వాళ్లు మారాలనుకోకపోతే బ్రహ్మకూడా వాళ్లని మార్చలేడు. తరతరాలుగా నరనరాల్లో అహంకారం, మూర్ఖత్వం, మొండితనం జీర్ణించుకుపోయిన మగవాళ్లు మారనంత వరకు ఏదీ మారదు. మీలాంటివాళ్లకి ఈ ప్రపంచంలో కొదువలేదు. ఆ మార్పు రావాలంటే ఇలాంటి ఉద్యమ ప్రయత్నాలు తప్పనిసరి.” అన్నానేకాని అనవసరంగా ఆవేశపడుతున్నాననిపించింది.

“ఆపేశావేం? చెప్పు. ఉపన్యాసాలు బానే ఇస్తావే!”

“అనవసరం. ఏమిటి ఎన్నడూలేదు ఇవాళ ఇంతలా మాట్లాడుతున్నారేం? రాత్రి హేంగోవర్ వదల్లేదా?” అనుకోకుండా నోరుజారాను.

“వదిలింది. నా బుర్రకి పట్టిన తుప్పు వదిలింది. నువ్వేకాదు నటివి. గత మూడేళ్లుగా నేనూ నటిస్తూనే వున్నా. పూర్తిగా మారనంతవరకు నీ ముందుకి రాదల్చుకోలేదు. ఇన్నాళ్ళకా నమ్మకం కుదిరింది. నీ మనసులో మాటకూడా తెలుసుకున్నాను. నీకు సరెండరయిపోతున్నాను. చెప్పేవాళ్లు వుండాలేగాని ఇవాళ కాకపోయినా రేపైనా మార్తాడు మగాడు. టైం పడుతుంది. హేమరింగ్ వుండాలి కొందరికి. మౌనం బంగారం కొందరికి. ఇది అందరికీ వర్తింపకపోయినా మెజారిటీ మగాళ్లు మారే అవకాశం వుంది. మగాడిగా చెప్తున్నా. ఓ ఛాన్స్ ఇచ్చి చూడాలి. అంతే!”

మురహరి మాటలు వింటుంటే నాకు తెలీకుండానే నాశరీరం తేలికయిపోతోంది. పడిపోతానేమోననిపించి అడుగుముందుకేసి చటుక్కున అతని

చెయ్యి పట్టుకున్నాను. అతను రెండోచేత్తో నా భుజంచుట్టి నా తల గుండెలకాన్చుకుని

"మెనీ మెనీ హాపీ రిటర్న్సు ఆఫ్ ద డే. ఐ లవ్ యూ యశూ!" అన్నాడు.

"నిజమో! కాదో తెల్సుకోడానికి మరో పంచవర్ష ప్రణాళికా?" అడిగాను కళ్లెత్తి చూస్తూ.

"ఊహూ! ఇంకొక్కక్షణం కూడా వృధా పోనివ్వను. ఐ ప్రామిస్. చేతిలో చెయ్యి వేసికాదు. పెదవులపై సంతకం చేసి మరీ చెబుతాను".

మాలకోసం విచ్చుకున్న నా పెదవులు అంతలోనే మూగపోయాయి.

# నాకు బ్రతకాలని ఉంది నాన్నా!

**- సాకేతపురి కస్తూరి**

**కి**టికీలోనుండి తెరలు తెరలుగా వెన్నెల జాలువారుతున్న వేళ. పిల్ల తెమ్మెరలాంటి ఆలోచనలు మనసులోకి మలయపవనాల్లా కదులుతున్న ప్రశాంతసమయం.

ఆ నిశ్శబ్దం నీరవాన్ని శ్రుతిచేస్తూ స్వర్గంలోంచి సంగీతం వినిపించినంత మృదువుగా–

"రాధీ!" అని పిలిచాడు శ్రీకాంత్.

"ఊఁ..." అంది.

"ఏవిటి ఆలోచిస్తున్నావు?"

"ఊహుఁ...ఏమీ లేదు."

"లేదు. ఏదో ఉంది!" అతను కొద్దిగా ఎత్తుగా వున్న ఆమె పొట్టమీద సుతారంగా స్పృశిస్తూ–

"మన పాపని గురించేనా?" అని లాలనగా అడిగాడు.

"ఊఁ... ఇన్నాళ్లూ జీవితంలో ఎంత ఒంటరిగా బతికాను. ఇప్పుడు నాలో, నా కోసం ఒక ప్రాణిని, ఒక తోడును ప్రవేశపెట్టాడా దేవుడు!" ఆ కంఠంలో తొణికిసలాడిన ఆనందోద్వేగాన్ని పంచుకుంటూ–

"నీకోసం కాదు. మనకోసం..."చిన్నగా నవ్వుతూ అన్నాడు శ్రీకాంత్.

"అవును" అతని గుండెలో ఒదిగిపోతూ తృప్తిగా కళ్లు మూసుకుంది రాధిక.

ఆమె అతని ఒంటరి జీవితంలోకి వసంతంలా ప్రవేశిస్తూ తన కొంగున మాధుర్యాన్ని మూటకట్టుకుని వచ్చింది.

అతను పుట్టగానే తల్లి పోయింది. తండ్రి మళ్లీ పెళ్లిచేసుకున్నాడు. తరువాత పుట్టిన సంతానం మీద ఉన్న శ్రద్ధ వారికి అతనిమీద లేకపోయింది. ఆ ఇంట అతని ఉనికి పరాయిదయింది. ఎలాగో బి.ఏ. పూర్తి చేశాడు. ఆ తరువాత ఒక ఆర్కిటెక్ట్ దగ్గర చేరి బిల్డింగ్‌ప్లాన్స్ వేయడం నేర్చుకున్నాడు. తరువాత తన చిన్ననాటి నుండి అండదండగా ఉంటున్న స్నేహితుడు విక్రమ్‌తో కలిసి వేరే ఆఫీసు పెట్టుకున్నాడు. ఇద్దరూ కలిసి శ్రమించారు. నెమ్మదిగా రియల్ ఎస్టేట్ బిజినెస్ ప్రారంభించారు. బిజినెస్ ఊపందుకుంది. మరో ఇద్దరు స్టాఫ్ కావలసి వచ్చి ప్రకటన ఇచ్చారు.

తను ఆఫీసులోకి ఉద్యోగం కోసం వచ్చింది రాధిక. ఆమెని ఇంటర్వ్యూ చేస్తూండగా ఆమె కూడా తనలా జీవితంలో ఒంటరిదని తెలిసింది. ఎందుకో ప్రథమ వీక్షణంలోనే మనసులో ఆమె అంటే ఇదీ అని చెప్పలేని ఒక భావం. అది సాన్నిహిత్యంతో పెరిగి ప్రేమగా మారింది. ఆ ప్రేమలోని మధురిమ పెళ్లి అయ్యాక రెట్టింపు అయింది.

పెళ్లి అయిన కొత్తలో ఈ ప్రపంచం మొత్తానికి తామిద్దరే ఉన్నట్టూ, మరింకెవరూ లేనట్టూ–తమ ప్రేమ, అనురాగం, అనుబంధానికి మించి మరే బంధమూ శాశ్వతం కానట్టూ అనిపించేది. కానీ ఈ మూడో ప్రాణి ఆగమన వార్తతో కొత్తగా ఆప్యాయత, ఆత్మీయత చిత్రంగా గుండెలో గూడుకట్టుకోసాగాయి. మనసులో ఎంతో అందమైన ఊహాచిత్రాలు, భవిష్యత్తులో రాబోయే బిడ్డకోసం ఎన్నో రంగు రంగుల కలలు కంటూనే గాఢ నిద్రలోకి జారిపోయాడు శ్రీకాంత్.

స్త్రీపురుషుల సంగమానికి సాక్షిగా స్త్రీగర్భంలో శుక్లము, స్త్రీ అండము ఫలదీకరించబడి పిండంగా మారి, ఆకృతిని సంతరించుకుని, వర్షరుతువు రాగానే అడ్డువచ్చే కొండలని, కోనలని దాటి ప్రవహించి పృథ్వీమీదకి చేరే జీవనదిలా నెలలు నిండగానే ఈ ప్రపంచంలోకి అడుగిడుతుంది శిశువు. అది సహజం.

దానికి భిన్నంగా నెలలు నిండకముందే రాధికకి నొప్పులు వచ్చాయి. హాస్పిటల్‌కి తీసుకుని వెళ్తే అత్యవసరంగా సిజేరియన్ చేయాలన్నారు. సిజేరియన్ చేసి పాపని తీశారు.

ప్రిమెచ్యూర్ బేబీ, పాపకి కాళ్లు, చేతులు సన్నగా పుల్లల్లా ఉన్నాయి. తల పెద్దదిగా వికృతంగా ఉంది. తల్లికి దూరంగా ఇన్‌సెన్‌టివ్ కేర్ యూనిట్‌లో ఇన్‌క్యుబేటర్ అని పిలవబడే ఒక గాజుపెట్టెలో పాపను ఉంచారు. పాప గుండెలో ఏదో లోపం ఉందట. శ్వాసప్రక్రియ సరిగా లేదట. పాప వంటినిండా ఏవో వైద్యపరికరాలు. ఆ పరికరాల సహకారంతో ఆ పాప మృత్యువుతో పోరాడుతోంది.

ఆ బిడ్డని చూసిన శ్రీకాంత్ దాని రూపం.. దాని చిన్ని గుండెలో లోపం... అలా కొనవూపిరితో కొట్టుకుంటూ ఆయుష్షును పోసుకోవాలని అది పడుతున్న నరకయాతను నేను... నేను చూడలేనండీ!" రాధిక అతన్ని పట్టుకుని బావురుమని ఏడ్చేసింది.

పదిరోజుల అనంతరం రాధికని హాస్పిటల్ నుంచి డిశ్చార్జ్ చేశారు. పాపని ఇంకొన్నాళ్లు ఇన్‌క్యుబేటర్‌లో డాక్టర్స్ అబ్జర్వేషన్‌లో ఉంచాలనడంతో రాధిక పూర్తిగా తన మనోనిబ్బరాన్ని కోల్పోయింది. ఆమెకి ఏమి చెప్పి ఊరడించాలో... శాంతపరచాలో తెలియక నలిగిపోతున్న శ్రీకాంత్‌తో– నీవు ఆమెను జాగ్రత్తగా చూసుకో!" అని విక్రమ్ హెచ్చరించడంతో శ్రీకాంత్ తననితాను కొద్దిగా నిలదొక్కుకుని రాధిక పట్ల మరింతగా శ్రద్ధ వహించసాగాడు.

అయినా రాధిక మనసునిండా తుఫాను బీభత్సం తరువాత పేరుకున్న స్తబ్ధత, విషాదం... ఆ కొన్నాళ్లలో ఆమెలో చాలా మార్పు వచ్చేసింది. మనిషి ఎన్నో ఏళ్లు మంచాన పడ్డ వ్యక్తిలా చిక్కిపోయింది. ఆమెలో మునుపటి చురకుదనం మాసిపోయింది. ఎప్పుడూ ఏదో పరధ్యానంగా ఉండటం, తనలో తనే ఏవో ఆలోచనలు చేయటం, రోజూ హాస్పిటల్‌కి వెళ్లటం.. ఎవరెంత చెప్పినా వినకుండా గంటల తరబడి ఆ ఇన్‌క్యుబేటర్‌లో నిస్సహాయంగా పడి ఉన్న బిడ్డని చూసుకోవడం.

డాక్టర్స్ వస్తారు. బిడ్డని పరీక్షిస్తారు. వాళ్లలో వాళ్లు ఏవో చర్చలు చేస్తారు. ఆ బిడ్డలో రోజుకో కొత్త లోపాన్ని కనిపెడుతూ ఉంటారు.

ఆమె అక్కడే ఓ పక్కగా నిలబడుతుంది. కళావిహీనమైన గాజు కళ్లతో నిలువుగుడ్లు వేసుకుని వారిని చూస్తుంది. అదుపు తప్పుతున్న గుండెని చిక్కబట్టుకుని ఆ చర్చలని వింటుంది. అలాగే రెండు నెలలు గడిచాయి.

ఒకరోజు ఆ హాస్పిటల్‌లోని చీఫ్ కార్డియాలజిస్ట్ డాక్టర్ మిత్రా శ్రీకాంత్‌ని, రాధికని ప్రత్యేకంగా మాట్లాడడానికి తన గదికి పిలిచాడు.

"డాక్టర్! మేము పాపని తీసుకుని పోవచ్చా!" వస్తూనే రాధిక వేసిన మొదటి ప్రశ్న.

"ముందు మీరు కూర్చోండమ్మా!" అతను మర్యాదగా సీటు చూపించాడు.

"చెప్పండి. డాక్టర్!" శ్రీకాంత్ కూర్చుంటూ అడిగాడు.

"మిస్టర్ శ్రీకాంత్! బేబీకి హార్ట్‌బీట్ పర్సంట్ చాలా తక్కువగా ఉంది. హార్ట్‌సర్జరీ చేయాల్సి ఉంటుంది. దానికి లక్షాయాభైవేలకి పైగా..." అతను అంటూండగానే.

"ఖర్చు విషయం వదలండి. డాక్టర్! సర్జరీ తరువాత పాప నార్మల్‌గా అడిగాడు శ్రీకాంత్.

రాధిక కళ్లలోనూ అదే ప్రశ్న.

డాక్టర్ ఇద్దరివైపు లిప్తకాలం పరికించి నెమ్మదిగా గొంతు విప్పాడు. "మిస్టర్...! అదే మీకు. ఫ్రాంక్‌గా చెప్పాలనుకుంటున్నాను. ఇది మా ప్రయత్నం మాత్రమే. ఈ పరిస్థితిలో ఇంతకంటే మరో మార్గం కూడా లేదు. సర్జరీ తరువాత ఫిఫ్టీ పర్సెంట్ మాత్రమే బతికే ఛాన్స్ ఉంది. ఇదిగాక మరొక విషయం కూడా మీకు చెప్పాల్సిన బాధ్యత నాకు ఉంది!" అంటూ అతను సంకోచిస్తున్నవాడిలా ఆగాడు.

క్షణంసేపు ఆ గదిలో భయంకరమైన నిశ్శబ్దం. అప్పటికే సన్నగా వణుకుతున్న చేతిని టేబిల్ అంచున నొక్కిపెట్టి మనస్థైర్యాన్ని తెచ్చుకోవటానికి విఫలప్రయత్నం చేస్తున్న రాధిక చేతిమీద తన చేతిని వేసి ధైర్యం చెపుతున్నట్టుగా గట్టిగా పట్టుకున్నాడు శ్రీకాంత్. డాక్టర్ చెప్పటం ప్రారంభించాడు.

"పాప సర్జరీ తరువాత కోలుకుంటే తన శరీరాకృతిలో మార్పు రావచ్చు. పౌష్ఠికాహారమూ, సరైన పోషణా ఉంటే కండపుష్టి కలిగి మామూలుగా అవ్వవచ్చు. కానీ పాప మెంటల్ కండిషన్ గురించి ఇప్పుడేమీ నిర్ధారించలేము. పాప బ్రెయిన్ ఎన్‌లార్జ్‌గా ఉంది. తను మెంటల్..." డాక్టర్ చెప్తుండగానే కుర్చీలోంచి ముందుకు తూలి స్పృహతప్పి పడిపోయింది రాధిక.

డాక్టర్‌తో సంభాషణ జరిగిన అనంతరం ఆ ఇద్దరిలో ఒకరినొకరిని ఓదార్చుకోవటానికి కూడా శక్తి లేకపోయింది. ఇద్దరి మధ్యా కొండలా పేరుకుపోయిన మౌనం, విషాదం, అంతులేని ఆలోచనలు హృదయాలని ఛిద్రం చేస్తున్న సంఘర్షణ.. నరకం... అవును. బతికి ఉండగానే నరకం అనుభవంలోకి వచ్చింది.

శ్రీకాంత్‌కి పనిమీద శ్రద్ధ తగ్గింది. ఎందుకు? ఎందుకిలా జరిగిందీ? తన రక్తం, తనలోని అంశం, తన బిడ్డ ఎందుకిలా పుట్టింది? తనేం పాపం చేశాడు? ఇదే వేదన, ఇదే చింత... ఆరనిచిచ్చులా హృదయాన్ని దహించివేస్తోంది. ఎన్నడూ లేనిది తాగుడును అలవాటు చేసుకున్నాడు. సిగరెట్లమీద సిగరెట్లు తగలేస్తున్నాడు. రోజురోజుకీ మనోస్థైర్యాన్ని కోల్పోతున్న అతన్ని చూస్తుంటే చివరికి పిచ్చివాడు అయిపోతాడేమో అనిపించింది విక్రమ్‌కి. అందుకే అతను ఒక నిర్ణయానికి వచ్చి-

"చూడు, శ్రీకాంత్! నీతో ఒకమాట చెప్పాలనుకుంటున్నాను!" అంటూ సానునయంగా ప్రారంభించాడు.

"నేను చెప్పే విషయం విని నీ మనసు కలత పడొచ్చు. నా చెంప పగలగొట్టాలన్న ఆవేశం కలగవచ్చు. లేదా, ఉన్మాదంతో నన్ను చంపేయాలన్నంత కోపం రావచ్చు. అయినా నేను నీ మంచి కోసం, నీ భవిష్యత్తుకోసం చెప్పేది చెప్పి తీరుతాను."

"ఏమిటది...?" భృకుటి ముడిపడగా కాస్త ఆశ్చర్యంగా అడిగాడు శ్రీకాంత్.

"ఆ బిడ్డకోసం, అర్థంలేని ఆ మాంసపుముద్ద కోసం ఎందుకు ఇంత తాపత్రయపడుతున్నారు మీరు?"

"వ్వాట్?..." శ్రీకాంత్ పిడికిళ్లు బిగుసుకుంటుండగా కూర్చున్న చోటునుండి లేచి,

"ఏమిటి?... ఏమిటి నీవంటున్నది?" అని ఆవేశంగా అరిచాడు.

"కూల్! కూల్‌డౌన్ మై ఫ్రెండ్! నేను ఏం చెప్పబోతున్నానో కొద్దిగా అర్థం చేసుకో! డాక్టర్స్ సరే. డబ్బిచ్చేవాడుంటే ట్రీట్‌మెంట్ అలా కొనసాగించడానికి వారికి అభ్యంతరం ఉండదు. నీవు ఆ బిడ్డకోసం ఇప్పటికి లక్ష పైగా ఖర్చు చేశావు. రేపు సర్జరీ అంటే మరో రెండు లక్షలు..." శ్రీకాంత్ మొహంలో పొంగుకు వస్తున్న రక్తాన్ని చూసి క్షణం ఆగాడు.

"సరే, డబ్బు విషయం వదిలేయ్! ఆ బిడ్డని అలా బతికిస్తూ నీవిలా మనస్తాపాన్ని ఎందుకు పెంచుకుంటున్నావు?"

"అయితే?...? అయితే...ఏం చేయమంటావు నన్ను నువ్వు? దాని పీకపిసికి చంపెయ్యనా?" కోపంతో కంఠం వణుకుతుండగా కీచుగా అరిచాడు శ్రీకాంత్.

"నేను ముందే చెప్పాను. ఆవేశం వద్దని. ఆలోచించు. ఆ బిడ్డకి ఆకారం సరిగ్గా లేదు. గుండెలో లోపం. బ్రెయిన్ సరిగ్గా పనిచేస్తుందన్న నమ్మకం లేదు. ఎందుకు? ఆ బిడ్డని బతికిస్తావు? ఆ పాప బతికి ఈ భూమిమీద ఏమి సుఖపడుతుందని? మిమ్మల్ని ఏమి సంతోషపెడుతుందని?"

"అంటే...? అంటే..." అతను చలించిపోతూ అడిగాడు.

"శ్రీకాంత్! కఠినంగా ఉన్నా చెప్పక తప్పడంలేదు. నా మాట విని, ఇక ఆ ట్రీట్‌మెంట్ ఆపుచేయించు!" చాలా నిదానంగా చెప్పాడు విక్రమ్.

"నో! నో!... దారుణం!... ఎంత దారుణంగా మాట్లాడుతున్నావురా నీవు? నీకు.. నీకు...?" శ్రీకాంత్ మాటరాక రొప్పుతూ ఉండిపోయాడు.

"శ్రీ...! నన్ను ఏమన్నా అను, తిట్టు, నిందించు–ఫరవాలేదు. కానీ నీవీ నరక వేదన నుండి బయటపడరా! నీకు ఏమంత వయసయిపోయిందని? భవిష్యత్తులో నీకు మళ్లా సంతానం కలగదా! ఒక్క బిడ్డ ఇలా పుడితే తరువాత పుట్టినవారంతా ఇలాగే ఉంటారనుకోకు! మా అమ్మకి నేనూ, అన్నయ్యా పుట్టకమునుపు ఒక పాప పుట్టుగుడ్డిగా జన్మించిందట. ఆ అమ్మాయికి మెదడులో కూడా ఏదో లోపం.. వెర్రితనం ఉండేదట. మూడేళ్లు బతికి చనిపోయిందట! 'అది చచ్చి సుఖపడిందిరా!' అంటుంది అమ్మ!"

"నో! నేను నమ్మను. ఏ తల్లీ అంత కఠినంగా అనదు. పాప గురించి నీవిలా అన్నావని తెలిస్తే... తెలిస్తే... ముందు నిన్ను చంపేస్తుంది రాధిక!"

"నాకు తెలుసు. అందుకే ఇదంతా ఆమెకి చెప్పాల్సిన పనిలేదు అంటున్నాను. ఈ రోజే వెళ్లి డాక్టరుతో పాపకి సర్జరీ చేయవద్దని చెప్పు. పాపని ఇంటికి తీసుకుని వద్దాము. ఆయుష్షు ఉన్నవాళ్లు బతుకుతుంది. లేకుంటే..." అలా చెప్పవలసి వచ్చినందుకు బాధపడుతూ ఆగాడు.

ఆ తరువాత బరువుగా విశ్వసించి, "రాధిక కొంతకాలం దుఃఖిస్తుంది. అంతే! ఎంత కఠినమైన ప్రాణాన్నయినా కాలం మానేలా చేస్తుందిరా! మా అమ్మ ముప్పై ఏళ్ల తరువాత తన బిడ్డ గురించి ఈ మాట అనగలిగింది. రేపు నీవూ అంతే!" అన్నాడు.

"విక్కీ!" శ్రీకాంత్ గొంతు నొక్కుకుపోగా నిస్సహాయంగా మూలిగాడు.

"శ్రీ! నీ గుండె దిటవు చేసుకో! సాయంత్రం మనం హాస్పిటల్‌కి వెళ్లి డాక్టర్ మిత్రాతో మాట్లాడదాం!" శ్రీకాంత్ భుజంమీద తట్టి చిన్నగా నొక్కి వెళ్లిపోయాడు విక్రమ్.

శ్రీకాంత్ మాత్రం మంచులో కూరుకుపోయిన కొయ్యముక్కలా అలాగే ఉన్నచోట బిగుసుకుపోయి కూర్చుండిపోయాడు.

అతను అలా కూర్చుని ఉండగానే నిమిషాలు గంటలు దొర్లిపోయాయి. సాయంత్రం అయిదవుతుండగా ఇంటి దగ్గర నుండి రాధిక ఫోన్ వచ్చింది.

"రాధికా! హాస్పిటల్‌కి వెళ్లివచ్చావా?" అతను అడిగాడు.

"ఆఁ, ఇప్పుడే వచ్చాను. రాగానే మీకు ఫోన్ చేస్తున్నాను. మీరు ఇంటికి త్వరగా రండి, ఒక విషయం చెప్పాలి!"

"ఏవిటి, రాధికా?"

"మీరు రండి, చెబుతాను!" రాధిక కంఠంలో కొద్దిగా చైతన్యం తొణికిసలాడడం అతను గమనించాడు. అతను వెంటనే లేచి విక్రమ్‌కి చెప్పకుండా ఆఫీసు నుండి బయలుదేరాడు.

"వచ్చారా, కూర్చోండి కాఫీ తెస్తాను!"చాలా రోజుల తరువాత అతని కనీస అవసరాన్ని గుర్తించింది రాధిక.

"లేదు, ఏమిటో చెప్పు ముందు!" వంట గదిలోకి పోతున్న ఆమెను ఆపుతూ అడిగాడు.

"ఈరోజు ఒక గమ్మత్తు జరిగింది. హాస్పిటల్‌లో సిస్టర్ పాపకి గ్లూకోజ్ బాటిల్ అమరుస్తుండగా అది చేయిజారి కింద పడి బద్దలైంది."

ఇందులో ఏమి విశేషముందో అతనికి తోచలేదు.

“అప్పుడేమైందో తెలుసా? మన పాప ఉలిక్కిపడి పక్కకి చూసింది. ఆ సమయంలో డాక్టర్ మిత్రాగారు దాన్ని పరీక్షిస్తున్నారు. వారు పాపలోని ప్రతిస్పందనని చూసి చాలా సంతోషించారు. పాప శబ్దాలను వినగలుగుతోంది, ఇది గుడ్ ప్రోగ్రెస్!” అన్నారు. మీకు తెలుసా? శబ్దాలని వినగలిగే శక్తి ఉంటేనే వాటిని అర్థం చేసుకునే శక్తి, తిరిగి పలికే పరిజ్ఞానమూ అలవరుతుందట...!” రాధిక చెప్పుకుపోతూ ఉంది.

“నిజంగా డాక్టరుగారలా చెపుతుంటే నాకెంతో సంతోషం వేసిందండీ! సరే ఇంటికి వచ్చాక మరో సర్‌ప్రయిజ్.. మీకు చెప్పానుగా న్యూయార్క్‌లో మా పిన్ని కూతురు ఉందని–దాని దగ్గర నుండి ఈ రోజు ఒక గిఫ్ట్ వచ్చింది. రండి, చూపిస్తాను”

రాధిక అతన్ని బెడ్‌రూమ్‌లోకి లాక్కుని వెళ్లి మంచంమీద కూర్చోపెట్టింది. ఆ పక్కనే రోజ్‌వుడ్‌తో చేసిన ఉయ్యాల, ఉయ్యాలపైన ఉన్న చెక్కకి రంగురంగుల కాగితపు పూలతో చేసిన ఒక పూలగుత్తి, రాధిక ఆ పూలగుత్తి మధ్యగా ఉన్న స్విచ్‌ని నొక్కింది, సన్నగా, మృదుమధురంగా సంగీతం వినిపిస్తోంది. ఆ సంగీతానికనుగుణంగా ఆ పువ్వులు కాంతులీనుతూ గుండ్రంగా తిరుగుతున్నాయి.

ఆ ఉయ్యాలలో పడుకున్న ఎంత ఆకతాయి బిడ్డ అయినా ఆ ముగ్ధమనోహర దృశ్యానికి పరవశించిపోవలసిందే. ఎంతటి ఏడుపుగొట్టు పిల్లవాడైనా ఆ సంగీతం అందించే లాలింపులో సేదతీరవలసిందే!

రాధిక కొద్దిసేపు ఆ దృశ్యం వంక కన్నార్పకుండా చూసి, “బాగుంది కదూ!” అంది.

“ఊఁ...” అన్నాడు తను.

ఆ రోజు అతనికి రాధికలోని ఆ చిన్ని ఆనందం విచిత్రంగా భయాన్ని కలిగించింది. అతనిలో ఏదో యుద్ధం ప్రారంభమయింది. అతనిలో చెలరేగే ఆలోచనలతో అతనే పోరాడుతున్నాడు. గెలుస్తున్నాడు, ఓడిపోతున్నాడు. మనిషిలోనూ, మనసులోనూ స్థిరత్వం లేదు. ఆ రాత్రి పొద్దుపోయేవరకూ పిచ్చి పిచ్చిగా తనలో తానే మథనపడుతూ నిద్రపోయాడు. నిద్రలోనూ అవే కలవరింతలు, విక్రమ్ మాటలే తిరుగుతున్నాయి.

"ఆ వికృతరూపం కోసం, ఆ మాంసపు ముద్దకోసం ఎందుకింత తాపత్రయపడుతున్నారు మీరు? ఆ బిడ్డ బతికి ఏమి సుఖపడుతుంది? మిమ్మల్ని ఏమి సంతోషపెడుతుంది?"

"చంపెయ్! బిడ్డని చంపేయ్... చంపేయ్...!"

అంతలో కలలో మరో దృశ్యం. చిన్నగా ఊగుతున్న ఉయ్యాల, ఉయ్యాలలో పాప, రంగు రంగుల పూలకాంతుల మధ్య ఒక పెద్దతల. సన్నటి చేతులు, కాళ్లు, ఏ జన్మ పాపఫలమీబిడ్డ? ఈ పాపని ప్రేమతో దగ్గరకి తీసుకోగలడా? నో! నో! ఇన్నాళ్లూ పెంచుకున్న మమకారం ఎటుపోయిందో! తన చేతులు... చేతులు పాపకంఠాన్ని నులిమేస్తూ... నులిమేస్తూ ఉంటే–

"వద్దు, నాన్నా! వద్దు! నన్ను చంపకు! నన్ను బతకనీయి, నాన్నా! ఈ ప్రపంచంలో, ఇదుగో ఎన్ని పువ్వులు? ఎన్ని రంగులు? అమ్మ నాకంతా చూపిస్తుంది. అబ్బ ఎంత చక్కటి సంగీతం? నన్ను విననీయి నాన్నా! చంపకు!... పెనుగులాట... పెనుగులాట... పెనుగులాట..

"నో!.. నో!... నో!..." అతను పెద్దగా అరుస్తూ అదాటుగా లేచి కూర్చున్నాడు.

"ఏమయిదండీ?" ఒంటినిండా చెమటతో తడిసిపోయి, భయంతో వగరుస్తున్న అతన్ని అడిగింది రాధిక.

"నేను... నేను..." అతనేదో చెప్పబోయాడు.

ఇంతలో ఫోన్ మోగింది, "ఉండండి, నేను చూస్తాను!" రాధిక లేచి ఫోన్ అందుకుంది. అవతలినుండి ఏమి విన్నదో కానీ, తాచుపాముని చూసి బెదిరినదానిలా ఫోన్‌ని అతనికి అందించింది.

"మిస్టర్ శ్రీకాంత్! ఐ యామ్ సారీ!..." డాక్టర్ మిత్రా కంఠం. "ఇట్స్ వెరీ సారీ!.. పేరెంట్స్ కాబట్టి మీకు ఇన్‌ఫామ్ చేయక తప్పలేదు. మీరు వచ్చి మీ బేబీబాడీని తీసుకుని వెళ్లవచ్చు!"

"నో! డాక్టర్! నో!..." శ్రీకాంత్ మనసులోనే పెద్దగా అరిచాడు.

మరో నిమిషంలో అతని కారు నిర్మానుష్యంగా ఉన్న రోడ్డుమీద నుండి హాస్పిటల్ వైపుకి దూసుకుపోతోంది. ఆ కారుకంటే వేగంగా అతని మనసులో కదులుతున్న ఆలోచనలు. అతని గుండెలో పేలుతున్న వేలాది శతఘ్నులు.

“నాన్నా! నన్ను చంపకు. నాన్నా! నన్ను చంపకు!” పాప ఇంకా వేడుకుంటున్నట్టుగానే ఉంది.

“లేదమ్మా. లేదు! నిన్న చంపనమ్మా చిట్టితల్లీ! నీవు ఎలా ఉంటే నాకేమమ్మా? నీవు నా బంగారు తల్లివి, నా రక్తానివి. నా కన్నబిడ్డవి. నిన్ను ఎలా చంపుకుంటానమ్మా!” శ్రీకాంత్.

కంపిస్తున్న స్వరంతో నిశ్శబ్దంగా అనుకుంటూ

మనసులోనే కుమిలి కుమిలి ఏడ్చాడు.. ఏడ్చాడు... ఏడ్చాడు...

శ్రీకాంత్ ఎంతగా విలపించినా, దుఃఖపడినా, పశ్చాత్తాపంతో దహించుకు పోయినా చేయని నేరానికిగానూ అతని జీవిత నిఘంటువులో శిక్షని రాసి ఆ పాప ఈ లోకం నుండి నిష్క్రమించింది.

# తోటమాలి

**- అత్తలూరు విజయలక్ష్మి**

"వెంకన్నా! ఇలారా! ఇదిగో ఇక్కడ గొప్పులు తవ్వి ఈ ముద్దమందారం నాటు..." పెరట్లో నూతిగట్టు నానుకుని ఉన్న కొద్దిపాటి ఖాళీస్థలంలో నిల్చుని పిల్చింది సమీర.

"వస్తున్నానమ్మా!" వెంకన్న అప్పుడే నాటిన మల్లె అంటుమీద సున్నితంగా నీళ్లు చల్లి పెరటి వైపు వెళ్లాడు. సమీర నిల్చున్న దగ్గరకి వెళ్ళి గునపంతో జాగ్రత్తగా ఆమె చూపించిన చోటున తవ్వడం ప్రారంభించాడు.

"ఇన్ని మొక్కలు ఇంత అపురూపంగా నాటుతున్నాను. నీళ్ళు సరిగా వస్తాయో! లేదో! మొక్కలకి నీళ్లు సరిపోతాయోలేదో?" దిగులుగా అంది సమీర.

"అయ్యగారు బోరు పంపు తవ్విస్తానన్నారు కదమ్మా"

"ఆ బోర్ పంపు కొట్టి కొట్టి నీళ్లు పోయాలంటే నా వల్ల ఎక్కడవుతుంది? పంపులో నీళ్ళొస్తే ఒక పైపు పెట్టి అన్ని మొక్కలకీ నీళ్లు పెట్టచ్చు"

"బెంగెట్టుకోకండమ్మా! నేను పెడతాలెండి మొక్కలకి నీళ్లు. వేరు నాటిన చేత్తో నీళ్లు పోయనా?"

"థాంక్యూ వెంకన్నా!" వెంకన్న హామీకి సంతోషంగా కృతజ్ఞతలు చెప్పింది.

వెంకన్న తను తవ్విన చోట కొద్దిగా నీళ్ళు చల్లి భద్రంగా కాగితంలో చుట్టి తెచ్చిన ముద్ద మందారమొక్క అందులో పెట్టి మట్టి కప్పేశాడు.

మళ్లీ ఒకసారి మొక్కమీద, మట్టి మీద నీళ్ళు చల్లి పంపు దగ్గర శుభ్రంగా కాళ్ళూ, చేతులూ కడుక్కున్నాడు.

"రా వెంకన్నా! అన్నం తిను! చాలా అలసిపోయావు" సమీర ఆకులో పెరుగన్నం తీసుకొచ్చి పెట్టింది.

వెంకన్న తను ఉదయం నుంచీ నాటిన మొక్కలని తృప్తిగా మరోసారి పరిశీలించి చూసుకున్నాడు. పెరట్లో ఓ పక్కగా ఆకుకూరలు, మరోపక్క వరసగా నాటిన సొరకాయ, కాకరకాయ, బీరకాయ, టమాటా, పచ్చిమిరపకాయలు, చిక్కుడుకాయలు...

వీధి వైపు ఖాళీ స్థలంలో గేటు కిరుపక్కలా నాటిన గులాబీలు, గేటు నానుకున్న బోగన్‌విల్లా, నూరు వరహాలు...

సమీర, మేఘనాథ్‌ల బెడ్‌రూమ్ కిటికీ పక్కన నాటిన మల్లె, నైట్‌క్వీన్‌లు...

బాల్కనీలో కుండీల్లో నాటిన క్రోటన్స్... అంగుళం అంగుళంలో నాటిన రకరకాల మొక్కలతో ఆ ప్రదేశం అంతా పసిపిల్లలతో నిండినట్టు, ముద్దు ముద్దుగా కళకళలాడుతోంది.

నీళ్లలో తడిసిన మట్టి వాసన గాలిలో వ్యాపిస్తోంది. మెల్లగా ఆగి ఆగి వీస్తున్న గాలికి సున్నితంగా, ఆహ్లాదంగా ఊగుతున్నాయి పూలమొక్కలు. వెంకన్న గుండెల నిండా సంతోషం.

"వెంకన్న జీవితమంతా దాదాపు నర్సరీల్లో, మొక్కల మధ్యే గడిచిపోయింది. వృద్ధుడైన కారణంగా ఉద్యోగం వదిలేయాల్సి వచ్చింది.

అతను కష్టపడి చదివించిన కొడుకులిద్దరూ గవర్నమెంట్ ఉద్యోగాలు చేసుకుంటున్నారు. కోడళ్లు ఇంత ఉడకేసి పెడుతుంటే కృష్ణా, రామా అనుకుంటూ కాలక్షేపం చేస్తున్నాడు వెంకన్న.

అనుకోకుండా రెణ్ణెల్లక్రితం అదే వీధిలో చివరి ఇంట్లో నవదంపతులు దిగారు.

ఎవరో అమ్మితే ఆ స్థలం మేఘనాథ్ నాలుగు లక్షలకి కొనేశాడు. అతను ఇంజనీరు. అతనికి మావగారిచ్చిన ఆస్తి ఓ ఫ్యాక్టరీ. ప్లాస్టిక్ వస్తువులు తయారు చేస్తారు.

అతనికి ఫ్యాక్టరీకి క్యారేజి తీసుకెళ్లే పనికి వెంకన్న కుదిరాడు.

ఆ ఇంటి స్థలం మొత్తం మూడు వందల గజాలు... రెండు వందల గజాల్లో రెండు పడకగదులు, పెద్ద హాలు, కిచెన్ కట్టారు. వంద గజాలు ఖాళీగా ఉంది.

వెంకన్నకి ఆ ఖాళీస్థలం చూడగానే అక్కడ మొక్కలు నాటి తన పాత జీవితం మళ్ళీ వెనక్కి తీసుకోవాలనిపించింది. ఇంటి యజమానికి సంతోషం, తనకి మనశ్శాంతి, ఇంటికి అందం కలిగించే ఆ ఆలోచన వెంటనే అమ్మగారి చెవిలో వేశాడు.

సహజంగా ఆడవాళ్లందరిలో ఉండే అభిరుచి సమీరక్కూడా ఉండటం చేత వెంటనే అంగీకరించింది.

ఎక్కడ చూసినా ఆకాశ హర్మ్యాలు వెలసి, ఓ తులసి మొక్క కూడా పెట్టుకోటానికి స్థలం లేని ఫ్లాట్స్ చూసిన వెంకన్నకి సమీర ఇల్లు ఎంతో అద్భుతంగా కనిపించింది.

అక్కడికీ కళాభిరుచి ఉన్న వాళ్లు కుండీల్లో గులాబీల్లాంటివి నాటి పైన వేళ్లాడదీస్తున్నారు. అలాగే సమీర కూడా వేళ్లాడదీసింది.

"ఏవిటి ఆలోచిస్తున్నావు వెంకన్నా" సమీర హెచ్చరికతో ఉలిక్కిపడి నెమ్మదిగా కదిలి ఆకుముందు కూర్చున్నాడు.

"నాకివాళ ఆకలిగా లేదమ్మా! కడుపు నిండుగా ఉంది" అన్నాడు.

"భలేవాడివే! ఉదయం నుంచీ బాగా కష్టపడ్డావు. ఆకలి లేకపోవటమేంటి? తిను... తిను" మందలించింది సమీర.

మెల్లిగా పెరుగన్నం తిని ఆకు పారేసి, చేయి కడుక్కుని వచ్చాడు.

"నువ్వు రెస్ట్ తీసుకుని పన్నెండింటికిరా! క్యారేజీ ఇస్తాను"

"అట్టాగే తల్లీ!" వెంకన్న వెళ్లిపోయాడు.

సమీర గేటువేసి గాలికి ఊగుతోన్న మొక్కలని చూసి చిన్నగా నవ్వుకుంది.

'ఈ కనకాంబరాలు ఎప్పుడు పూలు పూస్తాయో! ఈ మల్లెమొక్క ఎప్పుడు చిగురిస్తుందో, ఆ పరిమళాలు ఎప్పుడు ఆస్వాదించాలో!

ఈ గులాబీలు విరబూసి అతిథులకి స్వాగతగీతం పాడేదెన్నడో!

ఆకులో ఆకునై పూవులో పూవునై

కొమ్మలో కొమ్మనై నునులేత రెమ్మనై'. అలలుగా తేలి వస్తోన్న సంతోష తరంగాలను అణచుకుంటూ సన్నగా కూనిరాగం తీస్తూ లోపలికెళ్లింది సమీర.

"అమ్మా! సమీరమ్మా!" వెంకన్న కేకతో ఆయాస పడుతూ వచ్చింది. నిండు చూలాలు సమీర.

"ఏమిటి వెంకన్నా! ఏమిటీ ఖంగారు?"

"చూడమ్మా! మల్లెమొగ్గ వేసింది. ఈ వేసవిలో బోలెడు మల్లెపూలు, కనకాంబరాలు కూడా ఎన్ని పూస్తున్నాయో! కోసి తల్లో పెట్టుకోమ్మా లక్ష్మీదేవిలా ఉంటావు"

"అవును వెంకన్నా! కనకాంబరాలుచాలా పూస్తున్నాయి. కానీ నాకు మాల అల్లే ఓపిక లేదు. రేపు మా అమ్మ వస్తుందిగా అన్నట్టు నేను రేపు ఊరెళ్తున్నాను. ఈ లోగా మొక్కలు..."

"నీకెందుకు తల్లీ! నేనున్నాగా! పండులాంటి బాబుని నువ్వు ఎత్తుకుని వచ్చేటప్పటికి బోలెడు పూలు, బోలెడు కూరగాయలు. తెల్లగులాబీలు చూడమ్మా ఎన్ని మొగ్గలో! రేపు ఉదయానికి అన్నీ విచ్చుకుంటాయి. తను కష్టపడి పెంచిన తోట కళకళ్లాడుతోంటే అతని గుండెలనిండా సంతోషం... కళ్లనిండా ఆ సంతోషపు నీడలు.

"చాలా సంతోషం వెంకన్నా! అన్నట్టు కాసిని పూలు తీసికెళ్లి నీ కోడలికివ్వు"

"వద్దమ్మా! నాకు చెట్టునుంచి పూలు తెంపడం ఇష్టం ఉండదు"

"మరి నన్ను తెంపుకోమన్నావుగా!"

"అది నీ ఆస్తి కదమ్మా! వద్దనటానికి నేనెవర్ని?"

సమీర చిత్రంగా చూసింది. ఆమె కళ్ళల్లో ఆప్యాయత కమ్ముకుంది.

"భలేవాడివి వెంకన్నా! స్థలమే నాది.. గోతులు తవ్వి, మొక్కలు నాటి, నీరు పోసి నీ ప్రాణంలా, నీ కంటిరెప్పలా కాపాడుకున్న ఈ తోటంతా నీ శ్రమఫలితం. ఈ ఫలితం అనుభవించే హక్కు నీకు లేదా? కనీసం దొడ్లో బెండకాయలు, కాకరకాయలన్నా తీసికెళ్లు"

"అట్టాగే తల్లీ!" వెంకన్న పెరటి వైపు వెళ్లాడు. సమీర ఉదయ కిరణాల స్పర్శకోసం వేచి చూస్తోన్న గులాబీ మొగ్గల్ని ఓసారి వేళ్లతో సున్నితంగా తాకి లోపలికెళ్లిపోయింది.

"అయ్యగారూ! అయ్యగారూ! మేఘనాథ్ హాల్లో కొచ్చాడు.

"ఎవరు నువ్వు ఏం కావాలి?" ఎదురుగా నిల్చున్న వ్యక్తిని ఆప్యాయంగా అడిగాడు.

"నేను వెంకన్న కొడుకునండీ! మా నాన్నకి బాగాలేదు. ఆస్పత్రిలో చేర్పించాను. వారం రోజులు పనికి రాలేడండీ! మీతో ఈ విషయం చెప్పి రమ్మని పంపించాడు మా నాన్న" వినయంగా అన్నాడు.

"సరేలే! ఎలాగూ అమ్మగారు లేరుకదా! నేను హోటల్లో తింటాలే ఇంతకీ ఏమైంది మీ నాన్నకి?"

"తెలీదయ్యగారూ! ఉన్నట్టుండి గుండెల్లో నొప్పని కళ్లు తిరిగి పడిపోయాడు. ఆస్పత్రికి తీసికెళితే డాక్టర్లు అక్కడే ఉంచమన్నారు నాన్నని"

"సరేలే! జాగ్రత్తగా చూసుకో! ఒక్క నిమిషం ఉండు" మేఘనాత్ లోపలికెళ్లి రెండు వందల రూపాయలు తీసుకొచ్చి అతని చేతికిచ్చాడు.

"వస్తాను సార్!" ఆ కుర్రాడు కృతజ్ఞతగా చూసి వెళ్లిపోయాడు.

మేఘనాథ్ స్నానానికి బాత్‌రూమ్‌లోకి వెళ్లిపోయాడు. అతను స్నానం చేసి వచ్చేటప్పటికి అతని బిజినెస్ పార్ట్‌నర్ మురళీధర్ కూర్చుని ఉన్నాడు.

"హలో మురళీ! గుడ్‌మార్నింగ్" మనం ఈ రోజు బాలానగర్ వెళ్లాలి గుర్తుందా!" అడిగాడు మురళి.

"ఎందుకు గుర్తులేదు... అందుకేగా రెడీ అవుతున్నాను"

"నీ కసలు బిజినెస్ బ్రెయిన్ లేదుగురూ!"

"అదేం! ఉన్నట్టుండి ఈ స్టేట్‌మెంట్ ఏవిటి?"

"వంద గజాల స్థలం  ఇలా వేస్ట్ చేశావు! నువ్వు కళాపోషకుడివా ఏం?"

"అంటే!"

"ఏంలేదు. ఈ పూలమొక్కలు, కూరగాయల మొక్కలకి ఇంత స్థలం వృధా చేశావు. నీకు మొక్కల మీద అంత శ్రద్ధ ఉంటే యూకెన్ హావ్ సమ్ ఇండోర్ ప్లాంట్స్"

"ఇదంతా నా సతీమణి ఇంట్రస్ట్" నవ్వాడు మేఘనాథ్.

"అఫ్‌కోర్స్... ప్లాంటేషన్ ఈజ్ గుడ్ హాబిట్... కానీ దానికోసం ఇంత స్థలం వృథా చేయడం బాగాలేదు. ఇవన్నీ తీసేసి, షాప్స్ కట్టించి రెంట్ కిచ్చేసెయ్... యూ విల్‌గెట్ సమ్ పగిడీ.. కమర్షియల్ టైప్ ఇన్‌స్టిట్యూట్, కంప్యూటర్స్ కోర్స్ సెంటర్ లాంటివి ఇక్కడ రన్ చేస్తే దట్ విల్ బి మోర్ బెనిఫిషియల్"

మేఘనాథ్ కళ్లు మెరిశాయి... "ఎక్సలెంట్ ఐడియా, నాకీ ఐడియా రానేలేదు"

"డబ్బు సంపాదించటానికి శతకోటి మార్గాలు.. కాకపోతే కాస్త బుర్ర ఉపయోగించాలి"

"అయితే మా వెంకన్న హాస్పిటల్ నుంచి రాగానే పీకించేస్తాను"

"వెంకన్న ఎందుకు"

"వాడేకదా! ఇవన్నీ వేసింది"

"భలే వాడివే! మొక్కలు నాటటానికి తోటమాలి కావాలిగాని, పీకటానికి తోటమాలి దేనికి? ఇంజనీరువి కదా! మెజర్‌మెంట్స్ తీసేసుకో! ఎవర్నన్నా పిలిచి అన్నీ తీసేయించేసెయ్. ఏ పనైనా అనుకున్న వెంటనే చేసేయాలి"

"యస్. యూ ఆర్ రైట్" హుషారుగా ఈల వేశాడు మేఘనాథ్.

వృద్ధుడు వెంకన్న ఆర్తితో, స్ఫూర్తితో, ఆశతో ఎంతో కష్టపడి పెంచిన తోట సరిగా రెండు గంటల్లో ఎడారిలా మారింది.

అంబరాన్ని చూస్తూన్న కనకాంబరాలు నేలరాలి ధూళిలో కలిశాయి. తనపైకి దూసుకొస్తోన్న కసాయివాణ్ణి చూసిన మల్లి భయంతో పాలిపోయి, వాలిపోయింది.

విరగబూద్దామనుకున్న విరజాజి ఆశలు అడియాశలు కాగా నిరాశతో తలవాల్చింది.

గుండె తెగిన ముద్దమందారం రక్తం కార్చింది.

రాత్రికోసం ఎదురు చూస్తోన్న నైట్‌క్వీన్ ఇంక రాత్రి లేదని తెలిసి గోడ దూకింది.

పూబాలల రోదనతో, కరుణశ్రీ వేదనతో ఆ ప్రదేశం అంతా విషాదపూరితమైంది.

ఆరు నెలల తరువాత కొద్దిగా స్వస్థత చేకూరిన వెంకన్న కర్రసాయంతో బైటికి నడిచాడు.

హాస్పిటల్‌కి దగ్గరగా ఉంటుందని, అతని కొడుకు ఇల్లు మార్చేశాడు. ఇప్పుడు సమీర ఇంటికెళ్లాంటే రెండు వీధులు దాటాలి.

రిక్షా మాట్లాడుకుని సమీర ఇంటికి బయలుదేరాడు వెంకన్న. దారిలో ఒక పెద్ద చెట్టుని నలుగురు మనుషులు కలిసి కొట్టేస్తున్నారు. పచ్చని ఆ చెట్టుని ఎందుకలా కొట్టేస్తున్నారో వెంకన్నకి అర్థం కాలేదు. అదే సంగతి రిక్షా అతణ్ణి అడిగాడు. "ఆడ పెద్ద బిల్డింగు కట్టి, కిరాయికిస్తరంట అన్నా... గుత్తేదారు ఆ జాగా కొన్నడు... అందుకే చెట్టు కొట్టించేస్తుండు" అన్నాడు తను.

వెంకన్న మనసు ఉసూరుమంది.

కొన్నాళ్ళకి ఈ మహానగరంలో స్వచ్ఛమైన గాలికి మొహం వాచిపోతారేమో ప్రజలు అనుకున్నాడు.

రిక్షా సమీర ఇల్లు సమీపించింది.

వెంకన్నకి ముందు తను దారి తప్పానేమో అని అనుమానం కలిగింది ఆ ఇల్లు చూడగానే.

ఎంతో కళాత్మకంగా తీర్చిదిద్దిన ఇల్లు ఏదోలా వుంది. పైన ఇల్లుంది. ఏవో షాపులున్నాయి.

షాపులో కూర్చున్న ఒకతనిని పిలిచి "మేఘనాథ్ గారిల్లు ఇదేనా బాబూ!" అడిగాడు.

"సందులోంచి పైకి వెళ్లు" సన్నగా ఉన్న దారి చూపించాడు అతను.

వెంకన్న నెమ్మదిగా తడబడే అడుగులతో మెట్లెక్కాడు.

రంగు రంగుల పూలతో శోభాయమానంగా ఉండాల్సిన ఇల్లు ఇదేమిటి ఇలా వుంది?

మెట్లెక్కి బాల్కనీలోకి రాగానే గోడలకి వేళ్లాడుతూ కనిపించాయి అయిదారు పూలకుండీల్లో తెల్లగులాబీలు. అప్పుడే బైటికి వచ్చింది సమీర చేతిలో బాబుతో.

"అమ్మా!" కంపిస్తోన్న స్వరంతో పిలిచాడు వెంకన్న.

"నువ్వా వెంకన్నా ! ఏవిటి ఇలా అయిపోయావు?

అరెరె... రా.. రా... ఇలా కూర్చో" సమీర ఆప్యాయంగా ఆహ్వానించింది.

"అమ్మా!" ఇదంతా... ఇల్లు... మారిపోయిందే!" సమీర నిట్టూర్చింది.

"ఏం చెప్పను వెంకన్నా! మీ అయ్యగారు చేసిన నిర్వాకం... నేను పురిటి నుంచి వచ్చేటప్పటికి ఇలా చేశారు. ఆయన ఫ్రెండెవరో స్థలం అంతా వృధా చేశామన్నారట. మొక్కలన్నీ కొట్టించేసి ఇవన్నీ కట్టించారు. కింద ఇల్లు కూడా అద్దెకిచ్చేశాం. దాదాపు పదివేల రూపాయలు నెలకి అదనంగా కళ్ల చూస్తున్నాం. మొక్కలన్నీ తీసేసినందుకు కొంచెం బాధనిపించిందనుకో, చల్లగాలి రాదని... అయినా ఎయిర్ కూలర్ కొన్నారు. వచ్చే నెల మా బెడ్‌రూమ్ ఏసి చేయిస్తానన్నారు. వెంకన్న గుండెల్లో అనిర్వచనీయమైన బాధ.

గేటు తీసి అడుగుపెట్టగానే వింత వింత పరిమళాలతో, రంగురంగుల పూలతో స్వాగత గీతం పాడుతుందనుకున్న తోట ఎంత నిర్దయగా తీసేశారు!

అమ్మగారి మాటల్లో ఎంత మాత్రం బాధ కనిపించకపోవడం మరీ బాధ కలిగించింది అతనికి.

తాను ఎంతో శ్రమపడి అపురూపంగా కాపాడిన అద్భుతమైన సంపద. మనిషిలోని భావుకుడు చచ్చిపోయి, కళాత్మకంగా బతకటం మానేసి, వ్యాపారాత్మకంగా బతకటం ప్రారంభించాడు.

"ధనమూలం మిదం జగత్" అని తాను చేసే ప్రతి పనిలో లాభం గురించి ఆలోచించే మనిషిలో ఈ సున్నితమైన భావాలకి తావెక్కడ? ఉన్నంతలో సుఖంగా ఉంటూ పరులకింత తోడ్పడదాం అన్న ఆత్మ సంతృప్తికి దూరమై ఇంకా ఇంకా

సంపాదించాలి. భాగ్యవంతులమై పోవాలి, కార్లలో తిరగాలి, విలాసవంతంగా జీవించాలి... అన్న కాంక్షకీ, కోరికలకీ బానిసైన మనిషికి తన పైశాచికత్వానికి బలైన చెట్ల హృదయఘోష ఎన్నటికి అర్థం కావాలి?

జీవితమంతా రకరకాల మొక్కల మధ్య గడిపిన అతను తను నాటిన ప్రతి మొక్క మీదా, తను కని పెంచి, పెద్ద చేసిన పిల్లల మీద ఎంత మమకారం, ఆప్యాయత, అనురాగం, ఆశలు పెంచుకుని ఉంటాడో ఆ మొక్కల మీద కూడా అదే ఆప్యాయతానురాగాలు పెంచుకుని ఉంటాడని బిజినెస్ తప్ప మరేం తెలీని ఇంజినీరు మేఘనాథ్‌కి ఎప్పుడు అర్థం కావాలి? సమీర ఒక స్త్రీ... మామూలు స్త్రీ. ఆమెకి ఆమె భర్త మాటే వేదవాక్కు...

ఇంతేకాదు, డబ్బుతో పొందే విలాసవంతమైన జీవితానికీ, కోరికలకూ, భోగాలకూ అతీతురాలేం కాదు

ఆమెక్కూడా పూల నుండి గాలి మోసుకొచ్చే పరిమళ భరితమైన చల్లదనానికన్నా ఏసిరూమే బాగుంటుంది కాబోలు.

అందుకే సహజత్వానికి దూరంగా తాను నిర్మించుకున్న కృత్రిమమైన జీవితానికి నిస్సంకోచంగా అలవాటు పడగలిగింది.

వెంకన్న నెమ్మదిగా వెనుతిరిగాడు.

"భోంచేసి వెళ్లు వెంకన్నా!"

"వద్దమ్మా! కడుపు నిండుగా ఉంది" మిమ్మల్ని చూసి పోదామని వచ్చాను. చూశాను... వెళ్లివస్తానమ్మా!"

"అలాగే వెంకన్నా! బాగా రెస్ట్ తీసుకో! అన్నట్టు కారుకొన్నాం కదా! అయ్యగారికి క్యారేజి డ్రైవర్ తీసికెళ్తున్నాడు"

"చాలా సంతోషం తల్లీ! అయ్యగారికి నమస్కారాలు చెప్పండి"

నీళ్లు నిండిన కళ్లతో ఒక్కో మెట్టే నింపాదిగా దిగసాగాడు. అతని మనసంతా భారంగా అయింది.

'ఎందుకోయీ తోటమాలీ.. అంతులేని యాతనా...' దూరంగా రేడియోలో పాత తెలుగు సినిమా పాట గాలికి తేలి వస్తూ లీలగా వినిపిస్తోంది.

# సత్యానికి చేరువగా...

- టి. శ్రీవల్లీరాధిక

"నేనూ, నా భర్త గౌతం వెంటనే బయల్దేరి వచ్చాం. ఉన్న ఊర్లోనే కాబట్టి మేము అరగంటలో వచ్చేశాం కానీ అన్నయ్య రావడానికి టైం పడుతుంది. ఇంకా నయం. అదృష్టం కొద్దీ అన్నయ్య ప్రస్తుతం బెంగుళూరులో ఉన్నాడు. అసలయితే వాడు అమెరికా నివాసి. కంపెనీ పనిమీద ప్రస్తుతం ఒక ఆరునెలలు బెంగళూరులో ఉంటున్నాడు.

అమ్మకి మొదటి నుంచీ ఏదో ఒక అనారోగ్యం. స్థూలకాయం, బి.పి... షుగరు... కీళ్లనెప్పులు, అవన్నీ కాకుండా రెండేళ్ల నుంచీ కిడ్నీ సమస్య.

కానీ నాన్న... ఈ రోజు వరకూ ఆరోగ్యంగానే ఉన్నారు. అమ్మ సంగతంతా ఆయన చూసుకునే వారు. అలాంటిది హఠాత్తుగా ఈ రోజు!

రోజూలాగే సాయంత్రం వాకింగ్‌కి వెళ్లొచ్చారట. ఏడున్నరకి సత్యం భార్య సుశీల అన్నం పెట్టిందట. పొద్దున్న తిన్నదే సరిగా అరగలేదంటూ ఒక్క ముద్దే తిన్నారట. ఆ తర్వాత అన్నం అరిగేందుకు కాబోలు ఏదో టాబ్లెట్ వేసుకుంటానంటే సుశీల ఆయనకి మంచినీళ్లు యిచ్చి వంటగదిలోకి వెళ్లిందట. అంతే, నాన్న ఒక్కసారిగా కూలబడిపోయారట. ఆ శబ్దానికీ, ఆయన పక్కనే ఉన్న అమ్మ వేసిన కేకకీ సుశీలా, సత్యం పరుగెత్తుకు వచ్చారట. కార్డియాక్ అరెస్ట్ అన్నాడట డాక్టర్.

అనాయస మరణం. ఎవరినీ యిబ్బంది పెట్టకుండా... తను బాధ పడకుండా ఆయన అలా వెళ్ళిపోవడాన్ని గురించే మాట్లాడుకుంటున్నారు అందరూ.

"బాధ్యతలన్నీ తీరిపోయాయి. పిల్లలు చక్కగా సెటిల్ అయ్యారు" ఓదార్పుతో మిళితమై వినబడుతున్న మాటలు.

నిజమే అన్నయ్య అమెరికాలో మంచి ఉద్యోగంలో ఉన్నాడు. భర్తా, పిల్లలతో హాయిగా, ఏలోటూ లేకుండా ఉన్నాను నేను. తమ్ముడు సత్యం... అన్నయ్య అంత

గొప్ప సంపాదనలో లేకపోయినా వాడి స్థితి కూడా బాగానే ఉంది. నిజానికి వాడు చిన్నప్పటి నుంచి చదువులో బాగా రాణించినవాడే. అన్నయ్యలాగా ఇంజినీరింగ్ మంచి మార్కులతో పాసైనవాడే. కాకపోతే అన్నయ్య పెద్ద కలలు కని వాటిని సాధించుకున్నాడు. సత్యం ఇండియా వదిలి వెళ్లడం యిష్టం లేదంటూ ఇక్కడే ఉండిపోయాడు.

"ఏంట్రా దేశం మీద ప్రేమా!" అని ఎవరయినా వెక్కిరిస్తే చిన్నగా నవ్వి 'అవును' అనేవాడు. దేశం మీదే కాదు అన్నిటితోను అటాచ్‌మెంట్ ఎక్కువే వాడికి. అమ్మని కూడా ప్రాణప్రదంగా చూసుకుంటాడు. ఆవిడకోసం హాస్పిటల్స్ చుట్టూ తిరగడం.. వేళకి మందులు యివ్వడం... నాన్న ఎంతగా చూసుకున్నా సత్యం కూడా చాలా సమయం కేటాయించవలసి వచ్చేది. అటు భార్యనీ, పిల్లల్నీ... అంతే ప్రేమగా చూసుకుంటాడు. నాకు చేయవలసిన పెట్టుపోతలూ శ్రద్ధగా చేస్తాడు.

అన్నయ్యకి ఎంతసేపూ తన పనులూ... ఉద్యోగం.. అంతే. పైగా గత పదిహేనేళ్లుగా వాడు విదేశాల్లోనే ఉన్నాడు. సత్యం మాత్రం ఒక్కరోజు కూడా అమ్మానాన్నలకు దూరంగా ఉండలేదిప్పటి వరకూ. ఇప్పుడీ ఎడబాటుని ఎలా తట్టుకుంటాడో!

అన్నయ్య లాగా గలగలా మాట్లాడే అలవాటు లేదు. సినిమాలు, షికార్లు లాంటి సరదాలు లేవు. ఎప్పుడు చూసినా భారతం, భాగవతం లాంటి పుస్తకాలు చదువుకుంటూ కూర్చుంటాడు. లేదంటే సుశీల చేత భక్తిగీతాలూ, పద్యాలూ పాడించుకుని వింటూ ఉంటాడు.

అన్నయ్య వీడికి పూర్తిగా విరుద్ధం. అన్నయ్య అసలు దేవుడినే నమ్మడు. పురాణాలు వగైరాలని పూర్తిగా కొట్టి పారేస్తాడు. పనే దైవం వాడికి. అందుకే అంత పైకొచ్చాడు. అంత సంపాదిస్తున్నాడు అయితే సంపాదనకి తగ్గట్టు ఖర్చు కూడా పెడతాడు. ఫ్రెండ్సు.... పార్టీలు... ప్రపంచ మంతా తిరగడాలు... అవన్నీ కూడా ఎక్కువే వాడికి.

అలాంటి సరదాలేమీ లేని సత్యం ఈ షాక్‌నుంచి తేరుకుని మనుషుల్లో పడడం కష్టమే అనిపించింది నాకు. అసలు నేను వచ్చేసరికే బాగా ఏడుస్తూ ఉంటాడేమో

అనుకున్నాను. నా దుఃఖం కన్నా ముందు వాడినెలా ఓదార్చాలా అని భయపడుతూ వచ్చాను.

గేట్ తీసుకుని లోపలికి వచ్చి అచేతనంగా పడుకుని ఉన్న నాన్నని చూడగానే ఒక్కసారిగా ఏడుపు తన్నుకొచ్చింది నాకు. అయిదు నిమిషాల తర్వాత తేరుకుని "సత్యం ఏడీ?" అంటే 'బాబాయి ఫోన్ దొరకడం లేదట. ట్రై చేస్తున్నాడు" అందిఅమ్మ.

నేను వచ్చిన కాసేపటికి మామయ్యలిద్దరూ వచ్చారు. మొత్తం కార్యక్రమమంతా వాళ్ళ చేతుల్లోకి వెళ్ళింది. ఏం చేయాలో, ఎలా చేయాలో తెలిసిన వాళ్ళు కనుక సత్యం అన్నిటికీ వాళ్లనే సలహా అడుగుతున్నాడు. అన్నయ్య వచ్చేసరికే అన్నీ సిద్ధం చేశారు. అసలు కార్యక్రమం మాత్రం అన్నయ్య చేశాడు. నిజానికి అన్నయ్యకి కర్మకాండలమీద నమ్మకమూ లేదు. ఆసక్తీ లేదు. కానీ పెద్ద కొడుకు కాబట్టి తప్పలేదు.

నాన్న శవం చూడగానే నాకన్నా ఎక్కువగా ఏడ్చేశాడు అన్నయ్య. ఆ తర్వాత కూడా కదిలిస్తే కళ్ళనీళ్ళు పెట్టుకుంటూనే ఉన్నాడు. రోజూ పొద్దున్నే చేయాల్సిన కార్యక్రమం చేసి రావడం.. అన్నం తినడం... ఇక రోజంతా దిగులు పడుతూ కూర్చోవడం... ఇదే వాడి దినచర్య.

అన్ని విషయాలూ సత్యం ఒక్కడే చూసుకుంటున్నాడు. అన్నీ సక్రమంగా, శాస్త్రోక్తంగా చేయాలని ఆరాటపడుతూ.. తెలియని విషయాలు పెద్ద వాళ్ళని అడుగుతూ... దుఃఖపడటానికి సమయమే లేనివాడిలా తిరుగుతున్నాడు సత్యం,.

ఆలోచిస్తుంటే గుర్తొస్తోంది. వాడసలు ఒక్క కన్నీటిబొట్టు కూడా జార్చలేదు నాన్న పోయాక. వాడికంటే పెద్దవాళ్ళయిన అన్నయ్యా... నేనూ మాత్రం ఎవరు పలకరించడానికొచ్చినా ఏడుస్తున్నాం. మధ్యలో ఎప్పుడో సత్యం అన్నాడు కూడాను. "అలా ఏడవకూడదక్కయ్యా, ఏడవకు" అని.

వాడలా అన్నాక, వాడి నిబ్బరం చూసి నేను కాస్త దుఃఖం తగ్గించుకున్నాను. నిజమే. పుట్టిన ప్రతివారికీ మరణం సహజమని తెలుసు. నాన్న మరణించినా... మేము బతకడమూ, మా జీవితాలు కొనసాగించడమూ తప్పదని తెలుసు. మరి ఇంక ఏడవడం ఎందుకు? ఏడవవలసిన అవసరం లేకపోయినా ఏడవడం అజ్ఞానమే కదా! ఈ రకంగా మనసుకి నచ్చచెప్పుకోవడం మొదలుపెట్టాక నా దుఃఖం కొద్దిగా తగ్గింది.

అన్నయ్య మాత్రం మొదటిరోజున ఉన్న దుఃఖం నుంచి కాస్త కూడా తేరుకోలేదు. తను సాధించలేనిదీ, తనకు చేతకానిదీ ఏమీ లేనట్లు ధీమాగా తిరిగే అన్నయ్య..... దేవుడినీ, ఋషులనీ కూడా ఎగతాళి చేస్తూ.... జోకులేస్తూ మాట్లాడే అన్నయ్య... ఒక్కసారిగా శక్తంతా లాగేసిన వాడిలా అయిపోవడం చూస్తే మొదటిరోజు చాలా బాధగా అనిపించింది. కానీ రాన్రానూ ఒకరకమైన చిరాకు కూడా మొదలయింది.

చిరాకెందుకంటే స్పష్టంగా చెప్పలేదు. కానీ కలుగుతోంది. వాడి దుఃఖం నాకు అర్థమవుతోంది. కానీ అది అనవసరమనీ అనిపిస్తోంది.

దుఃఖం ఒక్కటే కాదు. కోపంతోనూ రగిలిపోతున్నాడు అన్నయ్య. మొదటిరోజు... హడావిడి అంతా అయ్యాక, నాన్నగారు అసలు? ఎలా పోయారన్న చర్చ వచ్చింది. అన్నం తినగానే టాబ్లెట్ వేసుకున్నారని విని "ఏం టాబ్లెట్!" అని అడిగాడన్నయ్య.

నాన్నగారు వేసుకున్న టాబ్లెట్ తెచ్చి చూపించింది అమ్మ. ఈ లోపల అమెరికానుంచి వాడి ఫ్రెండ్ ఫోన్ చేశాడు. వాడిని పలకరించడానికి. అతనితో మాట్లాడగానే అన్నయ్య చాలా అసహనంగా మారిపోయాడు.

ఆ టాబ్లెట్ వలన కొంతమందికి గుండెకి సంబంధించిన యిబ్బంది కలిగే అవకాశం ఉందన్నాడట అతను. "ఏ టాబ్లెట్ పడితే ఆ టాబ్లెట్ ఎలా వేసుకోనిచ్చారసలు?" అంటూ అందరి మీదా విరుచుకుపడ్డాడు అన్నయ్య.

సుశీల నివ్వెరపోయింది. అమ్మ కల్పించుకుని "డాక్టర్ రాసిచ్చిన టాబ్లెట్టేరా అది. నాన్నగారు ఎప్పటినుంచో వేసుకుంటున్నారు" అంది.

"ఏ డాక్టర్ రాసిచ్చాడు."

"ఇంతకుముందు చిక్కడపల్లిలో ఉండగా ఒక డాక్టర్‌కి చూపించుకునే వారు కదా. ఆయన రాసిచ్చారు."

"చిక్కడపల్లి వదిలి నాలుగేళ్ళయింది. అపుడెపుడో ఎవరో చెప్పినదాన్ని యిపుడు యిష్టం వచ్చినట్లు మెడికల్ షాపులో కొనుక్కుని వేసుకుంటారా?" అన్నయ్య కస్సుమన్నాడు.

అందరం సమాధానం చెప్పలేనట్లు చూస్తుంటే... మరి కార్డియాక్ అరెస్ట్ అన్న డాక్టరెవడు?" అని గద్దించాడు మళ్ళీ.

"అది.... ఈ కాలనీలో ఉండే డాక్టరుగారు. మామయ్యగారు పడిపోగానే మీ తమ్ముడు ఆ డాక్టరు గారిని పిల్చుకొచ్చారు" సుశీల చెప్పగానే అన్నయ్య ఆ డాక్టర్ దగ్గరికి బయల్దేరాడు.

"కార్డియాక్ అరెస్ట్ అని అలా ఎలా నిర్ణయించేశాడు? అసలు నాన్న ఏం టాబ్లెట్ వేసుకున్నారో ... అది వేసుకోవచ్చో లేదో యివన్నీ చూడాలి కదా! నేను కనుక్కుంటాను" అంటూ వెళ్ళాడు.

ఆ డాక్టరు గారు ఊర్లో లేరట. ఇల్లు తాళం పెట్టి ఉంది. వెళ్ళినంత వేగంగా తిరిగి వచ్చాడు. కానీ అన్నయ్య శాంతించలేదు. "నేను దీన్ని యిలా వదలిపెట్టను. కేసు పెడతాను. ఇంత ఘోరమా!" అంటూ బాధపడుతూనే ఉన్నాడు.

ఆ గొడవంతా జరిగినపుడు సత్యం ఇంట్లో లేడు. వాడు రాగానే అన్నయ్య చాలా నిష్ఠూరంగా మాట్లాడాడు. "అమ్మావాళ్లకి అంటే తెలీదు. ఇంత చదువుకున్న వాడివి నీకన్నా తెలియాలి కదా!" అని విసుక్కున్నాడు.

'నాన్న టాబ్లెట్స్ సంగతి నేనెపుడూ పట్టించుకోలేదన్నయ్యా. నాన్నే చూసుకునేవారు" అన్నాడు సత్యం కూడా బాధపడుతూ.

"అదే... ఆ నిర్లక్ష్యం వల్లనే నాన్న పోయారు" అన్నాడు అన్నయ్య విసురుగా. "అనారోగ్యంతో చనిపోలేదు నాన్న. నీ నిర్లక్ష్యం వల్ల పోయారు."

అందరం నివ్వెరపోయాం అన్నయ్య మాటలకి. ఆ ఆరోపణ వినగానే సత్యం మొహం పాలిపోయింది.

"అవేం మాటలురా! ఊరుకో" అన్నాడు మామయ్య.

"దైవ నిర్ణయం అలా ఉంది. ఏం చేస్తాం!" అన్నాడు బాబాయ్.

అందరివైపూ నిరసనగా ఒక్క చూపు చూసి "ఛీ" అన్నాడు అన్నయ్య. "ఇదిగో యిలా మాట్లాడతారు కాబట్టే యిక్కడ డాక్టర్లు కూడా ఇంత నిర్లక్ష్యంగా ఉంటారు. అరె! ఒక ప్రాణం పోవడం అంటే ఏమిటో అర్థం అవుతోందా మీకసలు!"

అన్నయ్య పెద్ద పెద్దగా అరుస్తుంటే మాకు ఏం సమాధానం చెప్పాలో అర్థం కాలేదు. ఆవేశంలో నుంచి మళ్ళీ దుఃఖంలోకి జారిపోయాడు అన్నయ్య."ఎంత

ఘోరం! నేను దీన్ని యిలా వదిలిపెట్టను” అంటూనే ఉన్నాడు. ఆ రోజు నుంచి అందరితోనూ ముభావంగానే ఉంటున్నాడు. వాడి దృష్టిలో ఎవరు దోషో అర్థం కావడం లేదు. సత్యం మీదేనా కోపం! లేకపోతే మా అందరి తప్పూ కూడా ఉందనుకుంటున్నాడా!

నాకు అర్థం కావడం లేదు. ఇందులో నిజంగా సత్యం తప్పు ఉందా! నాన్నని తన దగ్గర ఉంచుకున్నాడు కాబట్టి సత్యమే యివన్నీ చూసుకుని ఉండాలా? మరి ఆ మాటకొస్తే నాన్నని తన దగ్గర ఉంచుకోకుండా సత్యం దగ్గర ఉంచడం అన్నయ్య నిర్లక్ష్యం కాదా! సత్యం కూడా ఆ మాట అనచ్చు కదా!

రకరకాల ఆలోచనలు, కానీ చిత్రం ఏమిటంటే అన్నయ్య ఎన్ని సూటిపోటీ మాటలు అన్నా సత్యం ఒక్కసారి కూడా నిగ్రహం కోల్పోలేదు.

మొత్తానికి కార్యక్రమాలన్నీ పూర్తయ్యాయి. చుట్టాలందరూ వెళ్ళిపోయారు. నేను కూడా మా యింటికి చేరాను. కాకపోతే రోజూ మధ్యాహ్నం పూట కాసేపు వచ్చి అమ్మ దగ్గర కూర్చుని వెళ్తున్నాను.

ఇవాళ సాయంత్రం నాలుగు గంటలకి నేను వచ్చేసరికి అమ్మ లోపలి గదిలో పడుకుని ఉంది. అన్నయ్యా, వదినా మేడమీద గదిలో ఉన్నారు. నేనిలా లోపలికి వచ్చానో లేదో, మళ్ళీ వాకిట్లో ఆటో ఆగిన శబ్దం విని, ఎవరా అని చూశాను.

శోభ!... వదినా వాళ్ళ అక్కయ్య!

శోభా వాళ్ళు కూడా అమెరికాలోనే ఉంటారు. సెలవులకి ఇండియా వచ్చారట. అమ్మని పలకరించేందుకు వచ్చినట్లుంది.

తనకి మంచినీళ్ళిస్తూ “అమ్మపడుకుంది. లేపుతాను” అన్నాను.

శోభ వారిస్తూ ‘మావారు, మా అమ్మ కూడా వస్తామన్నారు. నాకు వేరే పనుంటే చూసుకుని అక్కడినుంచి వస్తున్నాను. వాళ్ళు డైరెక్టుగా యింటినుంచి వస్తామన్నారు. వాళ్లు కూడా వచ్చాక లేపవచ్చులెండి” అంది.

అన్నయ్య వాళ్ల మామగారు సంవత్సరం కిందటే పోయారు. అప్పుడు శోభ యిక్కడికి వచ్చి, వాళ్ళ అమ్మని తనతోపాటూ అమెరికా తీసుకెళ్ళింది.

"మీ అమ్మగారు ఎలా ఉన్నారు?" అని అడిగాను.

"చాలా బెటర్" శోభ జవాబిస్తుండగా అన్నయ్య, వదిన కూడా కిందికి వచ్చారు.

అక్కడికి తీసుకువెళ్ళాక అమ్మకి అసలు తీరిక అనేది లేకుండా చేసేశాను. మొదట్లో కొన్ని రోజులు చాలా నిరాసక్తంగా కనిపించేది. కానీ ఆ తర్వాత్తర్వాత పనిలో పడి మెల్లగా ఆ ఆలోచనలన్నీ మర్చిపోయింది. మరో పక్క నించి కౌన్సిలింగ్ కూడా యిప్పించాను. కౌన్సిలింగ్‌లో చెప్పారు. మరణాన్ని ఎదుర్కోవడంలో రకరకాల స్టేజస్ ఉంటాయిట.

మొదట జరిగినదాన్ని నమ్మలేని, ఒప్పుకోలేని స్థితి. తర్వాత, ఎందుకిలా జరిగిందన్న కోపం... బాధ. అవన్నీ దాటాక అన్నిటికన్నా చివరిస్థితి – జరిగినదాన్ని అంగీకరించడం. నిజాన్ని స్వీకరించడం, అమ్మ ఇపుడు ఆ స్టేజికి వచ్చేసింది నాన్న గారి మరణాన్ని కాక ఆయన వున్నప్పటిమంచి విషయాలన్నిటినీ ఆనందంగా గుర్తు చేసుకుంటోంది."

శోభ మాటలని మేము ముగ్గురం ఆసక్తిగా విన్నాం. ఇంకా చాలా విషయాలు చెప్పింది శోభ. కౌన్సిలింగ్‌లో చెప్పినవే కాకుండా, తను కూడా కొన్ని విషయాలు గమనించిందట. ఎందుకిలా జరిగింది! నాకే ఎందుకిలా జరిగింది! అన్న బాధలోనుంచి బయటపడటంలో భాగంగా, మరణించినవారి తప్పులని వెతకడం కూడా జరుగుతుందట. ఆయన అప్పుడు అలా చేశారు. ఇప్పుడిలా చేశారు' అంటూ ఆయన దోషాలన్నిటినీ తల్చుకుని ఆయన లేకపోవడమే బాగుందని సర్ది చెప్పుకుంటారట కొందరు. తన బాధలోనుంచి బయటపడడానికి మనిషి తనకి తెలియకుండానే చేసే ప్రయత్నమట అది. వాళ్ళ అమ్మను అబ్జర్వ్ చేసినపుడు శోభకి అర్థమయిన విషయమట అది. 'అది సహజం. సత్యం' అన్నట్లు శోభ ఆ విషయాన్ని ఒక సిద్ధాంతంలా చెప్తుంటే నాకు ఆశ్చర్యంగా అనిపించింది.

చనిపోయినవారి దోషాలు తల్చుకుని, వాళ్ళు లేకపోతేనే బాగుందనుకోవడం ... కరక్టేనా! అలా ఆలోచించడం మొదలుపెడితే.. అసలు ఏ దోషం లేని మనుషులెవరుంటారు!

గరుడపురాణం చదువుతూ సత్యం, చనిపోయినవారి గుణాలే కానీ దోషాలు తలవకూడదని చెప్పడం గుర్తొచ్చింది. గొంతు సవరించుకుని నా సందేహం బయటపెట్టాను.

శోభ నవ్వింది. "దోషాలు తలవడం మంచి పద్ధతి అని చెప్పడం లేదు. మరణాన్ని యాక్సెప్ట్ చేసి, చనిపోయిన వాళ్ళ గురించి ఆనందంగా తల్చుకోవడం చివరి స్టెప్. ఆ స్టెప్‌కి చేరేముందు మనుషులు యిలాంటి స్థాయిలన్నీ దాటతారని చెప్తున్నాను" అంది.

కాసేపటికి వాళ్ళ అమ్మగారూ, శ్రీవారూ వచ్చారు. ఆవిడని చూసి ఆశ్చర్యపోయాను. నిజంగానే చాలా మారిపోయిందావిడ.

ఇదివరకటికన్నా సన్నబడింది. హుషారుగా ఉంది. గతంలో పెద్ద కుంకుమబొట్టు పెట్టుకునేది. ఇప్పుడు అంత పెద్ద బొట్టు కాకుండా చిన్నటిక్లీ పెట్టుకుంది. అందుకేనేమో నాజూగ్గా, చిన్న దానిలా కనిపిస్తోంది. చూపులకే కాదు... ప్రవర్తన లోనూ, మనస్తత్వంలోనూ కూడా పదేళ్ళు చిన్నదై పోయిందనిపించింది నాకు ఆవిడని చూస్తే.

సత్యం వెళ్ళి అమ్మని నిద్రలేపి తీసుకువచ్చాడు. మళ్లీ నాన్న మరణం గురించిన చర్చా, ఇండియాలో డాక్టర్ల నిర్లక్ష్యాల గురించిన చర్చా వచ్చాయి.

"మీ అమ్మగారిని అమెరికా తీసుకు వచ్చేయండి. కనీసం ఆవిడనన్నా జాగ్రత్తగా చూసుకోండి" అంది శోభ అన్నయ్యతో.

అన్నయ్య వాళ్ళ అత్తగారు అమ్మవైపు తిరిగి "అవునండీ.. హాయిగా అక్కడికి వచ్చేయండి. మా అమ్మాయి మిమ్మల్ని చక్కగా చూసుకుంటుంది" అంది వదిన తరుపున భరోసా యిస్తూ.

నేను గబుక్కున సత్యం వైపుచూశాను. కానీ వాడు యిదేమీ వినిపించుకోలేదు. గేటు చప్పుడవడంతో వాకిట్లోకి వెళ్ళాడు. జగన్నాథం మామయ్య వచ్చాడు. అమ్మకి చిన్నాన్న కొడుకు. అమ్మకి ఆయనంటే చాలా అభిమానం. తలుపు దాకా వచ్చిన మామయ్య యింట్లో చాలామంది ఉండటం చూసి "యిలా కూర్చుందాం రారా"

అంటూ మళ్లీ వాకిట్లోకి నడిచాడు. సత్యం రెండు కుర్చీలు తీసుకెళ్ళి మామిడిచెట్టు దగ్గర వేశాడు.

పరామర్శ ముగిసి, వదిన, శోభ, వాళ్ళ అమ్మ మామూలు కబుర్లలో పడ్డారు. అక్కడ తన దినచర్య గురించి చెప్తోంది వాళ్ళ అమ్మ. రోజూ వంట తనే చేస్తుందట. కొత్తగా నేర్చుకున్న వంటల గురించీ, చూసిన సినిమాల గురించీ, ప్రదేశాల గురించీ చెప్పింది. "జీవితాన్ని ఎలా ఆనందించాలో అమ్మకి యిపుడు బాగా అర్థమయింది" అంది శోభ నవ్వుతూ.

"నీకు తెలుసా? అమ్మ కథలు రాస్తోంది" అంది మళ్ళీ తనే.

"అవునా!" వదిన ఆశ్చర్యపోయింది.

"ఊ.. ఒక కవిత కూడా పబ్లిష్ అయింది" బ్యాగ్‌లో నుంచి పేపర్‌తీసి వదిన చేతికిస్తూ చెప్పింది. వదినకి తెలుగు చదవడం రాదు. ఒక్కక్షణం ఆ కాగితాన్ని చూసి, నాకు అందించింది.

ఆసక్తిగా చదివిన నేను నివ్వెరపోయాను. టీనేజ్ అమ్మాయి రాసిన ప్రేమ కవితలా ఉందది.

ఆ కాగితం అమ్మ చేతికిచ్చి, నేను వంటగదిలోకి నడిచాను.

సుశీల కాఫీ తయారుచేసి కప్పుల్లో పోస్తోంది. వంటగదిలో నిల్చున్నా వాళ్ళ మాటలు వినిపిస్తూనే ఉన్నాయి.

చిన్నప్పటి స్నేహితులందరితోనూ మళ్ళీ కాంటాక్ట్స్ ఏర్పడ్డాయిట ఆవిడకి. ఈ వారం అందరూ ఏదో రిసార్ట్‌లో కలుసుకునేందుకు ప్లాన్ కూడా చేసుకున్నారట.

ఇప్పటివరకూ గడిపింది జీవితమే కానట్లూ, ఏ బాధ్యతలూ లేకుండా హాయిగా తిరిగే అవకాశమున్న శేషజీవితమే స్వర్గమన్నట్లుగా మాట్లాడ్తోందావిడ.

"నీ యిష్టమమ్మా నీ యిష్టం వచ్చినట్లు ఎంజాయ్ చేయి. నీకెంత డబ్బు కావాలన్నా మేము ఇస్తాం" అని భరోసా ఇస్తున్నారు పిల్లలు.

అన్నయ్య కూడా మామయ్య వాళ్ల దగ్గరకి చేరాడు. అందరికీ కాఫీ లందించి నేనూ ఓ గ్లాసు పట్టుకుని మామయ్య వాళ్ళ పక్కనే కూర్చున్నాను.

ఈ రెండు నిమిషాల్లోనే అన్నయ్య ఏమన్నాడో కానీ.. ప్రాణం పోవడం.. ఆగడం మన చేతుల్లో ఉందా? ప్రారబ్ధం ప్రకారం జరుగుతుంది" అంటూ మామయ్య నచ్చచెప్తున్నాడు.

ఇదే మాట అన్న బాబాయ్ మీద విరుచుకుపడినట్లు. మామయ్య మీద ఎందుకో విరుచుకుపడలేదు అన్నయ్య.

మామయ్య మాటల్లో.... మాట్లాడే పద్ధతిలో ఏదో శక్తి ఉంది. నిజాన్ని నిజంగా మాట్లాడేస్తాడు. అందులో ఊగిసలాట ఉండదు.

మొన్నొకరోజు సత్యం యిదే చెప్పాడు నాతో. అమ్మకి బాగా సీరియస్ అయినపుడు ఒకసారి మామయ్య వచ్చాడట.

అమ్మ మామయ్య చేతులు పట్టుకుని "నేను వెళ్ళిపోతే నా పిల్లల్ని కాస్త కనిపెట్టుకుని ఉండు" అందట.

ఇంకొకరెవరైనా అయితే... అదేం మాట అక్కయ్యా! నీకేం కాదు" అంటారు. లేకపోతే "అయ్యో! ఎందుకు చూసుకోను! నువ్వు ప్రత్యేకంగా చెప్పాలా!" అంటారు.

మామయ్య మాత్రం "నేనేమన్నా యిక్కడ పీఠం వేసుకుని కలకాలం ఉండిపోతానా? అందరం వెళ్ళాల్సిన వాళ్ళమే కదా!" అన్నాడట.

అమ్మ మంచం పక్కన దిగులుగా కూర్చున్న సత్యానికి ఆ మాట వినగానే మనసు ఏదోలా అయ్యి వణికిందట. కానీ అదే మాటని మళ్ళీ మళ్ళీ మననం చేసుకుంటే... మెల్లమెల్లగా అందులోని నిజం అర్థమయి, మనసు గట్టిపడిందట. నాన్న పోయినపుడు కూడా వాడికి దుఃఖం రాలేదట.

మామయ్య మాటలు సత్యం మీద చూపించి నంత ప్రభావం అన్నయ్య మీద చూపించే అవకాశం లేదు కానీ... ఎందుకో అన్నయ్య కూడా మాతో మాట్లాడినంత దురుసుగా మామయ్యతో మాట్లాడటం లేదు.

అలా అని, మామయ్య మాటలు ఒప్పుకోనూ లేదు. "నేనిలా అనుకోలేను మామయ్యా" అన్నాడు కచ్చితత్వం ధ్వనించే గొంతుతో.

"కానీ అదే నిజంరా" అన్నాడు మామయ్య అంతకన్నా కచ్చితంగా.

"ఎలా మామయ్యా? చూడు, పోనీ అమ్మ విషయంలో అయితే తనకి అనారోగ్య సమస్యలున్నాయి కాబట్టి ఒకవేళ తనకి ఏమైనా జరిగినా అలా సర్ది చెప్పుకోవచ్చు. కానీ నాన్న! ఆరోగ్యంగా ఉన్న నాన్న ఉన్నట్టుండి చనిపోతే, మన చేతుల్లో ఏం లేదని ఎలా అనుకుంటాం?" అన్నాడు అన్నయ్య. ఇంత లాజిక్ లేని మాటలు మీరసలు ఎలా మాట్లాడుతారు" అని వాపోతున్నట్లుగా చూస్తూ.

మామయ్య కనీ కనిపించకుండా నవ్వి 'నాకయితే నీ ప్రశ్నలోనే సమాధానమూ కనిపిస్తోంది. అంత అనారోగ్యంతో ఉన్న అమ్మ కాకుండా ఆరోగ్యంగా ఉన్న నాన్న పోవడంలోనే... మనకి ఆ విషయం బాగా అర్థం కావాలి కదా' అన్నాడు.

అన్నయ్య ఒక్క క్షణం మాటలు రానివాడిలా చూశాడు. ఆ తర్వాత తడబడుతూ ఏదో చెప్పబోయాడు కానీ, బహుశా అది వాడికే కన్విన్సింగ్‌గా ధ్వనించలేదు.

నా ఆలోచనలు మాత్రం మామయ్య మాటల దగ్గర నిలబడిపోయాయి. ఈ పదిహేను రోజుల అనుభవాలూ ఒక్కసారి కళ్ళముందు మెదిలాయి.

మొదట్లో ఏమనుకున్నాను నేను! అటు దేవుడి దగ్గర నుంచి... ఇటు పసిపిల్లల దాకా అందరి తోనూ ప్రేమగా ఉండే సత్యం ఈ బాధ నుంచి తేరుకోలేడనుకున్నాను. ఏదీ పట్టనట్లుగా ఉండే అన్నయ్య.... దేనిమీదా నమ్మకం లేని అన్నయ్య.... మరణాన్ని అంతే తేలిగ్గా తీసుకుంటాడనుకున్నాను.

కానీ.. కానీ!

శోభ మాటలు గుర్తొచ్చాయి నాకు. దుఃఖం, నిర్లిప్తత, కోపం... ఇలాంటి స్టెప్స్ అన్నీ దాటితే గానీ ఆనందం దాకా వెళ్ళలేరన్న సిద్ధాంతం గుర్తొచ్చింది. అన్నయ్య ప్రవర్తన అలాగే ఉంది. తన బాధకి ఎవర్నో దోషుల్ని చేయాలనే ప్రయత్నం... ఒక రకంగా ఆలోచిస్తే, నాన్నకి తను ఏనాడూ ఏమీ చేయలేదన్న న్యూనత కూడా వాడి మనసులో ఏమూలో ఉందేమో! అది ఎదుటివారు ఎక్కడ ఎత్తి చూపుతారోనన్న భయమే వాడిచేత అలా మాట్లాడిస్తోందేమో!

ఇక్కడే కాదు... ఇలాంటి ధోరణులు తాతయ్య పోయినపుడు, మా మామగారు పోయినపుడు కూడా గమనించాను నేను. ఎవరు బాధ్యతగా అన్నీ చేశారో, వాళ్లనే పట్టుకుని నిష్పూచీగా ఉండేవాళ్ళు నానామాటలూ అన్నారు. అయితే ఆ సందర్భాల్లో

మాటలు పడ్డవాళ్ళు కూడా ఊరుకోలేదు. తిరగబడి పోట్లాడారు. గోల చేసుకున్నారు.

కానీ ఇక్కడ అలా కాకుండా అంతా ప్రశాంతంగా జరిగిపోవడానికి కారణం సత్యం, వాడి నిగ్రహం. ఎంత పరిపక్వతతో ప్రవర్తిస్తున్నాడు వాడు. శోభ చెప్పిన స్టెప్స్ అన్నీ వాడు మనసులోనే దాటేశాడా? లేకపోతే వాటి అవసరం లేకుండానే చివరిస్థాయికి చేరుకున్నాడా?

అవును. మేమందరం ఇంకా షాక్ నుంచి తేరుకోకముందే, వాడు జరిగినదాన్ని యాక్సెప్ట్ చేసేశాడు. అయిపోయినదాన్ని అంగీకరించి, జరగవలసిన దానిమీద దృష్టి పెట్టాడు.

ఆధ్యాత్మికత! అదే నేర్పిందా వాడికీ సూక్ష్మాన్ని! సత్యం వైపే అబ్బురంగా చూస్తూ నేను ఆలోచిస్తుండగా .. అమ్మా వాళ్ళు బయటకి వచ్చారు.

"మేము బయల్దేరతామండీ" అంది శోభ. అందరం తలలు ఊపి లేచి నిల్చున్నాం. శోభా వాళ్ళు వెళ్ళి కార్లో కూర్చున్నారు.

కారు కనుమరుగయేవరకూ హుషారుగా చేయి ఊపుతున్న అత్తగారి వైపు ఆరాధనగా చూశాడు అన్నయ్య. "అవునమ్మా, నువ్వు మాతో వచ్చేసేయి" అన్నాడు శోభ మాటల్ని మననం చేసుకుంటున్నవాడిలా తల వూపుతూ.

ఒక్క క్షణం గంభీరంగా చూసింది అమ్మవాడివైపు. ఆ తర్వాత స్పష్టంగా తడబాటు లేకుండా చెప్పింది.

"కాదులేరా, నేను సత్యం దగ్గరే ఉంటాను."

అమ్మ సమాధానం విన్న నా గుండె ఉద్వేగంతో వణికింది. ఒక్క పరుగుతో అమ్మ దగ్గరకి వెళ్ళాను. అభినందిస్తున్నట్లుగా ఆమె చేయి పట్టుకున్నాను. నీళ్లు తిరిగే కళ్ళతో అమ్మని చూస్తూ 'అవునమ్మా నువ్వు సత్యానికి దగ్గరగానే ఉండు. దూరంగా వెళ్ళకు' అనుకున్నాను.

# నాన్న

**- తెన్నేటి సుధ**

**ఒ**క్కసారి ఉలిక్కిపడి నిద్రలేచాను. ఏవో పీడకలలు... ఉదయం లేచినదగ్గర్నుంచీ మనసంతా కలతగా ఉంది. అసలు రాత్రంతా ఏవో ఆలోచనలు... కలత నిద్రలో ఎన్నెన్నో జ్ఞాపకాలు.

నిన్నట్నుంచీ పదే పదే నాన్న జ్ఞాపకం వస్తూనే ఉన్నాడు. ఇప్పుడు నాన్న ఎట్లా ఉన్నాడో - మనస్సు మూలలో ఏదో బాధ కలుక్కుమంటోంది అంత ప్రేమగా చూసుకునే నాన్నను వదిలి నేనెందుకు పారిపోయి వచ్చాను?' ఇల్లు వదిలిన ఈ పదేళ్ళలో చాలాసార్లు ప్రశ్నించుకున్నాను. ఇంటికి వెళదామని ఎన్ని వందలసార్లో అనుకున్నాను. కానీ ముఖం చెల్లలేదు. అవును, ఇంటికి పెద్దకొడుకుగా నాన్నకు నేను మానసికంగానైనా ఏం సుఖశాంతుల్నిచ్చాను?

గతం నీడలు వదలకుండా మనసును వేధిస్తూనే ఉన్నై.

నాన్న బడిపంతులు, నిజాయితీకి, మంచి తనానికి మారుపేరు మంచి టీచరుగా కూడా గుర్తింపు ఉంది.

తనకు చదువు చెప్పాలని నాన్న ఎంతగానో ప్రయత్నించారు.

బడి ఎగ్గొట్టి గోలీలు ఆడుతున్నట్లు తెలిసి మందలించారు - బుజ్జగించారు. ఉహూఁ చదువంటే ఇష్టంలేదు తనకి - అదొక నిర్బంధంగా ఉండేది.

వేరే స్కూలయితే ఎగ్గొడుతున్నానని తను పనిచేసే బళ్ళో చేర్పించాడునాన్న.

అసలప్పుడే కథ మలుపు తిరిగింది. తను నాన్న బళ్ళో చేరనన్నాడు.

ఆయన కళ్ళనీళ్ళు పెట్టుకుని, 'చదువు లేనివాళ్ళకి విలువలేదురా? నువ్వు డాక్టరువో, ఇంజినీరువో కావాలన్న పేరాశ నాకులేదు. అంత బరువు కూడా నేను మోయలేను - కనీసపు డిగ్రీ అయినా ఉండాలికదా" అన్నాడు.

ఆ ఆవేదన ఆనాడు నేనెందుకు అర్థం చేసుకోలేక పోయాను? ఒక్కసారి, ఒక్కసారి పదేళ్ళు వెనక్కి జరిగి ఆ రోజొస్తే ఎంత బాగుంటుంది?

"నాకు చదువంటే ఇష్టంలేదు" చాలా పొగరుగా జవాబు చెప్పాను.

'జీవితంలో మనిషిగా వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దడానికి చదువు చాలా అవసరం బాబూ! చదువుకోకుండా ఏం చేస్తావు చెప్పు" ఆ మాటల వెనక ఎంత ఆవేదన ఉన్నదో!

'నీకేం పన్లేదు. ఎప్పుడూ చదువు – చదువని ప్రాణాల్తింటావ్. ఈసారి చదువు మాట ఎత్తితే ఇంటికే రాను..." బెదిరించి బయటికి పరుగుతీశాను. నాలాంటి మరో నలుగురైదుగురితో కలిసి రోడ్లు పట్టుకుని తిరగడం సరదాగా ముక్కలాడటం – అట్లా గడిచిపోయేవి రోజులు.

సాధారణంగా నాన్నకి కోపం రానేరాదు. తనంటే ఎంత ప్రేమ.... యేమిటి నోటికి ఉప్పగా తగుల్తోంది. ఓహ్ కన్నీరు... తనెందుకు యేడుస్తున్నాడు?.... నాన్న ప్రేమ.... అవును ఒక్కసారి నాన్న దగ్గరికెళ్ళి చిన్నవాడై 'నాన్నా, ఇంకెప్పుడూ నిన్ను బాధపెట్టను. నీతోనే ఉండి పోతాను. అని చెప్పగలిగితే– తను ఆఫీసరవుతే...? ఫ్చ్.. లాభం లేదు.

యేదైనా పనిమీద నాన్న బయటకి వెళ్ళి ఆలస్యంగా ఇంటికి వచ్చినపుడు తను నిద్రపోతుంటే లేపేవాడు. 'నాన్నా రాజా! నీ కోసం స్వీట్ తెచ్చాను. తీసుకోమ్మా – తిని పడుకో" ఆ రాత్రి అది తినిపిస్తే గానీ ఆయనకు తృప్తిగా ఉండేది కాదు. తిన్నాక మంచినీళ్ళు తాగించి సరిగ్గా పడుకోబెట్టి దుప్పటి కప్పేవాడు. ఆ ప్రేమ విలువ నేను గుర్తించానా?

ఎట్లాగో తొమ్మిదోక్లాసుకొచ్చాను. వార్షిక పరీక్షలు – బలవంతాన నాన్న ఏదో ఒకటిరెండు పాఠాలు చెప్తుంటే ఆవులిస్తూ విన్నాను.

తెల్లారిలెక్కల పరీక్ష. ఆ లెక్కలెందుకో నాకసలు బుర్రకెక్కవు. ఆ పరీక్షకు నేను వెళ్ళలేదు.

రాత్రి 11గం॥లకు ఇల్లుచేరాను. నాన్న ఏమంటాడో అని భయంగానే ఉంది. నాన్న నాకోసం కాచుకొని ఉన్నాడు నిద్రపోకుండా.

నేను అన్నం తిని వచ్చిందాకా మాట్లాడలేదు. అట్లా గమనిస్తుండిపోయాడు. పడుకోడానికి వెళ్ళబోతూంటే అప్పుడు పిల్చాడు.

"లెక్కల పరీక్ష ఎందుకు వ్రాయలేదు?"

"నాకు లెక్కలు రావు" తల బిరుసుగా జవాబిచ్చాను.

"రాకపోతే నేర్చుకోవాలి" మృదువుగా అన్నాడు.

"నాకసలు చదువుకోవడమే ఇష్టంలేదు."

"దౌర్భాగ్యుడా! ఈసారి చదువిష్టం లేదన్న మాటంటే చంపేస్తాను", నాన్నలో సహనం కరిగిపోతోంది.

'ఈసారి నువ్వు చదువుమాట ఎత్తితే నీ ఇంట్లో ఒక్క క్షణం ఉండను" అంతకంటే పై స్థాయిలో అన్నాను.

నాన్న సహనం కరిగిపోయింది. "పండితపుత్ర అన్నమాట నిజం చేశావురా – నువ్వు చదువుకొని వృద్ధిలోకి వస్తావని ఆశపడ్డాను కానీ ఇట్లా అవుతావనుకోలేదు – నిన్నిట్లా చూసేకంటే కంటిముందు లేకపోవడమే మనశ్శాంతి...." నాన్న గొంతు గద్గదంగా పలికింది. మరుక్షణం ఆ స్వరంలో తీక్షత – "పోరా పో... ఉండి ఉద్ధరించేదేముంది?" అన్నారు. చివరిమాట ముల్లులా గుచ్చుకుంది. రోషంగా బయటకు రెండడుగులు వేశాను.

వెనుక నుంచి నాన్న స్వరంలో ఆరాటం ధ్వనించింది. "ఎక్కడికిరా?"

"నా ఇష్టమొచ్చిన చోటికి" తల ఎగరేశాను.

"చాల్లే! వచ్చి పడుకో" నాన్న ప్రేమగా కసరడం పదేళ్ళ క్రిందటైనా స్పష్టంగా గుర్తుంది.

"నేనింక రాను' – వెనకనుంచి నాన్న పిలుపు నేను వినిపించుకోలేదు.

గమ్యం లేని నడక – ఈ పదేళ్ళూ గమ్యంలేని నడకే – ఎక్కడా స్థిరత్వం లేదు. చదువుకోనందుకు కుమిలిపోని క్షణం లేదు. కడుపునిండక కాళ్ళు కడుపులో పెట్టుకున్ననాడు నాన్న మాటలే – కూలీ దొరకక ఊరూరా తిరిగినప్పుడు నాన్న మాటలే. అదృష్టముండీ యే పెళ్ళిలోనో ఒక రోజెప్పుడైనా ఒక స్వీటు దానం

దొరికిననాడూ నాన్న తలపులే. నాన్న మరపుకు రాలేదు. ఆ ఆప్యాయత, ప్రేమ ఆయన విలువ, చదువు విలువ, జీవితంలో ఒక్కొక్క అనుభవంతో బాగా తెలిసొచ్చింది. పేపర్ బాయ్‌గా స్టేషన్లో కూలీగా ఎన్నో అవతారాలు.

ఉద్యోగం చేసేవాళ్లను చూస్తుంటే నాన్న నా కోసం ఎందుకింత ఆవేదన పడేవాడో అర్థమయ్యేది.

దీనికితోడు విధి నాతో మరోసారి చెలగాటమాడింది. అన్నాళ్ళూ యే కూలీ నాలీ తోనో భుక్తి గడిచేది. కానీ రోడ్డు పక్క ఫుట్‌పాత్‌మీద పడుకున్న నేను హఠాత్తుగా మేల్కొన్నానొకరోజు. అర్ధరాత్రి – తప్ప ఆగిన లారీ డ్రైవరొకడు లారీ ఫుట్‌పాత్ మీదకి ఎక్కించాడు. ఇద్దరి ప్రాణాలు పోగా నా కుడిచెయ్యి విరిగిపోయింది.

ఆరోజు నాన్నను తలుచుకుని కుళ్ళి కుళ్ళి యేడ్చాను. అప్పట్నుంచి ఊళ్ళో వాళ్ళ దయా ధర్మాలమీద ఆధారపడడం తప్పనిసరైంది. అసలు బ్రతికేదెందుకో కూడా అర్థం కాకుండా.

మోకాళ్ళ మధ్య తలపెట్టుకుని ఎంతసేపూ ఏడుస్తూ కూర్చున్నానో – చనిపోయే లోపల నాన్నని ఒక్కసారి చూడాలన్న కోరిక తీవ్రతరమవుతోంది. ఒక్కసారి నాన్నను క్షమించమని అడగాలి. నాన్న స్పర్శలో సుఖం అనుభవించాలి. ఊరు వెళ్ళి రావాలి. ఇన్నాళ్ళ అహం కరిగిపోయింది. చాలా గాఢంగా మనసులో ఈ కోరిక మొదలైంది.

రోశయ్య 'రాజా, రాజా' అని కుదుపుతుంటే ఎర్రబడిన కళ్ళతో 'యేమిటి' అన్నట్లు చూశాను. జ్ఞాపకాలు చెదిరిపోయినై.

"తొందరగా లేవాలి" – రోశయ్య నాచెయ్యి పట్టుకుని లేపాడు. వాడి కళ్ళు ఆనందంతో వెలిగిపోతున్నై.

"సంగతేమిటి?" నిర్లిప్తంగా అడిగాను. 'హుర్రే' అని ఆనందం సూచించే ఒక కేక వేసి "ఏమిటంటావేంటి?ఎవడో దిక్కులేని చావుచచ్చాడు. దాన్దగ్గర కూచుని రెండు బుడిబుడిరాగాలు తీశానంటే డబ్బులే డబ్బులు" సంబరంగా చెప్పాడు రోశయ్య.

అయిష్టంగా, నిరాసక్తంగా రోశయ్యతో ముందుకు నడిచాను. 'ఒకరి చావు ఒకరికి పండుగా? మనస్సు చాలా ఆవేదనగా ఉంది. అడుగులు తడబడుతున్నై. యేదో అదృశ్యశక్తి నడిపిస్తున్నట్టుగా నడిచాను.

శవంమీద పూర్తిగా బట్ట కప్పి ఉంది. రోడ్డుపక్కన అనాధలాగా పడి ఉన్న ఆ శవాన్ని అప్పటికే ఆ రోడ్డున వెళ్ళే వాళ్ళు పరికించి చూస్తున్నారు. నేను శవాన్ని సమీపించాను. హఠాత్తుగా వీచినగాలికి శవం మొహం మీద బట్ట తొలగిపోయింది.

అంతే! మనస్సులో బండరాయి పెట్టినట్లయింది. ఎవరది?... నా.. నాన్న... దిగ్భ్రాంతిగా చూశాను.. అంతే, దుఃఖం కట్టలు తెంచుకుంది. ఏడుస్తూనే ఉన్నాను. ఎంత యేడ్చినా మనసులో వేదన తీరడం లేదు. రోశయ్య చుట్టూమూగిన వాళ్ళతో యేదో చెపుతున్నాడు. చిల్లరడబ్బులు రాలుతున్నై.

'భలే ఏడుస్తున్నావ్' – అన్నట్లు చూపుడువేలు, బొటనవేలు కలిపి అభినయిస్తున్నాడు రోశయ్య. నేను మధ్యలో తలెత్తి చూసినపుడు.

కొందరు – ఇది నాటకమని తరలిపోతున్నారు. క్రమంగా జనం తప్పుకున్నారు. యేడ్చి యేడ్చి సొమ్మసిల్లి పోయాను. మనసంతా శూన్యంగా ఎడారిలా ఐపోయింది.

"ఇంకా ఎంతసేపు ఆ శవాన్ని అంటిపెట్టుకునుంటావ్? మన పని ఐపోయింది. దీన్ని వదిలించుకోకపోతే లేనిపోని బెడద. అయినా ఆ దిక్కులేని శవాన్ని దగ్గర పెట్టుకొని యేదో మీ అయ్య చచ్చినట్టు నిజంగానే యేడుస్తావేం?" రోశయ్య నా వీపు తడుతూ అడిగాడు.

"చచ్చిపోయింది నిజంగా మా నాన్నే రోశయ్యా!' అతి కష్టం మీద పలికాను. నాకింకా కన్నీరు జారిపోతూనే ఉంది. కన్నీటి పొరల మధ్య దిగ్భ్రాంతితో నిలబడ్డ రోశయ్య ఒక పక్క జీవరహితంగా పడి ఉన్న నాన్న మరొక పక్క మసక మసగ్గా కనిపిస్తున్నారు....

**– (యువ జనవరి, 1983)**

# అపరిచితులు

– బలభద్రపాత్రుని రమణి

**కొ**త్తగా పెళ్ళయిన పిల్ల మొహంలో ఉండాల్సిన కళాకాంతులూ కనిపించడం లేదు మాధవి మొహంలో రావమ్మగారికి. మాధవి ఆవిడకి ఒక్కగానొక్క మనవరాలు. ఇద్దరు కొడుకులకీ కలిపి ముగ్గురు కొడుకులు. చిన్నవాడికి మాత్రం రెండోసారి ఆడపిల్ల మాధవి పుట్టింది. అబ్బురంగా పెరిగింది. దిగులు అన్నది ఎరగదు. ఇంజనీరింగ్ పాసయింది.

"అమ్మా... నీకు పెళ్ళి చెయ్యాలనుకుంటున్నాం... నీ మనసులో ఎవరన్నా ఉంటేచెప్పు." అని తండ్రి పార్థసారధి అడిగితే, మాధవి ఉలిక్కిపడింది.

"ఎవరూ లేరు నాన్నా!ఎందుకా అనుమానం వచ్చింది?" అంది.

"మీ నాన్నమ్మ అడగడం మన బాధ్యత అంది. అందుకే అడిగాను." అన్నాడాయన.

నానమ్మ ఆధునిక భావాలకి మాధవి ఆనందపడింది.

"అదేదో సంబంధాలు కంప్యూటర్లో చూస్తారట్రా. అందులో మాధవి ఫోటో పెట్టి, మనకేం కావాలో వివరంగా రాద్దాం.... ఎదురింటి రామానుజం గారి అబ్బాయికి సంబంధం అలాగే చూశారు," అంది రావమ్మగారు.

ఆవిడ చిన్నకోడలు యశోధర. "మీ బామ్మ ఎంత టెక్ అయిపోయిందో చూశావా?" మాధవితో అని ముసి ముసిగా నవ్వింది.

రోజూ నెట్‌లో ఓ పాతిక సంబంధాల దాకా చూసి ఓ సంబంధం అన్నివిధాలా బావుందని వాళ్ళని సంప్రదించాడు పార్థసారధి.

అబ్బాయికి అమెరికాలో ఉద్యోగం. నెట్‌లోనే కాదు. ఆ తరువాత స్కైప్‌లో కూడా చూసింది మాధవి. సందీప్ అందగాడు. మితభాషి, వాళ్ళ అమ్మానాన్నా,. ఇక్కడే ఉన్న ఆక్కా, బావా, వాళ్ళ పిల్లలూ వచ్చి చూశారు.

కుందరపు బొమ్మలాంటి మాధవి నచ్చింది. వెంటనే అంతా ఓ కలలాగా రెండు నెలల్లో మంచి ముహూర్తం వుందని పెళ్ళి జరిపించేశారు.

పదహారు రోజుల పండగైనా కాకుండా అబ్బాయి అమెరికా వెళ్ళిపోయాడు.

మాధవి భర్త దగ్గరకి వెళ్ళడానికి వీసా కోసం ఎదురు చూస్తోంది.

కొత్తల్లో మొగుడి మీద దిగులేమో అనుకుంది రావమ్మగారు. కానీ అమెరికా వెళ్ళడం మాట వచ్చేసరికి మాధవి మొహం చిన్నబోవడం ఆవిడ గమనించింది.

రోజూ విధిగా సందీప్ ఫోన్ చేసి మాట్లాడ్తూనే ఉన్నాడు. రావమ్మగారు కూడా అప్పుడప్పుడు మాట్లాడ్తూనే ఉన్నారు.

"అబ్బాయీ అక్కడ అరటి ఊచ దొరుకుతుందా? మా మాధవికి అరటిఊచ పెరుగుపచ్చడి చాలా యిష్టం!" అనో లేదా, "నాయనా ... అది గారాబంగా పెరిగింది. ఏదైనా తెలీక అంటే, మనసులో పెట్టుకో! అక్కడ పుట్టిల్లయినా, అత్తిల్లయినా నువ్వే!" అనో చెప్తూ ఉండేది.

"అమ్మమ్మగారూ ... మాధవికి ఏ లోటూ రానివ్వను," అని సందీప్‌చిరునవ్వుతో హామీ ఇచ్చేవాడు.

మార్చి నెలలోనే ఎండలు ఫెళ్ళుమంటున్నాయి. రాత్రి బూడిద గుమ్మడికాయ తరిగి బట్టలో వడగట్టి, తెల్లవారు ఝామునే వడియాలు పెడ్తున్న రావమ్మగారికి, మాధవి పెరట్లో అటూ ఇటూ తిరగడం కనిపించింది.

"మాధవీ! ఇంత పెందరాళే లేచావేమ్మా?" అనగానే, నిద్ర పట్టడం లేదు మామ్మా" అంటూ మాధవి పైకికొచ్చింది.

'ఏమ్మా... ఒంట్లో బాగాలేదా?" ఆవిడ ఆదుర్దాగా అడిగింది.

"బాగానే ఉంది." మాధవి ముక్తసరిగా జవాబిచ్చింది.

"ఈ మధ్య నీ వరస చూస్తూనే ఉన్నాను.. ఏవిటమ్మా దిగులు? అబ్బాయి సరిగ్గా మాట్లాడ్డం లేదా? లేక మా అందర్నీ వదిలిపెట్టి అంతదూరం వెళ్ళిపోవాల్సి వస్తుందన్న దిగులా?" ఆప్యాయంగా అడిగింది రావమ్మ.

మాధవికి కంట్లో నీళ్ళు చిప్పిల్లాయి. "మామ్మా!... అతను .. అతను.." అని ఆగిపోయింది.

"ఎవరమ్మా? మీ ఆయనా? ఏం చేశాడు?"ఆవిడ కంగారు పడింది.

"ఆ.... సందీప్... నాకు అస్సలు తెలీదు! ఒకవారం ముందు వచ్చాడు. రెండుసార్లు బయటికి వెళ్ళాం. పెళ్ళి అయి పోయింది. ఆ తరువాత.. ఇంకో వారం వున్నాడు... ఏమీ పూర్తిగా మాట్లాడుకోనే లేదు. ఇప్పుడు కూడా మాట్లాడిన దాంట్లో ఆఫీస్ విషయాలే, మన ఇంట్లో వాళ్ళ విషయాలూ మాట్లాడితే టైం అయిపోయింది. పనుందని పెట్టేస్తాడు. అతని అలవాట్లూ, అభిరుచులూ, ఫ్రెండ్స్, మూడ్స్ ఏవీ నాకు తెలీవు. అక్కడ అతను తప్ప వుండరు.. ఎంత భయంగా ఉందో తెలుసా? అదే నేను చదువుకో ఉద్యోగానికో వెళ్తుంటే ఇంత దిగులు వుండదు. నేను ఎలాగైనా ఎడ్జస్ట్ అయిపోతాను.... ఇప్పుడు తెలీని ఓ స్ట్రేంజర్‌తో ఎడ్జస్ట్ అవ్వాలి కద మామ్మా!" అంది.

రావమ్మగారు నిట్టూర్చి , "మీ ఇద్దరూ ఒకళ్ళకి ఒకళ్ళు కొత్త అంటావు. అంతేనా?" అన్నారు.

మాధవి ఔను అన్నట్లు తల ఊపింది.

"మరి శోభనం నాడు... దగ్గరవలేదా?" ఆవిడ దగ్గరగా వచ్చి అడిగింది.

"లేదు మామ్మా.. ఇద్దరం బిడియంగా , ఒకరితో ఒకరం కాలేజీ విషయాలూ అవీ మాట్లాడుకుంటుంటే... తెల్లవారి పోయింది. ఆ తరువాత రోజు నాకు ఇబ్బొందొచ్చింది. స్నానం అయ్యేసరికి తను లీవ్ లేదని వెళ్ళిపోయాడు" అని మాధవి భయంగా చుట్టూ చూసి , "ఈ విషయం అమ్మతో చెప్పకు! కంగారు పడ్తుంది... అయినా.... అస్సలు బొత్తిగా పరిచయంలేని అపరిచితుల మధ్య ఏం జరుగుతుంది? మీరు పాలు, పండ్లు పెట్టి అగరువత్తులు వెలిగించి, గదిలోకి పంపించి, అన్నీ అయిపోయాయి అనుకుంటారు" అంది మాధవి.

రావమ్మగారు భళ్ళున నవ్వింది. "ఏవన్నావ్... అపరిచితులా? మొగుడికి పెళ్ళాం, పెళ్ళానికి మొగుడూ... అపరిచితులా?" అని మళ్ళీ నవ్వి, చేతులు కడుక్కొస్తా,. ఇక్కడే కూర్చో.. ఇంట్లో వాళ్ళు లేచేలోపల ఓ కథ చెప్తా!" అని వెళ్ళింది.

మాధవి నాన్నమ్మ కోసం ఎదురుచూస్తూ 'తొందరపడి అన్ని విషయాలూ చెప్పేశానా? మామ్మ ఏవనుకుంటోందో?' అని మథన పడ్తోంది.

రావమ్మగారొచ్చి ఎదురుగా కూర్చొని, "ఇది కథ కాదు తల్లీ! మీ మామ్మ జీవితం.... విన్నాకా మొగుడూ పెళ్ళాలు ఒకరికి ఒకరు ఎప్పుడు పరిచయం అవుతారో చెప్పు!" అంది.

మాధవి శ్రద్ధగా వింటోంది.

"కావమ్మగారి రామలక్ష్మికి పెళ్ళట" అని అగ్రహారంలో చెరువు దగ్గరా, గుడి దగ్గరా, రచ్చబండ దగ్గరా ఒకటే మాట!

'ఏంతైనా సూరయ్యగారు గొప్ప సంబంధం చేస్తారు... ఆయనకి ఆస్తిపాస్తులు లేకపోయినా పలుకుబడి వుంది. మనిషికి మంచితనం ముఖ్యం అండీ డబ్బు కాదు," అన్నారు పెద్దలు.

తొక్కుడుబిళ్ళ ఆడుతుంటే రామలక్ష్మి తల్లి వచ్చి, "ఇంకా ఈ గెంతులేంటి? నీకు పెళ్ళి!" అని లోపలికి బరబరా లాక్కెళ్ళి పరికిణీ మీద ఓణీ కప్పింది.

పెళ్ళి అనగానే రామలక్ష్మికి బోలెడు ఉత్సాహం వచ్చింది. పూలజడ కుట్టారు. బోలెడు జరీ చీరలు కొన్నారు. నగలు కూడా చేయించారు. ఇల్లంతా బంధువులు, ఊరంతా హడావిడి. పడవ నడిపే నారిగాడికీ హడావిడే, పందిళ్ళేసే పోలయ్యకీ హడావిడే, పిండి వంటలు చేసే ఇరుగుపొరుగు అమ్మలకీ హడావిడే!

"మీ ఆయన ఎలా ఉంటాడే?" అంది సూరివారి గౌరి.

"ఏమో!" అంది అద్దంలో బుగ్గన చుక్క చూసుకుంటూ పదమూడేళ్ళ రామి.

మనిషికి డబ్బు కాదు, మంచితనం ప్రధానం అన్న పెద్దలంతా ముక్కున వేలేసుకునేట్లు, కట్నం దగ్గర వెయ్యి రూపాయలు సూరయ్యగారికి సర్దుబాటు కాలేదని రామి మావగారు పేచీపెట్టుకుని, తాళి కట్టిన పావుగంటకి, "బండ్లు కట్టండి... మాట తప్పిన వీరింట్లో విస్తరి వెయ్యకూడదు!" అన్నాడు.

సన్నగా అర్భకంగా వున్న పెళ్ళికొడుకు లేచి రామలక్ష్మి మొహం అయినా చూడకుండా తండ్రి వెనకాల వెళ్ళిపోయాడు.

ఆ తరువాత రామి పెద్దమనిషైంది. ఆమె అత్తారిని పేరంటానికి పిలిచాడు. వస్తాం అన్నారు. మర్యాదలూ చేసి పంపారు.

అల్లుడు ఉద్యోగం కోసం బయట వూరికి వెళ్ళాడన్నారు. ఆయన రాత్రి బండికే వచ్చేశాడు.

పదహేనేళ్ళ రామి మొగుడి కోసం ఎదురుచూసింది. అతనిరూపం గుర్తు తెచ్చుకోడానికి ప్రయత్నించింది. అస్పష్టంగా వస్తూ వస్తూ చెదిరిపోయింది. ఆమె కల కూడా కరిగిపోయింది.

బంతినాడు అత్తవారింటికి నుండి ఎవరూ రాలేదు.

సూర్యగారు ఉత్తరం రాశారు. అమ్మాయిని కాపురానికి ఎప్పుడు తీసుకెళ్తారని.

దానికి జవాబు రాలేదు.

కొన్నాళ్ళాగి భార్య పోరు మీద ఆయనే బయల్దేరి వాళ్ళ ఊరు వెళ్ళారు. వియ్యంకుడు జబ్బుగా వున్నాడు.

ఆ సమయంలో ఏమీ మాట్లాడలేక వచ్చేశారు. ఆ తరువాత ఆయన పోయాడని సూర్యగారికి కబురొచ్చింది.

అన్ని కార్యాలూ అయ్యాకా వియ్యపురాలితో, "పిల్లని కాపురానికి ఎప్పుడు పంపమా?" అని అడిగారు.

ఆవిడ మంచిరోజు చూసి చెప్తానంది.

ఆ రాత్రి కొడుకుతో మాట్లాడింది. "మీ నాన్న మూర్ఖత్వం వల్ల నట్టింట తిరగాల్సిన లక్ష్మి రాలేదు. ఇప్పటికైనా వెళ్ళి తీసుకురారా" అంది.

"నేను పట్నంలో ఉద్యోగం చేస్తున్నాను. ఇప్పుడిప్పుడే జీవితం అంటే తెలుసుకుంటున్నాను. ఆ అమ్మాయి ఎవరో? ముక్కూ మొహం కూడా నేను సరిగ్గా చూడలేదు. తాటాకు బొమ్మకి చీర కట్టినట్లు కట్టి నా పక్కన పీటల మీద కూర్చోబెట్టారు. ఆ వయసుకి పెళ్ళంటే ఏం తెలుసునని చేశారు? నాన్న భయానికి తాళి కట్టాను. వెంటనే వదిలేసి రమ్మన్నారు. ఇంకా చదువుకోవాలన్న ఆశ నెరవేరుతుందని వచ్చేశాను. నేను ఆ ఘట్టం పూర్తిగా మర్చిపోయాను. ఆ అమ్మాయినీ మర్చిపొమ్మనండి. బతుకు బావుంటుంది. నేను పట్నంలో చదువుకున్న, నాకు నచ్చిన అమ్మాయిని చూసి చేసుకుంటాను" అని విశ్వం తల్లి ఏడుపూ, మొత్తుకోళ్ళూ పట్టించుకోకుండా పట్నం వెళ్ళిపోయాడు.

మాణిక్యాంబ కొడుకు మంకుతనం గురించి ఏమీ దాచలేదు. అన్నీ విడమర్చి ఉత్తరం రాస్తూ, “మీ అమ్మాయి జీవితం బలి చేశాం. ఆ శాపం మమ్మల్ని పట్టి పీడిస్తుంది అన్నయ్యగారూ!” అని రాసింది.

రామి తల్లి కూతుర్ని కౌగలించుకుని ఏడ్చి, “నా కూతురి బతుకు బండలేనా?” అంది.

“అమ్మా... మా అత్తవారింటికి ఎప్పుడు వెళ్తానే?” అని రోజూ అడిగే రామి వెక్కిళ్ళు పెడ్తూ మూగబోయింది.

“అమ్మాయిని దింపి వద్దాం, అన్నీ సిద్ధం చెయ్యి” అన్నారు ఓ నిర్ణయానికొచ్చి సూరయ్యగారు.

రైలుబండి వేగంగా పోతుంటే, బయటకి చూస్తూ, ఎగిరే నీటి కొంగల్నీ, కొండల్నీ, తన దిగులునీ మర్చిపోయి నవ్వుతున్న కూతుర్ని సూరయ్యగారు బాధగా చూశారు. ఆయన జేబులో మాణిక్యంగారు ఇచ్చిన విశ్వం అడ్రస్ కాయితం ఉంది.

చీకటి పడ్తుండగా, స్టేషన్‌లో దిగి ఆ అడ్రస్‌కి రిక్షా కట్టించుకొని, కూతురితో భయం భయంగా వెళ్ళారు సూరయ్యగారు.

ఇల్లు తాళం పెట్టి వుంది. పక్క భాగంలో వున్న ఇంటి వాళ్ళు, వీరెవరో తెలుసుకుని లోపలికి పిలిచి మంచినీళ్ళిచ్చి, ఫలహారం పెట్టారు.

ఆ రాత్రి చాలా పొద్దుపోయాకా విశ్వం గదికొచ్చి, అక్కడున్న మావగార్నీ, రామలక్ష్మినీ చూసి తెల్లబోయాడు.

అతను లోపలికి రమ్మనలేదు.

వీళ్ళే అతని వెనకాల వెళ్ళారు.

“చూడండీ... బొమ్మలాటలా జరిగిన ఆ పెళ్ళిని మర్చిపోండి. నా దగ్గర ఆ అమ్మాయి ఏమీ సుఖపడదు. నా కిష్టంలేదు. తీసుకెళ్ళి పోండి.” అని మొహం మీద కొట్టినట్లు చెప్పేసి పడుకున్నాడు.

చాప వాల్చుకుని తండ్రీ, కూతురూ పడుకున్నారు. రామలక్ష్మికి ఏడుపు కూడా రావడం లేదు, భయం వల్ల.

తెల్లవారుఝామున సూరయ్యలేచి ప్రయాణం అవుతుంటే, "అర్థం చేసుకున్న మీరూ, మీ అమ్మాయీ వెళ్ళిపోతున్నందుకు ధన్యవాదాలు", అన్నాడు.

సూరయ్య చేతి సంచీ తీసుకుని "లేదు బాబూ! నేను వెళుతున్నాను. అది నీ పెళ్ళాం. గొంతు పిసుకుతావో, చూసుకుంటావో", అన్నాడు.

విశ్వం నిద్ర మంచంమీద నుండి అమాంతం దిగి, "ఇది గోండి... మాట... ఇలా చెయ్యకండి. ఆడపిల్ల... బతుకు బుగ్గి అయిపోతుంది. తర్వాత ఏడ్చి లాభంలేదు. తీసుకుపోండి.' అన్నాడు కంగారుగా.

"చదువుకున్న వాడివి, బుద్ధిమంతుడివి అని ఇంటివాళ్ళు చెప్పారు. పైగా దాని మెడలో మూడు ముళ్ళువేశావు. నేను కాళ్ళు కడిగి కన్యాదానం చేసేశాను... ఏం చేస్తావో, నీ ఇష్టం! వస్తాను. తల్లీ... రాజరాజేశ్వరీ దేవే నీకు రక్ష!" అని సూరయ్య వెనక్కి తిరిగి చూడకుండా వెళ్ళిపోయాడు.

"నాన్నా.... నాన్నా.. " అని రెండు అడుగులు వేసి, మళ్ళీ కాలు బయటపెడితే ఇంటికి రానివ్వడేమోనని రామలక్ష్మి అడుగు వెనక్కి తీసుకుంది.

విశ్వం అక్కడున్న తప్పేళాలు, చెక్కకుర్చీ, కోపంగా నేలకేసి కొట్టి, "బుద్ధుందా మీ నాన్నకి? నువ్వు ఆయన కన్న కూతురివేనా? లేక ఎత్తుకొచ్చాడా? ఇలా వదిలించుకుపోతున్నాడు. అసలు భయం లేదే? నీకైనా ఉండద్దా? ఏడుస్తూ నా ఇంటికి రావడం కాదు... నీ తండ్రి వెనక పరిగెత్తు" అని అరిచాడు.

రామలక్ష్మి తల వంచుకుని వెక్కిళ్ళు పెడుతూ నిలబడింది.

అతను విసుక్కుంటూ, తన పనులు పూర్తి చేసుకుని వెళ్ళిపోయాడు.

రామలక్ష్మి స్నానం చేసి, కొత్తచీర కట్టుకుని తన కూడా తెచ్చుకున్న రాజరాజేశ్వరి పటానికి దీపారాధన చేసింది.

ఇంటావిడ వచ్చి క్యారియర్ బల్ల మీద పెట్టి, "రామ్మా....అన్నం తిను," అంది.

"నాకు వద్దు" అంది బాధగా రామి.

"విశ్వం చెప్పాడు పెట్టమని" అందావిడ.

ఆ పేరు వినగానే రామి కళ్లు మెరిశాయి. 'నిజంగా....!" అంది.

"ఆ..... ఈ పూటకి భోజనం పెట్టి వాళ్ళ ఊరి బండి ఎక్కించండి" అని పదకొండు రూపాయలు ఇచ్చి వెళ్ళాడు" అందావిడ.

"నేను వెళ్ళను." అని రామి భోజనం పూర్తిచేసి, గిన్నెలు కడిగి ఆవిడకి అందించింది.

ఆరోజు విశ్వం వచ్చేసరికీ రామి అతన్ని చూసి వంటగదిలోకి వెళ్ళి మంచినీళ్ళు, తనతో తెచ్చిన ఫలహారాలు తెచ్చి ఎదురుగా పెట్టింది.

'నువ్వు ఇంకా వెళ్ళలే?" చిరాగ్గా అడిగాడు.

"కాఫీ తెస్తాను" అని లోపలికి వెళ్ళింది.

"నేను అడిగింది వినిపించిందా?" అరిచాడు.

ఆమె కాఫీ కలుపుతూ, "ఎక్కడికెళ్తానూ? ఇది నా ఇల్లు.... మీరు నా భర్త!" అంది.

"నాటకాలు ఆపు!" కాఫీ తోసేసి విశ్వం బయటకెళ్ళి పోయాడు.

రాత్రి ఎక్కడెక్కడో తిరిగి వచ్చాడు. "భోజనం చెయ్యండి." అంది రామి.

"ఇంట్లో ఏమీ లేవు...ఎలా చేశావు వంట?" అన్నాడు.

"పిన్నిగారికి నా ప్రయాణానికని డబ్బు ఇచ్చారుగా!" అంది.

"పల్లెటూరి తెలివితేటలు" పళ్ళు కొరుక్కున్నాడు.

నాలుగు రోజులు గడిచాయి. ఆమె చేతి మంచినీళ్ళు కూడా విశ్వం ముట్టుకోలేదు. ఇంటాయనా, ఇంటావిడ వచ్చి, "పిల్ల లక్షణంగా వుంది. పనీపాటలొచ్చు, బుద్ధిమంతురాలు... ఎందుకు నాయినా పంతం? నీకు ఇంకో అమ్మాయి ఎవరైనా పరిచయం అయిందా? పెళ్ళాడుతానని మాటిచ్చావా? ప్రేమ... అనీ.. ఏవైనా?" అన్నారు.

విశ్వం నీళ్ళు నములుతూ, "నాకు చదువుకున్న పిల్ల కావాలి... ఇలాంటి... అని రామలక్ష్మి వైపు చూసి ఆగిపోయాడు. పెద్ద కళ్ళతో బేలగా చూస్తోంది. పచ్చని చెంపలు చిక్కి ముక్కు ఇంకా కోటేరయినట్లుంది.

"ఒద్దు.. వెళ్ళిపోమనండి" అన్నాడు మాటలు మింగేసి.

"అలా కుదరదు బాబూ... నువ్వు అగ్నిసాక్షిగా పెళ్ళాడావు. ఇదేం వస్తువు కాదు. నచ్చకపోతే మార్చుకోవడానికి", అంది పరుషంగా ఇంటావిడ.

"మీరూ ఆవిడవైపే మాట్లాడ్తున్నారూ? ఇంక చెప్పేదేం లేదు." అన్నాడు విశ్వం.

మరునాడు మధ్యాన్నమే ఆఫీసు నుండి వచ్చేశాడు. మంచం మీద బోర్లాపడుకున్నాడు. రామి లేపాలా ఒద్దా అని తిరిగి, తిరిగి సాయంత్రం దీపాల వేళ దగ్గరికెళ్ళి, "ఏవండీ" అంది. ఆ పిలుపు కొత్తగా, ఎంతో మత్తుగా అనిపించింది ఆమెకే.

అతను లేవలేదు. ఇంకో రెండుసార్లు పిలిచి, దగ్గరకెళ్ళి సంశయిస్తూనే మీద చెయ్యివేసి, 'ఏవండీ," అంది.

అదే మొదటిసారి అతన్ని ముట్టుకోవడం, చ(రున కాలింది. జ్వరం మండిపోతోంది.

ఆమెకి కంగారేసింది. ఇంటివాళ్ళు సినిమాకి వెళ్తున్నాం అని చెప్పి, ఇంటిల్లిపాదీ జీప్‌లో వెళ్ళడం చూసింది.

వెళ్ళి కాఫీ పెట్టుకొచ్చి, మళ్ళీ లేపడానికి ప్రయత్నించింది. మగతలోనే "పాపం... చిన్నపిల్ల.." అని కలవరిస్తూ మూలిగాడు. తన పేరు విని ఆనందపడింది. ఆమె అతన్ని లేవదీసి చల్లార్చిన కాఫీ తాగించింది.

మళ్ళీపడుకున్నాడు.

మర్నాడు ఇంటాయన డాక్టర్ని పిలుచుకొచ్చి చూపిస్తే ఆయనేదో ఇంజక్షన్ చేసి, మందు బిళ్ళలు రాసి వెళ్ళాడు. పాపం, ఇంటాయనే తెచ్చి పెట్టాడు.

మూడోరోజుకి కొద్దిగా స్పృహ వచ్చినట్లు ఆమె లేపుతుంటే, "అదేవిటీ? నువ్వు లేపుతున్నావ్? నాకేమైందీ?" అన్నాడు.

"ముందు మొహం కడగండి," అని బ్రష్షు, బద్దా ఇచ్చి బేసిన్ కింద పెట్టి నీళ్ళు పెట్టి నీళ్ళు అందించింది.

అతను మొహం కడిగాకా, చారు అన్నం మెత్తగా పిసికి చెమ్చాతో పెడుతుంటే కాదనడానికి కూడా ఓపిక లేకపోయింది.

కళ్ళు మూసుకుని పడుకుంటే మాటిమాటికీ ఆమె వచ్చి నుదుటి మీదా చెయ్యివేసి చూస్తుంటే, అతనికి ఎంతో బావున్నట్లు అనిపించింది.

ఆమె పాంజేబులు ఘల్లుఘల్లు మంటుంటే, ఆమె కదిలికల్ని పడుకునే ఊహించుకోసాగాడు.

అయిదోనాడు లేచి స్నానం చేసొస్తే, పీటవేసి, కంచం పెట్టి, మొదటి ముద్దలో ఉసిరికాయ పచ్చడి కలుపుకు తినండి.... నోటికి హితవుగా ఉంటుందని నూపిండి వేసి బీరకాయ కూర చేశాను. చారు మిరియం వేసి పెట్టాను..."అని వడ్డిస్తుంటే, అతని నోటికి అమృతంలా అనిపించింది చచ్చిన జిహ్వ లేచొచ్చింది. కడుపు నిండా తిన్నాడు.

తెల్లగా ఉతికి ఆరేసిన లుంగీ, మేజోళ్ళు, తువ్వాలు, పక్కమీద చాకింటి నుండి తెచ్చిన కమ్మని వాసన వేసే దుప్పటీ! పడుకుంటే, అదే గదిలో పడుకున్న రామలక్ష్మి తలలో మల్లెపూలు నిద్ర పట్టనివ్వడం లేదు.

అదాటుగా ఇటు తిరిగి కళ్ళు తెరిస్తే, చాపమీద ఎంత పొందికగా పడుకున్నా కనిపిస్తున్న ఆమె నడుమ భాగమో... ఇటు తిరిగి పడుకుంటే బంగారంలా మెరిసిపోతున్న పొత్తికడుపు భాగం.. చాలా వింతైన ఇబ్బందికి లోనయ్యాడు విశ్వం.

తెల్లారి, "డబ్బులేవైనా ఇస్తారా సరుకులు నిండుకున్నాయి," అంది రామి అతను ఆఫీసుకు వెళ్తుంటే.

అతను అప్రయత్నంగా తీసి ఇరవై రూపాయలు అందిస్తూ, ఆమె వెళ్ళబోతుంటే, "ఆగు... " అని ఇంకో నలభై ఇచ్చి, "నువ్వు రెండు చీరలు కొనుక్కో." అన్నాడు.

"అక్కర్లేదు... అమ్మ బోలెడు ఇచ్చి పంపించింది. ఇంకో మంచం కొంటాను. కింద పడుకోవడం నాకు అలవాటు లేదు." అంది.

ఆమె వెళ్ళిపోయాకా, ఇంటాయన వచ్చి, ''ఏమయ్యా... అంతా సర్దుకున్నట్లుంది" అని ముసిముసి నవ్వులు నవ్వాడు.

"ఏమిటి సర్దుకోవడం?" ఉలిక్కి పడ్డాడు విశ్వం.

"సర్లే... కానీ! అమ్మాయి ఇంకో మంచం కావాలంది.. నా మాటవిను. ఈ నవారు మంచం తీసేసి, ఇక్కడ ఒకటే పెద్ద పట్టెమంచం వేద్దాం. వీలుగా ఉంటుంది. ఏవంటావ్?" అన్నాడాయన.

"ఎందుకూ?ఒద్దు... " అని విశ్వం ఏదో అనబోయి ఆగి పోయాడు.

సాయంత్రానికి గదిలో పట్టెమంచం, దానికో దోమతెర వచ్చింది. దిండు గలేబులకి లతలు కుట్టి ఉన్నాయి.

రామలక్ష్మి కాఫీ గ్లాసు టేబుల్ మీద పెట్టి వెళ్తుంటే అతను, "నన్ను కాస్త లేవదీస్తావా?" అన్నాడు మంచం మీద జేరగిలబడి.

"నేను లేవదియ్యడం ఏమిటీ?" ఆమె సిగ్గు పడింది.

"జ్వరం వచ్చినప్పుడు లేవదీశావుగా?" అన్నాడు.

"అప్పుడంటే.... తప్పనిసరి!" అంది.

"ఇప్పుడూ అలాగే అనుకో" అని చెయ్యి చాపాడు.

ఆమె అందుకోలేదు. తల వంచుకుంది.

అతనే చెయ్యి పట్టి లాక్కున్నాడు. తరువాత ఓనాడు, "డబ్బులు దుబారా చెయ్యొద్దు.. నా చేతికి ఇవ్వండి, నేను జాగ్రత్తచేసి బంగారం కొంటాను" ఆరిందాలా చెప్పింది రామలక్ష్మి ప్రొద్దుట, కాఫీ ఇస్తూ.

"అప్పుడే బంగారం మీద ఆశా?" నవ్వుతూ అడిగాడు విశ్వం.

"నాకు కాదు... పుట్టేవాడికి మురుగులూ, మొలతాడూ చేయించాలి!" అంది సిగ్గుపడ్తూ.

మాధవి కథ విని, మామ్మ వైపు చూస్తూ కిలకిలా నవ్వింది.

"అలా మొహం అయినా చూడని వాడి దగ్గర వదిలిపెట్టి పోయాడు మా నాన్న! మొగుడే కదా నమ్మి ఉండిపోయాను...పెళ్ళిపీటలమీద ఒకరికి ఒకరం అపరిచితులమే! కానీ... ఈ ముడి ఏ జిగురుతో, లోహంతో చేశారో కానీ... చాలా గట్టి! ఒకర్ని ఒకరం ఎన్నో ఏళ్ళుగా తెలుసని అతన్ని చూడగానే అనిపించింది! మీ

తాతయ్య ఆ తరువాత ఏనాడూ నన్ను, నేనేం చేసినా, 'ఎందుకు?' అని ప్రశ్నించలేదు. 'రామి తెలివైనది. గొప్ప సాహసవంతురాలు. నాజీవితాన్ని ఓ ఒడ్డుకి చేర్చింది.' అని వాళ్ళమ్మతో అనేవారు." అని ముగించింది రావమ్మ.

మాధవి ఎంతో ఆరాధనగా చూసింది మామ్మవైపు.

"చదువు రాదు.. ఎప్పుడూ పట్నం మొహం చూసైనా ఎరగను. నువ్వునాకు ఒద్దుపో! అనే మొగుడు... చీకట్లో చావైనా, బతుకైనా ఇతనితోనే అని వదిలిపెట్టి పోయిన తండ్రి... తిన్నావా? ఉన్నావా? అనే నాఅన్నవాళ్ళులేరు.. ఇప్పుడు చెప్పు.... అంతకన్నా భయమేసే స్థితా మీది? నాకన్నా తెలివితక్కువదానివా నువ్వు?మొగుడ్ని ఆకట్టుకోవాలి. కొంగున కట్టుకోవడం కాదు! నమ్మకం కలిగించాలి. దీని చేతుల్లో నాజీవితం నిశ్చింతగా గడిచిపోతుందని. ఆ ఓర్పూ నేర్పూ ఉంటే ఎలాంటి పరిస్థితులైనా అనుకూలంగా మలుచుకోవచ్చు."

మాధవి ఏదో చెప్పబోయి, సెల్‌ఫోన్ శబ్దానికి , "మామ్మా... సందీప్ ఫోన్ చేస్తున్నాడు... నే వెళ్తా!" అని ఉషారుగా కిందికి పరిగెత్తింది.

"పిచ్చి పిల్ల!" రావమ్మగారు నవ్వుకుంది.

ఆవిడ కిందికి వెళ్ళేసరికి, "అయామ్ వెయిటింగ్ టు సీ యు.." అని ఫోన్లో ముద్దులు పెడ్తున్న మాధవి పట్టుబడిపోయినట్లు దొంగలా మామ్మవైపు చూసింది.

ఆవిడ నవ్వుతూ, తలుపు దగ్గరేసి, "ఎక్కడున్నావయ్యా..." అని పైకి చూసి దణ్ణంపెడ్తూ, పూజామందిరం వైపు వెళ్ళింది తన దేవుడి కోసం.

# అమృతాన్ని సాధించు!

**-వారణాసి నాగలక్ష్మి**

**అ**దో అగాధం, అదో సముద్రం,

అదో అగోచర కీకారణ్యం!

హృదయం! హృదయం! హృదయం!

ఎప్పుడో విన్న లలితగీతం మనసులో మెలికలు తిరుగుతోంది.

'మనసా! కవ్వించకే నన్నిలా!' పి. సుశీలలా వేడుకుంది నీరద. 'నేనోడిపోయి గెలుపొందినానూ... గెలిచానని నవ్వనా? ఏడ్వనా?' ఎందుకు పాడిందో అలాగ? ఏ సందర్భంలో పాడిందో? ఇంతకీ తను గెలిచిందా? ఓడిందా? గెలిచాననుకుని ఓడిపోయిందా?

"నీరదా!" అవినాశ్ పిలుపుకి ఉలికిపడింది. నీరద. తనపేరు భలే పెట్టారు నాన్న. వర్షమేఘాలంటే అంత ప్రేమ ఎందుకో? దట్టమైన నల్లమబ్బులు కమ్మేసినట్టుంది. తన మానసాకాశం. ఉప్పొంగే నదులూ, ఎగిసిపడే సముద్రాలూ, ఉరిమి ఉరిమి ఒక్కసారిగా కురిసే వర్షాలూ, ముంచెత్తే ఉప్పెనలూ, దిక్కుతోచని కారడవులూ, ఎంతలోతో కూడా తెలియని అగాధాలూ... అన్నీ తన మనసులోనే ఉన్నట్టనిపించింది.

"నీరదా!"అవినాశ్ మళ్లీ పిలిచాడు గట్టిగా. పలకాలని లేదు కానీ తప్పదు. అతనికి కోపం వస్తే చాలా యాగీ చేస్తాడు. పక్కవాళ్లకి వినిపించేలా అరుస్తాడు. ఇంట్లో ఏమైనా, ఒంట్లో ఎలా ఉన్నా, నలుగురూ ఏమనుకుంటారో అని... సమాజం మెప్పుకోసం, ఒప్పుకోసం ఒంగి వొదిగి బతుకుతూ, తరతరాలుగా, పడి లేచే, లేచినా మళ్లీ పడడానికి సిద్ధపడే తరంగంలాగా, అంతరంగంలోని ఆలోచనా తరంగాలు కూడా భర్తకి ఆమోదయోగ్యంగా ఉండేలాగా తమని తాము మలచుకుంటూ... స్త్రీ లెందుకిలా బతకాలి?

"నీరదా! ఎక్కడున్నావ్" వినపడటంలేదా అరుస్తున్నా?" పెద్దగా కోపంగా వినిపించింది. అవినాశ్ పిలుపు.

చటుక్కున లేచి బాల్కనీలోంచి పడకగదిలోకి పరుగు పెట్టింది. మంచం మీద మెత్తటి నీలిరంగు రజాయి లోపల బద్దకంగా పడుకుని ఉన్నాడు అవినాశ్. భావరహితంగా అతనివైపు చూసింది. ఉబ్బిన మొహం, తాగుడెక్కువై రాత్రంతా వాంతులు చేసుకోవడంతో నీరసించిన శరీరం ఎరుపు జీరలు తేలిన ఆ కళ్లూ, ఇంకా మత్తు పూర్తిగా దిగనట్టుగా మొద్దులా పడుకుని ఉన్న ఆ భంగిమా మనసులో జుగుప్సను రేకెత్తించాయి. అర్థరాత్రి దాటాక తూలుతూ అతను ఇంట్లోకి రావడం, ఏదో అసౌకర్యాన్ని సూచిస్తూ అస్థిమితంగా  నాలుగడుగులు వేయడం, బాత్‌రూం చేరేలోపే హాల్లో కార్పెట్ మీద భళ్లున వాంతి చేసుకోవడం, తను మళ్ళీ అగాధంలోకి కూరుకుపోవడం... అంతా గుర్తొచ్చింది. నందిని పెళ్ళి క్రితం రాత్రి అయిపోయిందని గుర్తొచ్చింది. నందిని పెళ్లికి ఇద్దరూ కలిసి వెళ్ళాలని ముందుగా అనుకున్నారు. తను చక్కగా అలంకరించుకుని ఎదురు చూస్తూ కూర్చుంది... ముందు రోజు బ్యాంక్ లాకర్‌లోంచి తెచ్చిన డైమండ్  పెండెంట్ మెడలో వేసుకుని! 'పది హేను నిముషాల్లో వస్తున్నాను, రెడీగా ఉండ మని' అతను క్లినిక్ నుంచీ ఫోన్ చేశాడు. తను మనసులో అనుమానం ఉండనే ఉంది. అతని 'సమయపాలన' తనకి తెలియంది కాదు. అయినా ఈసారి తనని నిరాశపరుస్తాడని అనుకోలేదు!

ఆ ఫోన్ తర్వాత మళ్ళీ కబురులేదు అతన్నుంచి పదింటిదాకా ఎదురుచూశాక 'ఏమైపోయాడో' అని భయం మొదలైంది. మొబైల్ కనెక్షన్ దొరకలేదు. ఒకవైపు ఆగ్రహం, మరో వైపు ఆదుర్దా, కణతలు పగిలే తలనొప్పి. ఒంటి గంటకు వచ్చాడు తాగి, తూలుతూ!

'మళ్ళీనా? వొద్దు భగవంతుడా ఈ బాధ' అని తన హృదయం ఆక్రోశించింది. ఎన్నోసారి ఇలా? ఏ జన్మ తాలూకు కసి ఇతనిలా తనమీద తీర్చుకుంటున్నాడు? వైద్యుడయ్యీ ఎందుకిలా చేస్తున్నాడు? మానసికంగా తనని కుంగతీస్తూ, తన ఆరోగ్యాన్ని దిగజార్చుకుంటూ... తాగినదంతా అతను బాత్‌రూంలో వాంతులు చేసుకుంటుంటే

పూర్వంలా తను వెంట వెళ్లలేదు. అగ్నిగోళంలాంటి మనసుతో ప్రేక్షకురాలిలా చూస్తూ ఉండిపోయింది. రాత్రంతా జాగారమే!

"ఏంటలా చూస్తున్నావ్?" నవ్వు మొహం పెట్టబోయాడు అవినాశ్.

"ఏం లేదన్నట్టు తలూపింది నీరద.

"చాలా సేపట్నుండీ పిలుస్తున్నా వినిపించలే?"

"ఏదో ఆలోచనల్లో ఉన్నా"

"అబద్ధం... నా మీద కోపం వచ్చింది కదూ?"

"........"

"ఇట్రా"

మెల్లిగా కదిలి దగ్గరికి వెళ్ళింది.

పక్కన చోటు చూపిస్తూ జరిగాడు పడుకునే.

కూర్చుంది. తన కుడిచేతిని ఒడిలో పెట్టుకున్న ఆమె చేతుల మీదుగా వేశాడు.

"ఫ్రెండ్స్ బలవంత పెడితే కొంచెం తీసుకున్నా, జస్టె లిటిల్.... డిజప్పాయింట్ అయ్యావా?"

ప్రతిసారీ ఇదే సంజాయిషీ. ఇదే ప్రశ్న.

"ఆ నవ్వు చూస్తే నాకు తిక్కరే...." పదునుగా ఏదో అనబోయి, ఆగి సౌమ్యంగా "ఎందుకలా నవ్వుతావు? ఏదో ఒకసారి సోషియలైజింగ్" అన్నాడు విసుగు కనపడనీయకుండా.

కళ్లెత్తి అతని కళ్ళలోకి చూసింది నీరద. చూపులు కలపలేక గడియారం వైపు చూశాడు అవినాశ్.

"ఒకసారా"? సౌమ్యంగా అంది నీరద.

"పోనీ రెండు సార్లు"

"రెండు సార్లు కాదు అవిన్! మన పెళ్లైన తర్వాత ఈ ఆరేళ్లలో ఇరవై ఆరు సార్లు ఇలా చేశావు"

"అబ్బా! ఎప్పుడూ నిందలేస్తూ మాట్లాడతావ్" ఇంగ్లీషులో చిరాకుపడ్డాడు.

"ఇవి నిందలా? నిజం కానివి నిందలు! ఇవన్నీ నేను మరచిపోలేని బాధాకరమైన నిజాలు అవిన్! పెళ్లైన నెలకి ఇప్పుడే వస్తానని కార్లో కూర్చోపెట్టి, మాయమైపోయి, మూడు గంటల తర్వాత వచ్చావు. ఏదో వింత కారణం చెప్పావు. మొదటి పెళ్ళిరోజునాడు? ఫ్రెండ్స్‌ని ఇంటికి పిలిచి, అంతా నీ కోసం చూసి చూసి తినేసి వెళ్ళిపోయాక అర్ధరాత్రి ఇంటి కొచ్చావు. నా పుట్టినరోజున హోటల్లో పార్టీ ఇచ్చి, తాగి, అక్కడే అసహ్యంగా మా అమ్మానాన్నల గురించి నానామాటలూ అన్నావు? నా తల భూమిలోకి కుంగిపోయింది. అందరిలో తలెత్తుకోలేక..."

"నీరదా! నా సహనాన్ని పరీక్షిస్తావు! ఇద్దరు కలిసి బతకాలంటే 'గివ్ అండ్ టేక్' ఉండాలి! సర్లే.... నాకు సర్జరీ ఉంది"

చటుక్కున ఆమె పక్కనుంచీ మంచం దిగి, బాత్‌రూంలో దూరాడు. మరో పదినిమిషాల్లో హాస్పిటల్‌కి వెళ్ళిపోతాడు.! ఉసూరుమంది నీరద మనసు. అతను లేచాక ఇవ్వబోయే హామీలు, చెప్పబోయే సారీలు, అనునయ పూర్వకమైన స్పర్శ, ప్రేమ నిండిన చూపులు.... ఏమీలేవు? ఎందుకిలా అయిపోయింది జాగ్రత్తగా నిర్మించుకున్న తన జీవన సౌధం?

ఫోను మోగింది. సునంద...

"బానే ఉన్నానే".... "డల్‌గానా? అబ్బే లేదే?" "ఆఁ... సెల్ సిగ్నల్స్ లేవుట"... "ముందు కూడా ట్రై చేశాట్ట. ఇంటి ఫోన్ ఎంగేజ్ ఉందిట!"... "అనుకోకుండా వాళ్ల రూమ్మేట్ వచ్చాట్ట న్యూయార్క్ నించీ. అప్పటికప్పుడు అంతా వెళ్ళారట ఊరి బైట ఏదో క్లబ్‌కి"... "సారీ నందా. సెల్‌ఫోన్ కాంటాక్ట్ కూడా దొరక్కపోతే భయం వేసింది. ఏం చెయ్యాలో తోచలేదు" "ఊ కొంచెం... అంతెక్కువేం కాదులే".... "అబ్బే హేంగోవరేం లేదు. నార్మల్‌గానే ఉన్నాడు డోంట్ వర్రీ!"

"భోజనానికా? రాలేం అవిన్‌కి సర్జరీ ఉందట"

"........"

"వద్దులేవే. అతనితో ఏం పెట్టుకున్నా టైంకి అవదు. అతనికి టైం సెన్సు లేదు. ఎదురు చూస్తుంటే నాకు తలనొప్పి వస్తుంది! ఇంకోళ్లని వెయిట్ చేయిస్తుంటే

నాకు ఒళ్లు కాల్చుకున్నంత బాధ”

“.......”

“పిచ్చి వాగుడులాగే ఉంటుంది. నీకు. ఇవ్వాల్టికి వదిలేయ్.. ఫోన్ పెట్టేస్తున్నా. బై”

వెనక్కి తిరిగేసరికి అవినాశ్

“ఎవరు?”

“సునంద”

“రాత్రి ఫోన్ చేశావా నా మొగుడింకా ఇంటికి రాలేదని?”

“నేను చెయ్యలేదు. నందిని పెళ్ళికి వెళుతూ ‘పికప్’ చేసుకోనా అని అదే చేసింది. మనిద్దరం వస్తామని చెప్పాను. అక్కడ కలుస్తామని ఎదురు చూసి మళ్ళీ ఫోన్ చేసింది. పదిన్నరకి – డిన్నర్ చేస్తూ. అప్పటికింకా నువ్వురాలేదని చెప్పా. ఇంటికెళ్ళి పదకొండున్నరకి చేసింది. ఇంకా రాలేదు. నువ్వు. మొబైల్ ఆఫ్ చేసి పెట్టుకున్నావు!”

‘తాగొచ్చానా అని అడుగుతోంది కదూ?” ఉబ్బిన కళ్లలో కోపపు జీరలు. మెరుపు కళ్లతో, చురుగ్గా కదిలే శరీరంతో తన మనసు దోచుకున్నది. ఇతడేనా? అతడూ, ఇతడూ ఒకరేనా?

“..........”

“అదెవత్తి? మన విషయాలు దానికెందుకు?”

“అవిన్!” దెబ్బ తిన్న తాచులా చూసింది.

“మన మధ్య గొడవలు సృష్టించాలని అంత ఉబలాటం ఎందుకు?”

నిద్రలేకా, దుఃఖం వల్లా ఎర్రబడ్డ కళ్ళలో నీటిపొర కదిలింది. చురకత్తుల్లాంటి చూపులతో తర్జని చూపిస్తూ “అవిన్! అదెవరని అడుగుతున్నావు కదూ? అయిన వాళ్లందరినీ వదులుకుని, నీ ప్రేమ సర్వస్వం అనుకుని, నిన్ను పెళ్లి చేసుకుని వచ్చేస్తే నాకు అవసరమైన ఏనాడూ నువ్వు నా పక్కన లేవు! ఆఖరికి... ఆఖరికి డెలివరీ అప్పుడు కూడా హాస్పిటల్లో చేరేవరకూ ఉండి, తర్వాత నా ఖర్మానికి నన్నొదిలేసి

పోయావు సర్జరీ కేసుందని! గైనకాలజిస్టుకి పురుటి నొప్పులుండవా! కాంప్లికేషన్స్ ఏవీ రావని ఎక్కడైనా రాసుందా?... ఆ వేళ నా దగ్గరుండి నాకు ధైర్యం చెప్పింది అదే. పుట్టబోయేది 'స్టిల్ బేబీ' అని తెలియగానే 'స్టిల్ బేబీ' కోసం సిజేరియన్ కాకూడదని, దగ్గరుండి మానసికంగా, శారీరకంగా... " బుగ్గల మీద జారడానికి సిద్ధమైన కన్నీటి బిందువు జారనా, మానవా అన్నట్టు కంటికొనలో ఆగింది. తుడుచుకోవాలనిపించని వైరాగ్యం, నైరాశ్యం.

"అదే ఎన్నిసార్లు చెప్తావ్? అంత 'సెల్ఫ్‌పిటీ' ఏమిటి? మా హాస్పిటల్లో నర్సు, రోజంతా డ్యూటీ చేసి వెళ్లి, 'క్వయిట్'గా పిల్లని కంది. ప్రకృతి సహజమైన విషయానికి అంత హంగామా ఏమిటి? ఆఖరిసారి చెపుతున్నా నీరదా? నా జీవితంలో ఎవరికీ... ఎవ్వరికీ ఊడిగం చెయ్యను. ముఖ్యంగా ఏ అగ్రవర్ణపు అహంకారికీ!"

నిశ్చేష్టగా నిలుచుండిపోయింది నీరద. అతను వెళ్ళిపోయాడు. ఆమె నీరదై కరిగి పోయింది. పక్క మీదికి వొరిగిపోయింది. పక్కలెగిరి పడేలా వెక్కిళ్లు పెట్టింది. కన్నీళ్ళతో చెక్కిళ్ళు కడిగి కడిగి, అలా పడుకుని ఉండి పోయింది. పై కప్పు చూస్తూ అతని చివరి మాటలు ఆమె చెవుల్లో మళ్ళీ మళ్లీ వినిపించాయి. తను మార్చాలను కుంటున్నది ఒక వ్యక్తిని కాదు! ఒక వ్యవస్థని! అంత శక్తి తనకి లేదు! నిస్సహాయంగా, నిస్త్రాణంగా వేళ్ళాడిపోయింది.

హాస్పిటల్లో తన కాబిన్‌లో కూర్చుని ఉంది నీరద. పండుగ రోజు కావడంతో అంత రద్దీగా లేదు. సైకియాట్రిస్టు మాటలు పదే పదే గుర్తొస్తున్నాయి. నిరంజన్ ఎంబీబీయస్‌లో తన క్లాస్‌మేట్. 'అణిచివేతకి గురైన వర్గం నుంచీ ఇలాంటి బాక్‌లాష్ (backlash) సహజమే నీరదా' అతని మాటల అర్థం బోధపడ్డ కొద్దీ బాధ ఎక్కువవుతోంది. ఇది సర్దుకోవడానికి చాలా సహనం, ఓపిక కావాలట. చాలాకాలం పడుతుందిట. అంటే తన జీవితం ఈ 'రిపెయిర్ వర్క్'లో గడిచిపోతుందన్నట్టేగా! తమలాంటి వాళ్ళేగా తారా, ప్రకాశ్! ఎంత హాయిగా జీవిస్తున్నారు? తన జీవితమే ఎందుకిలా కావాలి? ఎన్ని కలలు కంది? అన్నీ నిరర్థకమేనా? గ్రీష్మంలో ప్రభాతాలు,

శరత్కాలపు వెన్నెల రాత్రులు, నది ఒడ్డున విహారాలు, ఒకరికి ఒకరై ప్రపంచాన్ని వదిలేయగల ధీమా... ఇవేవీ తనకందవన్నట్టేగా?

'నిరంజన్! ప్లీజ్! ఏదైనా చెయ్యి. అతనితో మాట్లాడు. రెండు విలువైన జీవితాలు ఇలా నిస్సారంగా గడిచిపోవాల్సిందేనా?' అడిగింది తను.

"నేనేం మాట్లాడినా విలువుండదు నీరదా? అడక్కుండా ఇచ్చే సలహాకి విలువుండదు' అన్నాడు.

'నీ విలువ తగ్గిపోతుందనన్నమాట నీ బాధ'? అలిగింది తను.

'నీరదా! అతని వైపు నుంచీ కూడా ఆలోచించడానికి ప్రయత్నించు. ఈ స్థితికి ఎదిగేలోపు ఎన్ని అవమానాలను ఎదుర్కొన్నాడో అవిన్. అతని లోపల ఏదో అగ్ని ఉంది. నీ ప్రేమతోనే దాన్ని చల్లార్చాలి'

ఏం సలహా అది? 'అతని గతం తాలూకు గాయాలలో నా ప్రమేయం ఏమిటి చెప్పు నిరంజన్' అనడిగింది తను. 'నేనతన్ని అతనుగా చూసి ప్రేమించాను. తమ సర్వస్వాన్ని ఇచ్చి పెంచిన నా తల్లిదండ్రుల్ని వదిలేసి, ఇతన్ని వరించి పెళ్ళి చేసుకున్నాను. నా తర్వాత నా చెల్లెలి గతేమిటని ఆలోచించకుండా వచ్చేశాను. ఇంతటి పిచ్చి ప్రేమకు ఇదా ఫలం? అనడిగింది.

'నీరదా! అయామ్ సారీ టు సేదిస్! అవిన్ ఏమనుకుంటున్నాడో తెలుసా? దీన్ని నువ్వొక త్యాగంగా భావిస్తున్నావని అతని అనుమానం!' అన్నాడు నిరంజన్.

'నిరంజన్! నాది ప్రేమో, త్యాగమో, మరొకటో, ప్రతిదానికీ ఓ పేరు పెట్టడానికి ఇది కథో, నవలో కాదు. నా జీవితం. నన్ను నన్నుగా చూడమను. భార్యగా ప్రేమించమను. ఆదరించమను. నా కులం ఎందుకు అతనికి? ఏ కుల వ్యవస్థ వల్ల అతను తిరస్కారానికి గురయ్యాడో ఆ కులాన్నే పట్టుకు వేళ్ళాడుతూ నా జీవితాన్నీ, తన జీవితాన్నీ ఎందుకిలా నాశనం చేస్తున్నాడు?' ఆక్రోశించింది. తను.

"హాయ్"

తెప్పరిల్లి, గుమ్మం వైపు చూసింది నీరద. నవ్వుల మల్లెలు విసురుతూ డాక్టర్ జాహ్నవి. అంత హాయిగా ఎలా నవ్వుతుందో!

"హాయ్" బదులిచ్చింది అలాగే నవ్వడానికి ప్రయత్నిస్తూ

"చిన్న సహాయం కావాలోయ్. మా పనిమనిషి కూతురు... జయప్రదా! ఇట్రా... ఆరో నెల నడుస్తుందోయ్! త్రెటెండ్ అబార్షన్ కేసు" వెనక్కి తిరిగి ఆ అమ్మాయిని పిలిచింది. పాతికేళ్ళు ఉంటాయేమో. ఆరునెలల గర్భిణీలా లేనే లేదు. లోతుకుపోయిన కళ్ళు. ఎండిన పెదవులు. వెంట నలభైలో ఉన్న పలుచని స్త్రీ. తల్లి కాబోలు. చేతిలోని కార్డు నీరదకి ఇచ్చింది.

'ఈ డాక్టరమ్మ చూస్తార్లే యాదమ్మా అన్నీ చెప్పు" అని పెద్దామెతో చెప్పి, నీరద భుజం తాకి, వెళ్ళొస్తానన్నట్టు సూచించి, హడావిడిగా వెళ్ళిపోయింది. ఆమెతో పాటే ఒక సన్నని పరిమళం కదిలిపోయింది. తనెప్పటికైనా అలా పూర్వపు నీరదలా ఉండగలుగుతుందా అనుకుంది. పక్కనున్న స్టూల్ చూపించి కూర్చోమంది జయప్రదని.

చాలా నీరసంగా, బరువు తక్కువగా ఉన్న ఆమెను చూస్తూ.

"ఏమైందమ్మా" అనునయంగా అడిగింది స్టెతస్కోపు తీస్తూ.

"ఒక్కటే సుస్తు డాక్టరమ్మా. ఒంట్లో సత్తువే లేకపోయే" మూలుగుతున్నట్టు అంది జయప్రద.

"మంచిగా తినాలి. ఆకు కూరలూ, పప్పు, గుడ్డూ..."

"డాక్టరమ్మా చెప్పిందమ్మా. పనికి పోవద్దంది. ఎట్ల గడుస్తదమ్మ?" జయప్రద మాటలు పూర్తికాకుండానే.

"మాట ఇనదమ్మా. డాక్టర్లట్టనే చెప్తరు. పనికి పోతా అంటది. గట్టిగా చెప్పు తల్లీ నీ కాల్మొక్త" వెనక నుంచీ తల్లి అందుకుంది.

"ఏమి జయప్రదా! డాక్టరమ్మ చెప్పినా ఇనవా? పనికిపోతే బిడ్డ దక్కదు. ఎబార్షనై పోవచ్చు... ఏమైంది. పడ్డావా? రక్తస్రావం ఎందుకైంది?" మెల్లగా ఆదరంగా అడిగింది నీరద. తనకు దక్కని పాపాయి గుర్తొచ్చి కలుక్కుమంది!

మాట్లాడకుండా కూర్చుంది జయప్రద. ఆమె తల్లి మెటికలు విరుస్తూ "ఆ సచ్చినోడు, దాని పెనివిటి వొట్టి ముదనష్టపోడమ్మా! తాగుడికి పైసలియ్యమని తంతడు. తాగొచ్చి, దొరమీది కోపం దానిమీద సూపిస్తడు" తన దుగ్ధంతా చెప్పబోయింది.

“ఊకో. నీకెందుకు?’ కసురుకుంది జయప్రద.

“ఆఁ నాకెందుకు? పురిటికి తీస్కపోవాలె. వైద్దెం చెపిచ్చాలె. మంచీ, చెడ్డా కాస్కోవాలె. పురుడు పోసి సొమ్ములెట్టి పంపాలె. కడుపుతున్న బిడ్డని తన్నిండని తెల్సినా ఒకమాట అనేందుకి లేదా ఏమే?” గొంతు పెంచి అడిగింది. యాదమ్మ. వినీ వినపడకుండా గొణుక్కుంది జయప్రద.

యాంత్రికంగా ఆమెని పరీక్షిస్తున్నా నీరద మనసు నిండా తేనె తుట్టెలా ముసురుతున్న ప్రశ్నలే. ఇద్దరు వ్యక్తులు కలిసి జీవితానందాన్ని, ప్రేమలో మకరందాన్ని అనుభవించడానికి అడ్డుపడేదేమిటి? తనకి పూర్వం తెలిసిన అవిన్‌కీ, భర్తగా తన ముందున్న అవినాశ్‌కీ మధ్య ఇంత తేడా ఎలా వచ్చింది? తన కులం పట్ల ఇంత ఆగ్రహం అతనికి ఉంటే తననెందుకు పెళ్ళిచేసుకున్నాడు. తన వెంట పడ్డ ప్రతిమను చేసుకోలేక పోయాడా? ఇపుడతను ఎవరి నుద్ధరించినట్టు? వ్యవస్థలోని అస్తవ్యస్థత పట్ల మనిషిలో వ్యధాగ్ని, క్రోధాగ్ని ప్రజ్వరిల్లితే, అది ఆ అస్తవ్యస్తతను సరిచేసే దిశలో చెలరేగాలి! అంతే గానీ ఆ మంట అతన్నీ, అతని కుటుంబాన్నీ దహించేసేదైతే ఉపయోగం ఏమిటి? ‘తాగొచ్చి దొరమీది కోపం దానిమీద చూపిస్తాడు’... విరక్తిగా నవ్వుకుంది. ఏ వర్గమైనా తనకన్నా బలహీనమైన వర్గాన్ని అణచేయాలనుకోవడంలో పెద్ద తేడా లేదేమో! దొర ఆమె భర్తని తంతాడు. అతనొచ్చి భార్యని కొడతాడు. ఆమె కిందకూడా ఎవరైనా పనిచేస్తుంటే వాళ్లని ఆమె కూడా నాలుగు ఉతుకుతుందేమో! అవిన్ ఈమెని చూస్తే ఏమంటాడో? అతని ఆగ్రహం ఏమవుతుందో? ఏమీ అవకపోవచ్చు! అతని ఎజెండాలో ఈ ఇష్యూ లేదేమో! ఈమె తన మొగుణ్ణి ద్వేషిస్తూ, ప్రపంచంలో భర్త హోదా వెలగబెట్టే వాళ్ళందరి పట్లా కసి పెంచుకుంటే?

“అయిందా తల్లీ! తిండికి వస్తావా?” ఎనస్థటిస్ట్ పూర్ణిమ గొంతు.

“ఎంత బాగా అడిగావు?” నవ్వి, “ఇవాళ నా లంచ్ కాంటీన్లో. పొద్దున్న వంట చెయ్యలేదు. జ్వరం వచ్చినట్టనిపించింది” తల్లీ కూతుళ్లని పంపించేస్తూ అంది నీరద.

“ఎప్పుడూ నువ్వే చేస్తావా వంట? ఒంట్లో బాలేకపోయినా? ప్రేమ వివాహమైనా వంటిల్లు స్త్రీదే అన్నమాట!” కళ్ళెగరేస్తూ అంది పూర్ణిమ.

నవ్వింది నీరద.

"జ్వరం వచ్చినపుడు కాంటిన్ తిండి తినాలి! అప్పుడు వారం రోజులు సెలవు ఇస్తారట! డయేరియాతో పాటు!" ఊరించింది పూర్ణిమ. వెనక నుంచీ సిస్టర్ నవ్వింది కిలకిలా.

"నా బాక్స్ షేర్ చేసుకోవచ్చు రావోయ్! ఇవాళ మంచికూర, మా సుబ్బు చేశాడు. ఉల్లికారం పెట్టి బెండకాయ కూర!"

"ఎంత లక్కు!"

"ఇదీ లక్కే? ఓ సోస్. మా ఇంట్లో అన్ని పన్లూ ఇద్దరం కలిసి చేసుకుంటాం. తనకి డెబ్భైవేలు వస్తుంది. నాకు పదివేలు. మీలాగా నేను డబ్బు ఖర్చుపెట్టేటప్పుడు వంద లెక్కలు వెయ్యను తెలుసా? నా మనసులో ఎపుడూ అతనివి డెబ్భైవేలు, నావి పదివేలు అనిపించదు. ఇంట్లో అన్నీ ఇద్దరినీ. బాధ్యతనే కాదు, నా హక్కులు కూడా నాకు తెలుసు! మంజరి చూడు ఒక్క సెల్ ఫోన్, అదీ ఎంతో అవసరమైంది కొనుక్కుందుకు అంత రిక్వెస్టు చెయ్యాలా అతన్ని? అతని సంపాదన తనది కూడా కాదా? తొమ్మిది నెలలు మోసి, వేవిళ్లు పడి, పురిటి నెప్పులు భరించి, పిల్లాడ్ని కన్నప్పుడు 'నా కొడుకు' అని అతను మురిసి పోలేదూ? సంసారంలో పనులన్నీ ఇద్దరూ సమానంగా చెయ్యలేరు. కానీ సర్దుకుంటే దుఃఖం, సుఖం సమానంగా పంచుకోగలరు. చెరిసగం అనే భావం ఉంటే... సంసారం, సంసారం! ప్రేమ సుధాపూరం, నవజీవన సారం, సంసారం!"

"యూ శాంగ్ బ్యూటిపుళ్ డాక్టర్!" మళయాళీ సిస్టర్ మెచ్చుకోలు. ఆలోచిస్తూ లేచి పూర్ణిమ వెంట నడిచింది నీరద.

నీరద ఇల్లు చేసేసరికి అవిన్ సాయంత్రపు క్లినిక్‌కి బయలుదేరే సమయమైంది. హాల్లో కూర్చుని టీవీ చూస్తున్నాడు. మౌనంగా గదిలోకి నడవబోయింది నీరద.

"మీ సునంద ఫోన్ చేసింది నీకోసం" చెప్పాడు అవిన్. టీవీ వెలుగులు పడి రకరకాల రంగుల్లో కనిపించిందతని మొహం.

"సరే నే చేస్తాలే" ముక్తసరిగా అంది.

"లంచ్‌కి ఇంటికొచ్చా. వంట చెయ్యలేదేం?" యథాలాపంగా అడిగినట్టు అడిగాడు.

పొద్దున్న చెప్పానుగా – ఓపిగ్గా లేదు, బయట తినెయ్యమని!"

"నువ్వు చెప్పలేదు" ఆంగ్లంలో అన్నాడు.

"చెప్పాను. ఒకసారి కాదు. రెండుసార్లు" తనూ ఆంగ్లంలో అంది.

"ఎంత మాత్రం చెప్పలేదు" గట్టిగా అన్నాడు.

"మనింట్లో ఇరవై నాలుగ్గంటలూ వీడియో రికార్డింగ్ నడుస్తూ ఉండాలి... ఎందుకంటే ఇంకే విధంగానూ నా మాటలు నిరూపించలేను" నిర్లిప్తంగా అంది నీరద.

"ఓకే లీవిట్. సునంద ఫోన్ చేసింది. రాగానే నిన్ను చెయ్యమంది"

"చేస్తాలే"

"ఇప్పుడు చెయ్యి"

"ఏమిటంత ఇది అవిన్!? నాకు తెలీదా ఎప్పుడు చెయ్యాలో? దానితో నేనేం మాట్లాడతానో తెలుసుకోవాలనా?"

"నీరదా!" గట్టిగా నవ్వాడు అవిన్. "నువ్వేం చెప్పుకున్నా నాకు లెక్కలేదు. నీకు తెలీదా ఆ విషయం? ఇలాంటి విషయాలు బయట పెట్టుకుంటే నీకే అవమానం. నాకేం పర్లేదు" ఎంత ధీమా ఆ కళ్ళలో!

"తెలుసు" నిస్తేజంగా అంది.

"బయల్దేరు. వాళ్ళింట్లో దింపి వెళ్తా క్లినిక్‌కి"

"ఎందుకు?"

"ఏమో! అడిగింది నిన్ను దింపమని. క్లినిక్ అయిపోయాక వచ్చి పికప్ చేసుకుంటా"

"నాకు వెళ్ళాలని లేదు"

"అవును. నీకు వెళ్ళాలని ఉండదు. ఇంట్లో కూర్చుని జరిగిపోయినవి తవ్వుకుంటూ ఏడుస్తూ కూర్చోవాలని ఉంటుంది!"

అతని మాటలు వినాలనిపించక గబగబా పడక గదిలోకి వెళ్ళింది. అద్దం మీద మరిచిపోయిన సెల్‌ఫోను, మూడు 'మిస్‌డ్ కాల్స్' సునంద నుంచి ఒకటి నందిని నుంచీ.

సునందకి ఫోన్ చేసింది.

"నీరూ! వేడి పకోడీలు... అల్లం టీ... 'రెండు రెళ్ళు ఆరు' డీవిడీ! వెంటనే వచ్చేయ్! ఇంకేం మాట్లాడకు. అవిన్‌ని అడిగాను సరే అన్నాడు".

'ఊ. సరే అంటాడు అనకేం చేస్తాడు? నాలోని జవసత్వాలు పీల్చేసి పడేస్తే, నీ దగ్గరకొచ్చి వాటిని నింపుకుని, మళ్ళీ అతనిముందు నవ్వుల నదిలా ప్రవహించాలిగా' కసిగా అనుకుంది. అయినా వెళ్ళాలనిపించింది. ఎదురుగా పొడవాటి రాత్రి భయపెట్టింది. వెంటనే బాత్‌రూంలో చల్లని నీటిని వేగంగా చల్లుకుంటూ మొహం కడుక్కుంది. అద్దంలో తన కళ్ళు వేరేగా కనిపించాయి. వాటిలో తళుకు లేవీ? లాభంలేదు తనను తను ప్రేమగా చూసుకోవాలి! మనసులో ఉత్సాహాన్ని సృష్టించి కళ్ళలోకి పంపింది. కాస్త నయం. మెత్తటి తువాలుతో తుడుచుకుని, మృదువుగా చేతులతో కళ్లని అదిమింది. అలవాటైన పౌడర్‌ని వదిలేసి కబోర్డ్‌లోంచి కొత్త పౌడర్ డబ్బా తీసింది. కొత్త సువాసన. 'నన్ను నేను ప్రేమించుకోవాలి!' మెత్తగా జుట్టు దువ్వుకుని, క్లిప్పు పెట్టి వదిలేసింది. కోల బొట్టు బిళ్ల అంటించుకుంది. సన్నగా కాటుక తీర్చుకుంది. 'లిఫ్ట్‌గార్డ్' రాసుకుంది. రెండు మూడు సార్లు కళ్లు చికిలించి, ఉత్సాహంగా మొహం పెట్టి చూసుకుంది. మెత్తటి ప్రింటెడ్ క్రేప్ చీర కట్టుకుని, దానితో వచ్చిన జాకెట్ వేసుకుంది.

తలుపు తీసి వచ్చేలోపు అవినాశ్ పిలిచాడు టైమైపోతోందని.

"నువ్వెళ్ళిపో అవిన్. నే వెళ్తాలే"

అవిన్ నవ్వాడు. "అంత కోపం ఎందుకమ్మా! అపుడు తాగి ఉన్నానమ్మా!" సినిమా పాట బాణీలో పాడుతూ అన్నాడు.

"అదే మరి. ఎందుకు నువ్వు తాగావమ్మా? ఎందుకలా చేశావమ్మా" అదే స్టైల్లో అంది నీరద.

"ఎందుకోలే తీరిగ్గా చెప్తా. ఇప్పుడు త్వరగా రా"

"ఎందుకో చెప్పనా అవిన్? నా మీద ఎంత ప్రేమో అంత ద్వేషం నీకు!"

నవ్వుతూనే అంది యథాలాపంగా అన్నట్టుగా.

"పోనీలే అలానే అనుకో! తరతరాల బానిస మనస్తత్వం ఒక్క తరంలో దొరలాగా మారితే తట్టుకోవడం కష్టం పాపం"

"నీదా బానిస మనస్తత్వం? భలేవాడివి! నీది దొరల మనస్తత్వం బాబూ. మగదొరల మనస్తత్వం! అదేదో సినిమాలో ఓ పాట ఉంది. 'దొరలనీకు కనుల నీరు, దొరలదీ లోకం. మగదొరలదీ లోకం' అంటూ"

"పోన్లే మన సైన్ కర్వ్ – ఈ ఎత్తులూ పల్లాలూ ఎప్పుడూ ఉన్నవే. పద పద టైమైంది"

కార్లో మెత్తగా ప్రయాణం. ఏసీ వల్లో, అవిన్ మామూలుగా ఉండడం వల్లో, చల్లని నీటితో మొహం కడగడం వల్లో నీరద మనసు కాస్త కుదుట పడింది.

గేటు దగ్గరే సునంద ఎదురైంది. నీరదని హత్తుకుని, అవిన్ వైపు తిరిగి "హలో డాక్టర్ హాండ్‌సమ్! రండి. మీ కోసం వేడి పకోడీలు ఎదురు చూస్తున్నాయి" అంది. నిన్నటి చికాకు ఇంకా కనిపిస్తోంది. ఉబ్బిన అతని కళ్ల వెనుక. బాధ కనపడకుండా నవ్వింది.

"హలో మిసెస్ స్వీట్ టాక్! సారీ.... నా క్లినిక్ టైం దాటిపోయింది. ఇంకోసారి!"

"అంత ఆలస్యం ఏం కాదు లెండి. అంతా రెడీ... అక్కడ పేషెంట్సేమోగానీ ఇక్కడ మంచి టీ వెయిట్ చేస్తోంది! జస్టె సిప్!"

"అబ్బే అయాం సారీ! మరోసారి...." కారు రివర్స్ చేసుకుని వెళ్ళిపోయాడు. లోపలికెళ్తూనే చేతుల మధ్య నీరద మొహాన్ని పట్టుకుని, నుదిటి మీద ముద్దు పెట్టుకుంది. సునంద. "చాలా బాధేసిందా నందిని పెళ్ళి మిస్సయ్యావని?"

“ఊఁ ముందే చెపితేనే వెళ్ళిపోదును కదా. అలా చెయ్యడు. ఒకోసారి కసిగా ప్రవర్తిస్తాడు. పైకి తెలియనివ్వడు. ప్రేమగా ఉన్నాడనుకుని బొక్కబోర్లాపడతాను. ఐగెట్ హర్ట్!”

నిట్టూర్చి “పోన్లే! దా. సినిమా చూద్దాం!” అని, “చుక్కమ్మా! టిఫిన్ పట్రా” అంది సునంద.

“నందూ! నువ్వే లేకపోతే ఏమైపోదునో!” సునందని చూస్తూ ఆర్ద్రంగా అంది నీరద.

“నే ఉన్నాగా! ఇంకెందుకా ఆలోచన?” నవ్వుతూ రిమోట్ నొక్కింది. సోఫాలో కూర్చుంటూ నవ్వుల జల్లు ఆరంభమైంది.

పన్నెండేళ్ల చుక్కమ్మ ప్లేట్లలో పకోడీలు, గాజుగ్లాసులో మంచి నీళ్లు ఒక ట్రేలో పెట్టి తెచ్చింది. పొట్టిగా, పీలగా ఉన్న చుక్కమ్మని చూస్తూ ‘బావున్నావా?” అనడిగింది నీరద. మనసులో అనుకుంది ‘అర్థంలేని ప్రశ్న. బడిలో చదువుకుంటూ ఉండాల్సిన పన్నెండేళ్ల పిల్ల ఇంట్లో చాకిరీ చేస్తూ ఉంటే అడగాల్సిన ప్రశ్నేనా ఇది?’ అని.

“ఆఁ” వినయంగా తలూపి, లోపలికెళ్ళింది చుక్కమ్మ.

“నందూ! ఎందుకే ఇలా చైల్డ్ లేబర్... మంచిది కాదే”

“పోవే. వాళ్ల కవసరం నాకు వీలు. మళ్ళీ నీసోది మొదలెట్టకు” పకోడీ ప్లేటు అందిస్తూ అంది సునంద.

“పోనీ ఒక పూట స్కూలుకి పంపవే”.

“తల్లీ! ఆ విషయం వదిలేయ్. ఇది చైల్డ్ లేబరేం కాదు. అది చిన్నగా కనిపిస్తుంది. గానీ దాని వయసు పద్దెనిమిది. అది అడల్ట్” మొండిగా అంది.

‘సునంద ప్రేమ తనకి కావాలి. వాళ్ల ఇంటి సంగతి పనివాళ్ల సంగతి తనకనవసరం’ సినిమా వైపు దృష్టి తిప్పింది. సునంద వేడి పకోడీలు నములుతూ మధ్య మధ్యలో కబుర్లు చెప్పుకుంటుంటే సినిమా ముందుకు నడిచింది. బాగా నవ్వొచ్చి కళ్ళు చెమ్మగిల్లినప్పుడు “నందూ! ఐ లవ్ యూ” అంది నీరద.

“యూ ఛీట్! అంటూ అవిన్‌తో, ఇటు నాతో... ఇద్దరితో ప్రేమాయణం నడుపుతావా?” కోపం నటించింది సునంద. ఇద్దరూ ఫక్కున నవ్వుకున్నారు.

చుక్కమ్మ వేడి టీ తెచ్చింది. ముందు సునంద కిచ్చి, నీరద వైపు ట్రే చాపింది. నవ్వుతూ కప్పు అందుకుంటుంటే టీ తొణికి, వేడి టీ కొంచెం నీరద చేతిమీద, చీర మీద పడింది. చుర్రుమని కాలింది. లేత రంగు క్రేప్ చీర మీద మచ్చ కనిపించగానే 'అయ్యో!' అని బాత్‌రూం వైపు పరుగు పెట్టింది నీరద. మరక పడ్డ భాగం జాగ్రత్తగా శుభ్రం చేసుకుని మళ్ళీ హాల్లోకి వచ్చేసరికి, కార్పెట్ మీదా, కిందా పడ్డ మరకల్ని తడిబట్టతో తుడుస్తోంది చుక్కమ్మ. సోఫాలో కూర్చోబోతూంటే నీరద కంటపడ్డాయి. చుక్కమ్మ లేతబుగ్గమీద చేతి వేళ్ల అచ్చులు! తడికళ్లు! మనసంతా కెలికేసినట్టైంది. నీరదకి. సునంద!తన బాధ అర్థం చేసుకుని, తనని పువ్వులా ప్రేమగా చూసుకునే స్నేహమయి. తన మానసిక వేదనని చెప్పకుండానే గ్రహించి, స్నేహహస్తం చాచి, తన కన్నీరు తుడిచే ప్రేమమూర్తి. అనారోగ్యంగా ఉన్నప్పుడు తనకి తల్లిదండ్రుల అండ లేదని, వారి బాధ్యతని సంతోషంగా స్వీకరించిన నెచ్చెలి! మరి ఇపుడిపుడే కౌమారంలోకి అడుగుపెడుతున్న చుక్కమ్మ చెంపమీద ఆ ఎర్రని చారలు?

ముడుచుకుపోయి సోఫాలో కూర్చుంది నీరద.

"నీరూ! చీర పాడైందా? ఇందాకే అనుకున్నా ఎంత బావున్నావో ఈ చీరలో అని! అదో ఎడ్డి మొహం. ఎన్నిసార్లు చెప్పినా జాగ్రత్త లేదు!" చిరాగ్గా అంది సునంద.

"నందా! ప్లీజ్... చుక్కమ్మ తప్పేం లేదు. నా పొరపాటువల్ల తనకి..." జాలిగా నెమ్మదిగా అంది – 'నాకు నీ స్నేహం కావాలి. కానీ ఇలాంటి అన్యాయం భరించలేను' అన్నట్టు.

"నీరూ! నువ్వు మరీ ఇంత సున్నితంగా ఉంటే లాభం లేదే"

ఇబ్బందికరమైన మౌనం ఇద్దర్నీ చుట్టేసింది.

మళ్ళీ సునందే అంది "నీరూ! ఏ విధంగానైనా... డబ్బు విషయంలోగానీ, అధికారంలోగానీ బలవంతుడు బలహీనుడి మీద పెత్తనం చేయడం ఎప్పట్నించో ఉంది. ఎప్పటికీ ఉంటుంది. మా ఆయన్ని చూడు... చెయ్యని తప్పుకి 'డిమోట్' చేసి ట్రాన్స్‌ఫర్ మీద పంపేశారు! కేసు కోర్టులో ఉంది నాలుగేళ్లుగా అయనక్కడ. నేనూ పిల్లలూ ఇక్కడ. ఆ బాస్‌కి తన మీద ఎందుకో కసి. ఎప్పటికో కేసు తేలి. అయనిక్కడ కొచ్చేసరికి మా జీవితంలో ముఖ్యభాగం గడిచిపోతుంది! ఇదే జీవితం. దీన్ని అంగీకరించాల్సిందే" నీరద చేతి మీద చెయ్యేసి నెమ్మదిగా అంది సునంద.

"నందా! నీ అభిప్రాయాలతో ఏకీభవించలేకపోతున్నాను. నాకు ఇంటికి వెళ్ళిపోవాలనుంది. చుక్కమ్మని... ప్లీజ్ ట్రీట్ హర్ వెల్... నా కోసం" అంది నీరద సునంద మొహంలోకి చూడలేనట్టుగా, టీవీ మీద దృష్టి నిలిపి.

"నీరూ!" విస్మయంగా చూసింది. సునంద. "దాని బాగోగులన్నీ చూస్తాను. మంచి తిండి పెడతాను. నీకన్నీ తెలుసు దాని కుటుంబానికి నేనెంత చేస్తానో" నొచ్చుకున్నట్లు అంది.

"నందా! ఇతరుల తప్పుల వల్ల మన తప్పులు ఒప్పులవవు. ఇది వరకు కూడా చూశాను. ఏదేనా పొరపాటు జరిగితే నీ చెయ్యి లేస్తుంది. దానిమీదికి. పింకీ వయసుది అది! బాబీ దాన్ని అస్తమానం మొట్టికాయలు వేస్తుంటాడు. నువ్వు నవ్వుతూ 'బాబీ! తప్పురా' అంటావు అంటీముట్టనట్టు. 'వాడు వినడు' అంటావు మురిపెంగా! చూసిన ప్రతిసారీ నాకు ఏదో మానసిక వేదన! ఎందుకంటే నాకు నువ్వు కావాలి...." నీరద కళ్ళు వర్షించాయి.

"నీరూ! ఒక పనిపిల్ల గురించి నన్ను నిందిస్తున్నావా?" షాక్ తిన్నట్లుగా అడిగింది సునంద. ఆమె వదనం ఎర్రబడింది. పెదవులు అదిరాయి.

తర్వాత గంటకి ఇంటిదారి పట్టిన నీరదకి అంతా ఆగమ్యగోచరంగా అనిపించింది. మనసు నిండా ఎన్నో ప్రశ్నలు. ఉవ్వెత్తున ఎగసిపడే తరంగాల్లాంటి ప్రశ్నలు. హృదయ సముద్రంలో మథనం జరుగుతోంది. హృదయం! అదో అగాథం, అదో సముద్రం, అదో అగోచర కీకారణ్యం! ఆ కీకారణ్యంలో దారి వెతుక్కోవాలి. ఆ అగాథంలో జారిపడినా శక్తి కూడదీసుకుని గమ్యం వైపు పయనించాలి. ఆ సముద్రాన్ని మథించి అమృతం సాధించాలి?

వీధి మలుపులో అవిన్ ఎదురయ్యాడు. మౌనంగా కారెక్కింది. చాలాసేపు నిశ్శబ్దం. ఇంటివైపు మలుపు తిరగ్గానే ఎడంచేత్తో నీరద చేతిని మృదువుగా నొక్కి "అయామ్ సారీ నీరూ!" మెల్లగా అన్నాను అవిన్. నీరద కళ్లెత్తి అతన్ని చూసింది. అతడి తడికళ్లు వీధి దీపాల వెలుగులో మెరిశాయి.

# "ఇదం శరీరం"

**-పోడూరి కృష్ణకుమారి**

ఆ చుట్టు పక్కల పల్లెల్లోను, చిన్న చిన్న పట్నాల్లోను కనిపించని దావానలం వ్యాపిస్తోందని అందరికీ తెలుసు. అయితే అది ఎప్పుడు ఎక్కడ ఏ రూపంలో ఏ ఊరిని అంటుకుంటుందో మాత్రం తెలియట్లేదు. పోలీసులదారి పోలీసులదే. దుండగులదారి దుండగులదే. రెండువర్గాల మధ్య ఘర్షణలలో ఇంతమంది మృతి, అంతమంది గాయాలు, ఇంత ఆస్తినష్టం వార్తలు టీవీలో చూస్తూ నిట్టూర్చడం తప్ప సామాన్య ప్రజలు చేసేదేంలేదు. తమ ఊరి మధ్యలోను ఒక అగ్ని పర్వతం పేలడానికి సిద్ధంగా ఉందని అందరికీ అనుమానమే. రెండు వర్గాలు అంటే అర్థం అందరికీ తెలుసు. ఇంతవరకూ ఏమీ జరగలేదు. ఇదేదో మా ఊరిదాకా రాకుండా సమసిపోతే బాగుండునన్న ప్రార్థనతో సామాన్యుడు నిద్రలేస్తున్నాడు. ముందు జాగ్రత్త చర్యగా పిల్లల్ని స్కూళ్లకి పంపడం మానేశారు. తల్లులు. ఎందుకైనా మంచిదని చిన్న పిల్లల స్కూళ్లు మూసేస్తున్నారు యాజమాన్యం వారే. కానీ ప్రతి ఊళ్లో ఉన్నట్టే ఆ ఊళ్లోనూ ఏ చిచ్చు ఎక్కడ రగులుకుంటోందో, ఏ పర్వతం ఎప్పుడు బద్దలవుతుందో, ఏ వర్గం ఇంకే వర్గానికి చిచ్చు పెడుతుందో తెలిసిన పెద్దలు కొందరున్నారు.

అటువంటి ప్రముఖుల్లో రామం, ఆయన కొడుకు సూర్యం ముఖ్యులు. తండ్రీ కొడుకు ఇద్దరూ రాజకీయాల్లో చాణుక్యులు. రామం రాజకీయ చతురత అతనికి పార్టీ పదవిని, పలుకుబడిని సూర్యానికి ఆ ఊరి మున్సిపల్ ఛైర్మన్ పదవిని సంపాదించి పెట్టింది.

రామం తండ్రి సత్యమూర్తి. ఆయనకు కొడుకు, మనవడు చేసే రాజకీయాలు నచ్చవు. ఆయన గాంధేయవాది, ముఖ్యంగా ఆదర్శవాది. ఆయనకిప్పుడు తొంభయ్యేళ్ళు. ఆ వయసులో కూడా తన పనులు తను చేసుకుంటూ వార్తా పత్రికలు క్షుణ్ణంగా చదువుతూ తన లాగే ఆరోగ్యవంతురాలైన భార్య మణెమ్మతో దేశకాల పరిస్థితులు చర్చిస్తూ కాలక్షేపం చేస్తుంటాడు.

"గ్రద్దలా చూస్తూనే ఉంటాడు. నిద్దరైనా పోడు" అని లయబద్ధంగా విసుక్కుంటూంటాడు రామం ఆయన మీద. ఈ మధ్య సత్యమూర్తి రామం, సూర్యంలను ఎవరు కలవడానికి వస్తున్నారు, ఏం మాటాడుతున్నారు వినాలన్న ఆసక్తితో నిజంగానే గ్రద్దలాగా, గుడ్లగూబలాగా కనిపెడుతున్నాడు. సత్యమూర్తి వార్తలు చూసి నిట్టూర్చి, "దేశాన్ని భ్రష్టు పట్టించేస్తున్నారు. మతంతో రాజకీయాలు మంచివి కావు" అంటున్న తండ్రిమీద తాడెత్తున్న లేచాడు రామం. "మీ తరం వాళ్లుకాదా దేశాన్ని మతం పేరుతో రెండు ముక్కలు చేసింది? ఇవాళ గొప్ప నీతి కబుర్లు చెపుతారెందుకు?" అంటూ చెరిగేసాడు. తరవాత, "మీ ఆదర్శాలు మా మీద రుద్దకండి మీ గదిలో మీరిద్దరూ చర్చించుకోండి" అనేసాడు. ముసలి వాళ్లిద్దరికీ వాళ్ల గదిలో వాళ్లటీవీ వాళ్ళకుంది. ఏదో అప్పుడప్పుడు పిల్లలతో కలిసి వార్తలు చూసి చర్చించాలి. వాళ్లనీ చైతన్య వంతులను చెయ్యాలి అన్న ఆశ కొద్దీ పొరపాటు చేస్తుంటాడు సత్యమూర్తి. దానివల్ల గొడవలొస్తుంటాయి.

వాళ్లది తలనాటి విశాలమైన దేవిడీ లోగిలి. ఇప్పుడు ఆధునిక వసతులతో సౌకర్యంగా తీర్చి దిద్దారు రామం, సూర్యం చిన్న సైజు కోటలా ఉండే ఆ ఇంటిని ఊరివాళ్లంతా గౌరవంగా అబ్బురంగా చూస్తారు. 'అబ్బో! ఆ ఇల్లా? అందులో మూడుతరాల నాయకులుంటున్నారు!" అని పై ఊళ్లనుంచొచ్చిన చుట్టాలకి గొప్పగా చెప్తుంటారు. పెద్దాయన సత్యమూర్తిగారిని కూడా వాళ్ళు నాయకులు లిస్టులో గౌరవం కొద్దీ చేరుస్తుంటారేగానీ సత్యమూర్తిగారు మాత్రం తను నాయకుడిని కానని, తనకు మహాత్ముల అనుచరుడి హోదానే ఆపాదించుకుంటాడు. ఆయన గాంధీగారి ఏకలవ్య శిష్యుడు. గాంధీ గారిని దర్శించుకుని ఆశీర్వాదాలు, అభినందనలు అందుకుని స్వాంతత్ర్యోద్యమంలో పాలుగొన్న ధన్యజీవి. అదే కొడుకు రామానికి కొరుకుడుపడని సంగతి.

"అన్నేళ్ళు అంతా కష్టపడి కనీసం పార్టీపదవి కూడా దక్కించుకోకపోతే అదేం రాజీయం?" అని రామం ప్రశ్న. "మేం చేసింది దేశసేవ మాత్రమే. రాజకీయం కాదు" అన్న సత్యమూర్తి జవాబు రామానికే కాదు ఆయన సమకాలీన రాజకీయనేతలకు కూడా అర్ధంకాదు. మంత్రిపదవి కాకపోతే పార్టీ పదవో, ఏదైనా లాభసాటి బేరంలాంటి

పదవో దక్కకపోతే ఇంకెందుకా మిడిమేలపు దేశసేవ? అనుకుంటారు. ఎవరేమనుకున్నా సత్యమూర్తి ఇప్పటికీ తన ఆదర్శాలను, గాంధేయవాదాన్ని వదల్లేదు.

ఆ విశాలమైన కోటలో వరుసగా ఓ మూడుగదులు తల్లిదండ్రులు సత్యమూర్తి మణెమ్మలకు విడిగా వాడుకునేందుకు ఏర్పాటు చేసేసాడు రామం. వాళ్ళు దేనికీ హాల్లోకి రానవసరంలేదు. వాళ్ళ భోజనాలు కూడా ఆ వాటాలోనే ఎప్పుడో ఏ ప్రముఖ రాజకీయవేత్తో, ముఖ్యమైన చుట్టాలో వస్తే తప్ప.

సత్యమూర్తి మణెమ్మ ఆచరించి ప్రచారం చేసే అన్నం పెట్టని ఆదర్శ భావాలేవీ తమ మనవల చెవిని పడకుండా జాగ్రత్త పడుతుంటాడు రామం. అయితే రామం తన తండ్రి సత్యమూర్తి స్వాతంత్ర్యసమరయోధుడన్న సత్యాన్ని తన రాజకీయ ప్రస్థానంలో మహా లాభసాటిగా ఉపయోగించుకున్నాడు. గాంధీ గారితోను, ఆయన ఆదర్శాలతోను ఆట్టే సంబంధం మాత్రం పెట్టుకోలేదు.

ఆ రోజు పూజ గదిలో జపానికని కూచున్న రామం అసహనంగా ఉన్నాడు. రావలసిన కబురురాలేదు. రావలసిన మనిషి రాలేదు. పదేళ్ల మనవరాలు మైథిలి సత్యమూర్తి గదిలో చేరింది కాబోలు మాటలు వినిపిస్తున్నాయి. చిన్నతనంలో గాంధీగారి నిజాయితీని వివరించే సంఘటనను కథగా చెపుతున్నారు. సత్యమూర్తి మణెమ్మా ముని మనవరాలికి. చిరాకు పడిపోతూ జపం అయిందనిపించి లేచాడు రామం.

ఇవతలకొచ్చిన రామాన్ని చూసి "ఇంక రండి టిఫిన్ తిందురుగాని" పిలిచింది. భార్య ధనలక్ష్మి. బల్లదగ్గర కూచుని ఫలహారం చేస్తున్న రామానికి పక్క గదిలోంచి వినిపిస్తున్న మాటలు విసుగుతెప్పించాయి. "ఆయన్ని టీచరే కాపీ కొట్టమన్నాడుట! ఆయనగారు కొట్టలేదుట! తరతరాలుగా మనం అది పాఠ్యపుస్తకాల్లో రాసి నీతులు నేర్చేసుకోవాలిట! సరే ఆయన్ని నమ్ముకున్నందుకు వీళ్లకేం ఒరిగిందిట?" గొణుక్కున్నాడు. "హుష్షో..." అని మూలిగింది. ధనలక్ష్మి. "ఇంకెన్నాళ్లు ఆ పండుటాకులు మీద కసి? ఇంక ఊరుకోండి" భర్తని కాస్త అదుపులో పెట్టాలని ప్రయత్నించింది.

"తాతమ్మా, ఇండిపెండెన్స్‌డే... అదే... నువ్వంటావే స్వ... స్వా..." తడుముకుంటున్న మైథిలికి అందించింది మణెమ్మ "స్వాతంత్ర్య దినోత్సవం" "ఆ.

అదే. ఆ రోజు మాంచి పాటలూ దేశం గురించి నేర్చుకొచ్చి పాడమని టీచరుగారు చెప్పారు. నీకు బోల్డన్ని పాటలొచ్చుకదా? నాకొకటి నేర్పు. నేనూ స్కూల్లో పాడతా" అడుగుతోంది మైధిలి. "మాంఛి పాట నేర్పుతా జాగ్రత్తగా నేర్చుకో. నారాయణ నారాయణ అల్లా అల్లా... మా పాలిటి తండ్రీ మీ పిల్లలమేమెల్లా....." మణెమ్మ స్వరం సన్నగా ఉన్నా స్థిరంగా సాగుతోంది.

"ముసలాళ్లిద్దరూ కలిసి పిల్లదాని బుర్రంతా చెడగొడితే గానీ వదల్రా ఏమిటి?" కస్సుమన్నాడు రామం. "ఊరుకుందురూ. మూలనున్న ముసలాళ్లమీదే మీ ప్రతాపం. అయనా మనంకామా ములాళ్లం? కాస్త నాలుగు తెలుగు ముక్కలూ, తెలుగు పాటలు నేర్చుకుంటేనే బుర్రలు చెడిపోతాయా? ఇంకానయం కదూ అసలారోజున కూడా ఇంగ్లీషు రైమ్సూ సాంగ్సూ పాడమనలేదు ఆ స్కూలు వాళ్ళు. అందుకు సంతోషించక సణుక్కుంటారేమి?'' అత్తగారి అదిలింపుకు మందహాసాలు చిలికించుకుంటూ ముసలాళ్లగదిలోకి నడించింది కోడలు మీనాక్షి. "నాన్నాగారూ, రావుగారు వచ్చారు" సూర్య పిలుపు వీధిగదిలోంచి వినబడి హడావిడి పడుతూ లేచి వెళ్ళాడు. రామం.

దేవిడీ ఇంటికి పక్కనే ఉంది పార్టీ కార్యాలయం. అది మామూలుగా కార్యకర్తలందరితోను నాయకులు సమావేశమయి మీటింగులు నిర్వహించడానికి ఉపయోగిస్తుంటారు. కానీ ప్రముఖులైన రాష్ట్రస్థాయి నాయకులు మొదలైనవారు సమావేశమై రహస్యసమాలోచనలు చెయ్యాలంటే మాత్రం రామంగారి దేవిడీ వీధి వరండాకు కుడివైపుగా ఉండే పెద్ద గదిని వాడుకుంటారు. ఇవాళ సమావేశం అక్కడే. ఎవరో ఉత్తరాదినుంచి కూడా పెద్ద నాయకులే వచ్చారని చెప్పుకున్నారు.

సత్యమూర్తి దిగులుగా కూచున్నాడు. వాళ్ళుండే మూడుగదులవాటాకు వీధివైపు

తలుపులేకుండా జాగ్రత్త పడ్డాడు రామం. వీధిలోకి రావాలంటే వాళ్ళు హాల్లోకి వచ్చి వీధిగదిని దాటి వెళ్లవలసిందే. మామూలుగా పెరటిగుమ్మమే పనివాళ్ళు గాని, వాళ్ళని చూడదలుచుకున్న ఎవరైనాగానీ రాకపోకలు సాగించేది.

"ఇది కాదు మనం చూడాలనుకున్న భారతదేశం''. భారంగా అన్నాడు సత్యమూర్తి ఆ రోజుకి నాలుగోసారి. పెదవి విరిచి నిట్టూర్చింది మణెమ్మ. "మరెలాంటి

భారతదేశం చూడాలనుకున్నారు ముత్తాతగారూ" మైథిలి కుతూహలంగా అడిగింది. "ఎలాంటిదంటే... .." తను భావించిన భారతదేశాన్ని వర్ణిస్తూ సత్యమూర్తి కలలలోకంలోకి ప్రయాణించాడు. అతనితోపాటే మణెమ్మా మైథిలీ. "కులమతాలపేరుతో హింస చెలరేగ కూడదు దేశంలో ఎక్కడా, ఎప్పుడూ పల్లెటూళ్లు అభివృద్ధి చెందాలి. పట్నాలకు సామాన్య ప్రజలు వలసపోయే పరిస్థితి ఉండకూడదు. వ్యవసాయానికి పెద్దపీట వేసి మన వ్యవసాయోత్పత్తులు ఇతర దేశాలకు ఎగుమతి అయ్యే స్థాయికిరావాలిగానీ, విదేశీ దిగుమతుల మీద మనం ఆధారపడకూడదు. స్త్రీ పురుష సమానత్వం ఆచరణలో రావాలి.

...."అతనితో పాటు కలల రాజ్యంలోకి జారుకుని, మధ్యాహ్నపు ఎండకి మగతగా నిద్రపోయిన మైథిలిని మీనాక్షి ఎత్తుకెళ్లింది. పక్కమీద పడుకోబెట్టడానికి. సత్యమూర్తి నెమ్మదిగా హాల్లోకి వచ్చి పచార్లు సాగించాడు. నేతలందరూ ఇంకా సమావేశంలోనే ఉన్నారు. హాలుకి పక్కగా ఉన్న గదిలోకి వాళ్ల మాటలు చిన్నగా వినబడుతున్నాయి. అక్కడున్న పడక్కుర్చీలో వాలాడు సత్యమూర్తి.

ఆ తరువాత రెండు రోజులకు రాష్ట్రం నలుమూలల నుంచి కార్యకర్తలు రావడం మొదలైంది. వారందరికి బస పార్టీ కార్యాలయంలోనే. వారిలో నేతలకు దేవిడీలో వసతులు. మూడోనాడు సూర్యం హడావిడిగా ఇంట్లోపలికి వచ్చి "ఇవాళ, రేపు కూడా నేనూ నాన్నగారూ పార్టీ కార్యాలయంలోనే ఉంటాం. మా భోజనం నిద్ర అన్నీ అక్కడే" అని చెప్పాడు. "ఏం రాజకీయాలో మహాప్రభూ!" చేతులు పైకెత్తి దణ్ణం పెట్టి ఆకాశానికో విన్నపం పంపింది ధనలక్ష్మి. "పక్కిల్లే కదా అత్తగారూ!" ఓదార్చబోయింది కోడలు మీనాక్షి. "పక్కిల్లయినంత మాత్రాన పిలిస్తే పలుకుతారా ఏమన్నానా. రాజకీయాలు కాదుగానీ ఇల్లూ వొళ్లూ పట్టకుండా తిరుగుతారు మీ ఆయాన మా ఆయన" వెటకారంలో హాస్యం ఒలకబోసింది ధనలక్ష్మి. నవ్వొచ్చింది మీనాక్షికి.

సత్యమూర్తి పాలేరు రంగన్నతో పెట్టిన కబురందుకుని రహమాన్ వచ్చాడు సాయంత్రం. అతను పదిపన్నెండేళ్ళ పిల్లవాడుగా ఉన్నప్పుడు సత్యమూర్తి వెంట తిరిగి స్వచ్ఛమైన స్వార్థంలేని దేశభక్తిని ఒంటపట్టించుకున్నాడు. ఇప్పటికీ సత్యమూర్తిని

గురుతుల్యుడుగా భావిస్తాడు. డెబ్బై దాటిన వాడే గాని సత్యమూర్తిలా గట్టి శరీరం కాదు. అతని కొడుకులిద్దరూ కలిసి తీసుకొచ్చారు. వస్తూనే సత్యమూర్తి కాళ్ల దగ్గర కూలబడ్డాడు. "బాబుగారూ, ఇదికాదు మనం కలలుగన్న భారతదేశం. భారతమాత మళ్లీ ఏడుస్తోంది. బాబుగారూ!" కళ్లు నిండుకొస్తుంటే అన్నాడు రహమాన్. "కంగారు పడకు కలలు మన పరిధిలో మనం నిజం చేసుకోడానికి నిరంతరం ప్రయత్నాలు చేస్తూనే ఉండాలి."

"ఏం చెయ్యగలం బాబుగారూ? మన మాట ఎవరు వినిపించుకుంటారు? చూస్తున్నారుగా బాబుగారూ, చుట్టుపక్కల పల్లెలన్నీ అడ్డుకున్నాయి. నా బంధువులు మీ బంధువులు తేడాలేదు. పిట్టల్లా ఎగిరిపోతున్నారు. గృహదహనాలు పిల్లల్ని కూడా వదలట్లేదు". వలవలా ఏడ్చేసాడు రహమాన్.

"ఊరుకో రహమాన్ ఊరుకో. నువ్వుకాదు నీ కొడుకులనిలా రమ్మని పిలు. ఇప్పుడు వాళ్ల చేతుల్లో ఉంది దేశం". దూరంగా నుంచుని ఏడుస్తున్న తండ్రిని నిస్సహాయంగా చూస్తున్న కొడుకులిద్దరూ వచ్చి తండ్రి పక్కనే సత్యమూర్తి పాదాల చెంత కూచున్నారు. వాళ్లకు తోడుగా వచ్చిన వాళ్ల స్నేహితులు మైకేలు, కేదారుడూ కూడా అక్కడే సద్దుకు కూచున్నారు. సత్యమూర్తి చెప్పిందంతా శ్రద్ధగా విన్నారు.

ఆ రాత్రి రామం, సూర్యం ఇంక ఇంటికి రామని కబురుపెట్టారు. ఎన్నడూ లేనిది ఇంటి కాపలాకు ఐదుగురు గన్‌మెన్‌లు వచ్చారు. చంద్రం ఫోను చేసి, "ఇదుగో, మేము రెండు రోజుల వరకూ ఇంక ఇంటివైపు రావడానికి కుదరదు. రోజులు బాగాలేవని తెలుసుకదా. వీళ్ళు ఐదుగురూ ఇంటికి, మీకూ కాపలా కాస్తుంటారు. వాళ్ల భోజనం తదితర వసతులు వంటమనిషి నర్సయ్యగారు, పాలేరు రంగన్నా చూసుకుంటారు మీరెవరూ ఇల్లు కదలద్దు. పగటి పూటైనా సరే. మేము పక్కనే కార్యాలయంలో ఉంటాము. ఏ అవసరం వచ్చినా సెల్లులో పలుకుతాను. గన్ మెన్నులని మాత్రం ఇల్లొదిలి అక్కడికి ఇక్కడికీ వెళ్లే పనులేం చెప్పకండి" జాగ్రత్తలు చెప్పాడు.

తమ రక్షణకై కొడుకు నియమించిన గన్మెన్నుల భోజనాలు దగ్గరుండి పర్యవేక్షించారు, సత్యమూర్తి. ఆ రాత్రి ఇంట్లో ఎవరూ నిద్రపోలేదు. 'గన్ మెన్లు

తప్ప'  చిన్నది మైథిలి కూడా జరుగుతున్నదంతా నిద్ర ఆపుకుని మరీ చూసి సంతోషించింది. ఆ పిల్ల సంతోషంతో నాన్న సూర్యం, తాతరామం పాలుపంచుకోలేకపోయారు ఊళ్లో జరగాల్సింది ప్రణాళిక వేస్తున్న వాళ్లకి ఇంట్లో ఏం జరిగిందో తెలిస్తేగా.

సరిగ్గా అర్ధరాత్రి పన్నెండింటికి పేలడం మొదలెట్టాయి. నాటుబాంబులు. బాంబుల ధమధమలతో బాటు గుడిసెలు, ఇళ్లూ కాలుతున్న రపరఫ ధ్వనులు., చుట్టుపక్కల ఊళ్ళల్లోకి కూడా వినబడి ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని తలుపులు బిడాయించుకున్నారు ఆ ఊళ్లల్లో జనం. తెల్లవారుజాము నాలుగింటిదాకా వినబడుతూనే ఉన్నాయి. మంటల చిటపటలు. కానీ అంతటి మారణహోమంలోనూ ఏదో తెలియని ప్రశాంతత! కారుణమేమిటో తెలియదు. దారుణం చేసిన దుండగులు వినబడుతున్న శబ్దాల్లో తాము వినాలనుకున్నదేదో వినబడట్లేదన్న లోపల గుర్తించారు. కానీ ఏమిటది? ఏమిటాలోపం? ఎక్కడ పట్టుబడతామో నన్న ఆందోళనతో చెయ్యకూడని దారుణం చేస్తున్న దుండగులు నిలబడి ఆలోచించలేదు. చెయ్యదలుచుకున్నది. చేసి పారిపోదామని తొందరపడ్డారు.

నాలుగున్నరకల్లా నాయకులంతా జీపులు వేసుకుని ప్రాణనష్టం ఎంత జరిగిందో అంచనా వేయడానికి వెళ్ళారు. అలవాటు కొద్దీ ఆలస్యంగా వచ్చిన ఫైర్ ఇంజన్లు ఇంకా పోరాడుతూనే ఉన్నాయి మారణహోమాలతో. చూస్తున్న దృశ్యాలలో ఏదో లోపం తోచింది రామానికి ఏమిటాలోపం? తెలిసీ తెలియనట్లు... తోచీతోచనట్టు ఏమిటాలోపం?

"ఇదేటి ఇశిత్తరం? ఇప్పటికి నా సర్వీసులో నా తలెంటుకలన్ని కొంపలార్పినా. ఎప్పుడూ ఇంత ఇచిత్రం సూడ్నేదు. ఇప్పుడొచ్చిన దగ్గర్నించీ మండుతున్న కొంపలార్పుకుంటూ వస్తన్నాం గదా ఒక్కటంటే ఒక్క కొంపలో బియ్యాలూ, సామానూ తప్ప ఒక్కటంటే ఒక్క కాలిన వంకనపడదేట్రా? ఇశిత్తరం!" ఫైర్ మన్ ఒకడు ఇంకొకడితో అంటున్న మాటలు వినగానే సూర్యానికి తట్టింది అక్కడ జరిగిన లోపం ఏమిటో.

రాత్రి నుంచీ వినబడుతున్న చిటపటలూ రపరపలూ ధమధమలూ మధ్య వినబడ కుండాపోయినవి – మానవ స్వరాలు! సామాన్యజనుల హాహాకారాలు!!

“నానా ఇంటికెడదాం పదండి'' సూర్యం పెట్టిన కేకతో రామానికి జరిగిందేమిటో అర్థమైంది.

“అవును నాన్నగారు. నాన్నగారే దీని వెనకనున్న హస్తం!“ వాళ్ల జీపు దేవిడీకేసి పరుగుతీసింది. వెనకే మిగతావీను. సెల్ ఫోనులు నిర్విరామంగా మోగుతూనే ఉన్నాయి. ఆన్సర్ నొక్కితే చాలు జాతీయ నాయకుల గొంతులు “కంగ్రాట్స్. హార్టీ కంగ్రాట్స్. పార్టీ ప్రతిష్ఠ హిమాలయమంత పెరిగింది!” అభినందనల పరంపరం. ఏం జరిగిందో తెలిసిందా వీళ్ల కసలు? రామం మతిపోయింది.

తొలిసంజ మసకవెలుతురులో మృత్యు యంత్రాల్లా వచ్చి ఆగాయి జీపులు దేవిడీ ముందు దిగుతూనే రామం దేవిడీ సింహద్వారం పగిలిపోతుందా అన్నట్టు బాదాడు. తెల్లారినట్టు భళ్ళున తెరుచుకున్నాయి తలుపులు.

లోపల పట్టపగలు మించిన వెలుగు! కెమెరాలైట్లు ధగధగద్ధగాయమానంగా! ఉన్న టీవీ ఛానెళ్ళన్నీ అక్కడే సభ పెట్టాలా అన్నట్టు అక్కడే కుక్కేసినట్టున్న జనం ఒకరినొకరు ఆనుకుని నిలబడున్నారు. అంగుళం సందుదొరికినా మరో మనిషికి ఆశ్రయం ఇస్తాం  అన్నట్టు.

“మారణహోమం మధ్య మహాద్భుతం సృష్టించిన ఛైర్మన్ సూర్యం” కేప్షన్‌తో లైవ్ టెలీకాస్ట్ చేస్తున్నారు. ఏంకర్ అక్కడున్న జనాలతో ఇంటర్వ్యూల సందట్లో “ఇప్పుడే ఇంటికొచ్చిన ఛైర్మన్ సూర్యంగారు!!” ఏంకర్ కేక పెట్టాడు. కెమెరాలన్నీ ఇటు తిరిగాయి.” దుండగులు చెయ్యబోతున్న దారుణ మారణకాండను ముందే ఊహించి తన విశాలమైన దేవిడీ ఇంట్లో నాలుగువేలమంది పైగా ఉన్న పాతవాడ ప్రజలకు ఆశ్రయమిచ్చి కాపాడిన సూర్యంగారు, ఆయనను నిరంతరం వెన్నంటి ఉండి సూచనలిచ్చి నడిపించే ఆయన తండ్రి రామంగారు వీరే! స్వాగతం పలకండి! సుస్వాగతం!!” ఏంకర్ నాటకీయంగా ప్రకటిస్తుండగా రామం, “నాన్నగారూ!!!” కేకపెట్టారు.

ఆ కేకలో ఉన్నది క్రోధమా? ప్రశంసా? ఆనందమా? అభినందనా?

తెలిసే అవకాశం లేదు. కేక వేస్తూనే కుప్పకూలిపోయాడు కిడ్నీ వ్యాధిగ్రస్తుడు రామం. తక్షణం డాక్టర్ విలియమ్ ఆస్పత్రికి తరలించారతన్ని.

రామం ఆస్పత్రికి చేరిన సమయంలోనే రహమాన్‌కు కూడా చేతులమీద మోసుకువచ్చారక్కడికి దగ్గర్లోని మిషన్ హాస్పిటల్‌కు ఫోన్ చేసి మరో ఏంబులెన్స్ ఏర్పాటు చేశాడు విలియమ్. "నేను చెప్తూనే ఉన్నానండి. ఇంక డయాలిసిస్ మీద నడవదు. కిడ్నీ ట్రాన్స్ ప్లాంట్ తప్ప గత్యంతరం లేదు అని ఇదుగో ఈ వారంలో రాష్ట్రనాయకులతో మీటింగులున్నాయి. తరవాత చేద్దువుగానీ ఏర్పాట్లన్నారండి. ఇంతలోనే ముందుకొచ్చింది" సూర్యం తదితరులతో మాటాడుతూనే పేషంట్లిద్దరినీ ఎటెండవుతూ ఏంబులెన్స్‌లు రెడీ చేయించి రామాన్ని, రెహమాన్‌ని సిటీలోని సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌కు తరలించడానికి ఏర్పాట్లు చేస్తున్నాడు డాక్టర్ విలియమ్.

ఏంబులెన్స్‌ను అనుసరించి వెడుతున్న కార్లోనే చంద్రాన్ని ఇంటర్వ్యూ చేస్తున్నారు టీవీ వాళ్ళు. ఆ కారు పక్కనే నడుస్తున్న మరో రెండుకార్ల విండోల్లోంచి కూడా మైకులు పట్టుకుని ప్రశ్నలు వదులుతున్నారు మరికొన్ని టీవీ ఛానెల్స్‌వాళ్ళు. "ఇలా అందరినీ మీ దేవిడీలోనే ఆశ్రయమిచ్చి కాపాడలన్న ఐడియా మీదా? మీనాన్న గారిదా? "అంతా మానాన్నగారే నండి. ఆయనే సరైన సలహాలిచ్చి నన్ను నడిపిస్తారండి" అలవాటైపోయిన రాజకీయపు సమాధానాలు చెప్తున్నాడే గానీ తాతగారి చెయ్యి వదలట్లేదు సూర్యం. అతని కళ్ళు "తాతా అంతా నీదయాభిక్ష!" అంటున్నాయి. సత్యమూర్తి కళ్ళతోనే మనవడికి ధైర్యం చెప్తున్నాయి.

"రాత్రంతా బలే సందడండి. అసలు చీకటిపడేసరికల్లా పెరటివైపు మా ముత్తాతగారి గదివైపునించి రావడం మొదలెట్టేసారండి అందరూ" మైథిలి ఆపుకోలేనట్టు అందుకుని తను చూసిందంతా వర్ణించడం మొదలెట్టింది. మీడియావాళ్ళు ఆ అమ్మాయిని తమ వ్యానుల్లోకి కిడ్నాప్ చేసినంతపని చేసారు." తండ్రిరామంగారు హఠాత్తుగా అనారోగ్యం పాలవటం వల్ల సూర్యంగారు బిజీగాఉన్నారు. సూర్యంగారి పుత్రిక ద్వారా వివరాలు తెలుసుకుందాం" అంటూ అన్ని ఛానెల్స్ వారూ ఆ అమ్మాయికి ఫోకస్ చేసికూచున్నారు.

"రాత్రి తొమ్మిదింటికల్లా మా ఇల్లంతా నిండిపోయిందండి జనంతో. ఎప్పుడూలేనిది సెక్యూరిటీ వాళ్ళు ఆపాటికే గుర్రుపెట్టి నిద్రండి అదేంటో! (సత్యమూర్తి

వాళ్ల భోజనాల్లో కలిసిన మత్తు మందు మహత్యం పాపం మైథిలికేం తెలుసు) ఎంతమందంటే -- అందరం నుంచుంటేగాని ఇంట్లో చోటు సరిపోలేదండి. అంతమందండి. మా రంగన్న, మా సులేమాను, మాజేకబూ ఇంకా ఇంకా మనుషుల్ని తీసుకొస్తూనే ఉన్నారండి. పెరడంతా నిండిపోయిందండి. మీరు చూసారుకదా? ఇరుక్కుపోయి ఒకళ్ళనొళ్ళు అతుక్కుపోయి నుంచుంటే తప్ప చోటు సరిపోలేదండంకుల్. అప్పుడు అందరూ మా ఇంటి మనుషులే అనిపించిందండి. మా ఊరందరం ఒకే ఫ్యామిలీ.

అనిపించేసిందంకుల్ ఎప్పటికీ మేం అందరం అలాగే కలిసి ఉండాలని ఎంత అనిపించిందో.....! ఎవరూ మాటాడద్దు అని ఆర్డరేసేసారండి మా ముత్తాతగారు. మా స్కూల్లో లాగా పిన్ డ్రాప్ సైలెంటయి పోయారండి అందరూ చిన్న చిన్న పిల్లలుంటారుకదండి వాళ్ళు కూడానండి కిక్కురుమనలేదండి. ఎందుకో తెలుసాండీ? నాకు తెలిసిందండి. అసలు చిన్న పిల్లలకి విడిగా మంచం మీద పడుకోబెడితే కోపం వచ్చి ఏడుస్తారు కదా. అదే వాళ్లమ్మ ఎత్తుకు తిప్పితే హాయిగా బబ్బుంటారు. మరి నిన్న రాత్రంతా పిల్లల్ని వాళ్ళమ్మోనాన్నో ఎత్తుకునే నించున్నారు కదండీ. మరింక హాయిగా నిద్రబోయారండి కుఁయ్ కఁయ్ అనకుండా అసలు మాకు నుంచోడానికే చోటు సరిపోకపోతే ఇంక పిల్లలకి మంచాలూ ఉయ్యాళ్ళూ ఎక్కడినించొస్తాయండి? ఇంకో సంగతి చెప్పనా అంకుల్? అంత సేపు అలా ఇరుగ్గా నుంచున్నా నాకసలు కాళ్ళు నెప్పెక్కే లేదండి. ఆకలీ, దాహం ఏమీ వెయ్యలేదండి. కానీ ఎవరికైనా దాహం వేసిందంటే మాత్రం ఒకళ్ళచేతుల్లోంచి ఒకళ్ళు గ్లాసందుకుని ఒక గ్లాసుతోనే పదిమందిమి తాగేసామండి. అచ్చం స్కూలు పిల్లల్లాగే!

బోల్టు రాత్రయ్యాక అప్పుడు వినబడ్డాయండి ఢాంఢాంలు. ఎవ్వరూ నోరెత్తద్దన్నా రండి ముత్తాతగారు. రాత్రంతా మా ముత్తాతగారు, తాతమ్మతో సహా అందరం అలాగే నుంచుని ఉన్నామండి. మీరంతా వచ్చే వరకూ మేం నోరిప్పితే ఒట్టండీ అంకుల్ "ఉరికి ఉరికి, ఉబికిఉబికి ఉప్పొంగి ప్రవహించే గంగా ప్రవాహంలాగా మైథిలి చెప్తున్న విశేషాల ప్రవాహం సాగుతూనే ఉంది. సిటీ చేరే వరకూ ఇంటర్వ్యూలు సాగుతూనే ఉన్నాయి.

మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఎన్నడూ పడనంత హడావిడిపడిపోయింది. కేంద్ర మంత్రుల నుంచి కూడా కాల్స్ – 'రామంగారికి శ్రద్ధగా వైద్యం చెయ్యమంటూ'

"రామంగారికి సరిపోయిన కిడ్నీ ఆస్పత్రిలో లేదు. దాతలు ముందుకు రావాలి" టీవీల్లో ఫ్లాష్ న్యూస్ చూసిన ఊరి ప్రజలు కళవెళపడిపోయారు" ఊరంతకీ ప్రాణం పోసిన మారాజు.

రామంబాబుగారి ప్రాణానికి మన ప్రాణం అడ్డెయ్యకపోతే ఎందుకీ పాడుబతుకు?"

చర్చించుకున్నారు. "మనందరికీ దేవుడు రెండ్రెండు కిడ్నీలిస్తాడంట. ఒక్క కిడ్నీతో అయినా బతకడానికి ఏలోటూ రాదంట". "ఆ మారాజుకో కిడ్నీ ఇచ్చినంత మాత్రాన మనకొచ్చిన నట్టమేం లేదంట" "అసలు ఒక్కోడికి దేవుడు రెండ్రెండు కిడ్నీలిచ్చేదే అందుకు. ఎవడికయినా ఆపదొస్తే ఒకటి దానం చేసుకుని పుణ్యం కట్టుకోండ్రా అని." ఒకరికొకరు తమకు తెలిసిందంతా చెప్పుకున్నారు. 'సై' అంటే 'సై' అనుకుని ఒంట్లో సత్తువున్న వాళ్లందరూ బయల్దేరిపోయారు. ఏ కిరాయి సప్లైదారుడూ అవసరంలేకుండానే తమ ఖర్చులు తామే పెట్టుకుని లారీల్లోనూ, బళ్ళల్లోను తరలి వచ్చేసారు. ఆస్పత్రి ఆవరణంతా రామం ఊరి ప్రజలతో నిండిపోయింది.

"ముందుగా రామంగారి రక్తసంబంధీకులు, బంధువులను పరీక్షించి వారిలో ఎవరిదీ పనికిరాకపోతే మీలో ఎవరి కిడ్నీ రామంగారి శరీరానికి సూటవుతుందో పరీక్షించి వారి వద్దనుంచి తీసుకుంటారు. మీరంతా సంయమనం పాటించి ప్రశాంతంగా ఉండండి." డాక్టర్ విలియమ్ ప్రజలను శాంతపరిచి, లోపలకెళ్లి అక్కడి డాక్టర్లతోపాటు రక్తపరీక్షల రిపోర్టులు చూడడం ఆరంభించాడు.

బయట వెయిటింగ్ హాలులో ధనలక్ష్మి, "ఎంత ఖర్చైనా సరే ఈ కిడ్నీ మార్పిడి జరిగేలా చూడు సూర్యం. డబ్బుకు వెనకాడవద్దు" రోదిస్తూ కొడుకుతో చెపుతోంది.

ఆ హాల్లోనే ఓ మూల రెహమాన్ భార్య రజియా, "కిడ్నీ దొరికినా ఆ ఖర్చు మనం పెట్టగలమా బేటా?" దిగులుగా ఏడుస్తోంది. సూర్యం తల్లికి ధైర్యం చెప్తున్నాడు.

సత్యమూర్తి రజియా పక్కనే నుంచున్నాడు. "మేము లేమా రజియా, డబ్బుకోసం

రెహమాన్‌ను ఒదులుకుంటామా తల్లీ. ఆ మాత్రం డబ్బు పోగుచెయ్యగలములే. నువ్వు అధైర్యపడకు” ధైర్యం చెప్పాడు. రజియా సత్యమూర్తి చేతులు కళ్ళకద్దుకుంది.

టెస్టురిపోర్టులన్నీ పరిశీలించిన డాక్టర్లతో చర్చించిన విలియమ్ ఓ నిర్ణయానికొచ్చాడు. ధనలక్ష్మిని, రజియాను లోపలికి పిలిచాడు. పరిస్థితి వివరించాడు.

రెండు ఆపరేషన్ థియేటర్లు ఒక్కమారే మేల్కొన్నాయి.

వైద్యబృందాలు నిర్విరామంగా కృషిచేసాయి.

ధనలక్ష్మి కిడ్నీ రెహమాన్ శరీరంలోకి, రజియా కిడ్నీ రామం శరీరంలోకి చేరిపోయాయి – నిశ్శబ్దంగా – దైవలీల లాగా – మనిషి నైపుణ్యం వల్ల.

వైద్యో నారాయణో హరి.

ధనలక్ష్మి, రామం, రజియా, రెహమాన్ క్షేమంగా ఉన్నారన్న వార్త తెలిసిన ఊరి జనం పండగ చేసుకున్నారు.

మత్తు వదిలి మేలుకున్న రామం తండ్రికోసం కళ్ళతోనే వెతికాడు. సత్యమూర్తి కనపడగానే దగ్గరకు రమ్మన్నట్టు సైగచేసాడు. దగ్గరగా వచ్చిన సత్యమూర్తి చేతిని కళ్ళకద్దకుంటుంటే కన్నీళ్ళతో ఆ చెయ్యి తడిసిపోయింది.

“ఇప్పుడు చెప్పు రామం నీ శరీరంలో ఏభాగం ఏమతానికి చెందినదో. మరి మొత్తంగా నీదేమతమో చెప్పగలవా?” రామం కనురెప్పలు భారంగా, అపరాధభావంతో వాలిపోయాయి. “నీకు గుర్తుందోలేదో నువ్వు చిన్నప్పుడు గోడమీంచి పడ్డావు. దెబ్బలు తగిలి చాలా రక్తం పోయింది. అప్పుడు నీకు రక్తదానం చేసి నీ ప్రాణం కాపాడినవాడు ఒక పార్సీ వ్యక్తి. నీకు చాలాకాలంగా వైద్యం చేస్తూ ఇవాళ సకాలానికి ఆస్పత్రికి తీసుకొచ్చిన డాక్టర్ విలియమ్ – క్రిస్టియన్. నీకు తన కిడ్నీ దానం చేసి పునర్జన్మ నిచ్చిన వ్యక్తి ముస్లిమ్. పైగా స్త్రీ నువ్విప్పుడు చెప్పగలవా నీ ఈ శరీరానిదే మతమో? హిందువువా? పార్సీవా? క్రిస్టియనువా? అసలు స్త్రీవా? పురుషుడివా?”

రామం మౌనంగా దీనంగా చూసాడు.

"ఈ శరీరం దైవప్రసాదం. జాతి, మతం, వర్ణం, ఇవేవీ దైవ ప్రసాదానికి అంటవు. అవన్నీ మనిషి అహంకారంలో ఉంటాయి. మలినమైన మనసులో దైవమిచ్చిన దేహానికి ఇవేవీ పుట్టుకతోరావు. పరోపకారార్థమిదం శరీరం. అంతే కానీ ఇంత శక్తిగల శరీరాన్ని ఈ శరీరాన్ని ఆశ్రయించుకుని పెరిగిన మేధాశక్తిని పరులకు అపకారం చెయ్యడానికి వాడకూడదు. అందరిలోనూ నీలో ఉన్న రక్తమే ఉంది. కులమతాలకతీతంగా అది తెలియచెప్పడానికే దేవుడు అందరికీ ఒకేలాంటి శరీరాలనిచ్చాడు. దైవ సందేశం అర్థం చేసుకోలేక కుప్పిగంతులేస్తున్నాడు. మనిషి. "చిన్న పిల్లాడికి చెప్పినట్టు చెప్పాడు. సత్యమూర్తి వాత్సల్యంతో అర్ద్రమైన గొంతుతో.

ఆ రోజు సూర్యం సత్యమూర్తి కాళ్లకు చుట్టుకుని వలవలా ఏడ్చాడు. వొంగి సూర్యాన్ని ఓదార్చబోయిన సత్యమూర్తిని వారించి, "ఏడవనీయండి తాతయ్యా" అంది మీనాక్షి.

అవును. ఏడవనీయండి. మనసులో తరతరాలుగా పేరుకున్న మాలిన్యమంతా కన్నీళ్ళతో కడుక్కోనీయండి.

చరిత్రలో మరో సువర్ణ అధ్యాయం, మరో స్వర్ణయుగం ప్రారంభమవ్వాలంటే ఎంత ప్రక్షాళన జరగాలీ!

# అరకులోయ అప్పల్నర్సి

**-మంథా భానుమతి**

సుశీలకి రాత్రంతా నిద్దరపట్టలేదు. మరునాడు చెప్పబోయే తీర్పుమీదే దృష్టి అంతా. ఇంత విచిత్రమైన కేసు తన జీవితంలో ఎప్పుడూ వినలేదు. పైగా అది తనే వాదించడం.

కేసు పూర్తి అవడానికి మూడు సంవత్సరాలు పట్టింది. అది మామూలే కోర్టుల్లో. ఒక పట్టాన హియరింగుకి రాదు. వచ్చాక వాదనలూ, ప్రతివాదనలూ... చివరికి ఎలాగయితేనేం పూర్తయింది.

జరిగినదంతా కళ్ల ముందు సినిమా రీళ్లలా తిరిగింది.

అద్దం మీద పడిన  ఆవగింజలా జారిపోతున్న విదేశీ కారు ఒక్క కుదుపుతో ఆగింది. కిటికీ కిందకి దించి పరవశంగా ప్రకృతి అందాలని ఆస్వాదిస్తున్న సుశీల చిరాగ్గా ముందుకి చూసింది.

సుశీల హైద్రాబాదులో లాయరు. పదో పెళ్ళిరోజు ఆనందంగా గడపడానికి ప్రభాకర్ ఏ స్విట్జర్లాండో వెళ్దామంటే, దాన్ని మించిన అందాలు మన రాష్ట్రంలోనే ఉన్నాయని అరకులోయకి తీసుకొచ్చింది సుశీల. దగ్గర్లో అయితే పిల్లలు ఎప్పుడు గొడవ చేస్తే అప్పుడు వచ్చేయ్యచ్చు. ఎంత అమ్మమ్మ దగ్గర ఆంక్షలు లేకుండా హాయిగా గడుపుతున్నా, రాత్రిళ్ళు నాలుగేళ్ళ సోనీకి అమ్మకావాలి.

"సరే... వకీలుతో వాదనలేంపన్చేస్తాయీ" గాఢంగా నిట్టూర్చాడు. వైద్యం చెయ్య డంలో ఉన్న నేర్పు, వాదించడంలో లేని ప్రభాకర్. అతను పేరున్న హాస్పిటల్లో పెద్ద సర్జన్. అతి కష్టం మీద పదిరోజులు సెలవు పెట్టాడు.

దార్లో విజయవాడ, అన్నవరం, విశాఖపట్నం... చూడవలసిన గుళ్లూ, ప్రదేశాలూ చూస్తూ కార్లో అరకు వెళ్తున్నారు. అక్కడ నాలుగు రోజులు ఉండేలా కాటేజి బుక్ చేసుకున్నారు.

"ఏమయింది?"

"అటు చూడు సుశీ" ప్రభాకర్ అడ్డంగా ప్రత్యక్షమైన పెద్ద చెట్టుకొమ్మని చూపించాడు.

రోడ్డుకి ఇటూ అటూ చిన్న గుట్టలున్నాయి. ఈ పక్కనుంచా పక్కకి రెండు బండల్నీ కలుపుతూ పెద్ద చెట్టుకొమ్మ. ఎక్కడ్నుంచొచ్చారో ముగ్గురమ్మాయిలు కారుకి అడ్డంగా నుంచున్నారు.

పధ్నాలుగేళ్లకి కొంచెం అటూ ఇటూగా ఉంటాయి వయసులు.

"లోయ టాక్స్ కట్టాలండి" ఒకమ్మాయి దబాయించింది.

"టాక్సా... అదేం చెప్పలేదే ఎవరూ? గవర్నమెంట్ ఆర్డరేది... అసలు ఎవరు మీరు..." సుశీల ఎర్రజుట్టమ్మాయిని అడిగింది.

"ఈ లోయంతా మాదేనండి. మేము తాత ముత్తాతల్నుంచీ ఇక్కడే ఉంటున్న గిరిజనులం. మాకు గవర్నమెంటుతో పని లేదండి. ఆర్డర్లస్సలవసరం లేదండి. ఇటేపు ఎవరొచ్చినా టాక్సు కట్టాల్సిందేనండి. లేకపోతే ఎల్లనియ్యం". నడినెత్తిమీద నుంచి ముడేసి కొసలు పైకి వదలిన ఉంగరాల జుట్టు తలమీద పరచుకుని కిరీటంలా వుంది. అందులో గుచ్చిన తంగేడు పువ్వులు కెంపుల్లా మెరుస్తున్నాయి. కళ్లల్లో అల్లరి. మెరుస్తున్న పళ్లన్నీ బైటపెట్టి నవ్వుతోంది. ఆ గూడేనికి రాణీలా ఉంది. గిరిజనుల అమాయకత్వం, బ్రతక నేర్చిన తెలివీ సమపాళ్లలో కనిపిస్తున్నాయి. ఆ అమ్మాయిలో తనొక్కతే కాస్త మంచి పరికిణీ ఓణీ వేసుకుంది.

సుశీలకి వాళ్లని చూస్తే ముచ్చటేసింది.

"ఏంటిది... పార్లల్ గవర్న్‌మెంటా" ప్రభాకర్ రుసరుస లాడాడు. బాధ్యతగల పౌరుడు మరి!

"ఛ.. ఊరుకోండి! ప్రతీదానికి రూల్సూ రెగ్యులేషన్లూ. ఈ లోయలో చెట్లంత స్వచ్ఛందంగా ఉన్నారు వీళ్లు. ఎక్కడా కృత్రిమత్వం కనిపించడం లేదు...." ఇంగ్లీష్‌లో ప్రభాకర్‌ని కోప్పడుతూ కారు దిగింది సుశీల.

"ఎంతో కొంత ఇచ్చేసి తొందరగా పోదాం. ఇప్పుడు వీళ్ళతో ముచ్చట్లు పిచ్చాపాటీనా?"

"తొందరగా వెళ్ళి ఏం చేస్తాం నాలుగు రోజులు అంటే తొంభై ఆరు గంటలు పూర్తిగా మనవే. నేను కేసులూ, మీరు పేషెంట్లూ అంటూ పరుగులు పెట్టక్కర్లేదు" ఎప్పుడో ఏదో కొంప మునిగిపోతున్నట్లు అస్థిమితంగా ఉంటే ప్రభాకర్‌ని పట్టించుకోకుండా గిరిజన రాణీకేసి నడిచింది సుశీల.

పూర్తిగా కాకపోయిన అక్కడక్కడ అర్ధమయి, పరిస్థితిని ఆకళింపు చేసుకున్న రాణీ స్నేహంగా నవ్వింది సుశీలని చూసి.

"నీ పేరేంటమ్మాయ్?"

"అప్పల్నర్సండి. తొమ్మిదో క్లాసు చదువుతున్నానండి. మరి మాకు ఈ చెట్లూ పుట్టలే కదండీ అన్నం పెట్టేది. అందుకోసమే ఇలా రోడ్లంట పడ్తావండి. ఉప్పుడెవో మాకు సెలవలిచ్చీశారు కానీండి"

"ఈ కుంకుళ్ళు తీసుకోరండీ... నా పేరు సింవాచలవండి"

"ఈ చింతపండు, పుట్ట తేనె, మంచి గంధం చెక్కలూ.... నేను సింగారినండి"

రాణీకొక్కదానికే అంతా దక్కుతుందేమోనని ఇద్దరూ గుక్కతిప్పుకోకుండా అనేశారు.

సుశీల అక్కడున్న పెద్ద బండమీద కూర్చుంది. కోయ పిల్లలతో భేటీకి సిద్ధమైపోయి ఇంక లాభం లేదనుకుని, ప్రభాకర్ కారు పక్కకి ఆపి, కెమెరా పట్టుకుని కిందికి దిగాడు.

"మీరు కూడా చదువుకుంటున్నారా? గిరిజన పాఠశాలలోనా..."

"అవునండి. మేము ఎనిమిది, అక్కేమో తొమ్మిది. మధ్య మధ్యలో ఇవన్నీ అమ్ముతుంటాం. అమ్మగారూ... కొనరా?" ఆశగా చింతపండు చూపిస్తూ అడిగింది సింగారి. అది మోకాళ్ళ దగ్గర ఎర్రని ముతక చీర మడిచి కట్టింది. జాకెట్టు లేని ఒక భుజం నున్నగా మెరుస్తోంది. వీపంతా చీరే కప్పేసింది. జుట్టు ఒక పక్కకి తీసి కొప్పుపెట్టింది. కొప్పులో ఎర్రని మందార పువ్వు.

"నీ చీర బాగుందే... ఇది మీ కట్టా?"

"అవునండి. నాకు పరికిణీల్లేవు. ఇదయితే ఒకే బట్ట సరిపోతుంది"

"బాగుంది. అన్నీ కొంటా కానీ మీ గురించి చెప్పండి" వాళ్ళ చేతుల్లోవన్నీ కార్లో పెట్టించింది. సుశీల.

ఎగురుకుంటూ చాటంత మొహాలు చేసుకుని వెనుక సీట్లోకింద పెట్టారు.

ప్రభాకర్ పరుగెత్తుకుంటూ వచ్చాడు.

"అయ్యయ్యో! ఈ జంక్ అంతా ఎందుకు. చింతపండు, తేనే ఓకే! కుంకుడు కాయలు ఎవరు వాడ్తారు? గంధం... అసలు ఇది సాండల్ వుడ్డే అని గారంటీ ఏమిటి? అప్పుడు తిరుపతిలో పెట్టించుకున్న టోపీ మర్చిపోయావా"

తిరుమలలో ఎంతో ఘాటుగా గంధం వాసన వేస్తున్న పెద్ద చెక్కని రెండొందలు పెట్టి కొంటే అది ఇంటికొచ్చేసరికి ఏ వాసనా లేని దిమ్మయింది. అది గుర్తుకొచ్చి ఫక్కున నవ్వింది సుశీల. అంత పెద్దదుంగ రెండొందలకిచ్చాడంటే ఆలోచించాలి కదా! కొనద్దని చెప్తూనే ఉంది సుశీల. అది ముక్కలు చేసి బట్టల్లో వేసుకోవాలి. రోజూ గంధం అరగదీసి దేముడికి పెట్టచ్చు. బోలెడన్ని ఊహలు చేశాడు పాపం.

"ఇది సాండల్ వుడ్డేనండి. తిరుపతిలో అంతా మోసం. మేం అలా చెయ్యవండి అయ్యగారూ! కావాలంటే ఇంటికెళ్లీ వాడుకుని చూసి డబ్బు పంపండి మా అడ్రస్ ఇస్తాను" అప్పల్నర్సి నొచ్చుకున్నట్లు అంది.

"ఫర్లేదు రాణీ! ఇచ్చేస్తాలే. నువ్వు అంతలా చెప్తున్నావు కదా!

"రాణీ ఏటండీ"

"నీ నెత్తిమీద కిరీటంలా ఉంది జుట్టు, పూలు. నువ్వే వీళ్ళందరికీ నాయకురాల్లా ఉన్నావు. అందుకని ఆ పేరు పెట్టాను" సుశీల, రాణీ వెనక్కి వెళ్ళి దాని హైర్‌స్టైల్‌చూస్తూ అంది.

రాణీ కిల కిలా నవ్వింది.

"ఇప్పుడు నీ గురించి చెప్పు" రాణీ నవ్వుని చూస్తూ అడిగింది సుశీల.

"మా దగ్గర కబుర్లేటుంటాయండి. ఆకలి కబుర్లు తప్ప. మీ రంటున్నట్లు నేను మా గూడెం పెద్ద కూతుర్ని. మిగిలిన అందరికంటే నా పని కొంచెం ఫరవాలే. మాకీ అడవి తల్లే ఆధారం. దానికి ఫారెస్ట్ వాళ్ళు గోల చేస్తారు. మాకేవో కొద్దిగా

భూములుంటాయి. వాలు కదా. మామూలు పంటలు పండవు. కాఫీ తోటలు వస్తాయి. దానికి బోలెడు పెట్టుబడి కావాలి. కట్టెలు కొట్టడం, చింతచెట్లు, కుంకుడు చెట్లు, తేనె పట్టడం.... ఇలా నికరాదాయం లేని బతుకులు. ఇప్పుడు బాక్సైట్ అంటూ ఇవి కూడా లాక్కోవాలని చూస్తున్నారు. చానామంది వలసెల్లి పోతన్నారనుకోండి" అప్పల్నర్సి ఊపిరి తీసుకోడానికి ఆగింది.

సింగారి పరుగెత్తుకుని వెళ్ళిపోయింది. ఇంటి నుంచి సరుకులు తేవడానికి కాబోలు. సింహాచలం ఇంకో కారు వస్తుందేమోనని మెడలు సారించి చూస్తోంది. సుశీల వాళ్లనే గమనిస్తూ వింటోంది.

"మధ్యలో అన్నలొస్తుంటారు. మమ్మల్నేం చెయ్యకపోయినా... కూంబింగూ, ఎన్‌కౌంటర్లూ అంటూ అడవి దద్దరిల్లిపోతుంది. మేం గూడేల్లోనే దాక్కుంటాం.

"నువ్వు చక్కని తెలుగు మాట్లాడుతున్నావే"

"బడికెళ్తాం కదండి. పైగా మా దగ్గర కూడా టీవీలున్నాయి. గూడానికి ఇద్దరు ముగ్గురి దగ్గర. ఇంగ్లీష్ కూడా అర్థం అవుతుందండి. కానీ పెద్ద వాళ్ళు మాత్రం పక్కా మా కోయ బాషే"

"ఇంక వెళ్దామా? ఆకలేస్తోంది" ప్రభాకర్ అసహనంగా పచార్లు చేస్తూ అన్నాడు.

"సరే! మేం ఇంకా నాలుగు రోజులుంటాం ఇక్కడ. కలవండి. ఎప్పుడైనా హైదరాబాద్ వచ్చినా రండి" సుశీల, తన విజిటింగ్ కార్డ్ ఇచ్చి లేచింది.

"అమ్మో! మీరు లాయరా" అప్పల్నర్సి ఆశ్చర్యంగా అడిగింది.

సుశీల నవ్వుతూ టాటా చెప్పి కారెక్కింది.

ఒక్కసారి ఉలిక్కిపడి లేచింది. సుశీల. తలుపు దడదడ కొడ్తున్నారు. ఎవరో. కళ్ళు నులుముకుంటూ లేచి టైమ్ చూసింది. ఒంటిగంట. ఈ సమయంలో ఈ అడవిలో... డాక్టర్‌ని పెళ్ళి చేసుకున్నాక అర్థరాత్రిళ్ళు ఫోన్లు, తలుపు కొట్టడాలూ అలవాటైనా అరకులోయలో ఊహించలేదు. పగలంతా తిరిగి తిరిగి ఆదమరిచి నిద్రపోతున్నాడు ప్రభాకర్.

మెల్లిగా లేచి తలుపు తియ్యబోయి ఆగింది. దొంగలో, తీవ్రవాదులో... తలుపు తియ్యచ్చో లేదో! ఈ కాటేజీలకి వాచ్‌మెన్ ఉన్నాడు కదా.

మళ్ళీ తలుపు చప్పుడు.

"అమ్మా... నేనే అప్పల్నర్సిని... అదే రాణీని" గొంతు గుర్తుపట్టి తలుపు తీసింది సుశీల.

భోరుమని ఏడుస్తూ కాళ్ళమీద పడిపోయింది అప్పల్నర్సి.

"మీరే కాపాడాలమ్మా! మా తమ్ముడికి జొరం పేలిపోతోంది. నాలుగు రోజల్నుంచీ మా వైద్యాలేవో చేయిస్తున్నారు. ఇప్పుడు పిలిస్తే పలకడం లేదు. మీ కార్లో కొంచెం విశాఖపట్నం తీసుకెళ్ళి పెద్దాసుపత్రిలో..." వెక్కుతూ అంది.

"అదేంటి, మామూలుగా మీరేం చేస్తారు మరి... ఇప్పుడంటే మేం ఉన్నాం కానీ? ఎక్కడున్నాడు మీ తమ్ముడు"

"ఎప్పుడూ ఇంతవరకూ రాలేదమ్మా బస్సులో పట్టుకుపోతాం తీసుకొచ్చామమ్మా ఇక్కడే వరండాలో పడుకోబెట్టాం"

"ఒక్క నిమిషం" సుశీల లోపలికి వెళ్ళి ప్రభాకర్‌ని లేపింది. అతను ఎమర్జెన్సీ కిట్ పట్టుకుని వచ్చాడు.

అప్పల్నర్సి తండ్రితో కుర్రాడిని లోపలికి తీసుకురమ్మని, బెంచిమీద పడుకోబెట్టమన్నాడు.

పదేళ్ళుంటాయి అబ్బాయికి. గబగబా పల్స్, టెంపరేచర్ చూసి, జ్వరం తగ్గడానికి ఇంజెక్షన్ ఇచ్చాడు. అప్పల్నర్సి కళ్ళు పెద్దవి చేసి చూస్తుండిపోయింది.

"అయ్యగారు డాక్టరా?"

సుశీల నవ్వుతూ ఏం భయం లేదన్నట్లు చూసి, లోపలికెళ్ళి ఫ్రిజ్‌లోంచి ఐస్ తెచ్చింది. నర్సి గబగబా తన ఓణీలో దాని పెట్టి తమ్ముడి నుదురు మీదపెట్టి, మొహం తుడుస్తూ కూర్చుంది. కళ్లలో నీళ్ళు కారుతుండగా... అంతలో అబ్బాయికి తెలివొచ్చింది.

"ప్రస్తుతం భయం లేదు. ఈ మాత్రలు వెయ్యండి. పాలు ఇవ్వండి. ఉన్నాయా? ఇక్కడ ఫ్రిజ్‌లో ఉన్నట్లున్నాయి. టెస్టులు అవీ చేయించి మందులు వేసుకోవాలి" ప్రభాకర్‌కి, సుశీలకి అప్పల్నర్సి, తండ్రీ దండాలు పెడ్తూ కుర్రాడిని తీసుకుపోయారు.

సుశీల బాల్కనీలో నుంచుని ఉదయిస్తున్న సూర్యుడ్ని చూస్తోంది. చేతిలో కాఫీ కప్పు, పిల్లల్ని లేపి చదివించాలి, పరీక్షలు దగ్గరకొస్తున్నాయి. కోర్టులో ఒక విడాకుల కేసు వాదనుంది. వంటావిడ రానని ముందురోజే చెప్పింది. తల్లికి ఒంట్లో బాగోలేదు. డాక్టర్ దగ్గరికి తీసుకెళ్ళాలి. చెయ్యవలసిన పనులు తల్చుకుంటే నీరసం వచ్చింది. ప్రభాకర్ మీద ఏ ఆశా లేదు. అతను పొద్దున్నే ఏడున్నరకల్లా వెళ్ళిపోతాడు.

వాతావరణం అంతా నిశ్శబ్దంగా ఉంది కొద్దిసేపట్లో ఎంత రణగొణధ్వని మొదలవుతుందో.... నవ్వుకుంది సుశీల. అంతవరకూ ఆగక్కర్లేదు అటూ కాలింగ్ బెల్... ఎవరో నెమ్మదిగా అంటీ అంటనట్లు నొక్కారు. ఒక్కసారి మోగి ఆగిపోయింది. ఇంత పొద్దున్నే ఎవరబ్బా... పాలవాడు, పనిమనిషీ, ఎవరూ గంట మోగించకుండానే పనులు జరిగిపోయేలా చేసుకున్నారు. మళ్ళీ ఒకసారి.. అదే మొహమాటంగా బెల్లు.. కనుబొమ్మలు చిట్లించి చూస్తూ తలుపు తీసింది.

వచ్చింది ఎవరో మొదట గుర్తుపట్టలేకపోయింది. భుజానికి పాత చేతి సంచీ... పక్కన కొద్దిగా సొట్టలు పడిన ట్రంకు పెట్టి.

"అమ్మగారూ, నేను అప్పల్నర్సిని. మూడేళ్ళ క్రితం అరకులోయ...." చట్టుక్కున గుర్తుకొచ్చింది. సుశీలకి. అప్పల్నర్సి చీర కట్టుకొని నాజూగ్గా కాలేజ్ స్టూటెంట్‌లాగా ఉంది.

"మీరు కార్డిచ్చి రమ్మన్నారు కదాని వచ్చీశానమ్మా. ఇబ్బందయితే, ఏదన్నా సత్రానికి దారి చూపిస్తే వెళ్ళిపోతాను" మొహమాటంగా నిల్చుంది అప్పల్నర్సి.

"అయ్యో! ఫర్లేదు రామ్మా. వేషం అదీ మారింది కదా... అందుకే" లోపలికి రమ్మని, ఎప్పుడైనా ఇంటికి వచ్చే పేషంట్ల కోసం ప్రభాకర్ వాడే చిన్న గదిలోకి దారి తీసింది. సుశీల. దానికి ఆనుకుని బాత్‌రూం ఉంది.

"నిన్న పొద్దున్న యస్కోటలో బస్సెక్కానమ్మా. అక్కడ్నుంచీ పాసింజరు బళ్లని, ఎర్రబస్సుల్నీ పట్టుకుని వచ్చేసరికి ఇప్పుడయింది" అలసటగా అంది అప్పల్నర్సి.

గట్టిగా అలారం మోగింది. సుశీల పరుగున పిల్లల గదిలోకి వెళ్ళి దాన్ని ఆర్పి, వాళ్ళని లేపే కార్యక్రమంలో పడింది. ఆపరేషన్లు లేకపోతే ప్రభాకర్ ఏడుగంటలకి లేస్తాడు. అతనికి నిద్రాభంగం కలగకుండా చూసుకుంటుంది సాధ్యమైనంత వరకూ.

ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది. ప్రభాకర్ క్లినిక్కీ, పిల్లలు ట్యూషన్కి వెళ్ళారు. అప్పల్నర్సి బాల్కనీలో కూర్చుంది. ఆ రోజు పొద్దున్న భోజనం చేసి పడుకోమని చెప్పి కోర్ట్కి వెళ్ళిపోయింది సుశీల. పక్క ఫ్లాట్లోనే ఉన్న తల్లికి కావలసినవి అన్నీ అమర్చింది. తండ్రిపోయి ఏడాది అయింది. ముందు చూపుతో పక్క పక్కనే అపార్ట్మెంట్లు తీసుకోవడంతో సమస్య లేకుండా సర్దుకుపోతున్నారు. సుశీల వెళ్ళేవరకూ అప్పల్నర్సి, దూరంగా నుంచుని అన్నీ గమనించింది.

"మీరెళ్ళండమ్మా నేను నెమ్మదిగా తిని, పండుకుంటాను. మీ అమ్మగారు..."

"ఆవిడ పని ఆవిడ చేసుకోగలుగుతుంది. ఏదైనా అవసరం అయితే వాచ్మన్ భార్యని పిలుస్తుంది ఏవో చదువుకుంటూ, టీవీ చూస్తూ గడిపేస్తుంది. కావాలంటే నువ్వు వెళ్ళి ఆవిడ దగ్గర కూర్చోవచ్చు. వెళ్ళేటప్పుడు తాళం వేసుకుని వెళ్ళు" సుశీల టైము చూసుకుంటూ హడావిడిగా వెళ్ళిపోయింది. సగం దూరం వెళ్ళాక తట్టింది. అప్పల్నర్సి ఎవరో... ఒక్క రోజు పరిచయంతో ఇల్లంతా అప్పజెప్పి వచ్చింది. ఎందుకొచ్చిందో... ఎవరెవరు వచ్చారో, ఇంటికెళ్ళేసరికి ఇంట్లో ఎలా ఉంటుందో... పిల్లలు నాలుగింటికి వచ్చి అమ్మమ్మ దగ్గర కూర్చుంటారు. జరిగిపోయిందానికి విచారించి ఏం ప్రయోజనం! ఏమయితే అదవుతుంది. తల విదిలించి తను వాదించబోయే కేసుమీదికి దృష్టి మళ్ళించింది.

ఇంట్లోకి అడుగుపెడ్తూనే సుశీల ఆశ్చర్యంగా చూసింది. పిల్లలు కడిగిన ముత్యాల్లా తయారయి, హోంవర్కు చేసుకుంటున్నారు. ఇల్లంతా శుభ్రంగా ఉంది.

"సుశీ! ఈ అమ్మాయి మంచి పని మంతురాలే. ఎవరూ లేరుట. పాపం. నా దగ్గర ఉంచేసుకుంటా" అమ్మ మాట విని వెనక్కి తిరిగింది సుశీల. అప్పుడే లోపలికి

వచ్చిన పార్వతమ్మ, ఉత్సాహంగా కనిపించింది. అప్పల్నర్సి, సోఫాలో కూర్చున్న సుశీలకి గ్లాసుతో మంచినీళ్ళు తీసుకొచ్చి ఇచ్చింది.

"పెద్దమ్మగారు చూపించారు. వంట చేసేశానమ్మా. టీ పెట్టమంటారా?" వంటింట్లోకి వెళ్ళి, ఐదు నిముషాల్లో టీ తీసుకొచ్చి ఇచ్చింది.

"ఇప్పుడు చెప్పు, ఏమయింది" టీ తాగుతూ, అడిగింది సుశీల.

నర్సి కింద చతికిలబడింది. పార్వతమ్మ కుతూహలంగా చూస్తోంది. అప్పటి వరకూ బింకంగా ఆపుకున్న కన్నీళ్ళు వరదలా ఉబికి వచ్చేస్తున్నాయి. సుశీల టీ కప్పు టీపాయ్ మీద పెట్టి నర్సి భుజం మీద చెయ్యివేసి ఓదార్చింది.

"అమ్మా! నేను ఇంటర్ పాసయ్యాను. అలాగే... ఎన్ని ఇబ్బందులెదురైనా తట్టుకుని, ఇంక చదువు చాలించి ఏదైనా ఉద్యోగంలో చేరి తమ్ముడ్ని చదివిద్దామనుకున్నా. పది అవగానే పెళ్ళి చేశారు. మేనమామకిచ్చి. అందరం కలిసే ఉంటాము. పక్క పక్కిళ్ళే. నేను హాస్టల్లో ఉండే చదువుకున్నా. అయ్యాక ఇద్దరం ఏ వైజాగో వెళ్దామని అంతా సరిచేసుకుని రాత్రి పండుకున్నా. మావోటనుకుంటే సింవాద్రి అప్పన్న ఇంకోటనుకుంటాడు కదమ్మా! రాత్రే ముంచెత్తుకొచ్చిన ఏరు మా గుడిసెలన్నింటినీ మునగేసి తనతో తీసికెళ్ళిపోయింది. వాటితోనే మా ఓళ్ళంతా...." నోట్లో చెంగు కుక్కుకుని మోకాళ్ళమీద తలపెట్టుకుండి పోయింది.

సుశీలకి ఏం మాట్లాడాలో అర్థం అవలేదు. టీ కప్పు ఎప్పుడో పక్కన పెట్టేసింది. ముందుగా తేరుకుంది పార్వతమ్మే.

"అయ్యయ్యో! ఎంత పని జరిగిందమ్మాయ్!

ఆ మధ్యని వానలూ, వరదలూ, వేల ఎకరాలు పంటలు పాడవడవూ వింటూనే ఉన్నాం. అయితే ఒక్కరు కూడా..."

"మేవూ, బెస్తవాళ్ళూ ఇల్లాంటి చావులు చూస్తూనే ఉంటావండి. కానీ కొంచెం కూడా వార్నింగ్ లేకుండా కొట్టుకుపోడం ఇదేనండి. ఏం చెయ్యాలో అర్థం కాలేదు. అమ్మగారిచ్చిన కాగితం భద్రంగా పెట్టేసుకున్నా. ప్రభుత్వం పదివేలిచ్చిందండి. అదుచ్చుకుని ఏదైన దారి చూపిస్తారేమోనని వెతుక్కుంటూ వచ్చానమ్మగారూ! ఎక్కడికెళ్ళినా ఒంటరి దాన్ని కదండీ... మోసపోతానేవోనని బయ్యవండి. ఉప్పుడు మీరేం చెప్తే అదే..." మొహం పైకెత్తి దీనంగా సుశీలని చూసింది.

"పదివేలా! ఒక్కొక్కళ్ళకీ పదివేలన్నారే..."

"అవునమ్మా... కానీ దెబ్బలాడ్డానికెవరు మిగిలారనీ... నాలాంటి వాళ్ళు నలుగురైదుగురు తప్ప. మాకు మనస్థిమితం లేదు. ఇచ్చింది పుచ్చుకుని వచ్చేశాం.

"ముందు జరగవలసింది ఆలోచించు సుశీ!"

అమ్మకేసి సాలోచనగా చూసింది సుశీల.

"ప్రభాకర్ వచ్చాక ఏం చెయ్యాలో చూద్దాం

"అక్కా! ఈ అమ్మాయి అచ్చు మా చీరకట్టు కట్టుకుందేటండి. అదిగదిగో! ఆ అమ్మాయి మా కొప్పెట్టుకుంది. ఇంకో అమ్మాయి, నేను అప్పుడు ఎర్రపూలెట్టుకున్నట్టు జుట్టు పైకి లేపి కిరీటం లాగా పెట్టింది. అయ్యబాబోయ్... ఇప్పుడందరూ మా కోయోళ్ళలాగైపోతన్నారేంటండి!" అప్పల్నర్సి ఉత్సాహంగా అరిచింది.

టీవీలో... ముంబాయిలో ప్రసిద్ధ వస్త్ర వ్యాపారులు నిర్వహిస్తున్న ఫాషన్ షో అది. ప్రపంచ ప్రఖ్యాతి చెందిన డిజైనర్ 'వీణా బాటియా' రూపొందించిన దుస్తులు ధరించి, దేశంలో పేరెన్నికగన్న మోడల్స్ పిల్లి నడక నడుస్తున్నారు.

అప్పల్నర్సి అరకులోయ నుంచి వచ్చినప్పట్నుంచీ సుశీల దగ్గరే ఉంటోంది. పగలంతా పార్వతినీ, పిల్లల్నీ చూసుకుంటూ, ఇంటి పనిలో సహాయం చేస్తూ, ప్రైవేట్‌గా బి.ఏ పాసయి, సాయంకాలం లా కాలేజీలో చేరింది. పార్వతమ్మ తన ఇంట్లో ఒక చిన్నగది ఇచ్చింది. ఒక్క నిముషం కూడా వదలకుండా ఆంటీ అంటూ వెంటే ఉంటుంది.

సుశీల కుతూహలంగా చూసింది. నిజమే. అందరూ కోయ పడుచుల్లాగే కనిపిస్తున్నారు. అంతలో వీణా భాటియా వచ్చి, ఈ డిజైన్లన్నీ తను ఎంతో కష్టపడి తయారు చేశానని, ఎవరైనా అనుకరిస్తే తమకి రాయల్టీ ఇవ్వాలని చెప్పింది. కోయపడతులంతా చిరునవ్వులు చిందిస్తుండగా.

అప్పల్నర్సి సుశీల కేసి చూసింది. అదే సమయంలో సుశీల కూడా!

"ఇదెక్కడి అన్యాయం అక్కా! శుబ్బరంగా మా ఓళ్ళవి కాపీ చేసేసి... మరి మాకేటిచ్చిందో తెల్సుకుంటే...."

ప్రభాకర్ ఆశ్చర్యంగా చూశాడు. ఇంత తెలివి ఎక్కడ్నుంచి వచ్చిందా అని.

"కాబోయే లాయరు అనిపించావే. ముందు పేటెంటుకి వేసేద్దాం. అప్పుడు తీసిన ఫోటోలున్నాయి నా దగ్గర"

"2005 పేటెంట్ యాక్ట్ ప్రకారం డ్రెస్ డిజైన్ రాదేమో అక్కా!"

"అందులో ఏవేంటున్నాయ్?"

"మందులు, రసాయనాలు, యాగ్రో కెమికల్స్, ఆహార పదార్థాలు, సూక్ష్మక్రిములు, ప్రత్యేక ఉత్పత్తులు"

టకటకా చెప్పేస్తున్న అప్పల్నర్సిని చూసి చప్పట్లు కొట్టాడు ప్రభాకర్.

"ఇంత నాలెడ్జ్ ఉందా నీకు..."

"ఏమనుకుంటున్నావ్ ప్రభూ... గోల్డ్‌మెడల్‌కి ప్రయత్నిస్తోంది. వస్తే రికార్డ్ బ్రేకే... ఈవెనింగ్ కాలేజ్, యస్టీ కాండిడేట్..."

"ఊరుకో అక్కా! మరీ చెప్తారు. యూనివర్సిటీలో చాకుల్లాంటి పిల్లలుంటారు"

"తప్పకుండా వస్తుంది. వాళ్ళందరికీ సుశీ లేదు కదా! ప్రయత్నించు" ప్రభాకర్ సర్జరీ పుస్తకం తీసుకుని తమ గదిలోకి వెళ్ళిపోయాడు.

"అక్కా! ఇది ప్రత్యేక ఉత్పత్తి కింద వస్తుందేమో!" అప్పల్నర్సిని ఎగదిగా చూసింది. పార్వతమ్మ.

"ఏమిటే... నిజంగా వేసేద్దామనే... మరి డబ్బు?"

"కోర్టు ఫీజులు తప్ప ఇంకేం వుండవు కదా! అన్నీ నర్సే చూస్తుంది" ఉత్సాహంగా అంది సుశీల.

"అక్కా! నిజంగా వేసేద్దామా.... నా దగ్గర ఆంటీ గారిచ్చిన జీతం డబ్బులన్నీ అలాగే ఉన్నాయి. మీరు అన్నీ చూసుకుంటున్నారు కదా!" పార్వతమ్మ నెలకి వెయ్యి రూపాయలిస్తోంది. అప్పల్నర్సి వచ్చినప్పట్నుంచీ ఆవిడకి ఎంతో హాయిగా ఉంది మరి...

"అంతే మరి... రేపే... ఫైల్ చేద్దాం నాతో కోర్టు కొచ్చేయ్"

పార్వతమ్మని చూసింది నర్సి.

"నేనేవంటానే. కేసు సంగతెలా ఉన్నా అనుభవం వస్తుంది నీకు.. కానీయ్"

సుశీలకి ఎంతో ఆశ్చర్యం వేసింది. అప్పల్నర్సి చురుకుదనం చెప్పిన వెంటనే అల్లుకుపోవడం కేసు నడుస్తున్నంత సేపు తనవెనుకే ఉండి అన్నీ అందించడం బ్రీఫింగ్ ఇవ్వడం.

వీణా భాటియా చేసిన ప్రకటన టేపు తెప్పించారు. ఇతర దేశాల్లో జరుపుతున్న రియాలిటీ షోల్లో పాల్గొనే మహిళా జడ్జీలు, మోడల్సూ ఆవిడ కోయ డిజైన్లు అనుకరించి, వేలల్లో ధనం చెల్లిస్తున్నారు. ఆవిడ చేసిన పొరపాటేమిటంటే పేటెంట్ చెయ్యకపోవడం. నాగరికతలేని వాళ్ళు కదా ఎవరొస్తార్లే అనుకుంది. అప్పల్నర్సి పేటేంట్ తెచ్చుకుని దావా వేసేసరికి ఖంగుతింది.

ఆ డిజైన్లన్నీ తనవే అని పెద్ద పెద్ద లాయర్లని పెట్టుకుని శాయశక్తులా ప్రతివాదం చేసింది.

ఆఖరి హియరింగునాడు వీణా భాటియాకి, అప్పల్నర్సికి పోటీ పెట్టించింది సుశీల.

రెండు ఆరు గజాల చీరలూ, హెయిర్ స్టయిల్స్‌కి కావలసిన తల నూనెలూ, స్ప్రేలూ, దువ్వెనా, పూలూ, కావలసిన సామాన్లన్నీ తెప్పించింది.

అప్పల్నర్సి ఎవరి సహాయం లేకుండా కిక్కిరిసిన ప్రేక్షకులలోంచి ఒక చుడీదార్ 'లా' స్టూడెంట్‌ని పిలిచి చకచకా అచ్చు వీణా భాటియా డిజైన్ లాగే చీర కట్టేసింది. దుస్తుల మీద నుంచే, సూదీ దారం కూడా వాడలేదు. అలాగే ఒక్క దువ్వెన్న సహాయంతో హెయిర్ స్టైల్సూ....

వీణా భాటియా నోరు తెరుచుకుని చూస్తూ ఉండిపోయింది. ముంబాయిలో ప్రసిద్ధి చెందిన టైలరూ, ప్రఖ్యాతి చెందిన మేకప్‌మన్‌లూ లేకుండా ఎలా! జడ్జిగారు ఆవిడకేసి చూశారు.

కోర్ట్ హాలంతా కిటకిటలాడుతోంది. జడ్జీగారు తీర్పు ఇచ్చారు.

"ప్రకృతి ప్రసాదించిన వరాల్ని మేం ఏ రాయల్టీ లేకుండానే వాడుకున్నాం. నేను మా డిజైన్లని పేటెంట్ చేసి గెలిచాను. నిజమే కానీ... మేము పేదరికం వల్ల చాలీచాలని బట్టతో శరీరాన్ని కప్పుకుంటాం. అది ప్రపంచవ్యాప్తంగా పెద్ద పెద్ద వాళ్లు అనుకరిస్తామంటే సంతోషం. అలాగే జట్టు ముళ్ళు కూడా. నాకేవీ రాయల్టీ లివ్వక్కర్లేదండీ ఎవరూ" అప్పల్నర్సి చుట్టూ కమ్ముకున్న మీడియా వాళ్లతో అంటోంది.

సుశీల, తన జూనియర్ లాయర్, అరకులోయ అప్పల్నర్సిని చూసి కళ్ళు తుడుచుకుంది ఉద్వేగంతో.

# మూగవోయిన కోయిల

**-అల్లూరి గౌరీలక్ష్మి**

**"క**వితల పోటీ అని కనబడితే చాలు కాగితాలు ముందేసుకుని కూర్చుంటారు. వారం రోజులు కష్టపడితే ఓ రెండొందల బహుమతి వస్తుంది. దానిబదులు పిల్లలకి ట్యూషన్లు చెప్పుకుంటే ఉత్తమం అని చెబితే వినరుకదా నామాట. ఇప్పుడింతకీ మా పిన్నింటికి వస్తున్నారా లేదా?" చిరాగ్గా అడిగింది విశాల నన్ను.

"నువ్వూ పిల్లలూ వెళ్లండి విశాలా. నేను రాను. అక్కడ నాకు బోర్‌కొడుతుంది" బ్రతిమాలుతున్నట్లుగా అన్నాను. ఆమె కింకాకోపం వచ్చింది. "వంద మంది వస్తున్న ఫంక్షన్‌లో బోర్‌కొడుతుందా? అసలు మీరు ఇతర్లతో కలిసేరకమైతే కదా! వంటిపిల్లి రాకాసిలా కూర్చునుండడం మీకిష్టం కానివ్వండి... నేనిప్పుడు మీకు వంట చేస్తూ కూర్చోవాలన్నమాట" విసుగ్గా అడిగింది.

"వద్దు విశాలా! మీరు బయలుదేరండి. నేను ఆకలయినప్పుడు వంట చేసుకుంటాను కదా! నాకు ఆ మాత్రం వంట రాదనుకుంటున్నావా?" అని నచ్చజెప్పి వాళ్లను పంపించేసి కాగితాలు ముందేసుకుని కూర్చున్నాను.

ఒక్కొక్క కవితకూ థీమ్ దొరకడం ఎంత కష్టమో! దొరికిన తర్వాత కలుగుతున్న భావాల్ని కాగితం మీద అడ్డదిడ్డంగా పరిచేసి ఆ తర్వాత వాటిని సరైన సైజులో కట్ చేసి ఏర్చి కూర్చి టైటిల్ ఇచ్చేవరకూ ఒక తపస్సులా ఉంటుంది తనకు. కవిత పూర్తయినాక చూడాలి దాని అందం. అప్పుడే పుట్టిన బుజ్జాయిలా అది ఊరిస్తూ ఎంత ముద్దొస్తుందో! ఆ కవితను మళ్లీ మళ్లీ మనసులో, బైటకీ చదువుకుంటూ ఉంటే ఎంత గర్వంగా ఉంటుందో! ఆ ఆనందం అనుభవిస్తేగానీ తెలీదు.

ఏమిటో! విశాల 'అన్నీ పిచ్చిరాతలు' అనేస్తుంది. "ఒక్కసారి ఈ కవిత చదవవా ప్లీజ్...." అంటే బలవంతంగా ముక్కుమూసుకున్నట్టు గడగడా చదివేసి "వంటింట్లో పొయ్యిమీద కూర" అంటూ పరుగుతీస్తుంది. తను బహువ్యర్థంగా "టైటిల్ బావుందా" అనడుగుతాడు. అర్జంటుగా తల ఊగించి "రండి భోజనానికి"

అని లాక్కెళుతుంది. ఆమెకి తన కవితలకంటే ముఖ్యమైన విషయాలు చాలా ఉంటాయి. పక్కింటివాళ్ల కథలు, సినిమా కథలు, చీరల కథలు. అవయితే చాలా ఉత్సాహంగా మెరిసే కళ్లతో మాట్లాడుతుంది. బహుశా తన భావుకత్వం ఒక జబ్బేమోనని విశాల భావిస్తుండవచ్చు. జబ్బుల్ని ఎవరన్నా ప్రేమిస్తారా?

"మీ కవిత్వాన్ని నేనెంతగా ప్రేమించానుసర్" తియ్యని స్వరం మనసులో ప్రతిధ్వనించింది. ఉలిక్కిపడ్డాను అది సునీత గొంతు.

ఇప్పుడు సునీత నా పక్కనుంటే పిల్లల్ని పంపించి నా దగ్గరే కూర్చుని నేను చెబుతుంటే ఆమె రాసేదికాదూ!

ఎక్కడన్నా కవిత సాఫీగా సాగట్లేదనిపిస్తే మళ్లీ ప్రయత్నించమనేది. ఎక్కడన్నా కఠిన పదం పడితే 'ఇక్కడ మరో నాజూకైన మాట వేద్దాం. డిక్షనరీ చూద్దామా!' అనేది కాదూ! నేను గొప్ప కవిని కాకపోవచ్చు. కానీ ఇలా రాయడంలో తనకెంత ఆనందం, ఉత్సాహం ఉందో సునీతకి మాత్రమే తెలుసు. అలా మనసు తెలుసుకుని ప్రోత్సహించే తోడు దొరకడం ఎంత అదృష్టం. కానీ ఆ తోడు వద్దనుకున్నాడు తను ఆనాడు.

సునీత తలపుకు రాగానే సోఫాలో వెనక్కివాలి కళ్లు మూసుకున్నాడు. పెదాలు చిన్నగా విచ్చుకున్నాయి. చక్కని చిత్రం చూస్తున్నట్లుగా పగటికల.

సునీతా, నేను రంగ రంగుల పూదోటలో కూర్చున్నాం. సునీత లేచి హంసలా కదలి వెళుతూ "ఇదిగో పాడ్, పేపర్స్, పెన్. నేనలా వెళ్లి పల్లీలు కొనుక్కుని వస్తాను" అంటోంది. వెళ్తున్న ఆమెను చూస్తూ తను చట్టుక్కున రెండు లైన్లు రాశాడు. ఆమె పల్లీలతో తిరిగొచ్చింది. "ఏమిటంతేనా! సరే అయితే, నేనలాపోయి ఫ్రూటీలు తెస్తాను. అప్పటికి రాసెయ్యాలిసుమా!" అంటూ దూరంగా కనిపిస్తున్న కాంటీన్ వైపు నడిచింది. బిడ్డను బ్రతిమాలి, ముద్దు చేసి పాఠం రాయించే తల్లిలా.

తను నిజంగానే పౌరుషపడి పదిలైన్లు రాసేవాడు. ఆమె వచ్చేసరికి, వస్తూనే వెనకనుంచి చూసి బుగ్గమీద ముద్దుపెట్టుకుంది. 'బంగారుకొండ' అంటూ కాగితం తీసుకుని చదవడం మొదలు పెట్టింది. తను తృప్తిగా చూస్తున్నాడామెను. ఆమె కళ్లలో ఆనందం, పొగడ్త నిండిన మధుర భావంతో సన్నటి నీటిపొర. ప్రశంస నిండిన చూపులు తనపై ప్రసరించింది. వెంటనే తన కళ్లలో తడి ఊరింది.

నా కలకి స్టాప్ పెట్టి లేచి కాగితం తీసి చకచకా రాయడం మొదలుపెట్టాను. సునీత నా పక్కనే ఉన్నట్టుగా ఇలాంటి పగటికలకంటే నాకు చక్కని ఇన్స్పిరేషన్ వచ్చేస్తుంది. ఈ కలలు నా సొంతం. ఎలా కావాలంటే అలా, ఎప్పుడంటే అప్పుడు, ఎక్కడంటే అక్కడ వస్తుంటాయి. వెంటనే వెయ్యేనుగుల బలం వస్తుంది నాకు.

ఉత్సాహంగా రెండు గంటలు కష్టపడి పేజీలు నింపి నిద్రపోయాను. లేచేసరికి మూడయ్యింది. బాగా ఆకలేసి వంటిల్లంతా వెతికాను. బిస్కట్లు దొరికాయి. 'అమ్మయ్య' అనుకుంటూ అవి తినేసి టీ చేసుకుని తాగాను. ఆకలి తీరింది. తిరిగి కాగితాలు ముందేసుకుని కూర్చున్నాను.

వాటన్నిటినీ చక్కదిద్ది ఫెయిర్ చేసేసరికి మంచి కవితలు మూడు తయారయ్యాయి. వాటిని తృప్తిగా చదువుకుని గొప్ప రిలీఫ్‌తో పేపరు అందుకున్నాను మనసుకు డైవర్షన్‌కోసం.

సాయంత్రానికి విశాలా, పిల్లలు వచ్చేశారు. చెప్పులు విడుస్తూనే అడిగింది "వంట చేసుకున్నారా?" అని. నా మౌనం చూసి వంటింట్లోకి పోయి చూసింది. ఆమెకు వళ్ళు మండిపోయినట్టుంది. "ఒక్కపూట వంట చేసుకుంటే ఏమవుతుంది. కుళ్లు కాకపోతే. ఆ పిచ్చిరాతలు రోజంతా రాసుకోవడానికి తీరికుంటుంది. ఇంక దేనికీ ఉండదు" సణుక్కుంటూ గబగబా పట్టుచీర మార్చి వంట చేసేసి వడ్డించింది.

మంచి భార్య, భర్త ఆకలి ఎరిగిన భార్య. అతని శరీరాన్ని జాగ్రత్తగా పోషించే భార్య. కానీ ఆమె తిండి తిన్నారా? అని అడిగినంత ఆత్రంగా 'ఏం రాశారు?' అనడిగుంటే తనకడుపెంత నిండి ఉండేదో కదా! ఆ ఆనందంతో అసలు భోజనమే తినకపోయేవాడేమో!

ఆమె ఫంక్షన్ విశేషాలన్నీ విన్న తరువాత పడుకునే ముందు నేనే మనసుండబట్టలేక అడిగాను. "నా కవితలు – మూడు రాశాను. ఒకసారి చూడరాదూ" అని.

"సరే చదవండి" అందామె దుప్పటి మెడవరకూ కప్పుకుంటూ దయ తల్చినట్టుగా ఆ మాత్రానికే నా మనసు దూదిపింజెలా తేలికపడింది.

హుషారుగా ఈల వేసుకుంటూ కాగితాలు తీసుకొచ్చి పక్కనే కూర్చుని చదవడం మొదలుపెట్టాను. ఆమె 'ఊ' కొడుతోంది. ఒక కవిత పూర్తయింది. అందులో నేను

వాడిన పదాల విరుపు గురించి చెప్పాను. అసలా వాక్యంలో అందం ఎలా వచ్చిందో ఆమెకర్థం అయ్యే భాషలో చెప్పాను. ఇలాంటి సందర్భంలోనే దాశరథి ఒక కవిత ఎలా రాశారో వివరంగా చెప్పబోతూ ఆమెవైపు చూశాను. అప్పటికే ఆమె నిద్రపోయి చాలాసేపయినట్లుంది.

చల్లని నీళ్ళు మొహాన కొట్టినట్లయింది. మొహాన్ని అరచేత్తో రుద్దుకుని లైటార్పి పడుకుంటూ 'సునీతా' అనుకున్నాను ఆర్తిగా. ఎంతకీ నిద్రరాలేదు. మనసు గతంలోకి వెళ్లిపోయింది.

పది సంవత్సరాల క్రితం తనొక పల్లెటూర్లో గవర్నమెంట్ కాలేజీలో లెక్చరర్‌గా పనిచేస్తుండేవాడు. ఒకసారి ప్రముఖ వారపత్రికలో పడిన తన కవితకి ప్రథమ బహుమతి వచ్చింది. పక్కనే పరిచయం, ఫోటో వేయడంతో కాలేజీ అంతా తెలిసింది. స్టూడెంట్స్, కొలీగ్స్ అంతా ఒకటే ప్రశంసించారు. తనకి కాస్త గర్వం కలిగింది. ఆనందంతోబాటు.

ఎప్పుడూ కిలకిలా నవ్వుతూ, తుళ్ళుతూ ఉండే సునీత డిగ్రీ ఫైనలియర్ స్టూడెంట్. తెలివైన విద్యార్థి కూడా. ఆ రోజు ఫైనలియర్ బియస్సీ వాళ్ళు కెమిస్ట్రీ లాబ్‌లో ప్రాక్టికల్స్ చేస్తున్నారు. తను టేబుల్ దగ్గర కూర్చుని ఏవో రికార్డ్స్ కాబోలు దిద్దుతున్నాడు.

ఇంతలో 'సార్' అన్న పిలుపు విని తలెత్తాను. సునీత! "మీ కవిత చదివానండీ! సింప్లీ సూపర్బ్! చదువుతున్నంత సేపూ నన్ను నేను మర్చిపోయి ఒక అపురూప భావనా ప్రపంచంలోకి వెళ్ళిపోయానుసర్. కవిత పూర్తయిన తర్వాత ఆకాశం నుంచి కిందపడ్డట్టుగా అనిపించింది. చాలా బాగా రాశారు. మీరింత భావుకులని ఇప్పుడే తెలిసింది. నాకిలాంటి కవిత్వం చాలా ఇష్టం మీరిలాంటి కవితలింకా రాయాలని నా కోరిక. ఆ కవిత చదివిన దగ్గర్నుండీ నా మనస్సు ఆనందంతో పరవళ్ళు తొక్కుతోంది. నేను అనుకున్న భావాలన్నీ అందులో ఉన్నాయి. అందుకే అంత నచ్చిందనుకుంటాను. నోటి కొచ్చేసిందనుకోండి" అనేసి వెళ్లిపోయింది నవ్వుతూ.

తనకొక్కసారి నిజంగానే ఆకాశం నుంచి కిందపడినట్లనిపించింది. సునీత వెళ్ళిపోగానే. ఎంతోమంది తన కవిత బావుందన్నారు క్యాజువల్‌గా. కానీ ఇంత చక్కగా ఎవరూ వ్యాఖ్యానించలేదు. నాలో ఆనందం అర్ణవమైంది.

తొలిసారి నాకింత మార్దవమైన గుర్తింపు దొరికిందనిపించింది. మనం రాయాలేగానీ మన మది లోలోపలి ఆంతర్యంలోని భావాల్ని ఒక్కరు కనీసం ఒక్కరైనా అర్థం చేసుకోకుండాపోరు. కళ్లలో నీళ్లూరాయి ఆనందంతో.

తరచూ నా కవితలు మాగజైన్లలో వస్తున్నాయి. తను ప్రత్యేకించి వాటిపై అభిప్రాయం సునీతనే అడగడం, ఆమె అంతే అభిమానంతో వాటి గురించి విశ్లేషించడం జరగుతోంది. ఒక్కోసారి తనకి బహు నాజూగ్గా ఆమె సలహాలివ్వడం తనకి మరింత ఆనందాన్నే ఇచ్చింది. ఓ రోజు "ఒక ఆదివారం మీ ఇంటికొస్తాను సర్. మీరు రాసిన స్క్రిప్ట్‌లన్నీ చదువుతానుసర్" అని అభ్యర్థనగా అడిగింది. సరేనన్నాను.

అన్నట్టుగానే వచ్చింది. నేనిచ్చిన ప్రతి చిన్న కాగితమూ ఎంతో అభిమానంగా, ఆప్యాయంగా చదివింది. ఆమె అలా నా అక్షరాలను ప్రేమతో నిమిరినట్టుగా చదవడం నా అంతరంగాన్ని కుదిపేసింది. మొత్తం అన్నీ చదివిన సునీత కూడా నాలాగే హృదయ పూర్వకంగా స్పందించింది. ఆయా సబ్జెక్టుల మీద ఆశ్చర్యపడింది. పొగిడింది ఆనందంగా. ఒక విధంగా నా భావుకత్వపు ఆకర్షణకి పూర్తిగా లొంగిపోయిందని చెప్పొచ్చు.

నాకు బ్రతుకు ధన్యమయినట్లనిపించింది. బ్రహ్మచారి జీవితంలో కొత్త ఉత్సాహం చోటు చేసుకుంది. సునీత – నా కలలరాణి ఆమెను చూడగానే అంతులేని ఆనందం, ఉద్వేగం కలుగుతున్నాయి. నన్ను చూసిన సునీత కళ్లలో మెరుపు – నా సాహిత్య కృషికి మధురమైన గెలుపు.

ఫైనల్ ఎగ్జామ్స్‌కి సునీత చాలా కష్టపడి చదువుతోంది. కొంచెం వీక్‌గా కనిపిస్తోంది. కానీ కళ్లలో అవే కాంతులు. ఆ రోజు ఆఖరి సంవత్సరం వాళ్లందరికీ ఫేర్‌వెల్ పార్టీ. ఆ రోజామె కళ్లలో ఒక స్థిర నిశ్చయం, వింత మెరుపూ కనబడుతున్నాయ్. పార్టీ హడావిడిలో ఆమె లాగి విడిచిన బాణంలా తిరుగుతోంది. నా మనసే ఒక తెల్లని కాగితంలా, ఆమె కదలిక దానిపై అందమైన కవితలా తోచింది.

పార్టీ పూర్తయింది. అందరూ అందరికీ వీడ్కోలు చెప్పుకుంటున్నారు. నా కళ్ళు సునీత కోసం వెతికాయి. అప్పటివరకూ టెన్షన్ ఫీలవుతున్నట్టుగా ఒక మూల నిలబడిన సునీత నా దగ్గరగా వచ్చి ఒక చిన్న లెటర్ ఇచ్చింది. ఇస్తుంటే ఆమె చేతులు తీసుకుంటుంటే నా చేతులు చిన్నగా కంపించాయి. నేను తలెత్తి ఆమె వైపు

చూడబోయాను. ఆమె తలవంచి పారిపోయింది. త్వరత్వరగా రూమ్‌కి వెళ్ళి లెటరు విప్పాను.

డియర్ శేఖర్ సర్,

మిమ్మల్ని తొలిసారి చూసింది మొదలు మీపై ఏదో తెలీని అభిమానం బాధించింది నన్ను. మీ కవితలన్నీ చదివాక నిశ్చయం చేసుకున్నాను మీతో నా జీవితం ముడిపడిపోయింది. నాకిప్పుడు ఇదివరకట్లా ఎమ్మెస్సీ చెయ్యాలనీ, పి.హెచ్.డి చెయ్యాలనీ లేదు. మిమ్మల్ని పొందితే చాలనిపిస్తోంది. నా గోల్ మీరేసర్! అయ్ లవ్యూ సర్! నా ప్రేమను మన్నించగలరు.

ఇట్లు మీ అభిమాని

–సుని–

ఆ లెటర్‌ని ఆనందంగా ఎన్ని వందలసార్లు చదివాడో తను. మొదటిసారి చదవగానే తియ్యని అనుభూతి! ఎదలో అలజడి, గాలిలో తేలిపోతున్న భావన! సునీత రూపం ముగ్ధమోహనంగా కళ్ళముందు కదలాడింది. ఎంత ప్లెయిన్‌గా, ఓపెన్‌గా అడిగింది. సిగ్గులు, హొయళ్ళు లేవు. క్లాస్‌లో లెసన్ గురించి అడిగినంత సామాన్యంగా, సుకుమారంగా సూటిగా అడిగింది 'నా ప్రేమను స్వీకరించమం'టూ.

తన ఊహలకు తగిన అమ్మాయి! తన గోలనంతా అర్థం చేసుకోగల పిల్ల తనే కోరివచ్చింది. అలా ఆ రాత్రంతా చిత్రమైన ఆనందాంబుధిలో మునిగిపోయాడు తను. భోజనం కూడా చెయ్యలేదా రాత్రి. మనసుకు ఒక వింత కాంతి చుట్టుకుంది. తెల్లవారేవరకూ అదే ట్రాన్స్‌లో ఉండిపోయాడు. తయారయ్యి కాలేజీకి బయలుదేరేటప్పుడు కాస్త మెలకువ వచ్చినట్టయ్యింది.

కాలేజీకి వెళ్ళిన తర్వాత ఒక్కసారిగా మత్తు దిగిపోయింది. కలల ప్రపంచం నుంచి వాస్తవ ప్రపంచంలోకి విసిరివేయబడ్డట్టుగా వచ్చిపడ్డాను. ప్రాక్టికల్‌గా ఆలోచించడం మొదలు పెట్టాను. ఆమె కులం వేరు. తన కులం వేరు. పెద్దవాళ్ళు చచ్చినా ఒప్పుకోరు. పైగా ఇది పల్లెటూరు తనని పిచ్చి వేషాలు వెయ్యవద్దని ప్రిన్సిపాల్ చేత వార్నింగ్ ఇప్పించగలరు. సునీతకు కూడా బాధపెడతారు. ఇదంతా అల్లరీ, అనర్థం తప్ప ప్రేమ ఫలించే సమస్యలేదు. పైగా సునీత భవిష్యత్తుపై మచ్చపడుతుంది.

ఆమె నెత్తుకుని వెళ్లిపోయి పెళ్లి చేసుకుని అనంతరం పరిణామాలనెదుర్కునేంత ధైర్యం తనకు లేదు.

కానీ తనకు సునీతపై ఆ భావం కలిగిన మాట నిజం. ఆమె తన మనసును తట్టి లేపింది. అపురూప భావనలు కలిగించింది. కానీ ఆమెను అందుకోలేని నిస్సహాయుడు తను. అంత అదృష్టం తలుపు తట్టినా ఆమె చెయ్యందుకునే సాహసం లేనివాడు. ఆ రోజంతా ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చాను. నాకు తెలుసు అది పిరికి నిర్ణయమని, కానీ తప్పదు.

రెండు రోజుల తర్వాత ఒకరోజు కాలేజీకొచ్చింది సునీత. ఇంకో వారం రోజుల్లో పరీక్షలు ప్రారంభం కావలసి ఉంది. ఆమె వచ్చేసరికి తను ఏదో కవితా సంపుటి పుస్తకం చదువుతున్నాడు. నిజానికి గత రెండు రోజులుగా తను ఏ పనీ మనస్ఫూర్తిగా చెయ్యడంలేదు. నటిస్తున్నాడు. మానసికంగా దివాలా తీసినట్టుగా ఉండిపోయాడు. 'సర్' అన్న సునీత పిలుపుకి ఉలిక్కిపడి తలెత్తాను. కొన్ని సెకన్ల వరకూ ఆమెనే చూస్తూ ఉండిపోయి నెమ్మదిగా తలవంచి ఎదురుగా కూర్చోమని సైగచేశాను. ఆమె నా మొహం చూసి కాస్త చిన్నబోయింది. అయినా ఆతృతగా ఉన్నట్టుగా కుర్చీ చివరగా కూర్చుంది. నేను టేబుల్ క్రిందకి చూస్తూ మొదలు పెట్టాను.

"సునీతా! మీ లెటర్ చదివాను, జీవితం అంటే నచ్చిన వ్యక్తిని పెళ్లి చేసుకోవడం మాత్రమే కాదు. ఇంకా ఎన్నో బాధ్యతలుంటాయి. పెద్దవాళ్లని కాదని చేసుకునే పెళ్లి వల్ల సుఖపడేదేమీ ఉండదు. వాస్తవంగా ఆలోచించండి. మీకంటే లోకానుభవం ఉన్నవాడిగా ఫ్రెండ్‌గా చెబుతున్నాను. మీ వయసులో ఇలాంటి ఆకర్షణలు సహజం. మీరు బ్రిలియంట్ స్టూడెంట్. ఇలాంటి అనుభవాల్ని మీరు జయించి ముందుకు సాగి మీ లక్ష్యాన్ని చేరుకోవాలి. అంటే ఎమ్మెస్సీ చేయడం"

మాట్లాడడం ఆపి ఆమెవైపు చూశాను. తల వంచి ఉన్నా ఆమె మొహంలో తీవ్రమయిన ఆశాభంగం నాకు స్పష్టంగా కనబడింది. అయినా కొనసాగించాను.

"ఊహలు వేరు. వాస్తవాలు వేరు. నేనేమైనామిమ్మల్ని బాధపెడితే క్షమించాలి. ట్రైటు అండర్‌స్టాండ్ మై పాయింట్ ఎండ్ విష్యూ ఆల్ ది బెస్ట్!" అని ముగించాను.

చివ్వున తలెత్తిన ఆమె కళ్ళనిండా నీళ్ళు. "ఓ.కె. థాంక్యూ సర్" అంటూ లేచి వడివడిగా వెళ్ళిపోయింది. అదే ఆఖరిచూపు.

ఆ వెళ్ళడం తన జీవితంలో నుంచే శాశ్వతంగా వెళ్లిపోయింది సునీత. ఆమె జ్ఞాపకం తనకి పది సంవత్సరాల తర్వాత కూడా నిత్యనూతన స్ఫూర్తిగా మిగిలిపోయింది. ఆమె తలపు ఒక గాఢమైన ముద్రలా మనసులో పడి శాశ్వతంగా ఉండిపోయింది. తనకి బాధ కలిగినప్పుడల్లా సునీత ఊహాసుందరిగా మారిపోయి తనని అలరిస్తుంటుంది.

నాకు కవితల పోటీలో ద్వితీయ బహుమతిగా అయిదు వందల రూపాయల చెక్, పోస్ట్‌లో వచ్చింది. ఆఫీస్ నుంచి ఇంటికి రాగానే విశాలకి చెప్పాను. "అబ్బా! ఎంత మంచి మాట చెప్పారు" అని ఆనంద పడింది. "నాన్నగారికి ప్రైజ్ వచ్చిందర్రా. మీకేం కావాలో చెప్పండి" అంటూ పిల్లలకి చెప్పింది పక్కింటామెకీ, ఎదురింటామెకీ కూడా తెలియజేసింది. ఉత్సాహంగా.

విశాల నన్ను "ఏ సబ్జెక్ట్ మీద రాశారు కాపీ ఉందా? చూపించండి" అని అడుగుతుందేమో అని ఎదురు చేశాను. కానీ ఆమె ఆ మాటే ఎత్తలేదు. ప్రైజ్ సొమ్ముతో ఏం కొనాలో అని ఆలోచనలో పడి సంభాషణ ప్రారంభించబోయింది. నేను మాట్లాడలేదు.

నాకు బహుమతి వచ్చిందని తెలియగానే ఆనందంతో కూడిన దుఃఖం కలిగింది. నా ఆర్తినీ, అంతరంగ మథనాన్నీ గుర్తించి నా కవితని మెచ్చి బహుమతినిచ్చారు. న్యాయనిర్ణేతలు అన్న కృతజ్ఞతతో మనసు వణికింది. అప్పుడు కలిగిన మనోభావాల్ని విశాలకు చెప్పాలనుకున్నాను. ఆమె అవకాశం ఇవ్వలేదు. రాత్రి పడుకునే ముందు చెబుదామనుకున్నాను. నే వెళ్ళేసరికి ఆమె నిద్రపోయింది.

పక్కనే పడుకున్నాను నిశ్శబ్దంగా కొంతసేపటికి సునీత నా ఊహల్లోకి వచ్చేసింది. కళ్ళు మూసుకుని పడుకున్న నా దగ్గరగా వచ్చి జుట్టులోకి చెయ్యి పోనిచ్చి నుదుటి మీద చిన్నగా ముద్దుపెట్టుకుని 'కంగ్రాట్స్' అంది మంద్రంగా కళ్ళు తెరిచిన నేను ఆమె ఒడిలో తలపెట్టుకుని పడుకున్నాను. వీపు మీద సునీత చెయ్యి నిమురుతోంది.

'మీరసలు బహుమతి వస్తుందని ఊహించారా?" అడిగింది సునీత.

"లేదు" అన్నాను బుద్ధిగా. "ఇప్పుడు రాసిందేనా! పాతదా?"

"అయ్యో! పోటీకని ఒకరోజంతా కూర్చుని రాశాను తెలుసా! వీటితోపాటు మరో రెండు కవితలు కూడా రాశాను"

"మరి టైటిల్ అయిడియా ఎలా వచ్చింది? చాలా బావుంది కదూ. చిగురుమేసిన కోయిల!"

"దాని కాట్టే శ్రమపడలేదు కానీ రెండు మూడుచోట్ల పదాలు ఖచ్చితంగా పడకపోతే ఎంత గింజుకున్నానో తెలుసా" వివరించాను.

"నాకయితే రెండుచోట్ల పదాలు బాగా నచ్చాయి." చెప్పిందామె

"కానీ అసలు అందం ఇక్కడుంది చూడు" చదివి వినిపించాను.

"నిజమే సుమా" అంది తియ్యగా నవ్వుతూ.

"ఇప్పటికైనా ఒప్పుకుంటావా? నాకూ సత్తా ఉందని" అన్నాను గారంగా.

"ఎందుకొప్పుకోనమ్మా! అందుకేగా ఇంత ప్రేమించింది" అంటూ ఆమె మెత్తని చేత్తో నా నుదుటిపై రాస్తోంటే నిద్రపట్టేసింది.

తర్వాతి నెలలో బావమరిది గృహప్రవేశానికని హైదరాబాద్ వెళ్లవలసి వచ్చింది. ఫామిలీతో సహా. ఫంక్షన్ అయిన మర్నాడుదయమే స్నానం చేసి తయారై బిర్లామందిర్‌కి బయలుదేరాను. టైమ్ తొమ్మిదయింది. ఎందుకో ఎండ లేదసలు. కొండపైన చల్లగా ప్రశాంతంగా ఉంది. చక్కని గాలి వీస్తోంది. దర్శనం చేసుకుని పక్కనున్న బుక్‌స్టాల్ వైపు వెళ్లబోయాను. "హలో సర్! హౌ ఆర్యూ సర్" అన్న ప్రాణప్రదమైన గొంతు విని తత్తరపడ్డాను. వెనక్కి తిరిగాను.

సునీత! నా ఊహాప్రేయసి. పట్టుచీరలో దేవతామూర్తిలా ఉంది. ఆమె కళ్లలో గొప్ప తేజస్సు! మూర్తీభవించిన స్త్రీమూర్తిలా ఉంది. సంభ్రమంగా చూస్తూ ఉండిపోయాను నోట మాటరాక.

"బావున్నారా సర్!" అంది నిండుగా నవ్వుతూ తల ఉపానో లేదో!

"ఎప్పుడొచ్చారు. హైద్రాబాద్? ఫామిలీ ఏది? అంది ఆప్యాయంగా.

తేరుకుని చెప్పాను వివరాలు. నవ్వుతూ విన్నది.

"మీరేం చేస్తున్నారు?" అడిగాను అభిమానంగా.

"రెడ్డి కాలేజీలో లెక్చరర్‌గా పనిచేస్తున్నాను. ఆయన ఎం.డి. దిల్‌సుక్‌నగర్‌లో నర్సింగ్ హోమ్ కట్టాం" వివరంగా చెప్పింది అటు తిరిగి భర్తను చెయ్యి ఊపి పిలిచింది. అతను హుందాగా నడిచి వచ్చాడు చిరునవ్వుతో.

"మా వారు కృష్ణకాంత్. ఈయన మా కెమిస్ట్రీ లెక్చరర్ రాజశేఖర్ అని చెబుతుంటాను" ఒకరికొకర్ని పరిచయం చేసింది సునీత.

'అవునవును మిమ్మల్ని బాగా గుర్తు చేసుకుంటుంది మీ స్టూడెంట్. గ్లాడ్ టు మీట్ యూ" చెయ్యి కలుపుతూ అన్నాడతను.

"హలో బావున్నారా" అనడిగాను సమాధానంగా తల ఊపి నవ్వాడు. తర్వాత "వన్ మినిట్" అంటూ వెళ్లిపోయాడతను.

"చెప్పండి. ఎలా ఉన్నారు" అంది సునీత ఆత్మీయంగా తల ఊగించాను. సన్నగా నవ్వుతూ ఆమెను చూస్తూ ఉంటే ఎంతో ఆనందంగా, మరెంతో ఆహ్లాదంగా ఉంది. మాట్లాడాలనిపించడంలేదు. తనే మాట్లాడటం మొదలుపెట్టింది.

"మీకెన్నోసార్లు లెటరు రాయలనుకుని రాయలేదు. మీరు నా జీవితాన్ని గొప్ప మలుపు తిప్పారు. ఆరోజు మీరిచ్చిన సలహాతో పట్టుదలతో చదివి ఎమ్మెస్సీ ఎంట్రెన్స్ రాసి సీటు సంపాదించాను. తర్వాత పి.హెచ్.డి. కూడా చేశాను. జాబ్ చేస్తుండగానే కృష్ణకాంత్‌గారిని పెళ్లి చేసుకున్నాను.

ఈ రోజు నేనీ స్థితిలో ఉన్నానంటే కారణం మీరే. నన్ను వెన్నుతట్టి కర్తవ్యం బోధించిన మీకు ఏమిచ్చినా రుణం తీరదు. అంతటి సహాయం చేసిన మీకు సింపుల్‌గా లెటర్ రాయడం భావ్యం కాదనిపించింది. మీరు ఇప్పుడా కాలేజీలో లేరని తెలిసింది. ఎక్కడున్నారో తెలీలేదు. ఎప్పటికైనా స్వయంగా కలిసినప్పుడే ఈ మాటలు చెప్పాలనుకున్నాను.

ఆ శుభదినం ఇలా వచ్చింది. ఇప్పటికి స్వామి సన్నిధిలో నాకా అవకాశం దొరికింది. మీరేగనక ఆ రోజు నన్నలా గైడ్ చేసి ఉండకపోతే నేనొక గొప్ప ప్రపంచాన్ని మిస్ అయిపోయేదాన్ని. అయామ్ రియల్లీ గ్రేట్‌ఫుల్ టుయూ సర్!" సునీత కళ్లలో

సన్నటి కన్నీటిపొర. కృతజ్ఞతా సూచకంగా ఆమె గొంతులో చిన్న దుఃఖంతో కూడిన బరువు.

అంతవరకూ ఆమెనే చూస్తూ ఆమె మాటలు మంత్రముగ్ధుడిలా వింటున్న నేను ఠక్కున చూపు మరల్చాను. ఆమె కళ్లలో తిరిగిన నీటికి ప్రతిగా నా కళ్లలో నిండిన కన్నీళ్లను దాచడానికి ఇరువురం కొన్ని క్షణాలు నిశ్శబ్దంగా ఉండిపోయాం. పది సంవత్సరాల క్రిందటి రోజుల్ని గుర్తు చేసుకుంటున్నట్టుగా.

ముందుగా ఆమే తేరుకుని "మీరు మా ఇంటికి తప్పకుండా రావాలి ఫామిలీని తీసుకుని" అంది బాగ్‌లోంచి విజిటింగ్ కార్డ్ తీసి ఇస్తూ.

"మరెప్పుడైనా ప్లీజ్" అన్నాను కార్డ్ తీసుకుంటూ.

ఆమె కళ్లలో ఒక్క క్షణం ఆశాభంగం. అయితే అందులో బేలతనం లేదు. పరిపూర్ణ వ్యక్తిత్వంతో పరిమళిస్తున్న నిండు మహిళ ఆమె ఈనాడు. అందుకే మరుక్షణం తిరిగి మామూలుగా అయ్యాయి. ఆమె కళ్లు. కొన్ని సెకన్లు గడిచాక "మరి నేను పోయిరానా!" అంది నెమ్మదిగా.

కలుక్కుమంది నా మనసు. "అప్పుడేనా!" అన్నాయి నా కళ్లు. ఆ కళ్లలో భావం చదివినట్టుగా ఆమె తల వంచుకుంది. కొన్ని క్షణాలు మాటల్లేవు. తర్వాత చిన్నగా "ఆల్ ది బెస్ట్" అన్నాను. ఆమెను కళ్లనిండుగా చూసుకుంటూ.

సునీత భర్త దగ్గరికి వెళ్లి చెప్పినట్టుంది. ఇద్దరూ అక్కడినుండే చెయ్యి ఊపారు. నేను కూడా ఊపాను.

హైదరాబాదు ప్రయాణం ముగించుకుని తిరిగి వచ్చేశాము. హైదరాబాదులో నేనేదో పోగొట్టుకున్నాననిపిస్తోంది. మనసు వెక్కి వెక్కి చిన్నగా ఏడుస్తున్న భావన. కారణం ఇదమిత్థంగా తెలియడం లేదు. గుండెలు మోయలేని ఏదో దుఃఖాన్ని మోస్తున్నట్లున్నాయి. నా మనసులోని వింత భావాల్ని విశ్లేషించుకుంటూ బాధకు కారణం వెతుకుతున్నాను. నిస్సహాయంగా. హైదరాబాద్‌లో సునీత కనబడింది. అది మంచి సంఘటనేకదా! "నా చక్కటి భవిష్యత్తుకు దారిచూసిన గైడ్ మీరు" అని కృతజ్ఞతలు కూడా చెప్పింది కదా! అది నేను గర్వపడవలసిన విషయమే కదా! మరి దిగులెందుకు కలుగుతోంది? ఎంత తరచి ఆలోచించినా అర్థం కావడంలేదు. ఏదో

అసంతృప్తి. నా మనసు లోలోపలి పొరల్లో ఏదో పాయింట్ మిస్ అవుతున్నాను. ఆ పాయింట్ కోసమే వెతుకుతున్నాను.

హఠాత్తుగా ఒకరోజు రాత్రి కలత నిద్రలో ఒక ఆలోచన స్ఫురించింది. 'నాకు సునీత కనబడకపోతే నాకీ బాధ ఉండేది కాదేమో! ఉలిక్కిపడ్డాను. 'అదేమిటి? కనబడడంలో తప్పేమిటి?' అర్థం కాలేదు. నా మూగ మనసు మౌనంగా ఉండిపోయింది.

ఒకప్పుడామె నా ముంగిట్లో పూచిన మొగ్గ. ఇప్పుడామె మరొకరి సిగలో నిండుగా విరిసిన గులాబి. మొగ్గ నాదిగా భావించిన నాకు ఈ పువ్వెందుకో పరాయిదిగా అనిపిస్తోంది. ఇందులో నా మొగ్గ సొగసులు లేవు నిండుగా విరిసిన గంభీరత తప్ప. ఈ పూవులో ఆనాటి సిరిమొగ్గ ఆనవాళ్ళు మచ్చుకైనా లేవు.

ఇంతకాలం నా మదిలో సువాసనలు వెదజల్లిన సునీత తలపు ఈ సునీత రాకతో మాయమయ్యింది. ఏదీ! నా ఎదలో ఒదిగిన ఆ ముగ్ధమోహన రూపం! పిచ్చిగా వెతికాను. కనబడడంలేదు. మళ్ళీ మళ్ళీ ప్రయత్నించాను. అస్సలు రూపమే తోచట్లేదు. జ్ఞాపకాల దొంతర్ల నుంచి చిత్రంగా మాయమయిపోయింది. కేవలం రేఖారూపం మాత్రం మిగిలింది.

'నో! అలా కాకూడదు. ఎక్కడ నా సునీత! ఎక్కడ వ్యర్థంగా అన్వేషిస్తూనే ఉన్నాను. ఫలితంలేదు. అటు తర్వాత అంత దుఃఖంలో కూడా, ఓదార్పు లేపనాన్ని నా గుండెకు రాసి సేద దీర్చే నా కలల దేవత మరి కనిపించలేదు. పది సంవత్సరాలుగా నా మనసు తోటలో కమ్మని పాటలు పాడుతూ నన్నలరించిన నా ఊహల కోయిల' మూగవోయింది.

**(ఆంధ్రభూమి మాసపత్రిక, ఫిబ్రవరి, 1999)**

# గుప్పిటలో గోదారి

**–ఆకెళ్ల వెంకటసుబ్బలక్ష్మి**

"ఎక్కడికెళ్ళారు ఇంతసేపూ?" ఉరిమినట్లు వినిపించింది ఊర్మిళ గొంతు తలుపు తీస్తూ. పిల్లిలా అడుగుపెట్టబోతున్న భాస్కరం ఉలిక్కిపడ్డాడు.

అనుకున్నంతా అయ్యింది. ఎంత శబ్దం చెయ్యకుండా వచ్చి పడుకుందామనుకున్నా కుదరలేదు. ఊర్మిళని పాము చెవులు, అక్కడికీ ప్రొద్దున అమ్మకి చెప్పి వెళ్లాడు. హాల్లో పడుకుని, తమ రాగానే తలుపు తీయమని చెప్పాడు. కానీ ఈవిడెలా ఎదురయ్యిందో? తన పిచ్చిగానీ, తననే నిలువనియ్యదు. అల్లాంటిది గంగిగోవులాంటి అమ్మ ఒక్క లెక్కా? అమ్మహాల్లో పడుకోబోయినప్పుడే గ్రహించి వుంటుంది. అమ్మని కూడా ఏదో అనే వుంటుంది పాపం అమ్మ.

"మాట్లాడరేం? పిల్లల పరీక్షలు తొందరగా రమ్మని చెప్పావా? షికార్లు తగ్గించుకోమన్నానా? అయినా లెక్కలేదన్నమాట. స్టీరియోఫోనిక్ సౌండ్‌తో వీధరుగు మీద నుంచొని అడుగుతోంది.

సభ్యత కోసం ఎవరూ బయటకి రాకున్నా, ఆ నిశ్శబ్ద వేళ ఆ మాటలు అందరికీ వినిపిస్తూనే వుంటాయని తనని గురించి అందరూ నవ్వుకోవడమో లేక జాలి పడడమో చేస్తుంటారని కూడా తెలుసు. కానీ ఏం చేస్తాడు? "పూజ కొద్దీ పురుషుడు" అన్న వాళ్ళున్నారు కానీ, "పుణ్యం కొద్దీ పెళ్లాం" అని ఎవరూ అనలేదు కదా!

"లోపలకి రండి. ఎందుకా కొంగజపం?" మరోసారి ఉరుముతూ లోపలికి వచ్చింది.

"అమ్మయ్య!" అనుకుంటూ లోపలికి వచ్చాడు భాస్కరం. కానీ ఇంతలోనే...

"నేను ఇంత అడిగినా మాట్లాడరేం? ఇంత సేపూ ఎక్కడ ఊరేగారు?" అంది మళ్ళీ.

"ఆఫీసులోనే ఉన్నాను. పని"... అన్నాడు లోగొంతుకతో భాస్కరానికి చిన్నగా మాట్లాడడం ఎంత అలవాటో, ఎంత ఇష్టమో.... అంతకు పూర్తి వ్యతిరేకం ఊర్మిళ.

"నిజంగానేనా? నేనొక్కదాన్నే ఛావాలా అన్నిటికీ. ఇంటి పని, పిల్లల చదువులూ అన్నీ నా బాధ్యతలేనా?" ఆఫీసులో ఉన్నాననగానే కొంచెం శాంతించి, కంచం పెట్టింది. అయినా కొంచెం విసురుగానే.

"నే తింటాలే అన్నీ ఇక్కడే వున్నాయిగా" అన్నాడు సాధ్యమైనంత మెల్లిగా తల్లికి వినిపిస్తే అదో బాధ. ఆవిడ ఓర్చుకోలేక చిన్నమాట, "మగాడు, ఇంటికి రాగానే ఎందుకమ్మా" అంటుంది అంతే... అయిపోయిందే ఇలా బాధ్యత లేకుండా పెంచినందుకు ఆవిడని నానా మాటలు అంటుంది. కన్న ప్రేమ వల్లా, భాస్కరం నెమ్మదితనం, మెతకతనం తెలియడం వల్ల తల్లి ఎప్పుడైనా అలా అంటుంది. ఆవిడకి భర్తని ఎదిరించడం అనేది మింగుడు పడని విషయం. అత్యంత ఆశ్చర్యకరం ఇదైతే బాధాకరం కూడా

"నువ్వెళ్లి పడుకో" అన్నాడు గొడవ అంతటితో సద్దుమణుగుతున్నందుకు ఆనందిస్తూ. ఖర్మ... దీని పేరు ఊర్మిళే గానీ, దీనికి నిద్రే రాదు. ఇంట్లో అందరూ పడుకున్నాకే దానికి నిద్ర వస్తుంది.

"ఇదేమిటి? రాత్రి అన్ని అబద్దాలు చెప్పారు" ఇంకా నిద్ర మంచం మీంచి లేవలేదు భాస్కరం ఉరుముల్లాంటి మాటలతో బలవంతంగా కళ్ళు తెరిచాడు.

ఇంటర్‌పోల్ ఏజెంటులా చేతిలో పేపరుతో గుడ్లురిమి చూస్తోంది.

"ఏ... ఏమిటి" అన్నాడు తడబడుతూ...

పేపరు పక్కమీద విసిరేసింది. కల్చరల్ జోన్‌లో తన పేరు కింది అండర్‌లైన్ చేసి ఉంది. వద్దన్నా వినకుండా తనను రాత్రి బలవంతంగా స్టేజీ మీదకు లాగి ప్రార్థనా గీతం పాడించారు. తన పేరు పేపర్లో పడింది. కొంప మునిగింది. అనుకున్నాడు. తన జీవితం మీద తనకే విరక్తి పుట్టింది.

"అబద్దాలు... అబద్దాలు. నోరు విప్పితే చాలు అబద్దాలు.. పిల్లల పరీక్షలు బాబూ రోజులెలా వున్నాయి. కాంపిటీషన్ వరల్డ్ కదా. మనమూ కొంచెంద శ్రద్ద పెడితే బాగుంటుంది. అన్నా. చెవినేసుకుంటారా? మన సభలూ, మన నాటకాలు,

మన కీర్తి మనకి కావాలి. పెళ్ళాం, పిల్లలెలా పోతే యేం? అల్లాంటప్పుడు పెళ్లి ఎందుకు చేసుకోవాలి? వడగళ్లలా రాలుతున్నాయి మాటలు.

లేస్తూనే మూడ్ ఆఫ్ అయిపోయింది. ఛీ... ఛీ... ఏం బ్రతుకు. తన కిష్టమైన ఒక నాటకం చూడడానికి లేదు. ఒక సంగీత సభకి వెళ్ళడానికి లేదు. గొంతెత్తి పాడుకోవడానికి లేదు. సాహితీ సభలకి వెళ్లడానికి అసలే లేదు. ఆఫీసుకెళ్లి జీతం డబ్బు తెచ్చి, ఇంట్లో పోయాలి. పెళ్లాన్ని షికారుకు తిప్పాలి. పిల్లలని చదివించాలి. ఇదేనా జీవితం? ఇంత సంపాదించినా ఏం లాభం? తన కోరిక ఒక్కటీ తీరదు. ఒక డెక్ కొనుక్కోలేదు. మంచి పుస్తకాలు కొనుక్కోలేదు. నాటకాలు చూడలేదు. కేబుల్ పెట్టించలేదు. చదువులు పాడవతాయంటుంది లేదంటే అనవసర ఖర్చులంటుంది.

ఇంతకీ తన తప్పేమిటో అర్థం కాదు. తానేమైనా తాగి తందనాలడుతున్నాడా? రేసులకెళుతున్నాడా? పేకాటాడుతున్నాడా? కనీసం సిగరెట్లు అయినా తాగడు. తనకి చిన్నప్పటి నుంచి సాహిత్యాభిలాష, నాటకాభిలాష ఎక్కువ. అందులో పద్య కవితలంటే మరీ ఇష్టం. పద్య నాటకాలు, పౌరాణిక నాటకాల సంగతి సరేసరి. చెవి కోసుకుంటాడు. ఎన్నో రోజులకి మంచి నటులతో పద్య నాటకం వేశారు. కోరిక చంపుకోలేక భయపడుతూనే వెళ్ళాడు. అక్కడికీ నటించే కోరికను ఎప్పుడో చంపుకున్నాడు. కనీసం చూడడానికయినా అదృష్టం లేదా? తన జీవితం మీద తనకే విసుగేసింది.

అసలు చిన్నప్పుడు తనని అందరూ ఎంత మెచ్చుకునేవారు! “ఆల్ రౌండర్‌వి” రా నీవు అనే వాళ్ళు. అందరూ ఏదో ఒక దాంట్లో వుంటారు. తను అనేక రంగాల్లో వుండడమే కాక. పేరు ప్రావీణ్యం కూడా పొందాడు. పెళ్లయింది. అన్నింటికీ ఫుల్‌స్టాప్ పడింది. నిజంగా ఇంకెవరయినా అయితే ఇలాంటి ప్రముఖుడు భర్తగా దొరికినందుకు ఎంతగా ఆనందించేవారో తన భార్య.....?

ఎప్పుడో ఆగింది జడివాన. రాత్రి కురవకుండా ఆగిన వర్షం పొద్దున తుఫానులా అయింది. తల్లి జాలిగా, కోపంగా తన వంక, భార్య వంక చూడడం తప్ప ఏం చెయ్య లేకపోయింది. అంటే ఆవిడకి ఇంట్లో ఆ పాటి స్థానం వుండదని తెలుసు. తండ్రి లేదు. తనకి చిన్నప్పుడు అనేక రంగాల్లో బహుమతులు వచ్చేవి. తనకి సంగీతంలో ప్రైజ్ వస్తే నా బాబు ఘంటసాల అంతటి వాడు అవుతాడు”

అనేది. నాటకంలో ప్రైజ్ వస్తే ఎస్వీ రంగారావంతటి వాడు అవుతాడని ఏ కథలో, కవితలో రాసి బహుమతులు వస్తే ఏ రాచకొండ అంతటి వాడో అవుతాడని మురిసిపోయేది తల్లి. చివరకి ఒక సామాన్య వ్యక్తి కంటే తక్కువ అయ్యాడు. అతనికి కనీసం చూసే స్వాతంత్ర్యం అయినా వుంటుంది. తనకదీ లేదు.

ఫోన్ మోగింది వింటూ అలాగే వున్నాడు. ఎవరూ ఎత్తలేదు. ఎత్తే స్వాతంత్ర్యం లేదు. ఎక్కడి నుంచి ఫోన్ వచ్చినా తనే అందుకొని సెన్సార్ చేసేస్తుంది. సగం సార్లు తన ఎదుటే తను లేడని చెబుతుంది. అందుకే తనకి ఆత్మీయులు కూడా దూరమవుతున్నారు. తనకే ఇష్టం లేక గర్వంతోటి అలా చేస్తున్నాడేమో అనుకునే వాళ్లే ఎక్కువయ్యారు. ఆహ్వానం పంపినా, తను ఎక్కడికీ వెళ్లకపోవడం వల్ల ఎంత ఇది అయినా అందరి వద్ద భార్యని బయటపడేయలేడు కదా. అందుకే తనకి కుదరడం లేదని, బిజిగా వుంటున్నానని చెప్పడంతోటి తనకి పొగరు ఎక్కువయిందని చాలా మంది భావన.

పోనీ ఇంతకీ ఆమె పడిపోయే పాటుకానీ లేదా కష్టపడిపోవాల్సిన అవసరం గానీ ఏమీ లేవు. పిల్లలని మంచి స్కూల్లో వేశాడు. ట్యూషన్ పెట్టించాడు. ఇంటి పనులకి పిల్ల వుంది. వంట తల్లే చేస్తుంది. చేతినిండా పెద్దల సంపాదన, తన సంపాదన. ఎంత ఆనందించవచ్చు! "అన్నీ వున్నా అల్లుడి నోట్లో శని" అంటారు ఇదేనేమో. చాలా మంది ఆడ వాళ్లు ఇంటా బయటా ఎంత కష్టపడతారు? అది కూడా లేదామెకి ఉద్యోగం కూడా చెయ్యదు.

"ఇదిగో మీకే. నిన్న అద్భుతంగా పాడారట. వాళ్ల ప్రోగ్రాంకి కూడా పాడాలట. ఇంకో ఆహ్వానం వచ్చింది. వెళ్లండి" విసురుగా అంటూ కార్డ్‌లెస్ ఫోన్ మీద పడేసి వెళ్లింది.

ఏ మనిషో! అవతల వాళ్లకి వినిపిస్తాయని కూడా లేదు. మళ్లీ చదువుకుంది. ఏం లాభం? పోనీ ఉద్యోగానికయినా పోదూ అంటే... "నాకేం అవసరం ఉద్యోగం" ఉంటుంది.

తనకి వీలు కాదని చెప్పి పెట్టేశాడు. కానీ మనసంతా దుఃఖంతో నిండిపోయింది. ఎంత మంచి సంస్థ. సినిమా మ్యూజిక్ డైరక్టర్ కూడా వస్తున్నాడట. ఈ మహాతల్లి

అన్నది అవతల వినబడినట్లున్నది. 'ఇంత మంచి అవకాశం అందుకోలేకపోతున్నావు. నీ ఖర్మ" అన్నట్లు మాట్లాడి పెట్టేశారు.

నిజంగా తన దురదృష్టమే నిరాశగా అనుకొని పెట్టింది తిని, ఆఫీసుకి బయలుదేరాడు. కారున్నా, ఆఫీసుకి బస్సులోనే వెళ్లాలి. లేకపోతే టైముకి ఇంటికి రాడని భయం.

తన క్లోజ్ ఫ్రెండ్ అంటాడు. "ఎందుకు రా నువ్వింత భరిస్తావు?" అని భరించక ఏం చేస్తాడు? భరించాలి. లేదా విడిపోవాలి. అంతేగా పిల్లల కోసం విడిపోలేడు. ఇక మిగిలింది భరించడమేగా! ఆదే చేస్తున్నాడు.

సాధారణంగా పెళ్లయితే భర్త లేదా అత్తమామల ఆజ్ఞ ప్రకారమో, కోరిక ప్రకారమో కళలు చంపుకొని, ఇంట్లో కూర్చుని బాధపడే ఆడవాళ్లని చూసాడు. విన్నాడు కానీ, మగాడు భరించడం, సహించడం, కళలు చంపుకోవడం ఎవరూ విని ఉండకపోవచ్చు. కళలు చంపుకున్న ఆడవాళ్లని పాపం ఆడది అనుకునే వాళ్లకి. తన లాంటి మగ వాళ్లు కూడా వుంటారని తెలిసో తెలియదో. ఒక వేళ తెలిస్తే ఏమంటారు? అనుకుంటూ గుండెల్లో పొంగే గోదారిని గుప్పిట్లో బిగిస్తూ ఆఫీసు బస్సెక్కాడు భాస్కరం. ఎందుకంటే గుప్పిట్లో వున్నంత సేపే గుట్టు. గుప్పిట విప్పితే అంతా రట్టే కదా.... పాపం భాస్కరం.

# తోడికోడలు

– చంద్రలత

**తో**చీ తోచనమ్మ తోడికోడలు పుట్టింటికి వెళ్ళిందంటారు.

అదేమో కానీ మా తోడికోడలు మా పుట్టింటిలోనే మొదటిసారిగా నన్ను కలిసింది. అది కూడా సంపత్‌తో నా పెళ్ళి విషయాలు మాట్లాడడానికి.

నేను అప్పటికే అమెరికాలో కంప్యూటర్స్‌లో యం.యస్. పూర్తి చేశాను. ఉద్యోగంలో చేరడానికి ముందుగా నా చిరకాల సైబర్ స్నేహితుడు సంపత్‌తో వివాహం జరగడమే సబబని అందరితో పాటు మేమూ భావించడంతో – ఆ వేసవిలో హైదరాబాద్‌కు వచ్చాను.

సంపత్ డెట్రాయిట్‌లో జి.యం. మోటార్స్‌లో పని చేస్తున్నాడు. అతనూ నేను వచ్చిన వారంలోనే హైదరాబాదు వచ్చాడు.

ఇద్దరమూ ఒకరినొకరిని కలవడం అదే మొదటిసారి.

మా కలయికతో మా రెండు కుటుంబాలు కలిసిపోయాయి.

కొత్త చుట్టరికాలు, కొత్త బంధువులు. ఎందుకోగానీ అందరిలోనూ సంపత్ వదిన శారద నన్ను ఎంతో ఆకట్టుకుంది.

శారద ఒక చిన్న పల్లెటూరు నుంచి హైదరాబాదు వచ్చింది. అదీ సంపత్ వాళ్ళన్న అనంత్‌ను పెళ్ళాడాకే. వాళ్ళది రైతు కుటుంబం. పెద్దగా చదువుల్లేవు.

శారద డిఫార్మసి చేసింది. పెళ్ళయి నగరానికి రాగానే ఓ పెద్ద ఫార్మస్యూటికల్ కంపెనీలో చిన్న ఉద్యోగానికి చేరింది.

నిజానికి ఇవేవీ నన్ను ఆకర్షించలేదు.

శారద నాకన్నా వయసులో ఐదారేళ్ళు పెద్దది. ఎత్తులో నాకన్నా ఐదారు అంగుళాలు చిన్నది.

ఈ విషయమూ నన్ను ఆకర్షించేది కానేకాదు.

ఆమె కట్టుబొట్టు మాట మన్నన అన్నీ మామూలుగానే వున్నాయి.

అయితే నన్ను ఆకర్షించేది ఆమె కళ్ళల్లో కొట్టొచ్చినట్లు కనబడుతున్న ధీమా. ప్రపంచంలో నన్నెవరూ ఎదిరించలేరన్నంత ధీమా. ఆ ధీమాను వత్తి చూపుతూ కొద్దిగా ఎత్తినట్లున్న కనుబొమలు.

నాకు తెలియని విషయం ఏదైనా వుందా అన్నట్లు నిటారుగా పైకెత్తిన తల.

ఆమె ధీమాకు పక్క తాళం వేస్తున్న చురుకైన చూపులు.

ఆ చూపుల్లో నాకు అహంకారం కనిపించలేదు. అభిజాత్యం కనిపించలేదు.

కానీ ఎందుకో ఆ చూపులు నన్ను వెంటాడుతూనే ఉన్నాయి.

ఎటు వెళ్ళినా.... ఏం చేసినా...

శారద నుంచి నేను ఆశించిన ప్రశంసను పొందలేకపోవడం వలన కలిగిన భావనే బహుశా నన్నిలా వెన్నాడుతుందేమో... తెలీదు.

ఏది ఏమైనా నాకు తెలియకుండానే ఆమెపై ఒక ప్రత్యేక ఆసక్తి ఏర్పడిపోయింది.

సంపత్ అన్నయ్య అనంత్ ఫైనాన్స్ కంపెనీ పెట్టుకున్నాడు. శారద ఉద్యోగం. వాళ్ళకు ఉన్న చిన్న పిల్లవాడిని శారద వాళ్ళ పుట్టింటిలో వదిలి వచ్చింది. మామయ్య చనిపోవడంతో అత్తయ్య కూడా శారద వాళ్ళ దగ్గరే వుంటోంది.

పెళ్ళి పనులన్నింటిలోనూ పెళ్ళికొడుకు తరపు పెద్ద ముత్తైదువ శారదే. అందువల్ల పెళ్ళి పనులు అయ్యేలోగా అమ్మనాన్నలకు బాగా దగ్గరయ్యింది.

సంపత్ నేనూ అమెరికా బయలుదేరబోతుండగా. శారద వీడ్కోలు చెప్పడానికి వచ్చింది.

శారద వచ్చిన సమయంలో నేనూ సంపత్ షాపింగ్‌కు వెళ్ళాము. అమ్మానాన్నలతో శారద మాట్లాడుతూ ఉండగా నేనూ వచ్చాను. సంపత్ మరేదో పని ఉండడంతో ఇంటికి రాలేదు.

వచ్చీరాగానే అప్పటికే కొనసాగుతోన్న శారద వాళ్ళ సంభాషణలోకి నేనూ తలదూర్చాను.

"ఏంటీ నాన్నా... శారదను ఇబ్బంది పెట్టేస్తున్నారు?"

చెప్పాను కదా నాకన్నా ఐదారు అంగుళాలు చిన్నదైన శారదను అక్క అని పిలవాలనిపించలేదు. వావివరసలకేమి గానీ – శారదకూ ఏమీ చిన్నతనంగా లేదు. అదే ధీమా. అదే చూపు.

"చర్చించాల్సిందే – ఈ మధ్యన ఎక్కడ చూసినా పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయ్ చిట్‌ఫండ్ కంపెనీలు. చాలామంది ఇబ్బందుల్లో పడుతున్నారు. అదే చెపుతున్నా–"

"ఊరుకో నాన్నా... ఏదైనా శుభం కోరుకోవాలి గానీ..."

"నేనూ అదే అంటున్నా...." అమ్మ నాకు వత్తాసు పలికింది.

శారద చిరునవ్వుతో మమ్మల్నే చూస్తోంది.

"చిత్ర మాటలకేమి గానీ శారదా... ఓ మాట అడుగుతా చెప్పు..."

"అడగండంకుల్.... " శారద నవ్వుతూనే అంది.

"నాకు తెలిసి మీకు ఈ హైదరాబాదులో పరిచయాలు గానీ పలుకుబడిగానీ వెన్నుదన్నుగానీ పెద్దగా లేదు. మరి డబ్బులు ఎలా రికవరీ చేస్తున్నారు? అది మీ వల్ల అయ్యే విషయం కాదే–"

శారద చివ్వున తలెత్తింది. బుస్సుమంటోన్న నాగిని గుర్తొచ్చింది నాకు. అమ్మో ఎంత కోపం! అయినా అదంతా ముఖంలోనే. మాటలు మామూలుగానే ఉన్నాయి.

"పలుకుబడి ఉంటేనే అన్నీ సాధ్యమవుతాయా అంకుల్... మేం రెండేళ్ళ నుంచీ చిట్టీలు వేస్తున్నాం. ఎవరితో ఇబ్బంది రాలేదు. అందరూ కడతారు. ఇక ముందూ కట్టాల్సిందే!"

శారద గొంతులో గర్వం తొణికిసలాడింది.

"వెరీగుడ్! అంత విశ్వాసమూ దానికి దగ్గ సామర్థ్యమూ మీకుంటే మంచిదే. కాకపోతే అనంత్ అంత మంచి ఉద్యోగం మానుకొని ఇలా చేయడం మంచిది కాదేమో– ఈ పాటికి ఆడిటర్‌గా తనే స్వంతంగా ప్రాక్టీసు పెట్టేవాడు కాదూ – పక్కదారి పట్టలేదూ–"

"ఆడిటర్‌గా ఎప్పటికంకుల్ సెటిల్ అయ్యేది? ఇప్పుడు చిట్టీ వేసిన ప్రతిసారీ ఒక చిట్టీ మాకు మిగిలిపోతుంది. కొత్తగా పదిలక్షల చిట్ వేసాం. వచ్చే నెల్లో ఇరవైలక్షలది వేయబోతున్నాం. రెండు అయ్యేలోగా ముప్పై లక్షలు మిగులుతాయి కదంకుల్...." శారద కళ్ళు మిలమిల మెరిసాయి.

అమ్మో, కొంపదీసి నాన్నని ఓ చిట్టీ కట్టమనదు కదా– నేను అనుమానంతో కళ్ళను చిట్లించాను. బతికించింది. నాన్ననేమీ అడగలేదు.

అయితే నాన్న ఎందుకంతగా శారదను నిరుత్సాహపరచాలని ప్రయత్నిస్తున్నాడో నాకు అర్థం కాలేదు. అయినా ఎవరి పని వారిది. నాన్న ఎందుకు వాళ్ళ వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడం? ఉచిత సలహాలు గుప్పించడం! నాన్న ఎప్పటికి మారతాడో...

"మీరు అన్నది నిజమే అంకుల్. ఒక్కోసారి చిట్టీ పాడుకున్న వారి దగ్గర్నుంచి డబ్బు కట్టించడం గగనమై పోతుంది. కానీ చాలా చిట్టీలు మా ఆఫీసు వాళ్ళే వేస్తున్నారు. మా మేనేజర్ కూడా వేస్తారు. అందుకే డబ్బు సులభంగానే రికవరీ అవుతుంది. మా ఆఫీస్‌లో చాలామంది మా ఫైనాన్స్ ద్వారానే బాగుపడ్డారు–" శారద ఎంతో సంతోషంగా చెప్పింది.

శారదా కీపిటప్! నేను అభినందించాను మనసులోనే. పైకి చెప్పడానికి

ధైర్యం చాలలేదు. శారద ముఖంలోని విశ్వాసం మరొకరి నుంచి ప్రోత్సాహాన్ని ఆహ్వానించేలా లేదు.

ఆ రోజే శారదను చివరిసారిగా కలిసింది.

మేము అమెరికా వెళ్ళి ఎవరి ఉద్యోగాల్లో వాళ్ళం చేరిపోయాం.

సంపత్ నేనూ క్షణాల్ని కొలుచుకుంటూ నిమిషాల్ని తూకమేస్తూ మా రొటీన్‌లోకి పడిపోయాం. ఆరేడు నెలలు గడిచిపోయాయి.

ఓ రోజు సమయం కాని సమయంలో నాన్న దగ్గర నుంచి ఫోన్.

నేనెంతో ఆశ్చర్యపోయాను. భయపడ్డాను కూడా. ఏం ఉపద్రవం ముంచుకొచ్చిందోనని.

ఎందుకంటే నాన్న ఒక వాచీ అమెరికా టైం సెట్ చేసి వుంచారు. వేళకానివేళ మమ్మల్ని నిద్రలేపి ఇబ్బంది పెట్టకూడదని.

మేమేమీ భారతీయ సమయాన్ని పాటించం. తరచు వాళ్ళని అర్ధరాత్రి అపరాత్రి నిద్రలేపి పలకరిస్తూనే వుంటాం. అది వేరే విషయం.

ఎటూకాని సమయం అర్ధరాత్రి రెండున్నర గం॥లకు నాన్న ఫోన్ చేయడంతో చాలా భయపడి పోయాను.

ఆ భయంతో ఓ చేత్తో ఫోన్ పట్టుకొని మరోచేత్తో గాఢనిద్రలో వున్న సంపత్‌ను గబగబ తట్టి లేపేసాను. సంపత్ ఓ మూలుగు మూలిగి మళ్ళీ ముసుగేసాడు.

"ఏంటి నాన్నా విషయం?" నేను భయం భయంగా అడిగాను.

"కంగారు పడకు!" నాన్న నెమ్మదిగా అన్నా ఆ గొంతు మామూలుగా లేదు. ఆందోళనను గంభీరం కింద అణిచిపెట్టినట్లుంది.

"శారద ఇక్కడే వుంది!"

"ఓహ్!" నేను తేలిగ్గా గాలి వదిలాను. "కంగారు పెట్టేసావుగా నాన్నా... శారదేగా వచ్చింది! మేం తరచూ మాట్లాడుతూనే వుంటాంగా. ఏమైనా విశేషాలున్నాయి ఏంటి? అత్తయ్య ఆరోగ్యం అదీ..."

"అనంత్ కనిపించడం లేదు!"

"వ్వాట్!?!" నాకు తెలియకుండానే నేను హైదరాబాద్‌కు వినిపించేంత గట్టిగా అరిచాను.

సంపత్ నిద్రమత్తు వదలడమే కాదు మంచం మీద ఎగిరి నా పక్కకు వచ్చి పడ్డాడు.

"హేయ్... చిత్రా... ఏంటి విషయం?"

నేను మౌనంగా ఫోను సంపత్ చేతిలో పెట్టబోయాను.

"చిత్రా..." ఫోన్‌లో నాన్న గొంతు పక్కనున్న సంపత్ గొంతు కన్నా గట్టిగా వినిపించింది.

"ఆ... నాన్నా.." నాకెలా స్పందించాలో తెలియడం లేదు.

"సంపత్‌ని కంగారు పెట్టకు. విషయమంతా విని నిదానంగా చెప్పు. అనంత్ ఎక్కడికి వెళ్ళాడో తెలియడం లేదు. ఇవ్వాళకి రెండు వారాలు. శారద నా దగ్గరకి ఇప్పుడే వచ్చింది. నీకు తెలుసుగా... అనంత్ వ్యాపారం.... చిట్టీలు కట్టిన వాళ్ళంతా శారదని నిలేస్తున్నారట...." నాన్న చెపుతూనే వున్నారు.

నా కళ్ళ ముందు శారద రూపం మెదులుతూ వుంది.

నాకేం అన్నట్లున్న ఆమె కళ్ళు ధీమాగా వున్న ఆమె చూపులు.

నేనేమి సమాధానం చెప్పానో నాకే తెలియదు.

"నాన్నా తనకెలాగైనా సహాయం చెయ్యి"

"నువ్వు ప్రత్యేకంగా చెప్పాలా చిత్రా..." నాన్న ఫోన్ పెట్టేసారు.

నేను సంపత్‌తో విషయమంతా నెమ్మదిగా వివరించాను. సంపత్ హడావిడి పడుతూ అనంత్ స్నేహితులకు బంధువులకు ఫోన్లు చేసాడు. అనంత్ ఎక్కడికి వెళ్ళి ఉండవచ్చునో నన్న సమాచారం ఎవరూ ఇవ్వలేకపోయారు.

సంపత్ నాన్నతో మాట్లాడాడు. నాన్న లాయర్‌తో ఆడిటర్‌తో మాట్లాడాడు.

నెలలు గడిచాయి.

మాకు సెలవు దొరికీ దొరకడంతో హైదరాబాద్‌కు బయలుదేరాం.

సంపత్ నేరుగా శారద వాళ్ళింటికి వెళ్ళాడు. నేను అమ్మానాన్నల దగ్గరకు.

నాన్న శారద ఏ స్థితిలో తమ దగ్గరకు వచ్చిందో చెప్పారు.

"అనంత్ అదృశ్యమైన సంగతి ఎలా తెలిసిందో ఏమో కానీ – అతను కనిపించకుండా పోయాడు అని శారద గ్రహించక ముందే – ఈ చిట్టీలు కట్టిన వాళ్ళంతా పసిగట్టేసారు. చెమటోడ్చి దాచిన డబ్బు అనంత్ దగ్గర గుమ్మరించిరి. మరి వాళ్ళ కడుపు రగిలిపోదూ..."

"ఏం చేసారు నాన్నా?"

"చెయ్యాల్సిందంతా చేసారు. అనంత్ వెళ్ళిన మూడోరోజున అనుకుంటా శారద ఆఫీసు నుంచి వచ్చి ఇంట్లోకి వెళ్ళిందో లేదో అందరూ వాళ్ళ యింటిని చుట్టుముట్టారు.

శారద ఇంట్లో ఒక్కటే ఉంది. ఆ సమయంలో మీ అత్తయ్య లేదు. ఆవిడ మీ చిన్నత్తగారింటికి వెళ్ళింది, పాపం.... శారద! వెనక గుమ్మం తలుపు తీసుకుని కాంపౌండ్ వాల్ దూకి ఆ వీధిలో వున్న మున్సిపల్ పార్క్‌లో మూల నక్కింది.

వచ్చిన వాళ్ళు అరిచి ఇంటిమీద రాళ్ళు విసిరారు. అనంత్‌ను శారదను బండబూతులు తిట్టారు. ఇంటి తలుపులు పగలగొట్టి చేతికందింది తలా ఒకటి పట్టుకుపోయారు.

వీధి వీధంతా రచ్చలరావిడి చేసి పోయారు. శారద ఎంత ధీమాగా ఉండేది – నాతో చెప్తూ ఉంటే నాకే ఏడుపాగలేదు..." నాన్న గొంతు రుద్ధమైంది.

ఇలా జరిగి వుండ వచ్చునన్న వూహ కూడా నాకు రాలేదు. నేను నిర్ఘాంతపోయాను.

"నేనయితే శారద ఏ అఘాయిత్యమో చేసుకుంటుందని భయపడ్డా...." అమ్మ బాధగా నిట్టూర్చింది.

"ఇంత జరిగినా శారద మాకు చెప్పిందనుకొన్నావా? ఎవరో మాట వరుసకు అంటే నేనూ అమ్మ విషయం తెలుసుకుందామని వెళ్ళాం...."

"అభిమానం కల పిల్ల. ఏనాడన్నా మాటపడి ఎరుగునా– పాపం – ఎంత మొహమాట పడిందీ మాతో విషయం చెప్పడానికి, ఏదో సామెత చెప్పినట్లు – మొగుడు మొట్టినందుకు కాక తోడికోడలు నవ్వినందుకు ఏడ్చిందట వెనుకటికి ఎవత్తో, చిత్రా – శారద వ్యవహారంతో నువ్వు కాస్త జాగ్రత్తగా ఉండమ్మా"

"మధ్యలో నువ్వొటి....! శారదను చూసి నవ్వేట్లు వుందా ఇప్పటి పరిస్థితి?" నాన్న అమ్మ మాటలకు అడ్డొచ్చాడు.

"నాన్నా ఇంతకీ శారద మనింటికి ఎలా వచ్చింది?"

"ఇదుగో మీ అమ్మే రోజూ వెళ్ళి కబుర్లు చెప్పేది. అయినా మన యింటికి రావాలని శారద ఎందుకు అనుకుంటుంది? ఆ చిట్టీలు కట్టిన వాళ్ళల్లో ఎవరో పోలీసు కేసు పెట్టారు. మరొకడు ఏకంగా గుండాల్నే పంపించాడు...."

"బాప్‌రే–" నా గుండె జారిపోయింది.

"ఒకరోజు ఆ రౌడీ వెధవ అర్ధరాత్రి యింటి మీదకు వచ్చి పచ్చిగా ప్రవర్తిస్తుంటే వెనుక గుమ్మంలోంచి పారిపోయి వచ్చి ఓ ఎస్‌టిడి బూత్ నుంచి ఫోన్ చేసింది. నేనూ అమ్మ వెళ్ళి తీసుకొచ్చాం. మేం వెళ్ళేసరికి తలమీదుగా ముసుగేసుకొని బూత్ వెనకాల నక్కి నక్కి కూర్చుని వుంది." నాన్న మౌనం వహించాడు.

"శారదను అలా చూసేసరికి నా కడుపు తరుక్కుపోయిందనుకో. ఎవరి

కన్నబిడ్డయితే నేం కానీ ఈ ఖర్మ పగవాడికి కూడా వద్దు తల్లీ.... వద్దు. అయినా ఆ శారద కన్నవాళ్ళు ఎంతటి కర్కశులో... చిత్రా... విషయం తెలిశాక శారదకి సహాయం చేయకపోగా శారద కొడుకును తెచ్చి ఇంట్లో పడేసి చక్కాపోయారు. ఆడపిల్లలు పుట్టింటి మీద పుట్టెడు ఆశలు పెట్టుకుంటారు కదా – దుర్మార్గులు – అదీ లేకుండా చేసారు –" అమ్మ కొంగుతో కళ్ళు తుడుచుకుంది.

నాకూ దుఃఖం ఆగలేదు. నాకు తెలియకుండానే నా కళ్ళు తడిగట్టాయి.

"వాళ్ళనని ఏం లాభంలే చిత్రా.... బంధువులందరితోనూ చివాట్లు కట్టించారు. వాళ్ళు వచ్చి వీళ్ళ యింటిమీద పడ్డారు. మరి వాళ్ళింట్లో శారదను ఎలా వుంచుకుంటారు? పల్లెల్లో పట్టుదలలూ పరువూ ప్రతిష్ఠలూ ఎక్కువ గాదూ..."

"అదేంటి నాన్నా నువ్వు కూడా– "

"నిజం అదే చిత్రా – చేదుగానే వుంటుంది మరి–"

ఎన్ని సమస్యలున్నా కన్నవాళ్ళిలా సహాయనిరాకరణ చేయడం నాకైతే మనసొప్పలేదు. అమ్మలానే.

"అమ్మా... మరి మా అత్తయ్య ఆవిడేం అన్నారు?"

"ఏ మాట కామాటే చెప్పుకోవాలి– ఆవిడే శారదకు అండగా నిలబడింది. అదీ ఎప్పుడు? నేనూ మీ నాన్న మీ చిన్నత్తగారింటికి వెళ్ళి చెడామడా కడిగేసాక.

ఏమయినా అనుకో – నా మనసాగింది కాదు. మన యింటికి వచ్చి ఉండడానికి శారద ససేమిరా ఒప్పుకోలేదు.

ఎంత బతిమిలాడానని... వయసులో వున్న పిల్ల. ఆమెకు తోడు పసిపిల్లవాడు.

అటు పోలీసులు ఇటు రౌడీలు ఎటుపోయినా ఖాతాదార్లు.

ఆ పెద్దావిడకి ఆ మాత్రం బుద్ధీ జ్ఞానం వుండక్కర్లా – నేను ఆ నాలుగు మాటలు కడిగేసాక ఏమనుకుందో ఏమో శారద దగ్గరికి వచ్చేసింది." అమ్మ ముఖంలో వియ్యంకురాలి మీద సాధించిన విజయం ఓ క్షణం తళుక్కుమని మాయమైంది.

నాన్న నిట్టూర్చి గంభీరంగా అన్నాడు. "చిత్రా.... నిజంగా శారద స్థానంలో ఊహించుకుంటేనే ఎంత బాధగా వుందో తెలుసా– ఆమె బంధువులు. ఆమె స్నేహితులు. ఆమె ఇరుగుపొరుగు, ఆమె సహ ఉద్యోగులు అందరికీ ఒక పూటలో విరోధి అయిపోయింది. ఎందుకూ? ఆ దగుల్బాజీ వెధవ చేతకానితనానికి!

చేయని నేరానికి ఎంతటి శిక్షను అనుభవించిందో చూడు. పాపం.... ఎన్ని అవమానాల్ని భరించిందో... ఎంత క్షోభను అనుభవించిందో... అభిమానవంతురాలు ... నోరు విప్పిందే కాదు."

అందరం చాలాసేపు మౌనంగా ఉండిపోయాం. మాటలే కరువైనట్లు.

కొద్దిసేపటికి నేనే అన్నాను, "పోనీలే నాన్నా– మీరు తనకి సహాయపడ్డారుగా..."

"ఏం సహాయం చిత్రా – తెలిసిన స్నేహితులు వున్నారు కాబట్టి లీగల్ ప్రొటెక్షన్ ఇప్పించాను. అరెస్టులు గట్రా జరగకుండా స్టేలు తీసుకురాగలిగాను. ఆడిటర్‌తో లెక్కలు వేయించాను. కానీ ఆమెకు జరిగిన నష్టాన్ని ఆమె మనసుకు కలిగిన కష్టాన్ని ఎలా తొలగించగలం చెప్పు– ఎందరు ప్రయత్నించినా –" నాన్న భారంగా అన్నాడు, "డబ్బు కూడా మనం సర్దేంత ఉందా చెప్పు. ముప్ఫై నలభై లక్షలు!"

నా కళ్ళముందు ధీమాగా చూస్తోన్న శారద కళ్ళే కదలాడుతున్నాయి. నా మనసంతా వికలమైంది. నాన్న మాటలు నా గుండెలోతుల్ని కెలికాయి.

"మీది మరీ విచిత్రం! మనిషికి మాట సాయం అన్నారు. మన చేతనయితే చేస్తాం. అంతే కానీ –" అమ్మ పెదవి విరిచింది. "చిత్రా – మీ నాన్న మరీ లోతుగా ఆలోచిస్తాడమ్మాయ్–"

అదేమి విచిత్రమో మెల్లిగా నా మనసులో మరో ఆలోచన మొదలయ్యింది.

అమ్మ అన్నట్లు మాట సహాయం ఎంతయినా చేయవచ్చును. ధన సహాయం చేయడానికి ఓ హద్దూ పద్దూ ఉండక్కరలేదా? అదీ ఈ కాలంలో!

ఇక్కడ నుంచి చూస్తే అమెరికా అద్భుతంగా ఆడంబరంగానూ కనిపిస్తుంది. అక్కడి సామాన్య జీవితం గడపడానికే మేం రెక్కలు ముక్కలు చేసుకుంటున్నాం. ఒక్కో డాలరు సంపాదించడం అంత సులభమేమీ కాదు.

అమెరికా అవకాశాల దేశం అంటారు. అందిన అవకాశాన్ని సఫలం చేసుకోగలిగిన వాడే అందలం ఎక్కుతాడు. లేకపోతే అడుసులోనే!

నేనూ సంపత్ ఇప్పుడిప్పుడే మంచి అవకాశాలు చేజిక్కించుకొంటున్నాం. బంగారు భవిష్యత్తు ఊరిస్తోంది. ఇప్పుడీ శారద ఊబిలో చిక్కుకుని మమ్మల్ని మేం కుంచించుకోవడం లేదుగా– సంపత్ గబుక్కున శారదకు ధనసహాయం చేస్తానని వాగ్దానం చేసేస్తాడేమో–

ఈ మధ్యనే అప్పుచేసి కొన్న కారు, కొందామనుకొంటోన్న అపార్ట్‌మెంట్ నా కళ్ళముందు మెదిలాయి.

మరి మా భవిష్యత్ ఏమిటి?

నాలో సన్నగా మెదిలిన ఆలోచన మెల్లిగా విస్తరించి మెదడంతా ఊడలు దింపుకుంటోంది. ఎలా చేయడం? ఏం చేయడం? సంపత్‌కి ఏదో ఆవేశం కమ్మేసింది. అన్న చేసిన తప్పును తన తలకు రుద్దుకుంటున్నాడు! సంపత్... సంపత్... మైడియర్

సంపత్... మన గురించి ఆలోచించు... మహానుభావా!

ఎందుకోగాని నా ఆలోచనలు మాటల రూపం దాల్చడానికి – నా నోటినుంచి బయటపడడానికి వెనకాడుతున్నాయి.

నా మనసు మొద్దుబారిపోయింది. నా నాలుకా మొద్దుబారిపోయింది.

శారద పట్ల సానుభూతి – సంపత్ సహాయాల పట్ల అనుమానం – ఈ రెండూ కలిగించిన మిశ్రమ సందిగ్ధతతో ఏర్పడిన అనిశ్చిత స్థితిలో నేను శారదను కలిసాను.

శారదను చూడగానే నేను కదిలిపోయాను. ఏది తల్లీ నిరుడు చూసిన ఆ శారద?

నా నోట మాట రాలేదు.

శారద ముఖంలో నెత్తురు చుక్కలేనట్లు పాలిపోయి ఉంది. కంఠంలో ధీమాగానీ ముఖంలో గాంభీర్యం గానీ కాగడా పెట్టి వెతికినా కనిపించడం లేదు. మనిషి కుంచించుకుపోయి పిట్టలా ముడుచుకుపోయి వుంది. సంపత్‌తో గానీ నాతోగానీ కళ్ళెత్తి చూడడం లేదు. పెదవి విప్పి మాట్లాడడం లేదు.

అత్తయ్య సంపత్‌తో అన్ని విషయాలు చెపుతూ ఉంది. అనంత్‌నూ అతని వ్యాపారాలను శారద ప్రోత్సహించడం ఆవిడకి మొదటినుంచీ ఇష్టంలేదు. అలాగని చెప్పాపెట్టకుండా మాయమైన కొడుకుని వెనకేసుకు రావడానికి ఆవిడకు మనసు ఒప్పడం లేదు.

అనంత్ విషయాలు ఇంకా ఎన్నో శారదకు తెలుసునని ఆవిడ నమ్మకం. శారద నోరు విప్పితే చాలునని ఆవిడ సంపత్ దగ్గర ఎంతో బాధపడింది.

శారద పిల్లవాడు. చిన్ను, నాలుగేళ్ళవాడు. మేం తెచ్చిన అమెరికా చాక్లెట్లు చప్పరిస్తూ మేం తెచ్చిన బొమ్మలతో ఆనందంగా ఆడుకుంటున్నాడు. ప్రపంచంతో సంబంధం లేకుండా.

కొత్తకోడలినైన నాకు శారదతో ఎంత చనువు తీసుకోవాలో అర్థం కావడం లేదు. అత్తయ్య మాటలతో ఎంతవరకు ఏకీభవించవచ్చునో అర్థం కావడం లేదు. ఎవరినీ సమర్థించలేని అసమర్థత నన్ను గందరగోళంలో పడేసింది.

సంపత్ కూడా ఆశ్చర్యంగా ప్రవర్తిస్తున్నాడు. అసహనం... విసుగు... కోపం.. సంపత్ లాంటి నాలాంటి స్థితిలోనే వున్నాడని నా నమ్మకం.

చివరికి నా మౌనాల డొల్లను ఛేదించాల్సిన రోజు వచ్చింది.

మేం అమెరికాకు తిరిగి వెళ్ళేరోజు వచ్చేసింది.

సంపత్ నేనూ శారదతో వంటరిగా మాట్లాడడానికి సమావేశమయ్యాం.

శారద వంక చూస్తూ నేను చాలా చిన్నతనంగా భావించసాగాను. బహుశా శారద నన్నింకా పరాయి వ్యక్తిగానే భావిస్తుందేమో. ఎంతయినా తోడికోడలిని. అమ్మ అన్నట్లు శారద నా ముందు మాట్లాడడానికి అభిమానపడవచ్చుగదా? సంపత్‌తో మనసు విప్పి మాట్లాడుతుందేమో. అనంత్ ఆచూకీ తెలియకుండా మేము అమెరికా వెళ్ళిపోవడం అనేది మా ఇద్దరికీ బోలెడంత వత్తిడిగా.... ఆందోళనగా ఉంది. నేను సంపత్‌ను దుఃఖంలో చూడలేను.

నేనే లేచి మెల్లిగా గది బయటకు వెళ్ళబోయాను.

శారద చటుక్కున నా చేయి పట్టుకొని ఆపింది.

నేను ఆమె ముఖంలోకి సూటిగా చూసాను.

దిగులుతో శారద శరీరం చిక్కి శల్యమైనా ఆమె కళ్ళల్లో అదే ధీమా అదే మెరుపు. నేను మంత్రముగ్ధురాలిలా మౌనంగా శారద ఎదురుగా కూర్చుండిపోయాను.

సంపత్ ఎంతో ఆవేశంగా ఎంతో సేపు శారదను మాట్లాడించాలని చూశాడు.

శారద వంచిన తల ఎత్తనే లేదు.

నా పరిస్థితి అడకత్తెరలో పోకచెక్కలా వుంది.

"వదినా..." ఆఖరిమాటగా సంపత్ అన్నాడు, "తన పరిస్థితి ఏమిటో చిట్టీలు కట్టిన వాళ్ళకు వివరించి వాయిదాల మీద వాళ్ళ డబ్బులు వాళ్ళకి తిరిగి చెల్లిస్తే పోయేది. అన్న ఇలా ఎందుకు చేశాడో నాకు అర్థం కావడం లేదు. ఏది ఏమైనా అనంత్ అన్నది బాధ్యతారాహిత్యమే. అసమర్థతే. మిమ్మల్ని, చిన్నుని, అమ్మని ఇలా నడివీధిలో నిలబెట్టిపోవడం క్షమించరాని నేరం!"

సంపత్ దవడ బిగుసుకుంది. తన్ను తాను సంభాళించుకొని అన్నాడు.

"నెలల తరబడి ఇలా కనిపించకుండా పోవడం –".... సంపత్ గొంతు పెగల్లేదు.

తనను తాను కూడదీసుకున్నట్లుగా సంపత్ ముఖకవళికలు చెపుతున్నాయి. చాలాసేపు సంపత్ మౌనంగానే వుండిపోయాడు.

"అనంత్ చేసిన అప్పులు, చిట్టీలు వేసిన వారి అకౌంట్లు అన్నీ లెక్కలు వేసాము. నేనూ మామయ్య. ముప్పై నలభై లక్షలకు పైగా ఉన్నాయి. నా దగ్గర ఇప్పుడంత డబ్బు లేదు. అందరితో మాట్లాడాను. వాయిదాలపై తీరుస్తాను. పోతే –"

శారద వంచిన తల వంచినట్లుగానే వుంది.

నా గుండె గొంతులో కొట్టుకుంది. సంపత్ అనుకున్నంత పనీ చేశాడు!

సంపత్‌తో విభేదించలేనంతగా కట్టిపడేస్తుంది నా ఎదురుగా కూర్చున్న శారద దైన్యం.

"చిన్ను చదువు సంధ్యల ఖర్చు నేను భరిస్తాను. అయితే... వదినా... మీరు..."

చేయవలసిన వాగ్దానాలన్నీ చేసేసి ఇప్పుడు సంపత్ ఏ విషయం చెప్పడానికి అంత సందేహిస్తున్నాడో నాకు అర్థం కాలేదు. అతని ధోరణి మాటలు వెతుక్కుంటున్నట్లుగా వుంది.

"వదినా... మీరు విడాకులు తీసుకోండి. ఇలాంటి వ్యక్తితో జీవితం అర్థం లేదు."

సంపత్ ఆ నాలుగు ముక్కలు గబగబ అనేసాడు.

శారద విషయమేమో కానీ నేను నిర్ఘాంతపోయాను.,

సంపత్ పాశ్చాత్యధోరణిలో  కొట్టుకుపోతున్నాడా?

శారద రియాక్షన్ ఎలా వుంటుందోనని ఆత్రంగా ఆమె వంక చూసాను.

శారద ముఖంలో ఏ భావమూ లేదు.

ఏ భావమూ లేనితనమే చాలా భయపెడుతోంది.

మా ముగ్గురి మధ్యా నిశ్శబ్దం భయంకరంగా తాండవిస్తోంది. క్షణాలు భారంగా వేళ్ళాడుతున్నాయి. చివరికి శారద నోరు విప్పింది.

"సంపత్.. మనిషే మాయమైనపుడు ఎవరికి ఇమ్మంటావ్ విడాకులు?"

ఆ ఒక్కమాట అనేసి శారద చివ్వున లేచి వెళ్ళిపోయింది.

సంపత్ తప్పేమయినా అన్నానా అన్నట్లు నా వంక చూశాడు.

సంపత్ నోటినుంచి ఆ మాటలు రావడంతో ఇంకా ఆశ్చర్యంలోంచి  తేరుకోని నేను ఇతన్ని సమర్థిస్తూ తలాడించాను.

'అయినా మనసులో వున్న ఆలోచనను మనసులో వుంచుకోవాలి. ముఖాన అనేసేయడమనా? శారదకు కోపం వచ్చిందేమో'.

నేను శారద వెనకే నడిచాను.

శారద కిటికీ ఊచల్ని పట్టుకొని చీకట్లోకి దీక్షగా చూస్తోంది.

"శారదా... మరోలా అనుకోకు.. సంపత్ ఉద్దేశం ఏంటంటే..."

"చిత్రా... సంపత్ అన్నదాంట్లో తప్పేమీ లేదు." శారద ఇంకా చీకట్లోకే చూస్తోంది. ఒక్కో మాటా నెమ్మదిగా మంచు కన్నా చల్లగా అంటోంది. "అనంత్ అన్న మాటే నాకు అదృశ్యమై పోయినపుడు.... ఇక ఈ విడాకులు...."

నేను శారదకి ఓదార్చుతున్నట్లు భుజం మీద చేయి వేశాను.

శారద ముఖంలో నవ్వు మెదిలింది. ఆ చేతిని మెల్లిగా తట్టింది. స్నేహపూర్వకంగా.

శారద నవ్వు మెల్లిమెల్లిగా పెద్దదయింది. కొద్దిసేపట్లో శారద విరగబడి నవ్వుతోంది.

నాకు ఎలా స్పందించాలో తెలియలేదు. బిత్తరపోయి వెనక్కి జరిగి నిల్చున్నాను.

శారద చటుక్కున నవ్వాపింది. గంభీరంగా అంది.

"చిత్రా – నేను నీ అంత చదువుకోలేదు. నీకు ఉన్నంత ప్రపంచజ్ఞానం లేదు.

నేను చూసిన ప్రపంచమంతా నా భర్త చూపించిందే. అతను అరచేతిలో స్వర్గం చూపిస్తే సంబరపడ్డాను. వచ్చిన జీతాలతో ఆనందంగా గౌరవంగా బతుకుతున్నాం.

ఏం మాయ మమ్మల్ని కమ్మిందో కానీ ఈ మాయదారి చిట్టీల ప్రపంచంలో చిక్కుకుపోయాం. చెప్పాకదా – అనంత్ ఏది చెపితే అది నాకు వేదవాక్కు.

అతను నేర్పిన పలుకులని చిలకలా వల్లించాను. నా వాళ్ళందరూ ఖాతాదార్లయిపోయారు. అప్పుడు నాకు దాంట్లో తప్పేమీ కనిపించలేదు..."

శారద కాసేపు మౌనం వహించింది. నేను ఆమె ఏం చెప్తుందోనని చెవులు అప్పజెప్పాను.

"భరోసా... నా భర్త మీద భరోసా... పిచ్చిదాన్ని.. ఆ భరోసాను నా భర్తే భళ్ళున బద్దలు కొడతాడని నేను కలలోనైనా ఊహించలేదు –"

శారద బద్దలయ్యింది.

"నేను విధవనైనా బోలెడంత సానుభూతి దక్కేది.. కాని ఇప్పుడు..."

శారద వెక్కి వెక్కి ఏడవడం మొదలుపెట్టింది.

శారదను ఓదార్చడానికి నాకు ధైర్యం చాలలేదు.

శారద కొద్దిసేపటికి తనే తేరుకొంది. శారద మళ్ళీ మాట్లాడుతోంది. ఏదో ఇంద్రజాలం ఆమెను మాట్లాడిస్తున్నట్లుగా.

"నా ఇంటి వెనుక గోడ దూకి పారిపోవాల్సి వచ్చినపుడు – నా ఇంటి ఎదురు మున్సిపల్ పార్కులో మూలన నక్కి రాత్రంతా గడపాల్సినపుడు – ఇంతకన్నా ఎక్కువే ఏడ్చాను చిత్రా.

నాతో ఉద్యోగం చేసేవాడే నావైపే కన్నెత్తి చూడని వాడే నన్ను ఉంచుకుంటాను రమ్మని వేధిస్తున్నపుడు – ఇంతకన్నా ఎక్కువే ఏడ్చాను చిత్రా.

మొగుడి ఆచూకి పెళ్ళాంకి తెలియకుండా ఎలా ఉంటుందని పోలీసులు కుళ్ళబొడిచి ఆరాలు తీసినపుడు కుళ్ళి కుళ్ళి ఏడ్చాను చిత్రా.

అమ్మా నాన్న.... బంధువులు.. స్నేహితులు... అందరూ... అందరూ... నన్నో దోషిగా నిలబెట్టినపుడు కుమిలి కుమిలి ఏడ్చాను చిత్రా.

పొట్టకూటి కోసం ఉన్న ఉద్యోగం వదల లేక – అవహేళనల మధ్య అవమానాల మధ్య ఉద్యోగం చేయలేక – క్షణక్షణం ఏడుస్తూనే వున్నాను చిత్రా..."

శారద నావైపు సూటిగా చూసింది. ఆ తడికళ్ళు ఎప్పటిలా ధీమాగా తళతళలాడుతున్నాయి.

"కానీ చిత్రా – నా ఏడుపులో నా కల్మషాలన్నీ కరిగిపోయాయి. నేను మల్లెపందిరి అనుకున్న నా జీవితం సాలెగూడులా కరిగిపోయింది. నావి కాని నా నమ్మకాలన్నీ నా విశ్వాసాలన్నీ సమూలంగా కరిగిపోయాయి. నేనేమిటో నాకు తెలిసింది.

ఇక నాకు ఎవరి వెన్నుదన్ను అవసరం లేదు. జరిగిందంతా ఆ పాపంలో పాలుపంచుకొన్నదానికి చేసుకొన్న ప్రాయశ్చిత్తం అనుకుంటాను."

నేను శారద చెప్పింది వింటున్నాను.

"ఈ రోజు సంపత్ నాకు సహాయం చేయడానికి వచ్చాడు. సంతోషమే. కానీ, అన్న చేసిన పనికి అవమానపడుతోన్న ఆవేశం తప్ప నాకు మరోటి కనిపించడం లేదు.

రేపు మీరు తిరిగి అమెరికా వెళ్ళిపోతారు. మీ జీవితం మీకుంది. మీ అవసరాలు మీకుంటాయి. మీ ఆలోచనలు మీకుంటాయి.

మా కష్టాలు తీర్చడానికి... మీ భవిష్యత్తుని కాలదన్ని... మీరు అష్టకష్టాలు పడడం నాకు ఇష్టం లేదు.

ఈ రోజంటే మీరిద్దరు. రేపటికి మీరూ మీ పిల్లలు. చిత్రా... నేనే నీ స్థానంలో వుంటే నా అవసరాలని కాదని నీకు సహాయం చేస్తానా?

వద్దు... చిత్రా... దేనికైనా హద్దు వుంటుంది. చిత్రా– మీరు నాకు ఎలాంటి డబ్బు పంపొద్దు–"

శారద ముందు నేను మరుగుజ్జునైపోయాను. ఏం అనాలో నోట మాట రాలేదు. నాలో మెదిలిన ఆలోచనలు ఆమెకి తెలిసినట్లు ఎలా మాట్లాడుతోంది?

నేను సిగ్గుతో చితికిపోయాను. శారద కళ్ళల్లోకి చూసే ధైర్యం ఇక నాకు లేదు లేనేలేదు.

"నా తిప్పలేవో నేను పడతాను. ఎందుకంటే...." శారద కాసేపు మౌనం వహించింది- "అనంత్ నిన్న నన్ను కలిసాడు!"

నా నెత్తిన పిడుగు పడింది. ఈ విషయం శారద ఎందుకు దాచింది? మేం అందరం వెర్రివాళ్ళలా కనబడుతున్నామా?

'అనంత్‌కు ఎలా తెలుసోకానీ సంపత్ సహాయం చేయబోతున్నాడన్న సంగతి తెలుసు. నన్ను మరింత ఏడ్చి, మరింత నటించి, మరింత డబ్బు మీ నుండి రాబట్టమని ఆదేశించాడు!

అంతే!

అతని పట్ల నా మనసులో ఏమూలో వున్న భ్రమ కూడా పటాపంచలయ్యింది. ఇది కట్టుకొన్న భార్యను వ్యభిచారం చేయమనడం కన్నా ఘోరంగా లేదూ-"

శారద మాటలు మంచుకత్తుల్లా వున్నాయి.

"అలాగేనని తలాడించి - అతని చిరునామా తీసుకున్నాను. నేను తీసుకెళ్ళే సమాచారం కోసం అతను ఆత్రంగా ఎదురుచూస్తూ వుంటాడు. రేపుమీరు వెళ్ళగానే ఖాతాదార్లందరికీ, పోలీసులకూ గుండాలకూ అనంత్ చిరునామా ఇస్తాను. కనికరం లేకుండా. అతన్నీ అనుభవించనీ నేను పడిన చిత్రవధనంతా!"

నేను శిలనే అయ్యాను. శారద కంఠంలో ద్వేషం లేదు. పగలేదు. అంతకన్నా లోతైన భావనే ఉంది. అది ఏమిటో నాకు తెలియదు.

"నువ్వు సంపత్‌కు ఈ విషయం చెప్పవనే నా నమ్మకం చిత్రా. ఎందుకంటే... సంపత్ ఆ అన్నకు తమ్ముడేగా...!"

శారద మెల్లిగా నా ముందు నుంచి కదిలిపోయింది.

శారద మాటల్లో హేళనే ఉందో హెచ్చరికే ఉందో నాకు తెలియదు.

అవి అనుక్షణం నన్ను వెన్నాడుతూనే వున్నాయి.

అమె చూపుల్లా!

# ఒక రాత్రి గడవాలి

**-వాడ్రేవు వీరలక్ష్మీదేవి**

**రా**త్రంతా రైల్లో నిద్రలేదు. 'లేదు' కాదు, పోలేదు. పోలేకపోవడానికి కారణం నిద్ర రాలేదు. సదుపాయమయిన బెర్త్ దొరికింది. చక్కగా టిఫిన్ తిని, దానిమ్మ గింజల ఫలహారం చేసాను. పడుకున్నాను. అయినా నిద్ర పట్టలేదు. ఉత్కంఠ, ఆమెతో ఎలా మాట్లాడాలి? ఎలా ఎదురుపడాలి? అసలు ఎలా ఉంటారు?

ఫోటోల్లో తప్ప విడిగా ఎప్పుడూ చూడలేదు, మరి

ఈ ఉత్కంఠతో ఎప్పటికో గాని చిన్న కునుకు కూడా రాలేదు. వచ్చిన కునుకు అంతలోనే పోయింది. ఉదయం ఏడు గంటలకి ఎర్రబడిన కళ్లతో నిద్ర లేని మొహంతో దిగాను. అయినా ఎంతో ఉత్సాహంగా ఉంది. అలసట ఏ మాత్రమూ లేదు.

'విహాయస' కలం పేరు ఆ పేరుతోనే వ్యవహారం ఆమె పేరు సర్వలక్ష్మి అనుకుంటా. ఏదో పుస్తకం ముందుమాటలో చదివిన గుర్తు. రెండు పేర్లూ నాకు ఒకలాగే అనిపిస్తుంటాయి. పెద్దగా తేడా ఏం ఉంది?

ఆమె పేరు కూడా నన్ను ఎంతగా ఉత్తేజపరిచిందంటే ఇప్పుడు నేను విమానాలు నడిపే పైలట్ ట్రైనింగ్ పూర్తి చేసుకున్నాను. ఉద్యోగంలో చేరబోయే ముందు నా ఇన్స్పిరేషన్ ముందు మోకరిల్లాలని ఈ ఉత్కంఠ భరితమయిన ప్రయాణం.

ఆటో ఈ వీధిలో ప్రవేశించేసరికి చెట్ల మధ్య నుంచి ఉదయపు నీరెండ నేల మీద పడి మెరుస్తోంది. రెండు వైపులా ఎరుపు తురాయిలు, ఆకుపచ్చగా. ఇది పూసే ఋతువు కానట్టుంది. అయినా గుర్తుపట్టగలిగేను. మా ట్రైనింగ్ సెంటర్ నిండా ఇవేగా. వరుసగా ఇంటి నెంబర్లు చూస్తూ... రెండూ బై ముప్పయ్యారు. ముప్ఫయ్యేడు, ఆ... ఇదే ముప్పయి ఎనిమిది బాల్కనీ పిట్ట గోడల మీద 'చైత్రరథ' అన్న పేరు ఆటోని ఆపి దిగాను. నవంబరు నెల. వర్షాలు వెనకబట్టి చలి అడుగు పెట్టబోతూన్న

వాతావరణం. చల్లగాలి వీచింది. ఇది సముద్రపు తేమ గాలి కాదు. ఆరోగ్యకరమయిన కొండ గాలి. ఒళ్లు పులకరించింది.

గేటు తీసుకుని సూట్‌కేసు పట్టుకుని నాలుగడుగులు వేసాను. రెండు వైపులా మొక్కలు, పూలు రక రకాల చామంతులు. 'హేమంతమేగి చామంతి పూసె ఈనాడు' ఇది హేమంత ఋతువా'

గ్రిల్ తలుపు వేసి ఉంది. కాలింగ్ బెల్ కోసం చూస్తుంటే గ్రిల్‌కి క్లిప్ చేసి పెట్టిన కాయితం దాని వెనుక పూలగుత్తి. బెల్ కోసం ఎత్తిన చెయ్యి ఆగిపోయింది. 'గగన పథ విహారికి పూల ఎదుర్కోలు లివే' అని ఉంది ఆ కాయితం మీద.

నాకేనా? ఎంత మాత్రమూ ఊహకి అందలేదే ఇలాగ. నెమ్మదిగా కాయితం, దాని వెనకనున్న గోల్డెన్ రాడ్స్‌తో కలిపి కట్టిన చామంతి పూల గుత్తీ చేతుల్లోకి వచ్చేసాయి.

ఈ పూలగుత్తి ఇంట్లోనే కట్టిన బొకే అని తెలుస్తోంది. బయట కనిపించే బొకేల కుండే సాధారణత లేకపోవడం వల్ల... తెలుగు స్వాగతం చూస్తూ... నాకేనా... నాకోసమేనా... ఇంత గొప్ప స్వాగతం... అని ఆశ్చర్యచకితనవుతుండగా....

పచ్చటి రెండు చేతులు నా భుజాలను చుట్టాయి. నాఫ్తలిన్ బాల్స్ సువాసనను అలుముతూ.

తలెత్తి చూసి... మేడమ్... మీరు... నమస్తే... అన్నాను. తడబడుతూ. కనపడగానే నేనేం చెయ్యాలనుకున్నానో అన్నీ మర్చిపోయాను.

'ప్రయాణం బాగా జరిగిందా! రాత్రి నిద్రపట్టిందా?' అంటూ ఆమె నా చేతిలో పెట్టే అందుకోబోయారు. నేను పెట్టె ఇవ్వలేదు. ఆమెనే చూస్తూ ఉండిపోయాను.

ఆమె దారుఢ్యం. ముఖ్యంగా దేహ దారుఢ్యం. అరవై ఏళ్ల స్త్రీ లాగ ఎంత మాత్రమూ లేరు. తలలో నెరుపు అక్కడక్కడ కనిపిస్తోంది. కానీ షీ ఈజ్ వెరీ హెల్దీ. పదేళ్లు తక్కువ లెక్కపెట్టినా చాలదు.

నా చేతిలో పెట్టే లాక్కుని లోపలికి తీసికెళ్లి దివాన్ పక్కన పెట్టి 'కాసేపు పడుకుంటావా? కాఫీ తాగేస్తావా? అని అడుగుతూ ఇంకా నిలబడే ఉన్న నన్ను దివాన్ మీద కూచోబెట్టారు.

అప్పటికి నాకు మాట పెగిలింది.

'వద్దు వద్దు. ఇంక పడుకోను. ఈ రెండు రోజులూ ప్రతినిమిషం మీతో గడపాలనే కదా వచ్చింది. కాఫీ నే పెట్టనా' అన్నా.

ఈ వేళకి వద్దు రేపు పెడుదువుగాని, ఎలా కావాలో చెప్పు చేస్తాను. అంటూ వంట గదిలోకి నన్నూ రానిచ్చారు. పాలు తక్కువ, పంచదార తక్కువతో నా కాఫీ నాకిచ్చి ఆమె నల్లటి డికాషన్ కాఫీలో పంచదార వేసుకొని తనూ తెచ్చుకుని కూచున్నారు. కాఫీల రంగులు పైకి కనిపిస్తూ గాజు కప్పులు.

ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది. తూర్పువేపు కిటికీలోంచి చల్లటి గాలి సువాసనలతో వీస్తోంది. ఉదయానికీ మిగిలిన జాజిపూల పరిమళం మెల్లమెల్లగా లోపలికొస్తోంది. చెప్పలేని ఒక నెమ్మది ఏదో మనసులోకి జారుతోంది. అయినా ఆత్రుతలు నన్ను వదలవు.

ఈమెకు భర్త, పిల్లలు ఉన్నట్లు తెలుసు. కానీ ఎవరూ కనపడడం లేదు. ఇంట్లో లేరా? నాకు ఒకటే ఆత్రం.

'నీ ఉత్తరం నిన్ననే అందింది నిన్ననే చూసుకున్నానంటే బావుంటుందేమో! ఇ–మెయిల్‌ని కూడా ఉత్తరం అనే అనాలనిపిస్తుంది నాకు. 'వినీల' అన్న పేరు మగాళ్ళు కూడా పెట్టుకుంటారు కదూ? 'వినీల్' అని. అందుకని నువు పేరు చివర 'ఎ' అన్న ఇంగ్లీషు అక్షరాన్ని శ్రద్ధగా రాయాలి' అన్నారు.

అసలు రహస్య అదికాదు. నాకు 'వినీలా' అని పిలిపించుకోవడం కంటె 'వినీల్' అన్న మగ పిలుపే ఇష్టం. ఫ్రెండ్స్ అంతా అలాగే పిలుస్తారు. ఆ మాటే చెప్పా.

'పేర్లకి ఆడామగా ఏముందిలే. గుర్తు కోసం. అంతే కదా! అని నవ్వేసారు. ఆమె ఏ విషయానికీ ఎదుట మనిషితో వాదనికి దిగరు అని అర్థమయింది. కానీ ప్రతిచోటా ఇలాగే ఉంటే లోకువ కట్టెయ్యరూ!

'ఈ బ్లాక్ కాఫీ ఎలా అలవాటయింది మేడమ్ మీకు'

'అసలు చాలా రోజులు నాకు కాఫీయే అలవాటు లేదు. శంకర్ ఫ్రెండ్స్ బ్లాక్ టీ బ్లాక్ కాఫీ అడిగి తాగుతుండేవారు. అంత చేదుగా వేడి పానీయానికి

అలవాటు పడడం ఒక గొప్ప విషయంగానూ అదో గొప్ప జీవితానందంగానూ భావిస్తుండేవారు. కొన్నాళ్లకు వాళ్ల ఆ ఆలోచనను బద్దలు కొట్టాలని అనిపించింది. అప్పుడు మొదలు పెట్టాను. ఇప్పటికీ తాగడం మానలేదు నేను. వాళ్లంతా షుగర్‌లూ, బీపీలూ వచ్చి మానేసారు గానీ ఇంత చేదు పానీయం తాగడంతో రోజు మొదలు పెడితే ఇక ఆ రోజంతా ఏం జరిగినా మధురమే కదా' అంటూ కొంటెగా నవ్వేరు.

వయసు కొంటెతనాన్ని చంపలేదు సరికదా ఏ మాత్రమూ తగ్గించినట్లు కూడా లేదు.

ఇంతకీ శంకర్ ఇంట్లోనే ఉన్నాడా... ఉన్నారా... ఇంకా లేవలేదా? ఆగలేకపోయాను. 'సార్ ఉన్నారా మేడమ్? ఎటయినా వెళ్ళారా?'

"ఉన్నారోయ్! లేవరు. తొమ్మిది దాకా లేవరు. నేను ఉదయపు పక్షిని. లేచి ఓ గంట నడుస్తాను. నల్ల కాఫీతో అలర్ట్ అవుతాను. ఆ పైన పూల మొక్కలు, పాదులు నాకోసం ఎదురుచూస్తుంటాయి. పద చూద్దాం" అంటూ దారి తీసాను.

వంద గజాల పెరడులో చిన్న తోట. పూలు కూరలు, ఆకుకూరలు, వాటికి పాదులు, నీళ్లు పరిచర్య అయ్యేసరికి గంటపట్టింది. ఆ గంటా ఆమె పూల రకాల గురించి, సహజ ఎరువుల గురించి, ఆకుకూరల పెంపకంతో ఉండే ఇబ్బందుల గురించి మాట్లాడుతూ ఉన్నారు. నాకు బోర్‌గా అనిపించింది. ఇందుకోసం కాదుగా ఇంత దూరం వచ్చింది.

తెల్లగా, బక్కగా ఉన్న ఒక అరవయ్యేళ్ళు దాటిన మగాయన పెరట్లోకి వచ్చి 'లక్ష్మీ! గుడ్‌మాణింగ్' అంటున్నాడు. ఈయనేనా శంకర్ అంటే. శంకర్ కాదు శంకరం గారు అయుండొచ్చు.

విహాయస మేడమ్ చేతులు కడుక్కుని లోపలికి వెళ్లి కాఫీ కలిపి పట్టుకొచ్చి ఇచ్చారు. ఈలోపల నా పరిచయం అయింది. శంకరంగారు పెరటి వరండాలో కుర్చీలో చేరబడి పేపరు తెచ్చి పెట్టవోయ్ అంటే ఆమె వెళ్లి 'హిందూ' తెచ్చి ఇచ్చారు. సార్‌గారు పేపరు చూస్తూ కాఫీ తాగడం మొదలుపెట్టారు.

కలా? నిజమా? నమ్మలేకపోయాను. నా కళ్లముందు జరుగుతున్నది నిజమేనా? ఇక్కడా ఈ ఇంట్లో కూడా అందరిళ్లలాగానే ఇంత రొటీన్‌గా... పతిసేవా... చెత్తా... చెదారం...

మేడమ్ కనిపెట్టేసింది. నా మొహంలో చిరాకో, అసహనమో ఏదో గానీ, దాన్ని ఆమె దొరకబుచ్చుకుంది. కానీ ఏమీ మాట్లాడలేదు. తెలివయిన చిరునవ్వు నవ్వింది.

పద. మన రూంలో కూర్చుని కబుర్లు చెప్పుకుందాం. అంటూ ఆవిడ తన గదిలోకి దారితీసారు. గదికి లేతాకుపచ్చటి పొడుగు గీతల తెర. లోపల కిటికీలకు కూడా అవే తెరలు. బయటి ఎండ పొడ పడి తెరల ఆకుపచ్చరంగు గదిలో ప్రతిఫలిస్తోంది. ఒక మూల కుండీలో పేరు తెలియని ఆకుపచ్చటి ఆకుల మొక్క బలంగా.

ఎదురుగా గోడ మీద ఒక చిత్రమయిన పెయింటింగ్. ఓరగా తెరిచి ఉన్న తలుపులోంచి దొర్లుతూ బయటికొచ్చిన ఊలుదారపు బంతి. చాలాదారం లోపల ఉండిపోయింది. సగం బంతి ఇవతలకి జారి, ఇంకా దొర్లబోతూ, తేలికయి పోబోతూ, తగ్గిపోతూ ఉన్నట్టు భ్రాంతిని కలిగించే బొమ్మ అది. ఊదారంగు ఊలుదారపు బంతి. తలుపు వెనకా, ముందూ కూడా నల్లదనం, చీకటిలా, ఆ బొమ్మ చూస్తున్న కొద్దీ అది  థాట్ ప్రాసెస్‌ని కొంచెం కొంచెంగా కదిలిస్తున్నట్టూ, లేపుతున్నట్టూ అనిపిస్తోంది. ముఖ్యంగా రంగులు, బంతి కదులుతున్నట్టనిపించే నీడలు... ఆ బొమ్మ చూస్తూ ఉండిపోయిన నన్ను గమనించి 'అక్కడే ఆగిపోతే ఎలా? ఇంకా చూడాల్సినవి చాలా ఉన్నాయి' అంటూ తోటలోంచి వచ్చేటప్పుడు తనతో తెచ్చిన పసుపుగన్నేరు పూలకొమ్మ గులాబీరంగులో ఉన్న గులాబీ పువ్వూ గాజు వాజ్‌లో అమర్చుతున్నారు. పాత పూలు కాస్త వాడి ఉన్నాయి. అవి తీసి పక్కనున్న డస్ట్‌బిన్‌లో వేస్తూ టేబుల్ మీద చిందిన రెండు నీటి చుక్కలి తన చీర కొంగుతో అద్ది తుడిచారు.

ప్రతి చిన్న పనీ ఈమె ఎంతో శ్రద్ధగా చేస్తారన్నమాట. కానీ ఇలా ఈ ఇంటి అలంకారాలు చేసుకునే ఈమెకు టైం ఎక్కడ మిగుల్తుంది? అనుకున్నాను. నేను.

నాక్కూడా చిన్న చిన్న పనులు చెప్తూ వంటంతా ఆమే చేసారు. తోటకూర, పెసర పప్పు కలిపిన కూరలో మినపవడియాలు ఘుమఘుమలాడే పోపు. ఉల్లిపాయ పులుసు పెట్టి, గుమ్మడి వడియాలు, చల్ల మిరపకాయలు వేయించారు. ప్రతి వంటకమూ ఆమె తయారు చేసే విధానాన్ని నేను గమనిస్తూనే ఉన్నాను. చాలా

ఆసక్తికరంగా అనిపించిది. మాంఛి ఇంగువ సువాసనలీనే మాగాయి. ఊరగాయిని సీసాలోంచి తీసి చిన్న బౌల్‌లో పెడ్తుంటే... నిజం చెప్పొద్దూ... నాకు నోట్లో నీళ్ళూరాయి.

వంటికి, రుచులకి ప్రాధాన్యత నివ్వవద్దని అవి మానసిక వికాసానికి, అభివృద్ధికి అడ్డుపడే ప్రథమ ప్రతిబంధకాలని చెప్పే ఈ స్త్రీవాద రచయిత్రి ఇంట్లో ఏమిటి? ఇలా ఉంది? అంతా తలకిందులుగా.

అన్నింటినీ టేబుల్ మీద ఎంతో నేర్పుగా అమర్చి శంకరం గారిని పిలిచారు. ముగ్గురం భోజనం చేసాం. సాధారణమయిన వంటకాలతో విందుభోజనంలా చేయించిందామె. ఇందులో ఉన్న కిటుకు ఏమిటో అంతుబట్టలేదు. నాలాగే మేడమ్ కూడా త్వరగా తినేసారు. అప్పటికి శంకరంగారు కూర కలుపుతూ, చల్లమిరప కాయలు కొరుకుతున్నాడు. నేను కూచునే ఉన్నాను. టేబుల్ మేనర్సు గుర్తు చేసుకుంటూ. 'విహాయస' లేచి చెయ్యి కడుక్కుని ఇద్దరి కంచాలూ తనే తీసి సింక్‌లో వేసేసారు. "లే... మనం ఇతనితో కూచుంటే అవదు. నీకు చాలా చూపించాలి. చెయ్యి కడుక్కునిరా' అంటూ ఆమె రూంలోకి వెళ్ళిపోయారు.

నేను చెయ్యి కడుక్కుని, నేప్‌కిన్‌తో తుడుచుకుంటూ హాల్‌కి రెండోవేపున ఉన్న ఆమె వెళ్లిన రూంలోకి అడుగుపెట్టాను. ఇది ఆమె రీడింగ్ రూం అనుకుంటా. రెండు వేపుల ఉన్న గోడలకి గోడలంత ఎత్తుగా గోడలలోకి అల్మారాలు. వాటి నిండా తెలుగు, ఇంగ్లీషు పుస్తకాలు, ఒక వైపు కంప్యూటర్, ప్రింటర్‌తో సహా. కిటికీ దగ్గరగా సింగిల్ కాట్. మంచం నిండా చెదురుమదురుగా పుస్తకాలు, తెరిచిపెట్టీ, బుక్ మార్క్‌తో మూసి ఉంచీ, రకరకాలుగా, ఒక వైపు పాడుతూ ఆగినట్టున్న వాక్‌మెన్.

గది ఆమె అంతరంగంలా ఉంది.

రెండు గంటల సేపు ఆమె తనతో నన్ను ఆ గదిలోనే కూర్చోపెట్టారు. మొదటి లేడీ పైలట్, పైలట్ ఆఫీసర్ల దగ్గర్నుంచి వరుసగా అందరి వివరాలు ఉన్న వెబ్‌సైట్స్ చూపించారు. వివిధ దేశాల వాళ్లవేకాక భరత దేశ స్త్రీలవి కూడా. ఇన్ని విషయాలతో, ముఖ్యంగా నాకు అవసరమయినవి వెబ్‌సైట్స్‌లో ఉన్నాయనే తెలీదు నాకు. ఈవిడకెలా తెలుసు. ఆ మాటే అడిగాను.

'నువ్వు ట్రైనింగ్‌లో చేరగానే నీకు సంబంధించిన సమాచారమంతా పోగు చేసుకుంటూ వచ్చాను. నాక్కూడా ఆ కొత్త విజ్ఞానమంతా తెలుస్తుందిగా నీ మూలాన దాని మీద నేనూ ఒక ఆర్టికల్ రాసుకోవచ్చు" అన్నారు.

ఇదీ చదువంటే. అరవయి ఏళ్ల వయసులో కూడా ఈవిడ చదువుకుంటోంది.

మధ్యలో డైనింగ్ రూంలోకి వచ్చాను – మంచినీళ్లు తాగుదామని. శంకరం గారి భోజనం అయిపోయినట్టుంది. హాల్లో కూచుని టి.వి.లో వస్తున్న 'ఏనిమల్ ప్లానెట్'లో సముద్రపుజంతువుల కదలికలు చూడడంలో మునిగిపోయారు. అప్పుడు గుర్తొచ్చింది. గిన్నెలన్నీ తీసి టేబుల్ ఎవరు శుభ్రం చేసారా? అని. కుతూహలం కొద్దీ వంటింట్లోకి వెళ్లి చూసా. అన్నీ చక్కగా సర్ది మూతలు పెట్టి ఉన్నాయి. వాడిన గిన్నెలు. కంచాలు సింక్ కింద ఉన్న ప్లాస్టిక్ టబ్‌లో పొందికగా పడేసి ఉన్నాయి. సింక్ శుభ్రంగా ఉంది. ఇదంతా ఈయన పనేనా?

మంచినీళ్ళు తాగి తిరిగి రీడింగ్ రూంలోకి వెళ్ళేసరికి ఆమె ఏదో ఒక ఇంగ్లీషు ఆర్టికల్ ప్రింటవుట్ తీస్తున్నారు.

'టేబుల్ ఎవరు క్లీన్ చేసారు' అని నా కుతూహలం అడిగించింది. 'ఎవరేముంది' శంకర్ చేసేస్తాడు'

మరి ఈమె ఉదయం కాఫీ ఎందుకందించింది? ఈయన తెచ్చుకుని తాగలేరా? నా సందేహం.

'చూడు వినీలా! నీ సందేహాలు నాకు అర్థమవుతున్నాయి గానీ మరీ మొట్ట మొదటి మెట్టుమీంచే చూస్తున్నావు నన్ను. సాయంత్రం నీ సందేహాలు తీరుస్తా గానీ ఈ వ్యాసం చూడు. ఇది నీ కోసమే తీసాను' అంటూ నాలుగు పేజీల ఆ వ్యాసం పిన్ చేసి నాకు అందించారు.

నేను ఆ వ్యాసం చదువుతూ ఉండేసరికి ఆమె ఒక ప్లేట్‌లో కోసిన జామకాయ ముక్కలు తెచ్చి నా పక్కన పెట్టి 'ఇవి తింటూ ఈ గదిని కూడా కొంచెం కొంచెం తిను. నేను ఒక గంట నిద్ర తీసి వస్తాను' అని వెళ్లిపోయారు.

అలమార్ల నిండా రకరకాల పుస్తకాలు. ఇవి కాక ప్రపంచంలోని ఎన్నో పెద్ద గ్రంథాలయాల్లోని పుస్తకాలలోంచి, వెబ్‌సైట్లలోంచి ఏరి మెమరీల్లో దాచుకున్న

ఎంతో విజ్ఞానం. ఈవిడకి టైం ఎక్కడ సరిపోతుందో అనుకుంటూ ఆ ఆర్టికల్ ఒక పేజీ తిప్పేసరికి  నాకూ ఆవలింతలు మొదలయ్యాయి. రాత్రి నిద్ర లేదేమో? ఈ పూట మాంఛి భోజనం. ఆ పైన పళ్ల ముక్కలు. నిద్ర ముంచుకొస్తోంది.

రాత్రి పది దాటింది. సాయంత్రం మేమిద్దరం వాకింగ్‌కి వెళ్లొచ్చేసరికి శంకరంగారు కూర వండి. కేరట్లు, కీరాలు కోసి రెడీ చేసారు. మేడమ్ పుల్కాలు కాల్చారు. నేను ఒత్తబోయాను. సరిగా రాలేదు. నాకు వంట అస్సలు అలవాటు లేదు. వంటపని చాకిరీ అని భావించి అసలు నేర్చుకోలేదు. ఆమె నా చేతిలోంచి లాక్కుని తాను ఒత్తలేదు.

'ఎలా వచ్చినా సరే నువ్వే చెయ్యి. పని వచ్చి ఉండాలి. నీకు కుదరకపోతే మానెయ్యవచ్చు. అది వేరే విషయం'

అలా వచ్చీ రాకుండానే నేను పుల్కాలు ఒత్తి ఇస్తే ఆమె కాలుస్తుండగా అవే తింటుంటే అనిపించింది – ఇంటికి వెళ్లాక ఈ పని స్వంతంగా నేనే చెయ్యాలి అని.

సార్ చేసిన కూర పెద్ద రుచిగా లేదు. మేడమ్ అయితే ఈ కూర చాలా రుచిగా చేసి ఉందురనిపించింది ఉదయం  తిన్న రుచులను బట్టి. కానీ ఆమె రుచి కోసం ఆ బాధ్యత తన మీద వేసుకోవడం తెలుస్తోంది నాకు.

ఈమె తను పని చేస్తూనే ఎదుటి మనిషి ఎవరు కానీ వాళ్లచేత పని చేయించగలదు. దీన్ని నాయకత్వం లక్షణమంటారా? ఒకరికి చెయ్యగలదు. ఒకరిచేత చేయించుకోగలదు. దీన్ని నేర్పు అంటారా?

ఏమోగాని చాలా ఆసక్తిదాయకంగా ఉంది.

పది దాటేసరికి రాత్రి యౌవనంలోకి ప్రవేశించిందనిపిస్తుంది. చలి కాస్త పెరిగింది. ఈ గది కిటికీలోంచి చూస్తుంటే విచ్చుకోటానికి సిద్ధమయిన పారిజాతాల పలకరింపు. ఇంతలో వీధివేపు దీపం తీసేసినట్టున్నారు. బయటంతా ఒక్కమాటుగా వచ్చి వాలిన వెన్నెల. వెన్నెల ఇంత బావుంటుందా? లేక ఈ 'చైత్రరథ'లో కాసే వెన్నెలకే ఈ మెత్తని చల్లని అలరింపు ఉందా?

చెవులని మృదువుగా 'లకీ ఆలీ' స్వరం సోకింది ఇక్కడి వెన్నెల లకీ ఆలీ పాటలు కూడా పాడగలదా?

నేల మీద ఉండగానే ఆకాశంలో విహరింపచేసేలా చెయ్యగల ఆ నేర్పు ఇంకెవరిది?

ఆమె లోపలికి వచ్చి సిస్టమ్‌లో లోడ్ చేసి ఉంచిన పాటని నాకోసం వెన్నెలలోంచి అందించారన్నమాట. ఈ పాట పూర్తి అయిన తర్వాత చెప్పారు. 'నీకు తెలుసా! ఈ పాట మా మనవడు పరిచయం చేసాడు నాకు. వాడికి ఈ గాయకుడంటే ఎంతో ఇష్టం.

'మీ మనవడు ఎంత ఉంటాడు?"

వాడికి పదమూడేళ్లు. సంగీత ప్రియుడు. మా అమ్మాయి ఫ్రెండ్ 'నబీ'కి సంగీతం ఇష్టం. ఆ ఇష్టమే వీడికీ వచ్చింది.

'నబీ ఎవరు?' అడగవచ్చో. అడగకూడదో అనుకుంటూనే–

నీకు చెప్పలేదు కదా! నబీ మా అమ్మాయి క్లాస్‌మేట్. డిగ్రీ నుంచి పి.జి. దాకా ఎం.బి.ఎ. అయిన తర్వాత నుంచి వాళ్ళు ఇద్దరూ కలిసి ఒకే ఇంట్లో ఉంటున్నారు. పెళ్లి మీద వాళ్లకి నమ్మకం లేదు. ఒకరికి ఒకరు బరువనిగాని, రొటీన్ అని గానీ అనిపిస్తే విడిపోవాలని ఒప్పందం. పదిహేనేళ్లయింది. ఇంకా అనిపించినట్టులేదు. వాళ్ల పిల్లాడే 'లకీ అలీ' ఫాన్.

అవలీలగా ఆమె చెప్తున్న మాటలు నాకు గాభరా పుట్టించాయి. 'ఒక వేళ నబీ మీ అమ్మాయిని మోసగిస్తే' అన్నాను.

'మోసగించడం అంటే ఏమిటి? నిజమే. పెళ్లి చేసుకుంటానని మానేస్తే మోసం. పిల్లాడిని కని వదిలేస్తే మోసం. మరెవరి మీదో ఇష్టం కలిగి దాస్తే మోసం. ఇష్టం లేకపోతే వదిలెయ్యవచ్చునేగా ఒప్పందం'.

'అవును, ఆడవాళ్ళు ఎందుకు మోసపోతారు? మరి!'

'ఎందుకో చెప్పనా? ఆడవాళ్ళు అన్నిటికీ మగవాళ్ల మీద ఆధారపడిపోతారు గనక. అన్నిటికీ అంటే డబ్బు సరే. సాంఘిక భద్రత నుంచి, ఉద్వేగాల ఉపశమనం దాకా'

'ఒక మనిషి మీద ఆధారపడకుండా సంఘ నిర్మాణం ఉందా? మానవ జీవితం నడుస్తుందా?'

'నడవదు. నిజమే. నువ్వు అతని మీద ఎంతగా ఆధారపడుతున్నావో, అదే స్థాయిలో అతను కూడా నీ మీద ఆధారపడేలా నువు తయారు కాగలవా? దాన్ని అతను గ్రహించుకునేలాగ చెయ్యగలవా?'

లకీ అలీ స్వరం తాలూకు మత్తు దిగిపోయింది.

'ఆడవాళ్ల మీద ఇంత బాధ్యత ఎందుకు పెట్టాలి' నా ప్రశ్న.

'స్వాతంత్ర్య పోరాటం అంత సులువయినదేమీ కాదు. 'స్వతంత్ర దేవత కలకత్తా కాళిక నాలుకలాంటిది. దానికి నిరంతర అశ్రునైవేద్యం సమర్పించాలంటాడు' చలం. నువ్వే ఉన్నావు. ఈ స్థాయికి రావడానికి ఎంత కష్టపడ్డావు.'

నిజమే. ఈవిడకి అర్థమయింది. చాలా కష్టపడ్డాను. చాలా చాలా... ఒక కింది మధ్య తరగతి ఇంటి ఆడపిల్లని. ఆకాశంలో తిరగడానికి ఎంసెట్ టెన్షన్లు అక్కర్లేకపోయినా ఏరోనాటిక్ ఇంజనీరింగ్ చదువు రోజుల ఇబ్బందులు. ఇబ్బందులన్నమాట చాలా చిన్నమాట. ఒక సిటీ పత్రిక ఇంటర్వ్యూ తీసుకున్నప్పుడు ఆ పత్రికలో వేసిన నా రంగుల ఫోటో చూసినప్పుడు ఈ కష్టాలన్నీ ఇబ్బందుల్లాగ మారిపోలేదా? నాకు దొరికిన ఉద్యోగం కంటే ఈ పైలట్ పాత్ర చిన్నదయినా సరే ఛాలెంజ్‌గా ఎంచుకోడానికి కూడా ఎంత సాహసం అవసరమయింది?

'సరేనోయ్! ఇంక ఈ రోజుకి మన చర్చలు చాలు. రేపు ఉదయం పచ్చిమిర్చి, అల్లంతో ఉప్మా, పెసరట్టు టిఫిను. నువ్వే చేస్తున్నావు'

నా గుండె ఆగినంత పని అయింది. ఆకాశంలో విమానం నడపగలను గానీ ఉప్మా పెసరట్ చెయ్యడం రాదే!

ఆ మర్నాడు సాయంత్రం అడిగాను ఆమెను.

గత పదేళ్ళుగా మీరు ఏమీ రాయలేదు. ఎక్కడా ఏ సభలోనూ కనిపించడంలేదు. ఇలా వంటింటికి, ఇంటికి, ఇంటి వెనక పూలమొక్కలకి మీ తెలివిని, జ్ఞానాన్ని అప్పగించి ఉండిపోతారనుకోలేదు. మీరు ఇంతకాలం చెప్పిందేమిటి? అది చదివిన నేను, ఆ కొత్తదారి చూపిన ఆలోచనలతో ప్రభావితమయిన నేను, మీరు ఇక్కడ ఇలా... ఉంటారని ఊహించలేదు.

ఆమె మొహంలో ఆశ్చర్యం.

'ఆడవాళ్ళు వంటిళ్లు వదిలి బయటికి రాకపోతే జీవితం లేదన్న మీరే ఇలా ఇంటికి బందీ అయిపోయారంటే నాకు దిగులుగా ఉంది'

ఈ సారి ఆవిడ మొహంలో ఆశ్చర్యం స్థానంలో పరిహాసం చేరింది. పెదవుల మీదకు నువ్వు దానంతట అదే వచ్చింది.

'ఊ.... వంటింటి కుందేలునయేనంటావ్. తిరిగి వెనక్కి వచ్చేనంటావ్....'

అలా అన్నాను కానీ ఆమెను ఈ రెండు రోజులుగా చూస్తుంటే అదీ పూర్తిగా నిజం కాదని అనిపిస్తోంది. ఏదో ఒక అస్పష్టత. ఈమె ఎందుకో సరిగా అర్థంకావట్లేదు.

రేపు ఉదయమే వెళ్లిపోతున్నాను. మళ్లీ ఎప్పటికి వస్తానో తెలియదు. మీ రచనలు చదివి నేను ఇలా బయట ప్రపంచాన్ని గెలిచాను. తీరా ఇక్కడికి వచ్చి చూస్తే మీరూ మా అమ్మమ్మలాగ వడియాలు పెడ్తూ, పెసరట్లు వేస్తూ, ఇల్లు సర్దుతూ, సాధారణ గృహిణయిపోయారు. అందుకే అర్థంకావట్లేదు' అన్నాను.

'మీ అమ్మమ్మ జీవితమంతా వంటింట్లోనే గడిపారు. నేను చాలా చిన్నప్పుడే వంటిళ్ల 'డ్రెడ్జరీ'ని ఇళ్ల పెత్తనాన్ని గ్రహించాను. అందుకే వాటిని ఎదిరిస్తూ బయటికొచ్చాను. బయటి ప్రపంచాన్ని నువు చెప్పినట్టు అర్థం చేసుకోవడమో, గెలవడమో అది చేసాను. ఆ తర్వాతనే ఇంటిని కూడా గెలవొచ్చని తెలిసింది'

'మరి బయటికి రావడం ఎందుకు మానేసారు?'

'బయటికి రావడం అంటే ఏమిటి? బయటి ప్రపంచపు రిమోట్ నా చేతిలో ఉందని ప్రింట్ అవుట్ తీసి నీకిచ్చిన ఆర్టికల్ చెప్పడం లేదూ? ఈ ఉదయం పల్లెకి మనం వెళ్లింది సైట్ సీయింగ్‌కి అనుకున్నావా? 'లూసీ ఇరిగిరే' అన్న స్త్రీవాద తత్వవేత్త భావాల మీద సర్వే అని నీకు కొద్ది రోజుల్లో తెలుస్తుందని నేను ఇప్పుడే ఎందుకు చెప్పాలి?'

అవునా! ఈ ఉదయం ఆ పొలాల గట్ల మీద ఆడవాళ్లతో ఆమె మాట్లాడుతుంటే నేను చింతకాయల్ని గురి చూసి కొడుతూ కాలక్షేపం చేసాను.

'మరి సభలూ, సమావేశాలూ ఎందుకు మానేశారు'

'అదే నీ కంప్లయింట్. నా ఫోటో నీకు పేపర్లలో కనిపించడంలేదని. అది నీ ఫాన్సీ ఆలోచనకదూ!' అని నవ్వేసారు.

'నాకు అర్థమయినదేమిటంటే బయటికి వచ్చే కొద్దీ మనకి వచ్చే పాపులారిటీ, పేరూ మనల్ని 'క్యాప్చర్' చేస్తాయి. మనం ఎందుకొచ్చేమో మర్చిపోతాం ఎంతో మంది మగవాళ్ల విషయంలో జరిగేది అదే. నాకు ఆ సంగతి బాగా అనుభవమయింది. ఇంకా ఈ రోజుల్లోలాగే ఉంటే ఇలా నా కోసం వచ్చే నీవంటి దానితో పావు గంట కూడా మాట్లాడే వీలు ఉండకపోవచ్చు.

ఒక కెరీరిస్టుగా కాకుండా ఉండడం కోసం, ఒక మానవిగా మిగలడం కోసం నా స్వేచ్ఛని ఉపయోగించుకున్నానని. అదే నన్ను ఇలాంటి జీవన విధానంలోకి తెచ్చిందని చెప్తే నీకు సులువుగా అర్థమవుతుందా? అని ఆగారు.

మా అమ్మమ్మ నుంచి ఈమె దాకా చాలా పెద్ద ప్రయాణం. మా అమ్మమ్మ కూడా మానవే కానీ వెన్నెముక లేని మానవి.

ఆమె లేచి వెళ్లి నిన్నటిలాగే అగరవత్తులు వెలిగించి తెచ్చి గదిలో ఓ మూల ఉంచారు. స్వర్ణచంప అగరవత్తులు అవి. ఈ రెండు రోజులుగా గదంతా ఒకటే సంపంగి పూల సువాసన. ఈ సువాసన ఏమిటో ఆమె చెప్తేనేగాని తెలీలేదు. అదీ రెండు రాత్రులు గడిచిన తర్వాత.

నా ప్రయాణం నేనూ మొదలుపెట్టాలి. రేపటి ఉదయపు నా ప్రయాణానికి ఈ రాత్రంతా గడవాలి. బేగ్ సర్దుకోవడం మొదలుపెట్టాను.

**ఆదివారం, వార్త, 15 జూన్ 2003**

# సివమ్మ బడి

**-శ్రీదేవి మురళీధర్**

'**డా**క్టర్ చేతన

పి.హెచ్.డి. (బోటనీ)'

తను రాసిన పాఠ్యగ్రంథాన్ని అటూ ఇటూ విసుగ్గా గిరాటేసింది చేతన. సాయంత్రం ఆరవుతోంది. కిరణ్ వస్తున్న జాడలేదు. కనీసం కాఫీ కూడా కలుపుకుని తాగాలనిపించటం లేదు. ఈ అర్ధాంతరపు అడవి 'విలాస్‌పూర్'కి వచ్చాక. చిరాగ్గా, ఒంటరితనంగా, రోజులు, నెలలు ఎందుకూ పనికిరాకుండా నత్తనడక నడుస్తున్నాయి. స్నానం చేసి దేవుడికి దీపం పెట్టింది. కూరముక్కలు నిరాసక్తంగా తరిగి తాళింపువేసి, చారు పడేసింది. కిరణ్ వచ్చాక అన్నం వేడిగా వండుకోవచ్చు. కల్పించుకుని ఏవో పనులు చేసింది. 'నేనేమిటి? డా. చేతన, పి.హెచ్.డి., ఇదేమిటి ఇలా తయారౌతున్నాను? సగటు గృహిణిలా' అనుకుంది బాధగా.

చేతనను ఎంతగానో ప్రేమించిన కిరణ్ ఆమె డాక్టరేట్ పూర్తిచేసేవరకు ఆగి మరీ పెళ్లిచేసుకున్నాడు. పెళ్లి జరిగీ జరగకుండానే విలాస్‌పూర్‌లో ప్రాజెక్టు ఇన్‌ఛార్జిగా వేసింది ప్రభుత్వం. అంతదాకా తన కోసం నిరీక్షించిన భర్తను వదిలి ఉండలేక, ఏడాది కోసం యూనివర్సిటీలో 'లాంగ్ లీవ్ పెట్టి వచ్చిందన్నమాటే గానీ, నీరు విడిచిన చేపలా ఉందామె పరిస్థితి. యూనివర్సిటీలో జీవితం ఎంత హడావుడి, సందడి! సెమినార్లు, రీసెర్చి స్టూడెంట్లు, క్లాసులు, స్నేహితులు... రోజుకి ఇరవై నాలుగు గంటలేనా అనిపించేది. ఇక్కడ పూర్తి భిన్నమైన జీవితం. అయితే కొద్ది గంటలపాటు దొరికే కిరణ్ ప్రేమ, సాన్నిహిత్యంలో ఎంతో ఆనందాన్ని అనుభవిస్తూంది. ఏది ఏమైనా ఏడాది గడువుపెట్టుకుంది. 'ఈ మట్టిమిట్టలతో కూచుని నా చదువంతా దండగ చేసుకోను గాక చేసుకోను. ఎలాగోలాగ ఏడాది వెళ్ళదీసి, కిరణ్‌ను శతపోరి ఒప్పించి, ఉద్యోగానికి రాజీనామా చేయించైనా వెనక్కు వెళ్ళిపోవాలి' ఇదీ ఆమె

ఆలోచన. వచ్చి రెండునెలలైంది. నెలలా అవి? యుగాలు.ఎలా గడుస్తుందో ముందు ముందు, పిచ్చెక్కినా ఆశ్చర్యం లేదు.

ఆలోచిస్తూనే టీవీ పెట్టింది. దానిమీద కూడా ఆసక్తి, ధ్యాసలేవు. అన్ని ఛానెల్స్‌లో వెర్రిమొర్రి గోలలు. తేళ్లను పెంచే హాబీ కలవాడి గురించి ఒ కథనం. "ఏడ్చినట్లుంది' అనుకుంది చిరాగ్గా. కాలేజీ కుర్రకారుతో ఒక ఇంటర్వ్యూలాంటిదే కానీ, ఎంతసేపూ వాళ్ళకొచ్చిన సినిమాపాటలూ, డాన్సులూ, హీరోల మాస్ డైలాగులూ... ఇవి తప్ప కుర్రవాళ్లకు ఇంకేమీ చాతకానట్లు, మాట్లాడటానికి పనికొచ్చే మంచి విషయాలేమీ లేనట్టూ... చదువు తప్ప మిగిలిన వాటిలో శ్రద్ధచూపే కుర్రవాళ్లంటే చచ్చే కోపం చేతనకి. ఇంకో ఛానెల్‌లో ఒక సినీతార తన రాబోయే చిత్రం ఎంత గొప్ప కళాఖండమో వచ్చీరాని తెలుగులో ముద్దుమాటలలో చెబుతోంది.

ఆ యాంకర్ అంతకంటే వగలుపోతోంది. అరికాలి మంటనెత్తికెక్కి న్యూస్ ఛానెల్‌కి మార్చింది చేతన. రాజకీయ నాయకులు, ప్రతి నాయకుల వాద ప్రతివాదులు తారాస్థాయిలో ఉన్నాయి. ఆ వివాదాంశాలను లేవనెత్తిన సూటు బూటు యాంకర్ నవ్వుతూ చోద్యం చూస్తున్నాడు. 'ఛీ' అంటూ టీవీ కట్టేసింది.

బంగళా బయట చిన్న సిటౌట్. దూరంగా గేటు, మధ్యన ఒక మోస్తరు లాన్. లేచి కాసేపు పచార్లు చేసింది.

'అమ్మా' అని వినిపించి గేటు దగ్గరికి నడిచింది.

'దండాలమ్మా, నన్ను సివమ్మంటారు తల్లే!'

నల్లటి నలుపు, తీరైన శరీరసౌష్టవం, చురుకైన కళ్లు. పెద్దకాసంత కుంకం... ఎవరో పల్లెపడుచు. పాతికేళ్ల వయసుంటుంది.

'అయితే ఏమిటి?' అన్నట్లు చూచించి చేతన.

'ఒక్కపాలి నీతో మాట్టాడాలమ్మ గోరు'

అయిష్టంగా గేటు తెరిచి రమ్మన్నట్లు సైగచేసింది.

లాన్‌లో కుర్చీలో కూర్చున్న చేతన పక్కగా పచ్చికలో చతికిలబడింది. శివమ్మ.

'తల్లే. కొత్తగా వొచ్చారేంటమ్మా'

'అవును శివమ్మా రెండు నెలలైంది.

'పిల్లోళ్ళు ఏరమ్మా?'

'ఇంకా లేరు... నీకు?'

'ఇద్దరమ్మా... నా పెనిమిటి ఈడనే కొలువు. అయ్యగారి కాడ, పాజెట్టు మీద'

'ఓం అలాగా, పేరు?'

'లింగన్న. అమ్మగోరు, ఇంటో పనికి రమ్మంటావా తల్లే?'

'ఎందుకులే శివమ్మా. నాకే పెద్దగా పనిలేదు. పైగా ఏమీ తోచదు ఈ కాస్త పనీ లేకపోతే ఇద్దరమేగా'

'అది కాదమ్మా. నాకు తోటపనీ, సెట్ల పని బాగావొచ్చు. నీకు తోసినంత ఇయ్యి మా తల్లి. ఇల్లు వాకిలి అద్దం మాదిరి సుబ్బరం పెడతా, సూడు మరి!'

'సర్లే. అయ్యగార్ని అడిగి చెబుతాన్లే' అంటూండగానే కిరణ్ వచ్చాడు. 'లింగన్న భార్యట. పనిచేస్తానంటోంది' నిరాసక్తంగా చెప్పి లోపలికి వెళ్లిపోయింది.

'ఓహో నువ్వేనా శివమ్మవి? నేనే నిన్ను పంపమని లింగన్నకు చెప్పాను. అమ్మగారు రోజంతా ఒక్కతే ఉంటుంది. వచ్చి అన్ని పనులూ చేసి పెడుతూండు. మంచి జీతం ఇస్తాను' అన్నాడు కిరణ్. శివమ్మ సంతోషంగా వెళ్లిపోయింది.

అలా శివమ్మ ఆ ఇంట్లో పనికి చేరింది. చేరిన నాలుగు రోజుల్లోనే గ్రహించింది చేతన. శివమ్మ చాలా తెలివిగల మనిషని. చెప్పకుండానే చూచి గ్రహించి చేసుకుపోతుంది. అవసరాన్ని అర్థం చేసుకునే నేర్పు ఆమెలో సహజంగా ఉన్నది. ఏ పనీ రెండోసారి చెప్పించుకోదు. చెప్పినదాన్ని లోపం లేకుండా, పూర్తిగా సొంతపనులు చేసుకునే అంకితభావంతో చేస్తుంది. ఇలాంటి గుణమున్న మనిషిలో నిజాయితీ ఒక సహజాలంకారంగా భాసిస్తుందని వేరే చెప్పుకోనక్కర్లేదు.

వసపిట్టలాగా తన గోడు వెళ్ళబోసుకోదు. ఉదయాన్నే వెంకటేశ సుప్రభాతం రేడియోలో పెట్టి ఉంటే తన మానాన తాను పని చేసుకుంటూ ఉంటుంది. ఎప్పుడైనా బద్ధకానికో, పనితొందరలోనే రేడియో పెట్టి లేకపోతే మాత్రం నమ్రతగా

'అమ్మగోరండి... తిరుపతి కొండ పాట పెట్టండమ్మ' అని గుర్తు చేస్తుంది. నవ్వుకుంటూ రేడియో పెడుతుంది చేతన. తన మతిమరపును తిట్టుకుంటూ.

శివమ్మ పనిలో చేరిన నెలలోపల ఇల్లూ, పెరడూ ముందులోగిలీ కొత్త జీవంతో కళకళలాడసాగాయి. చేతన ఒంటరితనం ఒక ఆడతోడుతో చాలా వరకు దూరమైంది.

ఇద్దరూ రకరకాల పూలమొక్కలు నాటారు. పెరట్లో కూరల పాదులు వేశారు. నీటి మళ్ళు ఏర్పరచారు. తులసికోట చుట్టూ తెల్లపెయింటుతో చుక్కల ముగ్గులు తీర్చారు. గడపలకు పసుపు కుంకం బొట్లు రంగులతో దిద్దారు. ముందు గుమ్మానికి మావిడాకుల తోరణాలు కట్టారు. ఆఫీసర్స్ బంగళాకి సొంత ఇంటి వ్యక్తిత్వం, కళ వచ్చి చేరాయి.

ముందు హాలులో, పడకగదిలో గాజుకుండీలలో రకరకాల పూలు, ఆకులు తీర్చి అందంగా, పొందికగా అమర్చింది శివమ్మ. సిటీలలో ఉంటే షోకైన పోకడలు కాకపోయినా, ఒక సహజసిద్ధమైన సృజనాత్మకత ఆమె చేసే పనులలో వ్యక్తమవటం గమనించి మనసులోనే ఆ పల్లీయురాల్ని మెచ్చుకునేది చేతన. అది ముగ్గు మెలికలు తిప్పటంలోనే కావచ్చు. పూలగుత్తులు అమరికలోనే కావచ్చు. ప్రతిపనిలో ఒక చక్కదనం కనిపించేది చేతనకు.

వంటింట్లో వంటపాత్రలను, దినుసుల డబ్బాలను, సీసాలను అంచెల వారీగా ఉపయోగానికి వీలుగా సర్దుతుంది. శివమ్మ బాత్‌రూం, సింకులూ కడిగినప్పుడు, ఫినాయిలు వాడి, పాకుడూ లేకుండా శుభ్రం చేసి తడి లేకుండా తుడుస్తుంది. బట్టల బీరువాలలో కలరా ఉండలు పెడుతుంది. కిటికీలు, అద్దాలు దుమ్ము, ధూళి కనిపించకుండా మెరిపిస్తుంది. దువ్వెనలు ఎప్పటికప్పుడు కడిగి ఎండలో ఆరబెడుతూంది. ఒకటేమిటి, ఆమె పనిలో పొరూ, తీరూ కలిగి ఇల్లు అనేది ఎంత పరిశుభ్రంగా, కంటికి ఇంపుగా ఉండాలో అలా దిద్దే ప్రయత్నంలో ఉంటుంది.

సిటీలలో చూసేటప్పుడు ఒక రకంగా చూడనప్పుడు ఒక రకంగా చేసే పనిమనుషులు, నిజాయితీ లోపించినవారూ, క్రమశిక్షణ లేనివారూ, ఆశపోతులూ,

తగాదామారి వాళ్ళూ ఇలాంటి రకరకాల మనుషులతో అవస్థ పడిన చేతనకు శివమ్మ ఒక అద్భుతమైన మార్పు.

నిజానికి చేతన రహస్యంగా శివమ్మను అభిమానించసాగింది. ఇంత చక్కగా, నేర్పుగా ఎలా చెయ్యగలుగుతుంది పనులన్నీ? చదువురానిది, వెర్రి బాగులదానిలా కనిపించే పల్లెటూరి మనిషి ఇన్ని విషయాలు ఎలా గ్రహించి నిర్వర్తించగలుగుతుంది? ఇంట్లో అత్తమామలు, మరుదులు, ఆడబడుచు, ఇద్దరు చిన్న పిల్లలు. ఇంటెడు చాకిరీ ముగించుకుని తెల్లవారుతుండగానే పనికి వస్తుంది. వంచిన నడుము ఎత్తకుండా గంటల తరబడి చికాకు అనేది ముఖంలో కనిపించకుండా, ఏ పనీ ఎగ్గొట్టకుండా చేస్తూ పోతుంది. సిటీలలోగా కాఫీ, టిఫిన్లు పెట్టక్కర్లేదు. 'సద్దెనం తినొచ్చా తల్లే' అంటుంది. ఏదైనా పెట్టబోతే.

టైమ్ మేనేజ్‌మెంట్, ఎఫిషియన్సీ నిపుణులకు – శివమ్మ ఒక నడిచే గ్రంథం' అంటుంది కిరణ్‌తో.

'సందేహం లేదు' అంటాడతను ఏకీభవిస్తూ.

'దీనికే చదువూ సంధ్యలుంటే ఏ మినిష్టరో అయి కూర్చునేది!' అనుకునేది తనలో తాను నవ్వుకుంటూ.

ఒక శనివారం వెంకటేశ్వరస్వామి మాల కడుతున్న చేతనకు పూల కాడలు విడదీసి అందిస్తుంది. శివమ్మ.

'అమ్మా, నువ్వు సదూకున్నావా?' అనడిగింది. అమాయకంగా శివమ్మ.

ఊహించని ఈ ప్రశ్నవిని ఒక్క క్షణం ఆశ్చర్యపోయింది చేతన.

'ఆఁ. బో – లెడంత. మీ అయ్యగారికంటే ఎక్కువ!' కంఠంలో తెలియకుండానే గర్వం ధ్వనించింది.

'అమ్మో, నిజమె తల్లీ?' గుండె మీద చెయ్యేసుకుని అడిగింది. నమ్మలేనట్టు శివమ్మ.

'ఆఁ మరేమనుకున్నా? మా ఊళ్ళో పెద్ద ఉద్యోగం చేసేదాన్ని ఇక్కడ కుదరక, ఏమీ తోచక ఇంట్లో వంట చేస్తూ కూచున్నాను' మనసులో తొక్కిపెట్టి ఉన్న అసంతృప్తిని బాధగా, కోపంగా బయటపెట్టింది చేతన.

అంతలోనే తనను తాను తిప్పుకుని, 'అయినా ఇక్కడ నేను చేసే ఉద్యోగాలు లేవులే శివమ్మా' అన్నది.

'ఆహా, అయితే అమ్మగారు. నీ సదువేందమ్మా? ఏం కొలువు జేసేదానివి?'

'అవన్నీ నీకేం అర్థమౌతాయిలే శివమ్మా' అన్నది తీసిపారేస్తూ, అదే ఇంకొకరితోనైతే 'నా సబ్జెక్టు ఇదీ, దీనిలో నేను డాక్టరేటు చేశాను. యూనివర్సిటీలో ప్రొఫెసర్ని' అని దర్పంగా చెప్పేదే! పనిమనిషికి అందునా పల్లెబైతులకి అవన్నీ ఏమర్థమౌతాయి చెబితే మాత్రం ఊరికే యావ తప్ప!

శివమ్మ ముఖం చిన్నబోయింది. తలవంచుకుని అన్నది మెల్లగా "అవున్లెమ్మ, సత్తెం పలికావు. నాకు సదువులేదు గందా! మీ గొప్ప సదువులు మాకెక్కవు తల్లే!'

శివమ్మ బాధపడిందని అర్థమైంది. చేతనకు. 'సరే విను. చెబుతాను. బోటనీలో పి.హెచ్.డి చేశాను. యూనివర్సిటీలో ప్రొఫెసర్ని. అంటే చెట్లు, మొక్కలు వాటిని గురించిన చదువన్నమాట. అందులో బాగా పై దాకా చదువుకున్నాను. అవి చదువుకునే పిల్లలకు పాఠాలు చెబుతాను. అదీ నా ఉద్యోగం ఏమన్నా అర్థమైందా?'

శివమ్మ కళ్ళు మెరిశాయి.

'అవునామ్మా? నా తల్లి, నా తల్లి, బంగారు తల్లి, వనమాలచ్చివన్నమాట. అయితె సెట్టుకీ, పుట్టకీ పట్టే సీడలు, జబ్బులు వాటి యవ్వారాలు ఆయన్నీ దేనికక్కరకొస్తయ్యో అన్నీ మా అమ్మకు ఎరుకన్నమాట. అమ్మ నా తల్లి!' మురిపెంగా మెటికలు విరుస్తూ అన్నది శివమ్మ.

ఇక చదువురాని మనిషి తన చదువేమిటో విని క్షణంలో మామూలు మాటల్లో అవలీలగా విశ్లేషించటం విని చకితురాలైంది చేతన. శివమ్మ తెలివితేటలు సగటు స్థాయిని మించి ఉన్నాయని మరోసారి మెచ్చుకోలుగా అనుకుంది.

'అమ్మ నా తల్లి. సల్లంగా ఉండు' లేచి వెళుతూ దీవించింది శివమ్మ. తేలిగ్గా నవ్వుకుంది చేతన.

మరునాడు సాయంత్రం గుంపుగా ప్రాజెక్టు వర్కర్ల భార్యలు, వారి ఇంటి ఆడపిల్లలు పాతికమందికి పైగా గుంపుగా రావటం చూచి ఆశ్చర్యపోయింది చేతన. శివమ్మ రమ్మన్నట్లుంది.

అంతా చేతన వంక దేవతను చూచినట్లు చూచి దణ్ణాలు పెట్టారు. అందరి కళ్లలో ఆరాధన. పూజ్యభావం చదువుకున్న మనిషికి ఉన్న విలువ ఆ క్షణం అర్థమైంది. చేతనకు. సిటీలో తాను అందరిలో ఒకరు. ప్రత్యేకతా లేని మామూలు జీవితం.

'అమ్మా సదువుల తల్లే. ఏలి ముద్దర్లేస్తూ, రాసింది. సదవరాక, రాయరాక, లెక్కలు కూడరాక అందరికాడా మోసపోతున్నామమ్మా. మా పిలోళ్ళు మాలాగ పనికిమాలినోళ్ళు అవుతున్నారు. దగా బడుతున్న బతుకులుమాయి. బతకడానికి పనికొచ్చే పాటి సదువు చెప్పి మమ్మల్ని మడుసుల్ని సెయ్యి తల్లి. నీ పేరు సెప్పుకుని రోజు సంజేదీపం పెట్టుకుంటామమ్మ. మమ్ముల్ను మడుసుల్ని సెయ్యి తల్లే' అడుగుతోంది శివమ్మ దీనంగా. అందరూ అలాంటి మాటలతోనే ప్రాధేయపడుతున్నారు. చేతన కళ్ళు చెమ్మగిల్లాయి.

వేలు ఖర్చుపెట్టి తల్లిదండ్రులు కాలేజీల్లో చేరిస్తే రోజూ హాజరు కావటమే కష్టమనుకునే పిల్లలు, కాలేజీలకు రాకుండా ఎటెండెన్సు జబర్దస్తీగా వేయించుకుని చదవకుండా పాసయ్యే మెళకువలు నేర్చుకున్న విద్యార్థినాయకులు, షోకులు, సినిమాలు, చిట్టీలు కట్టడాలు, సంపాదించినది వడ్డీలకు తిప్పుతూ తమ తెలివితేటల్ని పనికిమాలిన వాటికోసం వెచ్చించే బస్తీ పనిమనుషులు... ఇలాంటి అనుభవాల ఊబిలో అదే జీవితమనుకుంటూ బతుకుతున్న చేతనకు ఇదొక కనువిప్పుగా ఉంది.

చదువుకు విలువేమిటి? చదువంటే నిజమైన ఇష్టమా, తపనా ఎక్కడ కనిపిస్తోంది? మార్కుల పందేలలోనా? డిగ్రీల వేటలలోనా? నోరు తెరిచి చదువుకుంటాం. చెప్పమని అడిగేవారేరి? చదువుకుంటే మనుషులమౌతామని చదువుపై నమ్మకంతో, గౌరవంతో గురువులను వెదుక్కుంటూ వచ్చే శిష్యులేరి? ఎక్కడా కనిపించరేం?

ఆడవాళ్ళంతా చేతన ముందు నిలబడి ఆమె సమ్మతి కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. చేతన మేధస్సు, మనస్సు జాగృతమైనాయి.

'నేను చదువుకున్నది వీళ్ళకోసమే' అనే భావంలో ఆమెలో తరంగంలా లేచింది.

'అయ్యగారికి చెప్పి మీకు కావలసిన పలకలు, పుస్తకాలు అన్నీ తెప్పిస్తాను. రెండు రోజుల్లో మూలానక్షత్రం వస్తోంది, సరస్వతీ పూజ. చాలా మంచిరోజు.

అందరూ రండి. రానివాళ్ళని కూడా నచ్చజెప్పి తీసుకురండి. పూజ చేసి మీ చదువులు మొదలుపెడతాను.

అంతా చప్పట్లు కొట్టినంత పనిచేశారు. 'మేమిక్కడ నాలుగేళ్లు ఉంటాము. నేను మీకు నేర్పగలిగినదంతా నేర్పిస్తాను. చెప్పినది జాగ్రత్తగా విని, అర్థం కానివి అడిగి నేర్చుకోండి. అది మీ చేతుల్లో ఉంది.

మీరు నేర్చుకుని బాగుపడ్డారా మీ పిల్లలకు కొంతైనా చెప్పుకోగలుగుతారు. ఈ నాలుగేళ్లల్లో ప్రభుత్వంతో మాట్లాడి ఒక చిన్నబడి పెట్టిద్దాం' తన ప్రమేయం లేకుండానే చెప్పుకుపోతున్న చేతన కిరణ్ రావటం చూచి ఆపింది.

'ఏమిటి శివమ్మా మీటింగేదో పెట్టినట్టున్నావు?' నవ్వుతూ అడిగాడు కిరణ్.

"ఏదో నాలుగు ముక్కలు సదువుకుందామని సారూ....' బిడియంగా అన్నది శివమ్మ.

'ఏమీ లేదండీ. ఇప్పుడే, ఇక్కడే శివమ్మ బడి పెట్టింది. వీళ్లందరినీ చేర్చడానికి తీసుకువచ్చింది' అన్నది చేతన.

ఆడవాళ్లంతా గొల్లున నవ్వారు. 'సివమ్మ బడి, బలెబలె సెప్పింది అమ్మ.... సివమ్మ బడి' అంటూ శివమ్మతో వేళాకోళం ఆడారు.

'నిజంగానేనర్రా.... ఇది శివమ్మ పెట్టిన బడే'

ఆప్యాయంగా శివమ్మ భుజం చుట్టూ చేతులు వేస్తూ అన్నది చేతన. అందరి ముఖాలలో ఆనందం.

చేతన, కిరణ్‌ల కళ్లల్లో అనిర్వచనీయమైన భావపరంపరలు.

'రాబోయే ఒక తరానికి ప్రగతి బాట వేసే కూలీని' తృప్తిగా అందరివంకా చూస్తూ అనుకుంది డాక్టర్ చేతన. డాక్టరేట్ ఇన్ బోటనీ.

# మగవాడి మనసు

**–అంబికా అనంత్**

**పా**లిపోయి నీరసంగా ఉన్న శాంతి మొహాన్ని చూస్తున్నాడు మూర్తి. ఆస్పత్రిలో చేరి వారం రోజులయినా జబ్బేమిటో ఇంకా చెప్పడం లేదు డాక్టర్లు. ఆఫీసు నుండి ఆస్పత్రికి, ఆస్పత్రి నుండి ఇంటికి తిరుగుతూ, మధ్య మధ్య గంటల కొద్దీ 'క్యూ'లో నిలబడి రక్త పరీక్షలకు, స్కానింగ్‌లకు డబ్బు కడుతూ, శారీరకంగా మానసికంగా అలసిపోయి, తనే ఒక రోగిలాగా కనబడుతున్నాడు మూర్తి. డబ్బు నీళ్ళలా ఖర్చవుతోంది. "ఇన్నిసార్లు స్కానింగ్ చేసారు. ఇప్పుడు ఇంకా ఏదో సిటి స్కాన్ చేస్తామంటున్నారు. ఇవాళన్నా తేలుస్తారో లేదో, నాకేం మాయరోగమోనని... నా వల్ల మీరు మంచానపడేలా ఉన్నారు...!" దిగులుగా గిల్టీగా అంది శాంతి.

ఏమీ మాట్లాడకుండా మౌనంగా ఆమె చేతికి హార్లిక్స్ గ్లాసు అందించాడు మూర్తి. ఆలోచనల వలలో చిక్కుకున్న అతని మనసు, అలసిపోతున్న శరీరం – ఒక మర మనిషిలా ఉంది అతని పరిస్థితి – టైంకి అన్నీ చేయడమే తప్ప ఇంకా మరేది ఆలోచించలేకపోతున్నాడు. అది అర్థం చేసుకున్నట్టుగా మౌనంగా హార్లిక్స్ తాగుతూ, గుండెలోనే బాధను అణిచేసుకుంది శాంతి.

ఒక అతి సామాన్యమైన మధ్య తరగతి కుటుంబం వారిది. శాంతి అనారోగ్యం చాలా అస్తవ్యస్తం చేసేసింది. ఆ ఇంటి పరిస్థితిని హైదరాబాదు మహానగరంలోని ఆ సమిష్టి కుటుంబంలో – పాత పద్ధతుల్ని పట్టుకుని వ్రేలాడుతూ, మడితడీ ఆచారాలే మనిషి వ్యక్తిత్వం, మనుగడ అనుకుంటూ, అభ్యుదయ భావాలు గానీ, విశాల హృదయం గానీ లేని మూర్తి తల్లి ఆండాళ్ళు, 'రిటైర్' అయ్యాక మగవాడు కాలుమీద కాలు వేసుకుని పూర్తిగా విశ్రాంతి తీసుకోవాలి గానీ, పూచిక పుల్ల కూడా కదపకూడదు; పుస్తకాలు అద్దెకు తెచ్చుకుని వాటిని తిరగేస్తూ కాలం గడపాలనే మనస్తత్వం ఉన్న తండ్రి వెంకట్రావు.

ఆండాళ్ళు చాదస్తానికి, వెంకట్రావు, బద్ధకానికి తాళం వేయడానికి, భర్త చనిపోయి, వీరిని, ఆశ్రయించిన వెంకట్రావు చెల్లెలు కమలమ్మ, కాలేజీ చదువు ఎంతకీ పూర్తిచెయ్యని తమ్ముడు రంగా, హైస్కూల్‌లో ఉన్న చెల్లెలు లక్ష్మి... ఇది మూర్తి కుటుంబం!

అందరి అవసరాలు తీరుస్తూ, ఇంటెడు పనిచేస్తూ, సౌమ్యంగా నడుచుకుంటూ అందరికీ తలలో నాలుకైన శాంతి పడక వెయ్యటం, చాలా ఇబ్బందిగా ఉంది అందరికీ ఆమె ఆస్పత్రిలో చేరిన రోజు నుండి, ఎవరి పనుల్లో వారు మునిగిపోయి, మూర్తికి ఆఫీసుకు బయలుదేరే లోపల కనీసం టిఫిన్ కూడా రెడీ చెయ్యలేక పోతున్నారు. ఖాళీ కడుపుతో, ఖాళీ అవుతున్న జేబుతో, క్షణ క్షణం గుండె మాత్రం బరువెక్కుతోంది మూర్తికి!

భర్తను అలా చూస్తున్న శాంతికి మనస్తాపం, నీరసం ఎక్కువయిపోతున్నాయి. తనను త్వరలో ఆరోగ్య వంతు రాల్ని చేయమని ఆ దేవుణ్ణి ప్రతి క్షణం వేడుకుంటోంది. తన నడుం నొప్పి వల్ల తనొకత్తే కాదు. ఎందరు బాధపడుతున్నారో అని కుమిలిపోతోంది.

నాలుగురోజులు, నాలుగైదు రకాల పరీక్షలు చేసి డాక్టర్లు తేల్చి చెప్పారు – శాంతికి వెన్నెముకలో టిబి వచ్చిందని, పూర్తి విశ్రాంతి అవసరమని, కనీసం ఏడాది పాటు వైద్యం చేయించాలని! కానీ, జబ్బు పూర్తిగా నయమవుతుందని, పూర్తి ఆరోగ్యవంతురాలు అవుతుందని భరోసా ఇచ్చారు డాక్టర్లు. ఆమెకు విశ్రాంతితో పాటూ, బలవర్థకమైన ఆహారం ఇవ్వాలని ఆమెకు సపర్యలు చేస్తూ ఒక మనిషి ఎప్పుడూ తోడు ఉండాలని, నాలుగైదు నెలలు వెన్నెముకలో జబ్బు తగ్గుతూ బలం పట్టేవరకూ నడుంకి బెల్టు కట్టుకుని జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. అందరి మొహాలు పాలిపోయాయి.

ఇంటి పరిస్థితిని ఊహించుకున్న మూర్తికి మాట రావట్లేదు. శాంతి ఆస్పత్రిలో ఉండడం వేరు, ఆమెను డిశ్చార్జ్ చేసాక ఎలాగ? ఆ ఊహే అతనికి భయం వేసింది. ఎలాగో మనసుని సమాధానపరచుకుని, శాంతికి ఇప్పించాల్సిన ఇంజక్షన్లు పేర్లు, మందుల పేర్లు రాయించుకుని ఆస్పత్రికి కట్టాల్సిన మొత్తాన్ని కట్టేసి, డాక్టర్లు చెప్పిన జాగ్రత్తలన్నీ మళ్ళీ తలుచుకుంటూ, శాంతిని ఇల్లు చేర్చాడు. ఇలాంటి అనూహ్యమైన

పరిస్థితికి తనే కారణమని, లోలోపల కుమిలి పోతోంది శాంతి. “భగవంతుడా, పెద్దవాళ్లకి నేను సేవ చేయాల్సింది పోయి, వాళ్ళతో నేనుసేవ చేయించుకునే సంకటస్థితిలో నన్ను పడేసావు.... ఏం తప్పు చేసానని...? అనుకుంటూ కన్నీరు కార్చింది. తనలోని బాధని, ఆలోచనల్ని అన్నీ మూర్తికి చెప్పి ఓదార్పుని పొందుదామనుకుంది, కానీ మౌనంగా, ఏదో దీర్ఘాలోచనలో ఉండి, రాత్రంతా అలా కూర్చుని ఉన్న అతనిని చూసి, తను హాయిగా పసిపాపలా అతని వెచ్చని కౌగిట్లో ఒదిగిపోయి నిద్రపోయిన రాత్రుళ్లు గుర్తుకొచ్చాయి. ‘తన విధి వక్రించింది....’ విరక్తిగా నవ్వుకుంది శాంతి. ఎదురుగా గోడమీద ఫ్రేమ్‌లో ఉన్న కవిత – ప్రేమకవిత ఆమెలో ఉద్వేగాన్ని మరీ పెంచింది. అనాధాశ్రమంలో పెరిగిన ఆమెను మనస్ఫూర్తిగా ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు మూర్తి. ఆ ప్రేమ చిహ్నం ఆ కవిత. ఎన్నిసార్లో ఆనందంగా చదివిన ఆ అక్షరాలు ఇప్పుడు అలుక్కుపోయినట్టు కనిపించాయి కన్నీటి తెరల్లోంచి....

‘మగవాడు ప్రేమికుడిగా ఎంత భావోద్వేగాన్ని చూపగలడో, మొగుడు అయ్యాక అంత చప్పబడి పోగలడు. ఎంత అంటీ అంటనట్టు, నిర్వికారంగా ఉండి పోయాడు. మూర్తి. టిబి వచ్చింది తన వెన్నెముకకి కానీ, మనసుకి కాదు కదా. ప్రేమ భాండారమైన మనసు పదిలంగానే ఉంది కదా.... అంటే ఈ శరీరాన్నే ప్రేమించాడా అతను....?!’ ఆలోచనల, ఆవేదనల సుడిగుండంలో కూరుకుపోతున్నట్లు అనిపించింది శాంతికి రాత్రంత!

మర్నాడు మామూలుగానే తెల్లవారింది. ఎవరి పనుల్లో వారు మునిగిపోయారు. శాంతి మాత్రం మంచంలో అలా పడుకునే ఉంది. ఆస్పత్రిలో అలా ఉండడం వేరు... ఇంట్లో అందరికీ ఇన్నాళ్ళు ఒక ‘కీ’ ఇచ్చిన యంత్రంలా అన్నీ చేసిపెట్టి, ఇవాళ అలా పడుకోవడం ఆమెకు శారీరక బాధకన్నా కష్టతరమయ్యింది. మూర్తి ఆమెకు మొహం కడిగించి, టిఫిన్, కాఫీ అయ్యాక మందులిచ్చి ఆఫీసుకెళ్లిపోయాడు. అప్పట్నుండీ... నీళ్ళు కావాలనో, బాత్రూంకి తీసుకెళ్లమనో... ఇలా ఒక్కొక్క పని, అత్తగార్నో, మూర్తి మేనత్త కమలమ్మనో అడుగుతూ, మనసులో

చితికి పోతూ కన్నీరు మున్నీరైయ్యింది. వారి మొహం మీది చిరాకును చూస్తూ, తన అసహాయతను తనే శపించుకుంటూ ఉండి పోయింది.

కానీ రాత్రికి ఇల్లు చేరిన మూర్తికి తన గోడు చెప్పుకోవాలనిపించలేదు... 'కొన్ని నెలలు సాగాల్సిన ఈ స్థితిని తను ఎంతగా ఓర్చుకోవాలో, మిగతా అందరూ అంతే భరించాలి' అనుకుంటూ... చిరునవ్వుతో 'భోంచేసి రండి' అంది. మౌనంగా బట్టలు మార్చుకుని బయటకు వెళ్లాడు మూర్తి.

అతనికి భోజనం వడ్డిస్తూ, తామిద్దరూ శాంతికి ఎంత సేవచేశారో, ఎంత కష్టపడ్డారో నిష్ఠూరంగా చెప్తున్న అమ్మను, మేనత్తను చూస్తూ... "నాకు తెలుసు శాంతిని రోజంతా జాగ్రత్తగా చూసుకోవడం కష్టమేనని... మీకు వయసు మీద పడింది... నేను ఆఫీసుకు సెలవు పెట్టి తనని చూసుకోలేను. డాక్టర్లు చెప్పినట్టు శాంతికి సహాయంగా ఉండటానికి ఒక మనిషిని పెట్టటానికి నాకు ఆర్థిక స్తోమత లేదు. తమ్ముడు, చెల్లెలు వారి చదువుల్లో వాళ్ళు ఉంటారు. అసలు ఈ పరిస్థితిని ఎలా మనం దాటగలమా అనిపిస్తోంది...!" అన్నాడు మూర్తి.

అలా నాలుగైదు రోజులు గడిచాక, రాత్రి భోంచేస్తూ మూర్తి "బాగా ఆలోచిస్తే నాకొక ఆలోచన వచ్చింది" అన్నాడు. "మన సమస్యకు అదొక్కటే పరిష్కారం". "ఏమిటది..." ఆత్రంగా అడిగారు ఆండాళ్ళు, కమలమ్మ. "నేను శాంతికి విడాకులిస్తాను!" అన్నాడు మూర్తి. మాట్లాడుకుండా అన్నం తింటున్న రంగా, లక్ష్మీ ఒక్కసారి అదిరిపడ్డారు. "అన్నయ్యా... ఏంటి నువ్వంటున్నది?" అన్నాడు రంగా.

"అవునురా... మీ వదిన పూర్తి విశ్రాంతి, మంచి పోషణ అవసరం. నేను వాటిని సంపూర్ణంగా ఆమెకు ఇవ్వలేను. కనీసం విడాకులిస్తే, తను పెరిగిన అనాథాశ్రమానికే తిరిగి వెళ్ళిపోతుంది. అక్కడ ఆమెకు కావాల్సినంత విశ్రాంతి, మంచి వసతులు ఉంటాయి!" అన్నాడు మూర్తి!

ఎలాంటి అచ్చట్లు ముచ్చట్లు తీర్చలేని ఒక అనాథను పెళ్లి చేసుకున్నందుకు మూర్తిని, అతన్ని లోబరుచుకుందని మాయలో పడేసిందని శాంతినీ ద్వేషిస్తూ, ఇద్దరినీ ఏదో రకంగా కష్టపెట్టిన ఆండాళ్ళుకి మూర్తి మాటలు ఎంతో తియ్యగా అనిపించాయి. మనసులో నుండి పెద్ద బరువు దించినట్టయ్యింది. ఆనందంగా నవ్వుతూ "అవున్రా

మూర్తి, ఆ పనిచెయ్యి... అన్ని విధాలా అందరికీ మంచిది' అంది.

అన్నయ్యలో ఇలాంటి దుర్మార్గుడు దాగున్నాడని తెలుసుకున్న లక్ష్మి గుడ్ల నీరు నింపుకుని, కంచంలో చెయ్యి కడుక్కుని లేచి వెళ్లిపోయింది. విచ్చలవిడిగా తిరిగినా, చదువుని లక్ష్య పెట్టకుండా సమయాన్ని, డబ్బుని దుబారా చేస్తున్నా, రంగాకు అన్నయ్య వదినల మీద అనురాగం, గౌరవం ఉన్నాయి. కానీ అన్నయ్య ఇంత కుటిలంగా ఆలోచించగలడని తెలుసుకున్న అతనికి ఆవేశం, అసహ్యం ఒక్కసారి తన్నుకొచ్చాయి.

"ఛీ ఛీ అన్నయ్యా... ఎంత స్వార్థపరుడివి. అసలు వదినకు నీ ఈ ఆలోచన తెలిస్తే, ఎంత బాధపడుతుందో ఆలోచించావా...? వదినకు నువ్వు అసలు తగవు..." విసురుగా లేచి వెళ్లిపోయాడు రంగా.

"వాళ్ల మొహం... వాళ్లకేం తెలుసు మన కష్టాలు. నువ్వు తీసుకున్న నిర్ణయం చాలా చక్కనిది అలాగే కానీయ్... గదిలోకి వెళ్లాక మళ్లీ మనసు మార్చుకోకు హెచ్చరించింది మూర్తిని ఆండాళ్ళు.

గదిలో నుండి వాళ్ల మాటలు విన్న శాంతికి ఊపిరాగిపోతున్నట్టు అనిపించింది. తను విన్నదంతా తన పిచ్చి ఊహ కావాలనుకుంది. మూర్తి సాన్నిధ్యం రసరాగంలాగా, తమ జీవితాలు సమన్వయ గానం లాగా అనుకుంటూ తను సాగించిన నిన్నటి రోజులకీ, ఊహించని కాఠిన్యాన్ని చూపిస్తున్న ఈనాటి వాస్తవానికి ఎంత వ్యత్యాసం...? "నేనేం పాపం చేశానని నాకీ శిక్ష భగవంతుడా" అనుకుంటూ జలజలా కన్నీరు కార్చింది. మూర్తి అర్థరాత్రి దాటాకా వచ్చి మాటా పలుకూ లేకుండా పడుకున్నాడు.

"కనీసం ఒక్కమాట కూడా మాట్లాడకుండా ఎలా ఉండ గలుగుతున్నాడో...!" అనుకుంది.

"నా హృదయ సీమనంతా ఆవరించ
అందులో పండాలి నీ తేనె మా

ఎంతగా కదలించాయి అతని

ఎంతగా కుదిపేస్తున్నాయి గుండెని

ఈనాడు!

శారీరక బాధతో పాటు మనసు కూడా మెలికలు తిరిగి పోతోంటే, ఎక్కడలేని ఆక్రోశం, ఒక దృఢ నిశ్చయం కలిగింది శాంతికి...

మర్నాడు ఆఫీసు నుండి వచ్చిన మూర్తికి, ఎంతో ఆనందంగా ఎదురొచ్చింది ఆండాళ్ళు.

"ఒరేయ్ మూర్తీ... మనకు పట్టిన శని విరగడయ్యింది. నువ్వు అలా ఆఫీసుకు వెళ్లావో లేదో, నీ పెళ్లాం ఏడుపు రాద్ధాంతం మొదలు పెట్టింది. దొంగ కన్నీళ్లకు కరిగి పోతాననుకుందో ఏమో...! తను ఇక ఈ ఇంట్లో ఉండనని విడాకులు, కోర్టు తీర్పుకోసం తను ఎదురు చూడనని నీతో తెగతెంపులు చేసుకున్నానని నీకు చెప్పమని వెళ్లిపోయిందిరా...! మేము బ్రతి మాలినా ఆగలేదు, ఎవ్వరూ తోడు అక్కరలేదు, అంటూ ఆ నొప్పితోనే ఆటోలో వెళ్లిపోయింది.... ఎంత మొండి మనిషో...!'

ఒక్క నిముషం తల్లి కళ్లలోకి చూసి, ఏమీ మాట్లాడకుండా లోపలికెళ్లిపోయాడు మూర్తి. కళ్లు మూసుకుని కాసేపు కుర్చీలో కూర్చున్నాడు. ఎంతో మామూలుగా ఏమీ జరగనట్టు "అమ్మా భోజనం వడ్డించు" అన్నాడు. భోజనం తిని గదిలోకి వెళ్లి నిద్రపోయాడు. తను అనుకున్నది ఇంత సులువుగా సాధ్యపడినందుకు కంటినిండా కునుకుపట్టింది ఆండాళ్లుకి!

మూర్తి మళ్లీ బ్రహ్మచారి జీవితాన్ని కులాసాగా, ఖుషీగా గడుపుతూ, రాత్రిళ్ళు ఆలస్యంగా ఇంటికి వస్తూ, మొదటి తారీఖు రాగానే మాత్రం ఆండాళ్ళు చేతుల్లో డబ్బులు పోసేసి మరే విషయాలు జోలికి వెళ్లకుండా, హాయిగా ఉన్నాడు. రెండో పెళ్లిచేసుకొమ్మని ఆండాళ్ళు అతన్ని రోజూ పోరు పెడుతున్నా, 'పెళ్లి, పెళ్ళాం అనే లంపటాలు" ఇక తనకి వద్దని తెగ నిక్కచ్చిగా చెప్పేసాడు. తనని కాలు కదపనీయకుండా, ఎంతో ఒద్దికగా, ఓర్పుగా పనులన్నీ చేస్తూ పోయే శాంతి

లేకపోవడం, ఎంతో కాలంగా కొడుకు తెచ్చే కట్నం మీద కన్నకలలు కరిగిపోవడంతో ఆండాళ్ళు నీరుకారి పోయింది.

ఏమీచేయలేక అందరి మీద ప్రతి చిన్న విషయానికి తెగ విరుచుకుపడుతోంది! అలా ఇంటి పరిస్థితులు తారుమారు కావడంతో మూర్తితో పాటు, రంగా లక్ష్మీలు కూడా అసలు ఇంటిపట్టున ఉండడం మానేశారు. వాళ్ళ అలవాట్లలో, స్నేహితులతో కాలం గడుపుతున్నారు. ఒక రోజు రంగా, లక్ష్మీ కలిసి మ్యాట్నీ చూసి, ఆ సినిమాలోనూ తమ అమ్మలాంటి గయ్యాళి పాత్రను గురించి జోకులేసుకుంటూ నడిచి వస్తూంటే, పక్కసందులోని ఒక ఇంటిలో నుండి మూర్తి బయటకు రావడం చూశారు. అతను స్కూటర్ స్టార్ట్ చేసి బయలు దేరే వరకు అక్కడే ఆగిపోయి, అతను వెళ్లిపోయాక, వెంటనే ఆ ఇంట్లోకి వెళ్లారు.

దేవత లాంటి శాంతి వదినను అన్నయ్య దూరం చేసుకోవడానికి కారణం అక్కడ దొరుకుతుందని... ఆ కారణం ఏదైనా దాని అంతుచూడాలనే ఆవేశంలో లోపలికెళ్లిన వారికి, ఆ దేవతే ఎదురయ్యింది.

ఒకరినొకరు చూసుకున్న వాళ్ల మొహాల్లో ఆనందం వెల్లివిరిసింది. "వదినా..." అంటూ శాంతిని గట్టిగా కౌగిలించుకున్నారు. "నువ్వు మీ ఊర్లో ఉన్న హాస్టల్‌కి వెళ్లిపోయావనుకున్నాను వదినా.... ఇక్కడే ఉంటూ మాకు కనపడకుండా ఇలా దూరంగా ఒంటరిగా ఉంటున్నావా...? ఇప్పుడే అన్నయ్యను చూసి, ఇక్కడ ఇంకెవరన్నా ఉన్నారేమో నిన్ను అన్నయ్యను వేరు చేసే వాళ్ళు అని లోపలికొచ్చాము.... నిన్ను ఇక్కడ చూడడం చాలా ఆనందంగా ఉంది వదినా...!" ఆరోగ్యంగా కనిపిస్తున్న వదినను చూస్తుంటే ఇది అందమైన కలకాదు గదా అన్న అనుమానం వేసింది ఇద్దరికీ...!

"నేను ఒంటరిగా ఎక్కడున్నాను... మీ అన్నయ్య ప్రేమ నాకు రక్షణ కవచమైనప్పుడు? ఆయన నన్ను తన గుండెలో నుండి ఎప్పుడూ బయటకు పంపలేదు. నేనే ఆయన ప్రవర్తనకు కృంగిపోయి ఇంట్లో నుండి బయటకు వచ్చేశాను. ఆయన ఈ రోగిష్టి భార్యను మరిచిపోయి, మళ్ళీ పెళ్లి చేసుకుని ఆనందంగా ఉంటారనుకున్నాను కానీ...'

ఆమె మాట పూర్తి అవకమునుపే, చేతిలో పళ్లు, కూరలు పట్టుకుని మూర్తి లోపలికొచ్చాడు. తమ్ముణ్ణి, చెల్లెల్ని ఆనందాశ్చర్యాలతో చూస్తూ శాంతి భుజాలచుట్టూ చేతులు వేసి అనురాగంగా దగ్గరకు తీసుకుంటూ "ఎలా ఉంది మీ ప్రియమైన వదిన? ఈ కర్కోటపు అన్నయ్య బాగా చూసుకుంటున్నాడా లేదా....?" అని చిరునవ్వుతో అడిగాడు.

"అన్నయ్యా... నిన్ను అలా అన్నందుకు క్షమించు. మేము నిన్ను సరిగా అర్థం చేసుకోలేదు...!" ఇద్దరూ మూర్తిని చుట్టేశారు.

"లేదు.. లేదు మీ తప్పేమీ లేదు... మీ వదిన మీద మీకున్న ప్రేమ మిమ్మల్నలా మాట్లాడించింది. ఆ ప్రేమే నన్ను అలా ప్రవర్తించేలా చేసింది. అమ్మది, అత్తయ్యది ఎలాంటి మనస్తత్వమో నాకు తెలుసు. శాంతికి సపర్యలు చేస్తూనే, వారి సూటిపోటీ మాటలతో ఆమెను కృంగదీసేవారు.... తను కోలుకోవడం మాట అటుంచి మనసులో రోజురోజూ చచ్చిపోతూ.... ఒక రోజు నిజంగానే... "ఆ ఊహే భరించలేనట్టు శాంతిని ఇంకా దగ్గరగా పొదివి పట్టుకున్నాడు మూర్తి"

"నా మాటలతోనూ, మౌనంతోనూ రెచ్చగొట్టి మీ వదినను ఆ ఇంట్లో నుండి బయటపడేలా చేసాను. వెంటనే తను ఉంటున్న 'శాంతిథామం' హాస్టల్‌కి వెళ్ళి, తనకు అసలు విషయం, నా మనసులో ఉన్న ఆలోచన చెప్పి, తనని నొప్పించినందుకు క్షమాపణ అడిగి నేను కుదుటపడ్డాను. పదిరోజులు ఆఫీసుకు సెలవు పెట్టి, ఈ ఇల్లు అద్దెకు తీసుకుని, మీ వదినకు అన్నీ సమకూర్చి పెట్టాను. తనకు సాయంగా ఉండటానికి హాస్టల్ నుండే ఒక అమ్మాయిని మేట్రిన్ పంపారు. ఇంటో వాళ్ళు నా పరిస్థితిని అర్థం చేసుకోలేకపోయినా, నా స్నేహితులు ముందుకు వచ్చి నాకు ఆర్థికంగా ఆసరగా నిలిచారు.

శాంతికి, తన భర్తలోని ప్రేమికుడు పరిస్థితుల ప్రభావం వలన, అసహాయత వలన మూగబోయాడు కానీ మాయమవ్వలేదని చూపాను.

అమ్మ కళ్లలో నేను రోగిష్టి భార్యను వదిలేసి జాల్సా చేసుకుంటున్న జులాయిని... అలా చెయ్యడం తప్పునిగానీ, శాంతిని మళ్లీ ఇంటికి తీసుకురమ్మని, ఆమెను ఆరోగ్యవంతురాలిగా చూడాలనిగానీ, అమ్మ ఏ నాటికీ అనదు. నాన్న నోట్లో నాలుకకు

పక్షవాతం ఎప్పుడో వచ్చేసింది. అందుకే ఇలాంటి నిర్ణయం తీసుకున్నాను. ఈ నిజం ఏదో ఒకనాడు బయటపడేదే కానీ ఆ పాటికి నా శాంతి మళ్లీ పరిపూర్ణ ఆరోగ్యం తిరిగి పొంది, పూర్ణచంద్రుడిలా కళకళలాడుతుంది.

'కానీ ఒకటి మాత్రం నిజం... ఆ ఇంటికి శాంతిని మళ్ళీ తీసుకురాను. పరిస్థితులు మారే వరకూ, ఒక భర్తగా, ఒక బాధ్యతగల కొడుకుగా, నా పాత్రలు వేరువేరుగా పోషిస్తాను. వాటిని కలిపి సమర్థవంతంగా నడపలేని మూర్తి.

"అన్నయ్యా... నీ మనసు బంగారం!" గర్వంగా అభిమానంగా అన్నారు రంగా, లక్ష్మీ!

# తృప్తి

**–ఉంగుటూరి శ్రీలక్ష్మి**

**పి**ల్లకాలువ మీదినించీ చల్లని గాలులు వీస్తున్నాయ్. అస్తమిస్తున్న సూర్యుడు దూరాన కొండల్లోంచి నెమ్మదిగా వీడ్కోలు తీసుకుంటున్నాడు. ఆకాశమంతా కుంకుమ ఆరబెట్టినట్లుగా ఎఱ్ఱదనం పులుముకుంది. కాని ఇవేమీ గమనించే స్థితిలో లేడు మాధవ్.

తీవ్రాలోచనలో మునిగివున్నాడు.

బి.కాం. ఫస్ట్‌క్లాస్‌లో పాస్ అయ్యాడు. కొండంత బరువునెత్తి కెత్తుకుంటాడని వున్న పొలం అమ్మి చదివించాడు తండ్రి. లాభం ఏముంది! పరీక్ష పాసై మూడేళ్లయినా ఎక్కడా ఉద్యోగం దొరకలేదు! దానికి కావలసిన క్వాలిఫికేషన్ డిగ్రీ కాదు, ఉత్తరం లేదా దక్షిణ! అవి రెండూ లేకపోతే తూర్పు ఎటో చూసుకోవలసిందే. తనను పరిచయం చేస్తూ ఉత్తరం యిచ్చేంత ఉదారులెవరూ లేరు. పోతే దక్షిణ తను యిచ్చుకోలేడు. పోనీ ఏ బ్యాంకు లోనైనా తీసుకుని చిన్న బిజినెస్ పెట్టుకుందామన్నా సెక్యూరిటీ చూపించడానికి తనకేముంది గనుక!

రిటైర్ అయిన తండ్రి ఇంకా ట్యూషన్లు చెప్పి కాస్తో కూస్తో సంపాదిస్తున్నాడు. తల్లి బట్టలుకుట్టి వేన్నీళ్ళకు చన్నీళ్ళు తోడుగా సంసారం సాగిస్తోంది. తనూ తండ్రిలాగా ట్యూషన్లు చెప్పుకుందామంటే డిగ్రీ అన్నదొకటి ఇన్నాళ్ళూ అడ్డొస్తోంది. ఏ బాంకిలోనైనా మంచి జాబ్ వస్తుందని ఆశ యిన్నాళ్ళుండేది. ఇక లాభం లేదు. ఏమైనా ప్రస్తుతానికి ట్యూషన్లు కుదుర్చుకోవాలి.

పాపం! ఆ ప్రకాష్ కంటే తాను ఎన్నో రెట్లు నయం. తనకు కంటికి రెప్పలా చూసుకునే తల్లీ తండ్రీ వున్నారు. ఇంకా వాళ్ళ సంపాదన మీదే తను బ్రతుకుతున్నాడు. ప్రకాష్‌కేముంది? రోగిష్టి తండ్రి, పైగా గుండెజబ్బుతో ఇవాళో, రేపో అన్నట్లున్న తల్లి, పెళ్ళికెదిగిన చెల్లెలు, చదువుకుంటున్న తమ్ముడు, తండ్రికొచ్చిన పెన్షన్‌తో తినీ,

తినకా గడుపుకొస్తున్నారు వాళ్లు! ఇలా మాధవ్ ఆలోచనలు పరిపరివిధాలుగా పోతున్నాయి.

"హాంరినీ! ఇక్కడున్నావా!" వీపు మీద ఒక్క చరుపుచరిచాడు ప్రకాష్.

ఉలిక్కిపడి చూశాడు మాధవ్.

"అదేమిత్రా! అట్లా చూస్తావ్, మన వాళ్ళంతా నీ కోసం ఎదురు చూస్తున్నారు. రా మరి!" చెయ్యందించాడు ప్రకాష్. ఇద్దరూ నడక ప్రారంభించారు.

"నీకో గుడ్ న్యూస్ రా" బుజం చుట్టూ చెయ్యివేసి నడుస్తూ చెప్పాడు ప్రకాష్!

"ఏమిత్రా అది" నాకేం గుడ్ న్యూస్ వుంటుందిలే. నీ మొఖం – అన్నట్లు చూశాడు మాధవ్.

"ప్రస్తుతం మన ఫ్రెండ్స్‌లో నిరుద్యోగుల సంఖ్య ఆరు అవునా!" అన్నాడు ప్రకాష్.

మాధవ్ మౌనంగా తలూపాడు. ఉద్యోగం లేకపోవటానికి తోడు ఈ కష్టాలతో వీడికి మెంటల్ డిఫెక్ట్ కాని వచ్చిందా ఏం ఖర్మ! అనుకుంటూ.

"ఇవాళ కాలేజీ గ్రౌండ్‌కి హెల్త్ మినిస్టర్ వస్తున్నారు. అక్కడికి వచ్చే సైకిళ్ళు మోటారు సైకిళ్ళు చూశాక నాకో ఐడియా తట్టింది. మన ఫ్రెండ్స్ కూడా యిష్టపడ్డారు. మరి నీ సంగతి కూడా చెబితే" అన్నాడు ప్రకాష్ మెల్లగా గొంతు సవరించుకుంటూ.

"అదేదో చెప్పి ఏడవరా బాబూ! వెధవ సెన్పెన్సూ నువ్వు" విసుక్కున్నాడు మాధవ్!

"ఏముంది? పెట్టుబడి లేని వ్యాపారం.మనం ఆరుగురుం మీటింగ్ అయ్యేదాకా ఆ సైకిళ్లకి కాపలా కాసి, తిరిగి వాళ్లకి అప్పచెప్పటం. సైకిల్‌కి 14 పైసలు చొప్పున డబ్బులు వసూలు చేసుకోవటం ఫస్ట్ స్టెప్! మనకి వచ్చిన డబ్బుని బట్టి సెకండ్ స్టెప్ తీసుకుందాం. ఓ.కే! ఏమంటావ్?" తన ప్రపోజల్‌ని మాధవ్ ముందుంచాడు ప్రకాష్.

మాధవ్‌కి మంచి హుషారొచ్చింది. ఏదైతే నేం యిదీ ఒక ఉద్యోగమే. కష్టపడి కాపలాకాస్తారు. వాళ్ళు ప్రతిఫలంగా డబ్బు ముట్టచెప్తారు. తప్పేముంది! తెలిసిన వాళ్ళు కనపడ్డా ఫరవాలేదు. రెండేళ్ళ నించీ నిరుద్యోగిగా కష్టాల్లో వుంటే సాయం

చెయ్యని వాళ్ళు యివాళ నవ్వుతారని బాధ పడటం కూడా అనవసరం. ధృడనిశ్చయానికొచ్చి 'ఓ.కె' అంటూ ప్రకాష్‌తో చెయ్యికలిపాడు మాధవ్.

వీళ్ళిద్దరూ వెళ్ళేప్పటికీ అట్టలు మీద నంబర్లేసి ఓ రెండు వందల స్లిప్స్ తయారు చేశారు వాళ్ళ మిత్రులు వాసూ, ప్రసాద్‌లు! దారిలో కర్రకి అట్టకట్టి దాని మీద "సైకిల్ స్టాండ్" అని రాశారు. శీను రావు కలిసి తెలిసిన లెక్చరర్ల సైకిళ్ళు ఒక పది వరుసగా పెట్టటంతో, మిగతా వాళ్ళు తమంత తామే సైకిళ్ళు యిచ్చి వెళ్ళటం మొదలు పెట్టారు. పావుగంటకల్లా నూటయాభైస్లిప్స్ అయిపోయినై. ప్రకాష్ సైకిల్ మీద వెళ్ళి ఒక దస్తా తెల్లకాగితాలు తెచ్చాడు. మాధవ్, శ్రీను కూర్చుని గబా గబా స్లిప్స్ తయారు చేశారు.

మినిస్టర్‌గారు వచ్చేప్పటికి షుమారు 2000 సైకిళ్ళు స్టాండులో చేరాయి! స్టాండులో వాటిని జాగ్రత్తగా కాపలాకాసి ఎవరివి వాళ్ళకి అప్పగించేటప్పటికి రాత్రి 11 గం॥ల యింది టైము. ఆరుగురూ కూర్చుని డబ్బు లెక్క చూచుకున్నారు. వాళ్ళ కష్టార్జీతం 300 రూ॥ వచ్చింది. 5రూ. పెట్టి అరటిపళ్ళు కొని అందరూ తలా కాసిని తీసుకుని ఇళ్ళకు వెళ్లారు.

మర్నాడు ఏడు గంటలకల్లా అంతా దేవాలయం దగ్గర చేరారు. తర్జన భర్జనలు జరిగాక హోల్‌సెల్‌లో పాలకొల్లు దేవస్థానం బట్టల సంతలో జాకెట్ పీసెస్, లంగాగుడ్డకొనాలని నిర్ణయించుకున్నారు ఆ మిత్ర బృందం.

సాయంత్రానికి బట్టలమూటతో మాధవ్‌యింటికి చేరారు అందరూ! మాధవ్ తల్లి లంగాలు కుట్టి యిస్తానంది. ప్రసాద్ చెల్లెలు అవి అమ్మి పెడతానంది. చివరకి వాసు చెల్లెలు జాకెట్ పీసెస్ 3 రూ॥ కొన్నదాన్ని నాల్గున్నరకి అమ్మి పెట్టటంతో మంచి లాభాలు వచ్చాయ్. మళ్ళీ సంతకి షర్ట్ పీసెస్ కూడా కొన్నారు. అవీ అమ్మారు లాభాలొచ్చాయ్.

అట్లా ఇట్లా వృద్ధి చేసి మెల్లగా పెద్ద బజారులో మంచి సెంటర్లో "ఫ్రెండ్స్ షోరూం"గా వాళ్ళ బట్టల వ్యాపారం స్థిరపడింది. అందులో కాషియర్, సేల్స్‌మెన్, మేనేజర్, షాపు ఓనర్ అన్నీ వాళ్ళే.

ఉత్సాహంతో పని చేస్తూ కొద్ది రోజుల్లో షాపుని ఇంకా పెద్దది చేశారు మాధవ్, అతని మిత్రం బృందం! ఆ తర్వాత రెండేళ్లలో "ఫ్రెండ్స్ షోరూం" బ్రాంచీలు అయిదు వూళ్ళల్లో వెలిసేయ్. ఆరుగురూ తలొకషాపూ మైన్‌టైన్ చేసుకోవడం మొదలెట్టారు.

క్రమేపి ఊళ్ళో మంచి పలుకుబడి సంపాదించారు. యిప్పుడు బీదవాళ్లకి ఎవ్వరికి ఏ సహాయం కావలసి వచ్చినా ఈ మిత్ర బృందంలో ఎవరైనా ముందుకు వస్తారు.

అనేక మందికి ఉత్తరం – దక్షిణ యిచ్చి మంచి ఉద్యోగాలు వేయించారు. ఈనాడు వాళ్లలో ఎవరిని కదిపినా "మేము ఉద్యోగాలు చెయ్యటం లేదనే బాధలేదు మాకు! నల్గురికి యిప్పించకల్గుతున్నామనే తృప్తి చాలు మాకు" అంటారు సంతోషంగా.

# ఎటు చూస్తే అటు

**-డి. సుజాతాదేవి**

సోములి ఇల్లు సందడి సందడిగా ఉందారోజు. అంతకు ముందురోజే దేశమెల్లి సరుకేసుకొచ్చాడు. పొద్దు పొడిచే సరికి ఒక్కొక్కళ్ళు పోగవుతున్నారు.

"ఎప్పుళ్ళెగిశారు? ఎప్పుడొందుకు తిన్నారర్రా?" విసుక్కుంది సోములి పెళ్ళాం రత్నం. సోములు సరుకున్న బస్తాలన్నీ వసారాలో వేశాడు. తరాజు, తాటాకు బుట్టలు దగ్గరబెట్టుకుని ఎత్తుపీట వేసుకుని కూర్చుంది సోములి అత్త పెంటమ్మ. బస్తాకున్న పురికొసలాగి బోర్లించాడు సోములు.

ఉండలు ఉండలుగా తుట్టలు కట్టుకున్న వెంట్రుకలు అదో రకం దుర్వాసనతో బయటపడ్డాయి. ఒక వుండ తీసి వాసన చూసి పోగులోకి విసిరి కొట్టింది పెంటమ్మ.

"మరీ నాశిరకం, అందులోను తడిపారు తూకాని కొత్తయ్యని" గొణుక్కుంది పెంటమ్మ.

"ఆ! ఇక్కడ కూసుని కబుర్లు సెప్పడంగాదు. అక్కడ కొచ్చి బేరం జేస్తే తెలుత్తది. ఎన్నిసోట్ల దిరిగి వాకబు జేత్తేనో ఈ రేటుకియ్యి దొరికినై" నిర్లక్ష్యంగా అన్నాడు సోములు.

తల్లి మాటలు విన్న రత్నం కూడా ఒక ఉండతీసుకుని విడదీసి చూసింది. మరీ గట్టిగా చుట్టుకుపోయి మట్టి కొట్టుకుని ఉన్న వాటిని చూసి రత్నానికి కూడా కోపం వచ్చింది.

"ఓ... సవకబేరం జేసుకొచ్చానని సంబరపడిపోతున్నావు. ఇయ్యి పీకేతలికి ముక్క ముక్కలైపోయి లాబంగూబల్లో కొత్తది", మొగుడుకేసి ఉరిమిచూస్తూ అంది రత్నం.

"సర్లే బేగి తూసి పడెయ్యండమ్మా, మీ లాబం మాటేమోగాని ఇయ్యి పీకేతలికి మా గూడలుపడిపోతయ్యి", అంది మంగమ్మ.

ఒక కిలో ఉండలు తూచి మంగమ్మ బుట్టలో వేసింది పెంటమ్మ.

"ఉంకో అరకిలో వెయ్యి"

"అయి పీక్కోవే మాటకారి మంగమ్మ. నీకాశ లావు, పీక సన్నం' విసుక్కుంటూనే మరో అరకిలో తూచి వేసింది పెంటమ్మ.

"యామని పెట్టారోగాని ఆ పేరు, ఎంత కమ్మటి నోరో తల్లిది" గొణిగింది మంగమ్మ.

అందరూ తలో కిలో వేసుకొని ఆ వసారాలోనే తలో పక్కా కూర్చున్నారు. ఒకళ్ళిద్దరు ఇళ్లకు తీసుకెళ్లారు. ఉన్న వాళ్ళు కాసిని కాసిని వెంట్రుకల ఉండలు ముందు పోసుకుని గట్టిగా చుట్టుకుపోయిన వాటిని దూదిపింజినట్లు విడదీసి పోగు పెడుతున్నారు.

అంతకు ముందు వ్యవసాయ కూలీగా వుండగా గోచీ కెక్కువ – గావంచాకు తక్కువగా సాగుతున్న సోములి సంసారం వెంట్రుకల వ్యాపారం పెట్టాక పచ్చగా ఉండటమే కాక పదిమందికి కూలి దొరుకుతుంది. ఆ చిన్న పల్లెటూరిలో అయిదుగురు ఆ వ్యాపారం చేస్తున్నారు.

పొలం పనులు చేయలేని చిన్న పిల్లలైనా, కన్ను కాలు అవుడైన ముసలివాళ్లయినా నీడపట్టున కూర్చుని రోజుకో కిలో పీకితే రెండు రూపాయలు వస్తాయి. అట్లా పీకిన వాటిని పింజదీసి, సైజులు వేరు చేసి కట్టలు కడితే కిలోకి ఎనిమిది రూపాయలు సవరాలు కట్టడం వచ్చినవాళ్ళకు పనిలో వేగాన్ని బట్టి, నేర్పునిబట్టి ఇంకా ఎక్కువే.

"ఇయాల కన్నమ్మింకా రాలేదేంటే? తెల్లారేసరికి వచ్చి పడేది" అంది పెంటమ్మ.

"ఏలూరెళ్ళింది"

"యాం పని"

"మునుపెల్లినపుడెప్పుడో అన్నారంట రెణ్ణెల్లలో సిట్టిపాప ఒత్తాదని, ఎప్పుడొత్తదో అడిగిరాటానికెల్లింది" అంది మంగమ్మ.

"మొత్తానికాపిల్ల మీద పంచపేణాలు. అమ్మ దీని బెమత పాడుగానో! అరికాలికి మట్టిగానిచ్చేదా, అగ్ని దగల్నిచ్చేదా?" అంది సూరమ్మ.

"మా సిట్టిపాప మా సిట్టిపాపని తెగ జెప్పుద్ది కన్నమ్మమ్మ. ఆ పిల్లేమవుద్దసలు" అడిగింది కొత్తగా కాపరానికొచ్చిన రామతులసి.

"అదా, సెప్పాలంటే శానాకతుంది." అని గొంతు సవరించుకుంది మంగమ్మ.

కాస్త దూరంగా కూర్చున్నవాళ్ళు కూడా వెంట్రుకలపోగులు నెట్టుకుంటూ దగ్గరకు వచ్చారు. అసలు మంగమ్మ ఏ విషయం చెప్పినా అలాగే చెవులు దోరబెట్టుకుని వింటారు.

ఆవిడకథా కథన చాతుర్యం అటువంటిది. ఎపుడైనా ఏడాదికో రెండేళ్లకో ఓ సినిమా చూసి వస్తే రాత్రి భోజనాలయాక చుట్టూ పదిమందిని కూచోబెట్టుకుని స్వాగతం దగ్గర్నుంచీ శుభం వరకూ ఒక్క కదలిక బీరుపోకుండా, వాళ్లనే మాటలే కాక ఆలోచనలు కూడా ఊహించి, ఊరించి ఊరించి వారం రోజులు చెబుతుంది. వాళ్ళు ఏ కబుర్లు చెప్పుకుంటున్నా చేతులు మాత్రం చకచక వెంట్రుకల చిక్కులు పీకి ఓ పక్కకు నెడుతున్నై. కొందరు పమిట చెంగులు తలమీది నుంచి ముందుకు లాక్కుని ముక్కు మీదుగా వెనక్కు వేసుకున్నారు. దుర్వాసన రౌజు భరించలేక.

మంగమ్మ మొదలుబెట్టింది కథలా.

"నేను కాపురానికొచ్చేతలికే మూడుసార్లు కడుపుకాల్చుకుంది. కన్నమ్మ. అవడానికి నాకత్తవరసైనా, నా కన్నా రెండు మూడేళ్ళు చిన్నది. పేరుకు మొగుడు మా సినమావ కాని అత్త, ఆడబిడ్డ అసలు మొగుళ్ళు, మా మావకు ముందు సమందం పిల్లలిద్దరూ చెరోసోట తిరపడిపోయారు. కత్తిమీద సాములుగా కావరం జేసింది. కన్నమ్మ. ఏదో పడ్డోళ్ళు సెడ్డోళ్ళుగాకపోయినా పోయినోళ్లు మంచోళ్ళనాలి. ఆళ్ల కాలం చెల్లింది. ఆళ్ళెల్లిపోయారు. కన్నమ్మ ఒంటిగా మిగిలిపోయింది. తండ్రి కరమల కొచ్చిన కూతురూ కొడుకు పొలం పుట్రా అమ్ముకొని పంచుకుపోయారు. ఇల్లొకటి మిగిలింది కన్నమ్మకు"

"ఇంతకీ ఈ సిట్టి పాపెవరు?" అసలు సంగతి చెప్పమన్నట్లు ఆత్రంగా అడిగింది రామతులసి.

"అదే అదే సెప్తున్నా, ఎప్పుడిమాటిరవై ఏళ్ళు దాటిపోయింది. కన్నమ్మకో ఆడబిడ్డుండేదని సెప్పాను కాదు. ఆవిడ కొడుకు ఎంకట సెలం, ఏలూరులో

గవరమెంటాఫీసులో ఉజ్జోగం, అదిగో ఆడి కూతురే ఈ సిట్టి, సిట్టి కేడాది దిరక్కుండానే తల్లి జచ్చింది. అపుడు కన్నమ్మే పెద్ద దిక్కుగా ఆదరించి ఓదార్చింది. సేయితులంతా పట్టుబట్టి మారు మనువు జూశారు సెలానికి. అయినింటిపిల్ల, సదుంకున్నది, సక్కందీను. ఆ పిల్ల కాపరానికొచ్చీ రాంగానే సిట్టిముండ బాజీతప్పజెప్పడానికి సిన్న తనవనిపించింది సెలానికి. ఏదో కొత్త పెళ్లాం పాతబడేదాకా ఆ పిల్లనెవరు పెంచుతారా అని పారజూస్తే అటూ ఇటూ ఎవరూ కనబడలే. బిడ్డ తండ్రిని జేత్తన్నారు నాకని ఆవిడగారు కళ్లమ్మటకారిసిందంట. నీకెందుకు, పిల్ల బాదరబందీ నీకుండదూ అని మాటిచ్చి మరీ సేసుకున్నాడంట. అదిగో ఆ రకంగా కన్నమ్మ కాళ్ల కడ్డంబడింది సిట్టి. అట్టా ఏడాది పిల్లను దెచ్చి ఆరేళ్లొచ్చేదాకా కంట్లో బెట్టుకు సాకింది కన్నమ్మ.

ఆ పిల్లని బళ్లో ఎయ్యాలని ఆళ్లనాన తీసికెల్లిన్నాడు దానేడుపింతాఅంతా కాదు. పీనుగెల్లినట్టు ఖాయిలా పడిపోయింది.

“ఏడిసిందంటే ఏడవదా మరి! ఆ పిల్లిక్కడ ఉన్నన్నాళ్ళు వైభోగం కిందుండేది. పైసా పాటుబడలేదు. సమస్తం తెచ్చిపడేసేవాడు.” అక్కసుగా అంది సూరమ్మ.

“బుద్ధి పోనిచ్చుకున్నావు కాదు, సుప్పనాతి సూరక్కా! ఆడూ, నువ్వూ పెడితేనే తింటందా ఎల్లకాలమూ, అప్పట్లో పిల్లను తీసికెళ్లాక కూడా నెల నెలా పదో పరకో పంపించేవాడు.

తరవాత్తరవాత ఎపుడో సూత్తానికొచ్చి పాతికో ముప్పయ్యో నేతిలో పెట్టేవోడు. పిల్ల కూడా అస్టలికి సెలవులిచ్చినపుడల్లా వొచ్చి నాలుగురోజులుండెల్లేది. రాను రాను ఇపుడా పెట్టుపోతలూ లేవు. రాకపోకలూ లేవు. తల్లి తరపు ఆత్తి బాగానే వచ్చింది. సిట్టికి, మంచి, సమందమే చేసాడు. ఉప్పుడిద్దరు పిల్లలు. మొగుడికి ఢిల్లీలో ఉజ్జోగం ఆళ్ళొత్తన్నారంటే సాలు కన్నమ్మకు ఒళ్ళు తెలవదు, ఒంటి మీద గుడ్డ నిలవదు”

మంగమ్మకథ ముగించకముందే...

“అదిగో కన్నమ్మామ్మొచ్చేత్తంది” అంది రామతులసి.

ఒక చేతిలో సంచి, ఒక చేతిలో కొత్తగా రంగువేసిన ముక్కాలపీట పట్టుకుని ఊగిఊగి నడుస్తున్నది కన్నమ్మ.

వచ్చేసింది నల్లగా పొగకట్టెలా ఎండిపోయి, సన్నగా ఈతజువ్వలా వొంగిపోయి వున్న కన్నమ్మ సాలిదీర్చుకుంటూ.

“ఏంటత్తా మీ సిట్టిపాప సంగతులు” అడిగింది మంగమ్మ.

“యామున్నయ్యమ్మా! తల్లీ పిల్లలూ, బాగానే వున్నారంట. వచ్చే నెల ఇరవై ఎ నిమిదో రోజునొత్తారంట. మా సెలం పెళ్లాం కరుగ్గా, మాటే సెప్పదమ్మా, ఒకటి మాటాడితే తక్కువ, రెండాడితే ఎక్కువ. ఆవిడతో నేనే మడుగుతాను. కాసేపు కూచోనొచ్చేశా.”

“పీటను పెళ్లికూతుర్ని చేశావేంటి మామ్మా!” అంది రామతులసి.

“అదా, మా బుడ్డదొచ్చాక, ఇద్దామని రంగేయిచ్చుకొచ్చా, ఆళమ్మ సిన్నప్పుడు దానిమీద కూసోబెడితేనే అన్నం తినేది, తానం చేసేది” మురిపెంగా అంది కన్నమ్మ.

“ఎంత సక్కగేశాడే రంగు! పైన పువ్వు కూడా ఏశాడు. కొత్త పీటలాగుంది” అంది పెంటమ్మ.

“అవునే, నన్నక్కడ నుంచో బెట్టి సిటుక్కున ఏసిచ్చాడు. ఇట్టాటి విద్దెలు నేరిసినోళ్లదే జనమ. మనవూ వున్నాం ఎంత సేపూ దుక్కిటెద్దుల్లా కట్టపడతవే గదా?” పీట మీద గులాబి పువ్వును ముచ్చటగా చూస్తూ అంది కన్నమ్మ.

“అట్టనమాకులే అత్తా, చేసే నేరువుండాలిగాని ఏ పనిజేత్తేనేంటి. మన కోటిగాడు పింజలు దీత్తాడంటే, ఒక్క ఎంటికైనా ముక్కలవనిత్తాడా? ఎంత సురుగ్గా జేత్తాడో, అంతందంగా జేత్తాడు. అదీ ఆ పారవతి సగరం కట్టిందంటే యెట్టుంటుంది? మిసనుపనేగాని సేతిపనిలాగుండదు. మనం జూడు పొద్దుగూకులూ కూసుని ఈసెడు బొచ్చుబీకీ తలికి గగనమై పోతుంది. దానికే సందలడేతలికి రెక్కలు పులిసిపోతన్నై” అంది మంగమ్మ.

“అది సరేగాని మంగమ్మా! ఈ పాలి మా సిట్టిపాపొచ్చే తలికి అరిసిలొండాలే” అంది కన్నమ్మ మాట మారుస్తూ.

“నీ కెందుకొచ్చిన పిచ్చే బాబూ. ఆళ్ళు కావాలంటే కొనుక్కుతినలేరా? ఏదో కాలూసెయ్యి ఆడతంది గనక కట్టపడి బొచ్చుపీకి రూపాయి డబ్బులు సంపాయిత్తన్నావు. ఒక పావలాతిని పైసా ఎనకుంచుకోపోతే ఎట్టా” అంది పెంటమ్మ.

"పోనివ్వే పళ్ళొచ్చిన కాణ్ణుంచి పప్పులు దింటున్నాం. కాళ్లొచ్చిన కాణ్ణుంచి కట్టపడతన్నాం. అది పొట్టలో వుంటందా? ఇది పెట్టెలో వుంటందా? బిడ్డాపాపా వున్న దానివి నువ్వు కూడా అట్టంటావేమే" అంది కన్నమ్మ.

అట్లా అవే ఆలోచించుకుంటూ పనిచేసుకుంటున్న కన్నమ్మ మనసులోకి బెదురు బెదురుగా ఒక ఆలోచన జొరబడింది. వెంటనే అది బలం పుంజుకుని నిముషాల మీద తిరుగులేని నిర్ణయంగా మారింది.

ఆలీ, మొగుడూ కట్టబడి కూలీనాలీ జేత్తన్నా, గోసి కెక్కువ, గావంచాకుతక్కువగా, కటకటలాడి పోయేవాళ్ళు. పెంటమ్మ పున్నెమా అని జిగినీ గొలుసు తాకట్టుబెట్టి ఎయ్యి రూపాయలు తెచ్చి ఎంటికల యాపారం బెట్టించ్చింది. సోములితో. ఇప్పుడు జూడు అడుసెలో అంటే సెట్లు కాస్తన్నై. తను కూడా ఎవళితోనన్నా దేశం నుంచీ సరుకు తెప్పించుకుని పని చేయించాలి. సిట్టి పాపొచ్చేతలికి బుడ్డదాని కేమన్నా చేయించివ్వాలి.

"ఎంత పేమ వుంటేనేంటి పెడితేనే పేరుండేది"

"ఇది మా మామ్మిచ్చిందీ" అని పిల్లలు సెప్పుకోవాలి! అనుకుంది కన్నమ్మ. ఆ క్షణం నుంచే పెట్టుబడికోసం ఆలోచన మొదలుబెట్టింది.

సాయంత్రం ఇంటికెల్తా కోటిగాడి చెవిలో ఓ మాట వేసింది. ఆడింటిదాకా వచ్చి అరచేతిలో స్వర్గంలా లాభాలు చూపించి వెళ్ళాడు. ఆనక మంగమ్మను పిలిచి అడిగింది.

"అయ్యో నీకెందుకత్తా అయ్యన్నీ. వచ్చే వయసా పోయే వయసా? ఏదో ఓపికున్ననాడు 'బొచ్చుపీకి' ఓ రూపాయి డబ్బులు తెచ్చుకుంటున్నావు. లేన్నాడు కడుపులో కాళ్ళెట్టుకుని పడుంటున్నావు. యాపారావంటే మాటలా" అని హితవు చెప్పి వెళ్ళింది. కాని కన్నమ్మకు తెల్లార్లూ అదే ఆలోచన.

తెల్లారకముందే వచ్చి పడ్డాడు కోటి. 'ఇల్లు తనఖా పెడితే వీరభద్రం అప్పు ఇస్తానన్నాడనీ, అతడే దేశమెల్లి సరుకు నాణ్యం చూసి తెస్తాడనీ వార్తమోసుకొచ్చాడు.

ఎందుకైనా అంత్యనిష్ఠూరం కన్నా ఆది నిష్ఠూరం మంచిదని సోములితోను చెప్పింది తన నిర్ణయం.

"ఆడి దగ్గరా, ఈడి దగ్గరా ఇల్లు బెట్టడమెందుకు? ఆ ఈరబద్రానికెప్పణ్నించో నీ ఇంటి మీద కన్నుంది. నేను సర్దుతాలే" అన్నాడు సోములు ఉదారంగా. "ఎవుణ్ని పంపిచ్చినా బోలెడు కరుసులవుతాయి. నాకైతే పనిలో పని, నేను తెచ్చిపెడతాలే సరుకు" అన్నాడు.

"అట్టాగే బాబూ నీ యిట్టం" అంది కన్నమ్మ ఆనందంగా.

అల్లుడి భరోసా చూసి పెంటమ్మ మండిపడింది.

"నీకెందుకబ్బాయా! సరుకు జూత్తే తేపకో రకంగా ఉంటుంది. మనకైతే లాబమో నట్టమో కట్టుకుంటాం. కట్టమో సుఖమో అనబగిత్తాం. బయటోల్లకు తేటమంటే మాటలా" అంది.

"ఓసే పెంటీ నువ్వూరుకోవే నేనేమంతపరాయిదాన్ని కాదుకాని, సోములా.... నీకెందుకు నీ సొంత పనేననుకో. అయ్యా అక్కడున్నదేదో తీసుకురా. నువ్వేం తెలివితక్కువ వాడివా!" అంది కన్నమ్మ.

"అవున్లే గోవుల్లేనూళ్లో గొడ్డుగేదె సీమాలచ్చిమి" అని నవ్వింది రత్నం.

మూడొందలు మించితే వద్దంది కన్నమ్మ.

నాలుగురోజులు గడిసినై. "నా కుప్పుడప్పుడే ఒద్దు. నీ కరెజంటుకదా, ఎలా" అని దేశమెల్లాడు సోములు. మూటలిప్పేసరికి గుండె బేజారైంది. కన్నమ్మకు. నాలుగైదేళ్ళుగా పనిచేస్తుందిగాని అట్లాంటి సరుకెక్కడా చూడలేదు కన్నమ్మ. ఏమన్నా అన్నా అక్కడున్నదదేనంటే చేసేదేముందనుకుని మారు మాటాడకుండా ఇంటో వేయించుకుంది కన్నమ్మ. "ఆడికీ తెచ్చుకునే ఉంటాడు. అది మంచి సరుకేమో బైట పెడతల్లే" అంది మంగమ్మ.

చిట్టిపాప కూతురు జుమికీలు, పాంజేబులు పెట్టుకుని గిలుకూ గిలుకూ గిలక్కాయలా తిరుగుతున్నట్లే వుంది కన్నమ్మకు. రెండురోజులు గడిచినై దాచుకున్నదేదో కొంచెముంటే ఇద్దరు మనుషుల్ని పెట్టుకుని తను రాత్రీ పగలు కష్టపడుతూ పీకిస్తోంది కన్నమ్మ.

పింజి దీయించాలంటే చాలా డబ్బు కావాలి. అందుకనే రెండొందలిమ్మని

సోముల్నడిగింది. ఇంకెక్కడ తెచ్చిత్తానంటూ కాసేపటికి కాయితం వ్రాయించి ఇద్దరు పెద్ద మనుషుల్ని వెంటబెట్టుకు వచ్చాడు సోములు.

సంతకం పెట్టమంటే తెల్లబోయి నోరెళ్లబెట్టి ఎందుకయ్యా అంది కన్నమ్మ.

ఇల్లు తనఖా పెట్టి సోములు దగ్గర ఏడొందలు తీసుకొన్నట్టు చదివి వినిపించారు పక్కనున్న పెద్దమనుషులు.

"అదేంటయ్యా, మూడొందల సరుకే తెమ్మన్నది" అమాయకంగా అంది కన్నమ్మ.

"ఆ... నువ్వన్నట్టే ఒత్తదా. అక్కడ అయిదొందలు సరుకొన్నాను. రెండొందలు ఖరుసులైనై" అన్నాడు సోములు.

"అదేంట్రా సోములా! ఏడొందలప్పు రాయించుకున్నావు. నాకెర్రని ఏగానివ్వలేదు. అయ్యిజూస్తే పీకుతుంటేనే సేతికీ కాలికీ రాకుండా ముక్కలు, సెక్కలై అంతా రద్దీ తేలేట్టుంది. ఆటి మీద ఏమొత్తయ్యో సత్తయ్యో నేనేం పెట్టి పని చేయించన్రా...." ఏడుపు గొంతుతో అంది కన్నమ్మ.

"ఏమో ఏం బెట్టి చేయించుదామనుకున్నావో నాకెందుకు. ఏదో అడిగావుగదాని నిన్ను కానీ అడక్కుండా సరుకు దెచ్చిపెడితే పైన ఇదా..."

"అయ్యో... ఆ జానా బెత్తా బొచ్చెవడు గొంటాడు... ఇదేవన్నాయంరా" అంది కన్నమ్మ. అప్పుడే అక్కడకొచ్చిన రత్నం రుసరుసలాడింది.

"ఏం... ఉప్పుడు తెలిసిందా...ఏదో మీ రెక్కల కట్టం మీదవేం బతికిపోతున్నామనేగా నువ్వు యాపారంలో ఏలెట్టావు. పైగా అప్పు ఇచ్చినోళ్ల దన్నాయమా?" అంటూ రంకెలేసింది. పోనీలే అయిపోయిన పెళ్లికి బాజాలెందుకు అని ఒణికే చేతుల్తో వేలుముద్ర వేసింది కన్నమ్మ.

ఇంక పని చేయించాలి. చేతిలో డబ్బులేదు. తను కాపరానికొచ్చేటప్పుడు పట్టుకొచ్చింది విరుగుడు చేవ కావిడి పెట్టె. అది బయటకు లాగింది. ఏముంటాయందులో దాచుకోవడానికి పాతగుడ్డలు, నవారు ముక్కలు, పెళ్లినాటి పట్టు చీరా, పన్నీరు బుడ్డీ, విరిగిన గంధం గిన్నె, పడగ విప్పిన వెండి పుట్టసామీ జ్ఞాపకాలతోపాటు వాటిని మూటకట్టి అటకమీద పెట్టి, పెట్టె అమ్మేసింది. ఊళ్ళో ఎవరింట్లో పెళ్లయినా తన దగ్గరకే వచ్చేవాళ్ళు, గంగాళం, రాగి బిందె, కళాయి

దేగిశా, కూరల గుత్తి పట్టుకెళ్ళడానికి. ఎవరైనా అడిగితే ఏ మొకం పెట్టి సెప్పాలి అని కళ్ళు తడిచేసుకుంటూనే అవన్నీ కోటితో ఏలూరు పంపించి అమ్మించింది. యాపారం కోసం. 'ఇంటికప్పు కూడా పీకి అమ్మేటట్టుంది కన్నమ్మ' అని నవ్వుకున్నారు. జనం జాలి పడ్డారు. అనుకున్న దానికన్నా ఎక్కువే రద్దుగా పోయింది.

చాలా తక్కువమంది సవరాలు కట్టించి అమ్ముతారు. అందరూ పింజదీసి, సైజులవారీగా కట్టిన కట్టలు కంపెనీ వాళ్ళకమ్ముతారు. పొడవు, నలుపూ, నొక్కూ, నాణ్యతని బట్టి ధర పలుకుద్ది. కాని కురసగా, బిరుసుగా వున్న కన్నమ్మ దగ్గర జుట్టు కొనడానికెవరూ ముందుకు రాలేదు. సవరాలు కట్టించే అమ్మాలని నిర్ణయించుకుంది. పని మొదలు పెట్టిందగ్గర్నుంచీ కోటీని తన ఇంట్లోనే తిని ఉండమంది. ఒక కిలో నల్లటి బారు వెంట్రుకలు, పావుకిలో నొక్కుల వెంట్రుకలు కొనుక్కొచ్చాడు కోటి. పైన బార్లు వేసి క్రింద వుంగరాల జుట్టు పెట్టి చక్కటి సవరాలు తయారు చేసింది పార్వతి. చూసిన వాళ్లంతా ముచ్చట పడ్డారు. పొద్దున్నే లేచి అన్నీ సర్దుకుని కడుపునిండా అన్నం తిని కట్టిన సవరాలన్నీ పెద్ద సంచీలో వేసుకుని ఏలూరు వెళ్లాడు కోటి. సాయంత్రానికి రావలసినవాడు రాలేదు. అన్నీ అమ్ముకుని మర్నాటికొస్తాడనుకొంది. మర్నాడురాలేదు. మూడోరోజు ఖంగారు పడింది కన్నమ్మ. నాలుగోరోజు అనుమానించింది. అయిదోరోజు భయపడింది. ఆరో రోజు ఏడ్చేసింది. ఏడో రోజు పెంటమ్మ, రత్నం వచ్చి ఓదార్చారు. "మా యిల్లు బాగుచేయించుకోవాలి. మేమిక్కడే వుంటాం సాయంత్రం మా సామానొస్తది ఇల్లు ఖాళీ చేయి" అన్నారు. "పోనీలే నువ్వు మాత్రం ఎక్కడికెల్తావు. వసారాలో ఓ పక్క తడిక్కట్టి వండుకు తిను... " అని దయగా అన్నారు.

కన్నమ్మకు నోటమాట రాలేదు. వెర్రిచూపు చూస్తున్న కన్నమ్మ దగ్గరకు పరిగెత్తి వచ్చింది మంగమ్మ.

"అత్తా చూశావా మీ చిట్టిపాపేం చేసిందో, ఢిల్లీ నుంచి రానూ వచ్చింది. పోనూ పోయింది. ఏలూరొచ్చి వారం రోజులుండి వెళ్లిందంట. నీక్కబురన్నా చేయలేదు చూడు! ఆ బండి సూరయ్యన్న చెబితే తెలిసింది."

పక్కనే వున్న పార్వతి పరుగెత్తికెళ్లి మంచినీళ్ళు తెచ్చి ఇచ్చింది. కన్నమ్మ చేయి వణికి గ్లాసు కిందపడిపోయింది. నీరసంగా కూర్చున్న చోటు నుంచీ లేచి నిలబడింది

నిలబడలేనట్లు పక్కనే వాల్చి వున్న మంచం మీద కూచ్చుంది. కూచ్చోలేనట్లు మంచానికడ్డంగా వెనక్కు వాలిపోయింది.

గుడ్డి గవ్వల్లాగా, గాజు గోళీల్లా, కళ మాసి పోడారిపోయి వుంటే ఆ కళ్ళు తడితడిగా కొడిగట్టిన ఆముదం దీపాల్లా మినుకు మినుకు మంటున్నై. పక్కన కూచుని చేతిలో చేయివేసి ఓదార్పుగా నిమిరింది మంగమ్మ.

మరీ గట్టిగా వున్నయ్యని తీసేసిన కాసిని వుండలనూ పీకుతోంది సూరమ్మ. “పనికిరాక చుట్టచుట్టి బయటకు పారేసిన వాటిని, చిక్కుదీసి, వన్నెచేసి దుర్వాసన పోగొట్టి ఉపయోగంలోకి తెత్తన్నాం. దుర్మార్గం అట్టలుగట్టుకుపోయింది. లోకంలో… ఆ చిక్కులెవరు తీత్తారు? స్వార్థంతో చెడువోసన గొడుతుంది. పెపంచం, ఆ గబ్బెవరు కడుగుతారు? ఎటు చూసినా మోసం, స్వార్థం, అయ్యెట్టాపోతయ్యి?’ అనుకుంది మంగమ్మ వడిలి రాలినపువ్వులా పడివున్న కన్నమ్మను కన్నీళ్లతో చూస్తూ.

**(1982 ఆంధ్రజ్యోతి దీపావళి ప్రత్యేక సంచికలో ప్రచురితం)**

# ఖాళీ సంచులు

**–కె. వరలక్ష్మి**

**పు**ంత మొగలో ఆగింది బస్సు

'గోయిందపురం – గోయిందపురం' అరిచేడు కండక్టరు.

సీట్లోంచి ఉలిక్కిపడి లేచింది దుర్గ.

కాళ్ల దగ్గరున్న తన సంచులు రెండూ తీసుకుని బస్సు మెట్టుమీంచి ఒక్క దుముకు దుమికింది.

"హమ్మయ్య, పీడ విరగడైంది బాబూ" అంటోంది దుర్గ పక్కన కూచున్నావిడ, ముక్కు మీద కప్పుకున్న పైట చెంగుని పక్కకి వదిలేస్తూ. వెనక్కి తిరిగి సంచిలోంచి ఓ ఎండు చేపని తీసి ఆవిడ మీదకి విసురుదామా అనిపించింది దుర్గకి, తన ఆలోచనకి తనకే ఫక్కున నవ్వొచ్చింది.

'పాపం, బేపనోరు కావోల్సు' అనుకుని జాలిపడింది.

"రైట్ రైట్" అన్నాడు కండక్టరు.

పుంత దారివైపు రెండడుగులు ముందుకేసింది దుర్గ. అప్పుడు గుర్తుకొచ్చింది – కండక్టరు తనకి రూపాయివ్వాలని, సంచుల్ని కిందపెట్టి చటుక్కున బస్సు వైపు చూసింది. నల్లని తారురోడ్డు మీద స్పీడందుకుని అడవి లోపలి ఊళ్ల వైపు దూసుకుపోతోంది బస్సు. అది కనుమరుగయ్యేవరకూ నిలబడి జాకెట్లో పెట్టుకున్న డబ్బుల మడతలోంచి టిక్కెట్టు ముక్కని తీసి, దాని వెనక వేసున్న ఒకటి అంకెను చూస్తూ విచారంగా కింద పడేసింది.

సంచుల్ని కాళ్ల దగ్గర పెట్టుకోనిచ్చినందుకు కండక్టరు మంచోడే అనుకుంది. కానీ ఇప్పుడు రూపాయి నొక్కేసినందుకు ఒళ్ళు మండుకొస్తావుంది. 'ఈ కండట్టర్లెప్పుడూ ఇంతే, మనం ఒక పావలా తక్కువిచ్చినా ఒప్పుకోరు, ఆళ్లివ్వాల్సిన సిల్లర ఎంటనే

ఇవ్వరు. ఇదిగిలాగే మరిసిపోతారు' అనుకుంది తనలో తను చిరాగ్గా. 'పొద్దున్నే ఎవరి మొకం సూసేనో, రూపాయి దండగ' – సంచుల్ని చేతుల్లోకి తీసుకుంది.

అమ్మో, సేలా బరువున్నాయే, ఈట్నట్టుకుని నాలుగు మైళ్ల నడకంటే మాటలా' అనుకుంటూ వెనక్కి తిరిగి రోడ్డవతలి టీ పాక వేపు చూసింది. ఊళ్లో కొచ్చేవాళ్లెవరైనా తారసపడతారేమోనని.

ఇటే చూస్తున్న టీ పాక భద్రం దుర్గని పోల్చుకుని – "ఓల్నువ్వంటే దురగా, ఇంకెవరో అని చూస్తన్నాను. ఇదేనా రాటం? ఇలాదా, టీ తాగి ఎల్దువుగాని" అని పిల్చేడు.

దుర్గ చొరవగా అటు నడిచి "బాగున్నావా మాయ్యా" అంది బల్ల మీద కూర్చుంటూ.

భద్రం మొహం చేటంత చేసుకుని, "నా బాగుకేంలే, ఏదో ఇలాగ నడిసిపోతంది బండి. నువ్వెలాగున్నావు? తెలుత్తానే ఉందిలే బస్తీ నీళ్ళు బాగానే ఒంటబట్టేయని" అన్నాడు నఖశిఖ పర్యంతం దుర్గని చూస్తూ.

నల్లని దుర్గ ఒంటికి మంచి నిగారింపు వచ్చింది. చెవులకి చిన్న జూకాలెట్టుకుంది. ఎడమ ముక్కుకి ఒంటి రాయి బేసరి ఎండ పడి మెరుస్తా ఉంది.

తెల్ల పువ్వులున్న మబ్బురంగు చీర కట్టుకుంది. నలుపు రంగు జాకెట్టు మీద జానెడు చేమంతి పూలమాల చెవి పక్కనుంచి తొంగి చూస్తావుంది. చూపు తిప్పుకొని, అగ్గిపుల్ల గీసి స్టవ్వు అంటించేడు భద్రం. టీ గిన్నెని స్టవ్వు మీద వేడి చేసి సీవెండి కోపాలోకి వడకట్టేడు. ఎన్ని రోజుల నాటిదో టీపొడి, వడకట్టే గుడ్డలో పెద్దమూటలాగ ఉంది. దాన్లోంచి టీ కోపాలోకి జారుతుంటే చూస్తూ కూర్చుంది దుర్గ. రెండు గాజు గ్లాసుల్లోకి ఒంపి ఒకటి దుర్గకిచ్చి, తనొకటి తీసుకున్నాడు భద్రం.

డిసెంబరు నెల ఉదయం పది గంటల వేళైనా చెట్ల గుబుర్లలోంచి చలి ఇంకా కిందికి జారుతూనే ఉంది.

వేడి వేడి పొగలుకక్కుతున్న గ్లాసందుకుని టీ చప్పరించింది దుర్గ.

కిరసనాయిలు వాసనా నిలవ టీపొడి వాసనా కలిసి చాలీచాలని పంచదారతో ఏదో వెగటుగా ఉంది టీ. వద్దని వదిలేస్తే భద్రం ఏమనుకుంటాడో. అని తాగుతోంది దుర్గ.

బస్తీకెళ్లేక అక్కడ దొరికే నీళ్ల పాలల్లోనే ఇంత పంచదార, టీ పొడి వేసుకుని అప్పటికప్పుడు మరగబెట్టుకుని తాగడం అలవాటైపోయింది.

"అంత బరువు మోసుకొత్తన్నావేటి, తమ్ముడికీ మరదలికీ ఏటేటి కొన్నావేటి?" అన్నాడు భద్రం.

దుర్గ నవ్వేసి, "మేవేం కొనగల్దుం బాబూ" అని వేళాకోళమాడింది.

"ఓసోసి, అందుకే గామోసు నిట్రాడి పాకని పెంకుటిల్లు గట్టించేవు. ఎకరం మెరక కొన్నావు. మీ కుటంబాన్ని ఎన్నేళ్లనించి ఎరిగున్నాను! ఏ మొగోడైనా ఈ మాత్రం సాధించేదేటి? ఇంక నీ బాబైతే ఏనాడన్నా పెళ్లవని, పిల్లలని పట్టించుకున్నాడా? తాటి సెట్టెక్కి ఎక్కడ తీసిన కల్లు అక్కడే అమ్మేసుకుని కడుపు నిండా సారా తాగేసి ఏ సెట్టుకిందో పడుకునేసీవోడు. మొత్తానికలాగ తాగి తాగే కడుపులో పేగులన్నీ సారా తినేసి సచ్చిపోయేడు.

"ఆడిమాట ఉప్పుడెందుకులే మాయ్యా" అంది దుర్గ. తనకి పదేళ్ల వయసప్పుడు చచ్చిపోయిన తండ్రి కళ్లల్లో మెదిలేడు.

"అదికాదమ్మీ. ఏ మాటికామాటే సెప్పుకోవాలా ఒద్దా. తమ్ముణ్ణి సదివించి అంతటోణ్ని చేసేవు. ఈ రోజుల్లో ఎవరికమ్మా అంత దందపడతాది? అవునింతకీ ఏం కొనుక్కొచ్చేవు తమ్ముడికోసం" అన్నాడు మళ్లీ.

"ఏదోలే, కొత్త బట్టలూ గట్టా కొనుక్కొచ్చేను. ఆళ్లిద్దరూ ఉజ్జోగమంతులేనాయె. మనం కొంటే మాత్రం ఆళ్లకి నచ్చొద్దూ..." అంటూనే దుర్గ లేచి బకెట్టులో సగానికున్న మురికి నీళ్లలో గ్లాసు తొల్చి బల్ల మీద పెట్టింది. 'సంచిలోయన్నీ తీసి సూపించమని దిష్టెడతాడో ఏటో' అని సణుక్కుంది.

"అయినా గానీ పిల్లా దురగా, నువ్వు, తనకి మాలిన దరమం అంటారే అలాగ సేసుకున్నావు. పెళ్లీ పెటాకులూ అనకుండా నావోళ్ళూ నా కుటంబం అన్నావు. నీ పిచ్చిగాని పెళ్లయ్యేక తమ్ముడు తన వోడవుతాడేటే? నీ కడుపులో కాయ కాసి, దాన్ని ఆడికిచ్చి ముడెడితే ఆ సంగతి ఏరేగా ఉణ్ణు"

ఎక్కణ్ణుంచొచ్చిందో కుక్క ఒకటి దుర్గ బల్ల మీద పెట్టిన సంచులకి మూతెత్తి మూచూస్తూ బల్లచుట్టూ తిరగడం మొదలెట్టింది.

"ఛీ... ఛీ... " అని అదిలించింది దుర్గ.

"ఏటెండు సేపలు గానీ అట్టుకొచ్చేవేటి, కుక్క నోట్లో నీళ్ళుగారిపోతున్నాయ్"

అన్నాడు భద్రం. సంచులున్న బల్లకేసి నడుస్తూ, "ఇదన్నమాట సంగతి ఇందాకట్నుంచి ఏట్రా బాబూ వోసన, పాకెనకాల ఏ నక్కయినా సచ్చిందో ఏటో అనుకున్నాను" అన్నాడు.

ఆ మాటకి దుర్గ పకపకా నవ్వింది. "నేనింకా గుప్పిడు నెత్తళ్ళు, ఒక సందువా తట్టాం ఇద్దారనుకున్నానే, అంత వోసన బరించలేనోడివి నువ్వేం తింటావులే" అంది.

"తల్లి తల్లి దురగా, ఆ మాటనకోలే, ఇచ్చి పున్నెం కట్టుకోమ్మా! ఎండు సేపలు తినక నోరు సవి సచ్చిపోయిందనుకో. నెత్తళ్లలో పాలోసి మసాలా యెట్టి ఒండుకుంటే దాన్రుసి ఇంకదేనికొత్తాది?" అన్నాడు భద్రం నోట్లో ఊరుతున్న నీళ్లని గుటకేస్తూ.

"ఇత్తాన్లే ఇంటికాడ మాయత్తకి" అంది దుర్గ వెళ్ళడానికి తయారవుతూ.

"ఇయ్యాళ ఊళ్లోకెళ్లీవోళ్ళెవరూ అంపడ్డం లేదేటో"

"నేనొత్తన్నానుండు, ఇయ్యాళ బేరాల్లేవు ఏవీ లేవు దీన్తల్లిసిగదరగ" అన్నాడు భద్రం.

టీ గిన్నెలు స్టవ్వు పక్కనే ఉన్న పెద్ద చెక్కపెట్లో పెట్టి తాళం బిగించేడు. జేబులోంచి బీడీ తీసి నోట్లో పెట్టుకుని పాలు కాయడానికి వేసిన పిడకల దాలిలో నిప్పుకోసం చాలా సేపు కెలికేడు. పొద్దున్ననగా వేసిన దాలి. అదెప్పుడో చప్పగా చల్లారిపోయింది. నిక్కరు జేబులోంచి అగ్గిపెట్టే తీసి బీడీ వెలిగించుకుని గుండె నిండా ఒక దమ్ములాగి ఖళ్ళు ఖళ్ళు మని దగ్గేడు.

ఈ దగ్గొకటి పీంఁడించేస్తంది. ఒదలకుండా" అన్నాడు స్వగతం లాగ.

"బలేవోడివే మాయ్యా. జేబులో అగ్గిపెట్టుంచుకునే నిప్పుకోసం అంతసేపు కెలికేవు?" అంది దుర్గ.

భద్రం గారపళ్లన్నీ కనిపించేలాగ నవ్వి "అదేనే మరి యాపార రాస్యం. మీ జీతగాళ్లలాగ కర్సు పెట్టెయ్యటానికి కుదర్దు మాకు" అన్నాడు.

"ఏటో, అగ్గిపుల్లలూ గట్టా పొదుపు చేసేసి ఇంటి మీద పై కప్పు తీసి మేడ గట్టేసినట్టు. నా సిన్నతనం నుంచి చూస్తన్నాను వానొత్తే కారిపోయీ తాటాకు పెణకే కాని పెంకన్నా నేయించేవు కావు"

భద్రం ఓ క్షణం నిర్వేదంగా దుర్గ వేపు చూసి, తల విదిలించుకుని చూపుడు వేలు పైకెత్తి ఆకాశంలోకి చూపించేడు. "అంతా ఆ పైవోడి దయ. రోజంతా ఇక్కడ కూకుని ఈగల్దోలుకున్నాం రెండు పొట్టలెల్లడం కష్టవైపోతంటే ఏటి సెయ్యగలం" అన్నాడు మూల నున్న డొక్కు సైకిలు స్టాండు తీస్తూ.

దుర్గ సంచులు అందుకుని వెనక చెక్క కేరేజిమీదొకటి. ముందు హేండిలు బారు మీదొకటీ పెట్టి నడిపించుకుంటూ పుంత వేపు దారి తీసేడు. వెనకే దుర్గ.

బస్సు దిగినప్పుడున్న హుషారు తగ్గినట్టనిపించింది దుర్గకి.

ఎండ నెత్తిని చుర్రుమనిపిస్తోంది. దారికటూ ఇటూ డొంకలు తప్ప నీడ నిచ్చే చెట్టొకటీ లేదు.

"పాపం భద్రం మాయ్యా, నా మూలాని నీకు నడక తప్పింది కాదు, లేపోతే సైకిలెక్కేసి నివషంలో ఎల్లిపోయీవోడిని" అంది.

"ఆ, దాన్దేవుందిలే, నాలుగడుగులు నడిత్తే మొక్క మొలిసి పోతానా, ఏటి, ఆడపిల్లవి నువ్వింత బలువు సంచులుచ్చుకుని అంత దూరం నడగల్దావేటి? అక్కడ రిచ్చాలో వొచ్చి బస్సెక్కుంటావ్" అన్నాడు – "అయినా మనకీ మనకీ సేవితం ఇయ్యాల్నాటిది కాదు. నువ్వింత పిల్లంత ఉన్న కాణ్నుంచీ మీ బాబుకీ నాకూ సేయితం. సేసిన పాపం సెప్తే పోతాదంటారు. సెప్పాపోడవేం, ఆడూ నేనూ పందేలేస్కుని మరీ తాగీవోళ్లం. మంచి మణుసుకురిసీ తెల్లార గట్టేళ సెట్టెక్కి కల్లు ముంతలు దించీవోడు మీ బాబు. అయిసేసిన కూలుడ్రింకులాగ కడుపులోకి సల్లగా దిగిపోయీది తల్లి మాలచ్చిమి. ఇంటికాడ మీయత్త ఓ... తెగ గోలెట్టేసీది – 'నువ్వేవన్నా కాపోడివా కల్లు తీసీవోడివా' అని. అయినా సరే మా సేయితం ఇళ్లేదు. ఆకరుకి మీ బాబెప్పుడైతే సడాలుమని సచ్చిపోయేడో అంతే, అళ్లెత్తిపోయి తాగుడూ గీగుడూ బందు జేసేసేను" – అయిపోయిన బీడీ పీకని పెదవులు కాలేదాకా పీల్చి ఆగి, బొటనవేలుకి మధ్య వేలు ఆనించి ఆ గోటితో తుప్పలోకి కొట్టేడు.

ఈ లోపల దుర్గ కొంచెం ముందుకైంది.

“కుప్పుసామి బాగున్నాడా?”

హఠాత్తుగా వెనక నుంచి వచ్చిన ప్రశ్నకి బిత్తరపోయి రాయిలా నిలబడిపోయింది దుర్గ.

సైకిలు దుర్గ నిల్చున్న దగ్గరకొచ్చేక అనునయంగా దుర్గ ముఖంలోకి చూస్తూ “ఎర్రిపిల్ల, ఏటలాగైపోయేవు? ఉప్పూకారం తినీ ఒళ్లు మొగోడికైనా ఆడదానికైనా ఒకటే కదా! మీయమ్మ నీకు వొయసొచ్చీతలికి పెళ్లి చేసి అత్తోరింటికి అంపిచ్చా పోబట్టే గదా నువ్వాపని సెయ్యవలిసొచ్చింది. మీయమ్మే వనుకున్నాదంటే దీనికి పెళ్లి జేసేత్తే నా దినం దీరీదెలాగ అనుకున్నది. నువ్వు బళ్లో జేరిపించి నెలనెలా డబ్బులంపబట్టే  కదా నీ తమ్ముడు సదువుకుని ఇంతటోడయ్యేడు! లేకపోతే కల్లమ్ముకుంటూ ఈ కొండలమ్మటుండ వలిసి నోడే కదా, మనసు నెమ్మళించుకో, ఏం బయ్యంలేదు” అన్నాడు.

దుర్గ నడక మందగించింది.

సంకురాత్రి ముందు ట్రాలరు మీద ఒరిస్సా సముద్రంలోకెళ్లిన కుప్పుస్వామి గుర్తుకొచ్చేడు.

కోరమీసం, కొండలు తిరిగిన కారు నలుపు శరీరం తెల్లగా మెరిసే పలువరస, ఉంగరాలు తిరిగిన దుబ్బుజుట్టు – అతని తలంపుతో ఒళ్లంతా ఒక పులకరింతలా జలదరించింది. గతంలోకి మనసు పరుగెత్తింది.

తనకప్పుడు పదేళ్ళుంటాయేమో, అప్పట్లో ఈ పక్క ఊళ్ళో వరుసగా అయిదారేళ్ళు వానలు పడక పొలం పనులు లేకపోయాయి. ఎక్కడ పని దొరుకుతుందంటే జనం అక్కడికి వలసపోయేరు. చాలామంది దగ్గర్లో ఉన్న జగ్గంపేట పెంకుల మిల్లుల్లో కూలీలుగా చేరిపోయేరు.

తండ్రి పోయేక ఇంటికి పెద్ద దిక్కుగాతనే నిలబడవలిసొచ్చింది.

తల్లి ఉత్తి అర్భకం మనిషి. ఒకరోజు పనికెళ్తే వారం రోజులు పడకేసేది. తమ్ముడు పసిపిల్లోడు. అయిదారు గర్భణీలు పోయేక పుట్టిన మొగనలుసని తల్లికి ఆడంటే ప్రేణం. తనకీ అంతే. నడకొచ్చిదగ్గర్నుంచి తన పరికిణీ కుచ్చిళ్ళు పుచ్చుకుని “అక్కా అక్కా” అంటూ వదలకుండా తిరిగేవోడు.

పెంకుల మిల్లుల్లోని మట్టి తట్టలు మోసే బరువు పని తన వల్లకాలేదు. అందుకే తెలిసిన చుట్టాలెవరి ద్వారానో తల్లి తనని కాకినాడ పంపించింది. అక్కడ రొయ్యలు ఒలిచి నిలవ చేసే గొడవన్నులో పని.

చాన్నాళ్ళు తనని తీసుకెళ్లిన చుట్టాలింట్లోనే ఉండి ఆళ్లకి నెలకింతని భోజనానికిచ్చి మిగతా డబ్బులు తల్లికి పంపేది.

సెలవు పెడితే ఆ జాగాలో ఇంకెవరైనా చేరిపోతారని తనసలు సెలవు పెట్టేది కాదు. అప్పుడప్పుడు తల్లే తమ్ముణ్ని తీసుకుని తనని చూడ్డానికొచ్చేది.

రొయ్యలపని లేనప్పుడు జెట్టీలో చేపలారబెట్టేపని ఉండేది. సముద్రంలో పట్టి తెచ్చి గుట్టలుగా పోసిన చేపల పొట్టల్ని చీల్చి శుభ్రం చేసి ఉప్పులో ఊరేసి ఆరబెట్టడం. మొదట్లో ఆ వాసన భరించడం కష్టమైపోయేది. క్రమంగా అలవాటైపోయింది.

అక్కడే తను పెరిగి పెద్దదైంది.

ఆ జెట్టీలోనే కుప్పుసామి పరిచయమయ్యేడు, తనకి ఇరవై ఏళ్ల వయసప్పుడు.

ఆ రోజు –

జెట్టీ అంచు దగ్గిర ఉయ్యాలలూగే పడవల వరస మీంచి అతను అలవోకగా నడుచుకుంటూ వస్తా ఉంటే అబ్బురమనిపించి చూస్తానుంచుంది. దగ్గరకొచ్చేక కన్నుకొట్టి.

"ఏం పిల్లా, ఏటి సంగతి, కన్నార్పకుండా చూస్తన్నావు' నచ్చేనా?" అన్నాడు.

తను ఉడుక్కుని, "నిన్నేం కాదులే, పడవల్ని చూస్తన్నాను" అంది.

"అయితే పని మానేసి పడవల్ని సూస్తావన్నమాట, ఉండు మేనేజరుతో చెప్తాను" అంటూ నవ్వుతూ వెళ్లిపోయాడు.

తర్వాత ఎప్పుడు కనిపించినా దగ్గిరకొచ్చి పలకరించేవాడు. ఆ పలకరింపుల మామూలు స్నేహం ఎప్పుడు ఎలాగ తామిద్దరి మధ్యా శారీరక బంధమయ్యిందో అయ్యింది. అవసరం తమ ఇద్దర్నీ అలా దగ్గిర చేసిందని అర్థం చేసుకున్నారిద్దరూ.

అతని పెళ్లాం పిల్లలు మెడ్రాసు దగ్గిర ఏదో ఊళ్లో ఉంటారని ఏడాదికి రెండుసార్లు తనే యెళ్లొస్తాడనీ చెప్పేడు. తనలాగే అతనూ ఇంటికి డబ్బులు పంపేవోడు.

కుప్పుసామికి జీతం కాకుండా కమీషనుగా బాగా డబ్బులొచ్చేవి. అలాంటప్పుడు తనని సినిమాలకీ షికార్లకీ తిప్పేవాడు. రంగు రంగు చీరలు కొనిచ్చేవాడు. ఇంటి అద్దె, తిండి ఖర్చు కలిసొస్తుందని త్వరలోనే తను అతనుండే గదిలోకి మారిపోయింది.

తల్లి మొదట్లో నెత్తీ నోరూ కొట్టుకుని ఏడ్చింది. తర్వాత తను ఎప్పటికన్నా ఎక్కువ డబ్బు పంపిస్తూండడంతో కిమ్మనకుండా ఊరుకుంది. కుప్పుసామి మంచి జల్సాలో ఉన్నప్పుడు వందలకి వందలు తనకిచ్చేవాడు. అలా దాచిన డబ్బుతోనే తల్లి ఊళ్లో పూరిపాక స్థానంలో పెంకుటిల్లు కట్టించింది. ఎకరం పొలం కొన్నది.

ఆ మధ్య కుప్పుసామి ఒక కొత్తపాట మొదలెట్టేడు – “నా కోసం నువ్విలాగ పెళ్లీ పెటాకులు లేకుండా ఉండిపోయేవు, అలాక్కాదు ఒక మంచి రోజు చూసి నీ మెళ్లో పుస్తి కట్టేస్తాను” అని.

పుస్తి కడితేనేనేటి, ఉప్పుడు మనం మొగుడూ పెళ్ళాలం కావా!” అనేది తను.

“ఆ సంగతి ఏరులే, నువ్వు ధైర్నంగా ఒక బిడ్డని కనొచ్చు. ఎప్పుడూ బతుక్కి తెగించి సముద్రం మీదకి పోయే నాకేదైనా అయితే అక్కడ మణియమ్మకు ఉన్నట్టే ఇక్కడ నీకు నీ బిడ్డ సాయం” అనేవాడు.

తన తమ్ముడికి పెళ్ళైందని తెలీగానే, ”చూసేవా, నీ తమ్ముడు కూడా నీతో మాట మాత్రమైనా చెప్పకుండా పెళ్లి చేసేసుకున్నాడు. ఈ సారి నేను సముద్రంలోకెళ్ళొచ్చేక మన పెళ్లి తప్పదు. తెల్సినోళ్లు నలుగుర్నీ పిల్చుకెళ్లి అన్నవరంలో చేసుకొచ్చేద్దాం” అన్నాడు.

అంతే! ఈ రెండేళ్ళుగా కుప్పుసామిని మళ్లీ చూడలేదు.

ఆ ఎళ్లటం ఎళ్లటం ఒరిస్సాలో తుపానొచ్చింది.

మనిషి బతికున్నాడో లేదో తెలీక చాలా తల్లడిల్లిపోయింది తను. చివరికి జెట్టీలో ఎవరో చెప్పుకుంటుంటే తెల్సింది తుపానుసమయంలో కుప్పుసామి సముద్రం మీదుండి పోయేడంట. ఎలాగో ప్రేణాల్తో ఒడ్డుకి కొట్టుకొచ్చినా కదల సత్తువ లేనట్లై పోయేడంట. ఇంటికి కబురెత్తే అతని కొడుకులొచ్చి తీసుకెళ్లిపోయేరంట. ఇంక కుప్పుసామి ఇటుకేసి రాడంట.

ఆ రోజు పనిలోంచి ఇంటికెళ్లేక చాలా సేపు ఏడిచింది.

అతని జ్ఞాపకంగా ఒక ఫోటో కూడా లేదు తన దగ్గిర. అనికున్న మూడు జతల బట్టల్లో ఒక జత ఒంటిమీదుంటే రెండు జతల్ని వెంట తీసుకెళ్లటం అలవాటు. మెడ్రాసు దగ్గిర అనటమే కాని అతని ఊరేదో కూడా సరిగ్గా తెలీదు తనకి.

"కుప్పుసామి మనిషి చేలా మంచోడు. రెండు మూడు సార్లు కాకినాడ మెయిను రోడ్డులో తారసపడితే ఒటేలుకి తీసుకెళ్లి కాపీ టిపినూ ఇప్పించేడు" అన్నాడు భద్రం.

ఉలిక్కిపడి ఈ లోకంలో కొచ్చింది దుర్గ.

ఊరి మొదట్లోనే భద్రం ఇల్లు.

వాకిట్లో చెట్టు కింద మంచం వేసుకుని ఎండపొడ తనమీద పడేలా పడుకుంది భద్రం పెళ్లాం.

మంచం పక్కన సైకిలు స్టేండేసి సంచులు కిందికి దించుతూ, "రాజులమ్మొలే, ఎవళొచ్చేరో పోల్చుకో సూద్దారి" అన్నాడు భద్రం.

"ఇదేటత్తా ఇలాగైపోయేవు" అని మంచం మీద పక్కన కూర్చుంది దుర్గ.

"నేనత్తా దుర్గని, గుర్తుపట్టలేదా?" అంది.

"మీ యత్తకి మున్నూటరవై రోజులూ ఒంట్లో బాగోటం లేదు. అదేం మాయారోగవో పట్టుకుని వదల్టం లేదు. ఒక పిల్లా జెల్లా ఈ ఏళకింటికొచ్చి నేనే ఏదో ఉడకేసి తనకింతపెట్టి నేనింత తింటం" అన్నాడు భద్రం లోపల్నుంచి గ్లాసుతో మంచినీళ్ళు తెచ్చి ఇస్తూ.

"ఇక్కడుంటే ఏం ఒదుల్తాదీ, కాకినాడ తీసుకు రాకూడదా, గవర్నమెంటు ఆసుపత్రిలో చూపిద్దారి" అంది దుర్గ.

"అయ్యన్నీ అయ్యేయి. డబ్బుల్లేందే గవుర్నమెంటోడుకూడా వైద్యం సెయ్యడని తెల్సుకుని, పడీ పాట్లేయో ఇంటికాడే పడదార్లే అని తీసుకొచ్చేసేను" అన్నాడు భద్రం బియ్యం కడిగిన నీళ్ళు వాకిట్లో చెట్టు మొదట్లో పోస్తూ.

"మాయ్యా, చేటుంటే ఇలాగట్రా" అంది దుర్గ.

భద్రం తెచ్చిన చేటలో రెండు గుప్పిళ్ళ ఎండు నెత్తళ్ళు, రెండు గుప్పిళ్ళ ఎండు రొయ్యలు, ఒక సందువా తట్టాం వేసి, "చాలా, ఇంకా ఎయ్యమంటావా?" అంది.

"సాల్లే తల్లీ, ఇయ్యే ఎక్కువ, నీవున్నెవాని రెండు నెల్లపాటు ఒంటుకు తింటాం. సారన్నంలో ఉప్పుసేప నంజుకు తింటానని ఎప్పణ్నించో అడుగుతుంది మీయత్త. ఉప్పుడే కాల్చెడతాను" అన్నాడు భద్రం మొహం వెలిగిపోతూండగా.

ఇంటికొచ్చి దిగబెడతానన్నాడు కానీ ఒద్దని వారించింది దుర్గ.

ఊరికాచివర ఈంద్రపేటలో దుర్గ ఇల్లు. ఊరి మధ్య వీధి గుండా ఏ మాత్రం మారని ఇళ్లని చూస్తూ, మనుషుల్ని పలకరిస్తూ నడుస్తోంది. సంచుల బరువుకి ఇటూ అటూ ఒరుగుతూ నడుస్తున్న దుర్గని చూస్తూ 'ఈంద్ర ఈరయ్య కూతురు' అని దుర్గకి వినపడేలా గుసగుసలాడుతున్నారు కొందరు. 'ఏటి పిల్లా, అంత బరువు మోసుకొస్తన్నావ్' అని ఇచ్చకాలాడి పలకరిస్తున్నారు కొందరు.

నెలగంటరోజులు కావడం వలన పండగ పనుల్లో మునిగి పోయి ఉన్నారు. ఆడవాళ్లంతా. కొందరు ఎర్ర మట్టితో గోడలు, అరుగులు మెత్తుతున్నారు. కొందరు వాకిళ్లలో బండెడు ఇత్తడి సామాను వేసుకుని చింతపండు, ఏటి ఇసక పెట్టి తళతళా మెరిసేలా తోముతున్నారు.

కొత్తగా చర్చి లోగిలి కట్టినట్టున్నారు. దక్షిణం వైపు పేటలోంచి మైకులో ఏసుక్రీస్తు పాటలు వినిపిస్తున్నాయి.

'కిస్మిస్ కదా' అనుకుంది దుర్గ తనలో.

ఇల్లు కట్టేక ఎప్పుడూ పగటి వేళ రాలేదు. రాత్రి వేళ వచ్చి పొద్దున్నే వెళ్లిపోవడమే. తల్లి పోయేక ఆ రావటమూ తగ్గిపోయింది. దూరంగా నిలబడి ఇంటికేసి గర్వంగా తృప్తిగా చూసుకుంది దుర్గ. చిన్నదైతేనేంగాక, అది తను కట్టించిన ఇల్లు. 'వాకిట్లో నాలుగు బంతి మొక్కలైనా ఏసేరు కాదు' అని మనసులోనే విసుక్కుంది.

అరుగుమీద నవారు మంచం వేసుంది. గోడకి రెండు దిండ్లు చేరబెట్టి వాటికి వీపు ఆనించి పత్రికేదో తిరగేస్తున్నాడు వెంకటేశు. తెల్లని లుంగీ మీద పొడుగు చేతుల చొక్కా వేసుకుని రాజాబాబులా ఉన్నాడు. తను తమ్ముణ్ని చూసి రెండేళ్ళు దాటిపోయింది. ఉద్యోగంలో చేరకముందంతా తరచుగా తనని చూడాలని వచ్చేవాడు. విశాఖపట్నంలో ఉద్యోగంలో చేరేక దూరం కావడం వలన కాబోలు అసలు ఇటు పక్కకే రాలేదు.

బక్కపల్చగా ఉండే వాడు కొద్దిగా ఒళ్ళు చేసి రంగొచ్చేడు.

ఫేషను కాబోలు ఇదివరకుండే సన్నటి మీసం తీసేసాడు. పైకి దువ్విన జుట్టు. అదేదో సినిమాలో హీరోలాగా ఎంత అందంగా ఉన్నాడు తన తమ్ముడు! సడి చెయ్యకుండా మెట్లెక్కి పుస్తకం లాక్కుని పక్కన పడేసింది.

"తమ్ముడూ ఎన్నాళ్ళైపోయిందిరా నిన్ను చూసి" అని ఓ అరుపు అరిచి తమ్ముడి కంఠాన్ని వాటేసుకుంది.

ఆ అలికిడికి లోపల్నుంచి వెంకటేశు పెళ్లాం శారద బయటికి వచ్చింది. ఆ అమ్మాయి తెల్లగా బొద్దుగా ఉంది.

మంచం పక్కనే ఉన్న సంచుల్లోంచి వస్తున్న ఎండు చేపల వాసన భరించలేక ముక్కును పైటచెంగుతో మూసుకుంది. తన భర్తనలా మరో స్త్రీ వాటేసుకోవటం, ఆ మోటుతనం చిత్రంగా అనిపించి రెప్పవాల్చకుండా చూస్తోంది.

గుమ్మంలో భార్యను చూసిన వెంకటేశు అక్క చేతుల్ని వదలించుకుని ఇబ్బందిగా మొహం పెట్టి మంచంలో అనీజీగా కదిలేడు. తమ్ముడి చూపుల వెంట తనూ వెనక్కి తిరిగి చూసింది దుర్గ. "ఈ పిల్లేనా నా మరదలు" లబ్బరు బొమ్మలా ఉంది. నా తమ్ముడి సెలక్సానా మరేటి? ఏమిరా బుజ్జులూ, అమ్మ లేపోతే పోయింది. నీ అక్క కూడా సచ్చిపోయిందనుకున్నావా ఒంటరిగా పెళ్లి చేసేస్కోటానికి! ఏంటమ్మాయ్ నువ్వైన అదగలేదా నా యాడబిడ్డేదని?" అంది చొరవగా.

"పోన్లే పెళ్లికి రాపోతే ఏటైందిలే, ఉప్పుడొచ్చేనుగదా, ఇంక సూస్కో, ఆడబిడ్డ అర్దమొగుడే మరి" అంది మురిపెంగా.

మరదలి మొహంలో మారుతున్న రంగుల్ని చూసి తన మాటల్లో ఏదో పొరపాటున్నట్టుందని ఆగిపోయింది తమ్ముడి మొహంకేసి చూసింది. అతను గుడ్లప్పగించి పెళ్ళాన్నే చూస్తున్నాడు.

తమ్ముడు తనతో ఎప్పట్లాగ గారాలు పోతూ మాట్లాడ్డం లేదని అర్థమైంది. దుర్గకి. వాళ్ళేదో బిడియపడుతున్నారనుకుని "తమ్ముడూ, నీకిష్టమని ఎండుసేపల్లో ఎన్ని రకాలున్నాయో అన్నీ తెచ్చేనొరే, ఉప్పుడు వంటైపోయిందా, వంజిరం ముక్కల కూరొండనా" అంది చీర కుచ్చిళ్ళు బొడ్లో దోపుకుంటూ.

పక్కింటి పాపమ్మ వాకిట్లోకి బట్టలారెయ్యడానికి వచ్చినట్టుంది. గుమ్మంలోకి తొంగిచూసి "దురగా నువ్వంటే, ఇదేనా రాటం? ఆళ్ల బోయినాలైపోయేయిలే, ఇలారా మా ఇంట్లో వొణ్ణవుంది, తినెల్దువుగాని" అని పిల్చింది.

"నా కాకలి లేదులే అత్తా, ఇంత సందమావలాంటి మరదల్ని చూసి కడుపు నిండిపోయింది" అంది దుర్గ.

"సాల్లే బడాయి, రద్దూ" అని పిల్చుకెళ్లింది పాపమ్మ.

"నువ్వేటో ఎండుసేపలూ గట్టా అంటన్నట్టున్నావు. నీ మరదలు నీసు తినని పిల్లంట. ఈ నాలుగు రోజుల్నించీ సూస్తన్నాను గదా. రోజూ కాయగూరలూ, గడ్డీగసరా వొండుకుని తింటన్నారు" అంది.

ఆ అమ్మాయి చెంగుతో ముక్కెందుకు మూసుకుందో అప్పుడర్థమైంది దుర్గకి. "అదా సంగతీ" అని పడీ పడీ నవ్వింది.

"సంబడం బాగానే ఉంది కానీ ఇంక ఈ ఊరొచ్చీ ఉద్దేశం లేదా నీకు?"

"అదేటి, కడుపట్టుకుని ఎక్కడెక్కడికో వలస ఎల్తాం. కాలూ సెయ్యీ వంగేక ఉన్న ఊరు రాక తప్పుద్దా? అందుకే కాదా నెత్తి మీదకింత నీడ ఏర్పర్సుకుంట"

"అదిగదే మరి, నీ తమ్ముడు ఇల్లూ, పొలవూ అమ్మకవెట్టేస్తన్నాడు తెల్సా నీకు? అందుకే సెలవు మీద వొచ్చేడంట. ఇంట్లో ఉంటన్న లచ్చమ్మోళ్లన్నీ కాళీ చేయించేసేడు. ఈ విషయం నీకు తెలుసో లేదోనని రామిగాడిసేత రమ్మని కవురెట్టేను"

దుర్గ నవ్వాగిపోయింది. నోట్లో పెట్టుకోబోతున్న అన్నం ముద్ద కంచంలో పడిపోయింది. "నువ్వా కవురెట్టింది!" అన్న మాట గొంతులోనే ఆగిపోయింది.

తమ్ముడే చూడాలని పిలిపించేడనుకుంది. అంతలోనే తేరుకుని, "పోన్లే అత్తా, నా తమ్ముడు సదువుకున్నాడు. ఎప్పుడేం సెయ్యాలో ఆడికి తెల్దేటి" అంది గ్లాసుడు నీళ్ళు తాగి.

"అంత తెల్సినోడైతే అక్క పెళ్లి సెయ్యకుండా తను పెళ్లాడి పెళ్లాన్ని ఎంటేట్టుకొత్తాడేటి. అదీ రెండేళ్ల తర్వాత, ఇందాకట్నుంచి ఇంటన్నాను, తమ్ముడు తమ్ముడని నువ్వు ఎంపర్లాడతన్నావే గాని ఆడినోటంట అక్కా అని ఒక్క ముక్కొచ్చిందా? ఇంకా ఏదో మాయదారి భ్రమలో ఉన్నావు, ఎల్లెల్లు నీకే తెలుత్తాది?"

"సాల్లే ఊరుకో, నాకీ వొయసులో పెళ్ళేటి, ఎవరైనా ఇంటే నవ్విపోతారు. నా తమ్ముడెక్కడుంటే నేనూ అక్కడే, ఆడి పిల్లల్ని పెంచుకుంటూ, పోసించుకుంటా ఉండిపోతాను" అంది దుర్గ సంబరాన్ని కొనితెచ్చుకుని, " సరే గాని పాపమ్మత్తా ఆ సేపల సంచి నువ్వు తెచ్చేసుకుందూ, ఆ వోసనికి మా మరదలు పిల్ల దొక్కుంటాదేమో కూడాను."

కంచం కడిగి బోర్లించి ఇంటికి తిరిగొచ్చింది. పాపమ్మ పట్టుకెళ్లిన సంచిగాక రెండో సంచి తనెక్కడ పెట్టిందో అక్కడే ఉంది.

దాన్లోంచి తను తమ్ముడి కోసం కొనుక్కొచ్చిన రెండు జతల బట్టలు, చెప్పులు, తీసి బైటపెట్టింది. మరదలి కోసం కొనుక్కొచ్చిన చీరలు, జాకెట్లు, స్టీలు గిన్నెలు, స్వీట్లు, పళ్ళుపూలు అన్నీ మంచం మీద పేర్చి, అరుగు చివరి కొచ్చి ఖాళీ సంచిని దులిపేసింది. "తీసుకోండి, ఇయ్యన్నీ మీకే" అంది. బొడ్లో దోపుకున్న ఎర్రకాయితప్పొట్లాం విప్పి తళతళా మెరుస్తున్న తెల్లరాయి ఉంగరం తీసి తమ్ముడి వేలికి తొడిగింది.

అప్పటికి నోరు విప్పి, "ఇప్పుడెందుకివన్నీ" అన్నాడు వెంకటేశు.

తను లేని సమయంలో ఏం మాట్లాడుకున్నారో ఇద్దరూ మొహాలు గంట్లు పెట్టుకుని ఉన్నారు. దుర్గ చొరవగా లోపలికెళ్లలేకపోయింది. అక్కడే గోడకి చేరబడి కూర్చుండిపోయింది.

వెంకటేశు గోడ వైపు చూస్తూ, "ఇక్కడి వ్యవహారమంత ముగిసేక నీకు తెలియజేద్దావనుకున్నాను. అంతలోకి నువ్వే వచ్చేవు. శారదా, నేను అమెరికా వెళ్ళే ప్రయత్నంలో వున్నాం. అక్కడ వాళ్ల బాబాయి ఉన్నారు. ఆయనే మాకిద్దరికీ అక్కడ ఉద్యోగాలు చూసారు. కొంత ఖర్చు వాళ్ల నాన్నగారు పెట్టుకుంటున్నారు. అది చాలక ఈ ఇల్లు, పొలం అమ్మాలనుకుంటున్నాను" అన్నాడు.

దుర్గకి ఎవరో నెత్తి మీద సమ్మెటతో మోదినట్లైంది. ఆకాశానికీ భూమికీ మధ్య ఒంటరిగా గిరగిరా తిరిగినట్లైంది.

తనను తను తమాయించుకునేసరికి కళ్ల నిండా నీళ్ళు నిండుకొచ్చేయి. "అమెరికానా... అంత దూరవా...." అంది ఎలాగో మాట మీద మాట పేర్చి.

"అవును, ఇద్దరం కంప్యూటర్ ఇంజనీర్లమే కదా! ఇక్కడుంటే ఏం సంపాదించగలం, బూడిద" అన్నాడు.

"మరి.... మరి .... నేను... నేను" అంది దుర్గ. ఆ పైన మాట పెగలలేదు.

"నీకు కుప్పుసామి ఉన్నాడు కదా" అన్నాడు వెంకటేశు. ఆ గొంతులో ధ్వనించిన వ్యంగ్యం, ఎగతాళి దుర్గకి శరఘాతాల్లా తగిలాయి.

"అయినా నువ్విప్పుడెందుకొచ్చేవో నాకు తెలీదనుకోకు. ఈ అమ్మకం జరక్కుండా ఆపాలనేగా, ఆ పని నీ వల్ల కాదు. ఎందుకంటే అమ్మ ముందుచూపుతో ఇల్లు, పొలం నా పేరునే పెట్టింది గనక"

వెల వెల పోయింది దుర్గ. తన ప్రమేయం లేకుండానే చటుక్కున లేచి నిలబడింది.

మెట్ల వేపు అడుగెయ్యబోతుంటే – "ఆగండి, మొదటి సారి మా ఇంటికొచ్చేరు, ఉత్త చేతుల్తో వెళ్లకూడదు" అంటూ తలుపు వెనక నుంచి మరదలు బైటికొచ్చింది. కుంకం భరిణ తెరిచి దుర్గ మొహాన బొట్టు పెట్టి, మంచం మీదున్న జాకెట్టు ముక్కల్లోంచి ఓ ముక్క తీసి చేతిలో పెట్టింది.

వెర్రిదానిలా దుర్గ జాకెట్టు ముక్కనీ, శారదనీ మార్చి మార్చి చూసింది. పొలం మీది మకరా ధాన్యం ధీమాతో ఇవన్నీ కొనడానికి తను అనపర్తి రెడ్ల దగ్గిర చేసిన చక్రవడ్డీ అప్పు కళ్ళ ముందు పెనుభూతంలా కదలాడుతుండగా నడిచిందో పరుగెత్తిందో తెలీని స్థితిలో పుంత దారిన పడి రోడ్డు చేరుకుంది. కదలడానికి సిద్ధంగా వున్న బస్సెక్కబోతుండగా వెనక నించి సైకిలు బెల్లు మోగించుకుంటూ "దురగా... దురగా" అని అరచుకుంటూ వచ్చి, "సంచులు మరిసిపోయేవంట" అని ఖాళీ సంచుల్ని చేతికందించేడు భద్రం.

**రచన (ఫిబ్రవరి 2002)**

# నాన్న ఉండాలి

**–సి. ఉమాదేవి**

**“అ**తడినే చెప్పనివ్వమ్మా” డ్రామాలో ప్రాంప్టింగ్ తోచిందేమో చెప్తున్న లతను వారించాడు డాక్టర్ మనోహర్, ప్రఖ్యాత సైకాలజిస్టు.

“డాక్టరుగారితో మీరే చెప్పండి నాన్నా, మీరెందుకు ఇలా అయిపోతున్నారో!”

కూతురివంక సాలోచనగా చూసాడు ముకుందం.

“ఆ రోజుకు వారం దాటిందేమో కూతురు తన దగ్గరకు వచ్చి ఛ.... తన వలన వీరికెంత ఇబ్బంది! తనను పట్టించుకోవద్దంటే వినదు.

ఏం చెప్పాలి? తనను కూడా త్వరగా నిష్క్రమించేలా చేయమనా?’

“నాన్నగారూ, మీరిలా బాధపడుతుంటే పోయినవాళ్ళు తిరిగొస్తారా? మాకు మాత్రం బాధగా లేదా అమ్మను పోగొట్టుకున్నామని” లత మనసులోని వేదన మాటలో కనబడుతోంది. అమ్మలు, నేను మీ అమ్మను పోగొట్టుకోలేదు. అంటే నా భార్యను పోగొట్టుకోలేదు. ఒక స్నేహితురాలిని పోగొట్టుకున్నాను. పైకెళ్లిపోయింది” ముకుందం చూపు ఊర్ధ్వదిశలో నిలబడిపోయింది.

“మరి మీరిలా బాధపడుతుంటే అక్కడున్న అమ్మ బాధపడదూ, మీ బాధేంటో డాక్టరుగారికి చెప్పండి. ఇప్పుడు అన్నిటికీ మందులున్నాయి కదా నాన్నగారూ”

కూతురి మాటలకు నిట్టూరుస్తూ, “మనోవ్యాధికి మందుందామ్మా” అంటూ కళ్ళు మూసుకున్నాడు. కాని మనసులోనికి జొరబడే ఆలోచనలకు తలుపులు బిగించలేకపోతున్నాడు.

“ఉంది సార్, మీరు కాస్త సహకరిస్తే చాలు. మీరు మరీ అండమాన్ ఖైదీ జైలుగోడల మధ్య బందీ అయినట్టు మిమ్మల్ని మీరు నాలుగు గోడల మధ్యే బంధించుకుంటే ఎలా?”

"సరే డాక్టరుగారు. రేపు వస్తాను. ఈ రోజు నా భార్య పుట్టినరోజు. మా ఇద్దరిలో ఎవరి పుట్టిన రోజైనా కిస్మిస్, జీడిపప్పు బాగా వేసి ఉదయాన్నే పాయసం కాచి నైవేద్యం పెట్టాక నాకందించేది. కనీసం ఆమె జ్ఞాపకాలలో ఈ రోజును గడవనివ్వండి"

డాక్టర్ మనోహర్‌కు వారించాలని ఉంది కాని మనోవేదనతో కృంగిపోతున్న ముకుందానికి అడ్డు చెప్పలేక సరేనన్నట్టు మౌనంగా తలవూపాడు.

"అమ్మలు పద, పాయసం కావాలి అమ్మకు!"

అతడికి భార్యపట్ల ఉన్న అనురాగానికి ముగ్ధుడైనా తన జీవనాన్ని మరీ చీకటిమయం చేసుకుంటున్న ముకుందాన్ని జాలిగా చూడటం మినహా ఆగమని గట్టిగా అనలేకపోయాడు డాక్టరు.

తాను ఔపోసాన పట్టిన సైకాలజి డిగ్రీలు ముకుందం ముందు చిన్నపోతున్నట్టనిపించాయి.

"రండి నాన్నగారు దీపం వెలిగిద్దురుగాని..." మరోమారు పిలిచింది లత.

ముకుందం గది తలుపు తోసి చీకటిలో ఏమీ కనబడక కిటికీ తీయబోయింది.

"ఆగు... ఏం చేస్తున్నావ్.... ఎన్నిసార్లు చెప్పాలి. కిటికీలు తెరవద్దని. ఒకసారి చెప్తే అర్థం కాదా. రోజూ చెప్పాలా" విసురుగా అన్న తండ్రి మాటలకు క్షణం పాటు చివుక్కుమనిపించినా అంతలోనే మనసుకు సర్ది చెప్పుకుని.

"సారీ నాన్నగారు.... పాయసం తయారయింది. మీరు వచ్చి దీపం వెలిగిస్తారు, ఈరోజైనా చీకటి నుండి బయటకు వస్తారని ఆశపడ్డాను. నా ఆశ అడియాసే" దుః ఖంతో లత గొంతు పూడుకుపోతోంది.

"నువ్వెందుకు అమ్మలు సారీ చెప్పడం నేనే చెప్పాలి. మీ అమ్మ నన్ను విడిచివెళ్లింది మొదలు నేను ఈ చీకటికి అలవాటు పడిపోయాను. ఏమో, వెలుగును మాత్రం భరించలేకపోతున్నాను. అమ్మలు, అమ్మకు నువ్వే దీపం వెలిగించి నైవేద్యం పెట్టు"

"సరే నాన్నగారు" అంటూ కళ్లలో నీరు తండ్రికి కనపడకుండా తలుపు మూసి బయటకు వచ్చాక గట్టిగా వత్తుకుంది. "ఇలాంటివి ఎన్ని సందర్భాలో! కన్నీటి జలపాతానికి ఆనకట్ట ఎలా వేయాలో తెలియక తండ్రికి కనబడకుండా దుఃఖాన్ని బోర్లించేది తల్లిని తలచుకుని ఆవేదనతో తల్లడిల్లిపోయేది. తల్లి మరణం ఎంత బాధాకరమో, ఆ అనుభవంలోని చేదును మింగలేక పోతోంది. తన పెళ్లి చూసింది. అంతే... అంతదాకా పొంచి వున్న జబ్బు మరిక ఆగలేనంటూ తల్లిపై దాడి చేసి కబళించింది. దేవుడిని రోజూ వేడుకునేది అమ్మను తీసికెళ్లిపోకు భగవంతుడా, అమ్మ నా పిల్లలను చూడాలి. వారితో మాట్లాడాలి, కమ్మని కథలు చెప్పాలి. వారి ముద్దు మాటలు అమ్మ వినాలి. 'లత నోటివెంట ఎన్ని నివేదనలో! కాని లత మాటలెందుకో దేవుడు వినలేదు. తల్లి పోయాక దిక్కుతోచని పక్షిపిల్లలా వణికిపోయింది లత. తండ్రి ఉన్నాడు మీకేం ఫరవాలేదు అన్న చుట్టపక్కాల మాటలతో ధైర్యాన్ని కూడదీసుకోసాగింది. అయితే అనుకున్నట్లు కాక తండ్రి పరిస్థితి చూసాక లతలో ఏదో తెలియని బాధ బీజమేసి మొక్కగా ఎదగసాగింది. విడువలేక విడువలేక తండ్రిని వదిలి వెళ్తూ తనతో వచ్చేయమని చివరి సారిగా మరోమారు బ్రతిమాలింది. తల్లి బ్రతికివున్నప్పుడు ఉన్న ఇల్లును వదిలి పెట్టవద్దని చెప్పేసాడు ముకుందం. తండ్రి మాటలలోని నిస్సహాయత, తల్లి నడయాడిన చోటనే వుండాలనుకున్న ఆరాధనా భావాన్ని గమనించిన లత మరిక తండ్రిని ఇబ్బంది పెట్టకూడదనుకుంది. కాని అలాంటి పరిస్థితిలో తండ్రిని వదలలేక వదిలి వెళ్లింది. ప్రతిరోజు తండ్రిని పలకరించేది. కాని రాను రాను తండ్రి బదులు వంట చేసిపెట్టే కుర్రాడు రాంబాబు మాట్లాడేవాడు. అయ్యగారు సరిగా భోంచేయడం లేదని, ఇష్టముంటే స్నానం లేకపోతే అదీ లేదని, గది వదలి బయటికి రారని చీకట్లోనే కూర్చున్నారని లైటు వేయబోతే కొట్టినంత పని చేసారని.

ఇలా వింటున్న లతలో మొక్కగా ఎదుగుతున్న భీతి మానుగా మారసాగింది. "తల్లిని పోగొట్టుకున్న దురదృష్టం. ఇక తండ్రిని కూడా పోగొట్టుకోలేదు. నాన్న నోటి వెంట అమ్మ జ్ఞాపకాల అనుభూతులు వినాలి. అమ్మతో తమ బాల్యపు ఊసులను నాన్నకు వినిపించాలి. అమ్మను జ్ఞాపకాలలో బ్రతికించుకోవాలి. అమ్మను పోగొట్టుకుని తల్లి ప్రేమకు దూరమయాం. ఇలాగే తండ్రి బాధతో కుంచించుకుపోతుంటే ఇక

నాన్నకు కూడా పోగొట్టుకుంటామేమో. ధైర్యాన్ని తండ్రిని చూసే నేర్చుకుంది. డబ్బుకు ఇబ్బందైనా, మనసుకు కష్టమైనా తమకు చెప్పి, ఆ తరువాత నాన్న ధైర్యంగా తీసుకునే నిర్ణయాలు తమను తలెత్తుకుని జీవించేలా చూసాయి తప్ప బెంబేలు పడింది ఎప్పుడూ లేదు. అలాంటిది ఇప్పుడు ఇలా తనలో తనే ముడుచుకుపోతూ... అందుకే ఏదైనా చేయాలి. నాన్నను కాపాడుకోవాలి. అమ్మపై దుఃఖాన్ని మరిపించాలి. ఎలా? భర్తతో ఆలోచించింది లత. మంచి సైకియాట్రిస్ట్‌కు చూపమన్న అతని సలహా కూడా ఓ సారి ప్రయత్నిస్తే తప్పేముంది అనుకుంటూ తండ్రికి కూడా ముందే చెప్పకుండా వచ్చి డాక్టరు దగ్గరకు బలవంతంగా తీసుకెళ్ళింది. అక్కడా ముకుందం సహకరించలేదు. “తల్లి చనిపోయినప్పటి నుండి ఇదే బాధ. తల్లి మరణించి ఏడాది దాటింది. క్షణ క్షణం గుర్తుకు వచ్చే తల్లిని మరవడం అసాధ్యమే. తల్లిని మరిపిస్తాడు తండ్రి అనుకుంటే, ఆయనే మరీ చిన్నపిల్లాడిలా బెంబేలెత్తిపోతున్నాడు” లత దేవుడికి మరోమారు తన వేదన నింపిన విజ్ఞాపనలు పంపుతూనే ఉంది.

“తన పిల్లలను నాన్న చూడాలి. అవును నాన్నయినా చూడాలి. తన పిల్లల అల్లరి చూసి నాన్న కోపం మరచి నవ్వడం చూడాలి. బడికి బ్యాగు తగిలించుకుని వెళ్తుంటే వారి వెంట వస్తాననే తాతయ్యను వారించి తుర్రుమనే తన పిల్లలను చూసి సాయంత్రం రండిరా మీ పని చెబుతాను అని ప్రేమగా గుర్రుమనే నాన్నను చూడాలి. ఇవన్నీ అనుకున్నవి అనుకున్నట్లు జరగాలంటే నాన్న ఉండాలి”

ముకుందానికున్న ఒక్క కొడుకు అమెరికాలో ఉద్యోగం వదిలి రాలేకపోతున్నాడు. కోడలు రానివ్వడంలేదేమోనని అందరు అనేమాట. కాని మాంద్యం ప్రభావానికి కుదేలైన అమెరికా ఆర్థిక వ్యవస్థలో అమెరికా వదలి వస్తే ఇక అంతే సంగతులేమో అనే భయాలు వున్నాయి కొందరికి.

పాయసం గ్లాసునిండా పోసి తెచ్చి ఇచ్చింది లత.

పాత జ్ఞాపకాలు ఎన్ని తడిమాయో కళ్ళు నీటి చెలమలయి అంతవరకు కనబడుతున్న చీకటిని కూడా చూడకుండా చేసాయి ముకుందాన్ని. పాయసం రుచిని ఆస్వాదించే స్థితిలో లేడు ముకుందం.

అందుకే గొంతుకడ్డం పడ్డ బాధను దాటుకుని వెళ్ళడం పాయసానికి సాధ్యం కావడం లేదు.

ఆ రాత్రి అన్నయ్య దగ్గరనుండి ఫోనందుకున్న లత ఫోనులోనే బావురుమంది.

"ఇలాగైతే త్వరలోనే నాన్నగారిని పోగొట్టుకుంటామేమోనని భయంగా వుంది అన్నయ్యా" అంది వెక్కి వెక్కి ఏడుస్తూ.

బాధపడుతున్న లతకు అన్నయ్య చెప్పిన మాటలు పచ్చి గాయంపై చల్లని లేపనంలా తోచాయి. త్వరలోనే తాను ఇండియా వస్తున్నట్టు, ఆ ఇంటి వారసుడు ఆకాష్ పుట్టినరోజుకు తామందరు అక్కడికి చేరుకుంటున్నట్టు చెప్పిన వార్త లతకు తాను మోస్తున్న భారాన్ని ఎవరో ఆప్యాయంగా అందుకుని దించి తనకు బరువు తగ్గించినట్టనిపించింది. ఆ కబురు తండ్రికి కూడా చెబుదామనుకుంది. కాని రాత్రి, పగలుకు తేడా తెలుసుకోవాలన్న ఆసక్తి ఏమాత్రం చూపకుండా మనిషి ఎప్పుడూ కళ్ళు మూసుకునే ఉంటాడు. బాధ మరచి కాసేపు పడుకున్నాడేమోనని లత మరిక లేపకుండా పడుకుని కళ్ళు మూసుకుంది. అన్న ఇచ్చిన హామీతో చాలారోజులకు లత నిద్రను మనసారా ఆహ్వానించింది. తల్లి తలపులు, నాన్నపై వేదనకు తాత్కాలిక విరామమిస్తూ నిద్రాదేవి లతను తల్లిలా హత్తుకుంది.

"నాన్నగారూ అన్నయ్య వస్తున్నాడు" తండ్రి ఎప్పుడు లేస్తాడా ఎంత త్వరగా ఈ వార్త అందిద్దామా అని త్వరగానే లేచిన లత తండ్రి అప్పటికే లేచి భార్య ఫొటోను తడుముకుంటూ నిట్టూర్చడం చూసి బిత్తరపోయింది. ఈయన అసలు నిద్రపోతున్నాడా  అన్న సందేహం కలిగింది.

"నాన్నగారూ"

"చెప్పు అమ్మలు... ఈ వేళేమైనా బయలు దేరుతావా, నీదేమో కొత్త సంసారం. నా కోసం అల్లుడికి ఇబ్బంది కలిగిస్తూ ఎన్నాళ్ళుంటావు?"

"అది సరే నాన్నగారు, ఈ మాట వినండి. అన్నయ్య వస్తున్నాడు"

"ఏం చేస్తాడు వచ్చి నాలుగు రోజులు నీలాగే నన్ను హైరాన పెట్టేస్తాడు ఆ డాక్టరు, ఈ మందులూ అంటూ, నా తంటాలేవో నేను పడతాను మీరు కూడా ఎందుకు శ్రమపడటం?'

"కాదు నాన్నా బంటి పుట్టినరోజు ఇక్కడే చేస్తాడట. అందుకే వదిన, బంటి కూడా వస్తున్నారు"

"ఎప్పుడట వాడి పుట్టినరోజు?" ఎప్పుడోలే అనుకుంటూ అడిగాడు ముకుందం ఆ వచ్చే ఆదివారమే కదా నాన్నా..."

"వచ్చే ఆదివారమంటే... ముకుందం హృదయంలో ఏదో తెలియని పొటమరింత, ఉద్విగ్నత! ఆ గోడమీద క్యాలెండరుండాలి చూడు"

లత ఏ గోడ మీద క్యాలెండరుందో అని గోడలను పరికించి చూస్తూ చేత్తో తడుముతోంది.

"ఏమిటి ఆ వెతుకులాట, ఆ లైటు వేస్తేకదా కనబడేది"

తండ్రేనా లైటు వెయ్యమంటున్నాడు తన తొట్రుపాటు కనబడకుండా లైటు వేసి క్యాలెండరు తీసి చూడసాగింది లత.

ఇవేవి గమనించడంలేదు ముకుందం. కాంతికి అలవాటు తప్పిన కళ్లను చికిలించి చూస్తూ "అరె ఇప్పుడా చెప్పేది, సరిగ్గా బయలు దేరకముందు మనమేం చేయాలి? ఎవరిని పిలవాలి?" కొడుకు స్నేహితులయితే ఒక ఐదారుగురు తప్పించి చాలా మంది అమెరికా లేదంటే బెంగుళూరు. ఇక మిగలిన వారు అమ్మలు స్నేహితులు, తన కొలీగ్స్ దాదాపు ఏడాది దాటింది. అందరిని పలకరించి ఎవరెవరు ఎక్కడెక్కడ వున్నారో... ఎలా... ఆ చలపతినడగాలి. వాడినందరు అడ్రస్ బుక్ అనేవారు. ల్యాండ్‌లైన్ నెంబర్లు, సెల్ నెంబర్లు, ఇ-మెయిల్ ఐ.డి అన్నీ సేకరించి వుంచుతాను.

"అమ్మలు నీ స్నేహితులందరినీ పిలువు. నీకు కూడా అందరినీ కలిసినట్లుంటుంది. అలాగే చలపతి అంకుల్‌కి ఫోన్ చెయ్యి. నేను రమ్మన్నానని చెప్పు. డాక్టరు గారికి కూడా కాల్ చెయ్యి, మరచిపోకు ఆయన మనవాడిని అదే మనవడిని చూడాలి.

వాడి సైకాలజీ ఏమిటో ఆయననడిగి కనుక్కోవాలి" తండ్రి ముఖంలో ఏదో చిన్న వెలుగు తొంగి చూసి నట్లనిపించింది లతకు. ఆ వెలుగును ఆరనీకుండా మరింత పెంచాలి.

లత వెతుకుతున్న టెలిఫోను డైరక్టరీ దొరకడం ఆలస్యమయ్యేకొద్దీ అసహనం పెరిగిపోసాగింది ముకుందంలో.

"ఎంతసేపు వెతుకుతావు? చిన్నప్పుడు ఇలాగే వెతికేదానివి పెన్సిలు పోతే!

నేను చూస్తానుండు... ఆ.... ఇదిగో ఇక్కడుందిగా" తన ఫైళ్ల మధ్యన ఉన్న డైరీని దుమ్ము దులిపి వెంటనే ఫోనందుకున్నాడు.

ముకుందం గొంతు విన్న చలపతికి ఒక్క క్షణం తాను వింటున్నది ముకుందం గొంతేనా అన్న అనుమానము కలిగింది. అయితే ముకుందం కూతురు ఆ తరువాత మాట్లాడి సందేహాన్ని తీర్చింది. "మీరొక్కసారి రావాలి అంకుల్. నాన్నకు తన స్నేహితుల ఫోను నంబర్లు కావాలట. అందరినీ కలవాలనుకుంటున్నాడు"

లత మాటలు చలపతికి అమృతాన్ని అదిమిపట్టి త్రాగించినట్టయింది. ఏడాదిగా అడపాదడపా కలుసుకుంటున్నా విసుక్కున్న సందర్భాలు ఉన్నాయి. అన్నింటికీ ఒకటే సమాధానం వెలుగును భరించలేనని. అప్పటికీ భార్యను పోగొట్టుకున్న భార్యల గురించి చెప్పాడు. అన్నీ విన్నాక ఎలా బ్రతుకుతున్నారో అని తన బాధకు వారి బాధను కలుపుకుని ఏడ్చేసేవాడు. నీలా చీకటిలో లేరు వాళ్ళు అంటే, అది నీకు కనబడదు వారి గుండెనిండా చీకటే ఉంటుంది. ఆ చీకటి తెర తొలగదు. అది తొలగాలంటే బాహ్యంగా మనం అంతమైపోవాలి అనేవాడు. ఇక ఇలా మాట్లాడితే ఏదైనా అఘాయిత్యం చేస్తాడేమోనని, ఆ పిల్లలకు తండ్రిని కూడా దూరం చేసినట్టవుతుందని తనే సంభాషణ తుంచేసేవాడు. మళ్లీ తన చీకటిలోకంలో తలుపును బిడాయించుకుని మనది కాని మరో లోకంలోకి ఆలోచనలతో ప్రయాణం చేసేవాడు. అలాంటిది ఈ వేళ తనే రమ్మంటున్నాడంటే, ఏదో విశేషమే అనుకుంటూ, కాఫీ తాగడం ఆలస్యం ముకుందం ఇంటివైపు వాహనాన్ని పరుగులు తీయించాడు. చలపతి రాకకోసమే కాచుకున్నట్లున్నాడు ముకుందం.

"అమ్మలు, చలపతి అంకుల్ వచ్చారు. చూడు కాఫీ, టిఫిన్ ఏర్పాట్లు, అలాగే ఆ నంబర్లన్నీ రాసుకో. ఈ లోగా నేను స్నానం చేసి వస్తాను"

తండ్రి స్నానానికి వెళ్ళగానే అంకుల్ అంటూ అణచివున్న దుఃఖాన్ని ఆపుకోలేకపోయింది లత.

"నువ్విప్పుడు ఏడ్వాల్సిన సమయం కాదు, మీ నాన్న అణగారిపోయిన శక్తులను పుంజుకుంటున్నాడు. అసలు మేమెప్పుడైనా దేనికైనా వెనక ముందులాడితే మమ్మల్ని మార్గదర్శిలా మీరీ ముందుకు నడిపించేవాడు. మీ నాన్నలో మార్పు వస్తోంది.

ఎందుకు ఎలా అనేది నీకర్థమయే వుంటుంది. మరిక ఏడవకు"

"నేను ఆనందంతో ఏడుస్తున్నాను అంకుల్. నా మేనల్లుడు అమెరికానుండి వచ్చి తాతగారింట పుట్టినరోజు జరుపుకుంటాడన్న వార్తతో నాన్నలో చలనాన్ని చూస్తున్నాను. తన స్నేహితులనందరినీ పిలవాలంటున్నారు. మీరు కొంచెం ఆ పని చూడండి అంకుల్, నేను పార్టీ ఏర్పాట్లు చూస్తాను" కళ్లు తుడుచుకుంది లత తండ్రివస్తున్న అలికిడి విని. షేవింగ్ కూడా మానేసిన నాన్న ఇలా శుభ్రంగా అన్నీ పూర్తి చేసుకుని వచ్చేసరికి లత తన మొర ఈసారి ఆలకించాడు అనుకుని మనస్సులోనే దేవుడికి నమస్కరించుకుంది.

"అరె ఏమిటి ఇంకా నెంబర్లు రాసుకోలేదా, సరే టిఫిన్లు కానిచ్చేసి ఒకేసారి ఫోన్ చేసి పిలుస్తాలే" అంటూ రాంబాబందించిన ఉప్మా ప్లేటందుకుని గబగబా తినసాగిన తండ్రిని కన్నుల నిండుగా చూడసాగింది లత.

"అలా చూస్తూ నిలబడితే ఎలా అమ్మలు మంచి నీళ్ళు తెప్పించవా?"

తండ్రి మాటతో సర్దుకుని మంచినీళ్ళు తెచ్చి ఇచ్చింది.

పిలవాల్సిన స్నేహితులు లిస్టు పెద్దదే. మళ్ళీ మనలో పడుతున్నాడు, వెళ్ళి చూడాలి అనుకుని పిలిచిన వారందరు హాజరు వేసుకున్నారు. అలాగే లత నేస్తాలు లతను చూసి చాలా రోజులయింది. పిచ్చిపిల్ల తల్లిని కోల్పోయి ఎలా వుందో పలకరించాలని కొందరు వచ్చారు. మొత్తానికి చాలా సందడిగా ఉంది. అందరి నడుమ సూటు కోటు వానికి తగిన టై, బూటు! ఆకర్షించగల రూపురేఖలు! బహుమతులతోపాటు ఆప్యాయతల జల్లు కురుస్తోంది. పుట్టిన రోజు జరుపుకుంటున్న బంటి అందరికీ చిరునవ్వుతో 'హాయ్' అంటూనే నమస్కారాలు పెడుతున్నాడు.

"ఏమోయ్ మనవడికి పెళ్ళిలా జరిపిస్తున్నావు పుట్టినరోజు!" స్నేహితుల జోకులకు చాలా రోజులకు కళ్ళెగరేసి నవ్వాడు ముకుందం.

"డాక్టరుగారు వీడి సైకాలజీ చెప్పండి వీడు ఇక్కడమ్మాయినా, అక్కడమ్మాయినా పెళ్ళి చేసుకునేది?" ముకుందం ప్రశ్నకు డాక్టర్ నవ్వుతూ..

"ఎక్కడమ్మాయైనా పెళ్ళి మాత్రం మా ముందరే చేసుకుంటాడు. అది మాత్రం గ్యారంటీ" అనగానే నవ్వుల గలగలలు విరిసాయి.

"ఛో తాతయ్యా! 'ఐ హేంట్ మ్యారీ' అని సిగ్గుగా లోపలికి పారిపోబోయాడు బంటి.

పారిపోబోతున్న మనవడిని పొదివి పట్టుకుని "నేనెక్కడికి పోతానురా? నీ పెళ్ళి చూడందే పోను గాక పోను" దృఢంగా పలుకుతున్న తండ్రిని చూసి మనసులో నుండి కొండంత బరువు దింపిన ఏడుకొండలవాడికి నమస్సులర్పిస్తూ ఇక ఫరవాలేదు నాన్న చీకటిని మరిచిపోతాడు స్నేహితులందరినీ కలిసాక వచ్చిన ధైర్యం ఇక వెనుకకు పోదు.

"మళ్ళీ మళ్ళీ వస్తుండండి" అని స్నేహితులకు వీడ్కోలు పలికి, బంటి బుగ్గలు పుణికి ముద్దు పెట్టుకున్నాడు ముకుందం. తండ్రి ముఖంలో గ్రహణం తొలగినట్టు చంద్రకాంతి చిన్నగా ప్రవేశిస్తూండటం చూసి నాన్న ఇక తట్టుకుని నిలదొక్కుకోగలడు. ధైర్యంగా ఉండగలడు. ఉండాలి. మాకు మా నాన్న ఉండాలి" లత కళ్ళు దుఃఖం, ఆనందం కలగలిసిన తడితో తండ్రిని ఆప్యాయంగా చూస్తున్నాయి.

# జీవని

**–కె.కె. భాగ్యశ్రీ**

"ఏరా తరుణ్.... జీవని ఈ మధ్య కనబడ్డమే మానేసింది" కాఫీ గ్లాసు తరుణ్ చేతికి అందిస్తూ అడిగాను.

"కాఫీ సూపర్ పిన్నీ. ఫిల్టర్ కాఫీ నీలా ఎవరూ కలపలేరు" అన్నాడు తరుణ్ కాఫీ సిప్ చేస్తూ.

నేనడిగింది వాడు సరిగా వినలేదేమోనని మళ్ళీ అడిగాను. "ఏంట్రా, ఏదేదో మాట్లాడుతున్నావు. నేనడిగేది జీవని గురించి"

"కాఫీతో పాటు జీడిపప్పు బాగా దట్టించిన ఉప్మా కూడా ఉంటే బాగుండేది. ఉప్మా చేయడంలో నువ్వు ఎక్స్‌పర్ట్‌వి కదా" అన్నాడు.

తరుణ్ నా మాటలు పట్టించుకోకుండా.

అప్పుడు అర్థమైంది వాడు మాట దాటవేస్తున్నాడని.

"ఏరా, ఇద్దరూ పోట్లాడుకున్నారా?"

లాలనగా అడిగాను.

"ప్లీజ్ పిన్నీ, ఆ టాపిక్ మాట్లాడకు" అన్నాడు తరుణ్ అసహనంగా.

వాడికంత చిరాకు ఎందుకు కలిగిందో అర్థంకాక తెల్లబోయాను.

"చూడు తరుణ్, నీకు జీవని మీద అంత కోపం ఎందుకొచ్చిందో తెలియదుగానీ...

నీ మనసులో ఏముందో మాత్రం నాకు తెలియాలి. అసలేమైంది?" అడిగాను మృదువుగా.

తరుణ్ నా ముఖంలోకి ఓసారి చూసి

"జీవనిని పెళ్ళిచేసుకోవడం నాకిష్టంలేదు పిన్నీ..." అన్నాడు కళ్ళు దించుకుంటూ.

నివ్వెరపోయాను.

"ఏంటి తరుణ్, నువ్వేమంటున్నావో తెలుస్తోందా?" అన్నాను కాస్త కరుకుగా.

"భేషుగ్గా... జీవనిని పెళ్ళి చేసుకోనని చెప్తున్నా" అన్నాడు తను కూడా అదే స్థాయిలో.

"కారణం?" ఉబికివస్తున్న ఆగ్రహాన్ని అణచుకొనే ప్రయత్నం చేస్తూ అడిగాను.

తరుణ్ ఏమాత్రం చలించకుండా

"ప్రత్యేకమైన కారణాలేమీ లేవు పిన్నీ. జీవని ఉద్యోగం పోయింది" అన్నాడు కూల్‌గా.

"అయితే?" అయోమయంగా చూశానున.

నన్నొక వింతజంతువుని చూసినట్లుగా చూశాడు తరుణ్.

"అయితే అని అంత మామూలుగా అడుగుతావేం పిన్నీ. జీవనిని నేను పెళ్ళి చేసుకోవడానికి ఇష్టపడింది ఆ ఉద్యోగం చూసే కదా" చెప్పాడు తరుణ్ రాకింగ్ ఛెయిర్‌లో ముందుకీ వెనక్కీ ఊగుతూ.

నిర్ఘాంతపోయాను. ఏమంటున్నాడు వీడు.

జీవనిని ప్రేమించాననీ ఆమె లేకపోతే బతకలేననీ చెప్పిన వీడు ఇప్పుడు ఉద్యోగంపోతే వద్దంటున్నాడేంటి?

అలా సందిగ్ధంలోపడి కొట్టుకుంటూనే ఉన్నాను చాలాసేపు. ఆ తరవాత తేరుకొని

"జీవని ఉద్యోగం పోయిందా" అడిగాను గొంతు పెగుల్చుకొని.

అవునన్నట్లుగా తలూపాడు తరుణ్.

"దానికీ నువ్వు జీవనిని కాదనడానికీ ఏమిటి సంబంధం?"

తరుణ్ నా వైపు విచిత్రంగా చూసి "ఎందుకు లేదు పిన్నీ. ఈ రోజుల్లో ఇద్దరూ ఉద్యోగాలు చేస్తేకానీ బతకలేని పరిస్థితులు ఉన్నాయి.

అలాంటప్పుడు ఉద్యోగం పోయిన జీవనిని పెళ్ళి చేసుకుని నేనేం సుఖపడగలను చెప్పు" ఎదురు ప్రశ్నించాడు.

"ఈ ఉద్యోగం కాకపోతే మరొకటి.

అంత మాత్రం చేత జీవనిని తిరస్కరించాలా?"

అడిగాను కాస్త కోపంగా.

"నీకు తెలియదు పిన్నీ. జీవని అంత తెలివైన అమ్మాయేంకాదు. ఏదో అదృష్టంకొద్దీ ఈ ఉద్యోగం దొరికింది. తగినన్ని కమ్యూనికేషన్ స్కిల్స్ లేకపోవడంతో ఉన్న ఉద్యోగం కాస్తా పోయింది. మళ్ళీ మంచి ఉద్యోగం దొరుకుతుందన్న గ్యారంటీ లేదు. ఈ పరిస్థితుల్లో రిస్క్ చేయడం దేనికని నేనే రిజెక్ట్ చేశాను" చాలా మామూలుగా చెప్పాడు తరుణ్. గొంతులో ఎక్కడా సంకోచంగానీ నదురు బెదురుగానీ లేవు.

వాడి ధోరణికి చిర్రెత్తి పోయింది నాకు.

"ఒకవేళ పెళ్ళి అయ్యాక తన ఉద్యోగం పోయుంటే.

అప్పుడు ఏం చేసుండేవాడివి?" అడిగాను శాంతంగా ఉండేందుకు ప్రయత్నిస్తూ.

అబ్బబ్బ పిన్నీ... ఏమిటి నీ ఇంటరాగేషన్, ఒకవేళ నువ్వన్నట్లే జరిగుంటే నా ఖర్మని సరిపెట్టుకుని ఉండేవాడిని. నా టైం బాగుండబట్టి తన ఉద్యోగం పెళ్లికి ముందే పోయింది. ఇక ఈ విషయంలో చర్చలూ వాదోపవాదాలూ అనవసరం" నా దగ్గర ఉండే చనువుకొద్దీ కాబోలు తరుణ్ మాటలు కాస్త వాడిగా వచ్చాయి.

స్థాణువయ్యాను. తరుణ్ ఇంత నిర్దయగా మాట్లాడుతాడని నేనసలు అనుకోలేదు. అతడి వ్యక్తిత్వం ఇంత బలహీనమైనదని ఏనాడూ ఆలోచించలేదు. వాడి గురించి నాకు పూర్తిగా తెలుసనుకున్నాను కానీ... కానీ... వాడు ఈ రకమైన మనస్తత్వం కలిగినవాడని తొలిసారి అర్థమైంది.

తరుణ్ నిష్క్రమణ తరవాత నాలో అనేకానేకమైన ఆలోచనలు కందిరీగల తుట్టల్లా ముసురుకున్నాయి.

జీవని... ఎంత మంచిపిల్ల. సన్నగా నాజూగ్గా చామనఛాయకి ఓ మెట్టు పై నుండే శరీరఛాయతో, తీర్చిదిద్దిన ముఖ కవళికలతో, స్వచ్ఛమైన చిరునవ్వు చిందిస్తూ

ఎంతో ఆకర్షణీయంగా ఉంటుంది. నిష్కల్మషమైన మాటతీరూ ఆకట్టుకొనే వ్యక్తిత్వం ఆమె సొంతమని ఆమెతో పరిచయమైన ఈ ఆరునెలల్లో గ్రహించాను.

తరుణ్ మా అక్క కొడుకు. వాడిని నా చేతులతో నేనే పెంచాను. తరుణ్ పుట్టిన ఐదేళ్ళకు నా పెళ్ళి జరిగింది. శ్రీవారికి తరచుగా క్యాంపులు తిరిగే ఉద్యోగం కావడంతో నా కాలక్షేపం అంతా తరుణ్‌తోనే దానికి తోడు పెళ్లయిన ఆరేళ్లదాకా నాకు పిల్లలు పుట్టలేదు. ఆ తరవాత కూడా నాకు పుట్టినవాళ్లిద్దరూ ఆడపిల్లలు కావడంతో మా ఇంట్లోనూ నా హృదయంలోనూ కూడా తరుణ్ స్థానం చెక్కుచెదరలేదు.

నా పెంపకంలో తరుణ్ ముద్దుల యువరాజులా ఎదిగాడు. నా భావాలూ ఆలోచనలూ అన్నీ మనస్తత్వం. విభిన్నమైన వాడి వ్యక్తిత్వం నన్నెంతో ముగ్ధురాలిని చేసేవి.

చక్కగా చదువుకుని, పేరున్న పెద్ద కంపెనీలో మార్కెటింగ్ మేనేజర్‌గా పనిచేస్తున్న తరుణ్ ఆరు నెలల క్రితం జీవనిని తనతోపాటు ఇంటికి తీసుకువచ్చాడు.

తొలిచూపులోనే జీవని నా మనసుని ఆకట్టుకుంది తరుణ్ తన తల్లిదండ్రులకన్నా ముందుగా జీవనిని నాకే పరిచయం చేశాడని తెలియగానే నా మనసు ఆనందంతో ఉప్పొంగిపోయింది. వాడికి నామీద ఉన్న ప్రేమాభిమానాలకి గుండె పులకించిపోయింది.

జీవని... ఏదో సాఫ్ట్‌వేర్ కంపెనీలో జాబ్ చేస్తోంది. అమ్మాయి చదువుకున్నది. ఉద్యోగస్తురాలు. అందగత్తె కావడంతో తరుణ్ మనసు ఆమెవైపు మొగ్గడంలో అసహజత్వం ఏమీ లేదనిపించింది.

అందుకే వారిద్దరి తరపున ప్రాతినిధ్యం వహించి అక్కాబావలతో వాళ్ళ పెళ్ళి గురించి మాట్లాడాను. ఆమెను తిరస్కరించడానికి అభ్యంతరాలేవీ లేనికారణంగా వాళ్ళు కూడా ఈ పెళ్ళికి అంగీకరించారు. తరుణ్ ఏవో కంపెనీ పనులమీద త్వరలో అమెరికా వెళ్ళనున్నాడు.

తిరిగి వచ్చేందుకు రెండు నెలలు పట్టచ్చు.

ఆ తరవాత ముహూర్తాలు పెట్టుకుందాం అనుకున్నాం ఇరువర్గాల పెద్దలమూ కలిసి. జీవని తరపు పెద్దలంటూ పెద్దగా ఎవరూలేరు. తల్లి, అన్నయ్య... అంతే.

ఇక వారం రోజుల్లో తరుణ్ అమెరికా వెళ్ళబోతున్నాడు. అంతా సవ్యంగా ఉందనుకున్న ఈ తరుణంలో వాడిలా బాంబు పేల్చడం నా మనసును అల్లకల్లోలం చేసింది.

నా పరిస్థితే ఇలా ఉంటే... పాపం జీవని ఈ వేదనను ఎలా తట్టుకుంటోందో.

అమెరికాలో రేగిన ఆర్థిక సంక్షోభం, ఇక్కడ... ఆంధ్ర రాష్ట్రంలోని ఒక ఆడపిల్ల జీవితంలో ఇలా పెనుతుపాను రేపడం నాకు మింగుడు పడని విషయమైంది.

వీల్లేదు, జీవనికి అన్యాయం జరగడానికి నేనొప్పుకోను.

వెంటనే అక్కకి ఫోన్ చేశాను.

"ఏం చేయమంటావు సుమా, వాడు ఆ అమ్మాయిని చేసుకోనని మొండికేస్తూంటే మేం మాత్రం ఏమి చేయగలం చెప్పు"

నిస్సహాయత ధ్వనించింది అక్క గొంతులో.

అలా అని వాడు ఓ అమ్మాయి జీవితంతో ఆటలాడుకుంటుంటే చూస్తూ ఊరుకుంటారా? అదే మన అమ్మాయి అయితే మీరిలాగే ప్రవర్తించేవారా? నయానో భయానో వాడికి నచ్చచెప్పాలిగానీ ఇలా ఏమీ పట్టనట్టు ఊరుకుంటే ఎలా, అయినా... కోడలు సంపాదించి తెస్తేగానీ ఇల్లు గడవని పరిస్థితిలో ఉన్నారా మీరు? సుఖాలకీ కోరికలకి అంతెక్కడ. ఉద్యోగం. పోయిందన్న ఒకే ఒక్క కారణంతో ఆ అమ్మాయిని కాదనడం సంస్కారం అనిపించుకోదు"

పట్టరాని ఉక్రోషంతో ఛడామడా దులిపేశాను.

అప్పటికిగానీ నా ఆవేశం తగ్గలేదు.

"నువ్వంటున్నదంతా నిజమే సుమా. కానీ మేం ఎటూ మాట్లాడలేని అసహాయులం.

ఒక్కగానొక్క కొడుకు. వాడి మాట కొట్టేయలేకే ఈ పెళ్ళికి ఒప్పుకున్నాం. ఇప్పుడు కూడా ఆ కారణంచేతే ఆ అమ్మాయిని కాదంటున్నాం. మా ప్లేస్‌లో ఉండి ఆలోచించి చూడు నీకే బోధపడుతుంది" నన్ను అనునయించే ప్రయత్నం చేసింది అక్క.

నాకు మరీ మండిపోయింది. లాభంలేదు. వీళ్లతో ఏం చెప్పినా బధిర శంఖారావమే. ఠఫీమని ఫోన్ పెట్టేశాను.

"ఇదేం ఘోరమండీ, వాడు ఇలా చేయడం ఏమన్నా బాగుందా. వాడి విశాల భావాలూ ఆదర్శాలూ అన్నీ ఎటు కొట్టుకుపోయాయో" శ్రీవారి ముందు నా గోడు వెళ్లబోసుకున్నాను.

"పిచ్చి సుమా, తరుణ్ ఇంకా చిన్నపిల్లాడనుకున్నావా. తనకేం కావాలో తేల్చుకునే పరిపక్వత అతడికుంది. ఇక ఆదర్శాలంటావా... ఆచరణలో అవి సాధ్యంకావు. ఇక ఈ విషయం నీ బుర్రలోంచి తీసేయి" అన్నారు శ్రీవారు ఓదార్పుగా.

ఆయన అన్నంత సులువుగా నేనా విషయాన్ని మరచిపోలేకపోయాను. జీవనిని పరామర్శించడం సాటి స్త్రీగా నా ధర్మం అనిపించింది. తరుణ్ ఆమె మనసుమీద కొట్టిన దెబ్బకి ఆమె ఎంతగా తల్లడిల్లిపోతోందో. ఆమెని చూసి, నాలుగు ఓదార్పు మాటలు చెప్పి ఆమె దుఃఖాన్ని ఉపశమింపచేయాలి.

ఆ రాత్రల్లా జీవని గురించిన ఆలోచనలే నన్ను వేధించి కంటిమీద కునుకులేకుండా చేశాయి.

ఎప్పుడో తరుణ్ చెప్పిన గుర్తులనుబట్టి జీవని ఉండే ఇంటిని వెతుక్కొని వెళ్లాను. చూడముచ్చటైన డాబా ఇల్లు అది. కాలింగ్‌బెల్ నొక్కగానే ఓ నడివయసావిడ వచ్చి తలుపు తీసింది. ఆవిణ్ణి నేను గుర్తుపట్టాను. ఆవిడ జీవని తల్లి శ్యామల. సంబంధం గురించి అక్కావాళ్లింటికొచ్చినప్పుడు చూశాను.

"నమస్కారమండీ" పలకరింపుగా అన్నాను చేతులు జోడించి.

ఆవిడ ముభావంగా ముఖం పెట్టి "నమస్కారం... ఏమిటిలా వచ్చారూ...." అంది.

ఆ మాటల్లో వ్యంగ్యం నా చెవులకు తాకింది.

"ఏమీలేదండీ, జీవనిని ఓసారి చూసిపోదామని..." అన్నాను బితుగ్గా.

ఆవిడ కళ్ళు ఎరుపెక్కాయి. ముక్కుపుటాలదిరాయి కోపంతో.

"మీవాడు చేయవలసినదంతా చేసేశాడుగా... ఇంకా ఏం మిగిలుందని వచ్చారు? అది ఏ విధంగా ఏడుస్తోందో చూసిరమ్మని పంపాడా ఆ మహానుభావుడు" అంది ఆమె ఉక్రోషంగా.

నేను కిమ్మనలేదు. ఆవిడ ఆవేదనలో అర్థం ఉంది. తరుణ్ వాళ్ళ హృదయాలను అంతగా నొప్పించాడు మరి.

"శ్యామలగారూ, తరుణ్ చేసిన పని నాకూ నచ్చలేదు. ఈ విషయమై నాకూ వాడికీ గొడవైంది కూడా కానీ వాడు ఎవరిమాటా వినే పరిస్థితిలో లేడు. కేవలం జీవనిని ఓసారి పలకరించిపోదామని వచ్చానుకానీ,,, మిమ్మల్ని మరింత హింసించాలని కాదు" మెత్తగా పలికిన నా స్వరం ఆమెను శాంతించేలా చేసింది.

ముఖంలోకి ప్రసన్నతని కొనితెచ్చుకుంటూ "లోపలికి రండి" అంది.

నా కళ్ళు జీవని కోసం వెతికాయి.

నా మనోభావన గమనించినట్లుగా "అమ్మాయి ఆ గదిలో ఉంది వెళ్ళండి" అంది శ్యామల.

నెమ్మదిగా అటువైపు నడిచాను.

ఉద్యోగం పోవడం ఒకెత్తు, పీటలదాకా వచ్చిన పెళ్ళి ఆగిపోవడం ఒకెత్తు. తరుణ్ ఆమె జీవితంలో ఎంతటి తుపాను సృష్టించాడు.

ఆ కల్లోలం ఇప్పట్లో ఆగిపోయే అవకాశమేలేదు.

తలుపు తోసుకుని లోపలికి అడుగుపెట్టాను.

దిండులో తలదూర్చి డొక్కలు పగిలేలా ఏడవకపోయినా జీవని ఎదకోత ఆ స్థాయిలోనే ఉంటుందని ఊహించిన నేను జీవనిని చూసి నివ్వెరపోయాను. ఒక మంచంలాంటి పరికరానికి లేత ఆరెంజ్‌కలర్ చీరను బిగించి దీక్షగా వర్క్ చేస్తూంది జీవని.

పట్టుదలతో దగ్గరకు ముడుచుకున్న లేత పెదవులు... తదేక దృష్టితో పనిచేయడం వలన తీక్షణత నిండిన చూపులు... ముక్కుకొన నుండి కిందికి జారుతున్న చెమట బిందువులు... ఏకాగ్రతతో ముడివడిన నుదురు... జీవనిలో ఎక్కడా విషాదఛాయలు కనబడటం లేదు.

లోస్వరంతో పిలిచాను "జీవనీ..."

తలెత్తి నన్ను చూసిన ఆమె "ఓ సుమా ఆంటీ... రండి, రండీ బావున్నారా?" అంది నవ్వు ముఖంతో.

"బాగున్నావా జీవనీ" నా పలకరింపు నాకే పేలవంగా తోచింది.

"ఫైన్ ఆంటీ.. చీర లాస్ట్‌కి వచ్చేసింది. ఒక్క టెన్‌మినిట్స్ అలా కూచోండి వచ్చేస్తాను"

అంటూ గదిలో ఓ మూలగా ఉన్న దివాన్ చూపించింది.

నేను మాట్లాడకుండా దివాన్ మీద కూర్చున్నాను. పొందికగా సర్దిన గది జీవని అభిరుచినీ శుభ్రతనూ తెలియపరుస్తోంది. అన్నట్లుగానే పది నిమిషాలలో పని పూర్తి చేసింది జీవని. చీరను తీసి మడతపెట్టి నా దగ్గరకు పట్టుకొచ్చింది.

"ఎలా ఉందాంటీ చీరా" నా చేతిలో ఆ చీర పెడుతూ అడిగింది.

కుందన్స్, బీడ్స్, రంగురంగుల చిప్స్‌తో కుట్టిన చీర ఎంతో అందంగా ఉంది.

"చాలా బాగుంది. నీకోసమే డిజైన్ చేసుకున్నావా?" అడిగాను చీరమీద వర్క్ పరిశీలనగా చూస్తూ.

"ఈ చీర నాదికాదాంటీ, మా పక్కింటి డాక్టర్‌గారి భార్యది" చెప్పింది నా పక్కనే కూర్చుంటూ.

"బయటి చీరలకి కూడా వర్క్ చేస్తూంటావా" విభ్రమయంగా అడిగాను.

"తప్పేంటి అంటీ? మెటీరియల్ అంతా పోను, చీరకి నాలుగైదు వందలు మిగులుతుంది" అంది జీవని.

"ఒక చీర చేయడానికి ఎన్ని రోజులు పడుతుంది?"

"ప్రొఫెషనల్స్‌కి అయితే కొన్ని గంటలు లేకపోతే ఒకరోజు పడుతుంది. నాలా ఎప్పుడో చేసేవారికి మూడునాలుగు రోజులు పడుతుంది" అంది జీవన.

అప్రస్తుత ప్రసంగం అంటే ఇదే కాబోలు. నేనొచ్చిన పనేంటి, ఆడుతున్న కబుర్లేంటి?

అసలు విషయం ఏమని మొదలుపెట్టాలో అర్థంకావటం లేదు. ప్రశాంతంగా కనిపిస్తున్న జీవనిని తిరిగి డిస్టర్బ్ చేయాలనిలేదు.

కాసేపు మౌనం తరవాత అన్నాను "అయాం సారీ జీవనీ..."

"ఎందుకాంటీ?" ఎదురు ప్రశ్నించింది జీవని తన చేతివేళ్ల వైపు పరిశీలనగా చూసుకుంటూ.

ఏం చెప్పాలో తోచనట్లు అయోమయంగా చూశాను.

"నీ ఉద్యోగం పోయిందిగా... అందుకనీ..." నీళ్ళు నమిలాను.

జీవని ముఖంలో కానీ స్వరంలో కానీ ఏ మార్పూలేకుండా అతి మామూలుగా "జీవితం అన్నాక ఈ ఒడిదుడుకులు మామూలేగా" అంది.

ఆమె నిబ్బరం చూసి నాకాశ్చర్యం కలిగింది.

"వన్స్ అగైన్,. అయామ్ సారీ జీవనీ.

తరుణ్ చేసినపనికి సిగ్గుపడుతున్నాను" అన్నాను అవనతవదనంతో.

జీవని అదోలా నవ్వుతూ "మధ్యలో మీరు సిగ్గుపడటం దేనికాంటీ, ఇందులో మీ తప్పేం ఉంది. అయినా తరుణ్ ఇప్పుడేమంత నేరం చేశాడనీ" అంది.

"జీవనీ" నిర్ఘాంతపోయాను. ఆమె మాటలకి.

నాపక్కనుండి లేచివెళ్ళి కిటికీలోంచి బయటకు చూస్తూ అంది జీవని "అవునాంటీ, తరుణ్ నాపట్ల ప్రవర్తించిన విధానాన్ని నేను తప్పుపట్టదలుచుకోలేదు. అతడి అభిప్రాయాలతడిని. వాటిని స్వేచ్ఛగా వెల్లడించే హక్కు అతడికుంది".

ఆమె మాటల్లో ఎంతో పరిణితి కనబడుతోంది.

"నీకు తరుణ్ మీద కోపంగా లేదూ?" కన్నార్పకుండా జీవని ముఖంలోకే చూస్తూ అడిగాను.

"కోపమా... ఎందుకాంటీ?" జీవని వదనంలో చిరునవ్వు చెక్కుచెదరలేదు.

'వాడింత దగా చేసినందుకు. నీ మనసు తోటీ జీవితంతోటీ ఆటలాడుతున్నందుకు"

ఎందుకో చెప్పలేని ఆవేశం కలిగింది. జీవని పెదవులమీద చల్లని చిరునవ్వు కదలాడింది.

"లేదాంటీ. తను దగా చేశాడని నేననుకోవడంలేదు. అతను చేసిన ఈ పనివలన నాకు మేలే జరిగింది" అంది నిబ్బరంగా .

"అదెలాగమ్మా, పీటలవరకు వచ్చిన పెళ్లి ఆగిపోయినందుకు నీకు బాధనిపించడం లేదూ" విస్మయంగా అగిగాను.

"మీరన్నది నిజమే ఆంటీ. మొదట్లో నేను కూడా ఒక రెండుమూడు రోజులు అదే తలచుకుంటూ బాధపడ్డాను. కానీ ఆలోచించి చూస్తే అదీ నా మంచికే జరిగిందనిపించింది. ఇలా జరగడం వలన జీవితమంటే పూలబాటకాదనీ ఎన్నో రకాల అనుభవాలనే ముళ్ళూ కంకరరాళ్ళూ ఆ దారిలో అడ్డుతగులుతూ మనని ముందుకు  పోకుండా అటకాయిస్తాయనీ బోధపడింది.

ఇదే మా ఇద్దరికీ పెళ్ళయ్యాక అతని మనస్తత్వం తెలిసిందనుకోండి... అనుక్షణం కుమిలిపోయే నా మనసుని బుజ్జగించలేక చిత్రహింస పడవలసివచ్చేది. అలాకాకుండా పెళ్ళికి ముందే తరుణ్ మనస్తత్వం తెలియడం వలన నాకు ఎంతో మనశ్శాంతిగా ఉంది. ఈ సంఘటన వలన బతుకులో ఎన్నో పార్శ్వాలుంటాయనీ వాటిని స్పృశిస్తూ ముందుకుపోవడమే మనిషి కర్తవ్యమనీ నాకు అర్థమైంది" సుదీర్ఘంగా చెప్పుకొచ్చింది జీవని.

దిమ్మెరపోయాను. నిజంగా జీవని ఆలోచనా దృక్పథం ఎందరికో స్ఫూర్తిదాయకం. జీవితంలోఎదురైన ఆటుపోట్లను ధైర్యంగా తట్టుకొని నిలబడగలిగిన సామర్థ్యం సొంతం కావడం ఎంత గొప్ప విషయం ప్రేమతో విఫలమయ్యామనో పరీక్షల్లో ఫెయిలయ్యామనో ఆత్మహత్యలు చేసుకొనే చాలామంది యువతీయువకులకి జీవని ఒక ఆదర్శం కావాలి. మనిషిని... అందునా ఒక స్త్రీని ఉన్నత స్థానంలోకి అదిరోహింపచేసేది పాజిటివ్ థింకింగ్ మాత్రమే జీవనయానంతో అడ్డుతగిలే అనేకానేక ఆటంకాలను తప్పించుకుంటూ ముందుకు సాగగలిగితే అందమైన జీవితం సాక్షాత్కరిస్తుంది. అందుకు ఆశావహ దృక్పథం చాలా అవసరం.

"యు ఆర్ వెరీ గ్రేట్ జీవని. ఆడపిల్లలు అందరూ నీలా ఆలోచించగలిగితే ఈ లోకంలో బలవంతపు ఆత్మహత్యలుండవు. డిప్రెషన్‌తో కుంగిపోయి బతుకును భారంగా వెళ్ళదీయడాలుండవు" మనస్ఫూర్తిగా అభినందించాను.

"ఎందుకండీ ఇవన్నీ..." ఆమె చేతిలోంచి టీ కప్పు అందుకుంటూనే అన్నాను. మొహమాటంగా.

"భలేవారే. కాసిన్ని టీనీళ్ళు పోసినంత. మాత్రాన అరిగిపోతామా శ్యామలలో ఇందాకటి కోపఛాయలు లేవు.

"ఉద్యోగం పోయిందిగా... ఇప్పుడేం చేయాలనుకుంటున్నావు? దేనికైనా అప్లై చేశావా?" అడిగాను టీ తాగడం ముగించి.

"ఇంకా ఏమీ ఆలోచించుకోలేదాంటీ. ఈ సారి మాత్రం ఆచితూచి అడుగువేయాలని నిశ్చయించుకున్నాను. ఏదన్నా కాలేజీలో ఫాకల్టీగా చేరుదామని ఉంది. కానీ అకడమిక్ ఇయర్ మధ్యలో ఉందికదా... వెంటనే సాధ్యంకాదు. రెండుమూడు కాలేజీలకి రెజ్యూమె పంపించాను. అంతదాకా ఖాళీగా ఉండటం దేనికని.... నాకొచ్చిన ఈ వర్క్‌ని ఉపయోగించుకుంటున్నాను" నవ్వింది జీవని.

"ఇంత చదువు చదువుకుని ఇలా చీరలపై వర్క్ చేసుకుంటూ సమయాన్ని గడపాల్సి రావడం... బాధగా లేదూ?" జీవని ముఖంలో భావాలేమన్నా మారుతాయేమోనని చూశాను ఆసక్తిగా.

ఆమె మోములో అదే దరహాసం... వెన్నెల వెలుగులా.

"ఏం ఆంటీ... ఇది మాత్రం పని కాదా?

అప్పుడంటే ఈ సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలొచ్చాయిగానీ మునుపటి రోజుల్లో ఆడపిల్లలు బతకడం మానేశారా. డిగ్నిటీ ఆఫ్ లేబర్ అంటే మీకూ తెలుసు. నీతిగా నిజాయితీగా ఏ పనిచేసినా అది నాకు ఆనందాన్నిస్తుంది. ఇప్పటి ఉద్యోగాల వలన వచ్చే సుఖాలూ సరదాలూ ఎక్కువే కావచ్చు. కానీ మనిషి తృప్తిగా జీవించడానికి కనీసావసరాలు తీరితేచాలని నా అభిప్రాయం. ఒకవేళ ఉద్యోగం పోకుండా ఉంటే నువ్విన్ని కబుర్లు చెప్పేదానివా... అని మీరడగచ్చు. కానీ ఎప్పుడైనా నా భావన

ఇదే. ఇదేమాట తరుణ్‌తో కూడా చాలాసార్లు చెప్పాను. బహుశా అందుకేనేమో ఉద్యోగం ఊడిపోగానే నాకు ఉద్వాసన పలికాడు”

నిక్కచ్చిగా ఉన్నాయి జీవని మాటలు.

నేను మరి మాట్లాడలేకపోయాను. జీవని మాటలు అక్షరసత్యాలు. జీవనిని కాదన్న తరుణ్‌కి అంతకన్నా చదువుకున్న, అందమైన గొప్ప ఉద్యోగం ఉన్న అమ్మాయి భార్యగా రావచ్చు. కానీ వాళ్ళెవరూ కూడా జీవనితో సమానం కాలేరు. ఆణిముత్యంలాంటి జీవనిని జారవిడుచుకున్న తరుణ్ నిజంగా చాలా దురదృష్టవంతుడు... మనసు మూలిగింది బాధగా.

“వస్తానమ్మా జీవనీ. నీ వే ఆఫ్ థింకింగ్ చాలా బాగుంది. జీవితాంతం ఇలాగే గడచిపోవాలని ఆ భగవంతుడిని కోరుకుంటున్నాను. ఆల్ ద బెస్ట్” అంటూ ఆమె చేయిపట్టి మృదువుగా నొక్కి వదిలాను.

జీవని వదనంలో శతకోటి పున్నముల కాంతులు.

“థాంక్‌యూ ఆంటీ, మీలాంటి శ్రేయోభిలాషుల ప్రోత్సాహమే నాలో కొత్త ఊపిరి నింపుతోంది” రెండు చేతులూ జోడించింది జీవని అందంగా నవ్వుతూ.

# ధరణి

**-కొండవీటి సత్యవతి**

**ఎం**తో ఆశతో ఇంటిముందు రిక్షా దిగిన ధరణి తలుపులు తాళంవేసి వుండటం చూసి వుసూరుమంటూ పర్సులో నుంచి తాళం చెవులు తీసి తలుపులు తెరిచి లోపలికి అడుగుపెట్టింది.

మునిమాపు వేళ కావడంతో లోపలంతా చీకటిగా ఉంది.

చేతిలో వున్న పేకెట్‌ను చీకట్లోనే టేబులు కోసం తడిమి దానిమీద పడేసి దగ్గరే వున్న గోద్రేజ్ కుర్చీలో కూర్చుండిపోయింది ధరణి.

కనీసం స్విచ్ నొక్కి దీపం వేద్దామని కూడా అనిపించలేదామెకు.

మూడు నెలలనుంచి ఈ రోజు కోసం ఓవర్‌టైమ్ వర్క్ చేస్తోంది. రోజూ ఆలస్యంగా వస్తున్నందుకు ఏవేవో కారణాలు చెప్తూ వచ్చింది కూతుళ్లకు.

తీరా ఈ రోజు ఆ డబ్బు తీసుకుని పల్లవి సరదాపడి కోరుకున్న చుడీదార్ కొనుక్కుని వచ్చింది.

ఆ రోజు షాపులో ఆ పింక్ కలర్ మీద జరీ పనిచేసిన చుడీదార్ చూడగానే పల్లవి కళ్లలో కనబడిన మెరుపు ధరణి మర్చిపోలేదు.

అందుకే దాని ఖరీదు అడిగి వెనక్కి వచ్చేసిన క్షణంలో నిశ్చయించుకుంది ఎలాగైనా పల్లవి కోరిక తీర్చాలని.

ఈ రోజు తను తెచ్చిన బహుమతి చూసి కూతురు మురిసిపోతుంటే చూడాలని ఎంత ముచ్చటపడింది.

చిన్నగా నిట్టూర్చి, అలసటగా లేచి లైటు వేసింది ధరణి.

టేబులు మీద వున్న చిన్న ఫ్లవర్‌వాజ్ కింద కాగితం మడతపెట్టి కనిపించింది. నిరాసక్తంగా తీసి చదివింది.

అమ్మా! సాయంత్రం డాడీ ఫోన్ చేసి పక్కింటికి పిలిపించి చెప్పారు. నా బర్త్‌డేకని సీవ్యూలో టేబుల్ బుక్ చేసార్ట. నీలిమ, నేను వెళ్తున్నాం. మా కోసం చూడకుండా భోజనం చేసెయ్.

నీ పల్లవి.

సివ్యూలో సాయంత్రం గడపడానికి టేబుల్ రిజర్వు చేయడానికి నాలుగువేలు అవుతుందని పిల్లలకు తెల్సు.

అంటే తన నెల జీతంలో సగం. అందులో కొంత ఇంటి అద్దెకు పోగా మిగిలిన డబ్బుతో తాము ముగ్గురు బ్రతకడానికి ఎంత అవస్థపడుతున్నా తన స్వశక్తితో కష్టార్జితంతో వాళ్ళిద్దర్నీ పోషిస్తున్నానన్న తృప్తితో బ్రతుకుతోంది. వాళ్లకోసం తను ఎంతైనా కష్టపడుతుంది. కానీ వాళ్లకు కావలసింది ఇవ్వగలుగుతుందా?

ఆలోచనల నుంచి బలవంతంగా బయటపడి వంటింట్లోకి నడిచింది ధరణి.

లైటు వేసుకుని, బిందెలోనుంచి గ్లాసుతో నీరు తీసుకొని గటగట త్రాగేసి, ఆ కొన్ని మిగిలిన నీటి చుక్కలతో ముఖం తడుపుకుంది.

అప్పుడు చూసింది. ప్రొద్దున వండి పెట్టిన పాయసం గిన్నెలో అలాగే ఉంది. గిన్నెనిండా ఎఱ్ఱచీమలు పట్టేయి.

అదేపనిగా చెప్పివెళ్ళింది. పల్లవికి ఇష్టమని క్షీరాన్నం వండిపెట్టాననీ, తొందరగా భోజనం చేయమని.

అన్నం తినాలనిపించలేదన్నమాట అక్కచెల్లెళ్లకి. కనీసం తనమాటకోసమైనా కాస్త పాయసం తాగలేకపోయారా? ధరణి మనసులో కోపం రగులుతోంది. నిస్సహాయస్థితిలో కలిగే కోపం అది.

రంజిత్ ఎందుకిలా చేస్తున్నాడు? తను అతని నుంచి విడాకులు కోరుకుందే తప్ప అతని డబ్బు ఒక్క పైసా కూడా ఆశించలేదు.

తన పిల్లలిద్దర్నీ తనకు వదిలేస్తే అతని జోలికి రానని మాట ఇచ్చింది. అవుటాఫ్ కోర్ట్ సెటిల్‌మెంట్ తమది. ఆఖరి క్షణందాకా తన మనసు మార్చాలని ఎంతో ప్రయత్నించాడు రంజిత్.

ప్రియాతో అతని సంబంధంవలన తనకెలాంటి నష్టమూ వుండదని నచ్చచెప్పాలని చూశాడు.

నష్టం! అతని భార్యగా తన హోదాలో మార్పు వుండదు. అతనితో పార్టీలకూ, మీటింగులకు వెళ్ళే హక్కు తనదే... ఆస్థి, ఐశ్వర్యం అన్నీ తనవే... ప్రియాతో అతను అప్పుడప్పుడు గడిపినంతమాత్రాన తనకు నష్టమేమిటని అడిగాడు రంజిత్.

తను ఎంతో ఇష్టపడి, ప్రేమించి, అందర్నీ ఎదిరించి పెళ్ళిచేసుకున్న రంజిత్ అలా అడుగుతుటే స్తంభం మీద చెక్కిన రాతిబొమ్మలా చేష్టలు దక్కి నిలబడి పోయింది.

అతన్ని ఏం కోరి పెళ్ళాడింది? హోదానా? అంతస్థునా? కాదే... రంజిత్ మనసు తనదనుకుంది. ప్రేమకు హక్కుదారిణిననుకుంది.

అతను ప్రియాను ప్రేమించటం లేదుట ఆమె వయారం, హొయలు అతనికి కావాలిట. ఆ మాటలు చెప్తూనే తనని దగ్గరకు తీసుకున్నాడు. నన్ను నమ్ము ధరణీ... నా ప్రేమ, నా మనసు నీవే అంటూ.

అసహ్యంతో ధరణి ఒళ్ళు జలదరించింది.

అతని స్పర్శ నిప్పులా కాల్చింది. జవాబు చెప్పాలని కూడా అనిపించక గదిలోకి వెళ్ళి తలుపు వేసుకుంది.

తన జీవితాన్ని గురించి ఒక నిర్ణయం తీసుకోవడానికి నెల్లాళ్ళు పట్టింది.

ఈ నెలరోజులూ తామిద్దరి మధ్యనా ఏమీ జరగనట్టే ప్రవర్తించాడు రంజిత్.

పిల్లల ముందు బయట పడటం ఇష్టంలేక తన పడక మరొక గదిలోకి మార్చలేదుగానీ రంజిత్ సామీప్యాన్ని కూడా సహించలేక అదే గదిలో నేలమీద పడుకోవడం ప్రారంభించింది ధరణి.

వారం రోజులు ఓపికగా భరించాడు రంజిత్.

తరువాత ఒక రోజు బలవంతంగా దగ్గరకు తీసుకోబోయాడు.

ప్లీజ్ రంజిత్... నా మనసు వ్యతిరేకించే నీ స్పర్శను భరించడం నా వల్ల కాదు.

ట్రై టు అండర్ స్టాండ్... సహనం కొనితెచ్చుకుంటూ అంది ధరణి.

రంజిత్ పురుషాహంకారం లావాలా ఎగిసి వచ్చింది. అంతవరకు తెచ్చిపెట్టుకున్న ఓర్పు మర్యాద గాలిలో కలిసిపోయేయి.

"డామిట్... నీ గురించి నువ్వే మనుకుంటున్నావు? పెద్ద అందగత్తెవా? డబ్బున్న దానివా ? కోరి పెళ్ళి చేసుకున్నదానివి... నిన్ను నడివీధిలో నిలబెట్టడం ఇష్టంలేక మంచిగా నచ్చచెప్పాలని చూస్తే మిడిసి పడుతున్నావ్.... ప్రియాను తెచ్చి ఇంట్లోనే పెట్టుకుంటాను. నువ్వు ఏమి చేయగలవు? సంసారం వద్దని తెగతెంపులు చేసుకొని పోతావా? వెళ్ళి ఎలా బ్రతుకుతావు నీ బోడి డిగ్రీకి ఎవడిస్తాడు ఉద్యోగం? మొగుడిని వదలివచ్చిన ఆడదాని బ్రతుకేమిటో తెలుసా నీకు! ధరణి భుజాలు పట్టుకొని ఆవేశంగా కుదుపుతూ దాదాపు అరిచినట్టుగా అన్నాడు రంజిత్.

"రంజిత్... ప్లీజ్ స్టాపిట్" నువ్వేం మాట్లాడుతున్నావో తెలుస్తోందా? ధరణి దుఃఖాన్ని రోషాన్ని అణుచుకుంటూ వణికే గొంతుతో అంది.

"తెలిసే మాట్లాడుతున్నాను. నువ్వేమిటో స్వర్గం నుంచి దిగి వచ్చినట్టు అనుకుంటున్నావులా వుంది. నా ఇష్టప్రకారం నాకు అనుకూలంగా వుంటే వుండు లేకపోతే... ఫో! రంజిత్ ఆమెను విసురుగా మంచం మీదకి త్రోసేసి బయటకు వెళ్ళిపోయారు.

మళ్లీ వారందాకా ఇద్దరూ అపరిచితుల్లా గడిపారు.

ధరణికి దగ్గరకావాలని మరో ప్రయత్నం చేశాడు రంజిత్.

"నీకున్న డబ్బు, అంతస్థు నాకు లేకపోవచ్చు రంజిత్. కానీ నేను మనిషిని. నాకూ మానాభిమానాలు, ఆత్మగౌరవం వున్నాయి. నీ స్పర్శ నాకసహ్యం కలిగిస్తోంది. నీ తోడు లేకపోతే బ్రతకలేనని భయపడి మనసులేని శరీరాన్ని నీకర్పిస్తూ జీవచ్ఛవంలా బ్రతకడం కన్నా ఒంటరిగా ప్రపంచాన్ని ఎదుర్కొని చావో బ్రతుకో తేల్చుకోవడానికే నిర్ణయించుకున్నాను...." స్థిరంగా దృఢంగా పలికింది ధరణి.

హేళనగా నవ్వి బయటకు వెళ్ళిపోయాడు రంజిత్.

ఆరోజు సాయంత్రమే తన స్నేహితురాలు రాజీవి ఇంటికి వెళ్ళింది ధరణి.

"నువ్వు కాస్త నిదానంగా ఆలోచించవలసింది ధరణీ" అంది తనే మళ్ళీ.

ధరణి విషాదంగా నవ్వింది.

"పిచ్చి రాజీ.... నీ పిల్లలకోసం నువ్వు ఆత్మాభిమానం చంపుకొని నీ ఆయనతో రాజీ పడ్డావు. ఏమయ్యింది? నీ కొడుకు తలెత్తుకుని ధీమాగా బ్రతికేస్తున్నాడా. కానీ నీ కూతురి సంగతేమిటి? మీ ఆయన ఇంకో స్త్రీతో కాపురం పెట్టినా పిల్లలకోసం అవమానం ఆవేదన దిగిమింగి కాపురం సాగించావు. నీ అల్లుడు కూడా మామగారి అడుగుజాడల్లో నడిచి నీ కూతురికి సవతిని తెచ్చిపెట్టాడు. మీ నాన్న చేసిన పనే నేను చేస్తే తప్పేందుకైందన్నాడు. మీ అమ్మలాగే నువ్వూ నోరుమూసుకుని వుండు అన్నాడు అంతేనా?"

రాజీవి మౌనంగా తలవంచుకుంది.

"నిజమే.. కానీ నీ పిల్లల భవిష్యత్తు ఏమవుతుందని ఆలోచించావా? అంత డబ్బు, హోదా వున్న తండ్రి బిడ్డలుగా వాళ్లకు ఎంతో గొప్ప భవిష్యత్తు దొరుకుతుంది? నువ్వేమివ్వగలవు వాళ్లకు?" కాసేపటి తర్వాత అడిగింది రాజీవి.

"తలెత్తుకుని ధీమాగా బ్రతికే ఆత్మాభిమానాన్ని ఇస్తాను. ఆత్మవిశ్వాసాన్ని కలిగిస్తాను. మంచి చదువునూ, సంస్కారాన్ని ఇస్తాను. డబ్బుకంటే' విలాసవంతమైన జీవితం కంటే ఇవి విలువైనవి కావా రాజీ?" ఉద్వేగంగా అడిగింది ధరణి.

రాజీవి బదులు చెప్పలేదు. నవ్వి ఊరుకుంది.

రాజీవి నవ్వులో ఎంతో అర్ధముందని ఇన్నేళ్ళ తర్వాత ఈ రోజు అనిపించింది ధరణికి.

పల్లవి, నీలిమ వారం వారం తండ్రి దగ్గరకి వెళ్తారు.

ఆ రోజు కోసం ఎంతో ఆతృతగా ఎదురుచూస్తారు. చల్లగా మెత్తగా సాగిపోయే ఎయిర్ కండిషన్డ్ కారులో వెళ్ళి ఏ స్టార్ హోటల్‌లోనో భోజనం చేసి, థియేటరులో సినిమా చూసి తండ్రితో కులాసాగా గడిపి వెలిగిపోతున్న ముఖాలతో తిరిగి వస్తారు.

వాళ్లిద్దరూ లేని ఆరోజుకు ముప్పై ఆరు గంటలున్నట్లు అనిపిస్తుంది ధరణికి.

ఆఫీసులో వున్నప్పుడు అన్యమనస్కంగానూ ఇంట్లో ఉన్న సమయంలో దిగులుగానూ గడిపి వాళ్ళు వచ్చే ఘడియకోసం నిమిషాలు లెక్కపెడుతూ ఎదురుచూస్తుంది.

ఈ రోజు అలాగే ఎదురు చూస్తోంది ధరణి. రాత్రి పదిగంటలవుతుండగా బయట కారు ఆగిన శబ్దమైంది.

బయటకు వెళ్ళి పిల్లలను అక్కున చేర్చుకోవాలని మనసు లాగుతున్నా రంజిత్‌ను ముఖాముఖి కలుసుకోవడం ఇష్టం లేక లోపలే వుండిపోయింది ధరణి.

అయిదు నిమిషాల తర్వాత పల్లవి, నీలిమ లోపలికొచ్చారు.

హాల్లో టేబులు పక్కన కూర్చీలో కూర్చుని వున్న తల్లిని చూడగానే ఇద్దరూ ఒకర్నొకరు చూసుకున్నారు.

నీలిమ భుజాలు ఎగరేసి పట్టనట్టుగా లోపలికి వెళ్ళిపోయింది.

పల్లవి ఒక్కక్షణం ఆగి తల్లిముందుకు వచ్చి నిలబడి "మమ్మీ ఈ డ్రస్ బాగుందా? డాడీ ప్రెజంట్ చేశారు" అంది.

అప్పుడు చూసింది ధరణి... పల్లవి పింక్ కలర్ కొత్త చుడీదార్‌లో మెరిసిపోతోంది. డ్రెస్ మీద కుట్టిన ముత్యాలమీద దీపం కాంతి పడి మెరుస్తోంది.

"ఎంత లేదన్నా రెండువేలపైనే ఉంటుంది ఆ డ్రెస్ ఖరీదు' అనుకుంటూ నిట్టూర్చింది మనసులోనే.

'గుడ్‌నైట్ మమ్మీ' అంటూ గదిలోకి వెళ్ళిపోయింది పల్లవి.

'అమ్మా అన్నం తిన్నావా?' అని అడగకపోతేమానె తామిద్దరు ఏమి తిన్నారో ఏం చేశారో చెప్పొచ్చుగా... నిర్వేదంగా నిట్టూర్చింది ధరణి.

కాసేపటిలో పక్కగదిలో లైటు ఆరిపోయింది. ధరణి కూడ లైటు ఆర్పి హాల్లోనే నడుము వాల్చింది.

అమ్మ నిద్రపోయిందనుకున్న అక్కాచెల్లెళ్ళు నెమ్మదిగా కబుర్లు చెప్పుకుంటున్నారు.

'నెక్ట్స్ ఇయర్ నేను డాడీ దగ్గరకు వెళ్ళిపోతాను హాయిగా' అబ్బ ఈ ఇరుకు ఇంట్లో ఏం కావాలన్నా డబ్బుకోసం వెదుక్కుంటూ బ్రతికే లైఫ్ విసుగొచ్చేసింది. డాడీ అయిదు లక్షలైనా డొనేషన్ కట్టి నన్ను మెడిసిన్‌లో చేర్పిస్తానన్నారు.

ఎక్సైటెడ్‌గా అంది పల్లవి.

"నీకేం... లక్కీ... నేనింకో సంవత్సరం ఇక్కడే పడివుండాలి. ఏ సరదా తీర్చదు. సరికదా మమ్మీ లెక్చర్లు వినలేక బోరు కొడుతుంది. చదువుకో... నీ కాళ్లమీద నిలబడు అంటూ ఏవో చెబుతుంది. డాడీకి అన్ని లక్షలు వుండగా మనకేం

ఖర్మ చదువుకుని ఉద్యోగం చెయ్యడానికి? మమ్మీ చాలా విచిత్రమైన వ్యక్తి" విసుగ్గా అంటోంది నీలిమ.

తను ఎంతో కష్టపడి అపురూపంగా తీర్చిదిద్దుకున్న బొమ్మమీద సిరా మరకలుపడి అలుక్కుపోయినట్టు, తనకు ప్రియమైన పూలను ఎవరో క్రూరంగా రేకులు పీకి నలిపివేస్తున్నట్టు ధరణి మనసులో బాధ సుడులు తిరిగింది.

చప్పుడు చేయకుండా కంటి నుంచి జారిన కన్నీరు ఆమె బుగ్గల్ని జాలిగా తడిమి ఓదార్చింది.

ఇంతకాలం పిల్లల గురించి తప్ప తన గురించి ఆలోచించలేదు.... పంజరంలో పక్షుల్లా స్వేచ్ఛకోసం ఎదురుచూస్తున్న ఈ పిల్లల్ని తన సర్వస్వం అనుకుంది. ఎవ్వరూ లేని ఈ శూన్య జీవితం తనకెందుకు? ఆవేశంగా లేచి అల్మారాలో వున్న నిద్రమాత్రల సీసా తీసుకుంది ధరణి.

ఎక్కడినుంచో రంజిత్ నవ్వు వినిపిస్తోంది. హేళనగా, ఎగతాళిగా... "మొగుడిని వదిలి వీధిపడిన ఆడది బ్రతకడం సులభం కాదు. నీవాళ్లు అనుకుంటున్న నా కూతుళ్ళు నా డబ్బుకోసం నన్ను వెదుక్కుంటూ వచ్చిన రోజున నువ్వేమవుతావ్?"

స్పృహలోకి వచ్చినదానిలా తల విదిలించింది ధరణి.

"నో రంజిత్! నీ డబ్బుతో పిల్లల అమాయకమైన మనసులని మళ్లించగలిగావు కానీ నా అభిమానాన్ని కొనలేవు... నా కోసం నేను బ్రతుకుతాను. ఆడదాన్ని కుర్చీగానో కాలి పట్టాగానో చూసే మగవాడి అండదండలు లేకపోయినా స్త్రీ బ్రతకగలదనీ, ధీమాగా ధైర్యంగా జీవించగలదనీ చూపిస్తాను రంజిత్. పిల్లల మీద ప్రేమ, మమకారం నన్ను బంధించే సంకెళ్ళు కావు. ఆడది అంటే ఒకరి కూతురు, మరొకరి భార్య, వేరొకరి తల్లి మాత్రమే కాదు రంజిత్... వీటన్నిటికన్నా ముందు ఆమె మనసున్న మనిషి... ఆత్మాభిమానమున్న మానవతి అని నీలాంటి వాళ్లకు నిరూపిస్తాను...." స్థిరంగా అనుకుంటూ నిద్రమాత్రల సీసాను దూరంగా పెట్టేసి పడుకుంది ధరణి.

**(ఉగాది పోటీలో తృతీయ బహుమతి పొందిన కథ, ఆంధ్రభూమి – 24 మార్చి, 2007)**

# కథా కౌముది

-శైలజామిత్ర

**మం**చు కమ్మిన ఆకాశం... ఎంతగా రగ్గులు కప్పుకుంటున్నా వీడని చలి... గడగడలాడుతున్న గుండె, ఒక చేతిలో సెగలు కక్కుతున్న కాఫీ... మరో చేతిలో అన్నయ్య ఖాళీ చేసిన కాఫీ కప్పు, ఎదురుగా తోడబుట్టిన అక్క చెల్లెళ్ళు... ఆ పక్కనే విషయమేమిటో అర్థంకాని పసిపిల్లలుతో వాతావరణం బయట చల్లగా ఉన్నా, లోలోపల మాత్రం వేడిగానే ఉంది. మనుషులకు నీ, నా భేదాలున్నాయేమో కానీ వాతావరణానికి లేదు. గాలి వీచినా, ఎండకాసినా, వర్షం పడినా ఏదయినా అందరికీ సమానంగా పంచుతుంది. ఇందుకు కుల మత భేదాలుండవు. ధనిక, పేద, తారతమ్యాలుండవు. అందుకేనేమో తెరచిన కిటికీ గుండా చలిగాలి రివ్వున ఇల్లంతా విస్తరిస్తోంది.

ఎదురుగా అందరూ ఉన్నా, ఎవరికీ అర్థంకాని నిశ్శబ్దం అక్కడ తాండవిస్తోంది. అందరూ వంటినిండా ఏదో ఒకటి కప్పుకుని చలిని చాలా వరకు తమకు దూరంగా ఉంచాలని ప్రయత్నిస్తున్నారు. దూరంగా అలాంటి ప్రయోగం ఏమీ చేయకుండా ఎంతటి చలి అయినా తాను ఇప్పుడున్న పరిస్థితుల్ని మించి కాదు కదా అనిపించేలా ఒంటరిగా ఆలోచిస్తూ, నిద్రపట్టకపోయినా నిద్ర నటిస్తూ, కంటిపై చెయ్యివేసుకుని దీర్ఘంగా ఆలోచిస్తుందా అనికూడా తెలియకుండా మౌనంగా పడుకున్నాను నేను. ఎదురుగా నిన్నటిదాకా మాతో నవ్వుతూ పలకరిస్తున్న అమ్మ నేడు గోడపై నిర్జీవంగా... నా పని నేను చేసాను ఇక మీ జీవితాలు మీ ఇష్టం అనిపించేలా... అందిరినీ వదిలేసి తన బాధ్యతలు తీరిపోయాయన్నంత ధీమాతో కనిపిస్తోంది.

ఎలా లాగనీ జీవితాన్ని? ఎలాగోలాగ లాగటం సమస్యకాదు. తిండికి, బట్టకు, ఉండటానికి లోటనికాదు. కన్నపిల్లలు, కట్టుకున్నవాడు లేరని కాదు. అన్నదమ్ములు ఆదరించరని కాదు. అక్క చెల్లెలు పలకరించరనికాదు. అమ్మ చూపినంత

స్వచ్ఛమయిన ఆత్మీయత చూపే వారు ఇక ఉండరని. తాను అమ్మగా తన స్థానాన్ని అర్థం చేసుకునేంతగా ఎవ్వరూ చెప్పేవారుండరని... ఇందరున్నా తాను పడుతున్న మానసిక ఆవేదనను తెలుసుకుని ఓదార్చే వారుండరని మాత్రమే....

ఎవరెవరో వస్తున్నారు. కొందరు ప్రేమతో పలకరిస్తే... మరికొందరు తప్పనిసరిగా పలకరించి వెళుతున్నారు. తప్పదు. ఇపుడు ఇక మిగిలేది ఇలాంటి ప్రవర్తనలే... అమ్మద్వారా మాకేమి వచ్చిందోనని ఆరా తీసేవారే... ఒక వేళ ఏదయినా గొడవలాంటిది జరిగితే అదంతా విని ఇంటింటికి మోసుకెళ్లి, కొన్నాళ్ళు కాలక్షేపం చేద్దామనుకునేవారే. అంతా కలిసి నిజమైన నాటకాన్ని చూపిస్తున్నారు.

ఇంతలో "అమ్మా... ఈ కాఫీ తాగమ్మా" అంటూ తన చిన్న చేతులతో తట్టి పలకరిస్తున్న నా కూతురు స్పర్శ ద్వారా ఏదో ఊరట. ఇక నువ్వలా ఉండిపోతే తగదు. లే... నీకు పిల్లలున్నారు వారి బాధ్యత నీ మీదుంది అంటూ అమ్మ హెచ్చరిస్తున్నట్లే ఉంది.

"ఇకలే ప్రతిమా.... అలా ఎన్నిరోజులని తిండి నిద్రలేకుండా అలా ఉంటావు. తెలియనిదేముంది? దాదాపు మూడేళ్ళనుండి అత్తయ్యగారు జబ్బుతో మంచాన పడి ఏమాత్రం సుఖపడ్డారో నీకు తెలుసుగా.... నిజమే... బాధగానే ఉంటుంది. కానీ.. తప్పదు.. అందరూ ఎప్పుడో ఒకపుడు పోయినా మిగిలిన వాళ్ళు వాళ్లకోసం బాధపడకపోతే ఇక రక్తసంబంధాలకు అర్థం ఏముంటుందని? అలాగని పిల్లల్ని కంగారు పెట్టేలా ఉంటే వాళ్ళు నిన్ను చూసి బాధపడటం తప్ప ఏం చెయ్యగలరు? లే.. లేచి కాస్త ఎంగిలిపడు... లేమ్మా..." అంది వదిన బాధ్యతగా..

"అమ్మా... అక్కడ వేణ్ణీళ్ళున్నాయి. నువ్వు తీసుకో... నాకేం పర్వాలేదు చన్నీళ్ళయినా..." అంటున్న కొడుకును చూసి నా పరిస్థితిని ఎలా మార్చాలా అని అంతగా ఆలోచిస్తున్నాడా అనిపించక మానదు...

"బామ్మా... నువ్వే చెప్పు... ఇది మా నాన్న కొన్న బొమ్మకదూ" అంటున్నాడు బాబి.

"అదేం లేదు.. మా పెద్దనాన్న నాకోసం తెచ్చారు" అంటుంది చిట్టి.

నాకు నవ్వొచ్చింది బాబిగాడి నాన్న అయినా చిట్టి పెదనాన్న అయినా ఒక్కరే.. అయినా ఒకే మనిషిని రెండు రూపాల్లో తలచుకుంటూ ఈ బొమ్మ నాదంటే నాదని

వాదులాడుకోవడంలో, ఇంత చిన్నతనంలోనే నాది అనే భావం పెంచుకుంటున్న పిల్లల్ని ఏమీ అనలేక ఇద్దరినీ దగ్గరకు తీసుకున్నాను. మీరు నావాళ్లనే భావంతో..

"బామ్మా... మరి నేనేమో చాలా బొమ్మలతో ఆడుకుంటే... మా ఇంటికి వచ్చి అవన్నీ పాడు చేసేస్తుంది చిట్టి అందుకే దాన్ని మా ఇంటికి రానివ్వాలంటేనే నాకు చెడ్డ చిరాకు..." అన్నాడు చిరాగ్గా ముఖం పెట్టి బాబి.

"ఏం లేదు బామ్మా... అన్నీ అబద్ధాలే..." అని చిట్టి మొదలుపెట్టేసరికి నేను కోపంతో "అబ్బ...!!! ఊరుకోండిరా నీ చెల్లెలే కదరా...!!! చిన్నది ఏదయినా తప్పు చేస్తే నువ్వే సరిదిద్దాలి. చక్కగా ఇద్దరూ కలిసి ఉండాలి" అన్నాను పెద్దమనిషి తరహాలో...

ఇక్కడ చెప్పాల్సిన విషయం ఒకటుంది. నిండా నలభై ఏళ్ళుకూడా లేకుండానే నేను బామ్మనవడం నాకెంతో కొత్తగా ఆనందంగా ఉంది. అన్నయ్య మనవలు నా మనవలుగా అలా పిలవడం నాకు మళ్ళీ మళ్లీ అలి పిలిపించుకోవాలని ఉంది. పిల్లలు అలా పిలుస్తూంటే నా బాధ్యత మరింతగా పెరిగినట్లుగా ఉంది. ఎందుకో నాకు మొదటి నుండి పిల్లలతో కాలక్షేపం అంటే తగని సరదా... వాళ్ళతో కాస్సేపు మాట్లాడినా, మొక్కలలో కాస్సేపు కూర్చున్నా, నాకెంతో రిలీఫ్‌గా ఉంటుంది.

ఇంతలో ఏదో పనిమీద కాబోలు పక్కింటి అమ్మాయి పిలుపు... "ఆంటీ" అంటూ అదీ నన్నే అని తెలుసుకున్న తర్వాత మెల్లగా వెళ్లాను.. ఏంటా అనుకుంటూ...

"ఆంటీ... ఒక్కసారి త్వరగా రారా... మా అమ్మకు కడుపులో నొప్పి విపరీతంగా ఉందట. నాకేదో భయంగా ఉందాంటి..." అంది కంగారుగా...

నేను వెంటనే మా వదిన వైపు చూసాను. అసలు ఆ అమ్మాయి నాకంటే మా వదినకే ఎక్కువ పరిచయం ఎందుకంటే అది మా అన్నయ్య ఇల్లు కావడంతో... అయినా వదిన ఏమీ ఎరగనట్లు లోనికి వెళ్లిపోయింది. నేనెందుకో అలా వెళ్ళలేకపోయాను. "పదమ్మా..." అంటూ బయలుదేరేంతలో... " ఇదిగో ప్రతిమా... అత్తయ్య పోయి మూడురోజులు కాలేదు... మైల... అలా మరో ఇంటికి వెళ్ళకూడదు..." అన్న మరో వదిన మాటలు వినిపించినా... నేనెందుకో ఆ మాటలకు పెద్దగా విలువ ఇవ్వలేదు... నాకు తోచినట్లుగానే వెళ్లిపోయాను... అక్కడ ఆవిడ

పేరు కామాక్షి కాబోలు... అప్పటికే ఎవరో వచ్చి "కామాక్షీ... ఎలా ఉందమ్మా" అంటూ పలకరిస్తున్నారు. నేనూ వాళ్లతోపాటే ఆమె పక్కనే చేరాను... వెంటనే డాక్టరుకు ఫోను చేసాము... అక్కడున్న ఒక జనరల్ ఫిజిషియన్ రావడం," ఇలా ఎప్పటి నుంచీ వస్తోంది. అలా వస్తున్నప్పుడు ఎలాంటి టాబ్లెట్స్ వాడేవారు ఎంత డోసేజ్ వాడేవారు?" లాంటీ రొటీన్ ప్రశ్నలు వేసారు. అతనేదో టాబ్లెట్స్ రాసివ్వడం, ఇందుకు కూడా తగ్గకపోతే బెటర్ హాస్పిటల్‌లో చేర్చండి అని ఉచిత సలహా ఒకటి పడేసి ఫీజు రెండువందలు తీసుకుని తానొచ్చిన పని అయినట్లు వెళ్లిపోవడం జరిగింది.

వాళ్ళు అంటే వారి అమ్మాయి ఉష కూడా ఎంతో కంగారుగా ఆమెని హాస్పటల్‌లో చేర్చారు. నాకు తెలిసి అక్కడ అంతగా మెడికేషన్ జరగదు. అయినా ఆ మాట అని వాళ్లనెందుకు మనం బాధపెట్టాలనే ఉద్ధేశ్యంతో... దాదాపు మా వయస్సున్న కామాక్షిని ఒకసారి పలకరించి నేను సెలవుతీసుకున్నాను.

"ప్రతిమా...! ఏమయిందే...? అడిగింది అక్కయ్య..

"ఏదో కడుపులో నొప్పిట.. పాపం ఎంతో బాధపడుతోంది..." అన్నాను మామూలుగా.

"అపెండిసైటిస్ ఏమో..." అంది అక్క మళ్లీ...

"ఏమో... టెస్టులు అవీ చేస్తున్నారు. అక్కడ వసుంధర, గీతాంటి వాళ్లందరూ ఉన్నారులే... వాళ్లు చూసుకుంటారు.... అందుకే వచ్చేసా... మరీ ఎక్కువమంది ఉంటే తనకేం జరిగిందో అని తానే కంగారు పడుతుంది అన్నాను..." అంతలో ఎక్కడి నుంచీ వచ్చిందో మా వదిన "ఇదిగో ప్రతిమా... నువ్వు అలా వెళ్ళకూడదు. ఈ హడావిడిలో గమనించలేదేమో కానీ, ఆ వసుంధర నిన్ను గమనిస్తే... తల్లిపోయి రెండ్రోజులు కాకుండా మైలతో అందరిల్లూ తిరుగుతోందని ప్రచారం చేస్తుంది. లేకుంటే నేను వెళ్ళలేకనా?" అంది.

"అదేంటి వదినా వాళ్ల అమ్మాయేగా మనల్ని పిల్చింది..." అన్నాను ఆశ్చర్యంగా

"సరేలే... ఉష చిన్నపిల్ల... తనకేం తెలుసు... ఇవతల నేను చెబుతున్నా వినకుండా నువ్వే వెళ్ళావు..." అంది తన మాట వినలేదన్న కోపం ధ్వనించే స్వరంతో... వదిన...

నేను ఆ మాటలేవీ పట్టించుకోకుండా మంచంపై నడుము వాల్చాను... ఇంతలో మళ్ళీ "ఆంటీ..." అంటూ తలుపు చప్పుడు వెళ్ళొద్దన్నా నేను వెళ్ళాను... అది ఇంత రాత్రివేళ... అనుకుంటూ... తలుపు తీసాను.

"ఆంటీ నాకు ఏదో భయంగా ఉందాంటీ... రాత్రిపూట అమ్మతో ఒక్కదాన్ని ఉండలేకపోతున్నాను. నాతోపాటూ మీరు కూడా హాస్పటల్‌లో ఉంటే..." అంటూ ఆగింది.

వెంటనే మా వదిన కల్పించుకుని "చూడమ్మా.. మేము మైలలో ఉన్నాము.. రాకూడదు" అంది ఖచ్చితంగా...

నాకెందుకో కాస్త బాధ అనిపించింది. పాపం..! చిన్నపిల్ల అనిపించింది... నా ఆలోచనను గమనించిందేమో " ఆంటీ.. కాదనకండి... వసుంధర... గీతాంటీలు కూడా రాలేమన్నారు" అంది దీనంగా... ఆమాటతో నా గుండె కలచివేసింది... నేనింకేమీ ఆలోచించకుండా పదమ్మా... అన్నాను... బయలుదేరుతూ...

"ఇదిగో ప్రతిమా.. మీ అన్నయ్య కోప్పడతారు మరి..." అంది కాస్త గట్టిగా వదిన.

"వదినా... ఊరుకో... పాపం... ఎవ్వరూ లేరంటోంది... ఈ సమయంలో ఇవి అవసరమా...?" అంటూ ఆ అమ్మాయి ఆ అమ్మాయి వెంట బయలుదేరాను...

నొప్పి తాలూకు రిపోర్ట్సు వచ్చాయి. వెంటనే కాకున్న ఎప్పటికైనా ఆపరేషన్ చేయాలన్నది వారి విషయం. అది విన్న నేను "ఏమ్మా ఉషా... మీ మామయ్య ఎవరో ఈ ఊరిలో ఉన్నారన్నావు... మరి వాళ్లకేదయినా తెలిపావా?" అడిగాను...

"లేదాంటీ... వాళ్లకు మాకు అసలు మాటల్లేవు..." అంది విచారంగా

"మాటల్లేకుంటే మాత్రం ఇలాంటి సమయంలో కూడా రాకుండా ఉంటారా? ముందు నువ్వైతే ఫోను చెయ్యి" అని ఫోను తీసాను నెంబరు చెప్పు అంటూ...

"వద్దాంటీ... ఇందాకే చేసాను... వీలయితే రేపు వస్తామని చెప్పారు" అంది కాస్తంత దిగులు నిండిన స్వరంతో. పరిస్థితి అర్థమయిన నేను పెద్దగా మాటలు పెంచడం ఇష్టం లేక  "సరేలేమ్మా... నేను ఉన్నాను కదా...!! అన్నాను భుజం చుట్టూ చెయ్యి వేస్తూ...

రాత్రంతా నేనెంత ధైర్యం చెప్పినా ఆ అమ్మాయి హాయిగా నిద్రపోలేకపోయింది. నాకు మాత్రం ఒక పక్క ఆలోచన, ఆవేదన, రెండూ కలగలసినట్టి తెలియని భావమేదో పట్టిలాగుతోంది. రాత్రంతా నిద్రపోకుండా పడుతున్న ఉష ఆవేదన నాకెంతో బాధ కలిగించింది ప్చ్...! ఏం జీవితాలో... అనిపించింది. రాత్రి చాలా సేపయిందేమో... అక్కడున్న మంచంపై అలా వాలగానే.. నాకు, ఉషకు కూడా నిద్రపట్టేసింది. సరిగా రెండు గంటల ప్రాంతంలో "అమ్మా... అమ్మా..." అంటున్న ఉష గొంతు వినబడి ఉలిక్కిపడి నిద్రలేచాను. అక్కడున్న పరిస్థితిని చూసి నాకు కాస్త కంగారు కలిగి చుట్టూ డాక్టర్స్ నర్స్‌లు అందరూ చేరివుండటంతో అయోమయంగా లేచి నిలబడ్డాను. ఆ అమ్మాయికి ఆసరాగా వచ్చి అలా నిద్రపోతున్నందుకు నాలో నేనే సిగ్గుపడ్డాను. కాస్త ముందుకు కదిలి...

"సర్... ఏమయింది సర్... అని అడిగాను... అంతే వాళ్ళు చెప్పిన మాటతో నాకు ఒక్కసారిగా కళ్ళు తిరిగినట్లయింది..." షీ ఈజ్ ఇన్ కొలాప్సింగ్ స్టేజ్" అరె... ఇదేంటి ఇంతలో... నిన్నటిదాకా ఆపరేషన్ చేస్తే బతుకుతుందని చెప్పారే... అదేంటి ఇలా మళ్ళీ వేరే మాట.. అదే మాట నేను అడిగేసాను ఉండబట్టలేక...

"మేడమ్.. మీరు ఆమెకు ఏమవుతారు? అని అడిగాడు... నా దూకుడు చూసి చాలా దగ్గర అనుకున్నాడేమో

"ఏమీ అవను సార్... కాకుంటే మాకు నైబర్స్..." అన్నాను... మెల్లగా...

"ఓహో... అయితే ఇలా రండి..." అంటూ తన రూములోకి తీసుకెళ్ళి "కూర్చోండి" అన్నాడు డాక్టర్. నేను సందిగ్ధంగా కూర్చున్నాను. ఏం చెబుతాదో ఏమో అనుకుంటూ...

"మేడమ్... షీ ఈజ్  ఇన్ క్రిటికల్ కండిషన్.. ఇదే విషయాన్ని రాత్రి ఆ అమ్మాయి వాళ్లకు చెప్పాను... ఆమె కొడుకులతో మాట్లాడాను కానీ..." అంటూ ఆగాడు.

"కానీ ఏంటి సర్... చెప్పండి...!" అన్నాను ధైర్యంగా...

"వాళ్ళు పెద్దగా ఆమెపై ఇంట్రస్ట్ చూపటంలేదు..." అన్నాడు డాక్టర్ అక్కడున్న నాప్‌కిన్‌తో చేతులు తుడుచుకుంటూ... విషయం కాస్త అర్థం అయ్యీ అవ్వని నేను" అంటే ఆమెకు ఆపరేషన్‌కు ఒప్పుకోవడం లేదా?" అన్నాను కాస్త వివరంగా...

"అంటే ఇప్పుడున్న పరిస్థితుల్లో ఆమెకు మెడికల్‌గా ఏమీ చెయ్యకండి... మా దగ్గర అంత స్తోమత లేదని అన్నారు..." మెల్లగా చెప్పాడు డాక్టర్.

"మరి ఆమె...?"

"చెప్పలేము... ఈ రాత్రి గడిస్తేగాని ఏ విషయాన్ని అంచనా వెయ్యలేము" అనేలోగానే... 'డాక్టర్...' అంటూ పెద్దగా అరుపు వినిపించింది... దాంతో నేనూ ఆ అరుపు వచ్చిన గదిలోకి పరుగుతీశాను. ఏది జరగకూడదనుకున్నానో అదే జరిగిపోయింది. కామాక్షమ్మ చనిపోయింది. "ఆంటీ... అమ్మ పోయిందాంటీ..." అంటూ వెక్కి వెక్కి ఏడుస్తున్న ఆ పిల్లను ఎలా ఓదార్చాలో నాకు అర్థంకాలేదు. అమ్మపోయి వారం రోజులు కావడంతో నాకూ అమ్మ గుర్తొచ్చి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. విషయం ఎలా చేరిందో ఏమో... వాళ్ళ వాళ్ళందరూ ఒక్కరొక్కరూ రావడం మొదలు పెట్టారు. నా కెందుకో నేను అక్కడుండటం అనవసరం అనిపించింది. మెల్లగా వాళ్ళతో మాట్లాడుతున్నట్లే మాట్లాడుతూ బయటపట్టాను... భారమైన గుండెతో...

ఇంటికి రాగానే.. ఒక్కసారిగా మూకమ్మడిగా నాపై దాడి జరిపారు... "అసలెందుకు వెళ్ళావు...? నీకేమి అవసరం? అమ్మపోయి వారంకాకుండానే నువ్వెళ్లి మరొకళ్ళకు సాయం చేస్తావా? నీకసలు బాధవుందా? ఎవరైనా ఏమనుకుంటారు? కూతురయి అసలు ఏమాత్రం లేదని ఆడిబోసుకోరా? ఇంతా చేసి ఆమెను కాపాడగలిగావా? పోనే పోయింది. ఆవిడ మామూలుగానే జబ్బు మనిషి, నేనెంత చెబుతున్నా నా మాటకు గౌరవం ఇచ్చావా.. అంతలా పెత్తనాలు చేస్తున్నావు... అందుకే నీ మొగుడు నిన్ను నిత్యం తంతూ వుంటాడు. అంది" అక్కసుతో వదిన... ఇన్ని మాటలు పడినా ఆ మాటను పడలేక "వదినా నా జీవితం నా ఇష్టం... నేను ఎపుడైనా నీ ఇంటికి వచ్చి నా మొగుడు కొడుతున్నాడనో, తిడుతున్నాడనో నీకు చెప్పి బాధపడ్డానా? ఎందుకు అనవసరంగా నోరు పారేసుకుంటావు? ఆ అమ్మాయి ఎంతో కష్టంతో వస్తే మనం చేసే సహాయం అంతమాత్రం కూడా లేకుండా ఏం బావుంటుంది?" అంటూ అక్కడి నుంచీ లోపలికి వెళ్ళిపోయాను.

ఆ తర్వాత తలో ఒకరు తలో రీతిలో తిట్టుకున్నారు. వదిలేసా... నాకు మంచి అని తోస్తే నేను చేయడం, అందరి నోట్లో పడటం నాకు కొత్తకాదు. మనసంతా ఏదో భారంగా ఒంటరిగా అనిపించింది.

అందరూ భోంచేసి ఒక వారగా పడుకున్నాము. అంతలో ఒకటే తలుపు చప్పుడు... మళ్ళీ వాళ్ళే అయి ఉంటారు.... "అమ్మా ప్రతిమా... నీకోసమే అయివుంటుంది. కామాక్షమ్మ పోయిందిగా... ఏడవటానికి తోడూ కావాలేమో" అంది హేళనగా వదిన. ఆ మాటలు విన్న నాకు ఎంతో బాధ కలిగి నేను ఉన్న చోటునుండీ కదలలేదు. తప్పనిసరిగా వదిన వెళ్ళి తలుపు తీసింది... తలుపు తెరిచీ తెరవడంతోటే "మీ ఇంట్లో ప్రతిమ ఎవరు?" అని అడిగారు. అది విన్న నేను ముందుకు వెళ్ళి నేనే అన్నట్లుగా నిలబడ్డాను. "మీరేనా ప్రతిమంటే...?" అంటూ "అయినా మీ అమ్మగారు పోయి వారం కూడా కాలేదు... మీరెందుకు మా అమ్మను చూడటానికి వచ్చారు? ఎందుకంటే చనిపోయినవారింటి నుండీ ఎవరైనా వస్తే అవతల వాళ్ళు కూడా చనిపోతారట. మీరెందుకు వచ్చారు? ఏమి మేములేమా? మా చెల్లెలు పిలిస్తే అదేదో చిన్న పిల్ల.. దానికేం తెలుసు? తను పిలిస్తే మీరు వచ్చేయడమేనా" అని అడుగుతుంటే నాకు నోటమాటరాలేదు... ఒక్క నిమిషం ఆశ్చర్యపోయాను.... ఇలా కూడా మనుషులు ఉంటారా? అంటూ అయినా బయటపడకుండా...

"మరి మీరెందుకు రాలేదు?"

"అని అడిగే హక్కు మీకెక్కడిది" అంటూ దాదాపు అరిచినంత పని చేసాడు. నాకేం మాట్లాడాలో తోచలేదు....

"అయితే మీ అమ్మను నేను చంపానా?" అన్నాను.

"అందుకు ఆలోచన ఎందుకు?" మళ్లీ అరిచాడు.

"మరి డాక్టర్ అలా అనలేదే... 24 గంటల్లో ఆపరేషన్ చేయాల్సిన అపెండిసైటిస్ ఆపరేషన్ అసలు నా దగ్గర డబ్బులేదు..., అని మీరు చెప్పడం తోటేనని నాకు చెప్పారే..." అన్నాను నేనూ అంత పెద్దగొంతుతోనే...

దాంతో తట్టుకోలేని వాళ్ళూ ఏవేవో మాటలు అంటున్నారు. నన్ను శాపనార్థాలు పెడుతున్నారు. నాకేమి తోచడంలేదు. ఒక పక్క వదిన, మరో పక్క వాళ్ళు నన్ను ఆ రోజంతా తిట్టడమే ధ్యేయంగా పెట్టుకున్నారు.

ఏంటి జీవితం...? ఎందుకీ ఆలోచనలు? ఈ గమ్యస్థానం ఎక్కడికి? భూత, వర్తమాన, భవిష్యత్ కాలాలను ఒకే క్షణంలో ముద్దచేసి నేను కలుపుకున్నా నాకు ఒంటరితనం బావుంది. నాతోపాటు నా ఆలోచనలు అనంతంగా తేలిపోతున్నాయి. ఒకరు ఒకచోట. మరొకరు మరోచోట. అనేది మనం నిర్ణయించడమే... ఈ అనంత కాల ప్రవాహంలో ఎవరికి ఎవరు లేకున్నా... ఆవేదనే... అందరికీ అందరూ ఉన్నా అనుమానమే... మనసులు కలవని ఎందరు ఎదురుగా ఉన్నా ఎవ్వరు లేనట్లే.. ఒకరికి సాయమొకరికి ద్రోహం అయితే సాయం ఎందుకు... ద్రోహమే చేస్తుంటే బావుంటుందేమో!...

ఇది మా తరం... మా జీవితం...? సంపాదన యుగం....? రాబోయేది కరువు యుగం... ఏది ఎలా వున్నా... మానవత్వం కోల్పోతున్న ఈ మానవులు వున్నంత కాలం.. ఏ యుగమైనా మనల్ని ఆదుకునేది ఏముంటుంది? అనిపించింది....

రాబోయే జీవితాన్ని తలుచుకుంటూ... బామ్మా... అంటూ ముద్దు ముద్దుగా దగ్గరకు చేరుతున్న నా మనవల్ని దగ్గరకు తీసుకున్నా ఇక రాబోయే రోజులు తలుచుకుంటూ... వారికి ఇక ఇంతటి ఆదరణ దొరుకుతుందా అనే సందేహం కలిగిందేమో నన్ను గట్టిగా పట్టుకుని నా ఒడిలోకి చేరారు ఆత్మీయంగా...

జీవితం పట్ల భయం భయంగా ఉన్న నేను... గోడపై చిరునవ్వులొలకపోస్తున్న అమ్మను తలుచుకున్నాను... ధారగా వస్తున్న కన్నీటిని తుడుచుకుంటూ...

# అందమా, ఇది నీ శాపమా?

**-ఝాన్సీ కె.వి.కుమారి**

“**శ**శిరేఖ చచ్చిపోయింది...”

బస్టాపులో బస్సుకోసం నిలబడిన నాకు ఈ వార్త షాక్‌లా వినిపించింది. నమ్మలేక మళ్ళీ, మళ్ళీ అడిగాను. నా పక్కనే నిలబడి ఈ విషయాలు చెప్పుకొంటున్న ఇద్దరాడవాళ్ళను...

“తెల్లవారి లేచేటప్పటికి పెరట్లోని బావిలో శవం తేలుతోందట... రాత్రి ఎప్పుడు పడిపోయిందో ఏమో, పాపం... చాలా మంచి పిల్ల! పెళ్ళయ్యి ఎంత..? సంవత్సరం తిరిగి రాకుండానే నూరేళ్ళూ చెల్లిపోయాయ్! ఆ అబ్బాయి కూడా చాలా మంచివాడేనటండీ... ఆ ఈడూ జోడూ ఎంత బాగుండేది... చిలకా గోరింకల్లా చూడముచ్చటగా ఉండేవారు. ఇంత అందమైన పిల్లకు సరైన జోడీ దొరుకుతాడా అనుకున్నాం... మొత్తం మీద అందగాడైన కుర్రాడే దొరికాడు... ఏమైతేనేం? పిల్ల బలవంతాన చచ్చిపోయింది... కారణాలేవీ కనబడడం లేదు... అంతా అయోమయంగా ఉంది. ఇద్దరూ కలిసే వచ్చారటండీ... పిల్లని పుట్టింట్లో దింపి, రెండోరోజు పిల్లాడు ఊరెళ్ళాడట...! మూడో రోజుకల్లా ఈ ఘోరం జరిగిపోయింది...”

ఈ మాటలు నా చెవుల్లోకి వెళ్ళున్నాయి గాని, మనస్సుకు ఏమీ తెలియడం లేదు. భూమి తిరిగి పోతున్నట్లుగా, కొండలు ఎగిరిపడుతున్నట్టుగా, ఏదో, ఏదోగా ఉంది... గుండె రెండు క్షణాలు చల్లబడిపోయింది! కాళ్ళు వణుకుతున్నట్టుగా నిలబడలేనట్టుగా అనిపించి, వెనక ఉన్న గోడకానుకున్నాను.

అప్పటివరకు నా చెవులకు వినిపిస్తున్న మాటలు ఆగిపోయాయి... ఏవేవో గందరగోళ ధ్వనులు వినిపించడం మొదలు పెట్టాయి... ఏదో బస్సు రావడం, చాలామందితోపాటు ఆ ఆడవాళ్ళు కూడా అందులో ఎక్కడం కళ్ళు చూస్తున్నాయి... బస్సు వెళ్ళిపోయింది. నేనొక్కణ్ణే అక్కడ మిగిలి ఉన్నాను. అప్పటికిగాని నా మెదడు

పని చేయడం మొదలుపెట్టలేదు... ఇంతకు ముందు నే విన్న మాటలను ప్లే బేక్' చేస్తోంది...

శశిరేఖ చచ్చిపోయింది....

శశిరేఖ బావిలో దూకి చచ్చిపోయింది...

శశిరేఖ... అందాలబొమ్మ శశిరేఖ...

కొత్త పెళ్ళి కూతురు శశిరేఖ...

ఆత్మహత్య చేసుకొంది!!!

ఏమిటి... నేనేమైపోతున్నాను...? నాలో ఈ ప్రకంపన లేమిటి? నేను శశిని ఆరాధించాను! ఆమె కన్నులలోని ఆ ప్రశాంతతను ప్రేమించాను! నాటి బాపిరాజుగారి శశిరేఖ ఈనాడు – ఇలా – భూమిపై అవతరించిందనుకున్నాను.... ఆనందించాను... కాని... ఆమెను నేనెన్నడు కాంక్షించలేదు. నా సొంతం చేస్కోవాలని వాంఛించలేదు. ఏమో... ఎందుకో... నాకే తెలియదు. ఆమె ఎడల నా కన్నులలో పొంగి వచ్చే ఆరాధనను కనిపెట్టిన మిత్రుడు దేవేందర్ రెండు, మూడు సార్లు నాతో అన్నాడు – "ఆ ఆరాధనను అలా దాచుకునే బదులు, పెళ్ళి చేస్కోరాదా? నీకేమిటి తక్కువ? కావాలంటే నేను రాయబారం నడుపుతాను. జగన్మోహనరావుగారు సంబరపడి కన్యాదానం చేస్తారు" అని. కాని నా సమాధానం విని, మొదట్లో వింతగా ఆశ్చర్యపోయినా, తర్వాత అర్థం చేసుకున్నాడు.

ఔను మరి... కొమ్మల నిండా విరబూసి, పరిమళాలను వెదజల్లే సుమభామలను అలా... అలా.... ఎంతసేపైనా చూస్తూ ఆ సౌందర్యాన్ని ఆరాధిస్తూ, ఆ సౌరభాలను ఆస్వాదిస్తూ మైమరచి పోవడంలోనే నాకు ఎనలేని తృప్తి, హాయి! వాటిని కోసి, ధరించడమంటే ఎందుకో నా మనస్సు విపరీతంగా క్షోభిస్తుంది. పూజారి దేవిని పూజిస్తాడు. ఆరాధిస్తాడే గాని, మరో దృష్టితో చూడడు కదా! ఆ శశిబాలుడిలా, ఈ శశిరేఖ వెన్నెలలను వెదజల్లాలనుకున్నానే గాని, ఇలా హఠాత్తుగా అంధకారాన్ని మిగులుస్తుందనుకోలేదు... ఏమిటి....? ఏమైంది శశికి...? ఎందుకిలా ఆత్మహత్య చేసుకొంది...? తనేది కావాలన్నా క్షణాల మీద తెచ్చిచ్చే తల్లిదండ్రులు, అన్నయ్యలు, అక్కయ్యలు ఉన్న తనెందుకిలా చేసింది....? వాళ్ళ నాన్నగారు జగన్మోహనరావు

గార్కి శశి ప్రాణాధికం! ఆయన.... ఆయనెలా తట్టుకోగలరు...? ఒకసారి వాళ్ళింటికెళ్తే కారణాలేమైనా తెలుస్తాయేమో...

వెంటనే ఒక నిర్ణయానికొచ్చేసాను. ఆఫీస్ కెళ్ళి, సెలవు పెట్టి, వాళ్ళింటి కెళ్ళొచ్చనుకుని, అప్పుడే వచ్చిన బస్సెక్కాను... కాని, నా ఆలోచనలు మాత్రం శశి చుట్టూనే తిరుగుతున్నాయి. నా మనస్సులో ప్రతిష్ఠించుకున్న దేవతా ప్రతిమ నవ్వుతూనే పలకరిస్తున్నట్టుంది!

ఆఫీసులో అడుగుపెట్టగానే ప్యూన్ ఎదురొచ్చి 'మీ కో ఉత్తరం" అంటూ బరువైన కవరందించాడు. ఆశ్చర్యంగా అందుకున్న నేను – అవాక్కుగా నిలబడిపోయాను....

"అది... అది... శశి దస్తూరి! మరలా కాళ్ళు, చేతులు వణకడం మొదలైంది... కళ్ళనిండా నీరూరుతోంది....

శశి... నాకెందుకు రాసింది? నా ప్రశ్నలన్నింటికి ఇందులో జవాబులుంటాయా? గబగబా నా సీట్లో కెళ్ళి కూలబడి వణుకుతున్న చేతులతో కవరు విప్పి, చదవడం మొదలు పెట్టాను.

శేఖర్ గార్కి –

హృదయపూర్వక నమస్కారాలతో శశి అనబడే ఈ అభాగినిని వ్రాసే మొదటి, చివరి లేఖ! నేను మీకు ఇంత పెద్ద ఉత్తరం వ్రాయడమేమిటా అని ఆశ్చర్యపోతున్నారా? ఔను... నాకూ ఆశ్చర్యంగానే ఉంది.

ఎందుకో మీకే వ్రాయాలనిపించింది.... ఓ మంచి మిత్రులుగా ఆ ఆవేదనంతటినీ మీకు చెప్పుకోవాలన్పించింది....

ఈ లేఖ మీకు చేరేటప్పటికి నేనీ లోకానికి లేనన్న వార్త మీకు చేరొచ్చు... బాధపడకండి. జీవితం శాశ్వతం కాదు... ప్రతి ఒక్కరూ ఏదో ఒక రోజు ఈ బ్రతుక్కు వీడ్కోలు పలకాల్సిందే...! కాని... నాలా ఆత్మహత్య చేస్కోవలసి రావడం – ఓ భయంకరమైన దురదృష్టం! తొమ్మిది నెలల క్రితం ఇదే రోజున మా పెళ్ళైనపుడు మీ అందరితో పాటు నేనూ అనుకున్నాను – 'నేను చాలా అదృష్టవంతురాలి'నని! 'మేడ్ ఫర్ ఈచ్ అదర్' అని అందరూ అంటుంటే నిజమేనని చాలా గర్వపడ్డాను.

పెద్దల ఎడల అతను ప్రదర్శించే వినయవిధేయతలను చూసి – 'బాహ్య సౌందర్యంతో పోటీ పడుతోంది అతని ఆత్మ సౌందర్యం' అనుకున్నాను.... అందరితో కలుపుగోలుగా నవ్వుతూ తిరుగుతుంటే 'మంచి స్నేహశీలి' అని పులకించిపోయాను....

క్షణానికొకటి చొప్పున అతని చుట్టూ ఎన్నో... ఎన్నో స్వప్న సౌధాలు నిర్మించుకున్నాను.

ఎంత పిచ్చిదాన్ని కదూ...! బహుశా... నాలాంటి పిచ్చి వాళ్ళుండరేమో...! కాదు.... కాదు... పెళ్ళి పీటల మీద ముస్తాబై కూర్చునే ప్రతీ ఆడపిల్లా నాలాంటి పిచ్చిదే! అతనేమిటో, ఎలాంటివాడో తెలుసుకోకుండగనే అతని చుట్టూ కలలు అల్లుకొని, అవన్నీ కల్లలైన తర్వాత తీరిగ్గా ఏడుస్తూ, శేష జీవితాన్ని కన్నీటికే అంకితం చేసే పిచ్చిపిల్లలు ఈ దేశంలో కోట్లాది మంది!

తలపుకొచ్చినప్పుడల్లా తనువు మనస్సులను పులకింపచేసే ఓ మధురస్మృతిలా కలకాలం నిలవవలసిన మా ప్రప్రథమ సమాగమం ఎలాంటిదో మీరూహించగలరా...? ఎవరూ... ఎవ్వరూ.... ఊహించలేరు. పెళ్లైన మూడోరోజు ఉదయం మేమిద్దరం గండిపేట వెళ్ళడానికి ఏర్పాట్లయ్యాయి.... మూడ్రోజుల క్రితం వరకు అతన్ని గురించి గానీ, వైవాహిక జీవితాన్ని గురించి గానీ ఇదమిద్ధంగా ఏమీ తెలియని నేను – వధువుగా అతని పక్కన కూర్చున్నప్పటి నుండీ ఏవేవో మధురోహాల్లో తేలియాడసాగేను. ఆ ఊహలన్నిటిని మాలలుగా కట్టి – నింగి, నేల, నీరు సంపూర్ణత్వంతో దర్శనమిచ్చే – ఆ గండిపేట ప్రాంతంలో, ఆ ప్రశాంత ఏకాంతంలో "నా భర్త" అనబడే ఆ ప్రత్యక్ష దైవానికి పాధాభిషేకం చేయాలనుకుంటూ హైదరాబాద్ నుండి గండిపేట చేరుకున్నాను.

అంతవరకు మా మధ్య ఎక్కువ మాటలు సాగలేదు... ఆచారాల వల్ల ఏకాంత మసలే కుదరలేదు... అతని పక్కగా నడుస్తుంటే కాళ్ళు తడబడుతున్నాయి. తనువెల్లా పులకింత రాగాన్నాలపిస్తోంది. అందరికీ దూరంగా పొదల మాటున, ఓ చెట్టు కింద, నేను కోరుకున్న లాంటి ఏకాంతమే మాకు లభించింది... ఆ ఏకాంతంలో అతను నన్ను దగ్గరకు తీసుకొని, బరువెక్కుతున్న నా ఎదలోని భావావేశాలను తన ఎదలోకి పంచుకుంటాడని చిగురాకులా కంపిస్తున్న నా మేనిని తన బలమైన కౌగిలిలోకి తీసుకుని ఆలంబన ఇస్తాడని... ఎన్నో... ఎన్నో... ఆశలతో ఉన్న నన్ను కూర్చోమని,

నా కల్లంత దూరంలో తను కూర్చుని-- "నువ్వు చాలా అందంగా ఉంటావు!" అన్నాడు. నునుసిగ్గు దొంతరలు కమ్ముకోగా, మలయపవనాలలో తేలిపోయాను... ఏ నోటి నుండి ఈ మాటలు వినాలనుకున్నానో ఆ కోరిక నెరవేరింది... జన్మధన్యమైందనుకున్నాను....

"ఈ మాటను ఇదివరలో, ఇలా... ఎందరని ఉంటారు?" స్వరంలో మార్పు... చూపులో మార్పు... పదునైన బాకును గుండెలో సూటిగా గుచ్చినట్టయింది. చివ్వున తలెత్తి అతన్ని చూసాను.

పెళ్ళి కొత్త కావచ్చు, గానీ... ప్రేమ కొత్త కాదనుకుంటా" అతని కళ్ళల్లో హేళన లాంటి నవ్వు!

"భగవాన్... ఏమిటిది?" నా హృదయం మూల్గుతుంది.

హృదయంలో ఏ మధురోహలు బంగారు సౌధాలు నిర్మించాయో... అవి... ఒక్కటొక్కటే కూలిపోతున్నాయ్...

"నీ ప్రియుణ్ణి ఇలాగే చూసేదానివా?"

"నీ ప్రియతముని చూసి ఇలాగే... నవ్వేదానివా?"

మూడు ముళ్ళు పడిన క్షణం నుండి ఎవరైతే నా భర్త, ప్రియుడు, స్నేహితుడు, తల్లి, తండ్రి, దైవం, సర్వస్వం అనుకున్నానో.. అతడు.. అతడు ఓ సేడిస్ట్! రాక్షసుడు... నరరూపరాక్షసుడు!! ఆనందమే నేనుగా, చైతన్యమే నేనుగా ఇక్కడకు అడుగుపెట్టిన నేను – ఒక జడపదార్థంలా ఇక్కడ నుండి బయలుదేరాను. నాటి సీతాదేవికున్న శక్తి నాకూ ఉంటే ఈ భూదేవి కదలివచ్చి నన్ను తనలో ఇముడ్చుకునేది! నా ఊహలు... నా ఆలోచనలు ప్రథమంలోనే ఇంతగా తారుమారైన క్షణంలో నాకెందుకు పిచ్చిపట్టలేదు? నా గుండె ఎందుకు ఆగిపోలేదు? నేనేందుకింత మామూలుగా, అతి మామూలుగా, ఏమీ జరగనట్టున్నాను...?

కొత్త దంపతులు ఏకాంతం దొరికితే చాలన్నట్టుగా ఎదురు చూస్తారని, పది మందిలో ఉండి కూడ చిలిపి చూపులు చూసుకుంటారని, వలపు బాణాలు దూసుకుంటారని విన్నాను. కాని... మాకు ఏకాంతం దొరికితే చాలు – అతని నోటి వెంట నా 'అజ్ఞాత ప్రియుని' గురించిన ప్రశ్నలు! నాకు తెలియని, నేను ఎన్నడూ

ఊహించని, అతని ఊహల్లో మాత్రమే సృష్టింపబడిన ఆ 'లేని వ్యక్తి'ని గురించి నేనేమి చెప్పగలను...?

దంపతులిరువురమూ ఏకమై, సర్వప్రపంచాన్ని మరచి, పరవశించాల్సిన వేళ – ఒక ఆడపిల్ల నోరు విప్పి చెప్పలేని భయంకరమైన అనుభవాలెన్నో! ఏమీ చేయలేని అసహాయతతో నోటిని, గుండెను నొక్కిపట్టి మౌనాన్ని అలవాటు చేసుకున్నాను.

భర్త ఆరోగ్యం కోసం పూజల్లో మునిగి, భర్త ఐశ్వర్యం కోసం వ్రతాలు చేసి, భర్త ఆయుష్షుకోసం ఉపవాసాలుండి, భర్తనే ప్రత్యక్షదైవంగా సేవించే పరమ పవిత్ర భరతధాత్రిలో పుట్టిన ఆడదాన్ని! "ఏనాటికైనా తనే మారతాడు, నన్ను అర్థం చేసుకుని, ఆదరిస్తాడు' అనే ఆశ ఏదో మూలన మిణుకు మిణుకుమంటుండగా, దానిని ఊపిరిగా చేసుకుని పూజలు, ఉపవాసాలతో రోజులు వెళ్లబుచ్చుతుంటే దానికీ వక్రభాషణలే!!

అతని మాటల తూటాలను భరించలేక, సహనాన్నంతా కూడదీసుకొని, నరాలను బిగబట్టి దిండులో తలదూర్చి, కళ్ళు గట్టిగా మూసుకొని, ముడుచుకొని, పడుకుంటే – "నీ ప్రియుడి ఒడిలో ఇలాగే మైమరచిపడుకునే దానివా?" ఎంతటి హింస? అతనిని నా ప్రియుడుగా ఊహించుకొని మాట్లాడాలిట! భర్తను 'ఎవరుగానో' ఊహించుకుని ప్రవర్తించాలట! భగవాన్, ఎంతటి దారుణమైన దావానలంలో చిక్కుకున్నాను...? తొమ్మిది నెలలు ఈ చిత్రాతిచిత్రమైన హింసను ఎలా భరించగలిగానో నాకే ఆశ్చర్యంగా ఉంది... నేనేం తప్పు చేసానని దేవుడు నాకీ శిక్ష విధించాడు? తెలిసి నేనెవరికీ, ఎన్నడూ ఏ అపకారమూ తలపెట్టలేదే... పైగా కష్టాలలో ఉన్న వాళ్ళను చూస్తేనే నా కళ్లలో నీరూరుతుంటే... అల్లాంటి నాకు ఇది శాపమా? అయినా... భగవంతుణ్ణి ప్రశ్నించడానికి నేనెవర్ని?

శేఖర్‌గారూ,

ఎందాకని నీరూరుతున్న కళ్ళతో నవ్వును నటించను? ఎంత కాలం గొంతుకను నులిమేసే దుఃఖాన్ని గుండెల్లో మోయను? అతనెదురుగా ఉంటే హృదయ శరీరాలలో ప్రతి అణువును ఉంపపుకోత కోసే మాటలు – అతను లేనప్పుడు ఆ మాటలు చేసిన గాయాల మంటలు! నో... నో... నేనిది భరించలేను! ఆత్మహత్య చేసుకుంటే నరకానికెళ్తారంటాను. కదూ! కాని, దీన్ని మించిన నరకం మరొకటి ఉండదని నాకు తెలుసు!

కన్నెగా ప్రతి ఆడపిల్ల కలలుకని, ఊహించుకునే ఆ బంగారు స్వర్గసీమ – నా భర్త, నా సంసారం, నా పిల్లలు – ఒక కలగా, కల్లగా మాత్రమే మిగిలిపోయాయి. నరాలు చిట్లిపోయేంతటి ఆవేదనతో, అవమానంలో కూరుకుపోయినప్పుడల్లా ఎందుకో... మీ రూపం నా కనుల ముందు ప్రత్యక్షమై నన్నోదారుస్తున్నట్టుగా అనిపించేది! ఆపుకోలేని దుఃఖోద్వేగం, నన్నావరించేది....!! ఇంతటి దావాగ్నిని నాలోనే దాచుకున్నాను. ఎవరితోనూ చెప్పుకోలేదు... కాని, ఎవరికీ తెలియకుండా నేను చచ్చిపోతే.. నా చావును గురించిన నిజం ఎవరికీ తెలియదు. పైగా అందరూ అపార్థం చేసుకోవచ్చు.... 'ఎవరికైనా తెలియజెప్పాలి' అనుకున్నప్పుడు పదే పదే మీరే గుర్తు కొచ్చారు. అమ్మా, నాన్న, అక్కయ్యలు, అన్నయ్యలు.. ఎవ్వరూ తట్టుకోలేరు... కాని.. ఏం చేయను? ఆ జ్ఞాపకాల మంటల్లో కాలిపోతున్నాను... జీవించే శక్తిని కోల్పోయాను... అందుకే వెళ్ళి పోతున్నాను.. దూరంగా.. సుదూరంగా!

నా క్షోభనర్థం చేసుకొని, కాలే నా గుండెలపై రెండు కన్నీటి బొట్లను రాల్చండి – ఆ ఓదార్పు చాలు!

"శశిరేఖా" గుండెలు దద్దరిల్లేలా, లోకాలు అదిరిపోయేలా అరిచాను. హృదయం రుధిరధారలను స్రవిస్తోంది. పడిపోతున్న నన్ను... ఎవరో గట్టిగా పట్టుకున్నారు. కళ్ళు తెరచి చూసాను... మిత్రుడు దేవేందర్ మసకగా కనిపించాడు. ఆ కాగితాలను అతని చేతిలో పెట్టి, అతన్ని గట్టిగా కౌగిలించుకొని ఏడ్చేసాను.

"దేవేందర్, నువ్వు చెప్పినట్టు చేసినా, నా శశిని కాపాడుకునే వాణ్ణేమో!" గుండెను పెగుల్చుకొని వచ్చాయా మాటలు!

అతను ఓదార్పుగా నా వీపు తట్టి "అందమైన ఆడపిల్లలను, ఉన్నత స్థితిలోకి వెళ్ళే ఆడపిల్లలను హింసించి, ఆనందించే సమాజం మనది! దేవుడిచ్చిన వరాలు, వాళ్ల పాలిట శాపాలౌతున్నాయ్!" అతని మాటలు నా చెవులకు వినపడుతుండగా 'అందమా! ఇది నీ శాపమా?' అని నా హృదయం ఘూర్ణిల్లింది!

**(అంకితం : ఎన్నో ఆశలతో, కోరికలతో కొత్త జీవితంలో కుడిపాదం పెట్టి అవేవీ చిగురించకుండానే వాడిపోయి, రాలిపోయిన... పుత్తడి బొమ్మల్లాంటి సుమబాలలకు కన్నీటితో ఈ కథ అంకితం)**

# ఈ ఒక్కరోజు

-అయినంపూడి శ్రీలక్ష్మి

అబ్బబ్బ... ఈ క్షణాలు ఎందుకిలా చక్రాలు వేసుకుని దొర్లిపోతుంటాయ్... నిమిషాలు గంటలుగా మారి రోజును పూర్తిచేస్తాయి. ఈ ఒక్కరోజు కోసం మళ్ళీ నెలంతా ఎదురు చూడాలి. ఎదురు చూసినంతసేపు పట్టదు ఆయన రావటం వెళ్ళిపోవటం కానీ ఈ 'ఒక్క రోజే' కదూ ఇరవై తొమ్మిది రోజులు బ్రతికేందుకు బలాన్ని... జీవాన్ని ఇచ్చేది... ఆయన సమక్షంలో దొరికే స్వాంతన జీవితానికి ఎంతటి పరిపూర్ణతను, సంతృప్తిని ఇస్తుందో....

భర్తతో గడిపే క్షణాలను నెమరేసుకుంటూ గబగబా గిన్నెలను సర్దేసింది శారద. "ఏమోయ్! కాస్త త్వరగా రారాదు ఇంకో 2 గంటలైతే మళ్ళీ నేను బయలుదేరి వెళ్ళిపోవాలి. పోనీ నేనొచ్చి కాస్త సాయం చేయనా..." ఆత్మీయంగా పిల్చాడు పరంధామ్ "ఛా! మీకెందుకండి శ్రమ నేను కానిచ్చి వచ్చేస్తున్నా. మళ్ళీ ఇవి ఇలాగే వుంటే ప్రసూన చికాకుపడ్తుంది. తాను అనే మాటలకు మీ దగ్గర కూర్చున్న ఆనందం కూడా మిగలదు. అయినా ఇదెంత... కాసేపేగా"...

"నీకు సాయం చేసిన ఆ కాసేపు, నీకూడా వున్నట్టుంటుంది. నీతో కల్సి సంతృప్తిగా వుండగలిగేది ఈ ఒక్కరోజేగా... మళ్ళీ నెలకి కానీ ఈ రోజురాదు! బరువుగా నిట్టూరుస్తూ ఆవేదనగా అన్నాడు పరంధామ్

"ఏంటో మనకి ఈ ఎడబాటు - పరిస్థితులు తప్పవు. ప్రసూన కూడా అర్థం చేసుకోదు. తాను ఓ ఆడదేగా. తన భర్తతో ఎలా అనుభూతుల్ని పంచుకోవాలనుకుంటుందో నాకూ అలాగే వుంటుందని ఎందుకనుకోదు. తనకన్నా పెద్దదాన్నయినా నాకూ మనసుంటుందని దానికో స్పందన వుంటుందని ఆలోచన రాదా!' ప్రతి దానికీ పెడర్థాలు తీస్తూ పెడసరంగా మాటలు విసురుతుంది. మనకు దొరికే ఒక్క రోజును మనశ్శాంతిగా ఎందుకు గడపలేక పోతున్నాం... అసలు

మనకెందుకండి ఈ కర్మ" ఆవేదనగా గొంతుకు దుఃఖం అడ్డంపడ్తుండగా ఆగి ఆగి మాట్లాడింది శారద. అనునయంగా భార్య భుజం మీద చెయ్యి వేసి దగ్గరగా తీసుకున్నాడు పరంధామ్

ఒక్కసారిగా ఉలిక్కిపడింది శారద. కళ్ళు తెరిచి చూసేసరికి పిల్లలిద్దరు చెరోవైపున నడుం చుట్టూ, మెడమీద చేతులు కాళ్ళు కదలనియ్యకుండా చుట్టేసి మంచి నిద్రలో వున్నారు. తలెత్తి కిటికి నుండి బయటకు చూసింది. మసక చీకటి వీధి లైట్లతో పోట్లాడుతుంది. ఇదంతా కలేనా" అనుకుంటూ ఆయన వచ్చే వేళకు త్వరగా పని చేసుకోవాలి. లేకపోతే కలే వాస్తవమవుతుంది. తీరా ఆయనొచ్చాక కూర్చునే తీరుబడి కూడా వుండదు. నెమ్మదిగా పిల్లల కాళ్ళు చేతులు తప్పించి లేచి గదిబయటకొచ్చింది శారద. ఇంతకీ శారద పెద్ద కొడుకు దగ్గర, భర్త పరంధామయ్య వేరే ఊరిలో చిన్న కొడుకు దగ్గర ఉంటారు. నెలకొకసారి పరంధామయ్యగారు వచ్చి భార్య, కొడుకు, కోడలు, మనవలను చూసుకొని వెళ్తారు. వంటింటి లోపలకు వెళ్లబోతూ కోడలు ప్రసూన గదివైపు చూసింది. మూసిన తలుపులు దర్శనమిచ్చాయి. అవి 9 గంటలకు కానీ తెరుచుకోవు. అది నిత్యం జరిగేదే. ప్రతిరోజు తాను తన భర్త దగ్గరగానే వుంటుంది. తనకాలు నేల మీద పెట్టకుండా అన్నీ తానే అమరుస్తుందిగా. ఈ ఒక్క రోజు తానెందుకు సాయం చెయ్యకూడదు? ఇన్ని రోజుల ఎడబాటు తర్వాత భర్తను కలుసుకోబోయే ఆడమనసు ఎలా తపనపడ్తుందో ఏ ఇల్లాలికైనా అర్థం అవుతుంది కదా! శర పరంపరగా ఆలోచనలను విసురుతూనే వుంది మనసు.

'పాలు' అన్న పాలవాడికేకతో మేధమధనం ఆపేసి పాలగిన్నె తీసుకుని తలుపు తీసింది. "ఈరోజు 1/2 లీటర్ పాలు ఎక్కువ పొయ్యిబాబు" ఆట్లాగేనమ్మగోరు. మొన్న జున్నుపాలు కూడా తెమ్మన్నారు కదా – ఇదిగో తెచ్చాను. అదనంగా ఓ 20/ – లెక్క కట్టుకొండమ్మగోరు" అంటు పాలసీసా అందించాడు.

"జున్నుపాలు తెచ్చావా! జున్ను మా వారికి ఎంత ఇష్టమో. ఇవాళ ఆయన వస్తున్నారు కూడానూ" సంబరంగా చిన్నపిల్లలా అంది శారద.

"నాకు తెలుసునమ్మగారు ప్రతినెల ఈ ఒక్క రోజు కోసమేగా మీరు ఎదురుచూసేది. ఎంతమంది అడిగినా ఇవ్వకుండా అందుకే తీసుకొచ్చాను. అయ్యగారికి చేసిపెట్టండమ్మ" ఆత్మీయంగా అంటూ వెళ్ళిపోయాడు.

చిక్కటి కాఫీ అంటే ఆయనకెంత ఇష్టమో.. ఇంకో రెండుగంటల్లో ఆయన వచ్చేస్తారు... తెల్లవారి 'చలిగా' వున్నా బయలుదేరే వుంటారు. స్వెట్టర్ వేసుకున్నారో లేదో... అనుకుంటూ కాఫీ డికాక్షన్ వేసి స్నానానికి వెళ్ళింది శారద. స్నానం చేసి వంటింట్లోకి వచ్చేసరికి ప్రసూన వంట గదిలో ఉంది. ముందు గదిలో ఎవరో కూర్చుని మాట్లాడుకుంటున్నాడు. శారదతో ఏం మాట్లాడకుండా తీసిపెట్టిన డికాక్షన్‌తో కాఫీ కలుపుకుని హాల్లోకి వెళ్ళిపోయింది ప్రసూన. ఫిల్టర్ తీసి చూసింది శారద. అది ఖాళీ మళ్లీ డికాక్షన్‌కి పొయ్యి మీద నీళ్ళు పెట్టింది శారద నిట్టూరుస్తూ.

'ఇవేంటి' విసురుగా వచ్చింది ప్రసూన

'కాఫీ... డికాక్షన్ కోసమని...' నాన్చింది శారద

'అదిసరే ఇవేంటి'... అంది ప్రసూన కోపంగా –

"అవా! అవి జున్నుపాలు – ఇవ్వాళ ఆయన వస్తున్నారని పాలవాడు ఆప్యాయంగా తెచ్చిచ్చాడు." సంతోషంగా చెప్పింది శారద.

"అయితే మాత్రం – జున్నుపాలు వాతమని చిన్నాడికి పడవని తెలియదా!? ఎందుకు తీసుకున్నారు?! ఆయన వస్తున్నారట – నెలకి ఓసారి ఇదో పంతమయింది. నాకు. వయసొచ్చినా హుందాతనం లేదు. మీ వరుస నాకు వెగటు పుడ్తుంది" అంటూనే వెళ్ళిపోయింది విసురుగా ప్రసూన. ఒక్కసారిగా బిక్క చచ్చిపోయింది శారద – పాలు పారపోద్దామని గిన్నె తీసుకుంది. మళ్ళీ మనసొప్పలేదు. ఆయన ఎంత ఇష్టంగా జున్ను తింటారో గుర్తొచ్చింది. మాటలు పడటం తన బ్రతుకుకు అలవాటే – కనీసం ఆయనకు ఇష్టమైనవి చేసిపెట్టగలిగితే అంతేచాలు... ఆయనన్నా తృప్తిగా వెళ్తారు" కళ్ళు తుడుచుకుంటూ పాలల్లో మిరియాలు బెల్లం కలిపి కుక్కర్లో పెట్టి హాల్లోకి వచ్చి ఇల్లంతా అందంగా సర్ది ఓసారి తృప్తిగా చూసుకుంది.

అలికిడి అయినప్పుడల్లా ఉలికిపాటుగా గుమ్మంవైపు చూస్తూనే వంటకు ఉపక్రమించింది శారద. పిల్లలకి స్నానం చేయిస్తుండగా కాలింగ్‌బెల్' మోగింది. పరుగెడ్తున్నట్లుగా వెళ్ళి తలుపుతీసింది. 'పేపర్ బిల్ అంటూ పేపర్ వాడు. నిరాశగా వెనుదిరిగింది. ఇవి గమనించిన ప్రసూన–

"ఛీ... ఛీ... ఏం మనుష్యులో... కొత్త జంటకు కూడా ఇంత ఆతృత ఉండదు." ఏవగింపుగా అంటూ బెడ్‌రూంలోకి వెళ్ళిపోయింది.

శూలాల్లా తగులుతున్న మాటల్ని భరిస్తూ గుండె దిటవు చేసుకుని పిల్లల్ని రెడీ చేసింది – వంటలో కూడా భర్తకు ఇష్టమైనవి చేసిపెడదామన్న ధైర్యం కల్సిరాలేదు. అన్యమనస్కంగా వంట చేస్తున్న శారద దగ్గరకు అదే విసురుగా వచ్చింది ప్రసూన.

“ఇవ్వాళ మా ఫ్రెండ్స్ భోజనానికి వస్తున్నారు. కాస్త స్పెషల్స్ ఏవైనా చెయ్యండి!” గోడకు చెప్పినట్లు చెప్పి, గోడకు కొట్టిన బంతిలా వెళ్ళిపోయింది.

ఆ మాటతో ప్రాణం లేచి వచ్చినట్లయింది శారదకు.

ఆ స్నేహితులెవరో చేతులెత్తి నమస్కరించాలనుకుంటూ భర్తకు ఇష్టమైన పులిహోర, చక్రపొంగలి, గోంగూర పచ్చడి – గుమ్మడికాయ కూర – ఉలవచారు చేసింది.

వంటంతా అవుతుండగా హాల్లో మాటలు విన్పించాయి. గాలిలో తేలుతూ వస్తున్న ధ్వని తరంగాలు ‘భర్త’ గొంతుని శారద చెవులకు చేరవేశాయి. నాదస్వరం విన్నదానిలా ఒక్క పరుగున హాల్లోకి వచ్చింది శారద. పిల్లలతో కబుర్లు చెప్తున్న పరంధామ్ కళ్ళు కూడా ఇల్లంతా వెతుకుతున్నాయ్ – శారదను చూడగానే ఒక్క క్షణం ఆ కళ్ళు వెలిగాయి. అంతలోనే చెమ్మగిల్లాయి కూడా. “మంచి నీళ్ళు తీసుకోండి” అంటూ తడబడిన అడుగులతో దగ్గరగా వచ్చి అపురూపంగా భర్తను చూసుకుంటూ అంది శారద.

“ఏంటి! చిక్కిపోయారు ఆరోగ్యం బాగోలేదా” అని అడగాలనివున్నా ప్రసూన వింటే దానికి ఎంతరాద్ధంతం చేస్తుందోనని భయపడి వంటింటివైపుగా భారంగా సాగిపోయింది శారద.

బామ్మా! తాతయ్య తెచ్చారివి – ఇది ఎలా తినాలి? అంటూ వచ్చాడు చిన్ని–

వాటిని చూడగానే అర్థమయింది భర్త తనకిష్టమని తెచ్చాడని – అపురూపంగా అందుకుని ‘వీటిని తేగలంటారమ్మ’ అని చెప్తూనే వాటిని ముక్కలు చేసి చిన్ని ముక్కను పిల్లాడి నోటికి అందించింది. ముందు వెగటుగా ముఖం పెట్టి రుచి తగిలేసరికి ‘భలే బాగుంది’ అంటూ మిగిలిన ముక్కలన్ని జేబులో వేసుకుని ముందుగదిలోకి పరుగెట్టాడు. ప్రసూన రానే వచ్చింది. రావటంతోనే ఏంట్రా అది – చిల్లర తిళ్ళు నువ్వను – అక్కడ క్యాడ్‌బరీస్ వున్నాయిగా తీసుకో “అంటూ తేగల్ని విసరేయబోయింది.

లేదు మమ్మీ ఇవి చాలా బాగున్నాయి. అయినా నువ్వేగా అనేది. చాక్‌లెట్స్ టీత్‌కి మంచిని కాదని – ఎంత బాగున్నాయో ఇవి తాతయ్య తెచ్చారు తెల్సా! – తాతయ్యని ప్రేమగా చూస్తు అన్నాడు చిన్ని.

'ఒహ్‌! ఇది మీ పనేనా'! నెలకోసారి వచ్చి వెళ్ళిపోక మీ అలగా తిళ్లన్నీ పిల్లలకి అలవాటు చెయ్యకండి" ఏహ్యంగా ఉంది.

"అది కాదమ్మా! దారిలో కన్పిస్తేనూ పిల్లలకు తెలియదుకదా. రుచి చూస్తారని తెచ్చాను" నీళ్ళు నములుతూ సంజాయిషీ చెప్పారు పరంధామ్.

సరేలెండి అంటూ విసురుగా వెళ్ళిపోయింది ప్రసూన. అబ్బాయి సుందరం వచ్చి నాన్నా బాగున్నావా అని పలకరించి వెళ్ళిపోయాడు. భర్తకు కాఫీ కల్పి ఇవ్వాలని శారద – వంటింట్లో వున్న భార్యను కుశల ప్రశ్నలు అడగాలని కళ్ళు నిండుగా ఆత్మీయంగా చూసుకోవాలని పరంధామ్... లోలోపల నలుగుతున్నా... ప్రసూన విసురు చూశాక ధైర్యం చేయలేకపోయారు.

ఇంతలోనే బిలబిలమంటూ ప్రసూన స్నేహితులొచ్చారు.

"కాస్త మీ కలలలోకం నుంచి బయటకు వచ్చి మాకు కాస్త తిండి పెడ్తారా" వంటింట్లో కొచ్చి కటువుగా అంది ప్రసూన. "వచ్చేస్తున్నావమ్మా" అంటూనే గిన్నెలన్ని తెచ్చి డైనింగ్ టేబుల్ మీద శుభ్రంగా అమర్చింది శారద. కబుర్లు చెప్పుకుంటూ – వంటను అద్భుతంగా పొగుడుతూ అద్భుతమైన ఆంధ్రా వంటను రుచి చూపినందుకు అంత శుచిగా చేసినందుకు ప్రసూనని ఆకాశానికెత్తేస్తూ... ఎవరి భర్తలకు వారు కొసరి కొసరి తిన్పించుకుంటూ నవ్వులు తుళ్ళింతల మధ్య భోజన కార్యక్రమం సాగుతోంది. వంటింట్లో వున్న శారద గడియారం వంక చూసింది. ఆయనకి త్వరగా తినే అలవాటు – వీళ్ళు త్వరగా కానిస్తే బాగుండును. వేడి వేడిగా తినటం ఆయనకు ఎంతిష్టమో... పాపం! తను అలా తిని ఎంతకాలమైందో. దిగులుగా నిట్టూర్చింది శారద.

"కాస్త డైనింగ్ టేబుల్స్ వైపు వస్తారా అత్తయ్యగారూ! 'మెత్తదనం ముసుగేసిన మాటల కత్తిని విసరింది ప్రసూన–

"ఆ జున్ను గిన్నె కాస్త ఇటిస్తారా" అని పురమాయిస్తూనే – "మా మామగారు వచ్చార్లే... నెలకోసారి మా ఇల్లు బృందావనం అవుతుంది" వ్యంగ్యంగా నవ్వుతూ

స్నేహితులతో చెప్తున్న మాటలు విని నిలువెల్లా అవమానభారంతో ముడుచుకుపోయింది. శారద – మ్లానమైన వదనంతో వంటింట్లోకి జొరబడి గోడకు చారగిలబడి కళ్ళు మూసుకుంది.

పిల్లల్ని పెద్ద చదువులు చదివించటానికి ఎన్ని సంవత్సరాలు తన భర్త డబల్ డ్యూటీలు ఓవర్‌టైం కోసం చేసింది. తాను మిషన్‌కుట్టి రాత్రనకా పగలనకా భర్తకు 'చన్నీళ్ళు చందంగా" ఆర్థిక అవసరాలకు సాయపడింది తను వయసులో పిల్లలకోసం వారి అభ్యున్నతి కోసం ఎంతగా త్యాగం చేసింది గుర్తొచ్చింది.

"మా భోజనాలు అయిపోయాయి అత్తయ్య! పిల్లలకి కూడా తిన్పించండి" ఆర్డర్ జారీ చేస్తున్నట్టుగా ఉరిమింది ప్రసూన.

భర్తకు ఇష్టమని వండిన వంటల్ని కొసరి దగ్గరుండి వడ్డించాలని ఆశగా వచ్చిన శారదకు ఖాళీ పాత్రలు వెక్కిరిస్తూ దర్శనమిచ్చాయి. "జున్ను" అని చెప్తే తప్ప గుర్తుపట్టలేనట్టుగా వున్న గిన్నె, అడుగున వుండీ లేనట్టున్న పులిహోర, చక్రపొంగలి, గుత్తివంకాయ కూరలు... ఒక్క మనిషికి కూడా సరిగ్గా సరిపోని అన్నం... గడ్డ పెరుగంతా వేసుకోగా మిగిలిన పై వీళ్ళు ఇదీ పరిస్థితి – బయటకు రావటానికి శతధా ప్రయత్నిస్తున్న కన్నీళ్ళను ఆపుకునేందుకు రెప్పలకట్టలు బిగించి కాసేపు ఆగింది శారద–

ఉన్న వాటినే చిన్న గిన్నెల్లోకి సర్ది టేబుల్ మీదపెట్టి భర్తను, మనవళ్లను కేకేసింది భోజనాలకి. "ఇక్కడికే రా బామ్మ – తాతయ్యకి నా ఫోటోలు చూపిస్తున్నాను" విసుగ్గా అన్నాడు బాబీ... అన్నీ సర్దుకుని పిల్లల రూంలోకి వెళ్ళి భర్తకి 'కంచం' అందించి పిల్లలకు తిన్పించసాగింది. పిల్లలభోజనం అయిపోయేదాకా తాను ముద్దలు కలిపి మధ్య మధ్య సాయం చేస్తూనే వున్నాడు పరంధామ్...

"మంచి హిందీ ఫిల్మ్ వస్తుందిరా బాబ్జీ రండిలా" తల్లి పిలుపుతో పిల్లలిద్దరూ పరుగెత్తారు.

గదిలో ఇద్దరే మిగిలారు...

ఒక్కక్షణం నిశ్శబ్దం...

ఊహించని ఏకాంతం....

ఇరవై తొమ్మిది రోజులుగా క్షణం క్షణం ఎప్పుడా అని ఎదురు చూసిన ఏకాంతం....

ఎవరూ ఎవరి దగ్గరకు రాలేదు... ఒకరినొకరు ఆద్యంతం అపురూపంగా పరికించుకుంటూ కళ్ళతోనే మాట్లాడుకుంటూ నిలబడిపోయారు.

అప్పుడు గమనించింది శారద భర్త చేతిలో మిగిలిన ముద్దను ఆశ్చర్యంగా చూసింది. దగ్గరకు రా అన్నట్టుగా కళ్లతోనే పిల్చాడు పరంధామ్... తడబడిన అడుగులతో భర్త దగ్గరకు వెళ్ళింది శారద. చిత్రంగా తొలినాడు ఏ తడబాటు గాబరా ఆ నడకలో వున్నాయో ఈ రోజు కూడా అదే తత్వం...

ఆప్యాయంగా భార్య నోటికి చక్రపొంగలి అందిచ్చి చెప్పాడు పరంధామ్.

"నేనొచ్చేది ఈ చక్రపొంగలి, దద్దోజనాలకోసం కాదని నీకు తెల్సు శారద! కనీసం ఒక్కసారైనా ఈ ఒక్కరోజైనా నిన్ను తృప్తి తీరా చూసుకుందామని - నీ చూపుల్లో నాకు ఎంత స్వాంతన దొరుకుతుందో తెల్సా - నీ స్పర్శలో ఎంత ఆత్మీయత దొరుకుతుందో... ఎంతగా తీపి తిన్నా నాకు తియ్యగా అన్పించదు. కానీ నీ చేత్తో ఇచ్చిన మంచినీళ్ళు కూడా ఎంతో తియ్యగా వుంటాయి. అది నువ్విచ్చావన్న భావన... అది ఎప్పటికీ ఇక్కడ నిలబడి వున్న అనుభూతి..." గుండెల మీద చేత్తో గుచ్చుకుంటూ గట్టిగా... ఆర్ధ్రంగా చెప్పాడు పరంధామ్...

ఒకనాడు పెళ్ళిచూపుల్లో కళ్ళతోనే మాట్లాడుకుని కల్సి బ్రతుకుదామని పెళ్ళి పుస్తకంలో ప్రమాణ పూర్తిగా తొలి సంతకం చేశారు. - మాట మనసు దాటకుండానే ఒకరి అంతరంగాన్ని మరొకరు అర్థం చేసుకుని 'నలభై' వసంతాలు మనుగడ సాగించారు. ఆ చూపుల్లోని అనురాగమే కాదు - అర్థం చేసుకునే తత్వం... అండగా నిలబడే గుణం ఎప్పటికి మారదు - కానీ వాటితో పాటు ఇప్పుడు-

బేలతనం - గుండె బీటలు వారిన దిగులు గుణం కన్పిస్తున్నాయి.

ఆర్ధతా - ఆతృత కనబడే ఆ కళ్ళు తననెప్పుడు మోసం చెయ్యవు.

జీవన మలి సంధ్య ప్రాంగణంలో-

బిడ్డలు చెరొకళ్ళని పంచుకుని ఎడబాటు ముళ్ళపొదల్ని నాటారు

చిత్రవధ – చిత్రమైన వ్యధ–

అది అర్థం చేసుకునే వారెవరు…?

మాటల తూటాలు… మనసుకు కుళ్ళపొడిచే నిర్లక్ష్యం… అభద్రత వెంటాడుతూ వేధిస్తూనే వున్నాయి….

నెలలో దొరికిన 'ఈ ఒక్కరోజు'లో కూడా.

# నివాళి

కె. వాసవదత్త రమణ

"ఏవండీ! ఈ విషయం విన్నారా?" రుక్మిణి హడావుడిగా వచ్చి పుస్తకం చదువుకుంటున్న క్రిష్ణారావు పక్కనే కూర్చుంటూ అంది

"ఏమిటి?" అని అడగబోయే లోపు తనే "మీ స్నేహితుడు వాసుదేవమూర్తి. వాళ్ళబ్బాయిని హుబ్లీ మిలటరీ ట్రైనింగ్‌కు పంపుతున్నాడట" అంది.

క్రిష్ణారావు పెద్దగా ఆశ్చర్యపడలేదు. ఎందుకంటే అది అతనికి తెలిసిన విషయమే!!

"చూడండి పాపం అతని భార్య 'రమ' ఉన్న ఒక్కగానొక్క కొడుకుని మిలటరీకి పంపలేక కన్నీరు మున్నీరుగా రాత్రింబవళ్ళు చాలా ఏడుస్తుందట? కాని ఆ మొండి మనిషి వింటేగా? ఒక్కటే పట్టుదల ఎల్లుండి ప్రయాణం అంట" రుక్మిణి చెప్పుకుంటూ వెళ్ళిపోతుంది.

"అబ్బా! రుక్మిణి నీలా 'రమ' అంత అధైర్యవంతురాలు కాదులే"

వాసుదేవమూర్తితో తన తొలి పరిచయం అతని కళ్ళముందు మెదిలింది.

ఆఫీస్‌కు వెళ్ళగానే,

'రండి క్రిష్ణారావుగారు? మీరు లేట్ అయ్యారు, ఇప్పుడే అందరి పరిచయాలు అయ్యాయి.

"వీరు వాసుదేవమూర్తిగారు అనకాపల్లి బ్రాంచి నుంచి ట్రాన్స్‌ఫర్ అయ్యి ఈవాళే మన ఆఫీస్‌లో జాయిన్ అయ్యారు. వీరు క్రిష్ణారావుగారు, మేనేజర్ పరిచయం చేసాడు అతనికి.

తెల్లచొక్క లూజ్‌పెంట్, కొద్దిగా పెరిగిన గడ్డం కళ్ళద్దంలో అతన్ని చూడగానే క్రిష్ణారావుకి ఎందుకో అంత మంచి అభిప్రాయం కలగలేదు. అసలే ఆఫీసుకు

లేటుగా వచ్చేయడంతో కొద్దిగా చిరాగ్గాను ఉందతనికి. తల పంకించి ఊరుకున్నాడు.

"నమస్కారం" రెండు చేతులూ జోడించి గంభీరమైన స్వరంతో అన్నాడు వాసుదేవమూర్తి. ఆ స్వరానికి చటుక్కున తలెత్తి, తెలియకుండానే నమస్కారం పెట్టాడు క్రిష్ణారావు "నమస్కారం వాసుదేవమూర్తిగారు వెల్‌కమ్ టు ఆఫీస్" అంటూ.

"నన్ను వాసుదేవ్ లేదా వాసు అనండి చాలు" సింపుల్‌గా మళ్ళీ అతనే అన్నాడు చిరునవ్వుతో.

ఆ స్వచ్ఛమైన నవ్వులో ఏదో ఆకర్షణ ఉంది. రూపానికి ప్రవర్తనకి ఎంత తేడా" ఆశ్చర్యంగా మనసులో అనుకున్నాడు క్రిష్ణారావు.

"వాసుదేవమూర్తి గారు, ఇదిగో మీ సీట్ మీరు అటండ్ అవ్వాల్సిన వర్కు గురించి క్రిష్ణారావుగారు అన్ని వివరంగా చెబుతారు. బెస్ట్ ఆఫ్ లక్" అంటూ మేనేజర్ తన కేబిన్‌లోకి వెళ్ళిపోయాడు.

క్రిష్ణారావు అతని టేబుల్ అంతా దుమ్ము ధూళిగా ఉండటం చూసి, "ఒక్కక్షణం ఆగండి" అంటూ "అదెమ్మా" అటండర్ కోసం కేకపెట్టాడు.

అటెండర్ గబ గబ వచ్చి గుడ్డ తీసుకుని వచ్చి శుభ్రం చేయిబోతుంటే వారించి వాసుదేవ్ తనే ఆ పాత గుడ్డ తీసుకుని నీళ్ళు జల్లి అంతా నీట్‌గా తుడిచి, చేతులు కడుక్కుని వచ్చి తన సీట్లో కూర్చుంటూ

'అన్నట్లు నీ పేరేమిటి అదెమ్మ కదూ, ఈ టేబుల్ రోజూ తుడవాల్సింది పొద్దునే కదా! సీట్లో వెనక్కి వాలి అన్నాడు వాసుదేవమూర్తి.

"అవును సార్, కాని ఇంకా ఎవరు మీ సీట్‌లో జాయిన్ అవ్వలేదని" చిన్నగా నసిగింది అదెమ్మ.

"సరే, అదీ నిజమే అనుకో, అయితే నాకు ఒక్క చిన్న సందేహం? అదే నీకు ఒంట్లో బాగోలేదనుకో, ఇంట్లో వంటేచేయవా, అసలు వంటిట్లోకే వెళ్ళవా, పిల్లల్ని స్కూల్‌కి తయారు చేసి పంపటం, గదులు తుడవటం ఇలాంటివి కూడా ఇంట్లో ఏం చేయవా? అలాగే కూర్చుంటావా?"

"అదేం మాటండి, అన్ని చేస్తాను. అంతే కాని, నాకు అనారోగ్యం అయితే

పిల్లల్ని ఇబ్బంది పెడతాననుకుంటున్నారా? నా ధర్మం నే తప్పుతానా ఏంటి?" అంది.

"మరీ, అదే ధర్మం నెలనెలా ఒకటిన టంచనుగా ప్రభుత్వం జీతం తీసుకుంటున్న మనకీ వర్తిస్తుందిగా?"

అదెమ్మను సూటిగా అడిగాడు.

"అదేంటి బాబు, ఏదో ఒక్కరోజు పొరపాటు అంతే కాని," విసుగ్గా అందామె.

క్రిష్ణారావుకి అతని ప్రవర్తన కొద్దిగా వింతగా, తేడాగా అనిపించింది.

"ఏదో ఒక్కరోజు అన్నీ సాకులు, ఇక నుంచి మళ్ళీ నే ఎప్పుడూ వినకూడదూ, అదెమ్మ, మన ఇంట్లో మనం ఎంత శుభ్రంగా ఎలా ఉంటామో, మన ఇల్లు ఎలా ఉంచుకొంటామో అలాగే మన ఆఫీసు కూడా అద్దంలా ఉంచాలి. సరేనా!" అతని స్పీచ్‌కు అయిష్టంగా చెప్పింది అదెమ్మ.

"నేను లోపలికి వచ్చేటప్పటికి నువ్వు బయట స్టూల్ మీద కూర్చుని పక్క సెక్షన్ వాళ్లలో బాతాఖాని కొడుతున్నావు? అదిగో ఆ పక్కన చూడు, ఆ ఫైల్ నిండా దుమ్మేంటీ? ఆ మెట్ల దగ్గర అంత తడిగా ఎందుకు ఉంది??? ఇవ్వన్నీ నువ్వు రోజూ చేయాల్సిన పనులే కదా! ఇక నుంచి నీ డ్యూటీ నువ్వు సరిగా చేయి. మళ్ళీ ఎప్పుడు నాతో చెప్పించుకోకు. నేను ఏదీ చెప్పినా ఒక్క సారే చెబుతాను! రెండోసారి కాగితం మీదే పెడతాను." హెచ్చరికగా అన్నాడు.

అదెమ్మ వచ్చిన కోపం దిగమింగుకొంటూ బయటకు వెళ్ళిపోయింది.

"ఇంత చిన్న విషయానికి అంత పెద్ద లెక్చరా" అని మనసులో అనుకుంటూ "సరే రండి అలా కేంటీనుకు వెళ్లి కాఫీ తాగేసి వద్దాం" క్రిష్ణారావు హుషారుగా అంటూ అతని భుజం మీద చేయి వేసాడు.

"క్రిష్ణారావుగారు ఇప్పుడు టైమ్ 11.30 అయ్యింది. మన వర్క్ టైమ్. 1.30 కి అప్పుడు కేన్‌టీన్‌కి వెళ్ళి వద్దాం ప్రస్తుతం మనం డ్యూటీలో ఉన్నాం కాబట్టి ఆఫీస్ పని చేద్దాం" స్పష్టంగా అన్నాడు వాసుదేవ్.

క్రిష్ణారావు ఖంగుతిని, "అలాగే లెండి. ఇప్పుడే డ్యూటికి రిపోర్ట్ చేసారు కదా అని సరదాగా ఆఫర్ చేసాను."

"వద్దండి. అలాంటి ఆఫర్ మనం ఎప్పుడూ ఎవ్వరికీ ఇవ్వకూడదు. అలాగే డ్యూటీలో ఉండగా, ఎవ్వరి దగ్గర్నుంచి తీసుకోకూడదు. మనది చాలా రెస్పాన్సుబిలిటీ జాబ్, చాలా ఆచితూచి అడుగేయ్యాలి."

క్రిష్ణారావు ఇంకేం మాట్లాడలేక 'భలే వింత మనిషే'. అనుకుని నవ్వుకుంటూ తన సీట్లోకి వెళ్ళి కూర్చున్నాడు. కాసేపటికే "క్రిష్ణారావుగారు రండి ఒక్కసారి ఆఫీస్‌లో ఈ ఫైల్స్ అన్ని నాకు చెప్పండి" పిలిచాడు వాసుదేవమూర్తి.

"ఇవాళే కదా జస్ట్ జాయిన్ అయ్యింది. రేపట్నించి అన్ని చెబుతాడులెండి కాస్త రెస్ట్ తీసుకోండీ పూట. త్వరగా వెళ్ళిపోండి ఇంటికి. అసలే కొత్త అద్దె ఇల్లు వెతుక్కోవాలి కూడా కదా సూపరెంటెండెంట్ " అన్నాడు వెనుక నుంచి .

"అయిపోయింది ఇవాళ సూపరెంటెండెంట్ పని, ఈ వాసుదేవ్ చేతిలో"! అనుకున్నాడు క్రిష్ణారావు మనసులో వాసుదేవ్ ఆయన సీటు వైపుకు వెళుతుంటుంటే.

"థ్యాంక్స్ క్రిష్ణారావుగారు. మంచి ఇల్లు చూసి పెట్టారు చక్కగా ఇంటి ముందు చాలా ఖాళీ జాగా ఉంది" సామాన్లు దింపుకుంటూ అన్నాడు వాసుదేవ్.

"మీరేమి అనుకోకపోతే, క్రిష్ణ అనండి సరిపోతుంది" అని నవ్వాడు క్రిష్ణారావు.

"అహ మీరు కూడా వద్దు నన్ను వాసు అన్నా ఓకే" మంచం పడక గదిలోకి చేరుస్తూ ఆయాసంగా అన్నాడు.

'ఎవరన్నా మనుషుల్ని పెట్టుకోండి సామాన్లు మోయడానికి అనబోయి మళ్ళీ దానికేం సోది చెబుతాడో అని మారు మాట్లాడలేదు క్రిష్ణారావు.

"క్రిష్ణా. ఇవాళ నువ్వు రెడ్ సిగ్నల్ ఉండగా, మళ్ళీ బైక్ మీద ముందుకు వెళ్ళిపోయావు. నేన్నీ వెనకే ఉన్నాను." కొంచెం కోపంగా అన్నాడు వాసు.

సూపరెంటెన్‌డెంట్ పరిహాసంగా ఏదో అనబోతుంటే క్రిష్ణారావు ఆయన్ని వారించి, సారీ ఆఫీసుకు టైమ్ అయ్యిందన్న కంగారులో అలా చేసాను. ఇంకెప్పుడు రిపీట్ చేయను" అన్నాడు.

"దీనికి పనిష్మెంట్ ఈ వారంలో ఆఫీస్‌కి అరగంట ముందుగా వచ్చి వర్క్ స్టార్ట్ చేయాలి"

"ఓకే డన్ వాసు" చిరునవ్వుతో అన్నాడు క్రిష్ణారావు. వాళ్ళిద్దర్ని విడ్డూరంగా చూసాడు సూపరెంటెన్‌డెంట్.

క్రమంగా వాసుదేవ్ సిస్టమ్‌కి ఆఫీస్‌లో అందరు బాగా అలవాటు పడిపోయారు.

ఆఖరికి అదెమ్మ కూడా, ముందు కొద్దిగా పాత పద్దతిలోనే సగం సగం పనిచేసినా ఆమె కొడుకు ఇంటర్ ఫీజు కోసం వాసు ఆఫీసంతా తిరిగి డబ్బు సేకరించి, ఆ అబ్బాయి చదువుకి సహాయపడటంలో ఆమె అతని సాయానికి కరిగిపోయింది – దాంతో ఆఫీసు శుభ్రంగా తయారైంది.

అంతకన్నా గొప్పగా చెప్పుకోవాల్సిన విషయం ఏమిటంటే, కొద్ది నెలలకి అదెమ్మ నెల నెలా తన జీతంలో రూ.50/– తన ఇంటి వీధి చివర బట్టలు కుట్టే సాయిబు కూతురు పుస్తకాలకి, చదువుకి సాయం చేయడం.

'మురికి నీరు రోడ్డు మీద వైతరణిలా ప్రవహిస్తుంది! ఇది నా రెండో కంప్లైంట్ మీరింత వరకు అటండ్ అవ్వలేదు. వాసుదేవ్ మాట్లాడుతుంటే అతనుండేది ఎక్కడో వీధి నెం.6లో, ఎందుకండీ వీధి నెం.1 లోని మురికి నీటి గొడవ' అంటు తొలినాళ్ళలో అతన్ని వెక్కిరించిన వాళ్ళే.

అతి కొద్ది రోజుల్లో

"వెంకటేశ్వరస్వామి గుడి దగ్గర బిచ్చగాళ్ల గొడవ ఎక్కువైంది. ప్రశాంతత కురువైంది! ఏక్షన్ తీసుకోండి" అనో "మూడు రోజులుగా మా నల్లా రావడం లేదు, రీజన్ ఏమిటి? మరీ మా వీధికి మీరు వాటర్ టేంకర్ రెండు పూట్లా పంపరా" అనే నిత్య ఫోన్స్ కంప్లైంట్ల్‌తో మా ఆఫీస్‌లోనే కాకుండా, అందరి మనసుల్లో , అందరి కుటుంబాల్లో నిశ్శబ్ధ విప్లవం పాకింది.

ఓ సాయంత్రం పూట, "వాసుదేవ్ ఇంటికి ఎప్పుడు వెళ్ళలేదు. వాడు చాలాసార్లు

పిలిచాడు. ఓ సారి వెళ్లీ వద్దాం పద, వాళ్ళది మన డాక్టరుగారింటి చివర ఇల్లే" అంటూ భార్యని తీసుకుని వాసు ఇంటికి బయలుదేరాడు క్రిష్ణారావు.

ఇంటి ముందు అప్పుడే నీళ్ళు జల్లి ముగ్గేసారేమో మట్టి వాసనలో కలిసిన గాలి ముక్కుకి సోకింది. అందమైన రంగవల్లి కంటికి ఆహ్లాదంగా, ఇల్లాలి అభిరుచికి చిహ్నంగా ఉంది. లోపలికెళ్ళిన క్రిష్ణారావు దంపతులు ఆశ్చర్య పోయారు. గట్టిగా పట్టుకుని పది  సామాన్లు కూడా లేవు. ఇల్లంతా ఖాళీగా ఉంది.

"రండి" అంటూ చాపలేసి వాసు దంపతులు సాదరంగా ఆహ్వానించారు. దొడ్లో తులసికోటలోని దీపం మెరుస్తుంది. సాంబ్రాణి సుగంధం ఇల్లంతా వ్యాప్తి చెంది ఉంది.

"నా భార్య రమ" పరిచయం చేసాడు వాసు.

"మనిషి అంత రూపవతి కాదు కాని చాలా ఒబ్బిడిగా ఉంది. మెళ్ళో చిన్న గొలుసు, చేతి నిండా మట్టి గాజులు, పెద్దగా బంగారం ఉన్నట్టుగా అనిపించలేదు. అదే రుక్మిణి వజ్రపు ముక్కుపుడకలో, బంగారు గాజుల్తో అందంగా మెరిసిపోతోంది. మనసులో గర్వంగా అనుకున్నాడు క్రిష్ణారావు.

వేడి పాలు తెచ్చి ఇచ్చింది రమ "మా ఇంట్లో కాఫీలు అలాంటివి అలవాటు లేవండీ! అతిధులు ఎండ వేళన వస్తే మజ్జిగ, చల్లటి వేళ పాలు" వాసు మాటలకి 'హహహహ' ముక్కుపుడక తళుక్కుమనేలా చిన్నగా నవ్వింది రమ.

"మా అబ్బాయి హుబ్లీ" పరిచయం చేసాడు వాసు. చురుగ్గా, హుషారుగా ఉన్నాడా కుర్రాడు.

"ఒక్కడేనా?" రుక్మిణి అంది. ఆరాగా!!!

"అవునండీ!" ఒక్కడే సర్దార్ వల్లభాయి పటేల్ అంటే మా వారికి విపరీతమైన అభిమానం. అందుకే ఆ పేరు పెట్టుకున్నారు.

"మాకు ఓ అబ్బాయి, ఓ అమ్మాయి"

రుక్మిణి మాటలకి "అలాగా పిల్లల్ని తీసుకురావాల్సింది సరదాగా అంది రమ.

అయ్యో సాయంత్రం వాళ్ళకి ఇంట్లోనే ట్యూషన్‌లు ఉన్నాయి. అందుకే చదువులూ పాడవుతాయిని ఎప్పుడు ఎక్కడికి ఎవరింటికీ కూడా తీసుకురాము నిజానికి అసలు నాకు కూడా ఎప్పుడు కుదరదు. నిత్యం వాళ్ళతోనే సరిపోతుంది' అంది రుక్మిణి.

కాసేపు మాట్లాడి ఇంటికి తిరిగి వచ్చేస్తుంటే "ఏవండీ మీకంటే అతను పెద్ద ఆఫీసర్ అన్నారు. మరి ఆ ఇల్లు వాళ్ళు ఇలా ఉన్నారు" అంది.

"ఏమో, అతనికి ఏవన్నా ఇతర బాధ్యతలు అవీ చాలా ఉన్నాయేమో రుక్మిణి" "క్రిష్ణారావు భుజాలు ఎగరేస్తూ అన్నాడు కాని ఆ ఇతర బాధ్యతలు ఏమిటో తెలిసింది క్రిష్ణారావు వాసు జీతాలు పేబిల్ ఆడిట్‌లో చూస్తుంటే.

నెలకి సీఎం రిలీఫ్ ఫండ్ రూ. 1000/-, బాలికా సేవ సదన్‌కి రూ.1000/- వృద్ధాశ్రమానికి రూ. 1000/- ఇలా అందరికీ పంచేస్తూ కేవలం సగం జీతం మాత్రమే వాసు ఇంటికి తీసుకు వెళ్తున్నాడు.

ఆశ్చర్యపోయాడు క్రిష్ణ "ఏమిటతను" అనుకుంటూ

కాస్త చనువు పెరిగాక, మరి కొన్ని నెలలకి "వాసు ఏంట్రా ఇది, మరీ అంత దేశభక్తా. లేదా మరీ ఇంత సమాజసేవా, కొంత ఇంటి విషయం కూడా పట్టించుకోవాలోయ్ నీకు కోరికలు ఉండకపోవచ్చు. కాని ఇంట్లో రమకి, హుబ్లీకి ఎవన్నా ఆశలు ఉండచ్చు కదా" అన్నాడు నెమ్మదిగా

"ఈ ఆదివారం ఖాళీగా ఉంటే నాతో గడపరా క్రిష్ణా అలాగే మూడు డజన్లు అరటిపళ్ళు తీసుకురా" అన్నాడు వాసు చిన్నగా నవ్వుతూ.

"బాలికా సేవ సదన్"! ముప్పై మందికి పైగానే ఉన్నారు ఆడపిల్లలు!! అంతా 13-14 ఏళ్లలోపే!!! వయసును, వారి అభిరుచిని బట్టి వాళ్ళని గ్రూపులుగా విడదీసాడు వాసుదేవ్.

"బాగా చిన్న పిల్లలకి హుబ్లీ పిట్ట కథలు, చిన్న చిన్న లెక్కలు కాసేపు చెప్పి కొన్ని ఆటలు ఆడించాడు" అదే టైమ్‌లో పెద్ద పిల్లలకి క్విజ్ పోటీ పెట్టి లెక్కల్లో చిట్టి చిట్కాలు ఇంగ్లీషులో గ్రామర్ కాసేపు చెప్పాడు క్రిష్ణ.

చదువు మీద అసలు దృష్టి కాని, ఆసక్తి కానిలేని పిల్లలకి రమ చిన్న చిన్న కుట్లు, ముగ్గులు, వంట చిట్కాలు చెప్పి సాయంత్రం వరకు వాళ్లని ఉత్సాహంగా, హుషారుగా చేసింది.

క్రిష్ణారావు చేత అందరికీ అరటి పళ్ళు, హుబ్లీ చేత తను తెచ్చిన బిస్కెట్స్, తీపి గవ్వలు ఇప్పించాడు వాసు! నెలలో రెండు ఆదివారాలు, వీళ్ళ కుటుంబం ఇక్కడే ఇలాగే ఈ అనాథపిల్లల్తో గడపుతారని తెలిసి క్రిష్ణారావు అవాక్కయిపోయాడు.

బయలుదేరి వస్తుంటే ఆ ఆడపిల్లల కళ్లలో వెలిగే దీపాల ముందు, ఆ ఉత్సాహపు జలపాతం ముందు ఆ రోజు సాయంత్రపు సూర్యుడు కూడా వెలవెలబోయాడు అనుకున్నాడు క్రిష్ణారావు.

"దా మా ఇంటిదాకా వచ్చి వెళ్ళు – చాలా రోజులైంది కదా వచ్చి" క్రిష్ణ భుజం చుట్టూ ఆత్మీయంగా చేయి వేస్తూ అన్నాడు వాసు. వాళ్ళింటి గేటు తీస్తూ మళ్ళీ ఆశ్చర్యపోయాడు క్రిష్ణ!!

ఇంటి ముందు ఉన్న కొద్దిపాటి జాగాలో చిక్కుడు, గుమ్మడి, సొర పాదులు చక్కగా పైకి వరండాలో పాకి ఉన్నాయి. ఓ పక్కన వంకాయలు, టమాటాలు బరువుకి మొక్కలు వంగి ఉన్నాయి. గులాబీలు, బంతిపూలు సువాసనలో వాతావరణాన్ని ఆహ్లాదభరితం చేస్తున్నాయి.

రమ, హ్లుబ్ కాళ్ళు కడుక్కుని లోపలికి వెళ్లిపోయారు

"దా! కూర్చో!" అంటూ వాసు.

క్రిష్ణా!! ఓ సారి వివేకానందుడ్ని విద్యార్థులు అడిగారట. "నిజమైన దేశభక్తి అంటే ఏమిటి? అని!!!!

"దానికి సమాధానం చెబుతూ ఏమన్నాడో తెలుసా?!"

"మన తరగతి గదిలోంచి బయటికి వెళ్ళే ముందు లైటు, ఫ్యాన్లు ఆర్పి మనం రోజు కనుక వెళితే అదే దేశభక్తి" అన్నాడు.

"మన తరం మన వంతు కర్తవ్యాన్ని నెరవేర్చాలి!! ఇప్పుడు మనదేశానికి తక్షణం కావాల్సింది అదే" గ్రూపులు కాదు, నినాదాలు కాదు, సమైక్య బంధం

కాదు, మన ఇంటి పని మనం సక్రమంగా చేసుకోవడం, మన చుట్టూ ఉన్న వీధిని శుభ్రంగా ఉంచుకోవడం, మన పిల్లల్ని క్రమశిక్షణగా పెంచుకోవడం, నిరాడంబరంగా జీవించగలగడం వ్యసనాన్ని వదిలించుకోవడం, మనిషి మనిషికి మధ్య బంధాన్ని డబ్బుతో కాకుండా ప్రేమతో ముడి వేసుకోవడం, ఇదిరా దేశభక్తి అంటే!! ఇప్పుడు మనం చూపించుకోవాలంటే చేయాల్సింది అంతే అది చాలు".

"ఓరేయ్ క్రిష్ణా పొట్ట నింపుకోవటానికి పట్టెడన్నం చాలురా!! కోట్లు మూట కట్టుకుని బ్యాంకుల్లో దాచుకొని ఏం సాధిస్తాం! చస్తూ అది కట్ట కట్టుకొని మనతో తీసుకుపోగలమా? చెప్పు పెరట్లో ఉన్న అరిటాకుని కోసుకుని ఇంత వేడన్నం కడుపు నిండా తింటే ఈ రోజు గడచిపోతుంది అది చాలురా!!

"పద ఈవాళ నీ భోజనం మా ఇంట్లోనే!" అంటూ వాకిట్లోని నాలుగు వంకాయలు, టమోటాలు కోసి చాకుతో కూరలు తరిగి వంటింటి గుమ్మం దగ్గర పెట్టాడు వాసు

వాసు మాటల్ని క్రిష్ణ సంభ్రమంగా వింటూ తల తిప్పి చూసాడు! రమ స్నానం చేసి వచ్చి ఇంటి ముందు నీళ్లు జల్లి అందంగా రంగవల్లులు వేస్తోంది! హుబ్లీ సాంబ్రాణిలు వెలిగించి, తులసి కోట కింద గూట్లో దీపం పెడుతున్నాడు!!

"ఏవండీ వింటున్నారా హుబ్లీ మిలటరీలో చేరుతున్నాడట!" మీరు ఒక్కసారి వాసుతో చెప్పి వద్దని వారించండి" రుక్మిణి చేతి మీద తడుతుంటే గతంలోంచి వర్తమానంలోకి వచ్చాడు క్రిష్ణ.

"రుక్మిణి నాకీ విషయం ముందే తెలుసు. నేను వాసును అడిగితే ఏమంటాడో తెలుసా?

"జాతస్య మరణం ధృవం" మనిషికి చనిపోయే యోగం ఉంటే ఏ ఉద్యోగం చేస్తున్నా ఎప్పుడైనా ఎక్కడైనా పోతాడు? మిలటరీలో ఉద్యోగం అయితే పోతాడు బయట ఉద్యోగం అయితే చనిపోడు అన్నీ గ్యారంటీ ఉందా??? అంటాడు.

రమ కన్న తల్లి  కాబట్టి, సహజంగా కొద్దిగా బాధగా ఉంటుంది! కాని నాలుగు రోజుల్లో ఆశ్రమం నుంచి ఓ ఆడ పిల్లని దత్తతకి తీసుకుని వాసు ఇంటికి తెచ్చుకోబోతున్నాడు!!! ఆ అమ్మాయిని పైలెట్ ఆఫీసర్ చేస్తాడట!

క్రిష్ణారావు మాటలకి "ఆ" అంటూ రుక్మిణి నోరు తెరచి విస్తూ పోతుంటే..

ఇంటర్ పాసై మెడిసిన్ చదువుతున్న అతని చిన్న కూతురు అప్పుడే లోనికి వస్తూ.

"ఇప్పుడే వాసు మావయ్య వాళ్ళింటికి వెళ్ళాను నాన్నా నేను కూడా హ్లుబ్ లాగే మిలటరీలో చేరి మిలటరీ డాక్టర్‌ని అవుతాను" ఉద్విగ్నంగా అంది.

రేపటి తరం ఆత్మవిశ్వాసాన్ని కళ్ళారా చూస్తుంటే క్రిష్ణారావు గుండె ఆనంద సముద్రమైంది.

వాసుదేవ్ లాంటి మిత్రుడు సహజీవనంలో తన జీవితం ధన్యమైందనిపించింది.

"ఏ భారతీయుడైన భారత పౌరుడుగా తన వంతు ధర్మాన్ని సక్రమంగా నిర్వహిస్తూ సమైక్యంగా వుంటే, ఈ దేశం వైపు కన్నెత్తి కూడా శత్రువులు భయపడతారని చరిత్ర రుజువు చేస్తోంది. గాంధీజీ అహింసావాదం, సర్దార్ పటేల్ ఉక్కు పట్టుదల, లాల్‌బహదూర్ శాస్త్రి నిరాడంబరత, నేతాజీ పౌరుషం, ఇందిరాగాంధీ ధైర్యం నేటి తరానికి నరనరాల్లో ఇంకి పోయేలా ప్రతీ భారతీయుడు తన పిల్లలకి నిత్యం నూరిపోయాలి" స్వాతంత్ర్యం కోసం పోరాడిన నాయకులకు, అమర జీవులకు ఈ దేశపు పౌరులుగా భరతమాత ముద్దు బిడ్డలుగా మనం ఇవ్వగలిగే చిన్న నివాళి ఇదొక్కటే!! అంతకంటే పెద్ద త్యాగాలు. ఈ దేశానికి మనమేమీ చేయినక్కర్లేదు!! ఇదొక్కటే చాలు"

వాసుదేవ్ మాటలు తూటాల్లా గుండెల్లో మారు మ్రోగుతుంటే

"అలాగే చిన్నీ వెరీగుడ్ డెసిషన్!! తప్పకుండా మిలటరీలో చేరుదువుగాని" అంటూ అభినందనగా కూతురు భుజం తట్టాడు క్రిష్ణారావు.

# చీకటి

**–డా॥ పెళ్లకూరు జయప్రదారెడ్డి**

**ఆ** రోజు గాలివాన...

కరెంటు లేదు...

జనరేటర్ మీద ఆ రాత్రి దొర్లుతోంది!

ఉరుములు మనుషుల్ని భయపెడ్తున్నాయి. ఆకాశాన్ని అలుముకున్న మెరుపులు కంటిచూపును చెదరగొడ్తున్నాయి. ఆ మెరుపుల్లో కొమ్మలు రెమ్మలు విరబోసుకుని ఊగుతున్న చెట్లు గ్లాస్‌విండో గుండా స్పష్టంగా కన్పిస్తున్నాయి.

అలాంటి సమయంలో తన స్వంత నర్సింగ్‌హోమ్‌లోకి తీసుకురాబడ్డ ఓ గర్భిణీ స్త్రీని పరీక్షిస్తోంది... డాక్టర్ స్వరూప – పక్కనే సిస్టర్ శ్రీదేవి.

సిస్టర్ హేమ, ఆయా షమీమ్ డెలివరీ రూమ్‌ని సిద్ధం చేసుకోవడానికి వెళ్ళారు.

పి.వి. చేసిన డాక్టర్ స్వరూప ఉలిక్కిపడింది....

అది అర్ధరాత్రి... పైగా – బయట నింగిని, నేలని ఏకం చేస్తున్న వర్షం! ఆ వర్షాన్ని ఆనందించే మూడ్‌లో వున్న స్వరూప ఉలిక్కిపడింది... ఈ హఠాత్ పరిణామానికి

బిడ్డ కంటే ముందుగా బొడ్డుతాడు వుంది.... బిడ్డ నాడి బాగానే వుంది. కానీ, ఆ బొడ్డుతాడు బయటపడిన కొన్ని నిముషాల్లోనే పసిబిడ్డ ప్రాణం పోగొట్టుకుంటుంది కాబట్టి – ప్రకృతి ఎంత రమణీయంగా వున్నా సరే... దాన్ని మర్చిపోయి, ఇప్పుడు ఈ పేషంటుకు ఆపరేషన్ చేయాల్సిందే.. తప్పదు!

గర్భంతో... 'ప్రసవ భయం' కించిత్ తొంగిచూస్తుండగా... అక్కడవున్న అందరి వైపు కొత్తగా చూస్తోంది – మరో ప్రాణిని ఈ భూమ్మీదకు తీసుకురాబోతున్న పూర్ణ.

బిడ్డ కంటే ముందుగా బొడ్డుతాడు వుందనీ... బిడ్డ ప్రసవం కంటే ముందు ఆ బొడ్డులోని నాడి బయటి ప్రపంచానికి ఎక్స్‌పోజ్ అవకూడదనీ... అలా జరిగితే

– కొద్ది నిముషాల్లోనే బిడ్డ గుండెశబ్దం ఆగిపోతుందనీ, వెంటనే ఆపరేషన్ చేయాలనీ... డాక్టర్ చెప్పడం విన్న బంధుజనం నిశ్శబ్దమైపోయారు.

ఆ అమ్మాయి  తలిదండ్రుల గుండెల్లో బండరాయి పడింది.

"అమ్మోఁ... మా పిల్ల ఇంజక్షన్‌కే తట్టుకోలేదు – ఆపరేషన్‌కి తట్టుకుంటుందా?" అక్కడవున్న ఒక ముసలామె నోరు విప్పింది.

"త్వరగా నిర్ణయించుకోండి... డాక్టర్‌గారు చెప్తున్నారు కదా! ఉమ్మనీరు పోతే బిడ్డకు అపాయమట!" నర్స్ హెచ్చరించింది.

సిస్టర్స్‌కి ఆపరేషన్ ఇన్‌స్ట్రక్షన్స్ ఇచ్చి, ఆరోజు ఆపరేషన్ అయిన కేస్‌ని చూడడానికి వెళ్లబోతోంది. స్వరూప.

"తొమ్మిది నెలల నుండి మీ కాడికే వస్తుంటిమే..." బొడ్డుతాడు ముందుగా వున్న విషయం డాక్టరమ్మ గానీ, ఆ స్కేన్ ఫోటోలు గానీ చెప్పనందుకు నిందించనట్టే నిందించింది. పేషంటు మేనత్త రాజ్యలక్ష్మి. పేషంటు తల్లి పార్వతి మాత్రం నోటిమాట పడిపోయినట్టు కూర్చోనుంది.

"చూడమ్మా... ఇలాంటి విషయాలు కొన్ని ముందుగా చెప్పలేం. ఇప్పటికిప్పుడు వచ్చే కాంప్లికేషన్స్ ఇవి. కాస్త తొందరపడండి... ఇప్పుడు మనం టైమ్ వేస్ట్ చేయకూడదు!" స్వరూప మెత్తగా అంది.

లేచి నిలబడింది పార్వతి –

"మీ కాడికి ఎంతోమందిని తీసుకొచ్చాను... ఎవ్వళ్ళకీ ఇట్టా జరగలేదు. మీ చెయ్యి చల్లటిదని మా అమ్మాయిని కూడా తీసుకొచ్చాను...." కడుపులో నుండి శబ్దాన్ని పైకి లాగి చిన్నగా గొణిగింది పార్వతి.

"ఇప్పుడు మాత్రం ఏమైంది? మీరు సంతకం చేస్తే... ఆపరేషన్ చేసి బిడ్డనూ, తల్లినీ మీకు అప్పజేప్తాను....."

"ఉహుఁ... వద్దు నాకు ఒక్కటే బిడ్డ!" మొండిగా అంది పార్వతి.

చిన్నగా నవ్వింది స్వరూపం.

"మీ బిడ్డకీ ఏమీ కాదు. మీ బిడ్డ బిడ్డకీ ఏమీ కాదు ఆపరేషన్ చేసి బిడ్డను మీకు అప్పజెప్తాను... భయపడకు!" అని ఆమె భుజం తట్టి, కదిలింది స్వరూప.

డాక్టర్‌ని అటు పోనిచ్చి, పేషంటు మేనత్త తన ఆడబిడ్డతో అంది –

"కాదులే వదినా! ఈ డాక్టర్లు అందరికీ ఒకటేమాయిన ఆపరేషన్లంటున్నారు. ఇప్పుడే కాన్పయిపోద్దా... ఏందీ? తొలి కాన్పయిపోయె... పొద్దుటిదాకా ఉగ్గబడ్తే మామూలు కాన్పయి పోద్దిలే!"

"అదే నేనూ అనుకుంటుండా...!" పార్వతి నీరసంగా అంది.

మొత్తానికి అందరూ మాట్లాడుకుని మామూలు కాన్పు అవుతుందని డిసైడయ్యారు.

ఎంతమంది నర్సులు ఎన్ని రకాలుగా చెప్పినా... వాళ్లల్లో కదలిక లేదు.

అరగంట తర్వాత

నిద్రకళ్ళతో మరలా డాక్టర్ స్వరూప సీట్లోకి వచ్చి కూర్చుంది.

ఆ అమ్మాయి భర్తను, అత్తమామల్ని పిలిపించింది. ఈ అరగంటలో వాళ్ల మధ్య జరిగిన సంభాషణల్ని నర్సు ద్వారా విన్న స్వరూప – వాళ్ళతో సౌమ్యంగానే అంది...

"మీరు ఆ అమ్మాయి భర్త కదా... మీరైనా ఓ మంచి నిర్ణయం తీసుకోండి."

అతను తల వంచుకున్నాడు.

బయట వర్షపుజోరు పెరిగింది. నింగిని, నేలను కలుపుతున్న చుక్కల కర్టెన్‌లా వుంది.

"ఆపరేష నొద్దంటున్నారాళ్ళు....!" బుద్ధిమంతుడిలా అన్నాడు పేషంటు భర్త.

"వాళ్ళమ్మ సంగతి వదిలేయండి... మీ అభిప్రాయం చెప్పండి!"

"ఖర్చు పెట్టుకునేవాళ్లు వాళ్ళు కదా!"

"బిడ్డ చనిపోయే అవకాశాలు తొంభైపాళ్ళున్నాయి. మీరైనా మంచి నిర్ణయం తీసుకోండి!" మెత్తగా చెప్పింది స్వరూప మరలా.

"మేమేం చెయ్యగలం? వాళ్లమ్మ గయ్యాళిది! అపాయిటేనేమైనా జరిగితే మా నెత్తికి వచ్చి చుట్టుకుంటది!" పేషంటు అత్తగారు తెలివిగా తప్పించుకుంది.

"బిడ్డ చనిపోయినా పర్వాలేదా?" ఈ సారి కాస్త గట్టిగా అంది స్వరూప.

"ఇంకేం చేయగలం?"

వాళ్ల మొండితనానికి కొద్దిగా కోపం వచ్చింది స్వరూపకు.

"అయితే... రిసెప్షన్ కెళ్ళి రిజిస్టర్‌లో మీ నిర్ణయం వ్రాసి, సంతకం చేయండి!" అనేసి, ఆ గాలివానలో శ్రమ తప్పినందుకు ఓ ప్రక్క ఆనందపడ్తూ... మరో ప్రక్క వాళ్ల అమాయకత్వానికీ, చూస్తూ చూస్తూ బిడ్డను చంపుతున్నందుకు బాధపడ్తూ... రూమ్‌కు వెళ్ళిపోయారామె.

"అనవసరంగా ఆపరేషన్ చేస్తున్నారని మీకు అనుమానమా?"

– పేషంటు భర్త చేత, తల్లి చేత సంతకం చేయించుకుంటూ అడిగింది సిస్టర్ హేమ.

సిస్టర్ హేమ ఆ ప్రశ్న అడగడంలో అర్థం వుంది. చాలామంది పేషంట్సులో ఆ అనుమానం వుంది.

దానికి కారణం... మెడికల్ నాలెడ్జ్ లేకపోవడమే!

'బిడ్డ పోయినా పర్వాలేదు... తల్లిని రక్షించండి చాలు!' అని అడిగే రోజులు గతించి పోయి చాలా కాలమయ్యింది. తల్లితో పాటు కడుపులో బిడ్డను కూడా అంతే విలువగా చూస్తున్న ఈ రోజుల్లో బిడ్డ కోసంగా చాలా డెలవరీస్ ఆపరేషన్ ద్వారా చేయాల్సివస్తున్నాయి.

"అదేంగాదు.... మాకు ముగ్గురు పిల్లలు కావాల! ఇప్పుడు ఆపరేషన్ అయితే మిగతాది కూడా ఆపరేషన్ అంట కదా! రెండు ఆపరేషన్లు మించి చేయకూడదంట కదా?!" ఈ సారి కుతూహలంగా అడిగింది పార్వతి.

"అదేం కాదు! ముందు పుట్టిన బిడ్డలు చనిపోయిన పేషంటు ఒకామెకు డాక్టర్‌గారు నాలుగోసారి ఆపరేషన్ చేసి బిడ్డను తీయడం మేము చూశాం. అలా అని మీ అమ్మాయికి నాలుగూ చేయించుకోమని కాదు. ఆ అమ్మాయి రెండో కాన్పుకు మూడేళ్లు గేప్ ఇస్తే... మామూలు కాన్పు అవుతుంది కూడా!"

నర్స్ వాళ్ళను ఒప్పించడానికి ప్రయత్నిస్తోంది.

కానీ, వాళ్ళు గట్టి నిర్ణయానికే వచ్చినట్టున్నారు... ఏమీ మాట్లాడడం లేదు.

నిముషాలు గడిచిపోతున్నాయి....

వర్షం జోరు తగ్గింది!

తన కుర్చీలో కూర్చున్న నర్సు శ్రీదేవి కునికిపాట్లు పడుతోంది.

మరో గంట గడిచింది.

కరెంట్ వచ్చింది... జనరేటర్ ఆగింది.

పేషంటు తాలూకు బంధువర్గం మరలా చర్చలో పడ్డారు...

మరో రెండు గంటల తర్వాత వాళ్ళలో జ్ఞానం ఉదయించినట్లు... ఓ 'నిర్ణయం' ప్రసవించింది.

"డాక్టరమ్మని పిలవండి... ఆపరేషన్ చేయమనండి!"

–ఎవరో ఒక అపరిచిత యువకుడు అన్నాడు.

డాక్టర్‌లో, నర్సుల్లో, ఆయాల్లో మరలా చైతన్యం... అంతా హడావుడి!

కానీ, ఏం లాభం? బిడ్డ అప్పటికే తన తల్లిదండ్రుల్ని అసహ్యించుకుని, మరణాన్ని ఆహ్వానించింది. ఆ విషయం డాక్టరమ్మ నిర్ధారణ చేయగానే... పేషంటు తాలూకు వాళ్ళలో టెన్షన్ రిలీవ్ అయ్యింది.

నొప్పులు పెరగడానికి, ద్వారం ఏర్పడడానికి నర్స్‌కి ఇన్‌స్ట్రక్షన్స్ ఇచ్చి డాక్టర్ స్వరూప వెళ్ళిపోయింది.

ఒక్క గంట గడిచింది.

ప్రసవానికొచ్చిన పూర్ణలో అన్ని అనుభూతులూ మాయమై... కేవలం శారీరక బాధ ఆమెను చుట్టేసిన క్షణాలవి! ఆమె ఆ బాధను భరించలేక కేకలు పెడ్తోంది.

ప్రాణంతో వున్న బిడ్డ కడుపులోని శిశువు ఆక్రందనను పట్టించుకోని పార్వతి – తన బిడ్డ పడ్తున్న బాధకు తట్టుకోలేకుంది.

కుర్చీలో కూర్చుని, హాయిగా నిద్రపోయే వాళ్లను చూసి అసూయపడ్తూ... నిద్రను తరిమేయలేక, సుఖనిద్రకు ఆస్కారం లేక తంటాలు పడ్తున్న డ్యూటీ నర్స్‌ని కుదిపి లేపింది ఆమె.

“ఏమిటీ...?”

“కొంచెం డాక్టరమ్మని పిలువు!”

“ఎందుకు?” కళ్ళు నులుముకుంటూ అంది సిస్టర్ శ్రీదేవి.

“పిల్లకి నొప్పులు ఎక్కువగా వున్నాయి.. తట్టుకోలేకుంది”

“పద... నేను చూస్తాను.”

శ్రీదేవి వెనకనే దిగులుగా నడిచింది పార్వతి.

పూర్ణతో జీవితం కొనసాగించాల్సిన ఆమె భర్త – ‘ఈ బాధ్యత తనది కాదు’ అన్నట్టు హాయిగా నిద్రపోతున్నాడు.

అతని తల్లి మంగమ్మ మాత్రం ఓ మూల దిగులుగా కూర్చోనుంది. ఆమెకు తన నట్టింట్లో పారాడాల్సిన బిడ్డ – కడుపులోనే మరణించినందుకు ఒక ప్రక్క బాధగా ఉంది. మరో ప్రక్క మామూలు కాన్పయిపోతుందనే నమ్మకం ఆమెకు ఉపశాంతి నిస్తోంది.

“కాన్పు కావడానికి ఇంకా రెండు మూడు గంటల పైనే పడ్తుంది. నువ్వు హాయిగా పడుకో.... మాకెలాగూ తప్పదు!” అని సీట్‌లోకి పోబోతున్న నర్స్ చెయ్యి పట్టుకుంది పార్వతి.

“ఇంకా రెండు మూడు గంటలా? లోపల సెప్టిక్ అయిపోదా?”

పేషంట్సులో ఎన్నో అపోహలు... ఇంకెన్నో అనుమానాలు!

“అవదులేమ్మా... ఇంజక్షన్స్ ఇస్తున్నాము కదా!” ఆవలిస్తూ అంటున్న నర్స్ మత్తును క్షణంలో ఎగరగొట్టేసింది పార్వతి.

“లేదు ... లేదు... మా అమ్మయికేమన్నా అయిపోద్ది! మీకేం...? మీరెన్నయినా చెప్తారు! డాక్టరమ్మను పిలువు.... ఆపరేషన్ చేసేయమని చెప్పు”

నర్సుతో పాటు అక్కడే వున్న పూర్ణ అత్త మంగమ్మ కూడా తెల్లబోయింది.

"ఇప్పుడు ఆపరేషనా? చచ్చిన బిడ్డకు ఆపరేషన్ చేస్తే... మరో మూడు కాన్పులు కావాలాయె... అందులో ఇద్దరన్నా మగ నలుసులుండాలి కదా!"

వియ్యంకురాలి మాటల్ని పట్టించుకోలేదామె.

తన బిడ్డ మీద వున్న ప్రేమ – ఆమెను మరి దేన్నీ పట్టించుకోనివ్వడం లేదు. తనకు వియ్యపురాలి దగ్గర నుండి రాబోయె అపవాదుల్ని కడుపులో బిడ్డ బ్రతికుండగానే ఆమె లెక్క చేయలేదు... అలాంటిది – తన బిడ్డకు ఏదో అయిపోతుందనే భ్రమ, ఆ బిడ్డ మీద అమితమైన ప్రేమ, తన ఏకైక సంతానానికి ఏదైనా జరిగితే తను బ్రతుకలేదనే నిజం... ఇవన్నీ కలిసి ఆమెను పిచ్చిదాన్ని చేస్తున్న టైమ్‌లో... మంగమ్మ మాటలు పట్టించుకుంటుందా పార్వతి?!

"నర్సమ్మా! నువ్వు డాక్టరమ్మకి చెప్పు పోమ్మా... వచ్చి ఆపరేషన్ చేసేయమనీ!"

"ఈ మాటేదో కడుపులో బిడ్డ బ్రతికుండగానే చెప్పుండుంటే ఎంత బావుండేది?"

అని నర్సు మరలా కుర్చీలో కూర్చుంది. ఆమెకు వాళ్ళ అజ్ఞానపు నిర్ణయం నచ్చినట్టు లేదు.

"కాదులే... నువ్వు పో! పొయ్యి డాక్టరమ్మను లేపుకు రా.... పో! మా అమ్మవు కదా....!"

"మొదట అందరూ కలిసి మాట్లాడుకోండి..... ఆ తర్వాత చెప్పండి! మీరు పూర్తిగా నిర్ణయించుకున్నాక డాక్టర్‌గారిని పిలుచుకొస్తాను.... " విసుగ్గా అంది శ్రీదేవి.

అందరూ మరలా సమావేశమయ్యారు.

డాక్టర్ స్వరూప తన మనస్సాక్షికి వ్యతిరేకంగా ఆ అర్ధరాత్రి ఆపరేషన్ చేసి మృతశిశువును తీయాల్సివచ్చింది.

మరొక్కరోజు ఆగినా పూర్ణకు ఏమీ అపాయం జరగదని ఎంత చెప్పినా పార్వతి వినలేదు. ఒకవేళ తాను మామూలు ప్రసవం చేయడానికి ఒకపూట వదిలేశాక – ద్వారం ఏర్పడకో, బిడ్డ శిరస్సు క్రిందకు దిగకనో... తప్పనిసరై ఆ తర్వాత ఆపరేషన్

చేయాల్సివస్తే..  తన అపురూపమైన కూతుర్ని అజాగ్రత్త చేసిందని పార్వతి తన మీద నింద వేయగల అజ్ఞానురాలిగా అన్పించి – తన ఆలోచనను విరమించుకుంది. డాక్టర్ స్వరూప.

అజ్ఞానంతో డాక్టర్స్ మీద కేసులు పెడ్తున్న కాలం ఇది మరి!

బిడ్డను సజీవంగా ఇవ్వలేని ఆపరేషన్ చేసినందుకు బాధపడ్తూ... తన సీట్‌లో విచారంగా కూర్చొనున్న డాక్టర్ స్వరూప – తుళ్ళిపడింది.

గది బయటనుండి పెద్ద పెద్ద కేకలు విన్పిస్తున్నాయి.

"స్కేనింగ్‌లో ఆడపిల్ల అంటివే నువ్వూ? అందుకని, బిడ్డ పోయినా పర్వాలేదనుకున్నాం గానీ... లక్షణమైన మగబిడ్డను పొట్టన పెట్టుకున్నావు కదే...?! పూర్ణ అత్తగారు మంగమ్మ అరుస్తోంది.

"స్కానింగ్‌లో ఏ బిడ్డ? " అని అడిగితే – ఆ డాక్టరమ్మ చెప్పలేదు. ఆడపిల్లయితేనే కదా చెప్పరని అనుకున్నాను!" నీరసంగా అంటోంది పార్వతి.

ఆపరేషన్ చేయించుకొని లక్షణంగా పడక మీద పడుకున్న కూతుర్ని చూసిన ఆనందం – పుట్టింది మనవడని తెలీగానే... ఆమెలో హఠాత్తుగా హరించుకుపోయింది. వియ్యపురాలు వేస్తున్న నిందలకు కంపించిపోతోందామె.

అన్నీ వింటున్న డాక్టర్ స్వరూప ఉండబట్టలేక పార్వతిని లోపలికి పిలిపించింది.

లోపలికి వచ్చిన పార్వతి ముఖంలో నెత్తురుచుక్కలేదు.

"మగపిల్లాడయితే ఆపరేషన్ చేయించుండేవాళ్ళా? ఏ బిడ్డయితే ఏమ్మా?"

"ఏమోనమ్మా! తప్పంతా నా నెత్తినేశారు గానీ – స్కానింగ్ కాడికి నా అల్లుడు కూడా వచ్చాడు. ఆడే అన్నాడు – 'ఆడపిల్లే అయ్యుంటుంది... లేకపోతే ఏ బిడ్డో ఎందుకు చెప్పరు?' అని! అప్పణ్ణుండి గొడవే... ఆడపిల్లయితే నాకొద్దని!" అంటూ అక్కడే కూలబడి మరలా మొదలెట్టింది.

"ఆడపిల్లయితే... అది పెరిగి పెద్దయ్యాక యాభైవేలు కట్నం ఇవ్వాలంట! నేను భయపడ్డాను తల్లే! ఆపరేషన్ చేసి ఆడపిల్లను తీస్తే... ఆ తర్వాత ఇంకొక్క బిడ్డే! అదీ ఆడదయితే... వాడు నన్నిక బతకనిస్తాడా? నా పిల్లను పుట్టింటికి అంపేయడూ?!!"

డాక్టర్ స్వరూపకు వాళ్ళ భయం పూర్తిగా అర్థమయింది.

నవ్వూ, ఏడుపూ రెండూ... ఏకకాలంలో ఆమెని చుట్టేశాయి. ఆమె సంస్కార సభ్యత గీటు దాటేసింది. –

"పార్వతీ! మీ అమాయకత్వమే మగవాళ్ళని సింహాసనం ఎక్కిస్తోంది. నీకు తెలుసా? ....మగబిడ్డ కలగాలంటే అది మగవాడి చేతిలోనే వుంది. అతనికే 'వై' క్రోమోజోమ్స్ అనేవి వుండేది. ఆడవాళ్ళలో అవి ఉండవు. భర్తలో 'వై' కణాలు హుషారుగా లేకపోతే... పుట్టేది ఆడపిల్లలే! ఈ విషయం వెళ్ళి మీ అల్లుడికి చెప్పు!" విసురుగా అంది స్వరూప.

"నిజమా? అయినా... ఇప్పుడు మగ నలుసు కలిగితే?! అమ్మో... ఇప్పుడు చెబ్దే ఇంకేమన్నా వుందా?" నిట్టూర్చింది – తన అమాయకత్వానికీ, అజ్ఞానానికీ తన బిడ్డ మాతృత్వాన్ని బలిపెట్టిన ఓ ఆడపిల్ల తల్లి... పార్వతి.

# ఎండమావులు

**-శ్రీలత**

"మగవాడొక ఎండమావి! దూరం నుండి చూసి, తన దప్పిక తీర్చుకోవడానికి జీవితపు ఆఖరిక్షణం వరకూ స్త్రీ అతని వెంట పరిగెడుతూను ఉంటుంది. దాహం తీరకపోగా తన ఆయుష్షు తానే తగ్గించుకుంటుంది.

శారద ఎందుకలా నిర్లిప్తంగా అందో?!

ఏ అనుభవం ఆమెనలా మాట్లాడించిందో?!

అందుకే నేను మౌనంగా విన్నాను. శారద తొందరపడి మాట్లాడే మనిషికాదు.... అతిలోతైనది!

"మీవారు నీతో బావుంటున్నారా ఇప్పుడైనా?" అని అడిగిన నా ప్రశ్నకు జవాబుగా తానా మాట అంది.

పెళ్లైన కొత్తలో వాళ్ల దాంపత్యం గురించి చెబుతూ – "ఆయన వారానికోసారి తాగుతారంతే! మిగతారోజుల్లో నాతో చాలా బాగుంటారు" అని చెప్పేది. కొద్దిగా గొంతు గీరబోయినా ఏదో సంతృప్తి ఆమె గొంతులో వినబడేది.

ఆ తర్వాత రెండు మూడు సంవత్సరాల తరువాత కలిసినప్పుడు తను డాక్టరుగా బాగా పుంజుకున్నానని, ఆయన మాత్రం కాస్త ఎక్కువే తాగుతున్నారని, డబ్బుకు కొదవలేకపోయినా ఆయన తాగుడు గుండెకు కొంచెం బాధ కలిగిస్తున్నదనీ చెప్పింది, ఆ బాధలో 'కొంచెం' బాధ మాత్రమే వెలువరించింది.

సైన్స్ స్టూడెంటయినా – చిన్నప్పటినుంచి దానిక్కాస్త దైవభక్తి ఎక్కువగానే ఉండేది. 'ఆయన బాగుకోసం పూలంగి సేవ చేయిస్తున్నా'నని చెప్పింది.

"నీ మొహం! పూజల్తో తాగుడు మానేస్తే ఇక తాగుబోతుల బాధ భారతదేశంలో

ఉండేది కాదు. ఎందుకంటే ప్రతి స్త్రీ ఏదో ఒక దేవుడికి ఎంతో కొంత పూజ చేస్తూనే ఉంటుంది" అన్నా.... నేను విసురుగా – దాని అమాయకత్వాన్ని చూసి!

"ఏదో ఒక పని చేస్తే మనలో చెడు తొలుగుతుందనే ఆశ బ్రతుకుకు తృప్తినిస్తుందే!" అంది. అప్పుడు తన మాటల్లో వేదాంతం వినబడింది.

మరోసారి కలిసినప్పుడు –

"ఆయన తాగితే తాగారు కానీ, నన్ను ప్రాక్టీసు మానేయమంటున్నారు. అందుకే కొంచెం బాధగా ఉంది!" అంది.

"మొదట్లో 'తాగడం కొంచెం బాధగా ఉంది....' అనేదానివి. దానికలవాటు పడిపోయి ప్రాక్టీసు మానేయమనడం కొంచెం బాధగా ఉందంటున్నావు – ఎందుకే అలా...?" గొంగళి పురుగు గుర్తొచ్చి!

"అయినా... ప్రాక్టీసు ఎందుకు మానాలి?" కొంచెం కోపంగా అడిగాను – అది ఎం.బి.బి.యస్. చదవడానికి ఎంత కష్టపడిందో తలుచుకుంది.

"నేనందరిలో తిరగడం ఇష్టంలేదట!" అంది.

"మరింకేం... బురఖా వేసుకు బ్రతుకు!" అన్నా... కాస్త కోపంగానే.

ఏమనుకుందో తెలీదు – "అసలు ప్రాక్టీసు మానసుగానీ, ఇంటికొచ్చే పేషెంట్లను చూడను" అంది.

"ఏం పాపం. అంత త్యాగం చేస్తున్నావు?" వెక్కిరింతగానే అన్నా – అది అర్థమయ్యీ, కానట్టే.

"అదికాదే... సంసారమన్నాక ఎవరో ఒకరు సర్దుకుపోవాలి గదా! అటువైపు సర్దుబాటు లేనపుడు ఇటువైపైనా ఉండాలిగా!" అంది దిగులుగా.

"సరే... అలాగే! నీ పరిధిలో నువ్వు బ్రతుకు. అతనికి అడ్డులేకుండా పోతుంది!" అన్నా.

"ఛాల్లేవే... సంసారం కోసం ఆ మాత్రం సర్దుకుపోకపోతే ఎలా?" అంది ఒక దండం పెట్టి వచ్చేశా.

అప్పట్నుంచి మళ్లీ కలవలేదు. తనంతట తానే నన్ను చూడాలనిపించిందట...

రెండురోజులు ఉందామని నా దగ్గరకు వచ్చింది.

మాట వరుసలో చెప్పింది–

'అతనికి తాగుడు మరీ ఎక్కువయిందట! డబ్బుకోసం కూడా తనను బాగా వేధిస్తున్నాడట! రాత్రిపూట ఇంటికి రావడానికి లేటవుతుందిట! కానీ... అంత తాగినా, రోడ్లమీదపడినా బాధలేదు గానీ, అతని ఆరోగ్యం పాడయి ఏవయినా అయితే తనూ, పాపా ఏమయిపోతారోనని కొంచెం బాధగా ఉందిట!".... చెప్పింది.

ఇక నాకు తిట్టడానికి తిట్లు దొరకలా! అందుకే మౌనంగా చూస్తూ ఉండిపోయాను.

చూసీ చూసీ తనే అంది –

"ఇంకా అనవేమే... 'నీ చదువూ, నీ తెలివీ ఇలా తగలబడ్డాయేమిటి?' అని అనూ!"

"నీకు నువ్వు పరమానందంగా పతివ్రతా కష్టాలు అనుభవిస్తూ అందరి స్త్రీలకూ ఆదర్శంగా నిలుస్తుంటే ఆనందంతో మాట రావడం లేదే!" అన్నా.

అప్పుడేడ్చింది! గుక్క తిప్పుకోకుండా ఏడ్చింది..!

తన నలాగే ఏడ్వనిచ్చాను... కనీసం ఓదార్చడానికి కూడా ప్రయత్నించలేదు నేను. కాసేపయ్యాక తనే ఆపేసి కళ్ళు తుడుచుకుంది. పాపను ఒళ్ళోకి తీసుకుంటూ – "నువ్వు తిడుతుంటే నాకెంత ఆనందంగా ఉంటుందో తెలుసా?" అంది. నేను మాట్లాడలేదు.

"అచ్చం నీలా ఆలోచించాలనీ, నీలా బ్రతకాలనీ నాకూ ఉంటుందే! నాకే కాదు, అందరి ఆడవాళ్లకూ ఉంటుంది. కానీ ఒప్పుకోరు. వాస్తవంలో ఉండటానికి ఏ స్త్రీ కూడా ఒప్పుకోదు. తనకంటూ రేపటికో ఆశను దాచుకుని ఈ రోజును కొనసాగిస్తుంది, అంతేగానీ, ఈ రోజుల్లో ఏ స్త్రీ కూడా జీవించదు. ఈరోజులో గనక స్త్రీ జీవిస్తే సంసారాలు నిలవవు ప్రపంచంలో!" అని ఆగింది.

నేనలాగే చూస్తూ ఉండిపోయాను.

"నీకు తెలుసా... ఏ స్త్రీ కూడా పురుషుడి వల్ల సంతృప్తి పడదు – ఏ

కోణంలోనూ! అందుకే ఆ అసంతృప్తిని పట్టుచీరల మాటున, నగల చాటున దాస్తుంది! మధ్య తరగతి స్త్రీలు మౌనం చాటున దాస్తారు! ఉత్తమ ఇల్లాలనే బిరుదు మాటున దాస్తారు! తమకంటే కొంచెం తెగించి, తనకంటూ స్వతంత్రం నిలుపుకున్న స్త్రీ మీద ఈర్ష్యతో, తాము అలా ఉండలేకపోతున్న బాధతో స్త్రీలే తమను తాము ఉద్ధరించుకోలేక ఆ స్త్రీని అవమానాల పాలు చేస్తారు. దాన్ని మగవాడు తన కనుగుణంగా మార్చుకుంటాడు! అందుకే నేను ఎదురుతిరగడం లేదు" ఆగింది... నా ముఖంలో ఎక్స్‌ప్రెషన్స్ చూడ్డానికి!

నేను నిర్లిప్తంగా ఉండిపోయాను.

"ఎదురుతిరిగినా – బ్రతకాల్సింది ఈ సమాజంలోనే! సర్దుకుపోయినా – బ్రతకాల్సింది ఈ సమాజంలోనే! ఎదురుతిరిగి సమాజంలో వెలివేయబడడం కన్నా సర్దుకుపోయి సమాజపు జాలిని పొందడం కొంత ఊరట! ఇప్పుడు అర్థమైందా... ఏ ఆడదీ మగవాడి వల్ల అన్ని కోణాలలోనూ సంతృప్తి పడదు! తన అసంతృప్తిని బయటపెట్టడానికీ ఇష్టపడదు!" మళ్ళీ ఓసారి రిపీట్ చేసింది.

"అందుకే నీతో – 'మీ ఆయన ఎలా ఉంటున్నా'డనే ప్రశ్నకు మగవాడ్ని ఎండమావిని చేసింది! మగవాడు ఎండమావయ్యాక స్త్రీకి దప్పిక తీరేదెక్కడ? కానీ ఆ దాహార్తిని కప్పుకోవడానికి బోలెడు ముసుగులున్నాయి. ఆ ముసుగు చాటునే ఆడది దాహంతో అలమటిస్తూ, నవ్వులు చిందిస్తూ మరణిస్తుంది" అంది.

నేను అలాగే నిశ్చేష్టనై చూస్తూండిపోయా! ఇన్నాళ్లూ శారదకు ఈ విషయాలేవీ తెలీవు అనుకునేదాన్ని. అన్నీ తెలిసికూడా... ఊహించడం ఇష్టంలేకపోయింది!

"నువ్వు నా గురించి ఏవీ ఆలోచించకే! మా ఆయన ఎన్ని చేసినా ఇంతవరకూ నన్నూ, పాపను బజారులోకి లాగలేదు. అందుకే కొంచెం ఆనందంగా ఉంది" అంది... అని చేయిని నొక్కి, "బై..." అంటూ బయలుదేరి వెళ్లిపోయింది.

నాకు చుట్టూ ఉన్న మగాళ్లందరూ ఆవిరై సాగిపోతున్నట్లూ..., ఆడవాళ్ళు ఆ ఆవిరి వెనుక పరుగెడుతున్నట్లూ అనిపించింది.

నిట్టూర్పు కూడా మరచి చూస్తూండిపోయా నలా...!

# వండనన్నావ్! ఎందుకొండేవ్?

## -చాగంటి కృష్ణకుమారి

**తె**ల్ల పంచకట్టి లాల్చి తొడిగిన ఓ కర్ర శరీరం మా ఊరి బస్సుస్టాండ్‌లో బస్సుదిగి పెట్టి పట్టుకొని నడుచుకొంటూ ఓ ఇంటి గుమ్మందాకా వచ్చి నిలుచుండిపోయింది. ఇల్లు తాళం పెట్టి ఉంది. ఆ ఇల్లే కాదు వరసగా ఆ వీధిలోని ఇళ్లన్నీ తాళం పెట్టి ఉన్నాయి. ఆ వీధి జంటలందరూ ఉద్యోగస్తులు, వారి పిల్లలందరూ బడికి వెళ్లే వయసులో ఉన్నవారు. సమయం మధ్యాహ్నం ఒంటిగంట. ఎండ పేలిపోతున్నాది. అంతా నిశ్శబ్దం, నిర్మానుష్యం.

బర్ బర్ బర్ర్ మంటూ స్కూటర్ మీద ప్రక్క ఇంటి ఆసామి వచ్చాడు.

"నమస్కారమండీ ఎప్పుడొచ్చారు? సాయంత్రం అయిదు దాటితే కానీ ఎవరూ ఇల్లు చేరరు. నేనూ రావలసిన వాడిని కాను. ఏదో పని తగలబట్టి డాక్యుమెంట్‌ల కోసం ఇంటికొచ్చా. మీరు వస్తున్నట్టు మేడం గారికి తెలియదా? మా ఇంటికి రండి. నేను మళ్లీ వెళ్లాలి. మీరు మా ఇంటిలో విశ్రమించవచ్చు."

"పరవాలేదు, ఒక స్టూల్ ఉంటే తెచ్చివ్వండి. ఇలా ఇక్కడ ఈ నంది వర్ధనం చెట్టుకింద కూర్చుంటా"

"మీరు మొహమాట పడుతున్నారు. ఎంతలేదన్నా మీ అమ్మాయీ, మనుమరాలూ రావడానికి మరో నాలుగు గంటలు పడుతుంది. అంత వరకూ బయట కూర్చోవడమెందుకు? ఎండ చాలా తీవ్రంగా ఉంది కదా!!"

"నాకీ చెట్టుకింద బాగుంటుంది. ఇక్కడే కూర్చుంటా."

"సరే మీ ఇష్టం"

ప్రక్క ఇంటి ఆసామీ మడత కుర్చీ తెచ్చి చెట్టుకింద వేసి చర్‌చరని స్కూటరెక్కి మాయమయ్యాడు.

"ఓహో! తాతా, తూతూ, తోతే వచ్చేడే!"

"ఆహా! ఓహో! తాతమ్మకి సైకిల్ తొక్కడం వచ్చిందే!"

"ఒక్కరోజు అంటే ఒక్కరోజులో నేర్చుకొన్నా. రెండు సార్లు పడ్డాను. కొంచెం మొణుకులు గీరుకుపోయాయ్ అంతే. రెండు నెలలనుండీ స్కూల్కి సైకిల్ మీదే వెళుతున్నా"

"మీ అమ్మ నీకు సైకిల్ కొనిచ్చిందన్నమాట! మీ స్కూల్ మరీ దూరం కాదు. నడిచివెళ్ళే దూరమే. సైకిల్ ఎందుకూ?"

"వీపు మీద పుస్తకాల సంచి చచ్చే బరువు తాతా! గూని దానిలా వంగి నడుస్తాగా! అందుకు కొంది. పైగా సైకిల్ నేర్చుకొందికి నాది సరియైన వయసుట! అదిగో! అమ్మ కాలేజ్ బస్ అటువెళ్లింది. అటు వెళ్లి, ఇటు తిరిగి మన ఇంటిస్టాప్ దగ్గరికి వచ్చేస్తుంది"

బస్ దిగడంతోనే దూరంనుండే తాతా, మనవరాలు మంచి ఉత్సాహంతో వెలిగిపోతూ కనిపించారు. ఏ బస్‌కి వచ్చాడో? ఎక్కడ నుంచి వచ్చాడో? వచ్చి ఎంతసేపయిందో? ఆ వివరాలు తరువాత అడిగి తెలుసుకొన్నవే!

అలా సడన్గా వచ్చేస్తూవుండేవాడు నాన్న నా దగ్గరికి.

ఖమ్మంలో జరిగిన సాహిత్య సభకి వచ్చి నీ దగ్గరకు వచ్చాడంటే అర్థముంది. పోనీ హైదరాబాదో వరంగల్లో వచ్చినప్పుడు మీ ఊరికి కూడా వెళ్లేడన్నా అది సబబే అనుకోవచ్చు. రాజమండ్రి వెళ్లినా తిరిగి ఇంటికి రాడు నీ ఊరు వస్తాడు. కాకినాడ వెళ్లినా, బెజవాడ వెళ్లినా నా దగ్గరకి రావాల్సిందే! మరీ విడ్డూరం కాకపోతే పొద్దున్నే విశాఖపట్నం వెళ్లిన వాడు సాయంత్రం నాన్‌స్టాప్ బస్సెక్కి ఇంటికి రావాలా. రైలెక్కి నీ దగ్గరకు రావాలా!" పెద్దగా నవ్వుతూ నేను దానికి సంజాయిషీ ఇవ్వాలన్నట్టు ఫోన్ చేసి మరీ ఓసారి నన్ను నిలదీసాడు నా తమ్ముడు.

ఇప్పుడు రావట్లేదు. ఈ నాటికి సరిగ్గా 18 ఏళ్లు. మళ్లీ మరి వస్తే ఒట్టు! రాడు. అలా వచ్చే రోజులు మరిలేవు. రోజులు మారిపోయాయి. మరిరాడు!

లోపలికి అడుగు పెడుతూనే "హాల్లో మంచం తీసేసారా" అన్నాడు. ఉద్యోగరీత్యా నాకు అలాట్ అయిన క్వార్టర్‌లో మేముండే వాళ్లం. గవర్నమెంట్ వారు హాలులో

రెండు ఫాన్లు. ఒక పడకగదిలో ఒక ఫాన్ ఇచ్చారు. ఇంకో చిన్న పడక గది ఉంది కానీ అందులో ఫాన్ లేదు. నాన్న రాగానే ఆ గదిలో మంచం తెచ్చి హాలులో వేసేవాళ్లం, ఆయన వెళ్లిపోయాక మళ్లి గదిలోకి మార్చేసే వాళ్లం. మంచం తీసేస్తే బాగా విశాలంగా కనిపిస్తూ హాల్ బాగుంటుంది.

"అమ్మ సీలింగ్ఫాన్ కొని ఆ గదిలో పెట్టించింది తాతయ్యా! నా పుస్తకాలకే టేబుల్, నీ మంచం, నువ్వు బట్టలు పెట్టుకోవడానికి బీరువా కూడా ఆ గదిలోకి మార్చేసాం, ఎంచక్కా నువ్వు నీ గదిలోనే పడుకోవచ్చు. హాలులో మంచం ఇంక వెయ్యక్కర్లేదు"

గదిలోకి తొంగిచూసి ఇబ్బందిగా మొఖం పెట్టాడు.

"కాఫీ తాగి స్నానం చేయి నాన్నా. ఈలోగా మేమిద్దరం కలిసి మంచం హాలులోకి మార్చేస్తాం. ముందు ఈ మంచినీళ్ళు తాగు" అన్నా గ్లాసు అందిస్తూ.

"ఎందుకమ్మా? అక్కడ ఫాన్ ఉందిగా?"

"తాతకి అక్కడ బాగుండదు. హాల్లో పడుకుందికే ఇష్టపడతాడు"

"అబ్బా. ఆ మంచాన్నీ పరుపుని అక్కడనించి ఇక్కడకు తెచ్చి వేయడం కష్టం బాబూ, నేను పట్టలేను. తాతా! గదిలో పడుకోవా? ఎంత నీట్‌గా సర్ది పెట్టామో రా, చూద్దువు గాని" అంటూ తాతమ్మ తాత తెచ్చుకొన్న పెట్టిని ఒక చేత్తో, మరో చేత్తో తాత చేయిపట్టుకొని లోపలికి తీసికెళ్ళింది.

"సరే అయితే ఇక్కడే పడుకొంటానులే" అంటూ కాఫీ తాగి స్నానానికి వెళ్ళాడు.

"మంచం మార్చుదాం రావే"

"తాత అక్కడ పడుకొంటానన్నాడుగా"!

"అన్నాడు కానీ, తనకి హాలులోనే పడుకోవాలని ఉంది. పడుకొని టి.వి. న్యూస్, క్రికెట్ మేచస్ చూస్తూ ఉంటాడుగా."

"సోఫాలో కూర్చొని చూస్తాడుగా"

"ఎక్కువసేపు కూర్చోలేడు, అదీకాక ఆ గది తాతకు నచ్చదు. దాని కిటికీలోంచి పెరటి వేపు ప్రహరీ గోడ ఎత్తుగా కనిపిస్తుంది. ఆ వ్యూ బాగుండదు. తాతకి చెట్లు

ఆకాశం కనిపిస్తూ ఉండాలి. నీకు నేను ఇన్ని సంజాయిషీలు ఇచ్చుకోవాలా, రా ఇలా! ఈ పరుపుని అటు వేపు పట్టుకో! నేను ఇటువైపు పట్టుకొంటా, నిలువుగా సరిగా తిప్పి పట్టుకొంటే గది గుమ్మంలో పడుతుంది".

"అబ్బా! ఇదో గేద్దూడ బాబూ, ఎంత బరువుందో చూడు."

"గట్టిగా పట్టుకో జార్చకు"

"ఏమిటి ఇద్దరూ గొడవపడుతున్నారూ?"

"చూడు తాతా! నువ్వు గదిలో పడుకొంటావని చెప్పినా కూడా మంచం తెచ్చి ఇక్కడ వెయ్యాలంటుంది"

"మా గొడవేదో మేము పడుతున్నాం. మా సంగతి నీకెందుకూ. ఇందులో నువ్వు తలదూర్చకు!"...

పరుపుని ఈ గోడకాంచుదాం ఇటు తిరుగు"

"అమ్మ! చచ్చానురా దేముడా."

మంచం మీద ప్లాంక్ ఆ తరవాత మంచాన్ని అలాగే నిలువుగా తిప్పి చెరో వైపు పట్టుకొని హాల్‌లోకి తెచ్చాం. చీపురుతో మంచం కింద వైపు పట్టిన బూజు దులిపి పక్క ఏర్పాటు చేసాం. ఉతికిన దుప్పటి వేసి తలగడకి కొత్త గలేబు తొడిగాం.

సుతిమెత్తని కోతి బొమ్మని బుగ్గకానుచుకొని మురిసిపోతూ కనురెప్పలు సగం వాల్చి దాని వంక చూస్తూ హాయిగా పక్కకు తిరిగి పడుకొన్న రెండేళ్ళ పాపడిలా ఆ పరుపు మీద అప్పుడు నాన్న పడుకొన్నాడు. నిన్న మొన్నలా ఉంది. అప్పుడే ఎన్ని సంవత్సరాలు దొర్లిపోయాయో!

ఇంచుమించుగా 18 ఏళ్లయి దగ్గరకి రావడం మానేసాడు. నా తమ్ముడిని, 'నాన్నని నా దగ్గరకు పంపించరా' అని అడగనూ లేను, స్వయంగా రమ్మనమని పిలవనూ లేను. అమ్మ సిఫార్సు పని చేయదు. అయినా ఒకరు ఆయనకు చెప్పాలా? నేను పిలవాలా? సర్వ స్వతంత్రుడు రావాలనుకొంటే వచ్చేస్తాడు. వచ్చినంతకాలం తనకు తానుగానే వచ్చాడుగా! నేను పిలిస్తే వచ్చాడా? అయిపోయాయ్. అలా వచ్చే ఆ రోజులు వెళ్ళి పోయాయ్. ఇంక మళ్లీరావు.

మా కుటుంబాలలో దాదాపుగా నాన్నతరం ఆ తరువాతి తరం మొగవారికెవరికీ వంట ఇంటి పనుల్లో ప్రవేశం ఉండేది కాదు. నాన్న తనకు తానుగా ఒక గ్లాసు మంచినీళ్ళు తెచ్చుకు తాగిన సందర్భం నా ఇంటికి వచ్చేదాకా మచ్చుకి చెపుదామన్నా ఒక్కటంటే ఒక్కటీ లేదు. నాన్న బజారుకెళ్లి వచ్చినా లేదా ఇంకెక్కడికి వెళ్లివచ్చినా సావిట్లోకి అడుగుపెట్టగానే మంచినీళ్లు పెద్ద కంచు మరచెంబుతో పట్టుకెళ్లి ఇవ్వడం మాకు అలవాటు. సావిడిలోనే ఎప్పుడూ ఉండేవాడు. కేవలం భోజనానికి మాత్రం నట్టింటిలోకి వచ్చేవాడు. అమ్మ వడ్డిస్తూ ఉంటే అందరం కలసి అన్నంతినే వారం. నాన్న బాగా ఆలస్యంగా వచ్చి ఒక్కడే తినాల్సిన సందర్భంలో అమ్మ వడ్డిస్తూ ఉంటే నేను లేదా మా తమ్ముడు విసెనకర్రతో విసురుతూ ప్రక్కన నిలుచునే వారం. నాన్నని అతని తల్లి భార్యా ఆ విధంగా పెంచుకొచ్చారు. నాన్న దగ్గర అలా మెలిగేటట్టుగా మమ్మల్ని పెంచారు.

"నీ దగ్గర మీ నాన్న పనులు చేయడం బాగా నేర్చుకొన్నారు. మధ్యాహ్నం రెండు గంటలకి ఆయనే కాఫీ పెట్టుకు తాగుతున్నారుట కదా!" అంది మా అమ్మ నేను పుట్టింటికి వెళ్లినప్పుడు  అన్నం తిన్నాక కూర్చున్న పీట గోడకి ఎత్తి పెట్టాడుట! ఆవిడ వచ్చేలోగా తిన్న కంచం తీసికెళ్ళి పెరట్లో మోరీ దగ్గర పెట్టాడుట. మరోమాటు మంచినీళ్ళు కావాలంటూ వంటింట్లోకి వెళ్ళి నీళ్ళబిందె కోసం వెతుకుతున్నాడుట. ఈ సరికొత్త ప్రవర్తనకి ఆవిడకి ఆశ్చర్యం వేసిందట!

పొద్దున్న ఎనిమిదిన్నరకల్లా తాతమ్మ స్కూల్కి వెళ్ళేది. మా కాలేజ్ బస్ తొమ్మిది నలభైకి మా స్టాఫ్ దగ్గరకి వచ్చేది. నేను 9-9.15 కల్లా పన్లు పూర్తి చేసుకొని కాస్సేపు కూర్చుని 9.30 కి ఇల్లు తాళం పెట్టి వెళ్ళేదాన్ని. మొదటి సారి నాన్న వచ్చినప్పుడు టేబుల్పైన వండినవన్నీ పెట్టాననీ పెట్టుకు తినమని చెపుతూ వంట ఇంటిలోకి తీసికెళ్ళి కాఫీ ఫిల్టర్ చూపించాను. "ఫ్రిజ్‌లో పాలు తెచ్చుకొని ఈ చిన్న గిన్నెలో పోసి పాలు బాగా వేడెక్కాక డికాషన్ కలిపి మరికాస్సేపు వేడి చేసి కప్పులో పోసుకో" అని చెప్పి స్టవ్ ఎలా వెలిగించాలో, పటకారుతో గిన్నె ఎలా పట్టుకోవాలో చూపించాను. నేను, తాతమ్మ కొద్ది నిముషాలు అటు ఇటుగా సాయంత్రం అయిదు తరువాత ఒకేసారి వస్తామని చెప్పాను. రెండోసారి కాఫీ కలిపిచ్చి వెళ్లాను.

సాయంత్రం ఇంటికొచ్చేసరికి టేబుల్‌పైన గిన్నెల మీద మూతలు లేవు. మూతలు తీసిలేని గిన్నెలలోని వంటకాలని అసలు వడ్డించుకోలేదని అర్థమయింది. తిన్న కంచం అల్లానే ఉంది. పెరుగు టేబుల్‌పైన వదిలీసాడు. తిరిగి ఫ్రిజ్‌లో పాలు తెచ్చుకొని వంటింటిలోనే వదిలేసాడు. ఎందువల్లో పాలు విరిగిపోలేదు. నేను ఆ ఊసులేమీ ఎత్తకుండా కాఫీ కలిపిచ్చాను.

"కాఫీ ఒలికి పోయింది. బజారుకెళ్ళి తాగాలను  కొన్నాను. కానీ వెళ్ళలేదు" అన్నాడు.

విని ఊరుకొన్నాను. ఫ్లాస్క్ ఒకటి కొనితెచ్చి అందులో కలిపిన కాఫీ ఉంచవచ్చు. అని అనిపించింది. కానీ ఆ కాఫీ బాగుండదు వద్దులే అని మనసులో అనుకొన్నాను.

నాకు మౌనంగా పన్లు చేసుకోవడం అలవాటు నాన్న కూడా మౌనంగా ఉండేవాడు. "తక్కువ మాట్లాడుతాడు. ఎక్కువ వింటాడు. మౌనం విలువ తెలిసిన వాడు" అని ఆయన ప్రాణ స్నేహితుడు  ఒకమారన్నాడు. అది నిజమే!

అలా కొన్ని రోజులు గడిచాయి. ఒక రోజు కాలేజీనించి రాగానే

"ఏమిటి నాన్నా! టేబుల్‌పైన అన్నీ అమర్చి పెట్టినా పెట్టుకు తినడం రాకపోతే ఎలా? గిన్నెలమీద తీసిన మూతలు మళ్లీపెట్టవు. మిగిలిన కూరలూ అవీ మనమే రాత్రికి తింటాం కదా?" అంటూ విసుక్కొన్నాను. అంతే!

ఆ మరుసటి రోజు నుండీ తిన్న తరువాత టేబుల్ని నీట్‌గా ఉంచడం కంచం గరిటెలు సింక్‌లో పెట్టడం పాలు, పెరుగు వాడుకొన్నాక ఫ్రిజ్‌లో పెట్టడం మొదలుపెట్టాడు.

"నేనుండి ఏమిటి నీకు లాభం? మరికొంచెం పని ఎక్కువవడం తప్ప! మీ అమ్మ అయితే నీకు వంట చేసి పెడుతుంది. అన్నాడోసారి.

"బాగుంది నువ్వు ఉండడమే పెద్దలాభం" అన్నా.

మా అమ్మ ఏనాడు బజారుకి వెళ్ళి ఎరగదు. ఇంటికి కావలసిన సరుకులు కూరలూ నాన్నే తెచ్చేవాడు. నాన్న నా దగ్గరున్నన్నాళ్ళు కూరలు కొని తెచ్చుకొనే పని నాకు తప్పేది. ఇంట్లో కూరలుండగానే కూరలు తెచ్చి పడేసేవాడు. వీధిలోకి ఆకుకూరలు అమ్మేవాళ్ళు ఉదయం తొమ్మిది తొమ్మిదిన్నర దాటాక వచ్చేవారు. నాన్న కొని ఉంచేవాడు.

ప్రతిరోజు ఏదో ఒక ఆకుకూర పప్పో, పులుసో లేక కూరో ఒకటి తప్పనిసరిగా ఉండాలి. ముందు రోజు ఆకుకూరలమ్మాయి రాలేదు. ఉదయం నా వంట అయిపోయి నేను కాలేజీకెళ్ళడానికి తయారై పుస్తకం పట్టుకు కూర్చున్నాను. టైం తొమ్మిదయింది. వీధిలోకి తోటకూర వచ్చింది. గేటు తెరుచుకుని వెళ్ళి పెద్దగా పిలిచి కూర కొన్నాడు. లోపలికి తెచ్చి. "కూర చేసై" అన్నాడు.

"అబ్బా! ఇప్పుడు వంటంతా అయిపోయాక మళ్ళీ వంటింట్లోకి వెళ్ళి వండలేను. ఇప్పుడికిప్పుడు వండాలంటే ఎలా? రేపు వండుతానులే" అన్నాను!

మరి రెండు నిముషాలకి లేచి వెళ్ళి కూర వండాను. "వండనన్నావ్ ఎందుకొండేవ్?"

"కూర లేతగా ఉంది. ఎంత సేపు మెత్తపడడానికి టైం ఉందనిపించింది. చేసాను" అంటూ హాండ్ బాగ్ పుచ్చుకు బయలుదేరాను. బస్ మిస్ కాలేదు...

నిన్న మొన్న జరిగినట్టు అనిపిస్తున్న ఆ సంగతి తలపుకి రాగానే "వండనన్నావ్! ఎందుకొండేవ్?" అన్న డైలాగ్ లేదా అలాంటిదే అనిపిస్తున్న డైలాగ్ మరింకెక్కడో ఎవరో అనగా విన్నట్టు అనిపించింది. ఎక్కడబ్బా? ఎవరన్నా రబ్బా? అనుకొంటూ ఆలోచిస్తూ కూరలు కొనుక్కొని రావాలని బయలు దేరాను. చటుక్కున "మొక్కుబడి" కథ గుర్తుకొచ్చింది.

కథ రాయడానికి ప్రయత్నించు అని ఒక సారో రెండు సార్లో నాన్న నాకు చెప్పాడు. నేను ఆ పని చేయలేదు. అందుకే రావడం మానేసాడేమో? నేనో కథ రాస్తే చదివి కథ ఎలా రాయకూడదో చెప్పడానికి వస్తాడేమో! నేను అధమపక్షం ఒక్కటంటే ఒక్క కథైనా రాయాలి తప్పదు రాయాలి. అనుకొంటూ ఉండగా నాన్న సందుమలుపు తిరిగి అటేటో వెళ్ళిపోతూ కనిపించాడు.

"నాన్నా! నాన్నా! ఎప్పుడొచ్చావ్ ఈ ఊరికి? అటెటు వెళ్ళిపోతున్నావ్? మనిల్లు ఇటుంది పద పద... ఇంటికి పోదాం పద".

"మీరంతా నేను చచ్చిపోయాననుకొంటున్నారుగా?"

"ఎవరనుకొంటున్నారు? నువ్వేమిటి? చచ్చిపోవడం ఏమిటి?

"బతికి ఉన్నాను కదా! బతికే ఉంటాను. నేను చచ్చిపోలేదని ఒప్పుకొన్నావు కదా!"

"ఏమిటి ఈ పిచ్చి మాటలు పద ఇంటికి"

"నేను రాను"

"అదికాదు నాన్నా. నేను ఒక కథ రాసాను. అది రాసి చాలా కాలమైంది. దాని గురించి మాట్లాడాలి రావూ?"

"అలాగా. అయితే పద, వస్తా. ఊ, ఇంతకీ ఏదీ నీ కథ? కథకేపేరు పెట్టావ్?"

"ఎందుకు విసిరేస్తాను అమ్మా?" అని పెట్టాను"

"ఆ విసిరి వేయనవి ఏమిటి?" "ఖాళీ పాల పాకెట్లు"

"ఓహో! సరే అల్లా పేరు పెట్టకు బాగుండదు. ఆ శీర్షికని కొట్టీ"

"ఏమీ? ఎందుకు బాగుండదు?"

"ఎందుకు పారేస్తాను నాన్నా?" అని ఒక కథ ఉంది కదా మళ్లీ ఇదెందుకూ?"

"ఆ కథ చాలా గొప్ప కథట కదా! దాని వరవడిలో రూళ్ల మధ్య ఆ దస్తూరీని అనుకరిస్తూ కాపీ రాసుకుపోయా, విశ్వ సాహిత్యానికి నేనో గొప్ప కథ రాసానని విర్రవీగి విరగబాదుదామని నా సంకల్పం."

"అలా రాస్తే అది నీ కథ ఎలా అవుతుందీ? నీ కథేదో నువ్వు రాసే విధానమె నువ్వు రాయాలి. గొప్ప కథవునో కాదో ముందు నీకు నువ్వుగా తేల్చుకోవాలి

"కాపీ చేయలేదు... దాన్ని నమూనాగా తీసుకొన్నాను...."

"శీర్షికనే కాపీ కొట్టావ్! కాపీ కాదంటావేమిటి? మాట్లాడుకొనేటప్పుడు మేమంతా మా కాలంలో కన్యాశుల్కంలో డైలాగ్స్ సందర్భానుసారం యథాతథంగా దించేసి ఆనందించేవాళ్ళం నువ్వు అలా సరదాకి నన్ను ఆట పట్టించ దలుచుకొంటే సరే, కానీ సీరియస్‌గా కథ రాయలనుకొంటున్నావా లేదా?"

"ఆ మాటకొస్తే "ఎందుకు పారేస్తాను నాన్నా" కథ ఉన్న ఆ సంపుటంలోని కథలన్నీ కాఫీ కథలే? కావలిస్తే మరోమారు చదివి చూసుకో!

"ఏమిటన్నావ్? కాపీకథలన్నావా? కాఫీ కథలన్నావా."

"ఆ మాటకొస్తే రెండూనూ"

"అదెలా?"

"పెళ్లాం ఇచ్చిన కాఫీ రెండేసి గుటకలేస్తూ నాలుగేసి వాక్యాలు రాస్తూ నాలుగు నిముషాల్లో రాసి పారేసిన కథలు కాఫీ కథలు కాక సారా కథలు అవుతాయా?"

జేబులోంచి చుట్టతీసి చిరునవ్వులొలికిస్తూ నోట్లో పెట్టుకొన్నాడు.

"చుట్ట కాల్చడం మళ్ళీ మొదలెట్టావ్?"

"ఈ చుట్ట నువ్వు ఎరిగిన చుట్ట కాదు. అత్యంత ఆధునికమైన నా బ్రాండ్ చుట్ట. దీనిని వెలిగించనక్కర్లేదు. నోట్లో ఓ మారు పెట్టుకొని వెంటనే తీసేస్తే చాలు రీచార్జవుతుంది. నా వేళ్ళ మధ్య అది ఉన్నంత సేపూ సృజనశక్తి పరిసరాల నుండి నాలో ప్రవేశిస్తుంది. అలసట ఉండదు. నే ఎక్కడకి వెళ్లాలనుకొంటే అక్కడకి వెళ్ళగలను. కారుచీకట్లను ఛేదించుకొంటూ చూడగలను"

"నా కోటి ఇయ్యి"

"నీకెందుకూ?"

"నేను శక్తి సంపన్నురాలిని కావద్దా? చీకట్లను చీల్చుకొంటూ పోవద్దా?"

"ఎందుకు పారేస్తాను నాన్నా? కథని కాపీ కొట్టిన నీ నోట్లో ఇది చార్జ్ అవదు. నీకిది పనికిరాదు. అన్నట్టు ఆ సంపుటాలలోని కథలు కాపీ కొట్టినవి అన్నావ్? ఏ కథ దేనికి కాపీవో చెప్పు చూద్దాం.

"ఒక దానికి కాపీ అని ఎప్పుడు చెప్పానూ? అందులోని ప్రతీ కథా ఒక అతుకుల బొంత"

"ఎంత మాటన్నావ్? సద్విమర్శని నేను ఆహ్వానిస్తాను. సహేతుకంగా చెపితే ఒప్పుకొంటాను. చిక్కగా, సన్నంగా దవళంగా నేనే స్వయంగా నేసి నా పెళ్ళానికి కట్టబెట్టిన పట్టుశాలీ వలువల వంటివి ఆ కథలు అవి నా విశ్వాసం."

"ఆ వలువల్ని సాలిపురుగు గూడు నేసుకొంటూఉంటే దాని దారపు వరుసల్ని చూస్తూ అదే వరుసల్లో నేసావట! అమ్మ నాకు చెప్పింది. నాకు తెలియదనుకోకు. ఈ కథలు అటువంటివే అయితే సాలిపురుగు సృజనకి కాపీలు కావా? అదీ కాక నువ్వే నేసి నీ పెళ్ళానికి కట్టబెట్టిన పట్టుశాలీ వలువలు నీకు నీ భార్యకీ ప్రియమైనవి కావచ్చు. అందరికీ ఎందుకవుతాయ్?"

"కాదు కాదు మహారాణీ మొదలూ మామూలు మహిళ దాకా ప్రతీ ఆడది మెచ్చుకొనే పట్టు రవికల గుడ్డలతో సహా లభించిన నాలుగు వేళ్ల వెడల్పు చుట్టు జరీ చీరల వంటివి ఆ కథలని  నా నమ్మకం"

"అంటే అవి ఆడ కథలా? ఆడవాళ్ళు మాత్రమే మెచ్చగలిగేటంతటివా?"

"కథకి లింగమేమిటి? నీ మొఖం."

"తెలుగు కథల మీద పరిశోధన చేయాలనుకొన్నప్పుడు రకరకాలుగా వాటిని వర్గీకరించి లోతుగా అధ్యయనం చేయాల్సి ఉంటుందిగా.. అప్పుడు ఈ కథలని ఏ విభాగంలో చేర్చవచ్చో తెలుసుకొందికి అడిగా."

"అదేదో నువ్వే తెలుసుకో"

"కథలకి ఆడ మొగ అనే లింగబేధం ఉండదన్నావు కనక, పోనీలే వాటిని కలిం(ళిం)గ కథల విభాగంలో చేర్చుకొంటానులే"

"అయితే ఆ కథలు అతుకుల బొంతలంటావ్? ఏదీ మారో మాటు అను!"

"ఎందుకు ఉడుక్కుంటావు నాన్నా?"

ఓ సన్నని చిరునవ్వుని విసిరి 'గుడ్డొచ్చి పిల్లని వెక్కిరించిందట! అలా ఉంది. నీ వ్యవహారం నేనేమిటి ఉడుక్కోవడమేమిటీ? ఇంతకీ నాకా రచయిత మీద ఈషన్మాత్రం పక్షపాత బుద్ధిలేదు. దాక్షిణ్యం లేదు. నేనతనిని చాలా తీవ్రంగా విమర్శించేవాడిని. నువ్వు బాగా చిన్న పిల్లవి. నీకా సంగతులు తెలియవు. అసలప్పటికి ఇంకా నువ్వు పుట్టలేదేమో సరిగ్గా జ్ఞాపకంలేదు" అన్నాడు.

"అవునట కదా? ఎందుకు పారేస్తాను. అయిదుసార్లు తిరగరాయించేవుట?"

"అవును, మొదటి ఐదు వెర్షన్స్‌నీ నాకు చదివి వినిపించిన ప్రతీసారీ చింపి పారేయమన్నాను. పారేసాడు కూడా"

"ఎందుకు పారేయమన్నావు నాన్నా?"

మళ్లీ చిరునవ్వులు చిందిస్తూ చేతిలో చుట్టవైపు అపురూపంగా చూస్తూ చెప్పాడిలా.

"నాకో మాదిరిగా నచ్చాయనుకో, కానీ పాత్ర చిత్రీకరణ నాకు సంతృప్తి నీయలేదు."

"అయితే చింపేయడమెందుకూ? వాటిని ప్రక్కకు పెడ్తూ కొత్త వెర్షన్స్ రాసుకోమనవచ్చు కదా?"

"బాగున్నాయనే ప్రలోభంలో పడి మరింత నాణ్యతా సాంద్రతలకు అతను ప్రయత్నించక పోయే ప్రమాదం ఉంది"

"చాలా తప్పుడు సలహా ఇచ్చావ్! వాటిని తీసికెళ్ళి అమ్మకి ఇచ్చి ఉండాల్సింది. ఇనప్పెట్టి ఎలాగూ ఖాళీ అయిపోయింది. కనక దానిలో పెట్టి తాళం వేసి చెవి ఖాళీ కందిపప్పు డబ్బాలో పడేసేది. ఇనప్పెట్టి అమ్మినప్పుడు ఒకే వస్తువు మీద ఒకే రచయిత రాసిన అయిదు కథలు నాకు దొరికేవి..."

"ఈ కథ దగ్గర ఆ కథలు వొంగి నిలబడతాయ్. అవి ఎందుకూ నీకూ?

"కథల నాణ్యతా సాంద్రతలకీ నిటారుతనానికీ గ్రాపులు గీసుకొని ఆరు చుక్కలతో వచ్చే రేఖా లక్షణాలని అధ్యయనం చేసేదాన్ని. ఓ చక్కని పరిశోధనా వ్యాసం రాసి పబ్లిష్  చేసుకొనేదాన్ని"

కుడిచేతి వేళ్ల మధ్య నున్న చుట్టను అట్నించిటూ ఇట్నించిఅటూ తిప్పుతూ చిరునవ్వు వొలక బోసాడు.

"ఎందుకూ నవ్వుతావ్?"

"పరిశోధనకి మంచి టాపిక్కే! అందుకు నువ్వు సమర్థురాలివే! ఖాళీ పాల పేకట్ల మీద నువ్వు రాసిన ఈ కథను పక్కకు పెట్టి దాని సంగతి మర్చిపో. మళ్ళీ కొత్తగా రాయి. మరోమాటు మళ్ళీ రాసుకో. ఆ పరిశోధనా వ్యాసమేదో నీ మీద నువ్వు రాసుకో. ఎవరు కాదంటారు?

"చూసావా? కథ చదివి వినిపించకుండానే దాన్ని పక్కకు పెట్టి మళ్లీ రాయమంటున్నావ్!"

"కథ చదివితే వస్తువు కూడా బాగులేదని కొట్టిపారేసినా పారేస్తావ్. నీతో వచ్చిన  చిక్కే ఇది. అందిస్తే చాలు అల్లుకు పోతుంది? ప్రయోగశాలలో రసాయనాలను వండిన పిల్ల అది! ఊహతో వంటింటి వంటలు వండలేదా? ఇలా చూస్తే అలా పట్టుకొంటుంది. లేసులల్లడం ఎంబ్రయిడరీ చేయడం చిటికలో నేర్చుకొంది అని అత్తయ్య నన్ను ఎంతగా మెచ్చుకొనేదో! ఆ మాత్రం కథలను వండలేనా! అల్లలేనా కుట్టలేనా?"

"నువ్వు సమర్థురాలివే అన్నారు కదా! ఎందుకూ అలక? 18 ఏళ్లక్రితం నేనన్న మాట మర్చిపోయావ్?"

"మర్చిపోలేదు. ఎందుకు మర్చిపోతాను నాన్నా? నీ కథా వారసురాలి వైపు చూపుడు వేలు పెట్టి చూపిస్తూ "నీకంటే" అంటూ ఆ వేలుని నావైపుకి తిప్పి "ఇది బాగా రాయగలదు" అన్నావ్. గుర్తుందిలే"

"అన్నాను కదా! నువ్వూ నా వారసురాలివే! ఆ కథని నువ్వే మరోమాటు చదువుకో. నీకు నచ్చిందనిపించాకనే నాకు వినిపించు" అన్నాడు ఎంతో చక్కగా నవ్వుతూ

"నేనింక ఆ ఖాళీ పాల పేకట్ల కథ మరి రాయను"

"పోనీ మరి దేనిమీదైనా రాయి ఈ మానవ సమాజంలో కథా వస్తువులకి కొదవేమిటి? నెత్తిమీద వెంట్రుకలున్నన్ని దొరుకుతాయి."

"ఎవరి నెత్తిమీదవి? నీ నెత్తిమీదవా? నా నెత్తిమీదవా?"

"వత్తుగా నల్లని వంకుల జుట్టుతో ఉన్న నన్ను నువ్వు ఎరగవు!"

"బట్టతల వచ్చాక నన్ను కన్నావా, నన్ను కన్నాక బట్టతల వచ్చిందా?"

"ఏమో గుర్తులేదు. నా నెత్తిమీద ఉన్న వెంట్రుకులన్ని కథలు రాయి చాలు"

"సరే అయితే ఏదీ చూసి లెక్కపెట్టుకోనీ అంటూ లేచి నిలబడ్డానో లేదో అంతలోనే అంతర్ధానమయ్యాడు.

# తొలి వెలుగు

**-వావిలకొలను రాజ్యలక్ష్మి**

చేటలో బియ్యం పోసుకొని వంటింట్లో నుంచి పెరట్లోకి వున్న గుమ్మంపై మెట్టు మీద కూర్చుంది అనసూయ. బియ్యాన్ని అటు ఇటు కెలుకుతూ... మట్టి బెడ్డల్ని ఏరి వేస్తూ పెరట్లో వున్న బాదం చెట్టుపై గలాటగా అరుస్తున్న కాకుల్ని అప్పుడప్పుడు పరికిస్తూంది.

ఇంతలో బయట కాలింగ్ బెల్ మోగింది.

లేచి చేతిలోని చేట వంటింట్లో పెట్టి గబగబా హాల్లోకెళ్లి తలుపులు తెరిచింది. గుమ్మంలో ఎదురుగా చేతిలో సూట్‌కేస్ పట్టుకొని నిల్చుని వుంది సుజల. హఠాత్తుగా కూతుర్ని అలా చూడగానే అనసూయ భ్రుకుటి ముడిపడింది. పైకి మాత్రం చిన్నగా నవ్వుతూ "చెప్పాపెట్టకుండా వచ్చావేం సుజీ?..." అని పలుకరిస్తూ కూతురి చేతిలోని సూట్‌కేస్‌ను అందుకోబోయింది.

"ఏం, రాకూడదా?..." దూకుడుగా అంటూ సూట్‌కేస్ తల్లికి ఇవ్వకుండా విసురుగా లోపలికి వచ్చిన సుజల హాండ్ బ్యాగ్‌ను సోఫాలో పడేసి బాత్‌రూం వైపు వెళ్ళింది. వంటింట్లో కెళ్ళి కాఫీ కలుపుతూ కూతురి హఠాత్ ఆగమనానికి విస్తుపోతున్నట్లుగా ఓ క్షణం ఆలోచనలో పడింది అనసూయ.

టవల్‌తో ముఖం తుడుచుకుంటూ వంటింట్లోకి వచ్చిన కూతురికి కాఫీ కప్పు అందిస్తూ, "అల్లుడుగారూ... మీ అత్తగారు వాళ్లంతా బాగున్నారా?..." అందామె.

"ఆఁ, అంతా కులాసే!...." ముక్తసరిగా జవాబు.

"పద... హాల్లో కూర్చుందాం..." అంటున్న తల్లిని అనుసరిస్తూ "ఎవరు లేరేం ఇంట్లో...?" విస్మయంగా అడిగింది సుజల.

"ఎవరుంటారు ఈ వేళలో ఇంట్లో.. మీ తమ్ముడు మరదలు ఆఫీసుకెళ్లారు. సాయంత్రానికల్లా వచ్చేస్తారు.

"ఓహోఁ ఇప్పుడు ఆవిడగారు కూడా జాబ్ చేస్తుందా?" కళ్ళెగరేసింది సుజల. "ఎందుకని నేనే ఉద్యోగం చేయమని చెప్పాను. ఒక నెల అవుతుంది చేరి. అందునా ఈ రోజుల్లో మొగుడు పెళ్ళాం కష్టపడితేనే నాల్గు డబ్బులు వెనకేసుకోగలరు. మనకేం పెద్దల ఆస్తిపాస్తులు లేవు కదా?... రేపు పిల్లా జెల్లా పుట్టుకొస్తే అక్కరకొస్తుంది.

"తనకేం? ఇక దర్జాగా రాణిలా ఉద్యోగం వెలగబెడుతుందన్న మాట! ఇంట్లో ఇంటి పనికి ఎంచక్కా నీవు వున్నావుగా!...."

కూతురి వెటకారపు ధోరణి అనసూయకు నచ్చలేదు.

"రమ్య చాలా మంచిదమ్మాయ్! నన్ను ఒక్కపనీ చేయనీయదింట్లో తెలుసా? తాను వెళ్ళే వరకూ అన్నీ తానే చేస్తుంది. నేను చేస్తానని చెప్పినా వినదాయె!.... మధ్యాహ్నం కాస్త వేడిగా అన్నం వండుకుంటానంతే! మళ్లీ సాయంత్రం వచ్చాక రాత్రి వంట పని అంతా తానే చూసుకుంటుంది. చాలా అణుకువగల అమ్మాయి. మంచి పనిమంతురాలు కూడాను" కోడల్ని మెచ్చుకోవడం అసలు రుచించలేదు సుజలకు, కాఫీ కప్పు కింద పెడ్తూ చిన్నగా నిట్టూరుస్తూ తల్లి వంక ఓమారు తీక్షణంగా అదోలా చూసింది.

"నేను అన్నం వండేస్తాను సుజీ! నువ్వీలోగా స్నానం చేసేయ్ ఇద్దరం కలిసి భోజనం చేద్దాం" అంటూ అనసూయ ఖాళీ కప్పు తీసుకొని వంటింట్లోకి వెళ్ళింది.

చందు రమ్య స్కూటర్ దిగి గలగల నవ్వుతూ ఇద్దరూ ఒకేసారి జంటగా ఇంట్లోకి వచ్చారు. ఎదురుగా సోఫాలో కూర్చున్న సుజలను చూసి ఆశ్చర్యం, ఆనందం ముప్పిరిగొన్న గొంతుకతో "హాయ్, అక్కయ్యా! ఎప్పుడొచ్చావ్" హుషారుగా ప్రేమగా పలుకరించాడు చందు.

"ఎలా వున్నారు వదినా మీరు?..." నవ్వుతూ నెమ్మదిగా పలుకరింపుగా మాటలు కలిపింది రమ్య.

తమ్ముడి, మరదలి పలుకరింపులోని ఆప్యాయతను అర్థం చేసుకోలేని సుజల "ఎలా వున్నానో కనబడ్డం లేదా?...." వెటకారంగా సాగదీసింది.

చందుకైతే అక్క మాటలు అంతగా కొత్తేం కావు కాని, రమ్య మాత్రం చాలా హర్ట్ అయింది. ఎందుకంటే పెళ్ళిలో  మూడు నెలల క్రితం తాను సుజలను చూసింది. పెళ్ళి హడావుడిలో ఆమెతో అంతగా మాట్లాడినట్లుగా గుర్తులేదు. మళ్ళీ ఇప్పుడే ఆమెను చూడ్డం. చందు కూడా వాళ్లక్కని గురించి ఎప్పుడూ ఏమీ చెప్పలేదు. అందుకని ఆవిడను ఎలా అర్థం చేసుకోవాలో రమ్యకి తెలియలేదు.

"వదిన వచ్చారు గదా... ఏమైన టిఫిన్ చేయనా అత్తమ్మా?"

"అత్తమ్మ ఏమిటి? చెత్తమ్మలాగా! చక్కగా 'అత్తగారూ' అని పిలువలేవా మా అమ్మని?..." ఓరగా చూస్తూ మరో చురక అంటించింది మరదలికి.

ఈ మారు రమ్య వదనం మ్లానమైంది.

చందు తల్లి వంక చూశాడు. అనసూయ కొడుకు ముఖంలోని భావాల్ని అర్థం చేసుకొని చిన్నగా నవ్వుతూ "ఎలా పిలిస్తే ఏముంది సుజీ! అత్త ప్రేమను, అమ్మ ప్రేమను రెండూ కలిసేలాగా రమ్య ఆప్యాయంగా పిలిచే ఆ అత్తమ్మ పిలుపు నాకు చాలా బాగా నచ్చింది. అందుకని నేను  తనని అలాగే పిలవమన్నాను..." సర్ది చెప్పింది కూతురికి.

"ఏమో నీకైతే బాగుందేమోగాని, వింటున్న నాకైతే చాలా ఎబ్బెట్టుగా వుందా పిలుపు! అయినా నీవైనా మీ ఆవిడతో చెప్పలేక పోయావా చందూ! అమ్మని ఎలా పిలువాలో..." ఈ మారు తమ్ముడి వైపు తిరిగి అంది సుజల.

"మన మనసుల్లో ప్రేమానురాగాలు వుండాలేగాని, ఎలా పిలిస్తే ఏముందక్కయ్యా! అవునూ... బావగారెలా వున్నారు?"

"ఆయనకేం.. నిక్షేపంగా వున్నారు"

"అక్కా తమ్ముడు మాట్లాడుకుంటూ వుంటారుగాని, పద... రమ్యా! మనం వేడి వేడి పకోడీలు చేద్దాం" అంటూ అత్తాకోడలు అక్కడి నుంచి కదిలారు.

ఆ రాత్రి పడుకోబోయే ముందు రమ్య కొంచెం ముభావంగా ఉండడం చందు గమనించాడు. "ఏం రమ్యా! భోజనాలప్పుడు నీ వంట మీద మా అక్కయ్య చేసిన కామెంట్స్‌కు బాధ పడుతున్నావా?"

"అబ్బే, అదేం లేదండి, నాకు నిజంగానే వంటరాదాయె! అత్తమ్మ దగ్గర చేర్చుకొని... ఈ రెండు నెలల నుంచే నేను వంట చేస్తున్నది. వదిన అలా అన్నారని నేనేం బాధ పడ్డం లేదు"

ఇంతలో సెల్ ఫోన్ మోగింది. తలగడ  పక్కనే వున్న సెల్ అందుకొని నెంబర్ చూస్తూ ఆన్ చేసి "హల్లో..." అన్నాడు చందు.

"హల్లో... చందూ! నేను ప్రకాశరావుని..."

"హాయ్, బావగారూ... ఎలా వున్నారు?"

"సుజల అక్కడికొచ్చిందా?"

"ఆఁ, వచ్చింది బావా!..."

"హమ్మయ్య! అక్కడికే వచ్చిందన్నమాట, ఇక్కడ మేమంతా కంగారుతో తెగ బాధపడుతున్నాం చందూ! ఎటు వెళ్ళిందో ఏమోననీ...."

"ఏం?... ఇంట్లో చెప్పలేదా?"

"చెప్తే నాకెందుకీ కంగారు?... ఇంట్లో గొడవ పెట్టుకొని ఎవరితో చెప్పాపెట్టకుండా వెళ్ళిపోయింది. ప్రతిరోజూ ఇంట్లో ఓ నరకం సృష్టిస్తుందనుకో మీ అక్క. చెల్లాయ్ పెళ్ళి బాధ్యత... తమ్ముడి చదువు... అమ్మని వదిలేసి నన్ను వేరే కాపురం పెట్టమని రోజూ ఒకటే పోరు! లేకపోతే ఇంట్లో వాళ్లతో వట్టి పుణ్యానికే జగడాలు! శోకాలు!... నీవేమనుకున్నా సరే చందూ!... మీ అక్కయ్యను భరించడం రాను రాను నాకు చాలా కష్టంగా వుందోయ్! నేను ఫోన్ చేసినట్లుగా చెప్పకు. అమ్మనేమో పుట్టింటికే వెళ్ళి వుంటుంది.... వెళ్లి నన్ను తీసుకురమ్మంటుంది. కాని, వద్దు చందూ! ఇప్పుడే వద్దు... కొన్నాళ్ళు మమ్మల్ని ఇలా ప్రశాంతంగా వుండనీ... అక్కడ మీ దగ్గర ఎన్నాళ్ళు వుంటుందో వుండనీ... బై... చందూ! గబగబా చెప్పేసి మరో మాటకైనా అవకాశం ఇవ్వకుండా ప్రకాశరావు ఫోన్ పెట్టేశాడు.

చందు ఆలోచనలో పడ్డాడు.

రమ్యకు విషయం అర్థమైంది.

"ప్రకాశ్‌రావు అన్నయ్యగారే కదూ ఫోన్ చేసింది?" భర్త ముఖంలోకి తేరిపారగా చూస్తూ మెల్లిగా అడిగింది రమ్య.

"అవును, నిజానికి మా బావ దేవుడు రమ్యా! అతనికిది భార్యగా తగదు" అక్కపట్ల  కోపంతో బాధగా నిట్టూర్చాడు చందు.

భార్యాభర్తలిద్దరూ సుజల కాపురాన్ని గురించే ఆలోచిస్తూ ఏ అర్ధరాత్రికో నిద్రాదేవి ఒడిలోకి జారుకున్నారు.

ఉదయం పెరట్లో పూజకోసం గుత్తులుగా విరగబూసిన మల్లె పూవులని కోస్తున్న తల్లి దగ్గరికి స్నానానికి వెళ్లుతున్న చందు టవల్ని మెడ చుట్టూ వేసుకొని వచ్చి మంద స్వరాన అన్నాడు... "రాత్రి బావగారు ఫోన్ చేశారమ్మా, అక్కయ్య ఇంట్లో దెబ్బలాడి ఎవరితో చెప్పకుండా వచ్చేసిందట. నీతో ఈ విషయం ఏమైనా చెప్పిందా?"

"ఊహు, నాకైతే ఏం చెప్పలేదురా! నేనైతే ముందే ఊహించాను... ఇలాంటిది ఏదో ఒకటి జరిగే వుంటుందనీ...." బాధగా నిట్టూర్చిందావిడ.

"విషయమేమిటో కనుక్కో అమ్మా!...." చందు కూడా రెండు మూడు పూలు కోసి తల్లి పట్టుకున్న పూల సజ్జలో వేశాడు.

"మనమిప్పుడు తనని ఏమీ అడగొద్దు. తానంతట తానే విషయమేమిటో చెప్పనీ..." మెల్లిగా అంటూ కూతురు పెరట్లోకి రావడం ఓరకంట గమనించిన అనసూయ "పువ్వులు నేను కోసుకుంటాను గాని, నీవు స్నానానికి వెళ్ళరా చందూ! ఆఫీసుకు టైం అవుతూంది..." అంటూ మాట మార్చింది.

"నీకు పూలు కోయడంలో సాయం చేద్దామంటే చేయనియ్యవేమే అమ్మా?!...." అని నవ్వుతూ చందు బాత్‌రూం వైపు వెళ్లాడు...

సాయంత్రం ఆఫీసు నుంచి వచ్చిన రమ్య హ్యాండ్‌బాగ్‌లో నుంచి ఓ కవర్ తీసి అత్తమ్మ చేతిలో పెట్టి పాదాభివందనం చేసింది.

"అయ్యో, ఏంటి?.... ఈ కవరేమిటి రమ్యా" అనసూయ ఆశ్చర్యంగా ప్రశ్నించింది.

"నీ కోడలికి మొట్టమొదటి జీతం వచ్చిందే అమ్మా! ఇదిగో, ఈ స్వీట్స్ హాట్ పాకెట్స్..." అని నవ్వుతూ చందు తన చేతిలోని కవర్సు టేబులుపై పెట్టాడు.

"ఓహోఁ" అలాగా" సంతోషంతో కోడల్ని నిండు మనస్సుతో ఆశీర్వదిస్తూ "అయినా నాకెందుకమ్మా ఈ డబ్బు? చందుకే యివ్వు, వాడైతేనే అన్ని ఖర్చులు సరిగ్గా చూసుకుంటాడు ప్రతినెలా...." అనసూయ తిరిగి కవర్ ఇవ్వబోయింది.

"ఉహూఁ ఆయనకేం వద్దు అత్తమ్మా! మీ దగ్గరే వుండనీ, ఈ డబ్బుతో వదినకేమన్నా కొనిపెడదాం"

కోడలి మాటకి నిండుగా నవ్విందావిడ.

అక్కడ మల్లె మొగ్గలు కడ్తూ కూర్చున్న సుజల వాళ్ల మాటల్లో వాళ్ళ సంతోషంలో పాలు పంచుకోవడం లేదు, మౌనంగా దారం మెలివేస్తూ వేళ్లతో పూలు కడ్తున్నా మనస్సు మాత్రం ఎక్కడో ఉంది. 'ఈ ఆనందం... ఇలాంటి సంతోషం వుత్సాహం తమ ఇంట్లో ఎందుకు ఉండవు? తామెప్పుడూ ఇలా ఉల్లాసంగా లేమే?... కారణమేమిటి?' పదే పదే తనను తాను ప్రశ్నించుకుంది.

"వదినా! మిమ్మల్నే..." గట్టిగా పిల్చింది రమ్య.

"ఆఁ ఏంటీ! అంతగా గట్టిగా పిలువాలా?... నాకేం చెవుడు లేదు. ఇక్కడ వున్నానుగా" కాస్త గొంతు హెచ్చించి అంది సుజల కూడా.

"మీరేవో ఆలోచనలతో వుంటేనూ... వినిపించుకోకపోతే బిగ్గరగా పిలిచినానంతే... గుడికి వెళ్తున్నాం మీరు వస్తారా వదినా?"

"అమ్మమ్మల్లా ఇప్పటి నుంచే గుళ్ళూ గోపురాలు తిరగాలా, నాకిష్టంలేదు. మీరు వెళ్ళండి" కుండ బద్దలు కొట్టినట్లుగా చెప్తున్న కూతురి మాటల్లోని కరుకుతనానికి అనసూయ, రమ్య, చందు ముగ్గురూ విస్తుపోయారు.

'ఎందుకే సుజీ, అలా మాట్లాడుతావ్!? ముసలి వాళ్ళే వెళ్తారా గుళ్లకు?..." కూతుర్ని కాస్త గట్టిగానే మందలించి, నొచ్చుకున్నట్లుగా బాధపడుతున్న కోడలి వైపు తిరిగి "దాని మాటలకేంగాని రమ్యా.... నీవు చందూ వెళ్లి రండి గుడికి" అనసూయ అనునయంగా సర్ది చెప్పింది.

"అబ్బో! కోడలి మీద ఈగ కూడా వాలనివ్వవే? ఎంత ప్రేమా?" దెప్పుతున్నట్లుగా దురుసుగా వెటకారంగా సాగదీస్తూ తల్లితో అంటూ కడుతున్న పూలు పక్కన పడేసి విసురుగా లేచి గదిలోకి కెళ్ళింది సుజల.

ఒక్కక్షణం అచేతనంగా నిలబడిపోయారు భార్యాభర్తలు.

తల్లి ప్రోద్బలంతో తయారయి... రమ్యని తీసుకొని గుడికెళ్లాడు చందు.

కొడుకు కోడలు స్కూటర్‌పై వెళ్ళిపోయాక, అనసూయ వీధి తలుపులు దగ్గరగా వేసి తీరుబాటుగా కూతురున్న గదిలోకి వెళ్ళుతూ "సుజీ! సుజీ...! అంటూ పిల్చింది. సుజల దిండులో ముఖం దాచుకొని మంచంపై బోర్లా పడుకొని వుంది.

"సుజీ, ఏమైందమ్మా?" అంటూ కంగారుగా మంచంపై కూర్చొని కూతురి తల పైకెత్తి బలవంతంగా తన వైపు తిప్పుకుంది అనసూయ.

ఎర్రనైన కళ్ళ నిండా నీళ్లు!.... లేచి కూర్చుంది. ఏడుస్తున్న కూతుర్ని అక్కున చేర్చుకొని "ఏమైంది సుజీ? ఇందాక నేను ఏమైన తప్పుగా మాట్లాడి నీకు బాధ కల్గించానా?...." లాలనగా బుజ్జగిస్తూ అడిగిందామె.

"లేదమ్మా! తప్పంతా నాదే! పరాయి ఇంటి నుంచి వచ్చిన రమ్య నీకు అంత చేరువగా ఎలా అయిందోనని నా బాధ! ఇదెలా సాధ్యం?.... మా అత్తగారింట్లో నేనిలా ఎందుకు వుండలేకపోతున్నాను? చెప్పమ్మా!? మీ అత్తాకోడళ్ళ అనురాగ అన్యోన్యతలను చూసి నేను ఓర్చుకోలేక పోతున్నాను? నా నోట్లో నుంచి ఏవేవో కరుకైన వాడి మాటలు వస్తున్నాయి. మా ఇల్లో నరకం. మీ ముగ్గురు ఎంతో ఆనందంగా ఉత్సాహవంతంగా వుంటారే! మరి... మేము ఎందుకిలా వుండలేక పోతున్నాం. కారణం ఏమిటి? తప్పెవరిది? చెప్పమ్మా? చెప్పునాకు..." అంటూ తన అత్తగారింట్లోని బాధలు, కష్టాలు అన్నీ తల్లితో చెప్పుకొని బావురుమంది సుజల.

అంతా విన్నాక అనసూయ తన పైట చెంగుతో కూతురి కళ్ళు ముఖం తుడిచింది. "పిచ్చి సుజీ! ఒక ఇంట్లో వుండే మనుష్యుల మధ్య ఒకరిపట్ల ఒకరికి మామూలుగా వుండాల్సిన ప్రేమానురాగాలు... ఆపేక్ష.... అభిమానం ఇవన్నీ లోపించినప్పుడే ఆ ఇల్లు నరకం అవుతుంది. కాని, అక్కడ మీ ఇంట్లో తప్పెవరిదో తెలుసా? నీదే..."

"నాదా!?..." సుజల విస్తుపోయింది.

"అవును, ముమ్మాటికి నీదే... పెళ్ళయ్యాక నీలో ఓ రకమైన అసూయాద్వేషాలు అంకురించాయి. ఇతరుల పొడ అస్సలు గిట్టడం లేదు నీకు. ఈర్ష్యా అసూయలు మానవ సహజం సుజీ! మనం మనల్ని హుందాగా నియంత్రించుకోవాలి. గాలి వార్తల్ని నమ్మి ఆవేశపడిపోకుండా విజ్ఞతతో వ్యవహరించడానికి తెలివి తేటలుండాలంతే

గానీ, 'మా అత్తగారు నాగురించి ఎదురింటి వెంకాయమ్మతోను, పక్కింటి పద్మావతమ్మతోను ఏవేవో చెప్తారని నీవంటున్నావు" కానీ నీవు మాత్రం ఆవిడకేం తక్కువ తిన్నావ్? అత్తగారని కొంచెమైనా గౌరవం ఇవ్వకుండా అవాకులు చెవాకులు వాగుతుండగా పోయిన సారి మీ ఇంటికి వచ్చినప్పుడు నేనే నా చెవులారా విన్నాను. నీకు గుర్తుందా? అప్పుడే నేను నిన్ను మందలించాను. కాని నీవు మాత్రం నా మాటల్ని చాలా తేలిగ్గా తీసి పారేశావ్. అవునా?....

"అవునన్నట్లుగా' సుజల మెల్లిగా తలూపింది.

కూతురి ముఖంలోని భావాల్ని పసిగట్టిన అనసూయ ఇనుము వేడిగా వున్నప్పుడే ఇంకో రెండు దెబ్బలు వేసి దాన్ని మనకు అనుకూలంగా కావాల్సిన రూపంలో మార్చుకోవాలన్న సూక్తి తెలిసిన అనసూయ మరలా ఇలా మాట్లాడసాగింది.

"మీ అత్తగారు, ఆడపడుచు, మరిది ఎవరూ చెడ్డవాళ్ళు కారమ్మా. నీ నుంచి వాళ్ళకి ప్రేమానురాగాల్ని అందించి చూడు!... అటు నుంచి కూడా రెండింతల ప్రేమాభిమానాల్ని వాళ్ల నుంచి పొందగలవు. నీ చుట్టూ వుండేవాళ్లకు నీ బాధలు కష్టాలు కాదు పంచేది ఆత్మీయతానురాగాల్ని పంచు. అప్పుడు చూడు నీ ఇల్లో నందనవనంలా వుంటుంది. రమ్యని నీవు అన్ని విషయాలలో తప్పుగా అర్థం చేసుకొని ఏవగించుకుంటున్నావు గాని తను చాలా మంచి స్వభావం గల అమ్మాయి. నన్నో దేవతగా పూజిస్తుంది పిచ్చిపిల్ల!... ఇక చందు సంగతి నీకు తెలుసుగా సుజీ! నాకు దేనిలోను  లోటు రానివ్వడు. ఓ మంచి కొడుకుగా తన బాధ్యతను కర్తవ్యాన్ని సక్రమంగా నిర్వర్తిస్తున్నాడు. మీ నాన్నగారు లేరన్న ఆ ఒక్క కొరతేగాని నాకేం తక్కువ? హాయిగా ఆనందంగా వున్నాను. అపోహలకు, అపార్థాలకు, మనస్పర్థలకు అసలు ఆస్కారమే లేదిక్కడ. అందుకే నేనిలా సంతోషంగా నిశ్చింతంగా వున్నాను."

"అవునమ్మా! రమ్య వచ్చాక మీ ఇల్లు చూస్తుంటే నాకెంతో ముచ్చటేస్తుంది...?" కళ్ళు తుడుచుకుంటూ మారిన మనస్సుతో అంది సుజల.

"పాపం నా మాటలకు రమ్య ఎంత హర్ట్ అయిందో! సారీ చెప్తానమ్మా"

"ఫర్వాలేదు. నీవు సారీ చెప్పినా చెప్పకున్నా రమ్య ఏం బాధ పడదు..."

"నీవు నిజంగా చాలా అదృష్టవంతురాలివమ్మా, నీ నిండు మనస్సుకు తగినట్టుగా దేవతలాంటి కోడలు దొరికింది నీకు..." మనస్ఫూర్తిగా అంటూ పైట చెరగుతో ఓ మారు కళ్ళు తుడుచుకొని లేచి గబగబా తన సూట్‌కేస్ సర్దుకో సాగింది సుజల.

"అదేమిటి? సర్దుతున్నావ్?... " విస్మయంగా అంది తల్లి.

"నేనిప్పుడు మా ఊరు వెళ్ళిపోతాను అమ్మా! నేనిక్కడికి వచ్చినట్లుగా మా వాళ్లకి కనీసం ఫోన్ కూడా చేయలేదు నేను...."

"నీవు చేయకున్నా అల్లుడుగారే ఫోన్ చేశారు... నీవు వచ్చిన రోజురాత్రే...."

"నాతో మరి మీరెవ్వరూ చెప్పలేదే!...." సుజల కళ్ళు ఆశ్చర్యంతో పెద్దవైనాయి.

'కావాలని మేమే చెప్పలేదు. పోనీ రేపు ఉదయం వెళ్ళు సుజీ!...."

"లేదమ్మా! ప్లీజ్... నన్ను ఆపకు. ఈ రోజే ఇప్పుడే వెళ్తాను" కూతురి కంఠంలో నుంచి చాలా దృఢంగా వచ్చాయా మాటలు.

అంతలోనే గుడికెళ్ళిన చందు, రమ్య తిరిగొచ్చారు. ఇంటిలోని సన్నివేశం చూసి విస్తుబోయారు. వెళ్ళడానికి రెడీగా వున్న సుజల మరదలి దగ్గరగా వచ్చి "నిన్ను నా పదునైన మాటలతో చాలా బాధ పెట్టాను కదూ రమ్యా. నీవు, చందు కల్సి దసరా పండక్కి మావూరురండి" మనసారా నవ్వుతూ అంది.

"ఇప్పుడీ హఠాత్ ప్రయాణం ఏమిటే అక్కయ్యా..."

సుజల నుదుట బొట్టు పెడ్తూ "ఇవాల్టికి వుండి పొండి వదినా!..." రమ్య ఎంత చెప్పినా వినలేదు.

"ఈ సారికి వెళ్ళనీ రమ్యా!" అనసూయ కూడా కోడలికి సర్ది చెప్పింది. అక్కతో పాటు బస్‌స్టాండ్‌కు వెళ్ళడానికి బయట వాకిట్లో కెళ్ళి అటుగా వెళ్ళుతున్న ఖాళీ ఆటోను ఆపి... అక్కచేతిలోని సూట్‌కేస్ అందుకొని చందు అందులో పెట్టాడు.

తమ్ముడి పక్కన ఆటోలో కూర్చున్న సుజల తల్లికి మరదలికి ఆనందంతో నవ్వుతూ చెయ్యి ఊపింది.

ఆటో సర్రున ముందుకు దూసుకుపోయింది.

"ఇన్నాళ్లకు దాని కళ్ళల్లో తొలిసారిగా వెలుగు చూశానమ్మా!..." నిండు మనస్సుతో కూతుర్ని గురించి సంతోషిస్తూ ఆప్యాయంగా కోడలి భుజంపై చెయ్యి వేసి ప్రేమగా అదిమి దగ్గరకు తీసుకుంది అనసూయ.

# భూమి బిడ్డ

**–జాజుల గౌరి**

రోనికార్తి దాటి ముర్గసిర కార్తి వచ్చింది గానీ ఆకాసంల ఎండలు పెళ పెళ మంటయింకా మండుతనే వున్నాయి. ఏడ సెరువులు ఆడ ఎండి బీటలు వారినయి పంట పొలాలు పగుళ్ళు తీసినయి. పల్లేల గుండెలు తడారినయి. మా నోయినోళ్ళ కండ్లల్ల నీళ్ళు యింకినయి.

“యింగ గిట్లయితే ఎట్ల ఆలిద్ర కార్తే గూడా రావట్టే ఆకాసంలకెళ్ళి ఒక్క సుక్క నీళ్లన్నా రాల్తలే. పంటలేసే కాలం దాటవట్టే నీయవ్వ ఏమి కరువు కాలం వచ్చేరా.....” అంట మా పెద్దనాయినా అంగలార్చుకుంట రుమాలు దులుపుకుని లేసి పోలం దిక్కుపోతుంటే.

“అర్రే కాలం కల్సిరాక వానలు పడకుంటే ఎవలేం సేస్తరే ఆనలొచ్చినప్పుడే దున్నుదాం తియ్యి గిప్పుడు పొలం కాడికి పోయి నువ్వు ఎంత అంగలార్చినా ఏం పాయిద లే” అంట నాయిన సైకిలు తుడుస్త అన్నడు.

మా పెద్దనాయిన, ఆ మాట యిని గూడ ఇనపడనట్లే సట్ట సట్ట పొలం దిక్కుపోతుండు.

“అర్రే సెప్తుంటే గూడ యింట లేవేందే” అని అంటనే యింట్లకు సూస్తా “టిఫిను కట్టినవా” అంట గట్టిగనంగనే.

“అ.... అ.... అయిపాయే అయిపాయే” అంట అమ్మ. నాయిన టిఫిన్ల బువ్వకట్టి కాంచి సీసల టమట చారుపోసి మూత బిర్రున బిగుస్తా బయట అరుగు కాడికి వచ్చి అవి బట్ట సంచిల పెట్టియ్యంగనే నాయిన సైకిలు క్యాడిలుకు సంచిని తగిలేసుకుంట, “ఓవ్వ నేను పోతున్న” అంట యింట్లకు సూసేతాళకల్ల ఆడనే బుక్కులు సదురుకుంటున్న నేను సెల్లీ నాయిన పనికి పోతున్నడని సమజయ్యి ఒకలం వట్టక ఒకలం నాయిన సైకిలు కాడికి ఉర్కచ్చి హ్యాడీలు పట్టుకుని “నాయినా... నాయినా... పైసలియ్యే పైసలియ్యే” అంట సేతులు సాపేతాళ్లకు.

"పనికి పోయేటప్పుడు గిట్ల పైసలడుగోద్దని ఎన్ని సార్లు చెప్పాలేరా" అంట యిసుక్కుంటునే జేబుల సేతులు పెట్టి లెనంకంగనే రెండు శారాన బిట్లు సేతి కొచ్చినట్లున్నయి గవి తీసి నాకొకటి సెల్లెకొకటి ఇచ్చి సిన్న చెల్లెను ఎత్తుకొని ముద్దాడ్తా "పొయ్యొస్త బిడ్డా పొయ్యొస్త టా..... టా.... టాటమ్మ...." అంట సైకిలు మీదెక్కి సీకులైను కాడికెళ్ళి పోతుంటే నాయిన కనుమరుగయ్యేదాకా గన్మట్ల నిలవడి నాయినను మురిపెంగ సూస్తున్న అమ్మ సిన్న సెల్లెను ఊయ్యాలలేసి పనిల మునగంగనే యింగ మేము పైసలు సేతిల పడిన సంతోషంల పుస్తకాలు తీసుకుని ఇస్కులుకు ఉర్కినము.

యింగ ఆలీద్ర కార్తీ ఆరం దీనాలుందనంగా ఆకాసంల ఉరుములు ఉరిమి దట్టంగా మేఘులు కమ్మినయి కోరలు సాచిన నెర్రేలల్ల పాలుగారినట్ల నీలజల్లులు ఏరులై పారినయి. భూతల్లి పులకరించింది.

మా పొలాలన్ని తడిసి మల్లా పచ్చదనం సిగురించీ రోజొచ్చింది. మా నాయినోల్ల మొఖాలల్ల నవ్వులు పూసినయి. ఆళ్ళు ఉప్పరి పనులు మాని పొలాలల్ల నాగండ్లు కట్టింద్రు.

ఆకాసంల ఉరుములు ఉరుముతున్నయి మెరుపులు మెరుస్తున్నయి. అయినా సరే నాయినా ఆ ఆనలనే పొలంల నాగలిని వట్టి రాగం ఎత్తిండు.

"మరదల మల్లమ్మ
నాసిన్ని మల్లమ్మ
మనస్సేమో పులకరించే
వరదల్లే పరవసించే
వానొచ్చేనే పిల్లా వానొచ్చేనే
ఉరుకుల్ల పరుగుల్ల ఉరుమొచ్చేనే
పల్లెమో తడిసేను
పచ్చాకు వనికెను
పచ్చని సేండ్లన్ని

తడిసి ముద్దయ్యేను ॥వాన॥
వాగుళ్ళు పారేను
వరదళ్ళు పొంగేను
అలుగుళ్ళు దాటేను
ఆకిళ్ళు నిండేను ॥వాన॥
బీడైన భూముళ్ళు
బిర్ర బిగుసుక పాయే
ఎండిన పంటలు
మొలకెత్తి మొలిచేను ॥వాన”
తడి ఆరిన గుండెళ్ళు
తడిసి ముద్దయ్యేను
సినుకులకు పులకరించి
పల్లె పండగ సేసే ॥వాన॥

అంట పొద్దు వుంటే నాగలి భూమిని సర్రు సర్రున చీరేస్తా పోతుంటే పొలం గుల్ల వారవట్టింది.

ఆరం దినాలు తిర్గక ముందే పొలాలల్ల యిత్తనాలు పడినయి శనివారము ఐతారము వచ్చిందంటే యింటిల్లాదులం పోలం కాడనే, అమ్మనాయినోళ్ళు పొలం పనులల్ల పోరగాండ్లము నాగలి సాళ్ళల్ల అడ్డం పడ్తా లేస్తా, ఓరం గట్లపోంటి ఉర్కుతా పచ్చంగ గప్పుడప్పుడే మొలుస్తున్న పచ్చ పచ్చని మైదాన్లల్ల మెత్తని పట్టు మక్మల్ కుచ్చుల లెక్కున్న ఆలీర్ద పురుగులు భూతల్లి వడిల పగడాలు సల్లినట్ల గున్న గున్న నడుస్తున్న ఆ ఎర్ర రత్నాలని ఏరుకుని పుల్లల డబ్బీలల్ల గడ్డేసి అండ్ల ఆటిని భద్రంగా దాయనికి సేతులల్లకీ తీసుకోంగనే అప్పుడే అమ్మ కడుపుల కెని వచ్చిన పసిపోరలు సల్లగాలికి ఉక్కిరి బిక్కిరైనట్ల కాళ్ళన్ని ఒక్కతానికి ముడ్చుకుంట బిర్ర బిగుసుక పోతున్న ఆలీర్ద పురుగుల తోటి ఆడుకుని ఆడుకుని మేము అలిసిపోతా, పని సేసి సేసి అలిసి తొలిస్తున్న అమ్మనాయినల తోటి గూడి ఆనసినుకులకు

సిగురుటాకుల లెక్క తడిసి ముద్దవుతనే అమ్మ కొంగును కోప్పెర సేసుకుని సీకటిపడే యాల్లకు యిల్లు సేరుతుంటే సలితోటి మా పాణాలు బిర్ర బిగుసుక పోయినయి.

ఆలీద్ర దాటుతుంటే పంట పొలాలల్ల యిత్తనాలు మొలవటం సురువైయింది. మా చుట్టంతా పచ్చదనం పరుచుకుంది. అలీద్రకే అందమిచ్చిన అలీద్ర పురుగులు మటుమయం అవ్వవట్టినయి. గవి కావాలంట మల్ల మల్ల మైదాన్లల్ల దున్నిన సాల్లల్ల దేవులాడ్తుంటే "ఆలీద్ర పురుగులు ఆలీద్ర కార్తీలనే దోరుకుతాయి బిడ్డ యింగ ఆడికెళ్ళ దోర్కయి గిప్పుడు బంతి నారు పోస్తున్నంగా యింగ కొన్ని దినాలైతే జింగన్నలు దొరుకుతాయి. గవి రంగ రంగులు రెక్కలతోటి మస్తుంటాయి. అవి పట్టిస్తనుండు బిడ్డ" అంట అమ్మ మమ్మల్ని సముదాయించింది. అయినా పట్టుకుంటే పట్టుల మెత్తగా మక్కలెక్కున్న ఆలీద్రలకోసం పోరగాండ్ల మందరం ఎత్కుతనే ఉన్నం.

యింగ రాను రాను మా పంట పొలాలతోటి సుట్టు పక్కల అడవి కూడా పచ్చగా అవ్వవట్టింది, అండ్ల ఉప్పుపూలు, తంగేడు పూవులు, గునుగుపూలు, బెల్లంత పూలు ఏడంటే ఆడనే పెర్గవట్టినయి. మా పొలం కాడ వరాల పోంటి ముద్దబంతి, పోకబంతి, తుర్కబంతి మా పంటతో పాటు కాపుకు రావట్టినాయి.

పొలం పనులు ఒక్క కొలిక్కి రాంగనే నాయినోళ్ళు మల్ల ఉప్పరి పనులకు పోవట్టింద్రు అమ్మోళ్ళు పంట పొలాల కాడికి పోయి ఆవులను కాస్తా సేనును సూసుకోవట్టింద్రు.

మేము గూడ ఇస్కులుకు పోవట్టినం ఆడ్త పాడ్త ఎగుర్తా దుంకుతా ఉన్నోళ్ళం గప్‌చుప్‌న యిస్కుల్ల కూకుంటున్నం.

ఒకనాడు మా కిలాసు టీచరు పాఠం సెప్తా సేప్తా, "తెలంగాణాల ఏ పండగలు బాగా చేస్తరో చెప్పగలరా" అన్నది.

"రాఖీల పండగ, పీర్ల పండగ, దసరా, దీపాల పండుగలు యింకా బోనాలు" అంట పోరగాండ్ల మందరం కలగా పులగంగా లొల్లి లొల్లిగా సెప్తుంటే.

"మరి ఈ పండగలల్ల రాబోయే పండగేది, కొన్ని దినాలైతే మనం ఏ పండగ చేస్తమో చెప్పంద్రి" అంట అందరి దిక్కు టీచరు చూసేసరికల్లా అందరం చాలా కామోష్‌గా వున్నం గాని, మాలో ఒకరు గుసగుసగా "దసరా' అన్నరు.

"అ.... అ..... మల్లచెప్పు" అంట టీచర్ అడిగేతాల్లకు "దసరా" అంట అందరం ఒకే సారన్నం.

"దసరా సరే దసరాలకు ముందేమి చేస్తారో చెప్పండి" అన్నది అందరి దిక్కు చూస్త.

"దసరాకు ముందు ఏంజేస్తారబ్బా" అంట సోంచాంచుతున్న "దసరాకు ఆరం పదిరోజుల ముందు కొత్తబట్టలు కుట్టిస్తారు. రెండు దినాల ముందు పండగ దిక్కెళ్ళి సౌదలు తెస్తాం, ముందు నాడు పిండి వొంటల దిక్కెళ్ళి పిండి పట్టిస్తాం యింకా పండగ నాడైతే బగారన్నం, సియ్య బువ్వండుతాం" అని అన్కుంట గంతే యాదికి వచ్చి నెత్తి గోక్కుంటున్న.

యింతల "బతుకమ్మను సేస్టరు టీచర్" అన్నది జనబాయి.

"ఆ కరెక్ట్ వివిధ రకాల పూలతోటి పండగ వారం పది రోజులుందనంగనే బతుకమ్మను చేసి ఆడ్తరు బతుకమ్మ పండగ తెలంగాణా ప్రాంతంలో చాలా ముఖ్యమైన పండగ అవునా' అంట అందర్నీ కలేస్తూ సూస్తా నన్ను చూసేంతల నా ముఖంల సెప్పలేనన్ని రంగుల తిర్గటం సూసి "ఏం గౌరి బతుకమ్మను చేస్తేరుగా" అని మల్ల అనేంతల ఏ లోకంలోనే వున్న నేను ఉలికపడ్తా "బ....తు....క....మ్మ...." అంట పొడి పొడిగా అంటనే సమజయ్యి సమజ్‌గానట్ల నిలువునా అడ్డంగా ముఖం తిప్పి తాళ్ళకే బెల్లయి టీచర్ యింకో కిలాసుకు పోయింది గాని నా ఆలోచన బతుకమ్మ కాడ ఆగిపోయింది.

ఆయల్ల ఇస్కులు కాడికెళ్ళి వస్తే వస్తేనే అమ్మకోసం దేవులాడిన, అమ్మ సేను కాడుందని ఎర్కయి ఆడికి ఉర్కేంతల వారల పొంటున్న గడ్డి కోస్తున్నది. నడ్మ నడ్మ ముద్ద బంతి, పోక బంతి, తుర్కబంతి పూలు నువ్వా నేనా అన్నట్ల పెర్గుతున్నయి.

ఓనరుగా ఆటిని పక్కకు కొడవలితో జరుపుతనే రప రప గడ్డిని కోయవట్టింది. అమ్మను సూసిన సంతోషంల రయ్యి రయ్యిన మేకపిల్ల లెక్కవరాలు పొంటి అమ్మకాడికి ఉర్కుతుంటే అటు ఇటున్న బంతి సెట్లు కుషీ కుషీగా నన్నలుముకుంటన్నట్ల నా యిస్కట్టును తాకుతుంటే మురిపెంగ ఉరికి అమ్మెన్న నుండి బుజాల మీద సేతులేసి అమ్మ మీద ఒరుగుతా "హా.... హమ్మ.... అమ్మ..... " అంట ఆయాస పడ్త దమ్ముపట్టిన

“అమ్మ గడ్డికోసుడు ఆపి ఎనుకకు మర్లిసూస్తా

“ఆ.... ఆ.... ఏందా.... దమ్మువట్టుడు ఏం ఆత్రం ముంచుకొచ్చే బిడ్డా గట్ల ఉర్కొస్తావేందిరా” అని అంటనే మల్లా గడ్డి కోయటంల మునిగింది.....

అమ్మ భుజాల మీదికెళ్ళి గమ్మున లేసి ముసి ముసిగా నవ్వుతా “ఏమ్లే... ఏమ్లే....” అంట వరం పొంటి కోసున్న గడ్డినంత ఒక్కతానికి కుప్పలేస్తా వున్న, అమ్మ సట్టసట గడ్డి కోస్తనే ఉన్నది.

కానీ నా మనసుల మాత్రం బతుకమ్మ సుడులు తిర్గుతా తిర్గుతా ఒక్కొక్క పువ్వు తోటి సురువై సుట్టుతా పేరుస్తా పేరుస్తా మల్లా సెట్టున సెదిరిపోతా.... మల్లా పేరుస్తా... మల్లా సెదిరిపోతా వుంటుంటే నాకే తెల్వని లోకంల నేనుంటే నా సేతులు బంతి పూలను తెంపి కుప్పలేస్తున్నయి.

జెరైనంక అమ్మ గడ్డికోయటం పూరకాంగనే నా అర్కతులు సూసి గిద్ద గిద్ద ఉర్కొచ్చి “అయ్యయ్యో ఏంది బిడ్డా మంచి పూలన్ని గిట్ల తెంపిపారేస్తున్న వేందిరా” అంట ఇసుక్కుంటనే నా సెయ్యి వట్టి ఆపంగనే ఉలిక్కిపడి సూసేతాళ్లకు వరం పోంటి ఆడికెని ఈడిదాకా.... బంతి పూలు వరుస కట్టి పడుండటం సూసి బిక్క సచ్చినా... “ఏం పిల్లనే తల్లి, ఏంది గీ అర్కతులు పండ్గకు పూలన్ని అంగడికి తోలాలనుకుంటే గిట్ల సేస్తివేందిరా గిప్పుడు ఏం జేస్తవీపూలని ఎందుకు తెంపినవె” అంట కోపంగా నిలదీస్తుంటే ఎన్క ముందు సోంచాంచక లటుక్కున్న “బతుకమ్మను జేస్తా” అన్నా.

“ఏందేంది బతుకమ్మను జేస్తవా.....” అంటు కిల్ల కిల్ల నవ్వింది అమ్మ నవ్వుల ఎకేసెక్కలు జూసి “ఔనే బతుకమ్మను జేస్తా” అంటనే వరం పోంటున్న బంతిపూలను ఎరి లంగ లేసుకుని ముందుకు ముందుకు పోతుంటే నవ్వటం ఆపిన అమ్మ “బతుకమ్మను జేస్తేవా బిడ్డా..... బ......తు......క.....మ్మ....ను....” అంట పొడి పొడిగంటనే గడ్డి మోపును కడ్త. “గట్లనా... గట్లయితే గాసెల్కలున్న గునుగుపూలు. ఉప్పుపూలు, గారస్తలున్న తంగెడి పూలు గూడా తెంపుకొచ్చి సక్కంగా బతుకమ్మను సేద్దుగని” అంట దీర్ఘాలు తీస్తుంటే అమ్మ దిక్కు అనుమానంగా చూస్తూనే గా పూలు దెంప అటు ఉరికి కంచెలున్న గునుగు పూలు రఫ రఫ తెంపుతుంటే వరం

కాడ అమ్మ గడ్డి మోపును నెత్తుకుని నాకోసం జుస్తున్నది. గప్పటి కల్ల ఆకాసంలా సూరీడు అమ్మ కొంగుసాటుకు సేరిన పసివోని లెక్క కొండలనడ్మ ఒదిగి పోతుండు సుట్టు మసక చీకట్లు ముసురుతుంటే ఆకాసంల పక్షులు రయ్యిన తిరిగి గూళ్లలకు చేరుతున్నాయి గాని నేను సెల్కల ఆత్రంగా పూలను తెంపుతనే ఉన్నా అమ్మ వరం కాడ గడ్డి మోపును నెత్తిమీదికెత్తుకుని సేను దాటతా నన్ను రమ్మని పిలుస్తుంటే నేను సెల్కదాటుకుంట బాటేంటున్న తంగేడు పూలను గూడా తెంపుకుంట అమ్మెన్క నడుస్తా "అమ్మ గియ్యాల బతుకమ్మను సేద్దామే" అన్న అనుమానంగనే.

అమ్మ మల్లా కిసుక్కున నవ్వింది గానీ ఏం మాట్లాడలే. అమ్మ ఎందుకు గట్ల నవ్వుతుందో సమజ్‌గాలే కానీ నా మనసుల అనుమానం సూదులు తిర్గవట్టింది.

"హు. అమ్మ సెప్పవేందే గియ్యాల బతుకమ్మను సేద్దామా" అన్న గునుసుకుంట.

"ఏంది బిడ్డా... ఏంది గియ్యాల బతుకమ్మ ఎన్కవడ్డవేందిరా ఏనాడన్న మన యిండ్లల్ల బతుకమ్మ సెయ్యంగా సూసిన వా" అన్నది.

"లే" అంట నెత్తి అడ్డంగా తిప్పినా

"మల్ల మనం బతుకమ్మను సెయ్యం బిడ్డా మనకు వోంతన లేదు" అన్నది

"వోంతన లేదంటే ఏంటే" అన్నమల్ల

"వోంతన లేదంటే గా బతుకమ్మను మన మాదిగోళ్ళ యిండ్లల్ల సెయ్యగూడదంట గట్టనే యింకొన్ని కులాలోళ్ళు గూడా గీ బతుకమ్మను సెయ్యరు బిడ్డా...." అన్నది రంజిగ.

"మనం ఎందుకు సెయ్యగూడదె మన కులంకేమి తక్వ" అన్న సోంచాంచుతా.

"మనం తక్వ కులపోల్లం బిడ్డా గద్కనే తక్వ కులపోల్లకీ బతుకమ్మ పండగ లేదు" అని రంజిగ అనేంతలనే "ఎందుకు లేదు అందరికీ బతుకమ్మ వుంది గానీ మనకెందుకులేదు" అన్న మొండిగ.

"లేదంటే లేదు గంతే" ఖరాఖండిగ అంట అమ్మ సటసట నడుస్తా ముందుకుపోతుంటే కాళ్ళు తడబడి నా ముఖం మాడిపోయింది, నా లంగలవున్న పూలన్నీ నన్ను ఎక్కిరిస్తున్నట్లున్నయి. అయినా ఆటిని భద్రంగా పట్టుకుని యింటి

కాడికి పోయి బయట అర్గుమీదేసి అట్లనే పూల పక్కన జేరగిల వడిన నా సోంచిల బతుకమ్మ సుడులు తిర్గతనే వుంది.

అమ్మ కోట్టంల గడ్డేసి జాలట్లకు పోయి కాలుసేతులు కడుకొచ్చే తాళ్ళకు గూడా నేను పూలను సూస్తా సోంచాంచుతా అరుగు మీద అలిగి కూకుండుడు సూసి

"ఓ బిడ్డా ఏందిరా గియ్యల నీకు బతుకమ్మ పిచ్చి వట్టిందేందిరా" అంటు నా కాడికొచ్చి వంగి నా యెంటికలు సవరిస్తా "పో బిడ్డా పో పోయి కాలు సెయ్యి కడుక్కోని రాపో బతుకమ్మను సేసుకుందువు తియ్యి...." అంట నా రెక్క పట్టుకుని లేపింది.

సుట్టు దట్టంగా సిమ్మసీకట్లు అలుముకుని ఆకాసంల సందమామా ఉదయిస్తుండు.

అమ్మ యింట్లకు పోయి సిమిని వెలిగించేంతల నేను కాలుసేతులు మొఖం కడుక్కోచ్చి మల్ల పూలకాడనే కూకున్న.

అన్నోళ్ళు ఆటలు మానోచ్చి సిమిని కాడ కూసుని బుక్కులు బయటకు తీసింద్రు గాని నామనస్సుల బతుకమ్మ సెగ ఎగస్తనే వుంది.

అమ్మ పొయ్యి రాజేస్తా బియ్యం కడుగుతా.... వంటసేస్త సిమిటతోటి మండే కట్టిపుల్లలని లోపలకు ఎదదోస్త, ఉదన గొట్టం తోటి పోయ్యిల గాలి ఊదుతా నా ఆలతు సుస్తనే వుంది గంటయ్యేతాళ్లకు పొయ్యికాడ వంటయ్యి పోయింది. సిమిని కాడ సదువయి పోయింది. గాని బతుకమ్మ సుట్టు నాసోంచి ఆగలే.

అమ్మ సేతులు కడుక్కోని వంట కోటిలున్న బాసనల్లకెని సత్తు తపుకు తెచ్చి నాకాడపెత్త "బతుకమ్మను పేరుస్తవా బిడ్డా" అంట నా ముందలకు తపుకును తోసి పక్కల కూసోని పూలకాడలని ఇరుస్తా ఏపూలకు ఆపూలను మట్టంగా పక్కల పెడ్తుంటే నేను తపుకుల పూలన్ని కుప్పేసిన.

అయ్యో గట్ల కాదు బిడ్డ గిట్ల గిట్ల మట్టంగా రౌండు రౌండులుగా సురువై పోను పోను పూలు తక్వ తక్వ చేసుకుంట పొట్టిఆనిగెం కాయలెక్క సెయ్యాలే" అంట బతుకమ్మను పేరుస్తుంటే.

"అమ్మ మనం బతుకమ్మను ఎందుకు సెయ్యమే" అంట మెల్లగడిగిన

"అమ్మ నాదిక్కు సూస్త కిసుక్కుమన్నది గాని ఏంమాట్లాడలె

గది సూసి నా ముఖం నల్లగా మాడిపోతుంటే "అయ్యో చెప్తతియ్యి బిడ్డ నువ్వు గట్ల మొఖం ఎందుకు సిన్నగ పెట్టుకుంటున్నవురా" అంట పూలను పేర్సపోతుంటే.

తపుకులున్న పూల మీద సెయ్యి పెట్టి "చెప్పమ్మ...." అంటుంటే పూలన్నీ వరుసల నుంచి రాలిపడినాయి.

గదిసూసి "అయ్యో పూలురాలుతున్నయిరా" అంట అమ్మ బతుకమ్మను మల్లా పేరుస్తా" యింగో పురానకాలంల మన కులంలనే నా లెక్క వోకతి పొద్దంతా పొలంకాడ కష్టం సేసి యింటి కొచ్చేతాళ్ళకు ఊర్లి అందరు బతుకమ్మను సేసి సెర్వుకాడికి బతుకమ్మనెయ్యా పోతుంద్రట. గప్పుడామె దబదబా పొలంకాడికెని తెచ్చిన పూలను తాపుకుల పేరుస్తుంటే నద్మకుడుక పెట్టి గౌరమ్మను సెయ్యలనే సుద్ది యాదికొచ్చి యింట్ల కుండల్ల గోళాలల్ల ఎతికే తాళ్ళకు అదునుకు కుడుక లేదంట. ఎవలనన్నా అడుగుదామంటే అందరు సెర్వుకాడికిపోయింద్రట. ఎట్ల సేద్దునని అంతట లెంకులాడ్తుంటే కూరటికెల వున్న ఎద్దు ముడుసు బొక్క కన్పించిందట. ఆమె గా ముడుచు బొక్కనే నద్మ గౌరమ్మ లెక్కుంచి పూలతోటి బతుకమ్మను పేర్చిందంట గప్పుడు గౌరమ్మ దేవతకు మస్తు కోపం వచ్చి మూడుసు బొక్కతోటి నన్ను తయారు సేస్తవా గిట్ల గలిజ లెక్కలు సేసిన నీకు నీ కులపోల్లకు యింక జిందగీల బతుకమ్మను ఆడేదిలేదంట శాపం పెట్టిందంట. గప్పటి నుండి మన యిండ్లల్ల బతుకమ్మ ఆడుడు వంతన లేకుండాపోయింది. బిడ్డా" అంట అమ్మ సెప్పెతాళ్లకు బతుకమ్మ పేర్చుడు సగం పూరగయ్యింది. యింక మీద మూడు నాలుగు వారసలు పేర్సతే బతుకమ్మ రడీ... గానీ అమ్మ నద్మ గౌరమ్మను పెట్టలేదని డౌటోచ్చి "అగాగు" అంట అమ్మ సెయ్యి పట్టుకుని ఆపి లోపలకు తొంగిసూస్తా

"అమ్మ గౌరమ్మను పెట్టలేదే" అంట అనేతాళ్ళకు "గా వంతన లేని గౌరమ్మ మనకు ఎందుకు బిడ్డా నాయింట్లనేనా బిడ్డ గౌరమ్మ ఉందిగా" అంట నన్ను దగ్గరకు తీసుకుంది.

గప్పటి దాకా రంజి గున్న నాపాణం ఉషారుగై కుషీగా నవ్విన జెరైనంకా మా బతుకమ్మ పేర్చుడు పూరగయ్యింది.

“యింగ పా... బిడ్డ... పా.... బతుకమ్మను ఆడ్తం పా....” అంట ఆకిట్ల నీళ్ళు సల్లి ముగ్గేసి దానిపై బతుకమ్మను పెట్టి మమ్మల్ని పిలిసి “యింగో గిట్ల సుట్టు నిలవడి వంగుకుంట రెండు సేతులతోటి సప్పట్లు కొట్టాలే” అంట బంతి తిరిగినట్ల తిరిగి సూపియ్యంగనే అమ్మ నేను సెల్లెండ్లు వరుసగా ఒకల్లపక్కల ఒక్కల్లం నిలబడి పక్క పక్కలనే అడుగులేస్తా వంగుతూ లేస్త సప్పట్లు కలుపుతుంటే అమ్మ నోట్ల నుండి ఆరున్నొక్క రాగం తోటి బతుకమ్మ పాట.

“బతుకమ్మ బతుకమ్మ ॥వియ్యల్లో॥
బంగారు గౌరమ్మ ॥వియ్యల్లో॥
ఇద్దరక్కల చెల్లెండ్లు ॥వియ్యల్లో॥
ఒక్కరికిచ్చి ॥వియ్యల్లో॥
ఒక్కడే మయన్న ॥వియ్యల్లో॥
ఓచ్చేన్న పోడు ॥వియ్యల్లో॥
ఏట్లెట్ల చెల్లెలా ॥వియ్యల్లో॥
ఏరడ్డమాయే ॥వియ్యల్లో॥
ఏరుకు ఎంపెల్లు ॥వియ్యల్లో॥
తోటడ్డమాయే ॥వియ్యల్లో॥
తోటకు తొంభైయి ॥వియ్యల్లో॥
తలుపు లడ్డమాయే ॥వియ్యల్లో॥
తలుపులకు తాళాలు ॥వియ్యల్లో॥
ఎండియె సీలలు ॥వియ్యల్లో॥
ఎండి సీలల కింద ॥వియ్యల్లో॥
ఎలవద్రి సెట్టు ॥వియ్యల్లో॥
ఎలవద్రి సెట్టుకు ॥వియ్యల్లో॥
ఏడే మొగ్గలు ॥వియ్యల్లో॥

ఏడు మొగ్గల దూది ॥వియ్యల్లో॥
కలేరాసి పోసి ॥వియ్యల్లో॥
పసిపిల్ల వడికింది ॥వియ్యల్లో॥
పగడాల నూలు ॥వియ్యల్లో॥
వయసుది వడికింది ॥వియ్యల్లో॥
వజునాల దూది ॥వియ్యల్లో॥
ముసలిది వడికింది ॥వియ్యల్లో॥
ముత్యాల దూది ॥వియ్యల్లో॥
ఆ దూది ఈ దూది ॥వియ్యల్లో॥
కలేరాసిపోసి ॥వియ్యల్లో॥
నేసేనే సాలోడు ॥వియ్యల్లో॥
నెలకొొక్క మూర ॥వియ్యల్లో॥
కొంగునా నేసిండు ॥వియ్యల్లో॥
కోటోక్క దేవస్తం ॥వియ్యల్లో॥
అంచున నేసిండు ॥వియ్యల్లో॥
ఐరేని కడవ ॥వియ్యల్లో॥
తోడమీద సింగుల్ల ॥వియ్యల్లో॥
దోసపూవు నేత ॥వియ్యల్లో॥
దిగనే సీర ॥వియ్యల్లో॥
దివిటీల మీద ॥వియ్యల్లో॥
ఆ సీర తీసుకుని ॥వియ్యల్లో॥
సెంద్రగిరి పట్నన ॥వియ్యల్లో॥
పోయేనే సాలోడు ॥వియ్యల్లో॥

సీరలమ్మ సీరలు ॥వియ్యల్లో॥
ఆ సీర కొనమని ॥వియ్యల్లో॥
అలిగేనే ఆడపిల్ల ॥వియ్యల్లో॥
ఆ సీర కట్టుకుని ॥వియ్యల్లో॥
కాకులా బాయికీ ॥వియ్యల్లో॥
నీళ్ల కంట పోతే ॥వియ్యల్లో॥
కాకులన్ని గూడి ॥వియ్యల్లో॥
కడువసిల్లి గొట్టే ॥వియ్యల్లో॥
ఆ సీర కట్టుకుని ॥వియ్యల్లో॥
పిట్టల బాయ్యికి ॥వియ్యల్లో॥
నీళ్లకంట పోతే ॥వియ్యల్లో॥
పిట్టలన్ని గూడి ॥వియ్యల్లో॥
కోయిల లెక్క అమ్మ, పక్కల కాకుల లెక్కమేము

ఆకాసంల కెళ్ళి సందమామ అమ్మ నోట్ల నుండి రాలే ముత్యాలను ఎరుక రమ్మని ఎన్నెలమ్మని పంపిస్తే ఆమె సర్కారు ముల్ల చెట్ల నుండి సర్రు సర్రున దూసుకొస్తా ముక్కలు సెక్కలై తెలుపు నలుపుల దుప్పట్లు పరుస్తున్నట్లు సుట్టుపక్కల వున్నది.

ఆ యల్ల రాతిరి పండుకున్ననన్న మాటేగాని బతుకమ్మను తోడు అమ్మపాట నా మనస్సుల సుడిగుండాలను సృష్టిస్తనే వుంది.

దినాలు గడుస్తున్నయి హస్తకార్తిల బతుకమ్మ పండగ దగ్గర కొస్తున్నది. మా పొలాలల్ల వరాలపోంటి సుట్టు పక్కల బంతిపూలు. ఉప్పుపూలు, గోగుపూలు, తంగేడు పూలు, ఇరుగ కాస్తున్నవి. మా సుట్టుపక్కల పొలాలోళ్ళు గాపూలన్ని తెంపి బజారుకు తీసుకపోయి అమ్మొస్తుంద్రు గుడులల్ల అమ్మోరి పూజలు జోరుగ సాగుతున్నయి. మా అమ్మోరిని రోజుకో తీర్గ తయారుసేసి కొలుస్తుంద్రు. అమ్మోరు అవతారాలను బయట నుంచే సుసుడు గాని లోపలకెళ్ళే సందేలేదు.

యింగ రేపోమాపో మా ఇస్కూలుకు దసరా లీవులిస్తారనంగా మా దోస్తూ జనబాయి “మాకు బతుకమ్మను సెయ్యాలంటే పూలు కావాలే మీ బాబు కాడికేని తెచ్చిఇస్తవా” అని అడిగేతాళ్ళకు.

“మా ఇంటి కాడ పొలంల మస్తు బంతి పూలున్నయి ఇస్తగానీ. గునుగుపూలు, ఉప్పుపూలు తంగెడి పూలూ మా కంచెపోంటున్న అడవిలనే దొర్కుతయి నా యెంట నువ్వొస్తే తెంపిస్త నబ్బా నాతోటి వస్తవా” అన్న.

“అమ్మో అడివిలకా నేను రానబ్బా నాకు భయం గందుల్ల మా అమ్మోళ్ళకు తెలిస్తే నన్ను కొడ్తరు. మా ఎక్వోల్ల యిండల్ల నుంచి ఆడపిల్లలు యింట్ల కాలు బయటపెట్టొద్దంట.” అంట భయం భయంగా సెప్పేతాళ్లకు నా దోస్తు దిక్కెళ్ళి నాకు ఎట్లనో అనిపించింది. జెరసేపు సోంచాంచి మా దోస్తుకు నేను పూలు తెచ్చి ఇస్తే నాకు బతకమ్మ ఆడటం నేర్పిస్తదనిపించి.

“ఇంగోనాబ్బ నాకు పూలు తెచ్చుడు ఇజీ గాని ఎన్ని పూలంటే అన్ని పూలు తెస్తను గానీ నాకు బతుకమ్మ ఆడరాదు. మా యిండ్లకాడేవరు బతుకమ్మ ఆడరు కొత్త కొత్త బట్ట లేసుకుని మీరంతా చాలా మంచిగాడుతారు. నన్ను గూడ మీ యింటి కాడ బతుకమ్మని ఆడిపిస్తవా మల్ల గట్లయితే మా సెండ్లనుంచి సెల్లల నుంచి అడివిల నుంచి ఎన్ని పూలంటే గన్ని పూలు తీసుకోస్తా” అంట చెప్పేతాళ్లకు, పైసలు పెట్టకుండ ఉట్టిగనే పూలొస్తున్నయన్న ఖుషీతోటి “ఓస్ ఇంతనేనా నా బతుకమ్మ ఆడుడు శానా ఈజాబ్బా ముందు నువ్వు పూలు తీస్కరా మా ఇంటి కాడ మనం బతుకమ్మను ఆడుదాం” అని అన్నది.

ఆ మాటిన్నప్పటి నుంచి నాకు మస్తు కుషీగుంది. మాయిండ్లల్ల కెల్లి ఏ ఆడపిల్ల గూడ ఎక్వోల్ల తోటి గూడి బతుకమ్మను ఆడలేదు కాని నేను ఆడబోతున్న నన్న ఖుషీల నా మనస్సు మబ్బులల్ల తేలిపోతున్నది. ముఖమంతా దీపం లెక్క ఎలిగిపోతున్నది.

ఆయల్ల నాలుగు గంటలకు ఇస్కూలు ఇడువంగనే యింటికి అదరాబదరా ఉర్కొచ్చి పుస్తకాల సంచి యింట్లకు ఇసిరేసి, బట్ట సంచి తీసుకుని పొలం కాడికి దమ్మువట్టంగురకినా ఆయల్ల అమ్మ పొలంల లేదు. గదే అదననుకుని వరం మీదున్న

మంచి మంచి బంతి పూలన్ని తెంపి బంతిపూలు కనవడకుండ కప్పుతున్న ఎందుకంటే బంతిపూలు మా దోస్తుకు ఇయ్యనీకి తీస్కపోతున్ననంటే అమ్మ ఊకోదు. ఆగడ్డి పొదలల్ల దూరి ఆత్రంగా నేను పూలు తెంపుతుంటే గడ్డిముండ్లు, పల్లేరుకాయలు, తుమ్మముళ్ళు నా కాళ్ళల్ల దిగవడి నన్ను ఎన్కకు పంపాలనే సూస్తున్నయి గానీ నేను పూలను తెంపుతనే వున్నా.

ఆకాసంల సూర్యుడు అలసటగా ఒదిగే యాలకు నేను సెల్కల కెళ్ళి బయటపడి పూల సంచితో తిరిగొస్తుంటే తూరుపు దిక్కు సుక్కలు పొడుస్తున్నాయి.

అడివిల కంచె పోంటి పోయి గన్నిపూలు తెంపుకోచ్చి మా దోస్తుకిస్తున్నని తెల్సిందంటే మా అమ్మ వూకోదని పూలసంచి తీస్కపోయి మా ఎల్లమ్మ లందకాడ పెట్టిన.

మరుసటి దినం పొద్దుగాల ఇస్కూలు పోయేటప్పుడు సాటుగా పూల సంచి తీసుకుని జనబాయోళ్ళ యింటికి పోయి గన్మ బయట నిలబడి "జనబాయి.... జనబాయి..." అంట పిలిసేతాళ్లకు నాసప్పుడిని జనబాయి యింట్లకెళ్ళి ఉర్కొచ్చి ఆత్రంగా సంచి తడిమిసూస్త "అన్ని రకాల పూలు తెచ్చినవబ్బా" అంట అడిగేతాళ్లకు

"ఓ" అంట మురిపెంగ సంచి సైడుకు సెయ్యిపెట్టి ఒక పక్కకు వత్తంగనే ఒక దానిపైన యింకొకటి చోప్పున కింది నుండి మీదికి అన్ని పూలు కన్పించినయి.

గప్పుడే జనబాయెల్ల అమ్మ "అమ్ములు ఎవరొచ్చింర్రు" అంట మాకాడ కొచ్చింది.

జనబాయి తల్లి దిక్కు తిరిగి "అమ్మ మాదోస్తు వచ్చిందే బతుకమ్మ గురించి ఆళ్ళ పొలంకాడికెళ్ళి పూలు తెచ్చింది" అంట మురిపెంగ సెప్పేతాళ్లకు

ఆమె నన్నోసారి ఎగదిగా సూసి మొఖం వికారంగా పెట్టుకుంట "ఆడనే గన్మకాడ గుమ్మరియ్యి" అన్నది.

తల్లి మాటినంగనే జనబాయి లటుక్కున నాసేతుల నుంచి సంచి గుంజుకుని పూలన్ని ఆల్ల గన్మట్ల గుమ్మరించింది.

"అయ్యో... అయ్యో... నిన్న తెంపిన కాడ్నుంచి మాయింట్ల ఎల్లమ్మ లందల భద్రంగున్న మా సేను సెల్కల పూలు ఆట్ల తొక్కుట్ల పడేతాళ్లకు నా మనస్సు గిలగిల

కొట్టుకుంది. అయినా ఏమనకుండనే మొఖం సిన్నగ సేసుకుని ఇస్కూలుకు పోయినా,

యింటరు బెల్లప్పుడు, పగటి బెల్లప్పుడు ఎక్కడలేని నవ్వుని మొఖానికి రుద్దుకొని జనబాయి తానికి పోయి "జనబాయి గియ్యాల పొద్దిమికి మీకాడ బతుకమ్మను ఆడొస్తనబ్బా" అంట మల్లమల్ల అడిగిన.

"గట్లనే... రా గట్లనే.... రా" అంట జనబాయి అనేతాళ్లకు ఖుషితోటి ఎగిరి గంతేసినా, నాలుగెప్పుడైతాదా అంట ఏయి కండ్లతోటి ఎదురుచూస్తనే వున్నా, ఎందుకంటే మా వొళ్ల దాంట్ల ఎవళ్ళు సెయ్యని పని నేను సెయ్యపోతున్ననని మనస్సుల మస్తు ఖుషీగుంది, ఒక్కదాన్నే కిస్కు కిస్కుమని నవ్వుకుంటనే బెల్లు కాంగనే బానం లెక్కరయ్యిన యిలంటి కురికినా.

యింట్ల అమ్మలేదు పొలం కాడికి పోయినట్లుంది.

బుక్కుల సంచి మూలకు ఇసిరేసి పెట్టెల కాడికి పోయి పెద్ద పెట్టెల కెల్లి దసరాకని కుట్టించిన కొత్తబట్టలు తీసుకుని బాయి కాడి కురికి బుడుంగున రెండు మునకలు మునిగి తానం జేసి కొత్త బట్టలేసుకుని యింటికొచ్చేతాళ్లకు.

అమ్మ దసరాకని కుట్టించిన దోసకాయ మెడ జాకెట్టు పూల లంగా నావొంటి మీద సూసిన సెల్లెలు "ఏడికి పోతున్నవు గౌరాలు నేనొస్త నీయెంట" అంట పెట్టెల కాడికి పోయి తన గూడ బట్టలు తీసుకుని బాయి గడ్డ దిక్కు తానంజేయ్య ఉర్కుతుంటే ఎనక నుంచి

"నువ్వొద్దు గంగాలు నేను జనబాయి యింటికి బతుకమ్మ ఆడవోతున్న" అంట గుసగుసగనే మస్తుకోపంగన్నా

ఐనా సెల్లే నా మాట వినక బాయిదిక్కు ఉరికింది. నేను జెల్దిజెల్ది పోవాలని నెత్తి సిక్కుతీసుకుని గోడకు అంటించిన అద్ద పెంచుల సూసుకుంట కాటిక బొట్టు పెట్టుకుని, సెల్లెకు అందకుండా పోవాలని జనబాయోళ్ళ యింటి దిక్కు ఉరుక్కుంటే గడ్డిమోపును నెత్తిన పెట్టుకుని అమ్మ ఎదురొచ్చేటాళ్ళకు గుండే గుట్టుక్కుమని దమ్మువట్టి ఆగి ఆగకుండానే "అమ్మ నేను మా దోస్తొళ్ల యింటి కాడ బతుకమ్మ లోతుకుంటకి పోతున్ననే మల్ల జెల్దీ తిర్గి వస్తునే" అంట అమ్మ మాట్లాడనీకి సందు యియ్యకుండ అమ్మను దాటి ఉరుక్కుతుంటే... అమ్మ నా దిక్కు తిరిగి "ఓ బిడ్డా ఆళ్ళు ఎక్వోళ్ళు

నిన్ను బతుకమ్మ ఆడనీయ్యరు బిడ్డా నామాటినే.... ఆడికిపోకు... నిన్ను బతుకమ్మ ఆడనియ్యరు బిడ్డా.... నా ఉరుకు ముందు అమ్మ పిలుపు గాలిలో కలిసింది.

నా కండ్లముందు నేను తెంపి ఇచ్చిన పూలు నా బతుకమ్మ పూలు బతుకమ్మ రూపంల ఎట్లుంటయో సూడాలనే ఆత్రంలా అడ్డదార్ల పడి నేను లోతుకుంట దిక్కు ఉర్కుతనే వున్నా.

ఆయాసం తోటి జనాబాయి యింటికాడికి దమ్ముపట్టి పోయేతాళ్లకు జనబాయోళ్ళ యింటి ముందల పెద్ద పెద్ద బతుకమ్మలు ఆటి సుట్టు అందరు కొత్త కొత్త పట్టుబట్టలు కట్టుకుని అటుఇటు తిరుగుతుంద్రు.

నేను మెల్లగా ఆడికి పోయిన, జనబాయి కోసం నాకండ్లు ఆత్రంగా ఎతికినయి... నా బతుకమ్మ పూలకోసం యింక ఆత్రంగా ఎతికినైయి. గప్పుడే జనబాయోళ్ళ అమ్మ పెద్ద బతుకమ్మను తీసుకుని యింట్ల నుంచి వస్తున్నది.

"అర్రే గవే గవే నేను తెచ్చిన నా బంగారు పూలు, నారత్నాల పూలు" వాటిని సూస్తనే నాకండ్లు పొద్దుతిరుగుడు పూల లెక్క పెద్దగైనయి.

జనబాయోళ్ళు పట్టు బట్టలు, బంగారం తోటి మిలమిలా మెరుస్తుంద్రు.

నేను కూడా కొత్త బట్టలేసుకున్నా ఆల్లముందల వెలవెలా పోతున్న అయినా సరే నాపూలే నాకండ్ల నిండా నా మనసు నిండా బతుకమ్మ రూపంల నా బంగారు పూలు నాకు కన్పించినయి.

జనబాయి, జనబాయోళ్ల అమ్మ నన్ను సూసిగూడా సూడనట్లే పట్టించుకోకుండా ఆళ్ల కుషీల ఆళ్ళుంద్రు.

"అయినా అంత మందిల నన్నేట్ల యిస్తరు నేనే పలుకరిస్తా" అని అనుకుని జనబాయి కాడికి పోయి, "జనబాయి ఓబ్బా జనబాయి నేనొచ్చినా" అంట పిల్చిన

నా పిలుపు ఇని తిరిగి చూసిన జనబాయి గుండే గుటుక్కుమన్నట్లుంది. అటు ఇటు సూస్తా దబదబా నా కాడికొచ్చి నాసెయ్యి పట్టుకుని పక్కకు గుంజుక పోయి "ఏందబ్బా ఎందుకొచ్చినవు....." అన్నది ఏమెర్గనట్ల

ఆ మాటినంగనే నా ముఖం పాలిపోయింది అయినా సర్దుకుని "గదేంది జనబాయి నేను బతుకమ్మ ఆడొచ్చినా" అన్నా

నా మాటిని జనబాయి జెరసేపు తటపటాయించింది.

"యింగో మీరు మాతోటిగూడి బతుకమ్మ ఆడొద్దంట మా అమ్మ అన్నది" అని అనంగనే యింకింత సల్లబడిన, నాకండ్లు బైర్లు కమ్ముతున్నయి. సెవులల్ల గిఱ్ఱు గిఱ్ఱున సప్పుడు సురువైంది. నా సుట్టు ఎమైతుందో నాకు సమజైతాలే.

"ఆళ్ళు నిన్ను ఆడనియ్యరు బిడ్డా... ఆడనీయ్యరు" మదిల అమ్మ పిలుపు అడిమిల నుంచి పిలుస్తున్నట్ల నా అవస్థ సూసి ఏడుస్తున్నట్ల అమ్మ రూపం నాకండ్లల్లకెళ్ళి కన్నిళ్ళ రూపంల నా వడిల పడేతాళ్లకు.

సటుక్కున లేసి జనబాయి కోసం సూసిన, ఆళ్ల అమ్మ పక్కల పట్టులంగా కుచ్చిళ్ళు వోసేతిల పట్టుకుని నవ్వుతా తుళ్ళుతా బుట్ట బొమ్మ లెక్కుంది.

మెల్లగా ఆమెకాడికి పోయి "జనబాయి ఓ జనబాయి" అంట మల్ల మల్ల పిలిసేతాళ్లకు.

"అబ్బా ఏందబ్బా" అంట ఇసుక్కుంట నా కాడికొచ్చింది

ఆమె కండ్లల్లకు సూటిగా సూస్త

"జనబాయి నన్ను ఎందుకు ఆడనిస్తలేవు' అన్న

"నాకు తెల్వదు కాని మీరు తక్వకులపోల్లంట మీరు మా గౌరమ్మను కొలువ వద్దంట గంద్కనే నిన్ను మా అమ్మ ఆడిపించొద్దన్నది" అన్నది మెల్లగ

"గట్లయితే మల్ల నేను తెచ్చిన పూలు కూడా తక్వయే అయితయి గదబ్బా" అన్న

"అదే డౌట్ నాకొచ్చి మా అమ్మనడిగితే ఏపూలైతేంది అన్ని దేవుడికెక్కుతయి అన్నది గట్లగాక గీ పూలు మస్తు పిరమంట నీకు ఎర్కనా మీకైతే అన్నీ ఇజీగ దొరకుతాయి గానీ మాకుదొర్కయి" అంట మస్తూ తెల్విగ అంటుంటే

నేను గదేం పట్టించుకోకుండా "జనబాయి నాపూలు నాకు కావాలబ్బా" అన్న మొండిగ

"అఱ్ఱే గిప్పుడు బత్కమ్మను పేర్చినం గవేట్ల యిస్తం కావాలంటే బత్కమ్మ

ఆడినంక సేర్ల పడేస్తం ఆడికెళ్ళి ఏరుకొచ్చుకో" అంట రుబాబుగా నన్ను దాటిపోతుంటే నా గుండే భగ భగ మండింది.

గంతే రయ్యిన బతుకమ్మకాడికి ఉరికి అటు ఇటు సుసేతాళ్లకు బతుకమ్మను ఆడనీకి అందరు సరబరాసేస్తూ మాటలల్ల మునిగుండ్రు నట్టనడుమ జనబాయోళ్ళ అమ్మసేసిన నాపూల బతుకమ్మ నడిబొడ్డున మా అమ్మోరు లెక్క...

గంతే యింకేం సోంచాంచలే సుట్టు పక్కలున్న బతుకమ్మలను ఒక్క షనంల దాటి నట్టనడ్మున్న బతుకమ్మను అలగ్గున తాంబాలంతోటే మీదికి లేపి వంపి నా పూలనన్నింటిని నా లంగలేసుకునే తాళ్లకు తాంబాలంల గౌరమ్మ వంటరిగా మిగిలింది. ఆ తాంబాలంను ఆడనే ఇసిరి "యింగో జనబాయి నా పూలను నేను తీస్కపోతున్న మీ గౌరమ్మను మీరే వుంచుకోండి" అంట వొక్క అంగల ఇవతలకు దుంకి ఉరుకందుకున్న. రెప్పపాటుల జరిగిన గీ సుద్దిని సుట్టు ముట్టోళ్ళు పట్టించుకున్నంతలనే చాన దూరం ఉరికిన

ఆళ్ళు తేరుకుని "అయ్యో... అయ్యో... గా పోరి బత్కమ్మను ఎత్కపోతుంది. బతుకమ్మను ఎత్కపోతుంది. ఉర్కుండ్రి, ఉర్కిపట్టుండ్రి" అంట నా యెంట పడ్తుంటే అడ్డంతోవల పడి ఆళ్ళకు దొర్కకుండ రాలల్ల రప్పలల్ల కెళ్ళి ఉర్కిపోయి కంచెంల దూరిన నాయెన్నపడ్డోళ్ళు వూర్కోస్తనే అందిన రాళ్ళు తీసుకొని నా మీదికి ఇసిరి ఇసిరి కొడ్తుండ్రు కంచేలున్న ముండ్లు నాకాళ్లకు గుచ్చుకుని పాదాలు రక్తం రక్తం అవుతుంటే నా యెనక ఆళ్ల గుంపు నన్నందుకోలేక ఆ ముండ్లల్లవడి ఉర్కిరాలేక ఒక్కొక్కరే చతికిల వడి అందితే సంపాలన్నంత కక్షతోటి వూర్కోస్త ఎనకవడి ఆగిపోవట్టిండ్రు.

నేనురుకుతుంటే ముళ్లపొదలల్ల నా పెయ్యంత రక్తం రక్తం అయితోంది. నావడిల వున్న పూలన్ని ఎగిరెగిరి రక్తసిక్త మౌతున్న నాకాళ్లను సేరి పసిపిల్ల పాదాలను ముద్దాడుతున్న తల్లి లెక్క తాకి భూతల్లి వడిల సేరి మల్ల నేను నడిసోచ్చే తోవల మొలకెత్తడానికి గప్పటి నుండే సిద్ధమౌతున్నయి. గాని పల్లేరు గాయలల్ల నా పరుగాగలే నామనసుల ఉరుకాగలే నా వడిల పూలు నారక్తాన్ని ముద్దాడటం మానలే.

"ఈ భూమినాది, ఈ అడవి నాది, ఈ పచ్చదనం, ఈ సంపదంతా నాదే, నావాళ్ళదే ఇది మాకే నీ సొంతం గావలే మాకే సొంతం కావాలే" అంట గట్టిగ ఓర్లుకుంట నా వడిల మిగిలిన పూలనన్ని మా సెల్కల అందిన కాడికి బలంగా ఇసిరి సల్లినా...

మల్లేప్పుడో ఒక పువ్వు వేయి పూవ్వులుగా మా అడవితల్లి నవ్వులై మల్లా మల్లా విరబూయాలని ఆ నవ్వుల కోసం అడవి బిడ్డగా నా తల్లి వడిల సేదతీరాలని కనుచూపుమేర అడివంతా కలియసూసి యింటి దిక్కు అడుగులేస్తుంటే ఆకాసంలోంచి నక్షత్రాలు మినుకు మినుకున మెరుస్తున్నయి కీచురాళ్ళు పెద్దగ రోద చేస్తున్నయి.

# నాన్న కూతురు

-మల్లీశ్వరి

**డి**సెంబరం పువ్వు రంగు క్రష్డ్ టాప్ పెన్సిల్ కట్ లోవెయిస్ట్ మోడల్ తెల్లని జీన్స్, స్టెప్‌కట్ చేయడం మూలంగా కదిలినప్పుడల్లా నల్లని సముద్రపు అలల్లాగా ఊగుతున్న ఉంగరాల జుత్తు, పొడవుగా, సన్నగా, తెల్లగా ఆకులు రాల్చడానికి కూడా తీరికలేనట్లు, మారాకులు మాత్రమే వేసుకుంటూ చకచకా ఎదిగిపోతున్న పదిహేనేళ్ళ లేత యవ్వనం.

లాస్య.

అపుడపుడు జరిగే మా ముగ్గురి సమావేశానికి ఈ రోజు ముఖ్య వక్త.

"నాన్నా! నువ్వు ముందు మొహం అట్లా చిరాగ్గా పెట్టడం మానేస్తే నేను మాట్లాడతా"

దివాన్ మీంచి లేచి ఫ్రిజ్‌లోంచి వాటర్ బాటిల్ తీస్తూ అంది.

శౌరి సోఫాలో అసహనంగా కదిలాడు. ఏమ్మాట్లాడలేదు.

"కండిషన్స్ లేవు". లాస్యని హగ్ చేసి వదిలి, వచ్చి శౌరి పక్కన సోఫాలో కూర్చుంటూ అన్నాను.

బాటిల్ ఎత్తి ఆగి ఆగి నీళ్ళు తాగింది. బాటిల్ ఫ్రిజ్‌లో పెట్టేసి జుత్తుని క్లిప్‌తో పైకి ఎత్తిపెట్టి బంధించి, వాష్ బేసిన్ దగ్గరకెళ్ళి మొహం కడుక్కుని టవల్‌తో తుడుచుకుంటూ "వర్రీ అవ్వాల్సిందేం లేదు నాన్నా ప్లస్‌టూ తుషార్ లేడూ.... నా బర్త్‌డేపార్టీకి వచ్చాడు మీరు చూశారు కూడా. తను ప్రపోజ్ చేసాడు. చాలా ప్రెషర్‌లో కన్ఫ్యూజన్‌లో ఓకే చేయాల్సివచ్చింది. తర్వాత ఎప్పుడో అమ్మతో కాజువల్ టాక్‌లో గిల్టీగా అనిపించింది. రైట్ ఏజ్ కాదని మిస్టేక్ చేసానని జనరల్ డిస్కషన్స్‌లో అర్థమయింది. బ్రేకప్ చెప్పేసాను. బ్రేకప్‌పాటీ కూడా ఎలౌ చెయ్యలేదు. అయిపోయింది

కదా అని మీయిద్దరితో షేర్ చెయ్యలేదు" దాపరికం లేని గొంతుతో స్పష్టంగా చెప్పింది లాస్య.

కంపిస్తున్న శౌరి చేతిని మృదువుగా పట్టుకున్నాను. క్షణం క్రితం వరకు నున్నటి పాలబుగ్గల్లో, ఇసుమంత ఎర్రజీర లేదు. గుండ్రని అమాయకపు పెద్ద కళ్ళల్లో, సిగ్గు ఎరుగని విరగబాటు నవ్వులో కనిపించిన బాల్యం మరి లేదు. పసిదనం విరిగిపోయింది.

"నీ వయసెంతా? ఈ వయసులో మాట్లాడాల్సిన మాటలేనా యివి? అసలకి ఆ భాషేంటి! తప్పు చేసిన భయం లేకుండా తల ఎగరేస్తూ మాట్లాడటమేంటి?" కోపంతో వణకిపోతూ మీదిమీదికొస్తున్న శౌరిని చూసి.

"కూల్.... నాన్నా.... మీ దగ్గర భయమెందుకు?...." లాస్య భుజాలు ష్రగ్ చేస్తుండగానే వీపు మీద గట్టిగా పడింది దెబ్బ. లాస్యని శౌరి కొట్టడం అదే మొదటిసారి. ముందుకు తూలిపడబోయి ఆపుకుని నమ్మలేనట్లు చూసింది లాస్య.

"ఏం పనిది?!" గాభరాగా ఇద్దరి మధ్యకి వచ్చి శౌరిని వెనక్కినెట్టి లాస్యని దగ్గరికి తీసుకోబోయాను. రెండడుగులు వెనక్కి వేసి తిరస్కరించింది. తట్టుతేలి చురుక్కుమంటున్న వీపుని తడుముకోబోయి సిగ్గు, అవమానం, పౌరుషంతో ఆగిపోయింది.

అన్ని బరువుల్ని విదుల్చుకున్న కళ్లను శౌరిమీదకి గురిపెట్టి "నువ్వంటే నాకిష్టం లేదు" గట్టిగా చెప్పి తన గదివైపు నడిచి నీళ్లతో నిండుతున్న కంటి దొన్నెల్ని మూస్తూ "నాకు అమ్మంటేనే ఇష్టం" అనేసి గది తలుపుల్ని కూడా ధడేల్మని మూసేసింది.

రెండో బాణానికి విలవిలాడాడు శౌరి. "ఎంతలో ఎంత మారిపోయింది! అసలెంత స్ట్రాటజిగ్గా మాట్లాడుతుందో చూడు!" వాన నీటిని దాచుకున్న చెట్టుని మొదలంతా పట్టుకొని ఊపినట్లు జలజలా కన్నీరయ్యాడు.

తను చేసిన పనో లాస్య ప్రవర్తనో ఏది ఎక్కువగా బాధిస్తుందో మరి. సోఫాలో చేరగిలబడి చిన్నప్పటి నుంచి ఆ పిల్లని ఎలా ప్రాణంలా చూసుకున్నాడో తనకి తనే చెప్పుకుంటున్నాడు.

మూసిన తలుపుల వెనుక లాస్య.

బైట శౌరి

యిద్దరి మధ్య నిలబడి చూడడం కొత్తగా వుంది నాకు

'పాప పుడితే నేనే పెంచుతాను' అన్న శౌరి, నిజంగానే లాస్యని తనే ఎక్కువగా శ్రద్ధపెట్టి పెంచాడు.

అందుకు, పిల్లల మీద సొంత భావన ఉండకూడదన్న ఆలోచనతోనూ, లాస్య పట్ల ముందునుంచి డిటాచ్‌డ్‌గానే ఉన్నాను. ఆ డిటాచ్‌మెంట్ మూలంగానే అనుకుంటా మా ఇద్దరి మధ్యా ప్రేమ కన్నా స్నేహం ఎక్కువుండేది.

కానీ శౌరీ లాస్య అట్లా కాదు. ప్రేమించడం ఎంత వరకు చాతనవునో అంతవరకే ప్రేమించి వూరుకోలేదు. ఒకరికొకరు జీవితాలనే రాసిచ్చేసుకున్నారు.

కొంచెం ఖాళీ దొరికితే చాలు నా పక్కన చేరి మీద కాలేసుకుని మెడ చుట్టూ చేయి చుట్టి "అమ్మా! నా చిన్నప్పటి కబుర్లు చెప్పు... నా పుట్టిన్రోజుకు నాన్న ఏం చేసాడో చెప్పు... అమ్మమ్మ వాళ్లింటికి వెళ్ళినపుడు నేను నాన్న కోసం రోడ్డుమీద ఎలా పరిగెత్తానో చెప్పు" అంటూ మరీ మరీ చెప్పించుకునే లాస్య మురిపెం, పక్కనే వుండి ఇష్టంగా వింటూ తల్చుకుని, తల్చుకుని శౌరి పొందిన సంతోషం గుర్తొస్తున్నాయి..

లాస్య ఏడో పుట్టినరోజు నాడు శౌరి తప్పని సరి పనిమీద లంతాపుట్ వెళ్లాల్సివచ్చింది. ఆరోజు సాయంత్రం ఐదుగంటలకి వెళ్లిన పని ఐపోతుంది కానీ తిరిగొచ్చే వీల్లేదు. ప్రమాదకరమైన ఘాట్‌రోడ్‌లో చీకట్లో నాలుగైదు గంటల ప్రయాణం. చీకటి పడితే పెద్దగా వాహనాలు దొరకవు. పైగా ముంచెత్తుతున్న వానలు

శౌరి వూళ్లో లేడని తెలిసి లాస్యకి ఆ లోటు తెలీకూడదని, తాతయ్యానాన్నమ్మ, అత్త, బాబాయ్ పిన్ని అందరూ బిలబిల్లాడుతూ వచ్చేసారు. అందమైన పిల్లి బొమ్మ ఆకారంలో కేకు పట్టుకొచ్చి కోయమని చాకు లాస్య చేతికిస్తూ దాన్నల్లాగే పట్టుకుని నాన్నొచ్చాకే కోస్తానని కూచుంది.

నాన్నెందుకు రాలేడో అందరూ బుజ్జగించి చెప్పినా విన్లేదు. శౌరితో చెప్పించడానికి సెల్ సిగ్నల్స్ వుండవు. అందరూ బ్రతిమిలాడి విసిగిపోయి చివరికి బహుమతిలిచ్చేసి అన్నాలు తిని వెళ్లిపోయారు.

ఈ పిల్ల మాత్రం కేకు దగ్గరే చాకు చేత్తో పట్టుకుని ఏడుపు ఆపుకుంటూ పెదాలు బిగించేసి కూచుంది. పడుకోమ్మా అంటే నాన్నొస్తాడు అంటుంది తప్ప కదలదు. పగలంతా పనులతో అలసిపోయి నాకు నిద్ర ముంచుకొస్తోంది. చూసి చూసి ఎపుడు దివాన్ మీదవాలేనో... ఎపుడు నిద్రలోకి జారుకున్నానో గుర్తు లేదుకాని కాలింగ్ బెల్ మోతకి  వులిక్కిపడి లేచాను. టైమ్ చూస్తే పదకొండూ నలభై... నమ్మలేనట్లు తలుపు వంక చూసి గబగబా వెళ్లి తీస్తే ఎదురుగా శౌరి.

తడిసి ముద్దయిపోయి చలికి గజగజా వణుకుతూ గుమ్మంలో నిల్చున్న శౌరి...

గుప్పెట్లో  చాకు భద్రంగా పట్టుకుని కేకుపక్కనే కుర్చీలో ఒరిగి నిద్రపోతున్న లాస్య...

అసలేంటి వీళ్లిద్దరూ!

ఏం చేసయినా నాన్నొచ్చేస్తాడని ఈ పిల్లకేంటి అంత విశ్వాసం!

ప్రాణాలకి తెగించైనా ఒచ్చేయాలని ఈ తండ్రికేంటి అంత పంతం!

ఇలాంటి తెగింపు శౌరికే కాదు లాస్యకీ అలవాటే.

తన ఎనిమిదో ఏట వేసవి సెలవులకి అమ్మావాళ్ల వూరెళ్లాము. బయల్దేరేరోజు శౌరి తన మిత్రునికి రక్తదానం చేయాల్సివుండి రాలేకపోయాడు. వూరు చేరాక మా తమ్ముడు బావేదని అడిగితే ఇదే చెప్పాను. అప్పటికే తండ్రి కూతుళ్ల ప్రేమ గాథల్ని వైనవైనాలుగా వినివుండటం చేత “ఏంటే లాస్యా! మీ నాన్న ఒంట్లోంచి రక్తం తోడేస్తున్నారంటా, సమయానికి నువ్వు మీ అమ్మకూడా దగ్గరలేరు. పాపం మీ నాన్న పరిస్థితి ఏంటో... ప్చ్....” అంటూ ఏడిపించడం మొదలుపెట్టాడు.

కాసేపటికి ఐస్‌ఫ్రూట్ అమ్ముకునే అతను ఇంటిముందు సైకిలాపి “అమ్మా!... మీ పాప గారు, తమ్ముడిగారి బాబు, రోడ్డుకడ్డంబడి లగెత్తుతున్నారమ్మా... వొయిజాగు పోతారంట” వగరుస్తూ చెప్పాడు.

పై ప్రాణాలు పైనే పోయినంత పనయి, కంగారుగా తమ్ముడు బైక్ మీద వెతకడానికి బయల్దేరాము. అప్పటికే చేతులు చేతులు పట్టుకుని ఎర్రటి ఎండలో

చెమటలు కక్కుకుంటూ చుట్టూ పొలాలు తప్ప జనసంచారం లేని తోవలో మైలుదూరం పరిగెత్తేసారు.

మమ్మల్ని చూడగానే తమ్ముడి కొడుకు "నాకేం తెల్వదు. మామయ్యను రప్పించాలి రమ్మంది లాస్య" అని వెక్కిళ్ళు పెట్టేసాడు.

'ఎట్లాగయినా వైజాగ్ వెళ్లి నాన్నని రప్పించాల్సిందే అని పట్టుబట్టేసింది లాస్య. మరుసటిరోజు ఉదయం శౌరి వచ్చేవరకు గొడవ చేస్తూనే వుంది. 'మీ ఆయన ఒంట్లో రక్తం తోడెయ్యడం దేవుడెరుగు, ఇది మన ప్రాణాలు తోడేసిందే తల్లీ!...' అంటూ తమ్ముడు నిట్టూర్చాడు.

మూడేళ్ల కిందట కూడా తండ్రీ కూతుళ్లది ఒకేమాట. లాస్య మెచ్యూర్ అయినపుడు సాంప్రదాయకంగా జరగాలని శౌరీ, వద్దని నేనూ గట్టిగా వాదించుకున్నాం. చివరకి లాస్యనే అడగాల్సి వచ్చింది.

"స్కూల్ నుంచి సడెన్‌గా వచ్చేసాను. యిపుడు ఫైవ్‌డేస్ లీవ్ అంటే అందరికీ తెల్సిపోతుంది. నాకు ఎంబరాసింగ్‌గా వుంటుంది. కాని నాయనమ్మ వాళ్లతో మాట పడాల్సివస్తుందని నాన్న అంటున్నాడు. నాన్నని హర్ట్ చేయడం నాకిష్టం లేదు" అంటూ ఇబ్బందులకు సిద్ధపడిన కూతురినీ కూతురికి లేని సౌఖ్యం నాకెందుకని డబుల్‌కాట్ వదలి తనూ హాల్లో ఓ పక్కగా దుప్పటి పర్చుకొని పడుకున్న నాన్నని, వచ్చేపోయే వాళ్ళు వింతగా చూసారు.

ఒకటా రెండా, చెప్పుకోవాలేగాని పూటకో విడ్డూరాన్ని చూపించారు తండ్రీకూతుళ్ళు.

ఎట్లాగో ఏమో తెలీదుకానీ లాస్య విడిగా ఎదుగుతుండడం, శౌరి మారడం రెండూ ఒకేసారి మొదలయ్యాయి.

చిన్నప్పుడు బొమ్మలా ముస్తాబు చేసిన కూతుర్ని చూసినవాళ్లంతా కళ్ళు తిప్పుకోలేనట్లయి బుగ్గలు లాగి ముద్దాడితే మొహం విస్తరాకంత చేసుకున్న శౌరి ఇపుడు పొరపాటున అబ్బాయిలెవరన్నా లాస్య వంక ఆసక్తిగా చూస్తే చాలు, వాళ్లు కళ్ళు తిప్పుకునే వరకూ గుర్రుమని చూస్తూనే వుంటాడు.

బీచ్‌కి వెళ్లినపుడు లాస్యని తమాషాగా కామెంట్ చేసిన అబ్బాయి కాలర్ పట్టుకోవడం, స్కూలుకెళ్ళేటపుడు లాస్య చుట్టూ బైక్‌మీద చక్కర్లు కొడుతున్న అబ్బాయిని ఆపి మరీ వార్నింగ్ ఇవ్వడం లాంటివి మొదట్లో తమాషాగా వుండి, నేనూ లాస్యా నవ్వుకునేవాళ్లం. పోను పోను అందరితోనూ గొడవలే! 'పిల్లకి శత్రువుల్ని తయారు చెయ్యకు, అది పద్ధతి కాదు' అని గట్టిగా చెప్పాక ఆ అదుపుని క్రమంగా లాస్యమీదకి మళ్లించాడు. అపార్ట్‌మెంట్ సెల్లార్‌లో అబ్బాయిలుంటారని ఆడుకోడానికి వెళ్లనిచ్చేవాడు కాదు. బైటకి ఎక్కడికి వెళ్లినా తను వెంట వుండాల్సిందే. నాన్నతో వుండడం ఇష్టమే కాబట్టి లాస్య కూడా పెద్దగా పట్టించుకునేది కాదు.

కానీ యిద్దరి మధ్యా దూరం వుందని గుర్తించిన సంఘటన లాస్య పదిహేనో పుట్టినరోజునాడు జరిగింది.

"నేను ఈవెనింగ్ నా ఫ్రెండ్స్‌కి 'బెజెల్స్'లో ట్రీట్ యిస్తాను అయిపోయాక కాల్ చేస్తాను వచ్చి బిల్ పే చేసేయండి" అంది లాస్య.

"మేమూ వస్తాం" శౌరి చిరుకోపంగా అన్నాడు

"నో!.... బాయ్స్‌కి నువ్వంటే భయం...." గలగలా నవ్వింది లాస్య.

శౌరీ ఒప్పుకోలేదు. కాసేపు వాదులాట అయ్యాక మేం కూడా వెళ్లేట్టూ కానీ దూరంగా వేరే టేబుల్ దగ్గరగా కూచునేట్టూ నిర్ణయం అయింది.

లాస్య స్కూల్ నుంచే ఫ్రెండ్స్‌తో కలసి బెజెల్స్‌కి వెళ్ళింది రద్దీలో ఇరుక్కుని మేమెళ్ళేసరికి ఆలస్యమైంది. లోపల అడుగుపెట్టేసరికి లాస్య బుగ్గలనిండా కేక్ క్రీమ్ పూసేసారు తన ఫ్రెండ్స్.

'హే.... డ్యాడ్.... కమ్.... తుళ్లింతలాడుతూ కేక్ పీస్ ఫ్రెండ్‌కి యిస్తోంది లాస్య.

శౌరికి గుండె చిక్కబట్టినట్టుంది. మొహం పాలిపోయింది. ఏం గుర్తొచ్చిందో ఏమో 'ఒక్క అరగంట ఆగలేకపోయింది చూడూ!' కళ్లల్లో నీళ్లు తుడ్చుకుంటూ అన్నాడు.

'అయ్యో! ఇదేంటి ఈ పిల్ల ఇలా చేసింది!' అని నాకూ అనిపించింది కాని ఏదో పిల్లల సరదా కదా అనుకున్నాను. మమ్మల్ని చూడగానే పరిగెత్తుకొచ్చి "సారీ

నాన్న ఫ్రెండ్స్‌కు లేటవుతోంది. వాళ్ళు వెళ్లిపోతానంటేనూ....” అని శౌరిని హగ్ చేసి మళ్లీ వెళ్లిపోయింది.

మేం కొంచెం దూరంలో కూర్చున్నాం. శౌరి మొహం గంటుపెట్టుకుని వాళ్లవైపే కుర్చీ జరుపుకుని చూస్తూ కూర్చున్నాడు.

పోలో టీ షర్ట్, రోపీలైన్ జీన్స్, స్పైక్స్ హేర్ స్టైల్, కాలర్‌నెక్‌కి వెనకవైపు వేలాడదీసిన గాగుల్స్‌తో లాస్య పక్కన, చేతుల్లేని కుర్చీని వెనక్కి తిప్పి, అటో కాలు, ఇటో కాలు వేసుకు కూర్చొని ‘లోల్....’ అంటూ విరగబడి నవ్వేస్తున్న కుర్రాడిని నాకు చూపించి “చూడు.... వాడి అవతారం... చీకేసిన తాటి టెంకలాంటి జుట్టూ వాడూ....” మిర్రి మిర్రి చూస్తూ అన్నాడు.

నాకు ఆపుకోలేనంత నవ్వొచ్చి లాస్య వంక చూసాను.

చేతి వేళ్ళు మూస్తూ తెరుస్తూ, కళ్ళు మూసుకొని తలాడిస్తూ ‘బ్లా.... బ్లా.... బ్లా...” అంటూ ఎవర్నో అనుకరించి ఏడిపిస్తోంది.

ఆ రోజు లాస్య నాకు మరీ మరీ ముద్దొచ్చింది.

మాతో సంబంధం లేకుండా దానికో ప్రపంచం వుండడం దానిని తనే సొంతంగా నిర్వహించుకోవడం చూసి ముచ్చటేసింది.

సరిగ్గా అదే విషయం శౌరికి సమస్యయి కూర్చుంది. తనకి తెలీని సంబంధంలేని ప్రపంచం లాస్యకి వుండడం మీద చాలా భయపడ్డాడు. ఆ ప్రపంచంలోని మంచి చెడూ చర్చించి వుంటే బాగుండేది.

తనట్లా చేయలేదు. తరతరాలుగా అందివచ్చిన రాజమార్గాన్నే ఎంచుకున్నాడు.

ఆ రాత్రికి వూరుకుని పొద్దున లేవగానే

“పిచ్చి పిచ్చి ఫ్రెండ్స్‌తో స్నేహాలు మాని చదువుమీద ధ్యాస పెట్టు” మందలింపుగా అన్నాడు

అవమాన పడింది లాస్య.

“నాకు ఎపుడూ నైన్టీఫైవ్‌కి తగ్గలేదు. నాదే ఫస్ట్ ర్యాంక్, ఎక్స్‌ట్రా... కరిక్యులర్‌లోనూ నేనే యాక్టివ్, నా ఫ్రెండ్స్‌కూడా బాగా చదువుతారు” కోపంగా అనేసరికి ఊరుకున్నాడు.

తొలి యవ్వనంతో తళతళా మెరిసిపోతున్న లాస్య, ఆ పిల్ల చలాకితనం శౌరికి గాభరా పుట్టిస్తున్నాయి. ప్రాచీన సంస్కృతీ సాంప్రదాయాల ద్వారా పిల్లల్ని అదుపు చేయొచ్చని ఎక్కడో బ్రెయిన్ వాష్ చేయించుకుని వచ్చి ఓ రోజు ఔటింగ్ కోసం తయారవుతున్న లాస్య దగ్గరకి వెళ్లి "బొట్టు పెట్టుకో... ఎపుడుచూడూ... బొట్టు లేకుండా బోడి నుదురుతో....." అసహనంగా అన్నాడు.

ఆ పిల్లా వూరుకోలేదు.

"చిన్నపుడు బొట్టులేని నుదురు చూసి "మేటవేసిన స్వచ్ఛమైన ఏటి ఇసుక పొరలాంటి నుదురు" అనేవాడివి... యిపుడు 'బోడి నుదురు' ఎలాగయిందీ?" అని లా పాయింట్ లాగింది.

రోజు ఇదే తంతు

ఆచార సాంప్రదాయాల సాయంతో శౌరీ, మేటవేసిన స్వచ్ఛమైన ఏటి ఇసుక సాయంతో లాస్య బొట్టు గురించి ఒకటే వాదం...

జీన్స్ మానేసి చుడిదార్లు వేసుకోమని ఒకరోజు, జుత్తు పెంచి జడ వేసుకోమని మరోరోజూ, ఇది చెయ్యి, అది చెయ్యొద్దు అంటూ సవాలక్ష నియమాలు ఆ పిల్ల నెత్తిన రుద్దడం మొదలుపెట్టాడు శౌరి.

లాస్య పరోక్షంలో 'ఈ పిల్లకి పెళ్ళి చేసి పంపేవరకూ ఎలా కాసుకోవాలో బెంగగా వుందనీ, పై చదువుల కోసం లాస్యని బయట వూళ్లకి పంపననీ' గొణుక్కుంటూ వున్నప్పుడు మాత్రం నేను తీవ్రంగా అభ్యంతరం తెలిపేదాన్ని.

యిలా రోజుకో గొడవలో యిల్లు మార్మోగిపోతుండగా, ఈ రోజు మధ్యాహ్నం నేను ఆఫీసులో వున్నప్పుడు త్వరగా రమ్మని శౌరి నుంచి కాల్. తన గొంతు విని భయపడి వున్నపాళంగా బయల్దేరి వచ్చాను.

రాగానే లాస్య కప్‌బోర్డులో దొరికిన 'ఐలవ్‌యూ' గ్రీటింగ్ కార్డు నా చేతిలో పెట్టి, 'అంతా అయిపోయింది... పరువుపోయిందని' బావురుమన్నాడు. లాస్య ట్యూషన్ నుంచి వచ్చేవరకు శౌరిని ఆపడం కష్టమయింది,

లాస్యని అడిగేవరకూ ఒక దుఃఖం, ఇపుడు అడిగేసాక మరో దుఃఖంతో సతమతమౌతున్నాడు.

ఓ అరగంట ఆగి లాస్య దగ్గరకు వెళ్లాను. కాసేపు మాట్లాడగానే "నాన్న బాగా భయపడినట్టున్నాడు అయ్ డిడ్ ఎ మిస్టేక్" విచారంగా అంది లాస్య.

"ఏ పేరెంట్‌కయినా భయమేకదమ్మా... తెలిసీ తెలియని వయసులో ప్రేమ మంచిది కాదు..." యింకేదో చెప్పబోతుంటే గొంతుకు దుఃఖం అడ్డుపడింది.

ఏడుపుతో పిల్లకి అర్థం చేయించడం యిష్టం లేక ఆగాను.

లాస్య నా వంక బిక్కమొహం వేసి చూసి... "సారీనమ్మా.. మా క్లాస్‌లో చాలామంది గాల్స్‌కి ఎయిత్‌క్లాస్ నుంచే బాయ్ ఫ్రెండ్స్ వున్నారు. నేను బాగా చదివినా, యాక్టివ్ అయినా బాయ్‌ఫ్రెండ్ లేకపోతే వేస్ట్ అని ఇన్సల్ట్ చేసేవారు. నాకు "నంబ్' అని నిక్‌నేమ్ పెట్టారు. చాలా ఫ్రస్టేటింగ్ వుండేది. ఈవెన్ దో ఇట్స్ మై మిస్టేక్ అయ్ విల్‌నాట్ రిపీటిట్...." నన్ను గట్టిగా కరుచుకుపోయి గావురుమంది.

కూతురు మనసులో తలుచుకుంటూనే ఆలకించగలిగిన తండ్రి కదా శౌరి... కూతురి ఏడుపు వినపడితే వూరుకుంటాడా! గట్లు తెంచుకున్న ప్రేమతో వురికి వచ్చి కూతుర్ని అక్కున చేర్చుకుని కన్నీళ్ళు తుడిచి

"వూరుకో తల్లీ... నీ తప్పులు గ్రహించావు కదా...." అనునయంగా అన్నప్పటికి లాస్య తన మార్గంలోకే వచ్చేసిందన్న ధీమా అతని మాటల్లో ధ్వనించింది.

దాన్ని లాస్య పసిగట్టింది. అందుకే చిరుకోపంగా శౌరిని చూసి "తప్పులు కావు నాన్నా! ఒకటే మిస్టేక్ చేసాను. యిక చెయ్యననీ చెప్పాను. బొట్టు పెట్టుకోకపోవడం మీద, జీన్స్ వేసుకోవడం మీద జరిగిన గొడవలన్ని నా తప్పుల ఎకౌంట్లో వెయ్యకు నాన్నా...." అంది.

లాస్య పరిశీలనకి నవ్వొచ్చింది. ఆశ్చర్యమేసింది.

నిజమే కదా!

ఇక యిపుడు తన తప్పులేంటో గ్రహించాల్సింది శౌరియే.

బంతి అతని కోర్టులోనే ఉంది.

# దీవారేఁ

**–షాజహానా**

**య**వ్వనంతో తుళ్ళిపడే ప్రతి శరీరానికి వృద్ధాప్యం వచ్చి తీరుతుంది. కానైతే చివరి మజలీ ఎవరి చేతుల్లో వెళ్లమారుతుందో ఎన్నెన్ని నరకాలు వెళ్ళదీయాలో తెలీక చివరకు మిగిలే దుఃఖంతో చెలిమి చేస్తాం. ఒంటరితనంతో పాటు ఎత్తిపొడుపులు, కసిరింపులు మన కోసమే సృష్టించబడినట్లున్న ఒక చీకటి గదిమూల... ఇదే మన గమ్యం...! ఆ అనుభవపు ముడతలకు ఎక్కడా గౌరవమే లేదు. ప్రేమతో కూడిన ఒక పలకరింపు కోసం కూడా ఈ 93 సంవత్సరాల జీవి ఎదురు చూడాలా? నాకెందుకో మా దాదీమాను చూస్తున్న కొద్దీ దుఃఖం చెలమలా ఊరుతుంది. ఇంతమంది సృష్టికి మూలమైన ఆ మాతృమూర్తిని ఈ ఇరుకింట్లో కాకుండా చివరి రోజుల్లో హాయిగా గాలి వెలుతురులో తిప్పాలని ఓ రెండు గదులు ఆమె కోసం కేటాయించాలన్న కోరిక నాలో మొలకెత్తింది. మా అబ్బా అమ్మీల హృదయం విశాలమైన ఇంట్లో భాయి బాబీ పిల్లలు ఎవరైనా వస్తే వచ్చే ఇబ్బంది నాకర్థమయిపోయింది. దాంతో మాకున్న రెండు గదుల ఇంటి పక్కనే మరో రెండు గదులు కట్టించాలన్న తలంపు కలిగింది. అబ్బాతో అంటే చాలా సంతోషపడి, పక్కనున్న స్థలంలో కడదామని అన్నారు. ఇరుకింటితో ఇప్పటిదాకా నెట్టుకొచ్చినా ఇప్పుడు బాగా ఇబ్బందిగా అనిపించడంతో కూడా ఆ అభిప్రాయానికి వచ్చారు అబ్బా. ఆ రెండగదులు దాదీ కోసం... ఆ తరువాత నావి!

వెంటనే ఊళ్ళో సీనియర్ మేస్త్రీని పిలిపించారు అబ్బా. ఆ మేస్త్రీ నెల్లూరు వాస్తవ్యుడు. కానీ ఇక్కడే స్థిరపడ్డాడు. ఆయనతో పాటు ఆ ప్రాంత యాస కూడా వచ్చి మా వాకిట్లో నిలబడింది. చాలా మర్యాదగా మాట్లాడుతున్నట్లున్నాడు కానీ నన్ను దాటి ఎవరూ ముందుకెళ్ళలేరు అన్న అహంభావమేదో ప్రతిమాటలో ప్రతిధ్వనిస్తుంది. అబ్బా అన్నారు. కాయితం రాసుకుందామని, కానీ ఎందుకండీ నేను మాటంటే ప్రాణం ఇచ్చే వాణ్ణి అనుకుంటూ వెళ్ళిపోయాడు మేస్త్రీ. రెండ్నెలల్లో రెండు గదులు కట్టడం పూర్తిచేయాలనేది ఒప్పందం. ఎస్టిమేషన్ కూడా వేసిచ్చాడు. కొంత అటు ఇటుగా అవుతుందని కూడా చెప్పాడు. అబ్బా ఆరోగ్యం కూడా అంతంత మాత్రానే ఉండటం వలన కొంత లౌక్య ప్రపంచంతో లావాదేవీలు ఆయనకు అలవాటు లేకపోవడం వలన

కూడా ఆ ఇంటి పని మొత్తం పూర్తయ్యే వరకూ నేనే చూడాలని అబ్బా చెప్పడం వలన ఇక నేను ఆ పనుల్లో కూరుకుపోయాను.

నేను కట్టిస్తున్నానని అందరూ అనుకుంటున్న రెండు రూమ్‌ల పునాది తీయడానికి ఒక శరీరం భారంగా నడుచుకుంటూ వచ్చింది. మేస్త్రీ ఆదేశాల మేరకు ముగ్గు గీసింది. కొబ్బరికాయ కొట్టి అగర్‌బత్తీలు వెలిగించిన ఆ శరీరం కాలిపోయి చివరకు మిగిలిన నల్లని పుల్లలా వుంది. ముగ్గురు కొడుకులను, ముగ్గురు కూతుర్లను కన్న ఆ దేహానికి ఇప్పుడెవరూ తోడులేరు. ఒక రెండు చేతులు, రెండు కాళ్ళు తన భార్య తప్ప. ఇప్పుడు పునాదులు తీస్తే లోపల ఆకలి గోతులను పూడ్చుకోగలదు. అసలు పునాదుల్లోనే ఎంత ఆకలి ఉంది? ముడుతలు పడిన దారుఢ్యంతోనే ఆ దేహం పునాదుల్ని తవ్వింది. వెళ్తూ వెళ్తూ అతను తన ఆకలిని, దాహాన్ని కొంత దుఃఖాన్ని పునాదుల్లోనే వదిలేశాడేమో?

ఇక ఆ నెల్లూరు మేస్త్రీ మాటెంత తీపో... పనులు కూడా అంతే చేస్తున్నట్లు కనబడతాడు. అతను చేస్తున్న మోసం మోసమని నాకు అతను వెళ్ళిపోయాక కానీ అర్ధమయేది కాదు. మళ్ళీ ఉదయాన్నే నవ్వుకుంటూ వచ్చేవాడు. నేను ఏమన్నా గట్టిగా అనడానికి లేదు. ఆయన సీనియర్ మేస్త్రీ....! నేను జూనియర్ వినియోగదారుని... ఏమన్నా అంటే మీకు తెలియదులేమ్మా... అనేవాడు దాంతో నిజమేనేమో... అనుకునేదాన్ని... కానీ చీప్ క్వాలిటీ ఇటుకలు, బఠానీ ఎక్కువున్న ఇసుకను మేస్త్రీ పాతబకాయిల కింద నాకు అంటగట్టాడని సమాచారం తెలిసేంతవరకు నాకు అర్థం కాలేదు...! కొంతలో కొంత నయమేంటంటే... ఇంటి పనులు ఏమేం చేయాలో అతను చెప్పి వెళ్ళేవాడు ముఖ్యంగా క్యూరింగ్ బాగా చేయాలని చెప్పేవాడు. క్యూరింగ్ చేయకపోతే గోడలు గట్టిగా ఉండవని చెప్పేవాడు. ఇక నేను ఆ డ్యూటీలో ఉండేదాన్ని... గోడల్ని తడుపుతూ నేను తడుస్తూ... ఆ ప్రదేశమంతా నీళ్ళు కారుతూ వర్షాకాలాన్ని తలపించేది. అదంతా నాకు కొత్తగా ఉండి ఇష్టంగా నేను ఆ పనుల్లో మునిగిపోయేదాన్ని... దాదీకి బయటికెళ్ళడానికి ఇబ్బందవుతుందని ఎటాచ్డ్ బాత్‌రూమ్ ప్లాన్ చేశాను. వెస్ట్రన్ టాయ్‌లెట్‌ను చూసి దాదీ ఎలా ఫీలవుతుందోనని పక్కన మామూలుది కూడా పెట్టించాలని మేస్త్రీతో మాట్లాడాను.... ముందు మాట్లాడిన దానికంటే డబ్బులు పెంచేశాడు...

ఒకోసారి ఇసుక కుప్పపైన అనువాద కవిత్వం, కథలు చదువుకుంటూ, మధ్యమధ్యలో వాళ్ళు గోడలు కడుతున్న వైనాన్ని గమనిస్తూ ఉండేదాన్ని!

ఇక సాయంత్రమయిందంటే నా క్యూరింగ్ డ్యూటీ మొదలయ్యేది! బాగా ఆకలిగా ఉన్న పసిపిల్లనోట్లో పెట్టిన పాల బాటిల్‌ని ఆవురావురని తాగుతున్నట్లు పైపులోంచి వచ్చే నీళ్లని గోడలు దేహం మొత్తంతో పీల్చేస్తున్నాయి. పైపు చివరనున్న నన్ను కూడా

తాగేస్తాయోమోనన్నంత ఆకలిగా ఉన్నాయి గోడలు. క్యూరింగ్ చేస్తున్నాను గోడలకు. నిన్నటి దాకా ఇటుకలుగా ఒక పక్క ఇసుక కుప్పలుగా మరో పక్క... సిమెంట్ బస్తాల్లో కూర్చబడి వరండాలో ఉన్న విభిన్న పదార్థాలు ఇవి. హఠాత్తుగా వీటికి ఆత్మెలా వచ్చింది? ఎంతగా తాగేస్తున్నాయి నీళ్లని.

కడుపు నిండిన పిల్లాడు మొహం తిప్పినట్లు గోడలు నీళ్ళను తాగడం వదిలేసాయి.... నేను మోటార్ స్విచ్చాఫ్ చేసాను. ఈ గోడల్లో ఆత్మనెవరో రచించారు... సిమెంట్, ఇసుకతో పాటు ఆకలిని ఎవరో ఒంపారు... ఆ గోడల్లో ఇటుకలను పేర్చిన చిట్టిచేతుల్లో ఏం శక్తి దాగివుంది? ఆ చేతుల వెనుక.. చిన్నదేహం... దేహం వెనుక మరో కొన్ని దేహాల సమూహం... ఆ సమూహాలతో కూడిన ఒక విసిరేయబడిన తండా... ఇవన్నీ ఆ గోడల్లో దాక్కున్నాయా?... లేక ఈ దాహం పాలబుగ్గల తండా పిల్లగాడు కట్టిన గోడ కింది పునాది తీసిన ఆ ముసలిచర్మం చేతులదా?

మేస్త్రీ గొణుక్కుంటున్నాడు ''బుజ్జమ్మా, నువ్వేమో నెల్లోపు అంతా ఐపోవాలంటుండవ్... ఇక్కడ మనుషులు దొరకడం లా... వరికోతలు, పత్తి తీయడం అన్నీ ఒక్కసారే వచ్చుండ్లా... ఒక్కోడికి ఎంత డిమాండ్ అనుకుంటుండవ్... మూడొందలిచ్చి ఆటోలో తీసుకెళ్ళినా రావడంల్లా'' అంటున్నడు. విని ఊరుకున్నాను. మనుషులు ఇలాంటి పనులకు దొరకకపోవడమే మంచిది. కావలిసింది కూడా అదే.

నేను మధ్యలో దాదీని చూడ్డానికని వెళ్ళివచ్చేసరికి పునాదులయిపోయి గోడ కూడా లేచింది. అయితే నాకు బాత్‌రూమ్ చిన్నదిగా అనిపించింది. మా దాదీమా ఆరడుగుల ఎత్తు. ఆమెను కూర్చోపెట్టి స్నానం చేయించడానికి అది సరిపోదు. మేస్త్రీని పిలిచి చెప్పాను.... ఆయన ముందు గోడను జరిపి కట్టడానికి ఒప్పుకోలేదు.... కానీ నేను పట్టు పట్టేసరికి... మళ్ళీ కొన్ని డబ్బులు పెంచేసి అంగీకరించాడు... పెద్దగా విశాలంగా ఉన్న బాత్‌రూమ్ గోడలను చూసాక నాకు తృప్తిగా అనిపించింది.

మేస్త్రీలు ఎన్ని ఇళ్ళు కట్టిస్తారు... ఎంతమంది పనిచేస్తారు వీళ్ళకింద. కాని మొదట ఒప్పుకున్న మొత్తానికే చివరికంటా ఉండటం కష్టం. మధ్యలో ఖర్చులన్నీ మీదేస్తారు నిర్దాక్షిణ్యంగా. ఒక వేళ మేస్త్రీ దాహం కాదు కదా ఆ గోడల్లో ఉంది. అదే అయితే ఎంత నీళ్ళు పెట్టినా, నిరంతరం పెట్టినా అది తీరేది కాదు.

నేను ఇంటి నిర్మాణం కోసమే వచ్చాను కాబట్టి వర్కర్స్ వచ్చిన దగ్గర్నుంచి వెళ్ళేంతవరకు బయటే కూర్చునేదాన్ని. ఇసుక, కంకర, ఇటుక వేయడానికి పక్కన గుబురుగా పెరిగిన చెట్లను సగానికి పైగా నరికేయాల్సి వచ్చింది. నరుకుతుంటే చాలా

ఆకులు రాలి పడుతుంటే కొన్ని ఆకులు రెక్కలు కొట్టుకుంటూ పైకి ఎగిరిపోతున్నాయి. అవి సీతాకోక చిలుకలు... పెద్దవి, చిన్నవి, రంగురంగులవి... నేను చాలా ఆనందించాను. చాలా రోజులకు ఎన్ని బటర్ ఫ్లైలను ఒక్కచోట చూశాను. మధ్యాహ్నానికి చూస్తే ఒక సీతాకోకచిలుక కిందపడి ఉంది. దాన్ని ఎ(ర చీమలు కసిగా తినేస్తున్నాయి. ఆ చీమల్లో నేనూ ఒక చీమనా? ఉలిక్కిపడ్డాను. సాయంత్రానికల్లా నా చుట్టూ ఎగురుతూ వందల బటర్ ఫ్లైలు... నన్ను నిలదీస్తున్నాయి. మా ఆహారమేది? మా నివాసమేది? కంకర మీద వాలుతున్నాయి. వాటికి తేనే దొరకలేదు. ఇసుక మీద ఇటుకల మీద కూడా ఆహారం దొరకలేదు... పాలుపోని సీతాకోక చిలుకలన్నీ భ్రమ్మరుల్లా ఊరికే అటూఇటూ తిరుగుతున్నాయి. నాకు వాటి మాటలు వినాలనిపించింది. కనిపించిన ప్రతి సీతాకోకను అడిగాను... అవి వాటి దుఃఖంలో వాటి ఆకలి దప్పుల్లో అవి మునిగిపోయి ఉన్నాయి. మాటిమాటికీ నన్ను శాపనార్థాలు పెడుతున్నట్లుగా అనిపిస్తుంది నాకు.

వాటికి ఈ రాళ్ళలో, ఇటుకల్లో, ఇసుకలో, ఇనుపరాళ్ళలో ఏమీ దొరక్కపోగా వాటి ఆకలి, దప్పిక కొంత వీటికే అంటినట్లుంది. అదే ఆ గోడలకి చేరి ఉంటుంది. ఆ రాత్రి ఇసుక దిబ్బ మీద కూర్చొని నేను వాటి పెద్దతో అతి కష్టం మీద మాట్లాడించాను. ఎట్‌లీస్ట్ ఆ భావాలను నా మనసుతో అనువాదం చేసుకున్నాను. నా మూసిన పిడికిలి మీద ఎగరడానికి సిద్ధంగా వున్న విమానంలా కూర్చున్న ఆ సీతాకోక చిలుక నాతో కొన్ని మాటలు మాట్లాడింది. “ఎలా చెబితే నీకు అర్థమవుతుంది. మీరనుభవిస్తే తప్ప మా బాధ అర్థం కాదు కదా!

మనుషులకు మనుషులు, ప్రాంతాలకు ప్రాంతాల్నే ఆక్రమిస్తున్నారు.... మేమెంత? ఆ పోలవరం కట్టిస్తే ఎంతమంది బాధపడతారో... పడుతున్నారో తెలుసుగా... అదిగో అలాంటిదే మా బాధ... మాకెవరూ వాగ్దానాలు చేయరు పునర్నివాసాల గురించి... మధ్యాహ్నం మా వాళ్ళు పాతికమంది దాకా ప్రాణాలు కోల్పోయారు. ఎవరికి పట్టింది.... దీనికి కారణమైన నీక్కూడా ఏ బాధా లేదు. పోలవరంలో మా బంధువులున్నారు. వాళ్ళప్పుడు చెప్తుంటే మాకర్థం కాలేదు కానీ ఇళ్ళు కోల్పోవడం అంటే ఏమిటో ఇప్పుడిక్కడ జరిగిన విధ్వంసం చూస్తుంటే అర్థం అవుతుంది. ఎక్కువగా ఏడిస్తే ఆ తడికి నా రెక్కలు అతుక్కుంటాయి.... నేను ఎగరలేను... శత్రువులు నన్ను పీక్కుతింటాయి. అలా అని ఏడవకుండా ఉండలేను... మా పసిపిల్లలు ఎక్కడ పడుకోవాలో తెలియక ఏం తినాలో తెలియక అయోమయంగా తిరుగుతున్నాయి. ఇంక నేను వెళ్తాను” అని సున్నితమైన రెక్కల్ని రెపరెపలాడిస్తూ పైకెగిరింది.

నాకు పోలవరం నిర్వాసితుల గోడు కళ్ళముందు మెదిలింది. నేను వీటికి ఏ వాగ్దానం చెయ్యలేక పోతున్నానే....? నాకేం హక్కుంది వీటిని అనాధలుగా మార్చడానికి తల భూమిలోకి కృంగి పోతుంటే హృదయం సాక్షిగా క్షమార్పణలు అడిగాను. కానీ ఏం లాభం... క్షమార్పూరాల్ని కాదు కదా!

కడుతున్న రెండు రూమ్‌లలో దాదీమా పడుకునే రూమ్‌లో టీవీ పెట్టాలని అనుకున్నాను. ఎందుకంటే టీవీ చూడాలంటే అందరూ దాదీమా రూమ్‌లోకే రావాలి. అప్పుడు దాదీమాకి బోర్ కొట్టదు...! ఏదన్నా కావాలంటే దాదీమా మొత్తుకోనక్కర్లేదు... ఎవరో ఒకరు అందుబాటులో ఉంటారు అనుకున్నాను.

పనిచేయడానికి వస్తున్నవాళ్ళంతా భవానీలు, అయ్యప్పలు. వీళ్ళంతా తండావాళ్లే. ఇప్పుడు వాళ్ళని ఎవరూ బూతులు తిట్టరు. ఒరేయ్ అనరు. కేవలం భవానీ, స్వామి అని మాత్రమే అంటారు.

నేను భయ్యా అని పిలిచేదాన్ని. వాళ్ళు మాతా అంటుంటే చెప్పలేని వాత్సల్యం పుట్టుకొస్తుంది. ఇల్లంతా అయిపోయాక వీళ్లందరికీ తలా ఒక టీ షర్ట్ కొనాలనుకున్నాను. అసలెందుకు వీళ్ళందరూ ఇవన్నీ వేసుకోవడం. అందరిలో సమానంగా భవానీ అని గౌరవంగా పిలిపించుకోవడం వెనుక ఎన్ని తరాల అవమానం దాగుంది. ఎవరి విజయం ఇది? ఎవరి వైఫల్యం? వెలుతురు కోసం సిటీ బస్సుల కోసం తండా ఇంకా ఎంతగా ఎదురు చూస్తుంది. తెగిన గాలిపటాల్లాగా పడివున్న తండాలు బయటికెగరడానికి ప్రపంచంలోకి ఎగరడానికి ఇంకెంతకాలం పడుతుంది? ఆ తపనేనా గోడల్నిండా పరుచుకుంది.

దాదీమాకి ఎండ రాకుండా కిటికీలకు కూలింగ్‌గ్లాస్‌లు పెట్టించాలనుకున్నాను. ఇండోర్‌ప్లాంట్స్... బయట హ్యాంగింగ్ ప్లాంట్స్... ఒకటేమిటి... ఇల్లంతా పూలతీగలతో... పరిమళాలతో నింపేయాలనుకున్నాను... ఇసుక మీద కూర్చుని ఇల్లుని దాదీమాకు అనుకూలంగా ఉండేలా రకరకాలుగా ఊహల్లో ముందే కట్టేస్తున్నాను... నేను! చిన్నప్పుడు దాదీ పాలగోకు రాచిప్పతో గీకి అరచేతులు నిండా ఎలా పెట్టేది?... అప్పుడు దాదీమా చేతులు ఎంత స్ట్రాంగ్‌గా ఉండేవి? ఇప్పుడు పాలమీగడల్లా మెత్తగా అయిపోయాయి... ఎంత మందికి దానం చేసిన చేతులు ఎంత పనో అలుపెరగక చేసుకుంటూ పోయిన చేతులు... ఇపుడు సహారా కోసం చూస్తున్నాయి.

మా దాదీ... ఒకటే ఏడుపు. తొంభై ఏళ్ళ మా దాదీ ఎండిన కళ్లల్లోంచి కన్నీళ్ళు సుడిగుండాలై చుట్టేస్తున్నాయి నన్ను. ఆమె దేహం ప్రేమను ఆప్యాయతను కోరుతూ కోరుతూ ముడుతలు ముడుతలుగా మడతలు పడిపోతుంది. ఆ గోడలు దాదీ శరీరంలోని ముడుతల్లా చాలా అగాధాలను ప్రేమ రాహిత్యాన్ని దాచుకుని వున్నాయో? ఆ దాహమేనా అది...? అందుకేనా అంత దాహం? వాడు నన్ను పలకరించను కూడా లేదు. వాడిది ఎంత కఠిన హృదయం... చిన్న కొడుకుని తలచుకొని దాదీ మనసు తడిసిన దూదిలా కనిపిస్తుంది నాకు. దాదీకి కాలం గీసుకుని శరీరం మీద ఎన్ని లెక్కలేనని గీతలు పడ్డాయో, చిచ్చా మాటలకు దాదీ మనసు కూడా అంతలా గీసుకుపోయిందని నాకు అర్థం అయింది. అందుకే ఇల్లు పూర్తవ్వగానే ఇంకెప్పటికీ చిచ్చా ఇంటికి దాదీని పంపించకూడదను కున్నాను. అబ్బా కూడా అదే అన్నారు.

అయ్యప్ప, భవానీ దీక్షలు అయిపోయి పనులకు యధావిధిగా వస్తున్నారు వర్కర్స్. నాకు రోజు బూతులతో మెలకువ వస్తుంది. ఆ నాయక్ నా కొడుక్కు ఏమయిందంటరా... పనికి రాలా... తాగుడెక్కువైందేమో...? మేస్త్రీ అధికారపు మాటలు నా చెవుల్లో మంటను లేపుతున్నాయి.

మొత్తానికి చివరి ఘట్టానికి వచ్చింది ఇల్లు. దాదీకి కొంచెం కొంచెంగా కనిపిస్తుంది. హాయిగా లేత వెన్నెల్లా కనిపించే రంగులు వేయాలని నేను మా అబ్బా అనుకున్నాము...

చిచ్చా ఇంట్లో ఉన్న దాదీ కింద పడిందన్న వార్త మా ఇంట్లో కలకలం రేపింది. వెంటనే ప్రయాణమయ్యారు అమ్మీ అబ్బా...

వెళ్ళిన తెల్లారే మిగతా అందర్నీ ఇంటికి తాళం వేసి రమ్మని కబురు. ఆందోళనతోనే అందరం చిచ్చా దగ్గరకు వెళ్ళాం...! ముడతల్లోంచి మౌనంగా జాలువారుతున్న కన్నీరు వీడ్కోలు పలుకుతుంది.... ఆమె గాలి వెలుతురు పరుచుకున్న విశాల విశ్వంలో తన నివాసాన్ని వెదుక్కుంటూ వెళ్తుందన్న విషయం నాకు అర్థమైపోయింది...! ఇంత పెద్ద వంశానికి మూలమైన ఇద్దరిలో దాదా ఎప్పుడో వీడ్కోలు తీసుకోగా మిగిలిన దాదీ ఇప్పుడు అదే దారిలో ఉంది. మేమంతా చెంచాతో నీళ్లు ఆమె నోట్లో పోస్తున్నాము... మా అమ్మీ పోస్తున్నప్పుడు ఇంకా పోయమని అతి కష్టం మీద సైగ చేసింది... చూస్తుండగానే దాదీమా అందర్నీ వదిలి ఎవరో పిలుస్తున్నట్లు వెళ్ళిపోయింది... మా దాదీ కోసం మా స్వంత ఊర్లో దర్గా చింత కింద శాశ్వతగృహం నిర్మించారు.

కాని నేనే ఆమె కోసమే మూడునెలల కాలాన్ని, ప్రేమని రంగరించి కట్టించిన గూడులో మాత్రం ఆమె ఒక అడుగు కూడా వేయలేదు... ఒక్కరోజు కూడా నివసించలేదు... కనీసం ఒకసారి చూడను కూడా లేదు...!

నాకు ఒక్కసారిగా దుఃఖం తన్నుకు వచ్చింది!

అంతా పూర్తయ్యాక బస్సెక్కి కూర్చున్నాను... చుట్టూ కుప్పలుగా ఆలోచనలు కందిరీగల్లా కుడుతున్నాయి.

అసలు ఇల్లెవరిది? అసంఖ్యాకంగా కనిపిస్తున్న ఈ ఇళ్ళన్నీ ఎవరివి? ఇటుక ఇటుకలో రక్తం, చెమట దాగుందని నాన్నలు అనుకుంటారు కదా! ఇళ్ళన్నీ నాన్నలవేనేమో. నాన్నల రక్తం, చెమట చిందించేందుకు అన్ని విధాల ఇంట్లో కష్టపడేది. అమ్మలు. ప్రతి కష్టం నష్టం భరించేది అమ్మలే. ఇళ్ళను తుడిచి, ఊడ్చి ప్రతిక్షణం వాటితో అనుబంధాన్ని కొనసాగిస్తుంటారు అమ్మలు. ఇళ్ళన్నీ అమ్మలవేనేమో. ఆస్తులన్నీ కొడుకులవనుకుంటారు కదా! ఇళ్ళన్నీ కొడుకులవేమో. పరాయి ఇంటి నుంచి కట్నం తీసుకొని వచ్చేది ఇళ్ళు చూసి కూడా కదా! ఇళ్ళన్నీ కోడళ్లవేనేమో? తాతయ్యా! ఇది నాది అంటూ గారాలు పోయే మనువలు, మనువరాళ్ళు, ఇళ్ళన్నీ వీళ్లవేనేమో. అసలు ఇళ్ళన్నీ అంత అవసరమా!

"బుజ్జీ! ఇల్లు కడుతున్నావంట కదా!" ఊరివాళ్ళ పలకరింపులు... మనసులో ఎంత సిగ్గుపడ్డాను. ఎంత అపరాధ భావన... "నీదేనంట కదా!"

నాదా? నాదనేది ఈ ప్రపంచంలో ఏదైనా ఉందా? నేనే నాది కాదు! నేనే నాకు చెందను. నవ్వొచ్చింది నాకు.

నాకు ఆ ఇంటి మీద ఏ ఆసక్తి లేకుండా పోయింది. ఆ రోజు సీతాకోక చిలుక చెప్పింది కదా – మరో చెట్ల సమూహంలోకి అన్వేషణ... ఏదీ శాశ్వతం కాదు... తమ ప్రయాణం రేపే – అని. నాక్కూడా సుతిమెత్తని రెక్కలేవో ఉన్నట్లు నా చేతులకేసి చూసుకున్నాను. కొంచెం సంతృప్తిగా అనిపించింది. అప్పటిదాకా గూడు కట్టుకున్న దిగులేదో తలుపులు తెరుచుకుని ఎగిరిపోయింది.

# మాన్యెం

–జూపాక సుభద్ర

**రెం**డు గాడిదల మీద సామానేసుకొని తోలుకుంట జోలెకట్టుల పిల్లను వెట్టుకొని దామరంచ పల్లెకు నడిచొచ్చే దక్కలి రాయక్కను, ఆమె పెనిమిటి సెయి బట్టుకొని నడిసే కొడుకును జూసి...

'రాయక్కా ఎప్పుడు బైలెల్లింౖడు యిదేనా రాకట కుంట్ల ఎడ్లకు నీళ్ళు దాపిచ్చి కొట్టుకచ్చుకుంట ఆ ఊరి మాదిగ మూగన్నడిగిండు పలకరించినట్లు.

"కాకర్ల పల్లె నుంచి పగటి పొద్దుకు బైలెల్లినం తమ్మీ" అని "యింకా అవ్వగిట్ల మంచేనా పిల్లలుగిట్లంత బాగేనా తమ్మి" అని అడిగింది 'ఆ... మంచే రాయక్కా మీరంత మంచేనా'

'ఏమ్మంచి తమ్మి అంత కరువు గొట్లాడ్తంది. వూరికి పిడికెడు బూడిద బుట్టకుంటైతంది. సరే గనీ వూల్లెట్లున్నత్తమ్మీ......'

గట్లనే వున్నది, అవ్వేడ్వంగ బిడ్డేడ్సినట్టు' అన్నడు నడ్సుకుంటనే సెరువుకుంట యింతల రానే వచ్చింది. అది జుడంగనే రాయక్క గాడిదలనాపి 'గీ పిల్లిగుండ్ల సెల్కల్లుంటం తమ్మి... యింటికి సందల కాడత్తా' అని చెప్పి గాడిదలను అటువైపు మలుపుకొని పోయింది. మూగన్న ఎడ్లను కొట్టుకొని యింటికొస్తూ తొవ్వొంటి కల్సి నోల్లకందరికి 'దక్కలి రాయక్కచ్చిందని, పిల్లి గుండ్లల్ల గాడుదులిడ్సుకున్నరని' సెప్పిండు దప్పుసాటింపోలే.

దక్కలి రాజక్కకు ఈ దామరంచపల్లె మీద 'యిస్స' వుంది ఆమె గురించి మాదిగిండ్లల్ల శాన పెద్దగజెప్పుకుంటరు వూల్లె సిన్న, పెద్ద అందరు దక్కలోల్లను. దక్కలిది, దక్కలోడనే పిలుస్తరు కాని యీ దక్కలి రాజక్కను మాత్రం వెనక ఎట్ల పిలిచినా ఆమె ముందు మాత్రం 'రాయక్క'నే పిలుస్తరు. మనిషి మట్టె గజమున్నట్లుంటది. ఎత్తుగ బలంగ సెయ్యేత్తే అందకుంట మొగోడున్నట్టుంటది

సెవునిండ సొమ్ములు. కాళ్ళకుడియాలు బెట్టుకొని నడిస్తే భూమి దద్దరిల్లుతది. చాన తెలివికల్లదంటరు. పంచాదిల కూసుంటే ఏ పెద్ద మొగోడు గూడ పనికి రాడు. దక్కలి పనంత జేస్తది. కుల పంచాదులు తెంపుతది, వూల్లె అందరితోని ముఖ్యంగ మాదుగులతోని మంచి మాటుంచుకుంటది కడుపుల మెదిలేటట్లు మాట్లాడ్తది. పటమేసి కులం కథ చెప్తది. పెద్దమాదిగింటికి బోయి కులం మంచి సెడ్డలు అరుసుకుంటది. ఎవరికన్న పాణం బాగలేకుంటే తాయిత గడ్తది. పంటప్పుడచ్చి యింటికో వరికట్ట, ఒక కుంచెడు వడ్లు మాదిగిండ్లల్ల వసూలు జేస్కుంటది. పంటల్లేనప్పుడు షికారుకు బోయి కంజుపిట్టల్ని పక్షుల్ని కొట్కత్తది.

ఇట్లాంటి రాజక్క ఒక మన్నెపాయనను చేస్కున్నది. ఆమె రూపు జూసి చానమంది మొగోల్లు మోజుపడ్డా మంత్రాలత్తయని భయపడి ముందుకు రాలే. యిగ మాదిగోల్లు గూడ మంత్రాల భయం కొంత, డొక్కల్ల బుట్టిన దక్కలోల్లతో కంచం పొత్తేగాని, మంచం పొత్తులేదనే కుల కట్టడి పంజేసి దూరంబోయింద్రు. ఆమె కులంల ఆమెకు సరిపోయే మనిషే దొర్కలేదు.

దక్కలోల్లు వూర్లు తిరుగుతరుగని ఏ వూరు బడితే ఆ వూరు తిరగరు. ‘యిస్స’ మీదచ్చిన వూర్లల్లనే తిరుగుతరు. మాదిగోల్లు యిచ్చే ‘మాన్యెం’ గింజలు కొలుసుకొని, రోజువారి తిండి అడుక్కొని పటమేసి ‘జాంబవపురాణం’ జెప్పి పైసల్దీసుకోవాలె. వాల్లకు భూములు జాగలు వుండద్దు. వ్యవసాయం జేయొద్దు.. యిది దక్కలి కులం రీతి రివాజు. అట్లా రాజక్క కుటుంబం వూల్లు తిరిగే క్రమంలోన వొక మన్నెపతన్ని ఇష్టపడి పెండ్లిజేసుకొని వెళ్ళిపోయింది. ఎల్లిపోయి మల్లా తల్లిదండ్రుల దగ్గెరికొచ్చింది.

తండ్రి ఆమె పెనిమిటిని ఉద్దేశించి బిడ్డా మంచో సెడో మీ ఇద్దరు నచ్చుకున్నరు. ఏదయితే అదయితది. నా బిడ్డె కులపోన్ని జేస్కుంటే అది యేరే మాటుండు. అది మంచిగ బత్కితె జాలు, నీకులంల నా బిడ్డెను కలుపుకోరు, యింట్లకురానియ్యరు పెద్దకొట్లాటలు దంపులాటలు గట్ల బత్క లేదు. నువ్వే నా బిడ్డెతోనుండు. నా బిడ్డెను ఆగంగ యిడ్సి పెట్టకు. బతుకు దెరువు లేదని అనుకోను. నాకున్న నలుబై వూల్లల్ల సగం బంచిత్త. ఆటితోని సల్లగ బతుకుండ్రని’ రాజక్కకు కట్నంగా 20 ఊర్లు ‘యిస్స’ (హక్కుగా వచ్చే భాగం) పంచియిచ్చిండు, అట్లా వూల్లు బంచియిస్తూ... యింకా మాదిగిండ్లకు బోయి అడుక్కునే హక్కు, వాల్ల పంచాదులు చెడావులు తెంపే హక్కు

వాల్లు బెట్టకుంటే కులంల నిలేసే పెద్దమనిషి తనం నీకియ్యరు. అదంతా 'రాజవ్వ' నే సూసుకుంటది. నువ్వు జేసే పనులు నువ్వు జేసుకో. నా బిడ్డె కష్టెంల సుకంల తోడు నీడోలెవుండు. అని అన్ని బతుకు దెరువుల బందవస్తు జేసిండు రాజక్క తండ్రి. అప్పటి కాన్నుంచి యింటి కాడ గాడుదుల్ని జూసుకుంట బైటి పని జేస్కుంట రాజక్క తోనే వున్నడు. రాజక్క నిడ్చిమల్ల అతని కులంలకు బోలే. కులంజెడ్డా రాజక్కతోని సుకమైతే దక్కిందంటరు వూల్లె. అట్లా తండ్రి పంచిచ్చిన వూల్లకు రాజక్కే యిస్సదారి. మాదిగ కులకట్టులో, కులం బాధ్యతలు, పెట్టేకాడ పోసేకాడ ఏం తేడా లొచ్చినా రాజక్కే తెంపాలె. అది కుల కట్టడి. డక్కలోల్లకు మాదిగలిచ్చే మర్యాదలు.

రాజక్క పెనిమిటి, పిల్లలు, గాడుదులకు ఒక సెట్టు నీడ దాపున సెరువుకుంట కట్టకు దగ్గర సూసుకొని గాడిదల మీదున్న మూటల్ని దించిండ్రు. తెచ్చుకున్న నీళ్ళను పిల్లలుకు దాపిచ్చి, వాళ్ళు తాగి కొంచెం సేపుకూర్చొని దమ్మార్సుకున్నరు. రాజక్క పెనిమిటి గాడుదలను నీల్లు దాపనీకి కుంటకు తీస్కపోయిండు. రాజక్క సంక పిల్లను కొడుక్కిచ్చి సెట్టుకింద కూసోబెట్టి గుడిసె కోసం సెత్త, మట్టి బెడ్డలు, రాళ్ళురప్పలేరేసి నేలంత సాపు జేసింది. ఇంతలో రాజక్క పెనిమిటి గాడుదుల్ని కుంటకట్టమీద యిడ్చి పెట్టి గుడిసెప్రయత్నం జేస్తుంటే అతనికి సాపసింపులు, తాళ్ళు అందిచ్చి 'యిప్పటి కిట్లుండనియి రేపు తాటి కమ్మల్దెచ్చుకుందాం' అని మూడు రాళ్ళు దెచ్చి 'పొయి' పొందిచ్చి ఆ పుల్లీపుల్ల దెచ్చి పిడికె నిప్పు తయార్జేసే సరికి సీకటి సిటుక్కు మన్నది.

రాజక్క యెడపిల్లను సంకనేసుకొని కొడుకుందీసుకొని గంజుగిన్నెతోని మాదిగిండ్లకు జేరింది.

'ఓ మల్లక్కా దక్కల్దాన్నచ్చిన' కీకబెట్టింది.

మల్లక్క బియ్యంజెరుక్కుంట బైటి కొచ్చి 'ఏందె రాయక్కా ఎప్పుడత్తివి అంత మంచేనా' అని అడిగింది.

'సందక్కాన్నే అచ్చినం మల్లక్కా' అన్నది రాజక్క.

"పొలంలనే పొద్దువొయింది ఇంక పొయ్యే రాజెయ్యలేదాయే మల్లరాపోరాదు' మల్లక్క అన్నది. యింతల

మల్లక్క పెనిమిటి సారయ్య కాల్లు గడుక్కుంట ఏందే రాయక్క యెప్పుడు దిగితిరే' అని పలకరించిండు.

'యీా పొద్దే దిగినమే'

'పొయినేడు కండ్ల వడకవోతిరేందే... అంతా మంచేనా నీ పెనిమిటి మంచిగున్నడా'

'మంచే... కరువు కాలంలచ్చి మిమ్ము ల తిప్పలేంబెట్టాలని రాలేదే'

'సరెగని బువ్వయేదాక కూసుంటవా యేరే యిండ్లకుబోయొత్తవా'

'మల్లేం రాను రేపత్త తియి' అని పిల్లల్ని సదురుకున్నది పోనీకి.

నీ పని మంచిగున్నది రాయక్కా వూరు మీది సద్ది వుట్టి మీది సమరు' గీ కూలి నాల్జెయ్యాలె, అండాలె పెట్టాలె అనే ముచ్చటేలేదు. నోసుకోని పుట్టినవే' అని మల్లక్కను కుంట బియ్యం కడిగి పొయి మీదేసింది.

రాజక్క విని విననట్టే యెల్లిపోయింది.

'నువ్వు కొత్తగనుడేందే... గాకులం పుట్కే గసోంటిది. ఎన్నటి నుంచి వున్నదోనాయే దాన్నేంజేయ్యమంటవు'

సారన్న సమర్థించిండు.

రాజక్క నాలుగైదిండ్లు బోయి కూర, తొక్కు, బువ్వతోని సగాని కెక్కువే. గంజుగిన్నె నింపుకున్నది.

"యింకో యింటికి బోతే గంజు నిండుతది, పొద్దుగాలెప్పుడో తిన్నరు పోరగాండ్లు' అనుకొన్నది.

'పోసవ్వా! దక్కలి దాన్నచ్చిన బాంచెను' అని పిలిచింది.

పోసమ్మ రాజక్క పిలుపిని బైటికొచ్చి 'నీ మల్లు మాన్యేలేమున్నయని బువ్వెయ్యాలె, బువ్వలేదేంలేదుపో... అని కసిరి కొట్టి ఎవరి మీది కోపమో రాజక్క మీద దీర్చుకున్నది.

అట్ల కసిరిచ్చినట్లు మాట్లాడంగనే ఆకలి మంట మీదున్న రాజక్కకు కూడా సర్రున కోపమెదగదన్నింది. 'ఏందే పోసి! నాకు వూకెనే పెద్దంగ్రానె, నా

మాన్యెందున్నుకొని తింటంద్రని నిన్ను బువ్వడుతున్న , నా మాదిగెకులం దానివని నీయింటికచ్చిన లేకుంటే వూల్లె గింతమంది వుండంగ నీ దగ్గరికే ఎందుకచ్చిన్నే' అని సాట సెరిగినట్లు సెరుగుదామనుకున్నది. కాని అట్లనద్దు. మర్యాదుంచుకోవాలె. 'బిచ్చానికి బోయి ఆమిట్లు కర్సుడెందుకు' తప్పుల వడుడెందుకు అని మొకం సిన్నజేసుకొని పిల్లల్ని, అన్నం గంజు వట్టుకొని తన అడ్డకాడికి బోయింది. తెచ్చినబువ్వ పిల్లలకు వెట్టి పెనిమిటికి బెట్టి తను తిని 'వూల్లెకు బోతివి కల్లుదొర్కలేదా' అని పెనిమిటితోని అనుకుంట రాజక్క సాపేసి దానిమీద బొంతలు పరిస్తే అందరు పడుకున్నరు. కాని రాజక్క కసిరి యెల్లగొట్టిన సంగతే ఆలోచిస్తుంది. 'బువ్వలేదు' అనే మాట యేరువుంటది. కాని కోపంతోని గట్ల మాట్లాడుడేంది అని బాధ పడుకుంటనే నిద్రబోయింది.

డక్కలి రాజక్క వాళ్ళ అయ్య యిచ్చిన వూర్లల్ల ఒక్కో వూల్లె పది , పదిహేను రోజులు అడ్డబిటాయిస్తది. పొద్దున సందెకాడ బువ్వడుక్కచ్చుకొని పగటీలి మాదిగ రైతుల కల్లాల కాడికి బోయి కల్లానికో వరికట్ట. రెండు కుంచాల మాన్యెం వడ్లు వసూలు జేసుకుంటది. మాన్యెం అంటే మాదిగ కింది ధాన్యం కొలవాలి. యిది కులం కట్టడి. యెంత కూటికి లేని మాదిగోల్లయినా డక్కలి చిందోల్లకు అన్నంబెట్టాలె. వాళ్ళకు అన్నంబెడితేనే వూల్లెవున్నట్లు లేకుంటే వూల్లె లేనట్టే లెక్క. వాళ్ళకు అన్నం బెట్టకుంటే మాదిగకులం హక్కులేముండయి పైగా కులం తప్పుదీసి పంచాదిలబెట్టి దండుగ గట్టిస్తరు.

రాజక్క మాదిగోల్లు 'జాంబపురాణం జెప్పించ్చుండు' అనేది కులం బాధ్యతగా మాదిగలు భావిస్తే వాటిని పొందే హక్కు రాజక్కకు వుంటది. రాజక్క పొద్దుగాల్నే గాడిదని యెంటబెట్టుకొని పిల్లను సంకనేసుకొని కల్లాల మీదికి బైల్దేరింది.

ఒక్కో కల్లం కాడికి బోయి ఒక వరికట్ట, రెండు కుంచాల వడ్లు వసూలు జేస్కోని గాడిద మీదేసుకొని యిది వరకు అన్నమెయ్యని పోసక్కోల్ల కల్లంకాడికి వచ్చింది.

'ముత్తన్నా... అని పిల్సింది. పోసక్క పెనిమిటిని.

'ఏంది రాజక్కా ఏంది ఏంజెయ్యాలె' అని అన్నడు పోసక్క పెనిమిటి ముత్తన్న.

'మాన్యెం కచ్చిన్నే అన్నా... ' అన్నది రాజక్క.

'మాన్యెమా మాకు మాన్యెమెక్కడిదే నీకు వెట్టా... మాకు మాన్యెంలేదేంలేదు పో... అన్నడు గెదిమినట్టు.

ముత్తన్న అట్లనంగనే రాజక్క కడుపు గడుకుడికినట్లుడికింది. బిడ్డా నీ సంగతి గిప్పుడు నేనేంజెప్ప కులంలకు గుంచి వూంచిపిత్తే గప్పుడు సక్కగైతవు కొడ్కా అనుకొని పైకి 'సర్లెతియ్యే' అని పక్క కల్లంలకు బోయింది. ఇచ్చిన వడ్లు, వరి కట్టలు గాడిద మీదేసుకొని వచ్చుకుంట అన్ని బాధలు ముందేసుకున్నది. మొగుడు దక్కలోడైనా మంచి గుండు నాకీ యిల్లిల్లు, కల్లం కల్లం దిరుగుడు గోసలు, పంచాదుల కతలుండకపోవు. నా సెర గీ మన్నెపోనికి సెప్పినా ఏమి సమజైతది. గా బాదేందో దక్కలోనికే సమజైతది. గీ బిచ్చంబత్కులేంది? కూలి నాలికి బోయినా మారాజుగుండు. అట్ల బోవద్దాయే గీ దక్కలి కులంల బుట్టి గిన్ని యీసడింపుల పడవడితిని. గీ కులం నాశనం గాను. దీనింట్ల పీనిగెల్ల, ఎవడు బొందిచ్చిందో అని తండ్రికినాసాడు. అని కులంల నా గలుగులు అని మనసుల బాగ తిట్టుకున్నది. మల్లా మనుసు దిటవు జేసుకొని గీ పోసవ్వోల్లు బువ్వకు బోతే బువ్వేత్తలేరు, మాన్యెం వడ్లు బెడ్తలేరు. ఏందో పున్యానికి పెడ్తండ్రా. మాన్యెం దింటలేరా, వూల్లె పెద్ద మాదిగ తనం జేత్తలేరా, గొడ్డు తస్సులు దింటలేరా, వూల్లె వుంటలేరా, కులపోల్లుగారా, గిట్లయితెట్ల? వూరేంగావాలె, పేరేంగావాలెల గీ సంగతేందో తేలాలని బాగ సత్తాయించుకున్నది.

తెల్లార్లేసి పొద్దుపొడవంగనే పెద్ద మాదిగింటికి బోయి సంగజ్జెప్పింది. రాజక్క. ఆ తొంట ముత్తన్నను పిలిపియ్యే పెద్దయ్యా అని ఓ పక్కపోంటి నిలుసున్నది.

పెద్ద మాదిగె తొంట ముత్తన్ని నేను రమ్మంటున్ననని పిలువు పో' అని కొడుకుందోలిండు.

తొంట ముత్తన్న పండ్లపుల్లేసుకొని తోముకుంటచ్చిండు. రాజక్కను సూడంగానే ఎందుకనే విషయం అర్థమైంది. గోడకు ఆనిచ్చిన నాగలి మీద కూసున్నడు. ఏంది సంగతి అనుకుంట.

రాజక్క విషయాన్ని తెల్లగిచ్చింది. 'పెద్దయా మేము గీ బిచ్చము కొత్తగడుగుతలేం కులం బుట్టినకానుంచి గీ యిర్తి గిట్లనే నవ్వవట్టే మీ డొక్కల్ల బుట్టి పెంటమీన

గూసోని సిప్పవట్టి మిమ్ములడుక్కునేటోల్లం, కుల పురాండాలు జెప్పేటోల్లం, మీకు గాలి దూలి దాకకుంట పద్దవతి జెసెటోల్లం మొకం కడిగి వూరికి బర్క తిచ్చెటోల్లం గసొంటి మాకు గీ పొద్దు మమ్ముల దూరంగొట్టుడెందుకో తెల్వాలె అని గోడకానుకొని కూసున్నది.

వెంటనే పెద్ద మాదిగె ముత్తన్న దిక్కు చూస్కుంట యిన్నావుర ముత్తా' దక్కలి రాజి సెప్పిన మాట, మాన్యెమెందుకిత్తలేవుర అన్నడు పెద్దమాదిగ.

ఎందుకు వెట్టాల్నే నేనేమన్న మాన్యెం దున్నుకొని తింటన్ననా' మనసులున్న మాట బైట వెట్టిండు ముత్తన్న.

'గదేందిరా గట్లంటవు! ఈ యేడు మాన్యెం మీ అన్నదమ్ములకే అచ్చింది గాదుర అన్నడు పెద్ద మాదిగ స్వరం బెంచి.

గా సంగతి నన్ను గాదు మా మైసన్ననడుగుండ్రి' అన్నడు ముత్తయ్య.

రాయక్కా యిన్నావు బిడ్డ గది సంగతి గీ సంగతి నీ పంచాదిల్నే తెగాలె నువ్వే తెంపాలె ఈ మూడు నాలుగు దినాలల్ల అన్నదమ్ముల్ని పంచాదిలకు పిలుపు' అని ముగించిండు పెద్ద మాదిగ.

దక్కలి రాజక్క మూడు నాలుగు దినాలల్ల జరిగే పంచాది కోసం వాల్ల మద్యన ఏం జరుగుతుందోనని ఏం కైలాట్కాలు నడుస్తున్నయని తెలుసుకునే దానికి ఆ రెండు కుటుంబాల్తోని వేర్వేరుగా మాట్లాడింది. వాళ్ళ మతులబులు రాబట్టింది. ఎవలది గండ్రగొండి తనమో ఎవల దిక్కు న్యాయం వున్నదని విచారించింది. బుధవారం పంచాదిని ఖాయం చేసింది. ఈ పంచాది దక్కలి రాజక్క తనకు రావల్సిన కుల కట్టడిని నిలేసి కలెబడే పంచాది.... తన కులానికి వచ్చిన మాన్యెం భూమిని దున్ని పొయ్యమని వూరు మాదిగలకు యిస్తే కులం రివాజుకు ఎగదొబ్బినప్పుడు నిలదీసి తిరిగి ఆ హక్కును సాధించుకునే దానికి ఈ పంచాది. కూలి చేయనివ్వని, ఆస్వతంత్రత, స్వంత భూములు ఉండకూడదని అసహాయత, అడుక్కుని తినే యీ కులం రీతి కింద రాజక్క జీవనం కష్టమైనా ఆ విషయంను కులంల బెట్టి, మంచి చెడ్డ విచారించి నలుగురితో వూంచి పిచ్చి గెలిసే అవకాశం ఈ పంచాదులిస్తయి. అందుకనుకూలంగా అన్నదమ్ముల్లో బలమున్నోన్ని, బలం లేనోన్ని మద్దెన వుంటే

అంతరాల్ని విచారించి సమానంగా దున్నుకొనమనే నీతితోని, తనకు చెందాల్సిన మాన్యెం గింజల కోసం, తన 'యిస్స' కోసం రాజక్క సమాయత్తమైంది. దానికి సరిపోను తీర్పులు నూరుకున్నది.

చెప్పిన రోజున పెద్దమాదిగెను కల్సి తొంట ముత్తయ్యను, అతని అన్న తొంట మైసయ్యను కొంతమంది మాదిగె పెద్దల్ని పిలిపించింది. పంచాది సర్కారు బాయికాడి సింత సెట్టుకింద. వచ్చినోల్లు చెట్టు మొదట్ల కొందరు, తేలిని వేరు మీద కొందరు, కొందరేమో నిల్సున్నరు. ఏం పంచాదో విందామని, పిలిపించిన అన్నదమ్ములే గాక వాల్ల పెండ్లాలు పిల్లలు గూడొచ్చింఁడ్రు.

పెద్ద మాదిగె అందర్ని జూసి రాజక్క వైపు జూసిండు. మాట్లాడమన్నట్లు, పెద్దయ్యా గీ పంచాదెందుకు కూసోపెట్టిన్నంటే గా తొంట మైసన్నోల్లు అల్ల తమ్మున్ని మాన్యెం దున్ననియ్యనందుకు నాకు బెట్టే బువ్వ, వెంటనే 'మీకు దున్నుకోనియ్యని మాటే ముందట వడ్తంది గాని దాని లోపటి మర్మాలు మాట్లాడ్తలేరు' అన్నడు మైసయ్య.

'గా మర్మాలు మన్సుల వెట్టుకుంటెట్ల దెలుత్తదే, పది మందిల దెల్వనీకే గీ పంచాదిల గూసున్నది' అని దుబ్బల గీట్లు వెట్టుకుంటన్నది రాజక్క.

నేనెందుకు దున్ననిత్తలేనో ఆనికి దెల్వదా. సేసిందంతా జేసి గిప్పుడేమెరుగని ఎడ్డిపిలగానోలే కూసున్నడు' అని మైసమ్మ ముత్తన్ననుద్దేశించన్నడు. ఇంకా వేయి పదేను వందల పొత్తుల తుమ్మలు కొట్టుకొని అమ్ముక తిన్నప్పుడెర్క లేదా, పైసలియ్యాలని తెల్వదా! గట్లజేసి మల్లా ఏ మొఖం బెట్టుకొని మాన్యెంల కత్తడు, మేమెట్ల రానిత్తం అన్నడు పెద్ద గొంతికతోని.

యింతలో ముత్తయ్య పెండ్లం మొగని దిక్కు జూసి నాలిముచ్చోడ నల్లికుట్లోడ ఏమ్మాట్లాడవేంది మీ యవ్వ నిన్నాగంగనే ఎత్కచ్చిందా తొంటోనికి నువు బుట్టలేదా' అని బూతు కడుగుతాంటే.

'అరే పోసక్కా జెరుండె యీడ మేమ్మాట్లాడ్తన్నంగాదే' అని గద్రాయించిండు పెద్ద మాదిగె.

'మైసన్నా తుమ్మలమ్ముకున్న పైసలెంతియ్యాల్నె' అని రాజక్క అడిగింది. 'ఏమో 500 రూపాలంటండు. గాని అంతకన్నెక్కువే అచ్చినయి.

ముత్తన్నా నువ్వు పొత్తుల తుమ్మలు కొట్టుకొని వాల్ల పైసలు వాల్లకియ్యవానె' రాజక్కడిగింది మల్ల.

'అల్ల పైసలు అల్లకియ్యకుంటే యాడికి బోతయి. యిద్దామనుకునే సైబలం నా బిడ్డెకు పొద్దుల్నిండి అయే పోయే పానాల్జేత్తే ఆ పైసలు దావుకాండ్ల వెట్టిన, ఏంజేతు. యింతల నాట్ల పైసలత్తయనుకుంటే గవ్వి రాలే. యీగ యింట్ల పైసలెల్లపాయే కల్లాలప్పుడు వడ్లమ్మిత్తనంటే యినక మా మైసన్న ఆయన కొడుకులు మాన్యెం భూమికి మర్ల వడ్డరు. దున్న నియ్యలే రానియ్యలే... గిది నేంజేసిన తప్పు' ముత్తన్న కుదించి చెప్పిండు.

మైసయ్య... యిగో రాయక్కా నా తప్పుంటె నీ సెప్పుతోనా గొట్టు, నోట్లె కాంద్రికిచ్చి వూంచు' అని లేసిండు.

'తుమ్మలేంది తుమ్మల బిసాదేంది, మూడు ముడికాల తుమ్మ కట్టెలకు మాన్యెంలకు రానియ్యకు పోతిరి మీరే బత్కుండ్రి. బువ్వలేక గంజి లేక సత్తె మీరే రాజ్యాలేల్దురు. తియ్యుండ్రి... గప్పుడు మీ కండ్లు సల్లవడ్తయి' అని పోసక్క సేతులిరుస్తుంటే...

మైసయ్య పెండ్లం గూడ అందుకున్నది. 'ఏందే వూకుంటాంటె బాగ మాట్లాడ్తున్నవు. బూతుగడుగుడు నీకేనానె నాగ్గూడత్తదే మిట్ల నొసల్దాన' అని మీదికురకబోయింది.

ఇట్లా అటోల్లు యిటోల్లు తిట్టుకుంటాంటే పెద్ద మాదిగె, రాజక్క పంచాదికొచ్చిన వేరే వాల్లు మీరు మీరు దిట్టుకునేదానికి పంచాదేంది' అని అదిలిచ్చి రెండు గుంపుల్ని సల్లబరిసి కూర్చోబెట్టిండ్రు. వాల్లు మంట తీసేసిన ఎసరోలే సలసల మసుల్తుండ్రు.

రాజక్క వాల్లనుద్దేశించి 'ముత్తన్నా గీ లొల్లి కొట్లాటలొద్దు. గీ పంచాది తెంపుతున్నుయినుండ్రి' నువ్వు పొత్తుల తుమ్మలమ్ముకొని పైసలియ్యక పోవుడు ఎవ్వలు మెచ్చరు. మైసన్నా అన్నదమ్ముల మద్దె గీ ఉచ్చిలి తనాలద్దు. తమ్ముడు ఏదో యింట్లెల్లక కట్టలేదాట. ఎగవెట్టిందా యిచ్చే సొమ్మేడికి వోతదే గా పాటి దానికి కులం మాన్యెం

పొత్తునుంచి దూరంగొట్టుడెక్కడ నేర్సుకున్నవే మాన్యెం పొలంను దున్ననియ్యకపోతే పెద్ద తప్పుల వద్దవు.

అని పంచాది పాబంది యిగ బాగినుండ్రి. 'గా తుమ్మ పైసలు యిప్పటి కల్లం వడ్లమ్మి మైసన్నకు  కట్టేటట్లు, మాన్యెం దున్నిన కూల్లు పెట్టువడి బోను మిగిలిన అడ్లు సెరి సగం తీసుకునేటట్లు పంచాది పాబందిజేసి 'నాకు వెట్టే వడ్లు ముత్తన్న కొల్సియ్యాలె యిండ్ల ఎవ్వరూ మాట దప్పినా ఆల్లు రొండు వేల దండుగ్గట్టాలెనని పంచాద్దెంపి వచ్చిన పెద్దమనుషులకు తాటి కల్లు జెప్పి దెప్పించి తను తాగి పుర్సతుగ గుడిసెకు బైల్దేరింది.

# ఎడారిలో వసంతం

-గోగినేని మణి

**కి**టికీ తలుపు కొంచెం తెరవగానే పక్కింటి పెరట్లో కనిపించిన దృశ్యానికి మాధవ్ నిశ్చేష్టుడయ్యాడు. విభ్రాంతిలో రెండు క్షణాలు అలాగే నిలబడి పోయాడు.

మంజరి తాడు మీద ఆరేసి వున్న ఆకు పచ్చని పంజాబీ డ్రెస్సుని తీసి చేతిలో బ్లేడు ఉందేమో చకచకా రెండు మూడు చోట్ల కోసేసి, పిగిలి నట్లుగా కనిపించాలని కాబోలు చేతిలో పోగులు లాగుతూ చింపేసి క్రింద పడేసి మట్టి అంటుకునేట్లుగా కాలితో అటూ ఇటూ రుద్దింది. ఎవరైనా గమనిస్తున్నారేమోనని అటు ఇటూ ఆదుర్దాగా చూస్తూనే ఆ పని క్షణంలో చేసేసి పరుగులాంటి నడకతో లోపలకు వెళ్లిపోయింది. మేడ గది నుండి కొంచెంగా మాత్రమే తెరిచిన కిటికీ నుండి చూస్తున్నందువల్ల తనను గమనించలేక పోయుంటుందని అనుకున్నాడు.

కిటికీ తలుపు మళ్లీ పూర్తిగా మూసేసి మంచం మీద కూర్చున్న మాధవ్‌లో ఆలోచనలు ముసురుకున్నాయి. మంజరి ఎందుకు... ఎందుకిలా చేసింది....?! ఇళ్ళు దగ్గరదగ్గరగానే ఉండటం వల్ల మంజరి చేసిన పని స్పష్టంగా కనిపించింది. అయితే ఎందుకలా చేసిందో అతని ఆలోచనకు అందలేదు. కారణం ఏమై ఉంటుందనుకుంటూ ఆశ్చర్యపోతూనే ఉన్నాడు.

అతని మామయ్య వెంకట్రావు గారిదే ప్రక్కఇల్లు. దూరపు బంధువులే అయినా ఇరుకుటుంబాల మధ్య రాకపోకలూ, మంచి సఖ్యతా ఉన్నాయి. వాళ్లకి శిరీష ఒక్కతే సంతానం వేరే వూళ్లో ఉద్యోగం చేస్తున్న వెంకట్రావు గారి తమ్ముడు యాక్సిడెంట్‌లో చనిపోతే, మరదలు జయమ్మనీ, వాళ్లమ్మాయి మంజరినీ ఆయన తమ దగ్గరకు తీసుకు వచ్చేశారు. ఆయనకు సొంతిల్లు ఉంది. ట్రాన్సఫర్లు లేని ఉద్యోగం. అందరూ కలిసే ఉందామని వెంకట్రావు గారంటే జయమ్మ అంగీకరించలేదు. తనకి వచ్చే పెన్షన్‌తో విడిగా వుండటమే బావుంటుందని అనుకుంది.

ఆ ఇంట్లో హాలుకి ముందు ఓ గది ఉంటుంది. అందులో తల్లీ కూతుళ్ళిద్దరూ ఉంటారు. హాలుకి వెనకవేపు నుండే వంట గదికి పక్కనే ఓ చిన్న గది ఉంటే, దానిలో వంట చేసుకుంటారు. హాలుకి కుడి వేపున ఉండే రెండు గదులూ వెంకట్రావు గారు వాళ్ళు వాడుకుంటారు. రెండు కుటుంబాలకి ఒక్కొక్కరే పిల్లలు కాబట్టి ఇల్లు విశాలంగా బాగానే ఉంటోంది. జయమ్మ వాళ్లకి ఏ అవసరాలున్నా, బయటి పనులున్నా అన్నీ వెంకట్రావు గారే చూసుకుంటారు. ఏమీ పొరపొచ్చాలు లేకుండా సవ్యంగానే రోజులు జరిగిపోతున్నాయి.

అయితే మంజరే మొండిగా తయారైందని, తల్లిమాటే కాదు, ఇంకెవరి మాటా వినదని, నిర్లక్ష్యంగా ప్రవరిస్తోందని మాధవ్ విన్నాడు. అతను సంవత్సరం క్రితమే ఇంజనీరింగ్ పూర్తి చేసి, హైదరాబాద్‌లోని ఓ పెద్ద కంపెనీలో వచ్చిన ఉద్యోగంలో చేరాడు. ఇపుడు పదిరోజుల సెలవు మీద నాలుగు రోజుల క్రితమే ఇంటికి వచ్చాడు. కొద్దిరోజుల క్రితమే శిరీషకూ, మాధవ్‌కు పెళ్ళి జరిపించాలని రెండు కుటుంబాల పెద్దలూ కలిసి నిర్ణయించుకున్నారు. తొందరలోనే నిశ్చితార్థం జరిపి పెళ్ళి తేదీ నిశ్చయించాలనే ఆలోచనలో ఉన్నారు. శిరీష బి.ఎస్సీ పూర్తి చేసి ప్రస్తుతం ఏదో కంప్యూటర్ కోర్సులో చేరింది. మంజరి డిగ్రీ సెకండీయర్‌లోకి వచ్చింది.

మూడు రోజుల క్రితమే శిరీష పుట్టినరోజు పండుగ జరిగింది. నిండు ఆకుపచ్చ రంగు డ్రెస్సులో శిరీష పచ్చని ఆకుల మధ్య విచ్చుకున్న జాజి మొగ్గలా అందంగా ఉందని తనూ అనుకున్నాడు. బయట ఆరేసి వున్న ఆ డ్రెస్సునే మంజరి ఎందుకలా పాడుచేసిందో....! అప్పుడే అతనికి ఇంకొక విషయం గుర్తుకొచ్చింది. ఆ మధ్య ఒక ఎగ్జామ్ ముందురోజు చదువుకుంటున్న పుస్తకాన్ని ఇంటిముందు మెట్ల మీద పెట్టి లోపలికి వెళ్ళి తిరిగి వచ్చిన కాసేపటిలోనే కుక్క లాక్కెళ్ళి కాలువలో పడేసిందనీ, అయినా కూడా ఆ ఎగ్జామ్ బాగానే రాయగలిగానని శిరీష తనతో చెప్పింది. అంటే... అప్పుడూ మంజరే ఆ పని చేసి ఉంటుంది....'

ఆ ఆలోచనతో మాధవ్‌కి చాలా ఆవేశం వచ్చింది. మంజరి తన మనసులో ఎందుకింతగా ఈర్ష్యాసూయల్ని పెంచుకుంటోంది? ఆకారంతో పాటు చేష్టలూ

వికారమైనవేనన్న మాట! తెలియనట్లుగా ఊరుకోవటం మంచిది కాదు... గట్టిగా మందలించాల్సిందే అనుకున్నాడు.

ఆ సాయంకాలం మాధవ్ తయారై వాళ్లింటికి వెళ్లాడు. వెంకట్రావు గారింకా రాలేదు. అందరూ హాలు గదిలోనే ముభావంగా కూర్చుని వున్నారు.

సుభద్రమ్మ "రా... బాబూ..." అంటూ మాధవ్‌ని ఆప్యాయంగా ఆహ్వానించి కుర్చీ జరిపింది. కూర్చుంటూ "ఎందుకత్తా అందరూ అదో మాదిరిగా ఉన్నారూ?" అడిగాడు. సుభద్రమ్మ నిట్టూర్చి వూరుకుంది గానీ మంజరి వివరించింది.

"మొన్న బర్త్‌డేకి అక్క వేసుకున్న కొత్త డ్రెస్సు బయట ఆరవేస్తే క్లిప్పు సరిగా పెట్టలేదేమో, గాలికి క్రింద పడిపోతే, ఏ కుక్కో చింపేసినట్లుంది. పనికి రాకుండా పోయిందని అక్క బాధ పడుతోంది బావా...."

మాధవ్ నిర్ఘాంతపోతూ మంజరి వేపు చూశాడు. అబద్ధం ఏ మాత్రం జంకు లేకుండా ఎంత సునాయాసంగా చెప్పేసిందో....! వెంకట్రావుగారు, శిరీష ఇంట్లో లేరు. పెద్దవాళ్ళు ఇద్దరూ కాసేపు నిద్రపోయిన సమయం. అందుకే తను చేసిన పని ఎవరికీ తెలిసే అవకాశం లేదని అనుకుంటోంది! తీవ్రంగా మందలించాలని అనుకున్న మాధవ్ తన ఆవేశాన్ని నిగ్రహించుకున్నాడు. కాసేపు వేచి చూడటమే మంచిదనిపించింది.

"నేనేగా ఆరేశానూ... క్లిప్పు గట్టిగానే పెట్టాను. ఎవరో కుళ్ళు మొత్తనంతో చేసిన పనిలా ఉంది. ఈ మధ్య చుట్టుపక్కల కుక్కలే కనిపించటం లేదూ...." శిరీష ఏడుపు గొంతుతో చెప్పింది. ఇష్టమైన కొత్త డ్రెస్సు పాడయి పోయిందనే బాధ ఆ మాటల్లో సుళ్ళు తిరిగింది.

"నీకు కుక్కలు కనుపించటం లేదా....?"

మంజరి వెటకారంగా నవ్వింది. "ఆ మధ్య నీ పుస్తకాన్ని కుక్క నోటితో లాక్కెళ్ళి కాలువలో పడేయ్యటం నా కళ్ళారా చూశాను కాదూ...! నిన్ను చూసి ఎందుకబ్బా... అంతగా ఎవరైనా కుళ్ళి పోతారు...!" పెదాలూ సాగదీస్తూ, నిర్లక్ష్యంగా కాళ్ళూపుతూ అంది.

"నేనేం రాణీనని అనుకోవటం లేదులే! నువ్వే రాణీవి... అద్దంలో చూసుకో!" శిరీష ఏ మాత్రం తగ్గకుండా వెక్కిరించింది. "ఏం మాటలవీ?" పెద్ద వాళ్ళిద్దరూ ఒక్కసారే అన్నారు.

మంజరికి కళ్ల నిండుకూ నీళ్ళు వచ్చేశాయి. నేలను కాలితో గట్టిగా తన్నుతూ తమ గదిలోకి వెళ్ళి కర్టెన్‌ని విసురుగా లాగింది.

"డొప్ప చెవుల కప్ప మొహం... ఏం చూసుకునో అంత గీర! ఆ నడక చూడాలి.... మగరాయుడిలా అసహ్యంగా..." డ్రెస్సు పాడయిందనే ఉక్రోషాన్ని వెళ్ళగ్రక్కుతూ శిరీష గొణుక్కుంది.

"ఆ భగవంతుడు మంచి రూపురేఖలివ్వకపోయినా గానీ సవ్యమైన బుద్ధినైనా ఇచ్చి వుండకూడదా....! అంతా నా తలరాత!" జయమ్మ చేత్తో తల మీద కొట్టుకుంది.

మాధవ్ మనసంతా చేదుగా మారింది. జయమ్మతో "ఏంటత్తా... నువ్వా... నువ్వు కూడా అలా మాట్లాడుతున్నావ్?... బాధగా అన్నాడు.

జయమ్మకి దుఃఖం తన్నుకొచ్చేసింది. "నన్నేం చేయమంటావయ్యా..." అంటూ కళ్ళు తుడుచుకుంది. "ఆ దేవుడు దాని మొహాన పెళ్ళి రాత ఎలాగూ రాసి వుండడు. కనీసం తన కాళ్ల మీద తను నిలబడాలంటే నాలుగు అక్షరమ్ముక్కలు రావద్దూ....! ఆ జ్ఞానం లేదు! ఈ మధ్య దాన్ని ఏ పురుగు కుట్టిందో గానీ, ఇక చదవనని మొండికేస్తోంది. కాలేజీ తెరిచి వారం రోజులైనా వెళ్ళటం లేదు. నేనెంత నెత్తీ నోరూ కొట్టుకున్నా వినటం లేదు! ఇదంతా నా ఖర్మ కాకపోతే ఏమిటి చెప్పూ....!"

మాధవ్‌కి అయోమయమైపోయింది. ఏం మాట్లాడలేని విముఢిలా ఉండిపోయాడు.

తల్లి మాటలు వింది కాబోలు మంజరి విసురుగా బయటకు వచ్చింది. "అవును. నేనిక చదువుకోను. అది నా ఇష్టం! రోడ్లు వూడ్చో, నాలుగిళ్ళలో పని చేసో బ్రతుకుతాను. లేకపోతే చస్తాను... అంతేగానీ ఎవరి మీదా ఆధారపడను! సరేనా... నన్నిక సతాయించకు! వదిలిపెట్టు!" అంటూ రెండు చేతులూ జోడించి దండం పెట్టి కోపంగా లోపలకు వెళ్ళి పోయింది.

మాధవ్ మనసు వికలమై పోయింది. మంజరిని గట్టిగా మందలించాలని అనుకుని వచ్చిన అతను మనసు మారిపోయింది. సానుభూతితో ద్రవించింది.

జయమ్మ కూడా కళ్ళూ, ముక్కూ తుడుచుకుంటూ గదిలోకి వెళ్ళి తలుపులు ఓర వేసింది. కూతురిని అనునయిస్తుందో... లేక మళ్లీ చివాట్లేస్తుందో... మాధవ్ నిట్టూర్చాడు.

"ఈ గొడవలకేం గానీ నువ్వు ఒక క్షణం కూర్చో బాబూ... కాఫీ తెస్తాను" అంటూ సుభద్రమ్మ లోపలకు వెళ్ళబోయింది. "వద్దత్తా... నాకు బయట పని ఉంది.... వెళ్ళొస్తాను..." అన్నాడు.

మాధవ్ వెనకే గుమ్మం వరకూ వచ్చిన సుభద్రమ్మ కష్టం, సుఖం చెప్పుకునే ధోరణిలో అంది.

"పదేళ్ళ క్రితం మరిదిగారు పోయినప్పుడు మీ మామయ్య వీళ్ల నిక్కడకు తీసుకువస్తానంటే వద్దన్నాను. నేలకి పోయేది నెత్తికి రాసుకున్నట్లుగా లేనిపోని బాదరబందీ, బాధ్యత మాకెందుకనిపించింది. నా మాట వినకుండా తీసుకు వచ్చారు. అందుకు నేనేం బాధపడలేదు. కాళ్ల తీపులూ, ఒళ్ళు నొప్పులతో సతమతమవుతున్న నాకు జయమ్మే చేతి ఆసరా అయింది. మంచే జరిగింది. తన, పర అనుకోకుండా ఇంటి పనంతా బాధ్యతగా భుజానేసుకుంటుంది! అంత మంచి మనసు! అలాంటి తల్లికి శాపంలా ఇలాంటి కూతురు! ఘనంగా కట్నాలిచ్చే స్థోమత ఉంటే, అందవికారంగా ఉన్న వాళ్ళకైనా పెళ్ళిళ్ళవుతాయి. చదువుకుంటే ఉద్యోగం చేసుకుని బ్రతకొచ్చనే బుద్ధీ జ్ఞానం లేకుండా పోయిందీ పిల్లకి! ఏడవటం తప్ప పాపం జయమ్మ ఏం చేయగలుగుతుందీ....!"

అందరినోటా ఒకే రకమైన మాట! ఏమిటిది అనుకున్నాడు మాధవ్. తెలిసో తెలియకోగానీ కన్న తల్లితో సహా అందరూ మాటల ములుగర్రతో మంజరి మనసును కుళ్ళ బొడుస్తున్నారనేది మాత్రం నిజం! మంజరి మనసులో కసి, కక్ష ఎందుకు రూపు దిద్దుకున్నాయో ఆ క్షణంలో అతనికి అర్థమైంది.

ఇంటికి వచ్చినా.... నీళ్ళు నిండిన కళ్ళతో చేతులు జోడించి మాట్లాడిన మంజరి రూపమే అతని కళ్లముందు పదే పదే కదలాడింది... మనసును వేధించింది.

ఆ మరునాడే మళ్ళీ వెళ్ళిన మాధవ్ రెండు నిమిషాలు అయ్యాక మంజరి గురించి అడిగాడు.... "కాలేజీకి వెళ్ళటం లేదుగా, గుడికి కాబోలు వెళ్తోంది...." జయమ్మ నిర్లిప్తంగా చెప్పింది.

మాధవ్ వెంటనే గుడికి వెళ్లాడు. మంజరి ఎక్కడా కనిపించలేదు. ఆ ఊళ్లో ఉన్నది అదొక్కటే గుడి. జనం మధ్యలో కనిపించటం లేదనుకోవటానికీ లేదు. ఇద్దరో, ముగ్గురో ఉన్నారంతే.

చివరకు కోనేటి గట్టు మీద కూర్చుని నీళ్ళల్లోకి రాళ్ళు విసురుతున్న మంజరి కనిపించింది. 'హమ్మయ్య' అనుకుంటూ వెళ్ళి పక్కనే కూర్చుని "ఈ ఎండలో ఇక్కడ ఏం చేస్తున్నావ్?" ఆశ్చర్యంగా అడిగాడు.

మంజరి అతని వేపు అదోరకంగా చూసి "కనిపిస్తోందిగా... రాళ్ళు విసురుతున్నాను!" అంది.

"అదే... ఎందుకలా....?

"ఎందుకేమిటి... కోనేరు అలా ప్రశాంతంగా ఉండటం ఇష్టం లేక రాళ్ళు విసురుతూ అలలు రేపుతున్నాను! సాధ్యం కాక వూరుకున్నాను గానీ, లేకపోతే పెద్ద పెద్ద బండరాళ్ళు విసిరి... నీటిని కల్లోలం చేసి ఆనందంగా చూసేదాన్ని!" అంటూ నవ్వింది.

ఆ నవ్వులో నవ్వు లేదు! ఏదో కసి బుసకొడుతున్నట్లుగా ఉంది!

మాధవ్ ఒక క్షణం మౌనంగా ఉండిపోయాడు.

"నువ్వు రోజూ గుడికి వచ్చేది దేముడికి దండం పెట్టుకోవటానికి కాదా? ఇక్కడ కూర్చున్నావ్?" అడిగాడు.

"నేనెప్పుడూ గుళ్లోకి వెళ్లను. దేముడు నాకేమిచ్చాడని దణ్ణం పెట్టాలో చెప్పు! నాలా కొందర్ని అందవికారంగానూ, మరి కొందర్ని అందంగానూ సృష్టించే ఆ దేముడంటే నాకు చాలా కోపం కూడా! కనిపించడు కాబట్టి తప్పించుకుపోతున్నాడు గానీ లేకపోతే గట్టిగా పట్టుకుని న్యాయం, సమదృష్టి ఉండనక్కర్లేదా అని దులిపేసే దాన్ని కాదూ....!"

మంజరి మళ్ళీ అలాగే నవ్వింది.

మాధవ్ ఒళ్ళు ఒక క్షణం జలదరించింది.

మనసు ఆర్ద్రంతో వెన్న ముద్దయిపోయింది. అనునయంగా ఆమె చేతిని పట్టుకుని ఆప్యాయంగా నొక్కాడు.

“అందవికారం అనే మాట మనిషి రూపురేఖలకి సంబంధించి వాడనే కూడదని నా ఉద్దేశ్యం! నిజం మంజూ.... ప్రతీ వ్యక్తిలోనూ మనం చూడాలే గానీ ఏదో ఒక అందం, కొన్ని ప్రత్యేకతలు ఉండనే ఉంటాయి! వాటికి ముసుగేయటం కాదు, మెరుగు పరుచుకునే ప్రయత్నం చేయాలి! అసలు ఎంత అందమైన వాళ్ళయినా సరిగా తయారుకాకపోతే బావుంటారా... ఆలోచించు... ముందుగా నీలోని మంచి లక్షణాలని నువ్వే ప్రేమించాలి... సానబెట్టుకోవాలి! అప్పుడే ఇతరులకూ ఆ అందాలు కనువిందు చేస్తాయి! నువ్వు బొమ్మలు ఎంత బాగా వేస్తావో నాకు తెలుసు. క్రితంసారి వచ్చినప్పుడు, నీ నోట్ బుక్‌లోని బొమ్మలు చూశాను కదా, రచ్చబండ దగ్గర కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్న నలుగురి మనుష్యుల బొమ్మ వేశావు చూడూ, అది నాకు ఎంత నచ్చిందో....! నిన్నో మాట అడగనా? నలుగుర్నీ నాలుగు రకాలుగా చిత్రించావు గానీ ఒకే రకమైన పోలికలతో వేయలేదుగదా... అవునా? ఆ భగవంతుడికి కూడా అందర్నీ ఒకేలా సృష్టించలేని అశక్తత ఏదో ఉందేమో!” అంటూ చిన్నగా నవ్వాడు.

మంజరి అతనివేపు కళ్ళు విప్పార్చి ఆశ్చర్యంగా చూసింది.

మాధవ్ ఆప్యాయత నిండిన గొంతులో మళ్ళీ అన్నాడు. “దేముడి గురించీ సృష్టి గురించీ మాట్లాడేంత పరిజ్ఞానం మనకు లేదు. తెలియని విషయాల సంగతి ఎందుగ్గానీ... నువ్వు ఎందుకు చదవనంటున్నావో ఇప్పుడు చెప్పు....”

మంజరి సమాధానం చెప్పకుండా తలవంచుకుని మౌనంగా ఉండి పోయింది. కాసేపటి తర్వాత “నేను... నేను చదవలేక పోతున్నాను బావా....” గొణిగినట్లుగా అంది.

“నేన్నమ్మను...!” గట్టిగా అన్నాడు. “ఒక్కసారి మనసుపెట్టి చదివితే చాలు, నీకు బాగా గుర్తుంటుందని నాకు తెలుసు! నీకూ గుర్తుండే ఉంటుంది.... నీ చిన్నప్పుడు సెవన్త్ క్లాసులోనే కదూ... మీ టీచరు ఒక రోజున ఏదో సబ్జెక్టు ఇచ్చి మాట్లాడమని

అప్పటికప్పుడు కాంపిటీషన్ పెడితే, ప్రిపేరు కాకుండా మాట్లాడలేమని కొందరంటే, ఓ నలుగురు మాత్రం అవకతవకగా మాట్లాడారనీ, నువ్వు మాత్రమే చక్కని పదాల పొందికతో బాగా మాట్లాడావంటూ నీకు ప్రైజు నివ్వటమే కాదు, ఇంటికి వచ్చి ఆ టీచరు ఈ మాటలు మామయ్యకి చెప్పటం నేనూ విన్నాను. ఇప్పుడేమో ఎందుకిలా అయ్యావు? క్రిందటి సంవత్సరం నీకు వచ్చిన మార్కులు చూస్తే నాకెంత ఆశ్చర్యంగా ఉందో! ఎందుకంత తక్కువగా వచ్చాయి? నీలో మంచి తెలివి తేటలున్నాయి. బొమ్మలేసే కళ, చక్కని వాక్చాతుర్యమూ ఉన్నాయి! ఎందుకని వాటిని నిర్లక్ష్యం చేస్తున్నావ్ మంజూ....?"

అతని మాటల్లో ధ్వనించిన అభిమానానికి మంజరి కళ్ళు చెమ్మగిల్లాయి. "నేనేదో ఏడ్చి పోతున్నానని ఓదార్చటానికి పొగడుతున్నావ్ కదూ...?"

"ఎందుకని అంటావ్?" చిరునవ్వుతో చూశాడు.

"ఏమో... ఎందుకో... నువ్వే చెప్పాలి!" నిర్లిప్తంగా అంది.

"ఎందుకంటే... నువ్వంటే నాకు చాలా ఇష్టం కాబట్టి నిన్ను నీవు కించపరుచుకోవటాన్ని సహించలేక పోతున్నాను.... బాధపడుతున్నాను... నిజం మంజూ... నువ్వు పెద్ద చదువులు చదివి మంచి ఉద్యోగంలో స్థిరపడతావని, గొప్ప చిత్రకారిణిగా పేరు తెచ్చుకుంటావనీ చిన్నప్పటి నుండీ అనుకునేవాడిని. ఇప్పుడేమో నిన్ను నీవే నిర్లక్ష్యం చేసుకోవటాన్ని నేను భరించలేకపోతున్నాను! మనకిష్టమైన వాళ్ళు ఉన్నతంగా ఉండాలని ఆశిస్తాం కదా!"

"బావా... నువ్వు... అబద్ధం చెబుతున్నావ్! నేనంటే నీకు... నిజంగా.. నిజంగా ఇష్టమా...?" విభ్రాంతిగా చూస్తూ అడిగింది.

"అవును... ఇష్టం కాబట్టే నీ గురించి ఇంతగా తాపత్రయ పడుతున్నాను. లేకపోతే నువ్వెలా ఉంటే నాకేంటి అనుకునే వాడినే కదా ఊ?"

గొంతులోకి తేనె వచ్చి చేరినట్లుగా తీయగా అతను చెప్పిన మాటలకు మంజరి నిలువెల్లా పులకించిపోయింది. కళ్ళల్లో ఆ భావం కనిపించింది. రెప్పవేయటం కూడా మరచినట్లుగా తననే చూస్తున్న మంజరి చేయి పట్టుకుని "ఇప్పుడు చెప్పుమంజూ... ఎందుకు చదువు మానేస్తానంటున్నావ్?" అనడిగాడు.

మంజరికి దుఃఖం ముంచుకు వచ్చింది. రెండు చేతుల్లో మొహం దాచుకుని రెండు నిమిషాలు ఏకధారగా ఏడ్చింది. కాసేపటికి తెప్పరిల్లింది గానీ మాట్లాడకుండా మౌనంగా ఉండిపోయింది. మాధవ్ అనునయంగా రెండు మూడుసార్లు అడిగేసరికి అప్పుడు గొంతు విప్పింది.

"బావా...మా క్లాసులో ఒకడున్నాడు. నేను క్లాసులోకి వస్తున్నప్పుడు, ఇంకెక్కడైనా కనిపించినప్పుడు "మంజరీ... ఓహో మంజరీ.... నీ వంటి దివ్య స్వరూపంబు ఎందెందు వెదికినా లేదుగదా...." అంటూ ఎగతాళిగా రాగం తీస్తుంటాడు. ఒకరోజు నేను కోపంగా చూసేసరికి... పక్కవాడితో "మాయాబజార్‌లో రేలంగి పాడిన సుందరీ నీ వంటి... పాటంటే నాకు చాలా ఇష్టం రా' నా నోట్లో ఎప్పుడూ  నానుతూనే ఉంటుంది' అన్నాడు ఇక వాడి వేపు చూడటం మానేశాను. అయినా వాడి పాటమాత్రం ఎప్పుడో ఒకప్పుడు నా చెవుల్లో పడుతూనే ఉంటుంది. ఆ పైన కొందరి ముసిముసి నవ్వులు కూడా జోడవుతూంటాయి. లెక్చరర్‌కి కంప్లైంట్ చేయాలంటే... నాకు సిగ్గుగా అవమానంగా ఉంటుంది. ఒక్కసారి వచ్చి ఈ కోనేట్లో పడి ప్రాణాలు తీసుకుందామా అన్నంత విరక్తి కలుగుతుంది! క్రిందటి సంవత్సరం అంతా నన్నలా డిస్టర్బ్ చేశాడు. అందుకే ఇక కాలేజీకి వెళ్ళాలనిపించటం లేదు. ఎందుకు బావా... ఇంటా బయటా నన్నిలా చిన్నచూపు చూస్తారు... నేను చేసిన తప్పేమిటి....!"

మాధవ్ కదిలిపోయాడు. మనసు ద్రవించింది. "వాడి మాటలకి భయపడి నీ భవిష్యత్తును బలిచేస్తున్నావా...?" మంజరి వేపు ఆశ్చర్యంగా చూశాడు. "మంజూ... నీ కో విషయం చెప్పనా...? కొందరు మనుష్యుల మాటలకి రాకాసిగోళ్ళు ఉంటాయి! వాటితో ఎదుటి వాళ్ళని గిల్లీ గిచ్చీ రాక్షసానందం పొందుతారు! వాళ్ల మాటలకి విలువిచ్చినట్లుగా మనం బాధపడితే, వాళ్లకు ఆనందం రెట్టింపవుతుంది. పట్టించుకోకుండా తేలిగ్గా తీసుకున్నామనుకో. ఏడిపించలేకపోతున్నామే అని వాళ్ళే ఏడ్చి చస్తారు! నిజం! నువ్వు నేను చెప్పినట్లుగా చేస్తే ఈ విషయం నీకు తెలిసి వస్తుంది. ఈ సారి వాడలా పాడినప్పుడు నువ్వు దగ్గరకెళ్ళి 'ప్రతి ఒక్కరిలోనూ ఏదో అందం ఉంటుంది. అందరూ చూడలేక పోయినా మంచి లక్షణాలని గమనించి నన్ను ప్రశంసిస్తున్నందుకు చాలా థేంక్స్ బ్రదర్....' అని చెప్పి చూడు... వాడి

మొహం మాడి పోవటమే కాదు, మళ్ళీ నీ జోలికి చస్తే రాడు! ఖచ్చితంగా చెప్పగలను!"

మంజరికి నవ్వొచ్చింది. హాయిగా తెరలు తెరలుగా నవ్వింది. "అలా చెప్పగలిగే ధైర్యం ఉండొద్దూ..." అంది.

"నీకు ధైర్యానికేం తక్కువ! మీరు ఈ వూరు వచ్చిన సంవత్సరమే అనుకుంటూ, మామయ్య నీకు, శిరీషకూ సాయంకాలం పూట ట్యూషను పెట్టించాడు. ఆ మేష్టారు ఒక రోజు ఇంట్లోని పనులు చూసుకుంటూ, మిమ్మల్ని చదువుకోమని చెప్పి, కాసేపటి తర్వాత 'చదువుకున్నారుగా, వెళ్ళిరండి' అనేసరికి 'మీరేమీ చెప్పకపోతే మేం ఇక్కడకు రావటం దేనికీ, ఇంటి దగ్గరే చదువుకుంటాంగా' అని నువ్వు అడిగావట! ఆయనకి పిచ్చి కోపం వచ్చి 'ఇంత చిన్నపిల్ల నన్నిలా అడుగుతుందా' అని రంకెలు వేస్తూ మావయ్యతో ఇక చదువు చెప్పనని కంప్లైంట్ చేయటం నాకు బాగా గుర్తుంది!"

"నీకివన్నీ ఎంత బాగా గుర్తున్నాయి బావా?" విస్మయంగా అంది.

"అప్పుడు నీ ధైర్యానికి నేనెంత విస్తుపోయానో! ఇప్పుడు నీ క్లాస్‌మేట్‌కి ఓ డోస్ ఇవ్వటానికేం... బాగానే ఇవ్వగలవ్!" చిరునవ్వుతో అన్నాడు.

మంజరీ నవ్వింది. కళ్ళల్లోకి వరదలాంటి వెలుగొచ్చింది.

"ఎండ ఛుర్రుమంటోంది. భోజనాల వేళ కూడా అవుతోంది. పద... ఇంటికి వెళ్దాం..." అంటూ లేచి నిలబడి మంజరికి చేయి అందించాడు.

"మంజూ... నీకో మాట చెప్పనా...? మీ నాన్న చనిపోయినా అత్తయ్య కష్టపడుతూ నీ కోసమే... నీ ఉన్నతిని చూడాలనే కోరికతోనే బ్రతుకుతోంది. మాటలోని పెళుసుతనాన్ని కాకుండా, మనసులోని ప్రేమనే గమనించు! మనల్ని ప్రేమించే వాళ్ళ మనసుల్ని కష్టపెట్టకూడదు! అవునా...?"

ప్రేమగా, నిజాయితీగా చెప్పిన మాటల్ని వింటూ అతని వెంట మౌనంగా నడిచింది.

రెండు మూడు రోజుల తర్వాత మాధవ్ వెంకట్రావు గారింటికి వెళ్ళాడు. ఆయన ఆఫీసుకి వెళ్ళిపోయారు. శిరీష ఇన్‌స్టిట్యూట్‌కి వెళ్లినట్లుంది. హాలు గదిలో

ఏదో చక్కబెడుతున్న జయమ్మని "మంజరి ఇంట్లో లేదా... ఎక్కడికి వెళ్లిందీ?" అనడిగాడు.

"ఇప్పటివరకూ ఇక్కడే ఉండాలి. ఇప్పుడే ఎటో వెళ్ళినట్లుంది. చదువు మానేసిన దగ్గర్నుండీ పెత్తనాలెక్కువయ్యాయి. ఎక్కడికని అడిగితే మొండి సమాధానాలు చెబుతుంది! ఇలాంటి పిల్లతో ఎలా వేగాలో ఏమిటో!" జయమ్మ చిరాకుపడింది.

మాధవ్‌కి భగ్గుమన్నట్లుగా కోపం వచ్చింది.

"ఎందుకత్తా... మీరంతా ఇలా మాట్లాడతారు...? మీ అందరూ మీ ఎత్తిపొడుపు మాటలతో తనని మొండిగా మార్చేశారు! మీ మాటల వల్లే... తనలోని మంచి లక్షణాలకి ముసుగేసుకుని లోలోపలకు ముడుచుకుపోతున్నట్లుగా అయిపోతోంది! నువ్వు గమనించటం లేదు... అర్థం చేసుకోవటం లేదు!" ఆవేదనగా అన్నాడు.

జయమ్మ ఆశ్చర్యంతో కొయ్యబారిపోయినట్లుగా అయింది. ఎలాగో గొంతు పెగల్చుకుని "దానికి పెళ్ళి కాదెలాగూ, చదువూ మానేస్తోందనే బెంగతో మాట్లాడుతున్నాను. విసుక్కుంటున్నానంతే గానీ, కన్నతల్లిని... దానిని బాధపెట్టాలనుకుంటానా..?" రుద్ధ కంఠంతో అంది.

"అత్తా... మంజూకి పెళ్ళి కాదని మీరంతా ఎందుకు తీర్మానించేస్తున్నారో నా కర్థం కావటం లేదు! మీ అందరి కళ్ళకూ ఏవో పొరలు కమ్మాయి. అందుకే తనలోని అందాన్ని చూడలేక పోతున్నారనిపిస్తోంది! మంజుకున్నంత పట్టుకుచ్చులాంటి జుట్టు ఈ ఇంట్లో ఎవరికి ఉందో చెప్పు! నవ్వితే తన మొహం ఎంత బావుంటుందో... మీరు మీ మాటలతో నవ్వనివ్వరుగా! శిరీష కంటే మంజూయే పెద్దదై ఉంటే, నేను తప్పకుండా తననే పెళ్ళి చేసుకునే వాడిని! మంజూ అంటే నాకు చాలా ప్రేమ. ఇష్టం! నిజమే చెబుతున్నానత్తా! మంజు బాగా చదువుకుని మంచి ఉద్యోగం చేస్తుంది! తన తెలివి తేటల్నీ వ్యక్తిత్వాన్నీ ప్రేమించే నాలాంటి వాడు తటస్థపడతాడు... పెళ్ళి చేసుకుంటాడు!

రెప్పవేయటం కూడా మరిచి జయమ్మ అలాగే చూస్తూ బొమ్మలా ఉండి పోయింది! కూతురి గురించి అప్పటివరకూ అలాంటి మాటలు ఆమె వినలేదు మరి!

మాధవ్ ఇక అక్కడ ఉండకుండా చకచకా బయటకు వచ్చేశాడు. మెట్ల దిగుతోంటే, ముందుగది కిటికీ కున్న పలుచని తెరచాటు నుండి తనని ఎవరో చూస్తున్నట్లుగా అనిపించింది. తన ఆలోచన నిజమే. మంజూ ఇంట్లోనే ఉంది. మనసులో అనుకున్నాడు. అతని పెదవులు చిరునవ్వుతో విచ్చుకున్నాయి.

ఇంటికి వచ్చి తనగదిలో మంచం మీద పడుకున్న మాధవ్ మనసు నిండా ఏవేవో ఆలోచనలు! అయిదు నిమిషాలకే దగ్గరకు వేసివున్న తలుపులు భళ్ళున తెరచుకునే సరికి మాధవ్ ఉలిక్కిపడి లేచి కూర్చున్నాడు.

మంజరి పరుగులాంటి నడకతో మెట్లెక్కి వచ్చి నందు వల్ల కాబోలు... కొంచెం రొప్పుతూ అతని కెదురుగా నిలబడింది.

"బావా... నేను ఇంట్లోనే ఉన్నాను. నీ మాటలు... విన్నాను... అమ్మతో... నువ్వు చెప్పింది... నిజంగా.... నిజమా....? అబద్ధం కాదు కదూ.....? నేనంటే... నీకు...ప్రేమ ...? అబద్ధం కాదు కదూ...? నేనంటే... నీకు... ప్రేమ..." ప్రశ్నార్థకంగా తలాడించింది.

'మాధవ్ రెండు చేతులతో దగ్గరకు తీసుకుని నుదుటి మీద చుంబించి "నిజం మంజూ... నువ్వంటే నాకు చాలా ఇష్టం.... ప్రేమ!" అన్నాడు.

"చాలు బావా.... నాకిది చాలు... " ఆమె మనసు పట్టలేని ఆనందంతో కేకలు పెట్టింది. ఇక అక్కడ నిలబడలేనట్లుగా... తూనీగలా... గాలిలో తేలిపోతున్నట్లుగా పరుగులు పెడుతూ ఇంటికి చేరింది.

మరునాడు మాధవ్ ప్రయాణమై వెళ్ళిపోయే సమయానికి మంజరి వెళ్లి అతని చేతికి ఓ కవరు ఇచ్చి "ఇప్పుడు కాదు... ట్రైనులో కూర్చున్నాకనే చదువు బావా...." అంది.

రైల్లో కూర్చోగానే మాధవ్ ఆత్రుతగా కవరు విప్పి కాగితం తీసి చదివాడు.

"బావా...

ఇలా బంధుత్వంతోకంటే నిన్ను ప్రాణమిత్రమా, ప్రియనేస్తమా అని పిలవాలని నా మనసు తహతహలాడుతోంది! 'ప్రేమ' అనే మాట అద్భుతమైన మంత్రంలా నన్నెంతగా మార్చేసిందో నీకు చెప్పాలనే ఈ ఉత్తరం! నీ ప్రేమలో, మాటలతో కొత్త

జీవితంలోకి అడుగు పెట్టినట్లుగా.... నా శరీరంలోని అణువణువులోనూ ఉత్తేజం, ఉత్సాహం పురులు విప్పుకున్నాయి! బీడులాంటి మనసులో పూలతోట వెలిసినట్లుగా పరిమళాల ఉప్పెన నన్ను ఊపేస్తుంది. ప్రేమని అందుకోవటంలోని మాధుర్యం చవి చూశాక, ఇప్పుడు నా కెవరి పట్లా కోపం, నిష్ఠూరం లేనే లేవు... అందరికీ నా ప్రేమనీ పంచి ఇవ్వటానికే ప్రయత్నిస్తాను. ఇప్పుడు నన్నేడిపించాలనుకునే క్లాస్‌మేట్ కనుపిస్తే ఏం చేస్తానో తెలుసా బావా...? 'నన్ను ప్రేమించే వాళ్ళు ఉన్నారు.... నన్నేడిపించటం నీ వల్ల కాదు... పోవోయ్ బడుద్దాయ్...' అని నేను సరదాగా వెక్కిరిస్తాను.

నాకు పెళ్ళి అవనీ, కాకపోనీ... ఆ విషయం గురించి పట్టించుకోను. శ్రద్ధగా చదువుకోవటమే నా ప్రస్తుత ధ్యేయం! నీ ప్రేమ అనే తీపి జ్ఞాపకం నా మనసులో తోడు ఉండగా నాకింకేమీ అక్కర్లేదనిపిస్తోంది! అమ్మ సంతోషించేట్లుగా ప్రవర్తిస్తానని నీకు మాట ఇస్తున్నాను.

చీకటి కోణంలాంటి నా మనసును వెలిగించిన వెన్నెల కిరణానివి నువ్వు! నా మనసుపై చిలకరించిన ప్రేమ, స్నేహాభిమానాలకు ప్రతిగా నీకేం ఇవ్వగలను నేను.... మౌనంగా మనసులోనే నీకు ప్రేమగా ప్రణామం చేయటం తప్ప!

ఈ రోజు గుడికి వెళ్ళి.... నీలాంటి ఆప్తబంధువు నిచ్చినందుకు దేముడికి మొదటిసారిగా మనసారా నమస్కరించాను! ఇవ్వని వాటి గురించి ఆలోచిస్తూ ఇచ్చిన వాటి ప్రాముఖ్యాన్ని మరిచి పోకూడదని తెలుసుకున్నాను మరి!

నీతో పెళ్ళిని నేను కోరుకుంటున్నానని అనుకోకు సుమా! శిరీషతో జరిగే నీ పెళ్ళిలో సందడిగా ఆనందంగా తిరిగే రోజుకోసం ఎదురు చూస్తుంటాను.

నీ ప్రేమాభిమానాన్ని పొందగలిగిన అదృష్టవంతురాలు"

# శాంతమ్మ

**–లక్ష్మీ రాఘవ**

"**అ**త్తగారు బాత్రూంలో జారిపడ్డారుట... ఫోన్ వచ్చింది"

"ఎన్ని గంటలకు ఫోన్ వచ్చింది?"

"పన్నెండు గంటలకు"

"అప్పుడే ఫోన్ చేసి చెప్పాల్సింది. ఈ పాటికి వూరికి వెళ్ళిపోయేవాడ్ని కదా"

సమాధానం చెప్పలేదు భారతి. అత్తగారంటే తనకున్న అయిష్టతని ఎలాగోలా వ్యక్తపరుస్తుంది తను.

తల్లి శాంతమ్మని చూడడానికి, వీలైతే తీసుకురావడానికి బయలుదేరుతున్న కామేశంతో –

"నేనూ వస్తాను నాన్న" అంది కూతురు సుధ.

"నువ్వెక్కడికే..." ఇంకా ఏదో అనబోతున్న భారతితో –

"అమ్మా! నాకిప్పుడు సెలవులు కదా. అందుకే వెళ్ళి నాన్నమ్మను చూసి వస్తాను. ఉండాల్సివస్తే అక్కడే కొద్దిరోజులు ఉండి వస్తాను" ఖచ్చితంగా మాట్లాడుతున్న సుధకేసి మెచ్చుకోలుగా చూసాడు కామేశం.

కోడలు తప్పించుకోవాలని చూసినా మనమరాలు సేవ చేయడానికి సిద్ధం అవడం నచ్చింది అతనికి. డిగ్రీ పూర్తయిన సుధ ఎంసిఎలో చేరడానికి ప్రిపేరవుతోంది. కారులో బయలుదేరారు కామేశం, సుధలు. నాలుగు గంటల ప్రయాణం ఆ పల్లెటూరికి.

నట్టింట్లో మంచం మీద పడుకుని ఉన్న శాంతమ్మ కామేశం, సుధ రావడంతో చాలా ఆనందపడింది. అప్పటివరకూ ఆమెను కనిపెట్టుకుని ఉన్న పనిమనిషి కమలను కాఫీ వగైరాలు తయారు చేయమని పురమాయించింది.

సుధ నానమ్మ దగ్గరగా మంచం మీద కూర్చుని "ఎలా ఉన్నావు నాన్నమ్మా?" అంది.

"ఏదో జారిపడ్డాను. పాదం కాస్త బెణికింది అంతే. తొందరగా తగ్గిపోతుంది. ఫోన్ చేయొద్దురా అంటే ఆ రవిగాడు వింటేగా? ఫోన్ చేసి మిమ్మల్ని హడావిడి పెట్టినట్టున్నాడు. ఏమైనా మీరు వచ్చారు నాకెంత సంతోషంగా ఉందో తెలుసా? రేపీపాటికి లేచి తిరగనూ?" సంతోషంగా అంది శాంతమ్మ.

అమ్మ ఆనందాన్ని ఆస్వాదిస్తూ కాలువాపుని పరిశీలిస్తున్నాడు కామేశం. ఇంతలో రవి వచ్చాడు.

"ఎప్పుడొచ్చారు మామయ్యా? అవ్వ బాత్రూంలో కాలు జారినట్టుంది. నెమ్మదిగా పడడంతో కాలు ఫ్రాక్చర్ కాలేదుగానీ బాగా వాచింది. కమల చెప్పబట్టి వెంటనే వచ్చాను. ప్రక్క టౌను నుండి డాక్టర్‌ను తీసుకువచ్చి చూపించాను. కాలు వాచిందని, కట్టుకట్టుకుని, కాలుకి రెస్టు ఇవ్వాలని, కొద్దిరోజులు బెడ్‌మీద ఉండాలనీ చెప్పారు. మీకు ఫోన్ చేయవద్దని చాలాసార్లు అంది. కానీ నేనే మీకు తెలిపితే మంచిదని ఫోన్ చేశాను" అన్నాడు.

రవి కామేశానికి దూరపు బంధువు. ఆ వూళ్లోనే ఉంటాడు కాబట్టి శాంతమ్మకు ఏ అవసరం వచ్చినా ఆదుకుంటాడు. ఆ పై కామేశం కూడా రవి చూసుకుంటాడని నిశ్చింతగా ఉంటాడు. శాంతమ్మ పట్నం రావడానికి ఇష్టపడడంలేదు కాబట్టి ఇలాంటి ఏర్పాటు తప్పలేదు మరి కామేశానికి. అంత బాధ్యత వదలకుండా ఆస్తి విషయం ఇంకా శాంతమ్మే చూసుకుంటుందని భారతికి కోపం. భారతి స్వభావానికి అందరూ అలవాటుపడ్డారు.

శాంతమ్మ కదలకూడదు అనడంతో కామేశం టౌనుకు వెళ్ళి డాక్టర్‌ను కలిసాడు. ఫ్రాక్చర్‌లేదు కాబట్టి కాలుకు పూర్తి రెస్టు ఇస్తే సరిపోతుందన్నాడు డాక్టర్. సుధ నాన్నమ్మ దగ్గరే కొద్దిరోజులు ఉంటానంది. సుధ ఇష్టంగా ఉంటానని అనడంతో అమ్మకు అవసరం అని కామేశం సుధను అక్కడే వదిలి వూరికి వచ్చేశాడు.

నాన్నమ్మకోసం వంట చేయడం, అన్నీ దగ్గరుండి కొసరి తినిపించడం, స్నానం, బట్టలు కట్టుకోవడంలో సహాయపడడం సుధకి ఎంతో ఆనందంగా ఉంది. తన దగ్గరి మనిషికి సహాయపడడం, ఉపయోగపడడం అన్నది సుధకి చాలా తృప్తినిచ్చింది.

అంతేకాదు, కొద్దిరోజుల్లోనే నాన్నమ్మకూ జీవితంలో ఎన్నో కోణాలు తెలిసివచ్చాయి. శాంతమ్మ కూడా సుధ తన దగ్గరకు వచ్చి ఉండడం ఎంతగానో నచ్చింది. తనకు కష్టసమయంలో మనమరాలు చేదోడువాదోడుగా ఉండడం ఆమెను ఎంతో కదిలించివేసింది. అందుకే ఎవ్వరికీ చెప్పని తన జీవిత విశేషాల్ని ఆప్యాయంగా మనమరాలి ముందు వుంచింది.

కర్ణాటక సరిహద్దులో వున్న చిన్న పల్లెటూరు శాంతమ్మ నాన్న రామచంద్రానిది. బహు చక్కని పిల్ల శాంత అని తెలిసి ఎన్నో సంబంధాలు వచ్చేవి. అనుకోకుండా రాయలసీమ నుండి జమిందారీ కుటుంబం నుండి వచ్చిన సంబంధం కొంచెం ఆలోచింపజేసింది. అంతటి సంబంధానికి తాము తూగగలమా అని సందేహపడ్డాడు రామచంద్రం.

"బంగారం లాంటి సంబంధం... ఒక్కగానొక్క కొడుకు. అందమైన పిల్ల కావాలని వాళ్ల కోరిక. మీ అమ్మాయి అందం గురించి తెలిసి వచ్చిందీ సంబంధం. అయినా కూతుర్ని కలిగిన కుటుంబానికి ఇవ్వాలని, కోడల్ని తక్కువస్థాయి కుటుంబం నుంచి తెచ్చుకోవాలనీ అంటారు. ఇక మీకు ఎందుకు అభ్యంతరం? పిల్లని చూసుకోవడానికి రానివ్వండి. కుదిరితే అమ్మాయి అదృష్టం"

మధ్యవర్తి అన్న మాటలు ఆలోచింపజేసాయి రామచంద్రాన్ని. జాతకాలు కుదిరాయి. పిల్లని చూసుకోవడానికి వస్తామని కబురు పెట్టారు.

అసలే అందమైన శాంత కుందనపుబొమ్మలా, ముచ్చటగా కూర్చుంది, చాపమీద. వరుడు, తల్లీ, తండ్రి వచ్చారు. తల ఎత్తి చూడాలని ఉన్నా సిగ్గు తలెత్తనివ్వలేదు.

"నీ పేరేమిటమ్మా?" అన్న వరుడి తల్లి మాటలు విని "శాంత" అని తలెత్తి చూసింది.

"అబ్బ... ఎంత బాగున్నాడు" అని అనుకోక తప్పలేదు. దృఢంగా, మంచి ఎత్తుతో, ఉంగరాల జుట్టుతో, చురుకైన చూపుతో ఓ రాకుమారుడిలా ఉన్నాడు. రామచంద్రానికి తృప్తినిచ్చింది.

"పిల్ల మాకు నచ్చింది" అని అప్పటికప్పుడు తాంబూలాలు పుచ్చుకుని తన చేతికున్న వంకీని తీసి కానుకగా పెట్టింది వరుడి తల్లి సుభద్రమ్మ.

అలా శాంత చిన్నవయస్సులోనే పెళ్లయిపోయింది. భర్త కృష్ణ వెంట కాపురానికి వెళ్లిపోవడమూ జరిగింది.

రాయలసీమలోని చిన్న పల్లెటూరులో జమిందారీ కుటుంబానికి కోడలుగా రావడం గొప్పగా అనిపించింది. అందులోనూ అందమైన భర్త, కలిగిన కుటుంబం ఎంత మందికి దొరుకుతుంది? అనుకుంది తృప్తిగా.

వచ్చిన వారం లోపలే ఓ రోజు సుభద్రమ్మ కోడలికి జడవేస్తూ "అందంగా ఉండే కోడలు రావాలని ఎంతో వెదికాము శాంతా. పెళ్ళి చూపుల్లో నిన్ను చూడగానే నువ్వే తగినదానివనుకున్నాము. ఇక నీ అందంతో కృష్ణను కట్టిపడేయాలి సుమా. నువ్వు తప్ప ఎవ్వరూ అతని కంటికి కనిపించకూడదు"

అత్తగారి మాటలు అర్థంకాలేదు శాంతకు.

"అందంతో కట్టిపడేయాల్సిన అవసరం ఏమిటి? అతను కూడా అందగాడేకదా?" సందేహం వచ్చింది శాంతకు.

ఓ ఆర్నెల్లు రాత్రి పగలు తేడా లేకుండా చిలిపిగా గడిచాయి. భర్త తనను వదిలి ఉండలేడేమోనన్నంతగా పొద్దు గడపడం అయింది. ఆపై వేవిళ్ళు. భర్త దగ్గరకు చేరినా నిరాసక్తతయింది. తన కడుపులో పెరుగుతున్న బిడ్డ మీద మమకారం ఎక్కువైంది.

కృష్ణలో కూడా కాస్త మార్పు వచ్చింది. ముందులాగా ఎప్పుడూ భార్యను అంటి పెట్టుకుని ఉండడంలేదు. అప్పుడప్పుడూ రాత్రిళ్ళు ఆలస్యంగా రావడం జరుగుతున్నా పట్టించుకునే ఆరోగ్యం తనకు లేకపోవడంతో నిర్లిప్తంగా ఉంది.

కడుపులో కదులుతున్న పాప అన్ని విధాలా దగ్గరవుతున్న భావన వచ్చింది.

సుభద్రమ్మకు కాస్త ఆందోళన ఎక్కువైనట్లు అనిపించింది. 'కృష్ణ ఎన్నింటికి వచ్చాడు? ఎక్కడికి వెళ్లాడు?' ఇలా ప్రశ్నలతో వేధించేది.

చివరికి ఒకరోజు శాంతను కూర్చోబెట్టి అసలు కథ చెప్పింది. కృష్ణకు చెడు అలవాట్లు ఎక్కువ అవడంతో దూర ప్రాంతాల సంబంధాల కోసం వెదికారు.

అందులోనూ అందమైన పిల్లకోసం వెదికారు. అలా అయితే అతను ఇతర ఆడవాళ్ళ దగ్గరకు వెళ్ళే ప్రసక్తి ఉండదని. అందుకే శాంతను నీ అందంతో ఆకట్టుకో అని హెచ్చరించేది. సుభద్రమ్మ. కానీ ఇక్కడ సుభద్రమ్మ పొరపాటు పడింది. కృష్ణకు కావాల్సింది అందం కాదు వెరైటీ. శాంతతో ఆరునెలలు కాపురం చేయగానే బోరుకొట్టి వెరైటీ కోసం వేరే ఆడవాళ్ళ దగ్గరకు వెళ్ళేవాడు.

ఇలాంటిదేమీ ఊహించలేని శాంతకు భర్త ఎందుకు ఆలస్యంగా వస్తున్నాడో తెలిసేదికాదు. ఇలా అని అత్తగారు తెలియజెప్పాక చాలా నీరసించిపోయింది.

అలా ఏడవ నెలలోనే పుట్టింటికి ప్రయాణమయింది. తన సంసారం గుట్టు తండ్రికి చెప్పడం ఇష్టంలేక పైకి మామూలుగా కనిపించినా మానసికంగా కృంగిపోయింది.

తిరిగి వచ్చినప్పుడు అత్తవారింట్లో వేమక్క అనే కొత్త మనిషి పనిచేస్తూ కనిపించింది.

వేమక్కకు భర్త చనిపోయి అత్తగారు బాగా వేధిస్తూ ఉంటే శాంత మామగారి దగ్గరకు పంచాయితీకి వచ్చింది. భర్త పోయినా ఆ ఇంటి కోడలిగా ఆస్తిలో వాటా కావాలని ఆవిడ వాదన. అందుకు అత్తింటివాళ్ళు ఒప్పుకోలేదని శాంత మామగారి దగ్గరకు వచ్చింది. అప్పటికాలంలో ఇలాంటి తగాదాలు కోర్టుదాకా వెళ్లకుండా వూరి పెద్ద పరిష్కారం చూపి తీర్పును ఇచ్చేవారు.

ప్రజలు దానికి కట్టుబడి ఉండేవారు కూడా. వేమక్కను కొద్దిరోజులు వదిలి వెళితే నచ్చచెబుతానని అనడంతో వేమక్క ఇక్కడే ఉండిపోవడం జరిగింది. శాంత కంటే కొంచెం వయస్సు పెద్దదే. భర్త లేక కొంచెం నిరాశగా ఉన్నట్లు ఉండేది.

ఒకరోజు శాంతకు వంటింట్లో పని ఆలస్యం అవడంతో లేటుగా మంచి నీళ్ళ చెంబు తీసుకుని పడకగదికి వెళ్లబోతూ ఉంటే ఆ గదిలో నుండి తడబాటుగా బయటకు వెళ్తున్న వేమక్కను చూసి షాకయింది శాంత.

ఇన్ని రోజులు బయట ఏమి తిరుగుళ్ళు తిరిగినా పట్టించుకోకపోయినా ఏకంగా తమ పడకగదిలో వేరే ఆడమనిషిని రప్పించుకున్నాడని తెలిసి అసహ్యమేసింది.

లోపలకు వెళ్ళగానే కృష్ణ ఏమీ ఎరుగనట్టు మామూలుగానే ఉన్నాడు.ఆ మంచంపై పడుకోవడానికి మనస్కరించక చాప వేసుకుని కింద పడుకుంది శాంత.

మరుసటిరోజు శాంతను తప్పించుకుని తిరిగింది వేమక్క. ఏమిటని నిలదీస్తే 'అయ్యగారు ఎంత వద్దని చెప్పినా వినలేదమ్మా' అంది. ఆపై శాంతకు మళ్లీ వేవిళ్ళు. దానితో సతమతమవుతుంటే వేమక్క పెరట్లో వాంతి చేసుకోవడం గమనించింది.

జరిగిందేమిటో అర్థమయింది శాంతకు. కడుపు పోవడానికి ఏదో నాటు మందులు వాడినా లాభం లేకపోయింది. వేమక్కకు. శాంత ఆరోగ్యం కూడా కాస్త ఆందోళనకరంగా ఉంది.

అప్పుడు ఆలోచన చేసింది శాంత. తనతోపాటుగా వేమక్కను తోడుగా పుట్టింటికి తీసుకువెళతాను అని మామగారికి చెప్పి ఆవిడ పంచాయితీ మరికొన్ని నెలలు వాయిదా వేయించింది. పుట్టింట్లో ఇద్దరికీ కాన్పులయ్యాయి.

శాంత బిడ్డ పురిట్లోనే పోవడంతో వేమక్క బిడ్డను తన కొడుకుగా తెచ్చుకుంది అత్తింటికి.

ఎటువంటి పరిస్థితుల్లోనూ ఈ విషయం బయట పెట్టకుండా వేమక్క దగ్గర ప్రమాణం చేయించుకుంది.

తన కొడుకు జమిందారీ వారసుడుగా అవుతాడన్న తృప్తితో వేమక్క మారుమాట్లాడక వెళ్ళిపోయింది. ఆమె కొడుకును అలా తన కొడుకుగా పెంచింది కామేశాన్ని.

అత్తవారింట్లో ఎవరికీ తెలియని రహస్యం. అది తల్లికి తండ్రికి తెలిసినా కూతురి కాపురం కోసం అది మనసులో దాచుకోక తప్పలేదు.

"ఇన్ని రోజులకు మీ నాన్న రహస్యం నీకు చెప్పాను సుధా. ఎందుకో ఇలా చెప్పాను. ఈ రహస్యం నాతోనే అంతం అయితే బావుండేది" బాధగా అంటున్న నాన్నమ్మను ఆప్యాయంగా చూసింది సుధ.

"తాతయ్య చేసిన ఒక తప్పుని సరిదిద్దావు సరే. ఇంకా మిగిలిన సంబంధాల కథలేమిటి?"

"ఇది నా కళ్ళెదుట జరిగిన కథ సుధా. అతని సంతానాన్ని గాలికి వదిలేయలేననుకున్నాను. ఒకవేళ నా బిడ్డ బ్రతికి ఉండి ఉంటే ఇద్దరినీ నాకు పుట్టిన కవలలుగా చెప్పేదాన్ని."

"అంటే ఇంకా ఎక్కడా ఇలా పుట్టి ఉండరని గ్యారంటీ ఏమిటి?"

"నిజమే. అతని బలహీనతకు ఎందరో ఆడవాళ్ళు బలయి ఉండవచ్చు కానీ నాకు తెలిసిన మనిషికి మాత్రం నేను న్యాయం చేసానని అనుకున్నాను అంతే."

"చాలా రిస్కు తీసుకున్నావు నాన్నమ్మా. నాన్న అచ్చు గుద్దినట్లు తాతయ్యలాగా ఉన్నాడు కాబట్టి సరిపోయింది. తల్లిని పోలి వుంటే ఏం చేసేదానివి?"

"అది నా అదృష్టం. దేవుడు నావైపు ఉండి నేను చేసిన పనికి సహాయపడ్డాడని అనుకుంటాను.

"మరి తాతయ్యకు ఎప్పుడు బుద్ధి మారినట్లు?"

"చివరిదాకా మారలేదు. అందుకే చివరకు మంచానపడి అన్ని రోజులు గడపాల్సి వచ్చింది. మీ తాతయ్యను మార్చలేకపోయానుగానీ నా కొడుకు విషయంలో మాత్రం చాలా జాగ్రత్తపడ్డాను. కామేశానికి ఈ పోకడలు సోకకుండా ఉండడానికి దూరంగా హాస్టల్‌లో ఉండి చదివించాను. వూరికి వచ్చినా నీడలా కాపాడాను. నేను కోరిన వ్యక్తిత్వం అతనికి వచ్చింది. ఆ తృప్తి చాలు నాకు"

"ఏదో పాతకాలపు నాన్నమ్మవనుకున్నాను. చాలా చక్కగా ప్లానుచేసావు. మరి నీవు మాత్రం ఇక్కడ ఉండడం ఎందుకు? మా దగ్గరకు వచ్చేయొచ్చుకదా! అటువంటి పరిస్థితిలో ఎప్పుడైనా బలహీన క్షణాలలో మీ తాత లక్షణాలు తెరమీదకు వస్తాయనే జాగ్రత్తపడ్డాను. అందుకే ఇక్కడి ఆస్తులు నెమ్మదిగా అమ్మివేస్తూ వస్తున్నాను. డబ్బు మీ నాన్నకు ఇస్తున్నాను. ఆస్తి కరిగించివేస్తున్నానని మీ అమ్మకు నా మీద కోపం. కామేశాన్ని వూరికి రానీయకుండా చేసాననే అపార్థం చేసుకుంది."

ఇక్కడి ఆస్తిపాస్తులన్నీ నేను చూసుకోకపోతే కామేశం రావాల్సి వస్తుందికదా!

"మా నాన్నమ్మ ఎంత ముందు చూపుతో ఇలా చేస్తున్నదని మా అమ్మకేం తెలుసు? మా మంచి నాన్నమ్మ..."అంటూ ఆప్యాయంగా కౌగలించుకుంది సుధ.

తనకు పుట్టకపోయినా భర్త సంతానాన్ని తనదిగా ఎంతో సంస్కారంవంతంగా తనకు పుట్టిన బిడ్డగా వంశాన్ని నిలపడానికి, తండ్రి లక్షణాలు కొడుకులో ఎక్కడ కనిపిస్తాయేనని జీవితాంతం కాపాడుకుంటూ తనదైన శైలిలో ఒక పరిష్కారాన్ని ఎంచుకున్న 80 ఏళ్ల శాంతమ్మ ఎంతో ఉన్నతంగా కనిపించింది సుధకు.

ఆమె గొప్పతనాన్ని ఎలుగెత్తి చాటాలనిపించినా ఏదో బలహీన క్షణాలలో తనతో పంచుకున్న తమ వంశ రహస్యాన్ని తన గుండెలో భద్రంగా దాచి తాళం వేసింది సుధ... నాన్నమ్మ తనపై వుంచిన విశ్వాసానికి తల వంచుతూ.

# సహజీవనం

-బి.గీతిక

నల్లగా ఉన్న రాతిరి మలి ఘడియలు చాలా చల్లగా ఉన్నాయి.

నా చుట్టూ... బోలెడు చెట్లు, వాటి బలాన్ని చాటే కోటానుకోట్ల ఆకులు, కొమ్మలూ, కొమ్మల మధ్య చిన్న చిన్న పక్షుల గూళ్ళు... నా చుట్టూ ఇంత జీవమున్నా ఏ అలికిడీ లేదు వాతావరణంలో. మరీ పట్టిపట్టి చూస్తుంటే తెలుస్తోంది మంచు కురవడం. ఆకులమీద పడిన మంచు బిందువులన్నీ ఏకమై ఉండుండీ చినుకులుగా కురుస్తున్నాయి. అయినా నిశ్శబ్దమే నా చుట్టూ, ప్రశాంతత నిండిన నిశ్శబ్దం....!

అలవాటైన ప్రకృతే... అయినా పరవశిస్తూ వాకిలి ఊడ్చే పనిలో పడ్డాను. నిండైన ముగ్గు ముగించే వేళకి వేకువ మొదలైంది. కువకువలతో.

ముగ్గు గిన్నెతో లోపలికి వస్తుంటే పక్కింటి గేటు శబ్ధమైంది. అప్రయత్నంగా నా తల అటు తిరిగింది. ఇన్ని రోజులుగా చూస్తున్నా.... పక్కింటి మామ్మగారు ఉదయాన్నే వచ్చి ముగ్గునీ, ముగ్గు వేస్తున్న నన్నూ మార్చిమార్చి చూస్తోంది ప్రతిరోజూ..

నేను ఓరగా ఆవిడని చూస్తే... ఆ ముసలావిడ వింతగా ముగ్గువంకే చూస్తూ....!

నాన్నకి ప్రమోషన్‌తోపాటు ట్రాన్స్‌ఫర్ రావడంతో మేము ఈ మధ్యనే ఈ ఊరికొచ్చాం.

అమ్మ నా చిన్నప్పుడే చనిపోయింది. ఒక చెల్లి, తమ్ముడు, నాకు ఊహతెలిసేవరకూ నాన్నే మమ్మల్ని కంటికి రెప్పలా చూసుకున్నాడు. హైస్కూలుకొచ్చాక పెద్ద కూతురుగా ఆ బాధ్యతని నేను తీసుకున్నాను. మొన్నే బికాం ఫస్ట్‌క్లాసులో పాసై, పిజికి అప్లికేషన్ పెడదామనుకునేంతలో ఈ ట్రాన్స్‌ఫర్....! చెల్లి డిగ్రీ రెండో సంవత్సరం, తమ్ముడేమో ఇంటరూ. వాళ్ళిద్దరి చదువుల గురించే ఇబ్బందిప్పుడు.

ఇక్కడ్నుంచి రెండు బస్సులు మారి, రెండుగంటలు ప్రయాణం చేసి వెళ్ళాలి కాలేజీకి. వాళ్ళకోసమే నేనింత ప్రొద్దుటేలేచి వంట, క్యారేజీల పనిచూడ్డం.

ఓ రోజు పక్కింటి మామ్మగారు "అమ్మా... మధురిమా..." అంటూ వచ్చారు. పెద్ద పళ్లెంలో పులిహోర, పరమాన్నం, గారెలు, బూరెలు... అన్నీ నిండుగా పెట్టి తీసుకొచ్చి.

'ఏంటండీ విశేషం...' అంటే ' ఈ రోజు తమ పెళ్ళిరోజ'న్నారు.

"ఇది ఎన్నో పెళ్లిరోజు...?' అనడిగాను ఆవిడను కూర్చోమని కుర్చీ చూపిస్తూ.

"స్వాతంత్ర్యం వచ్చి ఎన్నేళ్ళో మా పెళ్లయ్యి అన్నేళ్ళే" అందావిడ నవ్వుతూ.

తర్వాత ఆవిడే అంది... "తెల్లదొరలనుంచి స్వాతంత్ర్యం వచ్చేవరకూ నిన్ను పెళ్ళి చేసుకునేది లేదు.... అని తాంబూలాలైన పెళ్ళిని నాలుగేళ్ళు వాయిదా వేశారు మీ తాతయ్యగారు" అంది సగం నవ్వుని దాచుకుంటూ. అందులోని సిగ్గు అస్పష్టంగా కనిపించింది. "ఆ నాలుగేళ్ళూ ఆయన నాకూ, వాళ్ల వాళ్ళకి దూరంగా... స్వాతంత్ర్య పోరాటం సల్పే ఇతర యువకుల రహస్య స్థావరాల్లోనే. ఎంత పట్టుదలనుకున్నావ్ మీ తాతయ్యగారిదీ...! ఇరువైపుల వాళ్లని ఒప్పించడం ఒకెత్తయితే నన్నొప్పించడం ఒకెత్తు అంటారిప్పటికీ..." మళ్లీ ఆవిడ బుగ్గల్లో సిగ్గులు.

ఆ రోజు నుంచి ఆవిడతో నా పరిచయం చూపులు, చిరునవ్వుల్ని దాటి మాటలవరకూ సాగింది. ఆవిడ పేరు అనంతలక్ష్మి. అందరూ అనంతా, అనంతమ్మగారు అంటారు. అనంతమ్మగారు మనసుల్ని చదవగల నేర్పరే కాదు మనసెరిగి నడుచుకునే ఇల్లాలూనూ. ఆవిడకి ముగ్గులంటే చాలా ఇష్టమట. 'ఈ రోజుల్లో ఆడపిల్లలకి ముగ్గులెయ్యడమే రాదు.....' అంటూ నేను వేసే ముగ్గుల్ని మెచ్చుకునేది.

నాకూ వచ్చేది కాదేమో... మా అమ్మ బతికుంటే.

మామ్మగారికి నే వేసిన ముగ్గుల్ని గమనించడం ఎలా అలవాటయ్యిందో అలాగే నాకూ ఆవిడ దినచర్యని పరిశీలించడం అలవాటయ్యింది. ఎనభై పైనే ఉంటుంది మామ్మగారి వయసు. ఆవిడ చేసే పనుల్లో... నిదానమే తప్ప నీరసం ఎప్పుడూ కనిపించేది కాదు.

ఉదయాన్నే లేచి ఇల్లూవాకిళ్ళూ శుభ్రం చెయ్యడం, అప్పుడప్పుడూ తాతగారికి (భర్తకి) నలుగుతో స్నానం చేయించడం, ఆనక భోజనాలయ్యాక దంపతులిద్దరూ విశ్రాంతిగా వరండాలో కూర్చోవడం. సాయంత్రవేళల్లో తోటపనీ, కాసిన ఫలాల్ని, పూసిన పువ్వుల్నీ... అందరికీ పంచడం, చల్లని రాత్రుల్లో ఆరుబయట అరుగుమీద ఆయనకి కాళ్ళు నొక్కుతూనో... విసనకర్రతో విసురుతూనో... ఇదీ ఆవిడ దినచర్య ఏ హడావుడీ, ఆడంబరం లేకుండా ఎంత ప్రశాంతంగా గడిచిపోతుందో ప్రతిరోజూ.

నేనిప్పటివరకూ చూడని ఓ పూలచెట్టుని మొన్న వాళ్లింటికెళ్ళినప్పుడు చూశాను. అవేం పూలని అడిగితే మధుమాలతీలని చెప్పింది మామ్మ. ఎంత బాగుందో వాటి వాసన.

ఒకరోజు మధ్యాహ్నం.... వస్తున్నట్టు ఫోనైనా చెయ్యకుండా మా మేనత్త పద్మ వచ్చింది.

సాయంత్రం నాన్న వచ్చేవరకూ నాతో అన్ని విషయాలూ మాట్లాడి, తన కూతురు సునయన గురించి చెప్పింది. విన్నాక సునయన మీద చాలా కోపమొచ్చింది నాకు. ఆడపిల్లై ఉండీ, ఇంత చదివీ ఇలా ప్రవర్తించిందా... అని ఆశ్చర్యమేసింది. ఈ విషయం గురించే నాన్నతో మాట్లాడదామని వచ్చిందేమో అనుకున్నా. తీరా నాన్న వచ్చాక తన కూతురి గురించి చెప్తూనే అసలు సంగతి బయటపెట్టింది పద్మత్త.

"నా కూతురేం చేసిందో చూశావుగా. వీళ్లు తల్లిలేని పిల్లలు. వీళ్ళ ఆలోచనలు తెలుసుకోవడానికి వదినా లేదు. అసలే రోజులు బాలేవు. నేను చెప్పిన సంబంధం అయితే నీ కూతురు సుఖపడుద్ది. చెయ్యొచ్చులే అని ఆలస్యంచేస్తే రేప్పొద్దున నీ కూతుర్లేంచేస్తారో...." వివరాలన్నీ చెప్పి ముక్తాయింపు నాలుగు ముక్కల్లో ముగించింది అత్తయ్య.

నాన్న ఆలోచనలో పడ్డారు.

ఇన్నాళ్ళూ మాలో ఎవరికీ లేని ఆలోచనలు... చివరికి నాక్కూడా....! నిజమే... నాన్న కూడా మమ్మల్ని 'ఇంకా ఏం చదివించాలి' అనే తప్ప ఎప్పుడూ మా పెళ్ళిళ్ల

గురించి మాట్లాడలేదు. కానీ అత్తయ్య అన్న చివరిమాటలే నన్ను అమితంగా బాధించాయి.

తన కూతురేదో చెయ్యరాని పనిచేస్తే తామూ అదే దారిలో అడుగేస్తామనడం ఏం న్యాయం.....!

అత్తయ్య వెళ్ళేరోజు... సునయన సెల్ నెంబరడిగితే, "దానితో మాట్లాడుగానీ దాని బుద్ధులు బుర్రకెక్కించుకోకే తల్లీ" అంటూ నెంబర్ చెప్పింది అత్తయ్య. అత్తయ్య వెళ్ళిన సాయంత్రమే సునాకి ఫోన్ చేశాను.

కుశల ప్రశ్నలయ్యాక "అత్తయ్య వచ్చింది నిన్న...." అన్నాను.

"అయితే మీకూ చెప్పేసిందన్న మాట..." అందది నిర్లిప్తంగా.

"ఏం చెప్పిందనుకుంటున్నావ్..." ఏమీ తెలీనట్టే అడిగాను.

"కొత్త విషయాలింకేమున్నాయ్ చెప్పడానికి, నేనిక్కడ ఎవరితోనో కలిసుంటున్నానన్నది తప్ప...." ఠకీమని చాలా మామూలుగా అంది సునయన.

'అది నిజమేనా' అని నోటి చివరిదాకా వచ్చిన ప్రశ్నని సునా దూకుడు చూసి బలవంతాన దిగమింగుకుని, "నాకో పెళ్లి సంబంధం తెచ్చింది" అని సంభాషణ అటువైపు మళ్లించాను.

"నాకైపోయినయ్. ఇక నీకు మొదలు పెట్టిందా...!" వ్యంగ్యంగా అంది.

ఏం మాట్లాడాలో అర్థంకాలేదు నాకు.

"చూడు మధూ. మా అమ్మగురించి నీకు తెలుసుగా. తను డబ్బునే చూస్తుంది తప్ప.... వాళ్ళెలాంటి వాళ్ళో పట్టించుకోదు. డబ్బుంటే చాలు, గొప్పవాళ్ళంటుంది. తను తెచ్చిన సంబంధం ఏదీ నువ్వు ఓకే అనకు. నాకూ ఎన్నో మాచెస్ చూసింది. అవేవీ నాకు నచ్చలేదు. నేను ఉదయ్ అనే అతన్ని ప్రేమించాను అని చెప్పాను. ఛస్తే ఒప్పుకోనంది. ఉన్న ఒక్క కూతురూ వెయ్యి కిలోమీటర్ల దూరంలో ఉద్యోగం చేస్తూ నెలనెలా సంపాదనని పంపిస్తోంది. దానికి నచ్చినది చేద్దాం అని ఉండాలా... వద్దా, ఇక్కడ నేను ఎలా ఉన్నానో ఏంటో అవసరంలేదు. ఆవిడ లోకమంతా డబ్బే మధురిమా. నేను ఉదయ్‌ని పెళ్ళి చేసుకోవడం ఇష్టంలేదు అమ్మకి. తనొప్పుకునే వరకూ ఆగాల్సిన అవసరం  నాకు లేదు. అలాగని అందర్నీ ఎదిరించి పెళ్ళి

చేసుకోవడమూ ఇష్టంలేదు. అందుకే బాగా ఆలోచించాకే మా పరిస్థితుల్నిబట్టి నేను, ఉదయ్ సహజీవనం చేస్తున్నాం. నా మాటలు నీకు తప్పుగా అనిపిస్తున్నా... నేను చేస్తోంది కరెక్టేనని నా మనసు చెప్తోంది. నా జీవితం నా ఇష్టం అవునా... కాదా... మధూ..."

సునా చెప్పింది విన్నాక నోట మాట రాలేదు నాకు. ఫోన్ పెట్టేశాక కూడా సునా ఆలోచనలు వీడలేదు నన్ను.

పెళ్ళి చేసుకోకుండా ఒక ఆడ, మగ కలిసి ఉండవచ్చా...!?

సునాతో మాట్లాడి వారంరోజులైనా అన్యమనస్కంగా ఉంటున్నానని నాకే అర్థం అవుతోంది. ఇక అనంతమామ్మ గ్రహించడంలో వింతేముంది. అక్షరాల్ని చదవగలగడం తప్ప మరే పెద్ద చదువులూ చదవని ఆవిడలో అంత జ్ఞానం అనుభవాలిచ్చిన సొత్తేమో....!

నే చెప్పిందంతా విన్నాక ఎప్పటిలానే చిరునవ్వు నవ్వి. "కలిసి ఉండడం తప్పేంకాదే" అంది. "ఒకవేళ తప్పనుకున్నా... తప్పుచేసింది ఎవరో అయితే నువ్వెందుకు చింతించడం...!" అంది సూటిగా.

'నిజమే కదా... నాకెందుకింత మథన....?' అనుకోకుండా ఉండలేకపోయాను విస్మయంగా

"సహజీవనం తప్పుకాదు మధురిమా. ఏ ప్రతిఫలమూ ఆశించకుండా ఒకరికొకరు తోడుగా బ్రతకాలనుకుంటే సహజీవనం తప్పుకాదు. అవసరం కోసమో, ప్రతిఫలం కోసమో కలిసే బంధం కలకాలం నిలవదు. ఆ లబ్ధి పొందేసినప్పుడు బంధంలోని అందం, అనుబంధమూ మాయమైపోయి, మళ్ళీ ఎవరి పాత బ్రతుకులు వారికి అందంగా ఆకర్షణీయంగా కనిపిస్తాయి"

"అంటే..."

"అంటే ఏముంది.... మొదటికలయికల్లోని ఆకర్షణ తగ్గాక పట్టి ఉంచే బంధం ఏదీ లేదు కాబట్టి ఎవరికివారే అని విడిపోతారు. వాళ్ళు కోల్పోయేది బంధాన్నే కాదు సున్నితత్వాన్ని కూడా. అదే మన సమాజం ఏర్పరిచిన పెళ్ళనే బంధంలో 'నేను' నుంచి 'మనం' అనే దగ్గరతనం ఉంటుంది. ఆ దగ్గరతనం వల్లే

ఒకరితప్పుల్ని ఒకరం అర్థం చేసుకుంటాం. మనసుకి బంధం ఉండాలి కాబట్టి పెళ్ళి తప్పనిసరి. కానీ ఆ పెళ్ళి బంధనం అవకూడదు"

అర్థమయ్యీ కానట్టుంటే అప్రయత్నంగానే తలూపాను. నాలోని సందేహాల్ని ఆవిడ విపులంగా చెప్పినా, అవునో కాదో తరచి చూసుకోవలసింది మాత్రం నేనే.

మామ్మ నాతో ఇంత ఎక్కువగా ఇన్ని విషయాలు మాట్లాడుతుంది. మరి ఎప్పుడు చూసినా తాతయ్యతో అసలు మాట్లాడినట్టే కనిపించదేంటీ....! ఇద్దరూ ఆ ఆరుగుమీద కూర్చుంటారు. అలా నిశ్శబ్ధంగా... అంతే వాళ్ళ భాష 'మౌనమే'మో....!

మేం ఇక్కడకొచ్చి అప్పుడే మూడేళ్ళయిపోయింది.

ఇక్కడికొచ్చాక అనంతమామ్మగార్నుంచి ఎన్నో నేర్చుకున్నాను. పుస్తకాల్లో వ్రాయని, తరగతి గదుల్లో చెప్పని ఎన్నెన్నో విషయాలు....! సమాజపు కట్టుబాట్లు, పద్ధతులు, మనిషిని అంచనావేసుకునే విధానం, నైతిక, మానవత్వ విలువలు... మరెన్నో

నాన్న స్నేహితుని ద్వారా కుదిరిన సంబంధం. ఈఏడే.... మొన్న శ్రావణంలో ప్రశాంత్‌తో పెళ్ళైంది నాకు. ఇల్లు చక్కబెట్టే బాధ్యతంతా చెల్లి తీసుకుంది.

ఇప్పుడు దీపావళి పండగని... 'ఆయన' పండుగ నాడు నాన్నా వాళ్ళింటికి వస్తానని చెప్పడంతో, నాన్న నాలుగు రోజుల ముందే నన్ను అత్తగారింటి నుంచి తీసుకొచ్చారు. రాగానే అనంతమ్మగారడిగారు 'కాపురం ఎలా ఉంద'ని. 'ప్రేమగా చూసుకునే భర్త. కలివిడిగా ఉండే అత్తగారు... అందమైన జీవితం....' చెప్పాను

ఎందుకో మామ్మలో ముదుసలితనం స్పష్టంగా కనిపిస్తోంది. వార్ధక్యంలో.... ఇలాగే ఉంటుందా....!

సునాకి పెళ్ళి సంబంధాలు చూస్తున్నారట. తను, ఉదయ్ విడిపోయి సంవత్సరమైందని చెల్లి చెప్పింది. సునాకి ఫోన్ చేసి మాట్లాడాను. తన మాటల్లో ఏ మార్పూ లేదు. అదే స్థిరత్వం.

"కారణాలు ఏవైనా అంత న్యారోమైండెడ్ మెంటాల్టీ ఉన్న వాడితో నేను కలిసుండలేను. ఇక పెళ్ళంటావా... మగవాళ్ళు ఎన్ని పెళ్ళిళ్ళైనా చేసుకోవట్లేదా...

ఎంతమందితో నైనా తిరగట్లేదా....? ఆడవాళ్ళకేం తక్కువ...? ఉద్యోగాలు చేసి, ఇంటా బయటా పనులు చెయ్యగలవాళ్ళం. మనమెందుకు తగ్గుండాలి...?" తన మాటల్లో కొత్తగా వచ్చిన ఆవేశం. అందులో సున్నితత్వం లేకపోవడం స్పష్టంగా కన్పించింది నాకు... అచ్చం మామ్మ చెప్పినట్టే.

ఆ సాయంత్రం... అనంతమ్మగారింటి వరండాలో మధుమాలతీల్ని మాలకడుతూ... అడిగాను "పెనవేసుకున్న బంధం ఎప్పటికైనా విడిపోవల్సిందేనా ....?" అని

నా కళ్ళ లోతుల్లోకి చూసింది మామ్మ. ఆ చూపుల్లో మాలతీల వాసనలంత గాఢత....!

మళ్లీ అడిగాను. "భౌతికసుఖం కోసమో, మానసిక అవసరం కోసమో... కలిసుండే జంటలు కారణం కనుమరుగవ్వగానే విడిపోతున్నారు. భౌతికంగా దూరమవలేని కొందరు కలిసుంటున్నా దానికీ మరేదో కారణం... తాళి బంధమో, పేగుబంధమో...! అంటే కలిసుండే రెండు జీవితాలు ఎప్పటికైనా భౌతికంగానో, మానసికంగానో ఒంటరిగా బతకాల్సిందేనా...."

ఎప్పట్లానే మామ్మ చిరునవ్వు నవ్వింది. సమాధానమే చెప్పకుండా పువ్వులు మాలకట్టడం అయిపోవస్తున్నా మౌనంగానే ఉందామె.

చివరిముడి అయ్యాక నోటితో దారాన్ని తెంచుతుంటే... "కొన్నిటికి సమాధానాలు మనం అనుభూతించి నేర్చుకోవాలి. మరికొన్నిటికి ఎదుటివాళ్ళ అనుభవాల్నించి తెలుసుకోవాలి. ఇంకొన్ని ప్రశ్నలకి జవాబుని శోధించి కనుక్కోవాలే మనవరాలా" అంది మామ్మ నా ప్రశ్నకి జవాబివ్వకుండా.

"నీకోసం... మొన్న తొలకరుల్లో మధుమాలతీ తీగ అంటు తొక్కించాను. వేర్లొచ్చాక మీ తాతయ్య తీసి అదుగో ఆ కుండీలో వేశారు. ఇంటికి వెళ్ళేప్పుడు తీసుకెళ్దువుగాని" మురిపెంగా మాలతీలతవంక చూపిస్తూ చెప్పింది. అంతలోనే నేనేదో అనే లోపు బజారుకెళ్ళిన తాతయ్య లోనకొస్తుండడంతో ఎదురెళ్ళింది. ఈ వయసులోనూ వాళ్ళ అనురాగం అబ్బురంగా అనిపిస్తుంటే వారిని చూస్తుండిపోయాను. నాకూ 'అనంతమ్మగారి లాంటి అమ్మో... మామ్మో... ఉంటే..." అనిపించింది మొదటిసారిగా.

పొద్దుపూవు తొలివెలుగురేఖల్ని విడువక మునుపే గట్టిగట్టిగా వినిపిస్తున్న మాటలకీ అధాటున లేచి కూర్చున్నాను. "అక్కా త్వరగా రా...." అంది చెల్లి నా మంచం దగ్గరకొస్తూ.

కలత నిదురతో బరువెక్కిన కనురెప్పల్ని బలవంతంగా విడదీసి... "ఏం.." అంటూ మంచం దిగాను.

"త్వరగా రా..." చెప్తూనే కంగారుగా ముందుకు నడిచింది.

నిద్రమొహంతోటే దానివెనక మామ్మోళ్లింటికి వెళ్ళాను. ఎదురుగా గుంపుగా కొందరు.... నాన్నా అక్కడే ఉన్నారు.

మామ్మ. మామ్మకేమన్నా...! ఊహించలేక పోయానిక.

మనుషుల్ని తప్పుకుని వెళ్ళేసరికి అక్కడ వరండాలో....

తాతయ్య శరీరం... నేలమీద పడుకోబెట్టి....! ప్రక్కనే మామ్మ... తాతయ్య వంకే అపనమ్మకంగా చూస్తూ...."

తాతయ్య నిర్జీవంగా... మామ్మ జీవశ్చవంలా...

గుండె పట్టేసినట్లే కళ్లవెంట గిర్రున నీరు తిరిగింది.

మామ్మని ఏమని ఓదార్చాలి...? మాటలురాక తాతయ్య కాళ్ళదగ్గర కూలబడ్డాను. ఒక్కసారిగా ఉబికింది వెల్లువైన దుఃఖం. నాకే ఇలా ఉంటే... మరి మామ్మకి..? నన్ను నేను తమాయించుకుంటూ... మామ్మవైపు చూశాను.

ఆమె ఈ లోకంలో ఉన్నట్లు లేదు... నేను రావడమూ తెలీనట్టే ఉంది. ఈ ప్రపంచంలో తాతయ్య ముఖం తప్ప మరేమీ లేనట్టుగ తాతయ్య ముఖంలోకే చూస్తోంది.

నా భుజం తట్టిలేపారు నాన్న. మామ్మావాళ్ళ పిల్లలకి ఫోన్లు చేస్తే 'దేశం కాని దేశంలో ఉన్నాం. రావడానికి ఇప్పుడప్పుడే అవదని' చాలా నిర్లిప్తంగా చెప్పడంతో నాన్నే జరగవలసినదంతా దగ్గరుండి చేశారు.

ఆ రాత్రి మామ్మకి తోడుండమన్నారు నన్ను. కానీ మామ్మకి నేను

ప్రక్కనున్నానన్న స్పృహే లేదు. ఏదన్నా మాట్లాడబోయినా నా కళ్ళలోకి చూస్తూ అలా ఉండిపోతోంది.

మర్నాడు తెల్లవారుఝామునే లేచి చూస్తే ప్రక్కన మామ్మ లేదు. నిశ్శబ్దాన్ని చీల్చుతూ నా పిలుపు. కంగారుగా మూడుగదులూ తిరిగి చూశాను. నా పిలుపు అరుపైంది అప్పటికే. వరండాలోకొచ్చిచూస్తే....

అక్కడ.... ఎప్పుడూ తాతయ్య, మామ్మ కూర్చునే అరుగు మీద పడుకుని మామ్మ....!

ఎందుకో... ఇంకా చీకట్లు ముసిరే ఉన్న ఆ నిశ్శబ్దంలో ఏదోభయం....!

"మామ్మా....." గట్టిగా పిలుస్తూ మామ్మని కుదిపాను.

అచేతనంగా వాలిన మామ్మ మేనంతా మంచుబిందువుల తడి చల్లగా....! "మామ్మ....." బిగ్గరగా రోదిస్తున్న నాలో.... ఆత్మీయబంధం దూరమైందన్న వేదన...

ఎంత సేపైందో... నా భుజాలమీద బలమైన చేతులపట్టు... తలతిప్పి చూస్తే....

ప్రశాంత్... "మౌనం'తోనే నన్నోదార్చుతూ....!!

మామ్మ (చెప్పని), వెతుక్కోమని చెప్పిన సహజీవనానికి అర్థం... ఏ మూలో లీలగా తెలుస్తున్నట్టుగా...

# ‘ఉన్నాను! నేనున్నాను’

–గురజాడ శోభాపేరిందేవి

**రో**జూ లాగే ఆ రోజూ తెల్లారింది.

పక్షులు ప్రజల్ని కువకువల్తో నిద్రలేపాయి.

నిద్రిస్తున్న సిమెంటు రోడ్డుని మేల్కొలుపుతూ వాహనాలు సాగనారంభించాయి.

అలవాటుగా చీకటిలోనే నిద్రలేచిన మందాకిని గబగబా కాలకృత్యాలు తీర్చుకుని పనిలో పడింది.

అలా ఆమె రాత్రి పది దాకా ఏదో ఒకటి చేస్తూనే ఉంటుంది.

ఆమెకి పనిమనిషి లేదు. పని మనష్యులు శ్రద్ధగా, ఓపికగా చేయరని ఆమె ఉద్దేశ్యం.

అదీకాక తన ఇంటి పనంతా తానే చేయడంలో గల తృప్తి వేరే వారితో చేయిస్తే ఉంటుందా?

పాల బూతు నుండి పాలు తేవడం కూడా ఆమె చేస్తుంది. చాకలి పని బట్టలు ఇస్త్రీ పని కూడా తానే చేసుకునే మందాకిని అలసటగా రాత్రి పక్క మీదికి చేరుకుంటుంది.

ఆ అలుపు వెనక ఎంత ఆనందం ఉంటుందో ఆమెకి తెలుసు!

ఇది తన ఇల్లు!

వీళ్ళు తన స్వంత మనుషులు!

అలాంటప్పుడు ఈ ఇంటికీ, ఈ ఇంట్లోని మనుష్యులకీ చాకిరీ చేయక ఎవరికి చేస్తుంది?

ఇంటిని ఆమె దగ్గరుండి తన అభిరుచికి అనుగుణంగా కట్టించుకుంది. డబ్బివ్వడం మాత్రమే భర్త వంతు! అందుకే ఆ ఇల్లన్నా, ఇంట్లో అందంగా అమర్చుకున్న వస్తువులన్నా ఆమెకి వల్లమాలిన అభిమానం.

మందాకిని ఎక్కడికి వెళ్ళదు! భర్తనీ ముగ్గురు పిల్లల్నీ వెళ్ళనివ్వదు, ఆఫీసునుండి భర్త. స్కూల్ నుండి పిల్లలు నేరుగా ఇంటికే రావాలి. ఏ పరిస్థితిలోనైనా అలా జరగకపోతే మందాకిని అపర కాళి అవుతుంది. ఎక్కడికి వెళ్ళినా కుటుంబం మొత్తం వెళ్ళాలి.

నిజం చెప్పాలంటే అదీ ఆమెకి ఇష్టం ఉండదు. అందరూ వెళ్తే ఇంటికి తాళం పెట్టాలి. అది ఏమాత్రం మంచిదికాదు.

ఆమెని బంధువులు పరిహసిస్తారు.

స్నేహితురాళ్ళు ముఖంమీదే నవ్వేస్తారు.

'నీలాంటి ఆడది అరుదు' అంటారు. 'ఆడవాళ్ళు ఇలా ఉండడం వల్లే మగవాళ్ళ ఆటలింకా సాగుతున్నాయని' ఒకరంటే 'నువ్వు బావిలో కప్పవి' అని ఇంకొకరంటారు.

ఎవరు ఏమనుకున్నా మందాకిని మందస్మిత వదనంలో మార్పుండదు. ఆ మధ్య అనుకోని అవాంతరం టెలిగ్రాం రూపంలో వారింట పాదం మోపింది.

మందాకిని చిన్నన్న కూతురు 'కువలయ'కి పెళ్ళయి ఆరు నెలలు అయింది. ఆ పెళ్ళికి వెళ్లక తప్పలేదు మందాకిని కుటుంబానికి.

కానీ పాపం కొత్త పెళ్ళి కూతురిగా ఇప్పటికీ పిలవబడుతున్న కువలయ పసుపు కుంకుమలు కోల్పోయింది. ఆ అన్యాయం గురించి తెలుపుతూ రమ్మని టెలిగ్రాం ఇచ్చాడు ఆమె చిన్నన్న.

మందాకినికి సుతారమూ వెళ్ళాలనిపించలేదు. అలాగని చిన్నన్న మీద, ఆయన ఏకైక కూతురు మీద అభిమానం లేకపోలేదు.

ఇంటినీ, ఇంట్లోని వ్యక్తులనీ వదిలి వెళ్ళాలని లేక మందాకిని ప్రయాణం మానుకుంది.

తాను లేకపోతే ఎలాగా? ఇల్లు గడవదు. అసలు తను లేకపోతే ఇల్లే లేదు. తను ఊరికి ఏడాదికి రెండు మూడుసార్లు వెడితే తన సంసారం ఎలా నడుస్తుంది.

ఆ మధ్య ఎప్పుడో తనకి జ్వరం వచ్చింది. అప్పుడు తన ఇల్లెలా ఉందో తనకంటే ఎవరికి తెలుస్తుంది?

ఇంట్లో ఎవరికీ చెయ్యీ కాలూ ఆడలేదు. ఆమెకి ఏ విధంగా సాయపడాలో ఎవరికీ అర్థం కాలేదు. తడబడిపోతూ ఎన్నో తప్పులు చేసేశారు.

అంత జ్వరంలోనూ నవ్వుకుంది మందాకిని! ఆమెకి చాలా గర్వంగా అనిపించింది.

తానెంత అదృష్టవంతురాలు! తను లేకపోయినా, అనారోగ్యంతో ఉన్నా ఇంట్లో నిశ్శబ్దం రాజ్యమేలుతూంది. పొయ్యిలో పిల్లిపడుకుంటూంది. కుదురు కుంపటి కూకటి వేళ్ళతో సహా పెకలించుకుపోయాయి.

పిల్లల ముఖంలో కళాకాంతి లేవు. వంట గదిని అల్లకల్లోలం చేసేసి ఏదో ఇంత ఉడకేసిన భర్త ఉసురుమంటూ కూలబడిపోయాడు.

తను లేకపోతే తన ఇల్లు లేదు! ఉండదు. ఎంత హాయైన ఆలోచన!

ఆ రోజు ఆదివారం కావడంతో అందరికీ ఇష్టమైన వంటకాలతో వంట పూర్తి చేసింది మందాకిని.

దొడ్లోకి వెళ్ళి ఆకుపచ్చటి అరటి ఆకుని ఏరి కోసుకుని తెచ్చింది. దాన్ని శుభ్రంగా కడిగి తాను వండిన వంటకాలన్నీ కొద్దికొద్దిగా వడ్డించింది.

ఎర్రటి జరీ చీర కట్టుకుంది. జారుముడి వేసుకుంది. ఎర్రటి కుంకుమని దిద్దుకుంది. ఎర్ర గులాబీని తురుముకుంది. దేముడి పూజ చేసి నైవేద్యం పెట్టింది.

అంతే! కుప్పలా కూలిపోయింది.

ఏం జరిగిందో అర్థం కావడానికి ఇంట్లో వారికి చాలా కాలమే పట్టింది. ప్రథమ చికిత్స ఫలించలేదు.

డాక్టర్ వచ్చాడు. కాని చూడగానే పెదవి విరిచేశాడు.

ఆమె ప్రాణాలంత త్వరగా (అదీ ఏ అనారోగ్యం లేకుండా) ఎలా అనంతవాయువుల్లో కలిసిపోయాయో ఎవరికీ అర్థం కాలేదు. నమ్మబుద్ధి కావడం లేదు కూడా.

"అమ్మేమిటి నాన్నా అన్నం పెట్టకుండానే నిద్రపోతోంది?" అని చిన్నది అడిగింది.

"అమ్మా ఆకలేస్తోంది అన్నం పెట్టు" అని కుదిపి కుదిపి ఆమెని లేపే ప్రయత్నం చేస్తున్నాడు కొడుకు.

పెద్దది మాత్రం అర్థమయ్యీ కానట్టూ చూస్తూ అవాక్కైనట్లుగా నిలబడిపోయింది.

ఆమె ఆత్మ ఆకాశ మార్గం వైపుకు మరలింది. కానీ ఎంత కష్టపడ్డా దానికి మళ్ళీ తిరిగి రావాలనే ఉంది కానీ పైకి పోవాలని లేదు.

ఎలా ముందుకు సాగగలదు?

ఆమె కలలు, కోర్కెలు, ఆశలు, ఆశయాలు అన్నీ ఆ ఇంటినే అంటిపెట్టుకుని ఉన్నాయి. ఎన్నో ఏళ్ల అనుబంధం అంత త్వరగా ఎలా తెంచుకుపోగలదు?

ఆమెని చూడవచ్చిన వారంతా ఆమెని వేనోళ్ల పొగుడుతున్నారు. కాళ్లకీ దండం పెడుతున్నారు.

అవునుమరి, ఆమె ముత్తైదువగా మరణించింది.

"ఎంత అదృష్టం చేసుకుందో మందాకిని ఇంత మంచి చావు లభించింది" అంటున్నారు.

అయ్యో నేను అదృష్టవంతురాలిని కానండి. నిజంగా అదృష్టవంతురాలినే అయితే నేను నిర్మించుకున్న సౌధంలో నా వారి మధ్య ఉండక ఇలాజరిగేనా? ఇదంతా నా దురదృష్టం" మందాకిని ఆత్మ బాధగా గొణుక్కుంది.

"అవునూ తనంటే ఇంతమందికి గౌరవం ఉందా? ఇలా విలవిలలాడుతూ వచ్చేస్తున్నారు" అనికూడా ఆశ్చర్యపోయింది.

"అయ్యొయ్యో చిన్నాడి ముఖంలో ఎంత ఆకలో, నా గురించి దుఃఖంతో ఉండడం వలన పెద్ద వాళ్ళెవరూ వాడిని పట్టించుకోవడం లేదు"

"నా భర్త ముఖంలో ఎంత దైన్యం ఉందో పాపం నా కోసం ఎంత బాధని అనుభవిస్తున్నారో!"

ఒకే ఒక్కసారి తాను తన శరీరంలోకి ప్రవేశించ గలిగితే ఎంత బాగుండును!

భర్తని ఓదార్చవచ్చు పిల్లల కోసం చేసిన వంటలను తినిపించి రావచ్చు.

మందాకిని ఆత్మ ఎంత ప్రయత్నించినా శరీరంలోకి ప్రవేశించలేకపోయింది.

పోనీ మావార్ని పిలుస్తాను అనుకుంది. పిలిచింది. అలా పిలుస్తూనే ఉంది.

ఎన్నిసార్లు పిలిచినా పలకరేం? తన పిలుపు ఆయన దాకా చేరడం లేదా?

మందాకిని దుఃఖిస్తోంది.

ఆమె బంధువర్గమూ దుఃఖిస్తోంది.

ఏడుస్తున్న తన కన్నతల్లిని చూడగానే మందాకిని ఆత్మ మరింత రోదించసాగింది.

"అమ్మా! ఏడవకమ్మా! నేనెక్కడోలేను. నీ పక్కనే ఉన్నాను. నీ భుజంమీద నిమురుతున్నాను, చూడు! చూడమ్మా" మందాకిని ఆత్మ తల్లిని ఓదార్చాలని శాయశక్తులా ప్రయత్నిస్తోంది, కాని ఫలితం లేదు.

మందాకిని భౌతికదేహాన్ని లేపారు, తీసుకుపోయారు.

'వద్దు వద్దు' అని ఆమె ఆత్మ అరచిన అరుపులు ఎవరికీ చేరలేదు.

వద్దు నా అందమైన శరీరాన్ని కాల్చేయవద్దు అని ఆమె ఆత్మ ఎంతగా ఘోషిస్తున్నా వినకుండా శరీరానికి దహనసంస్కారం జరిగిపోయింది.

ఆ రాత్రి మందాకిని ఆత్మ కుమిలి కుమిలి ఏడ్చింది తనవారు తన కోసం ఏడ్చిన దానికంటే ఎక్కువగా.

కానీ ఆ ఏడుపు ఎవరినీ సమీపిస్తుంది? ఎవరిని ఓదార్చగలుగుతుంది?

ఎక్కడెక్కడి బంధువులో మందాకిని ఇంటికి వచ్చారు.

ఆమె మరణం గురించి అప్పుడప్పుడు ప్రస్తావించినా, మిగిలిన వేళల్లో అనవసర ప్రసంగాలు చేస్తున్నారు.

ఒక్కరూ ఊరికే ఉండడంలేదు. గొప్పలు చెప్పుకుంటున్నారు. పక్క వారిని వెక్కిరిస్తూ మాట్లాడుకుంటున్నారు. మధ్య మధ్యలో మందాకిని ప్రసక్తి వచ్చినా ఆమెలోని లోపాలను గురించే మాట్లాడుతున్నారు.

నిన్నపోయిన మనిషిని గురించి రేపు పోయే మనుషులు నేడు మాట్లాడుకుంటున్న తీరు ఇది.

"పోయిన వాళ్ళు దైవ సమానులని అంటారు. కానీ వ్యక్తిగా మందాకిని ఏమంత మంచిదో మీరే ఆలోచించండి."

"ఆమెకి తన భర్త హోదాని చూసి అమిత టెక్కు ఆ డబ్బుతోనేగా ఇంత ఇంద్ర భవనం లాంటి ఇల్లు నిర్మించుకుంది.

"ఏం లాభంలే. అనుభవించే గీత లేకుండా చేశాడు దేముడు."

"అందుకే అన్నారు దేని మీదా అతిగా వ్యామోహం పెంచుకోకూడదని"

ఈ విధంగా మాట్లాడుకునేవారు కొందరైతే, వంట గదిలోకి చేరి తమకి ఇష్టమైన వంట కాలను వంట మనిషికి వివరించి వాటిని వండమనే వారు ఇంకొందరు.

పగలూ రాత్రిళ్ళూ కమ్మటి భోజనాలు, మధ్య అల్పాహారాలు, కాఫీలు, టీలు , డ్రింకులూ, మజ్జిగలు, ఇంటిముందర షామియానా, ఇల్లంతా బిలబిలలాడుతూ తిరిగే మనుషులు, వాళ్ళు వేసే జోకులవలన, నవ్వులతో నిండిపోతున్న ఇల్లు ఇదంతా ఇంటికిగల చావు కళని చెరిపేసి పెళ్ళి కళని తెచ్చిపెట్టింది.

ముంగిట్లో మామిడాకులు ఒక్కటే తక్కువ.

మందాకిని ఆత్మ ఇదంతా చూసి మొర్రోమంది.

ఎందుకర్రా మీరంతా ఇటు వచ్చింది? దుఃఖం పంచుకోడానికా లేక సరదాగా కాలక్షేపం చేసి పోడానికా?"

"అయ్యో! ఆయనసలు సరిగ్గా స్నానమే చేయడం లేదు. గడ్డం గీస్కోడం మానేశారు అవును మరి తానేగా అన్నీ గుర్తుచేసి చేయించేది ఇప్పుడలా చేయించేందు కెవరున్నారు? పిల్లలు సరేసరి! పిచ్చివాళ్ళలా తయారై తిరుగుతున్నారు. వాళ్ళ ఆలనా, పాలనా చూసేదెవరు? తానున్నప్పుడు దొరసాని పిల్లల్లా తయారయ్యేవారు. అలాగే ప్రవర్తించేవారు.

అయ్యయ్యో అదేమిటి? ఇంట్లోని వస్తువులన్నీ ఈడ్చేస్తున్నారు.

మొజాయిక్ ఫ్లోరింగ్ మీద గీతలు పడవూ? నున్నటి గోడల మీద, బొట్టు, కాటుక, గోళ్ల రంగులు పులమడానికి వీళ్ళకి మనసెలా ఒప్పిందో.

ఒక్కసారి ఒకే ఒక్కసారి తను తన ఇంటిని పాడుచేస్తున్న వారికి వినిపించేలా గట్టిగా అరిచి వారు చేస్తున్న పనులను ఆపేయమని చెప్పగలిగే స్థితిలో ఉంటే ఎంత బాగుంటుంది.

పిల్లలు తోటి బంధుమిత్రుల పిల్లలతో ఆడుతూ, పాడుతూ తనని త్వరగానే మరచిపోయినట్లున్నారు.

కానీ పాపం ఆయనే తన మీద ఎంత బెంగపెట్టుకున్నారో.

ఎలా ఆయనకి చెప్పేది నేనున్నానని ఆయన ఎటు వెడితే అటు వెడుతున్నానని, ఎన్ని విధాల ప్రయత్నించినా తానున్నానన్న వార్త భర్తకి తెలిసేలాగ చెప్పలేకపోయింది మందాకిని ఆత్మ.

అయ్యో! అప్పుడే తాను మరణించి పన్నెండు రోజులా?

ఛా! తాను మరణించడమేమిటి? వీళ్ల మాటలు వినీ వినీ తన మతి తప్పిపోతోంది.

ఇవాళ తన పేరిట దానధర్మాలన్నీ ఘనంగా జరిగాయి.

తన భర్త సరిగ్గా లేడు. పిల్లలా మరీ చిన్న వాళ్ళు! అందుకేనేమో వంటావిడ ఎన్ని దినుసులు ఎత్తుకుపోతుందో?

ఈ సమయంలో అవసరానికి పనిలో చేరిన వాళ్ళు ఎన్నెన్ని వస్తువులని దొడ్డి దారమ్మట తీసుకుపోతున్నారో!

వాళ్ళని పట్టించుకునేదెవరు?

ఇవాళ పదమూడో రోజుట ఎవ్వరూ ఇంట్లో ఉండకూడదట.

అందుకే ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది. పిల్లలేదో తిన్నామనిపించి వీధిలో ఆడుకుంటున్నారు.

తన భర్త మాత్రం తలుపేసుకుని మంచం మీద వాలిపోయి కుమిలి కుమిలి ఏడవడం గమనించింది మందాకిని ఆత్మ.

"ఏడవకండి నేనెక్కడికీ పోలేదు. మీతోనే ఉన్నాను" అని ఎంతో సేపటిదాకా చెబుతూనే ఉంది.

రాత్రిళ్ళూ, పగళ్ళూ ఏ మార్పులేకుండా ఒక దాని తర్వాతొకటిగా నడిచిపోతున్నాయి.

రోజూ ఎవరో ఒకరు వచ్చి మందాకిని భర్తకి సానుభూతి చూపి వెడుతున్నారు.

మాటకి ముందు 'మరణించిన మందాకినితో మనమూ మరణించలేం కదా అందుకే మరచిపోయే ప్రయత్నం చేయాలి' అంటున్నారు.

'అయ్యో! నేను మరణించలేదు. బ్రతికే ఉన్నాను. ఎటొచ్చీ నన్ను మీరే గమనించడం లేదు' అని తనకి సాధ్యమైన రీతిలో చెబుతూనే ఉంది మందాకిని ఆత్మ. చెప్పి విఫలమవుతూ ఉంది.

నెల గడిచాక మాసికం పెట్టాడు మందాకిని భర్త.

ఆవురావురుమంటూ వచ్చింది అక్కడే తిరుగుతున్న మందాకిని ఆత్మ. వండినవాటిని చూసేసరికి ఉత్సాహం ఊదేసినట్లైంది.

ఆత్మలకి ఆకలిదప్పులొక్కటే కాదు రుచులు కూడా ఉంటాయని వీళ్ళు ఎరగరా? ఎప్పుడూ గారెలూ, అప్పాలు, ఓ ఆక్కూర, కాయగూర, చప్పటి చారు మాత్రమే చేస్తారేం?

తనకి ఏ వంటకాలంటే ఇష్టమో తెలిసికూడా తన భర్త ఇలా చేయించడం భావ్యంగా తోచలేదు మందాకిని ఆత్మకి!

ఈ మనుషులనేనా నా వాళ్ళు నా స్వంతం అనుకుంటూ పగలూ రాత్రీ ఊడిగం చేసింది అనుకోసాగింది.

ఆమె కోపంతో భగభగలాడిపోసాగింది. కానీ ఎవరినీ ఏమీచేయలేదు కనుక కుమిలి కుమిలి ఏడ్చింది.

తన బావగారు తన భర్తతో అన్న మాట విని హతాశురాలైంది. "నువ్వు పెళ్ళి చేసుకుంటే మంచిదని నా ఉద్దేశ్యంరా నీకేమంత వయసు ముదిరిపోయిందని ఇలా జీవించాలి. నీ కోసం కాకపోయినా నీ పిల్లలకోసమైనా చేసుకుని తీరాలి. నువ్వు ఊ అను నా ప్రయత్నం చేస్తాను"

మందాకిని ఆత్మ భర్త జవాబు వినాలని ప్రయత్నించలేదు. ఆమె ఊహించుకోగలదు. అతని మనసు స్థితిని ఇప్పుడు అతనేమీ జవాబు చెప్పడు. కానీ

ఆలోచిస్తాడు. ఆ ఆలోచన అతి త్వరలో మరో ఆలిపేర ఆ ఇంట కాలుమోపుతుంది. ఆపైన ఆపైన ఇంక ఆలోచించదలచలేదు. మందాకిని ఆత్మ. ఆలోచించినకొద్దీ ఏవో అడ్డంకులు బంధనాల పేరిట వచ్చేసి తననిక్కడ కట్టిపారేయడం తప్ప మరొకటి జరగదు.

మందాకిని ఆత్మ నిట్టూర్చింది నీరసంగా విలపించింది.

ఆమె ఆత్మ శాంతిని కోల్పోయింది.

తన ఉనికిని పూర్తిగా విస్మరిస్తున్న తన అవసరాలనుండి దూరంగా సుదూరంగా మిగిలిపోయింది.

# గతంలో జీవించకు నేస్తం!

**–అంగులూరి అంజనీదేవి**

**కా**లేజ్ కాంపస్ దాటిరోడ్డుమీది కొచ్చాక కామర్స్ లెక్చరర్ వేదప్రియతో మాట్లాడుతూ చాలా దూరం నడిచాడు ఎకనామిక్స్ లెక్చరర్ మన్యు.

మాటల మధ్యలో కొన్ని రోజులుగా తన గుండెలో దాచుకున్న కోరికను నెమ్మదిగా అతని చెవిన వేసింది. ఆమె అభిప్రాయాన్ని విని విస్తుపోలేదు. నీరెండలో వింత కాంతితో, ఏదో ఆశతో ఆమె మోము మెరిసిపోవటం గమనించి, తలపంకించాడు.

ఆమె టైమ్ కోసం చేతివైపు చూసుకుంటుండగా ఆమె దగ్గర సెలవు తీసుకున్నాడు మన్యు.

ఇంటికొచ్చాక స్నానం చేసి, ఫ్యాను కింద కూర్చుంటే హాయిగా అనిపించింది మన్యుకి అలా ఎంతసేపని కూర్చోగలడు? నిముషాలు దొర్లుతుంటే – ఒంటరితనాన్ని ఇష్టపడని మనసు అసహనంగా మూలిగింది. ఒంటరిగా ఉన్నానన్న ఫీలింగ్ రానంత వరకూ ఫరవాలేదు కాని, నిశ్శబ్దాన్ని భరిస్తూ – ఏదో వెలితితో పెట్రేగిపోతూ – విసుగ్గా గింజుకుంటే మాత్రం ఒంటరితనమనేది నిజంగా శాపమే?

డ్రెస్ వేసుకుని, ఇంటికి తాళం వేసి, బయటకు నడిచాడు మన్యు. హోటల్లో కాఫీ తాగాడు మౌని దగ్గరి కెళ్ళాలనుకుంటూనే – బుక్‌స్టాల్ దగ్గర చాలాసేపు కూర్చున్నాడు.

టైమ్ చూశాడు. ఎనిమిది గంటలు కావస్తూంది. హోటల్‌కి వెళ్ళి భోంచేసి – మౌని ఇంటికి బయలుదేరాడు మన్యు.

మన్యు పని చేస్తున్న కాలేజీకి ఈ మధ్యనే ట్రాన్స్‌ఫర్ అయి వచ్చాడు మౌని. ఆ ఊళ్ళో అద్దె ఇల్లు దొరకటం కష్టమనిపించింది మౌనికి. మన్యును వెంటపెట్టుకుని టులెట్ బోర్డు కోసం వెతికి వేసారి, ఓ ఇల్లు దొరికిందనిపించుకొని, ఒక నెల

అడ్వాన్స్‌గా ఇచ్చి. హాయిగా నిట్టూర్చాడు మౌని. అద్దె ఇళ్ల వేటలో వాళ్ళిద్దరూ బాగా దగ్గరై – మంచి స్నేహితుల్లా మారిపోయారు. వాళ్లు మాటల్లోకి దిగారంటే సమయం, సందర్భం మరచిపోయి, దేశ రాజకీయాల దగ్గర నుంచి కాలేజీ రాజకీయాల వరకు, క్రికెట్ మాచ్ దగ్గర నుంచి ఆసియా గేమ్స్ వరకు అలిసిపోయి, విసుగొచ్చేంతవరకు విడిపోకుండా మాట్లాడుకుంటారు.

గేటు తీసి, లోపలకెళ్ళి బెల్ నొక్కాడు మన్యు.

పనిపిల్లాడు వచ్చి తలుపు తీశాడు.

ఒకసారి మాటల మధ్యలో – వాళ్ల స్వగ్రామం నుండి పనికుర్రాడ్ని తెచ్చుకున్నట్లు చెప్పాడు మౌని. బహుశా వీడేనేమో అనకుంటూ –"మౌని సార్ లేరా;" పిల్లాడిని ప్రశ్నించాడు మన్యు.

ఉన్నారన్నట్లుగా తల ఊపి, గదివైపు చేయి చూపి, నిశ్శబ్దంగా అక్కడి నుంచి వెళ్ళిపోయాడు పిల్లాడు.

గదిని సమీపించి – డోర్ కర్టెన్ తీసి చనువుగా లోపలికి అడుగు వేశాడు మన్యు ఆశ్చర్యపోతూ అక్కడే ఆగిపోయాడు.

అలికిడికి – గుమ్మంవైపు దృష్టి సారించిన మౌని.... చిరునవ్వు నవ్వుతూ "హాల్లో... మన్యూ.... రండి, రండి" అంటూ ఆహ్వానిస్తూ – "ఇలా కూర్చోండి. జస్ట్ వన్‌మినిట్!" అంటూ తన పని తాను చేసుకుపోతున్నాడు.

"ఫరవాలేదు? మీ పని పూర్తి చేయండి" అంటూ కుర్చీలో కూర్చుని – చుట్టూ కలియజూశాడు మన్యు.

మౌని మంచి కార్టూనిస్ట్. దాదాపు అన్ని పత్రికల్లోను అతని కార్టూన్స్ వస్తుంటాయి. ఆ కార్టూన్స్‌ను చూసిన వాళ్లెంత సీరియస్ మనుష్యులైనా పొట్ట చెక్కలయ్యేట్లు నవ్వందే స్థిమితపడలేరు. ఈ విషయంలో మౌనిని చాలాసార్లు అభినందించాడు మన్యు.

మౌని కార్టూనిస్టే కాక చిత్రకారుడని కూడా ఇప్పుడే తెలుసుకుంటున్నాడు. ఆ గదిలో ఉండే చిత్రాలను చూస్తుంటే – ఇది కొన్ని రోజుల్లో నేర్చింది కాదనిపిస్తోంది.

తనతో ఎప్పుడూ చెప్పనేలేదు. మౌని దృష్టిలో తను అనుకున్నంత గొప్ప కాదేమో ఈ కళ! అందుకే తనతో చెప్పలేదు. మౌనిలోని చిత్రకళానైపుణం లోకానికి తెలియకపోయినా ఆ పెయింటింగ్స్ చూస్తుంటే కొన్ని ఏళ్ళుగా తనకు నచ్చిన భంగిమలను చిత్రించటంలో పరిశ్రమిస్తున్నట్లు తెలుస్తోంది.

మౌనిని డిస్టర్బ్ చెయ్యటం ఇష్టంలేదు మన్యుకి

మౌని కుంచె అనేక వర్ణాలను తాగి – స్టాండ్‌కి అమర్చిన కాన్వాస్‌మీద అతి నేర్పుగా కదులుతూ, తన ప్రతిభను పులుముతోంది.

నిండుగా, హుందాగా నిలబడి – చిత్రానికి ఫినిషింగ్ టచెస్ ఇస్తున్న మౌనిలో ఏదో తృప్తి, అంతు తెలియని ఆనందం, దేన్నో సాధిస్తున్నానన్న ధీమా కొట్టవచ్చినట్లు కనిపిస్తున్నాయి.

కుర్చీలో నుంచి లేచి – వరుసగా నిలబెట్టి ఉన్న చిత్రపటాలవైపు నడిచాడు మన్యు. ఒక్కోపటం ముందు నిలబడి శ్రద్ధగా, పరిశీలనగా చూడసాగాడు.

మన్యుకి – కొన్ని చిత్రాలు బొత్తిగా అర్థం కావటంలేదు. రంగుల్ని తాగిన అతని కుంచె వాంతి చేసుకుందేమో అన్నట్లుగా ఉంది. అలా అంటే కళాకారులు ఒప్పుకోరు. అందులో ఎన్నో భావాలు అంతర్లీనంగా దాగి ఉన్నాయంటారు. మనం ఒప్పుకోవలసిందే!

కొన్ని చిత్రాలు అర్థమై, కానట్లున్నాయి. మరి కొన్ని నవ్వు తెప్పించేలా ఉన్నాయి. కొన్ని మాత్రం బాగా అర్థమవుతూ – భాగవర్భితంగా గుండెల్లోకి దూసుకుపోతున్నాయి. అతన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్న ఆ చిత్రాలను గుచ్చి గుచ్చి చూస్తున్నాడు పరీక్షగా.

ఆ చిత్రాలలో కనిపిస్తున్న అమ్మాయి? పదహారేళ్ళ ప్రాయంలోకి అడుగుపెట్టిన ముగ్ధమనోహర సౌందర్యరాశి. అందులో నన్ను మించినవాళ్ళు లేరన్నట్లుగా కదులుతుంటే – కాలేజీ ప్రాంగణంలోకి చేతిలో పుస్తకాలతో అడుగు పెడుతూ ఎవరినో చిరునవ్వుతో 'విష్' చేస్తున్నట్లుగా ఉంది. ఆ చిత్రానికి అద్దిన రంగులు సహజంగా ఉన్నాయి. ఆ చిత్రంలోని ఆ అమ్మాయి కళ్ళు మన్యుకి సుపరిచితాలే కావటంతో – వెన్నెముకలో ఏదో జరజర పాకుతున్నట్లై ఆసక్తిగా మరో చిత్రాన్ని దర్శించాడు.

ఇనుపగేటు మీద తన తెల్లటి చేతిని ఆన్చి – స్నఫ్ కలర్ డ్రెస్‌లో నీరెండకు మెరిసిపోతున్న మోముపై నవ్వుల్ని పులుముకొని 'సెండాఫ్' ఇస్తున్న భంగిమలో నిలబడి ఉందా అమ్మాయి. మొదటి చిత్రంలోని పోలికలే ఈ చిత్రంలోవి కూడా. మన్యు గుండెలో మొండిబాకు దిగినట్లు, మరో చిత్రంవైపు పరిగెత్తాయి అతని చూపులు.

సముద్రపు ఒడ్డున కేరింతలు కొడ్తూ పరిగెత్తే కెరటంలా పరువాల అలను పవిటకొంగుతో చుట్టివేసి – భాస్కరుని కాంతుల్లో నీలిముంగురులు వింతగా మెరుస్తుంటే – ఏదో తెలియని ఆనందపు ఊపులో అనుభవాల అంచుల్ని తాకాలన్న తపనతో ఆశగా అడుగులేస్తూ – మధ్యలో పెద్ద బండరాయిని ఢీకొని విరుచుకు పడ్డ పెనుకెరటంలా ఆగిపోయింది అ అమ్మాయి! మన్యు మనసంతా ముద్దలా తయారై, మరో చిత్రాన్ని చూశాడు.

వెన్నెల కురిసిన ఏకాంతంలో – అవధులు లేని ఆనందంతో మౌని గుండెకు తన తలను చేర్చి, అలవోకగా నింగీ నేలను కలిసే చోటును చూస్తోందామ్మాయి. ఆమెను. పొదివి పట్టుకొని, ఆమె తలను తన గుండెలకి హత్తుకొంటూ... ప్రేమగా నిమురుతూ... పాపిటను పెదవులతో స్పృశిస్తూ – ఆమెను తనలో ఐక్యం చేసుకోసుకోవాలన్న బలమైన కాంక్షతో ఉవ్విళ్ళూరుతున్నట్లుగా ఉంది . ఆ చిత్రంలోని అతని భంగిమ. ఆ భంగిమలో మౌని పోలికలున్నాయి. ఒళ్ళంతా కారం పూసి ఎండలో నిలబెట్టినట్లుగా ఉంది మన్యుకి.

ఆ చిత్రాల్లోని ప్రతి భంగిమా ఎర్రగా కాలిన ఇనుపరాడ్‌గా మారి మన్యు శరీరంలోని అణువణువును వెదికి కాల్చివేస్తున్నట్లై ఏదో తెలియని వ్యధ అతని గుండెను పిండినట్లై నెమ్మదిగా వెళ్ళి కూర్చీలో కూర్చున్నాడు. ముఖానికి పట్టిన చెమటకు కర్చీఫ్‌తో తుడుచుకున్నాడు.

నిముషాలు గడిచిపోతుంటే –

తనలో చెలరేగుతున్న కడలి ఘోషను, అంతర్మథనాన్ని ముఖంమీద ప్రతిఫలించనీయకుండా జాగ్రదావస్థ కొచ్చాడు మన్యు.

వేస్తున్న చిత్రాన్ని పూర్తి చేశాడు మౌని.

"మిమ్మల్ని బోర్ కొట్టించాను. ఏదో మూడ్ వచ్చినప్పుడు ఇలా వెయ్యటం అలవాటైంది. ఈ పెయింటింగ్స్‌లో బాగా నచ్చిన వాటిని కళాభవనంలో జరిగే చిత్రకళా ప్రదర్శనంలో చేర్చాలనుకుంటున్నాను. అన్నట్లు ఇప్పుడు అన్ని చిత్రాలనూ చూశారు కదా! కొన్నైనా మీకు నచ్చాయా?" అడుగుతూ మన్యు దగ్గర కొచ్చి కూర్చున్నాడు మౌని.

మంచి మూడ్‌లో ఉన్న మౌని కళ్ళలోని తృప్తిని చూస్తూ – తన మానససరోవరంలో చెలరేగి విరుచుకుపడుతున్న ఆవేశపు కెరటాలకు పిచ్చిగా రెచ్చిపోకుండా తను ఏ విషయం మాట్లాడాలని వచ్చాడో అది ముఖ్యమన్నట్లుగా ప్రస్తుతానికొచ్చాడు మన్యు.

"కొన్నే కాదు. అన్నీ నచ్చాయి" అన్నాడు జవాబుగా

"థాంక్యూ...." అంటున్న మౌనిలోని కళాహృదయం భరించరాని ఆనందంతో ఉక్కిరిబిక్కిరైపోయింది.

"మౌనీ? నీకు వేదప్రియ తెలుసు కదా?" అడిగాడు మన్యు.

"తెలియకేం బాగా తెలుసు" చెప్పాడు మౌని.

"మీరు ఈ ఊరికి ట్రాన్స్‌ఫర్ అయి రెండు నెలలే అయినా – మన మధ్య స్నేహం ఏర్పడటం వేదప్రియగారు గమనించినట్లున్నారు. అందుకే కాబోలు ఈ రోజు నాకో బాధ్యత అప్పగించారు.

ఏమిటన్నట్లుగా చూశాడు మౌని.

"ఆమె మిమ్మల్ని ప్రేమిస్తున్నారు? అంటే ఐ మీన్ ఆవిడ ప్రేమిస్తున్నది. ఎత్తుకి తగ్గ లావుతో, పచ్చని ఛాయతో హుందాగా కనిపించే మీ శరీరాన్ని, తేజోవంతమైన మీ కళ్లని, విశాలమైన మీ వక్షస్థలాన్ని తీర్చిదిద్దినట్లుండే మీ కళ్ళని, నుదుటిమీద మాటి మాటికీ పడుతున్న మీ ఉంగరాల జుట్టునీ కాదు – మీ వ్యక్తిత్వాన్నీ, మీ టాలెంట్‌నీ – అని మీతో చెప్పమన్నారు" అన్నాడు మౌని కళ్ళలోకి పరిశీలనగా చూస్తూ మన్యు.

గలగలా నవ్వాడు మౌని.

"నన్నిలా పొగుడుతుంటే ఆడపిల్లలా సిగ్గుపడాలో, మగాడిలా రెచ్చిపోవాలో అర్థం కావటం లేదు" అన్నాడు నవ్వుని ఆపుకుంటూ.

మౌని అందమైన రూపాన్ని, అహంతో కూడిన ఆ నవ్వుని చూస్తుంటే తిక్కరేగుతోంది. మన్యుకి. తమాయించుకున్నాడు.

"నేనెప్పుడైనా సీరియస్‌గానే మాట్లాడతానని ఈ పాటికి తెలిసే ఉంటుంది మీకు...." అన్నాడు మన్యు.

మన్యు ముఖంలోకి చూసి మౌనం వహించాడు మౌని.

"ఆమె కూడా ఓ లెక్చరర్ కాబట్టి – ఆమెను పెళ్ళి చేసుకుంటే మీ జీవితం హాయిగా సాగిపోతుంది" అన్నాడు మన్యు.

మన్యు మాటలు జోక్‌కాదు. మౌని ముఖంలో రంగులు మారాయి. ఇంతవరకు ఉన్న సంతోషం మాయమయింది. నిరాశ, నిస్పృహ ఆవరించటంతో, ఏదో ఆలోచిస్తున్న వాడిలా "పెళ్ళిమాట మరచిపోయి.... చాలా కాలమైంది?" అన్నాడు.

"ఏం! ఎందుకని? నువ్వు..."

"మగాడినే! ఐ మీన్ మనసులేని మగాడిని. నా మనసెప్పుడో ఒక రూపానికి దగ్గరై, ఆ రూపం సమక్షంలో ఎంతో ఆనందాన్ని చవిచూశానన్న ఆత్మతృప్తితో బ్రతుకుతున్నది మన్యూ! నా ఉనికి ఎలాంటిదో చెప్పనాశ? చచ్చిన శవం లాంటిది. ఇక్కడ నాకు దొరికిన ఏకైక నేస్తం మీరే. ప్లీజ్! నన్ను అర్థం చేసుకోండి....." అంటూ మౌని మాట్లాడుతుంటే – మన్యు గుండెలో అలజడి మొదలైంది.

"మీరే కాదులెండి! యువకుల్లో చాలా మంది – నేనొక భగ్నప్రేమికుణ్ణి" అంటూ ఫ్రెండ్‌కి గతాన్ని చెప్పుకొని, సానుభూతిని అర్థించటం ఓ హాబిట్ అయిపోయింది. ఆ అమ్మాయి పెళ్ళి చేసుకొని – భర్తతో కాపురం చేసుకుంటూ – ఎప్పుడైనా, ఎక్కడైనా తట్టస్థపడితే? 'మీకు తెలుసో, లేదో ఒకప్పుడు ఆమె నా లవ్!' అని ఫ్రెండ్స్‌కి చూపించటం ఓ గ్లామర్ అయిపోయింది. ఓ ఫ్యాషన్..." అంటున్న మన్యు కొద్దిగా ఆగాడు.

మౌని కళ్ళు చురుగ్గా చూశాయి. ఏదో అనబోయాడు.

"నన్ను మాట్లాడనివ్వండి మౌనీ! ఈ ప్రకృతిలో ఎన్నో అందాలున్నాయి. మీ చిత్రకారులు స్పందించి గీసేందుకు ఎన్నో దృశ్యాలు మీ దృష్టిలో పడతాయి. కానీ మీ ప్రేయసి రూపమే మీకు ప్రేరణ కావటం సంస్కారమనిపించుకోదు. నా ఉద్ధేశం మిమ్మల్ని విమర్శించాలని కాదు. మీరు విరహంలో తృప్తిని వెతుక్కొని, ఊహల్లో జీవిస్తున్నారు. కానీ ఒకప్పటి మీ ప్రేయసి ఈనాడు బాధ్యతల్లో ఆనందించి, వాస్తవంలో బ్రతుకుతోంది. ఆమె రూపాన్ని మీ చిత్రకళా నైపుణ్యంతో చిత్రించి కళాభవనంలో ప్రదర్శించబోతున్నారు. అంటే ఆ విధంగా ఆమెను పదిమంది పోల్చుకుంటే – మీ ప్రేమ జీవించి, మీ ఆర్తికో గుర్తింపు, మీ ఆరాధనకో విలువ, మీ ఆవేదనకో అర్థం ఉంటాయన్న తపనతో – అహర్నిశలూ ఆరాటపడుతున్నారే కాని... ఆమె పచ్చని భవిష్యత్తుతో ఆడుకోబోతున్నారని మాత్రం గుర్తించలేకపోతున్నారు! అన్నాడు" మన్యు.

"మీరు వేదప్రియను దృష్టిలో ఉంచుకొని, ఆమెతో నా పెళ్ళి జరపాలని ఏదో ఆవేశంలో అంటున్నారు. అంతేగానీ... నా ప్రేయసి" అంటూ ఏదో అనబోతున్న మౌని ఆగిపోయాడు.

"స్టాపిట్! ఇక వినలేను! మీ ప్రేమతో నా గుండెకి తూట్లు పొడవకండి. మీ గుండెల్లో నిలుపుకున్న ఆ బొమ్మ పేరు తేజస్విత. ఆమె నా భార్య" మనసు తలుపులు భళ్ళున తెరుచుకొని హృదయాన్ని చీల్చుకొని వచ్చిందా మాట.

మౌని గుండెలో బాంబు పేలి బ్రద్ధలైనట్లైంది. తలతిరిగిపోతూ, మెదడు మొద్దుబారినట్లైంది. అంతులేని భయానికి, ఆలోచనల వేగానికి తట్టుకోలేని అతని హృదయానికి – ట్రీట్‌మెంట్ లేని యాక్సిడెంట్ అయింది.

చట్టుక్కున కుర్చీలో నుంచి లేచి – మన్యు రెండు చేతుల్ని పట్టుకున్నాడు మౌని. అతని చేతులు కంపిస్తున్నాయి.

"ప్లీజ్! మన్యూ! ఇదంతా మరచిపోండి! తేజ నా ప్రాణం, ఆమెను మీరు...." అంటూ మాట పూర్తి చేసేలోపలే – "నోఁ" అంటూ పెద్దగా అరుస్తూ, అర్థిస్తున్నట్లుగా పట్టుకున్న మౌని చేతుల్ని వదలించుకుంటూ...

"తేజ – నా భార్య, నా ప్రాణం. నా జీవితభాగస్వామిని. నాతో కలిసి ఏడు అడుగులు నడిచిన క్షణం నుంచి ఆమె చిరునవ్వుతో, చల్లని చూపులతో, తియ్యని

మాటలతో – మనస్ఫూర్తిగా నన్ను తన సొంతం చేసుకొంది. నిష్కల్మషంగా అభిమానించి, గౌరవించింది. భార్యగా తన స్థానాన్ని స్థిరపరచుకుంది. నా ప్రతిరూపాలకు తనలో ఊపిరి పోసి, నవమాసాలూ మోసి, మాతృత్వపు విలువను గుర్తించింది. ఇంకో నెల దాటితే ఇద్దరు బిడ్డలకి తల్లి ఆమె. మీ సెంటిమెంట్స్‌కి ప్రాధాన్యం ఇచ్చి, ఆమెను అనుమానించి, అవమానించేంత అవివేకినీ, కుసంస్కారినీ కాదు నేను.

అయితే ఒక్కటి మాత్రం గుర్తుంచుకోండి! ప్రేమ – విరహం తప్ప – జీవితం విలువ తెలియని మీకూ, మీ కళాహృదయానికీ ఇకమీదట నా భార్య రూపం ప్రేరణ కావటం నేను భరించలేను, వస్తాను," అంటూ విసురుగా కుర్చీలో నుంచి లేచి బయటకు నడిచి నిశీథిలో కలిసిపోయాడు మన్యు.

ముఖానికి పట్టిన చెమటను తుడుచుకుంటున్న మౌని మదిలో వేదప్రియ మెదిలి మాయమైంది.

"నేస్తమా! నువ్వెంత ఎదిగిపోయావు? నీ ముందు నేనెంత! ఆఫ్టాల్ ఓ అణువంత,!" అనుకుంటూ కిటికిలోనుంచి చూస్తున్న మౌని కళ్లకి – చీకట్లో నడిచిపోతున్న మన్యు వ్యక్తిత్వం హిమాలయాలను తాకుతూ కనిపించింది.

**(24.6.1987 ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక)**

# సంఘ సేవిక

-శివలెంక నాగ ఉదయలక్ష్మి

**ని**త్యానందకరి వరాభయకత
సౌందర్య రత్నాకరి నిర్ధుతాఖిల ఘోరసావనకరి
ప్రత్యక్ష మహేశ్వరి, ప్రా తీయాచలవంశపావనకరీ
కాశీ పురాధీశ్వరీ భిక్షాందేహీ కృపావలంబనకరీ
మాతా! అన్నపూర్ణేశ్వరీ

అన్నపూర్ణా అష్టకం ఏకాగ్రతలో చదువుకుంటూ

భక్తితో నిశ్చలంగా పూజ చేస్కుంటున్న శాంభవికి-

"అమ్మా! నా కాలేజ్ టైమయిపోతోంది" అంటూ పిలుస్తున్న కూతురు మనస్విని పిలుపుతో

గబగబా పూజకానిచ్చి అమ్మవారికి హారతిచ్చింది శాంభవి.

ప్రసాదం తీస్కుని కూతురు గదిలోకి అడుగుపెట్టింది శాంభవి.

'మనూ ప్రసాదం తీస్కోమ్మా'

హడావిడిగా హారతి, ప్రసాదం తీస్కుని -

'అమ్మా తొందరగా టిఫెన్ పెట్టియ్యి. ఈ రోజు మా కాలేజ్‌లో ఫంక్షన్ ఉంది నేను లేట్‌గా వస్తాను'.

మనస్విని చలాకీ తనం పట్టుదల గ్రహించే శక్తి చూసినప్పుడల్లా శాంభవి సంతోషంగా, గర్వంగా ఫీలవుతుంది.

అన్ని విషయాలు తెలుసుకోవాలనే ఆతృత, పెద్ద వాళ్ళంటే గౌరవం. క్రమబద్ధమైన ప్రణాళికతో తీసుకునే నిర్ణయాలతో నడుచుకోవడం ఆ లక్షణాలన్నీ తన భర్త మోహన్ నుంచీ వచ్చాయి. అనుకోగానే శాంభవికి ఆనందం కలుగుతుంది

కూతురి ముఖంలోకి మురిపెంగా చూస్కూంటూ - తొందరగా రా! టిఫిన్ రెడీ చేస్తానంటూ వంటగదిలోకి వెళ్ళిపోయింది శాంభవి.

బాల్కనీలో ట్యూబ్ లైట్‌తో పాటు వెన్నెల కిరణాలు శాంభవిని తాకుతున్నాయి. 'నైట్‌క్వీన్' పరిమళాలు ఆస్వాదిస్తూ తదేకంగా వ్రాసుకుంటున్న శాంభవి - వెనకాలే వచ్చి కళ్ళు మూసిన మనస్విని అల్లరితో - వెనక్కి తిరిగింది.

"హాయ్! మమ్మీ! ఇంకా నిద్రపో లేదా? నువ్వు"- అంటూ వ్రాస్తున్న కాగితాల వంక చూసింది మనస్విని.

ఏదో కథ తాలుకు 'స్కెచ్' వ్రాసినట్లుంది ముత్యాల్లాగా తెల్లని కాగితం మీద మెరిసిపోతున్నాయి అక్షరాలు.

"మమ్మీ! ఈ రోజు మా కాలేజీలో ఫంక్షన్ చాలా బాగా జరిగింది. కళావాహిని వారి ఆధ్వర్యంలో ఒక సాంస్కృతిక కార్యక్రమం కూడా జరిగింది. ఏదో మాటల్లో చెప్పాను. మా మదర్ కూడా రచయిత్రేనని! వెంటనే వాళ్ళు ఏం అడిగారో తెలుసా?"

కళ్ళు చక్రాల్లా తిప్పుతూ - ముందుకు వంగి శాంభవి చెయ్యి పట్టుకుని వూపింది మనస్విని.

"నువ్వు చెప్పందే నాకెలా తెలుస్తుందే! మనూ!"

శాంభవి వంక చూస్తూ! "ఔనవును! నిజమే! నేను చెప్పందే నీ కెలా తెలుస్తుంది." తల్లిని అనుకరిస్తూ.

"సరే! సరే! ఇంతకీ అసలు విషయం చెప్పు" తల్లి మాటలకు అడ్డువస్తూ!

"కళావాహిని వారు మీ మదర్ గొప్ప రచయిత్రి - సోషల్ వర్కర్. ఆవిడకి మా సంస్థ తరపున ఎన్నో సార్లు సన్మానం చేస్తామని అడిగాము. కానీ ఆవిడ అంగీకరించలేదు. 'ఉగాది' కి మా కళావాహిని వార్షికోత్సవంలో మేము కొంతమందికి 'సన్మానం' చేయాలనుకుంటున్నాం! కాబట్టి మీ అమ్మని ఒప్పించమ్మా!' అని అడిగారు. నేనేమన్నానో! తెలుసా! మా 'మమ్మీ' నా మాట ఎప్పుడు కాదనదు. తప్పక ఒప్పిస్తాను" అన్నాను.

మెరిసే కళ్ళతో ఉత్సాహంగా చెబుతుంది మనస్విని.

పద – పద! ఆకలేస్తోంది. భోజనం చేద్దాం! మాట మారుస్తూ కుర్చీ లోంచి లేచింది శాంభవి.

ఫోన్ రింగవడంతో – తదేకంగా పుస్తకం చదువుతున్న మనస్విని – వంటయింట్లో వున్న శాంభవి ఒక్కసారి హాల్లోకి వచ్చారు ఇద్దరు.

ముందుగా మనస్వినే ఫోన్ తీసింది.

"హలో! ఎవరూ?"

అవతలవైపు నుంచీ ఎవరు మాట్లాడుతున్నారో కానీ!

"హలో! అలాగే సార్! మీరు ప్రిపేర్ అవండి నేను చెప్పి ఒప్పిస్తాను. ఓ.కే!" అంటూ హుషారుగా ఫోన్ పెట్టేసింది మనస్విని.

"ఎవరినే! ఒప్పిస్తానంటున్నావ్!" శాంభవి కూతురు వంక చూస్తూ అడిగింది.

"అదేమిటి మమ్మీ! రాత్రి నీకు చెప్పాను కదా! 'కళావాహిని' వారు సన్మానం చేస్తామని అడిగాడు. అదే! మళ్ళీ అడుగుతున్నారు."

"ఏమిటి? ఓ.కే! అనేసావా? నువ్వే చెప్పేసావా?" శాంభవి కోపంగా అడిగింది.

"ఏం?"

"నాకిష్టం లేదు" నిష్కర్షగా చెబుతున్న తల్లివంక కోపంగా అసహనంగా చూసింది మనస్విని.

తనేది అడిగినా కాదనని తల్లి ఈ విషయంలో ఎందుకు కాదంటుందో! ఆశ్చర్యంగా చూసింది.

"నేను వాళ్ళకి మాటిచ్చేసాను మమ్మీ!" నసుగుతూ తల్లి వంక చూసింది మనస్విని.

"నన్నడగకుండా ఎందుకు మాటిచ్చావ్?"

శాంభవి తీవ్రంగా అడిగిన తీరుకి క్షణం సేపు భయంతో బిక్కముఖం వేసిన కూతురివంక అనునయంగా చూసింది.

"మనూ! నాకు ఈ సన్మానాలు, పొగడ్తలు ఇష్టం వుండదు. వాళ్ళకి చెప్పేసెయ్యి. అనవసరమైన ప్రయత్నాలు చేయవద్దని "– ఖచ్చితంగా, నిర్మొహమాటంగా చెబుతూ లోపలికి వెళ్ళిపోయింది శాంభవి.

ఏదడిగినా – ఎప్పుడు కాదనని తల్లి ఈ విషయంలో ఎందుకు కాదంటోందో! మనస్వినికి అర్థం కాలేదు. ఇప్పుడు వాళ్ళకేం చెప్పాలో తోచడం లేదు. తల్లిని ఒప్పిస్తానని కళావాహిని వారికి గొప్పగా చెప్పింది. ఏమూలో తల్లి ఒప్పుకుంటుందనే ఆశ – తన మాట కాదనదని నమ్మకం కలుగుతోంది. రెండ్రోజులు టైమ్ కావాలని అడిగితే సరి! ఈలోగా తల్లి తన మనసు మార్చుకుంటుందేమో! అనిపించిన మనస్వినికి ఆ విషయమే కళావాహినివారికి ఫోన్ చేసి చెప్పింది.

సాయంత్రం నా స్నేహితురాలు ... కూతురి పుట్టినరోజు వుంది.

కాలేజ్ నుంచీ తొందరగా వచ్చెయ్యి. ఇద్దరం కలిసి వెడదాం.

కాలేజ్‌కి తయారవుతున్న మనస్వినితో చెప్పింది శాంభవి.

తన మాటవినలేదని తల్లితో రెండ్రోజుల నుంచీ ముభావంగా వుంది మనస్విని.

తను అడిగింది ఏం చేయకపోయినా మౌనంతో ఆ పని సాధించుకోవడం మనస్వినికి అలవాటే!

"నాకు ప్రయివేటు క్లాసువుంది మమ్మీ! నేను రాను" కొంచెం కోపం మిళితమైవుంది మనస్విని కంఠంలో!

అది గ్రహించిన శాంభవి "అదేమిటి మనూ! కళ్యాణి ఆంటీకి నీవంటే ఎంతోయిష్టం. నిన్ను చిన్నప్పట్నుంచీ తన కూతురిలాగా చూస్కుంది రాకపోతే బాధపడదూ?" లాలనగా మాట్లాడుతున్న తల్లివైపు చూసింది మనస్విని.

"నేను బాధపడితే నీకే బాధా వుండదు."

నిష్ఠూరంగా అంది మనస్విని ఆశ్చర్యంగా ....

మెల్లగా మనస్విని దగ్గరకెళ్ళి తలమీద చెయ్యి వేసి నిమురుతూ... "మనూ! నీవు తప్ప నాకెవరున్నారు? నువ్వు బాధపడితే నాకు మనస్సులో ముల్లు గుచ్చుకున్నట్లుగా వుంటుంది. ఇంతకీ నిన్నే విషయంలో బాధపెట్టానో చెప్పు."

అనునయంగా మనస్విని చుబుకంపైకెత్తింది శాంభవి.

"ఊహు! నేనురాను నాకు క్లాసుంది. నువ్వెళ్లిపో!" అంటూ బయటకు దారితీసింది మనస్విని.

కూతురికి తన మీద కోపం పోలేదని గ్రహించింది శాంభవి బాధగా నిట్టూర్చింది.

వరండాలో లైటులేదు తల్లి ఫంక్షన్‌కి వెళ్ళిందేమో! అనుకుంది మనస్విని తలుపులు బార్లగా తెరిచే వున్నాయి. చీకటిగా వుంది.

“ఇదేమిటి? కరెంట్ పోయిందా?” అంటూ ట్యూబ్ లైట్ స్విచ్ వేసింది.

హాలంతా వెలుగుతో నిండిపోయింది.

తల్లి సోఫాలో వెనక్కివాలి పైకి చూస్తోంది.

కళ్ళ నుంచీ కన్నీరు జాలువారి బుగ్గల మీదకి జారిపోతున్నాయి.

మనస్వినికి తల్లి వంక చూడగానే క్షణం సేపు బాధకలిగింది.

అమ్మని అనవసరంగా బాధపెట్టిందేమో! అందుకే ఆవిడ మనసు గాయపడిందేమో! విచారంగా వున్న శాంభవి ప్రక్కన కూర్చొంది మనస్విని.

“అమ్మా! నేను – మనూని! సారీ! మమ్మీ! నిన్ను బాధపెట్టాను” అంటూ శాంభవి ఒడిలో తలదాచుకుంది బాధతో మనస్విని.

ఆర్తిగా – ఆప్యాయంగా పెనవేసుకున్న రెండు చేతులు కూతురిని దగ్గరకి తీసుకున్నాయి.

“మనూ! నిన్నెందుకు బాధపెట్టానో! నాకు తెలుసు తల్లీ! నేను చెప్పింది వినమ్మా! మనూ! మీ నాన్న నాకు మేనమామ. చిన్నప్పట్నుంచీ అమ్మమ్మకి మామయ్యకి నన్నిచ్చి పెళ్లిచేయాలనే కోరిక మా నాన్నకి తన చెల్లెలి కొడుక్కివ్వాలని – కానీ అమ్మమ్మ మామయ్యల దగ్గర ఎక్కువ పెరగడం వలన నాకు మామయ్యంటే యిష్టం ఏర్పడింది. మేమిద్దరం కాబోయే భార్యభర్తలం అని మా మనసులు – ఎన్నెన్నో – ఊసులు – కలలు – ఊహలు కన్నాం అమ్మమ్మ కోర్కె ప్రకారం మా పెళ్ళయిపోయింది. అమ్మమ్మకి మామయ్య ఒక్కడేకొడుకు. అందుకు ఆవిడ మాయిద్దరిని బాగాచూసేది. మామయ్యకి కూడా అమ్మమ్మ మాటంటే వేదం. ఎనలేనిగౌరవం. ఆవిడమాట ఏదీ కాదనేవాళ్ళంకాదు. మామయ్యకి బొంబాయిలో వుద్యోగం వచ్చింది మాయిద్దరికి

అమ్మమ్మని వదిలి వెళ్ళడం యిష్టంలేదు కానీ ఆవిడ పట్టుపట్టింది మీరు చిన్నపిల్లలు మీ భవిష్యత్తుని పాడుచేసుకోవద్దని – అలా మమ్మల్ని బొంబాయి పంపింది. బొంబాయిలో వున్నా సెలవులకు రావడం – అమ్మమ్మని బొంబాయి తీస్కురావడం జరుగుతూనే వుండేది – అమ్మమ్మని అత్తగారిలా ఎప్పుడూ భావించలేదు.

నువ్వు పుట్టక ముందు అమ్మమ్మకి ఒకసారి ఒంట్లో బాగుండకపోతే నెలరోజులు అమ్మమ్మ దగ్గరకి మీ నాన్న పంపించారు. ఆ నెల రోజులు ఆవిడకి నేనేం చేశానో నాకు గుర్తు లేదుకానీ ఆవిడ నాకెంతో చేసింది. నేను వెళ్ళిన రెండ్రోజులకి నేను గర్భవతినని తెలిసింది. ఆవిడ ఆనందంతో పొంగిపోయింది. అంతేకాదు నన్నొక్కపని చేయనీయకుండా తనదగ్గరుంచేసుకుంది. ఆ మూడు నెలల్లో అమ్మమ్మ దగ్గర ఎన్నెన్నో నేర్చుకున్నాను.

ఒకరోజు ఏదో నవల చదువుకుంటూ తాతయ్య పందిరి మంచం మీద పడుకున్నాను.

శాంభవీ! అంటూ పిలిచింది అమ్మమ్మ! ఏమిటో! అని ఖంగారుగా వెళ్ళాను. దక్షిణం వైపు గదిలో మంచం వాల్చి వేయమ్మా! అంటూ పురమాయించింది.

అమ్మమ్మ పక్కన ఒకపాతికేళ్ళ అమ్మాయి. నిండు గర్భిణి నుంచోలేక అసహనంగా చూస్తోంది. ఆ అమ్మాయిని అతి జాగ్రత్తగా ఇద్దరం గదిలోకి తీస్కుని వెళ్ళిపడుకోబెట్టాం. అమ్మమ్మ వేడి వేడి పాలు పట్టింది. ఒక అరగంట తర్వాత ఆ అమ్మాయికి పండులాంటి కొడుకు పుట్టాడు. ఆ హడావిడిఅంతా అయ్యాక అమ్మమ్మ చెప్పింది. ఆ పిల్ల మా అమ్మమ్మకు దూరపు బంధువు ఇంటి నుంచీ పక్కవూరుకి బయలుదేరింది. కానీ మధ్యలో వున్నమావూరు వచ్చేసర్కి ఆ అమ్మాయికి నొప్పులు ప్రారంభమయ్యాయి. రాములు వారి గుడికి వెడుతున్న అమ్మమ్మ చూసింది. ఆ అమ్మాయిని, భర్తని మనింటికి తీస్కువచ్చింది. కాన్పు అయ్యాక పురిటిస్నానం చేయించి వాళ్లకి బట్టలు పెట్టి పంపించింది. పురిటి స్నానం అయ్యేవరకు ఎంతో శ్రద్ధతో పత్యం పెట్టి తల్లిని పిల్లవాడిని క్షేమంగా పంపించింది. అమ్మమ్మ ఆ వూరి ప్రజలకు ఆ ఊరి దేవాలయాలకు ఎంత సేవ చేసిందో! ఎన్నెన్ని దానాలు చేసిందో చెప్పలేను. తాను నేర్చుకున్న సంస్కృతం – తెలుగు – కావ్యాలన్నీ కంఠతా వచ్చు. చదువు – సంస్కారం రూపం అన్నీ వున్న అమ్మమ్మ పేరు శాంతా సుందరి.

అన్నీ వున్న అమ్మమ్మకు గర్వం కానీ! అహంకారంకానీ లేవు. కీర్తి కోసం ప్రాకులాడటం నేనెప్పుడూ చూడలేదు. ఎంత విరోధి వచ్చినా అతిథి సత్కారం చేసి పంపేది. చిన్న పనిచేస్తే ఆశించేవాళ్ళు ఈ తరంలో వున్నారు. ఎంత వున్నవాళ్ళయినా! ఆవిడకి అందరూ సమానమే! మనూ! మీ బామ్మ ఏమాశించి అవన్నీ చేసిందో చెప్పు. అమ్మమ్మ కంటే నాన్న ఒక ఏడాది ముందు యాక్సిడెంట్‌లో పోయారు. నాకెంత ధైర్యాన్నిచ్చిదో! నీ గురించి ఎంత తపన పడిందో! నాలో వున్న రచయిత్రిని ఆవిడే బ్రతికించింది. మీ నాన్న కూడా ఎవరినీ ఏమీ ఆశించి చేసేవారు కాదు. వాళ్ళలోని సంస్కారం – వాళ్ళల్లోని ఆత్మీయత నాలో జీర్ణించుకుపోయాయి. ఈ తరం వాళ్లకి సన్మానాలు – కీర్తి శిఖరాలు ఎక్కాలనే ఆకాంక్ష.

మనూ! కీర్తి పతాకాలు కోసం ఎంతకాలం పరిగెత్తుతాం. మనల్ని – మనం ఆత్మవిమర్శ చేస్కుంటే – భగవంతుడి పరమార్థం తెలుస్తుందని మీ బామ్మ ఎప్పుడూ చెప్పేది. దయచేసి కీర్తి దాహం కోసం నన్ను బలవంతంచేయకు మనూ! ఒకసారి మనసులోకి వచ్చిందో! అది ఆగదమ్మా!”

ఆ క్షణంలో తల్లి హిమాలయాలంత ఎత్తుకి ఎదిగినట్లుగా ఒక తపస్వినిలా కనిపించింది. ఆ కళ్లలో వింత మెరుపులు తనని జ్ఞాన కిరణాలై చల్లగా స్పృశిస్తున్న అనుభూతిని ఆస్వాదిస్తూ తల్లి ఒడిలోకి చేరింది మనస్విని.

# సముద్రానికి కన్నీటి తర్పణాలు

-రేణుక అయోల

**అ**క్కడ నుంచి ఫోను రావడం పదోసారి. ఇంక బాగోదని తప్పకుండా వస్తానని ఫోను పెట్టేశాను. 'అమృత్ సేవాసదన్' నుంచి వరుసగా నాలుగు రోజుల నుండీ ఫోన్ కాల్స్ వస్తూనే ఉన్నాయి రవికి. "మీ అమ్మ గారు స్థాపించిన 'అమృత్ సేవాసదన్' పదవ వార్సికోత్సవానికి మీరు తప్పకుండా రావాలి. మీరు మీ శ్రీమతిని కూడా తీసుకురండి. మీ అమ్మగారు మాకు దూరమైన దగ్గర నుంచి మేము చాలా బాధపడుతున్నాం. ఆవిడ వర్థంతి, పదవ వార్షికోత్సవం కలిసి వచ్చాయి." అంటూ ఫోనులో వేడుకుంటూ రమ్మని బలవంతం చేశారు కాంతమ్మగారు.

నాకు అమ్మ మీద కోపం ఉందా? కోపం కాదు బాధ . ఏం తప్పు చేశామని మమ్మల్ని వదిలి వెళ్ళిపోయిందని అక్కసు. అర్థాంతరంగా ఇల్లు వదిలి వెళ్ళవలసిన అవసరం ఏమిటి? అసలు ఎందుకు అలా మారిపోయింది. ఇంట్లో అత్తా కోడళ్ళు కోట్లాటలు అసలు లేవు. ఇద్దరూ స్నేహితుల్లా ఉండేవారు. మొదటి నుంచీ అమ్మ స్వభావం వేరుగా ఉండేది. ఇతరులని అర్థం చేసుకోవడం, అందరికీ సహాయం చేయడం అలవాటు. అందుకు నాన్నగారి సహకారం కూడా ఉండేది.

అమ్మనాన్న ఇద్దరూ ఒకేమాట మీద నిలబడేవారు. ఒక్క కొడుకునని ఏనాడు అతి గారాబంగా పెంచలేదు. డబ్బు కన్నా మానవత్వానికే ఎక్కువ విలువ ఇచ్చిన వ్యక్తులు. అలాంటి అమ్మ ఎందుకు మారిపోయింది?

తల్లీ తండ్రి ఇద్దరినీ పోగొట్టుకొని అన్నా వదినల పంచన ఉంటూ ఎన్నో ఇబ్బందులకి గురి అయిన ఇందిరని కాని కట్నం లేకుండా కోడలుగా తెచ్చుకున్నారు. లోకానికి కోడలు అని చెబితే కానీ తెలియనంతగా కలిసిపోయారు.

నేను, ఇందు ఇద్దరం ఉద్యోగస్థులం.

"మా అత్తగారు ఒక్క క్షణం కనిపించకపోతే తోచదు. ఆవిడ వల్లే నేను ఇంత

స్వేచ్ఛగా ఉంటున్నాను. ఇంత నిశ్చితంగా ఉద్యోగం చేస్తున్నాను” అని అందరికీ ఆప్యాయంగా చెప్పేది ఇందిర.

పెద్దవాడు కిరణ్ పుట్టాక, నాన్నగారూ హఠాత్తుగా పోయారు. ఆ షాక్‌ని అమ్మ తట్టుకోలేక పోయింది. మళ్ళీ మామూలు మనిషిని చేయడానికి ఇందిర ఎంతో కృషి చేసింది. నాన్న మీద దిగులుతో డీలా పడిపోయిన అమ్మకోసం, ఎంతో తపన పడింది ఇందిర.

అప్పుడే హైదరాబాద్ ట్రాన్స్‌ఫర్ అయింది. స్థలం మార్పు వల్ల మెల్లగా కోలుకుంది. ఇందిరకి ట్రాన్స్‌ఫర్ అవడం చాలా ఆలస్యం అయింది. అప్పుడు కూడా నా దగ్గరికి రాకుండా ఇందిర దగ్గరే ఉండిపోయింది. అలాంటి అమ్మ ఎందుకు మారిపోయింది? ఎప్పుడో కర్మన్‌ఘాట్‌లో కొన్న స్థలంలో తానే ఒక ఆశ్రమాన్ని నిర్మిస్తున్నట్లు చెప్పి ఇల్లు విడిచి వెళ్ళిపోయింది. ఎందుకు వెళ్ళిపోయిందో అర్థం కాక ఇద్దరం చాలా బాధపడ్డాం.

“ఎంతగా ప్రేమించాను ఆవిడని, ఎప్పుడూ అత్తగారిలా అనుకోలేదు. ఆవిడలో కూడా ఏనాడు ఆ భావం కనబడలేదు. అందరూ మీ అత్తగారు ఎందుకు వెళ్ళిపోయింది. మొదట్లో అంతా బాగానే ఉంటారు... అంటూ ఏవేవో మాటలు అంటుంటే భరించలేక పోతున్నానండీ” అంటూ ఇందు నా దగ్గర ఏడ్చినప్పుడు ఎలా ఓదార్చాలో అర్థం కాలేదు. రెండోది ఉష పుట్టాక, పుట్టక మునుపు మా ఇద్దరి పాట్లు దేవుడికే తెలియాలి. రోజుకో పని పిల్ల, ఉష పెద్దదయ్యేదాకా ఇందిర నేను ఉక్కిరిబిక్కిరి అయిపోయాం.

మధ్య మధ్యలో పేపర్లలో “అమృత సేవాసదన్” గురించి అమ్మ దాని గురించి పడుతున్న శ్రమ గురించి, అందులో ఉన్న వారిని ఎలా ఆదుకుంటుందో లాంటి వార్తలు వింటూ చదువుతున్నప్పుడల్లా ఇద్దరం బాధపడేవాళ్ళం.

ఏ కారణం లేకుండా మా ఇద్దర్ని, మనమల్ని వదిలేసి వెళ్ళిపోయిన అమ్మని తలచుకొన్నప్పుడల్లా దుఃఖం, కోపం వచ్చేది. అక్కడికి వెళ్లాక కనీసం ఫోను కూడా చెయ్యలేదు. అసలు మేము ఉన్నామో లేమో కూడా ఆవిడకి అక్కరలేకపోయింది. సభలు, సన్మానాలు, పొగడ్తలు. ఒకసారి వస్తానన్నా నన్ను కూడా రావద్దని కబురు పంపింది.

పోయిన సంవత్సరం  ఆ సంస్థ వాళ్ళ దగ్గర నుంచి ఫోను వచ్చింది. "మీ అమ్మగారు ఈ ప్రపంచంలో లేరని, వచ్చి చూడవలసింది" గా చెప్పారు.

ఇద్దరం చూడడానికి వెళ్ళాం, హాస్పిటల్‌లోనే మరణించింది. నిశ్చలంగా పడుకొన్నట్లుగా ఉంది. బాగా చిక్కిపోయింది. ఎంతో చక్కటి మనిషి. కృంగిపోయినట్లుగా అయిపోయింది. శవాన్నికూడా ఆశ్రమంవాళ్ళే దహనం చెయ్యాలని  కోరిందట... ఆ రోజంతా ఇద్దరం విపరీతంగా బాధపడ్డాము... అంత అపకారం ఏం చేశామని?

మెల్లగా మరచిపోతున్న అమ్మ జ్ఞాపకాలు, మళ్ళీ ఆవిడ ఫోనుతో తేనెతుట్టలా కదిలాయి. ఇంటి ముందు కారు ఆగగానే ఆలోచనల నుంచి తేరుకున్నాను. కారుని బయటే పార్క్ చేసి లోపలికి వచ్చాను. "ఇందు రడీగా ఉన్నావా?"

"ఎందుకోనండీ రావాలనిపించటం లేదు, కానీ కాంతమ్మగారు ఎన్నోసార్లు ఫోను చేశారు, ఇంక బాగుండదు, ఆవిడ మనకి ఏం చేసింది అన్నది మన ఇద్దరికీ తెలుసు, లోకానికి ఆవిడ చాలా మంచి ఆవిడ, అన్నిసార్లు పిలిచినా రాలేదు అన్ననింద మనకెందుకు, పదండి వెళదాం" అంటూ కాఫీ కప్పు చేతికిచ్చి తయారవ్వడానికి లోపలికి వెళ్ళింది. అదే మొదటిసారిగా చూడడం "అమృత సేవాసదన్" ని. చుట్టూతా పచ్చని చెట్లు, అందులో అన్నీ పూరిగుడిసెలే, శుభ్రంగా అలికి ముగ్గులు పెట్టారు. అన్నింటి కన్నా కొంచెం పెద్దగా ఉన్నగుడిసె ఆఫీస్ అనుకుంటాను. మమ్మల్ని చూడగానే ఆప్యాయంగా పరుగులాంటి నడకతో వచ్చి "రండి రండి" అంటూ అభిమానంగా లోపలికి తీసుకువెళ్లారు కాంతమ్మగారు.

అక్కడున్న ఆడవాళ్ళు, పిల్లలు కన్నీటిధారలతో అమ్మ ఫొటోకి నమస్కరిస్తూ శ్రద్ధాంజలి ఘటించారు. అమ్మవల్లే ఇంత తిండి ఈ రోజు తినగలుగుతున్నామని గుర్తు చేసుకున్నారు. మధ్యాహ్నం భోజనాలు చేసి బయలుదేరబోతుంటే, కాంతమ్మ గారు చేతిలో ఒక కవరు పెట్టి "ఇది మీ అమ్మగారు  ఆవిడ చనిపోయిన తరువాత మీకు ఇమ్మన్నారు" అంటూ తెల్లటి కవరు ఇచ్చారు. అందరి దగ్గర సెలవు తీసుకుని బయలుదేరాం.

"చూశారా! మనిషికి కావల్సింది కీర్తి, ఆదర్శాలు, అభిమతాలు అంటారే గానీ , పొగడ్తలకి లొంగని వాళ్ళు ఎవరు చెప్పండి... పోనీలెండి మన దగ్గర మన

పిల్లలకి చాకిరీ చేస్తూ, ఆ స్థలం డబ్బులు మనకి ఇస్తే ఏమొస్తుంది" అంది ఇందిర బాధతో కూడిన కోపంతో... రాత్రి పడుకోబోయే ముందు గుర్తుకొచ్చింది. అమ్మ ఇచ్చిన కవరు కారులోనే ఉండిపోయింది. కవరు తెచ్చి విప్పగానే తెలిసింది. అమ్మ చాలా పెద్ద ఉత్తరం రాసిందని.

"చిన్నారవీ" అంటూ మొదలుపెట్టింది. నన్నెప్పుడూ "చిన్నా" అని పిలిచేది. "నా మీద నీకు, ఇందిరకి చాలా కోపం ఉందని తెలుసు. కానీ ఏం చెయ్యను? నాకు ఒంట్లో బాగోలేనప్పుడు... గుర్తుందా డాక్టరు కొన్ని ఇంజెక్షన్లు రాసిచ్చి చేయించుకోమన్నాడు. అప్పుడు ఈపాటి దానికి పెద్ద హాస్పిటల్ ఎందుకు అని దగ్గరగా ఉన్న హాస్పిటల్‌లో చేయించుకున్నాను. ఆ తర్వాత కొన్నాళ్ళ దాకా తెలియలేదు. ఎందుకో నెలల తరబడి జలుబు వేధించేది గుర్తుందా? ఆ మధ్య మామయ్యగారి ఇంటికి వెళ్ళినప్పుడు వాడే 'ఎందుకైనా మంచిదక్కా ఏదీ నెలల తరబడి రాకూడదు. పెద్ద హాస్పిటల్‌లో ఒకసారి మంచి డాక్టరుకి చూపించుకోమన్నాడు. అప్పుడే సరిగ్గా ఇందిరకి రెండోది కడుపులో పడింది. ఆ వార్త విని ఎంత సంతోషించానో, అత్తా కోడళ్లం ఇద్దరం ఎన్నో కబుర్లు చెప్పుకొన్నాం. ఆడపిల్ల పుట్టాలని, దానికి ఏ పేరు పెట్టాలో కూడా నిర్ణయించుకున్నాం.

ఆ మర్నాడు జలుబు ఇంకా ఎక్కువైపోయింది. తలనొప్పి కూడా భరించలేకపోయాను. ఇంక లాభం లేదని, పెద్ద హాస్పిటల్‌కి వెళ్లాను. ఆ డాక్టరుకి ఏదో అనుమానం వచ్చింది. కొన్ని పరీక్షలు చేయించుకోమన్నాడు. తీరా రిపోర్టులు వచ్చాక మర్నాడు డాక్టరు పిడుగులాంటి వార్త చెప్పాడు. నాకు హెచ్.ఐ.వి వచ్చిందని భూమి బద్దలైనట్లు అనిపించింది. సిగ్గుతో , బాధతో చితికిపోయాను. డాక్టరుఅడిగిన ప్రశ్నలకి ఏం జవాబు చెప్పాలో అర్థం కాలేదు. మనసంతా మొద్దుబారిపోయింది. ఇంటికి రావాలనిపించలేదు. మర్నాడు డాక్టరు దగ్గరికి వెళ్ళినప్పుడు "ఇది అంటువ్యాధి కాదు, ఇంట్లో వాళ్లకి నచ్చచెప్పి మందులు తీసుకోండి" అని ఎన్నో విధాలుగా ధైర్యంచెప్పారు.

అయినా తెలియని మనోవ్యధ, డాక్టరు ముందే ఏడ్చేశానురా, ఏం చెయ్యనురా ఇంజెక్షన్లు ద్వారా వచ్చినదానికి... ఏ తప్పు చేయకపోయినా బలి అయిపోయానురా.

మీతో ఎలా చెప్పాలి. ముఖ్యంగా కోడలితో ఏమని చెప్పుకోను, ఈ విషయం తెలిస్తే ఎన్నెన్ని అనుమానాలు, అసలు దీనికన్నా భయంకరమైన అంటువ్యాధులు ఉన్నాయి. కానీ ఈ జబ్బు కొచ్చినంత చెడ్డపేరు దేనికీ రాలేదు. ఎన్ని రాత్రిళ్ళు కుమిలిపోయానో మీకేం తెలుసు. దానికి తోడు కిరణ్, నన్ను పట్టుకొని వదిలేవాడు కాదు. వాడికి అన్నం పెట్టాలన్నా దగ్గరికి తీసుకోవాలన్నా భయపడి చచ్చిపోయేదాన్ని. ఆ చంటివాడు నా ఒళ్లో కూర్చుని ఎన్ని ముద్దులు పెట్టేవాడో, ఒళ్ళో బాంబులు పెట్టుకొని ఆ చంటివాడ్ని చంపేస్తున్నట్లుగా నరకం అనుభవించానురా. నా పరిస్థితి అంతా వివరించి ఏం చెయ్యాలో తెలియటం లేదని మళ్లీ డాక్టరు దగ్గర ఏడ్చాను. అప్పుడే డాక్టర్ కాంతమ్మగారిని పరిచయం చేశారు.

ఆవిడ ఓ ఇల్లు అద్దెకు తీసుకొని ఇలా హెచ్.ఐ.వి. తో బాధపడుతున్న ఆడవాళ్ళని, పిల్లలని చేరదీసి, వాళ్లతో చేతి పనులు చేయించి వాటిని అమ్మి వాళ్ళకి ఉపాధి కల్పిస్తుందట. అద్దెకిచ్చిన వాళ్ళకి ఎలా తెలిసిందో వీళ్ళంతా ఎయిడ్స్ వచ్చిన వాళ్లని, రాత్రికి రాత్రే సామాన్లని, పిల్లల్ని, ఆడవాళ్లని రోడ్డుమీదకి తరిమేశారు. ఆవిడ ఏడుస్తూ చెబుతుంటే కన్నీరు ఆగలేదు.

ఆవిడకి ఎలాంటి జబ్బు లేకపోయినా, సమాజంలో వెలివేయబడ్డ అభాగ్యులను చేరదీసి, వాళ్ల కోసం పాటుపడుతున్న కాంతమ్మగారిని చూసి జ్ఞానోదయం అయినట్లు అనిపించింది. అప్పుడే నిర్ణయించుకొన్నాను. మీ నాన్నగారు కొన్న ఆ స్థలం ఖాళీగా ఉంది. ఎప్పటికైనా మంచి ధర రావచ్చు. అయినా నా నిర్ణయం మారలేదు. ఆ మర్నాడు మీకు చెప్పి స్థలం కాగితాలు, కొంత డబ్బు తీసుకొని వెళ్ళిపోయాను. మిమ్మల్ని చూడడానికి కూడా రావద్దన్నాను గుండె రాయి చేసుకుని. అక్కడ ఉన్నన్నాళ్ళు చచ్చి బతికానురా. శరీరం మాత్రమే వాళ్ళ కోసం శ్రమించేది. మీ కోసం మనవల కోసం ఎంత బాధపడేదాన్నో... మిమ్మల్ని చూడాలని తపించిపోయేదాన్ని...

ఆ ఖాళీ స్థలంలో గుడిసెలు వేయించాను. అందరికీ తిండి కోసం సామాన్లు కొన్నాను. ఆ తరువాత వాళ్ల చేత అల్లికలు, కుట్లు, ఎన్నో రకాల చేతి పనులు చేయించి, బజారులో అమ్మేవాళ్ళం. వాటి మీద వచ్చిన ఆదాయంతో మందులు ఇప్పించేవాళ్ళం. సమాజంలో కలవలేనందుకు అనుక్షణం కుమిలి పోయేవారు. లోకం నుంచి వెలివేయబడ్డ వాళ్లని చూస్తే జాలి వేసేదిరా. వాళ్ళు వధ్యశిల మీద

ఉన్న జీవచ్ఛవాలురా... నన్ను మన్నించరా రవీ, నీకు వీళ్ళ మీద దయ కలిగితే వాళ్లకి ఏడాదికి ఒక్కసారి బియ్యం, పప్పులు పంపించరా. అందుకే నేను చనిపోయాక ఈ ఉత్తరం నీకు ఇమ్మన్నాను. బతికి ఉండి నీ ముఖం చూడలేకపోయానురా... ఇందిరకు పుట్టిన చిన్నదాన్ని చూడాలని వేగి పోయాను. ఇందిర చాలా మంచి అమ్మాయి. ఇద్దరూ కలకాలం సుఖంగా ఉండండి.. మీ అందరికీ నా ఆశీస్సులు...'

అమ్మా ...

కన్నీళ్ళు ధారాపాతంగా చెంపల మీద నుంచి జారిపోతున్నాయి. కడుపులో నుంచి దుఃఖం, తన్నుకురాగా అప్పుడు ఏడ్చాడు రవి వెక్కి వెక్కి 'అమ్మా' అంటూ. ఇంకా పడుకోలేదేమిటా అని అనుకుంటూ చూడడానికి వచ్చిన ఇందిరకి, కింద పడేసి ఉన్న కాగితాలని, మోకాళ్ళ మధ్య తల పెట్టుకొని ఏడుస్తున్న భర్తని చూసి కంగారుపడిపోయింది. ఉత్తరం పూర్తిగా చదివిన ఇందిర భర్తను ఓదారుస్తూ లేవదీసింది. ఇద్దరూ ఒకరినొకరు ఓదార్చుకున్నట్లుగా తనివితీరా ఏడ్చారు. చాలు... మహాసముద్రం లాంటి ఆవేదన ఆర్పడానికి వేదనతో రగులుకుపోయిన ఆత్మకి ఆ కన్నీటి తర్పణాలు చాలు.

# అగుపించని అదృష్టం

**–శ్రీపతి బాలసరస్వతి**

'**అ**వ్వ!.... పుట్టి బుద్దెరిగి ఇన్నేళ్ళయింది. ఇలాంటి విడ్డూరం ఎప్పుడూ కనలేదమ్మా... ఎప్పుడూ వినలేదయ్యా... కానీ... కానీ స్వయంగా చవి చూస్తున్నానర్రేయ్' స్వగతంగా అరుచుకున్నాను. ఒకటోసారి, రెండోసారి, కోటోసారి. ఎందుకంటే బిగ్గరగా అరిచినా అది అరణ్యరోదనమే. గోడకి వేసిన బంతే. పోనీ బాధని ఒకరికి చెప్పుకుంటే మనస్తాపం తగ్గుతుందంటారు కదాని ఎవరికన్నా చెప్పుకుందామంటే, ఇంట్లో పని మొదలు పెట్టాకే సూర్యోదయం అవుతుంది. సూర్యాస్తమయం అయ్యాకే పని ముగుస్తుంది. అలాంటప్పుడు ఎక్కడికని వెళ్లనూ? ఎప్పుడని వెళ్ళనూ? ఎవరికని చెప్పమా?... నాన్నకి అమ్మకి ఫోన్ చేద్దామన్నా, ఉత్తరం రాద్దామన్నా ఇంట్లో ఫోన్ లేదు. ఫోన్ కోసం, ఉత్తరం కోసం వెళ్దామన్నా దగ్గరలో అలాంటి ఆకారాలు లేవు. ఊరి చివర ఇదొక అరణ్యవాసమాయె. ఆయనకి చెప్పాలని లేదు. ఎపుడన్నా అమ్మా, నాన్న, అత్తగారు, మామగారు ఉత్తరాలు రాస్తుంటారు. కాలేజికి ఫోన్ చేసి కుశలం అడుగుతుంటారు. మాటిమాటికి వాళ్ళు రావడానికి కుదరదు కదా. పొలంపన్లు. పైగా ఇక్కడ తోచదు వాళ్లకి. పోనీ అద్దంలో చూసుకుంటూ చెప్పుకుందామంటే పేద్ద భవనమనబడే ఆ చిన్న గదిలో బుల్లి అద్దం. దానిలో పూర్తిగా ముఖం కనిపిస్తే ఒట్టు. కాటుక పెట్టుకోవాలంటే అద్దాన్ని కళ్ళెదురుగా పెట్టుకోవాలి. బొట్టు పెట్టుకోవాలంటే నుదురికి ఎదురుగా అద్దాన్ని పెట్టుకోవాలి. కింకర్తవ్యం?

అసలింతకీ సంగతేమిటంటే కాలేజీ లెక్చరర్ అయిన మా వారిని నేను లక్ష్మి బొమ్మలు వున్న బంగారు దుద్దులు కొనిమ్మని అడిగాను. పెళ్ళయి కొత్తగా కాపురానికి వస్తూంటే, రైల్లో ఒకావిడ దుద్దులు లక్ష్మి బొమ్మలతో ధగధగా మెరుస్తూండటం చూశాను. ఎంత బాగున్నాయో....! అసలు ఆ దుద్దులు ఎంత వుంటాయని?... మహా అయితే వెయ్యి రూపాయలు వుంటాయేమో....! ఆ మాత్రం దానికే ఏదో

లక్షలు, కోట్లు ఆస్తులు... అడిగేస్తున్నంత హంగామా చేసేస్తున్నారు. ఇన్నేళ్లుగా చిన్నపిల్లని మభ్యపెట్టినట్లుగా నన్ను ప్రతీ విషయంలోనూ మభ్యపెడుతూనే వస్తున్నారు.

పెళ్ళయిన కొత్త కదా అడక్కుండానే అన్నీ అమరుస్తారని ఆశపడ్డాను. లక్ష్మి దుద్దుల గురించి చెప్పగానే "చూడూ! మనది కొత్త కాపురం. నా జీతం మీదే అన్నీను. మామగారిని అడగను. నాన్నని ఇబ్బంది పెట్టడం ఇష్టంలేదు నాకు. వంటింట్లో సామాన్లు ఏమేం కావాలో మొదట కొనుక్కుని... తర్వాత.... " చాలా నిదానంగా చెప్పారాయన. నేనేం మాట్లాడగలను ఇంక? ఆ సామాను అప్పుడు కొన్నదీ లేదు. నేను విన్నదీ లేదు, కన్నదీ లేదు.

సంవత్సరం తిరక్కుండానే అబ్బాయిని కన్నాను. పురిటికి నన్ను మా వూరు పంపలేదు. "మీవాళ్లకెందుకు డబ్బు ఖర్చు?" అన్నారు. మా వాళ్లు వస్తామంటే కాదనలేదు. వాళ్లు మూడు నెలలు. అత్తగారు మామగారు నెల రోజులు వున్నారు. నాకు చాలా రెస్టు ఇచ్చారు. ఆ రెస్టు చూస్తే జీవితాంతం పిల్లల్ని కంటూండాలనిపించింది.

పుత్రోత్సాహంతో నా కోరిక కాదనరు. అదే మంచి తరుణం అని ఆ కోరికని తాంబూలంలో పెట్టి మా వారి ముందుంచాను. భోజనం అయ్యాక తాంబూలం చక్కగా వేసేసుకున్నారు. "బుజ్జిగాడి పాలడబ్బా ఖర్చు మన రోజూ ఖర్చుల జాబితాలో చేరింది కదోయ్" అన్నారు నా స్వామి దినఖర్చుల జాబితా రాసిన తన పుస్తకం చూపిస్తూ. బుజ్జిగాడికి పాలడబ్బా ఎందుకండీ నేనున్నానుగా పాడి డబ్బాని అన్నాను ఉక్రోషంగా బిడ్డడు పుట్టాడు అంటూ వాడి చదువు దగ్గర నుంచి ఉద్యోగం కోసం చేసే ఖర్చుల దాకా వెళ్ళిపోయి నా నోరు పెగలకుండా చేశారు.

మా బుజ్జిగాడిని బళ్ళో వేసే రోజుల్లో మా బుజ్జిపాప పుట్టింది. నట్టింట లక్ష్మి వెలసిందనే సంబరంలో నాకు లక్ష్మి దుద్దులు వచ్చి తీరుతాయని ధీమా. కానీ షరామామూలే. 'ఒకరికి ఇద్దరు, ఇద్దరికి ముగ్గురు. ముగ్గురికి నలుగురమయ్యామా?' అంటూ ఆడపిల్లకి చేసే ఖర్చుల్లో పెళ్ళి ఖర్చు కలిపి గీతాజ్ఞాన బోధ చేశారు. అరటి పండు వలిచి పండు వుంచేసి తొక్క ఇవ్వటం అంటే ఇదే.

ఇంక నేనేం చేయగలను?... అయినా ఎన్ననుకుని ఏం లాభం? ఎవరి కర్మకి వారే కర్తలు. నా డిగ్రీ పరీక్షలవుతూనే నాన్నగారి చిన్ననాటి స్నేహితుని

కొడుకు మా వూరికి, మా కాలేజీకి గెస్ట్ లెక్చరర్‌గా వచ్చాడు. మా ఇంట్లో నాలుగు రోజులు వున్నాడు. ఉండి వెళ్ళి పోవచ్చుగా? తన తల్లిదండ్రుల్ని పిలిపించటం, మా పెళ్ళి నిశ్చయించటం. ఏ ఆర్భాటాలూ లేకుండా గుళ్ళో పెళ్ళి జరగటం అన్నీ వారం రోజుల్లో జరిగిపోయాయి. అందరూ నా అదృష్టం అన్నారు. నా అభిప్రాయం గాని, నా ప్రమేయం గాని అవసరం లేదన్నమాట. ఇంకా చదువుకుందామని, ఆ తర్వాత ఉద్యోగం చేస్తూ చాలా ఆర్భాటంగా పెళ్ళి చేసుకోవాలని, అందరూ గొప్పగా చెప్పుకోవాలని చాలా కలలు కన్నాను. అన్నీ కల్లలైపోయాయి. ఇచ్చి పుచ్చుకోవటాలు లేవు. వట్టి చేతుల్తో పంపలేక అమ్మ కారాలు, తీపి వస్తువులు, ఊరగాయలు, పొళ్ళు, పళ్లు ఇచ్చి పంపింది. నాన్న కొంత డబ్బు ఇచ్చి బట్టలు, బంగారం, ఇద్దరినీ కొనుక్కోమని ఆయన్ని బ్రతిమిలాడారు. ఏ కళనున్నారో ఒప్పుకున్నారు. ఆ డబ్బు పుట్టబోయే పిల్లలకి అంటూ బ్యాంకులోనే వేశారు.

హైదరాబాదులో లెక్చరరు ఉద్యోగం అంటే, నాక్కూడా ఏ స్కూల్లోనో టీచర్ ఉద్యోగం రాకపోతుందా అనుకున్నాను. సంబరపడ్డాను. నా సంబరమంతా ఓయాసిస్‌లా మిగిలిపోయింది. పర్మనెంటు పనిమనిషి, వంటమనిషినైపోయాను. ఊహకి కూడా అలాంటి ఊహరాలేదు మరి.

పెళ్లవగానే మా ఊళ్లో పల్లకీ ఊరేగింపు లేదనే కొరత లేకుండా, సిటీ అంతా రిక్షా ఊరేగింపు జరిగింది. ఊరి శివార్లలో ఒక పెద్ద పాతబడ్డ బంగళాలో ఒకే ఒక్క చిన్న గదిలో మా కాపురం. శ్రీకృష్ణ భగవానుడు. తన నోటిలో సమస్త జీవకోటినీ చూపించినట్టు. ఆ గది, తనలో ఇముడ్చుకున్న సామానులన్నిటినీ చూపించింది. ఒక పక్కన సత్తు వంటసామాను, కిరసనాయిలు స్టౌ, డబ్బా, వంట సరుకుల పొట్లాలు, బియ్యం సంచి, మరోపక్కన దిండు, దుప్పటి, చాప, ఇంకో పక్కన చీపురు, ప్లాస్టిక్ చేట, విరిగిపోయిన చెత్త బుట్ట, నాలుగో పక్కన ఒక పాత సూట్‌కేస్, హాండ్‌బాగ్, చేతి సంచి, పైన దండెం, దాని మీద ఒక పాంటు, రెండు షర్టులు... ఆనాడు యశోదమ్మకిలాగే నాకు కళ్ళు తిరిగినట్టయింది అంతా చూశాక.

పిల్లడు వచ్చేంతవరకూ అదే సామ్రాజ్యం. హైస్కూల్లో పిల్లడని, అదే చిన్న స్కూల్లో పిల్లని వేశాను. వేసవి సెలవుల్లో ఒక రోజు భోజనాల దగ్గర 'స్కూల్‌కి

దగ్గరగా రెండు గదుల పోర్షన్ అద్దెకు తీసుకున్నానోయ్’ అని ప్రకటించారు. “అద్దెకు గాక సొంతంగా కూడానా?” నొక్కి నొక్కి పలికాను. “వూళ్ళోకి వెళ్ళి వుంటే చక్కగా పనివాళ్ళు, వంటవాళ్ళు దొరుకుతారు హాయిగా” అన్నాను హాయిగా ఊపిరి పీలుస్తూ. “అలాగే!... అయితే ఇక్కడే వుందాంలే. పిల్లలకి ఇంత దూరం నడక తప్పుతుందని, చదువుకోటానికి టైము వుంటుందని, పబ్లిక్ పరీక్షలు కదా.... అని ఆలోచించాను. సరేలే... నడక అన్నిటికన్నా మంచి ఎక్సర్సైజ్” మెల్లగా అన్నారు. చాపకింద నీరు!... “సరే పదండి” అన్నాను కచ్చిగా ఒక్కొక్క అక్షరం వత్తి పలుకుతూ, సహధర్మచారిణిని కదా!... అంతకంటే నాలోని తల్లి ప్రేమ నన్ను గెలుచుకుంది.

వేసవి సెలవుల్లో ఆ రెండు గదుల ఇంట్లోకి మారిపోయాము. కొంచెం ప్రమోషన్!.... రిక్షా నుంచి ఆటోలో ఊరేగింపు! అప్పుడే పాత మంచం, టేబులు, రెండు కుర్చీలు కొన్నారు. మావారు, నేను గబగబా బయటికి పరుగు తీశాను. “ఎక్కడికి ఆ పరుగు?” అనడిగారాయన నవ్వుతూ. “నేనెక్కడికి పోతాను?.... సూర్యుడు ఎటు ఉదయించాడా అని చూస్తున్నాను” అన్నాను వెటకారంగా.

ఆయన నావైపొకసారి చూసి సామాను సర్దటానికి వెళ్ళిపోయారు. దీని భావమేమి తిరుమలేశా!... దున్నపోతు మీద వానపడ్డట్లే!!

ఆ తర్వాత నెలలో మెత్తని పరుపులు, దిళ్ళు, ఆపై నెలలో దుప్పట్లు, ట్యూబులైట్, టేబుల్ ఫాన్ వెలిశాయి. “ఇంటి వారితో చెప్పవోయ్” అన్నారాయన ఒకరోజున. “ఏమని...? సెకండ్ హాండ్ సామాను కొన్నాము. వచ్చి చూడమనా..?” అన్నాను వెటకారంగా లైటు బిగించటానికి గోడకి మేకులు కొట్టాలికదోయ్! వాళ్ళ గోడ కదా!....” అన్నారు. “ఆ మేకులేవో నా పెదాలకి కొట్టేయండి. నా చిరకాల వాంఛ నాలోనే వుండిపోతుంది” నా గొంతులో జీర!

“సామాను సర్దటంలో సాయం చేయచ్చు కదా” శాంతంగా అడిగారాయన. “ఎన్ని లారీల సామానుందో సర్దటానికి?” గొణుక్కుంటూ రంగంలోకి దిగాను.

గుడ్డిలో మెల్లన్నట్లు, పిల్లల్ని టూర్‌లకి పంపుతారు, పిక్నిక్‌లకు పంపుతారు. మంచి సినిమాలు, జూ పార్కులు, వాళ్ళతో పాటు తోకని నన్నూ తిప్పుతారు. అంతేగానీ ప్రత్యేకించి ‘నీకేమన్నా కావాలా? ఎక్కడికన్నా వెళ్ళాలని వుందా” అని ఒక్కరోజు కూడా అడిగిన పాపాన పోలేదు. ఏమిటో ఈ బ్రతుకు!...

పిల్లలు కాలేజీకి వచ్చాక, రైల్వే స్టేషన్, హాస్పిటల్, కాలేజి. బస్టాండ్ అన్నిటికీ కొంచెం దగ్గరలో ఒక స్థలం తీసుకుని మూడు గదులు వేశారు. రేకుల కప్పు! ఇంట్లో తనవంతు పనిచేస్తూ కొత్త ఇల్లు కట్టించడంలో అంతా చూసుకుంటూ చాలా కష్టపడ్డారు. బయట కాలేజి పని! సుఖపడే యోగం మరి!... కానీ నన్ను కూడా సుఖపడనివ్వటంలేదే!

ఇంటి చుట్టూ వున్న ఖాళీ జాగాలో ఒక మామిడి చెట్టు. రెండూ కొబ్బరి చెట్లు, పూల మొక్కలు, కాయగూరల మొక్కలు వేశారు. వరి, పప్పుధాన్యాలు పండించటం ఒకటే తక్కువ.

ముంగిట వూడ్చి ముత్యాల ముగ్గులు నేను పెడితే, ఆయన మొక్కలకి నీరు పెట్టేవారు. ఇంట్లో వూడవటం, కడగటం నా పని. బూజులు దులిపి, సామాను శుభ్రంగా వుంచటం అబ్బాయి పని. మాకు పుట్టటం వాళ్ళ దురదృష్టం! వాళ్ళ పనులు వాళ్ళు చేసుకుంటున్నారులే అనుకుంటే ఈ పనులు కూడా. వాళ్ళ చిన్నప్పుడు వాళ్ళ పనులన్నీ ఆయన చేసేవారు. ఇప్పుడేమో వాళ్ల చేత పెద్ద పెద్ద పనులు చేయిస్తున్నారు. ఆయన గిన్నెలు తోమితే, నేను వంట చేస్తాను. మా ఇద్దరి బట్టలు నేను ఉతుకుతాను. బజారు పనులు ఎవరికి కుదిరితే వాళ్ళు చేస్తాము. అంతా చూస్తే నేను చేసే పనే ఎక్కువ! కానీ దానికి ప్రతిఫలం గుర్తింపు ఎక్కడ?

తోటలో పువ్వులు దేవునికి, నాకు, అమ్మాయికి. కాయగూరలు అందరం తింటాము. కొబ్బరి బోండాలు, నాకు ఏదో రుచి చూపించి, పిల్లలకి కొన్ని వుంచి మిగిలినవి అమ్మేస్తారు అసహ్యంగా. తాను రుచి చూడరు. మా చెట్టు మామిడికాయలతోనే ఆవకాయ. మాగాయ పెట్టాలి. ముక్కలు తను కొట్టి తుడిచి ఇస్తారు. ఇంట్లోనే ఆవపిండి, కారం, ఉప్పు తయారు చేయాలి. ఇంకా నయం నూనె కూడా గానుగ పట్టమనలేదు... పీనాసి!...

అసలు ఆ మాగాయ ముక్కల్తో పాటు నేనూ ఎండిపోతే హాయి. నా కోరిక కూడా ఎండిపోతుంది. ఎవరికీ ఏ గొడవా వుండదు.

కాలేజీకి వచ్చారని పిల్లలకి మంచి మంచి బట్టలు, స్కూటరు కొన్నారు. పిల్లల బాధ్యతలు అయిపోతున్నా నా గతి ఇంతేనా?... పిల్లిని గదిలో పెట్టి కొడుతున్నారు. కానీయండి. ఎదురు తిరిగితే ఎలా వుంటుందో చూపిస్తాను.

"అసలు పిల్లలకి అన్నీ అమరుస్తున్నారు. తండ్రిగా మీ బాధ్యత బాగానే నిర్వహిస్తున్నారు. బాగుంది. కానీ ఆ పిల్లలు మీకు రావటానికి కారకురాలైన నన్ను వదిలేశారు. భర్తగా నాకేం చేశారు మీరు?" ఒకరోజు ఆయన్ని నిలదీశాను. "పిల్లలు కలగటానికి కారకుణ్ణి నేను కదుటోయ్" అన్నారు చిలిపిగా "ఛీ ఛీ... నేనీ ఇంట్లో ఒక బానిసని... జీవచ్ఛవాన్ని పిచ్చిదాన్ని.." నా గొంతు పూడుకుపోయింది...

ఆయన నా దగ్గరగా వచ్చి నా తల నిమిరారు. "ఇన్నాళ్ళూ అంత నిబ్బరంగా వున్నావు. తీరా బాధ్యతలు అయిపోవస్తూంటే ఇప్పుడిదేమిటి?... చూడూ! ఎట్టి పరిస్థితుల్లోనూ మనిషి, తన మనస్సుని, ఎదుటి వాని మనస్సుని కష్టపెట్టకూడదు. ఆలోచనలు వెనక్కు వెళ్ళకూడదు. ముందుకి దూకనూ కూడదు. ఎప్పుడూ ప్రస్తుతంలోనే ఉండాలి" అన్నారు గోముగా. శ్రీరంగ నీతులు బాగానే వుంటాయి. "మనం కొన్నాళ్ళు తీర్థయాత్రలు చేసివద్దామోయ్!... సెలవులు చాలా వున్నాయి" "కలా... నిజమా!...

భుజం మీద మెల్లగా చెయ్యి పడటంతో ప్రస్తుతంలోకి వచ్చేశాను. "ఏమిటి ఎక్కడ వున్నావు? ఏమిటా పరాకు?... పిల్లల గురించి దిగులు పడుతున్నావా? వాళ్ళు వెళ్ళి పోయాక తీరిక ఎక్కువై ఆలోచనలు చోటుచేసుకుంటున్నట్టున్నాయి." చిలిపిగా అడుగుతున్న ఆయన్ని దులపరించుకున్నాను. అంటే ఈ వయస్సులో కూడా కష్టపడాలా? కాస్సేపు విశ్రాంతిగా కూర్చుంటే, పడుకుంటే చూడలేరా?... శాడిస్ట్....!

ఇంక లాభంలేదు. ఇంట్లోంచి పారిపోవటమో, ఆత్మహత్య చేసుకోవటమో, ఏదో చేసేయాలి. తప్పదు. అప్పుడే నా విలువ ఆయనకి తెలుస్తుంది.

కొంచెం సేపయ్యాక ఆయన నా పక్కన కూర్చుని "మనల్ని అర్థం చేసుకుని నడుచుకునే పిల్లలు వుండటం, అన్నీ సవ్యంగా జరుగుతుండటం, ముఖ్యంగా అందరం ఆరోగ్యంగా వుండటం అనేది మన అదృష్టం. అబ్బాయికి మంచి కంపెనీలో మంచి ఉద్యోగం వచ్చింది. పిల్లలిద్దరికీ మంచి సంబంధాలు వచ్చి ఏ ఆటంకాలూ లేకుండా పెళ్ళిళ్ళయ్యాయి. అమ్మాయికి వూళ్ళో సంబంధం! నీక్కావల్సినపుడల్లా పిల్లని

చూసుకోవచ్చు. అబ్బాయిని కంపెనీ వాళ్ళు అమెరికా పంపించారు. ప్రాజెక్టు అయిపోగానే వచ్చేసి మన దగ్గరే వుంటానన్నాడు కదా! మన కోడలు, అల్లుడు కూడా చాలా మంచివాళ్ళు. వియ్యాలవారు స్నేహస్వభావులు. ఇంతకంటే మనకింకేం కావాలి చెప్పు?... మా వారు చెపుతున్నది వినకుండా "చివరికి నా కోరిక అబ్బాయి తీరుస్తాడు లెండి. పోనీ మంచివాడు గదా అల్లుణ్ణి అడగమంటారా? అబ్బాయి వచ్చేంత వరకూ నా ప్రాణాలు అనంతవాయువుల్లో కలిసిపోవని గ్యారంటీ ఏమిటి?... ఇదిగో చూడండీ! నేను పైకి వెళ్ళిపోయినా, నా ఆత్మ మీ చేత ఆ లక్ష్మీ దుద్దులు కొనిపించి తీరుతుంది" గట్టిగా అన్నాను.

నాలో నేనే ఏడ్చుకుంటూ పడుకుండిపోయాను. ఎప్పుడు నిద్రపట్టేసిందో! దేవుని గంట మోతకి మెలకువ వచ్చింది. ఇంత ఆలస్యంగా లేవటం జీవితంలో ఇదే మొదటిసారి.

ఎదురుగా మా వారు! దేవుని హారతి నాకు అద్ది, నా నుదుటిని తన పెదవులతో సున్నితంగా తాకారు. "హాపీ బర్త్‌డే" అంటూ నా చేతిలో గిఫ్ట్ పేపరులో కట్టిన చిన్న పెట్టె పెట్టారు. ఒక కవరు కూడా పెట్టారు. పెట్టె విప్పుతీయి అన్నట్టు చూశారు. విప్పి చూశాను. "లక్ష్మీ దుద్దులు!".... ధగ ధగా మెరిసిపోతున్నాయి.

"దేవునికి దీపం పెట్టి పాలు పంచదార నివేదన చేశాను. త్వరగా స్నానం చేసిరా. తీర్థం తీసుకుందువు గాని" అన్నారాయన ఆప్యాయంగా.

నా చేతిలోని కవరు విప్పి లోపలి కాగితం చూశాను.

"నా పేర పదిలక్షలకి ఫిక్స్‌డ్ డిపాజిట్"! ఆశ్చర్యానందాలతో ఆయనవైపు చూశాను. "నా పేర ఏమీ లేదని చూస్తున్నావా?.... ఇన్నేళ్ళుగా నా కష్టంలో, సుఖంలో నన్ను గౌరవించి, చేదోడు వాదోడుగా వున్న నువ్వే నాదానివైనప్పుడు నాకా డబ్బు ఎందుకు చెప్పు?... చూడూ! ఈ స్థిరాస్తి, చరాస్తి నీ తర్వాతనే పిల్లలకి చెందుతాయి. ఒక వేళ నీ కంటే నేను ముందు పోతే నువ్వెవరినీ దేనికీ చేయిచాచి ఏదీ అడగక్కరలేదు... ... చూడూ! త్వరగా లేచి స్నానం చేసినా. రాత్రి పన్నెండింటికి

అంతా ఫోన్లు చేశారు. శారీరకంగా, మానసికంగా అలసిపోయి వున్నావు. హాయిగా ఆదమరచి నిద్రపోతూ విశ్రాంతి తీసుకుంటున్నావు. అందుకే నిన్ను లేపలేదు. మనవాళ్ళు మళ్ళీ ఫోన్లు చేస్తారు. ముందు గుడికి వెళ్దాము. అమ్మాయి అల్లుడు వియ్యాలవారు అక్కడికి వచ్చే ఏర్పాటు చేశాను. తర్వాత అందరం కలిసి హోటల్‌కి భోజనానికి వెళ్దాము. ఆ తర్వాత సినిమాకి వెళ్దాము సాయంత్రం పార్కుకి వెళ్ళి చల్లగాలిలో మనసుకి శాంతిగా, హాయిగా గడుపుదాము'' ఏమిటేమిటో చెప్పుకుపోతున్న ఆయన్ని అమాంతం కౌగలించేసుకున్నాను నా అంతట నేను మొదటిసారిగా. మా మధ్యన చోటుచేసుకోవాలని పంచభూతాలూ విఫల ప్రయత్నం చేశాయి.

# విందైన వంటకం

-ఎస్వీ.కృష్ణజయంతి

**"స**మరానికి నేడే ప్రారంభం... గృహరాణికి మూడెను ప్రారబ్ధం... భువర్లోకమున ధరల ధాటికి ఎదురే లేదని చాటిద్దాం... జైజై చక్కెర... జై కందిపప్పు... జైజై శనగనూనె! జయహో మినప్పప్పు - జయ జయహో దొడ్డు బియ్యం!!"

అదేదో సినిమాలో పాటకి అనుగుణంగా పదాలు మార్చి పాడ్తున్న పన్నెండేళ్ళ కొడుకు 'నాని' గాడి పాట విని - వంటగదిలో పనిలో నిమగ్నమై వున్న భారతికి నవ్వూ, దుఃఖమూ రెండూ ఒకదానివెంట ఒకటి తన్నుకొచ్చాయ్.

నానిగాడు మహాచురుకు పిల్లాడు! వాడికి చదువు, తెలివితేటలు, లౌకిక జ్ఞానం అన్నీ ఎక్కువే, పైగా అస్తమానం జోకులు వేస్తూ తెగ నవ్వించడమే గాక విసిగిస్తాడు కూడా!

భారతి భర్త గంగాధర్ ప్రభుత్వోద్యోగి, మరీ పెద్ద ఆఫీసర్ కాకపోయినా, మధ్య తరగతి కుటుంబాన్ని 'మధ్యస్థంగా' కొనసాగించడానికి సరిపడా జీతభత్యాలున్నాయి. అప్పటివరకూ ఏ సమస్యలూ, బాదరబందీలూ లేవు. ఇంటి ఖర్చులకీ, నెలకి - రెండుసార్లు సినిమాలకీ, ఓసారి హోటల్‌కీ వెళ్ళేందుకు ఆర్థికంగా ఇబ్బంది పడాల్సిన పరిస్థితేమీ లేదు. అంతేకాదు, నానిగాడి చదువుకీ, స్కూలు ఫీజులకీ 'అప్పులు' చేయడాలూ, 'ఆఫీసులో అడ్వాన్సులు' తీసుకోవడాలూ, 'లోన్లకి అప్లయ్ చేయడాలూ' లాంటి అవసరం కూడా అప్పటివరకూ రాలేదు. ఒడిదొడుకుల్లేక అంతా సవ్యంగానే గడుస్తోందా సంసారానికి.

అయితే... నిత్య జీవితానికి సంబంధించిన విషయాల్లో ఈ మధ్యే అకస్మాత్తుగా 'తేడా' వచ్చింది ఆ కుటుంబంలో.

భారతి వంట బాగా చేస్తుంది....

ముఖ్యంగా 'పప్పు కూరలు' మహా బాగా చేస్తుంది. ముద్దపప్పు, మామూలు పప్పు, దోసకాయ పప్పు, గోంగూర పప్పు, పాలకూర పప్పు, ఆనపకాయ పప్పు, వగైరా, వగైరా.... అసలు – 'పప్పు'తో కూడిన ఏ కూర చేసినా అదిరిపోవాల్సిందే! తినేవాళ్ళ చవులూరాల్సిందే!!!

అందుకే... గంగాధర్ ఆఫీసుకీ, నానిగాడు స్కూలుకీ బయల్దేరేటప్పుడు – మధ్యాహ్నం భోజనానికి క్యారియర్‌లో "ఈ రోజు ఏం పప్పుకూర సర్దావ్?" అని వారానికి నాలుగుసార్లు కన్‌ఫర్మ్ చేసుకునిగానీ ఇంట్లోంచి బయటకి అడుగుపెట్టరు. నానిగాడి కంటే గంగాధర్‌కే పప్పుకూరలంటే మహాప్రీతి. పప్పుతో తిన్నప్పుడే సుష్టుగా భోంచేశానన్న తృప్తి కలుగుతుందంటాడతను తరచూ.

ఇక, ఆ 'తృప్తి' కలకాలం నిలచేది కాదనీ, ఆ 'అనుభూతి' ఎల్లకాలం మిగిలేది కాదనీ, ఆవిరైపోయే ఆపద ముంచుకొచ్చిందన్న విషయం ఈ మధ్యే ఆ కుటుంబానికి అనుభవపూర్వకంగా అర్థమైంది.

భర్తకి వెసులుబాటున్న రోజున వీలుచేసుకుని ఏదైనా సూపర్‌బజార్‌కి వెళ్ళి నెలకి సరిపడా సరుకుల్ని ఒక్కసారే కొనితెచ్చుకుని నెల పొడవునా జాగ్రత్తగా, పొదుపుగా వాడడం భారతికి అలవాటు. క్రితం నెల 'షాపింగ్' లో – పెరిగిన సరుకుల ధరల్ని చూసినప్పటి నుండీ ఆమె గుండె సక్రమంగా పని చేయడం మానేసింది.

కానీ, డిగ్రీదాకా చదువుకున్న 'ఎడ్యుకేటెడ్ లేడీ' కావడం వల్ల 'కష్టసుఖాలు' కావడి కుండలనీ, లాభనష్టాలు కలకాలం వుండవనీ... అనుకుంటూ తనకు తానే ధైర్యం చెప్పుకుని – 'పాజిటివ్ థింకింగ్'తో గుండెనిబ్బరం పెంచుకుని, ఎలాగోలా ఆ నెల నెట్టుకొచ్చేసింది.

తిరిగి ఈ నెల – తీరిక చేసుకుని సరుకులు కొనడానికి కొడుకు నానిగాడితో పాటు బైక్ మీద భర్త వెనకాల కూర్చుని షాపింగ్‌కి బయల్దేరింది భారతి.

షాపులోకి అడుగుపెట్టిన వెంటనే రొటీన్‌గా ట్రాలీ నెట్టుకుంటూ రాక్స్ దగ్గరికి వెళ్లి ఇంటికి అవసరమైన సరుకుల్ని అందులో పడేసుకుంటూ వెళ్ళసాగింది భారతి. సరుకులు తీసుకోవడం పూర్తి చేసుకుని ఆమె బిల్లింగ్ కౌంటర్ దగ్గరికొచ్చేసరికి 'టైమ్' పడ్తుంది కాబట్టి – అప్పటివరకూ షాపంతా కలియతిరుగుతూ... షాపింగ్‌కు

వచ్చినవాళ్ళ వంక ఎగాదిగా చూస్తూ... తనకు నచ్చిన ప్రొడక్ట్స్ వున్న రాక్స్ దగ్గర నిలబడి గడవటం గంగాధరానికి అలవాటు.

అదే అలవాటు కొద్దీ షాపులో అటూఇటూ దిక్కులు చూస్తూ తచ్చాడుతున్న గంగాధర్‌కి అకస్మాత్తుగా 'సిక్త్ సెన్స్' మేల్కొని – గత నెల 'షాపింగ్ అనుభవం'తో పాటు తన 'మనీ పర్సుపై పడ్డ పెనుభారం' గుర్తొచ్చింది.

అంతే... ట్రాలీలో సరుకులు వేసుకుంటూ ముందుకు సాగుతున్న భార్యా, కొడుకూ ఉన్న చోటికి గబగబా పరిగెత్తాడు. వాళ్ళు తీసుకున్న వస్తువుల్ని తీసుకుని వాటి మీదున్న రేట్ల వంక పరీక్షగా చూశాడు. ఎందుకో... ఒక్కసారిగా కళ్ళు బైర్లు కమ్మినట్లయ్యింది గంగాధర్‌కి.

"భారతీ... ఇవి మనం రెగ్యులర్‌గా కొనే సరుకులేనా? లేక, వేరే గ్రహంలో తయారై ఇండియాకి ఇంపోర్ట్ అయిన 'అదర్ ప్లానెట్' ప్రొడక్ట్‌లా?" అన్నాడు కంగారుగా.

"చాల్లెండి... మీరూ, మీ జోకులూనూ! మేమింత జాగ్రత్తగా, సీరియస్‌గా షాపింగ్ చేస్తుంటే... మీరేంటి ఇలా జోకులేసి డిస్టర్బ్ చేస్తారు? ఇవన్నీ మనం ప్రతినెలా కొనే ఉప్పుపప్పులే!" అంది భారతి భర్తని విసుక్కుంటూ.

జోకులు కాదే... పిచ్చిమొహమా! నేను సీరియస్‌గానే అడుగుతున్నాను – ఇవి వేరే గ్రహంలో తయారైనవి కాకపోతే... మరి, వీటి రేట్లేంటి ఈ 'రేంజ్'లో ఉన్నాయి... చంద్రమండలాన్ని దాటిపోయేట్లు??" ట్రాన్స్‌లోంచి ఇంకా బయటకి రాకుండానే అన్నాడు గంగాధర్.

"అందుకే కదా... నేనింత జాగ్రత్తగా, సీరియస్‌గా, పూర్తి కాన్సన్‌ట్రేషన్‌తో ఎంతో అవసరమైన సరుకులు మాత్రమే తీసుకుంటున్నాను!" అంది భారతి – తన టాలెంట్‌ని తెలుపుతూ.

అప్పటికి కాస్త తేరుకున్నట్లున్నాడు గంగాధర్ – "అది కాదు భారతీ! ఈ రేట్లు చూస్తూంటే... నాకు కళ్ళు తిరిగి, గుండె ఆగి ఆగి కొట్టుకుంటున్నట్లుగా ఉంది!" అన్నాడు.

"మీకే కాదు – నాకూ కళ్ళూ, గుండె ఉన్నాయ్! అయినా... మనం బతకాలి కాబట్టి ఇలాంటి వాటన్నిటికీ తట్టుకోవాలి మరి!" భర్త వంక జాలిగా చూస్తూ ధైర్యం చెప్పింది భారతి.

"ఏంటో... ఇది కలో, నిజమో అర్థంకావడం లేదు నాకు!"

"ఆనందమో, ఆశ్చర్యమో కలిగినప్పుడు అలా అనాలి కాని – ఇలాంటి ఆపదలొచ్చినప్పుడు కాదు!" భర్త భావప్రకటనని సరిచేసింది భారతి.

చప్పున పాటందుకున్నాడు నానిగాడు "కల కానిదీ, విలువైనదీ... బ్రతుకు – కన్నీటిధారలలోనే బలిచేయకూ!" అని.. చాటుగా కొడుకు వీపు గిల్లింది భారతి. 'ష్ష్ష్ఁఆపరా! అసలే మీ నాన్న 'తెలుగు సినిమాలు చూసి కంటతడి పెట్టుకునేంత' సెన్సిటివ్!" అంది గుసగుసగా.

నానిగాడు ఠక్కున 'స్పీకర్' ఆఫ్ చేశాడు. అంటే... నోర్మూసుకున్నాడు.

షాపింగ్ పూర్తిచేసుకుని బిల్లింగ్ కౌంటర్ దగ్గరికొచ్చారు ముగ్గురూ.

ట్రాలీలోని సరుకుల్ని ఒక్కొక్కటే పైకి తీసి, వాటి రేట్లు చూస్తూ 'కీ – బోర్డు'పై వేగంగా వేళ్ళు కదిలిస్తూ కంప్యూటర్ బిల్లు తయారు చేస్తున్న కౌంటర్‌లోని క్లర్క్ వంక గుండెలు చిక్కబట్టుకుని, కనుగుడ్లు మిటకరించి బిక్కుబిక్కుమంటూ చూడసాగాడు గంగాధర్.

బిల్లు తయారైంది!

'సర్ర్ర్ర్ఁ....' మంటూ చింపి కౌంటర్‌లోని క్లర్క్ అందించిన బిల్లుని చేత్తో తీసుకుని, దానివంక చూసిన గంగాధర్‌కి – గుండె ఆగినట్లయి, స్పృహ తప్పుతున్నట్లనిపించింది.

అసంకల్పితంగా 'ఒరే నాని... భారతీ...." అంటూ ఆసరా కోసం కౌంటర్ పక్కనున్న గోడకి ఆనుకొని, ఊపిరి భారంగా తీసుకోసాగాడు గంగాధర్.

"ఏమైందండీ...." అంటూ కంగారుగా భర్త దగ్గరి కొచ్చింది భారతి.

కౌంటర్‌లోని క్లర్క్ కాస్త ముందుకి వంగి "మేడమ్... ఎనీ ప్రాబ్లమ్?" అన్నాడు భారతి వంక చూస్తూ.

వెనక్కి తిరిగి అతడి వైపు చూస్తూ "అదీ...." అంటూ ఏదో అనబోయింది భారతి.

"డోంట్ వర్రీ మేడమ్... ఈ మధ్య షాపుల్లోకి వచ్చిన కొంతమంది మగవాళ్ళు ఇలాగే బిల్లింగ్ కౌంటర్ దగ్గర అబ్‌నార్మల్ స్టేట్‌లోకి వెళ్ళి అన్‌కాన్షస్ అవుతున్నారు. భయపడాల్సిందేమీ లేదు. జస్ట్ః.. 'ఫస్ట్ ఎయిడ్' చేస్తే మళ్ళీ నార్మల్ స్టేట్ కొచ్చేస్తారు. ఎందుకైనా మంచిదని మా కస్టమర్స్ కోసం ఓ 'వన్నాట్ ఎయిట్' అంబులెన్స్‌ని కూడా రెగ్యులర్‌గా మా షాపు ముందే రెడీగా ఉండే ఏర్పాట్లు చేశాం. సోః... 'ఫస్ట్ ఎయిడ్' లేదా 'వన్నాట్ ఎయిట్' – మీకేది అవసరమైతే దాన్ని యుటిలైజ్ చేసుకోవచ్చు!" చాలా కూల్‌గా చెప్పాడతను..

"భారతీ... ఓసారిలారా!" భోజనానికి కూర్చుంటూ భార్యని కేకేశాడు గంగాధర్.

బాల్కనీలో బట్టలు ఆరేస్తున్న భారతి – భర్త కేకకి గబగబా లోనికొచ్చింది – "ఏమిటండీ... ఏమైందీ?" అంటూ.

"మన నానిగాడి అల్లరి రోజురోజుకీ మితిమీరిపోతోంది. వాడ్ని నువ్వు కంట్రోల్‌లో పెట్టట్లేదు!" తీవ్రంగానే అన్నాడు గంగాధర్. భర్తకి కోపం తెప్పించే పనేదో నానిగాడు చేసేవుంటాడనుకున్న భారతి –

"మళ్ళీ ఏం చేశాడండీ?" అంది అనునయంగా.

"చూడు.... ఏం చేశాడో!?" అంటూ ముందుకి వంగి ప్లేటులోకి పరీక్షగా చూసింది.

"ఏం... వేళాకోళమా? అన్నం ప్లేటులో ఒలకబోసిన నీళ్ళు నీక్కనిపంచట్లేదా?" రుసరుసలాడాడు గంగాధర్.

"ఓస్ః... ఇదా?" అంటూ తేలిగ్గా నిట్టూర్చి – "ఈ పని చేసింది వాడుకాదు... నేను!" అంది.

"ఏంటీ... నువ్వా?"

“ఔను .... నేనే! అయినా... మీరనుకుంటున్నట్లుగా అవి నీళ్ళు కావు!”

“మరి....??”

“చారు... పప్పుచారు! మీరెంతో ఇష్టపడే మీకు నచ్చిన కూర!”

నివ్వెరపోయాడు గంగాధర్ – “ఏమిటీ... ఇది చారా? పైగా, నాకెంతో ఇష్టమైన పప్పుచారా?” అంటూ ప్లేటందుకుని పైకెత్తి పట్టుకుని, కంటికి దగ్గరగా పెట్టుకుని మరీ పరీక్షగా చూసి – “ నో్నో....” అని అరిచాడు.

“మీరు ‘నో’ అన్నా – ‘నై’ అన్నా... ఒప్పుకున్నా, ఒప్పుకోకపోయినా... అది పప్పుచారే!” కుండబ్రద్దలుకొట్టినట్లు ఘంటాపథంగా చెప్పింది భారతి.

అయోమయంగా చూశాడు గంగాధర్ – “అది కాదు భారతీ! ఈ నీళ్లలో – సారీ... నువ్వనే ఈ ‘పప్పుచారు’లో కందిపప్పు రేణువులు కంటికి కనిపించే రేంజ్‌లోనైనా వున్నాయా....? చూసి నువ్వే చెప్పు! మైక్రోస్కోప్‌లో చూస్తే అయినా కనిపిస్తాయంటావా?” అన్నాడు.

“కందిపప్పుని మర పట్టించి పిండి చేయించి “పప్పుచారు” చేశాను. మరి, వారానికి నాలుగుసార్లు చొప్పున కిలో కందిపప్పు మూడ్నెల్లయినా రావాలా, వద్దా!” ఎదురు ప్రశ్నించింది భారతి.

“అలాగని... ” అసహనంతో గంగాధర్ ఏదో అనబోయేంతలో....

“మీరు ఎన్నైనా చెప్పండి... ఇక మీదట మీకిష్టమైన పప్పుకూరలన్నీ మనింట్లో ఇలాగే వుంటాయ్!” ఖండితంగా చెప్పేసింది భారతి.

“అది కాదు భారతీ! అసలు నేను చెప్పేది....” అంటూ మళ్ళీ గంగాధర్ ఏదో అనబోతుండగా....

“ఏమిటండీ మీరు చెప్పేది? చాలామంది తమ ఇళ్లల్లో పప్పుకూరలు వండడమే మానేశారు... తెలుసా? కానీ, పప్పంటే మీకెంతిష్టమో, అది లేనిదే మీకు గొంతులోంచి ముద్ద దిగదని నాకు తెలుసు కాబట్టి నేనింకా మానేయలేదు.... తెలుసా? నన్నూ నా మనసునీ అర్థం చేసుకోవాల్సింది పోయి – ఇలా తప్పు పడ్తారా?” అంది భారతి కొంచెం తీవ్రంగానే...

"అలాగని... ఇలాగా చేయడం? అసలు... "

గంగాధర్ మాటలు పూర్తికాకుండానే ఒక్కసారిగా బరస్ట్ అయ్యింది భారతి–

"మీరేమనుకున్నా సరే... నాకు మీ ఇష్టాయిష్టాల కంటే మీ క్షేమం ముఖ్యమండీ! మొన్నటికి మొన్న సరుకులు కొనడానికి షాపుకెళ్ళినప్పుడు ఏం జరిగిందో అప్పుడే మర్చిపోయారా? మీరలా కళ్ళు తిరిగి, గుండె చిక్కబట్టుకోవడానిక్కారణం... ఈ కందిపప్పు రేటే కదూ!?" గొంతు గాద్గదికమై – గుండెలోంచి దుఃఖం ఎగదన్నుకొస్తూంటే...

"మీకు... మీకు... మీకు... ఏమైనా అయితే...." అంటూ వెక్కిళ్ళ మధ్య మాట పెగలక – ఒక్కసారిగా అతడి గుండెల మీద వాలిపోయి, "... నేనూ, నానిగాడూ ఏమయిపోతామండీ....!?" అంటూ బావురుమంది భారతి.

బిక్కమొహంతో చేష్టలుడిగిపోయి నిల్చుండిపోయాడు గంగాధర్.

నెల రోజుల తర్వాత – ఓ రోజు సాయంత్రం...

"ఏమిటి భారతీ... మాట్లాడవ్?" పదకొండోసారి అడిగాడు గంగాధర్ భార్యని.

"ఏంటి నాన్నా... అమ్మ ఏం మాట్లాడాలీ?"

అప్పటిదాకా బయట ఆడుకొని వచ్చి, కాళ్ళూ చేతులూ కడుక్కొని చదువుకోడానికి బుక్స్ ముందేసుకుని కూర్చుంటున్న నానిగాడు అడిగాడు నాన్నని.

గంగాధర్ నానిగాడి వైపు తిరిగి "ఏం లేదు నాన్నా... రేపు నా బర్త్‌డే! అంటే... నేను పుట్టినరోజన్న మాట! రేపు ఆఫీసుకి సెలవు పెట్టాను. ప్రతీ సంవత్సరం నా బర్త్‌డేని చాలా బాగా సెలబ్రేట్ చేసుకుంటాం కదా! అలాగే 'రేపు ఉదయాన్నే అందరం ఇంట్లోంచి బయల్దేరి 'వాటర్ వరల్డ్'కో, 'స్నో వరల్డ్'కో, లేదా ఏదైనా చక్కటి పిక్నిక్ స్పాట్‌కో వెళ్ళి సరదాగా గడిపి, మధ్యాహ్నం ఏదైనా హోటల్‌లో లంచ్ చేసి, ఆ తర్వాత పార్క్‌కీ, ట్యాంక్‌బండ్‌కీ వెళ్ళి, అట్నుంచి 'ఐ – మాక్స్'లో సినిమా చూసి, వచ్చేటప్పుడు మళ్ళీ ఏదైనా హోటల్‌లో డిన్నర్ చేసొద్దాం... ఏమంటావ్?" అని మీ అమ్మని ఇందాకట్నుంచీ అడుగుతున్నాను. కానీ, అమ్మేమీ రెస్పాన్స్ ఇవ్వట్లేదురా కన్నా!" అన్నాడు.

"వావ్‌ఁ... వండ్రఫుల్! మరి, అమ్మ ఎందుకు రెస్పాన్స్ ఇవ్వట్లేదు నాన్నా? ఈ ప్రోగ్రామ్ అమ్మకి నచ్చలేదా" అర్థంకానట్లు అడిగాడు. నానిగాడు.

"ఏమో... నాకేం తెలుసూ? మీ అమ్మనే అడుగూ....!" ఖాళీ చేసిన కాఫీ కప్పును తన చేతిలోంచి అందుకోడానికి ముందు వంగిన భారతి కళ్లలోకి గుచ్చిగుచ్చి చూస్తూ అన్నాడు గంగాధర్.

"ఏమ్మా! నాన్న చెప్పిన ప్రోగ్రామ్ నీకు నచ్చలేదా?" అర్థంకానట్లు చూశాడు నానిగాడు తల్లివంక.

"ఉహుఁ నచ్చలేదు!" అంది భారతి – నానిగాడి వంక నవ్వుతూ చూస్తూ.

"వ్వాట్‌ఁ... నచ్చలేదు!" ఉలిక్కిపడ్డాడు గంగాధర్ – "ఇంతకంటే గొప్ప ప్రోగ్రామ్ ప్లాన్ చేయగలవా నువ్వు?" అన్నాడు బింకంగా భార్యవంక చూస్తూ.

"చేయగలను! అంతేకాదు, అది వింటే మీకు కూడా నచ్చుతుంది. మీరూ సంతోషంగా ఒప్పుకుంటారు!" తల పైకెగరేస్తూ అంతూ కాన్ఫిడెన్స్‌తో అంది భారతి.

"ఏంటమ్మా... అదీ?" నానిగాడు గోముగా అడిగాడు.

"చెప్తాను కానీ... మీ నాన్నకి ఇంట్రెస్ట్ లేనట్లుందిరా! ఆయన్ని కూడా అడగమను చెప్తాను!" అంది ఊరిస్తున్నట్లుగా.

"చెప్పు... చెప్పు... రేపెక్కడికి వెళ్దామో?! ఆ 'స్పాట్' అంత బాగుండేదైతే నేనెందుక్కాదంటానూ?!" అన్నాడు గంగాధర్ ఉడుక్కుంటూనే.

నవ్వుతూ చెప్పింది భారతీ – "ఎక్కడికీ వెళ్లక్కర్లేదు... ఆ 'స్పాట్' మనిల్లే! రేపుదయం మీరిద్దరూ నిద్రలేచి స్నానాలు ముగించే టైమ్‌కి డైనింగ్ టేబుల్ మీద 'ముద్దపప్పు, మామూలు పప్పు, దోసకాయ పప్పు' గోంగూర పప్పు, పాలకూర పప్పు, ఆనపకాయపప్పు', ఇంకా చిక్కటి 'పప్పుచారు' కూడా సిద్ధంగా వుంటాయ్... ఓకే!"

అంతే... "వావ్‌ఁ... వండ్రఫుల్!" అంటూ నానిగాడు, "య్యురేకాఁ... రియల్లీ యువార్ గ్రేట్ భారతీ!" అంటూ గంగాధర్.. ఆపుకోలేని ఆనందాన్ని వ్యక్తం చేశారు.

ఆ తర్వాత – "బర్త్‌డే భోజనంబూ... విందైన వంటకంబూ".... అంటూ నానిగాడు పాటందుకునేసరికి – తనివితీరా నవ్వేశారు భారతి, గంగాధర్‌లు.

# రేపటి కోసం...

**–పుట్ల హేమలత**

ఇప్పటికి వారం రోజులుగా ఆ ఇద్దరి మధ్యా ఈ మౌనం ఇలా కొనసాగుతూనే ఉంది. వేడిగాలుల రాపిడికి వేసవి రాత్రి మౌనంగా కరుగుతోంది.

గత నాలుగేళ్ళుగా ఎంతో విశాలంగా కన్పించిన ఆ డబుల్‌కాట్ ఇప్పుడెంతో ఇరుకైనట్టుగా ఉంది. శ్రీకాంత్ మంచం మీద అసహనంగా కదిలాడు. అతని వీపుకి సుమ శరీరం మెత్తగా తగుత్తోంది.

ఎప్పటిలా ఆ స్పర్శ అతనికి హాయిగా మత్తు గొలిపేగాలేదు. ఒకింత కంపరంగా అన్పించింది కూడా. ఒకరికొకరు దగ్గరగా ఉన్నా మనసుల మధ్య ఎంతో దూరం పెరిగినట్టుగా ఉంది.

శ్రీకాంత్ లేచి కూర్చుని సుమ వైపు చూశాడు. తను హాయిగా నిద్ర పోతోంది. బెడ్‌లైట్ వెలుతురులోనూ ఆమె ముఖంలో నిశ్చలత్వం కనబడుతోంది.

టైం నాలుగున్నర అవుతోంది. మంచం దిగి లేచి నిలబడ్డాడు. మోకాళ్ళు పటపట లాడాయి. మరుక్షణం భరించలేని బాధతో పెదవులు బిగబట్టి చటుక్కున కూర్చున్నాడు.

మోకాళ్ళు అరచేతులతో మృదువుగా రుద్దుకుంటూ గట్టిగా నిట్టూర్చాడు.

రుమటాయిడ్ ఆర్థరైటిస్!

"ఈ మాయదారి రోగం వచ్చినందువల్లే ఇప్పుడీ అవాంతరం వచ్చి పడింది? కసిగా పళ్ళు కొరికాడు. ఈసారి మెల్లగా లేచి వాటర్ బాటిల్ తీసుకుని కుంటుకుంటూ బాల్కనీలో కి వెళ్ళి కూర్చున్నాడు.

కృష్ణపక్షపు రోజులు. దూరంగా టాంక్‌బండ్, నెక్లెస్ రోడ్ విద్యుద్దీప తోరణాలతో ధగ ధగలాడుతున్నాయి.

సుమతో శ్రీకాంత్ గడిపిన క్షణాలకు ఆ బుద్ధ ప్రతిమ కూడా సాక్ష్యం.

శ్రీకాంత్ అలసటగా తల విదిలించాడు. సగం తెరిచిన తలుపులోంచి మసగ్గా కన్పిస్తోంది సుమ. ఆమెలోని తెగింపు, ముందుచూపు ఒకప్పుడు ప్రత్యేక లక్షణాలుగా కన్పించాయి. ఇప్పుడవే అహంకారంగా, బరితెగింపుగా కన్పిస్తున్నాయి.

"నన్ను భర్తగా పొందినందుకు బాధపడుతోందా? లేక నీతి నియమాలనే కోల్పోతోందా?" మనసులోనే ప్రశ్నించుకున్నాడు.

సుమతో పరిచయం కలిగిన మొదటి రోజు గుర్తుకొచ్చింది శ్రీకాంత్‌కి.

ఆ రోజే ఓ కంపెనీలో ఉద్యోగంలో చేరాడు శ్రీకాంత్. ఆఫీస్ తన క్కొత్తే అయినా తన కలుపుగోలుతనంతో అందర్నీ ఆకర్షించాడు.

పక్కసీట్లోని సురేష్ శ్రీకాంత్‌కి వర్క్ నేర్పడంలో సహాయం చేశాడు. ఆఫీస్ అవర్స్ పూర్తయ్యాక సురేష్ చెప్పాడు. "ఈ రోజుకి చాలు. మిగిలింది రేపు మేడమ్ చెప్తారు."

"మేడమ్?"

"అవును. మన బాస్ పి.ఎస్.మిస్ సుమ.

శ్రీకాంత్ మళ్లీ అడిగాడు.

"సురేష్! ఆవిడ ఈ రోజు రాలేదా? ఇంటర్వ్యూ రోజు కూడా నేనామెని చూడలేదే?"

సురేష్ నవ్వి "ఈ ఒక్క రోజుకీ నువ్ మిస్సయింది ఏం లేదులే. మేడమ్ చాలా ఫ్రెండ్లీగా ఉంటారు. బెటర్ లక్ టుమారో" కన్నుగీటి చెప్పాడు.

ఆఫీస్‌లో ఫైల్ స్టడీ చేస్తున్నాడు శ్రీకాంత్. ఈ ఉద్యోగం దొరికినందుకు అతడికి ఎంతో తృప్తిగా ఉంది. కష్టపడి చదివించిన తల్లిదండ్రులు గుర్తుకొచ్చారు. పెళ్ళి కోసం ఎదురు చూస్తున్న చెల్లి ముందు కదలాడింది.

జాస్మిన్ ఫ్రాగ్రెన్స్! సున్నితంగా శరీరాన్ని అలుముకుంటున్నట్టుగా అన్పించి పక్కకి తిరిగి చూశాడు.

ఓ అమ్మాయి సురేష్‌తో మాట్లాడుతోంది. ఆర్గండీ చీరలో నాజూగ్గా ఉంది. ఆమె అటు వైపు తిరిగి మాట్లాడుతూ ఉంటే క్లిప్‌తో బంధించిన పోనీటేయిల్ తమాషాగా కదుల్తోంది.

రెండు నిమిషాలయ్యాక ఆ అమ్మాయి శ్రీకాంత్ టేబిల్ దగ్గరకొచ్చింది.

అతను ప్రశ్నార్థకంగా చూశాడు.

"హలో! అయామ్ సుమ. పి.ఎస్ టు ది బాస్" చనువుగా కుడిచెయ్యి అందిస్తూ చెప్పింది.

ఒక్క క్షణం తత్తరపడి మరుక్షణం తేరుకుని షేక్‌హేండ్ ఇస్తూ చెప్పాడు.

"అయామ్ శ్రీకాంత్ కొత్తగా జాబ్‌లో చేరాను"

"ఆఫీస్ నచ్చిందా శ్రీకాంత్?"

"ఏమిటీ అమ్మాయి? తొలి పరిచయంలోనే ఏకవచన ప్రయోగం చేస్తోంది? తన కేడర్ చూసుకుని గర్వమా?" మనసులో ఆమెను తిట్టుకుంటూ పైకి మాత్రం ఎంతో నమ్రతగా చెప్పాడు, నచ్చిందని.

"బెస్టాఫ్ లక్ మళ్ళీ కలుస్తాను"

కొంతదూరం వెళ్ళిందల్లా ఏదో గుర్తొచ్చినట్లు చటుక్కున ఆగి మళ్ళీ అతని దగ్గరకొచ్చి ఆగింది.

అప్పటికీ శ్రీకాంత్ ఆమె వైపే చూస్తూండటం గమనించి అడిగింది.

"నిన్ను 'మీరు' అనలేదని ఫీలయ్యావా?

"అబ్బే. అదేం లేదు" మొహమాటంగా అన్నాడు.

ఆమె చిన్నగా నవ్వి చెప్పింది.

"మనమంతా ఒకచోట కలిసి పనిచేసే వాళ్ళం పగలంతా మనం ఇక్కడే గడపాలి. అందరం సరదాగా కలిసి పనిచేస్తే మనకీ టెన్షన్లూ చికాకులూ ఉండవు. అనవసర భేషజాలు మన మధ్య దూరాన్ని పెంచుతాయి. దీనివల్ల మన పనిలో

క్వాలిటీ తగ్గుతుందని నా అభిప్రాయం. మనమంతా ఒకటి అన్న భావంతోనే మన స్టాఫ్ అంతా అరమరికలు లేకుండా నచ్చినట్టు పిలుచుకుంటారు"

"యు ఆర్ రైట్ మేడమ్" శ్రీకాంత్ నిజాయితీగా చెప్పాడు.

"సుమా అనచ్చుగా?" నవ్వుతూ వెళ్ళిపోయిందామె.

విస్మయంగా సుమ వెళ్ళిన వైపే చూస్తూండిపోయాడు. మేఘం కమ్మకుండానే వానజల్లు కురిసిపోయినట్టయింది. అసలు బాస్‌కి పర్సనల్ సెక్రెటరీ అంటే అతడు ఏవేవో ఊహించుకున్నాడు. సినిమాల్లో చూసిన అనుభవం వల్ల. మినీస్కర్ట్సూ, బాబ్డ్ హేర్, ఫుల్ మేకప్, వీటన్నింటితో పాటు ఎవర్నీ పట్టించుకోనంత అతిశయం... మినిమమ్ ఓ భూలోక సుందరి!

కానీ ఇంత సాదాసీదా అమ్మాయిని, ఇంత చాకచక్యంగా తెలివిగా ఆలోచించగల అమ్మాయిని ఊహించనే లేదు. ఆమె గురించి మొదట ఏర్పడిన చిన్న నెగిటివ్ ఫీలింగ్ తొలిగిపోయి దాని స్థానంలో కొంత ఆసక్తీ కొంత గౌరవమూ ఏర్పడ్డాయి.

అప్పటికి సుమతో పరిచయం కలిగి రెండేళ్ళు దాటింది. శ్రీకాంత్, సుమల పరిచయం స్నేహం పరిధి దాటి ముందుకెళ్ళిపోయింది.

అతనిలోని నిజాయితీ, పట్టుదల ఆమెకి నచ్చాయి. ఆమెలోని ధైర్యం, ముక్కుసూటిగా ప్రవర్తించే తీరూ, అండర్‌స్టాడింగ్ నేచర్ అతనికి ప్రేమని పుట్టించాయి.

ఆఫీస్‌లో ప్రేమించుకున్న రెండు జంటలకి వాళ్ల పెద్దల్నెదిరించి పెళ్ళి జరిపించింది సుమ. అంత సాహసిని వదులుకోవటానికి శ్రీకాంత్ సిద్ధంగా లేడు. అందుకే కుటుంబ సభ్యులు, స్నేహితుల సమక్షంలో దంపతులయ్యారు. శ్రీకాంత్, సుమ.

ఆ శోభనపు రాత్రి ఎంతో ఆహ్లాదంగా ఉంది. స్నేహితుల జోక్స్‌తో ఇల్లు మార్మోగుతుండగా సుమ, శ్రీకాంత్ గదిలో బందీలయ్యారు.

మల్లెల గుబాళింపుల మధ్య మంచుముత్యంలా ఉంది సుమ.

"ఈ రోజు నాకెంతో ఆనందంగా ఉంది" తృప్తిగా చెప్పాడు.

అతని కౌగిట్లో మౌనంగా కళ్ళ మూసుకుని ఉందామె.

"శ్రీ!" మార్దవంగా పిలిచింది.

"చెప్పు సుమా!"

"నువ్వు నీ చెల్లి పెళ్ళి చెయ్యాలి కదూ!"

"అవును."

"నేను నా తమ్ముణ్ణి ఇంజనీరింగ్ చదివించాలి"

"మనం ముందే అనుకున్నాంగా" చెప్పాడు.

"మనం ఒక ఫ్లాట్ కొనుక్కోవాలి. లోన్‌కి అప్లయ్ చేద్దాం"

"అలాగే బేంక్ మేనేజర్‌కి ఫోన్ చేసిరా. లోన్ ఎంతిస్తారో కనుక్కో ఇప్పుడే వెళ్ళి అప్లికేషన్ పూర్తి చేసొద్దాం" చాలా సిన్సియర్‌గా చెప్పాడు.

"నేను సీరియస్‌గా చెబుతుంటే నీకు వేళాకోళంగా ఉందా?" తొడపాశం పెట్టింది గట్టిగా.

కెవ్వుమన్న కేకని అతని నోట్లోనే ఉంచేసి అరచేత్తో గట్టిగా నోరు నొక్కింది సుమ.

"నోరు తెరిచావంటే చంపేస్తాను! నీ కేకలు బయటికి వినబడితే నేనే నిన్నేదో చేశాననుకుంటారు. నువ్వు అరవకుండా ఉంటేనే చెయ్యి తీస్తా" షరతు పెట్టింది.

సరేనన్నట్టు తలాడిస్తూ రెండు చేతులెత్తి నమస్కరించాడు. అతని నోటిమీద నుంచి చెయ్యి తీసి నలిగి ఎర్రబడ్డ పెదాల మీద సున్నితంగా తన పెదాలతో అద్దింది. శ్రీకాంత్ ఆమె తలచుట్టూ చేతులేసి దగ్గరగా అదుముకున్నాడు.

"శ్రీ నీతో నేనింకా మాట్లాడాలి" పక్కకి జరుగుతూ చెప్పింది.

"ఇప్పుడంత అవసరమా? రేపు మాట్లాడుకుందాం లే" ఆమెకు దగ్గరగా జరుగుతూ అన్నాడు.

"లేదు ఇప్పుడే చెప్పాలి" గారాలు పోతూ అడిగింది.

"సరే చెప్పు"

"మనకి అప్పుడే పిల్లలొద్దు. కనీసం నాలుగేళ్ళు" కుడిచేతి బొటన వేలు మడిచి నాలుగువేళ్లను అతని కళ్లముందు ఆడిస్తూ చెప్పింది.

"అంత గేప్ ఎందుకు? నీలో లోపముందనుకుని మా అమ్మ నాకు మళ్ళీ పెళ్ళి చేస్తుంది" ఉడికిస్తూ ఆమె వైపు చూశాడు.

కోపంతో వెంటనే లేచి వెళ్లబోయింది. "ఏయ్, ఏంటిది? నేనేదో సరదాగా అంటే నీకింత కోపమా?" అన్నాడు.

అప్పటికే ఆమె అటు వైపు తిరిగి కళ్ళు తుడుచుకుంటూ ఉంది. శ్రీకాంత్ ఆమెని తన వైపుకి తిప్పుకున్నాడు.

"శ్రీ! నువ్వు సరదాగా అనటం కూడా నేను భరించలేను" సిన్సియర్‌గా చెప్పింది.

ఇద్దరూ హాయిగా నవ్వుకున్నారు. పూలతీగెల్లా ఒకరి నొకరు అల్లుకుపోయారు.

కమ్మటి కలలా సాగిపోయిన జీవితం కళ్ళముందు కరుగుతూ ఉంటే కుర్చీలోనే కునుకు తీశాడు శ్రీకాంత్ కోసం చూసి బాల్కనీలోకి వచ్చింది. అతను కుర్చీలో ఒక పక్కకి ఒరిగి నిద్రపోతున్నాడు.

"శ్రీ!" నుదుటి మీద చెయ్యివేసి ప్రేమగా పిలిచింది. బరువుగా కళ్ళు విప్పాడు. కళ్ళు నిప్పుకణికల్లా ఉన్నాయి. రాత్రంతా అతడు నిద్రపోలేదని ఆమెకి తెలుస్తూనే ఉంది.

"లోపల పడుకుందువు గాని రా!" అంది ముక్తసరిగా శ్రీకాంత్ బాధపడుతూ ఉంటే సుమ తల్లడిల్లిపోతూ ఉన్నా పైకి బెట్టుగా ఉంది.

ఇంతకీ అంతకాని మాట నేనేమన్నానని శ్రీకి కోపం? భవిష్యత్తు గురించి కేర్ తీసుకోవటం కాని పనా?

సుమ ఆలోచిస్తూ అక్కడే నిలబడి శ్రీకాంత్ వైపు చూసింది. ఆర్థరైటిస్ వల్ల అతడు ఎంతో బాధపడుతున్నాడు. మందులు వాడీ వాడీ ముఖంలోని కాంతి

తరిగిపోయింది. కాళ్ళూ చేతులూ కదిలించలేనంత ఎక్కువగా జబ్బు కమ్ముకుంది. దీంతోపాటు చలికాలం వస్తే భరించలేనంత ఆయాసం. గత రెండేళ్ళుగా అనారోగ్యం పాలైన భర్తని చూస్తోంటే బాధ కలగని క్షణం లేదు సుమకి.

శరీరాన్ని స్వాధీనంలోకి తెచ్చుకుని మెల్లగా లేచి బెడ్‌రూమ్‌లోకెళ్ళి పడుకున్నాడు.

సుమ స్టౌ మీద టీకి నీళ్ళు పెట్టి బ్రష్ చేసుకుంటోంది. శ్రీకాంత్ ఆమెనే గమనిస్తున్నాడు. సుమలో శారీరకంగా ఎంతో మార్పు కన్పిస్తోంది. శరీరంలో నాజూకుతనం పోయి బొద్దుగా తయారైంది. చలాకీ తనం తగ్గి మందకొడిగా ఉంటోంది.

బ్రష్ చేశాక పరగడుపునే 'ఎల్ట్రాక్సిన్' టేబ్లెట్ వేసుకుంది. సుమకి థైరాయిడ్ హార్మోన్ లోపం. దాంతో రెండు నెలలు క్రితం అబార్షన్ అయింది. అప్పుడే తెలిసింది తనకీ లోపం ఉన్నట్టు.

డాక్టర్ సుమకి ఎంతో ధైర్యం చెప్పింది ఈ లోపాన్ని టేబ్లెట్స్‌తో అదుపు చెయ్యవచ్చుని అయినా ఎంతో డిప్రెస్ అయింది సుమ.

జాలిగా ఆమె వైపే చూస్తున్న శ్రీకాంత్‌కి వారం రోజులుగా ఇద్దరి మధ్యా జరుగుతున్న మానసిక సంఘర్షణ గుర్తొచ్చి వెంటనే కఠినంగా మారిపోయాడు.

ఇద్దరి మధ్యా అభిప్రాయ భేదాలు తలెత్తిన రోజు గుర్తుకొస్తే పుండుమీద కారం చల్లినట్టుగా ఉంది. శ్రీకాంత్‌కి ఇష్టంలేకపోయినా ఆ దృశ్యాలే కళ్ళ ముందు తిరుగుతున్నాయి.

ఈ రోజుకి శ్రీకాంత్ తండ్రి గుండెపోటుతో చనిపోయి నెల రోజులవుతోంది. సుమ కూడా అబార్షన్ జరిగిన బాధ నుండి ఇంకా కోలుకోలేదు. ఈ పరిణామాలతో శ్రీకాంత్ నలిగిపోయాడు. ఈ బాధలు చాలవన్నట్టు సుమ బాంబులాంటి అభిప్రాయాన్ని వెలుబుచ్చింది.

"శ్రీ! నాకొక ఆలోచన వచ్చింది వింటావా?" ఏమిటన్నట్టు చూశాడు శ్రీకాంత్.

"మీ నాన్న, మీ తాత, పెద్దనాన్న అందరూ హార్ట్ ఎటాక్‌తోనే పోయారు. ఈ వ్యాధి మీ కుటుంబంలో వంశపారంపర్యంగా వస్తోంది. మొన్నటికి మొన్న మీ మేనత్త కిడ్నీ ఫెయిల్యూర్‌తో వెళ్ళింది" చెప్పడం ఆపి భర్త మొహంలోకి చూసింది.

ఈ ఉపోద్ఘాతం ఎక్కడికి దారితీస్తుందో అర్థం కాలేదు అతనికి.

"మనుషులున్నాక రోగాలు రావా? మీ వాళ్లకి మాత్రం రోగాలు లేవా?" ఎద్దేవాగా అన్నాడు.

"నేను చెప్పేది అదే. మా అమ్మకీ నాన్నకీ మధుమేహం అమ్మమ్మకి కేన్సర్. ఇందులో ఇప్పుడు నీకూ నాకూ ఈ దీర్ఘకాలిక రోగాలు"

ఒక్కక్షణం చెప్పటం ఆపి మెల్లగా అంది.

"ఈ పరిస్థితుల్లో మనకి పిల్లలు అవసరం అంటావా?"

"అంటే?" శ్రీకాంత్ అయోమయంగా చూశాడు.

"పిల్లలు మీద మమకారంతో మనం పిల్లల్ని కనివారికి వంశపారంపర్యంగా ఈ రోగాల్లో ఏదో ఒక దానిని కానుకగా ఇచ్చి తీరాలా?"

శ్రీకాంత్ అసహనంగా తల విదిల్చాడు. కోపం తారస్థాయికి అందుకుంది.

"చూడు సుమా! నాకు పిల్లలు కావాలి. పిల్లలు లేని జీవితాన్ని నేనూహించలేను. ఎప్పుడో ఏదో జరగబోతుందని ముందే ఊహించుకోవటం దేనికి? ఏది ఎలా జరగాలో అలాగే జరుగుతుంది. రోగాలొస్తే పిల్లలకి వైద్యం చేయించలేమా?"

"మనం వైద్యం చేయించగలం. కానీ నిరంతరం అనారోగ్యాలతో బాధపడే సంతానాన్ని ఈ సమాజానికి అందించాలని నేను కోరుకోవటం లేదు. నా బిడ్డలు ఎంతో ఆరోగ్యంతో, ఉత్సాహంతో జీవించాలని నేను ఆశిస్తున్నాను. లక్కీగా హెల్దీ బేబీస్ కూడా మనకి పుట్టొచ్చు. కానీ ఛాన్స్ తీసుకోడం నాకిష్టం లేదు"

శ్రీకాంత్ సుమతో ఏకీభవించలేక పోతున్నాడు. సుమ ఇంతవరకే తన అభిప్రాయం చెప్పి వుంటే బాగుండేది. ఆ తర్వాత చెప్పిందే మింగుడుపడటం లేదు అతనికి.

"మాట్లాడు శ్రీకాంత్! హెల్దీ బేబీ కావాలని నీకు లేదా?" అడిగింది.

"ఉంటే? అది నీ చేతుల్లో ఉందా?"

"ఉంది" స్థిరంగా చెప్పింది సుమ.

"ఎలా?" ఆశ్చర్యంగా అడిగాడతను.

"పిల్లలు కావాలనే కోరిక మనిద్దరిలోనూ ఉంది. కానీ మనం మన జీన్స్‌తో పిల్లల్ని కనొద్దు"

శ్రీకాంత్ మొహంలోకి కోపంతో రక్తం పొంగుకొచ్చింది.

"అంటే నన్నొక వెధవగా జమకట్టి మరొకడితో పిల్లల్ని కంటాననంటావా?" గర్జిస్తున్నట్టు అడిగాడు. ఆవేశంతో కళ్ళు ఎర్రబడ్డాయి.

"ప్లీజ్ శ్రీ! నన్నర్థం చేసుకో. నా పాయింట్ నువ్వు కేచ్ చెయ్యడం లేదు. నా ఉద్దేశం వేరు" కన్విన్స్ చేస్తూ చెప్పింది.

శ్రీకాంత్ బదులు చెప్పలేదు. మౌనంగా సోఫాలో కూర్చుని భార్యని తీక్షణంగా చూస్తున్నాడు.

"నీకిష్టం ఉన్నా లేకపోయినా నేను చెప్పేది ముందు విను. నిర్ణయం సంగతి తర్వాత చూద్దాం" మళ్ళీ అదే చెప్పింది.

"ఊఁ" అన్నాడు ముక్తసరిగా.

కళ్ళలోకి మెరుపు కమ్ముకుంటుండగా మొదలు పెట్టింది.

"మనుషుల్లో అనువంశిక లక్షణాలు కల్గించేవి జీన్స్. ఇవి ఆరోగ్యాల్నీ, అనారోగ్యాల్నీ, తెలివినీ, మంచి బుద్ధినీ నిర్దేశిస్తూ ఉంటాయి. జీన్స్ ఒక తరంలో అంతరించేవి కాదు. తన వారసుల ద్వారా తరతరాలకూ వారసత్వంగా అందించబడుతూ ఉంటాయి. ఈ జీన్స్ ద్వారా మనం మన అవలక్షణాలనూ మంచి గుణాలను కూడా మన పిల్లలకు అందిస్తున్నామన్న మాట.

దురదృష్టవశాత్తూ మన రెండు కుటుంబాలలోనూ ఈ బేడ్ జీన్స్ ఉన్నాయి. వాటిని మనతోనే ఆపలేమా?"

ఆమె మాటల్ని మధ్యలోనే అడ్డుకుంటూ అన్నాడు శ్రీకాంత్.

"ఆ విషయం నాకూ తెలుసులే. సైంటిస్టులు జీనోమ్ కోడ్ కనిపెట్టినంత మాత్రాన అన్నీ జరిగిపోయినట్టే అనుకుంటున్నావు. నీ బేడ్ జీన్ తీసి గుడ్ జీన్ పెట్టడానికి ఇంకో తరం జరగాలి"

"నువ్వు చెప్పింది ఇప్పుడే జరగదని నాకూ తెల్సు శ్రీ!" కాస్సేపు మౌనంగా కూర్చుంది.

తర్వాత మళ్ళీ చెప్పింది.

"నేను డాక్టర్ రమ్యతో మాట్లాడాను. అటు ఏడుతరాలూ ఇటు ఏడు తరాలూ చూసి పెళ్ళిళ్ళు చెయ్యాలని పూర్వీకులు అనేవారు కదా! అలాగే డాక్టర్ రమ్య కూడా ఎంక్వైరీ చేసి ఆరోగ్యంగా ఉన్న స్త్రీ పురుషుల నుంచి స్పెర్మ్, ఓవరీస్ కలెక్ట్ చేస్తారు. అవి లేబరేటరీలో ఫలధీకరణం చెందించి తిరిగి నా గర్భంలో ప్రవేశపెడ్తారు. తొమ్మిది నెలలూ నేనే మోసి కంటాను" తలవంచుకుని చెప్పింది.

వెక్కుతున్న శబ్దం విన్పించి తలెత్తి చూసింది. అప్పటికే శ్రీకాంత్ చేతుల్లో ముఖం దాచుకుని ఏడుస్తున్నాడు.

సుమ లేచి వెళ్ళి శ్రీకాంత్ పక్కన కూర్చుంది. తల నిమురుతూ బుజ్జగించినట్టు చెప్పింది. "ఈ రోజుల్లో చదువుకోని వాళ్ళు కూడా ఎంతో తెలివిగా ఆలోచిస్తున్నారు. తమలో లోపం ఉన్న మగాళ్ళు ఆర్టిఫిషియల్ ఇన్‌సెమినేషన్ ద్వారా తమ భార్యలు గర్భం దాల్చటానికి ముందుకొస్తున్నారు. చదువుకున్న నువ్వు పాజిటివ్‌గా ఆలోచించలేవా?"

"నేను ఆలోచించలేను. నేను మగాణ్ణి. నా రక్తం పంచుకు పుట్టిన పిల్లలే నాకు కావాలి. నా నిర్ణయం మారదు.

సుమ ముఖం వివర్ణమైపోయింది.

అదిగో ఆ రోజు నుంచి ఇద్దరి మధ్యా ఈ మౌనపోరాటం జరుగుతూనే ఉంది.

ఉదయాన్నే అన్ని పనులూ పూర్తి చేసుకుని సుమ ఆఫీస్‌కెళ్ళిపోయింది. శ్రీకాంత్‌కి బెడ్‌రెస్ట్ కాబట్టి ఇంట్లో ఒంటరిగా ఉన్నాడు.

అతడు ఎంత ఆలోచించినా సుమ చెప్పిన విషయంతో ఏకీభవించలేక పోతున్నాడు. ఆమె ఆర్గ్యుమెంట్‌కి ఆధారం ఉందా? పూర్వీకులకు ఉండే జబ్బులు పిల్లలకి వచ్చి తీరుతాయా?

"అసలు తను నాలుగేళ్లు పిల్లలు వద్దనుకున్నప్పుడే ఒప్పుకోకుండా ఉండాల్సింది. ఇప్పుడీ సమస్యే ఉండేదికాదు"

ఎంత సర్దిచెప్పుకున్నా శ్రీకాంత్ అంతరంగ పురుషుడు తోక తొక్కిన తాచులా బుసకొడుతూనే ఉన్నాడు.

"సుమ నిర్ణయానికి తలొంచితే అందరూ నాలోనే లోపముందునుకోరూ? అవును నా ఆధిక్యతనే నిరూపించుకుంటాను" ఖచ్చితంగా నిర్ణయించుకున్నాడు శ్రీకాంత్.

అంతలో కాలింగ్‌బెల్ మోగింది. శ్రీకాంత్ లేవబోయేలోగా దగ్గరగా వేసివున్న తలుపుతోసి అక్కడే నిలబడి వున్నాడు ప్రభాకర్. వెనక అతని భార్య లక్ష్మి నిలబడి ఉంది.

"అరె రండి రండి. అక్కడే నిలబడిపోయారేంటి?" ఆప్యాయంగా ఆహ్వానించాడు శ్రీకాంత్.

శ్రీకాంత్, ప్రభాకర్ ఒక ఊరివాళ్ళు. బాల్య స్నేహితులు కూడా. ప్రభాకర్ డిగ్రీ పూర్తి చేయకముందే వాళ్ళ నాన్న చనిపోయాడు. తండ్రి ఉద్యోగంలో తను చేరాల్సి వచ్చింది. తమ్ముళ్ళ చదువులు పూర్తయ్యాక మేనమామ కూతురు లక్ష్మిని పెళ్ళి చేసుకుని ఆ ఊళ్ళోనే స్థిరపడ్డాడు.

ప్రభాకర్ పెళ్ళికి శ్రీకాంత్, సుమ వెళ్ళారు. అప్పుడు కలుసుకున్న వాళ్ళు మళ్ళీ ఇప్పుడే చూసుకోవడం, "ఏరా నేను గుర్తున్నానా నీకు? నువ్వెలా ఉన్నావు?" శ్రీకాంత్ నిష్ఠూరంగా అడిగాడు.

"ఇదుగో ఇలా ఉన్నాం. గాలి ఎటు విసిరితే అటు వైపు కొట్టుకుపోతున్నాం." మంచినీళ్ళు తాగుతూ చెప్పాడు ప్రభాకర్. "సుమ ఆఫీస్‌కి వెళ్ళిపోయిందా?" మళ్ళీ అడిగాడు.

"నిన్ను చూసి మూడేళ్ళయింది రా! నీకు పాప పుట్టిందని విన్నాను. పాపని తీసుకురాలేదే?"

లక్ష్మి నవ్వి ఊరుకుంది.

"తనకి ఒంట్లో బాలేదురా, ఇక్కడ హాస్పిటల్‌కి తీసుకొచ్చాను. నీకూ, సుమకీ ఆరోగ్యం బాలేదనీ, నువ్వు బెడ్‌రెస్ట్‌లో వున్నావనీ విన్నాను. ఇప్పుడెలా వుంది?" ప్రభాకర్ అడిగాడు.

"ఫర్వాలేదు"

"లక్ష్మీ! నువ్వు లోపలికెళ్ళి కాసేపు రెస్ట్ తీసుకో. నేను వీడితో కాసేపు మాట్లాడతాను. "ప్రభాకర్ చెప్పగానే ఆమె లేచి లోపలికెళ్ళింది.

"పెద్ద వాళ్లు ఏదైనా మంచికే చేస్తారని. మేనరికం పెళ్ళి చేసుకోకూడదని తెలిసినా చేసుకున్నాను రా. పెళ్ళయిన ఏడాదిలోపు పాప పుట్టింది. మానసిక, శారీరక అవలక్షణాలతో. ఆకలేస్తే ఏడవటం తప్ప మరేదీ గ్రహించలేదు. వెన్నెముక ఎదగకపోవటం వల్ల కనీసం కూర్చోలేని దౌర్భాగ్యం. రెండేళ్ల పిల్ల రెండు నెలల బిడ్డలా బ్రతికున్న శవంలా కళ్ళముందుంటే ఆ పరిస్థితి ఎలా ఉంటుందో ఒక్కసారి ఊహించు. పిల్లలు లేకపోయినా ఫర్వాలేదుగానీ పగవాడిక్కూడా ఇలాంటి శాపం వద్దు శ్రీ! కన్న ప్రేమతో కళ్ళల్లో వత్తు లేసుకుని పాపని కనిపెట్టుకున్నాం లక్ష్మి అయితే ప్రతి క్షణమూ పాపే లోకంగా బ్రతికింది. ఈలోగా లక్ష్మికి మూడుసార్లు అబార్షన్ అయింది. పాపకోసం ఎంత కష్టపడ్డా ఫలితం దక్కలేదురా. నెల క్రితమే పాప చనిపోయింది?"

"సారీ రా! నాకీ విషయాలన్నీ తెలియవు. లక్ష్మికి నువ్వే మనోధైర్యాన్నివ్వాలి" బాధగా చెప్పాడు శ్రీకాంత్.

"ఇలాంటప్పుడు మనకి పిల్లలొద్దు అన్నాను రా! తను వినటం లేదు. ఇక్కడ డాక్టర్ రమ్య గురించి ఎవరో చెప్పారు. ఇప్పుడు అక్కడికే వెళ్ళి వస్తున్నాం.

లక్ష్మికి ఇన్నిసార్లు అబార్షన్ జరగటం, తన ఆరోగ్యం క్షీణించడం వల్ల గర్భం దాల్చడం ప్రమాదం అన్నారు నేనే వేసెక్టమీ చేయించుకుందాం అనుకుంటున్నా" ప్రభాకర్ చెప్పాడు.

"ఏరా! నీకు సొంత బిడ్డ కావాలని లేదా? శ్రీకాంత్ ఆశ్చర్యంగా అడిగాడు.

"పరిస్థితులు అనుకూలించనప్పుడు ఏం చేస్తాం? ఉన్నదాంతో సర్దుకుపోవాలి"

"అంటే?"

"ఓ అనాధ బిడ్డని దత్తత చేసుకోవాలనుకుంటున్నాను." ప్రభాకర్ చెప్పిన మాటలు విని శ్రీకాంత్ షాక్ అయ్యాడు.

"ఎవరో కనిపారేసిన బిడ్డ నీ సొంత బిడ్డతో సమానం అవుతుందా? అసలు నీ మనసు అంగీకరిస్తుందా? తల్లెవరో తండ్రెవరో తెలియని బిడ్డని ఎలా... ఎలా?" మాటలు రాక తలబడ్డాడు శ్రీకాంత్. "తల్లీ తండ్రీ లేకపోవటం వల్లే కదా అనాధలవుతారు" ప్రభాకర్ మాటల్ని అడ్డుకుంటూ అన్నాడు శ్రీకాంత్. "కానీ నేను అంగీకరించలేకపోతున్నాను ప్రభా!"

"మనకి కళ్ళు అవసరమైతే చనిపోయిన వాళ్ల దగ్గర్నుండి తీసుకోమా? లక్షలు ఖర్చుపెట్టి కిడ్నీ కొనుక్కుంటాం, ఇతరుల రక్తం కొనుక్కుంటాం. పిల్లల్ని కనడం కోసం స్పెర్మ్ ఓవరీస్ కూడా తీసుకుంటాం. మన ప్రాణాలు నిలుపుకోవడం కోసం ఇతరుల అవయవాల్ని ఏ మాత్రం సంకోచం లేకుండా తీసుకుంటాం. పైగా మనక్కావలసిన పార్ట్ దొరకడం ఎంతో అదృష్టమని మురిసిపోతాం.

మన ప్రేమనీ, అనుభూతుల్నీ ఒక్క అనాధ బిడ్డకి పంచడానికి మాత్రం మనం సిద్ధంగా ఉండలేం. అవునా?" ప్రభాకర్ అడిగాడు.

"ఒరే ప్రభా! పరిస్థితుల్ని నీకు అనుకూలంగా గొప్పగా మలుచుకున్నావురా. కానీ లక్ష్మి దీనికి ఒప్పుకుందా?"

"మొదట ఒప్పుకోలేదు. డాక్టర్ రమ్య కౌన్సిలింగ్ ఇచ్చాక మనసు మార్చుకుంది. ఇదంతా ఆవిడ చలవే. ఇందాక నేన్నీకు చెప్పిందంతా డాక్టరు గారు చెప్పిన మాటలే" నవ్వి చెప్పాడు.

"ఇంకో విషయం తెలుసా? ఇక్కడి కొచ్చే ముందు అనాధాశ్రమానికి వెళ్లి ఒక పాపని చూసి వచ్చాం. చట్టబద్ధంగా దత్తత చేసుకోవడానికి కావల్సిన ఏర్పాట్లు చెయ్యమన్నాం. ఆ తతంగం సాయంత్రానికి పూర్తవుతుంది. ఊరికెళ్ళేటప్పుడు పాపని తీసుకుని వెళ్ళడమే" ఉత్సాహంగా చెప్పాడు మళ్ళీ.

హోటల్ నుండి క్యారియర్ తెప్పించి వారికి భోజనం పెట్టి సాగనంపాడు శ్రీకాంత్.

ఆ వేళ సాయంత్రం సుమ ఆఫీస్ నుంచి వచ్చే వరకూ పడుకుని ఆలోచిస్తూనే ఉండిపోయాడు. " శ్రీ! ఎలా ఉంది?" ఎప్పటిలాగే అడిగింది. రోజులా మొహం

పక్కకి తిప్పుకోకుండా 'ఫైన్' అన్నాడు. సుమ ఒక్కక్షణం ఆశ్చర్యపోయి లోపలికెళ్ళి టీ కప్పులతో వచ్చింది.

"ఎవరైనా ఫ్రెండ్స్ వచ్చారా? అవును నా ఫ్రెండ్ ప్రభాకర్ ఫ్యామిలీతో వచ్చాడు" ఫోన్ రింగయింది. సుమ వెళ్ళి ఫోన్ తీసి మాట్లాడి పూర్తయ్యాక వంట గదిలోకెళ్లి వేన్నీళ్ళు గిన్నె తెచ్చింది. టవల్ నీళ్ళలో ముంచి శ్రీకాంత్ జాయింట్స్‌కి కాపడం పెడుతూ అడిగింది ప్రభాకర్ గురించి.

"వాడొచ్చి నాకెంత మేలు చేశాడో తెలుసా? నా కళ్లు తెరిపించాడు. వాడికున్నంత సంస్కారం ఆదర్శం నాకెందుకు లేవా అని సిగ్గుపడుతున్నాను" ఫ్రాంక్‌గా చెప్పాడు.

"అసలు విషయం చెప్పు ముందు" శ్రీకాంత్ కళ్ళు తెరుచుకున్న వైనం ఏమిటో తెలుసుకోవాలని ఉత్సుకతతో ఉందామె.

ఇన్నాళ్ళ తర్వాత శ్రీకాంత్ అలా ఓపెన్‌గా మాట్లాడటం కూడా ఆమెకెంతో ఆనందంగా ఉంది. వేణ్ణీళ్ల గిన్నె లోపలపెట్టి మళ్ళీ వచ్చి అతనికెదురుగా కూర్చుంది.

ప్రభాకర్ గురించీ ఆ దంపతుల నిర్ణయాల గురించీ చెప్పాడు.

సుమ ఏదో చెప్పబోయే లోపు మళ్ళీ తనే చెప్పాడు. "నువ్వు చెప్పిన పరిష్కారం గురించి ఆలోచించాను. నేనో నిర్ణయం తీసుకున్నాను"

"ఏంటది?" ఎంతో ఆతృతగా అడిగింది సుమ.

''లక్ష్మి కి పిల్లల్ని కనే అవకాశం లేదు కాబట్టి వాళ్ళు దత్తత తీసుకోవాలనుకున్నారు.

మనకి అటువంటి లోపాలేమీ లేవు. కానీ వంశపారంపర్యంగా వచ్చే జబ్బులను దృష్టిలో పెట్టుకుని కృత్రిమ పద్ధతుల ద్వారా ఆరోగ్యకరమైన పిల్లల్ని కనాలని నువ్వనుకుంటున్నావు. అంతేనా?" అడిగాడు.

"ఔను" చెప్పింది సుమ.

"అనువంశిక లోపాలతో పిల్లలు పుడితే ఎంత నరకాన్ని అనుభవించాలో ప్రభాకర్ ద్వారా తెలిసింది.పుట్టినప్పుడూ, బాల్యంలోనూ పిల్లలు ఆరోగ్యంగా కన్పించినా తర్వాత వాళ్ళు దీర్ఘకాలిక రోగాల బారిన పడితే నువ్వే కాదు నేనూ భరించలేను.

నీ ప్రయత్నంతో వందశాతం కాకపోయినా తొంభై శాతమైనా మంచి ఫలితాలు ఉంటాయని తోస్తుంది. గుడ్ జీన్స్‌తో పుట్టే పిల్లలనే కాదు, అనాథ బాలల్ని పెంచుకోటానికి కూడా నేను రెడీ!" చెప్పాడు

సుమ నమ్మలేనట్టు చూసింది.

"నువ్వు చెప్పేది నిజమా? శ్రీ! మళ్ళీ చెప్పు' అతని భుజాలు పట్టుకుని ఊపేస్తూ అడిగింది.

"నువ్వంతా విడమర్చి చెప్పాక నేనేమిటి? ఆ పై వాడు కూడా ఒప్పుకుని తీరాలి. మనం పుట్టకముందు ఈ మెడికల్ టెక్నాలజీ ఉండుంటే మన తల్లిదండ్రులు కూడా నీలా ఆలోచించగలిగి ఉంటే మనం కూడా మంచి ఆరోగ్యవంతులమై ఉండేవాళ్ళం. నీలాంటి తెలివి గల తల్లి దొరికినందుకు మనకి పుట్టబోయే పిల్లలు ఎంత అదృష్టవంతులో తెలుసా?" సుమని పొదువుకుంటూ చెప్పాడు.

సుమ హృదయకాశం మీద అమృతం కురుస్తున్నట్టుగా ఉంది. ఇన్నాళ్ళ దిగులూ బాధా ఆవిరై ఉప్పెనలా సంతోషం కమ్ముకుంది ఇద్దరి మనసుల్లోనూ. శ్రీకాంత్ బాహువుల్లో ఒదిగిపోయి నవ్వుతున్న సుమ కళ్ళలో ఆనంద భాష్పాలు జాలువారాయి.

# పొడిచే పొద్దు

**-కన్నెగంటి అనసూయ**

**సు**బ్బు చిరుగుల చాపమీద అటూ ఇటూ దొర్లుతున్నాడు. నిద్ర పట్టక చాలా సేపట్నించీ వాడలా దొర్లుతూనే ఉన్నాడు. దొర్లుతూ దొర్లుతూ మధ్యమధ్యలో కాళ్ళు పొడుగ్గా చాపి ఒళ్ళు విరుచుకున్నప్పుడల్లా వాడి కాళ్ళు చాప చిరుగుల్లో చిక్కుకుపోయి చిరుగుల్ని మరింత పెద్దవి చేస్తున్నాయి.

"ఓ వందుంటే మీయక్కకి తగ్గుద్దిరా నేను గేరంటీ" ధీమాగా అన్న రాజన్న మాటలే వాడి చెవిలో గింగరాలు తిరుగుతున్నాయ్. వందంటే ఎంతో? కూరగాయల మార్కెట్లో దళారులూ వాళ్ళూ లెక్కపెట్టుకుంటున్నప్పుడు చాలాసార్లు చూశాడు కానీ వందంటే ఏది అందులో?

బుర్రంతా కంగిరిబింగిరిగా ఉంది వాడికి. అంతలోనే లోపల్నుండి రావమ్మ మూలుగు.

అక్క మూలిగినప్పుడల్లా వాడికి చాలా బాధగా ఉండేది ఇంతకు ముందు. కానీ రాజన్న మాట గుర్తొచ్చి ఇప్పుడు అక్క మూలిగినా అంత బాధగా లేదు. తగ్గి పోద్దిగా అనిపిస్తాంది. ఇప్పుడు వాడికి ఉన్న బాధల్లా ఆ వందెలా అనే...

లోపల్నించి మళ్ళీ మూలుగు.

వాడికి వాళ్లమ్మ గుర్తుకొచ్చింది. అమ్మకూడా ఇలాగే నీర్సంగా మూలిగేది. దగ్గీ దగ్గీ నీర్సంతో ఇక దగ్గటానికి ఒంట్లో సత్తువ లేక మునగ తీసుకుని పడుకున్నా అమ్మనే పట్టుకుని వేల్లాడుతూ "ఆకలేస్తుంది ఏదైనా పెట్టమ్మా" అని తన బీద పొట్ట మీద చేత్తో చరుచుకుంటూ అమ్మ వైపే ఆశగా చూసేవాడు.

అలా అడగ్గానే అమ్మ కళ్ళవెంట నీళ్ళు ఎందుకు వస్తున్నాయో తెలిసేంత వయసులేదు వాడికి.

కాసేపు అమ్మ పక్కలోనే అటూ ఇటూ దొర్లి కుండలో నీళ్ళుంటే కాసిన్ని తాగి పిల్లగాళ్ళతో ఆటలకని బోసిమొలతోనే బయటికి పోయేవాడు కాస్త ఊహ తెలిసేనాటికి అమ్మామ్మలేదు, అమ్మ మూలుగూ లేదు. వాడికి మిగిలింది అక్క రావమ్మ ఒక్కతే.

అమ్మపోయాకా అక్కవెనకే తిరిగేవాడు. ఆమె ఎక్కడికి వెళితే అక్కడికి వదలకుండా కూడా వెళ్ళేవాడు. రావమ్మకి తమ్ముడు తన కూడా రావటం అస్సలు ఇష్ట ఉండేది కాదు. తనలాగా వాడూ పాత సీసాలకోసం, చెత్త కాగితాల కోసం పెంటకుప్పలమ్మట తిరిగితే వాడి కాళ్లకి ఏ గాజుపెంకో, ఇనపమేకో గుచ్చుకుంటదని ఆమె భయం. అందుకే "నువ్వింటికాదుంద్రా, ముళ్ళు గుచ్చుకుంటాయి" అనేది వాడి అక్క. అయినా వీడు వినేవాడు కాదు. కూడా వెళ్ళేవాడు తోకలాగ.

కాస్త పెద్దయ్యేసరికి అక్కడక్కడ తిరిగే కుర్రాళ్ళతో జతకట్టి వాళ్ళక్క వెంట వెళ్ళటం మానేశాడు. ఆ మార్కెట్లో కిందపడ్డ కూరగాయలేరే సాయిలూ, కిట్టిగాడి కూడా కూడా తిరుగుతూ వాళ్లల్లాగే కుళ్ళిపోయిన దోసకాయలూ, టమాల్లాంటివి తినేసి పొట్ట నింపేసుకునేవాడు.

అలా వాళ్ళతో తిరుగుతూ తిరుగుతూనే బళ్ళ మీదున్న బస్తాల్లోంచి కూరగాయలు ఎలా లాగాలో, మండీలో కిందపరిచిన వాటిని చాకచక్యంగా ఎలా తీసెయ్యాలో నేర్చుకున్నాడు. తోటి వాళ్లని చూసి ఏరటమైతే చేస్తున్నాడు గానీ వాటినేం చెయ్యాలో తెలియక అతి కష్టం మీద పాకలోకి మోసుకొచ్చేవాడు. అవి అలా పాకలోనే పడి కుళ్ళి పోతుండేవి. ఆకలేస్తే అందులోంచే ఏ టమాటాలో దోసకాయలో తీసుకుని తినేసేవాడు.

కడుపు నిండటం అంటే ఏంటో తెలియని పేద బతుకుల్లో ఆకలికి అయుష్షు కాస్త ఎక్కువేనేమో. అందుకే ఇంకా ఆకలిగా ఉంటే కాసిన్ని నీళ్ళు తాగేసి పడి నిద్దరోయేవాడు.

చుట్టుపక్కల పాకల్లోంచి అప్పుడప్పుడూ వచ్చే వాసనల్ని చూసి ఒకనాడు అక్క రావమ్మని అడిగాడు సుబ్బు.

"నువ్వు కూడా అన్నం, కూరా వండక్కా... ఆల్లందర్లాగా...."

రావమ్మకి జాలేసింది తమ్ముడ్ని చూస్తే. కళ్ళ నీళ్ళెట్టు కుంటూ రావమ్మ

తమ్ముడ్ని దగ్గరికి తీసుకుంది. అలాగే నన్నట్టుగా... కొండంత సంబరమై పోయింది వాడికి. అదిగో అప్పుడు మొదలైంది వాడి బ్రతుకు పోరాటం.

సరిగ్గా భరత్‌నగర్ బ్రిడ్జి కింద స్తంభాన్నానుకుని కూరగాయల మార్కెట్ పక్కగా ఉంది వాళ్ల గుడిసె. భరత్‌నగర్ కూరగాయల మార్కెట్లో తెల్లారి ఝామున మూడింటికే మొదలవుతుంది హడావిడి. రైతులు పొలాల్లో పండించిన పంటని ఎడ్ల బళ్ళమీదో, ట్రాక్టర్ల మీదో, లారీల మీదో మార్కెట్‌కి తెస్తే వాటి లోడింగ్, అన్‌లోడింగ్, హమాలీల అరుపులూ, కేకలూ, లారీలూ ట్రక్కుల రొద ఒకటోసారి, రెండో సారంటూ దళారీల వేలం పాటలతో నిద్రపోయే వాడల్లా గబుక్కున లేచి కూర్చునేవాడు.

మెలకువొచ్చిందంటే ఒక్క నిమిషం చాపమీదుండే వాడుకాదు. గబుక్కున లేచి నోట్లో గుక్కెడు నీళ్ళోసుకుని పుక్కిలించి ఊసేసి దండానికి వేళ్ళాడుతున్న చిరుగుల సంచినీ తీసుకుని జారిపోతున్న లాగూని పైకి లాక్కుంటూ ఉరుకులెత్తేవాడు మార్కెట్లోకి.

కూరగాయల తట్టలు ఎక్కించేటప్పుడూ బళ్ళల్లోంచి దించేటప్పుడూ... వాటి చిల్లుల్లోంచి జారిపడ్డ కూరగాయనల్లా ఏరి సంచిలో వేసుకునే వాడు. మధ్యమధ్యలో ఎవరూ చూడటం లేదనుకున్నప్పుడు తన బుల్లి బుల్లి మురికి లేతవేళ్ళను బస్తాలకున్న చిన్న చిన్న చిల్లుల్లోకి పోనిచ్చి లాగేస్తూ... మొత్తం మీద పొద్దెక్కేసరికి సంచి నింపేసేవాడు.

ఆ మార్కెట్లో హడావిడి ఉండే ఆ కొద్ది సేపట్లోనే వాడెదుర్కొనే చీత్కారాలకి అదిలింపులకి, బెదిరింపులకి లెక్కేలేదు... ఆ కాస్త టైమూ దాటిందంటే ఇక ఆ రోజుకి పస్తే. ఒక్క వంకాయ దొరికినా ఒట్టే. మంచి నీళ్ళు తాగి పడుకోవాలి. అందుకే ఎవరెన్ని తిట్టినా కసిరినా ఒక్కో సారి నెత్తిమీద ఒకటి మొట్టినా లెక్క చేసేవాడుకాదు. ఆకలి ముందు అవేం పెద్ద లెక్క కాదు వాడికి.

పొద్దంతా రావమ్మ పెంటకుప్పలమ్మట తిరిగి ఏరిన ప్లాస్టిక్ సంచులూ, సీసాలూ... ఎప్పుడైనా ఇనుపముక్కల్లాంటివి ఏదైనా దొరికితే అవీ అమ్మగా వచ్చిన పైసలతో పోశమ్మ హొటేలు కాడికెల్లి బియ్యం తీసుకొచ్చేది.

మూసాపేట నుంచొస్తుంటే భరత్‌నగర్ మార్కెట్ మొదట్లో బ్రిడ్జి దగ్గర ఉంటుంది పోశమ్మ హోటల్. ఆ హోటల్లో ఇడ్లీ, పూరీ, వడలూ భజ్జీలే కాక ముప్పై నలభై

మంది వరకూ భోజనాలు కూడా దొరుకుతాయి. ప్రభుత్వం రేషన్ కార్డు మీద కిరసనాయిలూ, గోధుమలూ, బియ్యం ఇచ్చినా అవి కొంటానికి కూడా పైసల్లేని పేదోళ్లు. ఆ కార్డుని పోశమ్మ దగ్గర నెలకింతని పైసలు తీసుకుని ఆమెకిచ్చేస్తారు. పోశమ్మ ఆ కార్డు మీద బియ్యంతో పాటు కిరసనాయిలూ, గోధుమలూ ఇంకా ఏవిస్తే అవన్నీ తెప్పించి ఇలా ఎవరైనా కావాలని అడిగితే కాస్త లాభం వేసుకుని అమ్ముతూంటుంది.

ఇలా బియ్యం కోసం సుబ్బిగాడు పోశయ్య హోటల్‌కి వెళ్ళినప్పుడల్లా వాడికి అక్కడ పెద్ద పెద్ద గిన్నెల్లో ఉన్న ఇడ్లీ పూరీ, దోశల్లాంటివి చూస్తే తినాలనిపించి నోట్లో నీళ్ళూరేవి.

నోరు తెరిచి అడిగితే పైసలేవీ... "అని ఒక్క ఉరుము ఉరిమేది. అప్పుడు గాని గుర్తొచ్చేది కాదు తన దగ్గర పైసల్లేవనే సంగతి. ఆశగా వాటివైపే చూస్తూ ఆ హోటేలు ముందు నుంచి ఎన్నిసార్లు తిరిగాడో వాడికే తెలియదు.

ఉన్నట్టుండి ఒకనాడు రావమ్మ ఎంత పొద్దెక్కినా లేవలేదు. అప్పటికే వాడు కూరగాయలు ఏరి తెచ్చేశాడు కూడా. ఎన్నిసార్లు లేపినా మూలుగు తప్ప ఏమీ మాట్లాడకపోయేసరికి అక్కకేమైందోనని ఏడుస్తూ కూర్చున్నాడు.

వాడి ఏడుపు విని పక్క పాకలో ఉండే రిక్షా రాజన్న పెళ్ళాం... లోనికొచ్చి రావమ్మ మెడ మీద చెయ్యేసి చూసి "మియ్యక్కకి జొరం కాసింది. పోశమ్మ హొటేలు కాడికెల్లి రెండిడ్లీ దెచ్చిపెట్టు... కాత్త ఓపికొత్తాది" అంది. మళ్ళీ తనపాకలోకి వెళ్ళిపోతూ... రావమ్మ మళ్ళీ మూలిగింది.

ఎందుకో వాడికి అమ్మ, అమ్మ మూలుగులూ తర్వాత అమ్మ చనిపోవటం అన్నీ గుర్తొచ్చాయి. అదురుతున్న గుండెల్తో పోశమ్మ హోటల్ దగ్గరకి పరుగుతీశాడు.

"డబ్బులెయ్యరా దిక్కుమాలిన సచ్చినోడా తేలేదా...." వాడి ఖాళీ చేతుల్ని చూసి పొట్లం చేతికివ్వబోయి వెనక్కి తీసుకుంది పోశమ్మ. తెల్లబోయి చూశాడు. అక్క మూలుగులు వినగానే అమ్మ మూలుగులు గుర్తొచ్చి... ఇడ్లీ తింటే నీర్సం పోతుందనే ఆలోచనలో గబుక్కున పరిగెత్తుకొచ్చేశాడు అంతే.

"ఫో... పోయి డబ్బులు తీసుకురా ఈడి బాబుగారి సొమ్మేదో ఇక్కడున్నట్టు ఉరకలెత్తుకుంటూ వచ్చేశాడు ఇడ్లీ కోసం" నత్తిగా అంటూ ఈసడింపుగా అంది పొట్లాం అక్కడున్న మురికి పట్టిన టేబుల్ మీదకి విసిరి కొడుతూ.

"రేపిస్తా... అవ్వా... మాయక్కకి పేనం బాగలేదు...."

"రేపెక్కడ్నించి తెస్తావురా పిచ్చి పీనుగా....." కసిరినట్టుగా అంది పోశమ్మ వాడేం మాట్లాడలేదు. చూరుగుంజని పట్టుకుని పోశమ్మని, ఇడ్లీ పొట్లాన్ని మార్చి మార్చి చూస్తూ బేలగా నిలబడ్డాడు. వాడి కళ్లనుంచి ధారగా కారుతున్న నీళ్ళు. వాణ్ణి చూస్తే జాలేసింది. అక్కడే కూర్చుని చుట్ట కాల్చుకుంటున్న పోశమ్మ మొగుడికి.

"ఆ పోనిద్దూ... రేపు తెత్తానంటన్నడు కదా... ఆర్రూపాయలకి ఆడెక్కడికి పోతాడు. ఆళ్ళక్కకి పేనం బాగలేదంటలే... " మొగుడన్న మాటలకి పోశవ్వ కాస్త కరిగింది." అవున్లే వాడెక్కడికి పోతాడు. ఇవ్వకపోతే రెండ్రోజులు గిన్నెలన్నా కడిగించొచ్చని మనసులోనే అనుకుని.

"సర్లేరా బుడ్డోడా... రేపు గుర్తెట్టుకుని తేవాల సరేనా?" వేగంగా బుర్రూపాడు అలాగేనన్నట్టు.

ఆ టైములో పోశవ్వ నిజంగానే దేవతలా కనపడింది వాడి కళ్లకి.

ఇడ్లీ పొట్లాం పట్టుకుని ఒక్కంగలో ఇంటికి చేరాడు సుబ్బు. అక్కింకా అల్లాగే పడుకునుంది. ఆ మర్నాడు కూడా ఆమె లేవలేదు. ఒళ్లు సలసలా కాగిపోతుంది. పైగా ఒకటే ఒణుకు బాగా చలేస్తున్నట్టు. ఆమెనలా చూస్తుంటే వాడికి మనసంతా అదోలా ఉంది.

తెచ్చిన కూరగాయలు తెచ్చినట్టే కుళ్ళిపోతున్నాయ్. ఏ రోజుకారోజే అక్క వంట చేసుద్దేమోనని కూరగాయలు ఏరి తెస్తానే ఉన్నాడు. అవలా కుళ్ళిపోతూనే ఉన్నాయ్ కానీ ఆమెకి తగ్గటం లేదు.

ఆ రోజు కూడా అలాగే కూరగాయలేరి తీసుకువస్తుంటే పోశమ్మ హోటల్లో గిన్నెలు కడిగే ఈరేసు అడ్డంగొట్టి "పోశవ్వ నిన్ను తీసుకు రమ్మందని" చెప్పి లాక్కుపోయినంత పనిచేశాడు.

"ఏరా పైసలెయ్యి...." అరిచింది పూరీలొత్తుతున్న పోశవ్వ వీడొచ్చాడని ఈరేసు చెప్పగానే ఇటు తిరగనైనా తిరక్కుండా... వాడేం మాట్లాడలేదు... దోషిలా నిలబడ్డాడు. కిందికి చూస్తూ చేతిలో కూరగాయల బరువొకటి.

"ఏరా... ఎయ్యి ఆర్రూపాయలు..." అయినా వీడేం మాట్లాడలేదు.

"మాట్లాడవేరా... అలా బెల్లంకొట్టిన రాయల్లే నిలబడ్డావ్...." అంటూ వెనక్కి తిరిగి పోశవ్వ వీడి చేతిలోని సంచిని చూసి ఈరేసుకి సైగ చేసింది అది లాక్కోమన్నట్టుగా.

పోశవ్వ సైగతో రెచ్చిపోయిన ఈరేసు గబుక్కున వచ్చి వాడి చేతిలోని సంచి లాక్కుని పోశవ్వ ముందు పెట్టాడు. సంచినీ కుమ్మరించి అటు తిరగేసి ఇటు తిరగేసి వాటికేసి అలాగేచూస్తూ "ఏటియ్యి" అనడిగింది చెప్పాడు సుబ్బు. వాటినలా చూస్తుంటే పోశవ్వ మనసులో దుర్బుద్ధి తలెత్తింది.

"సర్లే ఆ ఇడ్లీ డబ్బులు నువ్వేమిస్తావ్... గానీ.... ఆ డబ్బుల బదులు... ఈ కూరగాయలుంచుకోనా?" పోశవ్వ మాటలకి సంబరంగా తలూపాడు.

"ఎప్పుడైనా ఇలా ఏరిన కూరగాయలుంటే పట్రా... నువ్వో రెండిడ్లీ తిని మీయక్కకో రెండిడ్లీ అట్టుకెల్దు గానీ" ఆ గొంతులో ఆమె పలికించిన కపట ప్రేమకి పొంగిపోయాడు వాడు.

అదిగో అలా ఉదయాన్నే వాడు ఏరే రకరకాల కూరగాయలకి పోశవ్వ హోటల్లో పర్మినెంట్ బేరం దొరికింది వాడికి. బహుశా రావమ్మకి ఆ జ్వరం రాకుండా ఉంటే ఇలా జరక్కపోనేమో. కానీ వాడికీ ఇది బాగానే ఉంది.

పొద్దు పొడవకముందే పడతా లేస్తా ఏరిన కూరగాయలన్నీ తీసుకెళ్ళి పోశవ్వ ముందు పోసేస్తాడు. సుబ్బుగాడు భారంగా మోసుకొచ్చిన కూరగాయల్ని అటు తిరగేసి ఇటు తిరగేసి మనసులో ఆనందం ఉరకలేస్తున్నా పైకి మాత్రం" ఇంతేనా అన్నట్టు అదోలా పెడుతుంది ముఖం.

ఒక్కోరోజు ఎక్కువ పట్టుకెళ్ళిన్నాడు ఇడ్లీకి బదులు లావుగా ఉబ్బి ఉండే పూరీ తినాలని ఎన్నాళ్ళనుంచో అనిపించేది వాడికి. ఒకనాడు ధైర్యం చేసి ఆ మాట పోశవ్వతో అంటే...

"మరి తక్కువ తెచ్చిన్నాడో... సచ్చినోడా... నీకు అంతకంతకీ... ఆశెక్కువై పోతంది. నువ్వు తెచ్చే ట్రైర్లకిందా, కాళ్ళ కిందా పడి నలిగిపోయిన ఈ కూరగాయలకి ఇడ్లీయే ఎక్కువనుకుంటే... పూరీ అడుగుతున్నావా.... ఈటిని నేను గాబట్టి పుచ్చుకుంటన్నాను. మరొకళ్ళయితే పెంట మీద పొయ్యమనేవోరు.... ఎదవ సచ్చినోడా... ఎదవసచ్చినోడని..." ఆదిలోనే కొట్టి పడేసింది. అలా అలవాటు చేసుకుంటే ముందు ముందు వాడెక్కడ ఏకు మేకయిపోతాడోనని పోశవ్వ భయం.

పోశవ్వ మాటలకి బిక్కచచ్చిపోయాడు వాడు. మళ్ళీ పూరీ సంగతెత్తలేదు. పూరీ అడిగితే ఇడ్లీ కూడా ఇవ్వటం ఎక్కడ మానేత్తదోనని ఆ కోరికని చంపేసుకున్నాడు.

వీడు కూరగాయలు తేగానే వాటిని కుమ్మరించి... వేటికవి వేరుచేసి వాటిని అపురూపంగా బుట్టల్లోకి ఎత్తుకున్నాకా నిదానంగా "ఏరా ఈరేసూ... ఎక్కడ్రా... దొంగ సచ్చినోడా... ఇలాగొచ్చేడువ్... ఇదిగో ఈడికో ప్లేటిడ్లీ పెట్టిచ్చేయ్... ఆడు తిన్నాక పార్సిలోటియ్యి ఆళ్ళక్కకెట్టుకుంటాడు..." అంటది అదేదో ఊరకనే దయతలచి ఇస్తున్నట్టు.

సుబ్బుకి ప్లేటులో ఇడ్లీ పెట్టివ్వటమన్నా. వాడికి పార్శిలు కట్టివ్వటమన్నా ఆ ఈరేసుగాడికి ఎంత నామోషియో పోశవ్వ హోటల్లో గిన్నెలు కడిగే వాడికి సుబ్బు కంటే ఒకమెట్టు పైనున్నాననే ఫీలింగ్. నిక్కుతూ... నీల్గుతూ... పోశవ్వ అరిచాక అరగంటగ్గాని రాడు.

దేవుడు వరమిచ్చినా పూజారి ఫోజెట్టినట్టు ఆ ఈరేసుగాడు హోటల్ లోపలే ఏదో పని చేస్తున్నట్టు కూనిరాగం తీస్తూ మధ్య మధ్యలో వీడి వైపో లుక్కువేసుకుంటూ అటు ఇటూ తిరుగుతాడు.

పాపం వీడేమో ఆకలిగా... ఆశగా వాడు ఎప్పుడొచ్చి ఇడ్లీ పొట్లాం ఇస్తాడా అని వాడెటు తిరిగితే అటు చూస్తా ఉంటాడు అమాయకంగా. ఒక రోజు ఇలాగే ఈరేసు ఇచ్చే పొట్లాం కోసం ఎదురు చూస్తుంటే అక్కడే టిఫిన్ తింటున్న పక్క పాకలోని రిక్షా రాజన్న సుబ్బు వైపు చూస్తూ.

"ఏరా సుబ్బిగే... నాయాల్ది. మీయక్క తెల్లార్లూ మూలిగీ మూలిగీ నిద్దర్లేకుండా సేత్తందిరా... మొన్నటి దాకా మీయమ్మ దగ్గుతో సచ్చేం. ఆమె బాల్సీ తన్నీసింది.

ఇదిగో ఇప్పుడు మీయక్క... నిదరట్టక రోగాలొచ్చేత్తన్నాయ్ రా బాబూ...." అని కాసేపాగి.

"అద్సరే గానీ... ఒరే సుబ్బిగా నీ గురించేరా నా బాధంతా మీ యక్క క్కూడా ఏదయినా అయితే ఎలా బతుకుతావ్ రా... నిదర సంగతి అట్టుంచు దాన్దేవుందిలే సుక్కేసుకుంటే అది వత్తది లగెత్తుకుంటా. అది కాదు గానీ దీన్నయినా బెతికించుకోరా కుర్ర నాకొడకా అదీ లేకపోతే కుక్కలు చింపిన ఇస్తర్లెక్క అయిద్దిరా నీ బతుకు"

రాజన్న మాటలు పూర్తి కాకుండానే తరుముకొచ్చింది పోశవ్వ.

"ఈడి బొంద దాన్ది పెద్ద జబ్బయితే ఈడేం చేయగల్డు.... ఈడివల్లెక్కడయిద్ది ...." పోశవ్వ మాటలకి సుబ్బుగాడి మనసు చివుక్కుమంది.

"లేదవ్వా... ఇది అట్టాటిది కాదు... ఎంతమందిని చూళ్ళేదు. ఆళ్ళమ్మ ఖళ్ళూ ఖళ్ళూ మని దగ్గేది... ఈవెకి మూలుగొక్కటే... దగ్గులేదు."

"అయితే ఏ జొరమో అయుంటాది... ఊర్నిండా జొరాలే...."

"డాట్టర్లకి జూపిత్తే ఆళ్లే జెప్తారుగందా అదేం జబ్బో... అసలు తగ్గుద్దో తగ్గదో... ఆస్పితల్‌కి పట్టుకుపోరా... మీయక్కని... ఆలీసం చేత్తే నీకే నట్టం చూస్కో మరి" చుట్ట నోట్లో పెట్టుకుంటూ రాజన్న అన్న మాటలకి అడ్డు తగిలింది పోశమ్మ.

"నువ్వు మరీ చెప్తావు రాజన్నా ఆడెలా పట్టుకెల్లగల్డూ ఆస్పటల్కి... పిట్టని కొట్టూ పొయ్యిలో పెట్టూ అన్నట్టు ఏవో నాలుక్కూరగాయలేరుకొత్తాన్నాడు గందా అని నాకు తోచిందేదో నేనిత్తన్నా... అది కాస్తా తిని పగులల్లా కాయితాలేరుకుని రాత్రికి దేనితోనో దానితో పొట్ట నింపుకుని కాసిని నీళ్ళు తాగి పడుకుంటారు. ఆళ్ళ దగ్గర పైసలేడుంటాయ్. ఆస్పిటల్‌కి పోవాలంటే ఎన్నిపైసలుండాలి... ఊరకనే జెయ్యరు డాట్టర్లు వైద్యం...." ఎకసెక్కంగా అంది పోశవ్వ చెప్పటం సులువే అన్నట్టు.

రాజన్నకి అర్థమైపోయింది పోశవ్వ ఎందుకిలా ఎనక్కి లాగేత్తందో, సుబ్బుగాడక్క సత్తే పర్మినెంటుగా ఈడ్ని తన దగ్గర అట్టే పెట్టుకోవచ్చన్న పోశవ్వ ఎత్తుల్ని సాగనివకూడదన్నట్టు పోశవ్వ వైపో చూపు విసిరి సుబ్బు వైపు తిరిగి.

"ఒరేయ్ సుబ్బిగే... రాందేవుగారాస్పటల్ కయితే పైసలెక్కువక్కర లేదురా... పైసల్లేకుండగనే వైజ్జగం చేస్తారక్కడ నువ్వాడికి తీస్కపోరా"

“యాడన్నా అది....” ఆశగా అడిగాడు సుబ్బు రాజన్న దగ్గరగా వచ్చి... అలా అడిగేటప్పుడు వాడి కళ్ళల్లో ఎంత మెరుపో.

“అరె... ఈడనే రా... కూకటపల్లి నించీ అవుసింగుబోర్డుకి బోతమా... మజ్జలో... సిగ్నలొత్తాది గందా... ఇవేకానంద కాలనీ అని... ఆడనే ఎడం ఏపు జూత్తే... పెద్ద బోరుడుంటాది జూడు.”

“ఏది... ఆ మెయిన్‌రోడ్డు నుండాది అదా....” పోశవ్వ మాటలకి అవునన్నాడు రాజన్న.

“మొన్నీమజ్జనే మాయావిడ్ని జూపిచ్చినా కాల్నెప్పంటే ఆడకి దీస్కపో మీయక్కని... నయమయిద్దిరా... గేరంటీగా నేజెప్తున్నాగా... తీస్కోపో”

“తీస్కపో.... తీస్కపో అని మంచి జబర్దస్తీగా చెపుతున్నావ్... ఎట్ట తీస్కపోవాల గోసి పెట్టుకుంటం కూడా రానోడు. రోగంతో మూలుగుతున్న సెట్టంత మడిసిని ఎట్టా తీస్కెలతాడు. సలహా. ఇత్తంకాదు... దమ్ముంటే నీరిచ్చాలో తీస్కెల్లి అక్కడ పడేయ్... అక్కడ్నించి ఆళ్ళే చూసుకుంటారు.”

“అక్కడ పడేత్తే మాత్రం ఎట్ట పట్టుకెల్తారు లోపలికి. పైసలిత్తేగానీ ఎవరూ లోనికి తీసుకెల్లరు.... అంగీ లేనోడనీ ఉండదు. అడుక్కునే వోడనీ సూడరు. పైసలిత్తేనే ఏ పనైనా....” పోశవ్వ మొగుడందుకున్నాడు లోకాన్ని ఔపోశాన పట్టినట్టుగా.

“నిజ్జంగా నిజమన్నా.. అన్ని దవాఖానాలూ అట్లనే ఉన్నయ్” రాజన్న మాట రాజన్న నోట్లో ఉండగానే.

“అన్నీ తెల్సినోడికి... మరింకేం... ఆ పైసలు గూడా నువ్వే ఇచ్చేయ్... ఆ పున్నెం కాత్తా నీకే ఉంటది...” రాజన్నని ఎత్తి పొడిచింది పోశమ్మ.

“ఇత్తా... ఇత్తా... ఆడేరుకొచ్చిన సరుకంతా నువ్వట్టుకో. పైసలు నేనిత్తా... ఇన్నాళ్ళనించీ ఆడి కట్టాన్ని ఆ మట్టున ఏస్కుకుంటున్నవ్ గందా... నాయాల్ది ఇంతకు ముందంతా కుళ్ళు కూరగాయల్తో నువ్వండిన కూడు తింటాకి అయిదారుమంది రానాకి కనాకట్టం అయ్యేది. ఈడు దెచ్చే తాజా సరుకుతో తెల్లారితే ఎన్నాకులెత్తున్నాయో నాకెరికనేదనుకున్నావా... అదంతా ఆడి సలవ గాదా ఏటి. నువ్వీయరాదా పైసలు...”

"అనేసావా... అంటావనుకున్నాను. నీ కళ్ళడ్డాక ఇంకేటి... అయినా అవేమన్నా... నాణెమైనా సరుకా.... ఏవన్నానా.. టైర్ల కిందా... కాళ్ళ కిందా... నలిగియన్నీ తీస్తేత్తే... ఆడు తెచ్చేవి... ఆడికిచ్చేవి. సెరిసమానమే...." మాటా మాటా పెరిగి గొడవ పెద్దదవుతున్న టైములో ఇవేవీ అర్థం కాని సుబ్బు.

"ఎంతయిందన్నా...?" అమాయకంగా అడిగాడు.

"ఓ వందుంటే మీ యక్కకి తగ్గుద్దిరా గేరంటీ నే జెప్తున్నా గందా"

అదిగో రాజన్న నోటివెంట ఆ మాట విన్న కాడ్నించీ కాలుగాలిన పిల్లిలాగన అలా తిరుగుతూనే ఉన్నాడు. అప్పట్నించీ వాడికి నిద్రే కరవైపోయింది. తను ఇడ్లీ తింటం మానేసైనా సరే... వంద పోగెట్టాలి అవునూ ఇలా ఎన్నిసార్లు మానెయ్యాలి.

ఈ రాజన్నతో అంటే "నువ్వు మానేసి ఆమె నెన్నాళ్ళూ కిత్తావురా పిచ్చినాకొడకా పో... పోయి... ఆ ముసిల్దాన్నే అడుగు పైసలిమ్మని... నీ రెక్కల కట్టాం తేరగా పోసుకుంటుంది కదా... ఆ మాత్రం ఇవ్వదా ఏంటి..." అన్న రాజన్న మాటలు వినగానే కాళ్ళల్లో వణుకొచ్చింది వాడికి. ఎన్నాళ్ళనించో తినాలని ఉందని ఇడ్లీకి బదులు పూరీ ఇమ్మంటేనే ఇవ్వలేదు. పైసలిస్తుందా... చచ్చినా ఇవ్వదు... పోనీ ఒక పనిచేస్తే...

"ఇంకాసిని కాయగూరలేరి ఆటికి పైసలిమ్మంటే...." ఈ ఆలోచన వచ్చిందే మొదలు... వాడికింక నిద్రే పట్టలేదు. ఎప్పుడు తెల్లారుద్దా అని ఎలా లేచాడో ఎప్పుడు లేచాడో వాడికే తెలీదు. వాడి కాళ్ళల్లో ఏ ... శక్తో ఒక్కంగలో మార్కెట్ చేరాడు.

కూరగాయల తట్టలు మోసేవాళ్ళ కాళ్ళకడ్డూ కింద పడ్డా ఎలా లేచాడో, తనలాంటోళ్ల పోటీని ఎదుర్కొని ఎలా పరుగులు పెట్టాడో, షావుకారు కొట్టిన దెబ్బలకి చేతులు వాచిపోయినా లెక్కచేయక ఏరిన వాటిని వాడి చిన్న చేతుల్తో ఎలా మోసాడో... ముందు ఆవెంత చిన్నవో వాడికే తెలుసు.

వయసుకి మించిన బరువు మోయలేక నానా అవస్థలు పడుతూ ఏరిన వాటిని పోశవ్వ ముందుంచి తన కోరిక చెప్పాడు. ఏమంటోందనని ఒక పక్క భయపడుతూనే...

"ఓరి సచ్చినోడా... ఏవో నాలుగయిదు దుంపలు ఎక్కువున్నాయని నీకు ప్లేటిడ్లీ పైసలు ఎక్కువియ్యాలా... నా నాయనే... అడుక్కుతినాలి నేను... నువ్వేమన్నా బుట్టల్లో తాజా సరుకు తెచ్చిత్తన్నావా నాకు. నలిగినియ్యి. సచ్చులూ పుచ్చులూ నువ్వు తెత్తే నేను పైసలెక్కువియ్యాలా... ఇదేవన్నా నాయంగా ఉందాసెప్పు" అంది వాడు తెచ్చిన సంచీల వైపు ఒక పక్క ఆశగా చూస్తూనే... పోశవ్వకి తెలుసు నిజంగానే ఈ రోజు ఎక్కువున్నాయని కానీ ఇవ్వాళ ఇస్తే రోజూ ఇలాగే ఇమ్మంటాడని ఆమె భయం. అందుకే మొగ్గలోనే తుంచెయ్యాలని చూస్తుంది.

వాడి ఉత్సాహం మీద ఒక్కసారిగా నీళ్ళు చిమ్మినట్లయి దిగాలు పడ్డాడు పోశమ్మ అన్నమాటలకి.

నిండుగా ఉన్న సంచులవైపు నిరాశగా చూస్తు అనుకోకుండానే తనకి తగిలిన దెబ్బలు మీద చేత్తో రాసుకున్నాడు. ఇప్పుడు నెప్పనిపిస్తున్నాయవి అంతదాకా వాటి నసలు పట్టించుకోనేలేదు వాడు. ఏడుపొచ్చింది వాడికి. జీవన పోరాటంలో అలాంటి దెబ్బలెన్ని తినాల్సి వస్తుందో వాడికేం తెల్సు.

నిరాశా, బాధా, నిస్తేజం రంగరిస్తే కన్నీళవుతాయేమో... ఎంతసేపలా నిలబడ్డాడో... ఎంతకీ మాట్లాడని పోశమ్మనే గమనిస్తూ... నిలబడీ కాళ్లు పీక్కాపోగా... చివరకి చొరవచేసి.

"కాదవ్వా... రాజన్న... అక్కని ఆస్పతల్‌కి తీసుకుపోనానికి... వందవుద్దని నీయ్యెదురుగానే అన్నాడు గదవ్వా. అందుకే ఇయ్యాల నిజ్జంగానే ఎక్కువేరినా నవ్వా... సేటు కొట్టినాడు కూడానవ్వా సూడు రేపట్నించీ నువ్వీ మార్కెట్లో కనిపిత్తే చంపేత్తామన్నారవ్వా... ఆల్లెన్ని దెబ్బలు కొట్టినా రోజూ ఇట్టాగే తెత్తా నవ్వా... అక్కకి ఒల్లు కాలిపోతంది... జొరమొచ్చిందని రాజన్న చెప్పినాడు.. ఆ జొరం పోద్దని ఆళ్లు తరిమి తరిమి కొట్టినా ఏరికొచ్చానవ్వా ఇదిగో ఈ దెబ్బలు చూడు...." అంటూ అమాయకంగా చేయి ముందుకి చాపాడు తాను నీళ్ళు నిండిన కళ్ళలోంచి తన దెబ్బవైపే చూసుకుంటూ తన మీద తానే జాలిపడుతున్నట్టు.

వాడి బాధ పట్ల ఏమాత్రం జాలిలేని పోశవ్వ ఆలోచన్లు మరో రకంగా ఉన్నాయ్.

"ఒక్కసారొప్పుకుంటే ఇదే అలవాటయిపోద్ది. ఇయ్యాలాస్పటలంటున్నాడు. రేపు మందులకంటాడు. మరోటంటాడు... దీన్ని ముందుగానే తుంచెయ్యాల" అని మనసులో అనుకుని మళ్ళీ తనే..

"ఒక్కరోజు వీడి దగ్గర ఆ కాయగూరలు తీసుకోకపోతే ఏమవుద్దిలే... ఇయ్యాల తిరక్కొడితే కడుపు మాడి మళ్ళీ నోరెత్తడు అది కావాలి ఇది కావాలి అని... కుక్కిన పేనల్లే ఇచ్చిందట్టుకెల్తాడు..." అని అనుకుని వాడివైపు చూస్తూ...

"అంతేరా సుబ్బుగా మరో మాటలేదు... రేట్లు బాగా పెరిగిపోయినయ్యి. నేను మాత్రం యాడనించి తెచ్చేది చెప్పు. ఈ యాపారం నాక్కూడ ఏమీ కిడతల్లేదు. నాకే బతకనానికి సరిపోతల్లేదు.... మిమ్మల్ని కూడా ఎక్కడ మేపను చెప్పు. అందుకే ఇంకోచోటెక్కడయినా ఇచ్చుకో..." అంది భారంగా బతుకీడుస్తున్నట్టు నటిస్తూ.

ఏరిన దాన్నల్లా సంచీలో వేస్తూ... అలా వేసినప్పుడల్లా పెరిగిన సంచి బరువును తలచుకుని మురిసిపోయిన మురిపెం క్షణం కూడా నిలవక పోయే సరికి వాడికి గుండెల్లోంచి బాధ ఎగతన్నుకొచ్చి భోరుమని ఏడ్చేశాడు... అక్కడే గుంజకి జొరబడి... అలా ఎంత సేపు ఏడ్చాడో వాడికే తెలియదు.

"పసోడు... ఆడలా ఏడుత్తుంటే సూత్తా ఉంటాకి పాషాణమ్మణిసిని కాపోతే.... ఆడికో వందిత్తే... నీ సొమ్మేం పోద్ది... ఆడేవన్నా సుక్కేసుకుంటానికి అడిగేడా... సినిమా సూత్తకో, సీట్ల పేకాడతాకో అడిగేడా... ఈ పెపంచంలో ఆడికున్నది... ఆల్లక్కే.... దానికి రోగవొత్తే ఆస్పతల్‌కి పట్టుకెల్లానికి అడిగేడు. ఆడెవన్నా అప్పుగా ఆడిగేడేటి... సరిపడా సరుకిచ్చేగదా ఆడడిగింది... పసి పిల్లోడి పాటి గేనం లేదా నీకు... రాచ్చసి... ముండా... ఛీ... నీ బతుకూడగొట్టా..."

మొగుడన్న మాటలకి ఇంతెత్తున లేచింది పోశవ్వ నోర్మూసుకోమంటూ.... ఆ అరుపులకి భయపడిపోయిన సుబ్బు చివరకి చేసేదేం లేక మురికి పట్టిన చొక్కాతో కళ్ళు తుడుచుకుని నెమ్మదిగా లేచి తన సంచి చేతిలోకి తీసుకున్నాడు..

అంతకు ముందు ఒక ప్లేటిడ్లీ ఎక్కువిస్తది కదా అని ఉత్సాహంతో వచ్చేశాడేమో... ఆ ఆశ కాస్త అణగారి పోయేసరికి ఇప్పుడది ఎంతో బరువనిపిస్తుంటే... ఇంకా అక్కడే ఉంటే పోశమ్మ ఎక్కడ కొడుతుందోనని... కుడిచేత్తో

సంచి పట్టుకుని ఆ బరువుకి ఒక పక్కకి ఒంగిపోతూ నిస్త్రాణంగా కాళ్ళీడ్చుకుంటూ వెనుదిరిగాడు.

వాడలా మారుమాట మాట్లాడక వెనుదిరిగి పోవటంతో దెబ్బతిన్నట్టు చూసింది పోశవ్వ... "సర్లే... ఆ రెండు ప్లేటిడ్లియే ఇవ్వమంటాడనుకుంది. గాని వాడెళ్ళిపోతాడనుకోలేదు... అదిగో అప్పుడు మొదలైంది ఆమెలో ఆలోచన.

సమాజం తీరే అంత భయపడితే భయపెడుతుంది. ఎదురు తిరిగినా లెక్క చేయకపోయినా ఇదిగో ఇలా పోశమ్మలా....

"ఒక్కసారి బయటివాళ్ళెవరికైనా వాడేరిన కూరగాయలు ఇవ్వటం మొదలెట్టాడంటే మళ్ళీ తన దగ్గరికి రాడు వాడు ఎవరైనా తనకంటే ఎక్కువే ఇస్తారు వాడికి.... ఒక రకంగా ఈ మధ్యకాలంలో తన యాపారం పెరిగిందీ అంటే అది వాడివల్లే.... రాజన్న అన్నమాటల్లో తప్పులేదు. అలాంటోణ్ని తనెలా పోగొట్టుకుంటుంది..." అని ఆలోచిస్తూ కంగారుగా ఈరేసుని పిలిచింది.

"ఒరేయ్ సూద్రా.... ఆడెక్కడికెల్తాడో.... ఆడి కూడా ఎల్లి సూడు కాసేపు ఆటిని ఎవురుకైనా ఇత్తన్నాడనుకో పిల్చుకొచ్చేయ్... అంతదాకా సూత్తా ఉండు...." వ్యాపారంలో అదో లౌక్యం. అది పోశవ్వకి బాగా తెల్సు.

కడుగుతున్న అంట్లు అలాగే వదిలేసి రివ్వున బాణంలా దూసుకుపోయాడు వాడు.

"ఆడంతసేపూ నీ చూరట్టుకుని ఏలాడి ఏడుత్తూ ఆడి కట్టం సెపుకున్నా... వద్దని పొమ్మన్నావ్... ఇప్పుడు వాణ్ణి తీసుకురమ్మంటున్నావ్... అభిమానం ఉన్నోడెవడూ మల్లీరాడు.... నీ గుమ్మంలోకి...." తుపుక్కున ఉమ్మేస్తూ...

"నోర్మూసుకుంటావా... కాసేపూ... నాకసలే వాడెటుపోతాడా అని దడొత్తుంటే... నీ దెప్పుళ్ళేటి మజ్జలో..."

మోయలేక మోయలేక మోస్తూ నీర్సంగా వస్తున్న సుబ్బుగాడ్ని విసుగ్గా చూశాడు అక్కడ బండ మీద కూర్చుని బీడీ కాలుస్తున్న రాజన్న. అసలే రాత్రంతా సుబ్బుగాడి అక్క మూలుగుల్తో నిద్దర్లేదు వాడికి. ఆ పైన మందు మీదున్నాడేమో వీడ్ని చూడగానే వాడికోపం నషాళాన్నంటింది.

"ఏరా... సుబ్బుగే... ఏం జేసీవురా మీయక్క జొరం సంగతి నీయయ్య సంపేత్తన్నారాఁ? పగలంతా రిచ్చా తొక్కి తొక్కీ ఒల్లు ఊనమైపోయి... ఏదో కాత్త సుక్కేసుకుని ఇంటికొద్దును గందా... ఒకటే మూలుగుడు... నా పేనానికి..... తెల్లవార్లూ... లేనోడివై పోతావురా... నీయమ్మ...." రాజన్న మాటలతో వాడి ముఖం మరింత చిన్నబోయింది.

వాడికసలే నీరసంగా ఉంది రోజు తినే ఇడ్లి కూడా లేదు ఈ రోజు. పైగా పోశమ్మ తాను తెచ్చిన కూరగాయలు వద్దంది. డాట్టరుకి పైసలు మాటటుంచి రేపటేల్నించి ఏం చెయ్యాలో అక్కకి యాడనించి తెచ్చి ఇడ్లీ పెట్టాలో తెలీక నిరాశతో ఉన్నాడేమో రాజన్న మాటలతో మూలిగే నక్క మీద తాటికాయ పడ్డట్టు మరింత నిస్సత్తువగా అనిపించి... ఒక్కసారిగా కళ్ళు తిరిగినట్టయి తూలిపడబోయాడు... దగ్గర్లో స్తంభం ఉంటే పట్టుకుని నిలదొక్కుకోవాలని ప్రయత్నిస్తూనే దెబ్బ తగిలిన చేతులు సహకరించక పోయే సరికి ముందుకి పడిపోయాడు.

వాడలా పడి పోవటంతో సంచి కూడా పట్టుతప్పి భుజాల మీది నించి కిందపడిపోయింది. కూరగాయలన్నీ అక్కడున్న మట్టిలో చెల్లా చెదురుగా పడ్డాయ్. వాటినలా చూస్తుంటే వాడి ప్రాణం గిలగిలా కొట్టుకుంది. ఎంత కష్టపడి ఏరాడో... ఏరే కొద్దీ ఎంత మురిసిపోయాడో... ఎక్కువ డబ్బులొస్తాయని...

కళ్ళల్లో నీళ్ళూరుతుండగా చేతులు ముందుకు చాపి రక్తం తేరిన దెబ్బని నీళ్ళు నిండిన కళ్ళలోనే మరోసారి చూసుకున్నాడు. కళ్ళ నుండి నీటి చుక్క జారి దెబ్బ మీద పడేసరికి దెబ్బకి ఉప్పు రాసినట్టు భగ్గుమంది మంట.

'అమ్మా....!' అని ఒకపక్క బాధ నోర్చుకుంటూనే... గబుక్కున నోట్లోంచి కాస్త ఉమ్మి తీసి దెబ్బమీద రాసాడు. మంట కాస్త తగ్గినట్టనిపించిందేమో.... కింద పడ్డ కూరగాయలని అపురూపంగా చేతుల్లోకి తీసుకుని నెమ్మదిగా వాటికంటిన మట్టిని మాసిపోయి నల్లగా అయిపోయిన తన నిక్కరుతో తుడవటం మొదలెట్టాడు.

అదిగో అప్పుడు జరిగిందది.

ఎవరో ఇద్దరాడవాళ్ళూ... కాళీ సంచులతో హడావిడిగా ఏవో కబుర్లు చెప్పుకుంటూ కూరగాయల మార్కెట్‌కి వెళుతున్నారు. వెళుతూ వెళుతూ రోడ్డు పక్కన

కూర్చుని కూరగాయల్ని తుడుస్తున్న వీడిని చూసి. సడెన్‌గా ఆగిపోయింది, అందులో ఒకామె. ఆమె ఆగిందని రెండో ఆమె ఆగింది.

"ఏరో కుఱ్ఱోడా... ఈ కూరగాయలు అమ్మటానికేనా?" అని వీడి సమాధానం కోసం చూడకుండానే పక్కామెతో...

"ఇప్పుడే తెచ్చినట్టున్నాడు... ఇంకా పూర్తిగా కుమ్మరించను కూడా లేదు... ఇక్కడ తీసుకుందామా... మళ్ళీ అక్కడ దాకా నడవటమెందుకు అక్కడ్నించి మోసుకురావాలి... మనకసలే టైము లేదు ఇవి బాగానే ఉన్నాయ్ కదా ఏమంటావ్...."

"నీ ఇష్టం... బాగుంటే తీస్కో...." అంది పక్కామె బాగున్నాయో లేదోనని వాటివైపే...పరిశీలనగా చూస్తూ... తెల్లబోవటం వీడి వంతైంది... కోటి సూర్యుళ్ళ కాంతి ఒక్కసారిగా వచ్చినట్టుగా మెరిశాయి వాడి కళ్ళు. ఆశగా చూశాడు వాళ్ళవైపు.

"తీస్కోండమ్మా" అన్నాడు కంగారుగా ఆలస్యం చేస్తే మళ్ళీ వాళ్ళెక్కడ వెళ్ళిపోతారోనని.

"ఏవీ అన్నీ కుమ్మరించు...." వాళ్ళడిగిందే తడవు ఇంకా సంచిలో మిగిలి ఉన్న వాటన్నిటినీ కింద కుమ్మరించి బాగాలేనివి ఏరి పక్కన పడేసి సంచిని పక్కనే పరచి బెండకాయలూ, బీరకాయలూ, కాకర కాయలూ, టమాటాలు, దొండకాయలూ, ఉల్లి, మిర్చి మొదలైనవన్నీ విడివిడిగా పేర్చాడు. తన చిన్న చిన్న చేతుల్తో అంతకుముందెంతో అనుభవమున్నట్టుగా వాళ్ళు కూడా సాయం చేశారు వాడేరుతున్నంత సేపూ...

అంతా అయ్యాకా... వీడికినపడకుండా వాళ్ళల్లో వాళ్ళే ఏదో గుసగుసలాడుకుని "ఎంతకిస్తావ్ చెప్పు మొత్తం తీసేసుకుంటాం." వాడేం మాట్లాడలేదు... వాడికిదంతా కొత్త. వాడింకా అయోమయంగానే ఉన్నాడు. అప్పుడప్పుడే కొత్త శక్తిఏదో వాడిలో ప్రవేశిస్తోంది.

"చెప్పు... వీటన్నిటికీ ఏమివ్వమంటావ్...." రెట్టించారు వాళ్ళు.

"మీరే చెప్పండమ్మా...." అన్నాడు వాళ్ళవైపే ఆశగా చూస్తూ అప్పటికే ఈరేసు వచ్చి వాళ్ళ పక్కన నిలబడ్డాడు. చోద్యం చూస్తున్నట్టుగా చూస్తూ... కాసేపు వాళ్ళల్లో వాళ్ళే ఏదో మాట్లాడుకుని చివరికో నిర్ణయానికొచ్చినట్టు.

"తొంభై ఇస్తాం.. ఇస్తావా...." అన్నారు వెళ్ళడానికి సమాయత్తమవుతూ.....

అదెంతో కూడా వాడికి తెలియదు. అయినా గాని మారుమాట్లాడకుండా కూరగాయలన్నీ వాళ్ళ సంచీలో పోసేసి వాళ్ళిచ్చిన డబ్బులు తీసుకుని తన సంచికి పట్టిన దుమ్ము దులిపి భుజాన్నేసుకుంటూ ఈరేసు వైపు చూశాడు.

వాడు ఆశ్చర్యంగా కళ్లు పెద్దవి చేసుకుని వీడినే చూస్తున్నాడు. వాడి కళ్ళల్లో వీడిపట్ల అసూయ కొట్టొచ్చినట్లు కనిపిస్తూంటే....

"మీ ఒటేల్లో పూరీ ఎంతరా?" అన్నాడు ఒకింత దర్పంగా వాళ్ళిచ్చిన నోట్లని ఒకటికి రెండు సార్లు లెఖ్ఖ తెలియకపోయినా లెక్కిస్తున్నట్టు నటిస్తూ... అలా లెక్కించేటప్పుడు ఆ వేళ్ళ కదలికలో ఎంత వేగమో... అంత ఆత్మవిశ్వాసం... తననింకెవ్వరూ ఆపలేరన్నట్టు...

సూర్యుడు అంతకంతకీ తన పట్టు బిగిస్తున్నాడు.

# బతుకమ్మా...!

**-సమ్మెట ఉమాదేవి**

**"**ఇగో అద్దాల బంగ్లా రెడీ జేసిన... నువ్వు నీ కూతుర్లు... ఇగ ఇండ్ల కెళ్ళి సూర్యుని సూడొచ్చు ఇంట్లనే ఎన్నెల్లో పండొచ్చు." పాతిన గుంజలపై చాలిచాలని గోనె సంచులు కప్పి కుడుతూ... గురవయ్య మేళమాచాడు.

"దేవుడు సల్లగ జూసి పిల్లలకు కడుపు నిండ తిండి దొరికితే సాలు... అద్దాల బంగ్లలు, అంత్రాల... మిద్దెలు గట్టినట్లే... గదిసరెగాని ఈ ఊర్లె సెరువేడ ఉందో సూసి రావాలె..." గోనె సంచిలో నుండి వంట సామాన్లు... తీస్తూ అన్నది లచ్చిమి.

"అసలున్నదో లేదో ఎవ్వళ్ళకేర్పాటు?" పొయ్యి కోసం రాళ్ళు పేరుస్తూ... అన్నాడు గురవయ్య.

"అగ్గో గట్లంటవ్... సెరువు సెలమా లేకుంట... జలమలుండవు... జనం బతుకుడుందు గద్దెలుసుకో....." ప్లాస్టిక్ బిందెలో తెచ్చుకున్న నీళ్ళతో బియ్యం కడగసాగింది. పిల్లలు కర్రలు పాతి గోనెలు కప్పి స్నానానికి... చాటు సిద్ధం చేస్తున్నారు..

"అసల్ నీకు సెరువు... ముచ్చటెందుకో గదిజెప్పరాదె... " గురవయ్య... గొడ్డలి తీసి కట్టెపేడును ముక్కలు చేయసాగాడు.

"అయ్యో మారాజా దారి పొడుగూత సూడలె.. పున్నమోలే గరిక ఇరగబూసె... బంగారమోలే తంగేడు... మొగ్గలిప్పినయ్ గాదు. ఇగ వచ్చేది బతుకమ్మ సద్దులు... ఆడి బిల్లలు ముద్దుగ బతుకమ్మలు పేర్సి ఆడుకునుడే... సెరువు జూసుకోవాలె దరువేసి ఆడాలె.. రేకు పెట్టెలో బట్టల మధ్య దాచుకున్న సిబ్బిరేకులను... సంబరంగా తాకి చూస్తున్నారు పద్మ... పార్వతి.

"గిది బాగానే ఉన్నది లచ్చుమమ్మో... బతుకమ్మలు సరే మొదాలు బతుకుడెట్లో గదిజూడు లేకుంటే నీ ఆడిపిల్లల కడుపుల ఎలుకలు గిట్ట జేరి మంచిగ బతుకమ్మలాడ్తయి... యాడున్నా నీకు బతుకమ్మ రంధేనా...." నవ్వాడు గురవయ్య

"సీ గట్లంటవ్... యాడుంటేంది? అంచెన ఇడవకుంటుండాలె... మన పూజ మన ఆట మర్వద్దు.. అయిన నువ్వేమన్న. పైసల్‌పెట్టి కొనక్క రావాల్నా? సల్లనితల్లి.. సెట్లలబుట్టి సెరువుల గలుస్తది. ఒగ... పరమణ్ణమా పాశమా..? అరిసెలా సకిలానా...? గరీబోల్ల సంగతి దెలిసిన తల్లి పుట్నాలు పేలాలతోనే.. సరిపెట్టుకుంటది... మనమెంత బెడితే గంతే.. మక్క పేలలాతో సత్తు పెడితే... మస్తు కుషీబడే  తల్లి... మా దొడ్డతల్లి. గీ పండుగ జెయ్యకుంటే... నాకయితే పాణమెళ్ళి పోతది...' బండ కడిగి కారం వెల్లుల్లి పాయలు కలిపి నూరసాగింది.

"తల్లి బిడ్డలు గట్లనే ఆడుకుందురు తియ్... ఈ ఊరుకచ్చి... గంటగాలె.. నీ బిడ్డలు రేపు మాపటికల్ల సోపతోల్లను జమజేస్తరు తియ్ అందరుగూడి ఆడదురు గాని" బండ చుట్టూచేరి... తల్లి పెట్టే ముద్ద కోసం ఆత్రంగా ఎదురు చూస్తున్న పద్మ పార్వతి ముఖాలు బతుకమ్మ ముచ్చట్లతో విప్పారాయి.. అందర్నీ కూచోబెట్టి ఉన్నకాడికి వండింది ఊడ్చిపెట్టి తానింత తిన్నది

ఈత చాపలు గోనెసంచులు పరుచుకుని... ప్రయాణం చేసి వచ్చిన అలసట తీరేలా పడుకున్నారు... గురవయ్యతో పాటు మరో పది పదకొండు కుటుంబాలు. ఒరిస్సా పరిసర ప్రాంతాలలో రంగు రాళ్ళు దొరికే ప్రాంతాల్లో మకాము వేయడం మగవాళ్ళు గుట్టలు కొండలు తిరిగి రంగురాళ్ళు సేకరించుకు వచ్చి అమ్ముతుంటే ఆడవాళ్ళు కూలి పనులకు వెళ్ళడమో కూరగాయలో పండ్లో అమ్ముకురావడం చేస్తూంటారు ప్రతీ నాలుగైదు నెలలకు ఊరు మారి ఊరు తిరుగుతుండడం వాళ్ళకు అలవాటే. ఇరవై రోజులు గడిచిపోయాయి... ఆ ఊరికి అలవాటు పడిపోయారు...

"ఏంది వదినె బిరాన నడువవ్... మనూరు గాదు మన భాషగాదు.. జప్పన బోకుంటే.. భాషల దిడతరు... మొదాలు మనమాడ ఉంటేనే గదా... పెద్దసారు... కైకిలిప్పించేది...." మల్లమ్మ తొందర పెట్టింది. "మీరు బోంద్రి వదినే... మా పార్వతికి

జరం దగిలింది... జరంత సర్కారు దవఖానకు దీస్కబోయి మందులిప్పించి అస్త... పెద్దసారుకి నా ముచ్చట జర సోంచాయించి చెప్పుండ్రి... ఆయన దయుంటే ఇప్పిస్తడు లేకుంటే లేదు... లచ్చిమి అన్నది. మల్లమ్మ... రాజమ్మ... శంకరమ్మ అందరు ఉరుకులు పరుగుల మీద వెళ్ళిపోయారు....

"ఎండెక్కి పోతున్నది.... దబ్బ దబ్బ నడువు బిడ్డా." పార్వతిని తొందర పెట్టింది. "శాతగాటల్లె అమ్మా!" పార్వతి నీరసంగా నడవసాగింది... ఎదురుగా చెట్టు కింద కనపడుతున్న దృశ్యం చూసి ఇద్దరూ నడక ఆపేసారు... కేరు కేరు మంటూ చిన్ని గులాబిలాంటి అందమైన పసి పాప గుక్కపట్టి ఏడుస్తున్నది.... అంతకంటే అందంగా అమాయకంగా ఉన్న పాప తల్లి పాపను సముదాయంచలేక సతమతమైతున్నది.... ఆ ఏడుపు వింటున్నకొద్ది... అడుగు ముందుకు పడడం లేదు లచ్చిమికి... నాకెందుకులే అనుకోలేకపోయింది... చూస్తే బాగా ఉన్నింటి అమ్మాయిలా బాగా... చదువుకున్నదానిలా ఉన్నది... పసి గుడ్డును సముదాయించలేక పోతున్నది. పాప మరింత గుక్క పట్టి ఏడుస్తున్నది....? బెదురు కళ్ళతో కంగారుగా... పాపను ఊరడిస్తున్న ఆమెను చూస్తే లచ్చిమికి జాలేసింది... ఆమె పక్కనే... లగేజ్ బ్యాగ్... వంటరిగా ప్రయాణం చేస్తున్నట్లుంది. పక్కన పెద్ద వాళ్ళెవరూ లేరు. ఆ మాటే అడిగింది..... "ఏందమ్మా పెద్దోళ్లు ఎవళ్ళు లేరా ఏంది.... పిల్ల నీకాగుతల్లేదు... భుజానికేసుకో...." ఉండబట్టలేక సలహా ఇచ్చింది. "యాడిదాక బోవాలె...?" అడిగింది.

లచ్చిమి మాటలకు జవాబు చెప్పకుండా... "ఒక్క పదినిమిషాలు ఎత్తుకుంటారా ప్లీజ్ పాపకు పాలు కొనుక్కొస్తాను.... బతిమాలుతున్నట్లుగా అన్నది. "అయ్యో బిడ్డా తెచ్చుకోపో...." లచ్చిమి బిడ్డను భుజానికేసుకుంది. మనసులో ఒక పక్క పార్వతిని డాక్టర్‌కు చూపించేసి పనికి వెళ్ళాలని ఆత్రంగా ఉన్నా పోనిలే ఒక్క పదినిమిషాలే కదా... పాప అలా ఏడుస్తుంటే నిర్దాక్షిణ్యంగా వెళ్ళిపోవాలనిపించలేదు. పాపను భుజాన వేసుకుని ఊరడించింది. పాప పదినిమిషాల్లో ఏడుపు ఆపేసింది.

"పాపం ఏడదాక బోయిందో తల్లి... పాలు దొరికినయో లేదో..." అనుకుంటూ ఎదురు చూడసాగింది. "అమ్మా కండ్లు దిరుగుతున్నయ్...." పార్వతి నీరసంగా అన్నది.

"జర్రంత ఓపిక జేయి బిడ్డా... ఆమె పాలు తీసుకుని రాంగనే బోదం... నీకు డబల్‌రోట్టె గొనిస్త తియ్ తిందువ్‌గాని...."

ఏమనలేక పార్వతి చెట్టుకింద కూర్చుండిపోయింది.... పావుగంటైంది అరగంటైంది.... గంటైంది... వెళ్ళిన తల్లి తిరిగి రాలేదు...

లచ్చిమికి భయంవేసింది.. వయసులో ఉన్న పిల్ల... అందంగా అమాయకంగా ఉంది... ఎవరన్నా... ఏమన్నా చెయ్యలేదుకదా... అనుమానం వచ్చింది... పాపను భుజానా వేసుకుని పార్వతిని చెట్టుకింద కూర్చోబెట్టి అటూ ఇటూ తిరుగుతూ.

"ఓ అన్నా... ఎర్రసీరే గట్టుకుని... తెల్లగున్న ఒగామె గిటుదిక్కు బోయింది. చూసింర్రా?" అని అడగసాగింది...." ఆ చూసాం ఇటేపోయింది" ముందుకు చూపసాగారు... కాస్సేపయ్యాక పాప గట్టిగా ఏడవసాగింది... చుట్టూ చేరిన వారంతా ఒరియాభాషలో తెలుగులో ఏమిటేమిటో సలహాలివ్వసాగారు.... ఏం చెయ్యాలో అర్థంగాని పరిస్థితి... పాప ఏడుపు అంతకంతకు ఎక్కువవుతున్నది. దారిన పోయేవారంతా చుట్టూచేరి రకరకాలుగా మాట్లాడసాగారు. పాప ఏడుపు మరింత పెరిగింది. ఎందుకైనా మంచిదని లచ్చిమి ఆమె వదిలి వెళ్ళిన బ్యాగ్ తీసి చూడగానే అందులో పాలసీసా కనపడింది.... "అయ్యో పాలు ఉన్నాయి. ఆమె చూసుకోకుండానే పాలకోసం వెళ్ళింది. పాపం" అనుకుంటూ పాపను వళ్లో వేసుకుని గబాగబా పాలు పట్టసాగింది. పార్వతి జ్వరం మరచి... పాపను తల్లిని మార్చి మార్చి చూడసాగింది.... జనం చోద్యం చూస్తున్నట్టు చుస్తూ మాటలు విసరసాగారు.

పాపను కావాలనే వదిలిపెట్టి వెళ్ళిందని... ఒకరు... పోలీసు రిపోర్టు ఇవ్వమని ఒకరు... ఎంతో దూరం వెళ్ళి ఉండదు రైల్వే స్టేషన్‌కు వెళ్ళిచూడమని ఒకరు... బస్‌స్టాండ్‌కు వెళ్ళమని ఒకరు అనసాగారు... కొందరు ఆమెను బూతులు తిడుతున్నారు. లచ్చిమి ఇంకా అయోమయం నుండి తేరుకోలేదు... తేరుకున్నాక వాళ్ళ మాటలు, తిట్లు, సలహాలను భరించలేక పోతున్నది.... వీళ్లిలాగే అంటారు. కాస్సేపు ఎదురుచూస్తే ఆమె... తప్పక వచ్చేస్తుందనే నమ్ముతున్నది.

"పసిపిల్లను చూస్తే ప్రాణం ఉసూరుమనిపిస్తున్నది. ఇలా వదిలి వెళ్ళడానికి ఆ తల్లికి మనసెలా ఒప్పిందో.' అంటున్నారు కొందరు. పాపను పోలీసు స్టేషన్‌లో

అప్పుచెప్పమని పదే పదే సలహాచెబుతున్నారు. లచ్చిమికి ప్రాణమొప్పడం లేదు... ఇపుడో మరో క్షణంలోనో ఆమె వస్తుంది... అపుడు అందరూ నోరుమూసుకుంటారు... పాపను తీసుకుని ఆమె వెళ్ళిపోతుంది అనే ఎదురు చూస్తున్నది. కాని జనమెవరూ ఆగడం లేదు. అక్కడ మాటలు తూటాల్లా పేలుతున్నాయి.

"మదమెక్కి యాడోడో దిరిగి కడుపు దెచ్చుకుంటరు. గిట్ల కనిపారేస్తరు కావాల్ననే ఈడ బారేసి పోయింది..." అన్నారు. "కండ కావరం... కన్నూ మిన్నూ గానక తిరిగి కడుపు దెచ్చుకోవడం తెలుసుగాని పిల్లలను పెంచడం తెలియదా" అని... కొన్ని వినరాని మాటలు... కొన్ని అనకూడదని మాటలు తల్లడిల్లిపోతూ... పాపను పట్టుకుని నిస్సహాయంగా లచ్చిమి.

"గట్లనకుంద్రన్నా గామెను జూస్తే గట్లనిపిస్తలే... తల్లిపాణం ఆగదు యాడిదాంక పోతది.... వస్తది." అన్నది ఒక్కక్కొరూ వెళ్ళిపోయారు. చివరగా ఒకతను లచ్చిమి దగ్గరికొచ్చి... "సూడమ్మా... నువ్వు నీ దగ్గర ఇలాగే ఉంచుకుంటే... పిల్లల దొంగవంటారు పుణ్యానికి పోతే పాపం ఎదురు వస్తుంది... పోలీసుల దగ్గరకు వెళితే... ప్రశ్నలతో చంపి రోజు స్టేషన్‌కు పిలుస్తారు... చూడబోతే గరీబుదానిలా ఉన్నావు నీకెందుకొచ్చిన తలనెప్పి... చెప్తూ కన్నతల్లే వదిలి వెళ్లాక నీకెందుకు తాపత్రయం... నువ్వు కూడా ఎక్కడోచోట వదిలేసి.. ఈ భారాన్ని వదలించుకో... సలహా చెప్పి వెళ్ళిపోయాడు... అయోమయంలో మునిగిపోయిందామె.

ఆశచావక పాప తల్లికోసం మరి మరి ఎదురు చూసి లచ్చిమి ఇక తప్పదన్నట్టుగా పాపను భుజాన వేసుకుని ప్రమీలకు మెడికల్ షాపులో మందులు... బ్రెడ్డు కొనుక్కుని ఇంటి దారి పట్టింది అప్పుడు గుర్తుకు వచ్చాడు గురవయ్య. ఏమంటాడో అని భయం వేసింది.. కాని మొండిగా ముందుకు నడిచింది...

ఇంటిదగ్గర పద్మ తల్లి కోసం రోడ్డు మీదకు వచ్చి ఎదురు చూడసాగింది... "నాయిన నీకోసమే గటుదిక్కే వచ్చిండు." అంటూ "ఏందమ్మా... ఎవ్వరీ పాప... ఈ సంచెవరిది...?" ఆశ్చర్యంగా అడిగింది.

"గప్పుడే నాయనెందుకొచ్చిండు... " భయం భయంగా అంటూ గుడిసె లోపలికి పాపను తీసుకెళ్ళి పడుకో బెట్టింది.

"ఏమో గాని మొదాలు గీ పాపెవరో జెప్పు..." పద్మ.. ఆత్రంగా అడిగింది.

"గా సెట్టు కాడ ఒగామె ఎవరో పాప మస్తు ఏడుస్తున్నది జరంతసేపు.. ఎత్తుకోరా... పాపకు పాలు గొనుకొచ్చుకంట అని అమ్మ చేతికిచ్చి పోయింది. గంతే ఇగ రాలె... ఇద్వారు దాంక... జూసినం గాని మల్ల రాలె... ఇగ ఏంజేసుడు మేమే ఇంటికి దెచ్చినం..." పార్వతి చెప్పింది "అమ్మో ఎంత ముద్దుగున్నది. దొరల బిడ్డోలో ఉన్నది.... పద్మ ముద్దులాడసాగింది....." దారిలోనే సంగతంతా తెలుసుకుని ఎప్పుడు వచ్చాడో గురవయ్య.. కళ్ళు పెద్దవిచేసి చూడసాగాడు. లచ్చిమి గుండె దడ దడలాడసాగింది.

"ఏంది లచ్చిమి గింతపని జేసినవ్... ఎవలన్నా ఇంటి మీద బడి లొల్లి జేస్తే ఏం జేస్తవ్... మడుసుల మీన జాలుండాలేని. గది మన కొంప ముంచేట్లుండకూడదు... ఎర్కేనా? దబ్బన పోలీసోల్లు వస్తే ఏం జెబుతవ్... వాళ్ళకెవళ్ళు దోరకకున్న మన గరీబోల్ల మీద బడతరు... పొల్ల కండ్లవడతల్లేదని... వాల్లుగిట్ట ఠాణల షికాయత్ జేసింద్రనుకో... పాపం లచ్చిమి ఎత్తుకుని పాలు దాగి పించిందంటరా... పిల్లల దొంగవని పట్టుకుని ఠాణల వెట్టి పొట్టు పొట్టు గొడుతరు... నిన్నేగాదు మన తీరుగ అచ్చినొల్లను గూడ పట్టుకోని తంతరు. మబ్బుల లేసి ఎవ్వళ్ళకన్నా ఇచ్చేద్దం గింత ఉన్నోళ్ళ పిల్లను పెంచుడు మనతోని గాదు. గురవయ్య చాలాసేపు... హితబోధ చేసాడు... లచ్చిమి తలవంచుకుని నిలబడింది... "లచ్చిమి నువ్వు తప్పుజెయ్యలే తలొంచుకోకు కాని. ముందు ఎనక ఆలోచనజెయ్యాలె... మన గరీబ్‌గాళ్ళతో అయితయా గీ పనులన్ని పిచ్చి దానా... ఎర్కలేక దెచ్చినవ్‌గాని ఎనకసిరి ఎంత కిర్‌కిర్ అయితదో అని సోంచాయనుకున్న ఆమె పై అతని జాలి వర్షం కురిసి ఆమె కృతజ్ఞతతో తడిసిపోయింది.

తెల్లారింది. పక్షులు కిలకిల రావాలతో సూర్య కిరణాల వేడితో... కోడికూతలతో.. సందడిచేసే ఉదయం. పసిపాప కేరింతలతో పులకించిపోయింది. తనకేమి కాని ఆ పసికూన... వడిలో చేరి నవ్వులు కురిపిస్తుంటే.... లచ్చిమి కళ్ళు నీటితో నిండిపోయాయి.

"అమ్మోరి తీరుగున్న మీ అమ్మ ఎందుకు నిన్నిడిసి ఎటు పోయిందో. ఎందుకు పోయిందో... తెలియదు గీ గరీబు తల్లికాడ ఎట్ల బెరుగుతవ్ బిడ్డా?" తల్లడిల్లుతున్న లచ్చిమిని చూసి గురవయ్య.

"నువ్వు గిట్ల పరేషానుగాకు మనసు గట్టిజేసుకో... అసలే ఇద్దరాడపిల్లలున్న మనం ఇంగోబారం ఎత్తుకోలేం బంగారమోలే మెరిసిపోతున్న పసికూన మన తాన పెరిగితే మసి బొగ్గుతీరయితది ఆళ్ళమ్మగిట్ల తిరిగొస్తే ఇచ్చేద్దాం... లేకుంటే ఎవ్వళ్ళకన్నా పెంచుకోను ఇచ్చుడే... లేదంటే అనాధాశ్రమంలనో కాదంటే ఇగ పోలీసోల్లకిచ్చుడే... గురవయ్య గట్టిగా అన్నాడు. మౌనంగా తలూపింది లచ్చిమి. "లే... లేసి పనికి యాలయింది.. నడువ్..." అన్నాడు... "మరి... పాప...." అన్నది. "మళ్ళీ గిదొకటా... ఇవ్వాలొక్క దినమే... రేపటిసంది... కైకీల్‌కుబోవాలె...." గురవయ్య అరిచాడు.

"ఏ... రేపటిదాంకనా.... గియ్యాళ్ళనే... పాప సంగతి జూసి... రేపటిసంది కూలికి బోవుడే..." సర్ది చెప్పింది.

గురవయ్య అటు వెళ్ళగానే గుడిసెల్లోని వాళ్లంతా బిలబిలమంటూ పాపను చూస్తానికి వచ్చారు. అందరికి సంబరంగా పాపను చూపింది... కాస్సేపు చిన్నా పెద్దా. ఆడా మగ తెగ ముచ్చట పడ్డారు కాని. ఇక శంకరమ్మ... మల్లమ్మ, రాజమ్మ... త్వరగా పాపను వదిలించుకోకపోతే తమకు కూడా ప్రమాదమని, హెచ్చరించి వెళ్ళడంతో దిగులు పడింది. "నిన్నటి జనం తీర్గ గీళ్ళు సుత గా కన్నతల్లిని నోటికచ్చినట్టు దిడుతున్నరు... అసల్కి గదేందో దెలవదుగాని. ఆడి దాని మీద తప్పుబట్టి దిడుతానికయితే అందరికి నోరస్తది. అందరూ గా తల్లినే దిడతాండ్రు... గాని అసలేవడామెను మోసం జేసిండో... తల్లిదండ్రులతో లోకంతో ఆమెకెంత తక్లీబ్ అయిందో... ఎవ్వళ్ళకు దెల్సు... లచ్చిమి అనుకున్నది. మనసాగక మళ్ళీ ఆ చెట్టు క్రిందకు వెళ్ళి ఓ గంట అక్కడే తచ్చాడి కన్నతల్లి గదా... ప్రాణమాగక... మళ్ళీ.. ఆమె వస్తుందేమో ఆశగా చూసింది. ఊహూ... రాలేదు చేసేదేమిలేక... డబ్బులన్ని లెక్కపెట్టి పాపకు పాలప్యాకెట్టు తెచ్చి.... కడుపునిండా తాగించింది వంటికి నూనెరాసి నీళ్ళు కాసి స్నానం చేయించిది. ఈ పనులన్నీ తల్లి చుట్టుచేరి ఉత్సాహంగా గమనిస్తుంటే "మరి పాపను ఎవ్వళ్ళకన్నా ఇచ్చేద్దామా" అని అడిగింది.

"అద్దమ్మా నాయిన గట్లనే అంటడు... మనమే ఉంచుకుందం." అన్నారు... బ్యాగు నిండా ఉన్న రకరకాలగౌనులు... గంటకొకటి మార్చి పాపను చూసుకుంటూ... సంబరపడ్డారు... పద్మ, పార్వతి. సాయంత్రమైంది. గురవయ్య రానేవచ్చాడు... "లచ్చిమి పాప గురించి మస్తుమందిని అడిగిన... ఎవ్వళ్ళూ జూసినా పోలీసుల కియ్యమంటుండ్రు... ఏంజేసుడు గిట్ల ఎక్కువ దినాలు మన తాన ఉండుడు మంచిది కాదు... మరి ఇద్దామా. "చీర ఉయ్యాలలో లోకం తెలియని పాపాయి చెంపలు నిమురుతూ అడిగాడు.

"ఏమొద్దయ్యా. రోజుల పిల్లను తల్లికి దూరం జేస్తే పాపం దగుల్తదని... దబ్బున ఏడుసుకుంట మళ్ళ ఆ తల్లి అత్తదా ఏందని ఇయ్యాల సుత బోయి గా సెట్టుకాడ నిలబడి... మస్తు ఎదురుజూసిన... యాడ కండ్లవడలే ఇగ భగవంతుడు గీ సిన్న తల్లిని మరి ఏంజేత్తడో నాకయితే ఏర్పాటయితల్లేదు...." సెంపమీద పులిపిరి. పన్ను మీద పన్ను. సూడ సక్కగున్నది... గంత సదుకున్నమ్మకు బిడ్డను గిట్ల ఇడిసి బెట్టైతందుకు ... పాణమెట్లొప్పిందో. పాపను చూస్తూ మెటికలు విరిచింది. ఏమర్థమైందో పాప హాయిగా నవ్వింది."

"మరి పోలీసులకిచ్చుడా... పెద్ద నెత్తినొప్పి ఎవ్వళ్ళకన్న ఇద్దామా... పెంచుకుంటరో అమ్ముకుంటరో ఎవ్వళ్ళకుదెల్సు..." కళవరంగా.... గురవయ్య కాఠిన్యం ముసుగు జారిపోతున్నది.

"అమ్మో అమ్ముకుంటరా... బిచ్చమెత్తుకునేటోళ్ళు గొంచబోయండ్రనుకో... కళ్ళల్ల జీడిబోస్తరు లేకుంటే కాలన్నసెయ్యన్న ఇరుస్తరు. ఆ ప్రమాదం ఇపుడే జరుగుతున్నంత కలవరం పడుతూ... నిద్ర చెడుతుందన్న సంగతి మరచి... ఉయ్యాల్లో పాపను... ఎత్తుకుని గుండెలకు హత్తుకున్నది. "నాయినా మనమే ఉంచుకుందం... ఎవ్వళ్ళకు ఇయ్యకుండ్రి... పిల్లలన్నారు. "మరి మీ అమ్మ కైకిల్‌కు బోకుంట పిల్లను పట్టుకుని గూసుంటదా..." చిన్ని పాదాలను చేతితో తాకుతూ అన్నాడు.

"అయ్యో పోత గదా... వీళ్ళిద్దరున్నరుగదా... పాకెట్ల పాలేనాయె.. మెత్తని చీరను పక్క పరుస్తూ అన్నది.

“అవ్ నాయినా... మేం జూసుకుంటం...” చిట్టి చిట్టిచేతి వేళ్లనూ కాలి వేళ్లను.. తాకుతూ.. అన్నారు.

“మళ్ళ పాల పాకెట్లు ఏడనుంచి వస్తయి....? మన పెద్దోళ్ళం ఒగ పూట దిన్నా తినకున్నా.. నడుస్తది సంటిపిల్లను పస్తు బెడతమా...? అయినా గాని ఆడిబిల్లను బెంచుడంటే మాటలుగాదు... కొన్ని దినాలు బోయినంక ఆల్లెవళ్ళన్నా? మా పిల్ల మాకు గావల అంటే ఎనకసిరి మనం మస్తు బాధబడాలె.... వద్దు లచ్చిమి మనతోని గాదు గాని... ఎవ్వళ్ళకన్నా ఇచ్చేద్దాం...” మళ్ళీ మొదటి కొచ్చాడు.. లచ్చిమి, పిల్లలూ డీలా పడిపోయారు. గురవయ్యతో వాదించలేక పోయారు... నీళ్ళు తాగి పడుకున్న రోజులెన్నో కళ్ళల్లో మెదిలి... మౌనం వహించారు. ఎవరి పనుల్లో వాళ్ళు పడ్డారు.

మర్నాడు పొద్దున్నే... ఓ పదిమందిని కనుక్కుని... అక్కడా ఇక్కడా తిరిగి మొత్తానికి అనాధాశ్రమం ఎక్కడుందో తెలుసుకుని అక్కడి నిర్వాహకులతో మాట్లాడి వచ్చాడు.... “లచ్చిమి... మబ్బుల బయలెల్లు... మల్ల ఎవళ్ళన్నజూసి ఏమన్న అనకుంట... పిల్లను దీస్కపోయి... ఆడ ఇచ్చిరావాలె...” అని వివరించాడు. ఏమనలేక ముఖం చిన్నబుచ్చుకుని పడుకున్నారు పిల్లలు... ఎందుకో తెలియని దుఃఖం కలిగి... కళ్ళ నీళ్ళు దాచుకుని అటు తిరిగి పడుకుంది లచ్చిమి. “నెలన్న నిండలేదు ఏమి నసీబ్ తల్లి... నీది కన్న తల్లి నిన్ను గానకపోయె నా ఇంటికెందుకచ్చినవో గాని గరీబ్‌దాన్ని నిన్ను బెంచలేక బంపుతున్న బిడ్డా... ఎవళ్ళ చేతిల బడుతవో ఏందో పాపను దగ్గరకు తీసుకుని కళ్ళకు వత్తుకున్నది. రేయి కంటి మీద కునుకు లేదు... తెల్లారాక గాని కన్నంటుకోలేదు... గురవయ్య లేచిన అలికిడికి మెలకువ వచ్చింది. “కన్న తల్లికే లేదు నాకెందుకు భగమంతుడా ఈ శోకం..?” అనుకుంది.

“లచ్చిమి... ఏందే. పోల్లకు పెయ్యి గాలిపోతున్నది గాదు... జరం తగిలినట్లుంది.... జప్పన లే” అన్నాడు పార్వతికో పద్మకో అనుకుని కంగారు పడుతూ లేచింది... గురవయ్య చేతిలో చిన్ని పాప. చుట్టూ కంగారు పడుతూ పిల్లలిద్దరూ. అయ్యో మాయదారి నిద్ర పిల్లను జూసుకోలేదు అనుకుంటూ... చెయ్యి వేసి చూసింది. వల్లు కాలి పోతున్నది. ఏం జేసుడు భగమంతుడా... అనుకున్నది. “జల్దీ నడువ్”

అని గురవయ్య అనగానే... జరంతోటే పిల్లను వప్పజెపుతడా... దుఃఖపడతూ... ఏమనలేక "ఉండు మొఖం కడిగి వస్త" అని బావి దగ్గరకు వెళ్ళింది... ఆ పసిదానితో ఏ బంధమున్నదో... చేదతో నీళ్ళు తోడుతుంటే .. గుండెలో నుండి దుఃఖం పొంగుకొచ్చింది. కన్నీళ్ళను కడుగుకుని... కొంగుతో ముఖం తుడుచుకుని... పిల్లలకు జాగ్రత్తలు చెప్పి గుండె దిటవు చేసుకుని పాపను భుజాన వేసుకున్నది. ఓ చేత్తో పాప బ్యాగు పట్టుకున్నది. "నడువ్... కాస్త కోపంగానే అన్నది... కాని ఆ కంఠంలో దుఃఖమే వ్యక్తమైంది.

"అదేడికి... డాక్టరు దగ్గరకు బోనికి సుత గా బ్యాగు గావాల్న?" గురవయ్య మాటలకు ముగ్గురి ముఖాలు ఒక్కసారి విప్పారాయి. అయితే అనాధాశ్రమంకు కాదన్నమాట వెళ్ళేది.... బ్యాగక్కడ పడేసి ఉత్సాహంగా అడుగు ముందుకేసింది. ఆపదలు కూడా మంచికే వస్తాయేమో ఆ జ్వరం మూడు రోజులు తగ్గలేదు... మరో రెండు రోజులకు పాప కోలుకున్నాక అతనికి తీరికచిక్కలేదు ఆ తరువాత... అనాధశ్రమం వార్డెన్ ఊరెళ్ళాడు... పది రోజుల వరకు రాడు అన్నారు. ఒకాయన రెండు వేలిస్తాను పాపను ఇవ్వమన్నాడు. ఆ డబ్బు వాళ్లకు చాలా పెద్ద మొత్తం. భర్త ఇక ఇచ్చేస్తాడనే అనుకున్నది. కాని... "పిల్లగలోల్లు రేపు వస్తన్నరు... వాళ్ల పాపను వాళ్ళు దీస్క పోతమన్నరు... ఇచ్చుడు కుదరదు..." అని చెప్పాడు... లచ్చిమి వాళ్ళు వెళ్ళగానే

"నిజమేనా?"... అని ఆత్రంగా అడిగింది. "పిస్సమొగమా... వాడుజూడు ఎట్టున్నడో గది పిల్లను బెంచే మొగమేనా... గిసోంటోల్లే దుబాయిల ఆడిబిల్లలను అమ్ముకుని యాపారం జేసేది." అన్నాడు గుండెల నిండా ఊపిరి పీల్చుకున్నది.

రోజులు గడిచి బతుకమ్మ పండగ రానే వచ్చింది.... గౌరీదేవికి పూజ చేసి... కొంగులో పాపను నడుముకు చుట్టుకుని... ముగ్గురాడపిల్లలతో చేరి బతుకమ్మ ఆడింది. "ఒక్కేసి పువ్వేసి సందమామా ఒక్క జామయె సందమామా...

రెండేసి పూలేసి సందమామా రెండు జాములాయె సందమామ" అంటూ పిల్లలతో పాటు సంబరంగా పాడుకున్నది

“అడవిల... మోదుగ పూలతీరు... వాకిట్ల బతుకమ్మతీరు నా ఇంటికి గీ పాప వచ్చిచేరింది... తల్లిదండ్రులు జేసిన పాపానికి గీ పసి బిడ్డను బలిజెయ్యకమ్మా. ఈ బిడ్డను... కన్న తల్లి దగ్గరకన్నా బంపు, బాగ ఉన్నోళ్ళనన్నా... పెంచుకోను మాకాడికన్నా పంపు పసి పిల్లను సల్లగ కాపాడు తల్లి...!” అని మొక్కుకున్నది. తన కోసమో తన భర్తా పిల్లలకోసమో కాక తనకేమి కాని పసిపాప కోసం మొక్కుకుంటున్న లచ్చిమి దగ్గరకంటే పదిలమైన స్థానమెక్కడ ఉంటుందనేమో.. పది రోజుల్లో వస్తాడనుకున్న వార్డెన్ నెలైనా రాలేదు. ఒకరిద్దరు పెంచుకుంటామని వచ్చినవాళ్ళు పెంచుకుంటారో అమ్ముకుంటారో మనుష్యులను చూడగానే పాపను అర్థమై ఇవ్వలేదు. ఈ సందట్లో పాప అందరికీ బాగ అలవాటైపోతున్నది.

ఎవరో కొట్టి లేపినట్టు లేచి వెళ్ళి గురవయ్య పాపకోసం పాలు తెస్తున్నాడు. రాగానే మేలుకున్నదా పడుకున్నదా అని చూసుకుంటున్నాడు.. తమది కాని వ్యక్తి పట్ల ఉండే బాధ్యత... తాను పెంచగలడా అని... అసలిలా ఉంచుకోవచ్చా? అని అంతరాలలో ఏదో తెలియని భయం. ఉండుండి ఓ రోజు పాపను అనాథాశ్రమంలో ఇచ్చేద్దామని.. లేదా ఎవరికైనా ఇచ్చేద్దామని... మళ్ళీ మొదలు పెట్టాడు.... ఈ సారి మరీ పంతం పట్టాడు. చూసి చూసి... లచ్చిమి ఓ రోజు అతని పక్కన కూచుని.

“ఒగ మాటడుగుత కోపం జెయ్యకు... నిన్ను ఏనాడు. చీరలడగలే నగలడగలే మంచి బువ్వ బెట్టమని సుత అడగలే. మనకే ఎల్లుతలేదని తెలుసు. గీ పసి పిల్లను సాదుడు కష్టమని గూడ దెలుసు... కాని ఎవ్వళ్ళకన్నా ఇచ్చుడంటే... పాణం కళకళా మంటాంది....ఎట్లన్నజేసి మనమే బెంచుకుందం. కోపం దెచ్చుకోకు... వాళ్లమ్మ గిట్ల కండ్ల వడితే ఇచ్చేద్దాం... గా పాపం మనకొద్దు... మనకున్నంతలో ఒగ ముద్ద తిని బతుకతది... గా పిల్ల నసీబ్‌ల ఏముంటే గదే అయితది... జర నా మాట విను మనమెవళ్ళకన్నా ఇచ్చినంక పిల్లనేమన్న జేసింద్రనుకో... గా పాపం మనకు దగుల్తది... దేవుడు మన కడుపునే బుట్టించ్చిందనుకో...”

“గట్లెట్ల... ఏ అమ్మనో కని పారేసి తెలివిగ నిన్ను ఇరికించింది. నువ్ పిచ్చిదానోలే... దెచ్చుకున్నవు... ముందు ముందు గీ పిల్ల గురించి ఏమి

లొల్లిలయితయో... ఏం దెలుసు? వీళ్ళ వాదనలేవి తెలియని ఆ చిన్నారి చీర ఉయ్యాలలో తూగుతున్నది.

"అవ్ ఏమైన లొల్లి గాకుంటుండాలంటే... మనం ఈ ఊరు వదిలి ఎల్లిపోవాలె... సందమామోలె ఉన్న బిడ్డను జూసి బరాబర్ మన పొల్ల గాదని ఆళ్ళు ఈళ్ళు... ఏదోకటి అంటరు.... మనమింకేడకన్నా బోదం... ఓర్వలేనోళ్ళు పోలీసోల్లకు జెప్పినా పైసల కోసం ఏమన్నజేసినా కష్టం... అందుకే కొత్తగ బోయినకాడ మన పిల్లనే జెప్పచ్చు... ఏడకన్నా పోదం జరంత సోంచాయించు'

గురవయ్య మెత్తబడ్డాడు "బయట యాడికిపోయినా పాప ముచ్చట్నే దెస్తున్నారు. ఏందేందో అడుగుతున్నరు. బదుల్జెప్పుడు కష్టమైతాంది." అనుకున్న గురవయ్యకు నిజంగానే ఈ ఊరు వదలి వెళ్ళిపోవాలని బలంగా అనిపిస్తున్నది. లచ్చిమి మాటలతో అది మరింత బలపడింది. వీలు చూసుకుని మళ్ళీ కొత్త ఊరు చేరారు. కొత్త గుడిసె వేసారు. పార్వతి పద్మలు, పాపకు సుజాత అని పేరు పెట్టారు చెట్టుకు చీర కట్టి పాపను ఉయ్యాలలూపారు. పైకెక్కించుకుని గుర్రమాట... ఆడారు... లచ్చిమి కూలికి వెళ్ళగలిగితే.. సరే లేకపోతే... పిల్లలే పనికి వెళ్ళడం మొదలు పెట్టారు. వాళ్ళ గారాబాల మధ్య రేకు తొడిగిన ముద్దమందారంలా పాప బోసి నవ్వులు విరియసాగాయి... ఒక్కో బతుకమ్మకు ఒక్కో... వసంతం నిండి... పాప ముద్దులు మూట గడుతూ పెరగసాగింది. తన ఇంట... జాబిల్లిలా... ఎదుగుతున్న పాపను చూస్తూ... 'ఈ కలేపవ్వ పెరుగుతానికి.. గీ బుర్ద గావల్సివచ్చెనా దేవుడా ఏంది నీ మాయ." అనుకుంటూ ముద్దులాడుతుంది.

ఉండుండి... గురవయ్య ... "ఈ రోజుల్లో ఆడిబిల్లను బెంచుడు ఎంత కష్టం నాతోని గాదు... బువ్వబెట్టినట్టుగాదు పెండ్లిజేసి బంపుడు ఎంత కష్టం... ఎవళ్లన్న మంచోళ్ళు బెంచుకుంటమని అస్తే ఇచ్చేద్దాం" అంటూంటాడు.

లచ్చిమి ''సరే సరే'' అంటుంది. ''అయినగాని మనది గానిది మనముంచుకోకూడదు. ఎర్కేనా?" అంటాడు.

"నిజమే" అని ఒప్పేసుకుంఉంది. "ఎపుడన్న వాళ్ళమ్మగిట్ల కండ్లవడితే ఇచ్చేయ్యాల... మళ్ళా గిన్నొద్దులు బెంచినం నా పాణమాగుతదా అనొద్దు" అంటాడు. "ఏ... గట్లంటనా... ఇచ్చుడే" అంటుంది.

“ఇగ బాతలేసుడేనా పోల్లకింత జడలేసుడేమైన ఉన్నదా… ఎట్లంటే గట్ల మీ తిరుగుంచుడు గాదు ఉన్నింటి పిల్ల… సదువు కున్నోళ్ళ పిల్ల.. పోల్లను పువ్వోలే… బెంచాలె.. సుభ్రంగుంచాలే… అంటాడు.. ముసి నవ్వులు దాచుకుని మురిసిపోతుంటుంది.

“పసి పిల్లను గీ తీర్గ వదుల్చుకున్నరు… ఎన్ని పైసలుంటే ఏంది… ఎంత సదువుకుటే ఏంది?… నాలుగేండ్లు గడిపినయ్ ఇన్నొద్దులు రానోళ్ళు ఇగొస్తరా.. ఎట్టోనో ఒగట్ల… బెంచుతం… మాగిట్టం… బంగారాలొద్దు… బంగ్లాలొద్దు… కాయకష్టం.. జేసి పిల్లలను మంచిగ.. బెంచే శక్తినియ్యి సాలు దేవుడా అనుకుని నిట్టూర్చింది.

“ఇగ ఈ తిరుగుడొద్దు. మనపిల్లల మంచిగ సదివిపిద్దం. అమ్మ జేసిన కర్మానికో అయ్యజేసిన పాపానికో… అరసేతుల ఎన్నముద్దోలే పెరగాల్సిన పిల్ల మన పాలబడింది. మన పిల్లలతో గూడి సర్కారు బల్లేసి సదివిపిద్దం. “గురవయ్యతో అన్నది.

“ఈసారి బతుకమ్మ సద్దులైనంక వేరే ఊరికి బోయి ఇగ ఆడనే ఉందం. మనమిద్దరం… కష్టపడుదం ఆడిపిల్లల పనులకు బంపద్దు…” నులక మంచంపై పడుకుని చుక్కలంక చూసుకుంటూ… అన్నప్పుడు గురవయ్య చుక్కల్లో చంద్రుడిలా కనపడ్డామెకు

“పిల్లలను తీసుకుని.. గంప నిండా తంగేడు గరికె పూలు… గోరింట పూలూ… గన్నేరుపూలూ… సేకరించి తెచ్చుకున్నది. ఉన్నంతలో పిల్లలకు మంచి బట్టలు కుట్టించింది… పసుపు కుంకుమ కొబ్బరికాయ అరటి పళ్ళు తెచ్చి పిల్లలతో గౌరి పూజ చేయించింది. అందరికి… సత్తువ నిచ్చే మొక్కజొన్నలు… ఇతర ధాన్యాలు పేలాలుగ చేసి దంచి చేసి సద్దుల పండుగ నైవేద్యం సత్తుపిండి సిద్ధం చేసింది… నాది పెద్ద బతుకమ్మ అంటే నాదే పెద్ద బతుకమ్మ అంటూ… వాడలో అందరూ ఉదయం నుండే బతుకమ్మలు పేర్చారు. వాకిలి ఊడ్చి ముగ్గులు పెట్టి… సాన్నాలు చేసి కొత్త బట్టలు వేసుకుని… బతుకమ్మను తెచ్చిపెట్టి అందరూ లయబద్ధంగా చుట్టూ తిరుగుతూ చేతులు చరుస్తూ… పాటలు పాడగారు…

"బతుకమ్మ బతుకమ్మ... ఉయ్యాలో బంగారు గౌరమ్మ ఉయ్యాలో... అంటూ మొదలు పెట్టి... ఐదు పాటలు ఆడాక... చిన్న చిన్న బతుకమ్మలు పిల్లలు నైవేద్యాలు లచ్చిమి పట్టుకుంటే... గురవయ్య పెద్ద బతుకమ్మను నెత్తికెత్తుకున్నాడు... అందరు ఏటి ఒడ్డుకు బయలు దేరారు... ఇసుకలో బుడి బుడి నడకలు నడుస్తూ చిన్ని సుజాత ఆడుకోసాగింది.

పూలపై వాలిన సీతాకోకచిలుకల గుంపులా... లలనలు.. తుమ్మెదల ఝుంకారంలా వారి ఉయ్యాల పాటలు...

"రామరామ ఉయ్యాలో... రామనే శ్రీరామ ఉయ్యాలో... వర్ధిల్లుతూ... సిర్దిల్లుతూ ఉయ్యాలో... వాడ వాడల పోదు ఉయ్యాలో... ఆనందంగా లచ్చిమి పాడుతుంటే మిగితావాళ్లు... తిరిగి పాడుతున్నారు...

ఆ పక్కనే మరో గుంపు "కట్ల మీద రెండు ఉయ్యాలో... కలియమాకు చెట్లు ఉయ్యాలో... శ్రావ్యంగా.. గళాలు.. లయబద్ధంగా దరువులు... ప్రకృతికి కొత్త వన్నెలద్దాయి.

చెరువు పులకరించి... అలలు... అలుగా కులుకుతున్నది... గాలి... పరవశించి పూల పరిమళాలను... పంచుతున్నది.

దూరాన... మరో గుంపు... శ్రీలక్ష్మీ నీ మహిమలూ గౌరమ్మ... చిత్రమై తోచునమ్మా... గౌరమ్మ" ఆడి ఆడి అలిసిపోయారు. బతుకమ్మను నీళ్ళలో వదిలారు... ఒకరి కొకరు సద్దులు పంచుకుంటున్నారు... ఓ పక్కనే సద్దులు పంచుతూ చీర కుచ్చిళ్ళు తట్టుకుని పడబోతున్న ఆమెను ఆపిన లచ్చిమి ఉలిక్కిపడి చూసింది. అదే రంగు రూపు అనుమానం లేదు. చెంపలపై పులిపిరి... పన్నుపై... పన్ను... చారెడేసి కళ్ళు... ఇంత కాలం తాను ఎదురు చూసిన ఆమె ఆమె పాప తల్లి.

భర్తకిచ్చిన మాట గుర్తుకు వచ్చి పాపను ఇక ఇవ్వవలసిందే కదా అని... అన్న ఆలోచనకే గుండె పట్టేసినట్లయ్యింది.... ఆమె అక్కడే తిరుగుతుంటే గుండె దడ దడలాడసాగంది. లచ్చిమి ఒక్కపరుగున వెళ్ళి పాపను గుండెలకు హత్తుకున్నది.

ఇంతలో గురవయ్య పరుగు పరుగున వచ్చాడు.... "లచ్చిమి ఇటు రా జబ్బు పట్టుకుని లాక్కెళ్ళాడు... సూడు నువ్వు చెప్పిన తీరే ఉన్నదామె గటు సూడు" దూరాన

చూపించాడు... సరిగ్గా ఆమె అపుడే లచ్చిమిని చూసింది... బెదిరిపోతున్న ఆమె కళ్ళు... పారిపోతానికి సిద్ధమైతున్న ఆమె కదలికలు లచ్చిమికేదో సందేశం పంపుతున్నాయి... ఆమె ఎవరికో నమస్కరిస్తున్నట్లు నమస్కరిస్తూ తన వంక తిరిగింది.. అది తనకే అని అర్థమైంది.

"సూడు గదే పులిపిరి... పన్ను మీద పన్ను... ఒగాల ఈమె గామెనో ఏమో మంచిగ జూడు..." గురవయ్య లచ్చిమిని కుదుపుతూ ఆత్రంగా అడుగుతున్నాడు... గుండె దిటవు పరుచుకుని లచ్చిమి. "గట్లనే గొడుతున్నది గాని గీమె గామె గాదు... ఆమె ఇంక ఎత్తుగ... ఇంక తెల్లగుంటది... ఇగ నడువుండ్రి మస్తు పొద్దుపోయింది. ..." అందరినీ బయలుదేరదీసింది.

"నువ్వు సెంపమీద... పులిపిరి... పన్నుమీద పన్నేజూసినవ్... నేను గామె మెడల కొత్త గొడుతున్న.. పసుపుతాడు... గూడ జూసిన అనుకుంటూ నిట్టూర్చింది. కంగారుగా వెళ్తున్న 'ఆమె' వంక చూస్తూ... 'పో పోయి సల్లగ బతుకమ్మా..." మనసులో అనుకుంటూ ముందుకు నడిచింది. పాపనెత్తుకుని గుండెలకు గట్టిగా హత్తుకుని.. "సల్లగ బతుకమ్మా...." అని దీవించింది.

"నిద్రపో గౌరమ్మ... నిద్రపోవమ్మ... నిద్రకు నూరేళ్ళు... నీకు వెయ్యేండ్లు... నినుగన్న తల్లికి నిండా నూరేళ్ళు..." బతుకమ్మను నీళ్ళలో వదులుతూ... వీడ్కోలు... చెబుతూ... కొన్ని గుంపులు వాళ్ళు ఇంకా పాడుతూనే ఉన్నారు.

# గృహం - రుణం

-కోపల్లె మణి

రంగారావు ఉద్యోగం చేసినన్నాళ్ళు పొదుపుగా సంసారాన్ని నెట్టుకొచ్చాడు.. లక్ష్మి కూడా తనకి తోడు నీడగా నిలిచి సాయం చేసింది. ఒక్కగానొక్క కొడుకు శేఖర్‌ని ఎం.టెక్ చెప్పించి ఇంజనీర్‌ని చేశాడు. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా ఆరంకెల జీతం సంపాదిస్తున్నాడు. చదువుతున్నపుడే కాంపస్ సెలక్షన్స్‌లో సెలక్టయ్యాడు. మంచి ఉద్యోగం... తను సాధించలేనిది తన కొడుకు సాధించాడని సంతోషపడ్డాడు.

ఓ రోజు ఆఫీసు నుంచి ఇంటికి వచ్చిన శేఖర్ కొన్ని కాగితాలు తీసుకొచ్చాడు.

"నాన్నా! ఇవాళ ఆఫీసుకి కంఫర్ట్ లివింగ్ అనే బిల్డర్స్ తాలూకా ఏజెంట్స్ వచ్చి వాళ్ల ప్రాజెక్ట్స్ గురించి వివరిస్తూ అందరికీ డెమో ఇచ్చారు. వాళ్ల మోడల్ హౌస్‌లు, ఫెసిలిటీస్ గురించి అన్నీ వివరంగా చెప్పారు. అందరికీ వాళ్ల ప్రాజెక్ట్ వివరాలున్న బ్రోచర్స్ ఇచ్చారు. ఇవిగో అవే ఇవి. నువ్వు కూడా చూడు" అంటూ కాగితాలు తండ్రికి చూపించాడు.

రంగారావు కొడుకు ఇచ్చిన కాగితాలు చూడసాగాడు.

చాలా అందంగా వాళ్ళ ప్రాజెక్టుల వివరాలు, ఇంతవరకు ఎన్ని ఇళ్ళు కట్టారు. ఏవి కట్టబోతున్నారు మొదలైన వివరాలతోపాటు కట్టబోయే ఫ్లాట్స్ వివరాలు, ప్లాన్‌తో సహా ముద్రించి ఉన్నాయి ఆ బ్రోచర్‌లో.

రకరకాల ఏరియాల్లో కట్టే ఫ్లాట్స్ నమూనాలు ఉన్నాయి. చదరపు అడుగు రేట్లు అన్నీ ఉన్నాయి. అంతా నిశితంగా పరిశీలించాడు రంగారావు.

"ఎయిర్‌పోర్టు దగ్గరలో హైటెక్ సిటీకి 8 కిలో మీటర్ల దూరంలో అన్ని హంగులతో సుమారు 500 ఫ్లాట్స్ నిర్మిస్తారట నాన్నా. ఫ్లాట్‌కి కావల్సిన రుణ సదుపాయం కూడా ఆ బిల్డరే సమకూరుస్తారట. రేపు ఆదివారం సైటు దగ్గరికి వచ్చి చూసుకోమని అన్నారు వాళ్ళు. మా ఆఫీసులో అంతా వాళ్ళ ఫ్యామిలీలతో వెడతారుట"

"వాళ్ళ సంగతి సరే! మరి నువ్వేం ఆలోచించావు?" అన్నాడు రంగారావు.

"మనం తీసుకున్నా తీసుకోకపోయినా వెళ్ళి ఒకసారి చూద్దామని ఉంది. మీరు కూడా రండి. ఎలాగూ ఆఫీసుకి వాళ్ళ వెహికల్ వచ్చి అందరినీ పికప్ చేసుకుంటారట" అన్నాడు శేఖర్.

"సరే! చూడ్డంలో తప్పులేదుగా!" అన్నాడు శేఖర్.

ఆదివారం రానే వచ్చింది. అందరితోపాటు వాళ్ళిద్దరు కూడా సైటుకి వెళ్లి చూశారు.

నిజంగా చాలా బాగున్నాయి. ఆధునికత ఉట్టి పడుతోంది. అక్కడి ఫ్లాట్లలో బయటకి వెళ్లనవసరం లేకుండా షాపింగ్ కాంప్లెక్స్‌లు, ఆసుపత్రులు, స్విమ్మింగ్ పూల్, జిమ్ ఎక్స్‌ట్రా అన్ని సదుపాయాలతో కట్టబోతున్నారు ఆ ఫ్లాట్స్.

పైగా స్పాట్ రిజిస్ట్రేషన్ అంటే ఇంకా డిస్కౌంటు కూడా వస్తుందిట.

వచ్చిన అందరికీ ఆ ఏరియా నచ్చింది. "ఒకే చోట ఉద్యోగం చేస్తున్నాం. ఒకేచోట కూడా ఇళ్ళు కట్టుకుంటే అంతా ఒక ఫ్యామిలీలాగా కూడా ఉంటుంది. పిల్లలు కూడా అంతా కలిసిపోతారు" అని కొలీగ్స్ అంతా అనుకున్నారు. ఎన్నో ముందుగా ఊహించారు ఒకచోట కూర్చుని.

చాలామంది పదివేలు, ఇరవై వేలు అడ్వాన్స్ ఇచ్చి తమకి కావల్సిన ఫ్లాట్ బుక్ చేసుకున్నారు.

ఇక ఇంట్లో అందరూ అదే చర్చ... ఫ్లాట్ అంటే ఇదివరకు రోజుల్లో లాగా రెండు మూడు లక్షలకి రావటం లేదు. డెభ్బై లక్షల దాకా పోతోంది. వెయ్యి గజాల ఫ్లాటు. నాలుగు బెడ్ రూములు ఫ్లాట్స్ ఏకంగా కోటికి పైగానే... ఎంత బాగున్నాయో... అయినా ఎలా... ఇళ్ళు చాలా బాగున్నాయి. సొంతం చేసుకోవాలనే కోరిక బలంగా ఉంది.

రంగారావు కాలంలో అన్నీ చిన్న చిన్న ఇళ్ళు. మహా అయితే పూర్తి ఇల్లు కావటానికి లక్ష రూపాయల లోపే ఉండేది. ఇప్పుడో కాలం మారింది. సంపాదన బట్టి సొంత ఇల్లు. ఫ్లాట్ ఖరీదే ఎనభైలక్షల దాకా పోయింది. అంత డబ్బు ఎలా తీసుకువస్తాడు శేఖర్ అని బెంగ పట్టుకుంది రంగారావుకి.

ఇక శేఖర్ అయితే ఆఘమేఘాల మీద ఉన్నాడు. తన జీతం లక్షకి పైగానే ఉంది. అంతో ఇంతో బాంకు బేలన్స్ ఉంది. బాధ్యతలు లేవు. ఇంక పెళ్ళి అయితే కొత్త ఇంట్లో కాపురమే... ఊహల్లో ఉంది అతని ఆలోచన..

రంగారావు అడిగాడు "అంత దూరంలో ఫ్లాట్ అంటే రోజూ ఎలా వెడతావు ఆఫీసుకి? ఎలా సమకూరుస్తావు ఆ డబ్బు" అంటూ ఆరాటంగా అడిగాడు కొడుకుని.

"నువ్వేం బెంగపడకు నాన్నా! ఫ్లాట్ కొనటానికి ఆ బిల్డరే లోన్ ఇప్పించే ఏర్పాటు చేస్తున్నారు. ఎంత ఒక్క అరవై లక్షలే కదా! నెలకి అరవై వేలు కడితే చాలు. ఎలాగూ నా జీతం పెరగబోతోంది. అమెరికా వెళ్ళే ఛాన్సు ఉంది. తొందరలోనే బ్యాంకులోను తీర్చేయచ్చు" అంటూ ఎంతో ధైర్యంగా చెప్పాడు శేఖర్.

సగం కడుతున్న ఫ్లాట్ మోడల్ చూసి బుక్ చేసి లోన్ కోసం బిల్డర్ చెప్పిన బ్యాంకులో ఫార్మాలిటీస్ పూర్తిచేశాడు. అతని జీతం చూసి ఆ ప్రైవేటు బాంకువాళ్ళు అరవై లక్షలకి లోన్ ఇచ్చారు. లోన్ శాంక్షన్ అయిన నేపథ్యంలో శేఖర్ వాళ్ళు ఏ కాగితాల మీద సంతకాలు పెట్టమంటే పెట్టాడు. చదవటానికి తీరికేదీ... అడ్వాన్సు చెక్కులు పది దాకా తీసుకున్న బాంకు వాళ్ళు. తతంగమంతా పూర్తయి బిల్డర్‌కి పూర్తిగా కట్టి ఆ ఫ్లాట్ తన పేరు మీద రిజిష్టరు చేసుకున్నాడు.

రెండేళ్ళు గడిచాయి. శేఖర్ మంచి అమ్మాయి చంద్రని చూసి పెళ్ళి చేసుకున్నాడు. రోజులు ఆనందంగా గడవసాగాయి. నెలనెలా బాంకుకు కట్టవలసిన డబ్బు జీతంలోంచి కడుతున్నాడు శేఖర్. కొత్త ఇంటిలోకి మారాడు. ఎంతో బాగుంది రంగారావు తాతయ్య కూడా అయ్యాడు.

శేఖర్ చిన్నారి బాబు ముద్దు ముచ్చట్లతో కాలం తెలీటం లేదు. మధ్య మధ్య ముల్లులా గుర్తుకొచ్చేది తను బాంకు లోను తీసుకున్నట్లు. కానీ నెల నెలా జీతంలోంచి అరవైవేల రూపాయలు కట్ అవటం చూస్తున్నాడు. ఇప్పటికీ దాదాపు ఇరవైలక్షల దాకా తీరి ఉండాలి. అనుకుంటూ ప్రతి నెలా లెక్కలు కడుతున్నాడు.

ఒక రోజు శేఖర్‌ని ఆఫీసర్ పిలిచి "మన ప్రాజెక్టు పని మీద అమెరికా వెళ్లాల్సి వస్తుంది. నీకు పాస్‌పోర్ట్ అది ఉంది కదా!" అని అడిగాడు.

"ఉంది సార్" అని జవాబు చెప్పాడు.

"ఒక మూడు నెలల్లో పూర్తి చేయాలి. ఎక్కువ రోజులు పొడిగించకూడదు. కాబట్టి ఆ పని మీద నువ్వు ఉండు. ప్రయాణానికి సిద్ధంకా" అంటూ ఆర్డర్ పాస్ చేశాడు ఆఫీసరు.

శేఖర్ ఆనందంగా తన భార్య చంద్రకి చెప్పాడు. చంద్ర కూడా ఆ సంగతి విని చాలా సంతోషపడింది. "మీతో మమ్మల్ని కూడా తీసుకెళ్ళకూడదూ!" అన్నది చంద్ర.

"అబ్బే ఎలా కుదురుతుంది అది. వెళ్ళేది ఆఫీసు పని మీద కదా!" అన్నాడు.

"మేము మీరు ఎక్కడ ఉంటారో అక్కడే ఉంటాం. సాయంత్రం దాకా గెస్ట్ హౌస్‌లోనే ఉంటాం" అన్నది చంద్ర.

"ఊహు.. మేము పనిలో పడితే ఒక టైమంటూ ఉండదు. ఎంత... మూడు నెలలు ఇట్టే గడిచిపోతాయి. మళ్ళీ ప్రాజెక్టు అప్పుడు రెండేళ్ళు ఉండేలా ప్లాన్ చేస్తాను. పైగా ఇప్పుడు మనం వీలైనంత వరకు మనీ సేవ్ చేయాలి కదా!" అన్నాడు శేఖర్.

సరేననక తప్పలేదు చంద్రకి.

శేఖర్‌కి గుర్తుకొచ్చింది వెళ్ళేముందు తన హౌస్ లోన్ ఎంత తీరిందో... ఈ ఐదేళ్ళలో దాదాపు సగం కట్టేశాడు కాబట్టి బహుశా ఇంకో ముప్పై ఐదు, నలభై లక్షలు ఉండవచ్చు. వడ్డీతో కలిపి. ఇదిగో ఈ ఫారిన్ ఛాన్స్‌లో వీలైనంత ఆదా చేసి లోన్ తీర్చేయాలి...

ఎన్నో ఆశలు పెట్టుకున్నాడు. అక్కడ వీలైనంత తక్కువ ఖర్చుతో భోజనం చెయ్యాలి.  అక్కడ ఆఫీసువాళ్ళు ఇచ్చే డాలర్లలో కొంత మిగుల్చుకుని ఇంటి లోన్ మూడొంతులు తీర్చేయాలి అందరికీ మంచి గిఫ్టులు తీసుకురావాలి. తనకి మంచి జీన్స్... షర్టులు, చంద్రకి మంచి హౌస్ హోల్డ్ ఐటమ్స్ తీసుకురావాలి. నాన్నకి అమ్మకి కూడా మంచి ఉపయోగపడే వస్తువులు తేవాలి అని అనుకుంటూ లిస్ట్ ప్రిపేర్ చేసుకోసాగాడు శేఖర్.

ఒక రోజు వీలు చూసుకుని అమెరికా వెళ్ళే ముందు తను లోను తీసుకున్న బాంకుకి వెళ్ళాడు శేఖర్. తను ఇంకా ఎంత కట్టాలి అని మేనేజర్‌ని అడిగాడు. అతను ఆ డిపార్టుమెంటు వాళ్లకి ఫోన్ చేసి అతని లోన్ కాగితాలు చెప్పించారు మేనేజర్.

"ఇప్పటికి ఐదు సంవత్సరాలకి పైగా ప్రతి నెలా అరవై వేలు లోను కడుతున్నాను. దాదాపు సగం తీరిపోయి వుండాలి. ఇంకా ఎంత కట్టాలి?" అని అడిగాడు.

"కాగితాలు పరిశీలించాక చెబుతాను" అంటూ "ఇంకా మీరు అరవై లక్షలు కట్టాలి దాదాపు నాలుగు వందల ఎనభై నెలలు కట్టాలి" అని అన్నాడు.

ఆయన చెబుతున్నది అర్థం కాలేదు శేఖరికి.

"ఏమంటున్నారు మీరు?" అన్నాడు.

"అదేనండీ! మీరు ఇంకా అరవై లక్షలు కట్టాలి అని అంటున్నా" అన్నాడు మేనేజర్.

"దాదాపు ముప్పై ఆరు లక్షలకి పైగానే ఇంతవరకు కట్టాను. ఇరవై ఏళ్ళు అని అప్పుడు చెప్పారు" అన్నాడు శేఖర్

"నిజమే మీరు ఇంతవరకు ముప్పై లక్షల పైగానే కట్టారు. కానీ మీరు ఒప్పందం చేసుకున్నప్పుడు పది శాతం వడ్డీనే, కానీ ఈ మధ్య బాంకురూల్స్ మారి పన్నెండున్నర శాతం పెరిగింది వడ్డీ. ఆ ప్రకారం మీరు కట్టింది వడ్డీలోనే సరిపోయింది. అసలు అలానే ఉంది. వడ్డీ పోను ప్రిన్సిపల్ ఎమౌంట్ చాలా తక్కువ తీరింది. అందుకే అలా అయింది" అన్నాడు బాంకు ఆఫీసరు.

"అయితే మాత్రం మేము కట్టింది అసలు కొన్ని లక్షలయినా తీరాలి కదా!" అన్నాడు శేఖర్.

"మా బాంకు రూల్సు ప్రకారం ముందు వడ్డీ కట్టాక మిగిలింది అసలులోకి జమ వేస్తాం" అన్నాడు.

"ఇవన్నీ మీరు ముందు చెప్పలేదు కదా! అయినా ఇరవై ఏళ్ళని నలభై ఏళ్ళకి ఎలా పెంచారు?" అన్నాడు శేఖర్.

నలభై సంవత్సరాలు అంటే... ఇంటి మీద తను తీసుకున్న లోను తీరేటప్పటికి కుటుంబంలో ఎందరు ఉంటారో ఎందరు కాలం చేస్తారో తెలీని పరిస్థితి. ఇల్లు పూర్తిగా తమదవుతుందో లేదో తెలీదు. లేక బ్యాంకు పరం అవుతుందో ఏమో! ఆలోచిస్తున్న శేఖర్‌తో.

“మా తప్పేమీ లేదండీ! మీకు ముందే మేము చెప్పాం కాగితాల్లో రూల్సు అన్నీ రాశాం. మీరు చదువుకొన్నాకనే సంతకాలు చేసి అగ్రిమెంటుకు రావలసింది” అంటూ బ్యాంకు ఉద్యోగి తన తప్పేమీ లేదన్నట్లు మాట్లాడాడు.

ఎంతసేపు ఆర్గ్యుమెంట్లు నడిచినా బాంకు వారు తమ పట్టువీడలేదు. కట్టాల్సిందేనని అన్నారు.

శేఖర్ చేసేది లేక ఇంటికి నీరసంగా వచ్చాడు.

అతని ముఖం చూసి రంగారావు “ఏం జరిగిందిరా అంత డల్‌గా ఉన్నావు?” అని అన్నాడు.

జరిగింది చెప్పాలా వద్దా అని ఆలోచించాడు శేఖర్.

కానీ రంగారావు పట్టు పట్టాడు ఏమి జరిగిందో చెప్పమని.

ఇక చెప్పక తప్పలేదు. శేఖర్‌కి. బ్యాంకు వాళ్ళు గత ఐదేళ్ళ నుంచి ప్రతి నెలా తను కడుతున్న డబ్బు వడ్డీలకే పోవడం అసలు తీరక మళ్ళీ తను తీసుకున్నంతే ఉండటం అంతా చెప్పాడు.

చుట్టూ ఉన్న ఆధునిక ప్రపంచంలో ఆధునిక పోకడలు పోతూ సొంత ఇంటి కల నిజమవుతుందని అనుకున్నాడే కానీ తన కష్టార్జితం ఇలా జలగలా పీడిస్తూ ఉన్నదంతా తీసుకుంటుంటే... ఎప్పటికి తీరేను ఆ రుణభారం... ఎటూ పాలుపోవడం లేదు శేఖర్‌కి. ఎంతో చదువుకున్న తనే కాగితాలు చదవకుండా కాగితాల మీద సంతకాలు పెట్టాడు.... ఇరవై ఏళ్ల లోను నలభై సంవత్సరాలకి పెంచటమేమిటి? అసలు ఈ చక్రవడ్డీ లెక్కలు ఎలా కడతారు? ఇందులోని మతలబులేమిటి? ఎంత ఆలోచించినా అర్థం కావటం లేదు ఆ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌కి...

శేఖర్ బాధ చూస్తుంటే రంగారావు మనసు ఇంకా ఎక్కువ బాధపడింది. తన కొడుకు కష్టార్జితమంతా ఇలా ఇంకొకరు అనుభవిస్తుంటే... అంత సంపాదన ఉన్న

తన కొడుకే తీర్చలేకపోతే ఇక ఇటీవల మైక్రో ఫైనాన్స్ సంస్థల పేరిట ఎంత మందిబాధ పడుతున్నారో అని అనిపించింది రంగారావుకి.

దీనికి పరిష్కారం ఏమిటి? తండ్రిగా తను చేయవలసిన బాధ్యత ఏమిటో తను చేయవలసింది ఏమిటో తెలీటం లేదు.

రోజూ వాకింగ్‌కి వెళ్ళినప్పుడు కలిసే వాకింగ్ ఫ్రెండ్స్‌ని, తన ఫ్రెండ్స్‌ని ఇలా లోన్‌లు తీసుకున్న వాళ్లని అడగసాగాడు.

ఎంతో స్టడీ చేసిన మీదట తన ఇంటిని అమ్మి తన కొడుకు తీసుకున్న అసలు అప్పు కొంత తీర్చటం మంచిదేమో అనిపించింది.

"ఒరేయ్ శేఖర్ పోనీ మన ఇల్లు అమ్మేయనా?"

అన్నాడు.

ఉలిక్కి పడ్డాడు శేఖర్. ఆ ఇంటిని నాన్న ఎంత మమకారంతో పెంచుకున్నాడో చూశాడు. ఏదో కొద్దిపాటి అద్దెకే ఇచ్చారు కానీ అమ్మటం ఇష్టంలేదు. తండ్రి మనసు తెలిసిన శేఖర్ "వద్దు నాన్నా! ఇంకా సమయముందిగా ఆలోచిద్దాం" అన్నాడు.

శేఖర్ ఆలోచించాడు. ఎంతో కష్టపడి తండ్రి కట్టుకున్న ఇల్లు అమ్మటానికి ఇష్టపడలేదు. ఇది అమ్మితే తిరిగి సొంత ఇల్లు కట్టగలడా? తన ఫ్లాట్ అయితే బాగుంది. కానీ సొంత ఇండిపెండెంట్ ఇల్లు ఇచ్చే స్వేచ్ఛనివ్వగలుగుతుందా? ఆలోచించాడు. తక్కువ వడ్డీ ఇచ్చేకోట అప్పు చేయటం. ఆ డబ్బుతో వడ్డీలకు వడ్డీలు వేసి చక్రవడ్డీలు వేసి జలగల్లా రక్తం పీల్చే దళారుల వంటి ఈ ప్రైవేటు బాంకుల నుంచి రుణవిముక్తుడు అవటం. ఎవరిస్తారా అని వివరాలు తెలుసుకోసాగాడు. వడ్డీలో అరశాతం తగ్గినా లక్షల్లో పెద్ద మార్పు ఉంటుంది.

ఇక వేరే విషయాలకు ప్రాముఖ్యం ఇవ్వకుండా, పొదుపుగా డబ్బు ఆదా చేసి, డబ్బు సంపాదనపై దృష్టి పెట్టాలి అనుకున్నాడు శేఖర్.

వెతగ్గా వెతగ్గా వేరేచోట కొద్దిగా తక్కువ అంటే ఒక శాతం తక్కువ వడ్డీ లభిస్తుంటే అక్కడికి మార్చుకున్నాడు.

అప్పుడు కాస్త మనోభారం తగ్గినట్లయింది. శేఖర్‌కి. వీళ్ళు కూడా వడ్డీకే ప్రాముఖ్యం ఇస్తారని, వడ్డీ రేట్లు కూడా మారుతూ ఉంటాయని చెప్పారు. ఈ విషయాలన్నీ కూడా తండ్రికి చెప్పాడు శేఖర్.

కొడుకు తీసుకున్న నిర్ణయానికి తనూ ఆమోదించాడు రంగారావు.

తనకి వయసు అయిపోయింది. ముందు జీవితం శేఖర్‌ది. తము కట్టిన ఇల్లు పాత కాలంది. ఇప్పటి కాలానికి తగినట్టు ఉన్న ఈ ఇల్లు పరాధీనం కాకూడదంటే తను కట్టిన ఇల్లు తప్పనిసరిగా అమ్మాల్సిందే! శేఖర్ చేసిన అప్పులు తీర్చాల్సిందే అని గట్టిగా నిర్ణయం తీసుకున్నాక మనసు తేలికపడింది రంగారావుకి.

# ముత్యాలు

**–ఆచంట హైమవతి**

**"**ఇయ్యేల కూడా పొండుకోయావంట్రా? నాతో బాటే కుసింత గెంజోద్దునుగందా?" అంది గైరమ్మ.

"పండ్కొని... పండ్కొని ఇసుగేత్తందత్తా! నోరు సప్పగైపోనాది. బైటకెల్తే ఏ ఒటేలు బాబైనా నాల్టీసుక్కలోత్తాడేవోనని ఆసి!" అన్నాడు ముత్యాలు.

మూడు రోజుల్నుంచి మూసినకన్ను తెరవకుండా జ్వరం ముత్యాలుకి. ఇవేల్టికి జ్వరం బాగా దిగజారింది. జోలె ప్లాస్టిక్ చిప్ప పట్టుకుని మెల్లిగా బయల్దేరాడు ముత్యాలు.

జ్వరంగా ఉన్న మున్నాళ్ళు తనకున్న దాంట్లోనే ఏదో ఒక ఆహారం పెట్టి ముత్యాలుని చాలా జాగ్రత్తగా చూసుకుంది గైరమ్మ.

"ఏవో కల్తిరిగి పడ్తావేవోనని అట్లన్న. బేగ బేగ నడీబోకు. దూర్మెల్లొద్దు. బేగొచ్చేయ్!" వినయంగా తలాడించాడు ముత్యాలు.

నెమ్మదిగా నడక సాగించాడు ముష్టి ముత్యాలు. ఒక హోటల్ ఓనరుకి ముత్యాలంటే చాలా జాలి. ముష్టి ముత్యాలుకి ఒక కాలు కొంచెం పొట్టి. అతడు నడుస్తుంటే గెంతుతున్నట్లుంటుంది. అది చూసి "పాపం!" అనుకుంటాడతడు.

హోటల్‌కి చేరి, ఓనర్‌కి కనిపించేలా నుంచున్నాడు ముత్యాలు. యజమాని ఆజ్ఞతో సర్వర్ 'టీ' పట్టుకొచ్చాడు. ముత్యాలు పట్టిన చిప్పలో పోశాడు. మరికొంచెం పక్కకెళ్ళి ఒక వారగా కూచుని 'టీ'ని ఆప్యాయంగా చప్పరించుకుంటూ తాగసాగాడు ముత్యాలు. మొదటి రెండు గుక్కలు రుచి తెలియకపోయినా తర్వాత నోటి చప్పదనం తగ్గి రుచి తెలియసాగింది. ఊదుకుంటూ తాగుతుంటే ప్రాణానికి హాయిగా ఉంది.

వీధి కుళాయి దగ్గర నీటితో నోరు, మొహం, కాళ్ళు చేతులు శుభ్రంగా కడుక్కున్నాడు ముత్యాలు. కొత్త శక్తి వచ్చినట్లనిపించిందతనికి. కాని...! గబగబా నాలుగడుగులు వేసేసరికి తిరిగి నీరసం మొదలైంది.

నాలుగిళ్ళలో ఒక దోసెడు బియ్యం దొరికించుకుని వెనుతిరిగాడు. గైరమ్మ ఈ బియ్యంతో పల్చటి గంజి కాచి ఇచ్చింది.

“రేపట్నించి నానే ఒండుకుంతాన్లేత్తా! పాపం! నా మూలంగా నీకు పనెక్కువాయె....” అన్నాడు బిడియంగా ముత్యాలు.

“అట్లాగేలేరా” అంది గైరమ్మ నవ్వుతూ. ముత్యాలంటే గైరమ్మకి అభిమానం. అతడు పస్తులుంటే ఆమె సహించలేదు. తనకున్నా లేకపోయినా అతడు తినాలని కోరుకుంటుంది.

వారం రోజులు గడిచేసరికి ముష్టి ముత్యాలు బాగానే కోలుకున్నాడు. రెండు రోజుల్నుంచి కొత్త వీధులక్కూడా వెళ్ళొస్తున్నాడు. ఆ వీధుల్లో నెలజీతగాళ్ళు తక్కువేమో! తనకు కాసిన్ని బియ్యమే దొరుకుతున్నాయ్. పల్లె నుంచి సరకులు తెచ్చుకుని పిల్లల్ని చదివించుకుంటున్న కుటుంబాలవి. ఆ వేళ ముష్టి ముత్యాలు జోలె మూడొంతులు బియ్యంతో నిండింది.

ఒకరిద్దరు కొబ్బరి చిప్ప, వెలక్కాయ కూడా ఇచ్చారు. ఎవడో బస్తీ బాబు ఒక రూపాయిస్తే చింతపండు, ఉప్పు, కారం కూడా కొని తెచ్చుకున్నాడు ముత్యాలు.

ముష్టివాళ్ళందరూ వాడుకునే రోటి దగ్గర చేరి తెచ్చుకున్న సామాను, కొబ్బరి ముక్కలు అన్నీ కలిసి నూరి అన్నంలో కలుపుకుని తిన్నాడు. పచ్చడి నూరుతుండగానే ముత్యాలు నోట్లో నీరూరింది. గైరమ్మక్కూడా కొంచెం ఇచ్చాడు.

“నాక్కూతుర్లేదుగానొరే! ఉంటే నీకిచ్చే పెల్సేద్దున్రా! దాన్ని సుకపెట్టేటోడివి. ఎంత్బాగా చేసేవురా సెట్నీ!” లొట్టలేసి తింటూ మెచ్చుకుంది గైరమ్మ.

“సాల్సాల్లేత్తా” అంటూ తలొంచుకుని సిగ్గుపడ్డాడు ముత్యాలు.

గైరమ్మతో ఎంత మాట్లాడినా తనకి ఎక్కువ బియ్యం దొరికినట్లు చెప్పలేదు ముత్యాలు. చెప్దామని నోటిదాకా వచ్చిన మాటని వెనక్కి తీసుకున్నాడు. ముత్యాలు. కాని... అతడి మనస్సు గోల పెడుతూనే ఉంది. “జ్వరంతో తొంగున్న నాల్రోజులూ దాచుకోకుండా తన కడుపుకింత పెట్టింది. జాగ్రత్తగా తనని చూసుకుంది. అలాటప్పుడు తనకి దొరికిన బియ్యం ఎక్కువగా ఉంటే అందులో సగం గైరమ్మత్తకి ఇయ్యకుండా ఎందుకు దాచేసుకుంటున్నాడు? ఏమో!” మళ్ళీ మళ్ళీ ప్రశ్నించుకున్నాడు.

"రేపు కూడా ఇన్నేసి బియ్యమొత్తే అప్పుడు మరిన్నివ్వొచ్చులే!" అని తన అంతరంగాన్ని జోకొట్టాడు ముత్యాలు.

జోలెలో ఉన్న బియ్యం నాలుగైదు రోజులు కడుపు నిండా తిన్నా కూడా సరిపోతాయి గందా? నాలుగైదు రోజులు పోనక్కర్లే! గుడిసెలో తొంగొచ్చు!" అనుకున్నాడు ముత్యాలు.

రెండు మూడు గుప్పిళ్ళు జాస్తిగా దొరికితే ఆ మరునాడు ముష్టికి వెళ్ళేవాడు కాడు ముత్యాలు. బట్టలుతుక్కోవటమో, చిరిగిన బట్టలు కుట్టుకోవటమో చేసేవాడు. ఇప్పుడూ అలాగే అనుకుంటూ నిద్రపోయాడు రాత్రి. పొద్దెక్కినా గుడిసెలోనే ఉండిపోతే "అడుక్కోటాన్కి పోనేదేరా? పేనం బాండ్లేదా?" అంటూ వచ్చింది గైరమ్మ.

ముష్టికి పోకపోవటానికి నిజమైన కారణం చెప్పాలంటే ఎక్కువ బియ్యం వచ్చినట్లు చెప్పాలి. చెప్తే ఆమెకి వాటా పెట్టకపోతే బాగుండదు.

"కుసంతాలీసెంగా పోదామని...!" అంటూ గొణిగాడు ముత్యాలు.

"లెగు... లెగు! బారెడు పొద్దెక్కలా?" అంటూ వెళ్ళిపోయింది గైరమ్మ.

ఇక లేవక తప్పలేదు ముత్యాలుకి.

చిరిగిపోయిన లుంగీ మడతలేసి అందులో బియ్యం మూటకట్టి జోలె, చిప్పతో బయల్దేరాడు ముత్యాలు. మామూలుగా హోటల్ దగ్గరాగి, వాళ్ళిచ్చిన టీ తాగి ముందుకి సాగాడు. నిన్నటి దోవలోనే వెళ్ళాడు. ఇవేళ కూడా జోలె సగం పైగా నిండింది బియ్యంతో. ఇంటికి మళ్ళబోతూ పూర్వం వెళ్ళే రోడ్లవైపుగా అడుగులేశాడు ముత్యాలు.

"ఇన్నేళ్ళేడబోయావురా కుంటీ" అంటూ మిగిలిన పప్పు పులుసు, అన్నం కవర్లో పోసి ఇచ్చిందొకామె.

"ఏమోయ్! ఫారిన్ ఛాన్స్ దొరికిందేమో వెళ్ళిపోయుంటావనుకున్నాను? ఇండియాలోనే ఉన్నావా?.. బాగున్నావా?" అంటూ పరాచికమాడాడు స్టూడెంటు బాబు

“తమకంతా ఆశ్శీకం... ఈమద్దిన జొరం పడిపోయినా! అందుకే రాలేదన్నా” అన్నాడు ముత్యాలు నోరంతా తెరిచి నవ్వుతూ.

“సర్లే! ఇవి తీసుకో!” అంటూ కొంచెం చిరిగిన దుప్పటి, పాతచొక్కా ఇచ్చాడు. రెండు రూపాయల బిళ్ల కూడా చేతిలో వేశాడు.

పాత చోటుకి వెళ్ళటం వల్ల ఆ వేళ ముత్యాలుకి బాగానే లభించింది.

పప్పు పులుసు అన్నం సగం గైరమ్మకి పెట్టాడు. వేలూ... వేలూ నాక్కుంటూ తిని చాలా సంబరపడింది గైరమ్మత్త. ముందే తనదగ్గర ఒక పాత దుప్పటి ఉన్నందువల్ల స్టూడెంటిచ్చిన దుప్పటి గైరమ్మకిచ్చాడు.

“నా బాబు... నా బాబే” అంటూ మెచ్చుకుని సంతోషంతో కన్నీళ్ళెట్టుకుంది. గైరమ్మ అత్త విషయంలో తన బాధ్యతేదో తీర్చినట్లు ఫీలయ్యాడు ముత్యాలు.

ఆ రెండ్రోజుల్నుంచీ ముష్టెత్తిన బియ్యం ఆరు కిలోలకి పైగానే ఉంటాయి. బాగానే ఉంది. గాని... వాటిని దాచటమెలాగో తెలీటంలేదు ముత్యాలుకి.

కొత్త వీధుల్లో వరుసగా జోలె మూడొంతులు బియ్యంతో నిండటం, పాత వీధుల్లో వండినవే దొరకటంతో... బియ్యాన్ని దాచే సమస్య అంతకంతకు ఎక్కువే అవుతోంది.

ఈ వేళ రాత్రి ముత్యాలుకి నిద్రేపట్టలేదు.

“బియ్యాన్ని ఇలా బట్టల్లోనే కట్టుంచితే ఎల్కలు బట్టనీ కొరకెత్తాయి. బియ్యమూ తినేత్తాయి. ఏటి సెయ్యటం? ఆట్నెలా దాయటం?” అనే ఆలోచన ముత్యాల్ని సతమతం చేస్తోంది.

ఇదొక కొత్త బాధ వచ్చిపడింది. ముత్యాలుకి. తెల్లారుతుండగా నిద్రపట్టి– తాను బియ్యపు రాశుల్లో దొర్లుతున్నట్లూ, చుట్టూ ఉన్న ముష్టివాళ్ళూ, పేదలూ తనని చూసి చిరాకుపడుతున్నట్లూ కలకన్నాడు.

“తనకి బియ్యం ఇంతెక్కువ దొరికి... దొరికి గొప్పోడైపోతాడా? తన దురుట్టం సూసి సుట్టుపక్కలోళ్ళు ‘ఈసు’తో తిట్టుకుంటారేవో” అనుకుని నవ్వుకున్నాడు ముత్యాలు. కొంచెం గర్వంగా కూడా అన్పించింది.

గైరమ్మత్తకి కనపడకుండా బియ్యపు మూటల్ని మాసిన బట్టలకింద దాచేస్తున్నాడు. ఎప్పటికప్పుడు వాటిని దాచటమే గగనమైపోతోందతనికి. పాత వీధుల్లోకి కూడా వెళ్ళటం.... వండినదే దొరకటంతో వండుకునే పని కూడా తగ్గింది. తనకి సరిపడగా గైరమ్మత్తకి కూడా అప్పుడప్పుడు పెడుతున్నాడు. ఆమెకు అలా సంతృప్తి కలగజేస్తున్నాడు ముత్యాలు.

విషయ సేకరణ చేసి పాత సామానులు అమ్మే కొట్టుకెళ్ళాడు. పాతిక కిలోలు పట్టే సీనా రేకుడబ్బా బేరం చేశాడు. కాని వ్యాపారి చెప్పినంత డబ్బు తన దగ్గర లేక వెనక్కి మళ్ళాడు ముత్యాలు.

బజారు బయటికి ఒచ్చేస్తుంటే నాసిరకం సరకులమ్మే చిల్లరకొట్టు దగ్గర తనలాగే ముష్టి అడుక్కునే ముసిలిది కనిపించింది. ఆమెని గమనించాడు ముత్యాలు. ఆమె తన చెంగులోని బియ్యం ఆ కొట్లో అమ్మి డబ్బు తీసుకుపోయింది.

"అరే! నాకు తోసనే లేదే ఈ ఇసయం? అమ్మ... ముసిలిదానా! ఎంత్తెలివే నీకు?" అనుకున్నాడు. అతనికి దారి తెలిసినట్లయింది. ఐదు కిలోలు పట్టేటంత డబ్బా కొని పట్టుకుపోయాడు. అందులో పట్టినంత నిలవ ఉంచి మిగిలిన బియ్యం అమ్మదల్చుకున్నాడు ముత్యాలు.

చీకటితో లేచి బియ్యం జోలెలో పోసుకుని చిల్లరకొట్టుకెళ్ళి అమ్మి డబ్బులు తెచ్చుకుంటున్నాడు. కొద్ది రోజుల్లో బియ్యపు మూటలు ఖాళీ అయ్యాయి. డబ్బు ఒక పాత బట్టలో మూట కట్టి ఉంచటంవల్ల ఎలకలు ఆ మూటనీ, అందులోని నోట్లనీ కొరికి తినేస్తే? అనే దిగులు మొదలైంది. పూర్వపు సమస్యే కొత్త రూపంలో ఎదురైందిప్పుడు. డస్ట్‌బిన్‌లో పాత పరసులు దొరక్కపోవుగాని, వాటిని కూడా ఎలకలు కొరక్కుండా ఉండవుగా!?

తిరిగి పాత సామాను కొట్టుకెళ్ళి తన దగ్గరున్న డబ్బు దాచుకోటానికి సరిపడ పెట్టె ఒకటి కొన్నాడు. చవకలో తుప్పుపట్టిన చిన్న సీనా రేకు పెట్టె అది, దానికి చిన్న గొళ్ళెం కూడా ఉంది. "గొళ్ళెం పెట్టి దానికేదైనా అడ్డమెట్టొచ్చు" అనుకున్నాడు మురిసిపోతూ ముత్యాలు.

ఇంటికి రాగానే తనకి చేతనైనట్టు డబ్బు లెక్కెట్టి రేకు పెట్టెలో పెట్టి. పాత గుడ్డ గొళ్లెంలో దూర్చి మూడు... నాలుగు ముళ్ళేశాడు. అయినా జాగ్రత్త

చాలదనిపించింది. మళ్ళీ దాని పైన ఒక పోలిథిన్ కవరు చుట్టి, తాడుతో మళ్ళీ మూడు నాలుగు ముళ్ళు వేశాడు.

రోజులు గడుస్తున్నాయి. బియ్యం రావటం, అమ్మటం, డబ్బు లెక్కెట్టి పెట్టెలో పెట్టి జాగ్రత్తల మీద జాగ్రత్తలు చెయ్యటం – అయినా తిరిగి ఏదో అనుమానం... దిగులు!

ముత్యాలుకి శాంతి లేకుండా పోయింది. గైరమ్మకి పిల్లలమీదుండే అభిమానం గ్రహించిన ఒకావిడ ఒక పాఠశాలలో ఆయాగా పని ఇప్పిస్తే ఆమె ఇంకో ఊరి కెళ్ళిపోయింది.

"అప్పుడప్పుడు నేనొస్తాన్లేరా ముత్యేలు! నన్ను మర్సిపోవద్దురా!" అంది వెడ్తూ గైరమ్మ.

కొంచెం బెంగ పడినా ఎక్కువ బాధపడలేదు ముత్యాలు.

"ముట్టి బతుక్కంటే మేలే గదత్తా!" అన్నాడు మనస్ఫూర్తిగా.

"గైరమ్మతో బంధం ఆ రోజుతో తీరిపోయింది" అనుకున్నాడు ముత్యాలు.

బియ్యంతోబాటు అన్నం దొరికితే... తర్వాత రోజుకి బియ్యం ఉన్నాయి గదా అని ముష్టికి వెళ్ళకుండా బట్టలుతుక్కునేవాడు ముత్యాలు. ముష్టికెళ్ళటం మానలేక మాసిన బట్టలే కట్టుకు తిరుగుతున్నాడు. పోనీ... కొత్త బట్టలే కొనేసుకుందామంటే డబ్బు ఖర్చు చెయ్యటం ఇష్టం కావటంలేదు.

ఆ డబ్బుతో  ఏమీ అనుభవించటానికి మనస్కరించటం లేదతనికి. "డబ్మీద నాకింత ఆశుందా?" అనుకుని ఆశ్చర్యపోయాడు ముత్యాలు.

"గుడిసెలో దూరి ఎవరైనా డబ్బెత్తుకుపోతే...?" అందుకే ముష్టికెడ్తూ కూడా రేకు డబ్బా జోలెలో వేసుకుని పట్టుకుపోతున్నాడు.

ఆ వేళ ముష్టి అడిగి బియ్యం వేయించుకుంటుంటే రోజులాగా జోలెలో బియ్యం తగిలి రేకు పెట్టె శబ్దం చెయ్యలేదు. అనుమానం తోచి జోలెలోకి చూశాడు. అందులో రేకు  పెట్టే లేదు.

"ఏమైంది రేకు పెట్టె? ఇంట్లో మర్చిపోయానా?" పడ్తూలేస్తూ ఇంటికి పరుగెత్తాడు

ముత్యాలు. ఎంత వెతికినా రేకు పెట్టె కనిపించలేదు. మళ్ళీ మళ్ళీ వెతికినచోటే వెతికాడు. రేకు పెట్టే కనిపించనే లేదు.

పిచ్చెత్తినట్లనిపించేసింది ముత్యాలుకి. దిగ్భ్రాంతిగా కూచుండిపోయాడు. అలా ఎంతసేపు కూచున్నాడో తెలీదు. చీకటి పడింది. రాత్రైంది. ఆకలి లేదు... దాహం లేదు... అలాగే కూర్చుండిపోయాడు. నిద్రాలేదు... మెలకువా కాదు.

ఏమైంది రేకుపెట్టే? ఏమైపోయింది?? ఎవరెత్తుకుపోయి ఉంటారు?? ఏమో! ఏమో! ఏమో! ఏమో! అతడి మనస్సంతా ఖాళీ అయిపోయింది. ఆ రాత్రంతా ఎలా గడిచిందో అతనికి తెలీయలేదు. తెల్లారింది. సూర్యోదయం అయింది. అతడి మనస్సులో చిన్న కదలిక... బంధనం, ధనం, వీటి రాకపోకలు అస్థిరాలనిపించి –

"నేనింత డబ్బా కట్టంసేసి సంపాదిచ్చులా! అదే వచ్చినాది. తిర్గదే పోయింది. ఎంద్కొచ్చిందో... ఎందుకు... ఎలా పోయిందో... పోనే పోయింది. పోతే పోనీలే... ఏటైందిపుడూ?" అనుకున్న తర్వాత కొంచెం శాంతిగా అన్పించింది ముత్యాలుకి.

"ఏమీ దొరకన్రోజు పత్తుండ్లా? ఇపుడేం కొత్తా? బతికీదగల్నులే!" అనుకున్నాడు ముత్యాలు. రేకు డబ్బాలో దాచిన బియ్యం అయిపోయేవరకూ వండుకుతింటూ ఉండిపోయాడు గుడిసెలోనే.

తర్వాత గాని ముష్టికెళ్ళలేదు. ఓ రోజు వెనక్కొస్తూంటే మేదరి కిట్టప్ప కనిపించి "ఈమద్దిన శానామందికి సేతిపన్లు నేరిపిత్తాండాను. నీ కుంటి కాలు... నేను సేపిచ్చే పనికడ్డం కాదులే గాని... రేపిట్నించీ తెల్లారగానే ఒచ్చేయ్! మాతోబాటే తిందూగానీ!" అని చెప్పి వెళ్ళాడు.

వారంరోజుల్లో పని నేర్చుకున్నాడు ముత్యాలు. ఏకాగ్రత, బుద్ధికుశలత ఇపుడతని సొత్తయ్యింది. వేరే వేరే డిజైన్లలో నేర్పుగా కుర్చీలకు కూడా వైరు అల్లుతున్నాడు. అతడల్లుతున్న సరుకుని మెచ్చుకుని జనం కొనుక్కుపోతున్నారు.

ఇప్పుడతను ముష్టి ముత్యాలు కాదు అల్లిక డిజైనర్ ముత్యాలు. నిత్యం పరిశుభ్రమైన, చిరునవ్వుతో ముత్యాలు కడిగిన ముత్యంలా కనిపిస్తాడు. చేతినిండా పని! మనస్సు నిండా కొత్త బొమ్మలు!

పూర్వం రోజులు జ్ఞాపకం చేసుకోవటానిక్కూడా సమయం లేదతనికి.

# అసలు నిజం

**-కస్తూరి అలివేణి**

**మ**హేశ్వరి పని అమ్మాయి చేత ఇల్లంతా దులిపించి శుభ్రం చేయిస్తోంది. ఐదు నెలల తర్వాత అమెరికా నుండి వచ్చినందువల్ల ఇల్లంతా దుమ్ము, ధూళి నిండిపోయి ఉంది. భర్త స్నేహితులను కలుసుకునేందుకు బయటకు వెళ్లాడు.

"మహేశ్వరీ... మహేశ్వరీ? ఎప్పుడొచ్చావే మీ అబ్బాయి దగ్గర్నుండి" అంటూ సుడిగాలిలా ఏకంగా వంటింట్లోకి దూసుకు వచ్చింది కామాక్షి.

టీ తయారు చేస్తున్న మహేశ్వరి వెనక్కి తిరిగి కామాక్షికేసి నవ్వుతూ చూసింది.

"నేను వచ్చినట్టు నీకెలా తెలిసింది" అడిగింది మహేశ్వరి.

"అదే మీ పనిమనిషి వాళ్ల అమ్మ మా ఇంట్లోనే చేస్తోంది కదా... అదే చెప్పింది" అంది కామాక్షి.

"అంటే మళ్లీ పనిమనిషి మారిందా?" అంది వేళాకోళంగా మహేశ్వరి.

కామాక్షి మడి పనులకు దడిసి ఎవరూ ఎక్కువకాలం పనిచేయరు. వింత మనస్తత్వం. మనసులో ఏం ఉంచుకోదు. ఏదైనా క్రొత్త విషయం తెలిస్తే మహేశ్వరికి చెప్పుకోనిదే నిద్ర పట్టదు కామాక్షికి. మనసు మంచిది. కాని ఆమె మాటలు ఒక్కొక్కసారి చాలా ప్రమాదకరంగా మారతాయి.

"సరే నేనే నీకు కబురు పెడదాం అనుకున్నాను, కాస్త ఇల్లు సర్దుకున్న తర్వాత " అంది తిరిగి మహేశ్వరి.

"పోన్లే నేనే వచ్చేసానుగా?.... మీ పిల్లలు మనవలు బాగున్నారా?" అడిగింది కామాక్షి.

"ఆ... అంతా బాగానే ఉన్నారు టీ తాగుతావా" అడిగింది మహేశ్వరి.

"నీ దయ నా ప్రాప్తం... టీ ఎన్నిసార్లిచ్చినా తాగేస్తాను" అంది కామాక్షి నవ్వుతూ..

"చాల్లే జోకులు" అంటు టీ ఇంకో గిన్నెలోకి వడబోసి కప్పుల్లో పోసింది.

"పద డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చుందాం" అంటూ ముందుకు కదిలింది మహేశ్వరి.

"దుర్గా! టీ పెట్టాను వెళ్ళి తాగు" అంటూ పని మనిషికి అరచి చెప్పింది మహేశ్వరి.

"ఇప్పుడు చెప్పు... నేను లేనపుడు మన ఊళ్లో జరిగిన విషయాలు ఏమిటి? అడిగింది కామాక్షిని అక్కడ కుర్చీలో కూర్చుంటూ..

అసలు... కామాక్షి వింతలు విశేషాలు చెప్పటానికే వచ్చిందని తెలుసు మహేశ్వరికి.

"ఆ... ఏమున్నాయి వాద్రేవు వారి వీధిలో ఉంటున్న శర్మగారి మనవరాలు ఎవరో రెడ్డి కుర్రాడిని రిజిష్టర్ మేరేజ్ చేసుకుందిట.

"పోనీలే ఈ రోజుల్లో ఇంకా ఇలాంటివి ఎవరు పట్టించుకుంటున్నారు" అంది మహేశ్వరి.

"అలా నీలాంటి వాళ్ళు అనుకోబట్టే ఇలా మన సంప్రదాయాలు మంట కలిసి పోతున్నాయి" అంది కామాక్షి చేతులు ఊపుకుంటూ.

కామాక్షిని చూస్తే జాలేసింది మహేశ్వరికి. ఆ పల్లెటూరిలోనే పెరిగింది. ఆ ఊరే పుట్టిల్లు. అత్తవారి ఊరు కూడా. ఆ ఊరు దాటి ఏనాడు పట్టణం వరకు కూడా వెళ్ళక సందర్భాలు లేవు కామాక్షికి. ఉమ్మడి కుటుంబం. ఇల్లే ప్రపంచం.

అలాంటి వారు ఈ రోజుల్లో కూడా ఉన్నారంటే నమ్మాలి తప్పదు. ఎదురుగా సాక్ష్యం కనిపిస్తుంటే.

పిల్లలు లేని కామాక్షిది నిజంగా వింత జీవితం. మరిది పిల్లలను తన పిల్లలుగా సాకుతుంది. కానీ... ఆమె భర్తకి ఇంకో సంసారం, పిల్లలు ఉన్నారని ఊళ్లో జనం చెప్పుకుంటుంటారు. ఈ విషయం కామాక్షికి తెలుసో తెలియదో దేవుడెరుగు కాని తెలియనట్టే ఉంటుంది.

"ఊ... ఇంకా చెప్పు" అంది తాగేసిన టీ కప్పు టేబుల్‌పై పెడుతూ మహేశ్వరి.

తను కూడా గబగబా టీ తాగేసి కప్పు టేబుల్ మీద పెట్టింది కామాక్షి

"మీ పాత ఇంటి ప్రక్కన శారద లేదూ... అదే వర్ధనమ్మ పెద్దకోడలు భర్తపోయాడు. ఆ అమ్మాయి తన మరిదిని పెళ్ళి చేసుకుంది అంది కామాక్షి సాగదీసుకుంటూ....

నిజంగానే ఆశ్చర్యపోయింది మహేశ్వరి. ఎప్పుడూ ముభావంగా ఉండి ముక్తసరిగా మాట్లాడే ఆమె మొహం కళ్ళముందు మెదిలింది. వర్ధనమ్మకి ముగ్గురు కొడుకులు. ఒక కూతురు. కూతురు చిన్నతనం నుంచి మెంటల్ రిటార్‌టెడ్, సరిగా బట్టలు వేసుకోవటం చేతకాదు. అన్నం తినడం చేతకాదు. ఆడపిల్ల మూలాన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. పెద్ద కొడుకు కో ఆపరేటివ్ సొసైటీలో ఉద్యోగం, రెండో కొడుకు చదువు రాక మిలటరీలో జాయిన్ అయి కార్గిల్ యుద్ధంలో తీవ్రంగా గాయపడి కాలు పోగొట్టుకొని ఇంటికి చేరాడు. మూడో కొడుకు చెడు సావాసాలు పట్టి, ఇంట్లోంచి డబ్బు తీసుకొని ఒక రాత్రి పారిపోయాడు. ఏమయిపోయాడో ఇప్పటి వరకు ఎవరికీ తెలియదు.

కుటుంబ పరిస్థితులు దృష్ట్యా తమ బంధువులోనే తల్లిదండ్రులు లేని అమ్మాయిని తీసుకొచ్చి పెద్ద కొడుక్కి పెళ్ళి చేసింది.

కొడుక్కు పెళ్ళి అయిన ఆరు నెలలకి వర్ధనమ్మ భర్త పొలంలో పాము కరచి చనిపోయాడు. ఏడాది లోపు మనవడిని ఎత్తుకుని భర్త పోయిన బాధ మర్చిపోయింది వర్ధనమ్మ.

కాని కాలం, కర్మ కాలనాగులా వర్ధనమ్మని వెంటాడాయి.

మరో ఏడాదికి బ్రెయిన్ హెమరేజ్‌తో పెద్ద కొడుకు హఠాత్తుగా చనిపోయాడు. భర్త కొడుకు మరణాలు వర్ధనమ్మను మానసికంగా కృంగదీసాయి. భర్త ఉద్యోగం శారదకి ఇచ్చారు. ఇంటి బాధ్యత పూర్తిగా శారదకి ఇచ్చారు.

"ఏమిటి మహేశ్వరి మాట్లాడవు? ఆశ్చర్యంగా ఉంది కదూ...?" అంది కామాక్షి.

"ఆ... అవును,... అవును" అంది పరధ్యానంగా మహేశ్వరి.

"మన వీధిల్లో అందరూ బుగ్గలు నొక్కుకుంటున్నారు తెలుసా?" అంది బుగ్గన చేయిపెట్టుకుంటు కామాక్షి.

"అలాగా? అసలు ఇలా ఎందుకు చేసినట్లు" అడిగింది మహేశ్వరి సాలోచనగా.

"ఎందుకేమిటి? వయసులో ఉంది కదా! ఏం చేస్తుంది పాపం! భర్తపోయి రెండేళ్ళు దాటిందాయే! ఇంకో విడ్డూరం తెలుసా? వర్ధనమ్మే దగ్గరుండి మరీ వారిద్దరికీ గుళ్లో పెళ్లి చేసి అందర్నీ భోజనానికి పిలిచింది" అంది కామాక్షి.

"నువ్వు వెళ్ళావా?" అడిగింది మహేశ్వరి హాస్యంగా.

"ఆ... ఎందుకు వెళ్లను. నాలాగా అందరు వచ్చారు. వింత ఏమిటో చూద్దామని" మూతి తిప్పుతూ అంది కామాక్షి.

"అయితే మొత్తానికి ఊరంతా ఆశీర్వదించి వచ్చారన్నమాట" అంది మహేశ్వరి.

"ఇష్టం ఉన్నా లేకున్నా వెళ్ళాలిగా ముప్పైఏళ్ళుగా ఊళ్లో అందరికీ తెలిసిన కుటుంబమాయె" అంది కామాక్షి సాగదీస్తూ.

ఆపైన ఇంకా పది నిమిషాలు పిచ్చా పాటీ మాట్లాడి "ఇంక నేను వెళతాను... సాయంత్రం మడి వంటకు టైమ్ అయింది" అంటూ చీర దులుపుకుని లేచింది కామాక్షి.

పని మనిషి వెళ్ళిపోయిన తర్వాత మహేశ్వరి గదిలోకి వచ్చి మంచం మీద గోడకు ఆనుకుని కుర్చుంది. శారద నిర్ణయం ఎందుకో తప్పు అనిపించలేదు.

ఎంతో బిడియంతో, మొహమాటంగా ఉండే శారద మీద జాలితో మనసు నిండిపోయింది మహేశ్వరికి.

ఒకప్పుడు మహేశ్వరి వాళ్ళు వర్ధనమ్మ ఇంటి ప్రక్కనే ఉండేవారు. గోడ మాత్రమే అడ్డం, వర్ధనమ్మ కొడుకుల విషయం శారద ఆ ఇంటికి కోడలిగా రావడం అన్నీ తెలుసు.

శారద ఎవరితోను మాట్లాడేది కాదు. ఇంట్లో పనులతోనే సతమతమయిపోతూ ఉండేది. బయటకు వచ్చేది కాదు. గుడికి తప్పితే.

కాని అప్పుడప్పుడు మహేశ్వరి ఇంటికి మాత్రమే వచ్చి మాట్లాడేది.

"ఆమె మాటల్లో సఖ్యత, సంస్కారం కనిపించేవి. ఎప్పుడు అత్తింటి విషయాలు చెప్పేది కాదు.

"ఈ వీధిలో మీరే చదువుకున్నవారు. ఏదైన అర్థం చేసుకోగలరు. అందుకే అప్పుడప్పుడు మీతోనే మాట్లాడాలి అనిపిస్తుంది" అనేది శారద.

ఆ తర్వాత సొంత ఇల్లు కట్టుకుని కొంచెం దూరంగా వెళ్ళిపోవలసి వచ్చింది. మహేశ్వరి వాళ్ళకి. శారద భర్త పోయినపుడు కూడా వెళ్ళి పలకరించి వచ్చింది. తర్వాత మళ్లీ వెళ్లటానికి వీలుకాలేదు. అదీ కాకుండా వాళ్ళని బాధపెట్టవలసి వస్తుందని వెళ్ళటానికి మనసు ఒప్పుకోలేదు మహేశ్వరికి.

"ఏమిటోయ్ తలుపు తీసి ఉంది? ఏం చేస్తున్నావ్" అంటూ రూమ్‌లోకి వచ్చాడు మహేశ్వరి భర్త.

"వచ్చేశారా? అయ్యాయా మీ మీటింగ్‌లు" అంది లేచి వంటింట్లోకి వెళుతూ.

భోజనం చేస్తున్నప్పుడు విషయం చెప్పింది మహేశ్వరి భర్తకి.

"ఈ సమాజంలో వయసులో ఉన్న ఆడదానికి ఒక తోడుండాలి లేకపోతే లోకులు కాకులు. ఎన్ని కూతలైనా కూస్తారు. మంచి పనే చేసింది. ఆ అమ్మాయి" అన్నాడు మహేశ్వరి భర్త.

వారం రోజులు గడిచిపోయాయి. ఒకసారి వర్ధనమ్మ ఇంటికి వెళ్ళి శారదను పలకరిద్దాం అనుకుంది. కాని ఏమనుకుంటుందో అని వెళ్ళలేకపోయింది మహేశ్వరి.

ఒక రోజు సాయంత్రం నాలుగింటికి కాలింగ్‌బెల్ మ్రోగితే వెళ్ళి తలుపు తీసింది మహేశ్వరి.

ఎదురుగా శారద.

"అరే శారదా! నువ్వా రా... బాగున్నావా" అంటూ ఆప్యాయంగా భుజం మీద చేయివేసి తీసుకువచ్చి సోఫాలో కూర్చోబెట్టింది మహేశ్వరి.

ఇబ్బందిగా తల వంచుకుని కూర్చుంది శారద.

"మంచినీళ్ళు తాగుతావా" అడిగింది మహేశ్వరి తలూపింది శారద.

ఫ్రిజ్‌లోంచి మంచినీళ్ళ బాటిల్ తీసి గ్లాసులో పోసి తీసుకు వచ్చి శారదకిచ్చింది.

మంచినీళ్ళు తాగి గ్లాసు టీపాయ్ మీద పెట్టింది శారద. శారద ప్రక్కనే కూర్చుంది మహేశ్వరి. ఆమె చేతి మీద చేయి వేసింది.

"నువ్వు ఎందుకు వచ్చావో నాకు తెలుసు శారదా...? చెప్పు ఏం చెప్పాలనుకున్నావ్" అంది మహేశ్వరి అనునయంగా

గబుక్కున రెండు చేతులతో మొహం తిప్పుకుని వెక్కి వెక్కి ఏడవసాగింది శారద.

ఏం చేయాలో తోచలేదు మహేశ్వరికి.

దగ్గరకు తీసుకుంది శారదని మహేశ్వరి.

"చూడు శారదా? నిన్ను నేను అర్థం చేసుకోగలను చెప్పు భయపడకు".

కాస్త తెప్పరిల్లి కొంగుతో మొహం తుడుచుకుంది శారద.

"ఆంటీ మీరు మా ప్రక్క నుంచి వెళ్ళిపోయాక, ఎంతో లోటుగా అనిపించేది. ఎన్నిసార్లు ఇంటికి వద్దామనుకున్నా మా అత్తగారు నన్ను వెళ్ళనిచ్చేది కాదు. మీకు విషయం తెలిసే ఉంటుంది" అంది కళ్లొత్తి మహేశ్వరి వంక చూస్తూ.

తెలుసు అన్నట్టు తల ఊపింది మహేశ్వరి.

మౌనంగా ఉండిపోయింది శారద కాసేపు.

"నా చిన్నప్పుడే నా తల్లితండ్రులు పోయారు. అన్నయ్యే పెంచి పెద్దచేసాడు. అన్నయ్య పెళ్ళి చేసుకొన్నాక వదిన వచ్చిన తర్వాత నా కష్టాలు మొదలు అయ్యాయి. ఇంటెడు చాకిరీ చేసి నేను చదువుకునే దాన్ని. అన్నయ్య పిల్లల్ని చదివించేదాన్ని. అయినా ఏదో విధంగా నన్ను తిడుతూనే ఉండేది మా వదిన. కట్నం ఇచ్చి పెళ్ళి చేయలేక నన్ను ఎలా వదిలించుకోవాలో తెలియక అన్నయ్య ఇబ్బంది పడేవాడు".

"అటువంటి పరిస్థితులలో దూరపు బంధువుగా మా అత్తయ్య వచ్చి నన్ను కోడలిగా చేసుకున్నారు"

"జీవితం అంటేనే విరక్తిగా ఉన్న నాకు, ఒక ఆశ్రయం దొరికినందుకు ఎంతో సంతోషపడ్డాను. ఆ కృతజ్ఞతే నన్ను ఆ ఇంటికి బంధీని చేసింది. ఆ ఇంట్లో బాధ్యతలు నిర్వహించడం నాకేమి శ్రమ అనిపించలేదు."

"కాని అలా ఆనందంగా ఉండటం కూడా ఆ దేవుడు ఓర్చుకోలేకపోయాడు. హఠాత్తుగా మా వారు పోవడం మీకు తెలుసు" అంటూ ఆగింది శారద.

ఏమనలేక మౌనంగా తలాడించింది మహేశ్వరి. ఆమె మాటలకు అడ్డు తగలడం ఇష్టంలేదు.

తిరిగి చెప్పడం మొదలు పెట్టింది శారద.

"అటువంటి సమయంలో మా మరిదిని పెళ్ళి చేసుకోమని గోల పెట్టింది మా అత్తగారు. ఈ జన్మలో నే నెవరినీ పెళ్ళి చేసుకోను అనేవాడు నా మరిది. కారణం అడిగితే చెప్పేవాడు కాదు".

"ఈలోగా చుట్టుప్రక్కల వాళ్ళు నాకు నా మరిదికి సంబంధం అంటగట్టారు. కొన్నాళ్ళు భరించాను. ఇల్లు వదిలి వెళ్ళిపోదామని చాలా సార్లు అనుకున్నాను. కొడుకుతో ఒంటరిదాన్ని ఎలా బతకగలనో నాకు తెలియలేదు. అటు పిచ్చి ఆడబడుచు. ఇటు మానసికంగా, శారీరకంగా కృశించి పోతున్న అత్తగారు".

"నువ్వు ఎక్కడికైనా వెళ్ళిపోవాలంటే నాకూ, నా కూతురికి ఇంత విషం ఇచ్చి చంపేసి వెళ్ళిపో" అంటూ ఏడ్చింది మా అత్తగారు.

ఆ పరిస్థితులలో నా మరిది నన్ను పెళ్ళి చేసుకుంటానని నాతో మాట్లాడాడు. నేను అంగీకరించక తప్పలేదు. విషయం తెలిసి మా అత్తగారు తుపానులా లేచింది.

"కుటుంబాన్ని భ్రష్టుపట్టిస్తున్నావురా? జనం ఏమనుకుంటారనే జ్ఞానం ఉండక్ఖర్లేదా? నా కర్మ ఇలా కాలింది" అంటూ తలకొట్టుకుని ఏడ్చింది.

"మా నిర్ణయంలో మార్పు లేకపోవడంతో ఆవిడ తలవంచక తప్పలేదు" అంది శారద.

"ఫోన్లే శారదా!... మంచే జరిగింది కదా! లోకుల నోటికి తాళం వేశారు మీరు చేసిన పనిని నేను హర్షిస్తాను" మీ అత్తగారిలో కూడా మార్పు వస్తుంది" అంది ధైర్యం చెబుతూ మహేశ్వరి.

"ఇంక వెళ్ళొస్తాను ఆంటీ" అంటూ లేచింది శారద. "ఉండు కాస్త కాఫీ తాగి వెళ్ళు" అంది మహేశ్వరి.

"వద్దు ఆంటీ ఇప్పుడు ఇంటికి వెళ్ళి అందరికీ టీ పెట్టాలి కదా!" అంది శారద.

"సరే! అప్పుడప్పుడు వస్తూ ఉండు నువ్వు ఆనందంగా ఉన్నావు అదే నాకు సంతోషం" అంది మహేశ్వరి.

ఒక్కక్షణం మహేశ్వరి వంక చూసింది శారద.

"ఆంటీ! అందరిలాగా మీరు అనుకుంటున్నారు. అందరి ఆడపిల్లలాగా నా జీవితం ఉండాలనుకున్నాను. కాని అలా జరగలేదు. కృతజ్ఞతో, నిస్సహాయతో తెలీదు. ఆ కుటుంబం కోసం నేను బలిపశువును అయ్యాను. మా మరిది ప్రస్తుతం నా భర్త సంసారానికి పనికిరాడు" అంటూ కళ్ళలోంచి రాలుతున్న నీటిబొట్లని బలవంతంగా ఆపుకుంటూ గబగబ నడిచి వెళ్ళిపోయింది శారద.

నిశ్చేష్ఠురాలై జాలిగా ఆమె వైపు చూస్తూ నిలబడి పోయింది మహేశ్వరి.

# పిన్నీసు

**-పెయ్యేటి శ్రీదేవి**

**"సౌ**జన్య వెడ్స్ రామకృష్ణ" అన్న బోర్డు రంగురంగుల బల్బులతో మెరుస్తూ ఆకర్షణీయంగా కనిపించింది.

'ఆ... ఇదే పెళ్ళి మండపం. బస్సులోంచి అందరూ ఎవరి సామాన్లతో వాళ్ళు జాగ్రత్తగా దిగండి' అంటూ పెళ్ళికొడుకు తండ్రి చెప్పగానే, తెల్లవారుఝామున నాలుగున్నరకి అందరూ నిద్దర మొహాలతో దిగుతున్నారు.

అందరూ దిగగానే మంగళ వాయిద్యాలతో వియ్యంకుడు, వియ్యపురాలు మగ పెళ్ళివారికి స్వాగతం పలికారు.

గుమ్మం దగ్గర పెళ్ళికొడుక్కి దిష్ఠి తీసి హారతిచ్చింది వియ్యపురాలు. అందరినీ సాదరంగా ఆహ్వానించి విడిదిలోకి తీసికెళ్ళారు. పెళ్ళికొడుక్కి ప్రత్యేకంగా రూము ఏర్పాటు చేశారు. మగ పెళ్ళివారికి విడిదిలో పౌడరు దగ్గర నుంచి బొట్టు, కాటుక, సబ్బులు, కొబ్బరి నూనె, షాంపూ పేకెట్లు, టవల్సు, టూత్ పేస్టు, ఆఖరికి బట్టల సబ్బుల దగ్గర నుంచి ఒక పెద్ద స్టీలు పళ్ళెం నిండా లెక్కలేనన్ని పిన్నీసులు కూడా పోసి పెట్టారు.

'వదిన గారూ! పిన్నీసులు కూడా చాలా పెట్టారే!' అంటూ వియ్యపురాలు పార్వతమ్మ అన్న మాటలకి, భర్త రఘురామయ్య, 'మగ పెళ్ళి వారికి పిన్నీసులతో సహా మర్యాదలకి ఏ లోటూ రాకుండా ఘనంగా పెళ్ళి చేసామని చెప్పుకోడానికేమో!' అంటూ చమత్కార బాణం వేసి, మళ్ళీ, 'అయినా ఎందుకు బావగారూ, ఛాదస్తంగా ఇన్ని పిన్నీసులు పెట్టారు?' అన్నాడు.

ఆయన మాటలకి పెళ్లికూతురు తండ్రి పరంధామయ్య, 'ఛాదస్తం కాదు బావగారూ. అవసరం! అనుభవంతోనే పెట్టాం. చూస్తూండండి. పెళ్లి టైముకి పిన్నీసులన్నీ ఒక్కటి కూడా మిగలకుండా హాట్ కేకుల్లా అయిపోతాయి!' అన్నాడు.

'ఆ... ముందర కాఫీలు, పిల్లలకి పాలు పంపిస్తాం, మీరు స్నానాలూ అవీ కానిచ్చేస్తే టిఫిన్లు రెడీగానే వున్నాయి. టేబుల్సు మీద అన్నీ సిద్ధం చేస్తాం. ఎనిమిది గంటలకి స్నాతకం.'

'అలాగే బావగారూ. మీరుండండి. ఈ లోగా మేము రెడీ అవుతాము.'

టిఫిన్లు, కాఫీలు అవగానే స్నాతకం పూర్తయింది.

ప్రయాణంలో నిద్రలు లేక మగ పెళ్ళి వారిలో చాలామంది నిద్రలోకి జారుకున్నారు. కొంత మంది అంత్యాక్షరి, ఆటల పోటీలు పెట్టుకున్నారు. పెళ్ళికొడుకు, అతడి స్నేహితులు పేకాడుకుంటున్నారు.

ఈ లోగా భోజనాలకి పిలుపు వచ్చింది. మామూలుగానే మాటి మాటికీ చీరలు మార్చేస్తారు ఆడవాళ్లు. వాళ్ల చీరలన్నీ చూపించుకోడానికా అన్నట్టు. పెళ్ళి సమయంలో ఇదే తరుణమని తరుణిలందరూ ఒక్కో సందర్భానికి ఒక్కో చీర మార్చేస్తూ భోజనాల సమయం కదా అని స్నాతకం చీర, తర్వాత మామూలు చీర తీసేసి ఇప్పుడు భోజనాలకి తగినట్టు లైట్ శారీస్ ధరించి, లైట్‌గానే నగలు కూడా ధరించి సింపులందంగా తయారయి, భోజనాలకి బయలుదేరారు.

తర్వాత సాయంత్రం స్నాక్సు, టీ, కాఫీలు, ఎదురు సన్నాహాలు, పానకం బిందెలు, శుభలేఖలు చదవడం లాంటి అన్ని తతంగాలూ పూర్తయ్యాక వియ్యంకుళ్ళిద్దరూ కబుర్లలో పడ్డారు.

ఏవమ్మా వదినా! ఇందాక నీకు పిన్నీసు ఇచ్చాను. మళ్లీ ఇవ్వలేదేమిటి? పిన్నీసు కావాలి. ఇమ్మని అడిగితే, తిరిగి మళ్లీ నాకిచ్చెయ్యి అని చెప్పేకదా ఇచ్చాను?' త్వరగా నా పిన్నీసు నాకియ్యి.' అడిగింది సునంద ఇంచుమించు తన వయసే వున్న కొత్తగా పెళ్ళైన తన వదిన రేవతిని.

రేవతికి గుండెల్లో రాయి పడింది! అసలే కొత్త ఆడపడుచు! అందులోనూ కొంచెం పెంకిది! అత్త వారింట ఆమెకి తగని గారాబం. దానికి తోడు తనకి ఆడబడుచు కనక, ఆడబడుచుతనం కూడా బాగానే చెలాయించింది.

తన పిన్ని శ్రీలక్ష్మి ఆవిడ పదేళ్ల కూతురికి కొత్తగా కొన్న గాగ్రా చోళీ లూజుగా వుందని పిన్నీసు పెడదామని రేవతిని పిన్నీసు అడిగితే తన దగ్గర కూడా లేక పక్కనే

వున్న ఆడబడుచునీ పిన్నీసు ఇమ్మని అడిగింది. ఆమె వెంటనే ఇచ్చేయ్యమని కచ్చితంగా చెప్పి మరీ ఇచ్చింది.

వెధవ పిన్నీసుకు్కూడా మొహమాటం లేకుండా ఇంత కచ్చితంగా ఇచ్చేయమని అడగాలా అని మనసులో బాధగా అనుకుని ఆ పిన్నీసుని వాళ్ల పిన్నికిస్తూ, 'ఇదిగో పిన్నీ, పిన్నీసు మళ్లీ వెంటనే ఇచ్చెయ్యి. అసలే నాది కూడా కాదు' అంటే, వాళ్ల ఆడబడుచు కన్న కోపం పాలు కాస్త ఎక్కువే వున్న పిన్ని, 'ఏమ్మా! ఇంతోటి పిన్నీసుకి మళ్లీ ఇమ్మని అడుగుతావా? అక్కర్లేదులే నీ ముష్టి బోడి పిన్నీసు' అంటూ గిరాటేసి, ఇంక అందర్నీ పిలిచి ఆ పిన్నీసు గురించి తన మీద మరిన్ని కల్పించి, నానా యాగీ చేసి పడేస్తుంది. అంతకన్న, ఆవిడ నోట్లో నోరెట్టడం కన్న వాళ్ల ఆడబడుచు కోపాన్ని భరించడమే నయం అనుకుని మథన పడి 'వెంటనే పిన్నీసు ఇచ్చెయ్యి పిన్నీ' అని నాలుక చివరిదాకా వచ్చిన నోట్లో మాటలు నోట్లోనే దాచుకుని, మారు మాట్లాడకుండా పిన్నికి పిన్నీసు ఇచ్చింది.

ఆవిడ ఆ పిన్నీసు తన కూతురు రాణికి పెట్టి 'బాగుందే తల్లీ ఈ గాగ్రా చోళీ నీకు! అచ్చం యువరాణీలా వున్నావు. నా దిష్టే తగిలేలా వుంది' అంటూ నిజంగా యువరాణీలా లేకపోయినా కాకి పిల్లని ముద్దులాడుకుంది పిన్ని. తల్లి పొగడ్తలకి పొంగిపోయి, ఇంకా లూజుగానే వున్న ఆ గాగ్రాచోళీని మాటిమాటికీ పైకి లాక్కుంటూ తన ఈడు పిల్లలతో వెళ్ళి ఆటల్లో పడింది రాణి.

'ఏయ్ వదినా! ఏమిటి మాట్లాడవు నా పిన్నీసు నాకిమ్మంటే?' అని మళ్ళీ ఆడపడుచు అడిగేసరికి, మళ్ళీ వెంటనే ఇచ్చెయ్యి అన్న పిన్నీసుని ఎందుకు తీసుకున్నానురా భగవంతుడా అనుకుని, 'మనం వెళ్ళే లోపు నీ పిన్నీసుని నీకిచ్చేస్తాను. సరేనా? అయినా ఇప్పుడేగా ఇచ్చావు. ఇంకో రెండున్నాయిగా నీ దగ్గర' అంది రేవతి.

"తల్లీ నీకో నమస్కారం! ఎప్పుడో ఇస్తే నాకిందుకు? నీకిచ్చేటప్పటికి తెలియలేదు. చీర మీద జాకెట్టుకి ఒక హుక్కు కుట్టలేదు ఆ టైలరు మహాతల్లి. ఈ వున్న రెండు పిన్నీసులు ఒకటి చీర కుచ్చిళ్ళకి, మరోటి పమిటకి కావాలి. నువ్విస్తే ఆ పిన్నీసు హుక్కులేని జాకెట్టుకి పెట్టుకోవాలి. పెళ్లికని ఈ చీర ఒక్కటే వేసుకున్నాను. అన్నీ సిగ్గు విడిచి వివరంగా చెప్పుకోవాలా? ఖర్మ! రాను మొర్రో, నాకు

పరీక్షలున్నాయంటే లాక్కువచ్చావు. ఇక్కడేమో తీసుకున్న పిన్నీసు అడిగితే, నాదే తప్పన్నట్టు మాట్లాడుతున్నావే?'

నిజమే! పరీక్షలున్నాయి. రానంటే ఊరుకోవాల్సింది! మొహమాటం, అతి మంచితనం వల్ల తీసుకొచ్చినందుకు కొరివితో తల గోక్కున్నట్టయింది. తన భర్త పెళ్ళవగానే అమెరికా వెళ్ళిపోయాడు. తను అన్నయ్య పెళ్ళయ్యాక వెళ్ళాలని వుండిపోయింది. కాసేపట్లోనే పెళ్ళి! పెళ్లింట్లో పిన్నీసు గురించి ఇంత గొడవ చెయ్యాలా అందరూ వినేలా? అనుకుంటూ తన పిన్ని ఎక్కడుందా అని వెతకసాగింది రేవతి.

పట్టుచీర కట్టుకుని ఎవరితోనో బతాఖానీ వేస్తున్న తన పిన్నిని పక్కకి పిలిచి మెల్లగా, 'పిన్నీ! అర్జంటుగా నీకిచ్చిన పిన్నీసు ఇయ్యి పిన్నీ!' అని అడిగింది.

'అదేమిటే చోద్యం? ఎవరితోనో ముఖ్యమైన విషయాలు మాట్లాడుతుంటే, ఏమిటో పనున్నట్లు పిలిచి పిన్నీసు అడుగుతావా?'

'ప్లీజ్ పిన్నీ! దయచేసి ఇప్పుడే ఇయ్యి పిన్నీ. అర్జంటుగా కావాలి పిన్నీ' అంటూ భయంభయంగా అడిగింది. వాళ్ళ ఆడబడుచు మళ్లా ఎక్కడ గొడవ చేస్తుందో అని.

ఇప్పుడు నేనెక్కడి నుంచి తెచ్చేదే? నా కూతురు గాగ్రాచోళీ లూజు అయిందని, నా దగ్గర లేకనే కదా నిన్నడిగాను? పాడు పిన్నీసు! అసలెప్పుడూ ఈ మెడలో సూత్రాల తాడుకి పది పిన్నీసులుంటాయి. మీ బాబాయి సన్నాయి అప్పన్నలా అన్ని పిన్నీసులేమిటే అని సన్నాయప్పన్న అని పేరెట్టారు. ఎప్పుడూ ఇంట్లో కూడా ఎక్కడ బడితే అక్కడ, కిచెన్‌లోనూ, బాత్‌రూంలోనూ కింద పడేడుస్తూ వుంటాయి. వంద పిన్నీసులు కొన్నా అవసరం వచ్చేసరికి ఒక్కటీ వుండదు! ఈ పెళ్ళింట్లో నువ్విచ్చిన ముష్టి పిన్నీసు కోసం ఎవర్నని అడగను? పోనీ ఆ గాగ్రాచోళీకి పెట్టిన పిన్నీసు తీసిద్దామన్నా నా కూతుర్ని ఈ జనంలో ఎక్కడని వెతకను? ఏ పిల్లలతో ఆడుకుంటోందో! అయినా రేవతీ! నాకు తెలీకడుగుతానూ ఏదో బంగారం నగేదో అరువిచ్చినట్టు, ఆ వెధవ పిన్నీసు గురించెందుకే అంత రొక్కించడుగుతావు?"

'పిన్నీ! ఆ పిన్నీసు నాది కాదు. నాదైతే అడిగే దాన్ని కాదు. అది మా ఆడబడుచుది. తనకీ ఇప్పుడే అవసరమట. గమ్మున అవసరం వచ్చి నన్నడిగావు.

లేదంటే నమ్మవని మా ఆడబడుచునే అడిగాను. ఇస్తూ వెంటనే ఇచ్చేయ్యమని మరీ మరీ చెప్పింది. అలా అంటే నువ్వేమనుకుంటావో అని చెప్పలేకపోయాను'

'మరా మాట ముందరే చెప్పుంటే ఆ పిన్నీసు తీసుకునే దాన్నే కాదు. నిన్ను నేనే ముష్టడుక్కుంటే నీది ఇంకో వీరముష్టా? ఏ ఊరు వెళ్ళినా అద్దం, దువ్వెన, సబ్బు, టవలు, పౌడరు, పిన్నీసులతో సహా అన్నీ వేసుకుంటాను. పొరపాటున పిన్నీసు లొకటీ వేసుకోవడం మర్చిపోయాను. ఇప్పుడదే అవసరం వచ్చి నా అక్క కూతురువని అడిగినందుకు బాగా బుద్ధి చెప్పావు. పెళ్ళికొచ్చిన సంతోషం కూడా లేకుండా చేశావు.

కాసేపట్లో పెళ్ళి రిసెప్షను, వ్యవధి లేకుండా అరగంటలో పెళ్ళి! అందుకే ఏకంగా అందరూ భోజనాలయ్యాక మార్చడం కుదరదని, పెళ్ళి టైముకి వేసుకోవల్సిన పట్టు చీరలు, నగలు ధరించి రెడీ అవుతున్నారు.

ఈలోగా భోజనాలకి త్వరగా రమ్మని ఆడపెళ్ళివారు పిలవడానికి వస్తే గమ్మున పెళ్ళికూతురు చెల్లెల్ని 'ఏమనుకోకుండా కొంచెం ఓ నాలుగు పిన్నీసులు తెప్పించరా? ప్లీజ్! చాలా అర్జంటు!' రేవతి నెమ్మదిగానే అడిగినా, మగ పెళ్లి వారమే అన్న ధీమాతో అడగక తప్పలేదు.

'ఓ తప్పకుండా! మీరంత మొహమాటంగా అడగాలా? ఇప్పుడే పంపిస్తాను'

'ఖర్మ కాకపోతే పిన్నీసు గురించి అందర్నీ అడుక్కోవాల్సి వస్తోంది. ఛీ! ఇంకెప్పుడూ పిన్నీసులు లేకుండా ఏ పెళ్ళికీ వెళ్ళకూడదు. పెళ్లికే కాదు మామూలుగా ఎక్కడికి వెళ్ళినా ఓ పిన్నీసుల కట్ట బేగ్‌లో వేసుకోవాలి. ఎవరికన్నా అవసరం వస్తే ఇంకో కట్ట కూడా ఎక్స్‌ట్రా వేసుకోవాలి' అని నిర్ణయించుకుంది.

రేవతికి చీరల కుచ్చిళ్లకి, పమిటకి పిన్నీసులు పెట్టుకునే అలవాటు లేదు. చీరలు పాడయిపోతాయని. అందుకే పిన్నీసుల అవసరం తెలియలేదు. ఆ అలవాటున్నా బాగుండేది! తన దగ్గర పిన్నీసున్నా! ఇచ్చేది! ఇంత రాద్ధాంతమూ జరిగేది కాదు. పిన్నీసే కదా అని తీసిపారెయ్యాటానికి లేదు. ఎంత పెద్ద బట్టలు కుట్టడానికైనా చిన్న సూది, దారం లేనిదే డ్రస్సు తయారు కాదు. ఒక్కొక్క సారి చిన్న అవసరాలే పెద్ద సమస్యలుగా తయారవుతాయి. చివరికి గొడవలకి దారి తీస్తాయి. ఎవరూ చెడ్డవాళ్ళు కారు. భాష వచ్చినా భావాన్ని అర్థం చేసుకునే తీరికే వుండదు. అందులోనూ

తనకి ఇష్టమైన అన్నయ్య పెళ్లని ఎంతో సరదా పడింది. పెళ్ళివారితో ఎంతో హాస్యమాడదామనుకుంది. కాని అపహాస్యం పాలయింది!

ఇంతలో పుండు మీద కారం చల్లినట్టు 'అక్కా, అక్కా! అర్జంటుగా ఒక పిన్నీసుంటే ఇవ్వవా? ప్లీజ్! కొత్త రెడీమేడ్ షర్ట్ పెళ్ళికని కొనుక్కున్నాను. తీరా వేసుకుని బొత్తాం పెట్టుకుంటూంటే అది కాస్తా ఊడిపడిపోయింది. మా అమ్మనడిగితే, 'పోరా పో నేనివ్వను. చీర కుచ్చిళ్ళకొక్కటి, పమిటికొకటి, తల్లో పూల చెండు పెట్టుకోటానికొకటి కావాలి. ఐనా మగ పిల్లడివి. నీక్కూడా పిన్నీసేంటి? అంటూ మూడు పిన్నీసులున్నా ఇవ్వలేదు. ప్లీజక్కా! ఒక్క పిన్నీసివ్వక్కా' అంటూ బాబాయి కొడుకు పన్నెండేళ్ల సతీష్ వచ్చి కురుపు సలపినట్టు సలపడం మొదలెట్టాడు కూడా కూడా వెంట పడుతూ.

ఏదైనా అడగ్గానే లేదనకుండా ఇచ్చే స్వభావం వున్న రేవతికి ఎవరికేం సమాధానం చెప్పాలో తోచక అందరూ అనే సూటిపోటి మాటలు భరిస్తూ పెళ్లికూతురు చెల్లెలు ఎప్పుడు పిన్నీసులు పంపిస్తుందా అని ఎదురు చూస్తుంటే అసలే ఒక్కగానొక్క ఆడబడుచు ఇంకా భోజనానికి రాలేదేమని అందరూ ఎదురు చూస్తున్నారు. రేవతితో పాటు రేవతి ఆడబడుచు రాలేదని ఎవరూ భోజనాలు చెయ్యకుండా కూచున్నారు. 'మగ పెళ్లివారు ఎందుకలిగారు? ఎందులోనూ లోటు చెయ్యలేదు కదా' అనుకుంటున్నారు ఆడ పెళ్లివారు. ఎవరో పరంధామయ్యగారంటే, ఆడబడుచుకి ఆడబడుచు , ఇంకా ఎవరెవరో గొడవలు పడుతున్నారన్నారు.

అప్పుడు పెళ్లి కూతురు చెల్లెలు అంది 'అయ్యో నాన్నా మర్చిపోయాను హడావుడిలో. పాపం పెళ్లి కొడుకు చెల్లెలు నాలుగు పిన్నీసులు పంపమని ఎంతో బతిమాలుతున్నట్లు అడిగింది. ఎంత అవసరం వచ్చి వుంటుందో!'

'అయ్యో చెప్పవేమమ్మా? ఇదుగో సూరయ్యా! అర్జంటుగా పక్క షాపుకెళ్లి ఈ ఇరవయి అయిదు రూపాయలకి ఎన్ని పిన్నీసులు వస్తే అన్ని పట్రా'. అంటూ పంపారు. కానీ అతడు వెళ్లి, ఆ షాపులో పిన్నీసులు లేవంటూ తిరుగు టపాలా ఉట్టి చేతులతో తిరిగి వచ్చాడు.

ఇదంతా గమనించి, మగ పెళ్ళి వారికి ఏర్పాటు చేసిన పనమ్మాయి వీరమ్మ 'అయ్యో పిన్నీసు కావాలంటే నన్నే అడగచ్చు కదమ్మా? పని చేసే ఇళ్లలో ఇల్లూడుస్తూంటే బోలెడు పిన్నీసులు దొరుకుతాయి. పిన్నీసు భాగ్యానికి అమ్మగారికిస్తే "ఇదే డబ్బులు దొరికితే ఇస్తావా? పిన్నీసులు కాబట్టి ఇచ్చావు!' అంటారని, డబ్బులు దొరికితే మాత్రం

అమ్మగారికిచ్చి పిన్నీసులు నా మెడలో గుచ్చుకుంటూ వుంటానమ్మా. ఇవిగో, తీసుకోండమ్మా' అంటూ పది పిన్నీసులిచ్చింది!

అంత చికాకులోనూ వీరమ్మ మాటలకి నవ్వుకుని రేవతి 'బతికించావు తల్లీ! అని మనసులోనే ఆ పనమ్మాయిని అభినందించి, ఆడబడుచుకి పిన్నీసు ఇచ్చింది. బాబాయి కొడుకు సతీష్‌ని పిలిచి పిన్నీసు ఇవ్వబోతే 'వద్దులే అక్కా! ఇందాక అడిగితే ఇచ్చావు కాదు. ఇంకో షర్టు వేసేసుకున్నాలే' అంటూ నిష్ఠూరంగా వెళ్లిపోయాడు. మిగిలిన పిన్నీసులు ఇక అవసరం లేదులే' అంటూ వీరమ్మకిచ్చేసింది.

'కుట్టు కూలి జాకెట్టుకి పాతిక రూపాయలు తీసుకుంటున్నవు. సరిగా హుక్కులు కుట్టక్కర్లేదూ? ఆ ఒక్క హుక్కూ లేక పెళ్లిలో నానా అవస్తా అయింది.' అంటూ పెళ్ళి నుంచి రాగానే రేవతి ఆడబడుచు సునంద ఆవేశంగా వెళ్లి టైలరమ్మాయి మీద విరుచుకుపడింది.

ఆ టైలరమ్మాయి ఇంకా ఆవేశంగా వెళ్ళి, హుక్కులు, హెమ్మింగులు చేసే పదేళ్ల సీత మీద విరుచుకుపడింది. 'జాకెట్టుకి మూడు రూపాయలు తీసుకుంటున్నావు. సరిగ్గా అన్ని హుక్కులూ కుట్టక్కర్లేదా?" అంది

ఆ పిల్ల ఏడుస్తూ 'మీరే కదమ్మా ఒక్క హుక్కుంది, కుట్టాలి అంటే అక్కర్లేదు అర్జంటుగా కావాలి ఇచ్చేయ్. ఇప్పుడు జాకెట్టు ఇవ్వమని ఆవిడ వచ్చి కూచుంది అంటూ లాక్కుపోయారు.' అంది.

'అమ్మా, పెళ్లికూతుర్ని తీసుకురండి'. అన్నాడు పురోహితుడు.

'ఒక్క నిముషం ఉండండి. పెళ్ళికూతురు చీర కుచ్చిళ్లకి పిన్నీసు కావాలి. ఏమండీ, వందరూపాయల పిన్నీసులు అన్నీ పళ్లెంలో పోసి మగ పెళ్ళివారికిచ్చేసారు. ఆడ పెళ్ళివారికి పిన్నీసుల అవసరం వుండదనుకున్నారా? పెళ్ళికూతురికి పిన్నీసులు కావాలి. అర్జంటుగా తెప్పించండి. అవతల ముహూర్తం టైము దాటిపోతోంది. తీరిగ్గా కబుర్లు తర్వాతాడుదురుగానీ అంది. పెళ్ళికూతురు పినతల్లి భర్తతో.

అక్కడే వున్న రేవతి, 'ఇవిగో పిన్నీసులు' అంటూ తన బేగులోంచి పిన్నీసులు తీసిచ్చింది పెళ్ళికూతురు సౌజన్యకి.

సౌజన్య రేవతి వైపు కృతజ్ఞతగా చూసి 'థాంక్సు వదినా! అంది.

తన అక్క ఆడబడుచు, ఏడాది క్రితం జరిగిన అక్క పెళ్లిలో పిన్నీసులు అడిగితే, తను తెస్తానని చెప్పి మర్చిపోయింది. ఆ పిన్నీసుల గురించి మగ పెళ్ళివారు వాదులాడుకోవడం, భోజనాలకి రాకపోవడం, ఆ టైములో కూడా అదంతా గుర్తుకు వచ్చింది సౌజన్యకి రేవతి పిన్నీసులు ఇవ్వగానే. అందుకే అలాంటి ఇబ్బందులు మళ్ళీ రాకూడదని తన పెళ్లికి మగ పెళ్ళివారికి పళ్లెం నిండా పిన్నీసులు పోసారు తండ్రి పరంధామయ్యగారు.

ఆఖరికి పిన్నీసుల దగ్గర్నించి ఎవరికీ ఏ లోటూ రాకుండా, ఏ గొడవలూ లేకుండా పెళ్లి ఘనంగా జరిగింది. అప్పగింతల తంతు కూడా ముగిసింది. అందరూ బయలుదేరుతున్నారు.

గమ్మున వియ్యంకుడి చెయ్యి పట్టుకుని 'మా అమ్మాయిని బాగా చూసుకోండి బావగారూ! ఇక అమ్మాయి బాధ్యత మీదే' అంటూ కళ్ల నీళ్ళు పెట్టుకుంటూంటే 'ఊరుకోండి బావగారూ! మీరు నిశ్చంతగా వుండండి. ఇక నుంచి సౌజన్య మా కోడలు, మీ అమ్మాయి కాదు. మా అమ్మాయి సరేనా?' అన్నట్టు పెళ్ళి వారికి పిన్నీసులు పెట్టడం బాగుంది. మా అమ్మాయికి కూడా ఇలాగే పెడతాం' అంటూ బయలుదేరారు.

పరంధామయ్యగారు ఆయన మాటలకి తృప్తిగా ఊపిరి తీసుకుని అలసటగా కుర్చీలో కూర్చుని ఏమే, పిన్నీసొకసారి ఇయ్యి. ఇందాక భోజనంలో పంట్లో ఏదో ఇరుక్కుంది. ఇందాకటి నుంచి ఇబ్బందిగా వుంది.' అన్నాడు భార్యతో.

'నా దగ్గరెక్కడదీ ఇప్పుడు? ఒక్కటి కూడా లేదు. ఎక్కడన్నా వుందేమో చూస్తానుండండి. అంది ఆవిడ. 'పిన్నీసులతో సహా ఏదీ లేదన్న మాట రాకుండా మగ పెళ్ళివారికి పళ్లెం నిండా పిన్నీసులు పోసాం కదా? మిగిలినవన్నీ ఇలా పట్రా'

'అయ్యో! అవింకా ఉన్నాయనుకుంటున్నారా? ఎప్పుడో పళ్లెం ఖాళీ అయిందని వీరమ్మ తెచ్చిచ్చింది.

'ఇదిగో మామయ్యగారూ పిన్నీసు!' అంటూ తన బేగులోంచి పిన్నీసు తీసిచ్చింది రేవతి తనూ ప్రయాణమై బయలుదేరుతూ!

# అనుబంధం

**–అద్దేపల్లి జ్యోతి**

**వే**కువ రెక్కలు విచ్చుకుంటున్నాయి. ప్రాతఃకాలం సౌందర్యం ఎన్నిసార్లు చూసినా కొత్తగా, అందంగానే వుంటుంది. రాత్రి జ్ఞాపకాలని నెమరువేసుకుంటున్నట్లు ఆకుల మీద, పూల మీద మంచు బిందువులు. ప్రకృతిని ఇంత అందంగా సృష్టించిన ఆ అంతర్యామి ఎంత సౌందర్యపిపాసో కదా అన్పిస్తుంది.

సూర్యుడికి గుడ్‌మార్నింగ్ చెప్పేసి పూలసజ్జలో ఉన్న నక్షత్రాలని, అదే రాత్రి నక్షత్రాలు పొద్దున్నే సన్నజాజులై పూసాయి. అన్నట్టుగా వున్న సన్నజాజుల్ని సుతిమెత్తగా నిమిరి దేవుడి గదిలోకి వెళ్లబోతూ, శ్రీవార్నీ, బాబుని నిద్ర లేపాను గోవా వెళ్ళటానికి ఫ్లైట్ టైమ్ అవుతోంది అని.

"ప్లీజ్ టెన్ మినిట్స్ వదిలేయ్! టైమ్ సరి పోతుంది" అన్నారు ఇద్దరు.

"సరే! నే పూజ చేసుకుని వచ్చేలోగా మీరు లేచి రెడీ అవ్వాలి" అని నేను పూజగదిలోకి నడిచాను.

నా పూజ అయిందిగానీ వీళ్ల అలికిడి లేదు "దర్షన్ లేచావా? డాడీ లేచారా" అని పిలిచా.

"ఆ... ఆ... ఇద్దరం లేచాం అమ్మా" అన్నాడు వాడు.

"ఏవండీ మీరు రెడీ అయ్యారా"

"ఆ... ఆ... చూడు" అంటూ వచ్చారు టవల్‌తో శ్రీవారు.

"బాగా రడీ అయ్యారు. వెళ్ళేది ఎంత గోవా అయితేమటుకు ఇక్కడ్నించే ఇలా వెళితే బాగోదనుకుంటా" అన్నాను వస్తున్న నవ్వుని పెదాలచాటున దాచుకుంటూ.

"నీకు ఇష్టమైన గోవా, అందులో మీ అన్నయ్యని నాలుగేళ్ల తర్వాత కలవబోతున్నావు కదా, నీకు ఎక్కడా కాలు భూమి మీద ఆనటం లేదు. ఫ్లైట్ టికెట్ అవసరం లేదనుకుంటా' అన్నారు అంతే చిలిపిగా.

"నా ఫ్లైట్ టికెట్ డబ్బులు మిగుల్చుకుందామనా కన్జ్యూస్" అన్నా.

"అమ్మా మీరు ఇద్దరూ అలా కబుర్లు చెప్పుకుంటూ కూర్చోండి. టిఫిన్ పెట్టకు" అన్నాడు దర్షన్ విసుగ్గా.

శరీరం ప్రయాణం చేస్తున్నా నా మనసు గతంలోకి వెళ్ళిపోయింది. అన్నయ్య లవ్ మేరేజ్ చేసుకున్నాడు. ఎవరినో కాదు నా బెస్ట్ ఫ్రెండ్ 'సుష్మ'ని.

సుష్మ నా కోసం తరచూ మా ఇంటికి వస్తూండేది. అన్నయ్య ఆ టైమ్‌లో వుంటే ముగ్గురం కల్సి కబుర్లు చెప్పుకునే వాళ్ళం. సుష్మ వచ్చినప్పుడు నేను ఎక్కడికయినా వెళితే అన్నయ్యా, అదీ మాట్లాడుకునేవారు. అన్నయ్య లేకపోతే అమ్మతో మాట్లాడేది సుష్మ.

అన్నయ్య దాని మీద జోకులేసేవాడు. నవ్వేసేది. ఏమీ కోప్పడేది కాదు. నేనే అనేదాన్ని "దాన్ని ఎందుకు అలా ఏదో ఒకటి అంటావ్' అని.

"నీ ఫ్రెండ్‌ని అంటే, తనకి లేని బాధ నీకెందుకే" అనేవాడు.

నాల్గురోజుల్నుండి సుష్మ కాలేజ్‌కి రాలేదు.

మా ఇంటికీ రాలేదు. జ్వరం వచ్చిందేమోనని వాళ్ళింటికి వెళ్ళాను. ఆంటీ గుమ్మంలోనే ఎదురయ్యారు. "సుష్మకి ఎలా వుందండీ" అంటూ అడిగాను ఆత్రంగా

"మాయరోగం వచ్చింది. నువ్వే వెళ్ళి చూడు" అన్నారు నిష్ఠూరంగా.

ఆశ్చర్యం వేసింది ఆవిడ ధోరణికి.

దాని గదిలోకి వెళ్ళాను. సుష్మ అటు తిరిగి పడుకుని వుంది. "సుష్మా, ఎలా వుందే" అంటూ నుదుటిమీద చెయ్యి వేసాను. నన్ను పట్టుకుని ఏడ్చేసింది. "బతికే వున్నాను" అంటూ...

కాసేపు ఏడవనిచ్చి అప్పుడు అడిగాను "ఏంటే నీ బాధ! నాల్గు రోజుల్నుంచి ఇలాగే వున్నావని తెలుస్తోంది నీ వాలకం చూస్తే. నాకు చెప్పచ్చు కదా! నేను నీ ఫ్రెండ్‌నని అనుకుంటున్నాను. నువ్వు అలా అనుకోలేదు కాబట్టే ఇలా కూర్చుని ఏడుస్తున్నావ్" అన్నా బాధగా.

"ఛా... అలా అనకే, నాకు నువ్వు తప్ప మంచి ఫ్రెండ్ ఎవరున్నారే! కానీ ఇది విని నువ్వు ఎలా రియాక్ట్ అవుతావో అని భయం వేసి నీతో చెప్పలేదు, అంతే. పాలముంచినా, నీట ముంచినా నీదే భారం" అంది.

"పాలల్లో ముంచినా, నీట ముంచినా చావే కానీ! నేను నీకు తప్పకుండా సాయం చేస్తాను" అన్నాను భరోసాగా.

"చాలాథాంక్స్! నీకు ఇప్పటిదాకా చెప్పకపోవటం తప్పే. సారీ" అంటూ మా అన్నయ్య, అదీ ప్రేమించుకుంటున్నారని, ఇంట్లోవాళ్ళు వేరే సంబంధాలు చూస్తున్నారని, ఇంట్లో వాళ్ళని ఒప్పించలేక ఏడుస్తోందని చెప్పింది.

ఒక్కోసారి అన్నయ్యనీ, సుష్మనీ చూస్తే అనుమానం వచ్చేది కానీ ఛ అనుకునే దాన్ని అయితే నా అనుమానం నిజమేనన్నమాట అనుకున్నా మనసులో.

ఈ మాత్రానికి ఏడుస్తావా పిచ్చీ, మా ఇంట్లోనూ, మీ ఇంట్లోనూ ఒప్పించే బాధ్యత నాది. ఇంత మంచి ఫ్రెండ్ వదినగా వస్తోందంటే ఇంతకంటే ఆనందించే విషయం ఏముంటుంది?" అని దాన్ని గట్టిగా వాటేసుకున్నా.

"చాలా చాలా థాంక్సే నన్ను అర్థం చేసుకున్నావు. ఎక్కడ అపార్థం చేసుకుంటావో అని భయపడిపోయాను' అంటూ ఆనందపడింది సుష్మ.

"ఇక బెంగతీరింది కదా! లేచి మొహం కడుగు, ఏదన్నా తిందువుగాని. ఈ లోగా మీ అమ్మగారితో మాట్లాడతాను" అని ఆంటీ కోసం లోపలికి వెళ్ళాను.

ఆంటీ వంటింట్లో వుంది. ఆవిడని హాల్లోకి తీసుకొచ్చి కూర్చోపెట్టాను. ఎదురుగా కూర్చుని ఆవిడ చెయ్యి పట్టుకుని "ఆంటీ, అది చేసింది చెడ్డపని కాదు ఆంటీ, మీరు తలదించుకోనక్కర్లేదు..."

"నువ్వు చిన్నపిల్లవి, నీకు తెలీదమ్మా! మీ స్థాయి ఎక్కడ, మా స్థాయి ఎక్కడ? అందుకే మాకు తగ్గ సంబంధం చూసి చేద్దామంటే అది వినటం లేదు" అన్నారు. ఆవిడ బాధగా కళ్ళు తుడుచుకుంటూ.

"మీరేం బాధపడకండి. దాన్ని బాధపెట్టకండి. మనసులు, మమతలు ముఖ్యం కానీ స్థాయిలుకాదండీ కావల్సింది. అందుకే అన్నయ్య దాని మంచి మనసుకే

ప్రాధాన్యం ఇచ్చాడు. మీరు భయపడి దానికి ఏ సంబంధం చూడకండి. మా అమ్మావాళ్ళతో మాట్లాడి, మీతో మాట్లాడటానికి మా వాళ్లతో వస్తాను. డోంట్ వర్రీ" అని ఆవిడకి నచ్చచెప్పాను.

కొంచెం కష్టం మీద, అన్నయ్య నా పెళ్ళి చేస్తాను అన్న హామీ ఇచ్చాకా అమ్మ, నాన్న, అన్నయ్య – సుష్మల పెళ్ళికి ఒప్పుకున్నారు. అదీ నా పెళ్ళి అయ్యాకా మాత్రమే అని.

అన్నయ్య అన్నిటికీ ఒప్పుకున్నాడు. వాడి మనసులో భయం ఏంటంటే వాళ్ళ ఫ్రెండ్ భార్య అతని చెల్లెల్ని, తల్లినీ సరిగా చూడదట, చూడనివ్వదట. అందుకని నేను అంటే ఇష్టపడే అమ్మాయిని చేసుకుంటే, ఆ సమస్య రాదు కదాని ఆలోచించి, అన్నయ్య సుష్మని చేసుకోటానికి ఇష్టపడుతున్నాడట. వాడు అలా చెబుతుంటే ఆనందంతో ఏడుపొచ్చింది.

ఇంత మంచి అన్నయ్య నాకు వున్నందుకు ఆనందంతో కూడిన గర్వం కలిగింది. అందుకే వాడు చూసిన అబ్బాయినే మాట్లాడకుండా చేసుకున్నాను.

అన్నయ్య భావించినట్టే సుష్మ మా కుటుంబంలో చక్కగా కల్సిపోయింది. అమ్మకి చేదోడుగా వుంటూ నా పెళ్ళికి ఎంతో సాయం చేసింది.

నా పెళ్ళి తర్వాత వాళ్ళ పెళ్ళి. నేనూ, ఆయనా దగ్గరుండి అన్నీ చేశాం.

మా కుటుంబాన్ని చూసి అందరూ మెచ్చుకున్నారు. ప్రపంచం ఎంత ముందుకు పోతున్నా ఛాందసభావాలు వున్న తల్లితండ్రుల వల్ల పిల్లలు ఎంత నలిగిపోతున్నారో అని బాధ వేసింది పెళ్ళికి ముందు సుష్మ బాధను గుర్తుతెచ్చుకుని. మనం పెట్టుకున్న నియమాలే మననడకకి అడ్డువస్తున్నా, వాటిని తొలగించకుండా మూర్ఖంగా వుండే తల్లిదండ్రులు మారనంతవరకూ సభ్యసమాజంలో యువజంటలు కష్టాలు పడుతూనే ఉంటారు అని బాధగా నిట్టూర్చాను. భగవంతుడా నువ్వే మార్చాలి ఈ మూర్ఖజనాల్ని అని.

అన్నయ్యకి అనుకోకుండా దుబాయ్‌లో ఆఫర్ వచ్చింది. అమ్మ, నాన్న, నేను బాధపడ్డాం కానీ వాడిని అభ్యంతరం పెట్టలేదు. కొన్నేళ్ళు సంపాదించుకుని వచ్చేయ్యాలి. అక్కడ స్థిరపడిపోకూడదు అని వాడి దగ్గర మాట తీసుకున్నాం.

"నువ్వు అబ్బాయిని కను అప్పుడు నేను అమ్మాయిని కంటాను. నీ రుణం అలా తీర్చుకుంటాం" అన్నారు అన్న, వదినా!

"సరేలే" అన్నా నవ్వుతూ.

అన్నయ్య అన్నట్లుగానే నేను అబ్బాయికి జన్మనిచ్చా, ఏడాది తర్వాత వాళ్ళకి పాప పుట్టింది. అమృత అని పేరు పెట్టారు.

అన్నయ్య వెళ్ళాకా ఇదే రావటం. 'మా ఇంటికి రా' అన్నా.

"వద్దు నువ్వు వంటింట్లోనే వుంటావు. అందుకని నీకు ఇష్టమైన గోవాలో మనం కల్సుకుందాం. నేను రూమ్స్ బుక్ చేసేస్తాను రిసార్ట్‌లో" అని అన్నయ్య రూమ్స్ బుక్ చేసేసి వుంచాడు.

వాళ్ళు రాత్రి గోవా చేరారు. మేం కొన్ని గంటల తేడాతో చేరతాం అని ఆలోచనల్లోంచి తేరుకుని టైమ్ చూశాను. "గోవా వచ్చేశాం. లేండ్ అవబోతోంది" అన్నారు ఆయన ఇక కొన్ని నిముషాల్లో అన్నయ్యని, వదిన్ని, అమృతని చూస్తాను అంటే నా ఆనందానికి అంతులేదు. సంతోషంతో మనసు నిలవట్లేదు. ఇన్ని సంవత్సరాలు ఎప్పుడూ వాడిని చూడకుండాలేను. ఎంత వెబ్‌కేమ్‌లో చూసినా ప్రత్యక్షంగా చూసి స్పర్శించి మాట్లాడిన తృప్తి కలగదు కదా!

అన్నయ్య కనపడ్డాడు. హాయ్ అంటూ చెయ్యి వూపాను.

నేను ఆయన్నీ, దర్షన్‌ని పట్టించుకోకుండా గబగబా అన్నయ్య వైపు అడుగులేసాను.

అన్నయ్య, నేనూ ఒకరినొకరం చూసుకుంటూ వుండిపోయాం చేతులు పట్టుకుని.

దర్షన్ వచ్చి నా కొంగు పట్టుకులాగాడు.

"అమృత ఏది అని"

"ఆ... మార్చేపోయాను... ఒదినా, అమృత ఏదిరా" అని అడిగాను.

"నీ కోడలు ఇంకా లేవలేదు. దాన్ని ఒకదాన్ని రూమ్‌లో వదిలి రావాలని సుష్మ రాలేదు. ఎంత, ఫైవ్ మినిట్స్‌లో రూమ్‌లో వుంటాం".

"రా... రా... అల్లుడూ మీ ఆవిడని చూసేయ్యాలని తొందరగా వుందా" అంటూ వాడిని ఆటపట్టించాడు అన్నయ్య.

హోటల్ గుమ్మంలోనే ఒదిన, అమృత ఎదురొచ్చారు. అమృత చక్కగా వుంది. బొద్దుగా బొమ్మలా అందంగా వుంది ఫోటోల్లోకన్నా బావుంది.

చటుక్కున ఎత్తుకుని ముద్దాడాను. "అవునులే! కోడలు కావాలి కానీ స్నేహితురాలు అక్కర్లేదా అర్థమొగుడా" అంటూ నవ్వింది సుష్మ.

"బావుందే చాలా బావుంది. ఇలా పెళ్ళి చేసుకుని అలా దుబాయ్ తీసుకుపోయావ్ మా అన్నయ్యని. మా కోడల్కి నేను ఇప్పుడే బాల్య వివాహం చేసేసి నాతో తీసుకుపోతా! లేకపోతే నీలాగే నీ కూతురు నా కొడుకుని ఇంకే దేశానికో తీసుకుపోతుంది" అన్నా నవ్వుతూ.

"ఎంతయినా ఆడపడుచువి అనిపించుకున్నావే రాక్షసీ" అంటూ దర్శన్‌ని ఎత్తుకోబోయింది. వాడు సిగ్గుపడ్డాడు.

"ఏరా అల్లుడూ సిగ్గుపడుతున్నావ్" అంటూ వంగుని ముద్దాడింది.

"ఏంటి నాలుగు సంవత్సరాల కబుర్లు ఈ రిసార్ట్ గుమ్మంలోనే చెప్పేసుకుంటారా? ఏంటి, రూమ్ దండగ" అంటూ జోక్ వేసారు ఆయన.

"రూమ్ బుక్ చేసేసారు, పెన్సిల్ చేయరు. అయినా బిల్లు మీరు పే చెయ్యక్కర్లేదు" అని చిన్నగా గిచ్చాను.

"అబ్బా! చూడు సుష్మ మీ ఆయన అండ చూస్కుని మా ఆవిడ ఎలా రెచ్చిపోతోందో" అంటూ నా మీద కంప్లైంట్ చేశారు.

"సర్లేండీ అన్నయ్యగారు రూమ్‌లో కెళ్ళాకా వీళ్ళపని చెబుదాం రండీ" అంటూ సుష్మ ఆయనకి వంతపాడింది.

దర్శన్, అమృత చక్కగా ... ఆడుకుంటున్నారు... మా కబుర్లతో కాలం గడిపాం.

వారం రోజులు నిమిషాల్లా గడిచిపోయాయి. "గోవా గోవా అన్నావు. అసలు నువ్వు సరిగ్గా చూశావా" అన్నారు ఆయన.

"అబ్బ ఎందుకు చూడలేదు. ఒక పక్క కొండలు, ఒక్క పక్క ఆకాశం, సముద్రం కల్సి పోయిందా అన్నట్టుగా వుంది. ఇసుక కూడా ఎంత బావుందో మెత్తగా, అందంగా. మన ఇసుకలా లేదు. అంతేనా! ఫారినర్స్ ఎంత బావున్నారో. బికినీల్లో వున్నా పూర్తి డ్రెస్‌తో వున్నంత హేపీగా వున్నారు. ఒకళ్లకి ఒకళ్ళు ఆయిల్ మసాజ్ చేస్కుని ఎండలో పడుకుని బుక్స్ చదువుతూ వాక్‌మెన్స్ వింటూ వారిదంతా వేరే లోకం అన్నట్టు. మనం మంచి నీళ్ళు తాగినంత మామూలుగా లిక్కర్ తాగుతూ స్వేచ్ఛా జీవుల్లా వున్నారు" అన్నాను.

"హమ్మా, చూశావా అని అడిగితే ఇంత చెబుతావా?" అన్నారు ఆయన నిట్టూరుస్తూ.

"ఏవండీ! అన్నయ్య వాళ్ళు వెళ్ళిపోతారట. మన తర్వాత ఇంకో గంటకి వాళ్ళ ఫ్లైట్" అట అన్నా బాధగా.

"చెప్పండి, వూరించక"

"మీ అన్నయ్య ఫారిన్ వెళ్లట్లేదు ఇంకో గుడ్ న్యూస్"

"ఊ... చెప్పండి ప్లీజ్"

"మన ఫ్లాట్ పక్క ఫ్లాట్‌లోనే ఉండబోతున్నారు"

"ఆ...!" అన్నాను.

"ఇంకో విషయం చెప్పనా" అన్నారు.

"ఊ చెప్పండి" అన్నా ఆనందంతో, మాట రావట్లేదు.

"అమృతని నీ దగ్గరే వుంచబోతున్నారు. మీ ఒదిన జాబ్ చేస్తుందట. కేర్‌లో వద్దు, మా ఆవిడకి మీ అమృత అంటే ఇష్టం, మా దగ్గరే వుంటుంది. నువ్వు జాబ్ నుంచి వచ్చేదాకా అన్నా. సరేనంది సుష్మ" అన్నారు.

"ఇన్ని గుడ్ న్యూస్‌లు చెప్పినందుకు మీకు స్వీట్స్ చేసిపెడతా"

అనగానే

"ఒక్క స్వీట్సేనా?" అంటూ చిలిపిగా నవ్వారు శ్రీవారు.

# బ్రతుకు తీపి

**-విశ్వనాథ రమ**

**"రా**మశేషు గారికి ఒంట్లో బాగులేదుట. వారం రోజుల నుండి ఇంట్లోంచి బయటికి రావడం లేదని గుళ్లో పూజారిగారన్నారు.

ఊళ్ళో ఎలాంటి ఉత్సవాలు జరిగినా అతనే దగ్గరుండి జరిపించేవారు. అంతే కాదు... ఊళ్లో ఎవరు చనిపోయినా కర్మకాండల వ్యవహారాలు అతనే చూసేవాడు. ప్ఛ్... పాపం....!

అలాంటి మనిషి ఎలా ఉన్నారో... ఏమో...!"

భార్య సమత పక్కింటావిడతో బాధగా చెబుతూంటే జోళ్ళు తొడుక్కుని లైబ్రరికి బయలుదేరబోతున్న భారవి హఠాత్తుగా ఆగిపోయాడు.

ఎందుకో తెలీదు. ఒక్కసారిగా అతని హృదయం కలుక్కుమంది. విభూతి బొట్టు, భుజం మీద కండువాతో కళ్ళముందు రామశేషుగారు మెదిలారు.

సమత మాటలు అక్షరాలనిజం. దసరా ఉత్సవాల్లో, వినాయక చవితికి, నవరాత్రుల్లో అతనే పెద్దరికం వహించి ఆ కార్యక్రమాన్ని జయప్రదం చేసేవారు.

అలాగే ఎవరింట్లోనైనా... అశుభం జరిగినప్పుడు అతడే శవవాహకుడయ్యేవాడు.

ఆ పని చేస్తున్నప్పుడు ఏమాత్రం వెనుకంజ వేసేవాడు కాదు.

అది తన కర్తవ్యంలా భావించేవాడు. మరణించిన మనిషి తాలూకు రక్త సంబంధీకులు... శవాన్ని గుమ్మం వరకే సాగనంపితే... రామశేషుగారు ఆ కట్టె కాలేవరకు అక్కడుండి... బాధతో ఏడ్చి ఆ తర్వాత ఇంటికొచ్చేవారు.

మరణించిన వారికి అతడే ఆప్తబంధువు!

గుళ్లో ప్రవచనాలు చెబుతున్నప్పుడు మాత్రం అతని మాటల్లో ఎన్నో ఆశయాలు తనకున్నాయని... చెప్పేవారతను..

ప్రతీ మనిషి జీవితంపట్ల ఆశలు పెంచుకోవాలని... ఆశ మనిషిని ముందుకు నడిపిస్తుందని... అనేవారు.

అలాంటి మనిషికి... ఒంట్లో బాగులేకపోవడమా...!

హు....! ఇందులో విచిత్రమేముంది...?

రోగాలు, బాధలు మనుషులకు కాకుండా మానులకొస్తాయా...!

ఏడుపదులు దాటిన రామశేషుగారు మంచాన పడటంలో వింతేముంది?

ఊళ్ళో అందరికీ ఉపకారం చేసే మనిషి అతడు. ఇకముందు ఉంటాడో....! ఉండడో...!

మృత్యువుకి ఎవరిమీదా ఆపేక్ష ఉండదు. ఎవర్ని ఎప్పుడు తీసుకుపోతుందో తెలీదు.

భారవిలో ఎన్నో ఆలోచన్లు...!

సాయంకాలం అయ్యేసరికి లైబ్రరికి వెళ్ళడానికి అలవాటు పడిన అతని మనసు ఈసారి మాత్రం రామశేషుగారింటి వైపు దారితీసింది.

పాతకాలంనాటి నులకమంచం మీద పడుకొని, దుప్పటి కప్పుకొని పండుటాకులా దీనంగా చూస్తూ పడుకున్న రామశేషుగారిని చూడగానే... భారవి గుండె బరువెక్కింది.

మెల్లగా అడుగులేస్తూ... అతని దగ్గరకి నడిచాడు.

ఆ మంచం  పక్కనే ఉన్న స్టూలు మీద మందుసీసాలున్నాయి, మరో పక్క అల్మరానిండా పుస్తకాలు, ఆ పక్కనే రెండు ట్రంకుపెట్టెలు.

రామశేషుగారింటి పరిస్థితిని, ఆరోగ్యపరిస్థితిని చూసాక భారవి గుండె ద్రవించింది.

"ఒంట్లో ఎలా ఉంది..!" మంచానికెదురుగా ఉన్న కుర్చీలో కూర్చుంటూ ప్రశ్నించాడు.

రామశేషుగారు ఇంటి పైకప్పు వైపు చూస్తూ "ఆ భగవంతుని నిర్ణయం ఎలా ఉందో...!" అన్నారు విరక్తిగా చూస్తూ.

హు....! ఊళ్ళో ఎవరికి కష్టం వచ్చినా రామశేషుగారు వెళ్ళి ఓదార్చేవారు. ఇప్పుడీ పెద్దాయన బాగోగులు ఎవరికీ అఖ్ఖర్లేదు. నిట్టూర్చాడు భారవి.

ఎగశ్వాసతో... హీనస్వరంతో మళ్లా గొంతు విప్పారు. రామశేషుగారు.

"నాకో కోరిక ఉంది. తీర్చగలవా...!" అన్నారు మెల్లగా.

త్రుళ్ళిపడ్డాడు. భారవి. చావుకి సమీపిస్తున్న మనిషికి కోరికలా...!

ఊహూ...! తను పొరపాటుగా ఆలోచిస్తున్నాడు.

రామశేషుగారు ఎవరితో మాట్లాడినా 'జాతస్య మరణం ధ్రువమ్" అన్న సూక్తిని పదే పదే వల్లించేవారు. జీవితం అసత్యం. చావు సత్యం అనేవారు.

అలాంటి మనిషి ఏం కోరుకుంటారు?

వేగంగా చనిపోవాలని కోరుకుంటారేమో...!

"అదేమిటో చెప్పండి...!" ఆసక్తిగా అడిగాడు భారవి.

రామశేషుగారు మెల్లగా సర్దుకొని లేచి కూర్చున్నారు.

"భారవీ! నాకు చనిపోవాలని లేదు. ఇంకా కొన్నాళ్ళు నేను బ్రతకాలి. ప్రస్తుతం నా దగ్గర ఐదువేలున్నాయి. మిగిలిన డబ్బు ఎవర్నయినా అప్పు అడిగి నాకు వైద్యం చేయించు. ఆ అప్పు నేను తీరుస్తాను. నువ్వు డబ్బు ఇచ్చినా మెల్లగా తీర్చేస్తాను. ఆ సహాయం నాకు చెయ్యి. ఈ ఊరికి ఇంకా నేను సేవ చేయాలి!" ఆయాసపడుతూనే మనసులో ఉద్ధేశ్యం బయటపెట్టారు.

భారవి కొన్ని క్షణాలు నిర్ఘాంతపోయాడు. ప్రపంచం తలక్రిందులైన ట్లనిపించింది. తను వింటున్నది నిజమేనా...! విస్మయంగా రామశేషుగారి వైపు చూస్తూ... ఆలోచన్లలో పడ్డాడు.

ఇంకా ఇతనికి బ్రతుకుపట్ల తీపి కలుగుతోందా...! వినడానికే వింతగా ఉంది...!

ఊళ్లో ఎవరు పోయినా కర్మకాండలు చేయిస్తూ... శవవాహకుడిగా ఉంటూ ఒంటరిగా బ్రతుకు బండి ఈడుస్తున్న ఈ మనిషికింకా బ్రతకాలని ఆశలుండడమా...!

భారవి దీర్ఘాలోచనలో మునిగిపోవడం గమనించి మళ్ళా రామశేషుగారు నోరు విప్పారు.

"నాకున్న బ్రతుకుతీపి గురించి ఆశ్చర్యపోతున్నావా...! భారవీ...!

ముసలితనం శరీరానికి తప్ప మనసుకుండదు... అందుకే రోగిష్టి వాడైనా... నూరేళ్ళు నిండినవాడైనా... బ్రతకాలని కోరుకుంటాడు.

ఇంకా ఏదో పొందాలనే ఆశ... మనిషికి జీవితంపట్ల ప్రేమని కలగజేస్తుంది.

నాకింకా ఈ ఊరికి... ఈ ప్రజలకి సేవ చేయాలనిపిస్తోంది. నిజం భారవీ. నాకు వైద్యం చేయించు. నీ దగ్గర డబ్బులేకపోతే ఊళ్లో ఎవర్నయినా అడుగు!"

భారవికి అతని మాటలు నూటికి నూరుపాళ్ళు సమంజసంగానే అనిపించాయి. ఈ సృష్టిలో ఏ జీవీ చావుని కోరుకోదు.

బ్రతుకులోని మాధుర్యాన్ని ఇంకా అనుభవించాలనే కోరుకుంటుంది.

రామశేషుగారు చెప్పినట్లు మనసెప్పుడూ ఆశల చిగుర్లు తొడుగుతూనే ఉంటుంది.

అసలు జీవితమంటే అర్థం ఏమిటి? ఓ మంచి ఆశయం కోసం బ్రతకడం. ఉన్నతమైన ఆశలతో మంచి వ్యక్తిగా ఎదగడం. అందుకేనేమో.. రామశేషుగారు బ్రతుకుమీద ఎన్నో ఆశల్ని పెంచుకుంటున్నారు. వెంటనే ఒక నిర్ణయానికి వచ్చి ఆత్మీయంగా అతని చేయందుకున్నాడు భారవి.

"తప్పకుండా మీకు వైద్యం చేయిస్తాను!" అంటూ అక్కణ్ణుంచి లేచాడు.

"రామశేషుగారు ఎవరూలేని ఒంటరి మనిషి. పదేళ్ళ క్రిందట భార్య పోగానే ఈ ఊరొచ్చారు. అందరికీ సాయపడుతున్నారు. ఇప్పుడతనికి మృత్యువు ఆసన్నమైంది. వైద్యం చేయించినా బ్రతుకుతాడని గ్యారంటీ లేదు. అతను పోతే నా అప్పు ఎవరు తీరుస్తారు. అందుకే అప్పుగా పైసాకూడా ఇవ్వలేదు!" అన్నాడు సుగుణాకరం.

ఊళ్లో పెద్దమనిషిగా చెలామణి అవుతూ వందెకరాలపొలం ఉన్న సుగుణాకరం మాటలకి మనసులోనే కలతచెంది మరి మారు మాట్లాడకుండా ఊరి సర్పంచ్ రఘుపతి దగ్గరికి వెళ్లాడు భారవి. విషయమంతా విన్న రఘుపతిలో ఎలాంటి ఆందోళనలేదు. తర్వాత అటూఇటూచూసి గొంతు తగ్గించి "పెద్దాయన పోయినా

ఎవరికీ ఎలాంటి ఇబ్బందిలేదు, నువ్వు బలవంతం చేస్తే వందో రెండువందలో సర్దుతాను, అంతకుమించి మరేం ఇవ్వలేను!” అన్నాడతను.

స్తంభించిపోయాడు భారవి. ఒకప్పుడు రామశేషుగారి సేవానిరతిని అతని ఉపన్యాసాలను ఎంతగానో పొగిడేవాడు రఘుపతి, ఇప్పుడెంత స్వార్థంతో ప్రవర్తిస్తున్నాడో...! బరువుగా నిట్టూర్చి ఇంటిముఖం పట్టాడు భారవి.

జరిగిందంతా పూసగ్రుచ్చినట్లుగా భార్యకి చెప్పి చివరగా అన్నాడు భారవి.

“రామశేషుగారు ఈ ఊరందరికీ సహాయం చేసారు. అయినాసరే... అతనికి సహాయం చేయడానికెవరూ ముందుకే రాలేదు ప్చ్...! ఏం చేయాలో తోచటం లేదు!”

మరుక్షణం సమత మొహంలో రంగులు మారాయి.

“ఊరందరూ అతని పరిస్థితి తెలిసి కూడా మౌనం వహించినప్పుడు మీరెందుకు బాధపడటం చెప్పండి..? మీరు హాస్పటల్‌కి తీసుకువెళ్ళినా అతను బ్రతుకుతాడో లేదో...! అందర్లాగే... మీరు కూడా మౌనంగా ఉండండి చీకు చింతా లేకుండా హాయిగా పడుకోండి. ఊరందరి సమస్యలు నెత్తిన వేసుకుంటే మనశ్శాంతి ఉండదు!”

హతాశుడయ్యాడు భారవి. కొన్ని గంటలక్రితం రామశేషుగారి పరిస్థితిని పక్కింటావిడతో చెప్పి బాధపడిన సమత. ఇలా మాట్లాడ్డమా...!

జబ్బుపడ్డ మనుషుల్ని చూసి జాలి, సానుభూతి చూపించడం మంచిదా? లేక ఉడతాభక్తిగా సాయం చేయడం మానవత్వమా...! హా! ఏం మనుషులో..! ప్రార్థించే పెదవులకన్నా... సహాయం చేసే చేతులు గొప్పవంటారు. ఎవరితోను సంబంధం లేకుండా తనకు తోచిన సహాయం తను చేయాలి. దృఢంగా అనుకున్నాడు భారవి.

ఆ రాత్రి భారవికి నిద్రపట్టలేదు. అనారోగ్యంతో ఒంటరిగా మంచం మీద పడుకొన్న రామశేషుగారు కళ్లముందు మెదిలారు. మరి ఆలస్యం చేయలేదతను. ఈ రాత్రి అతనికి తోడుగా ఉండడం తన కర్తవ్యం. తెల్లవారేక అతని ఆరోగ్య పరిస్థితిని బట్టి సిటీలో ఉన్న హాస్పిటల్‌కి తీసుకువెళ్ళొచ్చు. అనుకుంటూ చేతిసంచీలో ఓ దుప్పటి ఉంచుకొని రామశేషుగారింటికి బయలుదేరాడు.

మెల్లగా అడుగులు వేస్తూ నడుస్తున్న భారవిలో మళ్లా ఆలోచన్లు ముసురుకున్నాయి. రామశేషుగారి మాటలే అతన్ని వెంటాడసాగాయి.

ఈ ఊళ్లో ఎవరికి అతను సహాయపడాలనుకుంటున్నారు?

ఈ ఊరిమీద ఇంకా అతనికి ఆపేక్ష కలగడానికి కారణం ఏమిటి"?

ఎన్నో ప్రశ్నలు భారవిలో సంచలనం కలిగించసాగాయి.

ఆలోచనలతో బుర్ర వేడెక్కిపోతూంటే... బరువుగా నిట్టూర్చి రామశేషుగారింటికి చేరుకున్నాడు.

భారవి లోపలికి అడుగుపెట్టగానే... రామశేషుగారి వదనం ఏడాది పొడుగునా... విరగ కాచే నిత్యమల్లెలా నిర్మలంగా ఉంది. అతనికి దగ్గర్లో నలుగురబ్బాయిలు కూర్చున్నారు. హైస్కూలు చదువుతున్న పిల్లల్లా ఉన్నారు. అందులో ఒకబ్బాయికి పోలియో...

"నా కోసం ఇప్పట్నుంచి ఏడవకండి, అనారోగ్యంతో ఉన్న ప్రతీవాడు చచ్చిపోడు. నేను తప్పకుండా బ్రతుకుతాను! మిమ్మల్ని పోషిస్తాను. చదువు చెప్పిస్తాను!"

ఆ అబ్బాయికి ధైర్యం చెబుతూ నవ్వుతున్నారు! రామశేషు. ఆ దృశ్యం చూచి నిలుచున్న చోటే ప్రతిమలా ఉండిపోయాడు భారవి. ఆ అబ్బాయిలు ఊరి చివర గుడిసెల్లో బ్రతుకుతున్నవాళ్ళు అనాధ పిల్లలు. వాళ్ళు మంచిమార్కులతో చదువుతూ అందరి మన్నన పొందుతున్నారు కూడా...!

తిండికి, బట్టకి లోటు లేకుండా హాయిగా బ్రతుకుతున్నారు. అంటే... వాళ్ళ విజయం వెనుక.... ఉన్న వ్యక్తి రామశేషుగారు, అందుకే కాబోలు... మంచాని కతుక్కుపోయిన అతన్ని చూసి ఆ అబ్బాయిలు కన్నీరు కారుస్తున్నారు.

భారవిని చూసి రామశేషుగారు నిండుగా నవ్వారు.

"వీళ్లని నేనే పోషించి చదువు చెప్పిస్తున్నాను ఎవరూలేని ఒంటరివాణ్ణి. అందుకే నాకొచ్చిన డబ్బుని వీళ్లకోసం ఖర్చు పెడుతున్నాను.

తల్లిదండ్రులు లేక... ఊరవతల బ్రతుకుతూ... ఎలాంటి సాయంలేక బాధపడుతున్న వీళ్లని చూసి నా మనసు ఎప్పటికప్పుడు బాధతో మూలిగేది. వీళ్లని

ప్రయోజకుల్ని చేయాలన్నది నా లక్ష్యం. అందుకే ఇంకా కొన్నాళ్ళు బ్రతకాలనిపిస్తోంది?" అన్నారతను నిజాయితీ నిండిన కళ్లతో.

నిశ్శేష్టుడయ్యాడు భారవి.

ఊళ్ళో వందల ఎకరాలున్న పెద్దమనుషులున్నారు.

కాని.... ఇలాంటి పెద్దమనసు వాళ్ళల్లోలేదు.

ఎలాంటి ఆస్తిపాస్తులు లేకపోయినా... అనాథపిల్లలకి ఆత్మీయతా పరిమళాలు పంచుతూ... ఆదుకొంటూ... పరోపకారమే లక్ష్యంగా పెట్టుకొన్న రామశేషుగారి మంచిమనసుకి లోలోపలే జోహార్లర్పించాడు భారవి.

మరుక్షణం కర్తవ్యం గుర్తొచ్చింది భారవికి. చేతికున్న ఉంగరాన్ని ఈ మధ్యనే చేయించాడు. దాన్ని అమ్మేసి అయినాసరే... రామశేషుగారికి వైద్యం చేయించాలి.

పదిమందికోసం బ్రతుకుతూ... బ్రతుకుతీపికి అర్థం చెబుతూ అనారోగ్యంతో విలవిలలాడుతున్న అతణ్ణి ఆదుకోవడం తన కర్తవ్యం. వెంటనే పిల్లలకి ధైర్యం చెప్పి రామశేషుగారి చేయందుకున్నాడు భారవి.

"ఇప్పుడే మనం హాస్పిటల్‌కి వెళుతున్నాం. మీరు నాకు పైసా ఇవ్వఖ్ఖర్లేదు. పదండి. మీకు ట్రీట్‌మెంట్ ఇప్పిస్తాను!" అన్నాడు.

రామశేషుగారి కళ్లల్లో పౌర్ణమి వెలుగులు తారసలాడాయి.

"బాబు! నాకంటే చిన్నవాడిని. లేకపోతే... నీ కాళ్లకి దండం పెట్టేవాణ్ణి నీ పెద్దమనసుకి నా జోహార్లు...!" అంటూ ఇంకా ఏదో అనబోయారు.

భారవి మధ్యలోనే అడ్డు తగిలి "జీవితపరమార్థం ఏమిటో నాకిప్పుడే తెలిసింది. మీ పెద్దమనసుకి మా ఊళ్లోవాళ్లు జోహార్లర్పించాలి!" అంటూ రామశేషుగారి చేయందుకొని ముందుకి నడిచాడు భారవి.

# మట్టి చేతులు

**-డా.వాసా ప్రభావతి**

ఎవరిదో పెట్టె జారి కిందపడింది.

ఆ చప్పుడుకి మంగళ ఉలిక్కిపడి కళ్ళు తెరిచింది. అద్దం పక్కకి జరిపి బయటకు తొంగిచూసింది. అంతవరకు లోకాన్ని ఆక్రమించిన చీకటి తొలగిపోతోంది. వెలుగు విచ్చుకుంటోంది. ఆ పరిసరాలకు, ఆమెకు విడదీయలేని అనుబంధం! తను దిగవలసిన ఊరు వచ్చేస్తోంది. తాత, నానమ్మలను చూడాలనే ఆతురత, ఆనందం ఆమెను నిలవనియ్యడం లేదు.

బస్సు ఆగింది.

మంగళ బ్యాగ్ భుజాన వేసుకుంది. పెట్టె చేత్తో పట్టుకుని గబగబా బస్సు దిగింది. ఆమె వెనకే మరో ఇద్దరు బస్సు దిగారు. తన పని పూర్తయినట్టు బస్సు హారన్ మోగించుకుంటూ వెళ్లిపోయింది.

నల్లటి దుప్పటిలో నుంచి నిద్ర లేస్తున్న కాల దేవతలా దూరంగా గ్రామం!

"ఏమ్మా! ఊళ్ళోకేనా?" బస్సు దిగినవారిలో ఒక వ్యక్తి ఆప్యాయంగా పలకరించాడు.

"అవునండీ!"

"ఎవరింటికెళ్ళాలమ్మా?" మరో వ్యక్తి అడిగాడు.

"మా తాత నరసింహంగారింటికండీ!"

"అయితే – నువ్వు నరసింహం మనవరాలివా? నాలుగురోజుల్నించి అతను నిద్రపోవడం లేదమ్మా! నిన్నే కలవరిస్తున్నాడు" ఇద్దరు వ్యక్తులూ ఒకేసారి అన్నారు.

ఆమె తాత కోసం ఎదురుచూస్తున్నట్లు ఆమె చూపులే చెబుతున్నాయి.

"అమ్మా! మంగా! మంగా! దూరం నుంచే తాత పిలుపు వినబడింది.

"ఆఁ....! నీ మనవరాలు వచ్చేసిందయ్యా! నువ్విప్పుడా రావడం?!" ఒకాయన అడిగాడు.

"పొద్దుటే పొలానికెళ్ళానయ్యా! అందుకే కాస్త ఆలస్యమయింది" ఆయనకు సమధానమిచ్చాడు నరసింహం.

"నీ మనవరాలు దీపంలా ఉందయ్యా!" మరో వ్యక్తి మాటలకి పూలచెట్టులా పెరిగిన మనవరాలివైపు గర్వంగా చూశాడాయన.

ఆ వ్యక్తులిద్దరూ నవ్వుకుంటూ ఊరి వైపు కదిలారు.

"ఏమ్మా! మంగా! ఈ తాత, నానమ్మలను చూడ్డానికి ఇప్పటికైనా వచ్చావమ్మా!

తాత, నానమ్మలు 'మంగా' అనే పిలుస్తారు. తాత తల్లిపేరు మంగమ్మ. ఆయనకు తల్లి అంటే చాలా ఇష్టం. ఆమె పోయిన రోజుల్లో మనుమరాలు పుట్టిందని ఆమె పేరు పెట్టుకున్నాడు. కోడలు శాంతకు ఆ పేరు నచ్చలేదు. 'మంగళ' అని పెట్టుకుంది.

తాత, నానమ్మలు 'మంగా' అనే పిలుస్తారు.

తల్లి 'మంగళా' అనే పిలుస్తుంది.

తండ్రి 'చిట్టి తల్లీ' అని పిలిచేవాడు. మంగళకు ఎవరు ఎలా పిలిచినా ఇష్టమే! తాత పిలుపు మరింత ఇష్టం. తాత మాటల్లోని ఆత్మీయత ఆమెను కుదిపివేసింది. ఆయన గుండెల మీద వాలిపోయింది.

ఆమె తలను, వీపును చేత్తో నిమిరాడు. చాలాకాలం తరువాత తిరిగి అందుకున్న ఆ ప్రేమ బంధానికి ఆయన కళ్ళు చెమర్చాయి. భుజం మీది కండువాతో కళ్ళొత్తుకున్నాడు.

"అమ్మా! మంగా... ఆ రిక్షాలో వెళ్ళి కూర్చో!" అక్కడే ఆగివున్న రిక్షాను చూపించాడు.

"ఆలస్యమవుతుందమ్మా! మీ నాన్నమ్మ ఎదురుచూస్తూ ఉంటుంది. పైగా... బస్సు ప్రయాణం చేసి అలసిపోయి ఉన్నావు. వెళ్ళి రిక్షాలో కూర్చో!"

మారు సమాధానం చెప్పకుండా మంగ బ్యాగ్ తీసుకుని వెళ్ళి రిక్షాలో కూర్చుంది తాత ఆమె పక్కనే రిక్షాలో కూర్చున్నాడు.

రిక్షా సాంబయ్య పెట్టె వాళ్ళ కాళ్ళ దగ్గర పెట్టాడు. రిక్షా ఊరివైపు రోడ్డు పట్టింది. వేప పుల్లలు నములుకుంటూ కాలవ గట్టు వైపు నడుస్తున్న కొందరు, సైకిళ్ళ మీద వెళుతూ ఎదురువస్తున్నారు.

అందరూ రిక్షావైపు మాత్రం పరీక్షగా చూస్తున్నారు. నరసింహంగారి పక్కన ఆ పిల్లను చూడగానే అందరికీ అర్థమైపోయింది. అందుకే అందరూ నవ్వుకుంటూ వెళ్ళిపోతున్నారు.

"మనూళ్ళో గుర్రంబండి ఉండాలి కదూ తాతా..., అదేమయింది?"

"ఇంకెక్కడి గుర్రబ్బండమ్మా! ఆ వరదల్లో గుర్రం చచ్చిపోయిందమ్మా...; బండి విరిగి ముక్కలయిందమ్మా!"

తాత సమాధానం వినగానే ఆ గాలివాన గుర్తుకొచ్చింది. ఆమె గుండె కలుక్కుమంది. పాత జ్ఞాపకాలు కళ్ల ముందు నిలిచాయి. రిక్షా కొత్తరోడ్డు మీద వేగంగా వెళుతోంది. ఆమె కళ్ళు ఎందుకో... అటూఇటూ వెతుకుతున్నాయి.

"ఇక్కడే తాతా... చెల్లి బురదలో కూరుకుపోయింది!" ఉన్నట్టుండి మంగ పిచ్చిదానిలా అరిచింది. రెండు చేతులతో ముఖం కప్పుకుని వెక్కి వెక్కి ఏడ్చింది.

తాత గుండెల మీద పెద్ద బండరాయి పెట్టినట్టుగా బరువెక్కింది.

"ఊరుకో తల్లీ! ఊరుకో!" ఆమెను ఓదార్చడానికి ఎంతగానో ప్రయత్నించాడు.

రిక్షా సాంబయ్య మనస్సు కూడా వికలమైపోయింది. కాళ్ళు తడబడుతున్నాయి. రిక్షా అనుకున్నంత వేగంగా తొక్కలేకపోతున్నాడు.

'ఇంకా మంగకు ఏ జ్ఞాపకాలు తలపుకు వస్తాయో'... నని తాతని భయపెడుతూనే ఉన్నాయి. అతను భయపడుతున్నంత సంఘటనా జరిగింది.

"తాతా! తాతా! ఇక్కడే నాన్న! తాతా! నాన్న...." ఇంక ఆమెకు మాటలు పెగల్లేదు ఈసారి గుండెలు బాదుకుని ఏడ్చింది.

సాంబయ్య భార్య కూడా ఆ వరదల్లో చనిపోయింది. ఆ పక్కనే ఆమె శవం దొరికింది. అతనికి దుఃఖం పెల్లుబికి వచ్చింది. తలగుడ్డ తీసి నోట్లో కుక్కుకున్నాడు. ఎడంచేత్తో రిక్షా సైకిలు పట్టుకుని, కుడిచేత్తో చిన్నపిల్లడిలా కళ్ళు తుడుచుకున్నాడు.

తాత కారే కన్నీళ్ళను దాచుకోలేకపోయాడు. ఆమెను ఓదార్చడానికి ఎంతగానో ప్రయత్నించాడు. కానీ... ఓదార్చలేకపోయాడు. సాంబయ్య రిక్షా తొక్కలేకపోయాడు.

కాలం స్తంభించినట్లుగా రిక్షా ఆగిపోయింది. మనసులోని శోకరసం కరిగి కరిగి అడుగంటినట్లుగా వారి ఏడుపులు ఆగిపోయాయి. తిరిగి కాలం కదలినట్లయింది.

సాంబయ్య రిక్షా కూడా ముందుకు కదిలింది.

మనవరాలు వస్తుందన్న కంగారులో ఆదిలక్ష్మిగారు ఇంటి పనులన్నీ గబగబా ముగించుకుంది. ఇంటిముందు రిక్షా చప్పుడు కాగానే తలుపులు తెరిచింది. ఒక్కసారి వెలుగంతా లోపలికి వచ్చింది.

ఆ వెలుగు మధ్యలో ఆ ఇంటి దీపంలా మంగ కనబడింది.

"మంగా! నా తల్లీ... వచ్చేశావా?" ఆవిడ చేతులు చాచి ముందుకు వచ్చింది.

"నానమ్మా!" అంటూ మంగ చేతిలోని బాగ్ అక్కడే పడేసి ఆవిడవైపు అడుగు వేసింది.

పద్దెనిమిది సంవత్సరాల మంగ గువ్వపిట్టలా ఆవిడ చేతుల్లో వాలింది, ఆవిడ గుండెల మీద సేద తీర్చుకుంది.

ఇద్దరి గుండెలూ బరువెక్కాయి. ఆనందం, ఆతురత, చాలాకాలానికి చూశామన్న ఆందోళన వారిని ఉక్కిరిబిక్కిరి చేశాయి. మరుక్షణంలో ఇద్దరూ వెక్కివెక్కిఏడుస్తూ అలాగే నిలబడిపోయారు.

"అదేమిటి ఆదిలక్ష్మీ..., పెద్దదానివై ఉండి అదేం పని?! పిల్లని లోపలకి తీసుకెళ్ళు"

ఇరుగుపొరుగు ఆడవాళ్ళు మాటలతో ఈ లోకంలోకి వచ్చింది ఆదిలక్ష్మి. తన కళ్ళు తుడుచుకుంది. గుండెరాయి చేసుకుని మంగ కళ్ళు తుడిచింది.

మనవరాలిని నడిపించుకుంటూ లోపలికి తీసుకువెళ్ళింది.

అప్పటికి వారితోపాటే తేరుకున్న సాంబయ్య సామాను లోపలపెట్టాడు.

నరసింహంగారు పైసలిస్తానన్నా వద్దంటూనే రిక్షా తొక్కుకుంటూ వెళ్ళిపోయాడు.

"ఆ పిల్లకి కాస్త కాఫీ యిస్తావా...., లేదా?"

"ఇదిగో... ఇప్పుడే కలుపుతా! కాఫీ డికాషన్ తీసే ఉంచా!" భర్తకు సమాధాన మిచ్చింది ఆదిలక్ష్మిదేవి.

"అమ్మా! మంగా! ముఖం కడుక్కురామ్మా! కాఫీ పట్టుకొస్తా!"

మంగను తొందర చేసింది నానమ్మ.

మంగ బ్యాగ్ తెరచింది. బ్రష్, పేస్టు తీసుకుని పెరట్లోకి వెళ్ళింది.

పెరడంతా కొత్తగా కళకళలాడుతూ కనబడింది. నీళ్ళు తోడుకోడానికి పంపు పక్కనే నీళ్ళతో సిమెంటు గోలేం. రకరకాల పూల మొక్కలు, విచ్చిన కనకాంబరాలు, ఎర్ర గులాబీలు, తెల్లని నంది వర్ధనాలు, ఎర్రని మందారాలు, గన్నేరులు గాలికి అటుఇటు ఊగుతూ ఆత్మీయంగా పలకరిస్తున్నట్లు కనపడ్డాయి.

పళ్ళు తోముకుని చల్లని నీళ్లతో ముఖం కడుక్కుంది. ముఖంతోపాటు, మనసు కూడా చల్లబడినట్లయింది.

అప్పుడు గమనించింది మంగ – 'పెరడే కాదు, ఇల్లు కూడా మారిపోయింది. ఇందాక ఊరంతా మారిపోయినట్లనిపించింది. తాతను అడగాలనుకుని మర్చిపోయాను' మంగ తనలోనే అనుకుని లోపలికి వచ్చింది. తాత అందించిన తుండుతో ముఖం తుడుచుకుంది.

"ఇదిగో... ముందు ఇడ్లెన్లు తినమ్మా!" ఆదిలక్ష్మి పీటవేసి ముందు ప్లేటు పెట్టింది.

"పొద్దుటే ఇడ్లీ ఎక్కడివి నానమ్మ!"

"ఎక్కడివేమిటీ? మన పిచ్చయ్య కొట్టుకెళ్ళి మీ తాత నీకోసం ఇడ్డెన్లు పట్టుకొచ్చాడమ్మా! చల్లారకుండా తిను".

"పిచ్చయ్య కొట్టు ఇంకా ఉందా?" జ్ఞాపకం చేసుకుంటూ తిరిగి అడిగింది మంగ.

"పిచ్చయ్య తెలివైనవాడు... పైగా... చాలా కష్టపడతాడు. ఆ చిన్న కొట్టే ఇప్పుడు పెద్ద హోటలయిందమ్మా! కానీ, ఆ కొడుకులిద్దరూ ఒట్టి జులాయి

వెదవలయ్యారమ్మా!" తల్లితండ్రులమాట వినరు...., కష్టపడరు తండ్రి సంపాదన తగలెయ్యడమే వారికి తెలుసమ్మా!"

"ఇదిగో మంగా! నీకు జున్ను ఇష్టమని నిన్ననే వండి ఉంచా!" ఉట్టి మీద గిన్నె తీసి మరో ప్లేట్లో జున్ను పెట్టి మంగ ముందు పెట్టింది.

"జున్నెక్కడిది నానమ్మా?" జున్ను చూడగానే నోరు చప్పరించుకుంటూ అడిగింది మంగ.

"మొన్నరాత్రే మన ఆవు ఈనిందమ్మా! నువ్వు వస్తున్నావని దానికి తెలుసు కదమ్మా!"

మంగ పకపకా నవ్వింది. తాతా, నానమ్మలు కూడా మనవరాలితోపాటు పకపకా నవ్వారు.

ఇడ్లీ తినడం పూర్తి చేసి, మంగ జున్ను ప్లేటు ముందుకు జరుపుకుంది.

"అన్నట్లు... అడగడం మరిచిపోయా తాతా! మన పెంకుటిల్లు ఇలా డాబాలా ఎలా మారిపోయింది? ఏదైనా మ్యాజిక్కా!"

"మ్యాజిక్కు కాదూ, ఏమీ కాదు. అంతా నిజమేనమ్మా. ఆ గాలివానకు మన పెంకుటిల్లు నేలమట్టం అయ్యింది కదమ్మా! తిరిగి ఇల్లు కట్టుకోవడానికి అందరికీ తలో రెండు వేలు ఇచ్చారు. బ్యాంకులు ఋణాలు ఇచ్చాయమ్మా. ఇల్లు కట్టుకోవడానికి స్వచ్ఛంద సంస్థలు ఎంతగానో సహాయం చేశాయి. మనమే కాదు, చాలా మంది కట్టుకున్నారమ్మా! పేదవారికి పక్కా యిళ్ళు కూడా కట్టించి యిచ్చారు!"

"అందుకేనా ఊరంతా మారిపోయినట్లు అనిపించింది. పెంకుటిల్లు పోతే పోయింది గాని మంచి యిల్లు కట్టావు తాతా! పైకిమెట్లున్నాయా! ఎక్కవచ్చా? చిన్న పిల్లలా అడిగింది మంగ.

"ఎక్కవచ్చమ్మా" తాతా నానమ్మలు ఒకేసారి అన్నారు ఆమె కంటే చిన్నపిల్లలై.

బెల్లంతో మిరియాల పొడి వేసి వండిన జున్ను మంగకు చాలా ఇష్టం.

"ఎంతబాగుందో జున్ను!" లొట్టలు వేసుకుంటూ తింటోంది మంగ.

"మంగా... కొంచెం జున్ను వెయ్యనా! మీ నాన్నక్కూడా జున్నంటే చాలా

యిష్టమమ్మా! అందులోనూ – ఈ బెల్లం జున్ను మరీ ఇష్టం!” కొడుకు పేరు తలపుకు రాగానే ఆవిడ కళ్ళు తుడుచుకుంది.

నానమ్మను చూసిన మంగ కళ్ళు తడయ్యాయి. తినడం మానేసి నానమ్మ వైపే  చూస్తూ ఉండిపోయింది.

అటుగా వచ్చిన నరసింహంగారు వారిద్దరినీ చూశాడు. ఆవిడ మాటలు కూడా విన్నాడు. వారిద్దరి గుండెలు పాత జ్ఞాపకాలతో తిరిగి బ్రద్ధలు కాకూడదనుకున్నాడు.

“అమ్మా! మంగా కాసేపు నడుం వాల్చమ్మా! కబుర్లు తర్వాత చెప్పుకోవచ్చు. అవి ఎక్కడికి పోవు. మీ నోట్లోనే ఉంటాయమ్మా!” అన్నాడు లేని నవ్వు తెచ్చుకుని.

“ఉండమ్మా! కాఫీ పట్టుకొస్తాను” ఆవిడ కాఫీ వెచ్చ చేసి పట్టుకొచ్చింది.

“కాఫీ తాగటానికి మా అమ్మ కప్పులు పంపించింది” మంగ బ్యాగ్‌లోంచి తీసి అరడజను పింగాణీ కప్పులు అక్కడ పెట్టింది.

“ఎంత బాగున్నాయో కప్పులు!” నానమ్మ వాటిని అటుఇటు తిప్పి చూసి ఒక కప్పు కడిగి తెచ్చింది. మంగ అందులో కాఫీ పోసుకుని తాగింది. తాతా, నానమ్మలు తృప్తిగా చూశారు మనవరాలి వైపు.

“అమ్మా! మంగా! కాసేపు గదిలో మంచం మీద నడుం వాల్చమ్మా!”

తాత మాటలకు సమాధానం చెప్పకుండానే పీట మీంచి లేచింది. గదిలోకి వెళ్ళి పట్టెమంచం మీద నడుం వాల్చింది.

ఎదురుగా దండ వేసి ఉన్న నాన్న ఫోటో! ఆనాటి జల ప్రళయం మంగ కళ్ళ ముందు నిలిచింది. మంగ మనసంతా వికలమైపోయింది. నాలుగురోజులు ఎడతెరిపి లేకుండా గాలివాన.

ఆ ప్రాంతాల్లో ఎన్నోసార్లు గాలివానలు వచ్చాయి. అమలాపురానికి మూడు మైళ్ళ దూరంలో ఉంది ఆ గ్రామం. అటువంటి గాలి ఎప్పుడూ రాలేదు. ఈలలు వేసుకుంటూ భయంకరమైన గాలి! ఇళ్ల కప్పులు ఎగిరిపోతున్నాయి. మరో పక్క ఆకాశం చిల్లుపడినట్లుగా కుండపోతగా వర్షం!

పాత ఇళ్ళు, దూడల పాకలు, తాటాకు ఇళ్ళు నేలమట్టమయ్యాయి. లోతట్టు ప్రాంతాలన్నీ మునిగిపోయాయి. ఓ పక్క గౌతమీ నదికి వరదలు. ఎన్నో చోట గండ్లు పడ్డాయి. ఊళ్ళన్నీ నీళ్ళలో కొట్టుకుపోతున్నాయి. మరో పక్క సముద్ర కెరటం విరుచుకుపడింది. పల్లపు ప్రాంతాల్లోని జనాన్ని తరలించారు.

"ఊళ్లోకి నీళ్ళొచ్చేస్తున్నాయ్ః... బాబోయ్!" అర్ధరాత్రి ఎవరిదో కేక... మృత్యు నినాదంలా వినబడుతోంది.

నరసింహంగారి గుండెల్లో రాయి పడింది. ఎందుకైనా మంచిదని ఆదిలక్ష్మిగారు ఇల్లు సర్దింది. ముఖ్యమైన వస్తువులు రేకుపెట్టెలో సర్దింది. ఖరీదైన బట్టలు మూట కట్టింది. తలుపులు తెరిచేటప్పటికి వరదనీరు ఇంట్లోకి వచ్చేసింది. ఇళ్ళూ, వాకిళ్ళూ వదలి అందరితోపాటు నరసింహంగారి కుటుంబం కూడా దేవాలయ ప్రాంగణం చేరుకుంది.

ఆ దేవాలయం చాలా ఎత్తులో ఉంది. ఆదిలక్ష్మిగారి పెట్టె చేరింది. కాని, నెత్తి మీద మూట ఆ కటిక చీకట్లో నీళ్లలో కొట్టుకుపోయింది.

నరసింహంగారి కొడుకు ప్రసాదు, చిన్న మనవరాలు ఊర్మిళ అందరిలో కనబడలేదు. మరెక్కడికో వెళ్ళివుంటారని అందరూ ధైర్యం చెప్పారు. అయినా... వీరి మనస్సు మనస్సులో లేదు. కన్నీరు మున్నీరుగా ఏడుస్తూనే ఉన్నారు. ఆ ప్రాంగణంలోనే ధర్మదాతలు అందరికీ వండించి భోజనాలు ఏర్పాటు చేసారు.

మూడు రోజులకి వానతోపాటు వరద కూడా తగ్గింది.

అప్పుడు తెలిసింది – నరసింహంగారి సంసారం బ్రద్దలయిందని!

ఆ బురదలో నడుచుకుంటూ అందరూ శోకదేవతల్లా ఇళ్ల వైపు కదిలారు. వారి వెంటే నరసింహంగారి కుటుంబం ఉంది. ఎక్కడ చూసినా కుళ్ళిపోయిన శవాలు, జంతు కళేబరాలు, ఆ కంపు వాసనలోనే కొడుకు ప్రసాదు శవం, మనవరాలు శవం గుర్తుపట్టారు. గుండెలు బ్రద్దలయ్యేలా ఏడ్చారు.

ఇళ్ళూ, వాకిళ్ళూ నాశనమయ్యాయి. పంటపొలాలు, పాడిపశువులు మట్టిలో కలిశాయి. ఎలా బతకాలో, ఎందుకు బతికిఉన్నారో ఆ వూరి వారికి తెలియదు.

పచ్చని కలశంలాంటి కోనసీమ – ఎండిన మోడులా, బండరాయిలా మారి పోయింది. పునరావాస కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఎన్నో స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చాయి. కేంద్రప్రభుత్వంతోపాటు, రాష్ట్ర ప్రభుత్వం తగిన సదుపాయలు కల్పించడం ప్రారంభించింది.

అమ్మ అక్కడ ఉండలేకపోయింది. మంగను, కొడుకును తీసుకుని చూడ్డానికి వచ్చిన అమ్మమ్మ, మామయ్యలతో ప్రయాణమయింది. కొడుకు పోయిన బెంగతో ఆదిలక్ష్మి, నరసింహంగార్లు చాపను కరుచుకుని ఉండిపోయారు. కోడలిని వెళ్లవద్దని బతిమాలారు.

"ఎప్పటికీ వరదలు వస్తూనే ఉంటాయి. మిగిలిన నా కూతుర్నీ, ఉన్న ఒక్క కొడుకునూ ఈ కోనసీమకు బలివ్వలేను" కోడలు శాంత సమాధానమిచ్చింది. పుట్టిల్లు నిడదవోలు చేరుకుంది.

భర్తలేని బాధను, కడుపుశోకాన్ని మరిచిపోడానికి ఆసుపత్రిలో నర్సుగా చేరింది.

పుట్టింటికి భారం కాకుండా ఆ జీతంలో పిల్లల్ని పోషించుకుంటోంది.

నరసింహంగారు కోడల్నీ, మనవల్నీ రమ్మని ఎన్నోసార్లు ఉత్తరాలు రాశారు.

అయినా... శాంత పంపించలేదు. చివరకు ఇప్పటికి మంగను పంపించింది. మంగ కన్నీళ్ళతో తలగడా తడిసిపోయింది. ప్రస్తుతంలోకి వచ్చిన మంగ కన్నీళ్ళు తుడుచుకుంది.

'అమ్మ, తమ్ముడు కూడా వస్తే నానమ్మ, తాత ఎంత సంతోషపడేవారో!'

మంగ పదే పదే అనుకుంది. మంగ కళ్ళు బరువెక్కాయి. ఎంతసేపు పడుకుందో తెలియదు... గాఢనిద్రలో మునిగిపోయింది.

"అమ్మా! మంగా! లేమ్మా! భోజనం చేద్దువుగాని! లేమ్మా!..." నానమ్మ పిలుపుకి మంగళ కళ్లు తెరిచింది.

"వేడినీళ్ళు కాచి ఉంచా! రెండు చెంబులు నీళ్లు పోసుకుని భోజనం చేద్దువుగాని, రామ్మా!"

"అలాగే నానమ్మా!" ఆవిడ వెంటే నడిచింది మంగ.

మంగ స్నానం చేసి వచ్చేటప్పటికి అరటి ఆకుల్లో భోజనం వడ్డించి ఉంచింది. ఆదిలక్ష్మిగారు.

మీరూ భోజనం చెయ్యలేదా?" మంగ నొచ్చుకుంటూ వెళ్ళి ఓ పీట మీద కూర్చుంది. ముగ్గురూ కబుర్లు చెప్పుకుంటూ భోజనాలు ముగించారు.

"అమ్మా! మంగా!  ఊరు చూస్తానన్నావు కదమ్మా! వెడదామా!"

"ఇప్పుడే వెడదాం తాతా!" మంగ తాతను తొందరచేసింది.

"ఇప్పుడే కదా.... భోజనం చేశావు! కాసేపుండి వెడుదువుగాని! ఆవిడ మాటలు వినలేదు మంగ. చెప్పులు వేసుకుని తాత వెంట బయలుదేరింది.

మంగ ఊహించినట్లు లేదు ఆ వూరు.

మంగ ఆశ్చర్యంగా చూసింది. ఆనాడు నాశనమయిన చెట్లపక్క పచ్చని చెట్లు పెరిగాయి. కొత్త జాతి కొబ్బరి మొక్కలు నాలుగేళ్ళకే కాపుకొచ్చి పచ్చని గుమ్మటాల్లా ఉన్నాయి. పాఠశాల భవనాన్ని ఆసక్తిగా చూసింది మంగ. రేకుల చావిడికి బదులు – సగం కట్టడం పూర్తి చేసిన భవనం!

"మంగా... చూశావా! ఈ బడిలో 5వ తరగతి వరకు ఉంది. అన్ని తరగతులకు పంతులు ఒక్కడే! చదువుకున్న వారంతా ఊరు వదలి వెళ్ళిపోతున్నారు. ఇంకా బాగా చదువుకున్నవారు దేశం వదిలే వెళ్ళిపోతున్నారు. ఈ బడిలో పాఠాలు చెప్పడానికి ఎవరు వస్తారమ్మా!"

తాత మాటలు అంతగా పట్టించుకోని మంగ, "అలాగా!" అంది.

"చూశావా అమ్మా! ఆ పిల్లలు కోతిమూకల్లా ఎలా అల్లరి చేస్తున్నారో! మరో పంతులు ఉంటే ఎంత బాగుండునమ్మా! ఈ వూరు బాగుపడుతుంది. ఈ పిల్లలు బాగుపడతారు!" తాత మాటల్లోని అంతరార్థం మంగళకు తెలీలేదు. కాని, అమాయకపు గృహిణిలా కనపడే గ్రామం చురుకైన యువతిలా కనపడింది.

"ఇక వెడదామా తాతా!" మంగ ఇంటివైపు అడుగులేసింది. ఆమె వెంట తాత అడుగులేశాడు. ఏదో తెలియని ఆనందం ఆమె మనసులో తళుక్కుమంది.

'ఆ బడిలో మనుమరాలు పంతులమ్మ అయితే ఎంత బాగుండును!'

నరసింహంగారి మనసులో కొత్త ఆశలు మొలకలెత్తాయి. కొత్త ఆలోచనలు ఊసులెత్తాయి. మంగ ఇల్లు చేరింది. అప్పటికే మంగని చూడ్డానికి వచ్చిన ఆడవాళ్ళు కూర్చొని ఉన్నారు.

మంగని వారి మధ్యలో కూర్చోపెట్టింది ఆదిలక్ష్మీదేవి. వారు అడిగిన ప్రశ్నలన్నిటికీ ఓర్పుగా సమాధానమిచ్చింది మంగ.

"మంగ బుద్ధిమంతురాలు!" అన్నారు.

"ఇంత చక్కటి మనుమరాలు మీకుంది. ఎంతైనా మీరు అదృష్టవంతులు!" అన్నారు మరికొందరు.

"మీ కోడలు, మనవడు కూడా వస్తే ఇల్లు కళకళలాడేది కదమ్మా!" అన్నారు మరికొందరు. చీకటి పడుతూంటే అందరూ లేచి ఇళ్ళకు వెళ్లారు.

'ఇక్కడి వాళ్ళందరూ ఎంత మంచివాళ్ళో! నిడదవోల్లో ఇలా ఉండరు' అనుకుంది మంగ.

"గడ్డ పెరుగు ఎంత రుచిగా ఉందో నానమ్మా!"

ఆ మనువరాలి మాటలకి ఆవిడ మరింత పెరుగు వడ్డించింది.

"చాలు... నానమ్మా చాలు!" మంగ అరుపుకి తాత, నానమ్మలు పకపకా నవ్వుకున్నారు. ఆ పూట ఆ ముసలి దంపతులు రెండుముద్దలు ఎక్కువే తిన్నారు. ఆదిలక్ష్మిగారు వంటిల్లు సర్దుతోంది.

"తాతా! నేను రేపు వెళ్ళిపోతాను!" అంది మంగ.

"అదేమిటమ్మా?!" నరసింహంగారు ఆశ్చర్యంగా అడిగారు.

ఆదిలక్ష్మి చేతిలో పని ఆపేసి బొమ్మలా నిలబడిపోయింది.

"మిమ్మల్ని చూశాను. ఊరు చూశాను. అమ్మ వెంటనే వచ్చేయమంది తాతా!

"అలాగే వెళుదువు గాని! ఇక్కడ నాలుగు రోజులు మాతో ఉండి వెళ్ళమ్మా!"

– మనుమరాలిని బతిమాలుతున్నట్లుగా అన్నాడు తాత.

అప్పటికి ఆదిలక్ష్మిగారిలో చలనం వచ్చింది.

"రాకరాక వచ్చావు కదమ్మా! తొందరపడితే ఎలా! మేమే వచ్చి నిన్ను

దిగపెడతాం! మీ అమ్మనీ, తమ్ముణ్ణి కూడా చూసినట్లవుతుంది” అంది ఆదిలక్ష్మీదేవి.

ఆ మాటలు మంగకు నచ్చాయి. “సరే!” అని తలాడించింది.

ఆ రాత్రి మంగ నానమ్మ పక్కలో పడుకుంది. మనుమరాలి మీద చేయివేసి ఆవిడ ఏదో చెబుతూనే ఉంది ఊరంతా నడవడం వల్ల మంగకు కాస్త కాళ్ళు నొప్పులనిపించాయి. అలసటవల్ల తెలీకుండానే నిద్రలోకి జారిపోయింది.

మరునాడు మంగ లేచేటప్పటికి కాస్త పొద్దెక్కింది. మంగ స్నానం చేసి బట్టలు వేసుకుంది. తాత హోటల్ నుంచి పట్టుకొచ్చిన పెసరట్లు తింది.

“పెసరట్లు బాగున్నాయి తాతా!” అంది.

“అవి మనూరు పెసరట్లు తల్లీ! అన్నాడు తాత.

“నరసింహంగారూ!” అంటూ బడిపంతులు శ్రీనివాస్ లోపలకి వచ్చాడు.

“రావయ్యా! పంతులూ... రావయ్యా! ఇలా కూర్చో!” అంటూ కుర్చీ చూపించాడు నరసింహంగారు.

“నమస్కారమండీ!” మంగ వైపు తిరిగి నమస్కరించాడు పంతులు.

“నమస్కారమండీ!” లేచి నిలబడి ప్రతినమస్కారం చేసింది మంగ.

‘ఎంతైనా... నిడదవోల్లో పెరిగింది కదా – సంస్కారవంతురాలు!’ అనుకున్నాడు మనసులో పంతులు.

వాళ్ళిద్దరినీ చెరో కుర్చీలోనూ కూర్చోపెట్టి నరసింహంగారు పట్టెమంచం వాల్చి కూర్చున్నాడు.

“ఇతను మన మునసబుగారి అబ్బాయి శ్రీనివాస్! హైదరాబాద్‌లో ఎమ్.ఎ.బి.ఎడ్. చేసి వచ్చాడు. ఈ బడిలో పంతులుగా చేస్తున్నాడమ్మా!” ఆయన పరిచయం చేశాడు.

అతని వైపు ఆశ్చర్యంగా చూసింది మంగ.

“నేను ఈ చిన్నబడిలో పాఠాలు చెప్పే పంతుల్ని! సాయంకాలం వయోజనులకు విద్య నేర్పుతానండి. అంతేకాదు, అభంశుభం తెలియనివారు ఈ గ్రామ ప్రజలు. వారికి బ్యాంకులో, పోస్టాఫీసులో డబ్బులు దాచుకోవడం, తీసుకోవడం, అవసరమైతే

ఋణాలు తీసుకోవడం తెలియచెబుతానండీ! మనం చదువుకున్నవాళ్ళం. ఈ దేశం మనకేమి చేస్తుందని కాదు – ఈ దేశానికి మనమేం చేస్తున్నాం...., ఏం చేయగలమని ఆలోచించాలండీ! మిమ్మల్ని విసుగిస్తున్నానుకోకండి... మీరు ఒక్క నాలుగురోజులు ఈ గ్రామాన్ని పావనం చేయండి. ఈ నాలుగు రోజులు మా బడికి కూడా వచ్చి మా పిల్లలకి నాలుగు కొత్త విషయాలు చెబుతారని ఆశిస్తున్నానండీ!" అన్నాడు శ్రీనివాస్.

అతని మాటల్లోని నిజాయితీకి, అతని ఆశయాలకు మనసులోనే నమస్కరించింది మంగ.

"తప్పకుండా మీ బడికి వస్తానండీ!" సమాధానమిచ్చింది.

"బడి గంట కొట్టే సమయమయింది. నేను వెడతానండీ!" పంతులు లేచి నిలబడ్డాడు.

"తాతా! నేను కూడా బడికి వెళతాను" మంగ కూడా కుర్చీలోంచి లేచింది.

తాత సంతోషంగా తలూపాడు.

మంగ అతని వెంటే బడికి బయలుదేరింది.

అతనితోపాటే తరగతుల్లో తిరుగుతూ పాఠాలు చెబుతుంటే తెలియని ఆనందమేదో ఆమెలో చోటుచేసుకుంది. బడి వదిలే గంట కొట్టారు. బడి గంట త్వరగా కొట్టారనిపించింది మంగకు.

"రండి... మిమ్మల్ని ఇంటి దగ్గర దిగబెట్టి వెళతాను" మంగతోపాటే అడుగులేశాడు శ్రీనివాస్.

ఇంటికి కాకుండా పొలాలవైపు నడిచారు ఇద్దరూ.

ఎన్నో విషయాలు మాట్లాడుకుంటూ ఇద్దరూ అలా నడుస్తూనే ఉన్నారు.

క్రమంగా సంధ్యా సమయమయింది. ఎర్రని సూర్యబింబం పశ్చిమాద్రిలోకి వెళ్ళిపోతోంది. పొలాల మీదుగా వచ్చే చల్లగాలి సేద తీరుస్తోంది. ఇద్దరి మనసుల్లో ఏదో తడబాటు... ఏదో కొత్త ఆనందం!

ఆకాశంలో తెల్లని కొంగలు, నల్లని కాకులు బారులుగా చెట్లవైపు అరుచుకుంటూ పోతున్నాయి.

"ఇంక వెళదామండీ!" మంగ మాటకి 'సరే....' అన్నాడు శ్రీనివాస్.

ఆవులను, గేదెలను తోలుకుంటూ పశువులకాపర్లు ఇళ్ళకు వస్తున్నారు. ఇళ్ల ముంగిళ్లలో కట్టేసిన ఆవు, గేదె దూడలు – 'అంబా....' అంటూ అరుస్తున్నాయి. అంతలో... మంగ ఇల్లు రానేవచ్చింది.

"లోపలకి రండీ!" అంటున్నా వినిపించుకోలేదు శ్రీనివాస్ వెనుతిరిగాడు.

'ఆ గ్రామానికి ఏదో చెయ్యాలనే తపన'... ఆమెలో మొలకలెత్తింది. నవ్వుకుంటూ ఇంట్లోకి అడుగుపెట్టింది మంగ.

"బడి నీకు నచ్చిందా మంగా!" తాత ప్రశ్నకు – "ఓఁ....." అంటూ సమాధానమిచ్చింది మంగ.

"ఈ వూరు బాగుందా" అన్న నానమ్మకు –

"చాలా బాగుంది నానమ్మా!" అని సమాధానమిచ్చింది మంగ.

మనవరాలి సమాధానం వారికి వెయ్యేనుగుల బలం వచ్చినట్లయింది.

ఆ రాత్రి నానమ్మ పక్కలో పడుకున్న మంగ – ఆలోచిస్తూనే ఉంది.

తన స్వార్థానికి తానే సిగ్గుపడింది.

'ఊళ్ళో ఎవరికీ లేని భయం తమకెందుకు? గాలివానలూ, ఈ ప్రాంతాలకు కొత్తేమీ కావు. వారితోపాటే తాము. తాను ఇక్కడే, ఎలాగైనా ఇక్కడే ఉండాలి. 'దేశం మాకేమిచ్చిందని కాదు...., దేశానికి మనం ఏం చేస్తున్నామని ఆలోచించాలి' అన్న శ్రీనివాస్ మాటలు చెవుల్లో గింగురుమన్నాయి. నానమ్మ వొడిలో దూరి హాయిగా నిద్రపోయింది మంగ.

పొద్దుటే నరసింహంగారు పొలానికి బయలుదేరారు.

"నేనూ వస్తా" నంటూ మంగ వెంటబడింది.

"అక్కడ పాములుంటాయి, ముళ్ళుంటాయి...., నువ్వు వద్దమ్మా!"

తాత ఎంత చెప్పినా వినకుండా మంగ ఆయన వెంట బయలుదేరింది. ఆయనతోపాటే పొలంలో తిరిగింది. అక్కడి పనులన్నీ చూసింది.

‘ఆ ముసలితాత ఎన్నాళ్ళు ఈ పొలం కోసం కష్టపడతారు? రేపటి నుండి పొలానికొచ్చి తాత బాధ్యత స్వీకరించాలి. ఎవరేమనుకున్నా భయం లేదు’... ఒక నిశ్చయానికొచ్చింది మంగ. తిరిగి తాత వెంటే ఇంటికి బయలుదేరి వచ్చింది. నానమ్మ అందించిన కాఫీ తాగింది.

“బడికి వెడతా నానమ్మా!” అంది గారాలు పోతూ!

ఆవిడ “సరే...!” అనగానే మంగ గబగబా తెమిలి బడికి బయలుదేరింది.

పిల్లలు ఎంత అల్లరి చేస్తున్నా వారిని సముదాయించింది. కథలు చెప్పింది. పాటలు నేర్పింది. పిల్లలందరికీ ఆమె అంటే ఎంతో ఇష్టం ఏర్పడింది.

శ్రీనివాస్‌కే ఎంతో ఆశ్చర్యం కలిగింది.

‘ఆమె తనకు తోడుగా ఉంటే ఎంత బాగుండును!’ అనుకున్నాడు. అతని మనసు వసంతంలో పూదోటలా గుబాళించింది.

ఇంటికి వచ్చిన మంగ నానమ్మను వాటేసుకుంది.

మనవరాలి ముఖంలో సంతోషం చూసి ఆదిలక్ష్మి గారి మనసు కుదుటపడింది.

ఆవిడ అందించిన జంతికలు, మినప సున్ని, పూతరేకులు వద్దనకుండా తింది.

“చాలా బాగున్నాయి నానమ్మా!” మనవరాలి మాటలకు ఆవిడ తృప్తిగా చూసింది.

మంగ నీళ్ల బిందె పట్టుకుని వీధుల్లోకి వెడుతుంటే ఆశ్చర్యంగా చూసింది నానమ్మ.

అంతకంటే ఆశ్చర్యంగా చూశారు ఇరుగుపొరుగు స్త్రీలు.

ఇంటికెదురుగా రోడ్డుపక్క పంచాయితీ వారు నాటిన మొక్కకు చుట్టూ బాగు చేసి నీళ్ళు పోసింది మంగ.

అదేమిటో అర్థం కాకపోయినా– ఇరుగుపొరుగు స్త్రీలు అదే పని చేశారు. ఎవరింటి ముందు మొక్కలకు వాళ్ళు నీరు పోశారు. నీళ్లు పీల్చిన మొక్కలు పచ్చగా తలలూపాయి.

"అదేమిటమ్మా!" అప్పుడే పొలం నుంచి వచ్చిన తాత ఆశ్చర్యంగా అడిగాడు.

"పంచాయితీవారు మొక్కలు నాటింది మన కోసమే కదూ తాతా! వాళ్ళు కూలీలను పెట్టి నీరు పోయించాలి కదా! ఎవరింటి ముందు మొక్కలకు వాళ్ళే నీళ్ళు పోస్తే అవే పెరుగుతాయి కదూ తాతా! మట్టిలో పుట్టి మట్టిలో పెరగడం కాదు తాతా! ఈ మట్టికోసం మనం ఏ చేస్తున్నామో, ఏం చెయ్యాలో ఆలోచించాలి తాతా!"

ఆమె మాటలు ఆశ్చర్యంగా అనిపించాయి.

మట్టి చేతులు చూసుకుంది మంగ. పొలం నుంచి వచ్చిన తాత తన మట్టిచేతులు తుడుచుకున్నాడు. పెరట్లో కలుపు మొక్కలు తీసిన ఆదిలక్ష్మిగారు మట్టిచేతుల వైపు చూసుకున్నారు.

"తాతా రేపటి నుండి పొలం పనులు నేనే చూసుకుంటాను. బడిలో పంతులమ్మగా చేరుతా! అమ్మని రమ్మని రాశా!"

నట్టింట్లో దీపంలా నిలబడిన మనవరాలిని ఆ ముసలి దంపతులు ఆప్యాయంగా చూసుకున్నారు.

# ప్రసాదరావూ-వంట సరస్వతీ

-పొత్తూరి విజయలక్ష్మి

'ఎంత మాటనేసింది! ఎంత ధైర్యం? ఎంత పొగరు? అమ్మో ఇప్పుడే ఇట్లా వుంటే రేపు రిటైరయిన తరువాత ఇంట్లోంచి వెళ్ళగొడుతుందేమో, ఇక లాభంలేదు దీపం వుండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలి. చేతులు కాలకుండానే ఆకులు పట్టుకోవాలి' అనుకున్నాడు ప్రసాదరావు.

కూర్చున్నా నుంచున్నా భార్య మాటలే గుర్తు వస్తున్నాయి. ఇంతకీ తనేమన్నాడనీ. కొడుకు ఫోన్‌చేశాడు. వాళ్ల అత్తగారికేదో అవసరం వచ్చి ఊరెళ్ళాలిట. కోడలు బాలింత. ఒక నెలరోజులు అమ్మని పంపిస్తారా? అని అడిగాడు. ఓ దానికేం వస్తాను అంది సరస్వతి.

'నాకు చాలా సెలవులు మిగిలిపోయాయి. నేనూ రానా పోనీ' అన్నాడు తను. అడిగినందుకైనా తీసికెళ్లచ్చు. లేదా మర్యాదగా కాదనవచ్చు. అంతేగానీ 'మీరెందుకు నా వెంట గుదిబండ లాగా. ఇక్కడే వుండండి' అనేసింది. అదేవిటంటే పెద్ద పురాణం చదివేసింది.

'మీకేమీ చేతకాదు డేరా మేకులాగా నిలబడితే అన్నీ నేనే అందించాలి. కాళ్ళకీ చేతులకీ అడ్డం తగుల్తారు. ఇంట్లో అయితే ఎలాగా తప్పదు. పొరుగూరికి కూడా ఎందుకు సంబడం' అనేసి వెళ్లిపోయింది.

ఇంటి వ్యవహారాలన్నీ ఆవిడగారే చూసుకుంటుంది. నిజమే, అదేం గొప్పా. తను నెల తిరిగేసరికి కుడుముల్లా రూపాయలు తెచ్చిస్తేగా ఈవిడ ఆటలు సాగేది.

ఏవిటంత పొగరూ అంటే బయటి పనులు ఉదాహరణకి బేంకు పనులు, షాపింగు అన్నీ ఆవిడ చెయ్యగలదుట. ఇంటిపని తనకు ఇసుమంతైనా రాదుట.

అదేం ఖర్మమో చిత్తశుద్ధితోనే వెతికినా తనకు ఏ వస్తువూ కనిపించదు. ఆవిడగారొచ్చి చిటికెలో తీసి ఇచ్చేస్తుంది. పండగరోజు ఒకసారి ఎప్పుడో తను

పనిలో వుండి అలమర్లోంచి కొత్త లుంగీతీసి పసుప్పెట్టి కట్టుకోమంటే అలమర్లో వెతికి కొత్త పేకేట్‌లోంచి లుంగీతీసి పసుప్పెట్టి కట్టుకున్నాడు. 'కొత్తరకం డిజైను బాగానే వుంది సరస్వతీ' అని వంటింటి దగ్గరకు వెళ్ళి చూపిస్తే పడీ పడీ నవ్వింది అది సింగిల్ బెడ్‌షీటుట.

'ఇంకా నయం పసుప్పెట్టి దిండు గలీబు బనీను లాగా తొడుక్కోలేదు' అంది నవ్వుతూ.

ఆ విషయం అడిగినవాడికీ, అడగనివాడికీ కూడా చెప్పేసింది. వాళ్ళంతా ఒకటే నవ్వడం. పోనీ కదా పన్లోవుంది అని సాయం చేస్తే ఇదీ ఫలితం. ఎంత పనిమంతురాలైతే మాత్రం అంత పొగరా? ఏవిటావిడకి వచ్చిందీ తనకు రానిదీను. ఆ బోడి వంటేగా.

తను తల్చుకుంటే చిటికెలో నేర్చుకోగలడు. సరస్వతి వచ్చేలోగా వంట నేర్చుకోవాలి. గట్టి నిర్ణయానికి వచ్చి ఆ ప్రయత్నం మొదలెట్టాడు. ఆఫీసులో పనిచేసే పరమశివాన్ని పిలిచి 'నాకు అర్జెంటుగా వంటమనిషి కావాలి' అని చెప్పాడు. అరగంటకి ఒకావిడని పట్టుకొచ్చాడు పరమశివం. ఆవిడ చేసిన ఉప్మా తిని అరగంటలో ఆవిడకి ఉద్వాసన చెప్పాడు ప్రసాదరావు. అలా అరడజను మందిని వెళ్ళగొట్టాక సరస్వతి అంత బాగా కాకపోయినా ఆవిడ వంటకి దరిదాపుల్లో వుండేలా వంటచేసింది. ఒకమ్మాయి. కాకతాళీయంగా ఆ అమ్మాయి పేరుకూడా సరస్వతే. రెండుపూటలా కాఫీ, టిఫిన్, భోజనం వండి పెట్టడానికి నెలకి వెయ్యి రూపాయలు కావాలి అంది. "రెండు వేలు ఇస్తాను వంట నేర్పుతావా?" అని అడిగాడు.

ఆశ్చర్యపోయింది. "మీరు వంట నేర్చుకుంటారా? ఎందుకు?" అడిగింది. విషయం అంతా చెప్పేశాడు. కొంగు అడ్డం పెట్టుకుని నవ్వింది వంట సరస్వతి.

"ఆవిడేదో చిరాకులో అనుంటారు. ఈ భాగ్యానికి వంట నేర్చుకోవాలా? నన్ను పర్మనెంట్‌గా పన్లో పెట్టుకోండి. పిన్నిగారు వచ్చాక కూడా నేనే వండిపెడతాను"

"వంట మనిషిని పెట్టుకోవడం ఆవిడ ఇష్టం నాకుమాత్రం వంట నేర్పాలి నువ్వు. విద్య వచ్చి వుండడం ఎందుకైనా మంచిదేగా" అన్నాడు పంతంగా.

"సరే మీ ఇష్టం బాబాయిగారూ" అంది నవ్వుతూనే.

“చూడు వంట సరస్వతీ. అలా వరసలు పెడితే సెంటిమెంటు అడ్డం వచ్చేస్తుంది. ఇక్కడ నువ్వు గురువ్వి నేను శిష్యుడిని. కాబట్టి ప్రసాదరావు అనే పిలు. నేను సరస్వతీ అంటాను. రేపటి నుంచే పని మొదలు పెడదాం. మనకింకా పదిహేనురోజులే ఉంది. రేపటినుంచి సెలవు పెడతాను. ఆవిడ వచ్చేలోగా పూర్తిగా వంటలో ప్రవీణుడిని చేసెయ్యాలి” అన్నాడు.

రాత్రి లిస్టు తయారు చేశాడు. టిఫిన్లు వారానికి సరిపడా ఇడ్లీ, దోసె, ఉప్మా, పూరీ, ఊతప్పం, పెసరట్టు, వడ పొద్దున వంటలోకి పదిహేను రకాల కూరలు, పచ్చళ్ళు, రాత్రి వంటకి మరో పదిహేను రకాల వేపుళ్ల జాబితా తయారు చేశాడు. లిస్టు చూసుకుని మురిశాడు.

ఈ మాత్రం దానికి, ‘టిఫిను ఏం చెయ్యను, వంట ఏం చెయ్యను అని హైరానా పడిపోతుంది సరస్వతి. ఎంతైనా మగవాడి తెలివితేటలు ఆడదానికెలా వస్తాయి?’ అనుకున్నాడు. మర్నాడు సరస్వతి రాగానే, “వంట సరస్వతీ ఇవన్నీ నాకు నువ్వు నేర్పాలి” అన్నాడు పది పేజీలు వున్న ఆ జాబితా చూసి నోరావలించిందామె.

“చాలా ఇవన్నీ?” అడిగింది సరస్వతి.

“ఇవికాక ఇంకా చాలా నేర్చుకోవాలి” అన్నాడు.

“సరేలే పద” అని కుక్కరు తియ్యబోతే వారించాడు.

“అలా కాదు నాకు చెప్పు. నేను చేస్తా” అన్నాడు.

“సరే ముందు బియ్యం, కందిపప్పు పట్టుకురా!” అంది కుర్చీలో కూర్చుని. బియ్యం తెచ్చి ఇచ్చి కందిపప్పుకోసం వెళ్ళినవాడు అక్కడే ఉండిపోయాడు.

“ఏం చేస్తున్నావు ప్రసాదరావ్?” అంది సరస్వతి.

“పప్పుకోసం వెతుకుతున్నా” అన్నాడు. వెళ్ళి చూస్తే స్టీలు డబ్బాలన్నీ దించి మూతలు తీసి పెట్టివున్నాయి. ఇంకా డబ్బాలు దించుతుంటే అడ్డుపడింది.

“ఇదుగో ఇక్కడే వుందిగా కందిపప్పు” అంది.

“ఏదీ? ఎక్కడా?” కళ్ళజోడు సర్దుకుంటూ అడిగాడు.

“ఇదుగో, ఇక్కడ” అంది సరస్వతి.

"ఓ! వండకముందు ముద్దపప్పు ఇట్లా బద్దలుగా వుంటుందా? నేనింకా ముద్దపప్పు డబ్బాలో కూడా పప్పులాగానే వుంటుందేమో అని వెతుకుతున్నా" అన్నాడు.

తలబాదుకుంది. "చంపావు పో. వండకముందు పప్పెలా వుంటుందో తెలియనివాడివి నువ్వు వంటేం నేర్చుకుంటావు ప్రసాద్‌రావ్?" అంది దీనంగా.

"నేర్చుకుంటాలే సరస్వతీ, తెలియక అస్తవ్యస్తాన పడ్డానుగానీ తెలుసుకున్నాక పులిని" అన్నాడు.

"సరే పద, పనొప్పుకున్నాక తప్పుతుందా?" అని కుర్చీలో కూర్చుని "ఒక పావు బియ్యం, అరపావు కందిపప్పు విడివిడిగా ఆ కుక్కర్ గిన్నెల్లో పొయ్యి. కుక్కర్‌లో గ్లాసెడు నీళ్ళు పోసి పొయ్యి మీద పెట్టు. గ్యాస్ వెలిగించు. ఇప్పుడు బియ్యం, పప్పు కడుగు, త్వరగా కడిగేయ్. అవతల నీళ్ళుతెర్లుతున్నాయి" చకచకా చెప్తూ అనుమానం వచ్చి లేచి చూసింది. పప్పు బియ్యం సగంపైగా సింకులో పడిపోయాయి. మరోసారి తలబాదుకుని. "నీకు ఏబీసీడీలు కూడా రావు ప్రసాదరావు. నేను కూర్చుని నీ చేత చేయిస్తే కొంప కొల్లేరవుతుంది. గానీ, ముందు రెండు రోజులు నా వెనకే వుండి ఫండమెంటల్స్ నేర్చుకో...." అని కసిరింది సరస్వతి.

ఎదురు చెప్పబోయి మానేశాడు ప్రసాదరావు.

కుక్కరు పెట్టి "ఫ్రిజ్‌లోంచి వంకాయలు తీసుకురా. అంగుళం ముక్కలు తరుగు. అంగుళం అన్నా కదా అని స్కేలు కోసం పరిగెట్టకు. సుమారుగా చూసి తరిగి ముక్కలు నీళ్ళలో పడేయ్. తరిగేక నీళ్ళల్లో వెయ్యమన్నా కదా అని ముందే కడగడం మానకు. కడిగి తరుగు. వేళ్ళుకోసుకోకు" అని చెప్తుంటే చెమటలు కక్కుతూ కూర తరిగాడు.

"వెరీ గుడ్... ఇప్పుడు వెళ్ళి మినప్పప్పు తీసుకురా. నానబోసి రుబ్బితే రేపు ఇడ్లీలు వండుకోవచ్చు. మినపప్పు ఇడ్లీలా వుండదు. చిన్నగా తెల్లబద్దల్లా వుంటుంది" అని చెప్పింది. మళ్ళీ వెళ్ళి డబ్బాలన్నీ దింపసాగాడు.

"అదేంటి. డబ్బాలన్నీ దింపుతావేం?" అంది.

"మరెలా తెలుస్తుంది ఏ డబ్బాలో ఏం వుందో?"

"ఒక సులుపు చెప్తానుండు" అంటూ ఒక్కో డబ్బాతీసి ఆడించి "ఇదుగో చూడు ఇది పెసరపప్పు. ఇది శనగపప్పు. ఇలా శబ్దంబట్టి తెలుస్తుంది. ఒక రోజులో తెలియదనుకో. రోజూ వాడే వాళ్ళకి డబ్బాలు గుర్తుండిపోతాయి. ఇప్పుడు నువ్వు ఆడించి చూడు" అంది.

వెంటనే ఓ డబ్బాతీసి బలంగా ఆడించాడు. మూత ఊడి శనగపిండి ఒళ్ళంతా పడింది. పగలబడి నవ్వింది. "పిచ్చి ప్రసాదరావూ? రెండో చేత్తో మూతపట్టుకోవద్దూ. ఇంకా నయం కారం డబ్బా ఆడించావు కాదు. కథాకళి చెయ్యాల్సి వచ్చేది" అంది నవ్వుతూనే.

"ఇప్పుడేం చెయ్యమంటావు?" అడిగాడు.

"స్నానం చేసిరా" అని చెప్పింది సరస్వతి స్నానం చేసి వచ్చేసరికి వంట అయిపోయింది.

"అదేవిటి నేనొచ్చాక చేస్తే నేనూ చూసేవాడినిగా" అన్నాడు.

"పన్నెండు దాటింది. నేను వేరేచోట వంటకివెళ్ళాలి. సాయంత్రం పెందలాడే వచ్చి నేర్పుతానులే" అంది.

భోజనం చేసి పడుకున్నా శనగపిండి డబ్బా గుర్తుకి వచ్చి నిద్రపట్టలేదు. వెంటనే లేచి తయారై వెళ్ళి పెర్ల్‌పెట్ సీసాలు కొనుక్కొచ్చేసి సరుకంతా ఆ డబ్బాల్లోకి మార్చాడు.

సాయంత్రం సరస్వతి వచ్చి "బానే వుంది. ఇంతింతేసి ఖర్చుపెట్టడం మా ఆడవాళ్ళవల్ల కాదమ్మా వున్నదాంట్లోనే సర్దుకుపోతాం" అంది.

"అవునవును. ఇలాంటి చిన్నవన్నీ పిక్కించి వేలకు వేలు పోసి అనవసరంగా బంగారం కొని దాచిపెట్టడంలో సిద్ధహస్తులు మీ ఆడవాళ్ళు" అన్నాడు ప్రసాదరావ్.

"సర్లే పద వంటచేద్దాం" అంది సరస్వతి.

ఆ పూట వంట వేపుడు ముక్కలూ, చారూ, పెసరపచ్చడీ, రాత్రి పడుకున్నాక పొద్దుటినించీ జరిగిన వంట కార్యక్రమం నెమరు వేసుకున్నాడు ప్రసాదరావు. సరస్వతి ఆరేడుసార్లు తిరగమోతలు పెట్టింది.

ప్రతిసారీ మూకుడు కాలేసి నూనె వెయ్యనూ, తిరగమోత డబ్బాతీసి దినుసులు వెయ్యనూ, చిన్నడబ్బాలోంచి కరివేపాకు తీసివెయ్యను. మళ్ళీ ఇవన్నీ సర్దనూ, మళ్ళీ తియ్యనూ చాలా హైరానా పడింది. ఇంతకంటే సులువైన మార్గం కనిపెట్టాలి. సీరియస్‌గా ఆలోచించాడు. వెంటనే లేచి వంటింట్లోకి వెళ్ళి మూకుడు వేడి చేసి అందులో సగందాకా నూనె పోసి, దోసెడు ఎండుమిరపకాయలు వేసి తిరగమోత డబ్బాలో సరుకులన్నీ వేసేసీ, దోసెడు కరివేపాకు వేసి, మరికొన్ని దినుసులు వేసి, ఇంగువ డబ్బా మొత్తం పంచేసి భారీ ఎత్తున తయారు చేసి దాన్ని ఒక గిన్నెలోవేసి చల్లారాక ఫ్రిజ్‌లో పెట్టాడు.

మర్నాడు సరస్వతి రాగానే "సరస్వతీ నీకోటి చూపిస్తాను" అంటూ ఆ గిన్నె తెచ్చి చూపించాడు.

"ఏవిటీ బ్రహ్మ పదార్థం?" అంది ఆశ్చర్యంగా.

"చూశావా నువ్వు కూడా గుర్తుపట్టలేకపోయావు. ఇది తిరగమోత. మాటి మాటికి అవస్థపడకుండా ఓ చెంచాడు తీసి వేసేసుకుంటే నెల్లాళ్ళు వస్తుంది. ఎలా వుంది నా ఐడియా?" అన్నాడు ప్రసాదరావు గర్వంగా.

"మండినట్లే వుంది. పెసరపచ్చడిలో తిరగమోత వేరు. కొబ్బరిపచ్చడి వేరు, కూరకి వేరు, చారుకి వేరు, ఇంగువేసి బీరకాయకూర చేస్తే ఇక జన్మలో బీరకాయ ముట్టవు. అదీగాక దీన్లో పావుశేరు ధనియాలు కూడా పోశావు. ఇంకెందుకు పనికొస్తుంది" అంది విసుగ్గా.

అంటే నా ప్రయోగం వల్ల ప్రయోజనం లేదా? ఇదెందుకూ పనికి రాదా?"అని అడిగాడు దీనంగా.

"అందులో వేసిన జీడిపప్పులూ, వేరుశనగపప్పులూ ఏరి పక్కనపెట్టు. కాస్త ఉప్పుజల్లి ఇస్తా తినేసెయ్. మిగిలింది చెత్తబుట్టలో పారేయ్. తీరికూచుని వందరూపాయల సరుకు తగలేశావు" అంది.

చిన్నబుచ్చుకుని ఆ పనిచేశాడు. వారం రోజులు గడిచినా ప్రసాదరావు వంట ముందుకి సాగలేదు.

"ఏవిటిది సరస్వతీ ఈ వంట ఏ వెధవ కనిపెట్టాడో గానీ ఓ పద్ధతీ పాడూ లేవేం. మాకు చూడు సిమెంటూ ఇసకా నీళ్లు ఇన్ని పాళ్ళల్లో కలిపితే సిమెంటు మిక్చర్ తయారవుతుంది. అలాగే కాంక్రీటుకి ఇంత. ఎంత బిల్డింగుకి ఎన్ని పిల్లర్లు వుండాలి. ఎంత ఇనుము వాడాలి. అన్నీ ఓ పద్ధతి ప్రకారం నిర్ణయం అయివుంటుంది.

ఈ వంట అలా కాదే. ఇడ్లీ పచ్చడికి ఎండు మిరపకాయలు పనికిరావు. కందిపచ్చడికి పచ్చిమిర్చి పనికి రాదు. దోసకాయపచ్చడికి ఏ మిరపకాయైనా వేసేయొచ్చు. వంకాయ నీళ్ళల్లోకి తరగకపోతే కనరు వస్తుంది. బెండకాయ నీళ్లల్లోకి తరిగితే జిగురొస్తుంది.

ఇన్నేళ్లనించీ వంటచేస్తున్నారు. ఒక పద్ధతి కనిపెట్టలేకపోయారు. ఇలా ఐతే మీ ఆడవారికి ఫర్వాలేదు గానీ కొత్తగా చెయ్యికాల్చుకునే మాలాటివాళ్ళు సంగతి ఏమిటి? అంతా గందరగోళంగా వుండదూ?"

"వంటలోవున్న మహత్యం అదేమరి" అతని అంత పొడుగు ప్రశ్నకీ అతి చిన్న సమాధానం చెప్పింది.

మరైతే కిం కర్తవ్యం. వారం రోజుల్లో నా ఇల్లాలొచ్చేస్తుంది. నువ్వు పక్కన లేకుండా ఏ పనీ చెయ్యలేకపోతున్నాను. నా శ్రమ అంతా బూడిదలో పోసిన పన్నీరేనా?" అన్నాడు దీనంగా.

"చూడు ప్రసాదరావు! వంట నేర్చుకుని నీ భార్య చేత శెభాషనిపించుకోవాలనే నీ ఆశయమైతే బాగానే ఉందిగానీ ఏనాడూ మంచినీళ్ళు కూడా ముంచుకు తాగని నువ్వు పదిహేనురోజుల్లో వంట మొత్తంనేర్చేసుకోవాలనుకోవడం అత్యాశ. నువ్వెంత హైరానాపడినా ఈ వయసులో రాదు. నా మాట విను. తేలికైనవి నాలుగైదు నేర్చుకో" అంది.

తర్వాత వారం రోజులూ గిర్రున తిరిగి వచ్చాయి. కమ్మగా ఉప్మా చెయ్యటం నేర్చుకున్నాడు. పూరీ కూడా బాగానే చేశాడుగానీ గుండ్రంగారాలేదు. ఫర్వాలేదు డబ్బామూతతో కట్ చెయ్యి అని చెప్పింది సరస్వతి. రెండు కూరలూ, రెండు పచ్చళ్ళు నేర్చుకున్నాడు. మల్లె పువ్వులా అన్నం వండడం వచ్చేసింది.

"ఇంకేం. ఒక నీకు తిరుగులేదు. అప్పట్లో నలభీములూ ఇప్పుడు నువ్వు వంట సరస్వతి డ్యూటీ ఆ పూటతో ముగిసిపోతోంది. మర్నాడు ఇంటి సరస్వతి వచ్చేస్తుంది.

రెండు వేలు తెచ్చి సరస్వతికి ఇచ్చాడు ప్రసాదరావు.

"ఇదేవిటి నెలకి వెయ్యి. వంటనేర్పితే రెండు వేలనుకున్నాం కదా. వంట నేర్పనేలేదు. ఆ లెక్కన నెలకి వెయ్యి. పదిహేనురోజులకి ఐదువందలు చాలు"

"ఫర్వాలేదులే వుంచు సరస్వతీ. వంట నేర్పలేదేమో గానీ చాలా చాలా నేర్పావు?" అన్నాడు.

"ఏం నేర్పాను?" అన్నది సరస్వతి.

"వంట చెయ్యడం ఎంత కష్టమో నేర్పావు. ఈ పది హేనురోజుల్లో నేను చాలా విషయాలు తెలుసుకున్నాను. డబ్బు తెచ్చిపడేస్తే సంసారం దిద్దడం, వంట చెయ్యడం ఓ గొప్పా అనుకునేవాడిని. అదెంత కష్టమో తెలిసి వచ్చింది. నిజం చెప్పాలంటే దానిమీద పంతంతో ఈ పని మొదలు పెట్టాను. ఇప్పుడాలోచన మారింది.

"ఇంతకాలం నా భార్యకి ఏనాడూ సెలవంటూ లేదు. దినం అస్తమానం పనే. రిటైర్ అయ్యాక వేరే ఉద్యోగం చెయ్యాలనుకునేవాడిని. ఇప్పుడా అభిప్రాయం మారింది. ఇంట్లోనే వుండి నా భార్యకి తోడుగా వుంటాను. ఈ వయసులో నేను సంపాదించే మరికొన్ని వేలరూపాయలకంటే నా ఆసరా అవసరం దానికి, ఏనాడైనా అది బద్ధకిస్తే నాకొచ్చిన కూరా పచ్చడీ చేసి దానికి అన్నం పెడతాను. నాకీ వంటనేర్పింది నువ్వే కదా" అన్నాడు.

"పిన్నిగారు అదృష్టవంతురాలు ప్రసాదరావ్" అంది వంట సరస్వతి చెమర్చిన కళ్ళతో నవ్వేస్తూ.

(కామెడీ కథల పోటీలో మొదటి బహుమతి పొందిన కథ) స్వాతి వారపత్రిక, 22 అక్టోబర్ 2004)

# ఓదార్పు

**–స్వాతి శ్రీపాద**

**దా**దాపు ఇరవై రోజులైంది ఆ వార్త తెలిసి. వెంటనే వెళ్ళి పలకరించి వద్దామనుకుంది సౌదామిని. కాని ఒక్క క్షణం ఆలోచించుకున్నాక వెంటనే వెళ్ళేకంటే ఓ నాలుగు రోజులాగి వెళ్ళడం ఉత్తమం.

బంధువులు నలుగురూ ఎవరిదారిన వారు వెళ్ళిపోయాక ఒక్కళ్ళూ ఉన్నప్పుడే ఓదార్పు అవసరం ఎక్కువ అనిపించింది. అందుకే ఓపిక పట్టి ఆగిపోయింది.

పనుల జాబితా సరిచూసుకున్నాక ఈ సాయంత్రం కుదిరింది సుజాతను చూసి వచ్చేందుకు.

ఉదయం లేస్తూనే మరెవరినైనా తోడు తీసుకు వెళ్దామా అనుకుంది. కాని ఓదార్పు అనేది సమూహంగా వెడితే నామకహా వెళ్ళినట్టుంటుందని మరెవరినైనా అడిగే మాట వదిలేసి సాయంత్రం నాలుగింటికి వెళ్ళాలని నిశ్చయించుకుని వట్టి చేతులతో వెళ్ళడం ఏమిటి ఏదైనా పట్టుకు వెళ్దామని నిశ్చయించి ఏం పట్టుకు వెళ్ళాలా అన్న ఆలోచనలో పడిపోయింది

వెతగ్గా వెతగ్గా గీతాంజలి కనిపించింది. దాన్ని ఒక చిన్న గిఫ్ట్‌బాగ్‌లో వేసుకుని, ఎందుకైనా మంచిదని ఒకసారి ఫోన్ చేస్తే ఉత్తమం మళ్ళీ అంత దూరం వెళ్ళాక ఇంట్లో లేకపోయినా, ఎవరైనా విజిట్‌కి వచ్చినా ఇబ్బందని ఫోన్ చేసింది.

సుజాత ఫోన్ ఎత్తింది.

"హలో"

స్వరం వింటూనే గుర్తు పట్టి, మరోమాటలకు అవకాశం ఇవ్వకుండానే

"అమ్మా, సుజాతా... ఇంట్లోనే ఉంటావుగా... ఓ గంటలో వస్తాను" సూటిగా చెప్పింది సౌదామిని.

"రండి...." అప్పటికే దుఃఖం గొంతులోకి తొంగిచూస్తోంది.

"సరే మరి" వెంటనే ఫోన్ స్విచ్ ఆఫ్ చేసింది.

ఆటో దొరికి సుజాత అపార్ట్‌మెంట్ వెళ్ళేసరికి నాలుగున్నరైంది.

"ఇంట్లో ఎవరైనా ఉంటే పదినిమిషాల్లో వెళ్ళిపోవాలి" అనుకుంటూ కాలింగ్ బెల్ నొక్కింది సౌదామిని.

నిమిషం తరువాత డోర్ ఓపెనైంది. సుజాతే తలుపు తీసింది. మనిషి కాస్త చిక్కి, నాజూగ్గా తయారైంది. ఇదివరలో కాస్త బొద్దుగా లావుగా అనిపించేది.

"రండి, కూర్చోండి మేడమ్" తలుపు వేస్తూ సోఫా చూపింది. కట్టుబొట్టు పెద్ద తేడా లేదు. ఇదివరలో లాగానే మాచింగ్ చెవిరింగులు, బొట్టు...

ఎలా ఆరంభించాలో అర్థం కాలేదు సౌదామినికి...

అయినా తప్పదు.

"ఈ మాట తెలిసి చాలా బాధ పడ్డాను సుజాతా... వద్దామనుకున్నాను వెంటనే గాని చుట్టాలూ బంధువులూ ఉంటారేమో... వెళ్ళాక వస్తే సావధానంగా మాట్లాడ వచ్చని... అందరూ వెళ్ళిపోయారా?"

"వెళ్ళారు, అమ్మాయి అబ్బాయి రెండు రోజుల క్రితం వెళ్ళారు.... "అప్పటికే సుజాతగొంతు దుఃఖంతో పూడుకుపోయింది.

"ఎలా జరిగింది?"

"ఆరేళ్ళక్రితమే రెండు సార్లు హార్ట్ ఎటాక్ వచ్చింది. అప్పుడే ఓపెన్ హార్ట్ సర్జరీ జరిగింది. బాగానే ఉన్నారనుకున్నాను. ఇలా హఠాత్తుగా మాసివ్ హార్ట్ ఫెయిల్యూర్...."

సుజాత వెక్కి వెక్కి ఏడవటం మొదలెట్టింది.

సౌదామిని ఆమెను ఓదార్చే ప్రయత్న మేమీ చెయ్యలేదు.

ఆమె దారిన ఆమెను ఏడవనిచ్చింది. "ఊరుకో"మని కూడా అనలేదు.

పది నిమిషాల తరువాత తనను తానే అదుపులోకి తెచ్చుకుని "ఒక్కనిమిషం" అంటూ లోనికి వెళ్ళింది.

మొహం కడుక్కుని ట్రేలో కాఫీ బిస్కెట్స్ తెచ్చేసరికి సౌదామిని టీ పాయ్ మీదున్న వారపత్రిక తిరగేస్తుంది.

వచ్చి ఆవిడ ఎదురుగా కూర్చుంటూ

"తీసుకోండి" అంటూ కాఫీ మగ్ అందించింది.

సౌధామినికీ సుజాతకూ హెల్ప్‌లైన్ ఆర్గనైజేషన్‌లో పరిచయం. సౌధామిని అందరికీ పెద్ద దిక్కు. ఆవిడే ఆ హెల్ప్ లైన్ ఆరంభించినది. చాలా మంది వాలంటరీగా హెల్ప్‌లైన్‌కు సాయపడుతుంటారు. సౌదామినికి అందరితో ప్రేమగా ఆత్మీయంగా ఉండటం అలవాటు.

నుదుటన కాసంత కుంకుమ బొట్టూ పెదవులపై చెరగని చిరునవ్వు. మాటల్లో హాస్యంతో అందరికీ ఇట్టే దగ్గరైపోతుంది సౌధామిని.

పదహారేళ్ల అమ్మాయితోనైనా ఎనభై సంవత్సరాల అమ్మమ్మతో నైనా అంతే ఆత్మీయంగా మాట్లాడగల దావిడ.

"చూడు సుజాతా.... మానవ జీవితమన్నాక ఇలాంటి ఆటుపోట్లు తప్పవు. నీకు తెలిసే ఉంటుంది.

మా ఆయన కాలం చేసి పదేళ్ళు దాటిపోయింది."

"అవునట... విన్నాను"

"మరోమాటా వినే ఉంటావు... మాకు పిల్లలు కలగలేదు..."

తలూపింది సుజాత.

అవును అందరూ ఆశ్చర్యపడుతూంటారు. ఆవిడ అంత నిబ్బరంగా ఎలా వుండగలరా అని డెబ్బైకి చేరువలో ఉన్న ఆవిడ ఒక్కరే వుంటారు. ఉన్న ఇల్లు అద్దెకిచ్చి చిన్న అపార్ట్‌మెంటు రెంట్‌కి తీసుకున్నారు ఆ అద్దె డబ్బుతోనే బ్రతుకు తెరువు.

హెల్ప్‌లైన్ నిధుల్లోంచి ఒక్క రూపాయి కూడా స్వంత ఖర్చుకు వాడరు.

"ఒక్కమాట అడగనా... ఏం అనుకోవుగా?"

"అబ్బే, అనుకునేదేం వుంది? అడగండి" సుజాత కాస్త మామూలు స్థితికి వస్తోంది.

పుట్టినప్పటి నుండీ అనుబంధాలు పెంచుకుంటాము, ముందు అమ్మతో, తరువాత తండ్రి, ఆపైన తోబుట్టువులు... ఏ ఒక్కరి వియోగాన్నీ తట్టుకోలేం...

అయినా జీవితమంతా చేరువై దూరమవటానికే సరిపోతుంది. ఇరవై ఐదు సంవత్సరాలపాటు పుట్టీ పెరిగిన ఇంటిని మమకారాలను వదిలి అత్తింటికి వలసపోతాము. అక్కడ కొత్తగా నాటుకుందుకు శతవిధాల సతమతమైపోతాము. అయినా పుట్టింటికి పరుగెత్తిపోల్లేదు. ఎవరూ ఆపలేరు. కాని మనమే వెళ్లం... అవునా...."

"అవునండి అదే కద చిత్రం. మధ్యలో వచ్చిన మనిషి జీవితమంతా ఆక్రమించి..." మళ్ళీ సుజాత కళ్ళల్లో నీళ్ళు.

"సుజాతా ఇలా మాటిమాటికీ కళ్ళ నీళ్ళు పెట్టుకుంటే ఎలా... మీ పెళ్ళై పాతికేళ్ళపై మాటే గద..."

"అవును ఇరవై ఏడేళ్ళైంది. బాబుకే ఇరవై ఆరు... కూతురికి ఇరవై నాలుగు...."

"ఒక్కమాట చెప్పు, సిన్సియర్‌గా ఈ ఇరవై ఏడేళ్లలో ఎన్ని రోజులు సంతోషంగా వున్నావు? కన్నీళ్ళు లేకుండా... నీ గురించి నా కేదో తెలుసనికాదు... మామూలుగా కష్టాలూ కన్నీళ్ళూ ఉండని ఇళ్లుండవని అందులోనూ మన మధ్య తరగతి ఇళ్లలో రాజీ పడటాలూ కన్నీళ్ళూ మామూలేగా...."

సుజాత పెదవి కదపలేదు... కాని మనసు ఒక్కసారి గతంలోకి తొంగిచూసింది....

అవును మొదట్లో.... మొదట్లో... ఎవరితో మాట్లాడినా అనుమానమే... ఎవరితోలేచిపోతుందో నన్న భయమే...

చివరకు చిన్నప్పటి మిత్రులతో మాట్లాడినా మొహం మాడ్చుకునే వాడు. అప్పట్లో అందరూ అనేవారు తియ్యటి గొంతనీ పెదవి కదిపితే మధురిమలు ఒలుకుతాయనీ... అలాంటిది ఎవరైనా మెచ్చుకుంటే చాలు... వారం పది రోజుల పాటు ఎడమొహం పెడమొహం... చివరకు పాట సంగతే మర్చిపోయింది.

పిల్లలు పుట్టి ఇంటి ధ్యాసలో పడిపోయాక... అసలు తన స్వరం గురించే మర్చిపోయింది. అతను మాత్రం అతని సరదాలు వేటినీ వదులుకోలేదు. ఆఫీస్ కొలీగ్స్‌తో పేకాట, అప్పుడప్పుడూ మందుపార్టీలు, తనూ పిల్లలూ పనికిరాకపోయినా తనవారి పట్ల తన బాధ్యతలు....

గట్టిగా మాట్లాడితే దెబ్బలాటలు... మొహం మాడ్చుకోడం... మాట్లాడకుండా సాధించడం... అప్పటికీ చాలకపోతే

“నే నున్నన్నాళ్ళూ ఇలాగే సాధించు... పోయాక....” అంటూ మరో మాటకు అవకాశం ఇవ్వకపోవడం... మనసు నలిగి ఎంత చిత్రవధ అనుభవించిందో...

తలుచుకుంటూపోతే... నిజానికి సుఖ సముదాయాలకన్న కలతలు, కన్నీళ్ళూ కష్టాలే ఎక్కువగా అనుభవించివుంటుంది....

చాలా సార్లే అనుకుంది... “మరెవరైనా అయితే నెత్తిన పెట్టుకుని చూసుకునే వారని....”

నిజమే... ఒక్కమాట... కనీసం ఒక్కమాటైనా తను చెప్పినది పరిగణించలేదు... ఒక్కసారైనా... చివరకు ఆరోగ్య విషయమూ అంతే! ఎంత చెప్పినా పట్టించుకుంటేగా.... హార్ట్ ఎటాక్ వచ్చినా ఓపెన్ హార్ట్ సర్జరీ జరిగినా తన అలవాట్లు తనవి ఎంత చెప్పినా వినిపించుకుంటేగా...

“సుజాతా... ఏంటి ఆలోచనల్లో మునిగిపోయావా?”

“అబ్బే లేదండీ....”

“పిల్లలతో వెళ్ళిపోతావా?”

“లేదండీ... వెళ్ళదలుచుకోలేదు... మీకు తెలుసుగా... ఎక్కడికి వెళ్ళినా వాళ్ళిల్లుకాని నాది కాదుగా... మళ్ళీ ఎక్కడో రాజీపడేంత ఓపిక లేదు.....”

“నేను నా గురించి చెప్పుకుందుకు సిగ్గుపడను సుజాతా.. మన సగటు ఆడవాళ్ళు... ముఖ్యంగా తెలుగు నేలపై పుట్టి సాంప్రదాయం ఒంటపట్టించుకున్న వాళ్ళు ఎలా బతుకుతారో నేనూ అలాగే బతికాను... మా ఆయన గొప్ప సంఘసంస్కర్త... పుస్తకాలు రాసాడు... ఉపన్యాసాలనిచ్చాడు. ఇరవైనాలుగ్గంటలూ ఇంటినిండా జనాలే... కాని నా పాత్ర ఏమిటో తెలుసా... వచ్చిన వారికి వండి వార్చడం... టీ కాఫీలు సరఫరా చెయ్యడం... అలాగని నలుగురిలోకి రావడమూ ఆయనకు నచ్చేది కాదు.....”

“నిజంగా...”

“అవును... మా జీవితాలు ఇలాగే గడిచాయి..... చాలా మంది ఈ తరం వాళ్ళకు తెలియదీ సంగతి... చివరకు ఆయనగారు కాలం చేశాక మాత్రమే నాకు బయటకు వచ్చే స్వతంత్ర్యం దక్కింది... సరే నా సంగతి వదిలెయ్యి. ఒక్క ప్రశ్నకు జవాబు చెప్పు... నువ్వెందుకు ఏడుస్తున్నావు? ఎంత ఒకరికొకరుగా బ్రతికిన

వారైనా... ఇద్దరూ ఒక్కసారి పోరుగా... నీ జీవితం నువ్వు బతకాలిగా... ఎందుకు ఏడుస్తున్నావు... నీ మీద నీకున్న జాలా... అతని మీద ప్రేమా... మరొకటి మరొకటేదైనా... ఆలోచించు" ఆలోచనలో పడింది సుజాత.

అవును... కారణం... కారణం...

మనసు తడబడింది... ఒకటి మూఢ నమ్మకాలనెలవైన ఈ లోకంలో భర్తలేని జీవితం... ముఖ్యంగా ఏదో తప్పుచేసినట్టు వెలి వేసినట్టు చూడటం... ఆ దుర్భరత ఊహించలేకనా....

కాదనే ధైర్యం లేదు... మరొకటి... పితృసామ్య సమాజంలో స్త్రీలు ఎంతగా పాటుపడ్డా అధికారం మాత్రం మగవారిదేగా... అందుకనా....

లేక...

"సుజాతా... నీ పిల్లలతో నువ్వు కలిసి ఉండదలుచుకోకపోతే... ఈ కాలంలో తోడు వెతుక్కోడం పెద్ద కష్టంకాదు... అలా ఇష్టం లేదూ నీ జీవితం కనీసం ఇప్పుడైనా నీ కోసం నీ ఇష్టం వచ్చినట్టు గడుపు... బ్రతికే నాలుగురోజులైనా నీవిగా సంతోషంగా బతకవచ్చుగా...."

మొదటి సారిగా సుజాతకు ఆ ఆలోచన ఇదివరకే తనకెందుకు రాలేదో అర్థం కాలేదు.

"నేను నీకు సలహా ఇవ్వటానికి రాలేదు. నన్నే చూడు లేని వాటికి బాధ పడను. నాకు నచ్చిన రీతిలో నలుగురికీ ఉపయోగపడేలా...."

ఆలోచనలో పడింది సుజాత.

"అన్నట్టు మరిచేపోయాను, నీ కంఠం చాలా మృదువుగా తియ్యగా వుంటుంది. ఇదిగో ఈ రవీంద్ర గీతాలు ఒక సారి చూడు. పాడు కుందుకు బాగుంటాయి..... "అంటూ పుస్తకం సుజాత చేతుల్లో పెట్టి "మరి వస్తానిక... ఒక్కటే కోరిక అమ్మడూ పెదవులమీద చిరునవ్వు మాయనీయకు కన్నీళ్ళను బహిర్గతం చెయ్యకు... అది సెల్ఫ్ పిటీ ఆత్మాహత్యా సదృశ్యం..... ఎప్పుడు రావాలనిపిస్తే అప్పుడు నా వద్దకు వచ్చెయ్యి" అంటూ తలుపుకేసి సాగింది సౌదామిని.

# ఆ రెండు రోజులు

-వాలి హిరణ్మయీదేవి

**మె**ల్లగా తలుపు తోసుకొని వచ్చాడు గౌతమ్.

సోఫా మీద గెంతుతున్న వైశాలి, సందీప్‌లు కంగారుపడుతూ దిగి, తమ రూమ్‌లోకి పరుగెత్తాలా లేక అక్కడే వుండిపోవాలో తెలీక తికమకపడసాగారు. వారి వంకే పరిశీలనగా చూసాడు గౌతమ్.

ఇద్దరి ముఖాల్లో రక్తం ఇంకిపోయినట్లుగా తెల్లగా పాలిపోయి, వణుకుతూ కన్పించగానే, మొదటిసారిగా ఏ మూలో కలుక్కుమంది. తదేకంగా టీవీ చూస్తున్నా. పిల్లలొక్కసారిగా సోఫా దిగడాన్ని గమనించిన అనురాధ తలెత్తి చూసింది. అంతే ఆమె పరిస్థితీ పిల్లలకు మల్లే అయిపోయింది. తత్తరపడుతూ లేచి భర్త చేతిలో నుండి బ్రీఫ్‌కేసు అందుకుంటూ "ఒంట్లో బాలేదా? తొందరగా వచ్చారు" అనడిగిందెలాగో గొంతు పెగుల్చుకొని. ఆమె వంక నిముషం పాటు తదేకంగా చూశాడు. ఆమె చూపుల్లో భయం తప్ప ప్రేమన్నది కన్పించలేదు.

"ఏంటండీ – ఏమైంది? అలా చూస్తున్నారు?" అడిగింది ఆశ్చర్యంగా.

"ఏం లేదు – అమ్మా నాన్నా పడుకొన్నారా?" అడిగారు బూట్లు విప్పుకొంటూ.

మరోసారి ఆశ్చర్యపోయింది. "ఆ – ఇంతకు ముందే వాళ్ల రూమ్‌లోకి వెళ్లారు.

"అలాగా, వైశూ, సందీప్ ఇలా రండి?" అన్నాడు మామూలుగా.

వాళ్లు బెదురుగా తనని సమీపించడం గమనించి, మనసులో నిట్టూర్చాడు.

"ఏం? రేపు స్కూల్లేదా? ఇంకా పడుకోకుండా ఆడుతున్నారు?"

"ఇప్పుడు మాకు హాలీడేస్ కదా" అన్నారిద్దరు ఒకేసారి.

'ఓ' నిజమే కదూ, తన స్టాఫ్‌లో కొందరు హాలిడేస్‌లో పిల్లల్ని ఊళ్లకి తీసుకెళ్లడానికి సెలవడిగితే, తను కాదన్నాడు అనుకొంటూ ఈ హాలిడేస్‌లో మనమూ ఎటైనా వెడదామా" అనడిగాడు చిరునవ్వుతో.

"అంటే – మీరు మమ్మల్ని తీసుకెడతారా లేక ఎవర్తోనైనా పంపిస్తారా?"

ఆ అడగటంలో అతను తమతో రాకుండా వుంటే బాగున్నట్టుగా ఉండటం చూసి మనసులో చివుక్కుమందతనికి.

"అహ – మనమంతా కలిసే – నేను రావడం మీ కిష్టమేనా?" అడిగాడు గౌతం. వాళ్ళు తల్లివంక చూసారు. 'అందరం కలిసే' అన్నట్లు సైగ చేసిందామె.

"సరే ఎక్కడికెడదాం? ఆలోచించుకొని చెప్పండి" అంటూ తన పేరెంట్స్ ఉన్న గదిలోకి దారి తీసాడు. అది చూసి విస్తుపోయింది అనురాధ.

"ఏంటీ వేళ – ఏదో తేడాగా ఉంది" అనుకొంటూ ఏదో మాట్లాడుకొంటున్న జగపతిరావు, జానకమ్మలు అడుగుల సవ్వడికి కళ్లెత్తి చూసారు. కొడుకునక్కడ చూడ్డంతోటే వారిద్దరి కళ్లలో ఆశ్చర్యం, ఆనక ఆనందం పోటీ పడుతూ వచ్చాయ్. అది చూసిన గౌతంలో ఏదో అపరాధ భావం చోటు చేసుకొంది. మౌనంగా తల్లి మంచం అంచున కూర్చున్నాడు.

"ఏంట్రా – కన్నా ఏమైందిరా" ఆతృతగా అతడి వెన్ను నిమురుతూ అడిగింది జానకమ్మ. ఆ ప్రేమపూరిత స్పర్శకి, లాలనకి అతడి కళ్లలో చివ్వన నీళ్లొచ్చేశాయ్.

'తన కళ్లలో వీటికి స్థానముందా' అనుకొంటూ గబుక్కున తుడిచేసుకొంటూ

'అబ్బే ఏంలేదమ్మా. భోం చేసారా? మందులవీ వేసుకొన్నారా?" అడిగాడెలాగో గొంతు పెగుల్చుకొని.

"ఆ తిన్నాం గానీ ఏంటి? అర్ధరాత్రికి గానీ రాని వాడివి ఇంత తొందరగా వచ్చావ్. రేపేదన్నా పార్టీగానీ ఇస్తున్నావా?" అడిగిందామె కాస్త ఇబ్బందిగా. అతడు తన బిజినెస్ డెవలప్ చేసుకొనేందుకంటూ కంట్రాక్టర్స్‌కి, ముఖ్యులకీ పార్టీలిచ్చినప్పుడల్లా, వారి మకాం ఔట్‌హౌస్‌లోకి మారడం, ఆ రెండు మూడ్రోజులూ మనవల్ని చూసే అవకాశం వుండక పోవటం జరుగుతూ వుంటుంది. ఆ సంగతి చూచాయగా ఒక ట్రెండుసార్లు చెప్పినా అతడు చెవిన పెట్టలేదు.

తల్లి గొంతులోని ఇబ్బందితో ఆ సంగతి గుర్తొచ్చి మనస్సు చిన్నబోయింది.

"అబ్బే – ఆ సెలవుల్లో ఎటైనా వెడదాం – మీకేదైనా చూడాలని వుంటే చెప్పండి – ఆ విధంగా ప్లాన్ చేద్దామని" అన్నాడు గౌతం.

'ఆ' అంటూ ఆశ్చర్యంగా తనవంకే చూస్తోన్న వారి చూపులతో చూపు కలపలేక 'గుడ్‌నైట్ – పొద్దుట ఏ విషయమూ చెప్పండం'టూ ఆ రూమ్‌లో నుంచి వచ్చేసాడు.

అతడు ఫ్రెషయి రాగానే "వడ్డించమంటారా" అనడిగింది అనురాధ.

"ఊ" అంటూ కూర్చొని "నువ్వు తిన్నావా?" అనడిగాడు.

తను విన్నది నిజమా అన్నట్లు అపనమ్మకంగా చూసి, అంతలోనే తేరుకొంటూ 'ఇవాళ గురువారం కదా– ఉపవాసం" అంది.

"ఎందుకూ" భృకుటి ముడేస్తు అన్నాడు.

"మీకు యాక్సిడెంటైనప్పుడు త్వరగా కోలుకొంటే నా జీవితాంతం అలా ఉపవాసముంటానని మొక్కుకొన్నాను" అందామె మామూలుగా.

తనకి యాక్సిడెంటై నాల్గేళ్లవుతోంది – అప్పట్నుండీ భార్య తనకోసం ప్రతీ గురువారం ఉపవాసాలుంటూంటే తను మాత్రం హాయిగా తింటూ తిరుగుతున్నాడా? తనామెను ఇంట్లోని ఓ ఫర్నిచర్‌లాగే ట్రీట్ చేస్తున్నా, ఆమెకి తన పట్ల ఎంత ప్రేమనుకొంటూ లేచి ఆమెను అక్కున చేర్చుకొన్నాడు. ఆ స్పర్శకి ఆమె కళ్లు చెలమలే అయ్యాయి.

అనురాధ వంటింటి పని ముగించుకొని వెళ్ళేసరికి, ఎప్పట్లా బిజినెస్ మాగజైన్స్ ఫైళ్లేగాక, ఆమె కోసమే ఎదురు చూస్తూ కన్పించాడు. అది చూడగానే ఆమెకు సిగ్గు కమ్ముకొచ్చింది. ఆమెను అపురూపంగా గుండెలకు హత్తుకొన్నాడు. ఎంతోకాలం తర్వాత, తమ కలయిక చాలా సంతృప్తిగా అన్పించిందిద్దరికీ బాగా తెల్లారేవరకూ మెలకువ రాలేదు. ఎంత మంచి బ్రాండ్ డ్రింక్ తాగినా రానంత కిక్కు – మత్తు చవిచూసిన ఫీలింగ్ కల్గింది గౌతమ్‌కి.

"రేయి గడిచిన హాయినంతా.

మనసు నెమరు వేసెరా" అంటూ ఉత్సాహంగా పాట పాడుతూ వంట చేస్తోన్న కోడలిని చూస్తే జానకమ్మకెంతో ఆనందం కల్గింది. తాతా మనవడు చెస్ ఆడ్తోంటే వెళ్ళి "ఎటు వెడదామో డిసైడ్ చేసారా'ంటూ అడిగింది. దాంతో పిల్లలిద్దరూ పోటీపడుతూ, ఒకరన్నది మరొకరు కాదనుకొంటూ వాదించుకోసాగారు. ఆమె 'హుష్' అంటూ వారిస్తున్నా, ఆ అల్లరి ఎప్పట్లా చికాకనిపించలేదు గౌతంకి. పైగా ఎంతో ముచ్చటగా అన్పించింది.' వాళ్ల ఆటపాటల్ని చూసిందెక్కడని? తనే అర్ధరాత్రో వచ్చేసరికి నిద్రలో వుంటారు. తను నిద్ర లేచేసరికి స్కూల్‌కి వెళ్లిపోతారు. – సండేలు గూడా తను బిజీనే, పార్టీ లిస్తూనో – పుచ్చుకొంటూనో గడుపుతాడు. తను రాగానే ఎవరెలాంటి శబ్దం చేసినా భరించడు. ఇంట్లోను, ఆఫీసులోనూ చండశాసనుడిగా, హిట్లర్‌గా పేరు పొందడం తప్ప పిల్లలతో అటాచ్‌మెంట్‌ని పెంచుకొన్నదెక్కడని?'

"రండి – టిఫిన్ చేద్దురుగాని" అన్న అనురాధ పిలుపులో తేరుకొని వెళ్లాడు. అల్లం ఉల్లిముక్కలు జీలకర్ర దట్టించి చేసిన ఆ పెసరట్లు రుచిని ఆస్వాదిస్తూ 'సూపర్ – చాలా బావున్నాయ్' అన్నాడు.

"అయితే ఇంకో రెండు వేయమంటారా?" పరమానందంగా అడిగింది అనురాధ.

"ఒక చిన్న పొగడ్త – మెచ్చుకోలు, ఈ ఆడాళ్లకెంత తృప్తిని కల్గిస్తాయో కదా' అని సత్యం చెవిలో చెప్పినట్లనిపించింది.

ఎప్పుడూ ఠంచన్‌గా పదింటికల్లా ఆఫీస్‌లో వుండే బాస్ పదకొండవుతున్నా

రాకపోయేసరికి స్టాఫంతా రిలాక్స్‌డ్‌గా వున్నారు. గౌతమ్ లోపలి కదుగుపెడుతూనే ఎవరెవరు పొజిషన్ల వుందీ క్రీగంట గమనిస్తూ తన ఛాంబర్‌లోకి వెళ్లిపోయాడు. బాతాఖానీ కొడ్తూ అతనికంట పడ్డ వాళ్లకి చెమటలుపట్టాయ్. ఎవరిమీదేం అరుస్తాడో – ఎవర్ని సస్పెండ్ చేస్తాడోనన్న టెన్షన్‌తో ఉలిక్కిపడుతోన్న వారి ఎదురుగా వచ్చి 'మీకో గుడ్‌న్యూస్ ఇవాల్టి నుండి మీరంతా ఆరున్నరకే వెళ్లిపోవచ్చు – ఇది మార్నింగ్ తొమ్మిదికల్లా ఠంచన్‌గా సీట్లో వుండేవారికి వర్తిస్తుంది. అలాగే లంచ్‌టైం మరో అరగంట పొడిగిస్తున్నా – ఏవన్నా పర్సనల్ పనులున్నా ఆ టైమ్‌లో చేసుకోవాలి తప్ప ఇతరత్రా పర్మిషన్స్ అడగకూడదు. ఇంకోటి పనిలో ఎఫీషియన్సీ చూపించిన వాళ్లకీ, కరెక్ట్ టైమ్‌ని మెయిన్‌టెయిన్ చేసినవాళ్లకి సర్‌ప్రైజ్ గిఫ్ట్స్ వుంటాయి.

స్టాఫంతా ముందు ఆశ్చర్యపోయి, ఆనక పెద్దపెట్టున హర్షధ్వానాలు చేశారు. అంతకు ముందు పావుగంట లంచ్‌టైమ్ – ఇంటికెళ్లడం ఏ ఎనిమిదో – తొమ్మిది గంటలకో వుండేది మరి.

"ప్రేమ అనే పునాదుల్ని మనవారి కోసం తవ్వితే వాళ్లు ఆప్యాయతా అన్న భవంతిని మనకందిస్తారు" అని సత్యం చెప్పింది. గౌతమ్ విషయంలో నిజమవసాగింది. ఇటు ఇంట్లో, అటు ఆఫీసులో ఆహ్లాదకర వాతావరణం నెలకోవడంతో అతను చాలా రిలాక్స్‌డ్‌గా, ఆనందంగా ఉంటున్నాడు. ఎప్పుడూ సీరియస్‌గా చిటపటలాడే ఆ గౌతమ్‌కి ఇప్పటి గౌతమ్‌కి వున్నతేడా... అతన్ని ఎరిగిన వారందరికీ తెలిసిపోయేంతగా వుంటోంది.

ఆ రోజూ ఎప్పట్లా నిద్ర లేచాడు. తీయటి ముద్దుతో భార్య మేల్కొల్పింది. కళ్ళు తెరవగానే పిల్లలిద్దరూ పూల బొకేలు పట్టుకొని "హాపీ బర్త్‌డే నాన్నా" అంటూ ముద్దల వర్షం కురిపించారు. తల్లి తలంటి స్నానం చేయిస్తే, తండ్రి ప్రేమక్షతలను జల్లి ఆశీర్వదించాడు.

అందరూ కలిసి గుడికి, అట్నుండి ఓ మాంచి రెస్టారెంటుకి వెళ్లారు. మధ్యలో కారు నాపి అందరికీ బట్టలు, పిల్లలకు బొమ్మలు, భార్యకు పాత సిన్మా పాటలు సీడీను కొన్నాడు. వారి కళ్లలో కన్పించే ఆనందం, మనసుకెంతో తృప్తినిచ్చిందతడికి. ఇంటికొచ్చి వారితో మారికాస్సేపు సరదాగా గడిపి, నాల్గుగంటలకు ఆఫీసుకెళ్లాడు. అక్కడ పండుగ వాతావరణాన్ని స్ఫురింపజేస్తూ బెలూన్లవి కట్టబడి ఉన్నాయ్. స్టాఫ్ బొకేలతో ఎదురై విషెస్ చెప్పారు. "నేనేమన్నా చిన్నపిల్లాడ్నా – ఏంటిదంతా" అన్నాడు ఇబ్బందిగా.

"ఏదో మా సంతోషం కొద్దీ – ఈ మూడు నెల్లుగా మీరు మాతో క్లోజ్‌గా మూవవుతున్నారు – మేం ఆఫీస్‌లో చేరి ఇన్నాళ్ళైనా. మిమ్మల్ని నవ్వుతూ చూస్తోందీ మధ్యే – మీరెప్పటికీ ఇలా నవ్వుతూ వుండాలని ఆశిస్తూ ఆ చిన్న ఫంక్షన్ ఏర్పాటుచేశాం" అంటూ కేక్ ముందుంచారు. వారి అభిమానానికి, మనసులో ఆనందం, గర్వం కూడా

కలిగాయి. "నేను చెప్పలేదూ – చిన్న చిరునవ్వు ఎంతో మాజిక్ చేస్తుందని" అంటూ సత్యం మరోసారి చెవిలో గుసగుసలాడినట్లు ఫీలయ్యాడు గౌతమ్. సత్యాన్ని కలవడానికింకా మూడు నెల్ల వ్యవధి వుంది అంటూ లెక్కేసుకున్నాడు. స్టాఫందరికీ స్నాక్స్ ఐస్క్రీం తెప్పించాడు.

"ఇప్పుడు సరదాగా ఓ గేమ్. మీరు మన బిజినెస్ గురించీ, నా గురించీ ఏమనుకొంటున్నారో – అంటే మీ విమర్శలేంటో – సూచనలేంటో నిర్మొహమాటంగా రాసివ్వాలి. సిన్సియర్గా నిజాల్ని రాసిన వారికో గిఫ్ట్ని గూడా ఇవ్వాలనుకొంటున్నా – అవి రాసిచ్చి, ఇవాళ్టికిక మీరంతా ఇళ్లకు వెళ్లిపోవచ్చు" అన్నాడు గౌతం నవ్వుతూ.

స్టాఫ్ మొదట విస్తుపోయినా, అతని చిరునవ్వు ఇచ్చిన ధైర్యంతో చకచకా రాసి, ఆ పేపర్స్ నందించారతనికి.

"ఈ రాత్రికివి చదివి, రేపు గిఫ్ట్నిస్తాను – ఆల్ ది బెస్ట్" అంటూ వారికి 'టాటా' చెప్పాడు గౌతం.

"మన బాస్లో ఈ మధ్య విచిత్రమైన మార్పు వచ్చింది గదు"

"నిజమే – ఇంతకు ముందైతే కేవలం పని రాక్షసుడిలా వుండేవాడు"

"ఏ క్షణం ఆఫీస్కి వెడతాడో – ఎప్పుడు వెడతాడో తెలిసేది కాదు. తనున్నంత సేపూ మనల్నీ వుంచి చెండుకు తినేవాడు.

"మూడు నెల్లక్రితమైతే రెండు మూ(డ్రోజుల పాటూ ఆఫీస్కి రాకుండా అందర్నీ హడలకొట్టాడు గదా"

"ఆ కొడితే కొట్టాడులే గానీ అప్పట్నుండే ఆయన మొహాన కాస్త చిర్నవ్వు చూస్తున్నాం" ఇలా రకరకాల కామెంట్స్ చేసుకొన్నారు స్టాఫ్. "అనూ ఇదుగో ఈ పేపర్లన్నీ చదువు. చదివి మొదట ఏయే విమర్శలున్నాయో, వాటినో పక్క నోట్ చెయ్. ఆ తర్వాత సూచనల్ని అభినందనలని, పొగడ్తలని, సరేనా" అన్నాడు గౌతం.

అనురాధ ఓ పక్క ఆశ్చర్యపోతూనే – ఆ పేపర్లనందుకొంటూ, ఈయన తీరు ఇంట్లోనే గాక ఆఫీసులోనూ మారినట్లుంది. అనుకొంటూ అతడు చెప్పినట్లే చేసింది. వాటినన్నింటిని పరిశీలించాడు. చిత్రంగా, విమర్శలకు కోపం తెచ్చుకోలేదు – మనసులో అంతమూర్ఖంగా వున్నానని నొచ్చుకున్నాడు తప్ప ఆ మర్నాడు మంచి సూచనలనందించిన సూపర్వైజర్కి, రిసెప్షనిస్ట్ లతకి, విమర్శించిన హెడ్క్లర్క్కి, అకౌంటెంట్కి మంచి గిఫ్ట్లనందించాడు. వాళ్ళు చేసిన సూచనల ప్రకారం అయితేనేం, స్టాఫ్ టైమ్ కల్లా ఆఫీస్ చేరడానికైతేనేం ఆ నెల నుండి వెహికల్స్ను వారిని పికప్ చేసుకొనేందుకు ఏర్పాటుచేశాడు. స్వంత ఇళ్ళు లేనివారికి, ఇన్స్టాల్ మెంట్ బేసిస్లో సొమ్ము చెల్లించేటట్లు

ఫ్లాట్స్ నందించగలనని ప్రామిస్ చేసాడు. విమర్శలలో కరెక్టనిపించిన వాటిని సరిదిద్దుకోవలసిన వాటికి ప్రాధాన్యతనిచ్చి 'టైమ్' అడిగాడు. అందరి సహాయ సహకారాలుంటే బోనస్‌శాతం పెంచుతానని వాగ్దానం చేసాడు. ఫలితంగా ఎన్నో ఏళ్ల నుండి ఎంతో శ్రమిస్తేగానీ పొందని ఫలం, లాభం కన్పించిందతని బిజినెస్‌లో, శ్రమకొద్దీ లాభం పొందుతున్న ఉద్యోగులు అతని అంచనాలను మించి వారి సహకారాన్ని అందచేయసాగారు.

ఈ రోజు అతడు నిద్రలేచే సరికి జానకమ్మ - అనురాధలు ఏవో గుసగుసలాడుకొంటూ కన్పించారు.

"ఏంటని" అనురాధనడిగితే, ఆమె అత్తగారి వైపు చూసింది. ఆమె ముసి ముసిగా నవ్వుతూ "మన వైశాలి రజస్వలయిందిరా. ఐదుగురు ముత్తయిదువలను పిలిచి, పిల్లని మూలన కూర్చోబెట్టాలి - దానికి నువ్వు ఒప్పుకొంటావో - లేదోనని కోడలు టెన్షన్ పడుతోంది." అందామె.

తన చిట్టితల్లి, పెద్దమనిషైందనుకోగానే, అతని పెదవుల మీదికి చిరునవ్వు దూసుకు వచ్చింది.

"అమ్మా - అనూ - ఏమేం చేయాలో చేయండి. తొమ్మిదో రోజో - పదే రోజో ఫంక్షనదీ చేస్తారుగా - అదీ ధూం ధాంగా చేద్దాం. అనూ అందరినీ ఆహ్వానించు. ఎవరినీ మరచిపోకు - అమ్మ ఏమేం చేస్తారో - ఏమేం కొనాలో - వచ్చినవారికి ఏం పెట్టాలో అన్నీ చెప్పు అనూకి. లిస్ట్ ఇస్తే అన్నీ పట్టుకురావడమే నా పని' అన్నాడు హుషారుగా. జానకమ్మ ఆశ్చర్యంగా అనురాధ వంక చూసింది. అనురాధ కళ్లలో అప్పుడే తన వాళ్లందర్నీ చూడబోతున్నానన్న ఆనందం గెంతులు వేయసాగింది. వారి సంభ్రమం అతడి కళ్లని దాటిపోలేదు. ఫంక్షన్‌ను చాలా అట్టహాసంగా జరిపాడు. వచ్చిన వాళ్లందరినీ నవ్వుతూ పలకరించాడు. మరదళ్ళు - బావమరిది పరిహాసాలాడితే, మొహం మాడ్చుకోకుండా రిటార్ట్‌లిచ్చాడు. తన అక్కా చెల్లెళ్లకు, దగ్గరి వాళ్లకి చీరెలు పెట్టించాడు. ఫంక్షన్‌కి వచ్చిన వారందరికీ రిటర్న్ గిఫ్ట్‌లను అందించాడు.

ఎన్నో ఏళ్ల తర్వాత ఆత్మీయులను కలుసుకొన్నందుకు తల్లిదండ్రులు మురిసారు. తన పుట్టింటి వాళ్లందరితో కలిసిన ఆనందంతో అనురాధ చెంగుచెంగున పనులన్నీ నిర్వర్తిస్తోంటే శాంత గోదారిలా వుండే 'అనూ' యేనా అనుకొన్నాడు గౌతం. మొత్తానికి తమ బంధుమిత్రుల రాక, తన వారందరి ముఖాలని 'వికసిత శతదళ పద్మాలను' గుర్తుకు చేయడం గౌతమ్‌కెంతో సంతృప్తిని కల్గించింది.

"ఏ ఇంటిలోని ఆడవాళ్లు స్వేచ్ఛగా, స్వచ్ఛంగా నవ్వగలరో ఏ ఇంటిలోని పిల్లలు పావురాళ్లలా ఆనందంగా వుండగలరో, ఆ ఇళ్ళే ఆనందానికి లోగిళ్లవుతాయి" అని సత్యం బిగ్గరగా తన చెవుల్లో అరిచి చెప్పినట్లుగా ఫీలయ్యాడు.

ఆ రాత్రి గౌతం గదిలోకి రాగానే, అతని కాళ్లకు నమస్కరించింది అనురాధ.

"ఏయ్ ఏంటిది?" అన్నాడు గౌతం

"మా వాళ్లంటేనే మండిపడే మీరు. వారినెంతో ఇదిగా ఆదరించడం – " అంటోన్న ఆమెతో "ఇన్నాళ్లూ అలా ప్రేమగా వుండలేకపోయినందుకు నేనే నీకు సారీ చెప్పాలి" అని గౌతం అంటూంటే నమ్మలేనట్లు చూసిందామె.

"ఏవండీ – మీలోని ఈ మార్పు ఓ పక్క ఆనందాన్ని మరో పక్క ఏదో భయాన్ని కలగ చేస్తోందండీ' సడెన్‌గా ఇది ఎలా?" ఇంకేం అడగాలో ఎలా అడగాలో తెలీక ఆగిపోయిందామె. దీర్ఘంగా విశ్వసించాడు గౌతం.

"మన పిల్లల ఎగ్జామ్స్ టైమ్‌లో ఓ రెండ్రోజులు ఇంటికి రాకపోతే కంగారు పడ్డావ్ గుర్తుందా?" ఆ రెండ్రోజులు నేను నా సత్యం దగ్గర వున్నాను. అప్పుడే నాకు జ్ఞానోదయమైంది" అన్నాడు మెల్లగా.

"ఎవరండీ సత్యమంటే? మీ ఫ్రెండా లేక కజినా?"

"ఏ జాబ్ లేక దాదాపు డిప్రెషన్‌లోకి వెళ్లిపోయిన వాడు. నా వెన్ను తట్టి రియల్ ఎస్టేట్ బిజినెస్ మొదలెట్టు" అంటూ ఆర్థికంగా సాయం చేసిన నా చిన్ననాటి నేస్తం. ప్రపంచమంతా నిన్ను వదిలినా నీతోనే వుండే వాడే నిజమైన స్నేహితుడు అన్నదానికి వాడు నిలువెత్తు నిదర్శనం.

"మరి అతని గురించి నాకెప్పుడు చెప్పలేదేం" అడిగిందామె.

"డబ్బు సంపాదిస్తున్న కొద్దీ పెరిగిన అహంకారం బిజినెస్ పరంగా బిజీగా మారిపోయి గూడా వాడిని ఎప్పటికప్పుడు కలవాలనుకొంటూనే ఏళ్ళు గడిపేసాను. చేసిన సాయంకి ప్రతిఫలం ఆపేక్షించని వాడూ, నన్ను కలిసే ప్రయత్నం చేయలేదు. ఓ సారి నేను మెదక్‌లో ఏవో భూములు అమ్మకానికి వున్నాయంటే వెళ్లాను. అనుకోకుండా అక్కడ సత్యం కలిసాడు. అప్పుడేమయిందంటే అంటూ గౌతం చెప్పుకుపోతూంటే – ఆ దృశ్యాలన్నీ సజీవంగా అనురాధ కళ్లముందు కదలాడసాగాయి.

"షిట్ – ఎటూ కాకుండా కారు మధ్యలో ఆగి పోయిందేంటి? ఓ పక్క చీకటి పడుతోంది. మరో పక్క వర్షం ఎలా? ఏ వెహికల్సొన్నా దొరుకుతాయో లేదో – మెకానిక్

కోసం ఎటెళ్లాలో? ఈ సెల్ ఇప్పుడే నీళ్లలో పడి పోవాలా ఖర్మకాకుంటే। ఈ అడవిలో ఈ నిర్జన ప్రదేశంలో ఇంత డబ్బుతో వుండిపోవలసి రావడం ఎంత అపాయకరం" అసహనంగా అనుకోసాగాడు గౌతమ్. ఇంతలో దూరం నుండి ముసుగు వేసుకుని వస్తున్న ఓ మనిషి కన్పించేసరికి వెన్నులోంచి భయం పుట్టుకొచ్చిందతనికి.

"ఏంది దొరా – బండి పాడైందా?" అనడిగాడతను.

"ఏమైతే నీకెందుకు?" బింకంగా అన్నాడు గౌతం. 'మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలని' విశ్వసించి అందరితోనూ అంటీ ముట్టనట్లుండే స్వభావం అతనికి. ఏదో లాభాపేక్ష లేనిదే ఎవరూ ఎవరికీ ఏమీ చెయ్యరని అతని విశ్వాసం.

"బండి తొయ్యాల్నా" అడిగాడా అపరిచితుడు.

"తన నుండి ఏదన్నా ఆశిస్తున్నాడేమో, లేక అదను చిక్కితే పీక నొక్కి తన వంటి మీది గోల్డ్, డబ్బూ లాక్కోవాలని చూస్తున్నాడో" అనుకొంటూ మౌనం వహించాడు.

"ఏందయ్యా – ఏం మాట్లాడకున్నవ్. సరె తియ్ సీకట్ల ఏం గూసుంటవ్‌గని ఈ బ్యాటరీ లైట్ నీతాన వుంచు" అంటూ తన బ్యాటరీ లైట్‌ని అతడికిచ్చి తూలుతూ వెళ్లిపోయాడు. తెల్లబోయాడు గౌతం. కారుని వదిలి నడుస్తూ వెళ్లడమా? లేక ఎవరైనా వస్తారని ఎదురు చూడటమా' అని మీమాంస పడుతూంటే, దూరంగా స్కూటర్ మీద ఎవరో రావడం కన్పించి ప్రాణం లేచొచ్చినట్లయిందతనికి స్కూటర్‌ని ఆపి "ఎవరండి – ఎటెళ్ళాలి మీరు" అనడిగాడా వ్యక్తి. ఆ గొంతు పరిచితమైన దానిలా అన్పించి బ్యాటరీలైట్ ఆన్ చేసి ఆ వెలుగులో అతడిని చూసాడు.

"అరె సత్తిపండు – నువ్వా , నేను గౌతంని" అన్నాడు ఆనందంగా.

"గౌతం! ఏంట్రా? నువ్వే! ఎవరో పెద్దాయన అనుకొన్నా – ఏంటిలా మారావ్. సరేగానీ ఎక్కడకని బయల్దేరావ్" అడిగాడు సత్యం.

"అబ్బ మనం కలుసుకొని ఎన్నేళ్లయిపోయిందిరా" అన్నాడు గౌతం.

"చాలాకాలం అయింది గానీ వర్షం ఇంకా పెరిగేలా వుంది. మా ఇల్లు ఇక్కడికే దగ్గరే పద వెడదాం. వర్షం తగ్గాక వెడుదూగానీలే. మా బంధువుకి వంట్లో బాలేదంటే చూసి వెడుతున్నాను. దార్లో ఒకతను నీ గురించి చెప్పాడు. 'పాపం చాలా భయపడ్తున్నాడు. నేనేమడిగినా సెప్త లేద్దొరా నువ్వే ఏదన్నా సాయం చెయ్' అనంటే ఇటు వచ్చాను' అన్నాడు.

"అతను నీకేమైనా తెలిసిన మనిషా" అడిగాడు గౌతం.

"అహ – కాదే" అన్నాడు సత్యం.

"మరి నాకు సాయం చేయమని నీకెందుకు చెప్పాడు?"

"ఓ మనిషి కష్టంలో వుంటే ఆదుకోడానికి తెల్సిన వాడో - ఫ్రెండో అయి వుండాలేంటి? మా ఇంటికి రా- నాల్రోజులుండి వెదుదువుగానీ" అన్నాడాప్యాయంగా.

ఆ అపరిచితుడి గురించి తప్పుగా ఆలోచించినందుకు సిగ్గు పడ్డాడు. ఇదే పరిస్థితిలో ఎవరైనా వుంటే తను సత్యంలా ఆహ్వానించేవాడా? అని మనసులో అనుకొన్నాడు గౌతం. మౌనంగా అతడి స్కూటర్ ఎక్కి కూర్చున్నాడు. కాస్త ఇబ్బంది పడుతు.

"ఏం చేస్తున్నావురా" అడిగాడు సత్యం.

"రియల్ ఎస్టేట్ బిజినెస్" గర్వంగా చెప్పాడు.

తనేంటో - తన అంతస్తుంటో చెప్పక చెప్పినట్లే', 'మరి నువ్వో' అడిగాడు.

"స్కూల్ హెడ్మాస్టర్ని" నవ్వుతూ చెప్పాడు సత్యం.

'హు - బతకలేక బడిపంతులు' మనసులో హేళనగా అనుకొన్నాడు.

'వీడిల్లు ఎలా ఉంటుందో - ఎలా గడపాలో' అనుకొంటూ మనసులోనే నిట్టూర్చాడు. ఓ అరగంట తర్వాత ఓ పెంకుటింటి ముందు బండి ఆపాడు సత్యం.

"రా, రా ఇదే మా ఇల్లు - 'లక్ష్మీ - తలుపు తియ్' అంటూ తలుపు కొట్టాడు. తలుపు తెరిచి "అయ్యో బాగా తడిసిపోయారే - దార్లో ఎక్కడన్నా ఆగక పోయారా" అంటూనే వెనకున్న వ్యక్తిని చూస్తూ "ఈ రాత్రి వేళలో గూడా మీకు బాగానే దొరుకుతారే" అని నవ్వుతూ రెండు టవల్స్ని అందించిందామె.

ఇంతలో పిల్లలు నవ్వుతూ పరుగెత్తుకొచ్చారు "నాన్నా - నాన్నా ఇంత లేట్ అయిందేం? కొంచెం ముందొస్తే నువ్వా నీ పడవల్ని మాతో పోటీకి పంపేవాడివి" అంటూన్న వాళ్ల నాత్మీయంగా హత్తుకుంటూ.

'ఇదుగో - మా పిల్లలు - ఒరేయ్ ఈయన గౌతం మామయ్య - ఈ వారం రోజులూ ఇంచక్కా మామయ్యతో ఆడుకోండి" అంటూనే లోపలి కెళ్లి "అమ్మా అన్నం తిన్నావా? నాన్న తిన్నాడా? ఇంకా అలకలో ఉన్నాడా" అంటూ వాళ్లతో ఓ అరగంట మాట్లాడి వచ్చాడు. ఈలోగా ఇంటినంతా పరిశీలనగా చూసాడు గౌతం. రెండు రూములు. చిన్న వంట గదీ ఉన్న ఇల్లది. తమ ఔట్‌హౌస్ గానీ స్టోర్‌రూమ్ గానీ ఈ ఇంటికన్నా పెద్దగా వుంటాయ్ - ఇంత ఇరుకిళ్లలో ఎలా వుంటారో అనుకుంటూ చుట్టూ చూసాడు. ఓ పక్క టీవీ, రెండు కుర్చీలు, ఓ మంచం బీరువా వున్నాయంతే ఆ గదిలో లోపలి గదిలో తల్లిదండ్రులుంటారేమో "లక్ష్మీ తొందరగా భోజనానికేర్పాట్లు చెయ్యి" అని గౌతం వైపు తిరిగి "బాత్‌రూంలోకి కెళ్లి కాళ్ళు చేతులు కడుక్కోరా - ఇదుగో ఈ లుంగీ తీసుకో" అంటూ టవల్, లుంగీ అందించాడు. గత్యంతరం లేక వాటిని అందుకొని ఫ్రెష్షయి

వచ్చాడు. అతడు వచ్చేలోగానే, లక్ష్మి భోజనం వడ్డించిందిద్దరికి. వేడి వేడి అన్నం, టమాటా పప్పు.ఆవకాయ పచ్చడి. అంతే కానీ ఆకలితో వున్నాడేమో చాలా రుచిగా అన్పించింది. గౌతమ్‌కి తన అంతస్థు తెలిసి, తనకి సరిగ్గా మర్యాదలు చేయలేక పోతున్నానని సత్యం బాధపడుతున్నాడేమోనని చూసాడు గానీ సత్యంలో ఎలాంటి ఫీలింగ్‌లేదు. పైగా చిన్ననాటి స్నేహితుడ్ని కలుసుకొన్నానన్న ఆనందంలో మాట్లాడుతూనే వున్నాడు. ఫ్రెండ్స్ గురించి, చిన్ననాటి సంగతుల గురంచీ, మధ్య మధ్యలో కొడుకులడుగుతోన్న డౌట్స్‌ని తీరుస్తూ "ఏంటి రాత్రంతా ఆయన తల తినేస్తారా ఏంటీ? పడుకోనీయండి" అంటూ లోపల్నుంచి లక్ష్మి గసరగానే కాస్సేపు మౌనం వహించి, మళ్ళీ మాటలు మొదలెట్టాడు సత్యం. కానీ గౌతం నిద్రలోకి జారుకోవడం చూసి, తనూ నిద్రకుపక్రమించాడు.

తెల్లవారింది. గౌతం లేచేసరికి లక్ష్మికాలికి ఝుండుబాం రాస్తూ కన్పించాడు. సత్యం. అతడిని చూస్తునే "చూసావా మీ చెల్లెలి నిర్వాకం, తొందరొద్దే అంటున్నా వినకుండా నీకు టిఫిన్ రెడీ చేసే ప్రయత్నంలో కాలు మడతపడి పడిపోయింది. అంటూ లక్ష్మి వైపు తిరిగా "లే లేచి కాలు గట్టిగా ఝాడించు. అదే పోతుంది నొప్పి" అంటూ తను ఎదురుగా వున్నా ఏ భేషజం లేకుండా భార్యకు పరిచర్యలు చేయడం, గౌతంకి అబ్బురంగా తోచింది. ఇటు తనతో మాట్లాడుతూనే భార్య క్కావలసినవందించడం, పిల్లల్ని తయారు చెయ్యడం, తల్లితండ్రులతో మాట్లాడుతుండడం చేస్తోన్న సత్యాన్ని చూస్తోంటే ముచ్చటగా అన్పించింది. 'ఇల్లు ఇరుకైతేనేం మనసులు విశాలం' అనుకొన్నాడు.

"ఒరే సత్యం – ఇలా రారా. తలకి నూనె రాస్తా"నంటూ అతని తల్లి పసి పిల్లాణ్ణి ట్రీట్ చేసినట్లే చూడటం గౌతంని ఆలోచనలో పడేసాయి. తనకూ తల్లితండ్రులూ, భార్యా పిల్లలూ వున్నారు. తనకు, వాళ్లతో ఇంత ఇంటిమసీ ఎందుకు లేకుండా పోయింది? మొదటిసారిగా తనని తాను ప్రశ్నించుకున్నాడు.

ఇరుగు పొరుగైతేనేం, స్కూల్లోని వారైతేనేరా, ఊరి పెద్దలైతేనేం ఎవరో ఒకరు రావడం, సత్యం సలహాలు తీసుకోవటం. వారి సమస్యల్ని చెప్పుకోవటం గమనించాడు. వేరే వ్యాపకం లేనందున ప్రతీ చిన్న విషయాన్ని అబ్జర్వ్ చేయసాగాడు గౌతం. సత్యం తోచిన సలహానివ్వటం కలిగినంతలో సాయం చేయటం గమనించాడు. చిన్నప్పుడు చందమామలో చదువుకొన్న 'పరోపకారి పాపన్నలా' సత్యం కన్పించసాగాడు. ఇంతలో ఓ టీచర్ వచ్చి 'మాస్టారూ మా నాన్నగారికి మళ్ళీ జబ్బు తిరగబెట్టిందట. ఊరెళ్ళాలి. సెలవు కావాలి' అంటుంటే 'దానికింత ప్రాధేయ పడాలా? మీ క్లాస్ నేనే చూసుకొంటాలెండి. అక్కడేమన్నా అవసరం పడ్తుందో ఏంటో ఈ వెయ్యీ మీ దగ్గరుంచండి" అంటూ అతనికాడబ్బు అందిస్తూ వుంటే, సిగ్గుతో తలొంచుకొన్నాడు

గౌతం. తనని లీవ్ అడగడానికి తన స్టాఫ్ గడగడ వణుకుతారు. తనంతగా విరుచుకు పడతాడాయో. కానీ సత్యమో, తన వారికోసం, తన ఊరివాళ్ల కోసం "నేను సైతం విశ్వవృష్టికి అశ్రువొక్కటి ధారపోసాను." అన్నట్లు, ఓ గృహస్తుగా తన బాధ్యతలను పరిపూర్ణంగా నిర్వర్తిస్తూనే, వారి కోసం పాటు పడుతున్నాడు. అందుకే వాళ్లతడిని తమ మనిషిగా గౌరవిస్తున్నారు. ప్రేమిస్తున్నారు.

"నీ కారుని గేరేజ్‌కి తీసుకెళ్ళమని నాకు తెల్సిన మెకానిక్‌కి చెప్పారా, నిశ్చింతంగా ఉండు" అన్నాడు సత్యం.

"ఏవండీ... అన్నని అప్పుడే పంపకండి. రేపు వడి బియ్యం పోస్తున్నారు. మనకి. అన్న తప్పకుండా వుండాలి" అంటూ వచ్చింది లక్ష్మి.

"వడి బియ్యమేంటి?" నిజంగానే తెలీక అడిగాడు గౌతం.

"ఆడపిల్లకు పెళ్లిలో, ఆ తర్వాత ఐదేళ్ళకోసారి పుట్టింటి వాళ్ళు. అల్లుడుకి కూతురికి వారి పిల్లలకు బట్టలు పెట్టి పసుపు కల్పిన బియ్యంలో ఐదు ఎండు ఖర్జూరాలు కలిపి అమ్మాయి వడినిండా పోస్తారు. కూతురు తన వడిలోంచి ఓ ఐదు పిడికెళ్ల బియ్యం మళ్లీ వారికిస్తుంది. వాళ్లు ఆ బియ్యంలో మరిన్ని కల్పుకొని దగ్గరి వాళ్లను పిల్చుకొని భోజనాలు పెట్టుకొంటారు. కూతురూ అలా చేయాలి" అన్నాడు సత్యం.

"ఇదేదో ఖర్చు పెంచే ఆచారం తప్ప మరోటి కాదు" తేలిగ్గా అన్నాడు గౌతం.

"ఖర్చనుకొంటే ఎలారా? మన బిజీ జీవితాల్లో ఎవరిళ్లకు రాకపోకలు, ఓ నెలా పదిహేనురోజుల పాటు పూర్వంలా ఉండడం మృగ్యమయి పోతోంది. ఒకరింటికి మరొకరి రాకపోకలీ వంకన జరుగుతాయి. బంధుత్వాలు నిలబడతాయి. కొత్త బంధుత్వాలేర్పడతాయి. మనిషి సంఘ జీవిరా బాబూ. ఒకరి అవసరం మరొకరికి వుంటూనే ఉంటుంది. ఫంక్షన్స్‌ని ఏర్పాటు చేసేది ఇందుకే! వచ్చే వాళ్ళు అంత శ్రమకోర్చి, ఛార్జీలు పెట్టుకొని గిఫ్ట్‌లు కొనిరావడం ఎందుకు? ఆ ఖర్చుతో వాళ్ళు వాళ్ళింట్లో తినలేకనా? "ఏనుగు తిన్నట్లుగా" అన్నట్లు స్వార్థం చూసు కొంటూ ఎవరి బతుకువాళ్లు బతికితే చాలా? ఎదుటి వాడికింత సాయం చేస్తే సంపదలు తరిగిపోవుగా, పైగా వారి చల్లదీవెనల వల్ల మరింత ఎదుగుతారు" అన్నాడు సత్యం అతడినే చూస్తూ తన ఆలోచనలంత వరకు ఎంత కల్మషంగా వున్నాయోనంటూ ఆత్మ విమర్శ చేసుకోసాగాడు గౌతం. మొదటిసారిగా తనలోకి తను చూసుకొంటుంటే, సత్యం మళ్లీ అన్నాడు. "మనల్ని నమ్ముకొని మనవెంట వచ్చేసిన అర్థాంగికి, పుట్టింటి మీద మమకారం పోదుకదా. ఇలాంటి అకేషన్స్ ద్వారా తన వాళ్లను కల్సుకొనేట్లు చేస్తే ఆ చిన్న ఆనందాలని, మదినిండా నింపుకొని, మనకి జీవితాంతం సంతోషాన్ని పంచే అల్పసంతోషిరా భార్య. బతికున్న నాల్గునాళ్లు నల్గురితో నవ్వుతూ కలిసి వుండటం కన్నా ఈ జన్మకింకేం కావాలిరా?

మనతో మోసుకుపోయేది ఏమీ లేదు కదా – పోయినా, నల్గురి మనసుల్లో మనం నిలిచివుండాలంటే నల్గురితో సఖ్యంగా వుండాలిరా. ఔను నువ్వేంట్రా ఏంటో మధనపడ్తున్నట్టున్నావ్? అడిగాడు సత్యం.

'అనుకొన్నది సాధించే ప్రయత్నంలో నేనెంత యంత్రంలా మారి పోయానో నిన్ను చూసి, మీతో గడిపిన ఈ రెండ్రోజుల్లో తెల్సుకున్నాను. మానవ సంబంధాలు హార్థిక సంబంధాలనీ తెల్సుకొన్నాను. నేను నీలా వుండటానికీ ఆరు నెల్లు ప్రయత్నిస్తా – ఆరు నెలల తర్వాత కల్సుకొని రిజల్ట్ ఎలా వుందో చెబుతా' అన్నాడు. ఓ నిర్ణయానికి వస్తూ గౌతం 'ఓ కే డన్' నవ్వుతూ అన్నాడు సత్యం.

"ఈ ఆర్నెలల్లో విజయం సాధించానని సత్యంకి నేను గర్వంగా చెప్పుకోవచ్చా" చిన్నపిల్లాడిలా అడుగుతోన్న గౌతం చేయి నొక్కుతూ 'దర్జాగా చెప్పండి అంత కన్నా ముందు నేనతనికి నా కృతజ్ఞతలు చెప్పుకోవాలి. ఎప్పుడు వెడదాం మరి" హుషారుగా అంది అనురాధ.

# నవ్విన నాపచేను

– రమాదేవి జాస్తి

"రామా...ఆ౨....ఆ౨...." బోసుబాబు ఎలుగెత్త రాగం అందుకున్నాడో లేదు, వొక్క గంతులో హాల్లోకొచ్చిపడింది శైలూ చేతిలో గంటతో సహా. వస్తూనే అడిగింది ఆదుర్దాగా, "ఏమైందండీ? రాముడు కూడా ఉలిక్కిపడేలా అట్లా పిలుస్తున్నారూ?" అని.

"నేనేం పిలవడంలా, పాడుకొంటున్నా, దాన్ని అట్లాగే మొదలు పెట్టాలి." అన్చెప్పి, "అందరి బంధువయా, భద్రాచల రామయ్యా..." రసోభంగానికి వెరవకుండా బోసుబాబు తర్వాతి వాక్యాం "కంటిన్యూ" చేసేడు.

"నిజమే కాని, ఒక్క 'రా'మీరు మీరీ అన్ని వొత్తులు పెడితే పాపం. రాముడికి నెప్పెట్టేస్తుందేమో నండీ?" శైలు బాధపడింది.

"ఇదిగో. ఆ 'నెప్పి' సంగతి నేనూ ఆయనా చూసుకుంటాం కాని, నువ్వెళ్ళి నీ పని చేసుకో. ఈ పూట ఎట్లాగైనా నేనీ పాట నేర్చుకు తీరాలి. ఏం చెప్పీ నువ్వు నన్నాపలేవు" బోసుబాబు పరమ శాంతంగానే అయినా మహా పదునుగా చెప్పేడు.

"అంటే అల్లం పచ్చడి చేసీ, ఉల్లి పెసరట్టు వేసీ కూడా మిమ్మల్ని అడ్డుకోలేను. సరే లెండి. మీ ఇష్టం మీది. అయినా మన మొదటి రాత్రే మిమ్మల్ని అడ్డుకోలేదు. ఇంక ఇప్పుడెందుకట్లాంటి వెర్రిమొర్రి పన్లు చేస్తాను చెప్పండి?" వంటగదిలోకి వెళ్తున్న శైలు నడుమ్మీద వయ్యారంగా ఊగుతోన్న వాలుజడని చూస్తే "భద్రాచలం రామయ్యా" దగ్గరే ఆగిపోయేడు. తర్వాతి వాక్యం గుర్తొస్తే కదా? 'పెసరట్టు' నోటికి, 'మొదటిరాత్రి ఎపిసోడు' మైండుని తాళం వేసాయి. వద్దంటున్నా మనసు రివ్వున వెనక్కి ఎగిరి ' ఆ రాత్రి'లో సెటిలైపోయింది.

'అనుభవశాలి' అయిన ఓ మిత్రుడు చెప్పేడు "పెళ్ళయిన కొత్తల్లోనే భార్యలు మన మాట వినేది. అది మనపాలిట 'స్వర్ణయుగ'మన్నమాట. దానికి పరిమితి మాత్రం మన 'అదృష్టం' మీద ఆధారపడి ఉంటుంది. అంచేత నీ అచ్చటా ముచ్చటా ఆ 'టైం'లోనే తీర్చేసుకోవాలి వీలయినంతవరకూ" అని. అది మనసులో పెట్టుకుని కార్యాచరణకు సిద్ధపడిపోయేడు బోసుబాబు. చిన్నప్పుడే తన మనసులో మొక్కై మొలిచి, తనతోపాటే

ఎదిగిన ఒకే ఒక్క 'కోరిక'ని శైలూతో చెప్పుకున్నాడు. అదేవిటంటే ఎప్పటికైనా సరే 'ఒక విద్య'లో కాకలు తీరిన కళాకారుడు కావాలని, అందుకు ఆమె 'సహకారం' కావాలని.

'ఓస్, ఇంతేకదా? 'ఏ' విషయంలోనైనా సరే మీకు నా పూర్తి సహాయ సహకారాలుంటాయండీ" అంది శైలు 'ఏ' అన్న చోట కాసింత తీయగా సన్నాయి నొక్కు నొక్కుతూ. హామీ ఇస్తోన్నట్లుగా తన మెత్తటి చేయి అతని చేతిలో వేసింది కూడా వొత్తుకోమని, అతనదేమీ పట్టించుకోకుండా ఆ చేతినలాగే గట్టిగా పట్టేస్కుని

"అయితే నా పాట విను" అని ఆర్డరో, అభ్యర్థనో తెలీకుండా అడిగేడు.

"మా అబ్బాయికి పాడలవాట్లు ఏమీ లేవు. చాలా 'బుద్ధిమతుడు' అని చెప్పేరండీ మీ వాళ్ళు మా నాన్నతో. కానీ ఈ 'పాడే' అలవాటు గురించి చెప్పనే లేదండీ?!" ఇంతింత కళ్ళేసుకుని బెదిరిపోతూ చూసింది బోసుబాబు ముఖంలోకి శైలు.

"పాడేవాళ్ళంతా బుద్ధిమంతులు కారా?" గట్టిగా కొప్పళ్ళేకపోయాడు బోసుబాబు. మొదటికే మోసం వొస్తే కష్టమని. ఇంక ఎక్కువ చర్చకి ఛాన్సివ్వకుండా హాయిగా, స్వేచ్ఛగా గొంతెత్తి ఆకాశంలోకి వినపడేలా తనకెంతో ఇష్టమైన 'జేసుదాసు' పాటందుకున్నాడు. గాలివానలో, వాన నీటిలో పడవ ప్రయాణమ్' – ఠక్కున అప్పుడే గుర్తుకొచ్చింది మరి ఉత్సాహంగా 'లో' అన్న అక్షరాన్ని అరమైలు దీర్ఘం తీసి, వాక్యంలో చివరి అక్షరం 'ణమ్' దగ్గరకొచ్చేటప్పటికి బయట కలకలం తలుపు మీద 'దబదబ' చప్పుళ్ళు విన్పించేయి. డాబా మీద ఉన్నది ఒక్కటే గది కాబట్టి ధైర్యంగా కిటికీల తలుపులు తెరచి ఉంచేరు. ఆ కిటికీల్లోంచికొన్ని ముఖాలు కన్పించేయి. శైలు ఒక్క ఉదుటున అతని చేతుల్లోంచి తన చేతిని లాగేసుకుని 'చెంగు'మని మంచం మీంచి కిందకి దూకేసి గది తలుపులు తెరిచేసింది.

బిలబిలా లోపలికి చొరబడిన అందరూ ముక్తకంఠంతో ఒకే ప్రశ్న వేసేరు. "అబ్బాయినేం చేసేవే? అట్లా గోలెత్తి పోతున్నాడు?" అని, శైలూ నిస్సహాయంగా చూసింది బోసుబాబువైపు. అతడికి జాలేసి తనే జవాబు చెప్పేడు అందరికీ. 'అబ్బే తనేం చెయ్యలేదండీ. నేనే పాటపాడుతున్నాను. అంతే"! అని.

పిచ్చిమొహాలేసుకుని అందరూ ఎంతో విచిత్రంగా చూసేరతన్ని "ఎప్పుడు చేయాల్సిన పనులు అప్పుడు చేయాలి" అని కొందరు, 'అదేంపాట, బొత్తిగా అనుభవం లేదల్లే ఉంది" అని మరికొందరు. "మొదటిరాత్రి అట్లానే అన్పిస్తుందిలే పాపం, కొందరిట్లా పైకి చెప్పుకుంటారు" అని మరికొందరు గొణుక్కుంటూ చేతులూ మూతులూ తిప్పుకుంటూ రకరకాల విన్యాసాలతో కింది కెళ్ళిపోయేరు. "అక్కా నన్ను గిచ్చినట్లు, బావగార్నీ గిచ్చి ఏడిపించకే పాపం!" అంటూ బావమరిది బోసు బాబువైపు జాలిగా చూస్తూ శైలూ 'పంజా'కి దొరక్కుండా తప్పించుకెళ్ళేడు.

“అతగాడి సరదాలు వేరేవల్లే ఉంది. ఇంక నువ్వే ‘సరసం’ మొదలెట్టకపోతే ఈ రాత్రంతా ఇట్లానే శ్రోతలు కోరిన పాటల కార్యక్రమంతో చల్లారి, తెల్లారిపోతుంది మనవరాలా!” అంటూ బోసుబాబుక్కూడా వినిపించేంత రహస్యంగా చెప్పి వెళ్లింది శైలూ బామ్మ – ఆఖర్న.

శైలూ తలుపులు మూసి వచ్చాక, ‘సారీ’ అన్నట్టు మొహం పెట్టి నసుగుతూ చెప్పేడు బోసుబాబు, “నాకు గొప్ప గాయకుడినన్పించుకోవాలని కోరిక చిన్నప్పటున్నండీ ఒక్కళ్ళూ నాతో సహకరించడం లేదు. అయినా సరే, పాడే ఏ అవకాశాన్నీ నాకు వొదులుకోవాలన్పించదు”.

బోసుబాబు గొంతులోని విషాదంతో కూడిన నిజాయితీకి కరిగిపోయింది శైలు. “అట్లా నిరుత్సాహ పడకండీ మీరు. గట్టిగా కృషి చేయాల్సిందండీ. కృషి ఉంటే మనుషులు ఋషులవుతారంటారు” ఆత్మీయంగా, అనునయంగా చెప్పింది.

“అయ్యో! ఎందుకు చెయ్యలేదూ? నా ప్రయత్నలోపమేమీ లేదసలు” అంటున్న బోసుబాబుకి తన ‘కృషి’ కళ్ళముందు మెదిలింది. కొత్త పెళ్ళికూతురన్న మొహమాటం కొద్దీ శైలూ ‘శ్రోత’ అయింది.

బోసుబాబుకి పసితనం నుండీ ‘పాట’లంటే పడి చచ్చేంత ఇష్టం. వినడమే కాదు. పాడటం కూడా. మొదటిసారి పాటల ‘పోటీ’లో పాడేడు. ఆరో తరగతిలో ఉన్నప్పుడు. అది మొదటిసారే అయినా ఏమీ జంకూ గొంకూ లేకుండా “అమ్మా! చూడాలి, నిన్నూ నాన్నని చూడాలీ, నాన్నకు ముద్దూ ఇవ్వాలి, నీ వొడిలో నిద్దుర పోవాలీ.. అమ్మా!... ఓ అమ్మా...!” అని ఓ నాలుగు ముక్కలు పాడేడో లేదో వాళ్ళ మేష్టారు చప్పట్లు కొట్టి మరీ ఆపేశారు.

“ఏరా! మీ అమ్మా, నాన్నలు ఊళ్ళో లేరా?” విసుగ్గా అడిగేరు. వాళ్ళు ఆ ముందురోజే బోసుబాబు వాళ్ళ మామయ్యగారి ఊరికెళ్ళారు. అదే మాట చెప్పాడు. ‘పాట’నీ మధ్యలో ఆపినందుకు మండిపడాలన్పించింది.

“వెధవా, వొక్క రోజుకే ఇట్లా స్టేజీ ఎక్కి మరీ శోకాలు పెట్టాలా? నీ రాగాలు ఈ సరికి వాళ్ళకి వినిపించి, బయల్దేరి పోయి ఉంటార్లే. ఇంక ఇంటికెళ్ళి వాళ్ళొచ్చాక ఆ ముద్దులు, నిద్దర్లు అన్నీ పూర్తిచేసుకునిరా. నీకో వారం సెలవిస్తున్నా. మళ్ళెప్పుడైనా ఆ పాట పాడి చావొద్దు నువ్వు. ఈ స్కూల్లో నీ చదువై నువ్వు బయటికి పోయే వరకూ నేను పాటల పోటీలు రద్దు చేస్తున్నా!” వాళ్ళ మేష్టారు లేచి బెత్తమూపుకుంటూ విసవిసా వెళ్ళిపోయారు.

అది బోసుబాబుకి తగిన మొదటి ‘గాయం’. దానిపై ‘కారం’ చల్లినట్లు తోటి పిల్లలందరూ ‘అగ్రహారం బడితెలాగున్నావ్. ఇంకా అమ్మ వొళ్ళో పడుకోవడాలి, నాన్నకు

ముద్దులివ్వడాలు ఏవిట్రా?" అని ఎగతాళి చేసేవాళ్ళు. అది 'పాట'న్న గ్రహింపు లేకుండా. పైగా అదేదో తనే రాసాడన్నట్లుగా.

అప్పటికి కోపం వచ్చినా ఆ తర్వాత బోసుబాబులో 'నవ్విన నాపచేనే పండాలి' అన్న పట్టుదల హెచ్చింది. ఎక్కడైనా మంచి 'గురువు'గారి దగ్గర సంగీతం నేర్చుకోవాలని దృఢంగా నిశ్చయించుకుని ఇంట్లో పోరుపెట్టి మరీ అనుకున్నది సాధించాడు. 'శంకరాభరణం – శంకరశాస్త్రి' లాంటి గురువుగారికి పళ్ళు, పూలు సమర్పించుకుని, భక్తిగా 'పాద నమస్కారం' చేసి మరీ 'పాఠం' నేర్చుకునేందుకు కూర్చున్నాడు.

'ఏదైనా నీకొచ్చిన పాటొకటి పాడి విన్పించరా బోసుబాబు" వాత్సల్యంగా అడిగేరు గురువుగారు, శిష్యుడి గాత్రపరీక్షకి పూనుకొంటూ.

"ఏడుకొండలవాడా, ఎక్కడున్నావయ్యా – ఎన్నిమెట్లెక్కినా కానరావేమయ్యా..." బోసుబాబు ఉత్సాహంగా గుడి మైకులోంచి రోజూ వినే పాటని అందుకున్నాడు అదే స్థాయిలో.

గురువుగారు తుళ్ళిపడి వొక్కంగలో వరండా లోంచి బయటికెళ్ళి నిలబడ్డారు ఆకాశంలోకి చూస్తూ. ఆయన రైళ్లల్లో పాటలు పాడుతూ అడుక్కునే గుడ్డి బిచ్చగాళ్ళు గుర్తుకొచ్చేరు.

"ఎవర్రా అదీ? ఎటూ కానివేళ వాకిట్లోకి వొచ్చేరు మధూకరానికి?" మందలింపుగా అంటూ లోపల్నుండి గురుపత్నిగారు ఓ పళ్ళెంలో ఇంతన్నం ఆవకాయబద్ద వేసి మరీ తీసుకొచ్చేరు. ఎవరూ కనపడక, అటూ ఇటూ చూసి 'అర్థమై'నట్లు తలపంకించి లోపలికెళ్ళిపోయేరు.

మళ్ళీ గొంతు సవరించుకుంటున్న శిష్యుడిని ఆపి చెప్పారు గురువుగారు. "ఇంకెక్కడ కనపడతాడురా నాయనా?! నీ పాట మొదలవగానే ఆయనెప్పుడో ఏడు కొండలమీంచి ఎగిరెళ్ళి, ఆకాశనికడ్డం పడి మరీ అదృశ్యమైపోయేడు. లోక క్షేమం కోసమన్నా నువ్వింక పాట జోలికి పోవద్దురా తండ్రీ. నువ్వు మళ్ళీ గొంతెత్తితే నా మీదొట్టే" చేతులు జోడించేరు దీనంగా చిన్నవాడనైనా చూడకుండా.

ఏదో ఆ బాధలో అమాయకంగా అర్థించేరే కాని, ఆయనేమన్నా చుట్టమా, పక్కమా బోసుబాబు లెక్కచేయడానికి? అంచేత 'ఒట్టు' తీసి గట్టున పెట్టి మరింత 'పట్టు' బిగించేడు లక్ష్యసాధన కోసం. ' ఆరంభింపరు నీచ మనావులు' అన్న పద్యం తెలీక పోయినా సాక్షాత్తు 'శంకరశాస్త్రి'గారంతటి వారే మొదటి రోజే చేతులెత్తేసిన తర్వాత మరింకెవరు సాహసించలేదు బోసుబాబుకి 'గురుత్వం' వహించడానికి. అంత మాత్రాన బోసుబాబేం నిరాశ చెందలేదు. 'బంతి' నేలకు అదిమిన కొద్దీ పైకి లేచినట్లు అతడి కోరిక మరింత విజృంభించింది. మర్గాంతరం ఆలోచించేడు తీవ్రంగా అతడి 'జేసుదాసు' ఆరాధ్య గాయకడు

ఆయన 'కంచుగొంతు' వింటే చాలు 'మంచల్లే' కరిగిపోతాడు. అంచేత 'జేసుదాసు'కి తప్పలేదు పటం రూపంలో 'ద్రోణా'వతారమెత్తక, పోటీగా 'అర్జును'డెవరూ లేకపోవడంతో ఎదురులేని గురుదక్షిణ బాధకూడా లేని 'ఏకలవ్యు'డయ్యేడు. 'స్వయంకృషి'తోనే గానకళని పుక్కిట పట్టి. ఇంటా బయటా అందరికీ 'చెవిలో ముల్ల'య్యాడు.

కుటుంబ సభ్యులందరూ ఏకతాటిపై నిలిచినా కూడా బోసుబాబు గాన ప్రవాహానికి అడ్డుకట్ట వేయలేక పోయేరు. ఇంటివాళ్ళ వలవల. ఇరుగుపొరుగు విలవిల చూడలేక బోసుబాబు వాళ్ళ నాన్న ఓ 'సౌండ్ ప్రూఫ్' గదిని కట్టించి ఇచ్చేడు. ఆ సత్కార్యానికి ఊరి వారంతా 'చందా'లివ్వాలని ఉత్సాహపడ్డారు. కానీ ఆయన ఒప్పుకోలేదు. ఆ తర్వాత బోసుబాబు గాన సాధన, సంగీతారాధన ఆ గదిలో నిరాటంకంగా సాగుతూ వొచ్చి 'ఇంతై ఇంతింతై వటుడింతై...'' అన్నట్లు 'ఎంతో' అయిపోయేడు. అసలు 'ఆల్బమ్' రిజీల్ చేద్దామనుకున్నాడు కానీ, అంత 'జీవహింస'కి వొడిగడితే కనుక తను 'హిమాలయాల'కి వెళ్ళిపోతానని వాళ్ళ నాన్న సీరియస్ వార్నింగ్ ఇవ్వడంతో ఆ ప్రయత్నం విరమించేడు. అయినా మనసు పీకింది. వెళ్తే వెళ్ళాడు. అక్కడికి రజనీకాంత్ వచ్చినప్పుడు ఆయన్ని కలిసి తన పాటని ఆయన సినిమాలో పెట్టమని ఆడగమని చెప్దామనుకున్నాడు. కాని, ఆస్తిలో తన భారీ వాటాని అమ్మేసి, ఊరందరికీ పప్పుల్లా పంచేసి మరీ వెళ్తాడేమోనని వెనకంజ వేశాడు.

"శిశుర్వేత్తి, పశుర్వేత్తి, వేత్తిగాన రసం ఫణిః" అన్నారు పెద్దలు. మీకసలు రసహృదయమే లేదు, బాధపడే వాడు బోసుబాబు ఎక్కడో విన్నది గుర్తు తెచ్చుకుని.

"అవును, ఆ మూడు ప్రాణులకీ నోరులేదు కాబట్టి చచ్చినట్లు వింటాయి. మాకేం కర్మ 'కుంకుడు రసం'లాంటి నీ గాన రసం ఆస్వాదించేందుకు? ఎదుకైనా మంచిది. వాటి జోలికి పోబోకు. పిల్లలు జడుసుకుంటారు. పశువులు కొమ్ముల్తో కుమ్మి పడేస్తాయి. ఇంక పాములైతే పగపట్టగలవు కూడాను" ఇంటి వాళ్ళందరిదీ ఇదేమాట. వాళ్ళల్లో ఎన్ని అభిప్రాయ భేదాలున్నా, బోసుబాబు 'గానం' విసయంలో మాత్రం అందరూ వొక్కమాటమీదుంటారు ఐకమత్యంగా. ఇంత వ్యతిరేకంలోంచి మనిషిని పైకి రమ్మంటే ఎట్లా వొస్తాడు?

బోసు బాబు గాఢంగా నిట్టూర్చేడు. వింటున్న శైలూకి నిద్దరొస్తోంది. 'ఫ్లాష్‌బ్యాక్' ఆగిపోగానే బామ్మ సలహా గుర్తుకొచ్చింది. 'మీరేం బాధపడకండీ. ఇక మీదట మీకు అన్నిటా నేను తోడుంటాను. చక్కగా మీరు 'పైకి రండి' అంటూ బోసుబాబుకేసి ఓరగా చూస్తూ రెండు చేతులు పైకెత్తి ఒళ్ళు విరుచుకుంది.

అంతే! బోసుబాబు మరి కళ్ళు తిప్పుకోలేక పోయేడు. ఈ సారి గుండె 'తాళం' తప్పింది. తప్పటమొక్కటే కాదు, తను ఇంకా వేరే పనులు కూడా చెయాల్సిన

సమయమొచ్చిందని గ్రహింపు వచ్చిన తర్వాత ఒక్క క్షణం కూడా వృధా చేయలేదు. తెల్లవారుతుండగా అలసి, నిద్రలోకి జారుతూ "ఛా, సందర్భ శుద్ధి లేకపోవడంతో సగం రాత్రి వేస్ట్ చేసుకున్నా" అని పశ్చాత్తాప పడ్డాడు బోసుబాబు.

ఆ తర్వాత సహజంగానే 'పాట, పడక' ఆ రెండే అతని జీవితమయ్యేయి. అతను పాడేందుకు నోరు తెరవగానే, శైలూ అతనికెట్ల 'మూత' వెయ్యాలో గ్రహించేసింది. కాబట్టి, ఆటోమేటిగ్గా రెండవది ప్రముఖ స్థానమాక్రమించి, మొదటిది వెనక్కి నెట్టబడింది. ఏ మబ్బులైనా పలచబడతాయేమో కాని కుమ్ముకుంది 'కారు వలపు మబ్బులు' కాబట్టి ఇక ఇది ఇంతేలే అని అందరూ హాయిగా ఊపిరి పీల్చుకుంటున్న సమయంలో వచ్చింది శైలూ బామ్మ మనవరాలి కొత్త సంసారం చూసేందుకు. ఆ క్షణంలో ఎవరికి తెలుసూ, ఆ వృద్ధ స్త్రీ తన కొద్ది తెలివినీ స్నేహితురాలి మీద ఉపయోగించడం వల్ల బోసుబాబు జీవితం ఊహాతీతమైన మలపు తిరగబోతున్నదని?!

"ఏమిటీ సాధన ఆగిపోయింది? మన ఫస్ట్‌నైట్‌కి షిఫ్టయ్యారా?" శైలూ ప్రశ్నకి ఈ లోకంలోకి వచ్చేడు బోసుబాబు.

"నీకు మొదటిరాత్రి అనగానే నా పాట గురించి తప్ప మరింకేమీ స్వీట్ మెమరీస్ లేనే లేవా శైలూ?" జాలిగా అడిగేడు బోసుబాబు.

"ఆఁ ఎందుకు లేవే? మా బామ్మ ఇప్పటికీ అడుగుతూనే ఉంటుందిగా. ఆ రాత్రి ఏం చేసావే అబ్బాయిననీ, అంతలా గొల్లుమన్నాడూ?" అని అంతకన్నా ఏం మెమరీస్ కావాలి? అయినా ఈ మాటలన్నీ ఎందుకుగాని, ఈ పెసరట్లు తినేసి హాయిగా మీ గదిలోకెళ్ళి ప్రాక్టీస్ చేసుకోండి లేకపోతే 'భద్రాచలం'దాకా వినపడగలదు మీ రాగం" శైలు ప్లేటు చేతికిచ్చింది బోసుబాబుకి దాన్తో సమస్తమూ మర్చిపోయేడు.

కాస్సేపటి తర్వాత హాల్లోకి వచ్చిన బామ్మ అడిగింది. 'బాబూ నీ పాటల సిడి ఒకటి ఇస్తావూ. ఆ మధ్య అవ్వేవో భజన్లు, కీర్తన్లూ కలిపి 'ఈమికుసో' ఏదో చేసావటగా? అదివ్వు, ఇంకా మీ నాన్న చేతిలో పడి బద్దలవ్వ కుండా ఉంటే" అని. బోసుబాబు తన చెవుల్ని తానే నమ్మలేకపోయేడు. అబ్బ! బామ్మ ఎంత ముద్దొచ్చిందనీ, సాహసించి పెట్టుకొందుకి ఆవిడ తన బామ్మ కాదు కదా? అంచేత నిగ్రహించుకుని క్షణంలో ఆ 'సిడి' తెచ్చి ఆవిడ చేతిలో పెట్టేడు మనసు మార్చుకోక ముందే. ఆవిడ దాన్ని పదిలింగా పట్టుకుని జాగ్రత్తగా దాచి పెడుతున్న అపురూప దృశ్యాన్ని చూసి శైలూని మొదటిసారి కౌగిలించుకున్నప్పటి కన్నా ఎక్కువగా పులకించి పోయేడు.

బోసుబాబు బయటకెళ్ళిపోయేక శైలూ అడిగింది ఆశ్చర్యంగా ' ఆ, సిడి నీకెందుకే బామ్మా?" అని.

"మధ్యాహ్నం నా స్నేహితురాలు వర్ధని లేదూ, తనొస్తానంది ఇక్కడికి. తను కూడా ఇక్కడ మనవడింటి కొచ్చిందిలే. నేనా మధ్య ఊర్లో వాళ్ళింటికెళ్ళినప్పుడు తోలు మందం కజ్జికాయలో రెండు, ఇనుప తీగల్లాంటి గుప్పెడు కారప్పూస పలుకులు, కషాయంలాంటి కాఫీ నా ముఖాన కొట్టి, వాళ్ళ అమెరికా మనవరాలు వైభవమంతా నాకు చూపించాలని కట్టల కట్టల ఫోటోలు బడాయిగా నా ముందు పడేసి చూస్తావా, ఛస్తావా అని కూచుంది. ఏదో పదీ పాతికా అయితే చూడగలం గానీ, అట్లా వందలూ వేలూ చూడాలంటే ఎవరి తరం? కళ్ళు, గూళ్ళూ కూడా పడపోవూ?! ఫొటోల్నిండా సుమో వస్తాదుల్లో దాన్ని పిల్లతో, పిల్లులూ, కుక్కలూ, మొక్కలూ, రోడ్లు, బిల్డింగులూ, మన్నూ మశానమూను. దాని మనుమరాలు కూడా ఎలుగ్గొడ్డుకెక్కువా, ఏనుక్కి తక్కువా అన్నట్లుంది. ఆ ఆకారానికి తోడు బట్టల వికారమొకటి. వొళ్ళంతా బయటేస్తూ, ఆ మొగుడెట్లా భరిస్తున్నాడో వెర్రివేషాల్ని? సరే, వాళ్ళెట్లా పోతే నాకేం కాని, చిన్నప్పటి నుండి దాన్ని ఎన్ని విషయాల్లోనో క్షమించా పోనీ పాపమని. ఈ సారి మాత్రం నేను పగతీర్చుకోలసిందే" బామ్మ ముఖం ఫాక్షన్ సిన్మాలో బాలకృష్ణ ముఖం కన్నా కసిగా, గొంతు 'బొమ్మాళీ నిన్నొదల' అన్నంత కన్నా భయంకరంగా మారినయ్.

"ఏం చెయ్యబోతున్నావ్ బామ్మా?" శైలూ రవ్వంత ఆందోళన పడింది.

బామ్మ చెప్పలేదు – టీవీ సీరియల్స్‌లో ఆడవిలన్లా అప్పటికి 'వికవికా' నవ్వి ఆ మధ్యాహ్నం ఆదేవిఁటో చేసి చూపించింది.

'పులిగుహ'లోకి 'పిల్లికూన'లా అమాయకంగా అడుగుపెట్టిన వర్ధనమ్మని బోలెడంత ప్రేమతో ఆహ్వానించింది. అమెరికా మనవరాలి గురించి కుశల ప్రశ్నలూ వేసి అక్కర్లేని సమాచారమంతా కనుక్కుంది. కాస్సేపు ఆ కబుర్లూ ఈ కబుర్లూ చెప్పుకున్నాక బలి ఇచ్చే ముందు 'మేక'ని మేపినట్లు చక్కగా తినేందుకు తీయన మెత్తని కోవా బిళ్ళలు, కమ్మని కారంబూంది, రంగు, రుచి, వాసన కలిగిన చిక్కని కాఫీ ఇచ్చింది. అవన్నీ ఆరగించాక, మెల్లగా తన 'ఆగ్నేయాస్త్రా'న్ని బయటకు తీసింది. "వర్ధనీ నీకు శంకరాభరణం సినిమా చూసినప్పటి నుండీ సంగీతంటే మహా ఇష్టం కదా? అప్పట్లో ఆ సినిమా రోజూ చూసేదానివి అదున్నన్నాళ్ళు మీ ఆయన్ని 'శంకరశాస్త్రి' అని పేరు మార్చుకుని, సంగీతం నేర్చుకోమని. చంపుకు తిన్నావు కూడాను. నువ్వు మంజుభార్గవిలా డాన్స్ నేర్చుకుంటేనే తను సంగీతం నేర్చుకుంటానని పేచీపెట్టి తెలివిగా తప్పించుకున్నాడు కదా?" అంటూ గతాన్ని గుర్తు చేసింది.

ముంచుకొస్తున్న ముప్పును గుర్తించలేనిదై వర్ధనమ్మ ముసిముసిగా నవ్వింది. 'నీకు బాగానే గుర్తుంది సుబ్బూ అప్పట్లో ఏదో చిన్నతనం' అంటూ కాని ప్రమాదాలకి చిన్నతనం, పెద్దతనం ఏముంటాయి గనుక? "బాగుందేవ్, ఇద్దరం చిన్నప్పట్నుండి ప్రాణ స్నేహితులం.

ఒకళ్ళ ఇష్టాలు వొకళ్ళం ఎట్లా మర్చిపోగలం?! అందుకే నీకోసం మాంచి భజన్లక్యాసెట్టొకటి సంపాయించా. మా మనవరాలి మొగుడు పాడిందేలే. మహాకొత్తగా ఉంటుందనుకో నువ్వది విన్నాక ఇక మరేవీ వినలేవులే" బామ్మనిజమే చెప్పింది. అఖర్న అప్పుడు కూడా వర్ధనమ్మకి సందేహం రాలేదు.

బామ్మ, శైలుతో సీడీ ప్లేయర్లో సిడి పెట్టించి దాన్ని బాగా ఎత్తుగా ఉన్న 'షెల్ఫ్' మీదికెక్కించి ఆన్ చేసాక, "పక్కవీధిలోని పూజారిగారు రాత్రికే బయల్దేరి భద్రాచలం వెళ్తున్నారట. ఆయనక్కాస్త నా రామకోటి పుస్తకాలు ఇచ్చేసి, ఇట్టే చిటికెలో వచ్చేస్తాను. మేమొచ్చేవరకూ నువ్వ హాయిగా వింటూ కూచో" అన్చెప్పి తలుపులు లాగేసింది (ఆటోమేటిక్ లాకింగ్ సిస్టం) శైలూతో సహా బయటికొచ్చాక అట్లా ఇంట్లోంచి బయటపడి పక్క వీధులన్నీ తిరిగి, తిరిగి ఓ అరగంట తర్వాత ఇంటికొచ్చి వర్ధనమ్మని విడుదల చేసింది బామ్మ.

వీళ్ళ వేపు తల తిప్పయినా చూడకుండా, కనీసం వెళ్ళొస్తాననైనా చెప్పకుండా సిన్మాలో 'అరుంధతి'లా నిస్తేజంగా నడుచుకుంటూ వెళ్ళిపోయిన వర్ధనమ్మని చూసి బామ్మ సోఫాలో కూలబడి తృప్తిగా నవ్వింది పడీ పడీ. "తొందరపడి ఇన్నేళ్ళు స్నేహాన్నీ పుటుక్కున తెంచేసుకున్నావేమోనే బామ్మా?" అంది శైలు కొంచెం బాధగా.

"ఆ పోనిస్తూ ఎంత? అరవయ్యేళ్ళేగా? ఇంక మేం మళ్ళీ కలిసేమా? చచ్చేమా?" చచ్చినట్లు కలవబోతున్నారని ఏ మాత్రమూ ఎరగని బామ్మ తేలిగ్గా చప్పరించింది.

సరిగ్గా అరగంటలో బామ్మ జన్మలో మొహం చూడదు, చూపించదు అనుకున్న మిత్రురాలు, 'మల్ల యోధుడి'లా ఉన్న మనవడితో సహా ఇంటి (మీది)కొచ్చేటప్పటికి గుండెలవిసిపోయేయి బామ్మకి. 'తన కోపమే తన శత్రువ'ని పెద్దలెందుకంటారో ఇప్పుడర్థమైంది కాలతీతమయ్యాక. శైలుకైతే అరికాళ్ళల్లోంచి వొణుకొస్తోంది. పారిపోయే దారిలేక, పాలిపోయిన ముఖాల్తో వచ్చిన ఇద్దర్నీ కూర్చోబెట్టి మంచినీళ్ళిచ్చి మర్యాద చేసేరు. అదృష్టవశాత్తు అయిదు నిముషాల్లోనే బయట నుంచి వచ్చిన బోసుబాబుని పరిచయం చేయగానే 'మల్లయోధుడు' అమాంతం మీదపడి తన ఉక్కు కౌగిలిలో ఉక్కిరి బిక్కిరి చేసేడు. ఆ తర్వాత అతడు చెప్పింది విని ఊపిరాగిపోయింది అందరికీ, ముఖ్యంగా వర్ధనమ్మకి. కొయ్యాబారిపోయి, వెర్రిదాన్లా చూడసాగింది మనవడి వేపు. ఇంటిదగ్గర జరిగింది గుర్తు చేసుకుంటూ..

సుబ్బి చచ్చిందాని కొంపలోంచి బయపడ్డాక, ఎట్లా వెళ్ళి ఇంట్లో పడిందో ఏమీ గుర్తులేదసలు. వంద వడదెబ్బలు తిన్నదాన్లా వడలిపోయి వచ్చిన వర్ధనమ్మని చూడగానే హడలిపోయేరు ఇంట్లో వాళ్ళందరూ. ముఖంలో ప్రేతకళ ఉట్టిపడుతుండగా,

ఉసూరుమంటూ సోఫాలో సొమ్మసిల్లి పడిపోయిన ఆవిడ చుట్టూ మూగారు ఆదుర్దాగా.

"ఓయమ్మ, అవ్వేం భజన్లే తల్లీ చెవుల్లో సీసం పోసినట్లు? వీడి దుంప తెగా, అస్సలు మీ భజన్లు, అన్నమయ్య కీర్తన్లు కలిపి మరీ 'రీమికుసు' చెయ్యాలన్న దరిద్రగొట్టు ఆలోచన ఎట్లా వొచ్చి చచ్చిందో ఏమో?! అయినా ఈ కాలపు మందకి పాత వాటిమీద పడి ఖూనీలు చేయకపోతే, కొత్త రాయడమూ, రాగాలు కట్టుకోవడమూ రాదా ఏం? దానికి తోడు ఆ భయంకరమైన గొంతొకటి– రాతి మీద ఇనుపరేకులతో గీరినట్లు, డబ్బాలో గోలీలు పోసి ఆడించినట్లు ఆ సుబ్బి కుంక కావాలనే నన్నాగదిలొ ఇరికించి, అది బయటకి పారిపోయింది 'రాముడు'పేరు చెప్పుకుని. "కాసేపటికి పీడకలలోంచి తెప్పరిల్లినట్లుగా కళ్ళు తెరిచిన వర్ధనమ్మ గుండెల మీద, వీపుమీద అరచేత్తో బాబుకుంది. జడుసుకున్నదాన్లా.

"వావ్!" అంటూ కెవ్వుమన్నాడు ఆమె మనవడు. నిజంగా అంత టెర్రిఫిక్‌గా ఉందా బామ్మా అతడి గొంతు? అచ్చం అట్లాంటి గొంతువాడికోసమే మా మ్యూజిక్ డైరెక్టర్ 'అడి'గారు వెతుకుతున్నారు. పద అమ్మమ్మా నాకా పాట పాడిన వాడని చూపించు. ఈ తెలుగు ప్రజలకి సరికొత్త గాయకుడిని పరిచయం చేస్తాం" అంటూ ఆనందంతో ఊగిపోతూ వర్ధనమ్మని బరబరా లాక్కొచ్చి కారులో కుదేయడంతో, ఇదిగో ఇట్లా బోసుబాబింట్లో ప్రత్యక్షమయ్యారన్నమాట. అదీ సంగతి!

కొత్త మ్యూజిక్ డైరెక్టర్ 'మిస్టర్ ఆడి' – గిటార్ బొమ్మున్న నల్లటి టీషర్ట్, నెత్తిమీద లాన్‌లా కత్తిరించిన జుట్టు, మధ్యలో రోడ్డు మాదిరి నాలుగైదు పాపిడులు – చూడగానే 'అమెరికా'నుండి దిగుమతి అయినట్లు అర్థమైపోతున్నాడు. వాళ్ళ నాన్న గతంలో బాలీవుడ్‌ని ఊపేశాడు తన సంగీతంతో. 'ఆడి'కిది మొదటి సినిమా. పేరున్న నిర్మాతగారి కొడుకు హీరోగా పరిచయమవుతున్నాడు. కాబట్టే అందర్నీ కొత్తవాళ్ళని పరిచయం చేస్తున్నాడు. సినిమా పేరు 'మూస్కో'– కళ్ళుకాదు, నోరు కాదు!' అన్నది టాగ్‌లైన్. హీరో ఎవర్నైనా సరే ఫస్ట్, 'మూస్కో' అంటాడు. అందుకని ఆ టైటిల్ పెట్టేరు. 'ఆడి'గారికి తెలుగు రాదుకాబట్టి పాటలన్నీ ఇంగ్లీష్‌లో రాస్కుని మరీ ట్యూన్లు కట్టేడు. బోసుబాబుకి బోలెడు మెళకువలు నేర్పాడు. జలుబు చేస్తే గొంతు కాస్త మెత్తగా మారే ప్రమాదం ఉంది కాబట్టి. అట్లానే గరగర ఉండేందుకు ఎన్నెన్నో జాగ్రత్తలు చెప్పాడు. బోసుబాబుకి తెలుగు వచ్చన్నా, తనకి రాదు కాబట్టి ఇంగ్లిష్‌లో రాసినవాటినే బుగ్గన బెల్లం ముక్క పెట్టి మరీ ప్రాక్టీస్ చేయించేడు. బోసుబాబు పేరుని 'బీబీ'గా మార్చాడు.

ఓ శుభ ముహూర్తాన 'మూస్కో' పాటల ఆడియో రిలీజింగ్ ఫంక్షన్ అట్టహాసంగా జరిగింది. నిర్మాత, డైరెక్టరూ,హీరో, హీరోయిన్లు, కథారచయిత, ఇట్లా ప్రతి ఒక్కరూ ఆ

సినిమా గొప్పగా ఉండి తెలుగు సినిమా చరిత్రని ఎట్లా మలుపు తిప్పబోతున్నదో, పాటలన్నీ ఎంత కొత్తగా ఉన్నాయో ఉల్లాసంగా చెప్పేరు. 'ఆడి' నిర్మాతకి, బోసుబాబు అందరికీ పాద నమస్కారాలు చేసి ఆశీస్సులు తీసుకున్నారు.

"నేను చిన్నప్పుడెప్పుడో హైస్కూల్లో ఉన్నప్పుడు 'ఇట్లా పెడితే, అట్టా నెడతావ్, నీతో ఎట్టా గమ్మో, గట్టుమీది గంగమ్మో" అనే పాట పిచ్చ పిచ్చగా హిట్ అయింది. అది సుబ్బరాజుగారు రాసింది. అప్పుడే అనుకున్నా ఎప్పటికైనా దానిని మించిన పాటరాయాలని, ఇప్పటికా అవకాశం వచ్చింది. దానబ్బ లాంటి పాటలు రాసేనన్నీ. 'ఆడి'గారు వాటికి కూర్చిన రాగాలు బీబీగారి గొంతులో వింటే మనకెట్టాంటి రోగాలున్నా ఇట్టేకుదిరి పోతాయి. విని చూడండి మీరే." అన్నాడు పాటల రచయిత పాపశ్రీ.

ఆ హాలూడ్చే అప్పలకొండతో పాటల క్యాసెట్ రిలీజ్ చేయించేరు వెరైటీగా ఉండాలని. అందరికీ తలా వొకటి పంచేరు ఆహూతులకి. బోసుబాబు ఆనందాశ్రువులు జలజల రాలుస్తూ తన పాటల్ని గురువుగారైనా జేసుదాసుకి అంకితమిచ్చేడు. ఆ తర్వాత మొదటి కేసెట్‌ని ( తన చేత్తో) తన జీవితాన్ని మలుపుతిప్పిన వాళ్ళ స్నేహబంధానికి గుర్తుగా బామ్మకి, వర్ధనమ్మకి కలిపి ఇచ్చేడు. వాళ్ళు దాన్ని కొండచిలువని పట్టుకున్నంత భయంగా అందుకుని ఆ తర్వాత ఎవరూ చూడకుండా కర్చీల కిందకి విసిరేరు. అమెరికా ఫోటోలకి, బీబీ పాటలకి చెల్లు అనుకుని ఇద్దరూ ఒకరికొకరు ఓమ ఆపణలు చెప్పుకుని మళ్ళీ కలిసిపోయారు. స్నేహంగా ఊరెళ్ళగానే చక్కగా మంచి పాత పాటలు, కీర్తనలు విని చెవులు కడుక్కోవాలనుకున్నారు.

బీబీ – అదే – బోసుబాబుకి శుక్రమహర్దశ ప్రారంభమైంది. 'నూవో అణ్‌దాల గణి, పట్టిణ్‌దే నికిప్పుడు ఫణి, తిన్‌టాడే నీ యబ్బ, ఇప్పుడే నా డెబ్బా", "ఈ జనమకి నూవె నా డుప్పి, వచావే దొరిటప్పి, ఇష్‌తా నీకో పప్పి, తపదే నీకి తలణెప్పి", "డమడమ, డమడమ డాళింగ్, చిమ చిమ చిమచిమ ఈవినింగ్, హర హర హరహర హంటింగ్ సరసర, సరసర నీ షంటింగ్"అన్న మూడు పాటలు కుర్రకారుని ఉర్రూతలూగించేయి. దాన్తో బీబీకి బ్రహ్మరథం పట్టేరు.

ఆహా! విధి ఎంత విచిత్రమూ, కాలమెంత మహత్తరమూ అయినవో కదా?!

'నవ్విన' నాపచేను పండిందిట్లా, భయంకరంగా!

# ఈ గ్రంథంలోని కథా రచయిత్రులు

వి.ఎస్. రమాదేవి
మాలతీచందూర్
రామలక్ష్మి
రంగనాయకమ్మ
తురగా జానకీరాణి
పవని నిర్మల ప్రభావతి
యద్దనపూడి సులోచనారాణి
శివరాజు సుబ్బలక్ష్మి
నాయని కృష్ణకుమారి
ఆర్. వసుంధరాదేవి
ద్వివేదుల విశాలాక్షి
అబ్బూరి ఛాయాదేవి
ఆనందారామం
డి. కామేశ్వరి
పోలాప్రగడ రాజ్యలక్ష్మి
నందుల సుశీలాదేవి
నిడదవోలు మాలతి
ఉషారాణి భాటియా
వేదుల శకుంతల
గోవిందరాజు సీతాదేవి
తమిరశ జానకి
పరిమళా సోమేశ్వర్
పోల్కంపల్లి శాంతాదేవి
దాగంటి తులసి
విజయలక్ష్మీరామకృష్ణన్
శారదా అశోకవర్ధన్
ముక్తేవి భారతి
ఇంద్రగంటి జానకీబాల
శీలాసుభద్రాదేవి
పింగళి బాలాదేవి
వింధ్యవాసిని
సుజాతారెడ్డి
జలంధర

ఆలూరి విజయలక్ష్మి
కొమరవోలు సరోజ
శేషు అప్పారావ్
సోమరాజు సుశీల
సి. వేదవతి
తురగా జయశ్యామల
కుప్పిలి పద్మ
సోమంచి ఉషారాణి
చిల్లర భవానీదేవి
గంటి భానుమతి
శరత్‌జ్యోత్స్నారాణి
కె.బి. లక్ష్మి
సాకేతపురి కస్తూరి
అత్తలూరి విజయలక్ష్మి
శ్రీవల్లీ రాధిక
తెన్నేటి సుధ
బలభద్రపాత్రుని రమణి
వారణాశి నాగలక్ష్మి
పోడూరి కృష్ణకుమారి
మంథా భానుమతి
అల్లూరి గౌరిలక్ష్మి
ఆకెళ్ళ వెంకట సుబ్బలక్ష్మి
వాలి హిరణ్మయీదేవి
వాడ్రేవు వీరలక్ష్మీదేవి
శ్రీదేవి మురళీధర్
అంబికా అనంత్
టంగుటూరి శ్రీలక్ష్మి
డి. సుజాతాదేవి
కె. వరలక్ష్మి
సి. ఉమాదేవి
కె. సత్యవతి
శైలజామిత్ర

రజ్నీ కె.వి. కుమారి
అయినంపూడి శ్రీలక్ష్మి
కె. వాసవదత్త రమణ
జయప్రదారెడ్డి
శ్రీలత
దాగంటి కృష్ణకుమారి
వావిలకొలనురాజ్యలక్ష్మి
జాజుల గౌరి
మల్లీశ్వరి
షాజహానా
జూపాక సుభద్ర
గోగినేని మణి
లక్ష్మీరాఘవ
వి. గీతిక
గురజాడ శోభాపేరిందేవి
అంగులూరి అంజనీదేవి
శివలెంక నాగ ఉదయలక్ష్మి
రేణుక అయోలా
శ్రీపతి బాలసరస్వతి
ఎస్. వి. కృష్ణజయంతి
పుట్ల హేమలత
కన్నెగంటి అనసూయ
సమ్మెట ఉమాదేవి
కోపల్లె మణి
జాస్తిరమాదేవి
కస్తూరి అలివేణి
పెయ్యేటి శ్రీదేవి
అడ్డేపల్లి జ్యోతి
విశ్వనాథరమ
డా. వాసాప్రభావతి
పొత్తూరి విజయలక్ష్మి
స్వాతిశ్రీపాద